వసిష్ఠ రామ సంవాదం

(యోగ వాసిష్ఠమ్)



మొదటి సంపుటం

వైరాగ్య, ముముక్షు వ్యవహార, ఉత్పత్తి ప్రకరణములు

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

(శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత యోగవాసిష్ఠము)

మొదటి సంపుటం

వైరాగ్య, ముముక్షు వ్యవహార, ఉత్పత్తి ప్రకరణములు

అనుసృజన:

వై. హెచ్. రామకృష్ణ

రామకృష్ణ మఠం

దోమలగూడ, హైదరాబాదు-500 029

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

I - 1M - 08 -2010
12024

12028 (Set)

Printed at :
RP Printers, Hyderabad.

Bound at
Pridhvi Binders, Hyderabad.

ప్రవేశిక

ఆర్షధర్మ వాఙ్మయ వినీలాకాశంలో జాజ్వల్యమానంగా భాసిస్తున్న తారలెన్నో. ఆ తారా సమూహంలో విశిష్టంగా భాసిస్తూ ధ్రువతార అని పరిగణించదగినది శ్రీ యోగవాసిష్ఠము. వాసిష్ఠ రామాయణము, మహారామాయణము, ఆఖండ రామాయణము అని కూడా గణుతికెక్కిన ఈ గ్రంథం వాల్మీకి మహర్షిచే విరచితమైనది. ముప్పైరెండు వేల శ్లోకాలతో ఒప్పారే ఈ బృహద్గ్రంథంలో వైరాగ్య–ముముక్షువ్యవహార–ఉత్పత్తి–స్థితి–ఉపశమ–నిర్వాణ అనే ఆరు ప్రకరణాలు ఉన్నాయి.

వసిష్ఠ మహర్షి శ్రీరామచంద్రమూర్తికి చేసిన అద్వైత వేదాంత బోధ ఇందలి విషయం. అనాదిగా జిజ్ఞాసువులను వేధిస్తున్న ప్రశ్న 'మోక్షోపలబ్ధి కర్మ వలన లేక జ్ఞానం వలన చేకూరుతుందా?' అని. కర్మ జ్ఞానాలు రెండు పరస్పర విరుద్ధమైన సాధనామార్గాలని, రెండింటినీ ఏకకాలంలో సమన్వయపరచటం అసాధ్యమనీ వారి భావన. దీనితో సాధకులు రెండు వర్గాలై కొంతమంది కర్మాభిముఖులై మరికొందరు కర్మను త్యజించి పూర్తిగా జ్ఞానమార్గాన్ని అవలంబించి ముక్తిని పొందడానికి ప్రయత్నిస్తూ వస్తున్నారు. ఐతే పూర్తిగా కర్మాభిరక్తులై ఉండటం కాదు; కర్మను పరిత్యజించటమూ కాదు; సమాజానికి, బాధ్యతలకు దూరంగా ఉండటం కాదు; వివేక విచక్షణలతో కూడి విహిత కర్మలను ఆచరించటం ద్వారా కైవల్యపదాన్ని చేరుకోవచ్చు అని ఘంటాపథంగా చెపుతుంది ఈ గ్రంథరాజం. భగవంతుడికి అతీతంగా ఏదీ లేదని తెలుపుతూ జ్ఞాన కర్మలను సమన్వయ పరచటానికి సంబంధించి సాధకుడికి ఉండే సంఘర్షణను తొలగించి లౌకిక, పారలౌకిక ప్రపంచా లంటూ రెండూ వేరుగా ఏమిలేవని, ఉన్నదంతా ఏకైక సాక్షీభూత కేవల చైతన్యం అని ఉద్బోధిస్తుందీ గ్రంథం. అనేక అద్భుత దృష్టాంతాలతో మహాజ్ఞానమైన అద్వైత వేదాంతాన్ని సామాన్య సాధకుడు కూడా అవలీలగా అర్థంచేసుకునే రీతిలో విషయాన్ని వివరిస్తుందీ గ్రంథరాజం.

'మోక్షకారణం కర్మయా లేక జ్ఞానమా? లేక కర్మ జ్ఞానాలు రెండూ మోక్షసాధనాలా అని 'సుతీక్ష్ణుడు' అనే బ్రాహ్మణుడు అగస్తి అనే మునీంద్రుని అడిగినప్పుడు 'కేవలం కర్మ వలనగాని, జ్ఞానం వలన గాని మోక్షం లభింపదు. ఈ రెండింటి వలన మోక్షం లభిస్తుంది. కనుక సాధుజనులు ఈ రెంటిని మోక్షోపాయాలుగా పరిగణింతురు,' అంటూ ఒక పురాణేతిహాసాన్ని ఉటంకించటంతో కథ ప్రారంభమవుతుంది. ప్రశ్నలు, వాటికి సమాధానాలుగా కథలో కథ, కథలో కథగా సాగిపోయే ఈ గ్రంథంలో పదే పదే ద్రష్టకు దృశ్యప్రపంచపు మిథ్యాత్వాన్ని నిరూపించి, సంసార విముక్తుణ్ణి చేయడం ముఖ్య ప్రయోజనంగా కనపడుతుంది.

ఎవరు ఈ గ్రంథాన్ని పఠించటానికి అర్హులు అన్న ప్రశ్నకు సమాధానం మనకు గ్రంథ ప్రథమ భాగంలోనే లభిస్తుంది. 'నేను సంసారబద్ధుడను, ముక్తుడనవుతాను' – ఇట్టి నిశ్చయం గలవాడే ఈ శాస్త్రాన్ని పఠించటానికి అర్హుడని వాల్మీకి మహర్షి తెలియజేస్తున్నారు. అంటే ముందు

జనన మరణ సంసార చక్రంలో చిక్కుకున్నాను అన్న స్ఫురణ కలిగినప్పుడే సాధకుడు ఈ పుస్తకంలోని విషయాన్ని పూర్తిగా ఆస్వాదించ గలుగుతాడు. బంధం అంటే ఏమిటో ఎరిగినప్పుడే స్వేచ్ఛకై ప్రయత్నించ గలుగుతాడు. మోక్షేచ్ఛ లేనివారికి గ్రంథంలోని విషయం సులభగ్రాహ్యం కాదు. వివేక వైరాగ్యాలు కలిగిన వ్యక్తికి ఇందులోని విషయం అమృతోపమై తోస్తుంది. ఐతే శ్రద్ధాళువులై పఠించేవారికి ఇందులోని జ్ఞానకౌముది వివేక వైరాగ్యాలను పెంపొందించి ఆహ్లాద భరితులను చేస్తుంది; నిర్వాణాభిలాషులుగా పరిణతి నొందిస్తుంది.

ఆర్యుల తత్త్వ చింతనాసక్తి, తత్త్వవిశ్లేషణా శక్తి, బుద్ధి కుశలతా, ధీశక్తి వైభవానికి ఈ గ్రంథం అద్దంపడుతుంది. గ్రంథంలోని విషయమంతా ఇద్దరు జ్ఞానుల మధ్య జరిగిన సంభాషణ. ఇప్పటి వరకూ హైందవ జాతికి తమ పూర్వీకుల నుంచి లభించిన ఆధ్యాత్మిక వారసత్వంలో అత్యంత విలువైనది, గొప్పగా ఎంచదగ్గది ఈ గ్రంథం అంటే అతిశయోక్తి కాదేమో!

అస్మాచ్ఛా స్త్రవరాద్బోధా జాయన్తే యే విచారితాత్
లవణైర్వ్యంజనానీవ భాన్తి శాస్త్రాంతరాణి తైః!

'ఈ ఉత్తమ శాస్త్రాన్ని (యోగవాసిష్ఠము) విచారించటంచే పరమోత్కృష్టమైన జ్ఞానం సంప్రాప్తమవుతుంది. అపుడే తక్కిన శాస్త్రాలన్నీ లవణ సంయోగం పొందిన శాకం వలె రుచిస్తుంది' అని వసిష్ఠ మహర్షి వచించడం ద్వారా ఈ గ్రంథ వైశిష్ట్యాన్ని, ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

కేవలం ఈ గ్రంథాన్ని పఠించడం ద్వారానే ముక్తిని పొందవచ్చు. పఠనమే ఒక అద్భుత సాధనా ఫలాన్ని అందించగలదు.

ఈ కావ్యాన్ని శ్లోకాలూ, తాత్పర్యంతో సహా మొదట తెలుగులో ప్రచురించినది శ్రీ వ్యాసాశ్రమం, ఏర్పేడు వారు. బ్రహ్మలీన పూజ్య మలయాళ స్వామీజీ వారు, రామకృష్ణ మఠం స్వామీజీ శ్రీ నిర్వికల్పానంద వారిని ప్రోత్సహించి సగభాగానికి (సుమారు 15 వేల శ్లోకాలకు) తాత్పర్యాన్ని వ్రాయించారు. మిగతా సగభాగానికి వారి శిష్యులు బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామీజీ వారు తాత్పర్యాన్ని సమకూర్చారు. 1936వ సంవత్సరంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 18 సంవత్సరాల శ్రమ తర్వాత 1954లో పుస్తకాన్ని ప్రచురించారు. ఈ వరిష్ఠ గ్రంథాన్ని తెలుగులో సరళ తాత్పర్యంతో అందించిన శ్రీ వ్యాసాశ్రమం వారికి తెలుగు ప్రజలు సర్వదా కృతజ్ఞులై ఉండాలి. శ్రీ నిర్వికల్పానంద, శ్రీ విద్యాప్రకాశానంద గిరి యతివరేణ్యులకు కూడా మనం కృతజ్ఞతా బద్ధులమై ఉండాలి.

పంతొమ్మిది వందల యాభయ్యవ దశకం తెలుగు భాషకు, ప్రస్తుత తెలుగు భాషకు తేడా ఉన్నది. శ్రీ వ్యాసాశ్రమం వారి పుస్తకంలోని తాత్పర్యాన్ని సరళీకృతం చేసి అందులోని సుదీర్ఘ సంభాషణల నిడివి తగ్గించి, ఆధునిక పాఠకుడు సునాయాసంగా అర్థంచేసుకోవటానికి వీలుగా సంస్కృత శ్లోకాలను అక్కడక్కడ మాత్రమే ఉటంకిస్తూ వచన కావ్యంగా తీర్చిదిద్దిన వారు శ్రీ హనుమ రామకృష్ణ గారు. వసిష్ఠ రామ సంవాదాలలో వసిష్ఠులవారి సమాధానం సుదీర్ఘంగా

ఉన్నచోట శ్రీరాముడిచే ఇతర ప్రశ్నలను సంధింపజేసి సంవాదాలను చిన్నవిగా చేసి తేలికగా విషయాన్ని గ్రహించటానికి దోహదపడేలా వీరు పుస్తకాన్ని వెలువరించారు. వారు ప్రస్తుత తరం పాఠకుడి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సులభ గ్రాహ్యంగా అందించి అందరూ అర్థంచేసుకునే విధంగా పుస్తకాన్ని రచించారు. గృహస్థ జీవితపు బరువు బాధ్యతలను మోస్తూ తన లాంటి ఉద్యోగి చదివి అర్థంచేసుకోగలిగినప్పుడు ఇతరులు ఎందుకు చదవకూడదని భావించి, ఈ మహోత్కృష్ట గ్రంథంలోని అద్వైత వేదాంత మకరందం అందరూ గ్రోలాలని సంకల్పించి, వారు పుస్తకాన్ని స్వీయముద్రణగా ప్రచురించారు. ఒక దశాబ్ద కాలం పాటి వారి కృషి ఫలితంగా ఈ పుస్తకం రూపుదిద్దుకున్నది.

అమూల్యమైన ఈ జ్ఞానాన్ని అందరికీ పంచాలన్న వారి సత్సంకల్పానికి మా వంతు సహాయంగా పుస్తకాన్ని మఠం స్వయంగా ప్రచురించటానికి స్వీకరించింది.

మఠ గ్రంథాలన్నింటినీ విశేషంగా ఆదరిస్తున్న పాఠకులు ఈ గ్రంథాన్ని కూడా చదివి ఆస్వాదించి శ్రీ వసిష్ఠ మహాముని శ్రీరామచంద్రమూర్తి కృపాకటాక్షాలను పొందాలని మా ఆకాంక్ష. ఈ పుస్తకాన్ని వెలువరించటానికి సహకరించిన యావన్మందికీ మా కృతజ్ఞతలు.

– ప్రకాశకులు

❖❖❖

పుష్పాంజలి

నా అభ్యున్నతి కొరకు అనేక త్యాగములు చేసి, నాకు బాల్యము నుండి భక్తి, జ్ఞాన, వైరాగ్య పూర్వకమైన అనేక విశేషములు బోధించిన మాతృదేవత శ్రీమతి ఆదిలక్ష్మీ కామేశ్వరమ్మ గారికి, పితృదేవులు శ్రీ లక్ష్మీనారాయణ గార్కి సాష్టాంగదండ ప్రమాణామములు, దైవసమానులు, ఆధ్యాత్మిక గురువులు అయిన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశా నందగిరి స్వామివారి (శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి) పాదములకు వినమ్రతతో నమస్కరిస్తున్నాను. నాకు జీవనోపాధిని ప్రసాదించిన 'ఆంధ్రాబ్యాంకు'కు సర్వదా దిగ్విజయమగుగాక!

1990లో శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు విజయవాడలో 'గీతాయజ్ఞం' నిర్వహించారు. "నాయనలారా! వాల్మీకి మహర్షిచే (కథారామాయణానంతరం) 32000 శ్లోకములలో రచించబడిన 'యోగ వాసిష్ఠం' అనే గ్రంథం చూడండి. మన ఋషులు ప్రకటిస్తున్నదేమిటో మరింత సుస్పష్టంగా గ్రహించగలరు" అని ఆయన సభను ఉద్దేశించి పలికారు. ఆ వాక్యాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఒకానొక జిజ్ఞాస నాయందు బయలుదేరింది. ఇక అప్పటి నుండి పూర్వం రచించబడిన వచన గ్రంథాలు కొన్ని చదవటం జరిగింది.

1. శ్రీ జ్ఞాన వాసిష్ఠ రామాయణము (1918), (వచన కావ్యం), బ్రహ్మశ్రీ వెన్నెలకంటి సుందరరామ శర్మగారు.
2. శ్రీ వసిష్ఠగీత (1982), వాసిష్ఠమహారామాయణము (1990), శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామిగారు.
3. జ్ఞానవాసిష్ఠము (వచనకావ్యము), బ్రహ్మశ్రీ చింతలపాటి లక్ష్మీ నరసింహశాస్త్రి గారు, ఘంటసాల
4. యోగవాసిష్ఠము (వచనకావ్యము), బ్రహ్మశ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారు
5. యోగవాసిష్ఠము 8 సంపుటములు (32000 శ్లోకములు + తాత్పర్యము) శ్రీశ్రీశ్రీ పూర్ణానందుల వారు మరియు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారు (యేర్పేడు, శ్రీ వ్యాసాశ్రమము & శ్రీ శుకబ్రహ్మాశ్రమము) 1937.

శ్రీ వసిష్ఠ మహర్షి : శ్రీరామచంద్రుల మధ్య సంభాషణా రూపంలో ఉన్న యోగవాసిష్ఠం (అఖండ రామాయణం, ఉత్తర రామాయణం అని కూడా చెప్పబడినది) "అద్భుతమైన గ్రంథం" అనుటలో సందేహమేమీ లేదు. ఎందుకంటే, ఈ గ్రంథం, "ఓయి! జీవుడా! నీవు ఇప్పటికే పూర్ణుడవై యున్నావయ్యా!" అని అత్యంత సుస్పష్టంగా నిర్దుష్టంగా నిరూపించి చూపుతోంది. ఇందలి విచారణ అత్యంత సులభమైనదేనని నా అభిప్రాయం. పాఠకుడు, తాను చదువుచూ ఉండగానే, తనయొక్క మోక్ష స్వరూపమును గుర్తుచేసుకొనేట్లు చేయగల ఉత్తమవిచారణ మనకు ఈ గ్రంథంలో లభిస్తోంది. ఇట్టి మహత్తరమైన గ్రంథం విశదీకరిస్తున్న విషయమేమిటో అనేకులు గమనించి ఉండనట్లు నాకు

అనిపించింది. ఇక మరికొందరు, "ఈ గ్రంథమును సామాన్యులు గ్రహించలేరు... ఇది అందరు చదివే గ్రంథం కాదు... కుటుంబ వ్యవస్థలోని వారికి ఇందలి విషయము గ్రహించడం కష్టమౌతుంది..." మొదలైన అవిచారణపూర్వకమైన అభిప్రాయాలు కలిగి ఉండటం గమనించాను. ఇంకొందరు తెలుగు నవలలో కనబడే అత్యంత సరళమైన భాష చదువుటకు మాత్రమే అలవాటుపడి ఉన్నారు. లోని ఆయా సిద్ధాంతాలు, 'ఉపనిషత్తులు' మొదలైన ప్రాచీన గ్రంథములచే ప్రతిపాదించ బడుచున్న సిద్ధాంతాలు - వాటి సమన్వయం గ్రహించాలని మరికొందరు అభిలషించటం గమనించాను. అట్టివారినందరిని దృష్టిలో పెట్టుకొని వర్తమాన వ్యావహారిక భాషలో "శ్రీ వసిష్ఠ - రావసంవాదము వచన కావ్యం" అనే ఈ ప్రయత్నం చేస్తున్నాను. ఈ పీఠికలో ఉదహరింపబడ్డ ఇతఃపూర్వపు గ్రంథాలు చదువుచు, ఒకానొక "ఉత్సాహము-ఆవేశములతో కూడుకొనిన ఉపన్యాసము" వింటున్న అనుభూతి పాఠకునికి రావాలనే ఉద్దేశముతో ఇందుకు ఉపక్రమించాను.

ప్రకృతి వర్ణనలకు సంబంధించిన సుమారు 500-550 శ్లోకాలు మాత్రం వదిలాను. మిగతా అన్ని శ్లోకాలు యథాతథంగా ఇందులో చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా జ్ఞాన విచారణకు సంబంధించిన శ్లోకాలన్నీ రావాలని నా ప్రయత్నం.

ఈ గ్రంథంలో 56 కథలు ఉన్నాయి. ప్రతి కథ పాఠకునికి 'మోక్షభావన' అంటే ఏమిటో రుచి చూపుతుంది. స్వస్వరూపము విషయమై సర్వసందేహాలు నివృత్తిచేస్తూ, అనేక విశేషాలు చర్చాపూర్వకంగా తెలియజేస్తోంది. పాఠకునకు "పునర్జన్మ-మృత్యువు-ఈ జన్మయొక్క ముందువెనుకలు-దేహి-దేహముల స్వభావ, స్వరూపములు - దుఃఖముల మూలకారణం" ఇవన్నీ సుస్పష్టమౌతాయి. "ఈ జీవుడు పూర్ణుడు, అనంతుడు, అఖండుడు, శాశ్వితుడు, ఈతడు సాక్షాత్ ప్రత్యగాత్మయే. వాస్తవానికి ఈతనికి జన్మమృత్యువులుగాని, ఆద్యంతాలుగానిలేవు" అని అనేక దృష్టాంతాలతో ఈ గ్రంథంలో ప్రతిపాదించబడింది.

శృణ్వన్తి విశ్వే అమృతస్య పుత్రాః ఆయే ధామాని దివ్యాని తస్థుః ।
వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరిస్తాత్ ॥

"ఓ అమృత పుత్రులారా! అది ఏమిటో మేము గ్రహించాము. ఆ మహత్తర తత్త్వము గురించి మీకు చెపుతాం వినండి" అని ఆ ఆత్మద్రష్టలు మనందరిని ఆహ్వానిస్తున్నారు.

మనందరిపై గల అవ్యాజమైన ప్రేమచే ఋషులు ఇదంతా చెప్పారు. "భక్తి-జిజ్ఞాస" - ఈ రెండూ ఉంటే చాలు, ఎవరైనా ఇది చదువవచ్చు. "ఇది మీది - అది మాది" అను రూపముగల మూర్ఖత్వమంతా అవిచారణచేతనే ప్రబలుతోంది. ఏ ఉత్తమ గ్రంథములోనిదైనా సరే, "జ్ఞానవిచారణ" అనేది అందరి కొరకే అయి ఉంటోంది. అందరికి సంబంధించినదే అవుతుంది. మహాత్ములగు వాల్మీకి, వ్యాసుడు, విశ్వామిత్రుడు, జీసస్, గురునానక్, మహమ్మద్, బుద్ధుడు, వసిష్ఠుడు, శంకరాచార్యులు వంటి వారికి "వీరు మా వారు. వారు మా వారు కాదు" అనుభేదభావం ఉంటుందా? ఉండదు. మనమంతా అది గ్రహించాలి. వారి వాక్యములలో ఉద్దేశమును అర్థం

చేసుకుని మనం బలోపేతులం కావాలి. మనందరి హృదయాలలో అవధులు లేని అకృత్రిమమైన ప్రేమ వెల్లివిరియాలి. మన స్వస్వరూప ప్రభావం గ్రహించి స్వస్థచిత్తులం కావాలి. "నేను అల్పుడను" అను రూపముగల బలహీనత, "ఇతరులు అల్పులు" అనురూపముగల జాడ్యము–ఈ రెండూ కూడా మనం అధిగమించగలగాలి.

ఈ గ్రంథములో విచారించబడిన విషయమేమిటో పరిచయం చేయటానికి, మరొక చిన్న దృష్టాంతము విన్నవిస్తాను. "ఒక అల్లరి బాలుడు ఉన్నాడనుకుందాం...అతడు బాధిస్తున్నాడు. లేక, తనను తానే బాధించుకుంటున్నాడు. ఇప్పుడు అతనికి సత్ప్రవర్తన అలవర్చటం ఎట్లా? భయ పెట్టటం ద్వారానా? నమ్మకం ద్వారానా? విచారణ ద్వారానా?

1. భయపెట్టటం : "నాయనా! బయటకువెళ్ళకు. ఇతర బాలురను బాధించకు. అట్లా చేస్తే కొడతాను. ఇతరులను దూషిస్తే పాపం వస్తుంది. పాపపు లోకములకు వెళ్ళవలసివస్తుంది."

2. నమ్మకం : పెద్దలు చెప్పారు. గ్రంథములు చెప్పుచున్నాయి. కనుక సత్ప్రవర్తన కలిగియుండు. మంచితనముతో పుణ్యకార్యములను ఆశ్రయిస్తే నీకు పుణ్యం కలుగగలదు. పెద్దల చరిత్రలు చదువు. వారిని అనుకరించు.

3. విచారణ – అవగాహన : నీవు కొందరిని బాధిస్తూ ఉంటే, నీకన్నా బలవంతులు నిన్ను బాధిస్తూ ఉంటారు కదా? చివరకు మిగిలేదేమిటి? బాధయేకదా!

"విచారణ చేయి, ఈ విశేషాలు దృష్టిలో పెట్టుకొని యోచించు. ఇతరులపట్ల క్షమ, ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండు. అట్టి ప్రవర్తన స్వభావ సిద్ధంగానే శుభం చేకూరుస్తుంది. ఎందుకంటే, ఇదంతా ప్రసరించియున్నది నీవే. నిన్ను నీవు ప్రేమించు కోవటమే ఆనందంగానీ, ద్వేషించటం ఆనందమైన విషయం కాదు. నీవు వాస్తవానికి బలవంతుడవు, పూర్ణుడవు, సత్యమువు, నిత్యమువు."

భయము, నమ్మకముల కంటే కూడా అవగాహన ఉత్తమమైనది, బలమైనది, స్వస్వరూపమునకు సంబంధించిన 'విచారణ' ద్వారా ఈ గ్రంథము భగవంతునిపట్ల ఉత్తమ అవగాహన పెంపొందింప చేస్తోంది. అందుచేతనే ఇది ఉత్తమోత్తమమైన గ్రంథంగా శ్రీ స్వామి రామతీర్థ, శ్రీ రమణమహర్షి వంటి జ్ఞానమార్గావలంబులచే, సంత్ తుకారాం వంటి భక్తాగ్రేసరులచే శ్లాఘించబడింది. అట్లే మహనీయులు అనేకులు ఇట్టి అభిప్రాయం వెలిబుచ్చారు. మద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరిస్వామి వారు ఈ గ్రంథం పేరు వినగానే పులకిత శరీరంతో తన్మయులై మాట్లాడుతూ ఉంటారు. వారు తాము నిర్వర్తించిన 108 గీతాయజ్ఞముల సందర్భములో అనేకచోట్ల ఉదయంపూట ఈ గ్రంథముపై ఉపన్యసిస్తూ ఉండేవారు.

"శ్రీ వసిష్ఠ–రామ సంవాదము" అనబడు ఈ వచన కావ్యం ప్రచురించే ప్రయత్నం యొక్క లక్ష్యములు మూడు.

1. నా మనస్సు దోషరహితమై, నాయందు "యజ్ఞభావము" దృఢపడుట కొరకు. "యజ్ఞార్థాత్ కర్మణో అన్యత్ర లోకోయం కర్మబంధనః" అని గీతాచార్యులు చెప్పియున్నారు కదా!

2. నాతో సహా సర్వుల యొక్క అంతర్యామియగు ఆ భగవానుని ఈ "ప్రయత్నములు" అనే పూజాపుష్పములచే పూజించటం.

3. శ్రీ వాల్మీకి విరచితమైన "యోగవాసిష్ఠం" లోని వస్తువు అనేకమంది దృష్టికి తేవటం.

హే వెంకటేశ్వరా! సర్వేశ్వరుడవు, సర్వజీవరాసులలోని అంతర్యామివి, సర్వస్వరూపుడవు కూడా నీవే. 'శివుడు'గా 'అల్లా'గా, 'యహోవా'గా ఇంకా ఇంకా ఎన్నో నామరూపాలతో ఆరాధింపబడుచున్నదీ నీవే. నా యందలి వాస్తవతత్త్వము కూడా నీవే అయివున్నావు.

ఈ నా ప్రయత్నము సకల జనులకు శుభము, శాంతము, ఐకమత్యము, ఆనందము ప్రసాదించాలని నా ఆకాంక్ష. సమాజమంతటికీ క్షేమ, స్థైర్య, అభయ, విజయ ఆయురారోగ్యములు సిద్ధించుగాక! ధర్మ-అర్థ-కామ-మోక్షములనబడే చతుర్విధ ఫల పురుషార్థములు మానవాళికి ప్రాప్తించుగాక! భక్తి-జ్ఞాన-వైరాగ్యాలు, శాంతి, అన్యోన్యత వెల్లివిరియుగాక!

ఈ "వసిష్ఠ-రామసంవాదము" అను గ్రంథపుష్పమును పరమాత్మని పాదపద్మములకు సమర్పిస్తున్నాను.

సర్వేజనాః సుఖినో భవన్తు ।
సమస్త సన్మంగళాని సన్తు ॥

- వై. హెచ్. రామకృష్ణ

❖❖❖

గ్రంథ సంఖ్యా వర్ణనం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రాఘవా! వివేకం ఉదయించినవాడే నీతిశాస్త్రం వినటానికి అర్హుడగుచున్నాడు కదా! అట్టివాడే ఈ 'జ్ఞానశాస్త్రం' కూడా వినటానికి అర్హుడు. ఎవరైతే మూర్ఖ సంగమము త్యజించి, నిర్మలమైన బుద్ధితో ఉత్తమమైన ఆశయం కలిగి ఉంటున్నాడో – అట్టివాడు మాత్రమే 'సత్యవిచారణ' చేయగలుగుచున్నాడు. నీయందు అట్టి గుణసంపద ఉండి ఉన్నది. అందుచేతనే, మనోమోహము పోగొట్టగల ఆ 'ఆత్మజ్ఞానశాస్త్రం' నీకు చెప్పబోవుచున్నాను. ఒకడు అనేక జన్మలలో ఆర్జించిన పుణ్యం చేతనే, 'ముక్తి' కొరకై ఈ శాస్త్రమును వినాలనే కోరిక పొందుచున్నాడు.

నీ యొక్క ఉత్తమ ప్రవర్తనలు, ప్రయత్నములు, గుణములే ఆత్మ సమాచారం స్వీకరించటానికి నిన్ను తగినవానినిగా తీర్చిదిద్దాయి. ఈ అఖండ రామాయణం ఆరు ప్రకరణములు కలిగి ఉన్నది.

1. వైరాగ్య ప్రకరణం : (1500 శ్లోకాలు) దీనిని విచారిస్తే ఈ దృశ్యము పట్ల, శరీరాదులను పేరుకొని ఉన్న అజ్ఞాన జనితమైన బుద్ధి మాంద్యము తొలగుతుంది. సాత్విక వైరాగ్యం ఏర్పడుతుంది. "జీవితము – అనుదానిని వివేకముచే పరిశీలించకుండానే బ్రతికివేస్తున్నామా?" అను వివేకపూరితమైన శోధనం ఏర్పడుతుంది. అట్టి దృష్టియే ఆత్మవిషయమై సమాచారం పొందటానికి పునాది.

2. ముముక్షు వ్యవహార ప్రకరణం : (1000 శ్లోకాలు) 'ముముక్షుత్వము' అంటే ఏమిటో, ముముక్షువులు ఎట్లు వ్యవహరిస్తారో, వారి స్వభావమేమిటో, ఎట్టి దృష్టిచే ఆత్మవిషయం గ్రహించటానికి సిద్ధంగా ఉండాలో చెప్పబడింది. బద్ధకము, అశ్రద్ధ, మూర్ఖత్వము త్యజించి శమము, సంతోషము, విచారణ, సత్సంగములను ఆశ్రయించ వలసినదిగా బోధింపబడింది. 'పరిశీలనదృష్టి – ప్రయత్నము' – రెండు ఉన్నవాడే ముముక్షువు.

3. ఉత్పత్తి ప్రకరణం : (7000 శ్లోకాలు) అనేక దృష్టాంతముల సహాయం చేత, 'లౌకికములైన నీవు–నేను అను వ్యవహారములన్నీ అసలు ఉత్పన్నమే అయివుండలేదు" అని నిరూపించబడింది. స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తు మూలమే లేనిదని, రూపరహితమని ప్రతిపాతించబడింది.

"ఈ సంసారమంతా స్వకీయకల్పిత మనోరాజ్యము వంటిదే కాని, వాస్తవము కాదు. స్వప్నంలో ఎట్లు జరుగుతోందో, అదేవిధంగా, ఇదంతా అవస్తు మాత్రమే, కల్పితానుభవమాత్రమై ప్రాప్తిస్తోంది" అని యుక్తియుక్తంగా నిరూపించబడింది. ఎండమావులలో నీరు లభిస్తుందా, మెల్లకన్నువాడికి ఆకాశంలో కనిపించే "రెండవ చంద్రుడు" ఉన్నాడా? అంధకారంలో కనిపించే మోడువారిన ఒకానొక వృక్షం దయ్యమై, అపరిపక్వ బుద్ధికి మాత్రమే ప్రాప్తిస్తోంది కదా! నావ కదులుతుండగా ఒడ్డున ఉన్న చెట్లు కదులుచున్నట్లు కనిపించినంత మాత్రం చేత, ఆ చెట్ల కదలిక వాస్తవమా? ఈ సంసారము కూడా కల్పితమాత్రమని, ఒకానొకప్పుడు, ఒకానొకదృష్టిచే, ఒకానొక విధంగా భావనను

అనుసరించి ప్రాప్తిస్తున్నదని తెలిసిపోతుంది. ఇది వాస్తవానికి సారరహితమని ఎరిగిన తరువాత, దీని గురించి ఎవడు దుఃఖిస్తాడు.

ఆభరణం – బంగారము కంటే వేరుకానట్లు, జలం కంటే తరంగాలు వేరుకానట్లు, ఈ జగత్తు పరమాత్మగానే దర్శించబడగలదు. ఇదంతా ద్రష్ట యొక్క దృష్టి కంటే వేఱేమీ కాదు. ఆకాశంలో నీలపు పదార్థం ఏదైనా ఉన్నదా? చిత్రపటంలోని అగ్నికి ఉష్ణత్వమెక్కడ? ఈ జగత్తు కూడా అసత్తే. కాని, అవివేకదృష్టికి మాత్రం 'సత్తు' గా తోచుచున్నది. ఎప్పుడో జరిగిపోయిన ఒకొనొక దృశ్యము ఇప్పుడు మనన కారణంగా మనోవీథిలో ప్రత్యక్షమై ప్రాప్తిస్తోంది చూచావా! అదేవిధంగా ఈ జగత్తు కూడా వర్తమానంలో అనుభవమౌతోంది. ఈ కనబడే పదార్థములను జ్ఞానదృష్టిచే పరిశీలించినప్పుడు ఇవన్నీ "అస్థిరము, తుచ్ఛము, శూన్యము" అని ఈ ప్రకరణం బోధిస్తోంది.

4. స్థితి ప్రకరణం : (3000 శ్లోకాలు) "ఈ జగత్తు అహంభావమునందే స్థితి పొంది ఉన్నది కాని, ఎక్కడో బాహ్యమునందు కాదు" అనే పరమార్థము అనేక కథల ద్వారా, దృష్టాంతముల ద్వారా నిరూపించబడింది. ఈ భ్రాంతిమయ జగత్తులు, ఈ ద్రష్ట–దర్శనము–దృశ్యములు ఇవన్నీ ఎట్లు వృద్ధి పొందుచున్నాయో చెప్పబడింది.

5. ఉపశమన ప్రకరణం : (5000 శ్లోకాలు) ఇందులో, "నేను, నీవు, అతడు, జగత్తు" – అను వ్యవహారమంతా ఉపశమింపచేయ గల యుక్తులేమిటో చెప్పబడింది.

ఈ జగత్తు ఒకనికి సుస్పష్టంగా, మరొకనికి అస్పష్టంగా ఉన్నప్పటికీ – వాస్తవానికి ఇది అసత్యమే. ఊహాకల్పితమైన రూపములు ఆ ఊహ ఉపశమించగానే తొలగిపోతాయి కదా! ఈ జగత్తు స్వకల్పితమనండి, లేక స్వప్న కల్పితమనండి. ఇది మనస్సు నుండి విభజిస్తోంది. జ్ఞానముచే తొలగిపోతోంది. ఎవరికైతే జగద్భ్రమ నశించుటలేదో, వారికి మాత్రం ఇదంతా ఒక అంతులేని అనేక సంఘటనలతో కూడిన 'కథ' వలె ప్రాప్తిస్తూపోతోంది. ఈ సంసారమంతా కల్పిత మాత్రమే. "అట్టి కల్పనలలోనే కొందరు మనోహరత్వమును, మరికొందరు దుఃఖపరంపరలను తమ అజ్ఞానం చేత, లేక మూర్ఖత్వం చేత పొందుచున్నారు" అని ఈ ప్రకరణం నిరూపిస్తోంది.

6. నిర్వాణ ప్రకరణం : (14500 శ్లోకాలు) జ్ఞానం వికసిస్తుంది. కల్పనలన్నీ తొలగిపోతాయి. "నిర్వాణము" అనబడే పరమశ్రేయస్సు లభించగలదు. ఇందలి విషయమును గ్రహించువాడు – నిర్విషయము, చిత్ప్రకాశమాత్రము, విజ్ఞానమయము, నిరామయము – అయినట్టి ఆత్మరూపమున ప్రతిష్ఠితుడగుచున్నాడు. సంసార భ్రమలన్నీ తొలగుట చేత పరమాకాశము వలె స్వచ్ఛుడౌతాడు. పరిపూర్ణుడు, కృతకృత్యుడు అగుటచేత, ఇక అతడు ప్రశాంతపూర్వకముగా ఈ 'జగత్‌యాత్ర' నిర్వర్తించగలడు.

"ఒక దర్పణం ఎదురుగా ఉన్న దృశ్యమును ఎట్టి ప్రత్యేకమైన ప్రయత్నం లేకుండానే, తన యందు ప్రతిబింబించుటకు ఆశ్రయమౌతోంది కదా! నేను కూడా పూర్ణమగు బ్రహ్మమునై ఈ

జగత్తులు, ఈ కార్యములు ప్రతిబింబించుటకు కర్తృత్వము లేకుండానే ఆశ్రయభూతుడ నగుచున్నాను." అని పఠించువాడు గ్రహిస్తున్నాడు. సమస్తము స్వస్వరూపముచే మ్రింగబడగా, అతడు తృప్తుడగుచున్నాడు. బాహ్యేంద్రియములు, చిత్తము, అహంకారము సర్వము చిదాకాశమేనని తెలుసుకొనుచున్నాడు. కార్య, కారణ, కర్తృత్వముల విషయంలో అత్యంత నిర్లిప్తుడై, దేనిచేత కూడా స్పృశించబడనివాడై ఉంటున్నాడు.

ఈ ప్రకరణము పఠిస్తున్నవాడు దేహము కలిగి ఉన్నప్పటికీ, తనను తాను విదేహిగా; సంసారి అయినప్పటికీ, అసంసారిలా గాంచుచున్నాడు. "నేను సర్వదా అఖండుడనే" అని గ్రహిస్తున్నాడు. ఇక అతనిని లోక వ్యవహారములు తాకలేవు. పరిపూర్ణమగు చిన్మయావస్థను పొందినవాడై స్వయముగా, తానే, 'చిదాదిత్యుడు' అగుచున్నాడు. అతని పట్ల దృశ్యములన్నీ అదృశ్యమగుటచే, అతడు శుద్ధ స్వరూపము, స్వచ్ఛత్వము పొందుచున్నాడు. ఈ 'సంసారము' అనే కుత్సితవ్యాధి నశిస్తోంది. 'అహంకారము' అనే పిశాచం వదలిపోవుటచే తాను శరీరం కలిగి ఉన్నప్పటికీ, "నేను ఈ దేహమునే" అను దురభిప్రాయం తొలగించివేసుకుంటున్నాడు.

మహాత్ముడగు అట్టి జీవన్ముక్తుని హృదయమే పరమాత్మ. అతడు "సత్త" అనురూపము గల ఆనందము యొక్క విస్తారముచే, సర్వోత్తముడై, హరిహరాదులతో సమానమైన అనుభవమును పొందుచున్నాడు.

❖❖❖

గ్రంథ ప్రశంస

శ్రీ వసిష్ఠ ఉవాచ :

మోక్షోపాయాభిధానేయం సంహితా సారసంహితా ।
త్రింసద్వేచ సహస్రాణి జ్ఞాతా నిర్వాణదాయినీ ॥ 1

దీపే యథా వినిద్రస్య జ్వలితే సంప్రవర్తతే ॥
ఆలోకో అనిచ్ఛతేపి యేవం నిర్వాణమనయా భవేత్ ॥ 2

స్వయం జ్ఞాతా శ్రుతావాపి భ్రాంతి శాంన్త్యైక సౌఖ్యదా ।
ఆపేక్ష్య వర్ణితా సద్యో యథా స్వర్గతరజ్గణీ ॥ 3

యథా రజ్వా మణి భ్రాంతిః వినస్యతి అవలోకనాత్ ।
తత్ ఏతత్ ప్రేక్షణాత్ శాంతిమ్ ఏతి సంసారదుఃఖితః ॥ 4

ఇదమ్ ఉత్తమమ్ ఆఖ్యానమ్ ఆధ్యేయమ్ వేదవత్ సదా ।
వ్యాఖ్యేయమ్ పూజనీయంచ పురుషార్థ ఫలప్రదమ్ ॥ 5

యదా అస్మాత్ ప్రాప్యతే శాస్త్రాత్ తత్తత్ వేదాత్ అవాప్యతే ।
అస్మిన్ జ్ఞాతే క్రియాజ్ఞానం ద్వయం యాతి పవిత్రతామ్ ॥ 6

వేదాంత తర్కసిద్ధాంతస్తు అస్మిన్ జ్ఞాతేచ బుద్ధ్యతే ।
ఇదముత్తమమాఖ్యానం వ్యాఖ్యాతం శాస్త్రదృష్టిషు ॥ 7

కారుణ్యాద్భవతామేతదహమ్ వచ్మి, న మాయయా ।
భవంతస్త్వవగచ్ఛంతి మాయామేతద్విచార్యతామ్ ॥ 8

అస్మాత్‌శాస్త్రవరాత్‌బోధా జాయంతే యే విచారితాత్ ।
లవణైర్వ్యంజనానీవ కాంతి శాస్త్రాంతరాణితైః ॥ 9

అనార్యమిదమాఖ్యానమ్ ఇతి అత్యనాదృత్యదృశ్యధీః ।
మా భవంత్యాత్మహన్తారో భవంతో భవభాగినః ॥ 10

మోక్షాభ్యుపాయాన్సు మహానుభావాన్
జ్ఞాస్యన్తి యే తత్త్వవిదాం వరిష్ఠాః ।
పునః నమేష్యన్తి న సంసృతింతే
కోఽర్ధః సుతాఃఽన్యేన బహూదితేన ॥ 11

శ్రీ వసిష్ఠమహర్షి :

ఓ సర్వజనులారా! 'యోగవాసిష్ఠము' అనబడే ఈ మోక్షశాస్త్రాన్ని 32000 శ్లోకములతో మీ అందరిముందు ఉంచుచున్నాను. ఇది సారవంతమైన అర్థప్రదాత నిర్వాణప్రదాతకూడా!

ఒకానొకడు గాఢనిద్రాపరవశుడై, దీర్ఘకాలంగా ఉండి అప్పుడే నిదురలేచి కనులు తెరచాడనుకోండి. ఆ గదిలో దీపం వెలుగుతూ ఉంటే, ఆ దీప ప్రకాశంలో – అతడు ప్రత్యేకమైన 'ఇచ్ఛ' కలిగి ఉండకపోయినా అక్కడ ఉన్న వస్తువులను చూస్తాడు కదా! ఈ గ్రంథములోని 'విచారణ'ను తెలుసుకొనుటకు ప్రయత్నించినంతమాత్రంచేత ఇచ్ఛ కలిగి ఉండకపోయినప్పటికీ నిర్వాణమగు మోక్షమును పొందగలడు.

దీనిని మీరు స్వయంగా పరిశీలిస్తే, చక్కగా గ్రహించగలరు. లేదా, ఇతరులు వ్యాఖ్యానిస్తున్నప్పుడు వినటం జరిగినా కూడా మంచిదే. గంగా జలం సర్వపాపములను హరించివేస్తుంది కదా! అట్లే ఇందు చర్చించబడిన విషయమును విచారిస్తే, అనేక జన్మలుగా వెన్నంటి వస్తున్న అజ్ఞానం తప్పకుండా తొలగిపోతుంది. ఒకడు చీకట్లో త్రాడును చూచి, "అమ్మబాబోయ్! ఇదిపాము!" అని భ్రమిస్తూ సర్వవికారములు పొందుచున్నాడనుకొందాం. ఆ భ్రమ తొలగిపోయేదెట్లా? "అటె! ఇది పాముకాదే! త్రాడు మాత్రమే కదా!" అని గ్రహించుటచేతనే కదా! ఈ గ్రంథమును అవలోకించినంతమాత్రంచేత ఈ దృశ్యముపట్ల, శరీరాదులపట్ల కలుగుచున్నట్టి అనేక భ్రమలు సమూలంగా తొలగిపోతాయి. సంసారదుఃఖమంతా శమించిపోతుంది. మీరంతా పరమపురుషార్థమయినట్టి "మోక్షము" అంటే ఏమిటో గ్రహిస్తారు.

ఈ ఉత్తమగ్రంథము వేదమువలె నిత్యము పఠించబడుగాక! పూజింపబడుగాక! వ్యాఖ్యానించ బడుగాక! వేదములందు, వేదమహావాక్యములందు ప్రసరించియున్నట్టి జ్ఞానమే ఇందు ప్రసరించి ఉన్నది. ఇందలి విచారణసారానికి వేదములే ప్రమాణం. ఇందలి విషయము తెలుసుకొనుటచే జీవుని 'కర్మ జ్ఞానములు' రెండూ కూడా పవిత్రవంతములౌతాయి. అనేక మంది తత్త్వజ్ఞానుల వేదాంత తర్క సిద్ధాంతములన్నీ కార్య కారణసహితంగా ఇందు పరిశీలించబడ్డాయి. శాస్త్రదృష్టిగల మహనీయులు దీనిని ఉత్తమ వేదాంత శాస్త్రముగా నిశ్చయించారు.

ఓ ప్రియజనులారా! మీపై మాకుగల అవ్యాజమైన ప్రేమచేతనే ఇదంతా చెప్పుచున్నాము. అంతేకాని, మాయకు లోబడియో, ఒకరి అభిప్రాయమును ఖండించుటకో మేము చెప్పుచుండుటలేదు. ఈ శాస్త్రము విచారించుటచే పరమోత్కృష్టమైన జ్ఞానము లభించగలదు. తద్వారా ఈ జగత్తు మాయ అని తెలిసిపోతుంది. ఇది విచారించుటచే ఇతర అధ్యాత్మశాస్త్ర గ్రంథాలు మరింత మధురంగా, సుస్పష్టంగా గ్రహించబడతాయి.

నాయనలారా! ఈ అఖండరామాయణము కావ్యమువలె లేదని (కథాగమనం తక్కువగా, చర్చ ఎక్కువగా ఉన్నదని) దీనిని నిరాకరించకండి. స్వస్వరూపమగు ఆత్మవిషయమై ఏర్పడిన దట్టమైన

అజ్ఞానం తొలగాలంటే ఓర్పు, నేర్పులతో కూడిన విస్తారమైన ప్రయత్నం అవసరమేనని మా అభిప్రాయం. అనేక రీతులైన ప్రవచనములు అవసరమే సుమా!

ఏదిఏమైనా నిష్కారణంగా ఆత్మ విషయం మరచి సంసారాసక్తులై ఉండటం శుభప్రదం కాదు. ధ్యానాదుల దృష్ట్యా, స్వల్పప్రయత్నమే చేసియున్నవారుకూడా మోక్షోపాయమైనట్టి ఈ గ్రంథం పఠిస్తూ ఉంటే క్రమంగా అమోఘమైన ప్రయోజనం పొందుచున్నారు. తత్త్వవిదులగు సద్గురువులు చెప్పుచుండగా శ్రవణం చేశారా ఇంకా ఎంతో మంచిది. అట్టివారు తత్త్వజ్ఞులలో ఉత్తమోత్తములై పునః సంసారమున పడబోరు.

❖❖❖

విషయ సూచిక

❖❖❖

మంగళాచరణం

యతః సర్వాణి భూతాని ప్రతిభాన్తి స్థితానిచ ।
యత్రైవోపశమం యాన్ని తస్మై సత్యాత్మనే నః ॥ 1

ఏ అద్వితీయ వస్తువు నుండి సృష్టికాలంలో ఆకాశము మొదలైన మహాభూతములు, వాటి నుండి సమస్త పదార్థములు ఉనికిని పొంది భాసిస్తున్నాయో, అట్టి సత్స్వరూపమగు పరమాత్మకు మోకరిల్లి నమస్కరిస్తున్నాను.

జ్ఞాతా జ్ఞానం తథా జ్ఞేయం ద్రష్టా దర్శన దృశ్యభూః ।
కర్తా హేతుః క్రియా యస్మాత్ తస్మై జ్ఞప్త్యాత్మనే నమః ॥ 2

జ్ఞాత (ఎఱుగువాడు) – జ్ఞానం (ఎఱుగబడే విధం) – జ్ఞేయం (ఎఱుగబడునది) – ద్రష్ట – దర్శనం – దృశ్యం – కర్త – హేతువు – క్రియ ఇవన్నీ దేని వల్ల భాసిస్తున్నాయో, అట్టి జ్ఞాన స్వరూపమగు పరమాత్మకు నమస్కరిస్తున్నాను.

స్ఫురన్తి శీకరా యస్మాత్ అనన్ద స్యామ్బరేః వనౌ ।
సర్వేషాం జీవనం తస్మై బ్రహ్మానందాత్మనే నమః ॥ 3

ఈ దేవతలు, మనుష్యులు, పశువులు మొదలైన ప్రాణులంతా ఏ మహానంద సముద్రంలో ఉపాధి భేదం చేత, ఆనంద బిందువులుగా స్ఫురిస్తున్నారో, ఏది సర్వదా ఆ సమస్త ప్రాణులకు జీవనమే అయివున్నదో, అట్టి బ్రహ్మానంద స్వరూపమగు పరమాత్మకు సాష్టాంగ నమస్కారం చేయుచున్నాను.

దివి భూమౌ తథాకాశే బహిరంతశ్చమే విభుః ।
యో విభాత్యవభాసాత్మా తస్మై సర్వాత్మనే నమః ॥ 4

స్వస్వరూపుడు, ప్రకాశరూపుడు అయినట్టి ఏ పరమాత్మ స్వర్గంలోను, భూలోకంలోను, ఆకాశంలోను, బయట, లోపల కూడా – ఏకరూపుడైనప్పటికీ – నానా రూపములుగా ప్రకాశిస్తున్నాడో, అట్టి సర్వరూపుడగు పరబ్రహ్మమును హృదయపూర్వకంగా మ్రొక్కుచున్నాను.

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

I. వైరాగ్య ప్రకరణం

మొదటి రోజు

1. ఉపోద్ఘాత కథ

పూర్వం 'సుతీక్ష్ణుడు' అనే ఒకానొక విద్యాకోవిదునకు ఒకప్పుడు ఒక సందేహం వచ్చింది.

కర్మ గొప్పదా? జ్ఞానం గొప్పదా? ....

కర్మలన్నీ త్యజించి 'విచారణ'ను అనుసరిస్తే మంచిదా? ....

విచారణను ప్రక్కకుపెట్టి ఉత్తమ కర్మను ఆశ్రయించటం ఉచితమా? ...

అప్పుడు అతడు సందేహనివృత్తి కొరకు సధర్మి, బ్రహ్మజ్ఞాని, తన సద్గురువు అయినట్టి అగస్తిమునిని సమీపించి వినయంగా ప్రణామంచేసి తన మనస్సులోని అనుమానం బైటపెట్టాడు.

అగస్తిముని చిరునవ్వు నవ్వి ఇట్లు పలికారు :

నాయనా! అదిగో! ఆకాశంలో ఎగురుచున్న పక్షిని చూచావా? అది రెండు రెక్కలు ఉంటేనే ఎగురుతోంది కదా! మానవుడు కూడా కర్మజ్ఞానముల రెండిటి సహకారంతో మాత్రమే మోక్షాకాశంలో విహరించగలడు. కేవలం కర్మవలనగాని, కేవలం జ్ఞానం వలనగాని జీవునికి మోక్షం లభించదు.

ఈ విషయంలో నీ సందేహాలన్నీ తొలగటానికి నీకొక కథన విశేషం చెపుతాను విను :

'అగ్నివేశ్యుడు' అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని కుమారుడు 'కారుణ్యుడు' అనే యువకుడు గురుకులంలో వేద వేదాంగాలు చదివి ఆ తరువాత గురుకులవాసం నుండి ఇల్లు చేరాడు.

ఇంటికి వచ్చిన తరువాత వంశపారంపర్యంగా వచ్చే అగ్నికార్యములు, సంధ్యా వందనము చేయకుండా తిరుగుతూ ఉండేవాడు. అగ్నివేశ్యుడు అది గమనించాడు. ఒక రోజు, కుమారుణ్ణి దగ్గరకు పిలిచి, "కుమారా! కర్మానుష్ఠానం త్యజించినట్లున్నావు. కర్మలను త్యజించి సిద్ధి ఎలా పొందాలనుకుంటున్నావు?" అని అనునయంగా ప్రశ్నించాడు. అప్పుడా కారుణ్యుడు, "తండ్రీ! మరి నన్నేంచేయమంటారు చెప్పండి? వేదములలోని కొన్ని భాగములు "కర్మానుష్ఠానం చేయవలసిందే" అని ప్రవృత్తి మార్గం నిర్దేశిస్తున్నాయి. ఇక మరికొన్ని విభాగములలో, 'కర్మ, ధనము, సంతానము మొదలైనవి మోక్షం ఇవ్వలేవు. సర్వత్యాగమొక్కటే ఉపాయం'* అని నివృత్తి

---

* "త్యాగేనతు కైవల్యమ్"

మార్గాన్ని చూపుచున్నాయి. కర్మ చెయ్యాలా? మానాలా? ఏమీ తోచక ఇట్లు మౌనం వహించి ఉన్నాను" అని పలికి ఊరకున్నాడు. అప్పుడు అగ్నివేశ్యుడు పకాపకా నవ్వి ఇలా చెప్ప ప్రారంభించాడు.

ఓహో! అదా సంగతీ! సరే. నీకిప్పుడు ఒక కథనం వినిపిస్తాను. అంతా విన్న తరువాత నీకు ఎట్లా తోస్తే అట్లాగే చెయ్యి : ....

'సురుచి' అనే అప్సరస ఒకనాడు హిమాలయ పర్వతశిఖరంపై ప్రశాంతముగా కూర్చుని ఉండి, ఆకాశం వైపు చూచింది. ఒక దేవదూత కనిపించాడు. అప్పుడామె "ఓ దేవదూతా! మీ ముఖం ఏవో నూతన కాంతులతో వెలుగుచున్నది. ఏదైనా విశేషమా?" అని ప్రశ్నించింది.

అప్పుడా దేవదూత ఇట్లు చెప్పసాగాడు : ఔను! విశేషమే. ఇప్పుడే ఒక పరమాద్భుతమైన సంభాషణ వినివస్తున్నాను. అది తలచుకొంటేనే నా ఒళ్ళు పులకరిస్తోంది. అదేమిటో నీకు చెపుతాను విను.

దేవదూత వాక్యాలు ఆ అప్సరస శ్రద్ధగా వినసాగింది ...

దేవదూత : గంధమాదన పర్వతంపై 'అరిష్టనేమి' అనే ఒక చక్రవర్తి ఎంతో భక్తి శ్రద్ధలతో తపస్సు చేస్తూ ఉండేవాడు. మన ప్రభువు ఇంద్ర భగవానుడు ఆతని తపస్సుకు మెచ్చి అతనిని స్వర్గమునకు తీసుకురావలసినదిగా నన్ను నియమించారు. నేను ఆ రాజు వద్దకుపోయి స్వర్గ లోకమునకు ఆహ్వానించాను. అప్పుడారాజు "అయ్యా! నా ఈ నమస్కారం స్వీకరించండి. నాదొక చిన్న సందేహం. దేవలోకంలో నాకు అవధులు లేని ఆనందం లభిస్తుందా? లేక అక్కడకూడా మా భూలోకంలో లాగానే గుణదోషాలు ఉంటాయా?"అని అడిగెను.

అతని ఉత్తమ జ్ఞానయుక్తమైన ప్రశ్నకు సంతోషించి నేను "ఓ రాజా! జీవులు తమ పుణ్యకర్మానుభవం కొరకు స్వర్గం చేరుతూ ఉంటారు. అయితే, జీవులు చేసే పుణ్య కార్యములలో కూడా ఉత్తమ, మధ్యమ, అధమ బేధములు ఉంటాయి కదా! స్వర్గలోకవాసులలో మీ లోకంలో లాగానే అధికులైనవారు, అల్పులైనవారు ఉంటారు. ఫలితంగా దేవతా జీవులు కూడా ద్వేషాలు, అసూయలు, దురహంకారములు, స్పర్ధలు, గర్వములు, గర్వభంగములు, కలహములు పొందుతూ ఉంటారు. అంతేకాదు. పుణ్యమంతా వ్యయమైన తరువాత ఆ జీవులు భూలోకం రావలసిందే కదా! అప్పుడు అమితదుఃఖం పొందుతూ ఉంటారు. ఓ ఉత్తమ పుణ్యశీలుడా! ఇక మనం బయలుదేరుదామా?" అన్నాను.

అప్పుడారాజు, "క్లుప్తంగా ఉన్న విషయమంతా సుస్పష్టపరచినందుకు కృతజ్ఞుణ్ణి. ఓ దేవదూతా! ఒక విధంగా ఈ భూలోకము వంటిదే అయ్యున్న, ద్వైతముతో కూడిన ఆ స్వర్గలోకం నేను కోరుకోవటం లేదు. నాకు నిర్వాణరూపమగు మోక్షమే కావాలి. అందుకొరకై ఇంకా ఇంకా తపస్సు చేస్తాను. ప్రకృతి సిద్ధమగు ఈ దేహం నేలకూలినా ఫరవాలేదు. నేను అందుకు సిద్ధమే" అని చెప్పి మౌనం వహించాడు.

ఇక చేసేది లేక నేను వెనుకకు మరలాను ఇంద్రదేవుని సమీపించి విషయమంతా విన్నవించాను. ఆయన ఆనందాశ్చర్యాలు పొంది ఇలా ఆజ్ఞాపించారు.

"ఓ దేవదూతా! అరిష్టనేమి లక్ష్యశుద్ధి నాకు ఆనందం కలుగచేస్తోంది. అయితే అతడు కోరుకొనే 'మోక్షస్థితి' ఉత్తమ విచారణ చేత మాత్రమే లభిస్తుంది. అతడు తన తపస్సుచే ఉత్తమ విరాగి అయినాడు. స్వర్గభోగములను ఉపేక్షించగల వితరణశీలం కూడా సంపాదించుకున్నాడు. అందుచేత ఉత్తమోత్తమైన ఆత్మ విచారణ వినటానికి అతడు తగి ఉన్నాడు. అందుచేత నీవు అతనిని వాల్మీకి ఆశ్రమం చేర్చు. మహత్తరమగు దేవదూత దర్శనం అతనిపట్ల వృథా కాకూడదు కదా!"

ఆయన సూచించినట్లే నేను ఆ రాజును వాల్మీకి ఆశ్రమం చేర్చాను.

❖

మోక్ష సాధనలో 1) తపో, ధ్యాన, నిష్కామ కర్మలవంటి ప్రయత్నములు,
2) సత్యాసత్యముల విచారణ – రెండూ ఆవశ్యకాలే!

భౌతిక సుఖరూపములగు స్వల్ప లక్ష్యములు మోక్షస్థితి వరకు జీవుని చేరకుండానే చేస్తాయి.

ఆత్మజ్ఞానం కొరవడినప్పుడు స్వర్గము కూడా తృప్తిదాయకము కాజాలదు.

ముముక్షువైనవాడు ఆత్మానుభవం గల మహనీయులను సమీపించాలి. వారి వాక్యములను వినటం, మననం చేయటం ఉత్తమ మోక్షోపాయమై ఉన్నది.)

❖❖❖

2. ఉపదేశ ప్రారంభం

అరిష్ఠనేమి రాజు వాల్మీకి ఆశ్రమంలో ప్రవేశించాడు. అక్కడి ప్రదేశమంతా పవిత్రతో, ప్రశాంతతతో ఆనందమయమై ఉన్నది. మునికుమారులు మధురంగా సామగానం చేస్తున్నారు. మరికొందరు రామావతారకథ ఆనందంగా చెప్పుకొంటున్నారు. చల్లగా వీచే పిల్లగాలులు జీవులకు భక్తి జ్ఞాన వైరాగ్యములను గుర్తు చేయుచున్నట్లున్నాయి. విశాల వృక్షములు మధుర శబ్దములు వినిపింపచేస్తున్నాయి.

ఒక ఎత్తైన స్థానంలో మహర్షివాల్మీకి ఆసీనులై ఉన్నారు. బ్రహ్మానందం ఆయన ముఖంలో మూర్తీభవించి ఉన్నది. రాజు ఆయనను సమీపించి సాష్టాంగదండ ప్రణామం చేశాడు. మహర్షి రాజును ప్రేమగా పలుకరించి సుఖాసీనుణ్ణి చేశారు. రాజు అవనత శిరస్కుడై ఇట్లు ప్రార్థించాడు.

"హే వాల్మీకి మహర్షీ! నేను సంసారబద్ధుడనై అనేక దుఃఖ పరంపరలను అనుభవిస్తున్నాను. నేటికి ఈ దేవదూత దయవలన మీ దర్శనం లభించింది. ఎంతటి సుదినం! తండ్రీ! మీరు

రామాయణం రచించి లోకమునకు మహోపకారం చేశారు. అయితే నాదొక సందేహం. ఎట్టి విచారణచే రాముడు మొదలైనవారు దుర్భరమైన ఈ సంసార సాగరాన్ని అవలీలగా దాటవేశారు? నాకా విషయం చెప్ప ప్రార్థిస్తున్నాను. మీ ప్రవచనముచే నన్ను పవిత్రుణ్ణి చెయ్యండి."

వాల్మీకి మహర్షి ఇది విని ఒక్క క్షణం మౌనం వహించారు. తనను ఆశ్రయించ వచ్చిన శిష్యుని పూర్వాపరాలు సంపూర్ణంగా గ్రహించారు. "ఇతడు వివేక దృష్టితో నిత్యానిత్యములను పరిశీలించా లనుకొంటున్నాడు. కనుక ఉత్తర రామాయణం (యోగవాసిష్ఠం) వినటానికి తగినవాడు. లోక కళ్యాణం కొరకు, జ్ఞానార్తులైన జనులపై నాకుగల అవ్యాజమైన ప్రేమచే వసిష్ఠ రామ సంవాద రూపమైన 'వాసిష్ఠ రామాయణం' ఇతనికి బోధించెదను గాక!" అని సంకల్పించారు. ఒక్కసారి ఆత్మ వస్తువును ధ్యానం చేశారు. పిమ్మట ఇట్లు ప్రవచించ ప్రారంభించారు :

శ్రీ వాల్మీకి మహర్షి :

దివి భూమౌ తథాఽఽకాశే బహిరంతశ్చ మే విభుః ।
యో విభాత్యవభాసాత్మా, తస్మై సర్వాత్మనే నమః ॥ (II - 1)

స్వస్వరూపభూతుడు, ప్రకాశరూపుడు అయిన ఏ పరమాత్మ స్వర్గంలోను, భూలోకంలోను, ఆకాశంలోను, బయట, లోపల కూడా నానావిధ రూపము లందు ఏకస్థుడై ప్రకాశిస్తున్నాడో అట్టి సర్వస్వరూపుడగు పరబ్రహ్మమునకు నమస్కరిస్తున్నాను.

శృణు రాజన్ ప్రవక్ష్యామి రామాయణమఖండితమ్ ।
శ్రుత్వాఽవధార్య యత్నేన జీవన్ముక్తో భవిష్యసి ॥ (I-52)

ఓ రాజా! జీవునియొక్క అఖండత్వాన్ని ప్రతిపాదిస్తున్న 'మహారామాయణము' చెప్పుచున్నాను. ఇది శ్రద్ధగా, ప్రయత్నపూర్వకంగా విని అవగతం చేసుకొన్నావా – నీవు ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తత్వము పొందగలవు.

ఈ 'ఆత్మవిచారణ' వినటానికి కేవలం అజ్ఞాని ("నే నీదేహమును అను దేహాత్మ బుద్ధి కలవాడు") తగినవాడు కాలేకపోతున్నాడు. కేవలం జ్ఞానికి ఇక చెప్పవలసిన దేముంటుంది? ఎవరైతే, "నేను బద్ధుణ్ణి, ఈ దృశ్యములోని అవాస్తవత్వం నన్ను ముగ్ధుణ్ణి చేస్తోంది. ఎట్లైనా సరే, ఆత్మజ్ఞానం పొంది ముక్తుడను కావాలి" అనే తీవ్రేచ్ఛ కలిగి ఉంటారో – అట్టి వారందరూ ఈ 'బోధ' వినటానికి తగినవారే !

మొదట పూర్వ రామాయణం (ఏడు కాండలతో కూడిన శ్రీరాముని కథ) తెలుసుకొని ఉండటం జరిగితే అప్పుడు ఆ పాఠకుడు ప్రవృత్తి మార్గంలో చిత్తశుద్ధిని పొందుచున్నాడు. ఇలా శుద్ధినొందిన చిత్తము స్వయంగా అకృతిమంగా సులభంగా జ్ఞానం పొందటానికి అభిముఖమౌతోంది. అప్పుడు ఈ వసిష్ఠ – రామసంవాద రూపమైన ఆరు ప్రకరణములతో కూడిన 'అఖండ రామాయణం' విచారిస్తే ద్విగుణీకృతమైన ప్రయోజనం సిద్ధించగలదు. ఇది నివృత్తి మార్గంలో తప్పక మోక్షం ప్రసాదించగలదు.

పూర్వం దివ్యదృష్టితో శ్రీరాముని కథ దర్శించి 24,000 శ్లోకములతో రామాయణం వ్రాశాను. 'భరద్వాజుడు' అను వాడు నా శిష్యుడు. మహామేధావి, బుద్ధిమంతుడు, ఏకసంథాగ్రాహి, వినయము కలవాడుకూడా. అతనికి రామకథ వినిపించాను.

ఒకసారి అతడు ఆ కథంతా మేరుపర్వతంపై భగవంతుడగు బ్రహ్మదేవునికి వినిపించాడు. ఆయన పరమానందం పొంది "కుమారా! చాలా బాగున్నదయ్యా! రామచంద్రుని కథ లోకమునకు కళ్యాణం కలుగజేస్తుంది. నాకు ఈ కథ వినిపించినందుకు ఏదైనా వరం కోరుకో" అని ఆశీర్వాదపూర్వకంగా పలికారు. అప్పుడు భరద్వాజుడు "తండ్రీ! ఈ జనుల దుఃఖములకు అంతూపొంతూ ఉండుటలేదు. దేనివలన జనులు దుఃఖవిముక్తులౌతారో, దాని గురించి చెప్పండి" అని వేడుకున్నాడు. అప్పుడాయన భరద్వాజుని, నా వద్దకు తోడ్కొనివచ్చి ఇట్లు ఆజ్ఞాపించారు :

"నాయనా! వాల్మీకీ! ఇప్పుడు నీవు వ్రాయపూనుకొన్న అఖండ రామాయణం శ్రమ అనుకోకుండా పూర్తిచేయి. సప్తకాండలు మధురంగా వ్రాశావు. అయితే, రాముడు ఏ విచారణచే వసిష్ఠ మహర్షిచే బోధింపబడి పూర్ణుడు, ఆత్మస్వరూపుడు అయ్యాడో – ఆ విషయాన్ని నీ ప్రియశిష్యుడగు భరద్వాజునికి బోధించు. అట్టి విచారణ సహాయంతో జీవులు ఈ సంసారమును అతి లాఘవంగా దాటివేయుదురుగాక!" ఇలా ఆజ్ఞాపించి అంతర్ధానమయ్యారు.

అప్పుడు ప్రవచించబడినదే నీకు చెప్పబోవుచున్నాను. నీ మీద వాత్సల్యంతో భగవత్ప్రేరితుడనై పలుకుచున్నాను. ఉత్కృష్టమైన ఈ 'ఆత్మజ్ఞానం' పొందినవాడు శోకము, దైన్యము, అభిమానము త్యజించి వేస్తాడు. నిత్యతృప్తుడై వెలయగలడు.

❖❖❖

3. శ్రీరామావతారం

ఓ అరిష్టనేమీ! నీ ఇష్ట దైవము ఆ నారాయణుడే భక్తుల శపాలను పరిపూర్ణమొనర్చే నిమిత్తం ఒక రాజు వేషం ధరించి ఈ భూమిపై సంచరించినాడు. తన అఖండత్వము, అద్వితీయ చిదానంద స్వరూపమును ఏమరచినవానివలె అవతరించి లోకములను పావనం చేశాడు. చైతన్య విగ్రహుడగు శ్రీమన్నారాయణునికి లీలా మాత్రంగా వేరువేరు సందర్భములలో ప్రాప్తించిన శాపముల గురించి మొదటగా చెపుతాను.

ఒకప్పుడు జగత్ప్రభువగు నారాయణుడు బ్రహ్మలోకం వచ్చాడు. బ్రహ్మదేవునితో సహా సర్వ బ్రహ్మలోకవాసులు ఆయనను పూజించారు. బ్రహ్మమానసపుత్రుడగు సనత్కుమారుడు మాత్రం "నేను నిష్కాముడను కదా! ఈ చరాచర సృష్టిలో నాకు కావలసినదేమున్నది? ఆశ్రయించవలసినది ఏమున్నది?" అని తలచి మాధవుని పూజించనేలేదు. ఇది గమనించిన గోవిందుడు "ఓయీ! మిత్రమా! సనత్కుమారా! నీవు నిష్కాముడవే కావచ్చు. కాని యుక్తాయుక్తములు మరువరాదు కదా! అందుచేత కుమారస్వామివై జన్మించి కామార్తుడవగుదువుగాక" అని శపించాడు. అందుకు

ప్రతిగా సనత్కుమారుడు "నారాయణా! అట్లా అయితే నీవు నీ సర్వజ్ఞత్వమును కోల్పోయి కొంతకాలం అజ్ఞానివై భూమిపై సంచరించెదవుగాక" అని శపించాడు. మరి ఆ వాక్యం నారాయణుడు సఫలం చేయాలి కదా!

ఇది ఇతఃపూర్వం ఒకానొక కల్పంలోని విషయం. ఆ కల్పంలో "ఖ్యాతి" అను ఆమె భృగువు యొక్క భార్య. ఆ ఖ్యాతి విష్ణుభక్తురాలు. "సర్వాంతర్యామియగు విష్ణువునందు లీనమగుదునుగాక" అని కోరుకొని భక్తి శ్రద్ధలతో ఆరాధించింది. భక్త వత్సలుడగు విష్ణుమూర్తి తన భక్తురాలి కోరికను అట్లే సఫలం చేశారు. అప్పుడు భృగువు క్రోధపరవశుడై "ఓయీ విష్ణుమూర్తీ! భార్యావియోగం ఎంతటి బాధాకరమో నీకు తెలియాలి. నీకు కూడా నాలాగానే భార్యావియోగం కలుగుగాక" అని శపించాడు.

గోలోకంలో ఒకప్పుడు రాధ, సుధాముడిని చూచి ఏదో సందర్భంలో, "నీవు దానవకులంలో జన్మించెదవుగాక"! అని శపించింది.

అతడు జలంధరుడై జన్మించాడు. అతని భార్య బృంద. లోకకంటకుడగు జలంధరుణ్ణి ఆ బృంద పాతివ్రత్యం కాపాడుతూ ఉండేది. దేవతలచే ప్రార్థింపబడి, నారాయణుడు లోకకళ్యాణం కొరకు కపటరూపం దాల్చి బృంద పాతివ్రత్యం భంగపరచారు. జలంధరుడు సంహరించబడ్డాడు. అప్పుడు విష్ణువు మోసం చేసినాడని తెలిసి "నీకు కూడా భార్యా వియోగం కలుగుగాక" అని శపించింది.

మరొకప్పుడు విష్ణుమూర్తి భీకరాకారమగు నృసింహుడై నదీతీరంలో సంచరిస్తున్నాడు. అప్పుడు 'దేవదత్తుడు' అనువాని భార్య నృసింహస్వామిని చూచి భయంతో ప్రాణాలు వదలింది. అప్పుడా దేవదత్తుడు "నీవు కూడా భార్యావియోగం పొందెదవుగాక" అని శపించటం జరిగింది.

ఓ రాజా! పై కారణాల వలన విష్ణుమూర్తి రాముడై జన్మించాడు. నీ ప్రియముకొరకే వేరు వేరు పురాణములలోని సంఘటనలు వినిపించాను. ఇక మనం ఆత్మవిచారణలో ప్రవేశిస్తున్నాం. సావధాన చిత్తుడవై విను.

❖❖❖

4. వస్తుతత్త్వం

ఆకాశము యొక్క వాస్తవ స్వరూపం శూన్యమేకదా! ఈ నిజం తెలుసుకొన్న తరువాత, "ఆకాశంలో నీలవర్ణముగల పదార్థమేదో ఉన్నది" అనే భ్రమ ఎవరికి ఉంటుంది? ఈ కనబడే జగత్తుకూడా కల్పితమాత్రమని, స్వకీయమైన 'భ్రమ' అని ఎరిగిన తరువాత ఇందు ప్రాప్తిస్తున్న సర్వ వికారాలు తొలగుతాయి. అయితే, బ్రహ్మము యొక్క వాస్తవ స్వరూపం తెలుసుకొన్నప్పుడు మాత్రమే ఈ జగత్తు యొక్క నిజస్వరూపం మనం తెలుసుకోగలం.

అనేక సంభ్రమములు, దుఃఖ పరంపరలు, వికారములు అనుక్షణం జీవునికి కలుగజేస్తున్న ఈ "జగద్దృశ్యము" ఎక్కడి నుండి ప్రాప్తిస్తోంది? ఈ వ్యవహారములు, అనుభవములు, శరీరములు జీవునకు రచించుచూ అందచేస్తున్న వారెవరు? సునిశిత బుద్ధితో పరిశీలిస్తే ఈ దృశ్యమును ఒకడు ఆయా విధములుగా మననము చేయుట చేతనే ప్రియముగా అప్రియముగా, సుఖ-దుఃఖ భరితంగా, సామాన్యముగా, అసామాన్యముగా.... ఇట్లు అనేక విధములైన భావనలతో అనుభవమగుచున్నది".... అని తెలియవచ్చుచున్నది. మననమే మనస్సుయొక్క, జీవునియొక్క, జగత్తు యొక్క మూలకారణమై ఉన్నది. అనగా ఈ 'జగత్తు' అనబడునది మనస్సునందే ఉదయించుచున్నది. ఎప్పుడైతే 'జగత్తు' అనబడే అనుభవం మనస్సునందు ఉదయించకుండా విస్మరించబడుతుందో, అట్టి విస్మరణముచే ఏర్పడగల శుద్ధ స్వస్వరూపానుభవమే సర్వోత్కృష్టమగు ముక్తి అని జ్ఞానులు మనకు చెప్పుచున్నారు.

అయితే అట్టి విస్మరణ స్థితి అనుభవమయ్యేదెట్లా? "అనేక అనుభవములతో కూడిన ఈ దృశ్యము ఉన్నదా? ఉంటే బాలునికి ఒక రకంగా, వృద్ధునికి మరొక రకంగా ఎందుకు తోచుచున్నది? కాబట్టి ఈ కనబడు దృశ్యముగాని, దీని సాక్షిత్వము గాని ఏ కాలంలోను ఉండి ఉండనేలేదు" అను అభేదరూపమైన బోధ లేక జ్ఞానము జీవునియందు దృఢం కావాలి. అప్పుడు మాత్రమే దృశ్యము యొక్క విస్మరణ, స్వస్వరూపము యొక్క అనిర్వచనీయానుభవం ఒకేసారి జీవునికి కలుగుతాయి.

భ్రాంతి వలన కల్పించబడిన ఈ జగత్తునకు ద్రష్ట యొక్క స్వభావమైయున్న భావము కంటే వేరైన అస్థిత్వమేదీ లేదు. అయితే అట్టి జగద్భావరాహిత్యముచే కలుగగల ఆత్మసాక్షాత్కారం శాస్త్ర విచారణా ప్రభావంచే అనాయాసంగా తప్పక లభిస్తుంది.

అట్టి ఆధ్యాత్మ విషయమును ప్రతిపాదిస్తున్న ఉత్తమ శాస్త్రములు ఉన్నాయి. వాటిని మానవుడు చక్కగా పరిశీలించాలి. లేదా, ఆత్మానుభూతి పొందిన మహనీయుల ముఖతఃవింటే ఇంకా మంచిది. "దృశ్యముగాని, ద్రష్టత్వముగాని మిథ్యయే" అనునట్టి తత్త్వజ్ఞానము యొక్క ప్రభావంచేత మనస్సు నుండి ఈ దృశ్యము తొలగిపోగా అప్పుడు శేషించు భేదరహిత స్థితియే సర్వుల యొక్క స్వస్వరూపమైనట్టి "ఆత్మస్థితి".

కాబట్టి ఈ దృశ్యము యొక్క విచారణము కొరకు ఆత్మజ్ఞానముకై ప్రయత్నించాలి. అట్లా కాకుండా, ఆత్మజ్ఞానం విడిచి కేవలం శాస్త్ర వాసనలతో లోక వాసనలతో కూడుకొని అనాత్మపూర్వకంగా ఎంత ప్రయాసపడితే మాత్రం ఏం లాభం చెప్పు?

మొట్టమొదట ఉత్తమ నిష్కామ కర్మలచేత, ఉపాసనలచేత, శ్రవణమననాదులచేత, స్వవిచారణచేత జీవుడు వాసనాక్షయం సాధించాలి. ఈ విధంగా చిత్తము నిర్మలత్వం పొందుగాక! సర్వ వాసనలు (tendencies) సంపూర్ణంగా త్యజించుటయే ఉత్తమమైన మార్గం. 'ఆసక్తి' కలిగి ఉండుటయే వాసనల రూపంకదా. ప్రపంచముపట్ల గల భ్రమలు తొలగితే అప్పుడు మరికొంత అభ్యాసముచే ఆసక్తి పూర్వకమగు (ఇంద్రియములతోటి) తాదాత్మ్యము సన్నగిల్లుతుంది. ఇక జన్మజన్మలుగా వెంటనంటి వస్తున్న వాసనలు తమంతట తామే తొలగుతాయి. "భ్రాంతి వలననే

ఈ జగత్తు నాకు ఇట్లు కనబడుతోంది. భ్రాంతికి వేరుగా జగత్తు లేదు" అను స్వబోధ (self-training) సహాయం చేత ఆత్మజ్ఞానమునకు పరాకాష్ఠ అయినట్టి "నిర్వాణస్థితి" ఉత్పన్నమౌతోంది. వాసనా రాహిత్యము, దృశ్య మనన రాహిత్యము కలుగగా అప్పుడు లభించే స్థితే 'మోక్షం'. అనగా, ఇకపుడు మోక్షప్రాప్తికి వేతే ప్రయత్నముల ఆవశ్యకత ఏదీ ఉండదు.

అయితే వాసనల యొక్క సంపూర్ణ పరిత్యాగం అవిద్యా దోషము లేనట్టి శుద్ధ చిత్తులకు మాత్రమే సాధ్యం. ఎండ ఎక్కుతున్న కొద్దీ మంచు కరిగిపోతున్నట్లు ఆత్మజ్ఞానం ఉదయిస్తున్న కొద్దీ క్రమంగా దృశ్యతాదాత్మ్యం, అవిద్యాభావన, అనేకత్వానుభవం, వాసనల ప్రభావం సన్నగిల్లుతాయి.

ఓ రాజా! పంచభూతములచే (భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశం) తయారగుచున్న ఈ భౌతిక దేహం కూడా వాసనల చేతనే ధరింపబడుచున్నది. ఈ వాసనలు రెండు రకాలు–

1. శుద్ధ వాసనలు 2. మలిన వాసనలు

ఇందు మలిన వాసనలు శరీర పరంపరా ప్రాప్తికి (మరల మరల జన్మలు పొందటానికి) కారణమౌతున్నాయి. మలిన వాసనల యొక్క ఆకారముగాని, వాటికి మూలకారణంగాని అజ్ఞానమే అయున్నది. అట్టి మలిన వాసనలే ఘనీభూతమై "అహంకారము" అనే రూపమును పొందుచున్నాయి. ఇక శుద్ధ వాసనలో, ... అహంకారమును, జన్మ పరంపరలను నశింపచేస్తున్నాయి. ఉడకపెట్టబడిన వేరుసెనగ గింజ మరల మొలుస్తుందా? కాని, రూపం మాత్రం కలిగే ఉంటుంది కదా! శుద్ధ వాసనలు కూడా జ్ఞేయమగు (తెలుసుకొనేది – తెలియబడునది) ఆత్మను ఎరిగిన తరువాత తమయందు 'పునర్జన్మ' అనే అంకురం కలిగి ఉండవు. 'శరీరం ధరించుట' అను బాహ్య వ్యవహార సరళి మాత్రమే కలిగి ఉంటాయి. అట్టి శుద్ధ వాసనలు మాత్రమే కలిగి ఉన్న జీవుణ్ణి "జీవన్ముక్తుడు" అని పిలుస్తున్నాం.

మహాత్ముడగు శ్రీరాముడు వసిష్ఠమహర్షిచే బోధింపబడి, సానపెట్టిన వజ్రంలాగా జీవన్ముక్తుడై, ఈ భూమిపై సంచరించాడు. ఆ రాముడు ఎట్టి విచారణచే అట్టి పరమోత్కృష్ట స్థితిని పొందాడో .... ఆ విచారణ నీకు కూడా చెపుతాను. ఇది వినినవారికి జరామరణభయం తొలగుతుంది. వారు తమ స్వరూపము యొక్క వాస్తవస్థితి గ్రహిస్తారు.

❖❖❖

5. కథా ప్రవేశం

అయోధ్యానగరం పాలించే దశరథ మహారాజుకు ఎంతోకాలం తరువాత పుత్రకామేష్టి మొదలైన యాగముల ఫలితంగా నలుగురు కుమారులు కలిగారు. వారే రామ, లక్ష్మణ, భరత శత్రుఘ్నులు. కులగురువు అయిన వసిష్ఠ మహర్షి వద్ద ఆ నలుగురు రాజకుమారులు విద్యాభ్యాస్యం పూర్తిచేశారు. స్ఫురద్రూపులై, నవనవోన్నత విలాసంతో ప్రకాశిస్తున్నారు. గురుకులం నుండి అంతఃపురానికి

తిరిగివచ్చిన రాముడు తండ్రి అనుజ్ఞపై సోదరులను వెంటబెట్టుకుని తీర్థయాత్రలకు బయలుదేరాడు. అనేక ఋష్యాశ్రమాలు, పుణ్యనదులు, దేవాలయాలు సేవించి తిరిగి అయోధ్యకు చేరాడు.

అయోధ్య చేరినప్పటినుండి రాముడు వేసవికాలంలోని తటాకజలంలాగా క్రమక్రమంగా క్షీణించసాగాడు. అప్పటికి అతని వయసు పదముడు ఏళ్ళు మించలేదు. కాని, తోటి బాలురతో ఆడటం మానివేశాడు. అంతఃపురంలో ఒక మూల పద్మాసనంలో కూర్చుని ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. పరిజనులు ఎంతో బ్రతిమలాడితేకాని, స్నానాదుల కొరకు కూడా లేచేవాడు కాదు. అతనిని చూచి ఆతని తమ్ములు కూడా చింతాక్రాంతులయ్యారు. అంతఃపురంలో రాజకుమారులున్న సందడేలేదు.

దశరథ మహారాజు రామునివైనం గమనించాడు. ఒక రోజు తన దగ్గరకు పిలిపించి, తొడపై కూర్చుండబెట్టుకొని లాలనగా "ఇంత దీనంగా ఉన్నావు. కారణమేమిటయ్యా? నీకు వచ్చిన లోటు ఏమిటో నాకుచెప్పు" అని తరచి తరచి ప్రశ్నించాడు. కాని ఏం లాభం? రాముడు మాత్రం ముక్తసరిగా "నాకేం అవసరం? ఇక లోటు ఏమి ఉంటుంది?" అని ఊరకున్నాడు. రాజు ఇక చేసేదిలేక, కులగురువు, వసిష్ఠుని రప్పించి రాముని నిస్తేజత్వం గురించి చర్చించాడు. అప్పుడు వసిష్ఠుడు, "ఓ రాజా! నీ కుమారుడు రామచంద్రుడు మేఘగంభీర స్వభావుడు. అట్టి వారికి స్వల్పకారణాలకు కోపం, సంతోషం, విషాదం మొదలైన వికారాలు పుట్టవు. స్వల్పులను మాత్రమే స్వల్పకారణాలు విచలితం చేస్తాయి. కనుక, మన రాముని యొక్క ఇట్టి విచిత్ర ప్రవర్తనకు ఏదో ఉత్కృష్టమైన కారణమే ఉండి ఉంటుంది. నీవు దిగులుపడవద్దు, దేనికైనా తగిన సమయం రావాలికదా!" అని అనునయంగా పలికాడు.

❖❖❖

6. విశ్వామిత్రుని రాక

'విశ్వామిత్రుడు' అనే మహర్షి ఉన్నారు. ఆయన ఒక సామాన్య రాజుగా జన్మించి స్వకీయ తపోధ్యానాది ప్రయత్నములచే బ్రహ్మర్షి అయ్యారు. ఒకప్పుడు శిష్య వాత్సల్యంతో ఇంద్రుని ఎదిరించి, 'త్రిశంకుడు' అను శిష్యుని కొరకు రెండవ స్వర్గం సృష్టించినట్టి మహామేధావి. అద్వితీయ ప్రతిభాశాలి. లోక కళ్యాణమే కార్యక్రమముగా కలిగియుండి సార్థకనామధేయుడైనారు. ఒక రోజు అకస్మాత్తుగా ఆయన అయోధ్యానగరం వచ్చారు. రాజు ఆయనను సభకు ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులు సమర్పించి ఒక ఉన్నతాసనంపై కూర్చుండబెట్టారు. సభలోని ముఖ్యులుంతా లేచి విశ్వామిత్రునికి సాష్టాంగ నమస్కారములు, ప్రదక్షిణలు సమర్పించారు. వసిష్ఠ – విశ్వామిత్రులు కుశల ప్రశ్నలతో పరస్పరం సంభాషించు కొన్నారు. యథాతథంగా సభ ప్రారంభించబడింది. దశరథ మహారాజు వినయ పూర్వకంగా సింహాసనము నుండి లేచి ఇట్లు పలికారు.

"లోక కళ్యాణమే జీవిత ధ్యేయంగా కలిగియున్న ఓ విశ్వామిత్ర మహర్షీ! సుస్వాగతం. మానవునకు అమృతం లభిస్తే ఎట్లా ఉంటుంది? రోజుల తరబడి కరువు కాటకం ఆవహించినపుడు అనుకోకుండా ఒక రోజు కుంభపోతవర్షం కురిస్తే ఎంత ఆనందం! గుడ్డివాడికి చూపు రావటమో, కుంటివానికి కాళ్ళు రావటమో జరిగితే ఎంత సంతోషం! మీ ఈ రాక మాకు, మా ప్రజలకు అంత ఆనందం కలుగచేస్తోంది. మేమంతా మీ దర్శనముచే పవిత్రులమయ్యాం. ఇచ్ఛాభయ క్రోధ రహితులగు మీ వంటి బ్రహ్మానందస్వరూపులు మా పూర్వజన్మల సుకృతం చేతనే మావంటి వారివద్దకు వస్తారు. మీరు ఎందుకు వచ్చారో అది నెరవేర్చబడినట్లే భావించండి. నిస్సంకోచంగా ఆజ్ఞాపించండి. ఈ రాజసింహాసనమైనా సరే, మీ పాదాలముందు ఉంచటానికి నేను సిద్ధంగా ఉన్నాను."

విశ్వామిత్రుడు ఆ మాటలకు సంతోషించి ఇట్లు పలికాడు.

"ఓ రాజా! మీకు, మీ రాజ్యమునకు శుభమగుగాక. నీ అతిథి మర్యాదలు నన్ను ఆనందింపచేస్తున్నాయి.

నేను ఒక మహాయజ్ఞం తలపెట్టాను. అది నిర్విఘ్నంగా నిర్వహించగలిగితే, లోకములకు శుభం చేకూరుతుంది. అయితే మేము యజ్ఞము ప్రారంభించి దేవతలను ఆహ్వానించినప్పుడల్లా కొందరు దానవులు వచ్చి యజ్ఞవాటికపై రక్త మాంసాలు కురిపిస్తున్నారు. మా ప్రయత్నాలన్నీ ధ్వంసమైపోతున్నాయి. మేము యాగదీక్షలో ఉన్నప్పుడు అత్యంత శాంత స్వభావులమై ఉంటాము కదా! అది వారు అవకాశంగా తీసుకొంటున్నారు.

ఇప్పుడు అసలు విషయానికి వస్తాను. నీవు మా ఈ ప్రయత్నమును సఫలం చేయాలి. నీ కుమారుడు రాముడు ఇంద్రుని మించిన పరాక్రమము కలవాడు. ఈ పూజనీయుడగు వసిష్ఠమహర్షి వద్ద సర్వశస్త్రాస్త్ర విద్యలు నేర్చుకొని మహావీరుడై ఉన్నాడు. మాకు ఆ రాముడు కావాలి. అతడు మాత్రమే మృగములను వేటాడే వేటగానివలె ఆ రాక్షసులను మట్టుపెట్టగలడు. మా యజ్ఞం పదిరోజులు జరుగుతుంది. ఇక ఇప్పుడు ఎక్కువ సమయం వృథా కాకూడదు. అతిత్వరలో యజ్ఞం ప్రారంభించటానికి అన్నీ సిద్ధం చేసుకున్నాం.

నీవు రాముని పరాక్రమం గురించి శంకించవలసిన పనిలేదు. అతడు వేనవేలు రాక్షసులనైనా సరే, క్షణంలో దునుమాడి నీకు కీర్తి తెచ్చిపెట్టగలడు. రాముణ్ణి నాకు అప్పగించిన మరుక్షణం మమ్ములను బాధిస్తున్న ఆ రాక్షసుల ఆయువు మూడినట్లే. మన రాముడు స్వయంగానే గొప్ప శక్తి సంపన్నుడు. పైగా నాచే రక్షింపబడగలడు. ఇక అనుమానం ఎందుకు? ఒకవేళ పుత్ర వ్యామోహం చేత అన్నమాట తప్పుతావా – అది నీకు అర్హమైనది కాదు. ఇక్ష్వాకు వంశపు రాజులు ఇచ్చిన మాట తప్పుతారా? లేదు. నీ ప్రత్యుత్తరం కోసం వేచి ఉన్నాను."

దశరథుడు అంతా విని అవాక్కయ్యాడు. కొద్ది క్షణములలో తేరుకొని రెండు చేతులు జోడించి ఇట్లు విన్నవించాడు :

"ఓ మహర్షీ! అన్నీ తెలిసి కూడా నన్ను పరిహాసం చేస్తున్నారా? ఎన్నో యేళ్ళు పరితపించిన తరువాత నాకీ పుత్రులు లేక లేక కలిగారు. నా పంచప్రాణాలు రాముడి మీదే. అతనికి ఏమైనా అయితే నేను భరించగలనా? ఈ రాముడు ముక్కు పచ్చలారని పసిబాలుడు. ఇంతవరకు కల్పితయుద్ధంలోనే గాని, నిజమైన యుద్ధంలో ప్రవేశించి ఎరుగడు. మీకు తెలుసు. అది రాక్షసులతో యుద్ధం. నేను అక్షౌహిణీ సైన్యంతో వచ్చి మీ యాగం రక్షిస్తాను. అయినా, ఆ రాక్షసులెవరో మరికాస్త వివరించి చెప్పండి. వారు ఎంతమంది? ఎట్టివారు? వారు మాయాయుద్ధ విశారదులు కాదుకదా...? ఒకవేళ మీకు ప్రతిబంధకం కలిగించేది లవణాసురుడో, సుందోపసుందులో కాదుకదా? ఈ కాలంలో రావణుని గురించి వింటున్నాం. అతడు కుబేరుని తమ్ముడు. విశ్రవసుని కుమారుడు. వాళ్ళ ముందైతే మేమే నిలువలేం. ఇక మా రాముడు ఎంతటివాడు చెప్పండి? ఇది ఈశ్వరేచ్ఛానుసారం కొందరు రాక్షసులు రాణించే కాలం. స్వామీ! నన్ను క్షమించి అనుగ్రహించండి. పుత్ర మమకారంతో నేనిట్లా అంటున్నానంటారా? నిజమే. ఈ పుత్రులకొరకు నేను ఎన్నో ఏళ్ళు తపించాను. మహా మహా జ్ఞానులైన వారే పుత్రుల యోగక్షేమముల కొరకు పరితపిస్తూ ఉంటారు. సామాన్య మానవులమగు మేము ఎంతటివారం చెప్పండి? అట్లుగాక, బలాత్కారంగా నా పుత్రుని గొని పోతానంటారా .... మరుక్షణం నన్ను విగతజీవునిగా ఎంచండి. మీ సేవచేయటానికి అక్షౌహిణి సైన్యంతో నేను సిద్ధంగా ఉన్నాను."

విశ్వామిత్రుడు అంతా విని తటాలున లేచి నిలబడ్డాడు.

"నా కార్యము నెరవేరుస్తానని మాట ఇచ్చి, ఇప్పుడు అన్నమాట వెనుకకు తీసుకొంటావా? రఘువంశంలో పుట్టిన నీకు ఇది తగుతుందా? సింహం లేడి కావటమా? పూర్ణ చంద్రుని నుండి ఉష్ణ కిరణాలు బయల్వెడలటమా? సరేః! మంచిది. నీవు నా కోర్కె తీర్చకుంటే నేను వెళ్ళివస్తాను. ప్రతిజ్ఞాభంగం చేసినవాడవై బంధువులతో సుఖంగా ఉండు."

ఇంతలో వసిష్ఠుడు విశ్వామిత్రుని సమీపించి అనునయ వాక్యాలతో శాంతపరచాడు. దశరథుని ప్రక్కకు పిలిచి, "ఓ మహారాజా! నీవే ధర్మం తప్పితే ఎట్లా? పైగా, రాముని పరాక్రమం సంగతి నాకు తెలుసు. అతడు విశ్వామిత్రుని రక్షణలో ఉండగా తేరిపార చూచేవారు ఈ మూడు లోకములలో ఎవరైనా ఉన్నారా? అందుచేత రాముణ్ణి తప్పకుండా పంపు. నీకు శుభమే కలుగుతుంది" అని సముదాయించాడు. దశరథుడు పుత్ర మమకారం కొంత ప్రక్కకుపెట్టి వివేచనా దృష్టితో విషయమంతా పరిశీలించాడు. రాముణ్ణి పంపటానికే నిశ్చయించుకొన్నాడు.

❖❖❖

7. రామ సభాప్రవేశం

రాజు రామచంద్రుని యొక్క ఒక ఆంతరంగిక సేవకుణ్ణి పిలిపించాడు. "ఓయీ! మన రాముని స్థితి ఇప్పుడు ఎట్లా ఉన్నది? చింతలన్నీ త్యజించి ఉత్సాహం పుంజు కొన్నాడా?" అని ప్రశ్నించాడు.

శ్రీరామ భృత్యువు : మహారాజా! మన రామచంద్రుడు తీర్థ యాత్రలకు వెళ్ళి వచ్చినప్పటినుండీ, అదొక విధంగా ఉన్నాడు. మేమంతా ఎంతో ప్రార్థిస్తేగాని స్నాన భోజనాలకు లేచుటలేదు. మాతో మాట్లాడనే మాట్లాడడు. తనలో తానే "ఈ సంపదల వలన ఏం ప్రయోజనం? ఆపదలచే బాధింపబడనివాడెవ్వడు? ఈ అంతఃపురములు, సేవకజనం, రాజ్యాది వ్యవహారములు ఈ జీవుడిని కాపాడగలవా? అసలు కోరికలు ఎందుకు ఉండాలి? ఏది సిద్ధిస్తే ఏం ప్రత్యేకత? ఇదంతా శూన్యరూపమే కదా!" అని చెప్పుకొంటున్నాడు. ఎప్పుడు చూచినా ఏకాకివలె, ఏకాగ్రచిత్తంతో ఎక్కడో ఒక మూల కూర్చుని ఉంటాడు. తాను ఒక రాజకుమారుడననే స్ఫురణే లేదు. సుఖమైన విషయాలను పట్టించుకోడు. దుఃఖకరమగు వార్తలకు ఏమాత్రం స్పందించడు. అభిమానముగాని, కోరికలు గాని ప్రకటించడు. "రాజా! ఇది యేమి?" అని ప్రశ్నిస్తే మౌనమే అతని సమాధానం. ఎక్కడైనా స్త్రీలు తారసపడినప్పుడు "అమ్మలారా! మీరందరు కాలముచే భక్షింపబడబోతున్నారనే విషయం తెలుసుకొనియే ఉన్నారా? మోక్షపదము కొరకు ప్రయత్నించకుంటే మీరెందుకు జీవిస్తున్నట్లో చెప్పండి?" అని నిలదీసి ప్రశ్నిస్తున్నాడు. "రామచంద్రా! మీరు కాబోయే సామ్రాట్టుకదా! ఇలా మాట్లాడటం ఉచితమేనా? యోచించండి" అని మేము అన్నప్పుడు పకపక నవ్వుతాడు. ఒక్కొక్కప్పుడు మేము మాట్లాడుతుంటే అసలు వినిపించుకోవడం లేదు.

"ఇయమ్ ఆపత్ ఇయంసంపత్" ఇత్యేవం కల్పనా మయః
మనసోఽభ్యుదితోమోహ ఇతి శ్లోకాన్ ప్రగాయతి! (X-38)

"ఇది సంపద, ఇది ఆపద...అనబడునదంతా కల్పనామయమే కదా!" అని అర్థం వచ్చే పాటలేవో బిగ్గరగా పాడుచున్నాడు. ఒకసారి, మాలో ఒకణ్ణి పిలిచి, "ఏమయ్యా! 'హా ఇంక గతేమిటి?' అని అనుకునే రోజు వచ్చేవరకు ఈ జనులు వైరాగ్యం పొందుటలేదేమిటి? నీకేమైనా కారణం తెలుసా?" అని ప్రశ్నిస్తున్నాడు. దానికి మేమేం సమాధానం చెప్పగలం? మాలో ఎవరైనా రాజకీయవిశేషముల 'ఊసు' ఎత్తగానే, ఆ మాటలు ఏమాత్రం విలువలేనివిగా చూస్తాడు. "ఇదంతా చమత్కారంగా ఉన్నదే! బాహ్యదృష్టిచే మాత్రమే లభిస్తున్న ఈ జగత్తులేదు. స్థూలబుద్ధికి మాత్రమే తోచుచున్న అహంకారం కూడా వాస్తవమైనది కాదు. మరి జీవుడికి దుఃఖం ఎక్కడినుండి వస్తోంది?" అని ఒకచోట వ్రాసి దాన్ని గురించే యోచిస్తూ ఉంటాడు. ఆతని దృష్టిలో బంధువులు, మిత్రులు, శత్రువులు, రాజ్యములు, కష్టములు, సుఖములు ఉన్నట్లే మాకు కనిపించటం లేదు. అతడు మూఢుడు మాత్రం కాదు. ముక్తుడు కూడా కాకపోయి ఉండవచ్చు. అతనియందు ఆశ, ప్రయత్నము, శాంతి కనబడటం లేదు.

కిం ధనేన కిమంబాభిః కిం రాజ్యేన కిమీహయా?
ఇతినిశ్చయవానంతః ప్రాణత్యాగపరః స్థితః ॥ (X-46)

"ఈ ధనంతో, ఈ బంధు జనంతో, ఈ రాజ్యములతో ఈ ప్రయత్నములతో నాకేమి పని? నేను నిశ్చయంగా ఇట్లే ప్రాణాలు వదిలేస్తాను" అని తనలో తానే గొణుక్కుంటుంటే, వింటున్న మాకు దుఃఖమే వస్తోంది. పరిపూర్ణమైన విభవములతో నిండిన అంతఃపుర ప్రాంగణమును, అతడు, కపటవేషం వేసిన మాంత్రికురాలిని చూచినట్లు చూస్తున్నాడు.

ఒకసారి ఏమైనదో చెపుతాను వినండి. మా భృత్యులలో ఒకడు మన రామచంద్రుని సమీపించి "యువరాజా! ఈ రాజవస్త్రాలు ధరించండి" అని వేడుకొన్నాడు. వెంటనే రాముడు అతనివైపు తిరిగి "ఓయీ! స్నేహితుడా! ఈ అన్నవస్త్రాలు చాలాగొప్పవైనట్లు మాట్లాడుచున్నావేమయ్యా? ఒకప్రక్క ఆయుష్షు ఎలా నిరర్థకమౌతోందో గమనిస్తున్నావా? ఆహా ఎంత ప్రమాదం! పరమానందరూపమైన మోక్షము కొరకు మనం ఏమైనా చేస్తున్నామటయ్యా? లేదు. అందుచేత ఈ స్వల్ప తతంగమంతా కాస్త కట్టిపెట్టు. ఈ జీవితం ఏమిటి? ఈ శరీరాదులు ఎందుకు ప్రాప్తిస్తున్నాయి? కొంచెం యోచించు" అని పలికాడు. ఆ ప్రక్కనే ఉన్న మేం ఆశ్చర్యపోయాం. మాలో ఒకడు ఒకసారి రామచంద్రుని ధనం యాచించాడు. అప్పుడాతడు, "ఓయీ! యాచకుడా! ధనం కోరుకుంటున్నావా? సరే మంచిది. కాని, 'ఈ ధనమే సర్వ అనర్థాలకు మూలం' అని మాత్రం మరువకు. ఇందలి దోషమును పరిశీలిస్తూ ఉండు" అని చెప్పి, ఎదురుగా ఉన్నదంతా ఇచ్చివేశాడు.

హే మహారాజా! రాముడు మహాధైర్యశాలి. ఔదార్యంలోను, పరాక్రమంలోను అతనికి అతడే సాటి. మరి అతడు అట్లు ఎందుకు ప్రవర్తిస్తున్నాడో? .... మాకు తెలియటం లేదు. అది నటన కాదు. కళ్ళలో నిర్మలత్వం, దృఢత్వం సర్వదా ప్రకటితమౌతూనే ఉన్నాయి. బైటనుండి పురుగుకూడా లోపలికి ప్రవేశించటం లేదు. మరి అతనిలో ఏదో మోహం చోటుచేసుకొన్నదని మాకు అనిపిస్తోంది. ఆ మోహం పోగొట్టి, అతనిని మరలించగలిగినవారు ఎవరైనా ఉన్నారా? ఎదురుగా ఉన్న వస్తువులను, జనులను చూడని వానికి మేమేం చెప్పగలం? దీనికి మీరే ఏదైనా పరిష్కారం కనుగొన ప్రార్థిస్తున్నాను.

❖

అంతా వింటున్న విశ్వామిత్ర మహర్షి కనులు ఆనందాశ్చర్యాలతో ప్రకాశించాయి.

శ్రీ విశ్వామిత్రుడు : ఓ రామభృత్యుడా! ఎంత చక్కగా వివరించావు! నీవు చెప్పినదంతా వింటే నాకు ఆనందం కలుగుతోంది. నీవు వెళ్ళి రాముణ్ణి ఇక్కడికి తీసుకురా. ఆశ్రిత వత్సలుడైన రాముడు మీ కోరిక, మా మాట, తండ్రి ఆజ్ఞ కాదనడు.

రామభృత్యుడు రాజాజ్ఞ గైకొని, రాముని అంతఃపురం వైపు పరుగులు తీశాడు.

శ్రీ విశ్వామిత్ర మహర్షి : ఓ సభికులారా! మన రామునికి కలిగిన ఈ చిత్తవైకల్యం వైరాగ్యయుక్తంగా కనబడుటలేదా! అతని వైరాగ్యం ఆపత్తుల వల్లనో, రోగాదులవల్లనో, కామాదుల వలననో కలిగింది

కాదు. వివేక వైరాగ్యముల వలన కలిగిన చిత్త ప్రబోధమేనని నాకు అనిపిస్తోంది. మహాసమృద్ధంలో కూడా ఇంతటి పరిశీలనాత్మక బుద్ధి ఉండటం మనం సంతోషించవలసిన విషయమే.

ఓ దశరథ మహారాజా! మీరు రాముని గురించి దిగులు పడవలసిన పనేమీలేదు. అతని చిత్తము జ్ఞాన వైరాగ్యములతో నిండి ఉన్నది. కాని, అందు స్వధర్మానికి సంబంధించిన లేశమాత్ర శంక ఇంకా మిగిలి ఉన్నది. ఆ దోషమును మనం యుక్తియుక్తాదులచే ఇప్పుడు తొలగించామా .... ఇక అతడు కూడా మావంటి ఋషులవలె స్వతఃసిద్ధమగు మోక్షము నందు విశ్రాంతి పొందగలడు. ప్రకృతి సిద్ధమగు రాజ్యపాలన మొదలైన లౌకిక వ్యవహారములకు, మోక్షస్థితికి ..... ఒకదానితో మరొకదానికి .... విరోధమేమీ వాస్తవానికి లేదు. ఆత్మ విచారణచే ఉత్తమ యోగస్థితిని పొంది, ఆపై ఎప్పటిలాగానే వ్యవహరించవచ్చు. మా వాక్యములు వింటే సత్త్వగుణం వృద్ధి చెందుతుంది. అతడు కార్యకారణతత్వమంతా తెలుసుకొంటాడు. సుఖదుఃఖములకు అతీతుడై గడ్డిపరకను, రాయిని, బంగారమును ఒకే తీరుగా చూడగలడు.

ఇంతలో సోదర సమేతుడై పదహారు సంవత్సరముల వయస్సుతో పూర్ణచంద్ర తేజస్సుచే ప్రకాశించుచున్న రాముడు సభలో ప్రవేశించాడు. సభలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. సభికులంతా రామునికి జయం పలికారు. ఆతడు మొదట రాజసింహాసనం సమీపించి తండ్రి పాదాలు స్పృశించాడు. ఋషులకు, బ్రహ్మవేత్తలకు, చిన్నప్పటి గురువులకు వినయంగా నమస్కరించాడు. సామంతులకు, రాజోద్యోగులకు ప్రతినమస్కారం చేశాడు. దశరథుడు, "నాయనా! రామా! స్వాగతం. ఇటువచ్చి యువరాజు ఆసనంపై కూర్చో!" అని పలికాడు. కానీ ఆ మాటలు రాముని చెవిని పడనేలేదు. అతడు సభామధ్యంలో ఒక ప్రదేశమునందు చతికిలపడి కూర్చున్నాడు. ఎవరో భృత్యువు పరుగునపోయి ఒక కంబళంతెచ్చి అక్కడ పరచాడు.

మహారాజు : కుమారా! నీవు సద్గురువు అయిన వసిష్ఠ మహర్షి వద్ద విద్య అభ్యసించావు. జ్ఞానవంతుడవు. రాజువు. సర్వ విషయములకు ఆశ్రయభూతుడవు. ఏమీ తెలియని జడునివలె ప్రవర్తిస్తున్నావేమయ్యా? నిష్కారణమైన ఈ దైన్యం ఎక్కడి నుండి వచ్చింది? ఆత్మను వినోదంతో ఆనందింపచేయాలేకాని, మోహదైన్యాదులతో నిన్ను నీవే బాధించుకోవటం ఉచితమా? నీవంటి వివేకులు పెద్దలచే, గురువులచే ఉపదేశించబడిన మార్గమే అనుసరిస్తారు కదా! ఎవరికైనా స్వధర్మమే పుణ్యము, సద్గతీ కూడా. నిరర్థకమైన చిత్తచాంచల్యం వలన లాభమేముంటుంది?

శ్రీ విశ్వామిత్రుడు : ఓ రామచంద్రా! నీకు జయమగుగాక! నీ మనసులో ఉన్న చింత ఏమిటో మాకు చెప్పు. నీ మనోవ్యాకులత్వానికి కారణములు ఏమిటి? నిన్ను ఏఏ విషయాలు బాధిస్తున్నాయి? మేము వచ్చాము కదా! నీ మనోభావాలు ఎట్టి సంకోచం లేకుండా మా ముందుంచు. మేము నీ సంశయాలన్నీ తొలగించి, మనోవ్యాధుల ఊసైనా లేకుండా చేస్తాం. విచారణ లేకపోవుటచేతనే మానవుడు ఈ దృశ్యములో మ్రగ్గుచు, అనేక వ్యధలు అనుభవిస్తున్నాడు. నీ మనస్సులో ఉన్నదేమిటో మమ్ములను తెలుసుకోనీ.

విశ్వామిత్రుడు లాలన పూర్వకంగా చెప్పినదంతా రాముడు విన్నాడు. కొద్ది క్షణాలు సభ అంతా కలియచూచాడు. తనలో “ఆహా! నేడు ఎంత సుదినం! బ్రహ్మ విద్వరేణ్యులైన మహర్షులు ఈ సభను అలంకరించి ఉన్నారు. కనుక నా సందేహాలన్నిటికీ సమాధానాలు తప్పక లభిస్తాయి” అని అనుకొన్నాడు. పూర్ణార్థయుక్తంగా ఇట్లు సమాధానమిచ్చాడు.

❖❖❖

8. రాఘవ వైరాగ్య వర్ణనము

శ్రీరాముడు : ఉత్తమోత్తములచే అలంకరించబడిన సభకు నమస్కారం. ఇక్కడ వేంచేసియున్న విశ్వామిత్రాది మహర్షుల దర్శనభాగ్యం, సేవాభాగ్యం అనేక జన్మల సుకృతం చేతనే లభిస్తాయి.

హే విశ్వామిత్ర మహర్షీ! నా మనస్సులో ఉన్న భావాలన్నీ మీరు ఆజ్ఞాపించినట్లే చెపుతాను. నా ఈ వాక్యములలో దోషమేమైనా ఉంటే క్షమించండి. సత్పురుషులకు మనోగతమైనదంతా తెలియచేయటం శుభప్రదమే అవుతుంది కదా!

నేను పదహారు సంవత్సరముల క్రితం ఈ దశరథ మహారాజు ఇంట్లో జన్మించాను. క్రమక్రమంగా వృద్ధిచెందుతూ విద్యాభ్యాసం పూర్తి చేశాను. కొంతకాలం క్రితం తీర్థయాత్రలకు వెళ్ళివచ్చాను. వచ్చినప్పటినుండీ నా మనస్సులో ఒకానొక “విచారణ” ఉత్పన్నమైనది. ఆ విచారణ యొక్క స్వరూపమేమిటో చెపుతాను వినండి.

కింనామేదం బతసుఖం యేయం సంసార సంతతిః?
జాయతే మృతయే లోకో, మ్రియతే జననాయచ ॥ (XII-7)

ఈ సంసార వ్యవహారంలో ‘సుఖం’ అంటూ ఏదైనా ఉన్నదా? ఇక్కడ ప్రాణి చావటానికే పుట్టుచున్నాడు. పుట్టడానికే చచ్చుచున్నాడు. ఇంతకన్నా ఇక్కడ చెప్పుకోతగ్గ విశేషమేమున్నది? కొందరు, “అలా ఎందుకనుకోవాలి? ఇందులో ఐశ్వర్యములు, ధనములు, స్వజనులు, స్త్రీలు – మొదలైనవి సుఖప్రదములేకదా! అవి సంపాదించు కొన్నవారు సుఖంగానే ఉంటున్నారు కదా!” అని అంటున్నారు. కాని, ఇది వినండి!

అస్థిరాః సర్వయేవేమే సచరాచర చేష్టితాః
ఆపదాం పతయః పాపా భావా విభవ భూమయః ॥ (XII-8)

ఇందులో స్థావరజంగమ జీవులు పొందుచున్న భోగములు, విభవములు – ఇవన్నీ అస్థిరములు, అసత్యములు, అశాశ్వతములు అయి ఉన్నాయి. ఒకప్పుడు కొంచెం సుఖకరంగా తోచినప్పటికీ, శాశ్వతమైన సుఖం మాత్రం ఖచ్చితంగా ప్రసాదించుటలేదు. ఒక్కక్షణంలో కనిపించి మరొక్క క్షణంలో మాయమైపోతున్న ధన, జన, యౌవనాదులు సుఖ ప్రదాతలని అనటం ఎట్లా? ఉదాహరణకు ఈ సంపదలే తీసుకోండి. వీటిని కూడబెట్టుకోవటంలోను, రక్షించుకోవడంలోను జనులు ఎన్ని

ఆపదలు ఎదుర్కొంటున్నారు! ఇవన్నీ ఎన్ని రకాలైన లోభమోహాది పాపపూరిత దుశ్చర్యలకు కారణభూతములౌతున్నాయి! అందుచేతనే సుఖకరములని అనేకమంది అనుకొంటున్న ఈ సంపదలు, ఈ విభవములు, ఈ పదార్థ జాలములు, ఈ మనుష్యుల సంబంధ – బాంధవ్యములు సత్పురుషుల దృష్టిలో తుచ్ఛములు, తిరస్కారములుగానే ఉంటున్నాయి. వీటికై ప్రయత్నిస్తున్న అనేకమంది సంసారజీవుల అనేక చేష్టలు కూడా నాకు అర్థరహితంగానే కనిపిస్తున్నాయి.

ఈ సంసారంలో మనకు కనిపిస్తున్న బంధుత్వాలు, స్నేహాలు, అనుబంధాలు, మొదలైనవాటిని పరిశీలనగా చూచినప్పుడు నాకు ఒకటి అనిపిస్తోంది: ఇందలి జనులు ఒకరికొకరు సంబంధించినవారే కారు. వీరందరు ఇనుప చీలలవలె (రింగులవలె) ఒకరికొకరు ముడిపడినట్లు పైకి ఉంటున్నారు. కాని, లక్ష్యాలు, కష్టాలు, ఆవేదనలు, సంస్కారాలు – ఎవరివి వారివే. ఒకరు మరొకరి వంటివారు కానేకాదు. అయితే జీవుడు "ఈ ఈ వ్యక్తులు, ఈ ఈ పదార్థములు నాకు సుఖకరములు" అని సంకల్పించుట జరుగుతోంది. అందుచేతనే అతనికి వాటితో సంబంధములు, బాంధవ్యములు ఏర్పడుచున్నాయి. చూచారా? ఈ ప్రపంచంలో మనకు కనిపిస్తున్న అన్ని రకములైన సంబంధములు కేవలం "సంకల్పించుట" అను ప్రక్రియ కారణం చేతనే ఏర్పడుచున్నాయి. అట్టి సంకల్పమాత్ర సంబంధాలు ఈ జీవుడిని ఎంతగా క్షోభింప చేస్తున్నాయో కదా!

ఈ జగత్తు, దీనియొక్క సృష్టి స్థితి లయాలు మనస్సుచే కల్పించబడినవి మాత్రమే. అయితే ఏం? ఈ జీవుడు అంతులేకుండా దుఃఖ క్లేశ పరంపరలు పొందుచూనే ఉన్నాడు. మనస్సే అన్నిటికి కారణం. కాని, పరికించి చూస్తే ఈ 'మనస్సు' అనునది ఎక్కడున్నది? దేనిచే తయారుచేయబడింది? 'మననము చేయుట' అనుదానికి వేఱుగా ఈ మనస్సుకు అస్థిత్వమే లేదు. అస్థిత్వం లేని వస్తువు కారణంగా జీవులమగు మేము బద్ధులం అవుతున్నాం. ఎంతటి దురదృష్టం! మూఢమృగములు అల్లంత దూరంలో మృగతృష్ణను చూచి "అందలి జలం మా దాహం తీరుస్తుంది" అని అనుకొని ఎంతో శ్రమకు ఓర్చుకొని పరుగెత్తుతాయి చూచారా! మూఢబుద్ధులమగు మేము కూడా 'అసత్తే' అయినట్టి ప్రాపంచిక సుఖములచే ఆకర్షించబడి, పరుగులు తీస్తున్నాం. ఈ విషయ సుఖములు చివరకు మా పట్ల దౌర్భాగ్యరూపములే అవుతున్నాయి. అజ్ఞానం చేతనే వాటియందు సుఖభ్రాంతి పొందటం జరుగుతోంది కాని, పొందుచున్నది మాత్రం సంకటములు మాత్రమే. 'అంతామాయ' అని తెలిసికూడా ఈ విషయసుఖములకు మేము అమ్ముడు పోతున్నాం. అరణ్యంలో ఒక లోతైన గోతిలో పడిపోయిన కొన్ని లేళ్ళు అక్కడి ఆకులను భక్షిస్తూ కాలం గడుపుతాయి. కొంతసేపటికి అవి "అయ్యో! మేము ఈ గోతిలో చిక్కుకున్నామే?" అని తెలుసుకొని దుఃఖిస్తాయి. మేము కూడా మోహవశంచేత 'ఇంద్రియముల ప్రియాప్రియములు' అనే గోతిలోపడి అనేక వాంఛలచే కట్టుబడి ఉన్నాం. ఎంతో కాలానికిగాని, "అయ్యో! ఇక్కడ ఈ అజ్ఞానంలో చిక్కుకున్నాం కదా" అనే విషయం తెలుసుకోలేకపోతున్నాం.

ఇప్పుడు చెప్పండి. ఈ రాజ్యాదులతో నాకేమి పని? ఈ భోగపాశాలలో నేను ఎందుకు

చిక్కుకోవాలి? అసలు నేనెవరిని? ఈ దృశ్య ప్రపంచమంతా నాకెక్కడినుండి దాపురించింది? నేను ఇక్కడికి ఎందుకు వచ్చాను? నా వాస్తవ స్వరూపమేమిటి? ఈ శరీరాదులు నాకెక్కడి నుండి ఎందుకు ప్రాప్తిస్తున్నాయి? ఈ ప్రశ్నలన్నీ వదలి నన్ను 'రాజ్యభోగాలు' అనే బురదలో చిక్కుకొమ్మంటారా? ఏది ఎక్కడినుండి వచ్చినా రానివ్వండి. ఏది మిథ్యయో అది మిథ్యగానే ఉండుగాక. అసత్యములు, అవాస్తవములు, అశాశ్వతములు అయిన పదార్థములచే నేను భ్రమపొందకుండెదను గాక!

❖

మహాత్మా! విశ్వామిత్రా! ఈ విధంగా అనేక కోణముల నుండి విమర్శన చేస్తూ, అంతా పరిశీలించాను. విచారణ చేయనివానికి రుచికరంగా తోచే ఈ ప్రాపంచిక పదార్థములపట్ల నాకు ఒక విధమైన 'అరుచి' పుట్టింది. ఒక బాటసారి తొందరపనిమీద దూరంగా ఉన్న గ్రామానికి త్వరత్వరగా నడచివెళ్ళుచున్నాడనుకోండి. అప్పుడు బాట ప్రక్కనగల శ్మశానభూములు తుచ్ఛములుగానే కనబడతాయి కదా! నాకు కూడా ఈ సంసార విషయాలు పరిశీలించాలని ఏమాత్రం అనిపించటంలేదు.

ఏది ఎట్లా ఉన్నా, నాకు మాత్రం నిర్దుష్టమైన, శాశ్వతమైన సుఖ శాంతులు లభించకయే ఉన్నాయి. స్వామీ! సంసారజీవులమైన మేము అనేకసార్లు పుడుతున్నాం. చస్తున్నాం. జరా–మరణములు, సంతోష –విషాదాలు, సుఖ–దుఃఖాలు, ఆవేశ–నీరసాలు వస్తున్నాయి. పోతున్నాయి. ఈ సంసారం కల్పిస్తున్న దుఃఖాలను మేము తొలగించుకోలేక పోతున్నాం. "ఈ 'సంసారము' అనే దోషం మమ్ములను ఆక్రమించకుండా ఉండేది ఎట్లా?" అనే ప్రశ్న నన్ను రాత్రింబవళ్ళు దహించివేస్తోంది. ఒక మహావృక్షపు తొఱ్ఱలో గొప్ప అగ్నికణం ప్రవేశించిందనుకోండి. అప్పుడు ఆ వృక్షం బైటకు తన ఆకులచే పిల్లగాలులు అనుభవిస్తూ ఉన్నా, లోనమాత్రం శిథిలత్వం పొందుతూ మౌనంగా రోదిస్తూ ఉంటుంది చూచారా? మా సంసారజీవుల గతి కూడా అట్లాగే ఉన్నది. మా మనస్సులు పరితాపాగ్నులచే క్షణక్షణం దహించబడుచున్నాయి. బైటకు మాత్రం ఏవేవో స్వల్ప కార్యక్రమములు కల్పించుకొని రోజులు గడుపుచున్నాం. ఈ సంసార భ్రమలకు, ఈ దుఃఖములకు మాకు అంతు కనబడుటలేదు.

స్వామీ! మరల మరల మాచే బలవంతంగా అనుభవించబడుచున్న తుచ్ఛ భోగములచే మేము శైథిల్యమే పొందుతున్నాం. వెదురు బొంగులవలె ప్రాణ వాయువులతో కూడినవారమై, శబ్దం మాత్రం చేస్తున్నాం. జడబద్ధులమై ఉంటున్నాం. ఎందుకంటే, దుఃఖనివృత్తి కొరకు శాశ్వతమైన ఉపాయమేదీ ఆశ్రయించని మేము జడపదార్థములకంటే అధికులమా? కాదు. కటిక దరిద్రునికి అధిక సంతానం లాగా వివేక రహితులమగు మాకు అనేక ఉచ్ఛ – నీచ ఉపాధులు వచ్చిపోతున్నాయి.

ఈ తుచ్ఛ ధనాదులు శాశ్వతమైన ఆనందం ఇవ్వలేకపోగా, అవి మమ్ములను క్షణక్షణం 'లోభము, మోహము, మాత్సర్యము' మొదలైన దుష్టమృగములు నివసిస్తున్న అజ్ఞానారణ్యములోకి త్రోసివేస్తున్నాయి. పోనీ, ఈ ధనములను, ఈ పరివారములను త్యజిద్దామా – అదీ కుదురునది

కాదు. ఇదంతా చూస్తుంటే నాకు దుఃఖమే కలుగుతోంది. కేవలం తల్లిదండ్రులు, తదితరులు కష్టపడతారేమోనని మాత్రమే పైకి ఏడ్చుటలేదు.

హే మహర్షీ! ఈ ప్రపంచమంతా అవిచారము, అజ్ఞానము, మూఢత్వము, మూర్ఖత్వము అన్నివైపులా దట్టంగా వ్యాపించి ఉన్నాయి. ఇంద్రియ ప్రియములగు "విషయములు" అనే దొంగలు మా హృదయ గృహములలో ప్రవేశించి మా 'వివేకము' అనే సంపదను దొంగిలించుకుపోతున్నారు. మేము ఆ దొంగలను గుర్తించుటలేదు. "ఇది మాకు చెంది ఉండుగాక. మా పేరు ప్రతిష్ఠలమాట ఏమిటి?" మొదలైన ఏవేవో ఫీంకారములతో ప్రొద్దుపుచ్చుతున్నాం. ఆ విషయదొంగలను నిరోధించుటకు మా ఈ శరీర సామర్థ్యాలు, శస్త్రాస్త్ర విద్యలు ఎందుకు పనికి వస్తాయి చెప్పండి? బ్రహ్మజ్ఞానులగు విద్వాంసులు మాత్రమే వారిని నిరోధించగలరు.

❖❖❖

9. ధన వ్యవహారం

ఓ మునిశ్రేష్ఠా! మేమంతా ఈ 'ధనం' అనునది సంసారంలో చాలా సారభూతమైన విషయమని భావిస్తున్నాం. అట్టి భావన మూఢత్వం చేతనే మా వద్దకు చేరుతోంది. దీనివలన నిజమైన సుఖముగాని, శాంతిగాని కలుగుతోందా? లేదు.

ఒకడు ఎంతో ప్రయాసతో "నేను ముందు ముందు సుఖపడెదను గాక" అని భావించి తన శక్తియుక్తులను, తెలివితేటలను, కాలమును వినియోగించి అట్టి ప్రయత్నమునందే నిమగ్నుడౌతున్నాడు. అనేక రోజులు గడచిపోతున్నాయి. అట్టి ప్రయత్నములో కొన్ని సఫలం, మరికొన్ని విఫలం అవుతున్నాయి. అయితే ఒక ప్రక్క విలువైన జీవితకాలం వృథా అగుటలేదా? జంతువుల, కీటకముల జన్మలన్నీ ఆహార నిద్రా మైథునాలతో గడచిపోతున్నాయి. మానవ జన్మకూడా అంతమాత్రమేనా? ఈ ధనమును అభివృద్ధి చేసుకోవటంలో ఎన్నో ప్రమాదాలు, భయాలు, దోషావేశాలు తారసపడుచున్నాయి. ఇది మనస్సును మోహమునందు చిక్కించి అనేక విధములుగా కలవరపెట్టుచున్నది. ఒక విచిత్రం గమనించారా? ధనము లేనివాడు, "అయ్యో! నాకు ధనములేదే? అతనికి ఉన్నదే?" అని వాపోవుచున్నాడు. కాని, ధనము కలిగియున్నవాడు మాత్రం, "నేను ఇప్పుడు అవిచ్ఛిన్నమైన తృప్తిని పొందుచున్నాను" అని అనుకోవటం లేదు. ఎంత చమత్కారమైన విషయం!

ఈ ధనము "నేను ఆశ్రయిస్తున్నట్టి ఈతడు గుణవంతుడా? కాదా?" అనునది చూడదు. రాజుయొక్క స్వభావంలాగానే అది ఒకచోట స్థిరంగా ఉండదు. నిప్పు త్రొక్కిన కోతిలాగా ఒకచోటినుండి మరొకచోటికి పరుగులు తీస్తూ ఉంటుంది. యుద్ధం, జూదం, వంచన, లోభం వంటి అధర్మ కార్యాలు కూడా ధనమును పెంచగలుగు చున్నాయి. ధనం ఉన్నచోట "ధర్మము"* ఉండగలదన్న

---

* ధర్మము = function, Duty consciousness

నమ్మక మేమున్నది? పాలు త్రాగి పాము విషమును క్రక్కునట్లు, ధనమును సంపాదించి ఈ మనుజుడు కూడా కామ, క్రోధ, లోభ, మోహాదులను అధికం చేసుకొంటున్నాడు. గొప్ప ప్రజ్ఞావంతుడు, శూరుడు, కృతజ్ఞుడు, అందరిపట్లా ప్రీతికలవాడు కూడా సంపదలు పొందినపుడు తన కోమల స్వభావం కోల్పోవుచున్నాడు. క్షణంలో కఠినాత్ముడుగా, అవివేకిగా తయారగుచున్నాడు. ధూళిలోపడిన కారణంగా రత్నముకూడా మలినపడుతుంది కదా! విచిత్రమేమిటంటే "జననిందా పాత్రుడు గాని ధనవంతుడు, తనను తానే పొగడుకొనని శూరుడు, సమదృష్టి కలిగివుండే ప్రభువు" – ఈ ముగ్గురు లభించటం లోకంలో దుర్లభమే అవుతోంది.

భయంకర విషసర్పం దాగివున్న పుట్టపైగల పూతీగ ఎట్టిదో, ఈ సంపదలు కూడా అట్టివే. ఎందుకంటారా? అవి ఉన్న కాస్త వివేకాన్ని ఊడ్చి పెడుతున్నాయి. కుసంస్కారమును, ఉద్వేగమును, దురభ్యాసములను తెచ్చిపెడుతున్నాయి. సత్యదృష్టిని మరచేటట్లు చేస్తున్నాయి. వీటి పటాటోపం ఎంతగా జీవుడిని ఆకర్షిస్తోంది! ధనమొక్కటే జీవితలక్ష్యంగా కలవారు నీచులతో, దుర్మార్గులతో, లోభులతో స్నేహం చేయవలసి వస్తోంది. గుణవంతులు దూరంగా ఉండిపోతారు. ఇక వీటియొక్క అంతిమ ఫలితం గమనిస్తే, అది అతి చంచలంగానే ఉంటోంది. ఎవరికోసం ఇంతగా శ్రమించి ఈ జీవుడు ధనాదులను సంపాదించాడో వారే అతనిని ద్వేషిస్తున్నారు. తిరస్కరిస్తున్నారు. ఇంతా సంపాదించి లెక్కించి చూచుకొంటూ ఉండగా మరొకవైపు ఈ శరీరమే శిథిలమౌతోంది. అతడు తాను సంపాదించినదంతా ప్రియంగా, మమకారంగా, నిస్సహాయంగా చూస్తూ "అయ్యో! ఇదంతా విడచి వెళ్ళవలసిందేనా? నేను పోయిన తరువాత ఏమౌతుందో, ఏమో?" అని అంతరంగమున తలచుచూ దుఃఖమునే పొందుచున్నాడు. బాహ్యవిషయములు మాత్రమే అయివున్నట్టి ఈ ధనాదులు ఇంతగా చిత్తమును ఆకర్షించటం నాకు చిత్రమని అనిపిస్తోంది.

ధనముతో బాటే భ్రాంతి, దుర్వ్యసనములు, బంధుద్వేషములు, దొంగలభయం, కారాగృహం, మృత్యుభయం మొదలైన అశుభ విషయాలు కూడా వెంటనంటి ఉంటాయి. ఈ అనుభవాలన్నీ జనులు గమనిస్తూనే, చూడనట్లే ఉంటున్నారే? మెఱుపువలె దీని రాకపోకలు క్షణికములు. దీనివలన 'సుఖం లభిస్తోంది' అని తలచటం వట్టి భ్రాంతి మాత్రమేనని నాకు అనిపిస్తోంది. జీవులను మోసగించటంలో ధనము తరువాతే ఏదైనా. ధనము ఉన్నచోట జ్ఞానము, వైరాగ్యము చోటు చేసుకోవడం దుర్లభమైన విషయమే.

❖❖❖

10. జీవితం - ఆయుష్షు

ఈ ఆయుష్షును చూచారా స్వామీ! ఇది చిగురాకు కొనయందున్న జలబిందువు లాగా చంచలమై ఉన్నది. చిల్లికుండలోని జలంలాగా నశించుటయే దీని స్వభావం. ఈ శరీరం ఉన్నట్లుండి ఏ క్షణంలోనో అకాలంగా రోగాల పాలు అవుతోంది. ఒక 'నియమము' అంటూ లేకుండా ఏ

క్షణంలోనో నేలకూలుతోంది. మునీశ్వరా! "ఇంద్రియ విషయములు" అనే సర్పములకు ఆలవాలమైన చిత్తము గలవారికి ఆయుష్షు శ్రమనే కలుగజేస్తోందని నాకు అనిపిస్తోంది. ఆత్మజ్ఞానం పొందినవారికి మాత్రమే అది ప్రయోజనకరం. ఎందుకంటారా? ఒకవైపు ఇంద్రియ శక్తులను ఇంద్రియ విషయములే బలహీనపరుస్తుంటే బ్రతుకు త్వరత్వరగా ఆయాసకరం అవటంలో ఆశ్చర్యమేమున్నది? మేము ఇంద్రియదృష్టిని మాత్రమే కలిగి ఉంటున్నాం. అందుకే మా ఆయుష్షు నిష్ప్రయోజనం అయిపోతోంది. ఈ జగత్తులో కొందరు స్వస్వరూపమగు 'ఆత్మ' గురించి ఎఱుగుచున్నవారై అట్టి ఆత్మపదము నందు విశ్రమించుచున్నారు. అందుచేత, లాభాలాభములందు సమబుద్ధి కలిగివుంటున్నారు. అట్టివారిపట్ల మాత్రమే ఈ ఆయుష్షు సౌఖ్యప్రదం అవుతోంది. ఇక మేము ఈ పరిమిత శరీరాదులందు "ఈ శరీరమే మేము" అనునట్టి దేహాత్మబుద్ధి కలిగి ఉంటున్నాం. అందుచేతనే కాబోలు, అనేక చింతలు మమ్ములను హింసించివేస్తున్నాయి.

అయినా ఈ ఆయుష్షును నమ్మి ఉండటం ఎట్లా చెప్పండి? ఏ క్షణంలో ఏదైనా కావచ్చును కదా! వాయువుయొక్క ప్రసరణమును, అలలను నిరోధించవచ్చునేమో కాని, నీటి బుడగవంటి ఆయుష్షును నిలపగలమని నమ్మి ఉండటం ఉచితమేనా? ఇది అతి చంచలమైనదికదా? అందుకే జ్ఞానులు దీనిని తరంగమువలె, చమురు లేని దీపంవలె త్వరలో నశించిపోయేదాని లాగానే చూస్తారు. కొందరు జనులు, "అయ్యా! మేము భగవంతుని గురించి ముసలితనంలో చూచుకొంటాం. ఇప్పుడు తొందర ఏమి వచ్చింది?" అంటూ ఉంటారు. వారికి ఆయుష్షుపై ఎంత నమ్మకం! అట్లు వారు నమ్మి మోసపోవుటలేదా?

తండ్రీ! మహర్షీ! మన పెద్దలు 'అశ్వతరి' అనే మృగం గురించి చెపుతూ ఉంటారు. అది ప్రసవించగానే మరణిస్తుంది. అయినప్పటికీ గర్భహేతువు అయినట్టి 'సంగమము' ను కోరుకొంటూనే ఉంటుంది. అట్లాగే లోకులుకూడా "మాకు ఎంతో ఆయుష్షు ఉండుగాక" అని కోరుకొంటున్నారు. కాని మూఢత్వం ఆశ్రయించి చిత్త ప్రశాంతతను కోల్పోయిన తరువాత దీర్ఘాయుష్షు ఉండి మాత్రం ప్రయోజనమేమున్నది? జీవించి ఉన్నందుకు ప్రయోజనంగా సర్వ విధ దుఃఖరహితమగు పరమానంద రూపమైనట్టి బ్రహ్మవస్తువు సాధించాలి. అఖండానందము, పరమశాంతి నిలయము అయిన ఆత్మను పొందినప్పుడే జీవితం సార్థకమౌతుంది.

తరవోఽపి హి జీవన్తి, జీవన్తి మృగ పక్షిణః ।
స జీవతి మనో యస్య మననేన నజీవతి ॥ (XIV-11)

వృక్షాలు, మృగాలు, పక్షులు కూడా జీవిస్తున్నాయి. కాని ఏం లాభం? ఎవనికైతే, ఈ దృశ్య సంకల్పము యొక్క మననము క్షీణిస్తుందో, అట్టి మనస్సు కలవాడే వాస్తవమైన జీవితమును అనుభవిస్తున్నాడని నా అభిప్రాయం. ఈ జీవితము పట్ల, ఈ కనబడే దృశ్య వ్యవహారము పట్ల సరైన అవగాహన కలిగివుండాలి. సత్యదృష్టిని అవలంబించి వాసనలను త్యజించివేయాలి. తత్త్వబోధ పొంది ధన్యులు కావాలి. అట్టివారి విషయంలో మాత్రమే ఆయుష్షు ధన్యత చెందుతుంది. ఇక

తక్కినవారి విషయం ఏమి చెప్పమంటారు? వారు ముసలి గాడిదల వలె ధన, దార, శాస్త్రాది విషయములను మూలుగుతూ మోస్తున్నారు. (శాస్త్రజ్ఞానం కూడా 'కామము' మొదలైన రోగములచే పీడింపబడేవారికి, దృశ్య విషయములపట్ల అనురాగం పెంచుకొన్నవారికి భారముగానే పరిణమిస్తోంది). కనుక, "జ్ఞానం సంపాదించుకోవాలి" – అని అనుకొనేవారు ముందు కామాదులను జయించాలి. పెద్దబరువు మోసేవాడు ఆ బరువును దించుకొంటేనే సుఖిస్తాడు కదా!

చిత్తశాంతి లేనివారికి ఆ చిత్తమే పెనుభారము అవుతోంది. ఈ చిత్తము అనుక్షణం అనేక సంకల్పములను ఆహ్వానించి కలత చెందుతోంది.

అయితే, కొందరు మాత్రం, "ఇది ఆత్మ, ఇది అనాత్మ" అని ఎరిగినవారై శరీరాభిమానం త్యజించివేస్తున్నారు. ఈ శరీరమును కూడా ఇతర దృశ్య పదార్థముల వలె ఒకానొక బాహ్యమైన వస్తువువలె చూస్తున్నారు. వారి బుద్ధి నిర్మలం కాగా మనస్సుకు స్వస్థత చేకూరుతోంది. మనో స్వస్థత లేనిచోట అందమైన రూపం, శరీర పుష్టి, లౌకికమైన తెలివితేటలు, దీర్ఘాయుష్షు, శాస్త్రజ్ఞానం, సంకల్ప సామర్థ్యం, గొప్పజ్ఞానశక్తి – ఇవన్నీ నిష్ప్రయోజనమే అవుతున్నాయి. పెనుభారముగా పరిణమించి అనేక దుఃఖములను ప్రోగుచేసి పెడుతున్నాయి. అయితే మేము యౌవన గర్వాతిరేకం చేత ఇదంతా గుర్తించలేకున్నాము. ఏవేవైతే చూచుకొని "మేము ఇంతటివారముకదా" అని అనుకొంటున్నామో, అవన్నీ మా వెంటే ఉంటున్నాయా? లేదు. కొద్దికాలంలో మా మానగర్వాలన్నీ నేలరాచి మమ్ములను విడచిపోతున్నాయి. ఈ ఆయుష్షు స్థిరమైన సుఖంగాని, సారభూతమైన అంశముగాని కలిగిఉండనప్పుడు ఇది గుణహీనమై వ్యర్థమే అవుతుంది కదా!

నూనం నిగరణాయాశు ఘన గర్ధమనారతం ।
ఆఖుర్మార్జాలకేణేవ మరణేనావలోక్యతే ॥ (XIV-19)

పిల్లి ఎలుకను ప్రియంగా చూచునట్లు ఒక ప్రక్క మృత్యువు ప్రాణిని మ్రింగి వేయడానికి మహాభిలాషతో నిరంతరం చూచుచున్నది. ఈ విషయం జీవులు ఎట్లా మరచుచున్నారో నాకు అర్థం కావటం లేదు.

రోగాలు శరీరాన్ని డొల్లచేస్తున్నాయి. వార్ధక్యం నక్కలాగా కాచుకు కూర్చున్నది. జరామరణాలు ప్రియమిత్రులవలె కరచాలనం చేసుకోవటానికి ఉత్సాహపడుచున్నాయి. ఇదంతా ఇట్లుండగా అనేకులు ఇదంతా గమనించకుండా తీరికగా కూర్చుని వర్తమానం వ్యర్థం చేసుకొంటున్నారు.

❖❖❖

11. అహంకార స్వరూపం

అన్నిటికన్నా ప్రబల శత్రువు ఈ 'అహంకారం'. ఇతడు కారణం లేకుండానే పుట్టుచున్నాడు. రూపం లేకుండానే వ్యవహరిస్తున్నాడు. సంసారారణ్యంలో విచ్చలవిడిగా సంచరించుచున్నాడు. పరీక్షించి చూస్తే "అహం" అనే అభిమానమే ఇతని రూపం. అట్టి అభిమానం వలననే రాగద్వేషాది

సర్వదోషాలు వచ్చిపడుతున్నాయి. ఆకారాదులు లేకపోయినప్పటికీ, ఇది అందరిని బాధిస్తోంది. ఓ మహర్షీ! భూమ్యాకాశాలమధ్య మరే శత్రువును చూచి నేను భయపడుటలేదు. కాని, ఈ అహంకార శత్రువు గుర్తుకు వచ్చినపుడు మాత్రం గజగజవణుకుచున్నాను. "దీని ఉత్పత్తికి కారణమేమి?" అని పరిశీలిస్తే 'అజ్ఞానమే' అని సమాధానం లభిస్తోంది. దీనినుండి సర్వ ఆపదలు, మనోవ్యథలు, వికారాలు జీవునకు ప్రాప్తిస్తున్నాయి.

'అహంకారము' అనే కిరాతకుడు 'మాయ' అనే వలపన్నుచున్నాడు. ఈ జీవులు అజ్ఞాన మృగములవలె అందులో చిక్కుకొంటున్నారు. ఇతడు, ఎందుకో, నా పాలపడ్డాడు. నన్ను బంధించయత్నిస్తున్నాడు. క్షణంలో శాంతి, సమత, సద్గుణములను పీల్చి పిప్పి చేస్తున్నాడు. ఇంతటి శత్రువు ఎదురుగా ఉండగా భోజనమే తీసుకోలేక పోతున్నాను. ఇక భోగముల మాట చెప్పేదేమున్నది?

మొదలే అసత్యమై ఉన్న ఈ అహంకారాన్ని ఆశ్రయించి ఏదేది చేస్తామో, గ్రహిస్తామో, వాంఛిస్తామో అవన్నీ కూడా అసత్యములే అవుతాయి కదా! అహంకారముపై నమ్మకమున్నంతకాలం, ఆశ, తృష్ణలు ఉంటాయి. అందుచేత నేను అహంకారమును తిరస్కరిస్తున్నాను. "నేను రాముడనే కాదు. నాకే కోరికలూ లేవు. నాకు చెందినదంటూ ఎక్కడా ఏదీలేదు. నేను దీనికి చెందినవాడనుకాను" అనే నిశ్చయం చేసుకొంటున్నాను. "నా మనస్సు ఎటూ ప్రసరించకుండుగాక" అని శాసిస్తున్నాను. కాని ఏం లాభం? అజ్ఞానం ఉండి ఉండుటచేతనే కాబోలు నాకు ఏమీ తెలియకయే ఉన్నది.

'దేహము' అనే కీకారణ్యంలో 'అహంకారము' అనే పిశాచం అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అతడు ఇట్టివే అగు అనేక పంచభూతాత్మకమైన దేహములను దండగా వేసుకొని ధరిస్తున్నాడు. ఈ జగత్తే అతని 'మెడ'వలె ఉన్నది. అసలు ఈ 'అహంకారము' యొక్క నివాస స్థానము ఎక్కడ? అంతఃకరణమే కదా! ఎప్పుడైతే అంతఃకరణము అమిత చంచలమై దుర్వాసనలతో కూడినదై, సద్గుణములు లేనిదై ఉంటోందో, అప్పుడు దానిలో అహంకారము వచ్చి తిష్టవేస్తోంది. సర్వ ఆపదలను వెంటబెట్టుకొని సంచరించే, ఈ అహంకారమును ఆశ్రయించి రాజ్యాదులు ఏలమని నన్ను మీరు ఆజ్ఞాపించకుండెదరుగాక! దానికి బదులు, ఈ అహంకారమును జయించివేయగల ఉపాయాలేమైనా ఉంటే నాకు ఉపదేశించి నన్ను కృతార్థుణ్ణి చేయండి. మనస్సులో పేరుకొన్న 'మహామోహము' అనే మంచు మీ ఉపదేశ ఉష్ణకిరణ ప్రభావంచేత కరిగిపోవాలనే కోరుకొంటున్నాను.

❖❖❖

12. మనస్సు - చిత్తము

సర్వ కార్యములు సాధించటంలో దిట్ట అయిన ఈ 'మనస్సు' గురించి చెపుతాను. వినండి. ఇది అనేక కామక్రోధాలతో నిండి అతి శిథిలమై ప్రవర్తిస్తోంది. అన్ని వేళలందు దోషదుర్గంధములతో కూడుకొన్న విషయానుభవములకొరకే పరుగులు తీస్తోంది. పెద్దలు చెప్పే మార్గమును, సత్కార్యములను

స్వీకరించమన్నప్పుడల్లా మొరాయిస్తోంది. దీని కదలికలు నెమలి పింఛపు తుదికొనలాగా అతి చంచలం. తండ్రీ! మీరు వీథికుక్కను చూచారు కదా! అది ఏ పనీ లేకపోయినప్పటికీ వీథులలో అటూ–ఇటూ తిరుగుచు ఆయాసపడుతూ ఉంటుంది కదా! అట్లాగే ఈ మనస్సు కూడా నిరర్థకంగా, నిష్కారణంగా, నిష్ప్రయోజనకరంగా అన్నివేళలలో 'అటూ ఇటూ' తిరుగుతోంది. నిద్రకు ఉపక్రమించినప్పుడు కూడా దీనివేగం ఆగటం లేదు. పోనీ, పొందేది ఏమైనా ఉన్నదా? లేదు.

ఓటికుండలాగా అది ఏమాత్రం నిండటంలేదు. ఎప్పుడైనా ఏదైనా లభించినా అంతటితో తృప్తిపడదు. తన సంకల్ప పరంపరలను త్యజించే శక్తిలేక అనేకసార్లు దీనత్వం, వ్యాకులత్వం పొందుతోంది. దురాశల వలలో చిక్కుకొన్న దానికి 'తృప్తి' అన్నమాట ఎక్కడిది? జల్లెడలో నీరు పోస్తుంటే నిండేదెప్పటికి చెప్పండి.

ఈ మనస్సు* గుంపులోంచి చెదరిన కోతిలాగా అవిశ్రాంతంగా ఎక్కడి నుండి ఎక్కడికో పరుగులు తీస్తోంది. హే బ్రహ్మవేత్తా! "స్తంభజాడ్యము" (అవయవములు బిగతీసుకుపోయే ఒక వ్యాధి)చే అవయవములు అస్వాధీనమగుటచే ఒకడు ఒకచోట పడి ఉన్నాడనుకోండి.... అతడు ఒక ప్రక్క కాళ్ళు చేతులు కదల్చలేక బిక్కచూపులు చూస్తూ ఉంటే, ఎక్కడి నుండో ఒక ఊరకుక్క అతనిని పీక్కుతినాలని "భౌ భౌ" మంటూ సమీపిస్తుంటే అతని మానసికస్థితి ఎలా ఉంటుంది? ఈ మనస్సు నాకు అలా కనబడుతోంది. సుడిగాలిలో చిక్కుకొన్న ఎండుటాకువలె దీనిచే నేను చాలా దూరం తీసుకుపోబడ్డాను. అది నన్ను ఎక్కడ నేలకూలుస్తుందో ఏమో?

ఈ మనస్సులో 'చిత్తవృత్తులు' అనే సుడిగుండాలు ఉన్నాయి. క్రూరత్వము, పరవంచన, దురభ్యాసము మొదలైనవి ఇందులో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.

మహాత్మా! నూతిలోకి దింపబడిన ఏతామును ఏతాము త్రాడు క్రిందికి పైకి త్రిప్పుతూనే ఉంటుంది చూచారా? మేము కూడా భోగవాంఛలతో, కామక్రోధములతో కూడుకొన్న వారమై మూడు లోకములలో మనస్సుచే త్రిప్పబడుచున్నాం. ఈ మనస్సును పట్టుకొని నియమిద్దామా అంటే, ... దీనికి ఒక రూపమే లేదాయె! తమవంటి జ్ఞానులు "మనస్సు అనబడు ఒకానొక వస్తువులేదు. దానికి అస్థిత్వమే లేదు" అని చెప్తూ ఉంటారు. అజ్ఞానబాలుడు కథలోని భూతమును చీకట్లో ఎదురుగా ఉన్నట్లు ఊహించుకొని బాధపడునట్లు "లేదు" అని చెప్పబడుతున్న మనస్సు మాకు ప్రాప్తిస్తోంది.

ఈ చిత్తము క్రోధాగ్నిజ్వాలలతో నన్ను ఒక ఎండుగడ్డి పరకవలె కాల్చి వేస్తోంది. ఇది అగ్నికంటె వేడి. కొండకంటే కఠినం. దీనిని మేము అసలు జయించగలమంటారా? స్వల్ప వస్తువులకోసం పరుగెత్తుతూ, స్వల్పత్వమునే పొందుచూ, నరకాదుల రుచి ఏమిటో మరల మరల

---

* ఒక పదార్థమును మనం ప్రీతిపూర్వకంగా ఆశ్రయించినపుడు మన మనోచిత్తములు ప్రవర్తిస్తున్నాయి.

ప్రీతి కలిగియుండు స్వభావం= చిత్తము; మననము చేయు స్వభావము = మనస్సు

చూపించే ఈ చిత్తము యొక్క గమనం నిరోధించటమెట్లా చెప్పండి? ఒక సింహమును ఉత్తచేతులతో బంధించవచ్చునేమో. సముద్రజలమునైనా పానం చెయ్యవచ్చునేమో. హిమాలయ పర్వతాన్ని కూడా పెకిలించవచ్చునేమో. అగ్నినైనా భక్షించవచ్చునేమో. ఈ చిత్తమును నిరోధించటం మాత్రం అంతతేలికైన విషయం కాదు. ఇది అవివేకమును ఆశ్రయించి ఉండుటచే, అన్ని ఉపాధులందు ఏకస్థమైయున్న 'ఆత్మ' దీనికి ఏమాత్రం కనిపించటంలేదు. ఏమి తెలుసుకొన్నా, ఎంత బోధింపబడినా, ఎల్లప్పుడూ భేద భావమునే పొందుతోంది. సామ్య - సమతా భావములను హరించివేసి దుఃఖములను కలుగచేయుటలో బహుప్రావీణ్యత చూపుతోంది. అనేక విషయాలలో అంతులేని ఆసక్తిని కల్పించుకొని అందులో జడత్వం వహించి నిదురపోతోంది. ఎంతలేపినా నిదురలేవదు. సమరసపూర్వకమగు ఆత్మజ్ఞానము కొరకు ఏమాత్రం ప్రయత్నం చేయదు. ఇప్పుడు నేను ఏమి చేయాలో నాకు అర్థమగుటలేదు.

ఈ మనస్సే అంతటికీ కారణం. ఇది క్షీణిస్తే లోకాలు క్షీణిస్తాయి. విజృంభిస్తే లోకాలు కూడా విజృంభిస్తాయి. కొండపై అడవులు పెరుగుచున్నట్లు, సర్వ సుఖ దుఃఖాలు ఈ మనస్సు నుండే బయలుదేరు చున్నాయి. ఆచార్యులు ఎంత బోధించినా ఇది తన జాడ్యమును త్యజించుటలేదు. క్రూరుడగు పోకిరిబాలుడు మరొక పసిబాలుని బెత్తము చూపి బెదిరిస్తున్నట్లు ఇది నన్ను బెదిరిస్తోంది. ఈ 'మనస్సు' అనే వ్యాధికి ఉత్తమమైన ఔషధం వివేకమే కదా! అట్టి ఔషధంతో ఇది క్షీణిస్తే సుఖదుఃఖ వికారాలు కూడా క్షీణిస్తాయి. తమవంటి మహాత్ములు చిత్తమును జయించుటచే సర్వము జయించివేశారు. అట్టి ఈ మనస్సును నశింపచేయ నిశ్చయించుకొన్నాను. ఇక నాకీ రాజ్యాదులతో పనేమున్నది చెప్పండి?

❖❖❖

13. ఆశ - తృష్ణ

ఎప్పటినుండో తెలియదుకాని, ఈ హృదయంలో "ఆశ" అనే అజ్ఞానాంధకారం వ్యాపించియున్నది. కామ, క్రోధ, లోభాది గుడ్లగూబలు ఆ చీకట్లో గూళ్ళు కట్టుకొని కాపురం చేస్తున్నాయి. నేను ఏమైనా సద్గుణాలను ఆశ్రయించాలని అనుకొంటూ ఉండగానే, ఇంతలో ఎక్కడినుండో తృష్ణ (Desire) వచ్చిపడుతోంది. ఎలుక ఇంట్లో ప్రవేశించి నూతన వస్త్రములను కొరికి పాడుచేయునట్లు, ఇది మా ఉత్తమ ప్రయత్నములను, సత్ప్రవర్తనలను పాడుచేస్తోంది. ఇక మేము వివేకము పొందేది ఎన్నటికి? ఆత్మ దర్శనం చేసేదెప్పటికి? వలలో చిక్కుకొని ఆక్రోశించే పిట్టలాగా మేము ఆశాపాశక్లేశ దుర్వాసనలలో పీకల దాకా చిక్కుకొన్నాం. అనేక తృష్ణలచే దగ్ధులమగుచున్న మేము అమృతంలో స్నానంచేస్తే మాత్రం సేద తీరుతుందా? ఊరట కలుగుతుందా? అనుమానమే.

బురదలోని తడిని సూర్యకిరణాలు పీల్చివేయునట్లు, మా అంతఃకరణములోని కొద్దిపాటి దయాదాక్షిణ్యములను తృష్ణవచ్చి పీల్చివేస్తుంటే మేము నిస్సహాయులమై చూస్తున్నాం. చూస్తూ ఉండగానే అది వచ్చి మా కళ్ళు కప్పివేస్తోంది. కన్నులు ఉండికూడా గ్రుడ్డివారము అవుచున్నాము. మామూలుగా అతిశాంతచిత్తుడైనవాడు కూడా, తృష్ణచేత కలవరపెట్టబడుచున్నాడు. ఎక్కడన్నా ధన, కనక, నారీజనమును చూస్తేచాలు, ఈ తృష్ణ ఎక్కడినుండో బొట్టుపెట్టి పిలిచినట్లు వచ్చిపడుతోంది.

ఆశ చేత నిండియున్న మనస్సు "నేను ఆశ్రయించబోయే వారు నాకు అనుకూలురా? కాదా? ఆయా వస్తుజాలం వాస్తవానికి శ్రేయోదాయకమా, ప్రమాదకరమా?" అని కూడా పరిశీలించుటలేదు. దీనంగా వారిని, వీరిని తుచ్ఛ పదార్థముల కొరకు అర్థిస్తోంది. "తాను తలచినది సాధ్యమా? అసాధ్యమా?" అనికూడా పరీక్షించుకోకుండా ఆతురపడుతోంది. కాని, ఏం లాభం? వయస్సుచెల్లిన స్త్రీ కామాతురత వలె ఏమీ పొందకయే పోవుచున్నది. దున్నపోతు ముక్కుకు త్రాడుకట్టి లాగబడునట్లు అది మమ్ములను దిక్కులన్నీ త్రిప్పుతోంది. పుత్ర, మిత్ర కళత్రాదులు అనే వలలను మాపై విసిరి మహామభ్యపెడుతోంది. అంతఃపురంలో సుఖశయ్యపై శయనించిన వానిని కూడా క్షోభింపజేసి, అడవిపాలు చేస్తోంది. ఉన్న కాస్త వివేకాన్ని ఊరేగిస్తోంది. లేని జాడ్యాలన్నీ తెచ్చిపెడుతోంది. ఆహా? నిర్దయుడగు ఆ భగవంతుడు ప్రపంచములోని జీవులందరిని 'తృష్ణ' అనే త్రాటితో 'సంసారము' అనే స్తంభమునకు కట్టి పారేస్తున్నాడు. అచేతనుణ్ణి కీటకములు బాధిస్తున్నట్లు మేము ఆశచే బాధింపబడుచున్నాం.

అపి మేరుసమం ప్రాజ్ఞమపి శూరమపి స్థిరమ్
తృణీకరోతి తృష్ణైకా నిమేషేణ నరోత్తమమ్ ॥ (XVII-50)

మేరువుతో సమానమైన ధీరుడైనా, మహాప్రాజ్ఞుడైనా, నరోత్తముడైనా – తృష్ణచేత క్షణంలో జయింపబడుచున్నాడు.

❖

ఓ మహాశయా! విశ్వామిత్రా! ముసలినర్తకి ఏమాత్రం ఆనందకరం కాకపోయినా తన నృత్యం మానలేకపోయినట్లు, ఈ 'ఆశ' అనేది పొందే తృప్తి అంటూ ఏదీ లేకపోయినా, ఈ సంసారారణ్యంలో తన చపల సంచలనం మాత్రం మానలేకపోతోంది. సంసారములోని దోషములన్నిటిలో ఇది అతితుచ్ఛమైనది. ఇది ఉన్నంతవరకు మాకు మోహపూరితమైన పాట్లు తప్పవు.

ఈ లోకంలో జీవునకు దుఃఖమంతా నశించాలంటే ఒక్కటే ఉపాయం ఉన్నది. అది "విషయచింతన లేకపోవటమే". ఆశయొక్క రూపాంతరమే విషయచింతన అయివున్నది. కనుక ఆశను త్యజిస్తే జీవుడు ఒడ్డుకు చేరినట్లే. అయ్యో! ఆశ, స్త్రీ, రోగబాధ – ఈ మూడు ఎంతటి గంభీరపురుషుడినైనా తమ వైపు అభిముఖం చేసుకొంటున్నాయి కదా! ఈ తృష్ణ అంత నీచంగా, ఘోరంగా పదునైన కత్తివ్రేటుగాని, వజ్రాయుధ ఘాతంగాని అగ్నిహోత్రంగాని బాధింపజాలదనే నా అభిప్రాయం. ఎందుకంటారా? ఇది హృదయంలోనే ఉండి జీవుణ్ణి దహించివేస్తోంది కదా! ఇక

తప్పించుకోవటానికి అవకాశమెక్కడిది చెప్పండి? దాని వేగం ఎంతటిదంటే, ... ఆధివ్యాధులు"* గాని, శరీరశిథిలత్వంగాని దాని ప్రబలత్వాన్ని శమింపచేయలేక పోతున్నాయి. చేప ఎఱకోసం తాపత్రయ పడునట్లు, అది ఎదురుగా కనిపించినదంతా 'తనదే' అని అనుకొంటుంది. వృద్ధ మాంత్రికురాలివలె ఎంతో క్రూరమైనది కూడా.

అయినాసరే, కొందరు మహామహులు దానిని "వివేకము" అనే కత్తితో నరికి వేస్తున్నారు. అవిద్యాపూర్వకమైన కామ్యకర్మల నుండి బైటపడి పరమశాంతిని పొందగలుగుచున్నారు. ఈ ప్రపంచమంతా ఎందులో అయితే నిబిడీకృతమై ప్రవర్తిస్తోందో, – అట్టి ఆశను నేను విజ్ఞాన వివేకాదులచే జయించి వేయ నిశ్చయించుకొన్నాను. ఈ ధన, జన, సామ్రాజ్యాదులు ఆశను అధికమే చేస్తాయి కదా! అందుచేత ఇవి నాకు అక్కర్లేదు. సర్వ వాంఛలు నశిస్తే మనస్సుకు ఉత్తమ చికిత్స ప్రాప్తించినట్లే కదా!

❖❖❖

14. దేహము

ఈ దేహము ఉన్నది చూచారా? ఇది రక్తమాంసాదులతోనూ, తడిసిన ప్రేగులతోను, నాడులతోను, మలమూత్రాదులతోను నిండి ఉన్నది. ఒక గొప్ప కళాకారుడు తయారుచేసిన విచిత్రమైన బొమ్మవలె ఒప్పుచున్నది. క్షణభంగురమైన ఈ దేహములు జీవునకు అనేక వికారములతో కూడినవై దుఃఖము కొరకే ఏర్పడుచున్నాయి. జీవుడు వీటిని ఎందునిమిత్తం గ్రహిస్తున్నాడు? ఆనందం పొందటానికే కదా! అట్టి ఆనందం సంసార సముద్రాన్ని దాటివేసినప్పుడే లభిస్తుంది.

కానీ ఏం లాభం? ఈ జీవుడు పదేపదే ఇంద్రియములచే మోసగింపబడు చున్నాడు. "నేను ఒకానొకప్పుడు ఈ దేహం గ్రహించాను. మరొక సమయములో త్యజించబోవుచున్నాను" అనునట్టి విజ్ఞతను (లేక ఎరుకను) సమూలంగా మరచి వర్తమాన దృశ్యముతో సంసర్గము కలిగి ఉంటున్నాడు. అనేక ఉపాధులందు ప్రవేశించి ఎప్పటికప్పుడు "ఈ శరీరమే నేను" అని భావనచేసి, ఆ ఉపాధియొక్క హానివృద్ధులను తనకు ఆపాదించుకొంటున్నాడు.

ఈ శరీరము వాస్తవానికి జడమే అయివుండికూడా, 'ఆత్మ' సమీపమున ఉండుటచేత 'చేతనము'వలె ప్రవర్తనము కలిగి ఉంటోంది. అయితే దీనికి "పుట్టుక, అభివృద్ధి, పరిణామము, క్షయము, వినాశనము" అనే వికారాలు ఎల్లప్పుడు ఉండనే ఉన్నాయి కదా! అనేక రోగములు, తాపములు అనుక్షణం దీనిని వేధిస్తూ ఉన్నాయి. అనేక బాధలకు వికారములకు, ప్రమాదములకు ఆలవాలమైయున్న ఈ శరీరము కలిగియుండుట సుఖకరమని ఎవరంటారో చెప్పండి? అయినప్పటికీ ఈ జీవుడు, "ఇది నాకు సర్వదా ఉంటేనే బాగుంటుంది. అట్లే ఉండుగాక! ఇది తొలగితే, ఇంకేమైనా

---

* ఆధి = మానసిక రుగ్మత వ్యాధి = శారీరక రుగ్మత

ఉన్నదా? ఎంతటి హాని! ఎంతటి విపత్తు! దీనితో నాకు ఏర్పడుచున్న మాత, పిత, భర్త, భార్య, సోదర, పుత్ర, మిత్రాది సంబంధములు ఎంతటి ప్రియమైనవి! ఇవన్నీ సత్యములే కదా" – ఇటువంటి రూపములు గల అనేక అసత్యపు అభిప్రాయ పరంపరలు కలిగి ఉంటున్నాడు.

హే మహర్షీ! ఇది కొంచెమునకే సంతోషిస్తున్నది. కొంచెమునకే దుఃఖిస్తుంది. ప్రపంచంలో ఇంతటి గుణహీనమైనది ఇంకేమన్నా ఉన్నదా? ఇందులో ప్రవేశించిన జీవుడు ఈ దేహము యొక్క వాస్తవత్వ – అవాస్తవత్వములు గ్రహించలేక 'ఇంద్రియ విషయములు' అనే తృణములను నెమరవేస్తూ దివారాత్రములు గడుపుచున్నాడు. అంతేకాని, 'పరమ పురుషార్థము' అంటూ ఏదీ పొందలేకయే ఉన్నాడు. ఇది అతనికి స్వగృహమువలెనే అనేక పదార్థముల కలయికచే ప్రాప్తించుచున్నది. "ఒకనాటికి దీని శిథిలత్వము అనివార్యము" అనే విషయం అందరికీ తెలిసిందే. వేఋవేఋ చోట్ల నుండి అరువు తెచ్చుకొని ఒకచోట ఒక వరుసక్రమంలో అమర్చబడిన వేఋవేఋ పదార్థముల అమరికవలె ఈ శరీరము నాకు కనబడుచున్నది.

దేహ వృక్షములు - బాటసారులు : చంకలు, భుజాలు వంటి అనేక పదార్థములతో కూడుకొని, వృక్షముతో పోల్చతగిన ఈ శరీరమునందు, బహుదూరపు బాటసారులగు ఈ జీవులు ఎక్కడినుండో వచ్చి కొంతసేపు విశ్రమించి, మరల ఎటకో బయల్వెడలుచున్నారు. ఈ శరీరము కలిగియున్న కొద్దిసేపట్లోనే, "ఇది నా శరీరం. దీని పేరు ఇది. ఈమె నా భార్య. వీరు నా పిల్లలు. ఇది నా గృహం. ఇవి నాకు ఉన్న పేరు–ప్రతిష్ఠలు" – అను రూపముగల అనేక సంబంధములను కల్పన చేసుకొని అనుభవిస్తున్నాడు. ఇట్టి తుచ్ఛ శరీరము పొందినట్టి ఇతడు "ఇది నాది, ఇది నాది కాదు" అంటూ మీమాంస ఎందుకు చేస్తున్నాడో నాకు అర్థమగుటలేదు. ఇట్టి ఈ నా యొక్క – తదితరుల శరీరములపై ఒకడికి ప్రేమ ఎందుకు? మరొకడికి ద్వేషమెందుకు? ఈ నా దేహము దుఃఖములందు, దారిద్ర్యములందు పొరలుగాక! లేదా, సుఖములందు, సమృద్ధములందు తేలియాడు గాక! దీనితో నాకేమి సంబంధం? ఇది 'ఆయుర్దాయం' అనే నదియొక్క జలం వంటిది. జన్మ – మృత్యువులే దీని ఈవలి – ఆవలి ఒడ్డులు.

❖

విజ్ఞులైన పెద్దలు "నాయనలారా! ఈ 'శరీరము' అనేది 'సంసారము' అనే సముద్రమును దాటుటకు తెప్పవంటిది. తగినంత జాగరూకులై దీనిని సరియైన ప్రయోజనమునకై వినియోగించండి" అని జనులందరినీ హెచ్చరిస్తున్నారు. విన్నవారు వింటున్నారు. విననివారు ఈ మాటలను అవహేళన చేస్తున్నారు. కొందరు తగినంత జాగ్రత్త వహించి విజ్ఞానమును పొంది ఆవలి ఒడ్డుకు చేరుచున్నారు. ఇక మరికొందరో, మధ్యలోనే మునిగిపోతున్నారు. శరీర తాదాత్మ్యము పొందినవారై "నాది–నేను" అను రూపముగల అనేక భ్రమలకు లోనగుచున్నారు. ఫలితం? అంతులేని దుఃఖములు, వేదనలు. రక్త మాంసములచే నిర్మించబడి, ఒకానొక బాహ్య వస్తువులాగానే దర్శన మిస్తున్న ఈ శరీరముపై 'నాది' అనే అభిమానం అసలు ఎందుకు కలుగుతోంది చెప్పండి?

దేహగృహం : 'దేహము' అనే గృహ ప్రాంగణములోగల పశువుల కొట్టాంలో 'ఇంద్రియములు' అనే పశువులు కట్టివేయబడ్డాయి. 'ఆశ' అనేది ఈ గృహము యొక్క గడుసరి ఇల్లాలు. 'చిత్తము' అనువాడే ఇక్కడి సరంజామా అంతా ప్రోగుచేసే సేవకుడు. విచారించి చూస్తే, సారమైన వస్తువంటూ ఇందులో ఏదీ లేదు. అందుచేత ఇదంతా దుఃఖకరమేకాని, వాస్తవసుఖమైనదేదీ ఇందులో నాకు కనిపించుటలేదు. ఈ శరీరగృహం 'నోరు' వాకిలిగా, 'నాలుక' గడియగా, 'వెన్నెముక' స్తంభముగా కలిగియున్నది. స్వల్ప కాలంలో నేల కూలబోయే ఈ శరీరగృహం పైకి మాత్రమే అందంగా కనిపిస్తోంది.

అయినా ఎంత రాజ్యముంటే ఏం లాభం? ఎట్టి సుందర దేహముంటే ఏమున్నది? అతికొద్ది కాలంలో ఇది కాలునిచే కబళించబడుతోంది కదా! ఈ దుష్టరోగములు సత్కర్మశీలుణ్ణి మాత్రం వదలుచున్నాయా? లేదు.

లోన రక్త మాంసములతో నిండియుండి, బైటకు 'చర్మము' అనే సున్నంతో పూయబడి, ఈ దేహము ఒక యంత్రమువలె చలించుచున్నది. 'మనస్సు' అనే భూతం దీనిలో ఉండి దీనికి నిలకడ లేకుండా చేస్తోంది.

నశించుటయే ధర్మముగా గల ఇట్టి స్త్రీ-పురుషుల శరీరములందు జనులకు కనబడే రమ్యత్వమేమిటో నాకు అర్థమగుటలేదు. దీనికి ఏమైనా తారతమ్య జ్ఞానం ఉన్నదంటారా? ఖరీదైన వంటకాలతో సుఖింపచేసినా, లేక దారిద్ర్యాదులచే బాధింప చేసినా కాలక్రమంగా ముసలితనం పొందకుండా ఉండదుకదా! "ఇదిగో, ఇక్కడ మేము సుఖంగా ఉన్నాము" అని అనుకొంటూ ఉండగానే కాలం అన్నిటినీ క్షణంలో మార్చి వేస్తోంది.

కింశ్రియా? కిం చ రాజ్యేన? కిం కాయేన? కిమీహి తైః ?
దినైఃకతిపయైరేవ కాలః సర్వం వికృంతతి ! (XVIII-37)

ఈ శరీరము, ధనము, రాజ్యము, మనోరథములు, వాటికి సంబంధించిన చేష్టలు - వీటన్నిటివలన ప్రయోజనమేమున్నది చెప్పండి? కొద్ది రోజులలో కాలము అన్నిటినీ త్రుంచి వేయబోతోంది కదా!

❖

ఎంతోకాలం అత్యంత ప్రియముగా జీవునిచే పెంచి పోషించబడిన ఈ శరీరము ఒకానొక రోజు 'మరణము' అనే తన ఇష్టసఖుడు ఎదుటికి రాగానే, ఆ జీవుడిని అవిశ్వాస పూర్వకంగా త్యజించి (మరణ సఖునితో) ఎటకో లేచిపోతోంది. మెఱుపులను, శరత్కాల మేఘములను, ఊహాకల్పిత భవనములను, మాయాకల్పిత వస్తువులను "ఇవి వాస్తవం, శాశ్వతం" అని నమ్మియుండే మూర్ఖులు ఎవరైనా ఉంటారా? ఈ శరీరం విషయం కూడా ఖచ్చితంగా అంతే.

హే మహాత్మా! ఒకానొక పిల్లి ఏ రాత్రివేళో ఒక 'చినిగి డొల్లపడి, ధ్వనింపని డోలు' నందు చిక్కుకొంటే ఎట్లా అగచాట్లు పడుతుందో మా ఈ అవస్థలు కూడా అట్లాగే ఉన్నాయి. మాంసము,

నరములు, బొమికలతో నిర్మించబడిన ఈ 'శరీరము' అనే గూటిలో చిక్కుకొన్న మా వంటి అజ్ఞానుల అగచాట్లు ఏమని చెప్పమంటారు? మాకు ప్రాప్తించిన "ఈ శరీరమే నేను" అనే ఈ జాడ్యం తొలగేది ఎట్లా?

ఈ శరీర వృక్షము యొక్క ఆశల కొమ్మలపై 'చిత్తము' అనే కోతి గంతులు వేస్తోంది. ఈ వృక్షమును చిరకాలంగా ఆలోచనలు, దుఃఖాలు పురుగులవలె తొలుస్తున్నాయి. 'తృష్ణ' అనే కొండచిలువ చుట్టలు చుట్టుకొని వ్రేలాడుతోంది. దీనిలో కొన్ని పక్షులు, పిట్టలు గూడులు కట్టుకొని నివసిస్తున్నాయి. అవే ఈ కోపాలు, తాపాలు, నవ్వులు, ఏడ్పులు, పుణ్యాలు, పాపాలు, ఇంద్రియాలు, శబ్ద స్పర్శ రూపరస గంధాలు మొదలైనవి. కాముకులైన బాటసారులు (జీవులు) యౌవనము పైగల అపేక్షచే ఇందు విశ్రమించటానికి వస్తున్నారు. ఇది 'అహంకారము' అనే గట్టుపై 'వాసనలు' (tendencies) అనే వ్రేళ్ళతో ఆయాసమే సంచలనముగా కలిగి ఉన్నది.

❖

కాలయాపన : ఈ 'శరీరగృహం'లో అహంకార గృహస్థుడు 'తృష్ణ' అనే ఇల్లాలుతో కాపురం చేస్తూ రోజులు గడుపుచున్నాడు. ఇంద్రియ పశువులను మేపుకొంటూంటే కాలమంతా ఎటుపోతోందో ఆతనికి తెలియుట లేదు. ఇక, రక్తమాంస బొమికలచే నిర్మించబడిన ఈ శరీరం 'ముసలితనము' అనే శైథిల్యమునకు ఎదురుచూస్తున్నట్లు లేదంటారా? 'చిత్తము' అనే భృత్యుడు పాపం, ఇది పడిపోకుండా చూస్తున్నాడు. ఈ దేహగృహంలో "అబద్ధము – అజ్ఞానము" అనే పేరుగల రెండు నిలువెత్తు స్తంభాలు ఉన్నాయి. లోపల ఎక్కడి నుండో 'దుఃఖము' అనే బాలుడు ఎలుగెత్తి రోదిస్తున్నాడు. 'సుఖము' అనే మరొక బాలుడు ఆదమరచి నిదురపోతున్నాడు. 'దురాశ' అనే పాలిపోయిన క్రూరమైన ఎత్తుపళ్ళుగల దాసి పళ్ళు ఇకిలిస్తూ ఈ గృహంలో అటు ఇటు సంచరిస్తోంది. ఈ ఇంటిలో "ప్రాపరచిక విషయములు" అనే అనేక కుండలు ఆ మూల కొన్నీ, ఈ మూల కొన్నీ ఉన్నాయి. ఆ కుండలలో "అజ్ఞానం" అనే ఉప్పునీరు తప్ప మరింకేమీ లేదు.

ఇందలి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, బుద్ధి అట్టి ఉప్పునీటితో నిండి ఉన్నాయి. వెదుఱు బొంగులలో గాలి ప్రవేశించి ఈల శబ్దం చేస్తున్నట్లు, పంచప్రాణాలు ఈ దేహమంతా సంచరిస్తున్నాయి.

క్షణంలో దుఃఖం. క్షణంలో ఆనందం. ఈ దేహం నాకు అనేక రుగ్మతలతో కూడుకొన్నదై అతి చంచలంగా కనిపిస్తోంది. ఆకు నుండి క్రిందకు వ్రేలాడే నీటిబొట్టువలె క్షణభంగురమైన ఈ దేహం ఏ క్షణంలో నన్ను వీడనున్నదో తెలియదు కదా! అందుచేత, ఇది నన్ను వీడకముందే, నేనే దీనిని లేనిదానిగా తిరస్కరించివేస్తున్నాను.

వహనైకార్థ యోగ్యాని కాయకాష్ఠాని భూరిశః
సంసారాబ్ధావిహోహ్యన్తే , కంచిత్తేషు నరం విదుః ॥ (XVII-47)

మహాత్మా! ఈ సంసార సముద్రమును చూచారా! కేవలం దహనం కొరకు మాత్రమే పనికివచ్చే అనేక శరీరాలు ఇందులో కొట్టుకుపోతున్నాయి. అట్లు కొట్టుకుపోయే వాటిలో కొన్ని కట్టెలను

చూచి "వీరు నరులు" అని అంటున్నాం. నా శరీరం కూడా, ఒకానొక కట్టె. ఈ కనబడే జగద్దృశ్యము లందు "ఇవి సత్యము" అని చిరకాలంగా విశ్వాసం కలిగి ఉన్నవారిని చూస్తే నాకు జాలివేస్తోంది. 'అజ్ఞానము' అనే కల్లు త్రాగి ఉన్మత్తులై గంతులు వేయుచున్న అట్టివారికి ధిక్కారమగు గాక!

అయ్యో! ఒక ప్రక్క "విషయములు" అనే బురదనీటి మడుగులో అనేక శరీరాలు క్రుళ్ళిపోవటం ఈ జనులు చూస్తూనే ఉన్నారు. కాని వీరు తమ శరీరమేమిటో, (దీని స్వరూప స్వభావములేమిటో) గ్రహించలేక పోతున్నారు. గాలియొక్క రాకపోకలు తెలుస్తున్నాయి. మనస్సుయొక్క ప్రసరణం కూడా కొంత గుర్తించవచ్చునేమో. కాని, ఈ శరీరాలన్నీ ఎక్కడినుండి వస్తున్నాయి? ఎక్కడికి పోతున్నాయి? అనేక పదార్థములతో కూడిన దీనిని ఎవరు ఎందుకు నియమిస్తున్నారు?

ఏదో 'అజ్ఞాతశక్తి' మాకు అర్థంకానిదై అన్ని వైపుల ఆవహించి ఉన్నదని నాకు అనిపిస్తోంది. అది మాకు "మానావమానములు, ప్రియాప్రియములు" మొదలైన రూపములుగల భ్రాంతిని చూపి మమ్ములను ఆకట్టుకొంటోంది. మా మనస్సులను హరించి మరల మరల మృత్యుముఖం వైపుకు దారులు చూపుతోంది.

ఓ దేవా! విశ్వామిత్రా! ఎవరైతే తమయొక్క అతి సూక్ష్మబుద్ధితో, "ఈ జడమగు దేహము నేను కాదు, నాకు ఈ దేహముతోగాని, ఈ దేహమునకు నాతోగాని సంబంధమే లేదు" అని గ్రహించి ఆత్మయందు విశ్రాంతి పొందుతారో, వారే మనుజులలో ఉత్తములు. ఆ విధంగా అతికొద్దిమంది మాత్రమే అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నారు. వారి జీవితములే ధన్యములు. ఇక మిగతా జనుల అవగాహనలన్నీ అనేక భ్రమలతో, విక్షేపములతో నిండి ఉంటున్నాయి. వారంతా అధోగతి పాలే అవుతున్నారని నాకు అనిపిస్తోంది.

స్వామీ! ఈ శరీరమనే గోతిలో దాగుకొనియున్న 'అహంకారము' అనే పిశాచం చేత మేము మరల మరల మోసగించబడుతున్నాం.

❖❖❖

ఉన్నదేది? సత్యమేది?

నకించిదపి దృశ్యేఽస్మిన్సత్యం తేన హతాత్మనా
చిత్రం దగ్ధ శరీరేణ జనతా విప్రలభ్యతే ॥ (XVIII-57)

ఈ దృశ్య ప్రపంచంలో "ఇది సత్యము" అని మనం అనుకోగలిగేది ఎక్కడైనా, ఏదైనా ఉన్నదా? ఈ కనబడే మొత్తము దృశ్యమునందు అంతర్గతమై ఒకానొక వస్తువువలె ఉన్న ఈ నా శరీరం కూడా అసత్యమే అయివున్నది కదా! అసద్రూపములై, దగ్ధ ప్రాయములైన ఈ శరీరాదులచే మేము ఎందుచేత మోసగింపబడుచున్నాం? ఎంత ఆశ్చర్యం! మెఱుపువలె అస్థిరంగా ఉండే ఈ శరీరంపై "ఇది మాకు కలదు. ఇది ఇట్లే ఉండబోవుచున్నది" అని విశ్వాసం కలిగి ఉండేవారికి ఎవరు మాత్రం ఏలా చెప్పగలరు?

అందుచేత మహర్షీ! ప్రబల దోషములచే దిక్కుమాలిన దానివలె ప్రవర్తిస్తున్న ఈ శరీరమును నేను తృణప్రాయంగాను, ఇప్పటికే నశించినదాని వలేనూ చూస్తూ సుఖమును పొందుచున్నాను.

❖❖❖

15. బాల్య స్వరూపం

జీవుడు ఈ దేహంలో ప్రవేశించి అనుభవమును పొందుచున్న బాల్యయౌవనవార్ధక్య దశలలో మొదటిదైన బాల్యదశ సుఖకరమైనదని కొందరు జనులు అనుకొంటూ ఉంటారు. "చిన్నతనంలో మేము ఆనందంగా ఉండేవాళ్ళం" అని చెప్పుకొంటూ ఉంటారు. అయితే వారంతా వర్తమాన ఆధివ్యాధుల దృష్ట్యా అలా అంటున్నారేకాని, అది వాస్తవం కాదని నాకు అనిపిస్తోంది.

చంచలము, సంకులము అయినట్టి ఈ సంసార సముద్రంలో జన్మించినప్పటి నుండీ అన్నీ కష్టాలే. బాల్యంలో శక్తి ఉండదు. అనేక వ్యాధులు, శారీరక దౌర్బల్యాలు బాధిస్తూ ఉంటాయి. "ఇది మంచి – ఇది చెడు" అనే విచక్షణ ఉండదు.

–ఇది కావాలి – అది కావాలి – అని ఎల్లప్పుడు కాంక్షించే స్వభావం.

–తనది కాకున్నా "నాకే ఉండాలి" – అనే లోభత్వం.

–అనుక్షణం మారిపోతూ ఉండే ఇష్టాయిష్టముల చపలత్వం.

–దీనత్వం, మూఢత్వం, తెలివితక్కువతనం.

–కల్పిత ఆటల మీద ధ్యాస.

–బుద్ధి నిలకడ లేకపోవటం.

–రోషం, రోదనం, చేతకాకపోవటం.

ఇవి బాల్యంలో చెప్పుకోదగ్గ విశేషాలు. ఏవేవో తినాలని, త్రాగాలని, పొందాలని కోరుకొంటాడు. కాని, లోపల ఉన్న భావాలేమిటో చెప్పుకోలేడు.

ఈ 'మనస్సు' అనేది స్వయముగానే పరమ చపలమైనది. బాల్యావస్థలో ఇక దీని చపలత్వానికి అంతూ పొంతూ ఉండదు. బాల్యంలో ఉండే అనేక అసమర్థతల కారణంగా ఏవేవో మనః చింతలు బాధిస్తూ ఉంటాయి. చేసే పనులన్నీ అతి మూఢంగా, అవిచారణాపూర్వకంగా ఉంటాయి.

అగ్నిజ్వాలలు, సముద్రపు అలలు, మెఱుపులు, స్త్రీల నేత్రములు ఇవన్నీ 'బాల్యావస్థ' అనుదాని నుండే చపలత్వం నేర్చుకున్నట్లు నా కనిపిస్తుంది.

ఈ బాలుడు కుక్కవలె అతి స్వల్పమునకే సంతోషించి స్వాధీనుడౌతాడు. అత్యల్ప విషయానికే పట్టరానంతకోపం పొందుతాడు. "ఈ పదార్థము పరిశుద్ధమా? కాదా? ప్రమాదకరమా? కాదా?" అని పూర్వాపరాలు విచారించకుండానే పైకి బాగున్నంత మాత్రంచేత "అది నాకు ఇప్పించండి" అని గోలచేస్తాడు. గుణదోషములు విచారించే బుద్ధి లేకపోవుటచే ఆయా పదార్థములు ఆతనికి అనేక బాధలే తెచ్చిపెడుతున్నాయి. పోనీ, పెద్దలు ఇవ్వనన్నారా, ఏడుపు ఆపడు. ఒకటి పొందగానే,

బుద్ధి విక్షేపం చేత మరొకటి కావాలనుకొంటాడే కాని, ఏది పొందినప్పటికీ ఏమాత్రం తృప్తి పొందదు. ఇంతలోనే ఏడుపు. ఇంతలోనే నవ్వు. అతని వెకిలి అల్లరి ప్రవర్తన చూచి ప్రతివాళ్ళు బెదిరించేవారే. పెద్దలు విధించే శిక్షలను నిస్సహాయంగా, మౌనంగా అనుభవించ వలసినదే కదా! పెద్దలు, తల్లిదండ్రులు, గురువులు పై తరగతి బాలురు - ఈ విధంగా అతడు భయపడనిది ఎవరికి? ఎవరో చెప్పిన కథలో వర్ణింపబడిన బేతాళుని ఎదురుగా ఊహించుకొని భయపడతాడు. నిద్రలో ఏవేవో ఊహించుకొని కలవరిస్తూ ఉంటాడు. ఇష్టమైన వారు దూరంగా ఉంటే బెంగపడతాడు. చూచారా స్వామీ! ఈ విధంగా బాల్యం అనేక భయములతో, తప్పుడు పనులతో, మనోవ్యాధులతో ఉద్వేగములతో నిండి ఉంటోంది. ఇట్లు అజ్ఞాన విజృంభణకు ఆలవాలమై ఉండగా, జనులు ఏ ఉత్తమానందం ఈ బాల్యంలో చూడగలుగుచున్నారు? చమత్కారమే కదా! దోష ప్రదములైన అజ్ఞానములు విజృంభించటం ఆనందకరమేమిటి?

ఈ బాలుడు పనికిరానిపనులను కూడా మహా కుతూహలంగా ప్రారంభిస్తాడు. దుశ్చేష్టలపై వ్యామోహం, దుర్బుద్ధి కలిగి ఉంటాడు. నిప్పన్నా భయం. నీరన్నా భయం. అందరిచేత చీవాట్లు. మనఃశాంతి ఉండదు. గోతిలో చిక్కుకున్న గబ్బిలం లాగా అనేక అమంగళమైన యత్నాలు, మనోవ్యాధులు, సందేహాలు, చెడు పోకడలు కలిగి ఉంటాడు. ఇక స్వస్థత ఎక్కడిది? ఎక్కడ మనోచాంచల్యం, అజ్ఞానం కలిసి ఉంటాయో, ఏ చోట దోషాలు, వ్యాధులు, ఆధులు, చిత్తవికారాలు, అస్వాధీనత సమావేశమౌతాయో - అక్కడ శాంతి, ఆనందం ఉంటాయా? లేనేలేవు.

బాలుని మనస్సు ఏదో అర్థంకాని నూతనత్వం వైపు అఱ్ఱులు చాస్తూ ఉంటుంది. పెద్దలు "స్వసంకల్పమే ప్రతిబంధకము" అనే విషయం నిరూపించటానికి "యథాబాలః" అంటూ ఈ బాల్యమునే దృష్టాంతంగా తీసుకొంటారు. ఒక వృక్షము యొక్క అనుభవం లాగా ఇతరుల (ముద్దుల వంటి) మూర్ఖపు క్రియలు, వంచనోపాయాలు ఒక బాలుడిని బాధించినట్లు మరి ఇంకెవరినీ బాధించవేమో! అనేక మనోరథాలతో, ఇతరులు విధించే క్రమశిక్షణాది అనేక నియమములతో, లోకాన్ని మ్రింగివేయాలనే మూఢత్వంలో బాలుడు పొందే సుఖసంతోషాలేమున్నాయి చెప్పండి? వృక్షం తను పడుచున్న బాధలు పైకి ఎవరికీ చెప్పుకోలేదు చూచారా! అదేవిధంగా అతడు తన అంతరంగములోని బాధలు పైకి చెప్పుకోలేడు.

పక్షులైతే ఆకలివేస్తే ఎటైనా వెళ్ళి ఆహారం తెచ్చుకొంటాయి. ఈ బాలుడో, నెత్తీ-నోరూ బాదుకోవటమేగాని చేసేది ఏమి ఉండదు. ఇతరులు ఎవరైనా కనికరిస్తేనే గతి.

ఇట్టి బాల్యావస్థలో ఏదో సుఖముగాని, విశేషముగాని ఉన్నదనుకొని, ఈ జీవుడు మరల మరల జన్మలు పొందాలనుకొంటే, ఈ విషయం నాకు జాలినే కలిగిస్తోంది. అనేక రోగ, విక్షేపాలతో, వివేక-విచారములకు అవకాశమేలేక, శాంతిని ఏమాత్రం ప్రసాదించలేని బాల్యమును నేను తుచ్ఛమైనదిగాను, అరమ్యమైనదానిగాను గాంచుచున్నాను.

❖❖❖

16. యౌవన దశ

ఈ మనుజుడు చివరికి ఎట్లో బాలానర్థముల నుండి గట్టెక్కి అనేక భోగ వాంఛలతో కూడుకొన్నవాడై, యౌవన ప్రాంగణంలో ప్రవేశిస్తున్నాడు.

ఇప్పటికే అతని మనస్సులో అనేక దోషాలు, కుసంస్కారాలు గూడుకట్టుకొని ఉంటాయి. ఇప్పుడిక అహంకార – కామములనే పిశాచాలు నెమ్మదిగా కనులు తెరచి జూలు విప్పుతున్నాయి. ఏవేవో గుర్తింపులు, సుఖములు పొందాలని స్వప్నం కంటూ ఉంటాడు హృదయంలోనే ఉద్భవించిన అహంకార – కామములకు ఇక 'దాసో ఽహం' అనటం ప్రారంభించుచున్నాడు. అతి చంచలమైన మనశ్చింత లన్నిటికి స్వేచ్ఛ వచ్చేస్తోంది. బుద్ధి అనేక వికారములచే ఆక్రమించబడి కలుషితం అవుతోంది. ఈ మనస్సు, యౌవనములోని ఎండమావులవంటి పరిచయాలను, విలాసాలను, స్వోత్కర్షలను చూచి, "ఆహా! ఇవన్నీ ఎంత మధురమైనవి! ఎంతగా వాస్తవమైనవి!" అని అనుకొని, పరుగెత్తి చివరకు 'విషయములు' అనే మురికి గుంటలో కాలుజారి పడుతోంది. అందుకే "యౌవనము అనేక మహానరకములకు బీజము వంటిది" అని పెద్దలు అంటూ ఉంటారు. ఇందులో ప్రత్యక్షమయ్యే కామజ్వరాదులన్నీ జీవుని వినాశనము కొరకే ప్రవర్తిస్తున్నాయి. చిత్ర విచిత్రములైన వృత్తాంతములకు, వివశత్వాదులకు ఆలవాలమైన ఈ యౌవనము వలన (వివేకం విషయమై) నష్టపోయే వారే ఎక్కువ. కామపిశాచికి వశం కాకుండా, దుష్కార్యములను ఆచరించకుండా ఈ యౌవనావస్థను ఎవరైనా దాటివేయగలిగితే అట్టివారు నా దృష్టిలో వందనీయులే. వారే మహనీయులు.

ఈ యౌవనం భోగ సమయంలో మధురంగా ఉన్నట్లే కనబడుతుంది. కాని, కల్లు యొక్క విలాసమువలె ఇది అన్ని దోషములకు శిరోమణి వంటిది. దీనిలోని కథనమంతా అబద్ధమే అయినప్పటికీ, అప్పటికి మాత్రం నిజమేనని అనిపిస్తూ క్షణంలో జీవుణ్ణి మోసగించి వేస్తోంది. స్వప్నస్త్రీ సాంగత్యం లాగా, ఊహ యందు గాంచబడే రతనాల మేడ లాగా క్షణకాలపు అసత్యరమ్యత్వం ప్రదర్శిస్తోంది. వేశ్యాస్త్రీ సాంగత్యం లాగా ఈ యౌవనం మొట్టమొదట మెత్తమెత్తగా జీవునియందు ప్రవేశించి, క్రమంగా దుర్భావాలకు, రోగాలకు, దుఃఖాలకు, అరిష్టాలకు నాంది పలుకుతోంది.

హృదయములోని జ్ఞానమును యౌవనం కప్పివేస్తుంటే శివకేశవులంతటి వారే భయపడతారు. ఎందుకంటారా? ఇందులో జనించే మోహం మంచిపనులను మరపింపచేస్తుంది. వివేకమును రూపుమాపటంలో, కాంతా వియోగాది కణకణ మండే ఉష్ణత్వాలు సృష్టించడంలో, మంచి అలవాట్లను విరమింపచేయడంలో, భ్రాంతి జ్ఞానం ప్రసాదించటంలో ఈ యౌవనమునకు ఉన్నంత శక్తి మరిదేనికీ లేదు.

❖

అయ్యో! ఎంతటి నిర్మలమైన మనస్సు అయినప్పటికీ, ఈ దశలో కలుషితం అవుతోందే? హే మహర్షీ! తుపాను సమయంలో ఆకాశాన్ని చుంబించే కెరటాలు ఉన్నట్టి నదినైనా దాటవచ్చు. ఈ యౌవనంలోని తృష్ణా తరంగాలు దాటటం ఎంతమంది తరం? ఆహా! జీవుడు ఈ దశలో "ఆ స్త్రీ,

ఆ స్తనాలు, ఆ ముఖం, ఆ విలాసాలు, ఆ హావభావాలు" అని మననం చేసుకొంటూ, ఇంతలోనే ముసలివాడు అయిపోతున్నాడు. చంచలమైన ఆశలచే బాధించబడే యువకుడు సాధువుల దృష్టిలో తృణప్రాయుడు మాత్రమే.

కామక్రోధాది అనేక దోషములతో కూడిన గంటల హారాన్ని ధరించిన 'అభిమానము' అనే మదపుటేనుగు ఈ యౌవనారణ్యంలో సంచరిస్తోంది. ఇది జీవులు ఎంతో భయపడవలసిన విషయం కాదంటారా స్వామీ? 'దుఃఖములు' అనే కాల కూట విషసర్పాలు 'విషయవాసనలు' అనే గాలి పీలుస్తూ జీవుడిని కాటువేయటానికి అటూ ఇటూ సంచరిస్తున్నాయి. ఇది గమనించని ఆ యువకుడు మాత్రం "ఆహా! ఈ నా శరీరభాగాలు ఎంతగా మెరుస్తున్నాయి! ఈ నా నూనూగు మీసాలు చూస్తున్నారా?" అని చెప్పుకొంటూ భ్రమిస్తున్నాడు. కుత్సిత మనోవికారాలను, రాగాదులను, దుశ్చింతలను, ఆశ్రయించే యౌవన మనస్సుకు నిజమైన సుఖశాంతులు ఎక్కడ లభిస్తాయి? యౌవనపొరచే దట్టంగా కప్పబడిన కనులకు తనను అతివేగంగా సమీపిస్తున్న ఆధి-వ్యాధులు, సంకల్ప-వికల్పముల యొక్క పరిణామాలు, మూర్ఖచర్యల దుష్ఫలితాలు ఏమాత్రం కనిపించటం లేదు.

అంతా బాగానే ఉంది కాని, ఈ యౌవనదార్ఢ్యం ఎన్నాళ్ళు ఉంటుందంటారు? అయ్యో! ఎంతో ప్రయాసతో సంపాదించుకొన్న అనేక సద్గుణాలు ఈ త్రిగుణ రూపములైన యౌవన వాయు వీచికలచే పెకిలించివేయబడుచున్నాయే! అహంకారం, మోహం సుకుమారత్వాన్ని త్రుంచి వేస్తున్నాయి. వివేకము మరుగున పడిపోతోంది. కామాంధకారముచే గ్రుడ్డిది అయిన మనస్సు తాను ప్రసరించుచున్న స్థానాలు ఎట్టివో ఏ మాత్రం పరీక్షించుకోవటం లేదు.

❖

మహర్షీ ! ఈ యౌవనం శరీరమునకు వెన్నెలవలె కనిపించినప్పటికీ, చిత్తమును మాత్రం అధోగతిపాలు చేసి నీచత్వమును, మూర్ఖత్వమును తెచ్చిపెడుతోంది. అతి త్వరలో నశించబోయే ఈ యౌవనం చూపిస్తున్న పైపై మెరుగులు చూచి మోసపోవటానికి నేను సిద్ధంగా లేను.

ఒకానొకడు ఎంతో శ్రమించి, అనేక ప్రయాసలకు ఓర్చుకొని చివరికి ఒక 'చింతామణి'ని సంపాదించాడు. "ఆహా! చూచారా! నేను ఎంతటి గొప్పవాడినో! ఇప్పుడీ చింతామణి నాదేకదా!" అని తలచుచు మాన మద గర్వాలు పొందినవాడై ఇక ఇంటికి బయలుదేరాడు. కాని పాపం, నదిని దాటేయత్నంలో మధ్యలో మణిని చేయి జార్చుకొన్నాడు. చూస్తూ ఉండగానే ఆ మణి కాస్తా నీటి ఉరవడికి కొట్టుకుపోతోంది. అప్పుడు ఆతని మానసిక స్థితి ఎట్లా ఉంటుంది? ఈ యౌవనం విషయం కూడా అంతే. ఆశపడినన్నాళ్ళు పట్టదు. ఎప్పుడో ప్రవేశిస్తుంది. కామము మొదలైన వికారాలన్నీ తలెత్తుతాయి. రాగము మొదలైన అనేక దోషాలు వివేకమును కప్పివేస్తాయి. ఈ కథ ఇట్లా నడుస్తూ ఉండగా, ఇంతలో ఎక్కడినుంచో ముసలితనం వచ్చిపడుతోంది. చూచారా మహర్షీ! మరి ఈ విషయాలన్నీ ఈ బాల్యంలోనే ఎందుకు చక్కగా జనులు విచారించరాదు? యౌవనం

చూచి మురిసిపోవటం చావుకు సిద్ధంగా ఉన్న బాలుణ్ణి ముద్దుపెట్టుకోవటం వంటిదేనని నేను అనుకొంటున్నాను. ఎవడైతే, అవివేకంచే క్షణభంగురమైన యౌవనమును చూచి మోహితుడై "విషయానందమే జీవిత లక్ష్యము" అనే భావన కలిగి ఉంటాడో వాడు 'నరపశువు' అని చెప్పబడుచున్నాడు. ఆతడు అతిత్వరలో కాలముచేత మోసగించబడినవాడై, పశ్చాత్తాపపడబోతున్నాడు.

స్వామీ! మరల మరల చెప్పుచున్నాను. ఈ 'యౌవనము' అనే సంకటము నుండి క్షేమంగా బైటపడినవారే మెచ్చుకోతగినవారు. పెద్ద తిమింగలాలు ఉన్న నదినైనా దాటవచ్చు. రాగద్వేషాదులతో నిండియున్న ఈ యౌవనం దాటటం అంత తేలికైన విషయం కాదు. అది మహాప్రాజ్ఞులకు మాత్రమే సాధ్యం. శాంతి, దయ, దాక్షిణ్యము, వినయము మొదలైన ఉత్తమ గుణములు గల యౌవనముతో ప్రకాశించేవారు మనకు చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తారు. అత్యంత మధురఫలములు, సుందర పుష్పములతో కూడిన ద్రాక్షతీగెలు ఎక్కడోగాని తారసపడవు కదా! అందుచేత నేను ఈ యౌవనము యొక్క పటాటోపమును తూష్ణీకరించి మౌనం వహించాలని నిర్ణయించుకొన్నాను.

❖❖❖

17. స్త్రీ వ్యవహారం

ఈ లోకంలో 'కామము' అనునది చాలా గొప్ప విషయంగా తలచుచు, ఈ జనులు ఎందుకో వ్యామోహం చెందుచున్నారు. నరములు, ఎముకలు, రక్తము, మాంసము – ఇట్టి వాటితో కూడిన ఈ స్త్రీ – పురుష దేహములందు శోభను చేకూర్చేది ఏది ఉన్నది? జనులు ఎందుకు మోహం చెందుచున్నారు?

ఈ స్త్రీ శరీరమును పురుషులు (అట్లాగే పురుష శరీరమును స్త్రీలు) మననం చేస్తూ పాపం, ఇప్పటికి ఎన్ని జన్మలు బూడిదపాలు చేసుకొన్నారో కదా! ఓయీ! మానవుడా! ఈ 'వనిత' అను వస్తువు యొక్క కాళ్ళు, చేతులు, చర్మము, మాంసము, కన్నీరు మొదలైనవి విడివిడిగా ఎప్పుడైనా పరిశీలించావా? ఇందులో మహత్తరమైన విషయమేమున్నది? మరి నీవు వృథాగా ఎందుకు ముగ్ధుడవు అగుచున్నావు?

ఓ స్త్రీ, పురుషులారా! ఒకచోట కేశములు, ఒకచోట చర్మము, ఒకచోట బొమికలు, ఈ శరీరములన్నీ ఇంతేకదా! మరి మీరంతా ఇంతగా బాహ్య శరీరాకర్షణలచే ఎందుకు బద్ధులు అవుతున్నారో చెప్పండి? తద్వారా మీ "వివేకము" మరుగున పడుటలేదా? ఈ రోజు ఈ దేహాలన్నీ వివిధ వస్త్రములతోను, లేపనములతోను తైతక్కలాడే బొమ్మలవలె అగుపించవచ్చు. వారి మెడలు రంగు రంగుల ముత్యాల హారములచే జాలువారుతూ, అత్యంత సుందరంగా కనిపించవచ్చు. కాని, ఒక్క విషయం గుర్తిస్తున్నారా? ఈ వర్తమాన క్షణంలో ఎంతో ఆకర్షణతో కనిపించే అవయవాలన్నీ

రేపో మాపో శ్మశానంలో ఒక మూలకు చేరి కుక్కలచే, నక్కలచే భుజింపబడబోవుచున్నాయి. లేదా కొన్ని ఎండు కట్టెలతోపాటుగా బూడిద కాబోవుచున్నాయి.

అయినా మునీంద్రా! పంచభూత నిర్మితమైన ఈ స్త్రీ-పురుషుల అంగములకు, అడవిలో సంచరించే కంచరగాడిదల అంగములకు భేదమేమున్నది చెప్పండి? మరి ఈ మనుజుడు స్త్రీ శరీరము చూడగానే వికారములు ఎందుకు పొందుచున్నాడు? ఈ జనులు చీరకుచ్చెళ్ళు, కేశములు వంటి పైపై మెరుగులకు ఆకర్షితులై అనేక వికారములు పొందుచున్నారే! కల్లుకు కామమునకు భేదమేమీ కనిపించుటలేదు. ఈ రెండు కూడా మత్తు, ఉల్లాసం, చిత్తవికారం కలిగించి జీవుణ్ణి వివశుణ్ణి చేస్తున్నాయి.

ఈ జీవుడు "దేహము" అనే కట్టుకొయ్యకు "మదము" అనే త్రాడుచే బంధింపబడి ఒక పశువువలె అనేక దుఃఖపరంపరలు అనుభవిస్తున్నాడు. ఎన్ని జన్మలు గడచిపోతున్నా, ఆతని యందు వివేకము మాత్రం ఉదయించుటలేదు. "ఆ కాటుక కన్నులు, జాలువారు కురులు, ఎత్తైన స్తనములు, నాజూకైన ముక్కు" .... అని అగ్ని జ్వాలలకు గడ్డిపరకవలె ఆహుతి అగుచున్నాడు. ఆ సరసములు, ఆ దూరం నుండి కనబడే బాహ్య సౌందర్యాలు – అవన్నీ ప్రజ్వరిల్లుచున్న 'నరకము' అనే అగ్నికి కట్టెపుల్లలవంటివే కదా! ఇక శృంగార కవులు "కారుచీకటి వంటి కనుబొమలు, నక్షత్రరాశులవంటి మిలమిల మెఱిసే కళ్ళు, చంద్రబింబము వంటి మోము, విరిసిన పువ్వులవంటి చిరునవ్వులు" మొదలైన అత్యంత మధుర భాషాయుక్తములైన ఉపమానాలన్నీ ప్రయోగించి భ్రమను ఇంతింతలు అధికం చేస్తున్నారు. ఇంకేమున్నది? ఈ జనులు క్షణంలో విలాసములలోకి పీకల వరకు దిగుచున్నారు. క్షణంలో ధర్మ వైరాగ్యాది కార్యక్రమముల నుండి వెనుకకు మరలుచున్నారు. ఫలితం? విలువైన మానవజన్మ వృథా అగుటయేకదా! కామిత స్త్రీలు విషతీగలవలె, తమను సమీపించు పురుషులను తమ కామోన్మాదం చేత వివశులను చేస్తున్నారు. ఎలుగుబంటి పుట్టలోని పామును తన ఉచ్ఛ్వాస-నిశ్వాసములచే ఆకర్షించి, బైటకు వచ్చిన ఆ పామును భక్షిస్తుంది చూచారా? అదే విధంగా, కామిని స్త్రీలు, "నీవే నాకు దిక్కు" వంటి అవాస్తవమైన మోసపు మాటలచేత, మాయలచేత, కృత్రిమ మర్యాదలచేత తళుకు బెళుకులచేత విటులను ఆకర్షించుచున్నారు. వారి మాన మర్యాదలను, శక్తి యుక్తులను హరించివేస్తున్నారు. సర్వస్వము పీల్చేసి బికారిని చేస్తున్నారు. కిరాతకుని వలలో చిక్కుకున్న పక్షిలాగా ఈ జీవులు అట్టి ఆకర్షణలో చిక్కుకొని బైటపడలేక విలవిలలాడుచున్నారు.

'సంసారము' అనే నీటిగుంటలో గల 'చిత్తము' అనే బురదలో సంచరించుచున్న ఈ జీవులు 'కామము' అనే 'ఎఱ'చే ఆకర్షించబడి, అనేక ఉపాధులను బలి చేసుకొంటున్నారు. గుఱ్ఱమునకు ముకుతాడు, ఏనుగుకు స్తంభము, పాముకు మంత్రము బంధములు అగుచున్నట్లు, ... ఈ కామమే జీవులకు పెద్ద గుదిబండగా పరిణమిస్తోంది. అనేక శోకమోహములచే రచించబడిన ఈ ప్రపంచమంతా 'కామము' అనే దానిచే ఆశ్రయించబడి, తత్ఫలితంగా స్థూలత్వం పొందుతోందని నాకు అనిపిస్తోంది.

❖

అందుచేత, ఓ మునీశ్వరా! స్త్రీ సాంగత్యమే సర్వ దోషములకు, సర్వ బంధములకు మూలకారణం. అద్దాని మాయలో పడకుండా తగు జాగ్రత్త వహించాలని నిర్ణయించు కొన్నాను. స్తనములు, కళ్ళు మొదలైనవన్నీ రక్తమాంసమయములే అయివుండగా, వాటిని చూచి నేనెందుకు వివశుణ్ణి కావాలి? ఒకప్పుడు స్థూల బుద్ధులగు పురుషునిచే అతిప్రియముగా, ఆప్యాయముగా లాలించబడిన సుందర స్త్రీలు ఇప్పుడు శ్మశానంలో దీర్ఘ నిద్రపోతున్నారు. వారి మాంస ఖండములను కాకులు, గ్రద్దలు భక్షిస్తున్నాయి. ఇప్పుడు ఇక్కడ నేను చూచే స్త్రీ–పురుష దేహముల గతికూడా అంతేకదా! వీరి కేశములు, తిలకము, అస్థులు కొద్ది కాలానికి కటిక నేలను అలంకరించబోతున్నాయి. ఇదంతా ఈ విధంగా విచారించిన తరువాత, ఇక నేను భ్రాంతిని పొందటానికి సిద్ధంగా లేను. బుద్ధిహీనులు మాత్రమే పంచభూతముల సన్నివేశమగు ఈ స్త్రీ–పురుష శరీరముల పట్ల ఆవేశపూరితమైన అనురాగం కలిగి ఉంటారు. అట్టి అనురాగం పెంచుకొన్నందుకు గాను, చివరికి, ఈ చిత్తము దీనత్వమునే పొందుతోంది. క్షణికావేశమయినట్టి కామముచే పరవశించు మనస్సు ఉత్తమ లక్ష్యముల నుండి చ్యుతి నొంది, చివరకు అనేక దుఃఖమోహములలో కూలిపోతోంది.

స్వామీ! వనిత ఉన్నవానికే కదా భోగేశ్చ! వనిత లేకుంటే "నాది, నాకు చెందవలసినది, నాతోనే ఉండవలసింది" అనునట్టి పదార్థజాలముల పట్ల భావావేశం కూడా సన్నగిల్లుట సులభమని నాకు అనిపిస్తోంది. నేను స్త్రీ వ్యవహారమునే త్యజించివేస్తాను. జరామరణముల పట్ల నాకు గల భీతి– ఆపాతారమణీయమై అతి చంచలమైనట్టి స్త్రీ సాంగత్యము పట్ల అత్యంత అరుచినే కలుగజేస్తోంది. అందుచేత ఈ మనస్సును అట్టి తుచ్ఛ వస్తువుల వైపు ప్రవేశించనీయకుండా, శాశ్వతమగు స్వస్వరూపజ్ఞానము కొరకే వినియోగించాలని నిశ్చయించుకొన్నాను.

❖❖❖

18. ముసలితనం

కోర్కెలు తీరని బాల్యమును యౌవనం మ్రింగివేస్తోంది కదా! ఇక మానమద గర్వాలతో నిండిన యౌవనమును ముసలితనం ఎక్కడి నుండో వచ్చి మ్రింగి వేస్తోంది. ఇట్లా చూస్తూ ఉండగానే పుష్టిగల ఈ అవయవములు శిథిలమైపోతున్నాయి. కుంచించుకు పోయిన దవడలు, వంగిన నడుము, ముడుతలుపడ్డ నుదురు, వణుకుచున్న కాళ్ళు, చేతులు – ఇవన్నీ స్త్రీలు, తదితరులు అత్యంత తిరస్కార దృష్టితో చూస్తున్నారు. మనస్సంతా దైన్యంతో నిండి ఉంటోంది. సూక్ష్మబుద్ధి, పాపం, గడుసరి సవతులచే హింసించబడే సాధ్వివలె, ఏ మూలకో వెళ్ళి దాక్కుంటోంది. ఇంతకాలం ఎంతో భయభక్తులతో ప్రవర్తించిన పుత్రులు, భార్య, బంధువులు, స్నేహితులు, సేవకులు ఇప్పుడు ఆతనిని ఒక పిచ్చివానివలె చూస్తున్నారు. "ఇదే మనకు మంచి సమయం" అనుకొని 'లోభం' వచ్చి మనస్సును ఆక్రమిస్తోంది. ఇక ఈ జీవుడు బుద్ధిహీనుడై, గుణహీనుడై, శక్తిహీనుడై అనుక్షణం ఏవేవో వ్యథలతో మ్రగ్గుతూ ఉంటాడు.

ఒక ప్రక్క శరీరం క్రమంగా శిథిలం అవుతూ ఉంటుంది. మరొకప్రక్క ఏదో అనుభవించాలనే తపన, దాహము, కామము వర్ధిల్లుతూ ఉంటాయి. ఏవేవో సంతాపములు, దీనత్వములు ఆ జీవుని చుట్టూ మూగి ఉంటాయి. "వీరంతా నా సొమ్ము తింటున్నారు. కాని, నన్ను లెక్కచేయటం లేదు. ఏవైనా రుచికరమైన పదార్థములు తింటే బాగుంటుంది. కాని, వంటికి సరిపడవు కదా! మరణం ఎక్కువ దూరంలో ఉన్నట్లు లేదు. పరలోకంలో ఏ దారుణమైన పీడ అనుభవించవలసి వస్తుందో ఏమో?" ఈ విధంగా ఉంటాయి అతని ఆలోచనలు. కోరికలు కోకొల్లలు. కాని భోగించే శక్తి ఉండదు. హృదయం నిస్సహాయంగా దహించుకొనిపోతూ ఉంటుంది. శరీరం అనేక ఆధివ్యాధులచే పీడించబడుచూ ఉండగా, క్రమంగా శక్తులన్నీ ఉడిగిపోతూ ఉంటాయి.

ఇట్లు జీవుడు అనేక వేదనలు అనుభవిస్తూ ఉంటాడు. మృత్యువు యొక్క క్రూరమైన వ్రేటును తలచుకొంటూ భయం భయంగా రోజులు గడుపుతూ ఉంటాడు. తాను బాల్య యౌవనములో వృథా పరచుకొన్న కాలమును, అవకాశములను నెమఱు వేస్తూ సంగతి - సందర్భములను అనుచితంగా గుర్తు చేసుకొంటూ ఇప్పుడు వర్తమానంలో ఉన్న కొద్దిపాటి అవకాశములను కూడా వ్యర్థపరచుకొంటూ ఉంటాడు.

❖❖❖

19. మృత్యువు

ఈ శరీరం ఈ విధంగా అనేక వ్యాధులచే, ముసలితనముచే ఆక్రమించబడి, జీవుడు దీనాలాపనం చేస్తూ ఉంటాడు. ఇంతలో, ఒకానొక అనుకోని క్షణంలో 'మృత్యువు' అనే గుడ్లగూబ వచ్చి ఎదురుగా వాలుతోంది. సాయం సంధ్యను చూడగానే చీకటి ఎక్కడినుండో వచ్చి వాలదూ? గ్రద్ద మాంసమును మ్రింగటానికే గ్రహించునట్లు, ఈ శరీరమును మ్రింగటానికే 'ముసలితనం' దాపరిస్తోంది. బాలిక పువ్వును జడలో అలంకరించుకొని, కొంతసేపటికి ఆ పూవు వాడిపోగా, త్రుంచి దూరంగా విసరివేస్తోంది. చూచారా? అదే విధంగా 'కాలము' అనే బాలిక కూడా కొంతసేపు ఈ శరీరమును కలిగియుండి, ఆ తరువాత 'మృత్యువు' అనే చీకట్లోకి త్రోసివేస్తోంది.

ఈ జీవుడు బాల్య, యౌవనములలో ఉన్నప్పుడు అప్పటి ఆయా అల్పకాలిక కార్యములందు నిమగ్నుడై ఉంటున్నాడు. భగవంతుని ఆరాధించటం, జ్ఞానము కొరకై విచారణ చేయటం - మొదలైన పెద్దలచే ప్రవచించబడిన ఉత్తమ కార్యముల పట్ల, "ఇప్పుడేం తొందర? మాకు ఇంకా సమయమున్నది. పెద్ద అయిన తరువాత చూచుకోవచ్చులే" అని తలచి ఎంతో అలసత్వము, అశ్రద్ధ కలిగి ఉంటున్నాడు. మృత్యువు ఎదురుగా నిలచి ఉండగా, ఇప్పుడు ఆ అనుకున్న ప్రణాళిక అంతా ఏమైనది? మంచు బాగా కురియగా వాడిపోతున్న పుష్పంలాగా ఈ శరీరం శిథిలమౌతూ ఉంటే, మృత్యువు అను పేరుగల శరీర వినాశనం సమీపిస్తూ ఉంటే ఇక ఈ జీవుడు ఏమి చేయగలుగుతాడు?

❖

శరీరం జీర్ణం అయిపోతూ ఉంటుంది. వాతాదిరోగములు ప్రజ్వలిస్తూ ఉంటాయి. బూడిదగుమ్మడికాయ వలె తల తెలుపుతనం సంతరించుకొంటూ ఉండగా, 'కాలుడు' అనువాడు "ఆహా! ఈ పండు పక్వమునకు వచ్చినట్లున్నదే! ఇక కోసుకొందామా?" అని అనుకొంటూ ఒక రోజు వచ్చి కోయనేకోస్తున్నాడు.

'ముసలితనం' అనే నక్క యొక్క ఊళ వినేవరకే ఈ మానవుడి ప్రతాపమంతా. 'జర' అనే అగ్ని ఈ శరీర గృహమును తాకగానే ఇక అతడు అనేక శారీరక బాధలచే హింసించబడి దుఃఖితుడు అవుతున్నాడు. అంగములు పాలిపోతున్నాయి. నడుం వంగిపోతోంది. ఆధి-వ్యాధులు ముందు నడుస్తూ ఉండగా ఈతడు మృత్యువుకు 'కబళం' అవుతున్నాడు. పర్వత గుహలో దాగినా, సుతిమెత్తని పరుపులపై ధన-జనముల మధ్య ఉన్నప్పటికీ ఎవడైనా మృత్యువు నుండి తప్పించుకోగలడా? ఇంద్రియాలు బిగతీసుకు పోతూఉంటే ఏ లౌకిక తెలివితేటలు ఎందుకు పనికివస్తాయి?

'జర' మూడవకాలుతో (చేతికఱ్ఱతో) జీవుడిచేత తప్పటడుగులు వేయిస్తూ ఉంటే, అనేక అసంతృప్తులు, రోగాలు అందుకు తాళం వేస్తూ ఉంటాయి. ఏ క్షణంలో మృత్యువు పంజా విప్పబోతోందో ఎవరికి తెలుస్తుంది చెప్పండి? అశక్తి, ఆర్తి, ఆపద శరీరంలోనే తిష్ఠ వేసుకొని ఉంటున్నాయి కదా! ఓ మహాశయా! చూడండి. ఈ మనకు కనబడే శరీరాలన్నీ ముసలితనం పాలబడి, చివరికి మృత్యువుచే కబళించబడవలసినదే కదా! ఈ శరీరము యొక్క ఉత్పత్తి - ఉత్తరోత్తరగతి - ఇదంతా పరిశీలించుచున్న నాకు దీనిపై ఏమాత్రమూ విశ్వాసం కలగటం లేదు.

తండ్రీ! మహర్షీ! అసలు నాకొక విషయం చెప్పండి. ముసలితనం మీద పడ్డ తరువాత కూడా, జనులకు భార్య-పుత్ర-గృహాదులపై పేరాశ ఎందుకు ఉంటోంది? ఈ మోహమంతా కల్పిస్తున్నవారెవరు? ముసలితనాన్ని జయిచిన వారంటూ ఎక్కడా ఉండరు కదా! మరి ఈ విషయం అందరికీ తెలియదా? ముసలితనం వచ్చిపడే సమయానికి అనేక కోర్కెలు కలిగివున్న ఈ జీవుడు ఆ కోర్కెలు తీరక అపూర్ణత్వాన్ని అధిగమించలేకపోతున్నాడు. బాల్య యౌవనాలలోనే "అసలు కోర్కెలు లేకుండా ఉండేదెట్లా?" అనే విషయం విచారించి తగిన కర్మ - జ్ఞానములు అభ్యాసం చేసి ఉండి ఉంటే ఇప్పుడీ దిక్కుమాలిన గతి పట్టేదా? లేదు కదా !

అందుచేత, అట్టి ముసలితనం నన్ను సమీపించక ముందే ఆత్మ - అనాత్మ విచారణచే ఈ శరీర భావమును జయించి వేస్తాను. అందుకుగాను, నా శక్తి యుక్తులన్నీ వినియోగించ నిశ్చయించుకొన్నాను.

❖❖❖

20. కాల విలాసము

ఓ మహాత్మా! దేహాత్మబద్ధులమగు మేము "ఇవి మేము భోగించవలసిన వస్తువులు, ఈ ఈ ఉపాయములు అవలంబించి వీటిని పొందుతాము" అని చెప్పుకుంటూ మూఢులమై ప్రవర్తిస్తున్నాము. "వీరు నా వారు. వారు పరాయివారు. ఇవి నా ఇష్టాయిష్టములు. ఇతడు నా శత్రువు. వీటిని జయించి సొంతం చేసుకొంటాను" అను భావనలను కలిగివుంటూ, ఆయా వస్తు సమూహముల వలన కలుగుచున్న రాగద్వేషములచే ప్రభావితులం అగుచున్నాము. సజ్జనులైనవారికి ఇటువంటి విషయాలలో అభినివేశం ఉంటుందా? లేదు. మాబోటి బాలుర వంటివారం మాత్రమే అద్దంలో కనిపించే ప్రతిబింబ సమానములైన ప్రయోజనములను, ఫలములను ఆకాంక్షిస్తున్నాం. "ఇది పొందిన తరువాత మేము ఎంతో సుఖవంతులం కాబోతున్నాం. ఇది మాకు ఎప్పటికి తొలగుతుందో? ఈ వస్తుజాలం కలిగి ఉండుటచే వారెంత సుఖంగా ఉన్నారు? అవి వారికే ఎందుకు లభించాలి?" ఇటువంటి సంసార సంబంధమైన లోభమోహములతో, తుచ్ఛ హావభావములతో విలువైన కాలమంతా గడపివేస్తున్నాం. స్వామీ! సాలెగూడు ఎలుకచే కొరకబడునట్లు కాలముచే మేము ఎంతగానో మోసగింపబడుచున్నాం. "ఆహా! నేను ఎంత విశాలమైన దానిని!" అని గర్వించు సముద్రంలో బడబాగ్ని పుట్టి ఆ సముద్ర జలాన్నే స్వాహా చేస్తున్నట్లు అంతరంగమున పుట్టిన దుష్ట సంకల్పములే ఈ జీవుని దీనునిగా చేసివేస్తున్నాయి.*

ఈ సృష్టిలో కాలముచే మ్రింగబడనిది ఏమైనా ఉన్నదా? భయంకర సంహారాకార రుద్రస్వరూపుడగు కాలుడు ఈ కనబడే సమస్త దృశ్య పదార్థముల అస్థిత్వమును ఏదో ఒకనాటికి రూపుమాపబోవుచున్నాడు. విశ్వాత్ముడగు ఆ కాలదేవుడు "ఇతడు అధికుడు. ఇతడు స్వల్పుడు" -- అనే తేడా చూపకుండా సర్వమును ఆరగిస్తూ త్రేన్చుచున్నాడు. అతని స్వరూపమా, ... అగమ్యగోచరం. ఈ క్షణములు, నిమిషములు, గంటలు, రోజులు, సంవత్సరములు, యుగములు, మన్వంతరములు, కల్పములే అతని యొక్క ఉపాధి అని అనవచ్చునేమో! అట్టి ఉపాధితో కొంచెము రూపము దోపింపచేయుచు, ఈ చరాచర విశ్వమంతా తన వశం చేసుకొంటున్నాడు. ఈ వర్తమాన క్షణంలో అత్యంత శుభారంభములైనవి, రమ్యములైనవి, దృఢతరములైనవి కూడా కాలగతికి ఎర కావలసినదేకదా! క్రూరులైనవారు, నిర్దయులైనవారు, కఠినులైనవారు, పరుషంగా మాట్లాడేవారు, మహాగర్వితులు, అనేకులను నిరాటంకంగా దూషించ గలిగేవారు – వీరు, వారు అనటం దేనికి? అందరూ కూడా క్షణంలో కాలునిచే భస్మం చేయబడుచున్నారు.

ఆతనికి మ్రింగటమంటే మహా ఇష్టం. ఒక్కొక్కసారి ఒక్కొక్క వస్తువును, ఒకేసారి అనేక వస్తువులను మ్రింగివేయగలడు. అనంత లోకములను మ్రింగినాసరే, అతని పొట్ట నిండదు. ఈ సంసార నృత్యమంతా చేస్తున్నది 'కాలము' అని పిలువబడుచున్న అతడే! ఇదంతా సృష్టిస్తున్నాడు.

---

* మన అంతరంగమున పుడుతున్న సంకల్పముల దోషముచే మనం అల్పత్వం పొందుతున్నామని మనకు ఈ వాక్యం గుర్తుచేస్తోంది.

కలిగి ఉంటున్నాడు. మ్రింగివేస్తున్నాడు. అతనికి అడ్డం ఎవరు? చిలుక దానిమ్మకాయను పగిల్చి లోన ఉన్న గింజలను మ్రింగునట్లు, కాలుడు కూడా తన సంహార వ్యాపారము ద్వారా అనేక జగత్తులలోని నానావిధ ప్రాణులను మౌనంగా చప్పరించి వేస్తున్నాడు. అభిమాన సమన్వితులగు ఈ జీవాత్మల సమూహమంతా 'ఒక మహారణ్యం' అని అనుకొంటే, దీనిని పెంచి, పోషించి, ధ్వంసం చేసే యజమానే కాలుడు.

'కాలము' అనే ఏనుగుకు 'శుభాశుభ కర్మలు' అనే రెండు దంతములు ఉన్నాయి. వాటిచే జీవసమూహం చిగురుటాకువలె విచ్ఛిన్నం చేయబడుచున్నది.

విరించిమూల బ్రహ్మాండ బృహద్దేవ ఫలద్రుమమ్
బ్రహ్మకాననమాభోగి పరమావృత్య తిష్ఠతి ॥ (XXIII-14)

ఈ 'బ్రహ్మాండము' అనుబడుదానికి మూలము బ్రహ్మదేవుడు (సమష్టి జీవుడు). దేవతలే (కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములే) ఫలములుగా గల బ్రహ్మాండవృక్షము స్వయముగా 'మాయ' అయి, బ్రహ్మమే ఉనికి స్థానంగా కలిగియున్నది.* ఈ గడుసరి కాలదేవుని విషయంలో మరొక చమత్కారం చెపుతాను వినండి. ఇతడు కార్యరూపంలో క్షణక్షణం భగ్నమగుచున్నప్పటికీ, కారణరూపంలో మాత్రం భగ్నుడు కాకుండానే ఉంటున్నాడు. ఒకచోట దహించబడుచున్నప్పటికీ, మరొకచోట, నిశ్చలుడై సుస్థిరంగానే ఉంటున్నాడు. ఒక విధంగా కనబడుచు మరొక విధంగా కనబడకయే ఉన్నాడు.**

❖

ఈ మనస్సు ఒక్క నిమిషంలో అనేక వస్తువులను, సంఘటనలను, రూపములను సంకల్పిస్తూ, త్యజిస్తూ ఉంటుంది కదా! అదేవిధంగా కాలము కూడా అనేక జగత్తులను ఒకవైపు సృష్టిస్తూ, మరొకవైపు మ్రింగివేస్తోంది. ఈ జగత్తుల ఆగమన నిష్క్రమణములను గమనించనట్టి ఈ జీవులు "ఈ శరీరమే మేము. ఇది పుష్టిగా ఉంటే మేము కూడా పుష్టిగా ఉంటాం. లేకుంటే లేదు. ఈ శరీరంలో ఏర్పడే అనుభవాలు, దీనితోపాటు ప్రాప్తిస్తున్న సంబంధాలు వాస్తవము" అను రూపముగల శరీర తాదాత్మ్య భావము పొందుచున్నారు. అవస్తువే అయివున్న ఈ దేహముతో ఐక్యభావము పొందుచున్నందుకు ఫలితంగా కాలుడు వారిని నిరంతరం స్వర్గనరకాదులందు త్రిప్పుచున్నాడు.

---

* ప్రతి శరీరము ఒక బ్రహ్మాండ నిర్మాణము యొక్క సంజ్ఞయే. అందుగల సంకల్ప తత్త్వము బ్రహ్మదేవుడుగా, ఇంద్రియములు దేవతలుగా ఇందలి జీవుడు (Absolute Experiencer) బ్రహ్మముగా వేదములలో వర్ణించబడింది.

** ఈ మూడు లక్షణాలు ప్రతి జీవునికి వర్తిస్తాయి.

1. అన్నిటికీ జీవునియొక్క శుద్ధ సత్తయే మూలకారణమై ఏమాత్రం భగ్నం కాకయే ఉంటోంది.
2. ఒకానొక చోట వాస్తవానికి అతడు నిశ్చలుడై జన్మకర్మలు లేనివాడై ఆత్మయే స్వరూపముగా కలిగియుంటున్నాడు.
3. అతని శరీరాదులను మనం చూడగలిగినా అతని వాస్తవ సత్త ఇంద్రియాదులకు కనుపించునది కాదు. మనం చూచే ఈ శరీరాదులు భగ్నము అయినా, ఆ శరీరములకు కారణమగు అతడు భగ్నము కాకయే ఉంటున్నాడు.

ఆహా! ఈ కాలుడు తృణమును, బూడిదను, కొండను, ఆకును, సముద్రమును కూడా కబళిస్తున్నాడే! ఇతని యందు క్రౌర్యము, లోభము, దౌర్భాగ్యము, చాంచల్యము దట్టంగా వ్యాపించి ఉన్నాయి. పసిబాలుడు బంతులతో ఆడుకొంటాడు చూచారా? అతడు కూడా సూర్యచంద్రులతో ఆడుకొంటున్నాడు. ప్రళయ సమయంలో జీవులందరినీ నాశనం చేసివేసి వారి అస్తులను ధరిస్తున్నాడు. ఇతని చర్యలను అడ్డగించగలిగే వారెవరు? ఒకప్పుడు అతడు రుద్రుడు, మరొకప్పుడు అతనికి రూపమే ఉండదు. ఒకే సమయంలో ఒకచోట సృష్టి, మరొకచోట సంహారం చేస్తూ ఉంటాడు.

'కాలము' అనే వృక్షం నుండి "దేవతలు – అసురులు" అనే పక్వ ఫలములు నేలరాలుచున్నాయి. 'బ్రహ్మాండములు' అనే కాయలు అనంత సంఖ్యలో కాస్తున్నాయి. ఆ కాయలపై వ్రాలే దోమలవంటి వారే ఈ జీవులు. "చిత్ప్రకాశము యొక్క సత్త" (ఏశుద్ధ తత్త్వమైతే 'స్వసత్త' కలిగియుండి 'తెలుసుకొనుట' అను ప్రకాశము స్వరూపముగా కలిగి ఉన్నదో. (That Absolute Self which is existence and Self -consciousness) సహాయంతోనే కాలుడు ఈ 'జీవులు' అనే రూపములు అవధరిస్తూ అనేక క్రియలు కల్పించుకొని, వినోదిస్తున్నాడు.

ఓ మహాత్మా! ఈ కాలుడు తుది–మొదలు లేని అనిర్వచనీయ వస్తువువలె వెలయుచున్నాడు. అతడు ఒకచోట కారునలుపు వస్తువులను (అజ్ఞానము, నైరాశ్యము, నిస్పృహ, నిష్క్రియత్వములను) మరొకచోట కాంతిమయ వస్తువులను (సుజ్ఞానము, ఉత్తమ ఆశయము, ఉత్సాహము, క్రియాచాతుర్యము) ఇంకొకచోట శూన్యమయ వస్తువులను (శుద్ధ సత్వమును) తనయందు తానే సృష్టించుకొనుచున్నాడు. తనదైన ప్రత్యేకమైన బాణిలో ఈ అనంత సంసారము యొక్క సారమైనట్టి "స్వకీయ సత్త"చే ప్రవర్తిస్తున్నాడు. వేలాది మహాకల్పములు ఎదురుగా గడచిపోతున్నా అతడు ఖేదముగాని, మోదముగాని పొందుటలేదు. దేనినీ చూచి ఆనందించడు, దేనినీ ఆదరించడు. ఏదీ స్థిరంగా కలిగియుండడు.

ఈ కాలము యొక్క స్థితిగతులకు ఆద్యంతాలు ఎక్కడ? ఇతడు అనాయాసంగా లభిస్తున్న "జగత్ సృష్టి" అనే క్రీడయందు నిరహంకారుడై తనను తానే పాలించుకొంటున్నాడు. తనకు తానే సూర్యకిరణ స్వరూపుడై నిర్లిప్తంగా, ఈ జగత్తంతా ఏమూల ఏమున్నదో సర్వదా చూస్తున్నాడు. సూర్యబింబ స్వరూపుడై అవిశ్రాంతంగా రేయింబవళ్ళను సృష్టించుకొంటూ పోతున్నాడు.

ఓ మహర్షీ! 'జగత్ సమూహములు' అనే దీర్ఘకథలో అతడు లోకపాలకులనే భక్షిస్తుంటే ఇక మేము ఎంతటి వారము చెప్పండి? ఆ కాలుడే జీవులను 'జగత్తు' అనే జీర్ణకుటీరంలో అమర్చి ఇంతలోనే త్రెంపి ప్రోగులు పెట్టుచున్నాడు. అత్యంత చపలుడై కాలగమనమును ప్రవహింప జేస్తున్నాడు. ఒకప్పుడు యౌవనమునకు చంద్రునివంటివాడై ఈ శరీరమును అలరించుచు, ఇంతలోనే సింహరూపుడై అవే శరీరములను కర కర నమిలివేస్తున్నాడు. 'కల్పాంతము' అనబడే ఒకానొక సందర్భంలో ప్రాణులన్నిటినీ సంహరించి "అభావ భావము" నందు ప్రకాశించుచున్నాడు. అట్టి అభావభావ* స్థితియందు ప్రవేశించినపుడు తన అధిష్ఠానమైయున్న స్వాత్మయందు (పరబ్రహ్మము

* అభావభావము = ఈ దృశ్యము గురించి భావనచేయకుండునట్టి (జీవునియొక్క) స్థితే 'కల్పాంతము'గా రామునిచే ఇక్కడ గ్రహించబడుతోంది.

నందు) రమించుచున్నాడు. ఒకప్పుడు శుభరూపంగాను, మరొకప్పుడు అశుభ రూపంగానూ ఎల్లవేళల, అన్నివైపుల మహాగోప్యంగా వెలయుచున్నాడు. ఆతనిని తెలుసుకో కలిగినవారెవరు? 'కాలము' కంటే మహత్తరమైనది, బలవత్తరమైనది ఎక్కడా, ఏదీ లేదేమో!

మహర్షీ! విశ్వామిత్రా! ఈ కాలము యొక్క విలాసం, ఇతని లీలలు అత్యద్భుతం. అతని పరాక్రమం అచింత్యమైనది. "పరబ్రహ్మము" అనే చక్రవర్తికి, 'మాయ' అనే అతని పట్టమహిషికి పుత్రుని వంటి కాలస్వరూపుడు దీనులు, మోహితులు అయిన ప్రాణులను క్రీడామాత్రంగా వేటాడు చున్నాడు. 'ప్రళయము' అనునదే అతని ఉపాహారం. ఆ కాల రాజపుత్రుని భార్య 'చండి' అనబడే కాళరాత్రి సర్వభూత వినాశినియై ఈ జగత్తులో సంచరిస్తోంది.*

ఈ భూమి అంతా ఆ కాలుని చేతిలోని పానపాత్ర. మహా మహా దేవతలే ఇతనికి ఆహారమగుచుండగా, ఇక స్వల్పమైన ఆయుష్షు గల మా మానవుల మాన-మద గర్వాలు ఎంతటివి చెప్పండి? ఆ కాలుని ధనుస్సు నుండి నిరంతరం దుఃఖకారకములైన సంహారధ్వనులు వచ్చిపడు చున్నాయి. కాని మూర్ఖులగు అనేకమంది జనులు మాత్రం అదంతా పట్టించుకోకుండా, "ప్రక్కవారికంటే మేము అధికులమేనా? మాకు గొప్పదైన వస్తుజాలం లభిస్తోందా?" అని సరిచూచు కొంటున్నారు. అట్టి క్షుద్రజీవులమగు మమ్ము అతడు సర్వదా చమత్కారంగా వేటాడుచున్నాడు.

❖❖❖

21. క్రియా స్వరూపం - కృతాంత విలాసము

'కాలము' యొక్క ఉపాధి భూతమే "క్రియ". లోకాలన్నీ సృష్టించేది, సంహరించేది ఈ క్రియాతత్త్వమే. దీనినే 'దైవము' అని కూడా అంటున్నారు. ఈ క్రియా స్వరూపమునే వేదజ్ఞులు 'కృతాంతుడు' అనే సంజ్ఞచే పిలుస్తూ ఉంటారు. కర్మయొక్క ఫలమును ఉత్పాదనము చేయటమే ఈ 'కృతాంతుడు'**అనబడువానికి ఉన్న ఏకైక కర్తవ్యం. దట్టమైన మంచు సూర్యకిరణములచే కరుగుచున్నట్లు ఈ కృతాంతుని వలననే ప్రాణులు పుడుచున్నాయి. నశిస్తున్నాయి. ఈ కనబడే జగన్మండలమంతా అతని నృత్యశాలయే కదా!

ఈ కృతాంతుడు "క్రియ - ఫలితము" అనే భంగిమలను చూపుచూ కాపాలికా వేషం ధరించి నృత్యం చేస్తున్నాడు. పైకి అనురాగివలె కనిపిస్తూ అల్పబుద్ధులకు అర్థంకాని ఏదో నియతి (దీనికి ఇది ప్రయోజనము - అను నియమము fate, destiny)ని అనుసరిస్తూ జీవుల సుఖ దుఃఖాలకు కారకుడు అగుచున్నాడు. ఈ నియతిని అనుసరించే స్వర్గమర్త్య పాతాళ లోకములు, శుభాశుభములు, కలిమిలేములు కలుగుచున్నాయి. లౌకిక వైదిక కర్మలతో కూడిన ఈ ప్రపంచ రచన అతనిదే. బాలుడు విసుగు విరామం లేకుండా మట్టిబొమ్మలు చేస్తూ, నశింపచేస్తున్నట్లు, ఆ కృతాంతుడు

---

* కాలపురుషుడగు రుద్రుడు, కాళరాత్రి స్వరూపినియగు చండి (అనగా సృష్టి - ప్రళయములు)ల గురించి నిర్వాణ ప్రకరణంలో విస్తారంగా చర్చించబడినది.

** యముడు అను పురాణ నామముచే అష్టదిక్పాలకులలోని ఒకడుగా చెప్పబడుచున్నది ఈ కృతాంతుడే.

అసంఖ్యాకములగు జీవులను, వారివారి కర్మ వ్యవహారములను రచిస్తూ పోతున్నాడు. మరల ఆ కర్మల ప్రయోజనములను ప్రసాదిస్తూ సృష్టి ప్రళయములను సాగిస్తున్నాడు.

❖❖❖

22. దైవ విలాసం

నియతి – కృతాంతుడు – కాలుడు – మహాకాలుడు – వీరి సన్నివేశమే ఈ జగత్తంతా.

అట్టి విస్తార సంసారంలో ఏ మూలో స్వల్పాయుష్కులమై మేము అత్యంత అజ్ఞానముతోకూడి పడి ఉన్నాము. శరీరధారులమై ఈ దృశ్య ప్రపంచములోనికి ప్రవేశించియున్న మేము 'దైవము' అనబడే ఏమాత్రం గ్రహింపశక్యంగాని ఒకానొక శక్తిచే మోహితులు అవుతున్నాం. అట్టి దైవము అనుదానికి పూర్తిగా అమ్ముడుపోయి, తోలుబొమ్మలు ఆడించువాని చేతిలోని తోలుబొమ్మలవలె అస్వతంత్రులమై ప్రవర్తిస్తున్నాం.* వన్యమృగములవలె మూఢులమై సంచరించుచున్నాం.

దుష్ట చరితుడగు కాలుడు "సంహరించుట (ఎప్పటికప్పుడు దేనిని దానినే హరించుట)" అనే కార్యమునందు నిమగ్నుడై మమ్ములను నిరంతరం అనేక ఆపదల పాలు చేస్తున్నాడు. ఇక మేము తరంగాల వెంట పైకి క్రిందకు తేలియాడుతూ కదలుచుండే కొయ్యవలె కాలప్రవాహంచే, దాని ఇష్టము ననుసరించి దొర్లించబడుచున్నాం. ఎంత ఆలోచించినా అర్థంకానట్టి 'దైవము' అనబడు విషయం గురించి అత్యంత భయపడుతూ బ్రతుకుచున్నాం. మేము కల్పించుకొన్న మా దురాశలే మమ్ములను అగ్నిజ్వాలలవలె దహిస్తూ 'దైవము' అనే దానికి దాసోఽహం చేయిస్తున్నాయేమోనని అనుమానం.

మా బాల్య, యౌవన, వార్ధక్య దశలన్నీ అవిచక్షణాపూర్వకమైన, అర్థం–పర్థం లేని అనేక యత్నములచే గడచిపోతున్నాయి. ఏవేవో భయాలు, ఆశలు, ఉద్వేగాలు, మూఢత్వాలు మమ్ములను అణచిపెడుతున్నాయి. చివరకు జరాపతితులమై కాలునిచే మ్రింగబడుచున్నాము. ఈ కాలునికి ఉచితానుచితము లెక్కడ? సద్గుణుడు – దుర్గుణుడు కూడా అతనికి ఒక్కటే.

మా దౌర్భాగ్యం గమనిస్తున్నారా మునీంద్రా! "ఎంతో సుఖకరములు" అని తలచి అనేక ప్రయత్నములచే ప్రోగుచేసుకొన్న భోగములే కొంతకాలానికి మా పాలిట దుఃఖ హేతువులు అవుతున్నాయి. 'దైవము' యొక్క విలాసమేమిటో మేము ఏమాత్రం గ్రహించలేకపోతున్నాం.

ఒక్కసారి ఈ లోకాలన్నీ పరిశీలించి చూచినప్పుడు ఇవన్నీ దుఃఖకరములేనని నాకు అనిపిస్తున్నాయి. ఏవేవి పొందిన తరువాత ఈ జీవుడు 'నేను సుఖిస్తాను' అని అనుకొంటున్నాడో – అవన్నీ లభించినా అతడు ఏ వాస్తవమైన సుఖమును పొందకయే పోతున్నాడు. ఏది ఎట్లు జరుగబోవుచున్నదో, అదంతా దైవము యొక్క అధీనములో ఉండగా – జీవుడు దేనిని గురించి

---

* ఈ అఖండ రామాయణము జీవుడు ఎట్లు అస్వతంత్ర భావన పొందుచున్నాడో, కాని ఎట్లు వాస్తవానికి స్వస్వరూపాత్మ దృష్ట్యా స్వతంత్రుడో చెప్పటమే లక్ష్యముగా కలిగియున్నది.

సంతసించగలడు చెప్పండి? అయినప్పటికీ, అతనిలో ఏదో పొందాలనే తపన మాత్రం ఉండనే ఉంటోంది. అట్టి అంతర్గతమైన ఆరాటమును ఏవేవో ధన, జన, పేరు, ప్రతిష్ఠల వంటి వాటికొరకై చేసే ప్రయత్నములు అనే కాలయాపనతో కొద్దిసేపు కప్పి పెట్టినప్పటికీ – అతనియందు అంతర్గతమైన ఆవేదన సమసిపోవుటలేదు. ఓ మహర్షీ! ఏ ఏ పదార్థజాలమంతా మహదైశ్వర్యమని, మహద్భాగ్యమని, ఈ జీవులు భావించి ఆయా వస్తుజాలం పొందటానికి అనేక ప్రయాసలతో కూడిన ప్రయత్నములు చేస్తున్నారో, అవన్నీ కూడా నా ఉద్దేశంలో తుచ్ఛమే అయివున్నాయి. "సత్యదృష్టి, దూరదృష్టి, పరిశీలనాత్మక దృష్టి" లేకపోవుటచేతనే ఈ జీవుడు అనేక మోహములను పొందుతూ, అత్యంత ప్రయాసపడుచున్నాడు.

ఆయురత్యంత చపలం, మృత్యురేకాంత నిష్ఠురః ।
తారుణ్యంచాతి తరళం, బాల్యం జడతయాహృతమ్ ॥ (XXVI-9)

ఈ ఆయువును చూద్దామా – అత్యంత చపలమైనది. మృత్యువా, – అల్లంత దూరంలో, అత్యంత క్రూరంగా ఎదురు చూస్తోంది. ఈ జీవుడు 'యౌవనము' అనే అందమైన, తెలివైన మోసకత్తెను చూచి, మాన–మద–గర్వాదులు పొందుతూ క్షణంలో విచక్షణ కోల్పోతున్నాడు. కాని యౌవనం శాశ్వతమా? కాదు. అది వాస్తవానికి క్షణికం. బాల్యం చూద్దామా, అది దట్టమైన అజ్ఞానంతో కప్పివేయబడి ఉంటోంది. ఈ లౌకిక విషయాలు చూస్తే, ఇవన్నీ అనేక విషయానుసంధానములచే కళంకితమై ఉన్నాయి. ఈ బంధువులు, ఈ మిత్రులు, ఈ స్వజనులు, ఈ పరిజనం, ఈ పరిచయాలు – ఇవన్నీ బంధాలేకాని, వాస్తవమైన సుఖమును, ప్రశాంతతను ప్రసాదించేవి కావు. ఈ భోగములు మహారోగముల ప్రతిరూపములు మాత్రమే. "ఎప్పటికో, ఎక్కడో, ఏదో పొంది సుఖించబోవుచున్నాను" – అను రూపముగల వ్యవహారమంతా "జింక దాహంతో పరితపిస్తూ అల్లంత దూరంలో గల మృగతృష్ణాజలం చూచి గంతులు వేయటం" వంటిదే.

❖

ఈ దైవము, లేక కాలగతి యొక్క చర్యలు ఎంత ఆశ్చర్యంగా చమత్కారంగా ఉన్నాయి! 'ఇంద్రుడంతటివాడు కూడా మృత్యుముఖమున పడుచున్నాడు. సర్వమును నిర్దేశించే యముడు నియమించబడుచున్నాడు. వాయువంతటివాడు ఒక రోజుకు ప్రాణహీనుడగుచున్నాడు. చంద్రుడు ధూళిగా మారిపోవుచున్నాడు. సూర్యుడు ఖండ ఖండములగుచున్నాడు. అగ్ని ఆరిపోవుచున్నాడు. విరించి వీగిపోయి, నామరూపాలు కూడా లభించకుండా అగుచున్నాడు. హరి అంతటివాడు హరించుకు పోవుచున్నాడు. భర్గుడు భస్మమగుచున్నాడు. కృతాంతుడు కాలునిచే మ్రింగబడుచున్నాడు. కాలుడు మహాకాలుని యందు విలయమైపోవుచున్నాడు. ఏ అనివార్య నియతి (Inevitable and indespensable destiny) దుస్సవహమై ప్రవర్తిస్తోందని అందరు అనుకొంటున్నారో, అట్టి నియతికూడా విలయించిపోతోంది. ఆకాశమే నిరాకాశమై వినాశనమగుచున్నది. ఇక తుచ్ఛ శరీరధారులమగు మాబోటివారి గురించి ఏమని చెప్పమంటారు? మాకు ఆలంబనం ఎక్కడిది?

హే మహాత్మా! ఇదంతా చూస్తుంటే నాకు ఒక్కటే అనిపిస్తోంది. అచింత్యమైన శక్తిరూపమగు 'అజ్ఞాతమూర్తి' ఏదో ఉన్నది. అట్టి అనిర్వచనీయమగు తత్త్వము వినుటకుగాని, చూచుటకుగాని, మాట్లాడుటకుగాని ప్రాప్తమయ్యేది కాదు. అయ్యది ఈ చక్షువులు మొదలైన సర్వేంద్రియములకు అగోచరము, అలభ్యము. అట్టి మహత్తర అజ్ఞాతమూర్తి తనంతట తానే, తనయందు, తనమాయచే – స్థూల సూక్ష్మ భూతములతో కూడిన విశ్వమునంతటినీ కనబడేట్లు చేస్తోంది. ఆ మహాద్భుత అజ్ఞాత వస్తువును అధిగమించేదేదీ ఈ ముల్లోకములలో ఎక్కడా లేనేలేదు. అదియే అహంకార రూపమున సర్వత్రా వెలయుచున్నది.

ఆ పరమ వస్తువుచే నిర్దేశింపబడుట చేతనే సూర్యుడు ఆకాశంలో ప్రభవిస్తూ రాత్రింబవళ్ళు నిర్మిస్తున్నాడు. ఆ పరతత్త్వ ప్రభావం చేతనే అనేక జీవ-గుణ ప్రదర్శనములచే ఆశ్రయించబడినట్టి ఈ భూగోళం ఉనికిని కలిగియున్నది. అదియే జ్యోతిశ్చక్రమును (నక్షత్ర మండలమును) ఆవేష్టించి నడిపిస్తోంది. ఆ పరమ పురుషుడు మనస్సుకు వాక్కుకు అతీతుడై, సర్వదా సర్వమై, అత్యంత మౌనస్వరూపుడై ఉన్నాడు. ఆయన తన తలపులతో సంకల్పించినంత మాత్రం చేతనే స్వర్గమున దేవతలు, భూలోకమున ఈ మనుష్యులు, పాతాళ లోకమున పాములు ప్రతిష్ఠితమౌతున్నాయి. దురాచారి అయిన మన్మథుడు కూడా ఆ ప్రభువుయొక్క అనుగ్రహంచేతనే బలిమిని సంపాదించి, ఈ లోకులను ఏలుచు, తన పరాక్రమం ప్రదర్శించుచున్నాడు. లేకుంటే ఆతడు వసంతఋతువులో పుష్పభరిత ప్రకృతి సమేతుడై మనస్సులను చలింపజేయ గలుగుతాడా? చిత్రం! ఈ విధంగా ఆ అప్రతిహత అజ్ఞాతమూర్తి నుండి శక్తిని పొందిన మన్మథుడు తన దుశ్చర్య ప్రభావంచేత, మహా వివేకులను కూడా ప్రియాంగనల వ్రేళ్ళను, కుచ్చెళ్ళను చూచి చిత్తభ్రమ పొందేట్లు చేస్తున్నాడు కదా!

పరోపకార కారిణ్యా, పరార్తి పరితప్తయా,
బుద్ధ ఏవ సుఖీమన్యే, స్వాత్మ శీతలయాధియా ॥ (XXVI-39)

స్వామీ ఎవరైతే పరోపకారపారాయణులై ఉంటారో, ఇతరుల కష్టములు తమ వంటివేనని అనుకొని పరితపించుతారో, బుద్ధిబలంచేత తత్త్వజ్ఞానమును సంపాదించి స్వాత్మ యందే రమిస్తూ ఉంటారో ... అట్టి మహనీయులే ధన్యులు. వారే ఈ మాయా జగత్తు నందు ఉత్తమమైన సుఖమును పొందుచున్నారని నాకు అనిపిస్తోంది. ఇక మిగతా వారి విషయమేమిటంటారా? వారి వలన వారికి గాని, ఇతరులకు గాని కలిగే లాభమేమున్నది చెప్పండి?

ఈ మనుష్యులలో అనేకులు మోహవశంచేత 'జీవనము' అనే మహారణ్యంలో చిక్కుకున్నారు. అనేక స్వకీయకల్పనలచే దురాచారములచే వేధింపబడుచున్నారు.

ఓ మహర్షీ! ఈ జనులంతా మరల మరల పుడుతున్నారు. చచ్చుచున్నారు. అనేక కర్మలు ఆచరిస్తున్నారు. స్వల్ప లభ్యములచే, స్వల్ప ఆశలచే, స్వల్ప క్రియలచే మరల మరల ఆయుర్దాయం వ్యర్థం చేసుకొంటున్నారు. వారు కోరుకొనే ఫలములన్నీ చివరికి వారికే ఉరిత్రాళ్ళుగా

పరిణమిస్తున్నాయి. మూర్ఖపు కార్యక్రమములను ప్రారంభించి, వాటినుండి ప్రాప్తిస్తున్న ఫలితముల నుండి మరికొన్ని కార్యక్రమములను స్వీకరిస్తూ – ఈ విధంగా అనేకసార్లు చేసినదే చేయుచు జన్మ పరంపరలు గడుపుచున్నారు. ఈ దుఃఖములకు అంతు ఉండటంలేదు. అయితే వివేకులు, జ్ఞానులు అయినట్టి వారికి మాత్రం, అవిద్యాజనితమైన సర్వకామ్య కర్మములు, వాటి ప్రయోజనములు తుచ్ఛంగానే ఉంటున్నాయి.

ఈ ప్రపంచంలోని అమాయిక జనులయొక్క సంచార వ్యవహారమంతా గమనించారా మునీంద్రా! "నేడు ఈ ఉత్సవం. ఇప్పుడు ఈ ఋతువు. ఈ రోజు ఈ ఊరుపోవాలి. ఆ రోజులలో యాత్రలు చేయబోతున్నాం. ఈ నా పిల్లల వివాహాలకోసం వేచియున్నాను. వీరంతా నా బంధువులు. ఇది సుఖం. ఇవి సరదాలు. ఈ విరామ సమయంలో ఈ ఆటలు ఆడుకొంటాం. ఈ విషయభోగాలు మేం పొందాలి. వీరి వలన నాకేం లాభం?" ఇత్యాది మిథ్యాకల్పనలన్నీ కల్పించుకొంటూ మేమంతా ఆ కల్పనలలో బద్ధులం అవుతున్నాం. చపల చిత్తము విజృంభిస్తూ ఉండగా, ఏది సత్యమో, ఏది నిత్యమో గ్రహించలేకపోతున్నాం.

❖❖❖

23. మనోవృత్తులు - అశాంతి

పైకి మాత్రమే మనోహరంగా కనిపించే ఈ కుత్సిత ప్రపంచంలో వాస్తవమైన మనశ్శాంతి కలిగించగలిగే వస్తువులు ఏమి ఉన్నాయి? బాల్యమంతా, కల్పిత క్రీడామయమే కదా! 'యౌవనం' అంటారా, స్త్రీ సాంగత్యం, స్వోత్కర్షలవంటి అనేక దురహంకార చర్యలతో నిండినదై కృశించిపోతోంది. ఇక ముసలితనం ప్రవేశించిందా, అన్నీ కష్టాలే. ఈ విధంగా ఈ జనులు వ్యర్థ జీవనులగుచున్నారు. ఈలోగా మృత్యువు వచ్చి వడలిన శరీరమును నోటకరచుకుపోతోంది. అప్పుడా జీవునికి ఇహలోకంలో శూన్యమే శేషించుచున్నది.

ఈ జీవుడు జీవించుచున్నంతకాలం "నా వయస్సు పెరుగుతోంది" అని సంతోషించుచున్నాడే కాని, "అయ్యో! నా ఈ ఆయుష్షు తరిగిపోతోంది కదా! ఇప్పటి వరకు స్వస్వరూపము విషయమై నేను గ్రహించినదేమిటి? ఇక ఇక్కడి నుండి ఏమి చెయ్యాలి? ఏ మార్గం అన్వేషించాలి? ఏ జ్ఞానులతో సంభాషణ చేయాలి" అని తలచుటయే లేదు. ప్రయత్నశీలుడు అగుటలేదు.

తృష్ణ అనుక్షణం సంతోషమును తన పొట్టన పెట్టుకొంటోంది. పంచేంద్రియములు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ వివేక రత్నములను మఱుగున పడవేస్తున్నాయి. భ్రమాత్మకమగు సంసార క్రీనీడలు బ్రతుకంతా ఆక్రమించి వేస్తున్నాయి. తృష్ణ యందు యథేచ్ఛగా సంచరిస్తున్న ఈ మనస్సు ఈ జీవుని ప్రయోజనరహితంగా పరిభ్రమింప చేస్తున్నది. కాలమంతా వ్యర్థమైపోతోంది. ఉత్తమమైన ఫలితమేదీ లభించుటయే లేదు. ఆపదలకు శోకించనట్టి, సంపదలకు మత్తిల్లనట్టి, యువతులను చూచి విచలించనట్టి చిత్తము పొందగలిగిన వాడే ఈ జగత్తులో ఉత్తముడని నా అభిప్రాయం.

హే మునిశ్రేష్ఠా! యుద్ధరంగంలో గజ తురగములతో కూడిన గొప్ప శత్రు సైన్య సముద్రాన్ని ఎదుర్కొనేవాడు నా ఉద్దేశంలో గొప్ప శూరుడు కాదు. అనేక మనోవృత్తి తరంగాలతో విక్షిప్తం అగుచున్న ఈ ఇంద్రియములను జయించినవాడే వీరుడు. దురాశలే మానవుని నిజమైన శత్రువులు. దురాశాగ్రస్తమైన మనస్సును శాంతపరచగలిగే పదార్థములు ఈ ప్రపంచములో ఏమి ఉన్నాయి? దురాశకు అంతు ఎక్కడ?

కీర్తి, ప్రతాపం, సంపద ఉన్నచోట సత్వగుణం, వివేకం ఉండటం దుర్లభమైన విషయమే అగుచున్నది. ఓయీ! మానవుడా! పర్వతగుహలో ఉన్నా, లేక వజ్రనిర్మితమైన అంతఃపురంలో దాగినా – అదృష్టానుసారంగా వచ్చే సంపదలనుగాని, ఆపదలనుగాని నిరోధించగలమా? లేదు కదా! మరి "ఈ ధన, దార, పుత్రాదులు మధుర రసాయనములు" అని ఎందుకు భ్రాంతిని పొందుచున్నావు? ఈ సంపదలన్నీ జీవించి ఉన్నంతకాలం 'అజ్ఞానము' అనే మూర్ఛను కల్పిస్తున్నాయి. శరీరం త్యజించు క్షణంలో కూడా "ఇవన్నీ నావి. వీటిని విడచి ఎట్లుండటం?" అని మమకారముల రూపములలో దుఃఖములకే కారణమౌతున్నాయి. మరి అవి ఉత్తమ విషయములు ఎట్లా అవుతాయి? వాటిపై అంతటి నమ్మిక ఎక్కడి నుండి వచ్చిపడుతోంది? మృత్యువు శరీరమును ఆక్రమిస్తున్నప్పుడు ఈ భార్య, పుత్ర, బంధు, మిత్ర పరివారాదులు ఎందుకు పనికివస్తాయి?

❖

ఈ జీవుడు అవసానకాలంలో విషాదకరములైన అవస్థలు పొందటమే జరుగుతోంది. విషణ్ణుడై, తాను ఒనర్చియున్న పాపపు పనులను నెమరు వేసుకొంటున్నాడు. తాను మమకారం పెంచుకొన్న వాటినన్నిటిని మననం చేస్తూ, అంతరంగంలో దహించి వేయబడుచున్నాడు. ధర్మమునకు అనుకూలం కానట్టి అర్థ కామములకై జీవితమంతా వెచ్చించిన వారి మనస్సు అవసానకాలంలో నెమలి పింఛపు తుదిభాగంలాగా చంచలమే అవుతుందని విజ్ఞులగు పెద్దలు చెప్పుచున్నారు. మరి అట్టి మనస్సును అతడు ఎట్లా సముదాయించుకొంటాడు చెప్పండి?

దుష్కర్మల ఫలితాలు ఇట్లా ఉండగా, సత్కర్మ ఫలములు కూడా పడిలేచే నదీ తరంగాలవలె క్షణభంగురములే కదా! సంచితములైన సత్కర్మలు కూడా మృత్యు ముఖంలో ప్రవేశించువానికి శాంతిని కలుగచేయలేకపోతున్నాయి. ఇక జీవించి ఉన్నప్పుడు కూడా దైవవశాత్తు అట్టి సత్కర్మలు ప్రారబ్ధముగా (వర్తమానములో అనుభవించవలసినవిగా) ప్రాప్తించినప్పటికీ, – దేహాత్మబుద్ధి కలవారికి ఆ భోగములన్నీ శాశ్వతమైన తృప్తిని అందించగలవా చెప్పండి? కట్టెలసంఖ్య పెరిగినకొద్దీ అగ్నిజ్వాలలు అధికమే అవుతాయి కదా! ఆహా! "ఈ రోజు ఇది చేస్తాను. ఆ రోజు అది చెయ్యాలి" – ఇట్లు అవిశ్రాంతంగా చింతన చేయు మనుజుల ఆయా కర్మప్రయాసలన్నీ చివరికి ఏ రూపంగా చూచినా దుఃఖపరంపరలుగానే పరిణమిస్తున్నాయి. ఇటువంటి ప్రయత్నములు చేయుటలోను, పుత్ర–మిత్ర–కళత్రాదులను సంతోషపెట్టడంలోను కాలమంతా ఎంత ఘోరంగా వ్యర్థం అయిపోతోంది! ఇక, ముదిమి (old age) దాపరించిన తరువాత, ఉన్న కొద్దిపాటి వివేకము కూడా ఊడ్చిపెట్టుకు

పోతోంది. చెట్టుకు ఆకులు చిగురించి, కాలక్రమంగా ఎండి రాలిపోతాయి చూచారా? ఈ ప్రపంచంలో కూడా వివేకహీనులగు వారు జన్మిస్తున్నారు. మరల శీఘ్రంగా నశించుచున్నారు.

ఇతస్తతో దూరతరం విహృత్య , ప్రవిశ్యగేహం దివసావసానే
వివేకి లోకాశ్రయ సాధుకర్మ రికేఽ హ్నిరాత్రౌ! క ఉపైతి నిద్రామ్? (XXVII-19)

నాకు ఒక విషయం చూస్తుంటే చాలా విచిత్రం అనిపిస్తోంది. ఈ జనులంతా ఏవేవో కార్యక్రమములను రచించుకొని, అందు నిమగ్నులై పగలంతా అటూ-ఇటూ తిరుగుచున్నారు. వివేకులను ఆశ్రయించకుండానే, సత్కర్మలను నిర్వర్తించకుండానే సాయంకాలానికి ఇల్లు చేరుకుంటున్నారు. రోజంతా ఏ వివేకము పొందకుండానే గడచి పోతోంది కదా! ఇక వారికి రాత్రిపూట నిద్ర ఎట్లా పడుతోంది? ఒక రోజు వృథా అయినందుకు చింతించరేం?

ఒకానొకడు అతి ప్రయాసతో శత్రువులందరిని జయించి వేస్తున్నాడు. పుష్కలంగా ధనాదులను సంపాదిస్తున్నాడు. సుఖకరములనుకొన్న పదార్థజాలమంతా చేకూర్చు కొంటున్నాడు. సరిగ్గా, అట్టి సమయంలో, ఎక్కడినుండో వార్ధక్య - మృత్యుదేవతలు వచ్చి ఎదురుగా నిలబడి "నాయనా! అయినదా? ఇక బయలుదేరుదామా?" అని పలుకరిస్తున్నాయి.

ఇక ఈ ఇంద్రియముల విషయానికి వస్తే, ఇవన్నీ కొంతకాలం జీవుడిని అలరిస్తున్నట్లే కనిపించుచు, ఇంతలోనే శిథిలత్వం పొందుతున్నాయి. అతి స్వల్పకాలంలో నిర్వీర్యమైపోతున్నాయి. తుచ్ఛరూపంగానే వృద్ధి చెందుతూ ఈ జీవుడిని విషయ లంపటములలోనికి త్రోసివేస్తున్నాయి. ఆహా! చిత్రం గమనించారా? వీటికి చిక్కిన ఈ జనులు ప్రక్కనే ఉన్న మృత్యువును కూడా ఏమాత్రం గమనించటం లేదు. కర్మపాశముచే బంధింపబడినవారై, యజ్ఞమునకు తేబడిన మేకలవలె అనేక జన్మ పరంపరలకు ఆహుతి అయిపోతున్నారు.

అయితే, ఉత్తములగు తత్త్వజ్ఞానుల విషయం మాత్రం ఆ విధంగా లేదు. వారు ఈ కర్మ పాశబంధములన్నీ విడనాడి ఆత్మయందే తమ ధ్యేయము కలిగి ఉంటున్నారు. కనుక వారి ఉత్తరోత్తర జన్మలు ప్రశాంతము, ఆనందము, జన్మ కర్మ బంధరహితము అయినట్టి ఆత్మానుభవమువైపే సంధింపబడి ఉంటున్నాయి.

ఓ విశ్వామిత్ర మహర్షీ! క్షణభంగురములైన కెరటాలవలె ఈ జన సమూహమంతా ఎక్కడి నుండి, వస్తున్నారు? ఎటు వెళ్ళుచున్నారు? చెప్పగలిగేదెవరు చెప్పండి? అనేకులు ఈ విషయమే యోచించకుండా ఎదురుగా ఉన్నట్టి క్షణికములైనట్టి స్త్రీ, ధన, జనాది వ్యవహారములందే దృష్టి పెట్టి, ప్రాప్తించబోవు దుస్థితులను గుర్తించుటకు ప్రయత్నించుట లేదు. వివేకము సముపార్జించ నందుకు పర్యవసానం దుఃఖ మోహములే కదా!

ఓ మానవుడా! ఈ స్త్రీలోలుత్వము కాలకూట విష వృక్షమునకు వ్రేలాడే పక్వమైన పండువంటిదేనని నీవు ఎందుకు గుర్తించటం లేదు? తుచ్ఛమైన పై పై సౌందర్యములు స్త్రీ పురుషులను

ఆకర్షించి వివశులను చేస్తున్నాయే? ఏది నిత్యమో, ఏది సత్యమో, అద్దానిని కనబడకుండా చేస్తున్నాయే? ఇంతా అయితే, ఈ శరీరములన్నీ రక్తమాంస నిర్మితములేకదా!

❖

ఉత్సవ జనసమాగమం : ఈ మూల నుండి కొంతమంది, – ఆ మూల నుండి మరికొంతమంది – ఏదో ఋణానుబంధం చేత కాబోలు, వచ్చి ఒక చోటికి చేరుతున్నారు. ఇదే బంధు – మిత్ర – పుత్ర – కళత్రాదుల సమాగమమంతా! ఉత్సవ సమయంలోని జనుల సమాగమము వంటిదే ఇది. ఓయీ! జీవుడా! ఇది చూచి నీవు ఎందుకు భ్రమిస్తున్నావు? ఎక్కడి నుండో జలప్రవాహమునకు కొట్టుకువచ్చిన కట్టెలవలె వచ్చి చేరిన వీరందరు అదృష్టానుసారం ఒకరికొరకై మరొకరు కొన్ని కార్యములను నెఱవేర్చటం జరుగుతోంది. కాని ఇందులో – ఎవరి లక్ష్యం, ఆర్తి, కార్యక్రమం – వారిదేకాని, ఒకరితో మరొకరు సంబంధించినవారే కాదు. "మనం మరొక జన్మలో కూడా ఇలాగే ఉందాం. స్వర్గ మర్త్య లోకాలలో మరల మరల కలుసుకొందాం" – అని జనులు అనుకునేదంతా కూడా భ్రమలాగానే ప్రాప్తిస్తోంది. ఎవరికి, ఎప్పుడు, ఎటు, ఏ విధమైన ప్రయాణం ప్రాప్తించనున్నదో, ఎవరేం చెప్పగలరు? కానీ, ఈ బహుదూరపు బాటసారులంతా ఒకరికి మరొకరు సర్వస్వమైనట్లు కబుర్లు మాత్రం చెప్పుకొంటున్నారు. అహంకరించు కొంటున్నారు. వాదులాడుకొంటున్నారు. కీచులాడుకొంటున్నారు. వివిధ కాలయాపనల రూపమున ఉన్నట్టి ఈ కార్యక్రమముల వ్యవహారమంతా ఎందుకు జీవుణ్ణి భ్రమింప చేస్తోంది? ఆలోచన, విమర్శ, పరిశీలన మొదలైన యుక్తులు కలిగి ఉండి కూడా అతడు ఇదంతా ఎందుకు గమనించుట లేదు? మహర్దశ–దుర్దశ, స్నేహము–ద్వేషము, స్థిరత–అస్థిరత మొదలైనవాటితో కూడుకొని కనబడుచున్న ఈ సంసారమంతా నాకు మాత్రం ఆరిపోవుటకు సిద్ధంగా ఉన్న దీపమువలెనే అనిపిస్తోంది. వినాశనము తప్పించి, ఇందులో నాకు సారమైనదేదీ కనిపించటం లేదు. ఒకానొక చక్రమువలె ప్రవృత్తమగుచున్న ఈ సంసారమంతా వాస్తవానికి వర్షాకాలపు జలబిందువు లాగా క్షణభంగురమే కదా! అయినప్పటికీ, అజ్ఞానియొక్క మనస్సుకు మాత్రం ఇదంతా వాస్తవమే అయినట్లు తోచుచున్నది. "ఆహా! ఈ వర్తమాన స్థితిగతులు ఎంతగానో నిజమై నాకు ప్రాప్తిస్తున్నాయి" అనే అతడు అనుకొంటున్నాడు.

ఈ శరీరం, ఈ యౌవనం, ఈ సుగుణ–దుర్గుణములు, ఈ గౌరవాగౌరవములు, ఈ పటాటోపములు – ఇవన్నీ కూడా ముదిమి (old age) అనుదాని ప్రభావంచేత వినష్టమై పోతున్నాయి కదా! ఇక ఈ చిత్తమును సంతోషింపచేయటం అసంభవమేనని నాకు అనిపిస్తోంది.

మహర్షీ! అటు ఆ మహావృక్షమును చూడండి. అది అదృష్టవశం చేత జన్మించింది. బాటసారులకు నీడను ప్రసాదిస్తోంది. పుష్పఫలాదులచే లోకానికి ఎంతో ఉపకారం చేస్తోంది. కాని, ఏం లాభం చెప్పండి? తాను ఎంతో సుఖింపచేసే ఈ జనులే ఒక గొడ్డలితో క్రూరంగా నరికివేస్తున్నారు. ఇక ఈ జగత్తులో దేనిని, ఏ విధంగా, ఎంతవరకు నమ్మి ఉండమంటారు? జనులతో ఏర్పడుచున్న సంసర్గమంతా అతి దుష్ట స్వభావమే కలిగియుండి, చివరికి వినాశనమే పర్యవసానముగా కలిగి ఉంటోంది. మోహమునే ప్రసాదించటం జరుగుతోంది.

వర్తమానం భారంగాను, దీర్ఘంగాను కనబడవచ్చునేమో కాని, మానవుని ఆయుష్షు ఎంత స్వల్పమైనది? అందులో మార్పుచెందుచున్నట్టి ఎన్నెన్ని దశలు? మానవుల జీవితకాలం దృష్ట్యా చూచినపుడు, బ్రహ్మ, యముడు మొదలైన లోకపాలకుల ఆయువు అధికంగానే కనబడవచ్చుగాక. కాని, కల్ప సమూహములను దృష్టిలో పెట్టుకొన్నప్పుడు, వారు కూడా క్షణమాత్రజీవులే కదా! అనేక క్షణముల సమన్వయమైనట్టి ఈ విచిత్ర కాలచక్రంలో ఆయువు యొక్క హెచ్చుతగ్గులు కూడా మిథ్యామాత్రములేనని నాకు అనిపిస్తోంది. తండ్రీ! విశ్వామిత్రా! దోషదృష్టి లేనట్టి, దుఃఖ తాపములు ప్రాప్తించనట్టి 'చోటు' ఎక్కడ? మాయకానట్టి క్రియలేమి ఉన్నాయి? ఏది పొందిన తరువాత, ఇక పొందవలసినదంటూ ఏమీ ఉండదు?

❖

పర్వతములన్నీ పాషాణమే కదా! భూమి అంతా మట్టి మాత్రమే. వృక్షములన్నీ కొయ్యకాక మరేమి? మనుష్యులంతా మాంసమయములే కదా! అసలు ఇక్కడ అపూర్వమైనదంటూ ఏమి ఉన్నది? ఈ కనబడే పదార్థములు, వాటి వికారములు – వాటియొక్క మూలకారణము కంటె వేఱైనవి కావు. మూలకారణమగు పరబ్రహ్మము నందే ఈ వివిధ నామరూపముల వ్యవహారం సంజ్ఞామాత్రంగా అనుభవమౌతోంది. ఆయా పదార్థ జాలమునకు లీలాభూమి అయినట్టి ఈ మిథ్యాజగత్తు అవివేకులకు మాత్రమే ఘనీభూతమై ప్రాప్తించుచున్నది. వివేకులు ఇదంతా పంచభూత వికారంగానే ఎఱుగుచున్నారు. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము రకరకాల పాళ్ళలో కలిసి "ఇదిగో..,ఇది గోవు, ఇది ఇల్లు, ఇది మనుజుడు" అను దృశ్య వ్యవహారమంతా ప్రత్యక్ష మగుచున్నదని వారు గ్రహిస్తున్నారు. ఏది ఏమైతేనేం? అనేకులు తమ స్వప్నమునందు కూడా సుఖదుఃఖాది అనుభవములన్నీ అత్యంత వాస్తవములైనట్లే అనుభవమును పొందుచున్నారు. మహాబుద్ధిమంతులైన వారు కూడా అనేక భావాభావములు పొందుచు ఇందు తగుల్కొనుచున్నారు. అజ్ఞాన వశంచేతనే మిథ్యారూపములైన వాటియందు ఇంతటి నిశ్చయం ఏర్పడుతోంది. నిజానికి అత్యంత స్వల్ప విషయములైనట్టి ఈ ఇంద్రియానుభవములు, ఈ ధనములు, ఈ గృహములు – ఇందుకోసమే బ్రతుకుచున్నట్లు ఇవే జీవితమందలి మహత్తర విషయములైనట్లు – కల్పన గావించబడుతోంది. ఇట్టి అనేక సంకల్ప వికల్పములతో బాల్యయౌవనాలు వృథా అయిపోతున్నాయి. వార్ధక్యం వచ్చేసరికి, అప్పుడిక ఈ మానవుడు ఏమీ చేయకుండానే ఉండిపోతున్నాడు. చివరికి, అతనికి స్వస్వరూపమునకు సంబంధించిన సమాచారమేమీ లభించకుండానే పోతోంది. ఇక నిరంతరమైన ఆత్మతాదాత్మ్యము లభించేది ఎప్పటికి? ఎన్ని జన్మలకు?

ఆదాతుమిచ్ఛన్ పదముత్తమానాం స్వచేతసైవాపహతోఽద్య లోకః ।
పతత్యశంకం పశురద్రికూటా, దానీలవల్లీ ఫలవాంఛయైవ ॥ (XXVII-37)

పశువులు, మేకలు పచ్చటి ఆకులమీద దృష్టితో కొండయొక్క అంచుదాకా పోయి,

చూచుకోకపోవుటచే అప్రయత్నంగా లోయలోకి పడి కూలిపోతాయి చూచారా? అదేవిధంగా మూఢజనులమగు మేము రాజ్య, ధన, గృహాది భోగములను సంపాదించాలని మా శక్తియుక్తులన్నీ కూడగట్టుకొని ప్రయత్నిస్తూ పోతున్నాం. మా చిత్తము రాగ లోభాది దుర్గుణములచే దూషితమైపోతోంది. అట్టి దుష్టచిత్తముచే వేధించబడినవారమై అధఃపతితులమౌతున్నాం. అజ్ఞానులమగు మాయొక్క జీవితములు ఇంద్రియ వ్యాపారములకే పరిమితమై వృథా అవుచున్నాయి. ఇక మాకు దిక్కేమిటి? మా గుణములు, యుక్తులు, తెలివితేటలు, శరీర సౌందర్యాలు ఎందుకు పనికివస్తాయి చెప్పండి? మా గురించి మేము ఎరుగము కదా!

ఈ జనులలో కొందరు దయ, దాక్షిణ్యము, విద్య, వినోదము మొదలైన చిత్త వృత్తులు కలిగి ఉంటున్నారు. మరికొందరో..., క్రోధ లోభాది నిష్ఠూరములైన వృత్తులతో ఈ భూమిపై సంచరిస్తున్నారు.

హృదయవిహీనుడగు ఆ బ్రహ్మదేవుడు ఈ దృశ్యమునందు అనేక వస్తువులను, వ్యవహారములను కల్పించుచున్నాడు. అవన్నీ పైకి రమణీయంగా ఉండవచ్చు. కాని, వాటి పరిణామం మాత్రం భయమును, ఉద్వేగమును, దుఃఖమును, అశాంతిని ప్రసాదించేదిగానే ఉంటోంది. అట్టి అనేక నూతన కార్యక్రమములన్నీ దోషయుక్తము లైనప్పటికీ, అవివేకులమగు మేము అనుక్షణం మోహం చెందుచున్నాం. వివేకులగు జ్ఞానులు మా అగచాట్లను చూచి నవ్వుకొంటున్నారు.

అనేకమంది జనులు నిరంతరం అనేక కుటిల యత్నములను ఆశ్రయిస్తూ విషయములందే ఆసక్తులై ఉంటున్నారు. మాయందు ప్రజ్ఞ కొఱవడి ఉండుటచే కాబోలు, మేము వివేకులగు జ్ఞానులను గుర్తించలేకపోతున్నాం. ఇక జీవితం ఎట్లా గడపాలో నాకు అర్థమగుటలేదు.

❖❖❖

24. స్థిరాస్థిరములు - స్థితిగతులు

యచ్చేదం దృశ్యతే కించిజ్జగత్ స్థావర జంగమమ్
తత్సర్వమస్థిరం, బ్రహ్మన్! "స్వప్నసంగమ సన్నిభమ్" ॥ (XXVIII-1)

ఈ కనబడే స్థావర జంగమాత్మకమగు జగత్తంతా కూడా స్వప్న సంగమమువలె అస్థిరమైనదే కదా? ఈ రోజు ఆకాశమునంటే మహారణ్యం, రేపటికి నేలమట్టమై పోతోంది. నేడు సముద్రమువలె కనబడుచున్న పెద్ద అఖాతం, ఒకనాటికి పెద్ద పర్వతమగుచున్నది. ఏ శరీరమైతే ఇప్పుడు పట్టువస్త్రములచే, గంధ లేపనములచే, సుకుమార పూలమాలలచే అలంకరింపబడి అనేకుల దృష్టిని ఆకర్షించుచు సంచరిస్తోందో – అదే శరీరం కొలది రోజులకు వస్త్రవిహీనమై ఊరికి దూరంగా గల ఒక గుంటలో పారవేయబడి, అక్కడ శల్యమగుచున్నది.

మహానగరాలు దట్టమైన అరణ్యాలుగా మారిపోతున్నాయి. గొప్ప తేజస్సుతో కూడుకొని అనేకమంది జనులను శాసించే ఒక మండలాధిపతి కొలది కాలంలో గుప్పెడు బూడిద అగుచున్నాడు.

అందంగా, రకరకాల రంగుల మెఋపులతో అనేక దీపకాంతులతో విలసిల్లే గొప్పభవనం మరికొంతకాలానికి మొండిగోడలతో, పిచ్చి చెట్లతో శిథిలమై భయమును గొలుపుచు గబ్బిలముల చేత, సాలెగూళ్ల చేత ఆక్రమించబడుతోంది. పూతోటల చేత, సుందర పుష్ప-లతల చేత అలంకరించబడి జనులను ఆహ్లాదపరుస్తున్న భూప్రదేశము మరుభూమి (ఎడారి) అగుచున్నది. నీరు ఉన్నచోట భూమి వెలయుచున్నది. భూమి నీరగుచున్నది. ఈ కాష్ఠ - తృణమయ జగత్తులో పరివర్తనమవనిదంటూ ఏది ఉన్నది స్వామీ?

ఈ బాల్యం, ఈ యౌవనం, ఈ శరీరం, ఈ ద్రవ్యములు - ఇవన్నీ అనిత్యములే అయి, ఎప్పటికప్పుడు నిరంతరం జలతరంగాలవలె మరొక స్థితిని పొందుచూనే ఉన్నాయి. ఈ జీవితమే గాలిలో దీపం వంటిది. ఇక దేనిగురించి ఏమని చెప్పుకోవాలి? ముల్లోకములందు కనబడే ఈ వస్తువుల శోభ అంతా మెఋపు వంటిదే కాని, మరేమీ కాదు. బీజము - వృక్షములవలె ఈ భూతజాలమంతా మాటిమాటికీ మార్పు చెందుతూనే ఉన్నాయి.

ఓ మహర్షీ! అనేక ఆడంబరములతో కూడిన ఈ సంసార రచన అంతా మహా నేర్పుగల ఒకానొక నర్తకి యొక్క తళుకు-బెళుకుల వలె కనిపిస్తోంది. ఇక ఈ జీవులు ధూళిరేణువులవలె 'మనస్సు' అనే వాయువుచే లేవనెత్తబడి ఆ నర్తకికి వస్త్రరూపులు అగుచున్నారు. వీరంతా స్వర్గ, నరక, భూ, పాతాళ లోకములకు రావటం - పోవటమే ఆమె అభినయం. ఎక్కడికక్కడ క్షణభంగురమైన అనేక కార్యక్రమములు! ఎన్నెన్ని వ్యవహారములు? ఇవన్నీ ఆ నర్తకి యొక్క చంచల నేత్రముల వీక్షణములే అవుతున్నాయి. ఈ ఎదురుగా కనబడేదంతా గంధర్వ నగరంలాగా మహాభ్రమను కలుగజేస్తోంది. ఆహా! ఇదేమి నృత్యం! ఇదేమి సంచలనం! ఏమి చంచలత్వం! ఈ రోజులు, ఈ సంపదలు, ఈ క్రియలు, ఈ మహాపురుషులు, ఈ అధికారములు - ఇవన్నీ ఏమైపోతున్నాయి? క్షణంలో దృష్టిపథం నుండి దాటిపోతున్నాయే? ఇక మనం మాత్రం ఇట్లే ఉంటామా? లేదు. క్షణకాలం కనబడి మరల ఎటో పోయే వారమే కదా! ప్రతిరోజు తెల్లవారుతోంది. క్షయించిపోతోంది. మరల ఇంతలోనే ఎచటినుండో ఉత్పన్నమౌతోంది. ఈ పాడు సంసారానికి 'అంతు' ఎక్కడో చెప్పండి?

హే ప్రభూ! మనుష్యులు పశువులు అగుచున్నారు. పశువులు మనుష్య జన్మలు ఎత్తుచున్నాయి. దేవతలంతటివారు తమ దైవభావమునే విడచివేస్తున్నారు. ఈ జగత్తంతటిలో స్థిరమైనదంటూ ఏది ఎక్కడ ఉన్నది? అటు సూర్యభగవానుని చూడండి. అతడు తన కిరణములతో మాటిమాటికి రాత్రింబవళ్ళను కల్పిస్తూ సర్వభూతముల ఉత్పత్తి - వినాశనములకు 'సాక్షి' అయి దర్శిస్తున్నాడు. ఇంతలో క్రమక్రమంగా తాను కూడా కరిగిపోతూనే ఉన్నాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సహా ఈ జీవులందరు - నీరు బడబాగ్ని*లో ప్రవేశిస్తున్నట్లు - వినాశనము వైపునకే పయనించు చున్నారు. స్వర్గ-మర్త్య-పాతాళములు, వాయువు, ఆకాశము, భూమి, పర్వతములు, నదులు, దిక్కులు - ఇవన్నీ కూడా 'వినాశనము' అనే అగ్నికి ఎండుకట్టెలగుచున్నాయి.

"మేము అంతటివారము - ఇంతటివారము-మా జాతి గొప్పది" - ఇటువంటి పై పై పటాటోపాలన్నీ ఈ జీవుడు తలచుకొని మురిసిపోయేది 'మృత్యువు' అను రాక్షసుడు గుర్తుకు రానంతవరకే. మృత్యుభీతిగల మనుజునకు ధనధాన్యాదులు గాని, బంధుమిత్ర పరిజనంగాని, విభవములుగాని, ప్రీతిని, ప్రశాంతతను కలిగించగలవా? లేదు. ఇది ఇట్లుండగా, ఒక్క నిమిషంలో ధనవంతుడు 'దరిద్రుడు' అగుచున్నాడు. ఆరోగ్యవంతుడు రోగి అవుచున్నాడు. అశాశ్వతమగు ఈ జగత్తు అనుక్షణం భ్రాంతిని కల్పిస్తూనే ఉన్నది. దీనినంతటినీ చూచి విమోహితుడు కానివాడెవడో చెప్పండి? ఒకప్పుడు ఈ ఆకాశం కారుమేఘాలచే ఆక్రమించబడి, నలువైపుల చీకటి ఆవరించి ఉంటోంది. అదే ఆకాశం మరొకప్పుడు బంగారుకాంతులతో శోభిల్లుతోంది. ఇంకొకప్పుడు ప్రశాంత వాయు వీచికలచే నిండి ఉంటోంది. ఒకానొకప్పుడు బీభత్సధ్వనులతోను, ఉఱుములతోను, మెఱుపులతోను నిండి ఉంటోంది. కాసేపు మూగగా, మౌనంగా, ఇంకాసేపు అనేక సంరంభములతోను కనబడుతోంది. కొంతసేపు నక్షత్ర శోభితమై చంద్రకాంతులు విరజిమ్ముతూ ఉంటోంది. అదే విధంగా క్షణమొక రకంగా ఉండే ఈ జగత్తును చూచి భీతిల్లనివారంటూ ఎవరైనా ఉంటారా?

ఆపదః క్షణమాయాన్తి, క్షణమాయాన్తి సంపదః
క్షణం జన్మ , క్షణం మృత్యుః ! మునే ! కిమివ న క్షణమ్? (XXVIII-31)

ఓ మునీశ్వరా! క్షణంలో ఆపదలు వచ్చిపడుచున్నాయి. క్షణంలో సంపదలు చేరుతున్నాయి. క్షణంలో జన్మ. క్షణంలో మృత్యువు. ఆహా! ఈ ప్రపంచంలో క్షణికం కానిదేమిటో చెప్పండి? అయ్యో! భగవంతుడా! ఈ దృశ్య జగత్తులో కనిపిస్తున్న వస్తువులన్నీ కూడా ఇతఃపూర్వం ఒక విధంగా ఉన్నాయి. ఇప్పుడు ఒక విధంగా ఉంటున్నాయి. ఇకముందు ఇంకొకరకంగా ఉండ బోతున్నాయి. వీటిలో స్థిరము, ఏకము, సద్రూపము అయినట్టి వస్తువు ఒక్కటి కూడా లేదు కదా!

మట్టి 'ప్రత్తి చెట్టు' అగుచున్నది. ఆ వృక్షమునకు కాస్తున్న ప్రత్తికాయలు 'ప్రత్తి' అయి అటుపై 'వస్త్రము' అవుతోంది. ఆ వస్త్రము గర్వితములైన శరీరములను ఆచ్ఛాదించి కాలక్రమాన మట్టిలో కలిసిపోతోంది. చూచారా! 'మార్పు పొందని వస్తువు' అంటూ ఎక్కడా ఏదీలేదు. ఈ దేహాభిమానియగు జీవునిపట్ల "జన్మ - స్థితి - వృద్ధి - పరివర్తనము - అపక్షయము - వినాశనము" ఇవన్నీ రాత్రింబవళ్ళు నిరంతరం ప్రవర్తిస్తూనే ఉన్నాయి కదా! ఇది ఇట్లా ఉండగా ఇంకెన్నో చిత్ర విచిత్రాలు! బలహీనుడు బలవంతుని చంపుచున్నాడు. ఒక్కడు నూర్గురిని మట్టుపెట్టుచున్నాడు. నీచులు ప్రభువులు అగుచున్నారు. గొప్ప విచక్షణాజ్ఞానం, ప్రజ్ఞ కలవారు చేయునదే లేక నిస్సహాయులగు చున్నారు. జగత్తంతా పరివర్తనామయమే!

జలంలోంచి తరంగాలు లేస్తున్నాయి. ఆ తరంగాలు మరల ఎప్పుడో ఎక్కడో విపర్యయం పొందుతున్నాయి. చేతన స్వరూపులగు మనుష్యులు అచేతన పదార్థముల సంస్పర్శచే మార్పు చెందుచున్నారు. ఆలోచనలు, అభిప్రాయములు, క్షణంలో మారిపోతున్నాయి. బాల్యం

---

* సముద్ర మధ్యంలో బయలుదేరే అగ్నిపర్వతం

గతించిపోతోంది. యౌవనం వస్తోంది. ఆ యౌవనం కూడా గతించిపోయి ఎక్కడినుండో వార్ధక్యం వచ్చిపడుతోంది. ఈ శరీరము యొక్క గతే ఇట్లా ఉండగా, ఇక బాహ్యపదార్థముల, విషయముల మాట వేరే చెప్పేదేమున్నది?

క్షణమానందితామేతి క్షణమేతి విషాదితాం
క్షణం సౌమ్యత్వమాయాతి సర్వస్మిన్నటవన్మనః ॥ (XXVIII-38)

మహాత్మా! ఈ మనస్సు ఉంది చూచారూ! నవరసాలు పోషించే నటునిలాగా, వచ్చిపోతున్న ఆయా విషయాలపట్ల క్షణంలో ఆనందం, క్షణంలో విషాదం, క్షణంలో సుముఖత్వం, క్షణంలో విముఖత్వం ప్రదర్శిస్తోంది. ఆ విరించి (బ్రహ్మదేవుడు) అల్లరిచేసే చలాకీ పిల్లవానివలె హర్ష – విషాద – మోహములు కలుగచేయగల అనేక వస్తుజాలములను సంఘటనలను ఎడతెగకుండా, విసుగు – విరామం లేకుండా సృష్టించుకొంటూ పోతున్నాడు. అట్లు తాను సృష్టించుచున్న జీవులను రక్షించుకొంటూ ఇంతలోనే భక్షించి వేస్తున్నాడు. ఆయన చర్యలకు మోహితులైన ఈ జనులు రాత్రిం బవళ్ళు అనేక దుఃఖాలలో మునిగితేలుచున్నారేకాని స్వస్వరూపమును గ్రహించుటలేదు.

ఈ సంసార భాగస్వామ్యులగు జనులు వస్తున్నారు. పోతున్నారు. ఇక్కడ శాశ్వతమైనదంటూ ఏదీ లేకపోయినప్పటికీ వారి దుఃఖములకు మాత్రం అంతు ఉండటంలేదు. వాస్తవానికి వారి సంపదలు, ఆపదలు కూడా అస్థిరములేకదా! భగవంతుడా! విశ్వామిత్ర మహర్షీ! ఈ 'కాలము' అనునది అతి చమత్కారమైనది. అతి చతురులైన వారిని కూడా అది విచలితులను చేస్తోంది. అది ఆపదలలో ముంచి తేల్చని జనులంటూ ఎక్కడా లేరేమో? 'సంసారము' అనబడే మహావృక్షపు ఫలముల వంటి ఈ ముల్లోకములందలి జీవులు నిరంతరం నేల రాల్చబడుచున్నారు. మరల క్రొత్త ఫలములు కాస్తున్నాయి. అయితే, అందులో అతికొద్ది ఫలములు మాత్రం 'జ్ఞానము' అనే మధురాతిమధురమైన రసమును కలిగి ఉంటున్నాయి.

హే మహర్షీ! ఈ తతంగమంతా బాగానే ఉన్నదికాని, జీవునికి ఈ దుఃఖాదులు ఎక్కడి నుండి వస్తున్నాయి చెప్పండి? మేమంతా ఈ కాలస్వరూపుని చేతిలోని కీలు బొమ్మలం మాత్రమేనా? అయ్యో! జ్ఞానదృష్టిని, దూరదృష్టిని కలిగి లేకుండానే జీవించి వేస్తున్నామే? అందుచేతనే ముందు ముందు ప్రాప్తించబోయే స్థితిగతులను తలచు కొన్నప్పుడు దుఃఖమునే పొందుతున్నాం. మేము ఊరుకొన్నా, జన్మ మృత్యు జరావ్యాధులు మమ్ములను సమీపించక మానవు కదా! కనుక దూరదృష్టి లేకుండా, పిల్లి కళ్ళు మూసుకొని పాలు త్రాగినట్లు, శక్తియుక్తులను కలిగియున్న రోజులు ఇట్లా వృథా అగుచుండగా ఇక మాకు ఏ గతి పట్టబోతోంది?

❖❖❖

25. పదార్థ దోషములు

స్వామీ! ఈ మా చిత్తమును చూచారా! ఇది అనేక విషయములందు ఆసక్తి కలిగినదై అట్లు ప్రాప్తించిన దోషములచే ఘోరంగా దహించబడుతోంది. ఈ చిత్తము జీవునకు కలిగించబోయే దుష్టదశలను గ్రహించినవారికి ఇక భోగాభిలాషేమి ఉంటుంది చెప్పండి? “దోషములు – దుఃఖములు – నీచస్థితులు” వీటిని గమనించనివారికి మాత్రమే పదార్థాభిలాష ఉండటం జరుగుతుంది. ఈ పదార్థములలో ఉండే దోషములు వీటిని ఆశ్రయించే వారికి కూడా సంక్రమిస్తున్నాయి. వేపచెట్టును ఆశ్రయించినందుకు పూతీగ కూడా చేదును సంతరించుకొంటుంది కదా!

రోజులు గడుస్తున్నకొద్దీ, ఈ పదార్థములతో ఏర్పరచుకొన్న ‘సంబంధం’ కారణంగా మేము దుర్బలులమే అవుతున్నాం. ఈ సంసారములో నిమగ్నమగుటచే పూర్వ జన్మల నుండి తెచ్చిపెట్టుకొన్న కొద్దిపాటి మంచి కూడా అడుగంటుచున్నది. తండ్రీ! మహర్షీ! ఈ జగత్పదార్థములన్నీ ఎండిపోయిన మినపతీగ లాగా ఒకనాటికి నిశ్శబ్దంగా విరిగిపోయేవే కదా!

విచారించి చూస్తే ఈ రాజ్యాలు, ఈ భోగాలు, ఇవి కలుగచేయగల చింతలు అతి దుర్భరమైనవేనని నాకు అనిపిస్తోంది. అందుచేత, ఎట్టి చింతలు దరిచేరనట్టి ఏకాంతమును నేను కోరుకొంటున్నాను. ఈ ఉద్యానవనాలు, ఈ ధనాదులు, ఈ స్త్రీలు నన్ను ఉద్ధరించలేవని, ఉత్తమమైన – శాశ్వతమైన ఆనందమును ప్రసాదించలేవని నేను గ్రహించాను. నా మనస్సు ఇప్పుడు శాంతిని మాత్రమే పొందాలని కోరుకొంటోంది. కాని పదార్థచింతన, తృష్ణ త్యజించటం సులువైన విషయం కాదని అనిపిస్తోంది. ఈ పదార్థములందలి దోషము గ్రహించినప్పటికీ వీటిని జయించి వేయటం జ్ఞానదృష్టి, ఉత్తమ ప్రయత్నము ఉన్నవారికే సాధ్యమేమో! నా చిత్తము చాంచల్యము కలిగియున్నంత వరకు నన్ను రక్షించేవారు ఎవరు? నేను ఎట్లు శాంతిని పొందాలి?

నేను ఇప్పుడు జీవితమును కోరుకోవటం లేదు. మృతిని కూడా కోరుకొనుట లేదు. ఏది ఎట్లో, అది అట్లే ఉండుగాక. నిశ్చితుండనై, ఏమియు కోరుకోక, ఆసక్తి కలిగి ఉండక ఇట్లే ఉండదలచాను. ఈ రాజ్యములతో, భోగములతో, ధనములతో, ప్రయత్నములతో నాకు పనిలేదు. వీటన్నిటి మూలకారణం అహంకారమే కదా! అట్టి అహంకారమే త్యజించివేయదలచుకొన్న నాకు వీటితో ఏమి పని చెప్పండి?

లెక్కింప అలవికానంత సంఖ్యలో జీవులు ఈ భూమిపైకి వస్తున్నారు. కాని, ఏం లాభం? వారిలో అత్యధికుల యొక్క ఇంద్రియగ్రంథులు “పూర్వజన్మ వ్యవహారముల ప్రభావములు– పునః జన్మ పరంపరలు” అనే దిశల వైపుకే ఎక్కుపెట్టబడి ఉంటున్నాయి. అట్టి “పునర్జన్మ సంస్కారములు” అనే చిక్కుముడులను విడదీయుటకు ప్రయత్నించువారు మాత్రమే ధన్యులు. వారు మాత్రమే ప్రశంసాపాత్రులు.

ఏనుగు సమూహం నిష్కర్షగా తమ పాదములచే తామర తూండ్లను త్రెంచి వేస్తున్నట్లు అనేక తెలిసీ తెలియని వాంఛల సమూహముచే మా మనస్సులు హింసించ బడుచున్నాయి. కాబట్టి ఈ

శరీరంలో శక్తి యుక్తులుండగానే నిర్మలమైన బుద్ధియోగంతో మనస్సులకు చికిత్స చేసుకోకపోతే ఇంకెప్పుడు, ఎట్లా, ఎక్కడ వీలౌతుంది చెప్పండి? తండ్రీ! 'విషం' నిజానికి విషం కాదు. విషయములే నిజమైన విషం. ఎందుకంటారా? విషము మహా అయితే ఒక్క శరీరాన్ని మాత్రమే హరించగలదు. మరి విషయములో – జన్మ జన్మాంతరాలుగా ముక్తికి అడ్డుగా నిలచి వందల – వేలసార్లు మా ప్రాణములు తోడివేయగలవు.

❖

యజ్ఞచేతసులు : ఇదంతా ఇట్లా ఉన్నప్పటికీ ఈ జనులలో కొందరు మహాత్ములగు జ్ఞానులు మాత్రం సర్వదా ఈ దృశ్యముచే, ఈ ఇంద్రియములచే ఈ జీవిత సంఘటనలచే, ఏమాత్రం విచలితులుకాక, అచంచల మనస్కులై ఉంటున్నారు.

న సుఖాని న దుఃఖాని న మిత్రాని న బాంధవాః
న జీవితం న మరణం బంధాయజ్ఞస్య చేతసః ॥ (XXIX-14)

జ్ఞానదృష్టి కలవారి విషయములో ఈ సుఖదుఃఖములు కాని, ఈ బంధుమిత్రులు కాని, ఈ జీవన్మరణములుకాని ఏమాత్రం బంధకారణములు కాలేకపోతున్నాయి.

కార్యకారణ తత్త్వజ్ఞుడవగు ఓ మహాత్మా! మీ పాదములు స్పృశించి అర్థిస్తున్నాను. తత్త్వజ్ఞానమును పొంది మేము ఈ భయ శోకముల నుండి విడువడు మార్గమేదైనా ఉన్నదా? ఉంటే అది మాకు ఉపదేశించండి. ఈ అజ్ఞానారణ్యంలో మేము చిక్కుకున్నాం. ఇది అనేక వాసనా సమూహములచే మహాజటిలమై, దుః ఖకంటకములచే (ముళ్ళచే) ఆవృతమై అనేక ఎత్తుపల్లములు కల్గినదై, అతిభయంకరమై మమ్ములను ఎంతగానో క్షోభింపజేస్తోంది. ఓ మునీశ్వరా! పదునైన కత్తితో ఈ శరీరం కోయబడినప్పటికీ నేను సహించగలను. కాని, ఈ సంసారములోని ఆశలయొక్క విషయాకర్షణల కోతను మాత్రం నేను భరించలేకున్నాను. “ఇవి మాకున్నవి. అవి మాకు లేవు” అనునట్టి అజ్ఞాన వాయువీచికా పరంపరలు మా చిత్తములను దోషపూరితం చేస్తున్నాయి. ఈ అజ్ఞాన వ్రేటులను నిరోధించేదెట్లా?

హే మహాశయా! ఈ సంసార జీవులందరు 'తృష్ణ' అనే పొడవైన సూత్రపు త్రాడుకు గ్రుచ్చబడిన ముత్యములవంటివారు. సాక్షి స్వరూపమగు శుద్ధ చిత్తమే ఇందు మధ్య ఉన్న మణి. కాలుడు ఈ హారము ధరించి సర్వత్రా సంచరిస్తున్నాడు. మేము కామక్రోధాదులచే మా బంధములను మేమే కల్పించుకొని, అస్వతంత్రులమై కాలచక్రము నందు ఇరుక్కొని దిక్కుతోచక పరిభ్రమిస్తున్నాం.

అయినదేమో అయినది. ఇప్పటికైనా నిదురలేచి, సింహం బోనుయొక్క ఊచలను త్రెంచివేయునట్లు నేను వైరాగ్యాదులచే ఈ కామక్రోధాదులను త్రెంచివేయతలచాను. ఓ తత్త్వశ్రేష్ఠా! నేను మీ పాదపద్మములకు సాష్టాంగ ప్రణామం చేసి శరణు వేడుచున్నాను. నా హృదయారణ్యంలో దట్టంగా వ్యాపించియున్న అజ్ఞానాంధకారాన్ని, ఉత్తమ జ్ఞానమునకు సంబంధించిన సమాచారం చేత తొలగించి వేయండి. నాయందు జ్ఞానజ్యోతి వెలిగించండి. పరమసుఖదాయకుడగు పూర్ణచంద్రుడు

ఉదయించగానే చీకట్లు, ఆ చీకట్లో కనిపించే బేతాళాది వికారాలు తొలగిపోతాయి కదా! మీవంటి మహాత్ముల దర్శనం, ఆశ్రయం ఎన్నో జన్మల పుణ్యఫలితంగా కాని ప్రాప్తించునది కాదు. సత్సంగముచే నశించని జాడ్యము గాని, మనోవ్యాధి కాని ఏముంటుంది?

తండ్రీ! విశ్వామిత్రా! ఆకునుండి జాలువారు నీటిబొట్టువలె క్షణభంగురమైన ఈ ఆయువును గాని, చంచలములగు ఈ భోగములనుగాని, మోసపూరితములగు ఈ యౌవనాదులను గాని నేను నమ్మి కూర్చొనుటకు సిద్ధంగా లేను. స్వవిచారణచే వీటి 'అనిత్యత్వము'ను, ముందు ముందు ప్రాప్తింపజేయబోవు నీచస్థితులను ఇప్పుడే గ్రహించాను. నా ఉద్దేశంలో ఈ మానవజన్మ ఒకానొక ఉత్తమ అవకాశమే అయివున్నది. అందుచేత, తమవంటి తత్త్వజ్ఞులచే బోధింపబడుటకు నేను తగినవాడి ననుకొంటే మీ యొక్క బోధామృతం చేత నన్ను సముద్ధరించండి.

❖❖❖

26. ప్రయోజన కథనం

హే మహానుభావా! 'అనర్థవృత్తులు' అనే సంసార లంపటంలో, చిక్కుకున్న జనులను చూస్తుంటే నా మనస్సు భ్రమిస్తోంది. భయం వేస్తోంది. నా ఇంద్రియములు ఎండుటాకులవలె కంపిస్తున్నాయి. అల్పబలుడగు భర్తను పొందిన సౌందర్యవతి క్రూర జనులను చూచి భయపడుతుంది చూచారా? మా ఈ బుద్ధి కూడా – అల్పజ్ఞాన యుతమగుటచేత కాబోలు, – ఈ సంసారమును, చూచి కంపించిపోతోంది. ఏమాత్రం ధైర్య సంతోషాలు పొందలేకపోతోంది. పచ్చికపై గల ఆశతో లేడి పెద్దలోతైన గోతిలోపడి బైటకురాలేక ఎలుగెత్తి ఏడుస్తుంది చూచారా? ఈ మనస్సు తుచ్ఛమైన విషయాలకై పరుగెత్తి చివరకు దుఃఖమునందు కూలిపోతోంది. అవివేకమును నిరంతరం ఆశ్రయిస్తున్న ఈ మా చక్షురాది ఇంద్రియములు మమ్మల్నందరినీ అంధకూపములోనికి లాగివేస్తున్నాయి. అట్లు విషయములు, పదార్థముల పైపటాటోపాలు మమ్ములను బలవంతంగా వివశుల్ని చేస్తుంటే, మేమిక సత్పురుషులను ఆశ్రయించేది ఎన్నటికి? చింతలు చావవు. కోరుకొనే వాటికీ అంతు ఉండదు. లోనగల అసంతృప్తిని కప్పి పుచ్చుకొని "ఇప్పటికి ఈ ఈ వస్తువులు లభించుగాక" అని భావించి పిచ్చి పిచ్చి ప్రయత్నములందు నిమగ్నమౌతున్నాం. ఎవరెవరినో సమీపించి ఏదేదో అర్థిస్తున్నాం. ఏది పొందినా ఈ 'తృష్ణ' ఇట్లాగే ఉంటోంది. పొందినవాటియొక్క దుర్లక్షణానుభవం (Adverse effects) తొలగుటలేదు. ఓ జనులారా! ఇదంతా గమనించకుండానే పిల్లి పాలు త్రాగినట్లు ఆయువునంతా గడిపివేస్తున్నారా? ఎంతటి దౌర్భాగ్యం!

ఈ 'సంతోషము' అనునది కొన్ని వస్తువులు పొందుతున్నందుకు, కొన్ని పొందనందుకు అనుక్షణం క్రిందమీదగుచున్నది. చిత్త చాంచల్య కారణంగా కాబోలు, నాకీ సంసారంలో "ఇది సుఖకరమైనది" అనునదేదీ కించిత్ కూడా లభించటం లేదు. ఇది నన్ను సగం ఆక్రమించి, సగం ఆక్రమించక ఉన్నది. బాలుడు చీకట్లో మోడుబారిన చెట్టును చూచి భూతమనుకొని భ్రమించునట్లు ఆత్మనిశ్చయం పొందని నా మనస్సు అనేక భ్రమపరంపరలను మాత్రమే పొందుతోంది. అనేక

భోగవాంఛలు చిత్తమును ఇంకా పరిభ్రమింపచేయుటచే నేను దానిని నిశ్చయించుకొన్నట్లుగా (the way I decide) నియమించలేకయే పోతున్నాను. అది తన ఇష్టం వచ్చినట్లు దేశ ద్రిమ్మరివలె సంచరించుచునేయున్నది. దేవతలు వారి సంపదలను వీడలేకపోతున్నట్లు చిత్తము తన చంచలత్వమును ఎంతసేపటికీ పరిత్యజించుటయే లేదు.

అతోఽతుచ్ఛమ్, అనాయాసమ్ అనుపాధిగతభ్రమం
కింతత్ స్థితి పదం, సాధో! యత్ర శోకో నవిద్యతే ? (XXX-11)

ఓ సాధువర్యా! ఉత్తమము, సుస్థిరము, ఉపాధి వర్జితము భ్రాంతి – దుఃఖరహితము అయినట్టి ఉత్తమ పదమేదో నాకు చూపండి. "ఈ సంసార వ్యవహారములు, ఈ కర్మలు స్వతహాగా బంధకరములు కావు. అజ్ఞానమే అన్నిటికి మూలకారణం" అని పెద్దలు చెప్పగా విన్నాను. అయితే అది ఎట్లో నేను గ్రహించజాలకున్నాను. జనకుడు మొదలైన శ్రేష్ఠపురుషులు ఈ సంసారక్రియా వ్యవహారమందుండి కూడా జ్ఞానులై ఎట్లా ఉంటున్నారు? ఈ సంసారమున ఉంటూ కూడా దీనిచే స్పృశించబడకుండా ఉండేదెట్లా? ఏ దృష్టిని పొందినవారై మీవంటి జీవన్ముక్తులగు మహాత్ములు ఈ సంసార క్షేత్రంలో వ్యవహరిస్తున్నారో నాకు చెప్పండి.

ఈ విషయ సర్పములు కుటిలములు, భయప్రదములు, నశ్వరములు (నశించబోయేవి), నరక కారణములు కదా! ఇవన్నీ యథేచ్ఛగా సంచరించే ఈ సంసారం శుభప్రదమెట్లా అవుతుంది? ఏనుగు ప్రవేశించి, స్వచ్ఛము నిశ్చలము అయిన సరోవరమును కెలికివేయుచున్నట్లు మోహము అనుక్షణం ఈ బుద్ధిని చంచలీభూతం చేస్తోంది.

సంసార ఏవ నివహే జనోః వ్యవహరన్నపి
న బంధం కథమాప్నోతి, పద్మ పత్రే పయో యథా? (XXX-17)

ఈ సంసార వ్యవహారంలో ఉంటూ కూడా తామరాకును నీరు అంటనట్లు నిర్లిప్తుడై ఉండటానికి ఉపాయమేమిటి? ఈ కామాది దుర్వృత్తులచే స్పృశించబడక ఉన్నవాడనై ఉండేదెట్లా? ఈ జగత్తును బాహ్యదృష్టితో తృణప్రాయంగాను, అంతర్దృష్టికి ఆత్మవలె చూడగలిగేదెట్లా? ఈ అజ్ఞాన సముద్రం దాటటం మహాపురుషులకు మాత్రమే సాధ్యం కదా! అట్టి ఏ ఏ మహాపురుషుల ఆచరణను ఆశ్రయించటంచే జనులు దుఃఖ రహితులు, ప్రశాంతచిత్తులు కాగలరు? మేమిపుడు ఏ శ్రేయోదాయకమైన బాటలో పయనించాలి? ఏ ప్రయత్నములచే ఉత్తమఫలం ప్రాప్తిస్తుంది? అనేక అసంబద్ధము లతో కూడిన ఈ జగత్తులో ఏ జ్ఞానం, ఏ బోధ కలిగి చరించాలి?

ప్రభూ! బ్రహ్మచేత సృష్టించబడిన ఈ అశాశ్వత జగత్తు యొక్క పూర్వాపరములను తెలుసుకొనుటకు వీలైనట్టి తత్త్వోపదేశం నాకు ప్రసాదించండి. హృదయాకాశంలో ఉన్న చైతన్య చంద్రుని మచ్చ తొలగిపోవాలి. ఇదే ఇప్పుడు నా ఏకైక ఆశయం. అందుకుగాను ఈ ప్రపంచంలో మేము స్వీకరించతగ్గదేది? త్యజించతగ్గదేది? ఈ రెండూ కానిదేది? ఈ చంచల చిత్తమును పర్వతమువలె స్థిరమొనర్చ గలిగేదేది? ఈ సంసార విషూచి వ్యాధి ఎన్నెన్ని బాధలు, వికారాలు,

విహ్వాలతలు కలిగియున్నదో చెప్పనలవికాదు. ఈ వ్యాధి ఏ పావన మంత్రముచే తొలగగలదు? హృదయంలో శీతలత్వము, పూర్ణత్వము, పరమశాంతి ప్రతిష్ఠింపబడేదెట్లా?

హే మహానుభావా! విశ్వామిత్ర మహర్షీ ! మీరు తత్త్వజ్ఞులు. అంతేకాదు. శరణన్న వారిని రక్షించటంలో మీ అంతటివారు లేరని లోకప్రతీతి. ఇప్పుడు మిమ్ములను వినమ్రతతో శరణు వేడుచున్నాను. నేను పూర్ణత్వము పొంది మరల దుఃఖము పొందనట్టి ఉపాయం, ఉపదేశించండి. అల్పజీవులను వారి ఉచ్ఛ్వాస – నిశ్వాసలే బాధిస్తాయి! ఆత్యంతిక విశ్రాంతి పొందనంతవరకు మా చిత్తవృత్తులు, మా కల్పనలు, మా భావాభావములు, మేము నమ్మికొన్న విలువలే మమ్ములను వేధిస్తూ ఉంటాయి. కనుక మీ బోధతో మమ్ములను ప్రక్షాళనం చెయ్యండి.

❖❖❖

27. రాఘవ ప్రశ్న

ఓ మహానుభావా! దీర్ఘాయువుగాని, ఈ శరీర స్థితిగాని ఈ బంధుమిత్ర సమాగమాలు గాని నిజంగా ఈ జీవుని ఉద్ధరించగలవా? కోర్కెలు అంతూపొంతూ లేకుండా మమ్ములను 'సుడిగాలి'లా చుట్టివేస్తుంటే అవన్నీ మాకు బంధమునే కలిగిస్తున్నాయి. మోహ మేఘములు గర్జిస్తూ పిడుగులు రాలుస్తుంటే 'దురాశలు' అనే మెఱుపులు మెఱిసి మమ్ములను గ్రుడ్డివాళ్ళను చేస్తున్నాయి. లోభము మమ్ములను పట్టి పీడిస్తూ మా నరనరములందలి శక్తిని పీల్చివేస్తోంది. క్షణక్షణం అనేక అనర్థాలు వచ్చి మా ముంగిట వ్రాలుచున్నాయి. మా సుకృత దుష్కృతాలు మమ్ములను అనేక లోకములలో త్రిప్పుచున్నాయి. కృతాంతుడు (కర్మల ఫలితములను ప్రసాదించు కార్యకారణ తత్త్వము) అనే పిల్లి 'జీవులు' అనే ఎలుకలను పట్టడానికి కన్నం వద్ద వేచియున్నాడు. జలప్రవాహ పతితులైనట్లు ఈ జీవులు ఎక్కడి నుండో వస్తున్నారు. ఇక్కడ పతనం పొందుచున్నారు. స్వామీ! ఈ స్థితిలో మాకు ఉపాయమేది? గతి ఏది? దేనిని చింతించాలి? దేనిని ఆశ్రయించాలి? ఈ జీవితారణ్యం శుభప్రదమయ్యేదెట్లా?

మీ వంటి మహాత్ములకు ఇచ్ఛ కలిగింపజేసి రమింపజేయగల వస్తువేదీ ఈ మూడు లోకాలలో ఎక్కడా లేదు. మా విషయం అట్లాలేదు. మేము అత్యంత స్వల్పము, నశ్వరము అయిన విషయములకు కూడా దాసానుదాసులమౌతున్నాం. ఈ పాడు సంసారం మాకు నిరంతరం పీడనే కలిగిస్తోంది. ఇదంతా మోహరహితమైన దృష్టిచే మాచే చూడబడేదెట్లా? జ్ఞానము, సంతృప్తి సంపాదిస్తే కాని ఇదంతా సుకరం కాజాలదు. కామ కళంకితమైన మా మనస్సులు ఏ ఉపాయం అవలంబిస్తే తద్వారా మనస్సు – దృశ్యము అమృత కళలతో ప్రకాశించగలవు?

ఐహిక – ఆముష్మిక ఫలాశలను త్యజించి ఈ సంసారగతిని తెలుసుకొన్నవాడే 'మానవుడు' అని అనిపించుకోగలుగుతాడు. అట్టి ఏ ఏ మహాపురుషులను అనుసరించి మేమీ సంసారారణ్యంలో

చరించాలి? ఏం చేస్తే సంసారమందున్న మనుజుడు రాగద్వేషాత్మకములైన భోగేచ్ఛాసమూహములచే పీడించబడకుండా ఉండగలడు? రసమయమగు పాదరసం అగ్నిలోపడ్డా దహించబడదు కదా! మనుజుడు ఈ సంసారాగ్నిలో పడికూడా తపించకుండా ఉండ కలిగే ఉపాయమేది?

సముద్రంలో పడితే తడవకుండా ఉండగలమా? ఈ సంసారంలో పడి ఇందు దొర్లుచున్న మావంటివారి మనస్సులు ఇందలి పదార్థములచే ఆకర్షణ – వికర్షణలు పొందకపోవటం సాధ్యమయ్యే పనేనా? రాగద్వేషములు, సుఖదుఃఖములు లేనట్టి సత్క్రియలంటూ ఈ ప్రపంచంలో ఉన్నాయా?

తండ్రీ! మలిన భూయిష్ఠమైన ఈ మనస్సుపైననే ఈ జగత్తు యొక్క అస్థిత్వము ఆధారపడి ఉన్నది. అట్టి ఈ మనస్సు తత్త్వబోధచేత కానీ ప్రక్షాళనం కాదు. అందుచేత నాకు తత్త్వబోధయుక్తమైన వాక్యములను ఉపదేశించండి. ఎట్టి యోగము అవధరించటంచే కర్మలు ఒనర్చినను, లేక ఒనర్చకున్నను దుఃఖము యొక్క ఛాయ కూడా ఉండదో, అట్టి సద్వస్తువు గురించి ఉపదేశించండి. ఎట్లు ఆచరిస్తే ఈ మనస్సు పరమపవిత్రమౌతుందో, నాకు పరమశాంతి లభిస్తుందో – అట్టి ఉత్తమ ఆచరణ గురించి ఆజ్ఞాపించండి. అట్టి ఉత్తమ కార్యక్రమం ఇతఃపూర్వం ఎవరెవరు ఆచరించి ఆత్మోన్నతి పొందారో అట్టి వారి కథనం నాకు వినిపించండి. ఓ భగవంతుడవగు విశ్వామిత్రా! అట్టి మహనీయులుగా కొనియాడబడేవాళ్ళు ఎట్లు బ్రహ్మ వస్తువు గ్రహించారు? ఎట్లెట్లు విచారణ చేశారు? వారికి ఏ సాధనలచే మోహ నివృత్తి, దుఃఖముల ఉపశాంతి ప్రాప్తించాయి?

ఓ మునిసత్తమా ఒక్క మాట మాత్రం విన్నవించుకొంటున్నాను. అట్టి ఉపదేశ వాక్యాలు ఉంటే ఉండి ఉండవచ్చు. లేక ఉండి ఉండకపోవచ్చు. నాకెవరైనా చెప్పవచ్చు. లేక చెప్పుటకు సిద్ధపడకపోవచ్చు. నేనిప్పుడు ఒక నిర్ణయానికి వచ్చాను. అహంకారంతో సహా అన్ని కోర్కెలను పరిత్యజించి వేస్తాను. ఈ భోజన పానాదులు కూడా నాకక్కర్లేదు. వస్త్రధారణ, స్నానాదులను కూడా వదలివేస్తాను. ఇక ఆపదలు రానివ్వండి. లేక సంపదలు రానివ్వండి. క్రమంగా హస్త పాదాదులతో కూడిన ఈ శరీరం కృశించినా, లేక నశించినా, అందుకు నేను సిద్ధంగా ఉన్నాను. సర్వ సందేహములను, అహంకారమును, అసూయను పరిత్యజించి కేవలం మౌనం వహిస్తాను. ఒక స్థాణువులాగా, బొమ్మలాగా ఉండిపోతాను. క్రమంగా శ్వాసలను, జ్ఞానమును కూడా వదలివేస్తాను. సర్వ అనర్థములకు కారణమైన ఈ శరీరమునకు ఏది అవ్వాలో అట్లే అగుగాక. ఈ దేహము నాది కాదు. నేను నా దేహమునకు చెందినవాడను కాను. ఇతర దేహులు కూడా నా వారు కారు. నేను వారికి చెందినవాడిని కాను. అందుచేత అన్నిటినీ పరిత్యజించివేస్తాను. చమురులేని దీపంలాగా ఈ దేహము శుష్కించి లయించినప్పటికీ ఇందువలన నేను క్రొత్తగా పొందునదిగాని, కోల్పోవునదిగాని ఏమీ ఉండదు. దేని పర్యవసానమెట్లుంటే అట్లే అగుగాక!

రామచంద్రుడు ఈ విధంగా మనోమోహమును నశింపజేసే వాక్యాలు పలికి మౌనం వహించాడు. అవి విన్న అక్కడి సభికులందరు ఆశ్చర్యానందములతో పులకిత శరీరులయ్యారు. అప్పుడు జనించిన వైరాగ్యవాసనలచే అక్కడివారికి సంసారము పట్లగల అజ్ఞానముతో కూడిన

ప్రియత్వం శమించింది. వసిష్ఠ-విశ్వమిత్రాది ఋషులు పరమానందమొందారు. నారదాది మహాప్రాజ్ఞులు రాముని వాక్యములలోని విచిత్రార్థమును గ్రహించి ఉత్తేజితులయ్యారు. సిద్ధులు పుష్పవర్షం కురిపిస్తూ తమలో తాము ఇట్లు సంభాషించుకొన్నారు.

❖❖❖

సిద్ధులు : ఆహా! ఈనాడెంత సుదినం! కల్పారంభం నుండి ఇప్పటిదాకా మనం మూడు లోకాలలో సంచరిస్తున్నాం. కాని ఇంతవరకు ఇంతటి అమృతమయ వాక్యాలు ఎప్పుడైనా విన్నామా? బృహస్పతి కూడా ఇంతటి వైరాగ్యవాక్యాలు పలుకలేదేమో! నేటికి కదా మన జన్మలు ధన్యమైనాయి. ఈ వచనాలు విన్నంత మాత్రంచేతనే మనమంతా ఎంతో ఉద్బోధించబడ్డాం. ఆహా! రఘురాముడు పలికిన ఈ ఉత్తమ ప్రశ్నలకు మహర్షులు ఏమి సమాధానమిస్తారో విని తీరాల్సిందే. ఓ సర్వ మునీంద్రులారా! రండి! మనం ఈ దశరథుని సభలో ప్రవేశిద్దాం.

❖

అప్పుడు కమండలధారులగు అనేకమంది ఋషి పుంగవులు సభలో ప్రవేశించారు. మహారాజులేచి వారందరిని ఆహ్వానించి ఉచితాసనములను ప్రదానం చేశారు. వేద-వేదాంగులగు తత్త్వవేత్తలు అక్కడ ఉపవిష్టులవటంతో ఆ సభ ఇంద్రసభను మించిపోయింది. ఆహ్వానితులగు మునులు ఇట్లు శ్లాఘించారు.

ఆహా! మన రామచంద్రుడు వైరాగ్య పూర్ణములు, జ్ఞానప్రబోధకములు, శుభ ప్రదములు అయిన వాక్యాలు పలికాడు. ఇతడు, పలికినవన్నీ అత్యంత విచార యుతములు, సుస్పష్టములు, విశుద్ధములు, సంతోషదాయకములు కూడా! ఇతని మాటలు విని ఆశ్చర్యపడనివారెవరు? ఎక్కడోగాని ఇంతటి సర్వోత్కృష్టములు, సుందరములు, సువ్యక్తములు అయిన వాక్యాలు వినిపించవు. ఎవరి హృదయంలో ఇంతటి ప్రజ్ఞా సుగంధం గల వివేక పుష్పం వికసిస్తుందో అట్టివాడే 'పురుషుడు' అని అనిపించుకొంటాడు. ఈ లోకంలోకి అనేకులు వస్తున్నారు. వారిలో చాలామంది విషయలోలుత్వం ఆశ్రయించినవారై కేవలం రక్తమాంసమయ నిర్మితమగు యంత్రములు మాత్రమే అయివుంటున్నారు. వారియందు ప్రజ్ఞచే ఉద్దీపించు పరిశీలన లేకుండటచే జడమాత్రులే అగుచున్నారు. పురుషార్థముకొరకు, లక్ష్యశుద్ధిలేని వారి జీవితములు వ్యర్థములే కదా! "మేమెందుకు జరామరణ దుఃఖాదులచే వేధింపబడుచున్నాం? ఈ సంసారమనగా ఏమి?" అనునట్టి సారభూతమగు ప్రశ్నలు రాముని వాక్యములచే ఉదయింపజేయబడుచున్నాయి. పూర్వాపరవిచారము సల్పునట్టి నిర్మలాశయుడగు పురుషుడు మనకీరోజు రామచంద్రుని రూపములో లభించటం మనందరి పూర్వసుకృత ఫలమే. ఇంతటి తత్త్వసాక్షాత్కారత్వం ప్రకటించ గలగటం అత్యంత అరుదైన విషయం.

ఆహా! మాన్యుడు, మనీషియగు ఇతడు ఇంత చిన్న వయస్సులో ఎంతటి ఆత్మ వివేక మాధుర్యమును అనుభవమునకు తెచ్చుకొన్నాడు! ఇతడు జగత్స్వరూపమంతా చక్కగా గ్రహించియున్నాడు. ఓ జనులారా! ఎక్కడోగాని లభించనట్టి చందన, లవంగ వృక్షమువలె మనకీతడు ఈనాడిక్కడ లభించాడు. మీరంతా ఇతని మహద్వాణిని విన్నారుకదా! ఈ కుఱ్ఱవాడు చెప్పినట్లు

"అతి క్రూరమగు దైవదృష్టియా?" అన్నట్లున్న ఈ పాడు సంసారములో సారమును గాంచటం చాలా కష్టతరమైన విషయమే. ఎవ్వరైతే ఇక్కడ ఆత్మ వస్తువును పొందటానికి ప్రయత్నిస్తారో వారు మాత్రమే ధన్యులు. వారే అగ్రగణ్యులు. వారే పురుషోత్తములు.

రామచంద్రుని వంటి మహావివేకి-విచక్షణాజ్ఞాని ఇంతకుముందు కాని, ఇకముందు గాని అలభ్యుడనే మా అభిప్రాయం. ఇప్పుడీ రామచంద్రుని వచనములకు సరి అయిన సమాధానమిచ్చి ఇతని అభిమతం సిద్ధింపచేయకపోతే, మాకు మునులు-ఋషులు మొదలైన నామధేయములు వ్యర్థమే అవుతాయి.

ఈ శ్రీరాముడు తత్త్వవిచారణచే పూర్ణత్వము అనుభవించుటకు సర్వవిధముల తగినవాడై ఉన్నాడు.(రామయ్యా! ఇది కదయ్యా, నీ అవతార విశేషం!)

❖❖❖

వైరాగ్య ప్రకరణం సమాప్తం

బ్రహ్మార్పణమస్తు - లోక కళ్యాణమస్తు

ఓం తత్సత్

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

II. ముముక్షు వ్యవహార ప్రకరణం

ముముక్షు వ్యవహార ప్రకరణం

- ముముక్షువు అనగా ఎవరు? ప్రయత్నము - ప్రయత్నరాహిత్యముల స్థితి-గతులు ఎట్టివి? ఈ మానవుని, దోషపూరితమైన ప్రయత్నములందు నియమిస్తున్నది ఎవరు? వివేక-అవివేకములు ఎట్లు ప్రవర్తిస్తున్నాయి? వివేకము వికసించాలంటే మార్గాలు ఏమిటి? ఈ జీవుని వాస్తవ స్వరూపము ఏమిటి? సాధన - విచారణముల ప్రాశస్త్యమేమిటి? జీవుడు మోక్ష స్వరూపుడు అగుట ఎట్లు? ఈ మొదలైన విషయాలన్నీ ఈ ప్రకరణంలో చర్చించబడ్డాయి.
- శిష్యుడు ఏ దృష్టి కలిగియుండి ఈ శాస్త్రంలోని బోధ వినుటకు సిద్ధంగా ఉండాలో, శ్రీ వసిష్ఠ మహర్షి చర్చించారు. ఈ శాస్త్రము యొక్క లక్ష్యమేమిటో కూడా చెప్పారు.
- జీవుని 'పూర్ణుడు'గా తీర్చిదిద్దటమే ఈ శాస్త్రము యొక్క ఏకైక లక్ష్యము కదా! అతనిని స్వతంత్ర, యత్నశీలునిగా చేయుటకుగాను, "దైవము" అనబడు బాహ్యమగు వస్తువు అతనికి ఏదీ ప్రసాదించుటలేదని నిరూపించబడినది. జీవుని స్వకీయ యత్నములే జ్ఞానాజ్ఞానములకు కారణములగుచున్నాయి.

ఈ ప్రకరణం పాఠకుని సదాచారము - వివేకపూర్వక విచారణలకు సిద్ధం చేస్తోంది.

1. శ్రీ శుక విశ్రాంతి

శ్రీరామచంద్రుని వివేక, వైరాగ్య పూరితమైన వాక్యాలు సభలోని వారందరి హృదయాలు పులకింపచేశాయి. అనేక మంది సిద్ధులు, మునులు, ఆ సభలో ప్రవేశించారు. వారందరు ఉచితరీతిన సత్కరింపబడినవారై సభలో ఆశీనులయ్యారు. అంతటా మరల ప్రశాంత వాతావరణం అలముకొన్నది. శ్రీ విశ్వామిత్ర మహర్షి రాముని ఉద్దేశించి మధురస్వరంతో పలుకనారంభించారు.

శ్రీ విశ్వామిత్ర మహర్షి : ఓ రాఘవా! నీవు పరమ పవిత్రమైన సత్యమునే పలికావు. నీ సూక్ష్మబుద్ధిచే గ్రహించవలసినదంతా చక్కగా గ్రహించావు. వాస్తవానికి నీవు క్రొత్తగా ఎరుగవలసినదంటూ ఏదీ లేదు. అయితే, సహజ నిర్మలమగు నీ బుద్ధికి కొంచెము మెరుపు మాత్రం అవసరమై ఉన్నది. ఈ సందర్భంలో ఇతఃపూర్వపు ఒక సంఘటన నాకు గుర్తుకు వస్తోంది. శ్రీ వ్యాస మహర్షి కుమారుడు 'శుకుడు' అనువాని విషయంలో ఇటువంటిదే... ఒకానొక సంఘటన జరిగింది. అతడు కూడా నీవలెనే తెలుసుకోవలసినదంతా తెలుసుకున్నప్పటికీ, జనక మహరాజుచే బోధింపబడిన తరువాతనే ఆత్మయందు విశ్రమించాడు. నీకు మొట్టమొదటగా, శుభదాయకమగు ఆ శుక మహర్షి వృత్తాంతం చెపుతాను విను.

❖

ఓ రామచంద్రా! అటు చూడు. నీ తండ్రి సింహాసనం ప్రక్కనే, సూర్య తేజస్సుతో వెలుగుచు, ఆసీనుడై ఉన్న ... ఆయనే, వ్యాసమహర్షి. ఆయన కుమారుడే శుకుడు. సౌందర్యరాశి వంటి ఆ శుకుడు జన్మతః మహాప్రాజ్ఞుడు. యువకుడగు అతడు ఒకప్పుడు ఒక ఏకాంత ప్రదేశం చేరాడు. ప్రశాంతచిత్తుడై, పద్మాసనము వైచుకొని, ఈ సంసారము యొక్క గతి గురించి, ఇందలి మాలిన్యము గురించి చింతించసాగాడు. అట్లు విమర్శనా పూర్వకంగా విచారించుచు ఉండగా కొంతకాలానికి అతని మనస్సునందు ఉత్తమోత్తమమైన 'వివేకం' ఉదయించింది. మహాబుద్ధిమంతుడు అగుటచే నిజబుద్ధి బలంచేత, చిరకాల విచారణచే అతడు అకృత్రిమము, సహజము, సుందరము, సత్యము అయిన "ఆత్మస్థితి యొక్క ఆనందానుభవం" గ్రహించాడు.

అట్లు తనంతట తానే సత్య వస్తువును ఎరిగినప్పటికీ అతని మనస్సు మాత్రం పూర్ణమగు శాంతిని పొందలేదు. "నేను గ్రహించినదే సత్యమా? జీవుడనగు నేను వస్తుతః పరిశుద్ధమగు పరమాత్మనే అయివున్నానా?" అనునట్టి కించిత్ శంక ఇంకా అతనిని వదలలేదు. ఫలితంగా సంసార దుఃఖం ఉండనే ఉన్నది. అతని సుస్థిర చిత్తము క్షణభంగురములగు సర్వ సంసార విషయముల నుండి విడివడింది. అనగా రంగం సిద్ధమైనది. కాని అతడు ఉత్తమ శాంతిని పొందవలసి ఉన్నది. అప్పుడాతడు ధ్యానము చాలించి, తండ్రియగు వ్యాసమహర్షిని సమీపించి, ప్రణామంచేసి ఇట్లు ప్రశ్నించాడు: "స్వతఃగా ఆత్మ స్వరూపుడనగు నాయందు ఈ సంసారాడంబరమంతా ఎట్లా ఉదయించింది? 'సంసారము' అని చెప్పబడుచున్నదంతా ఇంతకాలం కల్పించుచున్నవారెవరు? ఈ

ఉపాధియందున్న నేను అఖండుడనై నిత్యుడనై ఉన్నమాట వాస్తవమేనా? నాకున్న శంకను తొలగించండి." ఆత్మజ్ఞానియగు వ్యాసుడు పుత్రుని ప్రశ్న విని నిర్మల భావంతో యథోచితంగా అనేక శాస్త్ర, లౌకిక యుక్తులతో జీవుని వాస్తవ స్వరూపము వివరించాడు. కాని, శుకుడు, "నా తండ్రి చెపుతున్న ఈ విశేషములన్నీ నేను ఇంతకు ముందే గ్రహించాను కదా!" అని అనుకోసాగాడు. కుమారుడు తన వివరణ పట్ల నిరాదరణపూర్వకంగా ఉండటం గమనించి వ్యాసుడు, "నాయనా! శుకా! నేను గ్రహించియున్నదంతా చెప్పాను. నేను ఇంతకన్నా ఎక్కువ ఎరుగను. మిథిలానగర రాజు 'జనకుడు' అను అతడు నాకన్నా కూడా ఉత్తమమైన జ్ఞాని. నీవు వెళ్ళి ఆయనను శరణు వేడు. ఆయన వద్ద నీవు తెలుసుకొనదలచినది తెలుసుకోగలవు" అని చెప్పి మౌనం వహించారు. శుకదేవుడు తండ్రి పాదాలకు నమస్కరించి, సెలవు తీసుకొని, మిథిలానగరం బయలుదేరాడు.

❖

ద్వారము వద్ద వచ్చి వేచియున్న శుకదేవుని, రాజాంతఃపురములోని ఒక ద్వార పాలకుడు గమనించాడు. వివరాలు తెలుసుకొని జనకమహారాజుకు నివేదించాడు. అప్పుడు జనకుడు ఒక్క క్షణం యోచించి, "సరే. వస్తే రానీ! ఇప్పుడు సమయం లేదు. అనేక రాచకార్యక్రమములలో ఉన్నాను" అని సేవకుణ్ణి పంపివేశాడు. ఏడు రోజులు గడచిపోయాయి. శుకుడు ద్వారం వద్దనే వేచియున్నాడు. అప్పుడు రాజు ఒక భటుని పిలచి "ఓయీ! నీవు పోయి 'శుకుడు' అను ద్వారంవద్ద వేచియున్న మునికి బసకొరకు మన నగరంలోని ఏదైనా వసతి గృహం చూపించు. రాచకార్యముల వత్తిడి వలన మరొక వారం రోజుల వరకు రాజదర్శనం లభించదని చెప్పు" అని ఆజ్ఞాపించాడు. ఒక విశ్రాంతి గృహంలో ఆయనకు బస చూపించబడింది. మరొక ఏడు రోజులు గడచిపోయాయి. శుకుడు ఏమాత్రమూ ఉద్వేగంలేక అట్లే వేచియున్నాడు. వార్తాహరుల ద్వారా అంతా గ్రహించిన జనకుడు అతనిని మరికొంత పరీక్షించాలనుకొన్నాడు.

అప్పుడు అంతఃపురంలోని ఒక విలాసవంతమైన గదిలో శుకునకు బస ఏర్పాటు చేయబడింది. ఆకర్షణీయమైన పదార్థములు, భోజన పానములు అమర్చబడ్డాయి. మదమత్తులైన స్త్రీలు అతనిని సేవించుటకు నియోగించబడ్డారు. శుకుడు ఆ అంతఃపురంలో కూడా స్థిరచిత్తుడై, మౌనం వహించియున్నాడు. పిల్లగాలులు మఱ్ఱి వృక్షపు కాండమును కదల్చగలవా? దుఃఖ స్వరూపములే అయివున్న అక్కడి భాగ్యవస్తువులు, సపర్యలు, వందిమాగధ వచనములు,సుందర స్త్రీల సరస–సల్లాపములు అతని మనస్సుకు ఏమాత్రం ఆకర్షితంగా అనిపించలేదు.

ఈ విధంగా ఇంకొక ఏడు రోజులు గడచిపోయాయి. శ్రీ శుకదేవుని చెక్కుచెదరని ప్రశాంత స్థితిని గురించి తెలుసుకొన్న జనకుడు చాలా సంతోషించాడు. స్వయముగా వెళ్ళి శుకదేవుని సభా మధ్యమునకు ఆహ్వానించి పూజించాడు.

శ్రీ జనక మహారాజు : ఓ శుకదేవా! ఇప్పుడు మీ స్వభావమేమిటో గ్రహించాను. నేను మహదానందం పొందాను. ఈ జగత్తులో ఉంటూనే జీవుడు ఏ విధంగా ప్రవర్తించటం ఉచితమో మీరు అట్లే

ప్రవర్తించారు. నాకు చాలా సంతోషంగా ఉన్నదయ్యా! ఇప్పుడు చెప్పండి. మీరు ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారు?

శ్రీ శుకుడు : గురువర్యా! నన్నొక సందేహం పట్టి పీడిస్తోంది. ఈ జీవుడు ఎవరు? అఖండమగు పరమాత్మయే ఇతడై ఉంటే, మరి "నేను ఈ శరీర పరిమితుడను, నానుండి తదితరులు వేరైనవారు, నేను శ్రమించి మోక్షము పొందవలసి ఉన్నది" ఇటువంటి ఏకానేక రూపములైన చాంచల్యమంతా ఎట్లు ఎందుకు ప్రాప్తిస్తోంది?

అప్పుడు జనకుడు ఈ సంసారము యొక్క వాస్తవ – అవాస్తవముల గురించి పూసగ్రుచ్చినట్లు అంతా వివరించాడు.

శ్రీశుకుడు : హే మహావక్తా! మీరీ విషయములన్నీ ఉన్నది ఉన్నట్లు వివరించినందుకు కృతజ్ఞుడను. అయితే వివేకబలంచేత ఈ విషయాలన్నీ ఇదివరకే గ్రహించాను. (ఉపనిషత్తులు మొదలైన) శాస్త్రాలు ఈ విషయమే చెప్పుచున్నట్లు తెలుసుకొన్నాను. నా తండ్రి కూడా "నిస్సారమగు ఈ సంసారమంతా అజ్ఞానము నుండే వెలువడుచున్నది. అజ్ఞానము తొలగగా, ఈ జీవుడు స్వతహాగా నిత్యుడై, ఆనందమయుడై, పరమేశ్వరుడై ప్రకాశిస్తాడు" అని చెప్పియున్నారు.

మీరు చెప్పినట్లు "జీవుడు జ్ఞానముచే లేక అజ్ఞానము తొలగుటచే బ్రహ్మము అగును" అనే విషయం నా కర్థమగుచున్నది. కాని స్వామీ! "అజ్ఞానము తొలగుట" అనగా ఏమో నాకు సుస్పష్టమైనట్లు లేదు. "నాయందు అజ్ఞానము తొలగినది" అనుటకు గుర్తు ఏది? అట్టి స్థితి ఎప్పటికి లభిస్తుంది? నాకు అఖండత్వము యొక్క అనుభవం ఇంకను లభించలేదేమి? బ్రహ్మమే నేనైతే, మరి ఈ 'జీవుడను' అనేది ఎందుకు నాపట్ల ఏర్పడిఉన్నది?

శ్రీ జనకుడు : మునీశ్వరా! సత్యవస్తువగు బ్రహ్మమును మీరు స్వయముగానే స్వవిచారముచే సుస్పష్టంగా గ్రహించారు. ఆపై మీ తండ్రిగారివద్ద సవివరంగా విన్నారు. మీరు గ్రహించినదే బ్రహ్మతత్వము. ఇక మీరు తెలుసుకోవలసినదంటూ వేరే ఏమీ లేదు.

"బ్రహ్మతత్వము గ్రహించాను" అని మీరు నిరభ్యంతరంగా భావించవచ్చు. ఎందుకంటారా? మీ దృష్టిలో దృశ్య పదార్థజాలమంతా అవాస్తవము అయి ఉండుట చేతనే ఈ నగరంలో ఇరువది ఒక్క రోజులు నిర్లిప్తులై ఎట్టి వికారములకు లోను కాకుండా ఉన్నారు. సమృద్ధి – అసమృద్ధులు గాని, మానావమానములు గాని మిమ్ములను స్పృశించలేదు కదా! మీచే దృశ్యము త్యజించబడినట్లే అయినది.

ఈ విధంగా దృశ్యము తిరస్కరించబడగా, అప్పుడు శేషించు "శుద్ధము, అనిర్వచనీయము" అగు స్వస్వరూపమే పరబ్రహ్మముగా వేదజ్ఞులచే ప్రవచించబడినదని గ్రహించండి. ఓ మహర్షీ! అఖండ, నిత్యోదిత చైతన్య స్వరూపుడు, అద్వితీయుడు అగు ఆ ఆత్మ పురుషునికి ఒక్కనికే ఈ జగత్తునందు అస్థిత్వమున్నది. ఇక తక్కినవన్నీ కల్పనా మాత్రములే. అజ్ఞానయుతములగు సంస్కారముల వలననే "నేను, నీవు, పదార్థములు, శుద్ధబ్రహ్మము – ఇవి వేరువేరు" అను

భ్రమలు కలుగుచున్నాయి. ఆ భావనలే క్రమక్రమంగా స్వస్వరూపమగు ఆత్మతత్త్వమును బంధింపబడిన దానివలె అగుపింపచేస్తున్నాయి. అట్టి బంధము యొక్క అనుభవము ఉన్న వానిని మనం 'జీవుడు' అంటున్నాం. ఆ జీవుడు అజ్ఞానము నశించినపుడు ముక్తుడై స్వస్వరూపమగు ఆత్మగా శేషించుచున్నాడు. లేక, బ్రహ్మమే తానగుచున్నాడు.

మహాత్మా! మీరు ఈ భోగములపట్ల, ఈ సర్వదృశ్య వ్యవహారముల పట్ల, "ఇదంతా ఏమాత్రం సత్యము కాదు" అను సుస్థిరమైన బుద్ధి కలిగియున్నారని మీ ప్రవర్తచే నిరూపించారు. "ఇక తేజోమయమగు ఆత్మనే నేను" అని గ్రహించుటకు అడ్డేమున్నది చెప్పండి? ఎరుగవలసినది ఎరిగినప్పుడు మాత్రమే అకృత్రిమమగు 'విరాగము' ప్రకటితమౌతుంది. అట్లు నిస్సంగత్వం ప్రకటించి మీరు మహావీరులు అయ్యారు. శాస్త్రములచే బోధింపబడు అనేక విధి-విధానములు, వైదిక వ్యవహారములు జీవునకు అనాసక్త-బుద్ధిని నేర్పుటకే ఉన్నాయి. అట్టి 'అనాసక్తి'ని మీరు ఇప్పటికే సాధించారు. ఇక మీకు చెప్పవలసినదిగాని, మీరు వినవలసినదిగాని లేదు. పరిపూర్ణత్వము పొందినవారియందు రాగద్వేషరాహిత్యము, దృశ్యము పట్ల అంతరంగమున నిర్లిప్తత సహజంగానే ప్రాప్తిస్తాయి. మీరు స్వయముగా మీ వివేకబలంచేత పూర్ణత్వం పొందియే ఉన్నారు. మీ తండ్రి, వేదవ్యాసులు కూడా సర్వజ్ఞాననిధి, మహాతపస్వి అయినప్పటికీ, మీవలె ఇంతటి పూర్ణానుభవం పొందియుండలేదు. నేను వ్యాసుని కంటే శ్రేష్ఠుడను. ఇక మీరో, భోగరాగములను ఉద్వేగ-అనుద్వేగములను పూర్తిగా త్యజించి ఉండుటచే నాకంటే కూడా అధికులు అయ్యారు. పొందవలసిన ఉత్తమ స్థితి పొందనే పొందారు. కనుక మీ మనోరథం సిద్ధించినట్లే. ఈ దృశ్య ప్రపంచమున, ముల్లోకములందు మిమ్ములను వివశులను చేయునది, బద్ధులను చేయునది అంటూ ఏదీ లేదు. కనుక మీరు ముక్తులే అయి ఉన్నారు. ఇక మీకు సందేహం దేనికి? "ఇంతకు మించినది ఏదో ఉన్నది" అనే భ్రమను త్యజించండి. కట్టుకొయ్య త్రెంచుకొన్న ఆవువలె మీరు బంధ విముక్తులు అయ్యారు. ఇక మీకు ఎట్లు ఉచితమనిపిస్తే అట్లే సంచరించండి. ఆత్మ స్వరూపులు, ఆత్మ స్వభావులు అయివున్న మీకు నేను నమస్కరిస్తున్నాను.

❖

ఓ రఘురామా! మహాత్ముడగు జనకుని ఈ ఉపదేశం విన్న ఆ శుకయోగి సర్వ శంకలను అక్కడికక్కడే త్యజించి వేశాడు. మలినరహితమగు 'ఆత్మ' అను పరమ వస్తువును అధిష్ఠించి విశ్రాంతి పొందాడు. శోకము, సంశయము, ఆయాసముల నుండి విడివడ్డాడు. జనకునకు ప్రణామంచేసి అక్కడి నుండి బయలుదేరాడు. 'సమాధి'ని అభ్యసించుటకు మేరు పర్వతం చేరాడు. అక్కడ నిర్వికల్పయోగంలో అనేక సంవత్సరములు గడిపాడు. అటు తరువాత తైలరహిత స్వయంజ్యోతివలె 'ఆత్మ స్వభావము' అను నిర్వాణస్థితి పొందాడు. సర్వ అజ్ఞాన సంస్కారములు తొలగిపోయాయి. సునిర్మల స్వరూపుడై, పరమపావనుడగు పరమాత్మయందు లీనమై విదేహముక్తుడైనాడు.

❖

ఈ విధంగా వ్యాసపుత్రుడగు శుకదేవునకు కించిత్ 'గుర్తుచేయుట' అనే మార్జనం అవసరమైనది కదా! ఓ మునిశ్రేష్ఠులారా! మన ఈ రాముని విషయంలో కూడా ఇప్పుడు అట్టిదే అవసరమగుచున్నది. ఇతనికి కారణ రహితంగానే భోగములందు విరాగము పుట్టుటచే తన వివేకంచేత తెలుసుకోవలసినదంతా తెలుసుకొన్నాడు. భోగజాలము పట్ల అకృత్రిమమైన అరుచియే తత్త్వజ్ఞానిలో కనిపించే ఒక ముఖ్యమైన లక్షణం. ఈ సంసార బంధమంతా స్వతహాగా వాస్తవమైనది కాకపోయినప్పటికీ, "భోగచింతన"చే ఇదంతా దృఢపడి ఈ జీవునికి ప్రాప్తిస్తోంది. "వాసనాభివృద్ధే (Increase of tendencies) బంధము. వాసనాక్షయమే మోక్షము" అని మనకు జ్ఞానులైన పెద్దలు చెప్పుచున్నారు.

మరొక్క విషయం. ఆత్మ విషయమై ఆపాత జ్ఞానం (temporary & partial knowledge) అల్పశ్రమతో కూడా కలుగవచ్చు. ఎవరో చెప్పగా వినినంత మాత్రంచేత కూడా (స్వల్పమైన ఆవేశరూపంలో) వైరాగ్యం పొందవచ్చును. కాని, అట్టి వైరాగ్య భావన సుస్థిరపడాలంటే సంగరహితమైన బుద్ధి కావాలి. విషయములపట్ల వితృష్ణ (desirelessness) మాత్రం ఎంతో కష్టించితే కాని పొందుటకు వీలుకాదు. ఎవరి జ్ఞానధనమైతే కామక్రోధాదులచే ప్రతిహతం కాదో – అట్టివాడే తత్త్వజ్ఞుడు, జ్ఞాని, పండితుడు కూడా. ఎప్పుడైతే ఈ జీవుడు తెలుసుకొనవలసినదానిని తెలుసుకొంటాడో (నేను ఎవరు? అను ప్రశ్నకు ఉత్తమ సమాధానం పొందుతాడో), అప్పుడు మాత్రమే అతనికి ఈ శరీర పటాటోపం పట్ల, ఐశ్వర్యముల పట్ల, భోగములపట్ల సహజమైన విముఖత, అరుచి ఏర్పడతాయి. యశస్సు – దంభము కొరకు కాకుండా, వాస్తవదృష్టి వలన అకృత్రిమమైన వైరాగ్యము పొంది ఉండే వారే మానవులలో ఉత్తమోత్తములు. జ్ఞేయమగు (సర్వజ్ఞానుల ఉత్తమ లక్ష్యమగు) ఆత్మవస్తువు గ్రహింపబడనంతవరకు విషయవితృష్ణ కలగటం అసంభవమే.

రమణీయమగు భోగ భాగ్యములు కూడా, ఎంతటి దోషభూయిష్ఠమైనవో మన రామచంద్రుడు స్వవిచారణచే గ్రహించాడు. అందుచేతనే మహత్తరమైన ఆశయములను పొందగలిగాడు. ఓ సభికులారా! ఈ బాలుడు చెప్పినదంతా వాస్తవమే. అయితే ఇతనికి ఇంకా చిత్త విశ్రాంతి కలుగవలసియున్నది. స్వస్వరూపమగు ఆత్మ గురించి విచారణచే ఇతడు తప్పకుండా చిత్తవిశ్రాంతి పొందగలడు. ఇప్పుడు ఈ రాముని బుద్ధి కైవల్య శాంతి మాత్రమే కోరుకుంటోంది.

లోకకళ్యాణార్థం, రాముని చిత్తవిశ్రాంతి కొరకు రఘుకుల గురువు, సర్వము ఎఱిగినవాడు, సర్వసాక్షి, బ్రహ్మజ్ఞాని, త్రికాలవేత్త అయిన వసిష్ఠ భగవానుణ్ణి ఆత్మ విచారణ బోధించవలసినదిగా సభాముఖంగా అర్థిస్తున్నాను.

హే వసిష్ఠ మహర్షీ! ఒకప్పుడు మన ఇరువురి వైరం శాంతింపచేయటానికి భగవంతుడగు బ్రహ్మదేవుడు మీకు, నాకు, తదితర మునులకు ఆత్మజ్ఞానం ఉపదేశించారు కదా! ఆ యుక్తిపూర్వకమైన జ్ఞానోపదేశం చేత సర్వ సంసార వాసనలు తొలగిపోగలవు. ఓ బ్రహ్మజ్ఞా! మీ ప్రియశిష్యుడగు రామచంద్రునకు ఉత్తమమైన ఆత్మ విషయం ఉపదేశించుటచే ఇతడు, ఈ రాజ్యం, ఈ లోకం,

భవిష్యత్తులో అనేకమంది జనులు పవిత్రత పొందటం జరుగుతుంది. వివేక వైరాగ్యములతో ప్రకాశిస్తున్న రాముడు మీ ఉపదేశమునకు అన్ని విధాలా తగినవాడు. ఇతనికి ఉపదేశించటం చేత మీ వాక్యాలు సార్ధకమౌతాయి. ధూళిచే కప్పబడక పరిశుభ్రంగా ఉన్న అద్దంలో ముఖం సులువుగా, సుస్పష్టంగా కనిపిస్తుంది కదా!

త్రికాలజ్ఞులగు మీకు మేము చెప్పగలిగేదేమున్నది? భక్తిశ్రద్ధలు కలిగినవాడు, నిగర్వి, వైరాగ్యవంతుడు అయిన శిష్యునకు బోధింపబడు శాస్త్రజ్ఞానమే సార్థకమౌతుంది. ఏ బోధ అయితే అజ్ఞానమును దగ్ధం చేస్తుందో, సర్వ సందేహములను మొదలంట్ల తొలగిస్తుందో, అనిందితమైన ఉత్తమ సత్యమును ప్రతిపాదిస్తుందో – అదే ఉత్తమబోధ. అట్టి బోధను మీరు మాత్రమే ప్రసాదించగలరు.

గురుశుశ్రూషబుద్ధి లేనివానికి, విరక్తుడు కానివానికి, అపాత్రునకు ఉపదేశించబడే జ్ఞానం కుక్కతోలులో పోయబడిన పాలవలె అపవిత్రమే అవుతుంది. హే వసిష్ఠ మహర్షీ! మీరు మహావైరాగ్యసంపన్నులు. భయక్రోధములంటూ లేనివారు. నిర్మలమైన స్వభావము కలవారు. సాధుపుంగవులు. అట్టి మీవంటి మహనీయులు ఆత్మ విషయమై ఉపదేశించటంచేత, ఆ ఉపదేశ సమయంలోనే బోధింపబడువాని బుద్ధి వికసించి విశ్రమించగలదు.

అప్పుడు వ్యాస, నారదాది మహర్షులు అభ్యర్థనపూర్వకంగా వసిష్ఠునివైపు చూచి చిరునవ్వు నవ్వారు.

❖

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ విశ్వామిత్ర మహర్షీ! ఈ సభకు వేంచేసిన వ్యాస–నారదాది మునిసత్తములారా! నేను మీ ఆజ్ఞను శిరసావహించటానికి సిద్ధంగా ఉన్నాను. సజ్జనుల వాక్యములు ఉల్లంఘించే శక్తి ఎవరికుంటుంది? మీరు నన్ను నియమిస్తున్నట్లుగానే ఈ రామాదులకు జ్ఞానోపదేశం చేసి అజ్ఞానమును నివృత్తింపజేస్తాను. దీపం వెలిగించిన తరువాత చీకటి ఆ సమీపంలో ఉంటుందా?

పూర్వము నా తండ్రియగు బ్రహ్మదేవుడు నాకు, తదితర మునివరేణ్యులకు ఉపదేశించిన ఆత్మజ్ఞానమును నేను ఇప్పుడు స్మరించుచున్నాను. ఈ నా ప్రయత్నము సంసార భ్రమను శాంతింప చేయటానికి, లోక కళ్యాణము కొరకు ప్రవృత్తమగుగాక!

❖

ఇట్లు ఆయన ప్రతిజ్ఞాపూర్వకమైన మంగళాశాసనం పలికారు. కొద్దిక్షణాలు ధ్యాన నిష్ఠులై దృష్టాంతములు, ఉపాఖ్యానములు, ప్రమాణములు మొదలైన పరికరములు చేకూర్చుకొన్నారు.

అప్పటికప్పుడు ఆ సభయందు వక్త–శ్రోతలకు అనుకూలమైనట్టి వాతావరణం, వేదికలు తయారు చేయబడినాయి. అప్పుడు బ్రహ్మర్షివరేణ్యులగు వసిష్ఠ మహర్షి అజ్ఞాన శాంతి కొరకు పరతత్త్వ బోధకమైన "యోగవాసిష్ఠము" లేక "అఖండ రామాయణం" ఇట్లు ప్రవచించ ప్రారంభించారు.

❖❖❖

2. సదేహముక్తి - విదేహముక్తి

శ్రీ వసిష్ఠమహర్షి :

పూర్వమ్ ఉక్తం భగవతా యత్ 'జ్ఞానం' పద్మజన్మనా,
సర్గాదౌ, లోకశాంత్యర్థం తదిదం కథయామ్యహమ్ ॥ (III-1)

ప్రియశిష్యా! రామచంద్రా! పూర్వం సృష్టి ప్రారంభంలో బ్రహ్మదేవుడు జగశ్శాంతి కోసమై ప్రవచించిన ఆత్మ తత్త్వశాస్త్రమును నీ ముందు ఉంచబోవుచున్నాను. శ్రద్ధతో వినెదవుగాక!

శ్రీరాముడు : హే భగవంతుడా! వసిష్ఠమహర్షీ! మనం మోక్షశాస్త్రంలో ప్రవేశించే ముందు నాకు ఉన్న ఒక సందేహం నివారించ ప్రార్థిస్తున్నాను. శుకదేవుడు విదేహముక్తి పొందినట్లు విశ్వామిత్రమహర్షి చెప్పియున్నారు. అతని తండ్రి, గురువు, మహామతి, సర్వజ్ఞుడు అయిన ఈ మన వ్యాసమహర్షి ఎందుకు విదేహముక్తి పొందలేదు? శుకుడు మాత్రమే ఎందుకు పొందాడు? తత్త్వజ్ఞానమునకు విదేహముక్తియే ఉత్తమ ఫలితముగదా! శుకయోగి యందుగల ప్రత్యేకత ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! సూర్యునివలె స్వయంజ్యోతి స్వరూపుడగు ఆ 'పరమాత్మ' యొక్క చైతన్యశక్తి లేక చిత్ప్రకాశంలో కాంతిరేణువులవలె అనంత సంఖ్యలో బ్రహ్మాండాలు లేచి ప్రవర్తించి, లీనమైపోతున్నాయి. ఈ వర్తమాన క్షణంలో కూడా త్రైలోక్యములతో (స్వర్గ-మర్త్య-పాతాళములతో) కూడిన బ్రహ్మాండములు ఇసుకరేణువులవలె లెక్కింప అలవికాదు. అదే విధంగా ఇక ముందు కూడా ఆ 'పరమాత్మ' అనే మహాసముద్రంలో ప్రపంచ-తరంగాలు అసంఖ్యాకంగా లేచి లయించబోతున్నాయి.

అట్టి ఈ 'జగత్తులు' అనే రేణువులందు "ఇది సత్యమే" అను బుద్ధితో ఈ మాయామయులైన జీవులు ప్రవర్తిస్తున్నారు. అయితే, జీవన్ముక్త పురుషులకు మాత్రం ఇందలి అసత్యత్వమంతా అవగతం అయ్యే ఉంటుంది. అందుచేత ఇదంతా వారికి స్వప్నతుల్యంగానే ఉంటోంది. అట్టి స్వప్నము వంటివే అయిన ఈ బ్రహ్మాండములలో అంతర్గతమైయున్న ఈ దేహాదులు కూడా నశ్వరము (నశించపోవునవి), స్వప్న తుల్యము, అసత్ తుల్యము (వాస్తవానికి లేనట్టివి) అయి ఉన్నాయి. ఇట్టి దేహాదులు కలిగి ఉండుటలో,(లేక) లేకుండుటలో విశేషమేమున్నది? ఆత్మతత్త్వము చక్కగా ఎరిగిన జ్ఞానుల దృష్టిలో జీవన్ముక్తులకు వచ్చిన లోటేమీ లేదు. అది విదేహముక్తి కన్నా తక్కువైనదిగా వారు ఎంచుట లేదు. ఉన్న రహస్యమంతా తన వాస్తవస్వరూపమగు 'ఆత్మ' గురించి పొందియున్న విజ్ఞానపూర్వకమైన జ్ఞానములోనే ఉన్నది.

శ్రీరాముడు : మీరు భూతకాలపు, వర్తమానపు, భవిష్యత్ కాలపు, బ్రహ్మాండముల ఉత్పత్తి, స్థితి వినాశనముల గురించి చెప్పుచున్నది అత్యంత సమంజసమే. మనకు కనబడుచున్నదంతా అనుక్షణం మార్పు చెందుతూనే ఉన్నది. భూతభవిష్యత్ కాలముల మధ్య ఈ వర్తమానకాలంలో కనబడే బ్రహ్మాండము, ఇందలి పదార్థములు సర్వదా అనిశ్చింతంగా, అస్థిరంగా ఉంటున్నాయి. అందుచేత వర్తమాన బ్రహ్మాండము గురించి, ఇందలి వస్తుజాలము యొక్క ఆయా ధర్మముల గురించి ఎరిగినంత

మాత్రంచేత, మనం 'బ్రహ్మతత్త్వము' లేక 'ఆత్మయొక్క వాస్తవ స్వభావము' ఎరుగజాలమేమోనని నాకు అనిపిస్తోంది. భూత-భవిష్యత్ అనే రెండు గట్ల మధ్య మనకు లభిస్తున్న ఈ వర్తమానమును అట్లే ఉంచి, మనం ఈ బ్రహ్మాండము యొక్క పూర్వాపరాలను (ఇది ఎక్కడి నుండి వస్తోంది? ఎటు పోబోతోంది?) తప్పక విచారించవలసియున్నది. ఈ వర్తమాన బ్రహ్మాండము యొక్క అంతర్గత దృశ్య విశేషాల గురించి విచారణ అనవసర కాలయాపనయే అవుతుందేమో, ఎందుకంటారా? ఈ కనబడే వస్తుజాలమంతా అనుక్షణం భూతకాలం నుండి, భవిష్యత్తుకు పయనిస్తూ - వర్తమానంలో లేకయే ఉన్నాయని అనిపిస్తోంది. ఎప్పటికప్పుడు భూత భవిష్యత్తులచే కప్పివేయబడుతూ ఉన్నట్టి ఈ వర్తమాన "క్షణిక దృశ్యప్రపంచము"ను మనం ఎంత తరచి చూచినా, ఇది మనకు కావలసిన ఉత్తమ అవగాహనను ప్రసాదించజాలదేమో?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓహో! తత్త్వగ్రహణ సమర్థమైనట్టి నీ సూక్ష్మబుద్ధికి మెచ్చాను. అయితే భూత-భవిష్యత్, వర్తమానములు, ఈ బ్రహ్మాండములు, ఈ వ్యవహారమంతటిలో ఒకానొక మిథ్యాత్వము అజ్ఞానముచే సత్యమైన దానివలె ప్రవర్తించుచున్నది. అందుచేత, నీ రెండు ప్రశ్నలు దృష్టిలో ఉంచుకొని నేను చెప్పబోవు సమాధానం విను.

❖

కారణ దేహమే....	ఆయా ధర్మములను అనుసరించి
(The Self)	ప్రత్యగాత్మ తత్వం 'జీవుడు', 'శరీరి', ('The Experiencer')
	మొదలైన పేర్లతో చెప్పబడుతోంది.

అదియే.... "తత్ - అది (తత్త్వమ్)", "సః - అతడు (సోఽహమ్)", "స్వస్వరూపాత్మ" ఇత్యాది పదములచే ఉద్దేశించబడుతోంది.

స్థూలం : ఈ పశువులలోను, పక్షులలోను, మృగములలోను, మనుష్యులలోను, దేవతలలోను 'శరీరత్యాగము' అను రూపముగల 'మృతి'ని చూస్తూనే ఉన్నాం కదా! ఈ కళ్ళకు కనబడే రక్తమాంస నిర్మిత శరీరమును జలము - వాయువు - అగ్ని - భూమి - ఆకాశములచే నిర్మించబడుటచే భౌతికశరీరం' లేక 'స్థూలశరీరం' అంటున్నాం.

సూక్ష్మం : ఈ స్థూల దేహం నశించినప్పటికీ, 'మనస్సు-బుద్ధి-చిత్తము అహంకారముల సమన్వయం మాత్రం నశించదు. దానిని 'సూక్ష్మశరీరం' లేక 'అతివాహికదేహం' అని అంటున్నాం. 'సూక్ష్మశరీరం' యొక్క రూపమే ఇష్టములు, అయిష్టములు, అవగాహనలు, అభిప్రాయములు, కోరికలు, భావనలు, కోపతాపములు మొ॥ అయి ఉన్నాయి. (మరికొన్ని శాస్త్రములు దీనినే 'సంస్కారశేషము' అని కూడా అంటున్నాయి).

స్థూలదేహం నేలకూలినంత మాత్రం చేత అతివాహిక దేహం నశించదు. లేక, లేకుండాపోదు. అయితే, శరీర పరిమితులైన అతని బంధువులు మాత్రం పాంచభౌతిక దేహము వరకు మాత్రమే గ్రహించగలరు కనుక, "అయ్యో! మనవాడు చనిపోయాడే!" అని అనుకొని ఊరుకొంటున్నారు.

ఇప్పుడు భౌతిక శరీరం తొలగిపోగా సూక్ష్మశరీరము మాత్రమే ధరించి ఉన్న ఈ జీవుడు అప్పటికప్పుడు తన వాసనలను (tendencies) అనుసరించి తన హృదయాకాశంలో ముల్లోకములను గాంచుచున్నాడు. దీనినే 'పరలోకము' అని అంటున్నాం. ఇప్పుడు ఇక్కడ చూడబడే ముల్లోకములు కూడా అట్టివే సుమా! ఇది ఇతఃపూర్వమునకు (అనగా ఈ వర్తమాన శరీరధారణకు ముందున్న స్థితికి) పరలోకమే అయివున్నది కదా! అయితే దేహాత్మబుద్ధి లేక పంచభూతములకు పరిమితమైన బుద్ధి కలవారికి – ఇదంతా మరొక చోటగాని, లేక ఆలస్యంగా గాని జరుగుతోందని అనిపిస్తోంది. కాని, అది అట్లేమి కాదు. ఎందుకంటే అతివాహికానుభవం పంచ భూతముల కంటే సూక్ష్మమైనది కదా! అద్దాని అనుభవం పంచభూతములతోను, అవి ఉండనప్పుడు కూడా ఏర్పడగలదు.

ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. మనం ఇక్కడ ఇప్పుడు చూస్తున్న ఈ స్థూల దేహమును జీవుడు తన సూక్ష్మదేహం సహాయంతోనే ధరించి, ప్రవర్తింపచేస్తున్నాడు. కనుక ఇక్కడ మనకు అనుభవమగుచున్నది కూడా, ఈ అతివాహిక దేహపు అభివ్యక్తీకరణే. ఉదాహరణకు, నేను నీతో మాట్లాడుతున్నప్పుడు "నా 'మనోబుద్ధి చిత్తాహంకారాలు' నీయొక్క మనోబుద్ధి చిత్తాహంకారాలతో ప్రతిస్పందిస్తున్నాయి" అనునదే సిద్ధిస్తుంది. అంతేకాని భౌతిక పదార్థములు, జడములు అయి ఉన్న చెవులు – నోరు మాట్లాడుకోలేవు కదా!

ఇంతవరకు గ్రహించావు కదా! ఇప్పుడు మనం మరొక విషయానికి వద్దాం. ఇంతకీ "ఇహ–పర" రూపములైన ఈ భూత–వర్తమాన–భవిష్యత్తుల దర్శనమంతా చేస్తున్నట్టి ఈ 'జీవుడు' అనబడువాడు ఎవడు? ఓ రాఘవా! ఇతడు స్వయముగా ఆ ప్రత్యగాత్మయే. ఇతనికి వాస్తవానికి ఈ జన్మ – మొదలైన వికారాలు ఏ సమయమందును లేవు. పరబ్రహ్మమే ఇతని నిజస్వరూపం.


"చిదాకాశ స్వరూపుడైన పరమాత్మయే వాసనామయమగు అతివాహిక శరీరంతో, స్వయముగా, తన హృదయాకాశమునందు, వాసనామయమే అయివున్న ఈ దృశ్యమంతా పొందుచున్నాడు" – అనునదే జీవునియొక్క 'జగత్తు' అను అనుభవమై ఉన్నది. ఈ శరీరము కూడా అట్టి జగద్దృశ్యములోని ఒక వస్తువు వంటిదే అగుచున్నది.

❖

ఈ విధంగా ప్రతి ప్రాణి తన చిత్తములోని వాసనలను లేక సంస్కారములను అనుసరించి, తాను భావించి, వాంఛించు అనుభవమునకు అనుకూలమైన ఉపాధులను (శరీరములను) పొందుతూ, త్యజిస్తూ ఉంటున్నాడు. అయితే ఈ జీవుడు విజ్ఞానమే (ఎరుక – consciousness) తన స్వరూపముగా కలిగి ఉన్నాడు. అతడు దేనినైతే "ఇది ఈ విధమైన సత్యము" అని సంకల్పిస్తున్నాడో అది అట్లే అతనికి సత్యమైన అనుభవమై ప్రాప్తించుచున్నది. అందుకే "ఈ జీవుడు సత్యసంకల్పుడు" అని కూడా చెప్పబడింది.

అట్టి ఈ జీవుడు ఈ భౌతికదేహం త్యజించటం జరిగినప్పుడు (లేక మరణించినప్పుడు) అతని మానస నగరంలో (In the zone of his subtle body) ఏ ఏ కోర్కెలు అగ్రగణ్యంగా

ఉంటాయో వాటిని అనుసరించి అందుకు తగినట్టి ఉపాధిని పొందుచున్నాడు. అప్పుడు "ఇతడు పుట్టాడురా" అని జనులు అనుకొంటున్నారు.



కనుక ఓ రామా! ఈ జీవుడు తన వాసనలను, కర్మ పరిపాకమును అనుసరించే మనుష్య, పశు, పక్షి, దేవత, రాక్షసాది యోనిభేదం చేత ప్రకాశించే పాంచభౌతిక సమన్వయములైన ఉపాధులను పొందుచున్నాడు✷. దీనినిబట్టి ఈ దృశ్యవిషయమై ఒక చమత్కారం గమనించావా?

సంకల్పనిర్మాణమివ- మనోరాజ్య విలాసవత్,
ఇంద్రజాలా మాల ఇవ - కథార్థప్రతిభాసవత్,
దుర్వాత భూకంప ఇవ- త్రస్త బాల పిశాచవత్,
ముక్తాళీవామలే వ్యోమ్ని - నౌస్పంద తరుయానవత్,
స్వప్నసంవిత్తి పురవత్ - స్మృతిజాత ఖపుష్పవత్,
జగత్సంసరణమ్ స్వాంతర్మృతోఽనుభవతి స్వయమ్! (III - 11,12,13)

✷ (సింహోవా, వ్యాఘ్రోవా యద్భావంతి, తథాభవతి : జీవుడు తన భావనను అనుసరించే సింహముగానో, వ్యాఘ్రముగానో అగుచున్నాడు - ఉపనిషత్తు వాక్యం.)

ఈ ఎదురుగా కనిపించే చరాచరములతో కూడిన దృశ్యజగత్తు – ఎవడో అజ్ఞాతమూర్తి తన సంకల్పములచే ఎందుకో రచించినట్లు ఉంటోంది. ఏదో మనోరాజ్యము యొక్క విలాసమువలె తోచుచున్నది. ఎవరో గొప్ప ఐంద్రజాలికుడు తన ఇంద్రజాల చమత్కారంచే ఇది చూపుచున్నట్లు అనిపిస్తోంది. ఒక గొప్ప కవి తన ఊహా చమత్కారంతో రచించిన ఒక పెద్ద కథలోని మధ్యభాగంలాగా స్ఫురిస్తోంది. వాతము క్రమ్మిన రోగియొక్క భూకంపానుభవంవలె అనిశ్చితముగా, అతి చంచలంగా, దుర్భరంగా అనుభవమౌతోంది. ఒక బాలుడు ఏదో పిశాచం కథ విని నిద్రించి, అర్ధరాత్రి మెలుకువ రాగా కనులు తెరచి ఎదురుగా కథలోని భూతమును భ్రమచే చూచుచున్నట్లు కనిపిస్తోంది. తనకు తానే కల్పించుకొనిన భ్రమచేత ఆకాశంలో ఏవేవో ఆకారములు తోచునట్లు భ్రమకొల్పుతోంది. నౌకలో ప్రయాణించే వానికి ఒడ్డున ఉన్న చెట్లు అర్ధచంద్రాకృతితో కదులుచున్నట్లు ప్రాప్తిస్తోంది. ఒకడు స్వప్నంలో అనేక వస్తువులను చూచునట్లు, మరొకడు తన స్మృతి పథంలో ఎక్కడో చెప్పగా విన్న ఆకాశ పుష్పం గాంచునట్లు ఈ జగత్తు ప్రత్యక్షమై ఉంటోంది. కనుక రాఘవా! ఇదంతా మిథ్యయై, చూచువాని యొక్క కల్పనామాత్రమై, స్వయముగా ఏదీ కానిదై ఉన్నది. అయితే, తన అజ్ఞానము చేతనే ఈ జీవుడు మిథ్యారూపమగు ఇట్టి జగత్తును తాను శరీరము కలిగి ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా తన హృదయాకాశమునందు స్వయముగా గాంచుచున్నాడు. అనగా, మృతుడు ఇట్టి ఈ జగదృశ్యమును తన అంతరంగాకాశంలో తనకు తానే స్వయంగా అనుభూతపరుచుకొనటం జరుగుతోంది.

❖

ఇట్లు దేనిచేతనూ నిర్దేశించబడజాలని ప్రత్యగాత్మ స్వరూపుడే అయినట్టి ఈ జీవుని సమ్ముఖమునకు ఈ శరీరములు స్వకీయ–అనుభూతి రూపంగా మాటిమాటికీ వస్తున్నాయి. పోతున్నాయి. అట్టి రాకపోకలు గల దేహములు ఒకప్పుడు ఒకేవిధంగా, మరొకప్పుడు భిన్న – విభిన్నములుగా ఉంటున్నాయి. అనగా ఒకప్పుడు పూర్వ సంస్కారములన్నీ అట్లే ఉంటున్నాయి. మరొకప్పుడు పాత సంస్కారములన్నీ లయించగా క్రొత్తవి వచ్చి చేరుచున్నాయి. ఇట్టి అనుభవం మనమందరం ప్రత్యక్షంగా ఈ లౌకిక దైనందిన జీవితంలో కూడా చూస్తున్నాం కదా! అభిరుచులు, అభిప్రాయాలు, నమ్మకములు మొదలైనవి ఎప్పటికప్పుడు మారిపోతూ, కొత్తవి సంచరించుకొనుటలేదా?

ప్రతిజీవి పుట్టినప్పటినుండి ఈ దేహము త్యజించే లోపులో అనేక కర్మలు చేసి, వాటి వలన తనకు తానే తన పరలోకములను తయారుచేసుకొంటున్నాడు. తాను కలిగియున్న వాసనలవలన కొన్నిదేహాలు, ఆ దేహముల వలన మరికొన్ని వాసనలు, ఆ వాసనల వలన మరల పురుష, పశు, పక్షి దేహాలు – ఈ విధంగా అరటి స్తంభము లోని మట్టలవలె ఈ సంసార వ్యవహారమంతా పొందుచున్నాడు.

అయితే రామా! వాస్తవమైనట్టి 'ఆత్మదృష్టి'చే లేక 'శరీరి' దృష్టిచే చూచినప్పుడు, ఈ బ్రతికిఉన్న

వారికిగాని, శరీరము త్యజించిన వారికిగాని (అందరు స్వతహాగా చైతన్యమే రూపముగా కలవారు అగుటచే) ఈ పంచభూతముల సమావేశము, ఈ సృష్టిక్రమములు లేనేలేవు. అయినప్పటికీ ఈ జీవునకు ప్రపంచ భ్రాంతి తప్పుటలేదు. లేనిది ఉన్నట్లుగా భ్రమింపచేయుటయే ఈ జగత్తు యొక్క వైచిత్ర్యము. ఈ 'జగత్తు' అను మాయా నాటకమంతా అనాదిగా సిద్ధించియున్న 'అవిద్య' చేతనే నడుపబడుతోంది.

'పరమాత్మ' అనే మహాసముద్రంలో "సృష్టి – ప్రళయములు" అనే తరంగాలు మాటిమాటికీ బయలుదేరుచున్నాయి. లయిస్తున్నాయి. ఇందులో కొన్ని గుణములు, క్రమములు – మనస్సుయొక్క అనుభవం దృష్ట్యా – ఒకేరకంగా ఉంటున్నాయి. కొన్ని వేరువేరుగా ఉంటున్నాయి.

ఇక, నీకు ఎదురుగా కనిపిస్తున్న ఈ దృశ్యమునకు వద్దాం. ఈ 'సృష్టి' అంతా మాయారచితమే అయినప్పటికీ, నీయొక్క బోధ కొరకు, ఆద్యంతములు లేనట్టి దీనిని నా దృష్టి ప్రసరించ గలిగినంత వరకు పరిశీలించి నేను చూస్తున్నది చెపుతున్నాను. విను.

❖

ఈ సభకు వేంచేసియున్న వ్యాసుడు నాకు ముప్పదిరెండవ వానిగా కనిపిస్తున్నాడు. అందులో మొదటి పండ్రెండు మంది ఆకృతిలోను, చరిత్రలోను సమానులు. వారందరు 'ఆత్మతదాత్మ్యము' దృష్ట్యా కొంత అల్పజ్ఞులే. ఇక పదమూడవవాని వంశము మాత్రము భిన్నమైనది.

భవిష్యత్తులో కూడా ఎందరో వ్యాస, వాల్మీకాదులు జన్మించనున్నారు. వారిలో కొందరి శరీరముల ఆకృతులు పూర్వము ఉన్నట్లే ఉంటాయి. మరికొందరి దేహములు వేరువేరుగా ఉంటాయి.

ఎందరెందరో మనుష్యులు, దేవతలు, దేవర్షులు మొదలైనవారంతా ఇతఃపూర్వం లాగానే ఒకేకాలంలో జన్మించి, ఒకే సమయంలో జీవించనున్నారు. ఈ వర్తమాన బ్రహ్మ యుగంలో ఇది డెబ్బది రెండవ త్రేతాయుగం. ఇట్టి బ్రహ్మ యుగములు ఇతః పూర్వం ఎన్నో గడచిపోయాయి. ఇంకా ఎన్నో గడచిపోనున్నాయి. నీవు, నేను కూడా ఎప్పుడో పూర్వకాలంలో ఉన్నట్లే ఇప్పుడు కూడా ఉంటున్నాం. మనతో మరెందరో క్రొత్త వారు కూడా వచ్చి చేరుచున్నారు. ఇదంతా నేను తెలిసికొనే ఉన్నాను.

ఒకానొక క్రమమును అనుసరించి ఈ వ్యాసమునికి ఇది పదవ అవతారం. వ్యాస వాల్మీకులకు సమకాలికులమై మనం అనేకసార్లు పుట్టాం. మనలో చాలామంది మధ్య మధ్యలో విడివిడిగా పుట్టటం జరిగింది. మనమే కాదు. తదితర జ్ఞానులు, అజ్ఞానులు కూడా ఇట్టివేయగు అనేక శరీరములతో చాలాసార్లు జన్మించియున్నారు. ఈ వ్యాసుడు నా దృష్టిపథం ముందుకు వెళ్ళునంత వరకు చూడగా – మరొక ఎనిమిది సార్లు జన్మించనున్నారు. ఇతడు 'మహాభారతము" అను ఇతిహాసమును ఎనిమిది సార్లు వ్రాయబోవుచున్నారు. వెనుకటి లాగానే మరల వేదములను విభజించి భరత వంశమునకు గొప్ప కీర్తి తెస్తారు. ఆ తరువాత, బ్రహ్మదేవుడై విదేహముక్తుడు కాబోతున్నారు.

అయితే ఇతడు ఇప్పటికే జీవన్ముక్తుడు. ఉత్తమోత్తమమైన మనోనిగ్రహం కలవాడు. గొప్ప శాంతుడు. 'మోహము' అనునది ఏమాత్రం అతని యందు లేదు. అహంకార – మమకారాలు లేవు. అందుచేతనే శోకరహితుడై స్వచ్ఛముగా వెలుగొందు చున్నారు.

ఓ రామచంద్రా! ఈ జీవులందరు "భాగ్యము, బంధువులు, ఆయుర్దాయం, ప్రయత్నం, విద్య, జ్ఞానం" – మొదలైనవన్నీ సమంగా స్వీకరించి ఒకప్పుడు ఇట్లాగే ఉంటున్నారు. మరొకప్పుడు ఇట్లా ఉండరు. ఇవన్నీ ఎల్లప్పుడు సమానంగా ఉండుట లేదు. ఇంకొకప్పుడు కొన్ని సృష్టుల వరకు వీరు ఇట్లే ఉంటున్నారు. అయితే, ఇదంతా మాయయే సుమా! దీనికంతటికి అంతము ఉండదని కూడా అనవచ్చు. కొలవటం కోసం ధాన్యపురాశిని ఒకచోట పోశామనుకో. కొలిచిన తరువాత ఆ గింజలు ఒకే తీరుగా కలిసి ఉంటాయా? ఈ ప్రాణులు కూడా భిన్న–భిన్న సృష్టులలో భిన్న–భిన్నంగా ఉంటూ ఉంటారు. సముద్రంలోని తరంగాలు గమనించావా? అవన్నీ ఒకప్పుడు ఒకేవిధంగా మరొకప్పుడు మరొకవిధంగా ఉంటాయికదా! ఏ తరంగం ఏ నీరో, ఏది ఏ నీరు కాదో చెప్పటం ఎవరి తరం? 'కాలము' అనే మహాసముద్రంలోని ఈ సృష్టి తరంగాలు కూడా అంతే. ఒకప్పుడు ఒక రూపంగాను, మరొకప్పుడు మరొక రూపంగాను ప్రదర్శితమౌతూ ఉంటాయి.

❖

అయితే, తత్త్వజ్ఞాని దృష్టిలో అజ్ఞాన పూరితములగు ఈ వికల్పములన్నీ లేకయే ఉన్నాయి. ఈ సృష్టి తరంగాలన్నీ చూస్తున్నప్పటికీ, అతని అంతరంగము మాత్రం ఏమాత్రం తల్లడిల్లుట లేదు. అతడు తన సహజ సిద్ధమగు ప్రశాంతతను కోల్పోవుట లేదు. స్వయముగా పరబ్రహ్మ స్వరూపుడే అయివున్న ఈ జీవుని దృష్టిలో మాయావరణం తొలగనంత కాలం మాత్రమే ఈ సృష్టి పరంపరలన్నీ ప్రవర్తిస్తున్నట్లు తోస్తాయి. వాస్తవానికి ఇతడు పరమశాంత స్థితి అగు ఆత్మయే స్వరూపముగా కలిగి ఉన్నాడు. పరమాత్మ స్వభావమగు అఖండ స్థితుడే అయున్నాడు. మాయావరణము తొలగినప్పుడు ఇతడు బ్రహ్మస్వరూపముగానే శేషించుచు, బ్రహ్మముగానే వెలుగొందుచున్నాడు.

"జీవన్ముక్తత్వము" అనునది ఎట్లా లభిస్తుంది? తత్త్వజ్ఞానము యొక్క ఫలమే కదా! మన ఈ వ్యాసమహాముని అట్టి తత్వజ్ఞాన ఫలమును పొందే ఉన్నారు.

ఇక్కడ మనం సముద్రమునే దృష్టాంతంగా తీసుకొందాం. సముద్రంలో తరంగములు ఉన్న సమయంలోను, తరంగములు లేని సమయంలో కూడా అందలి జలము జలముగానే ఉంటుంది కదా! అదే విధంగా జనులు విదేహముక్తులైనా, లేక సదేహముక్తులైనా ఒక్కటే. ఈ రెండిటికీ భేదమేమీ ఉండదు. అసలు 'ముక్తి' అంటే ఏమిటి? జీవుడు విషయములకు (దృశ్య – ఇంద్రియ – వ్యవహారములకు) స్వాధీనుడు కాకపోవుటయే కదా! అది సదేహమైతే ఏమున్నది? విదేహమైతే ఏమున్నది? విషయములను విషయములుగా గ్రహించని వానికి ఇక 'భోగము' అనే అనుభవమే సిద్ధించదు కదా! విషయ భోగములకు సంబంధించిన భావన ఉన్నచోట మాత్రమే "ఈ స్థితి నిర్వాణస్థితి కంటే స్వల్పమైనది" అనే ప్రసక్తి లేక అవకాశం ఉంటుంది. 'జీవన్ముక్తత్వము' అను స్థితి యందు విషయభోగ భావనకు చోటే ఉండదు. కాబట్టి అది కూడా నిర్వాణముక్తి వంటిదే.

ఇప్పుడు వ్యాస, శుకదేవుల జీవన్ముక్తి – విదేహముక్తుల విషయానికి వద్దాం. జీవన్ముక్తుడగు ఈ వ్యాసునిగాని, లేక మరొకరిని గాని, "మట్టికుండ – వస్త్రము" వంటి పదార్థములను చూచినట్లు మాత్రమే (ఈ భౌతిక దృష్టిలో ఉన్నప్పుడు) మనం చూడటం జరుగుతుంది. ఇది అత్యంత పరిమితమైన దృష్టి మాత్రమే. అతని ఆంతరంగిక స్థితి ఎట్టిదో, అతడు ఈ దృశ్యమును, జగత్తును ఎట్టి దృష్టితో దర్శించుచున్నాడో భౌతిక దృష్టి మాత్రం చేత మనం గుర్తించగలమా? లేదు. అందుచేత ఉపాధిని అనుసరించి ఒకని జ్ఞానం లెక్కించటం సాధ్యం కాదు.

"బోధ స్వరూపులైనట్టి నిర్వాణముక్తులకు, జీవన్ముక్తులకు భేదమేమీ ఉండదు" అని మరల ప్రకటిస్తున్నాను. గాలి వీచినా, వీచకపోయినా – గాలి గాలేకదా! అలలు ఉన్నా లేకున్నా నీరు నీరే కదా! అట్లే ఇందు సందేహించవలసినదంటూ ఏమీ లేదు.

నా యొక్క, ఈ వ్యాస భగవానుని యొక్క లక్ష్యములు ఈ సదేహ – విదేహ ముక్తుల ప్రహసనం కానే కాదు. మా ఇరువురి ఉత్తమ లక్ష్యములు కూడా ద్వైత – ఏకత్వరహితమగు ఈ జీవాత్మ – పరమాత్మల అభేదము లేక ఐక్యతే అయివున్నది. అనగా "జీవుడే – పరమాత్మ" అని నిరూపించుటకే యత్నించుచున్నాము. ఎందుకంటే, ఉన్న సత్యము అదే కనుక.

ఇక మనం ప్రస్తుత విషయానికి వస్తున్నాం. ముముక్షువు శ్రద్ధతో తత్త్వజ్ఞానోప దేశమునకు సిద్ధపడవలసిన తీరు గురించి ఇప్పుడు విచారించబోతున్నాం. ఈ నా వచనములు లోక కళ్యాణకారకములై, అజ్ఞానమును, అంధత్వమును పారద్రోలుగాక! సర్వదా, సర్వమై, సర్వత్రా వెలయుచున్న ఆత్మతత్త్వము శ్రవణ భూషణంగా ప్రకటించబడు గాక.

❖❖❖

3. పురుష ప్రయత్నము

ఓ రఘునందనా! ఈ జగత్తులో ఎవరికైనా, ఏ వస్తువైనా లభించాలంటే పురుషకారమే (Effort) ఉపాయం కదా! పురుషకారం లేకుంటే ఎక్కడా ఏదీ జరుగదు. ప్రాప్తించదు. ఆకాశంలో ఆ చంద్రుని చూడు. అతడు లోకములకు ఆనందమును "శీతలత్వము ప్రసరించుట" అను క్రియ చేతనే ప్రసాదించగలుగుచున్నాడు కదా!

"పరిస్పందఫల ప్రాప్తౌ పౌరుషాదేవ, నా–న్యతః" (IV-9)

ఏ ఫలితమైనా పురుష ప్రయత్నం చేతనే లభిస్తోంది కాని, మరి దేని చేతనూ కాదు. అదే విధంగా పురుషకారము చేతనే జీవునకు జ్ఞానం ప్రాప్తించుచున్నది. అట్టి జ్ఞానము వల్లనే కామ – క్రోధాది తాపములను నశింపజేసే 'జీవన్ముక్తి' కూడా లభించుచున్నది.

పురుషకారము యొక్క రూపమే 'కర్మ'. అట్టి కర్మ యొక్క పర్యవసానంగానే ఒకడు ఒక చోటు నుండి మరొక చోటుకి వెళ్ళటం, భుజించటం, కావాలనుకొన్నది చూడటం మొదలైన దైనందిన లౌకిక క్రియలను కూడా నిర్వర్తించగలుగుచున్నాడు. ఇది అందరికీ నిత్యానుభవమే కదా!

అయితే అనేక విషయ చింతనలచే మోహితులైనవారు, మందబుద్ధి కలవారు మాత్రం "ఆఁ ! మాదేమున్నది? అంతా దైవము లేక అదృష్టము యొక్క అధీనములోనే ఉన్నది" అని చెప్పుకొంటూ తమను తామే సముదాయించుకొంటున్నారు.

పౌరుషం స్పందఫలవత్ దృష్టం ప్రత్యక్షతోనయత్
"కల్పితం మోహితైఃఉ మందైః దైవం కించిత్ న విద్యతే" (IV-10)

నాయనా రామా! ఈ దైవము, అదృష్టము – అనునవి మూఢులు, మోహితులు అగు జనులకొరకై కల్పించబడినవి మాత్రమే. వాస్తవానికి, అవి స్వతహాగా లేవు.

మరి ఈ ప్రాప్తించునవి, కనబడుచున్నవి ఏమంటావా? ఇదంతా కూడా ఇతః పూర్వపు పురుషకారమే (essence of past efforts) ఈ విధంగా జీవునకు ప్రాప్తిస్తున్నాయి. ఇతఃపూర్వపు ప్రయత్నములే అట్టి ప్రభావం అతనిపట్ల కలిగి ఉంటున్నాయి.

అయితే, మా దృష్టిలో 'పురుషకారం' అనగా, ... సాధు పురుషుల ఉపదేశానుసారంగా మనస్సును, వాక్కును, కాయమును నియమించి చేయబడు ప్రయత్నమే అయి ఉన్నది.* జ్ఞానము కొరకై అట్లు నిర్వర్తించబడు ప్రయత్నమే జీవుని జ్ఞానిగా తీర్చిదిద్దుతోంది.

ఆ విధంగా కాకుండా, ఇంద్రియానుకూలంగా మాత్రమే ప్రవర్తించుచు "నేను పొందాలనే అనుకొంటున్నాను. కాని, సాధించలేకపోతున్నాను. అయినా, మా వల్ల ఎక్కడౌతుంది? దైవమే ప్రసాదించాలి" అని అనుకొని వగర్చుచూ కూర్చుంటే లాభం ఏమి ఉంటుంది?

ముందుగా నీవు ఏమి సాధించదలచుకొన్నావో, సుస్పష్టంగా నిర్ణయించుకో. ఇప్పుడు, సరైన అవగాహనతో శాస్త్రోక్తమైన (శాస్త్రములచే చెప్పబడిన) ప్రయత్నం చేయి. ఎవడు ఏది కోరుకొంటాడో అద్దాని కొరకు శాస్త్రములచే ఉపదేశించబడిన మార్గమును అనుసరిస్తూ, మధ్యలో తన ప్రయత్నమును విరమించకుండా ప్రయత్నం కొనసాగిస్తాడో, – అట్టివాడు ఆ లక్ష్యమును తప్పక సాధించి తీరుతాడు. కాబట్టి రామా! మానవుడు తన జీవిత లక్ష్యమును ముందుగా దృఢీకరించుకొని, ఆపై శాస్త్ర సమ్మతమైన నిజమార్గంలో ప్రయత్నం చెయ్యాలి. అంతేకాని, ఏదో కొంత ప్రయత్నం చేసి, మరికొంత ఎక్కడో దృష్టి పెట్టి, మధ్యలో తనపై తానే జాలిపడుతూ క్రుంగిపోవటం, మా ఉద్దేశంలో, అర్థం ఉన్న పని కాదు.

ఓ రాఘవా! ఒకానొకడు ఇంద్ర పదవిని పొంది త్రిలోకాధిపత్యం వహిస్తున్నాడు. అతడు అది ఎట్లా పొందగలిగాడు? దైవం ప్రసాదించాడా? లేదు. తన ప్రబలమైన పురుషకారము (Intensified effort) చేతనే ఆతడు దానిని సాధించాడు. మరొక జీవుడు పురుష ప్రయత్న ఫలితంగానే బ్రహ్మ పదవిని అలంకరిస్తున్నాడు. ఇంకొకడు స్వకీయమైన తీవ్రప్రయత్నం చేతనే విష్ణుదేవుడయ్యాడు. వేరొకడు నిజప్రయత్న శీలత్వంచే చంద్రశేఖరుడై కైలాసగిరిని పావనం చేస్తున్నాడు. ఇందులో 'దైవము' అను దానికి పాత్ర ఎక్కడున్నది?

❖

ఈ పురుష కారము (ప్రయత్నము) అనేది రెండు విధాలుగా ఉంటోంది–

1. ప్రాక్తనము = ఇతఃపూర్వం చేసియున్న ప్రయత్నములు (Past deeds / efforts made in the Past)
2. ఆద్యతనము = వర్తమాన ప్రయత్నములు (Present deeds / efforts)

ఈ రెండింటిలో మొదటిదైనట్టి 'ప్రాక్తన పురుషకారము'ను 'దైవము' లేక 'అదృష్టము' అని జనులు పిలుస్తున్నారు. అయితే ఇప్పటి ప్రయత్నములు ఇతఃపూర్వపు క్రియల యొక్క ప్రభావమును జయించివేయగలవు. ఇందులో ఏమాత్రమూ సందేహం లేదు. లేకుంటే, శాస్త్రములు ప్రయత్నముల గురించి, సాధనల గురించి, ఉపాసనల గురించి ఎందుకు ప్రబోధిస్తాయి?

ప్రాక్తన పురుష – ప్రయత్నముల ప్రభావమునే 'సంస్కారములు' లేక 'వాసనలు' అని కూడా అంటున్నారు.

యత్నవద్భిః దృఢాభ్యాసైః ప్రజోత్సాహ సమన్వితైః
మేరవోఽపి నిగీర్యంతే! కైవప్రాక్పౌరుషే కథా ? (IV-18)

ప్రయత్నము– దృఢమైన అభ్యాసము కలవారు, ఉత్సాహవంతులు అయినట్టి వారు, మేరు పర్వతాన్నైనా సరే,...మ్రింగి జీర్ణం చేసుకోగలరు. ఇక వారికి ఈ దైవము, అదృష్టము అనునవి ఒక లెక్కలోనివి కావు.

శాస్త్రోచితంగా ప్రయత్నించటమే ఉచితం. 'శాస్త్రోచితం' అంటే ఏమిటి? అనుభవజ్ఞులగు పెద్దలు సర్వుల సానుకూల్యతను దృష్టిలో పెట్టుకొని, తమ అనుభవమంతా రంగరించి "ఇది ఇట్లు అనుసరించబడుగాక! ఈ విధములైన విధి – విధానములు నిర్వర్తించబడుగాక! ఇట్లు జనులు చేయకుండెదరుగాక" అని చెప్పినదే "శాస్త్రానుశాసితం" అంటున్నాం. వాటిని సూక్ష్మబుద్ధితో గ్రహించి సర్వులకు శుభప్రదం అయ్యేవిధంగా ఆచరించటమే మంచిదని మా ఉద్దేశం. అట్లు కాకుండా, చిత్తమునకు ఆధీనులై, విషయలోలుత్వముచే చేయు ప్రయత్నాలు అనర్థదాయకం, వ్యర్థం అవుతాయి. శాస్త్ర విహితమైన ప్రయత్నమును వదలి యథేచ్ఛగా సంచరించేవానికి కొన్ని రోజులకు రెండుచేతులు ఎత్తి నమస్కరించటం కూడా కష్టతరం కాగలదు. తమ పురుష ప్రయత్నమును త్యజించియుండే మందభాగ్యులను కాపాడకలిగేదెవరు? ఓ రామా! ఈ ప్రపంచంలో అజ్ఞానం, పేదరికం తాండవించటానికి కారణం ప్రజలంతా తగినంత ప్రయత్నశీలురు కాకపోవటమే. ప్రయత్నశీలుడు తాను సమృద్ధుడు అగుటయేకాక, తాను ఉన్నచోట, తన చుట్టుప్రక్కల కూడా సమృద్ధిచే నింపివేయగలడు. అతనికి ఈ ధరణీమండలమంతా ఒక లెక్కలోనిదే కాదు. ప్రయత్నశీలుడిని

---

* త్రికరణశుద్ధిగా (మనోవాక్కాయముల ఏకత్వముచే) నిర్వర్తించబడినది మాత్రమే పురుషకారమని, ఫలప్రదమని వసిష్ఠమహర్షి అభిప్రాయం.

అతని లక్ష్యము నుండి దూరం చేయగలిగేది అతని "ప్రయత్నరాహిత్యము" ఒక్కటే కావచ్చునేమోకాని, మరింకేదీ కాదు.

❖❖❖

4. వర్తమాన పురుష ప్రయత్నములు (ఆద్యతన పురుషకారం)

ఓ రఘురామా! అంతరంగమునందు "ప్రవృత్తి"యే సర్వ బాహ్యప్రవర్తనల యొక్క అంతర్లీన కారణం. అట్టి ప్రవృత్తి శాస్త్ర విధిని, శ్రద్ధాసక్తులను అనుసరించి ఆయా ప్రయోజనముల సిద్ధికి కారణమగుచున్నది.

మనసా వాంఛ్యతే యచ్చ యథాశాస్త్రం న కర్మణా,
సాధ్యతే మత్తలీలాసౌ! మోహనీనార్థ సాధనీ ॥ (V-2)

"మనస్సుతో కోరుకోవటం, కాని శాస్త్రవిధిని అనుసరించి ప్రయత్నం చేయకపోవటం" – ఇదీ, జీవునియొక్క దౌర్భాగ్యం. ఇది ఉన్మత్త క్రీడగాక మరేమిటి? దీనివలన ఏం ప్రయోజనం సిద్ధిస్తుంది చెప్పు? పైపెచ్చు అది మోహకారణమే అవుతుంది.* ఎవడు ఎట్లు యత్నించుచున్నాడో, వాడు అట్టి కర్మనే పొందుచున్నాడు. దైవకృతం లేక అదృష్టం దానికి వేరు విధంగా ఉండటం లేదు. ఈ కర్మ రెండు విధాలుగా చెప్పబడుతోంది.

1. శాస్త్రోచితమైన కర్మలు. 2. శాస్త్ర విరుద్ధములైన కర్మలు.

శాస్త్రోచితమైనవి పరమార్థము కొరకు, శాస్త్ర విరుద్ధములైనవి అనర్థము కొరకు ప్రవర్తిస్తున్నాయి.

అయితే ఒకడు "నేను ఈ విధముగా ప్రవర్తించకుండెదను గాక!" అని అనుకుంటాడు. (ఉదాహరణకు ఇతరులను దూషించుట, దురభ్యాసములు ఆశ్రయించుట, దురుసుగా సంభాషించుట, తీవ్రముగా వాంఛించుట, దీర్ఘముగా దుఃఖించుట, నిష్కారణముగా భయపడుట మొదలైనవి బాహ్య అంతరంగ క్రియా ప్రవృత్తులు). కాని, తాను అనుకొనుదానికి వేరుగా, బలవంతముగా నియమించబడిన దానివలె, ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? ఎందుచేతనో చెపుతాను విను.

ప్రతి సందర్భములోను ఈ మనుజుని ఇతఃపూర్వపు శారీరక–మానసిక క్రియాయత్నములు, ఇప్పటి ప్రయత్నములు నిరంతరం రెండు మేక పోతులవలె పోటీపడుచున్నాయి. ఈ ప్రాక్తన – ఆద్యతన ప్రయత్నములలో ఏది బలవత్తరమైనదైతే అదియే జయిస్తోంది. ఒకవేళ, వర్తమాన

---

* **పుణ్యాత్వ ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవః ।**
నపాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః ॥

ఈ మానవుడు పుణ్యఫలం అయినట్టి సుఖ, శాంతులు కోరుకొంటున్నాడు. కాని పుణ్యకర్మలందు ప్రయత్నశీలుడు అగుట లేదు. పాపఫలమైన దుఃఖాదులు కోరుకోడు. కాని, ప్రయత్నపూర్వకంగా పాపకర్మలందే ప్రీతి కలిగి ఉంటాడు. ఏమి దౌర్భాగ్యం!

శ్రద్ధాసక్తులకన్నా, శారీరక-మానసిక యత్నములకన్నా ఇతఃపూర్వపు క్రియలు అధికబలము కలిగి ఉంటే, అప్పుడాతడు అయిష్టుడైనప్పటికీ బలవత్తరముగా అట్టి కర్మలందే (సంకల్పములందే / లేక ప్రయత్నములందే) ప్రవేశించటం జరుగుతోంది.

అందుచేత రామచంద్రా! మానవుడు శాస్త్రవిధిని అనుసరించి సత్కర్మలకు సంబంధించిన ప్రయత్నములను ఎప్పటికప్పుడు అధికం చేసుకోవాలి. క్రమంగా అట్టి సత్కర్మలు బలవత్తరమై ఉత్తమ సంస్కారములుగా రూపుదిద్దుకుంటాయి. అట్టి సుసంస్కారం వివేకమును నిదురలేపి, శుద్ధ సత్త్వమగు ఆత్మవస్తువు యొక్క సామీప్యతను ప్రసాదిస్తుంది.

ఒకవేళ, అట్టి శుభకర్మలు ఆచరించటానికి ప్రయత్నములు చేస్తున్నప్పుడు ఏవైనా అవాంతరాలు వస్తున్నాయనుకో, "ఇవన్నీ ఇతఃపూర్వపు నా దుష్కర్మల ప్రబలత్వమే" అని గ్రహించబడుగాక అట్టి సమయములందు స్వప్రయత్నములను విడనాడకూడదు. పళ్ళతో పళ్ళు అదిమి అయినా సరే దృఢంగా శుభకరములగు కర్మలనే ఆశ్రయించాలి. ఫలోన్ముఖములగుచున్న ఇతఃపూర్వపు అమంగళకరములగు కర్మల ప్రభావమును (దుష్ట సంస్కారములను లేక వాసనలను) జయించివేయాలి. అణచివేయాలి. అందుకై ఓర్పు (తితిక్ష), పట్టుదల అవసరమైయున్నాయి. "విధియే బలీయమై నా చేత ఇట్టి దుశ్చర్యలు చేయిస్తోంది" అను రూపముతో మరల మరల తల ఎత్తే మూర్ఖభావములను వర్తమాన ప్రయత్నములచే అణగత్రొక్కివేయాలి.

ప్రత్యక్షముగా ఎదురుగా ఉన్న ఆద్యతన కర్మలను, వాటి ప్రయోజనములను గమనించకుండా "ఏదో శక్తి మమ్ములను నియోగిస్తోంది. లేక నిర్వీర్యులను చేస్తోంది" అని నమ్మువాడు చేతిలో ఉన్న ఫలమును వదలి, ఆకాశమువైపు చూస్తూ ఆ ఆకాశం నుండి ఏదైనా మధుర పదార్థము లభిస్తుందేమోనని ఎదురు చూచేవాడే అగుచున్నాడు. అట్టి దీనాలాపనలచే కలిగే ప్రయోజనమేమున్నది?అందుచేత రామా! ఇతఃపూర్వం ఆర్జించుకొనియున్న మనోదోషములు హరించిపోయేవరకు శాస్త్రోచితమైన సత్కర్మలను శరణువేడవలసిందే.

ఓ రాఘవా! ఇతఃపూర్వపు అశుభకర్మలు ఇప్పటి ప్రయత్నములచే జయించ బడతాయి. - అనుదానిలో నీవు ఏమాత్రం సందేహించవలసిన పనిలేదు. జనులు ఇప్పటి వ్రత-జప-నియమా దులచే రాబోవు దోషములను పరిహరించుకోవటం లేదా? ఇదే మనకు నిదర్శనం. కాబట్టి నీవు ప్రయత్నములతో కూడుకున్నవాడవై ఉండు. తద్వారా నిన్ను ప్రభావితం చేస్తున్న అశుభ-అదృష్టములను దూరంగా నెట్టివేయి. సంసారము నుండి నిన్ను తరింపజేయగల శమ-దమము*లను సంపాదించటానికే ప్రయత్నించు. ప్రయత్నహీనుడు గాడిదతో సమానం. అతడు ఇహమునందే ఉత్తమమైనదేదీ సాధించలేడు. ఇక పరమపదమును పొందే అవకాశమెక్కడ? శాస్త్రానుసారం యత్నించేవాడే ఇహ - పరముల రెండింటిని శుభప్రదం చేసుకో గలుగుచున్నాడు.

---

* శమము : కామక్రోధాదులు త్యజించి, శాంతము వహించుట ; దమము : ఇంద్రియములను నిగ్రహించుట.

సంసారకుహరాదస్మాన్నిర్గంతవ్యం స్వయంబలాత్ ।
పౌరుషం యత్నామాశ్రిత్య హరిణేవారిపంజరాత్ ॥ (V-15)

ఓ జనులారా! సింహము తన పంజాతో పంజరమును భేదించి వెలువడునట్లు మీరు ఈ సంసార పంజరము నుండి వెలువడుటకై యోచించండి. అందుకొరకై పురుష ప్రయత్నమును ఆశ్రయించుటయే మీకు శుభప్రదం. అదే మీ తక్షణ కర్తవ్యం. ఎందుకంటారా? ఈ శరీరం స్థిరంగా కలకాలం ఉండేది కాదని మీ అందరికీ తెలుసు కదా! దీని అస్థిరత్వమును దృష్టిలో పెట్టుకొని మీరు విచారణశీలురు కావాలి. నాయనలారా! పశుతుల్యమగు మూఢత్వమును త్యజించండి. సాధుజన సాంగత్యమును, సచ్ఛాస్త్రములను ఆశ్రయిస్తూ, మీ మీ ప్రయత్నములను దృఢత్వం చేయండి. ఈగ కురుపుపై వ్రాలి, అక్కడి చీము–నెత్తురు త్రాగుచు సంతోషపడునట్లు మీరు స్వల్ప విషయములగు గృహ అన్నపానాదుల కొరకై మహత్తరమైన మానవజన్మను వృథా చేసుకోకండి. అది ఉచితం కాదు.

❖

శుభకర్మల వలన శుభం చేకూరుతోంది. అశుభకర్మల వలన అశుభం ప్రాప్తిస్తోంది. ఇక ఇందులో 'దైవము' లేక 'అదృష్టము' అనబడు మూడవ స్వతంత్ర వస్తువుకు అవకాశమెక్కడ? 'ప్రత్యక్షము'గా ఉన్నదానిని వదలిపెట్టి 'అనుమానము'ను ప్రమాణంగా స్వీకరించేవాడు ఒకానొక రోజున తన చేతులను చూచుకొని, 'పాములు' అని భావించి భయముతో బాటలవెంట పరుగెత్తవలసి వస్తుంది. 'అదృష్టమే నన్ను ఈ పనికి పురమాయించుచున్నది' అని తలచువారి ముఖమును చూచి లక్ష్మి కూడా విముఖత్వం చూపుతోంది.

అందుచేత మనుజుడు తన పురుషకార బలంచేత మొట్టమొదట సాధన చతుష్టయ సంపత్తిని* సమకూర్చుకోవాలి. వివేకమును సునిశితం చేసుకోవాలి. ఆత్మజ్ఞానమును ప్రతిపాదించే మహార్థపూర్వకమైన శాస్త్రములను విచారించాలి. "నేను ఉత్కృష్టత పొందాలి" అనే లక్ష్యమును (ఆశయమును) కలిగియుండికూడా కొందరు అందుకు అనుకూలమైన శాస్త్ర విహితములైన ప్రయత్నములను ఆశ్రయించుటలేదు. అట్టివారి ఆశయములకు అర్థం ఏమి ఉంటుంది? "ఆ! ఏమి ప్రయత్నములు? ఎంతని ప్రయత్నించాలి? ఈ సత్కర్మల వ్యవహారమునకు అంతు ఎక్కడ?" అని తలచి తాత్సారం చేయరాదు. అప్రయత్నపరులు కారాదు. రాతి నుండి రత్నం ఎలా వస్తుంది? ప్రయత్నములేని వాడు ఏది మాత్రం ఎట్లా పొందుతాడు?

శాస్త్రోచోదితమైన ప్రయత్నం ఎన్నటికీ వ్యర్థం కాదు. "మట్టి కొద్దీ కుండలు, దారము కొద్దీ వస్త్రములు, పిండి కొద్దీ రొట్టె లభిస్తాయి" అనునది అందరికీ తెలిసిందే కదా! అదేవిధంగా పురుషార్థమును అనుసరించే ప్రయోజనములు కూడా ఉండటం జరుగుతోంది. చేసిన ప్రయత్నమును

* "సాధన చతుష్టయ సంపత్తి" అంటే ఏమిటో ఈ ప్రకరణంలోనే ముందుముందు సవివరంగా చెప్పబోవుచున్నారు.

బట్టే ఫలితములు సిద్ధిస్తున్నాయి. బాల్యం నుండే మాటిమాటికీ, అధికంగా ఆశ్రయించబడుచున్న సత్సంగము, శాస్త్ర చర్చ, శుభమైన అభ్యాసములు – ఇవన్నీ లక్ష్యమును దృఢతరం, సుస్పష్టం చేస్తున్నాయి. "ఉత్తమ జ్ఞానము కొరకు, తదనుకూలమైన ప్రయత్నములను చేసెదను గాక!" అను సంకల్పము రూపు దిద్దుకుంటోంది. అట్లు ఆశ్రయించుచున్న స్వప్రయత్నమే మానవునకు అమోఘమైన ఫలమును ప్రసాదిస్తోంది.

ఈ విధంగా ప్రత్యక్షములు, అనుభూతములు, దృష్టములు, శాస్త్ర సమ్మతములు అయిన ప్రయత్నములను ఆశ్రయించాలి. అట్లు చేయకుండా "దైవము నాపట్ల లేదు అందుకే నేను ఉత్తమ ప్రయత్నమేదీ చేయలేకపోతున్నాను" అని తలచు మూఢజనులు జ్ఞానుల దృష్టిలో జీవన్మృతులే. చిత్రం ఏమిటంటే, అనేక అవకాశములకు స్థానభూతమైన, ఉత్తమమైన ఈ మానవజన్మ పొందికూడా అనేకులు ఏ ఉత్తమ ప్రయత్నములను ఆశ్రయించకుండా రోజులు గడపివేస్తున్నారు. అనర్థహేతువగు సోమరితనమే లేకపోతే, గొప్ప పండితుడో ధనవంతుడో అవనివాడు ఎవడుంటాడు? సోమరితనము వల్లనే ఈ ధరామండలమంతా అనేకమంది మూర్ఖులతోను, దరిద్రులతోను, నర పశువులతోను నిండి ఉన్నదని నాకు అనిపిస్తోంది. బద్ధకము, సోమరితనము త్యజించిన వారికే ఉత్తమ వస్తువు లభ్యపడుతోంది.

❖

ఓ రఘురామా! సచ్ఛాస్త్ర విధిని అనుసరించి, సత్సంగశీలుడై సదాచార పూర్వకంగా నిర్వహించబడిన కర్మ సంపూర్ణంగా ఫలప్రదమౌతోంది. లేకుంటే ఉత్తమమైన ప్రయోజనం లభించుటలేదు. పురుష ప్రయత్నము యొక్క, కర్మయొక్క స్వరూప స్వభావములు అట్టివి. ఇదే కర్మ సిద్ధాంతము. దీనిని గ్రహించి చరించు మనుజుడు ఎన్నటికీ విఫలుడు కాడు. హరిశ్చంద్రుడు మొదలైన అనేకమంది ఉత్తములు అనేక దుఃఖ –దారిద్ర్యములు పొందుచున్నప్పుడు కూడా తమ పురుషకారమును, ప్రయత్నమును త్యజించలేదు. అందుచేతనే వారు ఇంద్రతుల్యులు అయ్యారు. మీ పూర్వీకులగు అనేకమంది చక్రవర్తుల చరిత్రలు ఇట్టివే.

బాల్యే గతే ఽ విరతకల్పిత కేళిలోలే,
దోర్దండమండితవయః ప్రభృతి ప్రయత్నాత్ ।
సత్సంగమైః పదపదార్థవిశుద్ధబుద్ధిః
కుర్యాన్నరః స్వగుణదోష విచారణాని ॥ (V-31)

ఓ జనులారా! ఒక్కసారి ఈ యావత్తు జీవితమును పరికించి చూడండి. బాల్యమంతా అతి చంచలమైన హావభావములతో, కల్పిత క్రీడలతో గడచిపోతోంది. ఉత్తమ కర్మాచరణం సులభంగా అలవడు అవకాశమున్న బాల్యము మూర్ఖత్వంతో, అజ్ఞానంతో వృథా అవుతోంది. ఈ బాల్యంలో సద్భావనలు, ఉత్తమ అభ్యాసములు ఆశ్రయించబడుట లేదు. పోనీ వారికి ఉత్తమ మార్గమును చూపగల విశాల బుద్ధి కలవారి శుశ్రూష (teachers and education - system) లభిస్తోందా?

లేదు. లభించినా, అనేకులు వినుటయే లేదు. జీవితము యొక్క ఉత్తమ లక్ష్యములను గ్రహించలేకపోతున్నారు. సరే, బాల్యం గడచిపోయిన తరువాత, ఇక తాత్సారం చెయ్యరాదు. యౌవనమునుండే "ఇది నిత్యము -- ఇది అనిత్యము" -- అని విచారణ చేయాలి. అట్టి వివేకమును అధికం చెయ్యగల సుగుణములను అలవరచుకోవాలి. సత్సంగం కొరకు ప్రయత్నం చెయ్యాలి. శ్రద్ధగా ప్రయత్నించినప్పుడు లభించనిదంటూ ఏమి ఉంటుంది?

ఎప్పటికప్పుడు స్వీయగుణ దోషములను పరీక్షించుకొంటూ, తగిన చికిత్సా పూర్వకమైన స్వప్రయత్నమును ఆశ్రయించాలి. అంతేగాని, పరుల దోషములు ఎంచుచూ, కాలం వృథాపరచుకోరాదు.

సాయం సమయమైనది. ఆ రోజుకు సభచాలించబడింది.

❖❖❖

(మొదటిరోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

రెండవ రోజు

5. ప్రయత్నము - కార్యసిద్ధి

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఓ సభికులారా! నిన్నటిరోజు మనం విచారించినదంతా మననముచే గ్రహించారు కదా! నిన్న చెప్పుకొన్నట్లు "ఇతః పూర్వపు ప్రయత్నరూపములైన కర్మలు" – అనునవి కాకుండా "అదృష్టము" అనబడు ఇంకొక వస్తువు ఏదీ లేదు. కనుక అట్టి అదృష్టమనునది దూరంగా నెట్టి వేయబడుగాక. "మానవుడు సాధుసంగం, సచ్ఛాస్త్రం, స్వవిచారణలను ఆశ్రయించి, స్వప్రయత్నముల ద్వారా ఆత్మ సముద్ధరణకు నడుం కట్టాలి" – అని గుర్తు చేస్తూ రెండవ రోజు విచారణ ప్రారంభిస్తున్నాను. ప్రయత్నమే అన్నిటికన్నా ముఖ్యమైనది.

"యథా యథా ప్రయత్నః స్యాత్, భవేదాశు ఫలం తదా ।
ఇతి పౌరుషమేవ అస్తి, 'దైవమ్' అస్తు తదేవచ ॥ (VI-2)

చేసే ప్రయత్నములను బట్టే ఫలితములు ఉంటున్నాయి. 'అదృష్టము' అనునది కూడా పురుషకారమును అనుసరించే ఉంటోంది.

ఈ లోకులు దుఃఖములు పొందుచున్నప్పుడు "హా! హతవిధీ! ఎంత కష్టం" అంటూ ఉంటారు. ఏదైనా సంతోషకరమైన విషయం ప్రాప్తించినప్పుడు "ఓహో! ఎంతటి అదృష్టం!" అని పలుకుచున్నారు. వారు అట్లు 'హతవిధి' అని, 'అదృష్టము' అని సంబోధించునది పూర్వకాలపు లేక పూర్వజన్మల పురుష ప్రయత్నములనే అయి ఉన్నట్లు మేము గ్రహిస్తున్నాం. అంటే 'దైవము లేక అదృష్టము' అను పదములు పురుషకారమునే (పురుష ప్రయత్నములనే) సూచిస్తున్నాయి. ప్రాక్తన కర్మలు కాకుండా వేరుగా జీవుని నియమించగల దైవము – అనునది లేదు. ఎందుకంటావా? ఏ విధంగా అయితే బలశాలుడగు పురుషుడు ఒక బాలుని చిటికెలో వశపరచుకోగలడో, అదే విధంగా ప్రయత్నశీలుడైనవాడు అనాయాసంగా 'అదృష్టము' అనుదానిని వశపరచుకో గలుగుచున్నాడు.

ఒకడు తాను చేసిన అశుభ కర్మలను ప్రాయశ్చిత్త కర్మలచే శుభములుగా మార్చుకొంటున్నాడు కదా! అదే విధంగా పూర్వకర్మల దోషములను వర్తమాన ఉత్తమ ప్రయత్నములచే తప్పకుండా శుభప్రదం చేసుకోవచ్చు. అట్లుకాకుండా అల్ప విషయముల పట్ల లోభమును పొంది, "దైవము" అనుదానిని జయించుటకు ప్రయత్నించకుండా, అద్దానికి లోబడి ఉండువారు మా ఉద్దేశంలో దీనులు, మూఢులే.

ఎప్పుడైనా వర్తమాన పురుష ప్రయత్నం విఫలమౌతుంటే అప్పుడు, మనం నిన్నటిరోజు చెప్పుకొన్నట్లు, ఇతఃపూర్వపు 'వ్యతిరిక్త' పురుషకారం ప్రబలంగా ఉన్నదని గ్రహించాలి. ఇక ఇప్పుడు శాస్త్రవిధిని, పెద్దలను ఆశ్రయించి యే యే ప్రయత్నములు ఉచితమో, ఉత్తమమో సద్విమర్శనా

పూర్వకంగా నిర్ణయించుకోవాలి. మరల మరల ప్రయత్నశీలుడు కావాలి. ఒక గుత్తిలోని రెండు పండ్లలో ఒకటి తియ్యగా మరొకటి పుల్లగా ఉంటే, ఇందుకు ఆ ఫలభోక్త యొక్క ఇతఃపూర్వపు కర్మాచరణమే కారణం" అని గ్రహించుటే ఉచితం కాని, దైవముపై ఆపాదించుట ఉచితం కాదు. ఎందుకంటే సర్వసాక్షి, అకర్త, అభోక్త అగు పరమాత్మకు కర్మదోషం ఎలా అంటగట్టగలం?

మహాప్రసిద్ధమగు పదార్థములు క్షయం పొందుతున్నప్పుడు కూడా "ఇది క్షయ కర్త యొక్క పురుషకారమే" అని గ్రహించబడుగాక. ఈ జగత్తులోని ప్రతి అభివ్యక్తము వెనుక ప్రయత్నశీలత్వమే అంతర్లీనంగా ఉండి ఉన్నది. ప్రతిజీవుని యందు ప్రతి క్షణం ప్రాక్తన – ఆద్యతన* పురుషకారములు ఒకదానితో మరొకటి సంఘర్షణ పడుచుండగా అందులో అధికమైన బలముగలది గెలుస్తోంది.

"ఒకానొక రాజ్యంలో రాజవంశం నశించింది. అక్కడి మంత్రివర్యులు తమ రాజును నిర్ణయించుకోవలసి వచ్చింది. వారు ఒక శుభమైన రోజున ఒక ఏనుగును అలంకరించారు. దాని తొండమునకు ఒక పూలమాల అందించి రాజవీథిలో వదిలారు. అనేక ప్రదేశముల నుండి తండోపతండములుగా వచ్చిన జనులు ఆ వీథిలో గుమిగూడి ఉన్నారు. ఆ ఏనుగు ఒకానొక భిక్షకుని మెడలో ఆ దండను వేసి రాజుగా చేసింది. ఆ భిక్షకుడు చాలాకాలం రాజ్యం పాలించాడు". ఈ సంఘటనలో కూడా "అంతా దైవమే చేశాడు" అనటం భావ్యం కాదు. ఇందులో మంత్రుల యొక్క, పౌరుల యొక్క, ఏనుగుయొక్క, రాజశాసనము యొక్క ప్రయత్నశీలత్వమే (పురుషకారమే) అట్టి సంఘటనకు కారణమైనది. వారి సమానాభిప్రాయబుద్ధి, అందుకు సంబంధించిన ప్రయత్నమే భిక్షకుని రాజుగా చేసింది. ఇక, భిక్షకుడు అంతకు ముందు చేసియున్న ప్రయత్నములను మనం చూడలేం కనుక "ఇది దైవము చేశాడు" అనే పదప్రయోగం చేయటం జరుగుతోంది. అంతేకాని ఈ సంఘటనలో 'దైవము' ఎక్కడ పాల్గొన్నది?

❖

ఒకానొకడు ఏదైనా సాధించుటలో సమర్థుడు అగుచున్నప్పుడు అతని ప్రయత్నము దృష్టము కావచ్చు. లేక ఎదురుగా కంటికి కనబడకపోవుటచే 'అదృష్టము' కావచ్చు. కాని మరొకడు అట్టి సమర్థత వెనుక ఉన్న ప్రయత్నశీలత్వమును గమనించలేడు. కనుక "ఇదంతా దైవమే అతనికి ప్రసాదించింది" అని భావించి ఊరట చెందుచున్నాడు. అయితే అట్టి అభిప్రాయం జ్ఞానుల దృష్టిలో మూర్ఖమగు అభిప్రాయం మాత్రమే. ఈ ప్రపంచంలో మనకు ఒక సమర్థుడైన వ్యక్తి కంటే ఇంకా అధికమైన సమర్థతగల వ్యక్తి తారసపడుచున్నాడు కదా! ఆ భేదం ఎక్కడి నుండి వస్తోంది? ఆ రెండవవాడు అధికమైన ప్రయత్నం చేసియుండట చేతనే. కాబట్టి 'సమర్థత' అనునది అదృష్టానుసారం ఉండేది కాదని, స్వప్రయత్నముల అల్పాధిక్యములను బట్టి ప్రాప్తించేదేనని తెలిసిపోతోంది.

ఈ వర్తమానమునందు ఆశ్రయించబడు ప్రయత్నములచే ఇతఃపూర్వపు దుష్కర్మల సంస్కారమును జయించివేయవచ్చునని అనుకున్నాం కదా! అయితే, వర్తమానపు శుభ ప్రయత్నములను ఇతః పూర్వపు అశుభ ప్రయత్నముల (కర్మల) ఆకర్షణ ఓడించకుండా చూచుకోవాలి. ఉత్తమమగు

లక్ష్యమునుండి చలించనివాడే విజయమును పొందుచున్నాడు.

ఎప్పుడైనా సరే, ఈ ప్రాక్తన* – వర్తమాన పురుషకారములు రెండిటిలో ఐహిక (వర్తమాన) పురుషకారమే అధిక బలమైనదిగా భావించాలి. ఈ ఐహిక పురుషకారం ఇప్పుడు మన చేతిలో ఉన్నది. "ప్రయత్నం చేయుటచే నేను ప్రాక్తనమును జయించి వేయగలను" అను నమ్మకం కలిగి ఉండాలి. తనపై, గురువుపై, శాస్త్రముపై విశ్వాసము, నమ్మకము (faith and confidence) కలిగి ఉండాలి. "అయ్యో! నేనేమి చేయగలను? నేను ఒక స్వల్ప మానవుణ్ణి. ఇది ఇంతే. ఎవరో మహానుభావులే దీనిని అధిగమించగలరు. మా వంటి మామూలు మనుష్యుల వలన ఏమౌతుంది?" – ఇటువంటి దౌర్బల్యములైన భావములు కలిగియుండి, అప్రయత్నశీలురై ఉండేవారికి ధిక్కారమగుగాక!

ఓ రాఘవేంద్రా! ఒక రైతును గమనించు. ఆతడు సంవత్సరమంతా కష్టపడి పండిస్తాడు. ఒక్కొక్కసారి ఒక రోజు వచ్చిన తుపాను తాకిడికి చేతికి వచ్చిన పంట అంతా దెబ్బ తింటుంది. అతడు కొద్ది క్షణాలు నిరుత్తరుడౌతాడు. అయితే అట్టి నిరుత్సాహమునందే కృంగిపోయి ఊరుకుంటున్నాడా? లేదు. మరల "విత్తులు ఎక్కడ? నాగలి ఎక్కడ?" అంటూ పునః ప్రయత్నశీలుడై మంచి పంటను సాధిస్తున్నాడు. వర్షము యొక్క పురుషార్థము వలన దెబ్బతిన్న ఆ రైతు స్వకీయమైన పురుషార్థముచే తిరిగి పుంజుకొంటున్నాడు. ప్రతిజీవుడు ఇందలి పాఠమును గ్రహించాలి. అధిక ప్రయత్నం చేసేవాడు విజయం తప్పక సాధిస్తాడు.

❖

అదే విధంగా ఒక వ్యాపారస్తుడు కష్టపడి ఆర్జించిన విత్తమంతా నష్టపోయినప్పుడు కూడా ఏం చేస్తున్నాడు? తిరిగి ప్రయత్నించి లాభములు ఆర్జించటానికి నడుం కట్టుచున్నాడు కదా! అట్లు ప్రయత్నించుటయే ఉచితం. అట్లాకాకుండా, దుఃఖించుచు కాలం గడపటం, ప్రయత్నమును త్యజించటం ఉచితమెట్లా అవుతాయి?

అనువుకాని చోట, చేయకలిగినదేమీ లేనిచోట దుఃఖించటం అనవసరం, నిష్ప్రయోజనం కూడా. అట్లు దుఃఖించ తలచుకొంటే అనివార్యమైన మృత్యువు గురించి మననం చేస్తూ ప్రతి రోజు కొంతసేపు ఓ మూల కూర్చుని దుఃఖించాలి. అట్లా చేస్తున్నామా? లేదు కదా! కాబట్టి ఇప్పటికిప్పుడు ఏది చేయలేమో దానిని గురించి విచారించటం అప్రస్తుతం. చేయకలిగినట్టి ఉత్తమ ప్రయత్నమునకై వెతకి, అద్దానిని విధి – విధానముగా, శ్రద్ధతో, సదవగాహనతో నిర్వర్తించుటయే మనం ప్రస్తుతం చేయవలసినది.

❖❖❖

---

* 1. ప్రాక్తనము = ఇతఃపూర్వం చేసియున్న ప్రయత్నములు (Past deeds /efforts made in the past)
2. ఆద్యతనము = వర్తమాన ప్రయత్నములు (Present deeds / efforts)

6. దైవ ప్రేరణ - పురుషార్థము

ఈ జగత్తులోని పదార్థాలన్నీ దేశ – కాల – క్రియ – ద్రవ్యముల శక్తిని అనుసరించి ప్రకాశించుచున్నాయి. వీటన్నిటిలో అధిక యత్నశీలి అయినవే జయిస్తున్నది. మానవుడు సర్వదా పౌరుష బలమునే ఆశ్రయించాలిగాని, తెలియని దైవంపై భారంవేసి అప్రయత్నశీలుడగుట ఉచితంకాదు. సాధు సాంగత్యం, శాస్త్ర విచారణ ఆశ్రయించి ముందుగా చిత్తశుద్ధిని సంపాదించాలి. చిత్తశుద్ధి సహాయంచేత దుర్భరమైన సంసార సాగరమును దాటివేయాలి.

ఈ "ప్రాక్తన–ఐహిక పురుషకారములు" అనే ఫలవృక్షాలలో బలమైన వృక్షం బలహీనమైన దానిని కప్పివేస్తోంది. మానవుడైనవాడు నిజప్రయత్నములచే ప్రాక్తన కర్మలను అణగత్రొక్కివేయాలి. ఎవడైతే అట్లు చేయడో, – అట్టి వానికి తన సుఖ దుఃఖముల రెండిటి యందును స్వాతంత్ర్యము ఉండదు. నిజప్రయత్నములను బలవత్తరం చేయలేని పశుతుల్యుడగు జీవుడు ఈశ్వర ప్రేరితుడై స్వర్గ నరకములకు వెళ్ళి వస్తూ ఉంటాడేగాని, స్వతంత్రుడు కాలేడు. అట్టివాడు సర్వదా పరాధీనుడే. ఇక 'మోక్షము' అను మాట ఎక్కడిది? సదాచార సంపన్నుడు, ప్రయత్నశీలుడు అగువాడు మాత్రమే ఈ 'జగన్మాయ' అనే పంజరమును ఛేదించి బయటకు రాగలుగుచున్నాడు. అతనికి తన ఉదారము, చమత్కారము అయినట్టి స్వకీయ ప్రయత్నమే తోడుగా నిలచి బంధవిముక్తిని ప్రసాదించుచున్నది.

కశ్చిన్మాం ప్రేరయిత్యేవమ్ ఇత్యనర్థ కుకల్పనే
యఃస్థితో దృష్టముత్సృజ్య నత్యాజ్యోఽసౌ దూరతోఽధమః ॥ (VI-29)

ఎవ్వరైతే ఎదురుగా (దృష్టమై) కనిపించుచున్నట్టి పురుషప్రయత్నమును, దాని యొక్క ప్రయోజనమును గుర్తించక, "నన్ను ఎవరో ఎక్కడినుండో ప్రేరేపిస్తున్నారు. లేక నా ప్రయత్నముల నుండి నన్ను నిరోధిస్తున్నారు. అందుచేతనే నేను ఇట్లు అగుచున్నాను" అని తలచుచు, కుకల్పనలు చేసుకొంటూ, లక్ష్యశుద్ధి లేకుండా అప్రయత్నశీలురై ఉంటారో, అట్టివారిని దూరంగా త్యజించటం మంచిది.

వేలకు వేలు వ్యవహారాలు ప్రతి రోజు ఈ జీవుని సమక్షమునకు వస్తున్నాయి. పోతున్నాయి. వాటియందు రాగద్వేషాలు కలిగియుండకుండా శాస్త్రానుసారం ఆచరించటమే ఉత్తమం. శాస్త్రానుసారంగా లోకానుకూలంగా స్వీయకర్మలను రక్షించుకొనువాని వద్దకు, రత్నాలన్నీ సముద్రంలోకి వచ్చి చేరుచున్నట్లు, ఉత్తమ గుణములు, అభీష్ట సిద్ధులు వచ్చి చేరుచున్నాయి.

ఏ యత్నములైతే సుఖదాయకములై, దుఃఖనివృత్తికరములై ఉంటున్నాయో, అట్టి యత్నములనే విజ్ఞులైన పెద్దలు "పౌరుషము" అని నిర్ణయిస్తున్నారు. శాస్త్ర విహితములైన అట్టి యత్నములే "పురుషార్థము" అను ప్రయోజనమును కలుగచేస్తున్నాయి. ఇట్టి కర్మయొక్క రహస్యమును (కర్మ సిద్ధాంతమును) గ్రహించినట్టి బుద్ధిమంతులగువారు ఊరకే కాలం వృథాచేయరు. వారికి "అయ్యో! ప్రాప్తిస్తుందో? లేదో?" – అను రూపముగల ప్రాప్తాప్రాప్తములు ఒక లెక్కలోనివి కావు. ప్రయత్నమును అనుసరించే ప్రయోజనము ఉంటుందని వారికి తెలుసు. అందుచేతనే వారు గురుసేవ,

స్వాధ్యాయనము, సాధు సంగం, శ్రవణము, పరోపకారము మొదలైన ప్రయత్నములచే, తమ చిత్తములను దోషరహితం చేసుకొంటున్నారు. తద్వారా ఆత్మోద్ధరణమును సాధించుచు, – స్వస్వరూపము, సర్వస్వరూపము అయినట్టి "ఆత్మానుభవము" అను పురుషార్థమును క్రమంగా పొందుచున్నారు. అనిర్వచనీయమగు ప్రశాంతత్వమును అవధరిస్తున్నారు. కనుక ఓ రామా! నీవు సర్వ విధములైన లౌకిక పార లౌకిక ప్రయత్నములన్నీ "చిత్తశుద్ధిని పొందెదను గాక" అను లక్ష్యముతో చెయ్యాలి కాని, మరింకెందుకూ కాదు.

నాయనా! రాఘవా! ఈ ద్వైత వైషమ్యమంతా అజ్ఞానముచేతనే ప్రాప్తిస్తోంది. అట్టి వైషమ్యమును నివృత్తింప చేసి, 'సమతానందము' అను దానిని పొందించునదే "పురుషార్థం" అని పెద్దలు పిలుస్తున్నారు. అట్టి అఖండానందమే జీవుని లక్ష్యము కావాలి. అయ్యది ప్రాప్తింపచేసే శాస్త్రములను, సాధువులను, సత్కర్మలను ఎల్లవేళల సేవించాలి.

❖

ప్రాక్తనకర్మ పరలోకములలో (In the past births) అనుభవించగా మిగిలినదే మనతో ఈ లోకానికి వచ్చి మన ఈ వర్తమాన అనుభవములకు కారణమగుచున్నది. దానినే జనులు 'దైవము' అని పిలుస్తున్నారు. "భ్రాంతము" (ఇది కష్టము – ఇది సుఖము అను భావన భ్రాంతియే కాబట్టి వసిష్ఠ మహర్షి ఆ అనుభవమును 'భ్రాంతము' అని వర్ణిస్తున్నారు), "అదృష్టము" (ఎదురుగా కనబడునది కాదు కాబట్టి) అయినట్టి ప్రాక్తన కర్మను ఉద్దేశించి "అయ్యో! దైవమా! ఇది ఇట్లగుచున్నదేమిటి?" అనునట్టి వాక్యములచే కొంత ఊరట చెందుచున్నారు. వారిని అట్లే పొందనీ, వారిని, నేనేమీ అనుటలేదు. కానీ, వర్తమానంలోని పురుషకారమును త్యజించి, మూఢులచే కల్పించబడిన "అదృష్టము"ను ఆశ్రయించేవారిని మాత్రమే నేను ప్రశ్నిస్తున్నాను. అట్టి అదృష్టము ఎక్కడ ఉన్నది? ఎక్కడి నుండి లభిస్తోంది? అదృష్టమును నమ్మి ఉండునట్టి నిష్క్రియులు క్షయము వైపే పయనించుచున్నారని గుర్తుచేస్తున్నాను. ఎందుచేతనంటావా? నిజ పౌరుషబలము చేతనే సకల శుభములు చేకూరచుండగా, అట్టి స్వప్రయత్నము విషయంలో అశ్రద్ధ కలిగియుండుట ఉచితము ఎట్లా అవుతుంది? వర్తమాన సత్కార్యములు, ప్రాయశ్చిత్త కర్మలు శుభములుగా మారి భవిష్యత్తునందు శోభను కలుగచేస్తున్నాయి.

అందుచేతనే ఓ రామా! ఈ జీవుడు కార్యశీలుడు కావాలి. బద్ధకమును, అశ్రద్ధను త్యజించాలి. అతడు స్వకీయమైన పురుష కారముచేత కోరుకొన్న ఫలమును అరచేతిలోని ఉసిరికకాయవలె ప్రత్యక్షం చేసుకోగలడు. మూఢుడైనవాడు మాత్రమే ప్రత్యక్షమును పరిత్యజించి 'అదృష్టము' అను మోహమునందు నిమగ్నుడగుచున్నాడు. ఓ శుభాశయా! రామచంద్రా! ఈ కార్యకారణములకు సంబంధించిన సమస్త సంశయములను కాస్త ప్రక్కకుపెట్టు. నీయొక్క చిత్తవృత్తి బలంచేత కల్పితము, మిథ్య అయినట్టి 'దైవము' అను దానిని అపేక్షించటం మానివేయి. పురుషకారమును (లేక ప్రయత్నమును) ఆశ్రయించి ఉద్ధారణ పొందెదవుగాక!

❖

ఈ జీవుడు చిత్తశుద్ధి పొందితే అంతా సుస్పష్టమే అవుతుంది. అయితే చిత్తశుద్ధి లభించేదెట్లా? జ్ఞానము వలననే. జీవుని సముద్ధరించగల ఉత్తమోత్తమజ్ఞానం (ఆత్మజ్ఞానం) లభించాలంటే, 'వేదములు' మొదలైన శాస్త్రములచేతను*, సత్పురుషుల ఆచరణ చేతను, వారిచే బోధింపబడుచున్న ప్రవచనముల చేతనే సాధ్యం. అట్లాగే, దేశకాలములను అనుసరించి చెప్పబడే ధర్మములను ఆచరించాలి. అన్ని వేళలలోను హృదయంలో "చిత్తశుద్ధి – జ్ఞానము" అనే మధుర ఫలములను ఉత్పత్తి చేయగలిగినట్టి ఉపాయములకొరకు అన్వేషించాలి. అట్టి నిరంతర ప్రయత్నములను ఆశ్రయించాలి. అందుకొరకై 'తీవ్రేచ్ఛ' కలిగియుండాలి.

ఓ రామా! ఒకడు కనుక "చిత్తశుద్ధి – జ్ఞానము" పొందవలెనను తీవ్రేచ్ఛ కలిగి ఉంటే, తదనుకూలమైన సాధనములు, ప్రయత్నములు వాటంతటవే సమకూరుతాయి. అప్పుడు అట్టి ప్రయత్నశీలునియందు స్ఫురించే కార్యక్రమ వ్యవహారమే "పౌరుషము" అని చెప్పబడుతోంది. మల్లయుద్ధ వీరుడు పోటీలో గెలవాలంటే బలము, తెలివి రెండూ కావాలి కదా! అట్లే జీవుడు కూడా మాయను జయించాలంటే "ఉత్తమ ప్రయత్నములచే (తపస్సు, ధ్యానము, లోకోపకారములగు కర్మలు, నామస్మరణ మొదలైనవి) పొందబడగల "చిత్తశుద్ధి" : సద్గురుసేవ, శాస్త్ర విచారణ, స్వయముగా విచారించుట మొదలైన వాటిచే వివేకము వికసించగా పొందబడగల "జ్ఞానము" – ఈ రెండింటిని సంపాదించుకోవాలి.

కనుక ఓ ప్రియ రామచంద్రా! మానవుడైనవాడు మొట్టమొదట బుద్ధిబలంతో పురుషకారమును ఆశ్రయించి, సర్వవేళలా, సర్వవిధములా ప్రయత్నించుటయే ఉచితం. అప్పుడే మానవ జన్మ సార్థకమౌతుంది. ఆ తరువాత, శాస్త్రములను, సాధువులను, పండితులను సేవించి ఆ ప్రయత్నములను సఫలం చేసుకోవటమే కర్తవ్యమైయున్నది.

మహాత్ములగు వివేకశీలురు దైవము–పురుషకారము – ఈ రెండిటి యొక్క బలాబలములను చక్కగా విచారించి, పరిశుద్ధమైన లక్ష్యముతో వర్తమాన ప్రయత్నములను ఉత్సాహపూరితం చేసుకొంటున్నారు. అందుకే వారు జీవించి ఉన్నందుకు ఉత్తమమైన ప్రయోజనమును పొందుచున్నారు. కనుక, నీవు కూడా జ్ఞాన సేవితమైనట్టి శ్రవణ మననాదులను ఆశ్రయించు. సర్వదా ఆత్మోద్ధారణ వైపునకే ప్రయాణించెదవు గాక!

స్వాభావికమైనట్టి ఐహిక (Present) పురుషకారమునే కార్యసిద్ధి యొక్క ఉపాయంగా జీవుడు ఎంచుకోవాలి. ఆత్మజ్ఞానులగు పండితులు ఉన్నారు. వారిని, వారు చెప్పుదానిని ఉపేక్షిస్తూ రోజులు గడపటం ఉచితంకాదు. వారిని సేవించుచూ సత్యాసత్య వివేక రూపమగు జ్ఞానమును సంపాదిస్తూ, సత్కర్మాచరణులై జనన మరణరూపమగు 'సంసారభ్రమ' అను రోగము నుండి విముక్తులు అగుటకు ప్రయత్నించెదరు గాక శాంతిని, సమతాభావమును పొందెదరుగాక!

❖❖❖

---

* అట్లాగే జీసస్, మహమ్మద్, బుద్ధుడు, గురునానక్ మొదలైన ప్రవక్తలచే బోధింపబడిన గ్రంథాల చేత కూడా.

7. నిజప్రయత్న ప్రాధాన్యం

ఓయీ! మానవుడా! నీవు ఈ ఉత్తమమైన ఉపాధిని పొందావు. నిత్యానిత్యములను విచారించి గ్రహించగలిగే సూక్ష్మబుద్ధినికూడా పొంది ఉన్నావు. (జంతువుల బుద్ధితో పోల్చినప్పుడు మానవుని బుద్ధి సునిశితమైనదే కదా!) అనేక ఉపాయములకు అవకాశమైయున్న ఈ జీవితమును వ్యర్థపరచుకోవటం తగిన పనేనా? కాబట్టి శ్రద్ధాసక్తుడవై, స్వస్వరూపమగు ఆత్మయందు సమాధానమును పొందు లక్ష్యముతో వ్యవహరించాలి. ఈ దుష్ట సంసార వ్యవహారమును అంతరంగము నుండి తొలగించివేయి.

'పురుషకారము'చే 'అదృష్టము'ను నివారింప యత్నించువానికి ఇహ–పరలోకముల రెండిటియందు అభీష్టసిద్ధి ప్రాప్తిస్తోంది. అట్లుకాక, అదృష్టమును నమ్మి అప్రయత్న పరులై ఉండేవారు తమకు తావే శత్రువు లగుచున్నారు. తమయొక్క ధర్మార్థ కామములను తావే నశింపచేసుకొంటున్నారు. ఇక మోక్షము విషయమై వేరే చెప్పేదేమున్నది?

పౌరుషము యొక్క స్వరూపములు మూడు–

1. పురుషార్థమును సాధించవలెనను 'ఇచ్ఛ'.
2. కర్మేంద్రియముల ప్రవృత్తి
3. తత్త్వజ్ఞాన వికాసము

ఈ మూడు, ఒకదానికి మరొకటి 'తోడు' అగుచు ఉత్తమ ఫలమును ప్రాప్తింప చేస్తున్నాయి. మనస్సునందు ఎట్టి విషయము స్ఫురిస్తుందో, చిత్తము కూడా అట్టి ఆకారమునే దాల్చుట జరుగుతోంది. అట్టి చిత్తము నుండి ఇంద్రియముల యత్నములు బహిర్గతమౌతున్నాయి. ఒకడు తన బాల్యమునుండి ఏఏ విషయముల గురించి ఏఏ ప్రయత్నములు చేస్తాడో – ఫలితములు కూడా ఆ ప్రయత్నములబట్టే ఉంటున్నాయి. ఇక 'దైవము' అనుదానికి వేరే చోటెక్కడ? అందుచేతనే 'పౌరుషము' అనునది సర్వమునకు మూలకారణమై ఉన్నదని మేము సిద్ధాంతీకరించటం జరుగుతోంది.

ఓ రాఘవా! తమ పురుషకారము చేతనే ఎవరైనా ఏదైనా ఈ జగత్తులో పొందగలుగుచున్నారు. పురుషకారము వలననే బృహస్పతి దేవతల గురువు అయ్యాడు. అట్లే శుక్రాచార్యుడు రాక్షసులకు ఆచార్యుడై వెలయుచున్నాడు. మనుష్యులలో కూడా కొందరు అనేక దైన్య, దారిద్ర్యములచే పీడింపబడుచూ కూడా, ఉత్తమ పురుషకారమును ఆశ్రయించినవారై ఇంద్రసమానులగుచున్నారు. అదేవిధంగా 'నహుషుడు' మొదలైన మరికొందరు అనేక సంపదలతో భోగములతో తులతూగుచు, తమ స్వప్రయత్నముల దోషములచే నరకమున కూలిపోయారు. ఎదురుగా ఉన్న ఈ ప్రపంచమునే చూడు. ఇక్కడ జీవులు వేలకువేలుగా సంభవిస్తున్న ఆపదలను, దుర్దశలను తమ పురుష ప్రయత్నము చేతనే అధిగమించుచున్నారు కదా!

శాస్త్రములు ఎందుకొరకు రచించబడ్డాయి? "అశుభ మార్గమున పయనించే చిత్తము సర్వప్రయత్నములచే శుభమార్గమునకు మరలించబడుగాక" అని ప్రతిపాదించి, మానవుని

చక్కదిద్దుటకే కదా! అవి సక్రమంగా అవగాహన చేసుకోబడుగాక! ఆచరించబడుగాక! గురుజనులు కూడా మానవులకు, “నాయనలారా! శుభదాయకము, అనపాయకరము, ఉత్తమ ఫలప్రదము అయిన్న ఈ ఈ క్రియావ్యవహారములను యథారీతిగా యత్నపూర్వకంగా ఆచరించండి” అనే ఉపదేశిస్తున్నారు. అంతేగానీ, “దైవమే అన్నీ ఇస్తాడు. మీరు ఇష్టం వచ్చినట్లు తిని–తిరగండి” .. అని చెప్పటం లేదే!

“నేను ఏ రీతిగా ప్రయత్నిస్తున్నానో, ఫలములు కూడా ఆ రీతిగానే ప్రాప్తిస్తున్నాయి. అందుచేత నేను నా ప్రయత్నములనే సరైన మార్గంలో నియమించెదను గాక” – అని మానవుడు భావించాలి. ఎప్పుడైతే అతడు అట్టి సద్విమర్శ చేయడో, అప్పుడు తనకు దైవము వలననో, అదృష్టము వలననో, ఇతరుల వలననో అశుభములు ప్రాప్తిస్తున్నాయని అనుకోవటం, వాపోవటం జరుగుతోందని మా అభిప్రాయం. అతడు అనేకసార్లు “నా సామర్థ్యము, ప్రయత్నము ఎట్లా ఉన్నాయి?” అని ప్రశ్నించుకోకుండా “వారి వలన నేను ఇది సాధించలేకపోయాను” అని అంటూ పరదూషణకు దిగుచున్నాడు.

❖

పౌరుష బలముచేతనే కార్యసిద్ధి జరుగుతోంది, – అనునది నిర్వివాదాంశము. బుద్ధిమంతులు పౌరుష బలమును ఆశ్రయించే తమ కార్యములచే అనేకులను ప్రభావితం చేయగలుగుచున్నారు. అయితే, జీవితంలో అయిష్టమైనవి, కష్టమైనవి సంభవిస్తున్నప్పుడు అల్పబుద్ధి గలవారిని ఓదార్చుటకు బుద్ధిమంతులైనవారు ‘దైవము’ అనే శబ్దమును ఉపయోగించటం జరిగింది. అట్లు కల్పించబడిన ‘దైవము’ అనుదాని పట్ల విశ్వాసముచే (లేక భీతిచే) ఉత్తమ కార్యాచరణము నిర్వర్తించబడగా, ఆ శిష్యులు ఉత్తమ బుద్ధి సమన్వితులై సర్వము గ్రహించగలరనునదే బుద్ధిమంతుల ఉద్దేశం. ఇది చిన్నపిల్లలకు ప్రమాదరహితమైన సత్ప్రవర్తన నేర్పుట వంటిదే. అయితే ‘దైవము’ అను శబ్దము ఏదీ స్వయముగా ప్రసాదించదు. ప్రయత్నబలమును అనుసరించే సదవగాహన – సత్ప్రవర్తనములనుండే ఔన్నత్యమనేది లభిస్తోందని గ్రహించు.

“పురుషకారమే ఫలవంతమగుచున్నది” .... అనునది అందరికి, అన్నివేళల ప్రత్యక్షానుభవమే. ఒకడు ఒక చోట నుండి మరొక చోటికి వెళ్ళాలంటే కూడా స్వప్రయత్నమే శరణ్యమగుచున్నది కదా! భుజించినవానికే రుచి తెలుస్తోంది. తృప్తి కలుగుతోంది. ఆకలి తీరుతోంది. భుజించనివానికి ఆకలి ఎలా తీరుతుంది? నడిచేవాడే వెళ్ళగలుగుతాడు. నడువనివాడు వెళ్ళేదెట్లా? మాట్లాడేవాడే చెప్పగలుగుచున్నాడు. మాట్లాడనివాడు తాను అనుకొన్నది ఎట్లా చెప్పగలుగుతాడు? అందుచేత, పౌరుషమే జనులకు సిద్ధిదాయకమగుచున్నదనుటలో ఎవరికీ, ఏమాత్రం సందేహం ఉండవలసిన అవసరం లేదు. అనేకమంది ధైర్యశాలురు పౌరుషమును ఆశ్రయించే గొప్ప సంకటముల నుండి విడివడుచున్నారు. “మా అదృష్టము ఇంతే కాబోలు” అని నమ్మి ఊరక కూర్చునేవారు ఏమి సాధించగలరో చెప్పు?

ఓ రామా! మరల మరల ప్రకటిస్తున్నాను. ఏ వ్యక్తి ఎద్దానికొరకు ఎంతగా ప్రయత్నిస్తాడో, అతడు అద్దానిని అంతవరకే అట్లే పొందుచున్నాడు. తూష్ణీభావం వహించి ఊరుకునే వానికి ఎక్కడా ఏమీ సిద్ధించుట లేదు. శుభ పురుషకారము శుభమునకు, అశుభ పురుషకారము అశుభమునకు దారితీస్తోంది. కాబట్టి నీవు దేనిని కోరుకొంటున్నావో, దాని కొరకే ఉత్తమ ప్రయత్నం చేయి. ఇక ఫలితమంటావా, అది వెనువెంటనే లభించవచ్చు. లేదా ఆలస్యంగా ప్రాప్తించవచ్చు. ఏది ఏమైనా శుభ ప్రయత్నములకు శుభము, అశుభ ప్రయత్నములకు అమంగళము వచ్చి తీరుతాయి. వాటిని ఎవరూ నిరోధించలేరు. ఇది అప్రతిహతమైన విధానశాసనం.

అయితే, దేశకాలాధీనంగా పౌరుషబలంచే లభిస్తున్న శుభాశుభ ఫలములనే 'దైవము' (ద-ఏవమ్ = ఏదైతే / ఇస్తోందో) - అని అందరు పిలుస్తున్నారు. అంతేకాని, 'దైవము' అనగా, కనులకు కనబడని ఏదో తెలియరానిశక్తి, లేక, అకస్మాత్తుగా కారణం లేకుండా ప్రవర్తించేది, లేక, ఇంకొకచోట ఎక్కడో ఉన్నట్టిది అయిఉండలేదు.

❖

పురుషుడు ఈ లోకమునందే జన్మిస్తున్నాడు. పెరుగుచున్నాడు. ముదుసలి అగుచున్నాడు. ఈ విధంగా బాల్య, యౌవన, వార్ధక్యాలు ప్రత్యక్షానుభవం అయినట్లుగా 'అదృష్టము' అనునది ప్రత్యక్షంగా లభిస్తోందా? లేదుకదా! కనుక మా ఉద్దేశంలో, కారణమే లభించనట్టి 'అదృష్టము' అనునది లేనే లేదు.

సత్పురుషులైన వారు "పరమార్థములను సాధించు యత్నములు" - అనువాటినే 'పౌరుషము' అను పేరుతో పిలుస్తున్నారు. లౌకిక దృష్టితో చూచినపుడు కూడా పౌరుషము లేక పురుషయత్నము వలననే అభీష్టములన్నీ సిద్ధిస్తున్నాయి. చేతులతో వస్తువులను కదల్చటం, మాట్లాడటం, చూడటం ఇట్లే సర్వేంద్రియ క్రియలు - ప్రయత్నము (లేక) పౌరుషబలం చేతనే జరుగుచున్నాయి. అంతేకాని, దైవబలంచేత కాదే! అయితే, 'అనర్థ కరములు - నిష్ప్రయోజనకరములు" అయిన ప్రయత్నములు అట్టి ప్రయోజనములనే కలుగచేస్తున్నాయి. అల్పాశయముతో కూడినవాటి ప్రయత్నముల వలన పొందేదేముంటుంది? అందుచేత, సత్సంగమందు, సచ్ఛాస్త్ర పర్యావలోకనమందు బుద్ధిని వినియోగిస్తే, ఆ బుద్ధి సునిశితమౌతుంది. ఇప్పుడు 'సమగ్ర - సదవగాహన'తో కూడిన ప్రయత్నము చేతనే అనుకొన్నది లభిస్తుంది.

❖

అజ్ఞానం చేతనే వైషమ్య మమకార వృత్తులు జనిస్తున్నాయి. ఏ ప్రయత్నములైతే "సర్వవైషమ్య భావములను మొదలంట నివృత్తింపచేసి, అఖండానందమును ప్రాప్తింప చేయటానికి కారణములు కాగలవో, అట్టి ప్రయత్నముల సమూహమునే "పరమ పురుషార్థము" అని తత్త్వజ్ఞులు పిలుస్తున్నారు. అట్టి పురుషార్థమును ప్రాప్తింపచేయగల సదసత్ వివేకులగు సత్పురుషులను, సచ్ఛాస్త్రములను, శరణువేడటం సంసారబద్ధుడగు మానవునకు అత్యంత ఆవశ్యకమైయున్నది. సరోవరంలో అందమైన

తామరలు వృద్ధి చెందాయనుకో. అప్పుడు తామరల వలన సరోవరం, సరోవరం వలన తామరలు పరస్పరం శోభింపచేసుకుంటాయి. అదేవిధంగా, సచ్ఛాస్త్ర – సాధు సాంగత్యాల వలన బుద్ధి, బుద్ధి వలన సచ్ఛాస్త్ర – సాధు సాంగత్యాలు శోభిస్తున్నాయి. అందుచేత, బాల్యము నుండి వాటిని అభ్యసించాలి. వాటి వలన ఆ అభ్యసించువాడు తనను తాను ఉద్ధరించుకొనుటేకాక, అనేకులను తనవలెనే సమున్నతులను చేయగలడు. ఎందుకంటే, అతనికి స్వాత్మలాభమే చేకూరుతుంది కదా!

ఓ రామచంద్రా! ఈ ప్రపంచమంతా అదృష్టముచేత నడుచుచున్నదని భ్రమింప బడకుండుగాక! ఏది ఎక్కడ ఎట్లు జరుగుచున్నా, దాని వెనుక ప్రయత్నమే అంతర్లీనమై ఉండి ఉంటోందని నేను నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను. భగవంతుడగు విష్ణుదేవుడు నిజప్రయత్నము చేతనే దుష్టులను శిక్షించుట, శిష్టులను రక్షించుట చేస్తున్నాడు. అంతేకాని ఆయనకు అదృష్టము కలసి వస్తోందా? కానే కాదు. ఈ జగత్తులో ఎవరికైనా పురుష ప్రయత్నమే ఇష్టసిద్ధిని ప్రాప్తింపచేస్తోంది. అందుచేత నీవు సర్వదా ప్రయత్నశీలుడవై ఉండు. సర్వశంకలను త్యజించి ఏ ఏ ప్రయత్నములు ఉచితమో వివేకముచే విచారించి వాటిని ఆశ్రయించు. అంతేకాని 'కొయ్య'ను చూచి "ఇది పాము కాదు కదా?" అని అనుకొంటూ 'దైవము' అనుదాని విషయమై లేనిపోని భ్రమలు పొందవద్దు. మహత్తరమైన అవకాశములు ఉన్న ఈ జీవితము అను దానిని జనులు లేనిపోని కల్పనలతో వృథా చేసుకోవటం తరచు జరుగుచున్నదని గుర్తు చేస్తున్నాను.

❖❖❖

8. అప్రయత్నశీలుడు - దుర్గతులు

ఓ రామచంద్రా! "దైవము" అని జనులు దేనిని దృష్టిలో పెట్టుకొని సంబోధిస్తున్నారో – ఎంత తరచి చూచినా, నాకు అర్థమగుట లేదు. "దైవం" లేక "అదృష్టం" అనునది ఎక్కడ ఉన్నది? అద్దానికి ఆకారముగాని, కర్మగాని, చలనముగాని, పరాక్రమముగాని లేదే? అందుచేత అది మిథ్యాజ్ఞానము చేతనే ఆరూఢమై ఉంటోందని మా అభిప్రాయం. లేదా, ఇతఃపూర్వపు కర్మలు (లేక ప్రయత్నములు) ఫలోదకమగు చున్నప్పుడు (ప్రయోజనత్వము పొందుచున్నప్పుడు) సుదూర దృష్టితోకూడిన సూక్ష్మబుద్ధి లేని జనులచే "ఇవి దైవము యొక్క చేతలే కదా!" అను మాటలచే కల్పించబడినదని చెప్పక తప్పదు. (People who cannot see a little far pacify themselves by attributing the incidents to the unknown 'DAIVAM'). భ్రాంతిచే త్రాడునందు పామును ఆరోపించునట్లు, వారు 'దైవము' అను కల్పిత వ్యవహారము నందు సుదృఢులై ఉంటున్నారు.

❖

అయితే ప్రాక్తన కర్మలచే జీవుడు సర్వదా ప్రభావితమగుచు అస్వతంత్రుడుగా ఉండవలసినదేనా? లేదు. ఒక దృష్టాంతము విను. ఒకడు కొంత చెడ్డగా కొంత కాలం వ్యవహరించటం జరిగిందనుకో. అప్పుడు ఆతడు ప్రాయశ్చిత్తరూపములైన (అనునయ వాక్యాలు, క్షమించ వేడుకొనుట, అధికమైన

సేవా సహకారములు అందించుట మొదలైన) శుభకర్మలచే తాను బాధించియున్నవారి యొక్క సానుకూల్యము చూరగొనవచ్చును కదా! అశుభత్వం నుంచి తనయొక్క శుభత్వముచే దోషపరిహారం చేయబడుతోంది. అట్లే ప్రాక్తనకర్మలు (past deeds)చే ప్రాప్తించియున్న దుష్ట సంస్కారములను, వాసనలను (లేక దోషబుద్ధిని) ఇప్పటి ప్రయత్నములచే శుభప్రదం తప్పక చేయవచ్చు. వర్తమాన ఆద్యతన సత్కర్మలు ఇతఃపూర్వపు దోషములను ప్రక్షాళనం చేయగలవు. కాబట్టి రామా! నీవు సర్వదా సత్కార్యములు చేయుటకే యత్నించెదవు గాక!

కొందరు మూర్ఖులు ప్రత్యక్షమును ప్రక్కకునెట్టి అనుమానమును మాత్రమే ఆశ్రయిస్తూ "దైవమే అంతటికి కారణం. మాచేత సత్కర్మలు ఎప్పుడు చేయించాలో దైవమునకు తెలుసు. కనుక మేమేం చేయగలం?" అని చెప్పుకొంటూ వర్తమానంలో ఉత్తమ ప్రయత్నశీలురు కాకుండానే రాత్రింబగళ్ళు గడిపివేస్తున్నారు. అట్టి దుర్మతులు, మూఢులు నీకు తారసపడితే "దైవబలంచేత మమ్ము అగ్ని ఏమి చేయలేదు" అని తలచి అగ్నిలోకి దూకమను. ఒళ్ళు కాలకుండా బయట పడగలరేమో చూద్దాం. అందుచేత "నేను తగినంత ప్రయత్నశీలుడను కాలేదు కనుకనే ఉత్తమజ్ఞానం పొందలేకపోయాను" అని మనిషి భావించటం మంచిదికాని, "దైవం మాకు జ్ఞానం ప్రసాదించలేదు" అని సరిపెట్టుకొని కాలయాపన చేయటం ఉచితం మాత్రం కాదు.

సరే, "ఈ ప్రపంచమున దైవమే సర్వము నిర్ణయిస్తుంది. చూడరాని, చెప్పబడ జాలని ఆ దైవమే అన్నిటికి కర్త. ఇక కర్తృత్వమంటూ మరెవ్వరికీ లేదు" – అనే అనుకొందాం. ఇక పురుష ప్రయత్నమెందుకు? ఎవరో ఎక్కడో ఉండి నీ కాళ్ళు కదల్చుచున్నారా? "పురుషప్రయత్నము లేదు. దైవమే ఉన్నాడు" అని అనుకోదలచుకొంటే ఇక మానవునకు, యంత్రచలితమైన ఆటబొమ్మకు తేడా ఏమి ఉంటుంది? దైవమే సర్వము చేస్తున్నప్పుడు ఇక స్నాన, దాన, జప తపాదులు ఎందుకు శాస్త్రములచే చెప్పబడుచున్నాయి? దైవ నిర్ణయమే* అంతా అయినప్పుడు, శాస్త్రోపదేశం మాత్రం దేనికి? మనం ఇప్పుడు ఈ ఆత్మవిచారణ చేస్తే మాత్రం ఏమి ప్రయోజన ముంటుంది? ఈ విచారణ – ఉపదేశాలను మానివేసి, కాళ్ళు–చేతులు గాలికి వదలి కూర్చుంటే సరిపోతుంది కదా! ఆ 'దైవము'నే అన్ని ప్రయత్నములు చేయమని చెప్పి ఇక ఈ జనులను పురుషప్రయత్నం మాని చతికిలపడమందామా? కాబట్టి, దైవమును ప్రతిపాదించి, అప్రయత్నశీలురు కాగోరువారిని మేము లెక్కలోనికి తీసుకోము.

ఈ ప్రపంచంలో ప్రతిఒక్కరు ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉన్నారు – ఒక్క శవం తప్ప. యత్నము వల్లనే ఫలితమనేది లభిస్తోంది. "ఈ నా యత్న–ఫలితములు అల్పమైనవా? లేక పరమోత్కృష్టమైనవా?" – అనునది జీవుడు తన బుద్ధితో సరి అయిన నిర్ణయం చేసుకోవాలి. కాని,

* లోకంలో "శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు" అను నానుడి ప్రచారంలో ఉన్నది. అట్లే "నారుద్రో రుద్రమర్చతి" అనునది రుద్రాభిషేకంలోని వాక్యం. (రుద్రుడు కానివాడు రుద్రుని అర్చించలేడు). ఈ రెండిటియొక్క సమన్వయార్థం అతి సూక్ష్మబుద్ధితో గ్రహించాలి.

"యత్నము వలననే ఫలితం" అనునది కర్మల యొక్క సిద్ధాంతము, అప్రతిహతమైన శాసనం అయియున్నది. యత్నములను అనుసరించే జీవునకు త్రికాలములు ప్రాప్తిస్తున్నాయి.

అందుచేత, ఓ రామచంద్రా! "ఏది ఎట్లు అగుచున్నదో అదంతా ప్రయత్నాను సారమే ఉంటోంది" అని గ్రహించబడుగాక! 'దైవము' లేక 'అదృష్టము' అనునవి అర్థరహితమైన పదములేనని మా అభిప్రాయం. ఐనా, నాదొక ప్రశ్న. "ఆకృతిలేని దైవము, ఆకృతి కలిగిన మనుజుడు చేసే ప్రయత్నములు" ఈ రెంటికీ సమన్వయం ఏకత్వం, సమాధానం ఎట్లా కుదురుతాయి. ఆ రెండిటికి సంబంధం ఎట్లా ఉంటుంది? అందుకే ఆ మాట నిష్ప్రయోజనమైనది. మరొక విషయం. కలము – కత్తి – ఈ రెండిటినీ ఒకేసారి ఉపయోగించటం సాధ్యమా? "దైవమే అంతా చేయిస్తాడు. కాని పురుష ప్రయత్నం కూడా ఉండాలి" అని అనటం అట్టిదే అవుతుంది. కాళ్ళు, చేతులు లేనివానిచే దైవము ఏదైనా చేయించగలదా? లేదు కదా! ఈ జగత్తులో ఒక పసిబాలుని దగ్గరనుండి, మహామేధావి వరకు 'దైవము' అనుదానిని తమ మనోబుద్ధులచే ప్రత్యక్షపరచుకొన్న వారెవరైనా ఉన్నారా? ఈ విధంగా 'దైవము' అనునది అసత్తేనని తేలుట లేదా?

❖

'దైవము' అనబడునది వేరుగా ఎక్కడో ఉన్నదనే కొద్దిసేపు అనుకొందాం. అప్పుడు "ఈ బుద్ధి – దైవము – అనునవి రెండూ ఒక్కటేనా? వేరువేరా?" అనే మరొక ప్రశ్న ఉదయిస్తుంది. ఎందుకంటే, అట్టి భావన చేసేది ఈ బుద్ధితోనే కదా! కనుక ఈ ప్రశ్నకు మనకు సమాధానం కావాలి. "నిశ్చయము అనే ధర్మమును నిర్వర్తించే 'బుద్ధి' – 'దైవము' అనుబడునవి ఒక్కటే. దైవము యొక్క ప్రభావము చేతనే, దైవమును అనుసరించే బుద్ధి ప్రవర్తిస్తోంది" అని మనం నిర్ణయిస్తామనుకో, అప్పుడారెండింటికి భేదం లేనట్లే కదా! అనగా బుద్ధియే దైవము కనుక ఇక బుద్ధినే మనం ఆశ్రయిస్తే పోతుంది కదా!* 'దైవము' అనబడే మరొక వస్తువును ఎందుకు ఆశ్రయించాలి? ఎందుకంటావా? 'బుద్ధి' అనునది అందరికి అనుభవభూతమై ఉంటోంది. దైవమా, ఎక్కడున్నదో, ఎట్లు ఉన్నదో తెలియదు.

"దైవము – బుద్ధి వేరువేరు" అని అనుకుంటామనుకో, అప్పుడు, సంబంధంలేని రెండు విషయాలు సంబంధం కలిగి ఎందుకు ప్రవర్తిస్తున్నాయో చెప్పవలసి వస్తుంది. అనిర్వచనీయమగు దైవము ఈ సర్వజీవుల బుద్ధులను ఎందుకు ప్రభావితం చేస్తున్నది? దానికి వచ్చే ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం లభించటం లేదు కనుక, మనం 'దైవము' అనుదానిపై ఆధారపడకపోవటమే మంచిది.

---

* బుద్ధౌశరణమన్విచ్ఛకృపణాఃఫలహేతవః" – శ్రీ కృష్ణ పరమాత్మ భగవద్గీత – సాంఖ్య యోగంలో "నాయనలారా! బుద్ధినే శరణు వేడండి. ఫలహేతువు (ఇక్కడ 'దైవము'గా చెప్పబడుతోంది) చాలా అల్పమైన విషయం" అని హెచ్చరిస్తున్నారు. "బుద్ధం శరణం గచ్ఛామి" – బుద్ధభగవానుడు.

అట్లుగాక "సమాన బుద్ధిబలములు కలిగిన ఇద్దరు వ్యక్తులు ఒక ఫలము (లేక ప్రయోజనము) కొరకు ప్రయత్నించినప్పుడు, ఒకడు ఒక రకంగా, మరొకడు మరొక విధంగా ప్రయోజనము పొందుచున్నారు. ఇది దైవముయొక్క పాత్రే కదా!" అని ఎవరైనా అంటారేమో? దీనికి కారణం తెలియని "దైవము" అని ఎందుకు అనటం? వారివారి ప్రయత్నముల తీవ్రతను అనుసరించి అది అట్లున్నదని ఎందుకు అనుకోరాదు?

"మా బుద్ధిలో ఇది ఇట్లు చేయాలనే భావం ప్రతిఫలించింది. ఇది దైవముయొక్క చర్యయే కదా?" అని మరెవరైనా అంటారేమో? ఆయా శారీరక (క్రియలు) – మానసిక (ఆలోచనలు) యత్నములే నిశ్చయమును ప్రభావితం చేస్తున్నాయని ఎందుకు అనుకోరాదు? బుద్ధిచే "ఇది చేయాలి" అనే నిర్ణయం చేయబడుతోంది. అట్లు చేయబడిన యత్నములు మరల బుద్ధిని ప్రభావితం చేస్తున్నాయి.* కనుక 'దైవము' అనుదాని పాత్రను ఆశ్రయించే బదులు మనం పురుషకారమునే ఆశ్రయించవచ్చు కదా!

❖❖❖

9. కార్య కుశలత

ఆకాశానికి రూపం లేదు. ఈ శరీరానికో, రూపం ఉన్నది. అందుచేత ఈ శరీరము ఆకాశమును తాకజాలదు. అట్లే రూపములేని దైవముతో రూపముగల మనకు కారణాంతరము (ఏదో కారణము) యొక్క కలయిక అసంభవమైయున్నది. ఆకృతిగల రెండు వస్తువులకు పరస్పర సంయోగం సాధ్యమౌతుంది. అందుచేత "దైవము – అనునది లేదు" – అనియే ఏర్పడుచున్నది. ఈ ప్రపంచమున జరుగు సర్వ వ్యవహారములకు నియామక – నిర్ణయాత్మక కర్త దైవమే అయితే, ఈ ప్రజలందరిని హాయిగా పరుండనిమ్ము. ఇక ఆయా ప్రయత్నములు, కార్యకుశలతలు, జాగ్రత్తలు దేనికి? ఆ దైవమే వచ్చి చేయవలసినది చేస్తాడా?

దైవేనతు అభియుక్తోఽహం, తత్కరోమీదృశం స్థితమ్
సమాశ్వాసన వాగేషా! న దైవం పరమార్థతః ॥ (VIII - 15)

"నేను అదృష్టముచే ప్రేరేపించబడి పనులన్నీ చేస్తున్నాను. అదృష్టబలం చేతనే ఇవన్నీ ఇట్లు సిద్ధిస్తున్నాయి" అని ఎవరైనా అనుకొంటే, మా ఉద్దేశంలో మాత్రం వారు తమను తాము అట్లు ఓదార్చుకోవటం మాత్రమే జరుగుచున్నది. పరమార్థ దృష్టికి 'దైవము' అనునదే లేదు, లభించుటలేదు. మూఢులే 'అదృష్టము (దైవము)' యొక్క కల్పన చేయుచున్నారు. అదృష్టపారాయణులగువారు స్వశక్తిపట్ల, స్వప్రయత్నముల పట్ల విశ్వాసము లేకపోవుటచే, వారు ఎప్పటికైనా చెడిపోవటం తథ్యమని మేము అనుకొంటున్నాం.

---

* "బుద్ధిఃకర్మానుసారిణి" – "కర్మలను అనుసరించే బుద్ధి ఉంటోంది" అనునదే లోక ప్రసిద్ధంగాని, "బుద్ధిః దైవానుసారిణి" --- అనునది లోకప్రసిద్ధం కాదు కదా!

ఈ ప్రపంచంలో ఎందులో అయినా ఔన్నత్యం సాధించిన బుద్ధిమంతులను ఎవరినైనా తీసుకో. వారికి ఆ సామర్థ్యమును ప్రసాదించింది ఎవరు? నాయనా! రామా! వారందరు తమ పురుషకారం చేతనే, పురుషప్రయత్నము చేతనే, ఆ ఉన్నతిని సాధించారు. అందుకే, మనం వారి చరిత్రలు వ్రాసుకొని చదువుకొంటున్నాం. ప్రయత్నముల ప్రాముఖ్యతే లేకపోతే మనం మాత్రం వారి గురించి తెలుసుకోవటం దేనికి? "అంతాదైవమే" అని గ్రంథాల నిండా వ్రాస్తే సరిపోతుంది కదా!

యే శూరా యే చ విక్రాంతా యే ప్రాజ్ఞా యే చ పండితాః
తైస్తైః కిమవ లోకేఽస్మిన్ వద! దైవం ప్రతీక్ష్యతే? (VIII - 17)

ఓ రామచంద్రా! నీవు శూరులైనట్టి పరాక్రమవంతులైనట్టి, బుద్ధిమంతులైనట్టి, పండితులైనట్టి అనేకమంది మహాత్ముల గాథలు విన్నావు కదా! వారు తాము సాధించదలచుకున్నది ఎట్లా సాధించారు? ప్రయత్న బలము చేతనే కదా! వారిలో ఎవరు దైవము కొరకు వేచియున్నారు చెప్పు?

దైవమును ప్రతిపాదించువారు, "ఇతడు చిరంజీవి, బహుకాలం జీవిస్తాడు" – అని 'దైవ నిర్ణయం'గా ఒకని గురించి చెప్పారనుకో, అట్టి వానియొక్క తలను తీసినప్పుడు కూడా అతడు బ్రతికితే, అప్పుడే దైవమే గొప్పదని నేను ఒప్పుకొంటాను. అట్లుండుట లేదే? భవిష్యత్తు గురించి (జాతకం చెప్పేవారు), "ఇతడు పండితుడు అవుతాడు" అని చెప్పినప్పుడు, అట్టివాడు చదవకుండానే పండితుడు అవుతున్నాడా? అట్లా జరిగితే, దైవమే లోకంలో అదృష్టమై సర్వము నిర్వర్తిస్తోందని మనం కూడా ఒప్పుకుందాం.

విశ్వామిత్రేణ మునినా దైవముత్సృజ్య దూరతః
పౌరుషేణైవ సంప్రాప్తం బ్రహ్మణ్యం! రామ! నాఽన్యథా ॥ (VIII - 20)

ఓ రామచంద్రా! ఈ సభకు దేవేంద్రునివలె వేంచేసియున్న బ్రహ్మర్షియగు ఈ విశ్వామిత్ర భగవానుని చూడు! ఇతడు జన్మతః ఒక సామాన్యమైన రాజు. ఈ రోజో, ఒక బ్రహ్మర్షిగా, లోకకల్యాణ కారకుడుగా ముల్లోకములచే ఎట్లు ప్రశంసలు అందుకుంటున్నారో చూచావు కదా! ఇది ఈయనకు ఎట్లా సాధ్యపడింది? 'దైవము' అనబడుదాని కృపచేతనా? కానేకాదు. ఇతడు అదృష్టమును ప్రక్కకునెట్టి పురుష ప్రయత్నమును దృఢంగా ఆశ్రయించాడు. అందుచేతనే బ్రహ్మర్షిత్వము సంపాదించాడు. అంతే కాని అదృష్టము కొరకు వేచియుండి కాదు సుమా! నేను కూడా పురుషకారమును ఆశ్రయించే ఆకాశగమన శక్తి, సప్తర్షిమండలములో నివాసము సంపాదించాను. నన్ను 'మహర్షి' అని అందరు అంటున్నది నాయొక్క అదృష్టం చేతనా? కాదు. నా స్వప్రయత్నము యొక్క దృఢత్వం చేతనే ఈ రోజు అట్లు గుర్తింపబడుచున్నాను. రాక్షసరాజులు పౌరుషమును ఆశ్రయించే, అమరావతి నుండి దేవతలను పారద్రోలి ముల్లోకములలో తమ ఏలుబడి సాగించారు. దేవతలు కూడా పురుషకారము చేతనే శత్రువులను ఛిన్నాభిన్నంచేసి మరల ఈ జగత్తులను పాలిస్తున్నారు. అంతదాకా దేనికి? వెదురుతో అల్లిన బుట్టలో నీరు ఎలా నిలుస్తోంది? అదృష్టంవల్లనా? కాదు. దాని వెనుక పురుషప్రయత్నమే దాగి ఉన్నది.

ఈ లౌకిక కార్యములనే చూడు. కుటుంబ పోషణం, శత్రు రాజ్యాపహరణం, భోగవిలాసం, కోపం, నిగ్రహం, ఇతరులను అరికట్టటం, ఆకట్టుకోవటం – ఇత్యాది అనేక క్లిష్టమైన పనులన్నీ పురుషప్రయత్నబలము చేతనే ఒనగూడుచున్నాయి కదా! 'అదృష్టం' అనునది ఏదో తెలియని రూపంలో వచ్చి ఇవన్నీ చేయటంలేదే! ఆ దైవము అనుదాని క్రియాశక్తి ఎక్కడా కనబడకయే ఉన్నది.

ఓ శుభాశయా! రాఘవా! ఈ 'దైవము' అనబడే పదార్థం కార్య–కారణ విమర్శలకు లభించకయే ఉన్నది. అందుచేత, అది వికల్పవశంచేతనే కల్పించబడినట్లు, సుస్పష్ట మౌతోంది. కనుక అవశ్యమై, ఎదురుగా నిలిచియున్నట్టి పురుషకారమును ముందుగా ఆశ్రయించి ఉండు. మనకు ఎదురుగా లభించనట్టి ఈ దైవవ్యవహారమును కొంతసేపు ప్రక్కకుపెట్టు. దాని విషయమై ముందుముందు మన ఈ విచారణలో అనేక విషయములు నీవే గ్రహిస్తావు. ఈ 'దైవము' అనుదానిని అపేక్షించక, ఉత్తమమగు పురుషకారమునే ఆశ్రయించి, సమున్నతుడవుకమ్ము.

❖❖❖

10. కర్మవిచారము

శ్రీరాముడు : ఓ సర్వధర్మజ్ఞా! వసిష్ఠమహర్షీ! పురుషప్రయత్నం విషయంలో మీరు చెప్పినట్టి సోదాహరణ పూర్వకమైన విషయాలన్నీ నేను అంగీకరిస్తున్నాను. అయితే, మీరు "దైవము" అనబడునది ఏదీ లేదని కొన్నిచోట్ల అన్నారు. మరికొన్నిచోట్ల, "పూర్వ జన్మలందలి లేక ఇతః పూర్వపు కర్మ పరంపరల (లేక ప్రయత్నముల) సమ్మేళనమే దైవము" అని అంటున్నట్లు నాకు అర్థమగుచున్నది. "ప్రయత్నము ముందు – దైవము సంగతి తరువాత" .... అని సూచనగా కూడా అంటున్నారు.

ఈ ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధిగాంచియున్న ఈ "దైవము" అనే పదార్థం అసలు ఉన్నదా? లేదా? అనేకులు అట్టిది కలదని నమ్ముచున్నారు కదా! అందుచేత దైవము–అనునది మీచే ఎట్లు గాంచబడుచున్నదో మరికొంత సుస్పష్టంగా తెలుసుకోవాలనుకొంటున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! రామచంద్రా! పురుషకారమే సర్వ కార్యక్రమములను ఒనర్చుచున్నది. వాటి ఫలితములను కూడా అదే అనుభవిస్తోంది. ఇక 'దైవము' అనబడు మరొక వస్తువు ఏదీ దేనికీ కర్తగాని, భోక్తగాని కాదు. దైవము స్వయముగా ఒనర్చునదంటూ ఏదీ లేదు. అది భోగించునదీ లేదు. అది ఇతరులను ఆదరించునది కూడా లేదు. దానిని ఎవరూ చూచుచున్నది లేదు. అది కేవలం కల్పనామాత్రమే. పౌరుషమే ఫలప్రదమగుచున్నది. అట్టి పురుషకారము (తనకు తానుగా నిర్వర్తించి యున్న ప్రయత్న పరంపరలు) వలన లభించుచున్న శుభాశుభములనే జనులు 'దైవము' అనే పేరుతో పిలుస్తున్నారు.

తమ పురుషప్రయత్నములచే తాము పొందుచున్నట్టి స్వల్ప – దీర్ఘములైన ఇష్ట – అయిష్టములను అల్పజ్ఞులగువారు 'దైవము' అనబడుదానికి ఆపాదించుచున్నారు.

ఈ లోకంలో ఎవరికైనా సరే, ఒక్క పురుషార్థము చేత మాత్రమే ఫలములు (Results) అవశ్యం లభిస్తున్నాయి. అయితే ఒక వ్యవహారము యొక్క ఆది-అంతములు, వేరైన దేశ-కాలములందు ప్రాప్తిస్తున్న ప్రభావములు [The effects (or) results that materialise at a different time and place] గ్రహించలేనట్టి (దూరదృష్టి లేనట్టి) జనులు ఆయా ఫలితములను "ఇవి దైవము ప్రసాదిస్తున్నాడు. లేక దైవమే ఇట్లు శిక్షిస్తున్నాడు" - అని భావన చేయుచున్నారు.

ఓ రాఘవా! రూపమేలేనట్టి 'దైవము' కారణంగా ఎవరికైనా, ఏదైనా చేకూరినదనుకొంటే, అది మా ఉద్దేశంలో భ్రమయే. "దైవమును ప్రార్థించటం", "అభీష్టములు పొందటం" అనే విషయానికివస్తే, ఆ కొంత కాలం అద్దాని కొరకు తీవ్రేచ్ఛచే వారు చేయునది అభ్యర్థనపూర్వకమగు పురుషప్రయత్నమే కదా! ఆ అభ్యర్థనచే లక్ష్యశుద్ధి ఏర్పడి, సాధించదలచినదానికి (లేక పొందదలచినదానికి) సానుకూలంగా ఆలోచన-క్రియాదులు ఒనగూడుతున్నాయి. అప్పుడు ప్రాప్తించినదానికి "ఇది దైవమే ఇచ్చినాడు" అని అనుకొనుట జరుగుతోంది. కనుక, ఇక్కడకూడా, పురుష ప్రయత్నమును అనుసరించే ఆయా శుభాశుభ ఫలములు లభిస్తున్నాయి.

జనులు కొందరు "వీడి అదృష్టము ఇట్లా ఉన్నది" అని అంటున్నప్పుడు, ఆ మాటయే 'దైవము'గా లోకంలో ప్రసిద్ధికెక్కింది.

ఇక కర్మల ప్రసంగం వచ్చినప్పుడు, "ఇతడు ఇట్లు పలికినాడు. అది విన్న నాకు ఈ బుద్ధి పుట్టింది. అప్పుడు ఈ విధంగా దృఢంగా నిశ్చయించుకొన్నాను. ఇట్లు ప్రయత్నించినాను. ఈవిధమైన ఉత్తమఫలితం పొందాను. కనుక, ఈ ఉత్తమ ఫలితం దైవవశాత్తు లభించింది" - అనునది కొందరికి అనుభవమౌతూ ఉంటుంది. ఇట్టి దృష్టాంతమే లేక సంఘటనయే 'దైవము' అనబడు కల్పనకు కారణమగుచున్నది. అయితే ఇందులో, "ఇతఃపూర్వపు ప్రయత్నములచే ఏర్పడిన బుద్ధే అందుకు సిద్ధమై ఆ ఆలోచనను స్వీకరించింది. మరల ప్రయత్నముచేతనే ఫలితం ప్రాప్తించింది" - అనునదే మనకు సూక్ష్మదృష్టితో చూచినప్పుడు లభిస్తోంది. ఎందుకంటావా? ఒక పదిమంది ఒకే విధంగా బోధింపబడినా, అందరూ ఒకే విధంగా స్పందించుట లేదు కదా! ఎవరైతే ఇతః పూర్వపు - వర్తమానపు ప్రయత్నములచే ఆ విషయమును స్వీకరించారో, వారు మాత్రమే ఆ ఫలితమును పొందుచున్నారని గ్రహించు.

ఒకనికి ఇష్టమైన, లేక అయిష్టమైన ఫలములు లభించుచున్నాయనుకో, దైవమే అది ప్రాప్తింపచేస్తున్నట్లు అల్పదృష్టి కలవారు భావిస్తున్నారు. సూక్ష్మదృష్టి కలవారో - "నా ఇష్ట - అయిష్టముల రూపమున ఏర్పడియున్న సంస్కారములే (లేక వాసనలే) నాకు 'ఇది సుఖము - ఇది కష్టము' అను భావనలు కలిగిస్తున్నాయి" - అని గ్రహిస్తున్నారు. ఇంతకుమించి 'దైవము' అనునది లేదు. కనుక, ఈ విషయమై నీవు నిశ్చింతుడవగుము. వర్తమానమునందు ఉత్తమ కర్మలను ఆశ్రయిస్తూ ఆత్మయొక్క తత్త్వమేమిటో వివేక దృష్టితో గ్రహించియుండుము.

❖

శ్రీరాముడు : హే మహర్షీ! "మీరు" "పూర్వజన్మల సంచితమే దైవము" అని మరల మరలా అంటున్నారు. ఇంతలోనే "దైవము లేదు" అని నిర్ణయం ప్రకటిస్తున్నారు. ఎందుచేత?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నేను నీకు ఏదైనా చెప్పినప్పుడు, నీవు అత్యంత సూక్ష్మదృష్టితో ఆ విషయం గ్రహించగలవు. నీ గురువుగా, నీపై నాకు ఉన్నట్టి అభిప్రాయం అది. అందుచేత, నేను చెప్పబోవునది సూక్ష్మదృష్టితో, నిర్మలహృదయుడవై, ఉద్వేగాదులు లేనివాడవై విను. నీ బుద్ధి చంచలత్వమును త్యజించి, స్థిరత్వము పొందగలదు. అప్పుడు 'ఉత్తమ సత్యము' విషయమై చెప్పినది, చెప్పబోవునది గ్రహించగలవు.

ఒకానొకడు తన 'మనస్సుచే, వాక్కుచే, కాయముచే" ఒకానొక విధంగా కర్మలు నిర్వర్తిస్తున్నాడు. అతడు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? అలా ఎందుకు ఆలోచిస్తున్నాడు? అలా ఎందుకు మాట్లాడుచున్నాడు? (Why he is behaving the way he behaves?) దీనికి సమాధానం విను. ఇతః పూర్వపు (మరియు క్రితం జన్మల) స్వకీయ ప్రయత్నముల సారమై ఉన్నట్టి వాసనలను అనుసరించే, వాటిచే ప్రబోధితుడై ఈ వర్తమానమునందు ఆయా విధములుగా భావించుట, మాట్లాడుట ప్రవర్తించుట చేస్తున్నాడు. అనగా, వాసనలే కర్మలుగా పరిణమిస్తున్నాయి. వాసనలను అనుసరించే నేను, నీవు, అట్లే ప్రతి ఒక్కరు ఆయా విధములైన 'మనోవాక్కాయ' కర్మలను ప్రదర్శించుచున్నాము. అభిప్రాయములు, భావనలు కూడా వాసనలను అనుసరించే ఉంటున్నాయి. కర్మలు ఒక రకంగా, మనోభావాలు మరొక రకంగా ఉంటాయా? ఉండవు. పల్లెకు పోగోరువాడు పల్లెకే చేరుతాడుగాని, పట్టణం ఎలా చేరుతాడు?

ఎవనికి ఏ వాసనలుంటే, వాడు వాటి నిమిత్తమే ఎల్లప్పుడు ప్రయత్నిస్తూ ఉంటాడు. "ఎట్లాగైనా సరే, ఈ ఫలమును నేను పొందెదనుగాక" అనునట్టి బలమైన కోర్కెతో తీవ్రముగా నిర్వర్తించబడిన కర్మయే దైవమై పరిణమిస్తోంది. అంటే ఏమిటి? "కర్మల బలమే (ప్రయత్నముల ప్రయోజనమే) దైవబలంగా పరిణమిస్తోంది" అనునదే ఇక్కడ మనకు సిద్ధిస్తోంది. కర్మలకు (లేక ప్రయత్నములకు) వేరుగా 'దైవము' అనునది ఎవరికీ, ఏదీ ఇచ్చుట లేదు. ప్రతికర్త తన కర్మలను ఈ విధంగానే నిర్వర్తించటం, తత్ఫలితములను పొందటం జరుగుతోంది. ఇక ఇందులో స్వకీయమైన నిర్ణయంగల దైవము అనుదానికి పాత్ర ఎక్కడున్నది?

ఒకనిలో ఏ వాసనలైతే బలమును చేకూర్చుకొని ఉంటాయో – అవే అతని కర్మలు (Deeds)గా పరిణమిస్తున్నాయి.* అయితే తనయొక్క ఇతఃపూర్వపు ప్రయత్నముల వ్యవహారమంతా సమగ్రముగా పరిశీలించక పోవుటచే, (లేదా) అతనికి ఎదురుగా కనబడకపోవుటచే అతడు, "నన్ను ఎవరో ఈ కర్మ నిర్వర్తించవలసినదిగా ప్రేరేపిస్తున్నారు" అని తనకు తాను సమాధానం చెప్పుకొంటున్నాడు. కనుక, 'కర్మ' అనునది వాసనలకంటే భిన్నము కాదు – అని తేలుతోంది కదా! అయితే ఆ వాసనలు, మననమే ధర్మముగాగల మనస్సుకంటే వేరు కాదు. ఇక ఈ మనస్సు మననము అనే 'కర్మ'కు కర్త అయినట్టి 'ఆత్మ' కంటే వేరు కాదు.

కనుక హే సాధూ! 'దైవము' అని చెప్పబడుచున్నదే "ప్రయత్నము రూపముగాగల 'కర్మ' " అయివున్నది. అట్టి కర్మయే 'మనస్సు'. అట్టి మనస్సే 'పురుషుడు' అనబడు ఈ జీవుని స్వరూపము. కనుక ఈ జీవుని స్వరూపము పురుషకారమే కదా! అందుచేత పురుషకారము కంటే వేరొకటి ఎక్కడా ఏదీ లేదని తేలుచున్నది. పురుషకారముకంటే వేరైనదిగా 'దైవము' అనుదానిని గాంచదలచుకొంటే, "అట్టి దైవము లేదు" అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను. అట్టి దైవము 'మిథ్య' మాత్రమే. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

ఇక 'ఆత్మ' అంటే ఏమిటి? అది ఎక్కడున్నది? అది జీవుని స్వస్వరూపముకంటె వేరైనది కాదు. అట్టి ఆత్మయే వాస్తవ స్వరూపముగా కలిగియున్నట్టి ఈ జీవుడు తన మనోరూపమున చేయు కార్యముల ఫలములను స్వస్వరూపమగు ఆత్మనుండే పొందుచున్నాడు. అదే 'దైవము'గా కూడా ప్రసిద్ధికెక్కింది. స్వస్వరూపముకంటే దైవము వేరుగా లేకపోవుటయే మనకు ఇక్కడ సిద్ధిస్తోంది. 'మనస్సు', 'చిత్తము', 'వాసన', 'కర్మ', 'దైవము' – వాస్తవానికి ఇవన్నీ పర్యాయపదములే. ఈ పర్యాయ పదములన్నీ సత్యమును ధరించినట్టి ద్రష్టలగు సాధువులచే, అజ్ఞానులకు బోధించుట కొరకు, కల్పించబడ్డాయి. "ఇది చిత్. ఇది జడము. ఇది దేహము. ఇది దేహి" – అను నిశ్చయము లేనట్టి అజ్ఞాన జనులు విషయమును గ్రహించటానికి వీలుగా ఇవన్నీ కల్పించబడి, విస్తారంగా చర్చించబడ్డాయి. ఇవి విచారించబడి, గ్రహించబడగా, 'బోధ' సుస్థిరమైతే, ఇకప్పుడు సర్వము ఎరుగబడుతుంది. అఖండము, జ్ఞానయుతము అయినట్టి స్వస్వరూప శుద్ధ చైతన్యమే శేషిస్తుంది.* అట్లు శేషించు శుద్ధ సత్యమే ఈ జీవుడు. అట్టి 'దేహి'కి సంబంధించిన ఉత్తమజ్ఞానం పరిఢవిల్లే వరకు ఈ శబ్దజాలం యొక్క అవసరం ఉంటోంది.

పురుషుడే అన్నిటికి మూలం. అతడు దృఢమగు భావనాబలంచేత ఎట్లు ప్రయత్నిస్తాడో, ఫలములను కూడా అట్లే పొందుచున్నాడు. కనుక ఓ రఘుపుంగవా! ఒక్క పురుషకారము వల్లనే అభీష్టములన్నీ సిద్ధిస్తున్నాయని గ్రహించు. అంతేకాని అదృష్టం చేత కాదు. "అదృష్టము చేతనే" అని అనుకొంటే ఇక శాస్త్రాలు ఎందుకు? నేను నీకు బోధించటం దేనికి? నీకైనా, నాకైనా, మరెవ్వరికైనా పురుషకారమే శ్రేయోదాయక మగుచున్నది.

❖

---

* **సంచితము :** ఇతఃపూర్వపు కూడబెట్టబడిన కర్మలన్నిటియొక్క సమన్వయ సంస్కార స్థితి.

ప్రారబ్ధము : వర్తమానపు పరిస్థితులకు అనుకూలముగా బహిర్గతమగు (సంచితము మనకు సంబంధించిన) సంస్కారము.

ఆగామి : ప్రాక్తన + ఆద్యతన యొక్క సంస్కారసారము, ముందు ముందు ఆగామి అయి (Accompany) జీవుని ప్రభావితం చేస్తోంది.

** "సర్వం ఖల్విదం బ్రహ్మ", "జీవో బ్రహ్మేతినాపరః", "అహం బ్రహ్మాస్మి" "త్వమేవాహం", "తత్త్వమసి", "తత్త్వమ్" – ఇత్యాది శ్రుతి వాక్యాలన్నీ ఈ సత్యమునే ప్రతిపాదిస్తున్నాయి.

శ్రీరాముడు :

ప్రాక్తనం వాసనాజాలం నియోజయతి మాం యథా,
మునే! తథైవ తిష్ఠామి! కృపణః, కిం కరోమి అహమ్? (IX - 23)

మునీంద్రా! నాదొక ముఖ్యమైన సందేహం. ఇతఃపూర్వం లేక క్రితం జన్మలందు నిర్వర్తించబడిన 'ప్రాక్తనకర్మలు' ఉండనే ఉన్నాయి. అవి వర్తమానంలో మమ్ములను ప్రభావితం చేస్తున్నాయని మీరు కూడా ఒప్పుకుంటున్నారు కదా! ఆ ప్రాక్తనకర్మలు మమ్ములను ఎట్లా నియమిస్తే మేము అట్లా ప్రవర్తించవలసినదే కదా! ప్రాక్తనకర్మలు మమ్ములను నడిపిస్తుంటే, దీనులమైన మేము ఇప్పుడు చేయగలిగే దేమున్నది? ఆ కర్మలు ఒక విధంగా, మా ప్రవర్తన మరొక విధంగా ఉండే అవకాశం ఎక్కడున్నది చెప్పండి?

శ్రీ వసిష్ఠమహర్షి : నీ ప్రశ్న సుందరంగా ఉన్నది. కాని, నీవు మరల జడత్వమగు ప్రయత్నరాహిత్యమునే ప్రతిపాదిస్తున్నావు. ఈ సంభాషణ యొక్క లక్ష్యము, శ్రోతని ప్రయత్నశీలుని చెయ్యటం. ఎందుకంటే ప్రయత్నరహితుడు ఏమీ చేయలేడు, గ్రహించలేడు. ప్రయత్నపరుడు పొందవలసినది తప్పక పొందుతాడు. సరే, నీ ప్రశ్నకు సమాధానం విను.

'ప్రాక్తనకర్మలు' అంటే ఏమిటి? ఒకప్పుడు నీచేత నిర్వర్తించబడిన కర్మలే కదా! అప్పటి పురుషకారము నిన్నిట్లా ప్రవర్తింపచేస్తుంటే, అందుకు ఇచ్చగించని నీవు ఇక చూస్తూ ఊరుకొంటావా? ఓ రామచంద్రా! నీవు చైతన్యమూర్తివే కాని, ఒకానొక జడపదార్థం కావుకదా! మరి నీవు ఆ ప్రాక్తనకర్మల చేతిలో కీలుబొమ్మ అవటమేమిటి? ఇప్పటి పురుషకారము మాట ఏమిటి? ఇదీ నా ప్రశ్న. ఇప్పుడు అనుసరించబోవు పురుషకారము చేతనే నీకు శాశ్వతమైన శ్రేయస్సు లభిస్తుంది. అంతేకాని, "ఇది నాకర్మ. నేను ఇట్లు చేయకతప్పదు. ఏదో దైవము నాచేత ఇట్లు చేయిస్తోంది", అని తలచి నీవు సరయిన మార్గంలో ప్రయత్నమునకు అభిముఖం కాకపోతే, ఇక నిన్ను కాపాడగలిగేవాడెవడు? దైవం వచ్చి కాపాడతాడా?

❖

ప్రతి జీవునియందు శుభ–అశుభములైన ప్రాక్తనకర్మలు (The essence of past deeds) ఉన్నాయి. అందులో శుభ వాసనలు శుభకర్మలవైపు, అశుభవాసనలు అశుభకర్మలవైపు ఈ జీవుని ప్రేరేపిస్తున్నాయి. ఆ రెండింటిలో ఏది బలవత్తరమైతే, అది రెండవదానిని శీఘ్రంగా జయించి జీవుడిని అట్టి ఆచరణములో నియమిస్తోంది. సరే. ఇంతవరకు బాగానే ఉన్నది. కాని, "ఈ వర్తమానంలో ఏది చెయ్యాలి? ఏది చెయ్యకూడదు? దేనిని ఆశ్రయించాలి? దేనిని ఆశ్రయించకూడదు? దేనిని ఎట్లు గ్రహించాలి? దేనిని ఎట్లు గ్రహించకూడదు? (What should not be interpreted in what way)" ... ఇవి చైతన్య స్వరూపుడవగు జీవుని చేతిలోనే ఉన్నాయి. అందుకు సన్మార్గం చూపించగల గురువులు, పెద్దలచే చెప్పబడిన విధి–విధానములు మనకు ఇక్కడ వర్తమానంలో లభిస్తున్నాయి. అవన్నీ ఆశ్రయించటం వదలి, "నేను నిస్సహాయుణ్ణి" అని

వగర్చటం ఎంతవరకు ఉచితం? వాటి నన్నిటినీ వివేక బుద్ధితో గ్రహించి, చక్కగా ఉపయోగించుకొంటూ ఎందుకు ఆత్మజ్ఞానము కొరకై ప్రయత్నించరాదు? అల్పములు, దోషభూయిష్ఠములు అయినట్టి దృశ్య పదార్థముల వెంటబడి ఎందుకు దుఃఖకరమగు పరిణామములు తెచ్చిపెట్టుకోవాలి?

అందుచేత, నీవు శుభకర్మలనే ఆశ్రయించెదవు గాక! శుభమగు వాసనలచే ప్రేరేపితులైతే, ఈ జీవులు శుభపురుషకారబలం చేత క్రమంగా శాశ్వతమగు ముక్తిని పొందగలరు. ఒకవేళ, అశుభవాసనలు ప్రబలమై, అశుభ కర్మలందు ప్రవేశింప చేస్తున్నాయా? అయితే, వర్తమానంలో ఉత్తమ ప్రయత్నము అత్యంత ఆవశ్యకమై ఉన్నది. వర్తమాన పురుషకారయత్నం చేత క్రమంగా అశుభవాసనలను బలహీనం చెయ్యాలి. అట్లు ప్రయత్నిస్తూ, ఒక శుభతరుణంలో ఆ అశుభ సంస్కారములను మొదలంట పెకల్చివేయాలి.

ఓ రామచంద్రా! ఈ జడమగు దేహమే 'నీవు' అని అనుకొంటున్నావా? కానే కాదు. నీవు చిన్మాత్ర స్వరూపుడవు. ప్రజ్ఞాతత్త్వ స్వరూపుడవు. అట్టి నీవు పూర్వ సంస్కారములకు లొంగి ఉండవలసిన అవసరమేమున్నది? నీకే కాదు. నేనీ వాక్యములు సర్వజనులకు చెప్పుచున్నాను. నాయనలారా! మీరంతా, 'చిత్' నందు ఉదితమైన చైతన్యమే స్వరూపముగా కలవారు. అంతేకాని, బైట ఎక్కడినుండో ఎవరిచేతనో కదల్చబడుచున్న జడపదార్థమాత్రులు (Some matter that moves by Remote Control) కారని మరల మరల గుర్తు చేస్తున్నాను. మరి, "ఆఁ! మాదేమున్నది? అంతా దైవలిఖితం. ఇది ఇంతే. ఇది మా కర్మ. ఇక చేసేదేమీ లేదు" – అను రూపముగల దౌర్భాగ్యమంతా ఎక్కడి నుండి వచ్చిపడుతోంది? కొంచెం యోచించండి. మీ అంతట మీరే నిష్కారణంగా, అసంగతమైన నిష్క్రియత్వానికి పాలుపడి, ఆ దోషమును 'దైవము' అనబడుదానికి అంటగట్టి సంతృప్తి చెందుచున్నారా? అది సరికాదు.

ఓ రామా! ఎవ్వరో బాహ్యము నుండి నిన్ను చేతితం చేస్తున్నారంటావా? అయితే నాకీవిషయం చెప్పు. అట్లు ఏదైతే నిన్ను చేతితమొనర్చుచున్నదో, అద్దానిని నియమించి చేతితం (operative) చేసేదెవరు? ... కాబట్టి అట్టి అభిప్రాయానికి అనవస్థా దోషం (A doubtful state - whether it exists or not) సంభవిస్తుంది. ఇట్టి సరళి "వస్తు సిద్ధి ప్రతిబంధకము" (Hurdle to achieve the Truth) అని మా అభిప్రాయం.

నీవు స్వయంగా చేతన స్వరూపుడవు. కనుక, నీ ఈ వర్తమానమునకు నీవే కారకుడవు. నీ ఉత్తమ – అధమ ప్రయత్నములే నిన్ను ఒకానొక స్థితికి తెస్తున్నాయి. అట్లే ప్రతిజీవుని విషయం కూడా. అందుచేత ఈ దోషమును మూగవస్తువు అయిన దైవమునకు ఆపాదించకుండెదవు గాక! అట్టి ఆలోచనయే మిథ్య.

జీవునియొక్క ఇతఃపూర్వపు ఇంద్రియ–మనో సంబంధమైన కర్మలే "వాసనలు (tendencies)"గా పరిణమిస్తున్నాయి. అందుచేతనే, ఈ ఇంద్రియ – మనస్సులు తమయందు కలిగియున్న వాసనలను అనుసరించి శుభ–అశుభ మార్గముల రెండిటి వైపు ప్రసరించ యత్నిస్తున్నాయి. ఇప్పటి పురుష

ప్రయత్నం చేత ఇంద్రియ మనస్సులను, ఎట్లాగైనా సరే, శుభమార్గంలో నియోగించాలి. పురుషప్రయత్నమే అందుకు నీకు ఉపయుక్తమైన పరికరం. ఓ మహాపరాక్రమవంతుడా! రామచంద్రా! నీ మనస్సు చెడు త్రోవలలో ప్రవేశిస్తున్నప్పుడు, దానిని మంచిమార్గంలో నియమించటానికి చేసే ప్రయత్నమునే మనం ఇక్కడ "పురుషకారం" అని పిలుస్తున్నాం.

ఈ జీవునియొక్క చిత్తము అల్లరి చేసే పిల్లవానివలె అతిచంచలమైనది. అయితే, ఈ చిత్తమునకు ఒకానొక ప్రత్యేకత ఉన్నది. అద్దానిని మనం ఏ 'దిశ' (direction) కు నియమిస్తామో ఆ దిశకు ఉరకలు వేస్తూ పరుగులుతీస్తుంది. దానిని మనం అశుభము నుండి శుభము వైపు త్రిప్పితే క్రమంగా శుభకర్మలనే ఆప్యాయతతో ఆశ్రయిస్తుంది. అట్లా కాకుండా, మంచి నుండి చెడువైపుకు వెళ్లనిచ్చామా, అదేవేగంతో దుష్ట కర్మలను ప్రీతిగా ఆశ్రయిస్తుంది. అందుచేత, ఈ చిత్తమును కొంత పట్టుదలతో బలవంతంగా శుభప్రయత్నముల వైపుకే (శుభప్రదములైన ధ్యాన, సత్ప్రవర్తన, దాన, దయ, దాక్షిణ్యాదులతో కూడిన కర్మల వైపుకే) మరల్చాలి. అంతేకాని, "అట్లే" మాత్రం వదలి వేయరాదు. అశుభకర్మలను (ఇతరులను బాధించుట, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములకు చోటిచ్చుట – మొదలైనవి) క్రమంగా క్షీణింపచేస్తూ, త్యజిస్తూ, కరుణ సమదర్శనము మొదలైన ఉత్తమమార్గములను మనుజుడు ప్రయత్నపూర్వకంగా ఆశ్రయించాలి.

సమతా సాంత్వనేనాశు నద్రాగితి శనైః శనైః
పౌరుషేణైవయత్నేన పాలయేచ్చిత్త బాలకమ్ ॥ (IX - 33)

'చిత్తము' అనే బాలుడు అనేక రాగద్వేషములను స్వీకరించి తన ఇచ్ఛ వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడు. "త్యాగము" అనే కండబలంతో ఈ చిత్తబాలకుణ్ణి ఆ రాగ – ద్వేష – వైషమ్యాది లంపటం (బురద) నుండి బయటకు లాగాలి. స్వాభావికమైనట్టి సమత్వము, సాంత్వములలో నియోగించాలి. పురుషప్రయత్నములచే మెల్లమెల్లగా వానిని ఓదార్చుచు, క్రమంగా అఖండమగు స్వస్వరూపానుభవము నందు లగ్నం చేయాలి.

పసిపిల్లవాడు అల్లరి చేస్తున్నాడని చితకబాదుతామా? అతడు సరికాకపోగా, ఇంకా మొరాయిస్తాడు కదా! అప్పుడు అసలే మాట వినడు. చిత్తమును కూడా బాలునివలె లాలిస్తూ ఆత్మజ్ఞానము వైపు, ఆత్మానుభవం వైపు మరల్చాలి. అంతేగాని, హఠం మొదలై బలప్రయోగాలతో నిరోధించటం ఉపాయం కాదు.

ఓ రామా! ఇతఃపూర్వం నీవు శుభాశుభములైన రెండు వాసనలందు ప్రవర్తించి ఉండవచ్చు. అయినదేమో అయినది. ఇక మాత్రం శుభవాసనలను మాత్రమే రూఢి చేసుకొనెదవుగాక! ఓ శత్రుమర్దనా! "ఈ వాసనలు అభ్యాసవశం చేతనే దట్టమగు చున్నాయి" అనునది ఎవరూ కాదనటానికి వీలులేనట్టి సత్యం. అందుచేత, శుభ వాసనలనే అలవరచుకొనెదవుగాక. ఇంతకు ముందు నీవు అశుభవాసనలు అభ్యసించి ఉండకపోతే మంచిదే. అప్పుడు అశుభకర్మలు నీ మనోగమనమును అంతగా ఆకర్షించలేవు.

'వాసనలు' అనునవి అభ్యాసవశంచేత కానీ, లేక అజ్ఞానవశంచేత కానీ, లేదా మరింకే కారణంచేతనైనా వృద్ధిచెందనీ. అందుకు చికిత్సమాత్రం శుభకర్మలే సుమా! శుభాచరణం సర్వదా మంచిదే*. వాటి వలన కీడు ఉండదు. అవి భవిష్యత్తులో – దుర్వాసనలు ఏర్పడే అవకాశమును బలహీనపరచగలవు.

ఈ జగత్తులో ఏది ఎట్లా అభ్యసిస్తే, అది అట్లాగే పరిణమిస్తుంది. ఏ భావనతో, ఉద్దేశంతో ఒక కర్మ నిర్వర్తిస్తామో దాని పరిణామం ఆ భావన – ఉద్దేశములను అనుసరించే ఉంటుంది. ఈ విషయం అందరికీ నిత్యానుభవమే. ఇందులో సందేహం అనవసరం. అందుచేత నీవు శుభప్రదములైన ఆశయములు కలవాడవై పౌరుషమును (లేక పురుషకారమును) అవలంబించు. క్రమంగా ఈ పంచేంద్రియములను జయించివేయి. ఉత్తమ పురుషుడవు కమ్ము. ఉత్తమ పురుషకారము ఆశ్రయించినవాడు మాత్రమే 'పురుషుడు' అని అనిపించుకొంటాడు. ఈ మనస్సు యొక్క స్థితి గ్రహించ బడనంత కాలం, జ్ఞానం ప్రాప్తించనంత కాలం శుభ కర్మలను ఆశ్రయించవలసిందే. అందుకుగాను 'శుభకర్మలు' అంటే ఏమిటో ముందుగా గ్రహించాలి.

1. గురువు 2. శాస్త్రము 3. యుక్తి లేక ఉపాయం 4. అనుభవం.

ఈ నాలుగిటి సహాయంతో ఉత్తమ ప్రయత్నములను నిర్ణయం చేసుకోవాలి.

ఓ రాఘవా! ఈ జీవుని మనస్సులో జన్మజన్మలుగా అనేక రాగాది దుర్వాసనలు పేరుకొని ఉన్నాయి. వాటిని క్రమంగా శుభకర్మల ప్రభావం చేత 'రహితం' చెయ్యాలి. అప్పుడు ఆత్మవస్తువు తనంతట తానే స్వయంగా ద్యోతకమౌతుంది. సర్వ మనోవ్యాధులు నామరూపాలు లేకుండా నశిస్తాయి. మనస్సు పరిశుద్ధమైన తరువాత, ఇక శుభవాసనలతో కూడా పని ఉండదు. సర్వే సర్వత్రా ఆత్మనే దర్శిస్తావు. వాసనారహితుడవై, వృత్తిజాడ్యములు లేనివాడవై సూర్యకాంతిమణివలె స్వయముగా ప్రకాశిస్తావు.

అరికాలులో ముల్లు విరిగినదనుకో, అప్పుడు ఏం చేస్తాం? మరొక ముల్లును తీసుకువచ్చి దాని సహాయంతో కాలులోని ముల్లును తీసి, ఆపై ఆ రెండు ముల్లులను త్యజిస్తాం కదా! అదే విధంగా శుభవాసనలతో మనస్సులోని అశుభవాసనలను తొలగించి వేయాలి. ఆ తరువాత క్రమంగా ఆ మనస్సును వాసనారహితం చేయాలి. అప్పుడు శేషించు స్వస్వరూపమగు ఆత్మయందు ప్రశాంతానుభవము పొందెదవుగాక. ఓరామా! ఈ లోకంలో ఉత్తమ జ్ఞానులందరు అట్లే ప్రయత్నించుచు శుభమగు పదమును పొందుచున్నారు. నీవు కూడా అట్లే అనుసరించి, పరమార్థ వస్తువును సాక్షాత్కారం చేసుకో. స్వస్వరూపమునందు అవస్థితుడవుకమ్ము.

❖❖❖

---

* **నహి కల్యాణకృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి॥**

నాయనా! అర్జునా! మంచిపనులు చేసిన మానవుడు ఎన్నడూ దుర్గతి పొందడు. (గీత : ఆత్మసంయమ యోగం – 40)

11. జ్ఞానావతరణము

ఓ రామచంద్రా! "బ్రహ్మతత్త్వము" స్వయంప్రకాశమై, అనిర్దేశ్యమై మనోవాక్కులకు అతీతమై ఉన్నది. అయ్యది సత్-చిత్-ఆనంద రూపమున సర్వత్రా వెలయుచున్నది. దాని సత్త వల్లనే తదితరములన్నీ వెలుగొందుచున్నాయి. అదే భవిష్యత్తునందు 'నియతి' అని కూడా వ్యవహరించబడుచున్నది. కార్య-కారణ స్వరూపము కూడా అదే. దర్పణంలో దృశ్యప్రతిబింబమువలె, అనేక నదీతటాకాదులలో అనేక ప్రతిబింబములుగా ఒకే సూర్యబింబము ప్రతిబింబిస్తున్నట్లు, ఆ పరబ్రహ్మమే "నీవు-నేను-అతడు" - ఇత్యాదు లందు ఖండితమువలె ప్రకటితమగుచున్నది. ద్రష్ట యొక్క దృష్టి చమత్కారమే అట్లు ప్రాప్తిస్తోంది.

ఈ జీవుడు వాస్తవానికి స్వభావసిద్ధంగా పరబ్రహ్మస్వరూపుడే. అయితే అజ్ఞాన కారణంగా లేక అనిర్వచనీయమైన 'మాయ' కారణంగా, "నేను జీవుడను, ఖండుడను.* అల్పజ్ఞుడను. బద్ధుడను. కాళ్ళు, చేతులతో కూడుకొనిన దేహమే (ఈ శరీరమే) నా స్వరూపము" - ఇత్యాది అల్పభావములను తన చిత్తమునందు పొందుచున్నాడు. అట్టి అవాస్తవ భావములచే మూర్ఖుడు, దుఃఖితుడు అగుచున్నాడు. అట్టి అల్పత్వమును తొలగించి జీవునకు తన "అఖండ - సర్వనియమాతీత" స్వరూపమును గుర్తు చేయుటయే ఉపనిషత్తులు మొదలైన ఆత్మతత్త్వ ప్రతిపాదకములగు శాస్త్రములయొక్క ప్రయోజనమై ఉన్నది.

అందుచేత రామా! జీవుడు నిత్యబంధువు అయినట్టి ఈ చిత్తమును పౌరుష బలముచే ఏకాగ్రంచేసి, "ఖండానుభవం" నుండి "అఖండానుభవము"**నకు పయనించాలి. నాయనా! ఒక్కసారి ఈ ఇంద్రియములను చూడు. ఇవి విషయాభిలాష యందు మిక్కిలి ఆరూఢమై ఉన్నాయి. బురదపై వ్రాలే దోమలులాగా, ఇవి విషయ సుఖములందే విశేషంగా వ్రాలటం జరుగుతోంది. పురుషప్రయత్నం చేత మాత్రమే వాటిని అరికట్టి సంయమనం చేయగలగటం సాధ్యపడుతుంది. మనస్సును "సర్వసమత్వము" లేక "సమాధి" వైపునకు మరలిస్తేగాని, ఈ జీవునకు దుఃఖదోషాలన్నీ తొలగవు.

❖

ఇప్పుడు మనం జ్ఞానదాయకం, పురుషార్థప్రదం, సారయుతం, సవివరం అయినట్టి విచారణలో ప్రవేశించబోతున్నాం. మనం విచారించబోయే "ఆత్మయొక్క స్వరూప - స్వభావములు" సర్వలోకములకు వారివారి అధికారభేదమును అనుసరించి మహత్తరముగా ఉపయోగపడుగాక!

❖

దేనివలన జీవుడు ఇక్కడే, ఇప్పుడే, ఈ జగద్వ్యవహారములన్నీ ఇట్లు ఉండగానే (Here and now while everything is "as it is") తనయందలి పూర్ణత్వమును అనుభవమునకు తెచ్చుకోగలడు?

---

* ఖండానుభవం = Compartmental consciousness

** అఖండానుభవం = Comprehensive consciousness. An experience of indivisibility.

ఏది గ్రహించుటచే ఈ జన్మమృత్యువుల రహస్యము గ్రహించినవాడై జన్మకర్మల జాడ్యము నుండి సర్వదా విముక్తి పొందగలడు?

ఏది తెలుసుకొనుటచే ఇతడు సుఖ దుఃఖములు మొదలైన ద్వంద్వములకు అతీతుడు కాగలడు?

ఈ మనస్సును సమరసమునందు నిలిపినప్పుడు ప్రాప్తించే సమాధానస్థితి ఎట్టిది?

ఈ సర్వకర్మకాండ, జ్ఞానకాండల అర్థవిచారణ చేసినప్పుడు లభించగల ఉత్తమ వస్తువు ఏది?

ఈ సర్వసంసార వాసనలను త్యజించినప్పుడు సంపూర్ణ శమ సంతోషముల రూపమున ప్రాప్తించే అనుభవమేది?

ఏది పొందిన తరువాత ఇక అనంత సంఖ్యలో ఎదురుగా నిలిచియున్న ఈ బ్రహ్మాండములో పొందవలసినదేదీ 'కించిత్' కూడా మిగిలియుండదు?

అట్టి మోక్షోపాయం మనం విచారించబోతున్నాం. విస్తారంగా నాచే చెప్పబడబోయే ఈ మోక్షకథను వివేకులతో కూడి విచారించటం జరిగితే - ఎవరైనా ఎప్పుడైనా - తప్పక అక్షయము, దుఃఖరహితము అయిన పరమపదమును పొందగలరు. విచారించినంత మాత్రంచేత ఇది దుః ఖమును నశింపజేసి మనశ్శాంతిని ప్రసాదించ గలదు. మనం చెప్పుకోబోయే ఈ మోక్ష కథను పరమేష్ఠియగు బ్రహ్మదేవుడు లోక కళ్యాణార్థమై ప్రవచించియున్నారు. ఆయన కల్పాదిలో బోధించినదే మీముందు ఉంచుచున్నాను.

శ్రీరాముడు : మహర్షీ! ఇతఃపూర్వమే (మనం చెప్పుకోబోయే) మోక్షకథను బ్రహ్మదేవుడు ఎవరికి చెప్పారు? ఎందుకు చెప్పారు? అది మీరు ఎట్లా పొందారు? మొట్టమొదటి నుండి ఎట్టి సందేహములు ఉండకపోవుటే మంచిది కనుక ఇట్లు ప్రశ్నించుచున్నాను. అందుచేత, అన్యథా భావించకుండెదరుగాక!

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! రామా! నీవు కించిత్ సందేహము పొందటం జరిగినా, నిస్సంకోచంగా ప్రశ్నించవలసినదే.

మనం 'బోధ' (Main Text) ప్రారంభించకముందే, ఈ చెప్పుకోబోయే "జ్ఞానవిచారణ"ను నేను ఎట్లు పొందానో వివరిస్తాను. ఆ తరువాత వక్త (బోధించేవాడు) - పృచ్ఛక (ప్రశ్నించేవాడు).... వీరిరువురికి ఉండవలసిన లక్షణముల గురించి, మనం ఉపయోగించబోయే దృష్టాంతములు గ్రహించవలసిన విధానం గురించి, సాధనచతుష్టయం గురించి, సదాచారాదుల గురించి చక్కగా గ్రహించిన తరువాతే మనం (ఉత్పత్తి ప్రకరణము ఆదిగా) తదుపరి విచారణలో ప్రవేశిద్దాం.

ఇప్పుడు ఈ ఆత్మ సమాచారం నేను పొందిన విధమును వివరిస్తున్నాను. విను.

❖

భూత, భవిష్యత్, వర్తమానములచేత అవిభాజ్యమై, వినాశనమనునది లేనట్టి 'ఆత్మతత్త్వము' అను ఒకానొకటి ఉన్నది. అదియే ఈ మాయావిలాసమునకంతటికీ మునుముందుగా సర్వమునకు కారణభూతమైయున్నది. సర్వులయొక్క, సర్వముయొక్క అంతర్యామి, వాస్తవ స్వరూపము అదియే.

సర్వమునకు ఆధారభూతమై, శాస్త్రాదులచే అయ్యది "చిదాకాశము" అని, "ప్రత్యక్ చిద్రూపము" అని, "పరిశుద్ధ ఆత్మతత్త్వము" అనికూడా పిలువబడుచున్నది. అయ్యది అనిర్వచనీయమై, వేదోపనిషత్తులచే ప్రతిపాదింపబడుచున్నదై, సర్వుల స్వస్వరూపమై వెలయుచున్నది.

సముద్రంలో తరంగాలు ఉన్నా లేకున్నా, జలం జలంగానే ఉంటుంది కదా! నిర్వికారమగు ఆత్మతత్త్వముకూడా మాయ ఒనర్చుచున్నను, ఒనర్చకున్నను ఒకే రీతిగా ఉంటోంది.

అట్టి నిర్వికార ఆత్మతత్త్వము నుండి, ఒక సమున్నత తరంగమువలె "విష్ణు భగవానుడు" స్వయముగా ఉదయించినారు. ఆ విష్ణువు నాభికమలం నుండి "బ్రహ్మదేవుడు" జన్మించారు. ఆ బ్రహ్మదేవుడు దేవతల చేతను, మునులచేతను పరివేష్టించబడినవాడై, ఇక ప్రాణులన్నిటిని సృష్టించ సంకల్పించారు. మనస్సు వికల్పములు సృష్టించుచున్నది కదా! ఇది కూడా అట్టిదే.

❖

అయితే ఈ బ్రహ్మదేవుని సంకల్పబలం చేత, సృష్టించబడిన ఈ ప్రాణులు అనేక ఆధి-వ్యాధులతో, లాభాలాభ వ్యవహార భావనలతో అనుక్షణం మనోచాంచల్యం పొంది తల్లడిల్లుచుండిరి. వారంతా విషయభోగరతులై ఉండటం, అల్పాయుష్కులవటంతో అనేక దుఃఖపరంపరలు పొందటం జరుగుచుండేది. జీవులయొక్క ఈ కష్టదశలను చూచి - పిల్లల కష్టములను చూచి తల్లడిల్లు తండ్రివలె - సకల లోకకర్త యగు బ్రహ్మదేవుని హృదయం ద్రవించింది. "హతాశులు, అల్పాయుష్కులు అయినట్టి ఈ నా బిడ్డలందరి దుఃఖములు తీరేదెట్లా?" అని స్థిరచిత్తులై కొంతసేపు యోచించారు. అప్పుడు, సకల దుఃఖనివారణ సమర్థుడగు ఆయన కొన్ని ఉత్తమ సాధనములను సృష్టించారు.

1. తపస్సు/ధ్యానము 2. ధర్మము, 3. దానము, 4. సత్యము, 5. తీర్థములు.

ఈ ఐదింటిని సృష్టించిన తరువాత ఆయన మరికొంత యోచనచేస్తూ, "ఈ ఐదు సాధనములు బాగానే ఉన్నాయి. కాని, ఇంతమాత్రం చేత ఈ నా బిడ్డల దుఃఖములు సమూలంగా పోతాయా? లేదు. జన్మరహితమైనట్టి నిర్వాణపదము పొందాలంటే వీరికి జ్ఞానమే ముఖ్యమైన ఉపాయంకదా! తపో-ధర్మ-దాన-సత్య- తీర్థాదులచే వీరు కోరుకున్న సమృద్ధములన్నీ తప్పక పొందుతారు. కాని అంతమాత్రం చేత వీరికి ఉత్తమమైన శాంతి లభించదు. జీవుని ఉద్ధరించగలిగేది 'జ్ఞానము' మాత్రమే. అందుచేత అజ్ఞానమును పూర్తిగా తొలగించగల ఏదైనా ఉపాయం కనుగొని, ఈ జనులకు ప్రసాదించెదను గాక" అని అనుకొన్నారు. అప్పుడు మనస్సుచే సంకల్పమాత్రంగా నన్ను సృష్టించారు. అనగా నేను బ్రహ్మమానసపుత్రుడను.

❖

ఎక్కడో పుట్టిన తరంగాన్ని మరొక తరంగం చేరునట్లు అనిర్వచనీయమగు మాయ వలన జన్మించిన నేను జపమాలను, కమండలమును ధరించినవాడనై నా తండ్రియగు బ్రహ్మదేవుని సమీపించి సాష్టాంగ ప్రణామం చేశాను. ఆయన చిరునవ్వు నవ్వుచు, నన్ను చేరదీసి, "నీ మనస్సు

కోతివలె చంచలమగు గాక! అట్టి చంచల మనస్సు నందు కొంతసేపు అజ్ఞానం ప్రవేశించును గాక" అని నిర్దేశించారు.

అంతేః! ఒక్కక్షణంలో నేను నా నిర్మల స్వరూపం మరచాను. బుద్ధి జడత్వం పొందుటచే, దీనుడనై ఒక నిరుపేదవలె దుఃఖశోకములు పొందసాగాను. "ఆహా! ఈ సంసార దోషమంతా నాకు ఎక్కడి నుండి దాపరించింది?" అని చింతించసాగాను. ఎంత యోచించినా, చింతించినా నాకు దుఃఖవిముక్తి కలుగనే లేదు. అప్పుడు నా తండ్రి నన్ను సమీపించి "ఏమయ్యా! కుమారా! ఎందుకు నిష్కారణంగా నీలో నీవే దుఃఖిస్తున్నావు? ఈ దుఃఖములకు నివారణోపాయ మేమిటో ఎదురుగా ఉన్న నీ తండ్రినగు నన్ను అడుగవచ్చును కదా! అప్పుడు నీకు తగిన ఉపాయమేమిటో వివరిస్తాను!" అని లాలిస్తూ అనునయవాక్యాలు పలికారు.

అప్పుడు నేను ఆయన ప్రక్కన కూర్చుని వినమ్రతతో "తండ్రీ! దుఃఖమయ సంసారంలో ఈ జీవుడు ఎట్లు తగుల్కొనుచున్నాడు? దీనుడై అనేక దుఃఖములను అనుభవిస్తున్న ఇతడు వాటినుండి విడివడేదెట్లా?" అని ప్రశ్నించాను. అప్పుడాయన విస్తారమగు తత్త్వజ్ఞానం ఉపదేశించారు. ఆ అమృతతుల్యమగు జ్ఞాన ప్రవచనమంతా శ్రద్ధగా గ్రహించినవాడనై అత్యంత నిర్మలుడనయ్యాను. నా తండ్రిని మించినట్టి తత్త్వజ్ఞానమునందు అవస్థితుడనయ్యాను. ఏది తెలుసుకొన్నంతమాత్రంచేత జన్మ సార్థకత పొందుతుందో, పవిత్రత చెందుతుందో, అయ్యది తెలుసుకొన్నాను.

❖

ఆ విధంగా తిరిగి స్వస్వరూపమును పొందినట్టి నాతో ఆయన ఇట్లు పలికారు:

"ఓ ప్రియపుత్రకా! ఇంతకుముందు నీవు, అజ్ఞానవశం చేత జీవుడు ఎట్టి దుఃఖములను పొందుతాడో, స్వయముగా రుచి చూచావు కదా! నా సృష్టిలోని ఈ జీవులందరు అజ్ఞాన జాడ్యముచే దుఃఖ-మోహములందు చిక్కుకొని అనేక జన్మ పరంపరలందు బలవంతంగా ప్రవేశిస్తూ కొట్టుమిట్టాడుచున్నారు. అందుకు ఔషధమే ఇప్పుడు నీకు చెప్పిన అఖండ జ్ఞానము. ఈ జ్ఞానము అన్ని తరగతులవారికి ఉపయోగించాలనే ఉద్దేశంతో నేను నిన్ను శపించి మూఢుడిగా చేశాను. ఇప్పుడు మన ఇరువురి సంభాషణచే నీవు పరమజ్ఞానమును పొందావు. నీవుకూడా నావలెనే ఏకాత్ముడవయ్యావు.

ఇప్పుడు నీవు జనులను అనుగ్రహించటానికి భూలోకం వెళ్ళు. కర్మరతులైన వారికి క్రియాకాండను ఉపదేశించు. విరక్త-చిత్తులగు ప్రాజ్ఞులకు ఆనందదాయకమగు జ్ఞానం ఉపదేశించు."

ఆయనచేత ఆ విధంగా ఆజ్ఞాపించబడిన నేను జంబూద్వీపంలోని ఈ భరతవర్షానికి వచ్చాను. ఈ జ్ఞానము పొందుటకు తగినవారు ఉన్నంతవరకు నేను ఇక్కడే ఉంటాను. నాకు ఇక వేరే కర్తవ్యమంటూ ఏదీ లేదు. అయితే, ఇక్కడ నాకు యథాప్రాప్తములైన కార్యములను మాత్రం అభిమానరహితమైన చిత్తంతో నిర్వర్తిస్తూ ఉంటున్నాను.

ఇట్టి 'జ్ఞానవిచారణ' వినతగిన లోకకల్యాణకారకుడవైన నీవంటి ఉత్తమ శిష్యుడు లభించటం నాకు ఆనందకరమైన విషయం. నిన్ను నిమిత్తంగా చేసుకొని లోకములన్నిటికీ ఈ జ్ఞానామృతమును పంచిపెట్టుటకు ఉద్యుక్తుడనయ్యాను.

ఓ రామచంద్రా! నా జన్మవృత్తాంతం ఏమిటో, ఈ భూలోకమునకు 'జ్ఞానము' ఎట్లు ప్రవేశించిందో, నాయొక్క, నా తండ్రియొక్క ఆశయములు ఏమిటో – అంతా విన్నావు కదా! గొప్ప సుకృతం చేయుట చేతనే, స్వస్వరూపానందప్రదమగు ఈ పర–జ్ఞానం వినాలని నీ చిత్తము తహతహపడుతోంది. ఇట్టి మధురమైన సమయం సర్వలోకములకు శుభము, శాంతము, ఐశ్వర్యము, ఆనందము కలుగచేయునుగాక!

❖❖❖

12. సంసార చక్రం - వైరాగ్యం

శ్రీరాముడు : బ్రహ్మదేవునిచే సృష్టించబడిన ఈ లోకములకు జ్ఞానముయొక్క ఆవశ్యకత ఎట్లు కలిగిందో, అది ఏ విధంగా ఈ లోకమునందు ప్రవేశించిందో, దానియొక్క ప్రయోజనము, ఉద్దేశము ఏమిటో మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : జ్ఞానావతరణము గురించి, జ్ఞానము యొక్క ఆవశ్యకత గురించి, ఇందుకు తగియుండుట గురించి, ఆ సంసారచక్రం గురించి మరికొన్ని విశేషాలు చెపుతాను, విను.

సముద్రంలో తరంగాలు ఉదయిస్తాయి చూచావా! అదే విధంగా పరబ్రహ్మము నందు స్వభావానుసారం బ్రహ్మదేవుడు క్రియాశక్తియుతుడై జన్మించారు.

ఆయన తన వలన సృష్టించబడిన జీవరాశులు "మేము పుట్టుచున్నాము – చచ్చుచున్నాము" అను రూపమున గల జరామరణ భావములను పొందటం గమనించారు. ఒక్కసారి భూత – భవిష్యత్తు – వర్తమానములనంతా పర్యవలోకించారు. ''ఆహాఁ! అనేక యుగములు గడచిపోతున్నాయి. 'స్వర్గము' మొదలైన ఊర్ధ్వగతులు పొందటానికి తగినట్టి సాధన సంపత్తి అంతా సృష్టించాను. ఇవన్నీ బాగానే ప్రవర్తిస్తున్నాయి. కాని, ఈ జన్మలు పొందుచున్న జీవులు మోహబద్ధులే అగుచున్నారు. అంతేకాని, సర్వదా నిత్యమైయున్నట్టి అఖండమైయున్నట్టి స్వస్వరూపమును ఏమాత్రం గాంచుటలేదు'' అని గమనించారు. ఇదంతా చూచి కరుణా పరవశులయ్యారు. అప్పుడాయన నన్ను సృష్టించి, చక్కగా ఉపదేశించి 'జ్ఞాని'గా తీర్చిదిద్దారు కదా! ఈ సర్వజనుల అజ్ఞానము బాపటానికి నన్ను ఈ భూలోకం పంపారు. ఒక్క నన్ను మాత్రమే కాదు. అందుకుగాను సనత్కుమార, నారదాది అనేకమంది మహర్షులను కూడా పంపారు. మమ్ములను నిర్ణయించుటలో ఆయన ఉద్దేశం 'మనోమోహము' అనే జాడ్యముచే కుంచించుకుపోవుచున్న జీవులను, "క్రియ–పుణ్య–జ్ఞానము"లచే సముద్ధరించుటయే సుమా!

ఆ విధంగా అనేక యుగాలు గడచిపోయాయి. విశుద్ధములైన యజ్ఞాది క్రియలు కూడా అశ్రద్ధ కారణంగా అంతరించిపోవటం ప్రారంభించాయి. అది గమనించిన మహర్షులు కర్మకాండను, శాస్త్ర మర్యాదలను ఉద్ధరించాలని (తిరిగి రక్షించాలని) అనుకొన్నారు. ఈ భూమండలమును వేర్వేరు దేశాలుగా విభజించి రాజులను కల్పించారు. ఆ తరువాత, ధర్మార్థకామముల ప్రయోజనం సిద్ధింపచేసే స్మృతి శాస్త్రములను (పురాణములను), యజ్ఞ శాస్త్రములను మరల రచించారు.

❖

ఆ విధంగా కాలచక్రం పరిభ్రమిస్తోంది. కాలమహిమ ఏమని చెప్పాలి? క్రమంగా జనులు ధన, గృహ, అన్నపానాదులందు మాత్రమే ఆసక్తి కలిగి ఉండటం ప్రారంభించారు. ప్రజలలో అనేకులు అనేక నేరాలు చేస్తూ దండార్హులు కావటం అధికమైనది. హింస, యుద్ధము మొదలైన దుష్టక్రియలు నిర్వర్తించకుండా రాజులు, ప్రజలను పాలించటం సాధ్యమయ్యేదికాదు. అటు రాజులు, ఇటు ప్రజలు దీనత్వం పొందటం జరుగుచుండేది. అప్పుడు మావంటి జ్ఞానదృష్టి కలవారు లోకంలో దీనత్వం పోగొట్టటానికి "ఆత్మతత్వము" ప్రచారం చేయవలసి వచ్చింది. ఈ 'విద్య' మొట్టమొదట రాజులకు చెప్పటం జరిగింది. అందుచేత దీనిని 'రాజవిద్య' అని అంటూ ఉంటారు. ఈ 'ఆధ్యాత్మవిద్య' సర్వవిద్యలకు మకుటంవంటిది అవటం చేత దీనికి 'రాజవిద్య' అనే పేరు తగినదే అయింది. రహస్యమగు ఈ విద్యను తెలుసుకొన్నట్టి రాజులు, తదితరులు దుఃఖ విముక్తులయ్యారు.

క్రమంగా నిర్మలమైన కీర్తి కలిగినట్టి అనేకమంది రాజులు గతించారు. ఇప్పుడు ఈ దశరథమహారాజు పుత్రునిగా నీవు జన్మించావు. సహజ నిర్మలము, ప్రశాంతశీలము అగు నీ మనస్సులో ఎట్టి కారణం లేకుండానే పరమపవిత్రమైన వైరాగ్యం జనించింది. అట్టి వైరాగ్యం నీయందు ఈ విధంగా జనించటం లోకములకు శుభము కలిగింపచేయటానికే అయివున్నది.

రాజసిక వైరాగ్యం, సాత్విక వైరాగ్యం అని వైరాగ్యం రెండువిధాలుగా ఉంటుంది–

రాజసిక వైరాగ్యం : ఏవైనా దుస్సంఘటనలు తారసపడినప్పుడు ఏర్పడే వైరాగ్యం. ఉదాహరణకు – ధనమునో, రాజ్యమునో, బంధువులనో కోల్పోవటం మొదలైనవి కారణాలుగా కలిగిన వైరాగ్యం.

సాత్విక వైరాగ్యం : ఎట్టి బాహ్యకారణం లేకుండానే, కేవలం పరిశీలనాత్మకమగు బుద్ధిచేత, నిత్యానిత్య వివేకము వలన ప్రాప్తించే వైరాగ్యం.

నీయందు ఇప్పుడు జనించింది సాత్విక వైరాగ్యం. అందుకే సాధు పురుషులు కూడా అది చూచి ఆశ్చర్యపడుచున్నారు.

బీభత్సం విషయం దృష్ట్వా కోనామ నవిరజ్యతే?
సతాముత్తమ వైరాగ్యం వివేకాదేవ జాయతే ॥ (XI - 23)

జీవితంలో బీభత్సమైన విషయాలు చూచినప్పుడు వైరాగ్యం ఎవరైనా పొందుతారు. అది సహజమే. అందులో మహత్తరమైన విశేషమేమున్నది? అయితే సాధుపుంగవుల వైరాగ్యం

చమత్కారంగా ఉంటుంది. వారు ఇతర జనుల కష్ట సుఖములను గాంచినప్పుడో (అర్జునుడు, బుద్ధుడు మొదలైన మహనీయుల ఉదాహరణలు అట్టివే) లేక కేవలం ఏకాంతంలో నిర్వర్తించబడిన స్వవిచారణాపూర్వక వివేకముచేతనో (ఉదా॥ శుకుడు మొదలైనవారు) వైరాగ్యం పొందటం జరుగుతుంది. అట్టివారు మా దృష్టిలో మహనీయులే. వారే మహాప్రాజ్ఞులు. వారి మనస్సు అతి నిర్మలమై ఉంటుంది. అందమైన పూలతో సుందరముగా తయారుచేయబడిన దండ భగవంతునికి అలంకారమగునట్లు, "స్వవిచారముతో కూడిన పరామర్శ"చే జనించిన వివేకముచే ఈ సంసార గతిని విచారించి, ఇందలి అస్థిత్వ - నాస్థిత్వములను వైరాగ్యాభ్యాసంచే గ్రహించేవారు పురుషశ్రేష్ఠులు. వారు తమను తాము ఉద్ధరించు కొనుటయేకాక, అశుభమార్గమున చనుచున్న తదితర జనులకు కూడా జ్ఞానజ్యోతియై వెలుగొందుతారు.

❖

కాబట్టి, ఓ సభికులారా! వివేకముతో "నేను ఎవ్వరు? ఈ దృశ్యమంతా ఏమిటి? ఇదంతా ఎట్లు ఎక్కడి నుండి ప్రాప్తిస్తోంది? ఈ కనబడే సంబంధ - బాంధవ్యములు ఎచ్చట ఎట్లు ఏర్పడుచున్నాయి?" అనే విషయాలు చక్కగా, బాగుగా విచారించబూనెదరు గాక! "ఈ మాయా దృశ్య ప్రపంచము, ఈ దేహ-ఇంద్రియ-తదితర పదార్థములతో కూడిన బాహ్యజగత్తు, ఈ మనో-బుద్ధి-చిత్తాహంకారాలతో కూడిన అభ్యంతర జగత్తు - ఇదంతా అవిద్యయే" - అని గ్రహించినవారై వివేకమును ఆశ్రయించి అవిద్యను త్యజించి వేసెదరు గాక! "వీటిచే స్పర్శించబడజాలని నిత్యోదిత సాక్షీతత్త్వమే నేనైయున్నాను" అని గ్రహించెదరుగాక!

ప్రియ రాఘవా! శ్మశానము, ఆపదలు, దైన్యము - మొదలైనవి తారసపడినప్పుడు ప్రాప్తించే విరక్తి కంటే, స్వతహాగా విచారణాదులచే కలిగే వైరాగ్యం మహత్తరమైన ప్రభావం కలిగి ఉంటుంది. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.* అందుకుగాను అనేక దృష్టాంతాలు (ఉదాహరణలు) మనం ఈ విచారణలో చూడబోతున్నాం.

నీవు ఈనాడు అకృత్రిమమైన వైరాగ్యమును, అతిశయపూరితమైన మహత్వమును పొందావు. చదునైన, తడిసిన నేల విత్తుటకు తగినదై ఉంటుంది కదా! ఇప్పుడు జ్ఞానోపదేశమునకు పాత్రుడవయ్యావు. సర్వాంతర్యామియగు ఆ భగవంతుని అనుగ్రహం చేతనే, నీబోటివారి బుద్ధి యిట్లు వివేకము పొందినదై వికసించటం జరుగుతూ ఉంటుంది.

ఓ రామచంద్రా! ఓ సర్వజనులారా! ఈ మనం చెప్పుకోబోయే బోధ యొక్క ఉత్తమ ప్రయోజనం మీ మీ వివేకము యొక్క ఔన్నత్యము వలననే ఒనగూడగలదు. కనుక మీ 'వివేకము' విషయంలో జాగరూకులై ఉండండి. 'వివేకము' అనునది యజ్ఞయాగాది సత్క్రియల వలన, గొప్ప తపస్సు

---

* బుద్ధుడు, జీసస్, గురునానక్, మహ్మద్‌ప్రవక్త వంటి మహనీయులు ఈ లోకుల అజ్ఞానజనిత దుర్భర స్థితులను గాంచుటచే వైరాగ్యం పొందారు. అంతేకాని, తాము పొందిన వ్యక్తిగత కష్టములచే కాదు. అందుచేతనే వారు తమ ప్రవచనములచే చెడుదారులను, అశుభములను ఆశ్రయిస్తున్న జనులకు దారిచూపారు.

వలన, చిరకాలం తీర్థయాత్రలు సేవించుట చేత, ఆయా సత్పురుషులచే, శాస్త్రములచే నిర్ణయించబడిన నియమ-నిష్ఠలు సదవగాహనచే అవలంబించుట వలన, పరోపకార ప్రభావంచేత ఉదయిస్తుంది. అట్టి ప్రయత్నములచే అంతరంగమున పేరుకొని ఉన్న పాప-దృష్టులు నశిస్తాయి. అప్పుడు కాకతాళీయ న్యాయముచే 'తత్త్వచింతన'యందు ఆసక్తి కలుగుతుంది.

ఓ రామచంద్రా! ఈ సంసారచక్రము యొక్క భ్రమణమునకు అంతులేదు. "పరమ పదము"ను దర్శించనంతవరకు, జనులు ఇట్లే, ఈ సంసార చక్రంలో పడి తిరుగుతూ ఉంటారు. అనేక రాగద్వేషాదులచే చుట్టబడినవారై, అంతూ-పొంతూలేనట్టి ఐహిక - ఆముష్మికప్రదములైన క్రియావ్యవహారములు ఆచరిస్తూనే ఉంటారు. "ఈ సంసారము అపారము" అనే విషయం, వివేకము ఉదయించినప్పుడు మాత్రమే గ్రహించగలరు. సునిశితమైన బుద్ధిచే వివేకము ఉదయించిందా, ఇకప్పుడు, "త్రాళ్ళు త్రెంచుకొని అరణ్యంలో ప్రవేశించే ఏనుగు"లాగా ఈ జీవుడు "సంసార బుద్ధి"ని త్యజించి, తన స్వస్వరూపమగు పరమపదమును అందుకొని సుఖించగలడు.

❖

ఓ సభికులారా! ఈ సంసారము యొక్క గతి అతి కుటిలమైనది. దీనికి అంతు లేదు. "ఈ దేహమే నేను" అనునట్టి బంధమున చిక్కుకొన్న ఒక మహాజంతువు వంటి ఈ జీవుడు జ్ఞానమును ఆశ్రయించనంతకాలం ఈ సంసారము యొక్క అంతమును కనుగొనజాలడు. వివేకులైనవారు "జ్ఞానయుక్తి" అనే తెప్ప సహాయంచేతనే ఈ సంసార సాగరమును దాటివేసి, తరించుచున్నారు. అట్టి సంసార సాగరమును దాటించగల ఈ "జ్ఞాన విచారణ"ను మీరంతా శ్రద్ధాసక్తులతో, విచారణపూర్వకమైన బుద్ధితో, ఏకాగ్రమనస్కులై వినండి.

ఓ రామచంద్రా! నీకు సందేహాలుంటే ఎప్పటికప్పుడు ప్రశ్నించు.

ఈ జగత్తును గమనించావా? ఇది అజ్ఞానుల కొరకు నిరంతరం అనేక కామ, క్రోధ, మోహ, భయ, సందేహ సమన్వితములగు సందర్భములను, అనుభవములను నిర్మించుకొంటూ పోతోంది. ఫలితమేమిటి? ఈ జీవుని అంతరంగము అనేక దుఃఖములచే, భ్రమలచే దహించబడుతోంది. ఎక్కడా తృప్తిగాని, దోషరహితమైన ఆనందముగాని లభించుట లేదు. అందుకుగాను ఏదైనా ఉత్తమమైన ఉపాయం అన్వేషించాలి కదా! నిరర్థకంగా రోజులు గడిపివేస్తుంటే ప్రయోజనమేమిటి? "అవివేకమునకు ఏకైక ఔషధం జ్ఞాన విచారణయే" అని మేము మరల మరల ప్రకటిస్తున్నాము. "ఆ! ఈ ఆత్మవిచారణ మా కెందుకు? ఇప్పటి మా లౌకిక ప్రయత్నములు, అవి ప్రసాదిస్తున్న ప్రయోజనములు మాకు సానుకూలంగానే ఉన్నాయి కదా!" అని తాత్సారం చెయ్యటం ఉచితం కాదు. ఎందుకంటారేమో? అనుక్షణం మార్పులు చెందుతూ ఉండే ఈ 'ఉపాధి'ని (దేహాన్ని) నమ్మి, ఇందలి దోషములను గమనించకుండా రోజులు గడపటం ఉచితమెట్లా అవుతుంది? శీతల, వాత, తాపాది అనేక వ్యాధులు, దుఃఖాలు, మనోచింతలు, శిథిలత్వం, వృద్ధాప్యం, మృత్యువు - ఇత్యాదులతో కూడుకొనియున్న సంసార వ్యవహారమంతా మనిషిని క్షణకాలంలో దుఃఖ సముద్రము నందు ముంచివేయగలదు కదా! దూరదృష్టి లేనట్టి దుర్బుద్ధులకు నేను కాని, మరెవరు కాని ఏం చెప్పగలం?

సాధుపురుషులగు మహాత్ములు జ్ఞానము – నిగ్రహము – యుక్తి – ఏకాగ్రత (Awareness - Self control - discrimination - concentration) చేతనే (ఈ సంసార దుఃఖమును పొందవలసి వస్తున్నప్పటికీ) దీనిని సహించగలుగుచున్నారు. ఈ దృశ్యమునకు అతీతమైనట్టి అకళంకస్థితియందు తమను తాము స్థాపించుకొనుచు, సుస్థిరత శాంతములను పొందగలుగుచున్నారు.

అనుక్షణం మూఢ మానవులను అనేక దుఃఖచింతనలు సమీపించి వారిని –ఎండుగడ్డిని అగ్నివలె – దహించివేస్తున్నాయి. అందుకే "నాయనలారా! తాత్సారం చేయకండి" అని సర్వజనులకు మరల మరల మనవి చేస్తున్నాను. అమృతతుల్యమగు ఆత్మయే స్వరూపముగాగల ఓ సర్వజనులారా! వానకు బాగా తడిసిన ఎండుగడ్డిని నిప్పు దహించగలదా? మీరు ఆత్మ జ్ఞానమును పొందండి. ఆధ్యాత్మ శాస్త్రమును విచారణపూర్వకంగా గ్రహించండి. ఆత్మతత్త్వమును సాక్షాత్కరింప చేసుకోండి. సమ్యక్‌దర్శులు (సర్వమును సమరస భావముతో దర్శించువారు) ఎట్టి మానసిక వ్యాధులచే బాధింపబడజాలరు. ఈ 'సంసారము' అనే విశాలభూమిలో అనుక్షణం "ఆధివ్యాధులు (మానసిక–శారీరక దోషములు)" అనే సుడిగాలులు లేస్తున్నాయి. ఒక్క తత్త్వజ్ఞుడగువాడు మాత్రమే ఇందులో 'కొండ'వలె నిశ్చలుడై ఉండగలుగుచున్నాడు.

ఏమాత్రం వివేకం కలిగి ఉన్నా, అట్టివాడు తన కాలమును వృథాచేసుకోడు. తత్త్వ జ్ఞానమును గ్రహించినట్టి ప్రాజ్ఞుడు, ప్రబుద్ధాత్ముడు, బుద్ధిమంతుడు అయినట్టి మహనీయుని కోసం వెతుకుతాడు. అట్టివానిని గుర్తించి, సమీపించి, సర్వ సందేహములను నివృత్తి చేసుకొని, శుద్ధజ్ఞానము నందు విలీనుడౌతాడు. నాయనలారా! ఎంతో ప్రయత్నపూర్వకంగా, నిరహంకారంగా, డంబము–దర్పము లేకుండా అన్వేషిస్తే గాని, అట్టి మహనీయుని సామీప్యత లభించదు. ప్రయత్నశీలుడైనవాడు అట్టి వ్యక్తిని సమీపించి, అతనిని నమస్కారాది సపర్యలచే సంతోషింపచేయాలి. ప్రేమపూర్వకంగా, సత్యాన్వేషణాదృష్టితో ప్రశ్నించి తెలుసుకోవాలి. వస్త్రమునకు కుంకుమ రంగు వేసినట్లు, ఈ మనస్సును జ్ఞానులు ప్రసాదించే సమాచారముతో నింపివేయాలి. అత్యంత శ్రద్ధతో సంశయములన్నీ నివర్తింపచేసుకోవాలి. బుద్ధికుశలతతో, ఓర్పు–నేర్పులతో, యత్న పూర్వకంగా, "ఇతడు ఇట్లు చెప్పుటలో ఏ ఉద్దేశమును ప్రకటించుచున్నాడు?" అనునది జాగరూకులై గ్రహించాలి.

❖❖❖

13. ప్రశ్న - సమాధానం

ఓ రామచంద్రా! తత్త్వజ్ఞుడు కాని వానిని, సత్యవస్తువగు ఆత్మను గ్రహించనివానిని, ఉపదేశములేని వానిని ఆత్మవిషయమై ప్రశ్నిస్తే ఏం ప్రయోజనం?

అదేవిధంగా "ఇతడు తత్త్వవేత్త. ఆత్మవిషయమై నాకంటే కూడా అధికంగా ఎరిగినవాడు" అని తెలిసికూడా అతనితో సంభాషించకుండా, అతడు ఏది చెప్పుచున్నాడో అది గ్రహించకుండా, పిడివాదాలతో జ్ఞానవస్తువును తిరస్కరించేవారు – మా ఉద్దేశంలో వృథా వ్యాసంగపరులు మాత్రమే.

ప్రశ్నించువాడు (పృచ్ఛకుడు) : ప్రశ్నించే ముందు మనం ప్రశ్నించువాని జ్ఞాన – విజ్ఞానస్థితులను చక్కగా గ్రహించి ఉండాలి. "ఇతడు ఇట్టి విషయమై పండితుడు" అని నిర్ణయించుకొనిన తరువాత ప్రశ్నించాలి. ఎట్టి అనుకూలమైన ప్రశ్నచే అతని వాస్తవమైన అభిప్రాయం మనకు లభిస్తుందో గ్రహించి ఉండాలి. ఆత్మజ్ఞాన జిజ్ఞాసతో ప్రశ్నించాలి కాని "నీవు మూర్ఖుడవు. నీకు ఏమి తెలియదు" అని నిరూపించుటకు ప్రశ్నించరాదు. ఒకనికి తెలియదని భావించినప్పుడు మనకు కావలసిన ఆత్మ సమాచారం లభించే మరొకవ్యక్తి కోసం అన్వేషించుటచే కాలం సద్వినియోగమౌతుంది. "మనలోని అహంకార మమకారములే ఇతరుల దోషములను ఎంచుటకు ప్రేరేపిస్తాయి" అనే విషయం మనం మరువరాదు. అజ్ఞుడైన వానిని ప్రశ్నించి, అంతటితో ఆత్మ విచార విషయమై దురభిప్రాయములు సమకూర్చుకొని, ఉత్తమ జ్ఞానము తిరస్కరించువాడు మా దృష్టిలో 'మూర్ఖుడు' మాత్రమే. అతడు పరమార్థజ్ఞానం ఎట్లా పొందుతాడు?

సమాధానమిచ్చేవాడు : "నన్ను ప్రశ్నించుచున్న ఇతడి పూర్వాపరములు ఏమిటి? ఇతని మనోదోషములు ఎటువంటివి? ఏ ఉద్దేశంతో, ఏమి కోరి ప్రశ్నిస్తున్నాడు? ఏ విధమైన వాక్యములు, దృష్టాంతములు అతనిని ఉద్వేగరహితునిగా, సత్యోన్ముఖునిగా చేస్తాయి? ఇతని అవధారణ సామర్థ్యం ఎట్టిది? అనిందితములైన నిర్ణయములు కలవాడేనా? నూతనమైన ఉన్నత సత్యమును అంగీకరించి, ఆకళింపు చేసుకోగలడా?" అని వితర్కించుకొని అప్పుడు ప్రశ్నించేవానికి తగినట్లుగా సమాధానం ఇవ్వాలి. పశు స్వభావుడగు అధమునకు ఏమీ చెప్పకపోవటమే మంచిది. ప్రశ్నించేవాని సామర్థ్యం విచారించకుండా ఉపదేశం ఇవ్వటం చెవిటివాని ముందు శంఖం పూరించటం వంటిదే కాకుండా, అతనిని తికమక పరచటమే అవుతుంది.

❖

ఓ రామచంద్రా! నీవు సద్గుణశీలివి. సాత్విక వైరాగ్యం ఆశ్రయించినవాడవు. సద్గుణ పక్షపాతివి. అట్టి నీవు ప్రశ్నిస్తున్నావు.

ఇక నేను, బ్రహ్మదేవునిచే 'బోధ' కొరకు నిర్ణయించబడినవాడను. లోక కళ్యాణము మాత్రమే శిష్యుల నుండి ప్రతిఫలంగా కోరుకొనేవాడిని. కాబట్టి మన ఇద్దరి ఈ గురు–శిష్య సంయోగం మధురమే కానున్నది.

❖

ఓ రాఘవా! నీవు శబ్దార్థ జ్ఞానమునందు మహా నిపుణుడవు. నేను చెప్పబోవు దానిని "ఇది అనుభవపూర్వకమగు తత్త్వము" అను భావన, గౌరవం, ఉత్తమ విశ్వాసము కలిగియుండుము. ఎందుకంటావా? మేము అనేక సంవత్సరములు సత్యము కొరకు అన్వేషించాం. తపోధ్యానాదులచే మనస్సును పరిపక్వం చేసుకొని ఆపై శాస్త్రవిషయాలు పరిశీలించాం. అనేకమంది ఉత్తమ జ్ఞానులతో కూడి, దీర్ఘకాలం విచారణ చేశాం. "సత్యము ఇది" అనే నిర్ణయానికి వచ్చాం. అందుచేత మా వాక్యములపై కొంత విశ్వాసము కలిగియుండటం ఉచితమే కదా! అప్పుడే ఉత్కృష్టమైన ప్రయోజనం

ఉంటుందని నా అభిప్రాయం. విశ్వాసంలేని వైద్యునివద్ద ఉపశమనం కష్టమగునట్లే గురువుపై విశ్వాసం లేనిచోట అవగాహన ఏర్పడటం అసాధ్యం.

❖

నాయనా! నీవు మహామతివి. అకారణ విరక్తుడవు. స్వవిచారణచే జీవుల 'గతి'ని గ్రహించినవాడవు. ఈ 'జీవితము' అనబడుదానిని, ఇందలి జన్మమృత్యు జరా దుఃఖాది దోషములతో సహా సమగ్రంగా చూస్తున్నావు. నీవంటి శిష్యుడు లభించటం కూడా మాకు సంతోషకరమైన విషయమే. శుభ్రమైన వస్త్రమునకు స్వల్ప ప్రయత్నంతో చక్కగా రంగు అంటుతుంది కదా! ఈ నా బోధ సులభంగా నీయందు ప్రవేశించి అంకితము, సుస్థిరము, పవిత్రము కాగలదని నేను భావిస్తున్నాను. నీవు నిన్నటి రోజు పలికిన దానినిబట్టి, "ఈ రాముని బుద్ధి పరమార్థ విచారణ సలుపుటలో ఏకాగ్రత, సమర్థత కలిగియున్నది" అని మేము మునులందరము నిశ్చయం చేశాం. సూర్యకాంతి నిర్మల జలంలో ప్రవేశించునట్లు, నేను ప్రతిపాదించబోయే తత్త్వార్థము అకృత్రిమంగా (స్వభావ సిద్ధంగా) సుందరంగా నీ హృదయములోనికి ప్రవేశించునుగాక! నేను చెప్పబోయేదంతా బహు యత్నపూర్వకంగా గ్రహించాలి సుమా! అట్లు విని, విచారించి, ఆపై నీవు ఎట్లు నిర్ణయించుకొంటావో అట్లే ఆచరించవచ్చు.

ఆయా సందర్భాలలో ప్రశ్నించవచ్చు. అయితే అనుమాన నివృత్తి కొరకు, ఆత్మజ్ఞాన సముపార్జనయే లక్ష్యముగా కలిగియుండి ప్రశ్నించాలి. వ్యర్థమైన ప్రశ్నలు వేయకుండెదవు గాక! ఇలా ఎందుకంటున్నా నంటావా? చంచలమైన ఈ "మనస్సు" అనే కోతి యథేచ్ఛగా సంసారారణ్యంలో సంచరిస్తోంది. అట్టి మనస్సును శుద్ధ పరచుకోవాలి. లేకుంటే, 'సంసార దృష్టి'యే పెత్తనం చలాయిస్తూ, మనస్సును అల్పత్వము వైపుగా ప్రసరింపచేస్తూ ఉంటుంది. అందుచేత నీ ప్రశ్నలు అల్ప లక్ష్యములు కలిగి ఉండే అవకాశమున్నది. యత్నపూర్వకంగా పరమార్థ తత్త్వమునే వినాలి. మహత్తరమైన ఆశయము కలవాడవై ఆత్మయొక్క స్వరూప-స్వభావములు ఎరుగుటకై ప్రశ్నించెదవు గాక!

❖

ఓ మానవులారా! ఈ 'ఆత్మ విచారణ' వినటానికి సిద్ధపడుచున్నారు కదా! అవివేకం చేత అజ్ఞత్వకారణంగా (Because of sheer ignorance) అసత్ వ్యవహారములతో క్షణక్షణం 'సంసర్గము' ఏర్పడటం ఈ సంసారము యొక్క లక్షణం. అట్టి సంసర్గమును క్షీణపరచుకోండి.

ఆత్మోన్నతి సాధించాలనుకొనేవారు సాధుపుంగవులకై వెతకాలి. వారిని గుర్తించి వారితో జ్ఞాన విచారణ చెయ్యాలి. అప్పుడు సత్యమేమిటో, అసత్యమేమిటో మీరే సుస్పష్టంగా తెలుసుకొనగలరు. సాధనపూనండి, నిరంతర సాధుసంగం ఆశ్రయించే వారికి అప్రయత్నంగానే వివేకము ఉదయించి వికసిస్తోంది. అట్టి వివేక వృక్షము యొక్క మధుర ఫలములలోని రసమే "మోక్షము" అని చెప్పబడుతోంది.

❖❖❖

14. మోక్షోపాయం

ఓ రామచంద్రా! "మోక్షము" అనబడే రాజాధిరాజు యొక్క దర్శనం కావాలంటే నీవు నలుగురు ద్వారపాలకులను ఆశ్రయించాలి.

1) శమము – Inner Calmness

2) విచారణ – Enquiry

3) సంతోషము – Contentment

4) సాధుసంగము – Company of Holy men

ఈ నాల్గిటిని యత్నపూర్వకంగా అభ్యసించాలి. నాల్గిటిని ఒక్కసారి అభ్యసించటం కష్టమనిపిస్తే, కనీసం ఏ మూడిటినో, రెండిటినో అభ్యసించు. అప్పుడు ఆ ద్వార పాలకులు నీ కొరకు మోక్షద్వారం తెరుస్తారు. అదికూడా కష్టమనుకొంటే, ఆ నలుగురిలో ఏ ఒక్క ద్వారపాలకుడినైనా ప్రాణాలు పణంగా పెట్టైనా సరే, ఆశ్రయించి ఆప్తమిత్రునిగా చేసుకో. ఆ నలుగురిలో ఒకరు నీ వశమైతే మిగతా ముగ్గురు తమంతట తామే వశమౌతారు.

శాస్త్రము, జ్ఞానము, తపస్సు, శ్రుతులు (వేదములు) – వీటికి వివేకిమాత్రమే యోగ్యుడగుచున్నాడు. అట్టి వివేకి ఆకాశంలో సూర్యునివలె సర్వజనులలో 'శ్రేష్ఠుడు' అగుచున్నాడు.

'చల్లదనం' చేత నీరు గడ్డ కడుతుంది కదా! ప్రయత్న మాంద్యము చేతనే (సరి అయిన ప్రయత్నములను ఆశ్రయించకపోవుటచేతనే) ఈ జీవుని బుద్ధి జడత్వం పొందుతోంది. ఫలితంగా "నేను ఈ కాళ్ళు, చేతులు కలిగినట్టి ఒకానొక భౌతిక శరీరమును. దీని వృద్ధిక్షయాలు నాకు సంబంధించినవే" – అనే భావన దృఢపడుతోంది.

అయితే రామచంద్రా! నీవు మాత్రం "సౌజన్యము, సుగుణములు, శాస్త్రదృష్టుల వలన వికసించిన అంతఃకరణం" పొంది ఉన్నావు. లేళ్ళు తమ చెవులు రిక్కించుకొన్నప్పుడు మంద్రమైన 'వీణధ్వని'ని వినగలుగుతాయి కదా! ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో, జ్ఞాన–పిపాసతో ఉన్నట్టి నీవు నేను చెప్పబోవు వాక్యములు విని, సత్య విషయము తప్పక గ్రహించగలవు.

❖

ఏది ఏమైనా నీవు శాస్త్రప్రవచితమైన ధ్యాన – భక్తి యోగాది అభ్యాస (Practice) – వైరాగ్యము (Analysis) లను మాత్రం వదలవద్దు. వాటి సహాయం చేతనే నీయందు తరగని సౌజన్య సంపద సుస్థిరం కాగలదు. మొట్టమొదట "నేను ఈ సంసారము నుండి విడివడవలసిందే" అని నిశ్చయం చేసుకో. శాస్త్ర, సజ్జన సాంగత్యములను గ్రహిస్తూ "స్వకీయమైన విచారణ" అను రూపముగల తపస్సు నిర్వర్తించు. అద్దాని వలన నీ ప్రజ్ఞాశక్తి వర్ధిల్లుతుంది.

ఓ సర్వజనులారా! శుద్ధమగు చిత్తముతో ఈ వాసిష్ఠ – రామాయణాది ఆత్మ తత్త్వబోధకమగు శాస్త్రములు పరిశీలించండి. "ఇప్పుడు అవన్నీ మా కెందుకు?" అను రూపముగల మూర్ఖత్వమును

వదలండి. ఈ సంసార మహావృక్షమును గమనించారా? ఒక ప్రక్క ఆయువు వృథా అగుచున్నది. నిదురలేచి మనోజాడ్యమును త్యజించండి. అజ్ఞులగువారిని (The Ignorant Lot) ఈ సంసారము నిత్యము మోసగించుచునే ఉన్నది. మూర్ఖత్వమును నశింపచేయాలంటే ప్రయత్నమే ఏకైకమార్గం. 'బద్ధకము, దురాశ, అవిచారము" – అనే మూడు విషసర్పములు ఈ 'జీవితము' అనే ప్రదేశమును సర్వదా విషపూరితం చేస్తున్నాయి. అవి హృదయమును సంకుచితపరుస్తూ ఉంటే మానవుడైనవాడు చూస్తూ ఎలా ఊరుకుంటున్నాడో మాకు అర్థం అవటం లేదు.

ప్రాజ్ఞులగువారియందు నిత్య ప్రసన్నత కానవస్తోంది. ఎందుచేత? తత్త్వదృష్టి చేతనే సుమా! మేఘం లేని ఆకాశంలోని చంద్రుని ఆహ్లాద కిరణములు లోకమునంతా సుఖమయం చేస్తాయి కదా! ఎవని బుద్ధి పూర్వాపర విచారణచే ఆత్మ జ్ఞానమును గ్రహించగలుగుతుందో అట్టివానియందే బ్రహ్మానందము బహిర్గత మౌతోంది. అట్టి బుద్ధి కలవాడే 'పురుషుడు' అని అనిపించుకొంటున్నాడు. అట్టి ఉత్తమ విచారణశీలత, తత్త్వదృష్టి లేనట్టి బుద్ధి కలవానిని ఏమని పిలవాలో నన్ను అడుగవద్దు.

అందుచేత ఓ సర్వజనులారా! మీరంతా "తమోరహితము, స్వచ్ఛము, శాంతి మొదలైన ఉత్తమ గుణములతో కూడినది" – అయినట్టి బుద్ధిని పెంపొందించుకోండి.

❖❖❖

15. జగత్‌భ్రమణ క్రీడ

ఓ రామచంద్రా! నీ మనస్సు చక్కటి సుగుణములతో కూడి ఉన్నది. చెప్పినది గ్రహించగల సూక్ష్మబుద్ధి కలిగియున్నావు. సముచితంగా ప్రశ్నించగలవు. నీపట్ల గల ఆప్యాయతచే, సర్వజనులపైగల అవ్యాజమైన ప్రేమచే లోకకళ్యాణ దృష్టితో ఉత్తమమగు తత్త్వజ్ఞాన విచారణ ప్రారంభించబోవుచున్నాను. అందుకు అనువుగా నీ మనస్సును మరల మరల రజస్తమోగుణరహితం చేయి. ప్రయత్నపూర్వకంగా మనస్సును సుస్థిరపరచుకొని, జ్ఞానము వినటానికి సిద్ధంగా ఉండు. నా తండ్రియగు బ్రహ్మదేవుని 'అభిలాష'ను అనుసరించి, నిన్ను నిమిత్తంగా చేసుకొని, సర్వజనుల ముందు ఈ ఆత్మ విచారణను ఉంచుచున్నాను.

నీ హృదయం వివేకం, అనాసక్తులచే బాల్యమునుండే ఆర్ద్రమైయున్నది. చంద్రుడు లేకుంటే ఆకాశం అందంగా ఉంటుందా? కలువలు వికసిస్తాయా? ఉపదేశమునకు అత్యంత తగినవాడవైన నీ వలన, నీయొక్క సుందరమైన ప్రశ్నల వలన ఈ నా 'ఉపదేశము' ఉత్తమమై ప్రకాశించగలదు. మన ఈ 'విచారణ' యొక్క సారము, లక్ష్యము అయి ఉన్నట్టి "పరమపదము" అను దానిని సముపార్జించుటచే బాహ్యాడంబర దృష్టులన్నీ సమసిపోతాయి.

ఓ రాఘవా! ఈ సంసారము కలుగజేయగల "చిత్తమౌఢ్యం" ఏమాత్రం స్వల్పమైన విషయం కాదు సుమా! 'జ్ఞానము' అనబడు ఉపాయం చేత మాత్రమే మనోవృత్తులన్నీ స్వయంగా లయిస్తూ ఉంటాయి.

ఈ సంసారమును జయించటానికి రెండు ఉపాయములు జ్ఞానులు మనకు చెప్పుచున్నారు.

1) యోగము (ప్రాణాయామము, ధారణ మొదలైనవి)

2) విచారణ (Self enquiry)

ఈ రెండు ఉపకరణములలో 'విచారణ' అనునది అతి సులభమైనది. పరమార్థ జ్ఞానమును సజ్జనులగు వ్యక్తులతోకూడి విచారించటం జరిగితే అమోఘమైన ప్రయోజనమును ప్రసాదించగలదు. "అట్టి 'జ్ఞానవిచారణ'చే దుఃఖములన్నీ నశిస్తాయి" – అనటంలో ఏమాత్రం సందేహంలేదు. అందుచేత విచారణపరులగు వారిని హేళన చేయకుండెదరుగాక! వారే అనేకమంది జీవులను సంసార నికృష్టత్వము నుండి కాపాడగలరు.

❖

ఓ జనులారా! మీరంతా వివేకులు కావాలి. పాము తన కుబుసమును విడచునట్లు, 'ఆధి' అను పేరుగల మనోవ్యాధులకు సరైన చికిత్సను ఆశ్రయించండి. విచారణాదులను ఆశ్రయించినవారై, సత్వసంపద, ఆత్మవిషయమై అనుభవమును పెంపొందించుకోండి. క్రమంగా, జ్వర–ఉద్వేగరహితులై, శీతలాంతఃకరణులై ఈ జగత్తునంతా ఒక ఇంద్రజాలమువలె దర్శించుట అభ్యసించండి. మీరు ఇప్పుడే, ఇక్కడే "సమ్యక్–దర్శనము"ను అలవర్చుకోకపోయారా ... తత్ఫలితంగా అనేక దుఃఖ పరంపరలనే పొందబోవుచున్నారని హెచ్చరిస్తున్నాను.

ఈ సంసారముపట్ల ఆసక్తి కలిగియుండటమనేది అతిభయంకరమైన విషయం. "ఈ సంసారము అనర్థకరమైనదే కదా!" అనే శంకను ఈ జీవుడు కలిగి ఉండాలి. లేకపోతే ఇయ్యది మోహగ్రస్తులగు జీవులను పామువలె కాటువేస్తోంది. ముడులతో కూడిన వస్త్రమువలె బాధిస్తుంది. త్రాడువలె కట్టిపడేస్తుంది. చురకత్తివలె గాయపరుస్తోంది. అగ్నివలె దహిస్తుంది. నిబిడాంధకారమైన రాత్రివలె చూపును పోగొడుతుంది. త్రోవలో పాతబడిన నిలువురాయివలె నేలపై కూలుస్తుంది. ప్రశాంత జలములోనికి విసరబడిన గులకరాయివలె బుద్ధి యందు దోష వృత్తులను పేట్రేపుతుంది. చెప్పనలవి కాని మోహాంధకారకూపం (నుయ్యి)లోనికి త్రోసివేస్తుంది.

దృశ్యాసక్తియే సంసారము యొక్క మూలరూపం. సంసారాసక్తుడగు వాడు అనుభవించని దుఃఖము లంటూ ఉండవు. అట్టి దురంతమగు విషయ విశూచికావ్యాధికి ఇక్కడే తగిన చికిత్స చేసుకోవాలి. లేకుంటే, అది 'రక్తమాంస నిర్మితములే' అయి ఉన్నట్టి బంధుజనుల శరీరములందు "ఆహా! వీరంతా నావారే! నాకు సంబంధించినవారే" అనునట్టి భ్రమపూర్వకమైన మమకారమంతా కలుగజేయగలదు. అట్లు ప్రాప్తించబోయే నరకయాతనలకు 'అంతు – పొంతు' ఉండదు.

అజ్ఞాని యొక్క యాతనలు ఎట్టివని చెప్పగలం? అతడు ఒకచోట రాళ్ళు భక్షించవలసివస్తోంది. మరొకచోట కత్తికోతలు అనుభవిస్తున్నాడు. కొండలమీద నుంచి దొర్లించబడుచున్నాడు. రాళ్ళపై మోదింపబడుచున్నాడు. నిద్రలేకపోవటం, కొండంత భారీ శరీరాలు పొందటం – ఇత్యాది అనేక

యాతనలు అనుభవిస్తున్నాడు. నాయనలారా! మరల మరల గుర్తు చేస్తున్నాను. పలుచేష్టలతో కూడుకొనిన ఈ సంసార యంత్రం అతి దారుణమైనదిగా మేము గుర్తించాం. దీనిని గమనించకుండా, తగిన విచికిత్సా పూర్వకమైన ఉపాయాలు లభిస్తున్నట్టి 'మానవ జన్మ' అను అవకాశమును వృథా చేసుకోవటం ఉచితం ఎట్లా అవుతుంది? కనుక 'అశ్రద్ధ' అను జాడ్యమును త్యజించండి. ప్రయత్నశీలురుకండి.

'శాస్త్ర విచారణ' వలననే ఉత్తమ శ్రేయస్సు లభిస్తుంది. శాస్త్రము అంటే ఏమిటి? కొందరు మహనీయులు – "ఈ దృశ్యము, ఇందలి పదార్థానుభవం మాత్రమే జీవితము యొక్క 'లక్ష్యము, ఔన్నత్యము, పరమావధి' కాదు. ఈ దృశ్యములో ప్రవేశించిన నాకు సంబంధించిన, స్వస్వరూపం విషయమై సత్యమేదో ఉన్నది" – అని గుర్తించి అత్యంత ప్రయత్నశీలురై ఆ సత్యమును గ్రహిస్తున్నారు. తదితరులపై వారికి గల అవ్యాజమైన ప్రేమ కారణంగా అట్టి సత్యమును విధివిధానములగు ప్రయత్నముల రూపమున, విచారణ రూపమున ప్రకటిస్తున్నారు. అట్టివే ఈ శాస్త్రములు. 'మానవజన్మ' అను అవకాశము లభించినందుకుగాను, అట్టి శాస్త్రముల సహాయం స్వీకరిస్తూ ఉత్తమ విచారణ ఆశ్రయించాలి. సత్యాసత్యములను, నిత్యానిత్యములను గ్రహించాలి. "కొందరు వివేకులు సంసార దుఃఖములను ఎట్లా జయిస్తున్నారు? సంసార పీడనం ప్రాప్తిస్తున్నప్పటికీ, నిరంతరం ఆనందచిత్తులై ఎట్లా సంచరించగలుగుచున్నారు?" – ఈ విషయము గమనించబడుగాక! 'జ్ఞానము' అను కవచమును ధరించియుండుట చేతనే వారికది సాధ్యపడుచున్నది సుమా!

❖

విశుద్ధచిత్తులగు అనేకమంది మానవులు హరి–హర–బ్రహ్మాదుల వలెనే ఈ సంసారంలో, ఈ భూమిపై, కౌతుకరహితంగా, విక్షేపములు లేనివారై సంచరించటం జరుగుతోంది. మానవులలోనే "మహామోహబద్ధులు" – "మహామోక్ష స్వరూపులు" కూడా కానవచ్చుచున్నారు. అట్లే దేవతల దానవుల పాతాళ జీవుల విషయం కూడా! అందుచేత రామచంద్రా! ఈ 'మోహము' అనునది ఎట్లాగైనా సరే, క్షీణింపచేయబడాలి. అందుకు జ్ఞానోదయమే ఉపాయం. జ్ఞాన ప్రభావంచేత ఆత్మతత్త్వము స్వయముగానే ప్రకటితం కాగలదు.

ఓ జనులారా! ఈ చెప్పబోవు విచారణను చక్కగా పరిశీలించండి. ఈ 'విచారణ' సహాయంతో మీ విజ్ఞతను సునిశితం చేసుకోండి. హృదయంలో అలుముకొనియున్నట్టి "మోహ–రాగ–కౌతుకములను (Delusion, Attachment, Inquisitiveness with out usefullness) బయల్వెడల కొట్టండి. అప్పుడు ఈ హృదయాకాశమునందే ఆత్మాకాశము పరిఢవిల్లుతుంది. అట్టి స్థితిలో ఈ జీవునకు ఈ జగద్వ్యాపారములన్నీ 'లీల'గా, 'క్రీడ'గానే ఉంటాయిగాని, 'పీడ'గా కాదు. చైతన్యమాత్రమగు (కల్పనారహితమగు, శుద్ధ స్వస్వరూపమగు) "ఆత్మ" ప్రసన్నం కాగా, అప్పుడు పరమశాంతి లభిస్తుంది. 'సర్వసమత్వము' అనబడు అమరభావన రూపుదిద్దుకుంటుంది. అంతఃకరణము బ్రహ్మరసమయమౌతుంది.

ఓ రఘునందనా! జ్ఞానులకు ఈ జగద్భ్రమణమంతా క్రీడగానే తోచుచున్నది సుమా! కాబట్టి నీవు జ్ఞానివి అగుము.

ఈ 'శరీరము' రథంగాను, ఈ 'ఇంద్రియములు' రథచక్రములుగాను, ఈ 'పంచప్రాణములు' ఐదు గుఱ్ఱములుగాను, ఈ మనస్సు-పగ్గముగాను పెద్దలు చెపుతూ ఉంటారు. ఆనందమే దీని గమ్యస్థానం. అట్టి దేహరథమును అధిరోహించిన ఈ జీవుడు "శుద్ధచిత్తము" యొక్క సహాయం చేత జగద్వ్యవహారమంతా "ఆనందరూపమగు" క్రీడగానే దర్శించగలగాలి గాని దుర్భరంగా కాదు.

అదే మా ఈ ప్రయత్నము యొక్క ఏకైక లక్ష్యము.

❖❖❖

16. వివేకులు - అవివేకులు

ఓ రామచంద్రా! ఈ భూమిపై వివేకులు, అవివేకులు కూడా సంచరించుచున్నారు. వారి గురించి కొన్ని విషయాలు చెపుతాను విను.

మనం విచారించబోయే ఈ "అఖండ రామాయణ శాస్త్రము" ఏ వివేకమును ప్రతిపాదిస్తోందో, ... అట్టి వివేకదృష్టి కలిగి ఉన్నట్టి ఎందరో బుద్ధిమంతులు సన్మార్గమును అనుసరించినవారై ఆత్మసాక్షాత్కారం పొందియున్నారు. ఆత్మజ్ఞాన సమన్వితులై రాజాధిరాజువలె ఈ భూమిపై సంచరించారు, సంచరించుచున్నారు. అట్టివారు ఈ కుటుంబ వ్యవస్థలో ఉండి ఉండవచ్చు లేదా, ఈ వ్యవస్థ (గృహస్థాశ్రమం) త్యజించి వీధిలో (సన్యాసాశ్రమంలో) ఉండవచ్చు. ఎక్కడ ఉన్నప్పటికీ వారు దేనికొరకైనా శోకించుట లేదు. హర్షించుట లేదు. దేనినీ కోరరు. త్యజించరు. శుభాశుభములకు వ్యథ చెందరు. శాస్త్ర విరుద్ధములైన వాటికి దూరంగా ఉంటూ ఉంటారు. "పవిత్రత" యందే సర్వదా సుస్థితులై ఉంటారు. వారు ఏది చేసినా శుభముకొరకు, అనేకమంది సుజనుల అనుకూలత కొరకు అయియుంటుంది. అన్నివేళల సన్మార్గమునే ప్రయత్న పూర్వకంగా స్వీకరిస్తూ ఉంటారు. "ఈ ఈ పదార్థములన్నీ నాకుండాలి. ఇవి పొందాలి. ఇవి తొలగాలి" – ఇట్టి రూపముగల బుద్ధిపూర్వకమైన పట్టుదలచే వారు బాధింపబడరు. సర్వ సంఘటనల యొక్క ''పూర్వాపరములను'', "సత్యాసత్యములను" గ్రహించి ఉండుటచే వారు దేనికీ, ఏమాత్రం ఉద్వేగపడరు. అయినప్పటికీ ఆయా లోక ధర్మములను సర్వుల సానుకూల్యతను దృష్టిలో పెట్టుకొని నిర్వర్తిస్తూ ఉంటారు. బాహ్యమునకు ఏది, ఎప్పుడు, ఎట్లు అనుకూలమో, ఉచితమో అట్లే ప్రవర్తిస్తూ ఉంటారు. అంతరంగమున మాత్రం సర్వదా ఆత్మ నిష్ఠులై ఉంటారు. నిష్క్రియులై ఉంటారు.

ఈ లోకంలోని వారి రాక–పోకలు (జన్మ–మృత్యువులు) కూడా బుద్ధిపూర్వకములు కావు. అందుచేత వారు చేసేది, పలికేది నిష్కామమే అవుతుంది. "పరమపదము" అనగా ఏమో గ్రహించబడిన తరువాత, సమస్తకార్యములు, దృష్టులు గ్రాహ్య – త్యాజ్యములు (గ్రహించుట – త్యజించుటలు)

శూన్యరూపములుగానే ఉంటాయి. సర్వవిధములైన ఇచ్ఛలను, కర్తృత్వములను పరిత్యజించినవారై, సర్వదా మధురమైన మనోవృత్తి కలిగి ఉంటారు. శాంత రసమయమగు "బ్రహ్మాకార వృత్తి"చే చంద్రకిరణములవంటి 'ప్రశాంతత'ను అనుభవిస్తూ ఉంటారు. ఆత్మ స్వభావము తెలుసుకొన్నవాడు ఈ మాయమగు "దృశ్యము" అనే ఇంద్రజాలమును చూచి ఆకర్షితుడు కాడు. వికర్షితుడు కాడు. వాటికి కారణమైన వాసనలను అనుసరించడు.

"బాల్యచాపల్య ముస్సృజ్య, పూర్వమేవ విరాజితే"* (XIII.8)

బాల్య చాపల్యమును విడనాడినవాడై ఇతఃపూర్వమే సర్వదా (సిద్ధించియే) ఉన్నట్టి పరమాత్మ సుఖమునందే విరాజిల్లుతూ ఉంటాడు.

అయితే అట్టి జీవన్ముక్తత్వము ఆత్మదర్శనముచేత మాత్రమే లభిస్తోంది. అంతకు మించి వేరే ఉపాయం లేదు. అందుచేత మనుజుడు విచారణ సమన్వితమైన 'బుద్ధి'తో యావజ్జీవితము 'ఆత్మాన్వేషణము' చేస్తూనే ఉండాలి. ఆత్మతత్త్వమునే ఉపాసిస్తూ జ్ఞానమును పొందాలి. ఈ లౌకిక-పారలౌకిక కర్మలను కూడా అది దృష్టిలో పెట్టుకొని, అందుకొరకే నిర్వర్తించాలి. మరింకెందు కొరకు కాదు.

మరి ఆత్మానుభవం పొందేదెట్లా? అభ్యాసమే అనుభవమును ప్రాప్తింప చేస్తుంది.

శాస్త్రములను ఆశ్రయించి సమాచారమంతా గ్రహించాలి. శాస్త్రానుకూలమైన ప్రయత్నములను ఆశ్రయించాలి. గురువులను సమీపించి చురుకైన బుద్ధితో వారి ఉపదేశములలోని అంతర్లీన సారాన్ని గ్రహించాలి. ఏది ఏమైనప్పటికీ, యత్నము చేసేవాడే ఆత్మవస్తువును పొందుచున్నాడు.

❖

ఓ జనులారా! శాస్త్రార్థములను నిరసించుచు, మహాత్ముల ప్రవచనములను పెడచెవిని పెట్టుచు మూఢత్వముచే నిష్కారణంగా అష్టకష్టములను తెచ్చిపెట్టుకోకండి. మనుజుని "అజ్ఞానం - అవివేకం" బాధించునంతగా వ్యాధులుగాని, ఆపదలుగాని బాధించలేవు. అందుచేత మీరు యేయే అజ్ఞానములచే బాధింపబడుచున్నారో, పరిశీలనాత్మకమైన దృష్టితో గ్రహించండి.

---

* ఇక్కడ "పూర్వమేవ విరాజితే" అని మహర్షి మహత్తరమైన ప్రయోగం చేశారు. 'మోక్షము' లేక 'ముక్తి' అనబడునది క్రొత్తగా పొందబడేవస్తువు కాదు. అయ్యది నిత్యమై జీవుని వాస్తవ స్వరూపమై ఇతఃపూర్వమే సర్వదా సిద్ధించియే ఉన్నది. మరి మనం ప్రయత్నించేదంతా దేని కొరకు? ముక్తస్వరూపులమగు మనస్వరూపమును కప్పియున్నట్టి మాయను (లేదా "నేను జీవుడను - బద్ధుడను" - అను అభిప్రాయ రూపంలో గల అజ్ఞానమును) మాత్రమే తొలగించుకొనుటకు అయిఉన్నది. మనయందు, ఈ సర్వము నందు పూర్ణమైయున్న ఆత్మ వస్తువు దర్శించగల సుందరమైన దృష్టి స్థిరపడాలి. అట్టి దృష్టికే సాక్షీ స్వరూపులమై ప్రశాంతముగా శేషించాలి. అప్పుడు నిత్యనిర్మలత్వమే మన అనుక్షణానుభవం అవుతుంది. "మనమందరము ఏకైక ఆత్మస్వరూపులమే" అనునట్టి ఎరుకను బాల్యచాపల్యము వంటి 'ఇంద్రియ - లోలుత్వము' కప్పి ఉంచుతోంది. దృశ్యముపట్ల గల బంధపూర్వకమైన అనుభవం, ఆసక్తి తొలగించటానికే నియమములు, శాస్త్రములు, యజ్ఞములు, విధివిధానములు ఉన్నాయి - అనునది జ్ఞానుల అభిప్రాయం.

కొంచెము సంస్కరించబడిన దృష్టి కలవారు ఈ శాస్త్రమును పఠిస్తే వారి అజ్ఞానం తప్పకుండా తొలగిపోతుంది. వారికి ఇది తప్పకుండా తోడ్పడగలదు. ఇక "పరమాత్మను పొందుటే మా జీవిత లక్ష్యము" అను నిర్ణయముగల మహనీయులైతే ఇది శ్రవణ మధురమై, ఆత్మ సుఖదాయకము కాగలదు. శ్రుతి-స్మృతులందు (వేదపురాణములందు) కొంత మర్మగర్భంగా చెప్పబడిన విషయమే ఈ 'యోగవాసిష్ఠము' నందు అనేక సుందరమైన దృష్టాంతములతో, కథనములతో – సుస్పష్టముగా, ముక్కుకు సూటిగా చెప్పబడింది. అందుచేత ముముక్షువులు దీనిని ఆమూలాగ్రం పఠించి, ఆ తరువాత, నా ఈ అభిప్రాయముయొక్క నిజానిజములు తమకుతామే నిర్ణయించుకొనెదరు గాక!

అసలు, ఈ జీవునకు తుచ్ఛమైన, కుకారణమైన, అనివార్యమైన ఆపదలన్నీ ఎక్కడి నుండి ప్రాప్తిస్తున్నాయి? మూర్ఖత్వము నుండే సుమా! మూర్ఖంగా మూఢునివలె జీవితం గడపడం కంటే, ఒక మూకుడు తీసుకొని అడుక్కుతింటూ ఉండటం ఉచితం. చీకటి నూతిలోనో, చెట్టు తొర్రలోనో ఒక 'పురుగు'గా ఒంటరిగా జీవితం గడపటం మంచిది.

మోక్షోపాయమై ఉన్నట్టి ఈ గ్రంథము యొక్క సహాయంచే 'జ్ఞాన కాంతి'ని పొందువారు మోహాంధకారంచేత గ్రుడ్డివారు అవటం జరగదు. 'తృష్ణ' అనేది వివేకము ఉదయించనంత కాలమే ఉంటుంది. తృష్ణ ఉన్నంతకాలం వేదనలు తప్పవు.

ఓ జనులారా! లేవండి. ఈ శాస్త్రవిచారణను అనుసరిస్తూ రండి. సంసార బంధమును త్రెంచి వేయుటకు కృతనిశ్చయులు అవండి. మావంటి ఆప్తులు, హితులు, సద్గురువులు, శాస్త్రములు ప్రతిపాదిస్తున్నదేమిటో చక్కగా వినండి. గ్రహించండి. అనేక ప్రమాణముల సహాయంచేత, మనందరిలోని ఆత్మ స్వభావ స్వరూపములేమిటో మీ ముందు ఉంచబోవుచున్నాము. స్వస్వరూపమగు ఆత్మను గ్రహించి, అందు సుస్థిరులగువారు మా మహర్షులవలెనే జీవన్ముక్తులై వెలుగొందగలరు.

ఈ సంసారంలో దుఃఖములు ఒకదాని వెనుక మరొకటి వచ్చి పోతూనే ఉంటాయి. దీనికి అంతు ఉండదు. ఇక ఇందులో మిణుకు మిణుకుమంటూ కనిపించే 'సుఖము' లేశమాత్రమే. అందుచేత రామా! నీవు అల్పునివలె దుఃఖములతో కూడిన ఈ సంసార సుఖములవైపు దృష్టి మరల్చకుండెదవు గాక! వివేకియగువాడు "క్లేశరహితము, అద్వితీయము, అనంతము, స్వస్వరూపమాత్రము" – అయినట్టి మోక్షపదము పొందుటకే ప్రయత్నం చేస్తున్నాడు. మనస్సు నుండి కామము – క్రోధము మొదలైన దోషములను తొలగించుకొంటున్నారు.

ఈ రాజ్యాది సుఖములతోను, అన్నపానాది భోగములతోను సంతుష్టి పొంది జీవించేవారు మా దృష్టిలో గ్రుడ్డి కప్పల వంటి వారే. 'అజ్ఞాని' మాత్రమే ఈ ఇంద్రియ విషయానుభవములు చాలా గొప్పవైనట్లు భావించి, వాటివెంట పరుగులు తీస్తున్నాడు. ఫలితంగా అనేక దుఃఖములచే, ఆపదలచే, మోహములచే అనుక్షణం పీడింప బడుచున్నాడు. అవన్నీ వాస్తవానికి ప్రబల వంచకమైనవని, మిత్రరూపంలో కనబడే శత్రువులేనని నీకు వేరుగా చెప్పవలసిన పని ఏమున్నది? వాటియందు ఆసక్తి కలిగియున్నట్టి జీవులు 'మోహము' అనే చీకట్లో చిక్కుకుంటున్నారు. ఆయా

ఆసక్తుల ప్రతిఫలంగా అనేక భయములను, నరకములను, దుఃఖములను, కష్టములను పొందటం జరుగుతోంది.

ఈ సుఖదుఃఖాలు పరస్పర నాశకరములగు వెలుగుచీకట్ల వంటివి. పైగా, అవి క్షణభంగురములు కూడా. అవి అత్యంత శ్రేయోదాయకమైన మోక్షమును చేకూర్చగలవా? లేదు. ఈ సుఖము-దుఃఖము -మానము-అవమానము - ఆశించుట - అభిమానించుట - ప్రాపంచిక సంగతి / సందర్భములను ధ్యానించుట - అభియోగములు కలిగియుండుట - రోషము మొదలైన భావములచే బంధింపబడిన వారు విరక్తితో కూడిన వివేకమును పొందజాలరు. వాస్తవానికి 'వివేకి' అగువాడు మాత్రమే భోగ - మోక్షముల రెండింటిని అందుకొని, సర్వులకు వందనీయుడగుచున్నాడు.

❖

ఓ జీవుడా! నీవు భయమును ఎందుకు పొందుతావు? "నేను స్వల్పుడను" అనునట్టి అల్పత్వమును, దీనత్వమును కట్టిపెట్టి పరమవివేకమును ఆశ్రయించు. నీ స్వస్వభావమేమిటో ఈ "యోగవాసిష్ఠం" అనే దర్పణమును ఉపయోగించి గ్రహించు. వైరాగ్యాభ్యాసం ఆచరించుటచే ఈ సంసారసాగరమును అతి సులభంగా దాటి వేయగలవు.

అయితే అప్రయత్నశీలుణ్ణి మాత్రం త్రిమూర్తులు కూడా కాపాడలేరు. 'వివేకి' అయినవాడు అప్రయత్నవంతుడై ఈ సంసారమాయ యందు నిదురించడు. మోక్షం గురించి, శుద్ధమగు స్వస్వరూపము గురించి విచారించకుండా విషయానందములు మాత్రమే లక్ష్యముగా కలిగియుండి, రోజులు గడపటం ఎంతవరకు ఉచితం? ఈ సంసారములో చిక్కుకొని, తన విమోచనమునకై ప్రయత్నించనివాడు తగలబడుచున్న ఇంటిలోని ఒక గడ్డి పాన్పుపై మత్తుడై విశ్రాంతి పొందుచున్నవాడే అవుతాడు.

లోకమాన్యమైన పదము కేవలం జ్ఞానము వలన మాత్రమే లభిస్తుంది. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఒకవేళ "బ్రహ్మము - అనునది ఎక్కడున్నది? ఉంటే మాకు కనబడాలి కదా?" అని అంటారేమో! బ్రహ్మము ఉండనీ, లేకుండనీ. విచారణ చేస్తే తప్పేమున్నది? 'విచారణ' అనగానే ఎందుకు పిరికితనం, బద్ధకం వహించి ఉండాలి? "ఇప్పుడు స్వస్వరూపము గురించి తెలిసినదానికన్నా విచారణచే అనేక విషయాలు గ్రహించుటచే స్వస్థత చేకూరగలదు" - అని జనులు భావించెదరుగాక. "అట్టి ప్రయత్నము జీవులను ఈ సంసారసాగరము నుండి దాటించివేయగలదు" అని సర్వజనులకు శుభమును కలుగచేయుటయే ఆశయముగాగల మేము మా అనుభవము యొక్క సారముగా ప్రకటించుచున్నాము.

❖

ఓ సభికులారా! "మోక్షము" అని చెప్పబడుచున్న - దృశ్య వ్యవహారమునకు అతీతమైనట్టి, మీయొక్క - నాయొక్క సర్వులయొక్క స్వస్వరూపమే అయినట్టి "స్వసత్తా సామాన్యము (Absolute Existence)" అను రూపముగల - ఒకానొక స్థితి కలదు. ఈ వాక్యం మేము మా అనుభవమంతా

రంగరించి చెప్పుచున్నాం. మీరంతా అట్టి మోక్ష భాగులు కావాలి. ఈ విచారణమంతా ప్రకటించటంలో మాకు గల ఉద్దేశం అదే. సద్గురువును, సచ్ఛాస్త్రమును ఆశ్రయించుటచే, స్వవిచారణచే, సర్వాంతర్యామియగు ఈశ్వరుని (ఆత్మదేవుని) అనుగ్రహంచే ఎవరైనా అట్టి స్థితిని పొందవచ్చు. అట్టి శుద్ధచైతన్య స్వస్వరూపము గురించి విచారించండి. అప్పుడే స్వస్థత పొందగలరు. ఈ ముల్లోకములలో అట్టి మోక్ష స్థితి కంటే నిరపాయమైనది, భ్రమ – శంకారహితమైనది మరొకటి ఉండదు. ఇంద్రియ సుఖములు, స్వర్గసుఖములు – ఇవన్నీ స్వసత్తసామాన్యమగు మోక్ష స్థితితో పోల్చిచూస్తే సూర్యుని ముందు 'దివిటీ' వంటివి మాత్రమే సుమా! మీ హృదయంలో "మేము మోక్షోపాయం తెలుసుకోవాలి" అనే ప్రవృత్తి కనుక కలిగిందా – ఇక మోక్షం పొందటానికి ఎటువంటి ఆటంకం ఉండదు. అందుచేత సత్యదృష్టితో ఇందలి విచారణను గ్రహించండి.

❖❖❖

17. మనోజయం

నాయనలారా! ధనముగాని, బంధుమిత్రులుగాని, తీర్థయాత్రలుగాని, పుణ్య క్షేత్రములలో నివసించుటగాని, ఈ కాళ్ళు – చేతులతో నిర్వర్తించబడే కర్మల చేతగాని, ఈ శరీరమును శ్రమింపచేయునట్టి ఉపవాసాదులవలనగాని 'మోక్షము' అనునది లభించేది కాదు. మరెట్లా లభిస్తుంది? వినండి.

శ్రవణం = స్వస్వరూపమగు ఆత్మయొక్క స్వరూప– స్వభావముల గురించి శాస్త్రములు, గురువులు చెప్పే సమాచారం శ్రద్ధగా వినటం.

మననం = అందలి వస్తుసారాన్ని హృదయంలో మరల మరల విచారణచేస్తూ సుస్థిరం చేసుకోవటం.

నిధిధ్యాస = మనస్సు పరిపరివిధాల పోకుండా నిలువరించటం

= ఆత్మయొక్క స్వభావములైనట్టి అఖండత్వము, నిత్యత్వము, సర్వత్వము, అప్రమేయత్వము అనుభవమునకు తెచ్చుకోవటం. అట్టి అధ్యాస (thought constancy) కలిగి ఉండటం.

ఆత్మ విషయమై ఈ విధములైన పురుషప్రయత్నముల చేతనే మనస్సు జయించబడుతుంది. మనస్సు బ్రహ్మరసము, సర్వసమత్వములచే నింపబడగా అప్పుడు "ఆ మనస్సు, దానికి భోక్తలగు మీరు" కూడా "శుద్ధసత్వము" అయి శేషించగలరు. సమరస భావనను పొందినట్టి మీరు 'బ్రహ్మము'గానే ప్రకాశిస్తారు. అట్టి స్థితియే ప్రతి జీవునియొక్క వాస్తవమగు పరమలక్ష్యమైయున్నది. ఈ జీవుడు ఎరిగినా, ఎరుగకున్నా – అతని యొక్క సర్వ తాపత్రయములు అందుకొరకే. కాని, ఆ విషయం స్వకీయమగు (తనకు తానే నిర్మించుకొనిన) మాయావరణ కారణంచేత మరచుచున్నాడు. లేక అశ్రద్ధ చేయుచు, "ఈ వస్తుజాల సముపార్జనయే నా ఏకైక లక్ష్యం" అని భావించుచున్నాడు. అందుచేతనే అవి పొందినా, లేక పొందకున్నా ఆతడు పూర్ణత్వము యొక్క అనుభవమును ఏమాత్రం

పొందుట లేదు. వాస్తవానికి, అతనికి అనుభవమగుచున్న అసంతృప్తి 'ఆత్మస్థితి' యొక్క సమాచారం సముపార్జించు కోకపోవుట చేతనే కలుగుచున్నది.

సర్వ అసంతృప్తులను తొలగించగల బ్రహ్మపదము (కేవలీ స్థితి, లేక సమాధాన స్థితి) విచారణము (Enquiry) చేతనే సునిశ్చితం కాగలదు. అందుకుగాను, ఈ దేహేంద్రియములను అధిగమించినట్టి ఉత్తమ వివేకము ఆవశ్యకమైయున్నది. ఉత్తమమైన దానికోసం స్వల్పమైనది త్యజించటం లోకవిదితమే కదా! "బ్రహ్మపదము" అనబడు ప్రశాంత స్థితిని కోరుకొనునట్టివారు, దుఃఖజాలమే అయినట్టి (లేక దుఃఖ జాలముగా పరిణమించబోవునట్టి) విషయ వ్యవహారములను పరిత్యజిస్తున్నారు. దృశ్య వ్యవహారమును అధిగమించుటకొరకై తీవ్రప్రయత్నశీలురగుచున్నారు. సమము, సుఖకరము అయినట్టి ఆసనముపై కూర్చుని స్వయంగా సర్వదృశ్య వ్యవహారములను సూక్ష్మబుద్ధితో విచారించుచున్నారు. అట్టి విచారణచే శోకరహితమగు ఆత్మ పదమును పొందినవారై జన్మరహితులగుచున్నారు. అట్టివారి స్వకీయ విచారణ ఎట్టిదో మనం ముందు ముందు పరిశీలించబోతున్నాం. ఓ రాఘవా! మన ఈ సభలోని అనేకులు, అట్లే ఈ భూమిపైగల, అనేకమంది సాధువులు ఆ పరమ పదము గురించి తెలుసుకొనే ఉన్నారు. అయ్యది సమస్త సుఖముల పరమావధి, ఎనలేనిది, నాశనరహితమైనది, అమృత తుల్యమని వారందరికీ తెలుసు. అనేకమంది జ్ఞానుల అభిప్రాయం క్రోడీకరించి, వాటిని కూడా ముందు – ముందు అక్కడక్కడ ప్రకటించబోవుచున్నాను.

నాయనా! రామా! ఈ ప్రపంచంలో కొన్ని మధురమైన పదార్థములు ఉన్నమాట నిజమే. అయితే అవన్నీ ఒకనాటికి నశించబోయేవే కదా! అయినా, ఎండమావులలో నీరు ఎక్కడుంటుంది చెప్పు? ఈ స్వర్గ, మర్త్య, పాతాళ లోకములలో వాస్తవము, శాశ్వతము అయినట్టి సుఖమును ప్రసాదించగల పదార్థమంటూ ఎక్కడా ఏదీ లేదు. అందుచేత శాంతి – సంతోషముల ద్వారా మనోజయం సాధించుటయే ఉచితము, ఉత్తమము కూడా. అట్టి మనోజయము నుండి మాత్రమే ఏకరస స్వరూపమగు ఆనందము లభించుచున్నది. అందుకు వివేకం వికసించాలి. అట్టి వివేకముచే మనశ్శాంతి రూపమైనట్టి "ఆత్మపదం" అనే పరమ సుఖం లభిస్తోంది.

అట్టి ఆత్మజ్ఞానము కొరకు దేవ, దానవ, మనుష్యాది జీవులలో ఎవ్వరైనా సరే, తగియే ఉన్నారు. అది ప్రతి ఒక్కరి స్వస్వరూపమే కనుక "దీనికి ఈ ఈ దేశకాల జాతులకు సంబంధించినవారే తగినవారు" అనునది ఉచితము కాదు. 'ఈ విచారణ వీరికి మాత్రమే పరిమితం' అనునది మా ఉద్దేశమే కాదు.✷

దీనిని పఠించుట ఆత్మవస్తువును ధ్యానించుటయే అవుతుంది. పైగా, ఇట్టి ఆత్మవిచారణ చేయటానికి, (ఆత్మ గురించి సమాచారం గ్రహించటానికి) ఏమాత్రం శరీర పరిశ్రమ అవసరం లేదు. అట్టి ముక్తి – సుఖము పొందినవాని అంతరంగము ప్రశాంతంగా, నిర్మలంగా, భ్రమరహితంగా,

✷ "నామ సంకీర్తనే ధ్యానే సర్వయేవాధికారిణః" : నామ సంకీర్తనమునకు, ధ్యానమునకు సర్వులు తగినవారే.

శ్రమశూన్యంగా, వాంఛాశూన్యంగా ఉండగలదు. అందుచేత అట్టి ఆత్మ విషయమై ఎరుకగలవాడు "ప్రపంచంలో ఏదో నేను పొందలేక పోయానే?" అనే రుగ్మత కలిగియుండడు. "ఇది ఎట్లైనా తొలగాలి. అప్పుడుగాని మరికొందరివలె నేను సంతుష్టుడను కాలేను" అనునట్టి ఆవేశపూరితమైన అభినివేశము కలిగి ఉండడు. దేనిపట్లా కూడా పట్టుదల గాని, ద్వేష-మోహములు గాని కలిగి ఉండడు. ఈ దృశ్య పదార్థముల వాస్తవ - అవాస్తవములేమిటో అతనికి తెలిసిపోతుంది.

అతడు ప్రవాహపతితములైన కర్మలు ఆచరించినప్పటికీ, "దీనికంతటికీ కర్తను నేను" అను ఉద్వేగం పొందడు. అకర్తాభావమునే సర్వదా, ఆశ్రయించి ఉంటాడు.* కనుక, ఆయా కర్మల ఫలితములు అతనికీ అంటవు.

ఓ రామచంద్రా! ఆకాశంలో ఆ సూర్యభగవానుని చూడు. ఆయన దేనినైనా పొందటం గాని, త్యజించటం గాని చేస్తున్నాడా? "ఇది కావాలి? వీరికే సహకరించాలి? ఇది ఇట్లే ఉండాలి" అను భావావేశం లేకుండానే సృష్టిలోని సర్వ పదార్థములకు కారకుడగుచున్నాడు కదా! ఆత్మజ్ఞాని కూడా ఏదీ పొందడు, త్యజించడు. నిర్లిప్తుడై, ఉంటున్నా కూడా, కార్యసమర్థుడై స్వీయ కర్మలను నిర్వర్తిస్తూ ఉంటాడు.

ఇక ఇప్పుడు మనం "మోక్షము" అనే రాజు యొక్క ద్వారపాలకులగు శమ, విచారణ, సంతోష, సత్సంగమముల గురించి విచారిద్దామా?

❖❖❖

18. శమము (తృష్ణారాహిత్యము - శాంతము)

Inner calmness

ఇంద్రియనిగ్రహ రూపమగు ప్రశాంత స్థితియే 'శమము'. ''మనస్సు ఆసక్తులను, ప్రాప్తాప్రాప్తములను త్యజించి సర్వదా ప్రశాంతముగా, తృష్ణారహితంగా ఉండుట" అను దానినే 'శమము' అని అంటున్నాం. శాంతి, ఆనందములతో సర్వవేళల ఉండి ఉండుటయే 'శమము'.

❖

"నేను సుఖమును పొందెదనుగాక" అనునదే 'సుఖాశ' కదా. అట్టి 'సుఖదాహము' అనే దోషము చేత ఈ సంసార పంజరం నిర్మించబడింది. ఈ విస్తారమైన సంసారపు ఎడారిలో 'శమము' అనునది 'సరస్సు' (Oasis) వంటిది. సూర్యుడు అస్తమించగా, పూర్ణచంద్రుడు ఉదయించుటచే ఆ చంద్రుని కిరణములు ఇసుక తిన్నెలను ప్రశాంత పరుస్తాయి. అట్లే శమము ఉన్నచోట ప్రశాంతత ఉంటుంది.

---

* అకర్త = "నాఽహం కర్తా! నైవకించిత్ కరోమి! బంధమోక్షః కుతోమే? - నేను దేనికీ కర్తను కాదు. (ఏదీ నేనైయున్నానో అది) ఏమియు చేయునది కాదు. ఇక నాకు బంధ మెక్కడిది? మోక్షమెక్కడిది?"

'శమము' వలన శ్రేయస్సు లభిస్తోంది. అది ముక్తిప్రదాత, శుభకరము, భ్రాంతి నివారకము కూడా. ఎవడైతే శమాలంకృతుడై, తృప్తుడై, శాంతుడై, నిర్మలుడై ఉంటాడో, అట్టివానికి శత్రువులు కూడా మిత్రులు అవుతారు. ఆతడు విష్ణువువలె శోభిల్లుతాడు. ఎవరి ముఖంలో శమము సర్వదా శోభిల్లుతుందో, అట్టివారి ముందు పూర్ణచంద్రుడు ఎందుకు పనికివస్తాడు? దానివలన కలిగే ఆనందం ముల్లోకములలోని సంపదలు లభిస్తే మాత్రం ప్రాప్తిస్తుందా?

సూర్యుడు ఉదయిస్తే ఏ విధంగా అయితే చీకటి ఉండటం జరుగదో, - అదే విధంగా శాంతచిత్తుని మనస్సులో కూడా దుఃఖములకు, తృష్ణలకు, దుర్భరమైన మనోవ్యాధులకు చోటు ఉండదు. శాంతచిత్తుని యందు లభించే మనోవికాస స్థితికి, ఈ విషయానందములకు, హస్తి - మశకాంతరమైన (ఏనుగుకు-దోమకు ఉండునట్టి) భేదముంటుంది.

శమయుతుడై, సర్వజీవుల పట్ల స్నేహబుద్ధి గల సజ్జనునియందు పరతత్త్వము తనంతటతానే స్ఫురిస్తోంది. శమసమన్వితుని మహా కఠినమైన హృదయము కలవారు కూడా తమ తల్లిని సేవించునట్లు సేవిస్తారు. విశ్వసిస్తారు. ఓ రామచంద్రా! ఇంద్రపదవి వలనగాని, విష్ణుపదవి వలనగాని, "శమము" నందు లభించునంతటి సుఖము లభించదని ఘంటాపథముగా ప్రకటిస్తున్నాను.

ఈ జీవుడు 'తృష్ణ' అనే పాశంచేత బంధింపబడి, అనేక శారీరక, మానసిక రుగ్మతలతో కలత చెందుచున్నాడు. అయితే ఈ మనస్సు 'శాంతి' అనే అమృతం సేవించటం జరిగితే తృష్ణాపాశాలన్నీ తమంతట తామే విడిపోతాయి. సర్వవేళలందు శాంతిని సేవించుటే 'శమము' అయియున్నది. వత్సా! శమము వలన శీతలత్వం పొందిన బుద్ధితో ఏది ఆచరిస్తామో, ఏది గ్రహిస్తామో అది మాత్రమే మధురంగా ఉంటుంది. శాంతితో కూడుకొని ప్రాప్తించిన "ఆనందం" యొక్క అంశలో ఒక ప్రత్యేకత ఉన్నది. అది ఏవైనా సంఘటనల కారణంగా విచ్ఛిత్తి (Breaking) పొందినప్పటికీ, కొద్ది సమయంలో అతని మనోబుద్ధులు తిరిగి శాంతిని సంతరించుకోగలవు. ఇంద్రియానందము అట్టిది కాదు.

శమముతో కూడుకొనిన వ్యక్తిని పిశాచములుగాని, రాక్షసులుగాని, విరోధులుగాని, పాములుగాని బాధించలేవు. ద్వేషించలేవు. బాణము ఒక వజ్రమును ఛేదించ గలుగుతుందా? శాంతిసుధ అనే కవచాన్ని ధరించినవానిని ఈ సాంసారిక దుఃఖములు ఏమీ చేయలేవు. ఒకడు సమము, స్వచ్ఛము, ఉపశమనము పొందినట్టి బుద్ధితో కూడుకొని ఉన్నప్పుడు శోభించునట్లు ఒక మహారాజు అంతఃపురంలో కూడా శోభించలేడు. నాయనా! నేను ప్రాణసమానుడైన ఒక స్నేహితుని చూచినప్పటికంటే కూడా శాంతి - ఆనందముతో కూడిన శమయుతుణ్ణి చూచినపుడు ఎక్కువ ఆనందం పొందుతాను.

ఎవడైతే శమయుతుడై సాధుభావయుతుడై, లోకశుభదాయకమగు ప్రవర్తన కలిగియుంటాడో, అతని జీవితమే ధన్యము. ఇక ఇతరుల జీవితములలో 'వ్యర్థము' అయ్యే పాలే ఎక్కువ. శమయుతుడే అభినందనీయుడు. నిగర్వి, శాంతియుతుడు అగువాడు నిర్వర్తించు కర్మలు శ్లాఘనీయమౌతాయి. శమయుతుడు ఎట్లా ఉంటాడు?

"ఏ వ్యక్తి అయితే శుభాశుభ వ్యవహారములు చూడటం జరిగినా, వినటం జరిగినా, స్మరించవలసివచ్చినా, అతడు హర్షముగాని, విషాదము గాని పొందడో, అతడే శమయుతుడు." అట్టి శాంతుడు భూత-భవిష్యత్తు సుఖములేవీ కోరడు. ప్రాప్తించిన విషయములను త్యజించడు. యత్నపూర్వకంగా ఇంద్రియములను మాత్రం జయించి వేసి ఉంటాడు. సర్వభూతములపట్ల 'సమము' అయినట్టి దర్శనము కలిగి ఉంటాడు. అట్లు ఉండుటయే శమము యొక్క పరాకాష్ఠ. అతడు ఇతరుల కుటిలములైన దుర్గుణములను చూస్తూ కూడా బాహ్య అంతరంగములందు "వ్యర్థ ఆవేశము – ఆవేదన" వంటివి పొందడు. తాను అంతరంగమున శుద్ధుడై ఉంటూ, ఎప్పటికి ఏది సముచితమో అట్లే తదనుకూలంగా మాత్రం ప్రవర్తనను ప్రకటిస్తూ ఉంటాడు. మరొకరి మెప్పు కొరకు కాకుండా కేవలం "మోక్షము" లేక "స్వగుణ దోషనివృత్తి" కొరకు మాత్రమే యథాప్రాప్తములైన ఆయా కర్మలను శాస్త్రోచితంగా ఆచరిస్తూ ఉంటాడు.

స్థితోఽపి నస్థితయివ, నహృష్యతి నకుప్యతి
యః సుషుప్తసమః స్వస్థః స 'శాంత' ఇతి కథ్యతే ॥ (XIII.75)

ఈ ప్రపంచ వ్యవహారములందు అతడు కూడా ఇతరులవలెనే స్థితి పొంది ఉండవచ్చును. కాని అకర్తృత్వ భావనచే దేనియందు కూడా 'స్థితుడు' కాకుండానే ఉంటాడు. అతనికి హర్షముగాని, క్రోధముగాని ఉండదు. సుషుప్తితో సమానమైన స్వస్థతను, శాంతమును అన్నివేళల అన్ని పరిస్థితులందు కలిగి ఉంటాడు. ఎవని మనస్సైతే మరణ సమయమునందు, ఉత్సవ సమయమునందు కూడా ఏ మాత్రం భయ, క్రోధ, భావావేశములు పొందకుండా ఉంటుందో, పూర్ణచంద్రబింబమువలె తన పూర్ణత్వము త్యజించకుండా ఉంటుందో – అట్టి మనస్సు కలవాడు శాంతుడు, శమయుతుడు కూడా.

శమము అభ్యసించువాడు అమోఘమైన ప్రభావం కలిగి ఉంటాడు. ఆతని దృష్టి సకల జీవులపట్ల అమృతప్రవాహంవలె మధురంగా సర్వ సమానత్వంతో ప్రసరితమౌతూ ఉంటుంది. అతడు సర్వదా, సర్వవేళల శీతలాంతఃకరణుడై ఉంటాడు. ఒకవేళ విషయానుభవమునందు ప్రవర్తించవలసి వచ్చినప్పటికీ వాటిపట్ల మూఢము, మూర్ఛాశయము కలిగి ఉండడు. అసంగుడై ఈ ఈ దృశ్య సంసార వ్యవహారమంతటినీ 'దూరగ్రామంలో జరిగే ఒక జాతర'లాగా చూస్తూ ఉంటాడు. చిరకాలంగా ఉండే ఆపదలు అతనిని కృంగదీయలేవు. క్షోభింపజేయలేవు. ఓ రామా! "తపస్సు చేయువాడు – అనేక విషయములు తెలిసినవాడు – యజ్ఞములు చేసినవాడు – రాజు – బలవంతుడు – గొప్ప విశేషములతో కూడుకొనిన గుణవంతుడు" .... వీరందరిలో శాంతుడే మా ఉద్దేశంలో సర్వదా శోభించుచున్నాడు. అతడు పరమానందంతో ఈ భూమిపై సంచరిస్తూ ఉంటే, భూమాత ఆనందపరవశురాలు అవుతుంది. శమము, తృష్ణారహితము అయినట్టి అతని అంతరంగము నుండి అప్రయత్నంగానే 'ప్రశాంతత – పరమానందము' అనే కిరణపుంజములు వెలువడుతూ ఉంటాయి.

సంకట సమయములందు, భయ స్థానములందు శాంతియే గొప్ప బల ప్రదర్శనంగా చెప్పబడుతోంది. అట్టి 'శాంతి - సౌజన్యము' అను బలపరాక్రమములు కలవాడు ఎక్కడుంటే అక్కడ ఆ పరిసరాలు పవిత్రమౌతాయి.

ఓ రఘునందనా! నీవు 'శమము' అనే ఆభరణం చేకూర్చుకో. అద్దానిని నీనుండి మరెవరు హరించలేనంతగా ప్రవృద్ధం చేసుకో! మహాత్ములైనవారు ఈ శమమును తమయందు గుప్తముగా పదిలపరచుకొని, ఇక ఆపై బాహ్యమునకు మాత్రం ఆయా స్థితిగతులను బట్టి ప్రవర్తిస్తూ ఉంటారు. దీనిని అవలంబించినవారు "మోక్షము" లేక "పరమపదము"ను పొందినట్లే. నీవు కూడా శమ, శాంతియుతుడవై సర్వదా ప్రశాంత గంభీరత్వములను అవలంబిస్తూ లోకమాన్యుడవయ్యెదవు గాక!

❖❖❖

19. విచారణ (Enquiry)

ఈ కార్య - కారణ వ్యవహారమంతా గమనించుచున్న మానవుడు శాస్త్ర జ్ఞానమును ఆశ్రయించాలి. నిర్మలము, పవిత్రము అయినట్టి బుద్ధితో నిరంతరం ఆత్మ విచారణ చేస్తూ ఉండాలి. అట్టి విచారణచే బుద్ధి సునిశితమై పరమ పదమును గాంచగలదు. "దీర్ఘ సంసారము" అనే ఒకానొక దోషము ఈ జీవుని పట్టి పీడిస్తోంది. అందుకు దివ్యమైన ఔషధం విచారణయే సుమా!

ఈ ఆపదలన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయి? రాగద్వేషాది ప్రవృత్తుల నుండే కదా! 'విచారణ' అనే చురకత్తితో ఈ నిరంతరం ప్రాప్తిస్తున్న రాగద్వేషములను ఛిన్నాభిన్నం చేయాలి. అసమృద్ధి, బంధువుల మృతి, శారీరక బాధలు మొదలైన కష్ట సమయములలోను, అట్లే సుఖసమయములలోను, ఎక్కడినుండో మోహము వచ్చిపడి ప్రాజ్ఞుడైనవాడి వివేకమును కూడా కప్పివేస్తోంది. మరి అట్టి సంసార స్థితులందు ఉపాయమేమిటి? విచారణయే.

సత్యాసత్య విమర్శ చేయగలుగుచున్న పండితులకు కూడా విచారణయే సాధనమగుచున్నది. విచారణబలం చేతనే సత్పురుషుల బుద్ధి అశుభమును పరిత్యజించి, శుభమును ఆశ్రయించటం జరుగుతోంది. మహనీయులందరు తమ విచారణశక్తి చేతనే - బుద్ధి, బలము, తేజము, సమయోచితమైన స్ఫురణ, ఉత్తమ ప్రయత్నము - మొదలైనవాటిని ఆశ్రయించటం, వాటి సత్ఫలితములను పొందటం జరుగుతోంది.

నాయనా! రామా! "విచారణ" అనేది, "ఇది ఉచితము. ఇది అనుచితము" అనుదానిని ప్రకాశింపజేసే దీపము వంటిది. అభీష్ట సాధనమైనట్టి విచారణను ఆశ్రయించే మహనీయులంతా సంసార సముద్రమును దాటివేయ గలుగుచున్నారు. వివేకమును కప్పివేస్తున్నట్టి మహామోహ మంతటినీ, ఒక్క 'విచారణ' మాత్రమే పటాపంచలు చేయగలదు. మూఢులగువారు విచారణ లేకుండుటచేతనే కాలమునకు వశులై అనేక జన్మపరంపరలు పొందుచున్నారు. వారు ఎక్కడో కాకతాళీయంగా విచారణచే ఈ సంసార వ్యవహారమంతా గమనించినవారై "అయ్యో! అసంగతము,

అసత్యము, దోషపూరితము అయిన ఏదో భ్రమసమూహంలో చిక్కుకున్నట్లున్నామే? ఇదంతా ఎక్కడి నుండి దాపరించింది? అసలు ఇదంతా ఏమిటి? నేనెవడను?" అను సదసద్విమర్శ (ఏది సత్యము, ఏది అసత్యము? అను మీమాంస)కు వస్తున్నారు. అప్పుడు ఈ సంసారమును దాటుటకు ఉపాయములను వెతకి, పొంది, ఆచరించి ముక్తి నొందుచున్నారు. అట్లు ముక్తినొందగోరు వారికి ఈ శాస్త్రములో చర్చించబడిన విషయము ఎంతగానో సహకరించగలదని అందరికీ మనవి చేస్తున్నాము.

'ముక్తి' అనునది, "ఇందు ఏది సత్యము? ఏది అసత్యము? ఏది స్వప్నతుల్యము? ఏది వాస్తవము?" అని విచారించుట చేతనే సాధ్యపడుచున్నది. లౌకికమగు రాజ్యము, సంపదలు, భోగములు, పారలౌకికమైనట్టి మోక్షము – అన్నీ విచారణ – ప్రయత్నము (Enquiry & effort) అను రెండిటిచేతనే సిద్ధిస్తున్నాయి. విచారణ, వివేకములతో కూడిన బుద్ధి ఆపదలందు కూడా కృంగదు. ఎండిన సొరకాయ బుఱ్ఱ నీటిలో మునుగుతుందా? పరిశీలన, విచారణ అవలంబించువారు ఈ సంసార పటాటోపంచే మోసగించబడక, శ్రేష్ఠమైన ప్రయోజనమును లక్ష్యముగా కలిగి ఉంటున్నారు.

❖

ఓ జనులారా! దుఃఖమే అంతిమ ప్రయోజనంగా గల అనేక లౌకిక వ్యవహారములు మూర్ఖుల హృదయంలో తిష్ఠ వేసుకొని ఉంటున్నాయి. బహుచిత్రంగా ముముక్షుత్వమును కప్పివేస్తున్నాయి. నాయనలారా! ఈ జీవుడు 'మోహము'లో నిద్రిస్తున్నాడు. అట్టి మోహము అనేక దుర్భర దుఃఖములకు కారణమగుచున్నదని హెచ్చరిస్తున్నాను. అయితే "మోహనిద్ర" అనే పదము, "విచారణారాహిత్యము" అనుదానికి పర్యాయపదమే సుమా! అది కల్లువలె జీవునకు మత్తు గొలుపుతోంది. ఎన్నడైనా తేజః స్వరూపుడగు సూర్యుడు 'చీకటి'లో మునుగుతాడా? లేదుకదా! విచారణతత్పరుడైనవాడు, "విషయములు" అనే బురదతో నిండియున్న దీర్ఘ మోహమునందు నిమగ్నుడు కాడు. మరల మరల గుర్తు చేస్తున్నాను, 'జీవితము' అనుదానిలో అవిచారణ చేతనే మోహము అనునది తాండవించటం జరుగుతోంది.

విచారణచే వికసించిన మనస్సే శోభించుచున్నది. అయ్యో! మూఢబుద్ధులగు అనేకులు 'విచారణ' లేకుండానే జీవితం గడిపివేస్తున్నారే? ఎదురుగా ఏమాత్రం లేనట్టి దయ్యమును బాలుడు గాంచుచున్నట్లు, విచారణహీనుడు స్వల్ప విషయముల చేతకూడా హింసించబడుచున్నాడు. అతడు ఆపదలను, దుఃఖములను తాను పొందుచు, ఇతరులకు పంచిపెట్టుచున్నాడు. మూర్ఖుడై 'ఆత్మవిచారణ'కు సంబంధించిన సమాచారమే దరిచేరనీయుటలేదు. "ఇదంతా మాకేమి ఉపకరిస్తుంది? ఎవరో ఏదో చెప్పితే మేము బాగుపడతామా? ఎవ్వరు మాకు చెప్పలేరు. మా గతి ఇంతే" అని ఆత్మ విషయకమైన జ్ఞానాన్ని తిరస్కరిస్తూ, మొండితనము వహిస్తున్నాడు. "ఏది ఎట్లో అది అట్లే అగుగాక! మేమిట్లే ఉంటాము. దుఃఖములా? రానిండు. ఎవరము ఏమి చేస్తాం?" అని చెప్పుకుంటూ విచారణ చేయుటకుగాని, వినుటకుగాని సిద్ధపడనివారికి ఎవరం ఏమి చెపుతాం? అట్టివారిని దూరంగా త్యజించుటయే మంచిది.

'దయ్యము' అనబడుదాని అనుభవం చీకట్లో మాత్రమే ప్రాప్తిస్తుంది కదా! ఈ ప్రపంచంలో విచారణ లేకపోవుట చేతనే ఇతరులను హింసించటం, మానసిక వ్యాధులు మొదలైనవి సంభవిస్తున్నాయి. మా ఉద్దేశంలో వివేకహీనుడు నిర్జన ప్రదేశంలోని చెట్టులాగా నిష్ప్రయోజకుడే. ఏ మనస్సు వాంఛాశూన్యమై, విచారయుతమై ఉంటుందో, అయ్యది పరమానందమే పొందగలుగుతుంది. అట్టి ఉత్తమమైన మనస్సు విచారణ లేనివారికి లభించుట లేదు. విచారణ కలవానిబుద్ధి మాత్రమే పరమార్థ బోధకు తగి ఉంటుంది. "వివేకము" అనునది విచారణయొక్క ఫలితమేకదా! విచారణ సామర్థ్యము కలవారు తాము ఉన్నచోట సర్వ భవభయములను తొలగించుచు, దశదిశల శోభించు చున్నారు. ఒక్క 'విచారణ' అనునది మాత్రమే ఈ సంసార భయమును తొలగించ గలదు. అదే ఈ కనబడే దృశ్యమును అభూతమయంగా చేసి చూపగలదు.

❖

ఈ జగత్తులో ఉండే పదార్థములన్నీ విచారించి చూడనంతవరకే మనోహరంగా కనిపిస్తాయి. విచారించి చూస్తేనో, ఇదంతా మట్టి–రాయిలాగానే అసారమని తెలిసి పోతోంది. ఓ రామా! ఈ సంసారము అనబడే మనోభూతమును గమనించావా? ఇది మనుజుని మనోమోహంచేత మాత్రమే కల్పించబడింది. అనేక దుఃఖములను కల్పిస్తున్నట్టి ఇది, 'విచారణ' చేతనే లయించి పోతోంది.

'కైవల్యము' – అనునది సర్వవైషమ్యశూన్యము, సుఖప్రదము, బాధారహితము, అఖండితము అయున్నది. అదియే అనుభవపూర్వకంగా మేము చెప్పునది. అట్టి కైవల్యము సద్విచారణ చేతనే ప్రాప్తిస్తోంది. విచారణచే "నేను ఇట్టి మోక్ష స్వరూపుడనే" అను ఎరుక ఉదయించగా, అప్పుడు 'నిష్కామత్వం' (ఒకానొకటి పొందవలెననెడి భావావేశం లేకుండుట) దానంతట అదే ప్రాప్తిస్తోంది. అప్పుడు ఈ జీవుడే స్వయముగా ఉదారుడు, నిశ్చలుడు, ఆనందరస స్వరూపుడు అగుచున్నాడు. శ్రేష్ఠత్వమును ప్రసాదించగల 'విచారణ' అనే ఉత్తమ ఔషధం సేవించినవాని చిత్తము, ఇక దేనిని కోరుకొనదు. దేనిని త్యజించదు. స్వీకరించబడని చోట త్యజించటం ఏమి ఉంటుంది? అతడు క్రమంగా గ్రాహ్య–త్యాజ్యములను అధిగమించిన ప్రశాంత స్థితిని నిశ్చలం చేసుకుంటున్నాడు.

❖

చిత్తము బ్రహ్మభావమును ఆశ్రయిస్తే, ఇక వాసనలన్నీ తమంతట తామే నశిస్తాయి. అప్పుడాచిత్తము 'ఆకాశము'వలె ఉదయాస్తమయములు లేకయే ఉంటుంది. అట్టి వ్యక్తి ఈ విశాల జగత్తును కేవలం సాక్షివలె చూస్తూ ఉంటాడు. ఇక అతడు ఎప్పుడూ లోపలగాని, వెలుపలగాని నివసించడు. ఏ విధమైన దుఃఖమును పొందదు. "ఈ ఈ కర్మలు నేనే చేస్తున్నాను" – అను కర్తృత్వముండదు. కనుక కర్మలను ఆచరించనివాడే అవుతాడు. "ఈ ఈ కర్మలు ఇంకా ఎంతకాలం చెయ్యాలి?" అనునట్టి ఆరాటము కూడా పొందడు. ప్రవాహ పతితంగా ఆయా కర్మలు ఇంద్రియములచే చేయవలసి వస్తున్నప్పుడు ఏవి శుభప్రదమో, శాస్త్రవిహితమో, లోకమునకు అనుకూలమో, – అట్లే ఆ కర్మలనే నిర్వర్తిస్తాడు. తదనుకూలంగానే వ్యవహరిస్తాడు. కోల్పోయేదానికి

చింతించడు. లభిస్తున్న దానికి స్వాభిమానుడు కాడు. దుఃఖించడు. సంతసించడు. సముద్రమును చూచావుకదా! నదులనుండి అనుక్షణం జలం వచ్చి చేరుచున్నప్పుడు, మరియు సూర్య కిరణములు తనలోని జలం త్రాగివేస్తున్నప్పుడు అది తొణుకు-బెణుకు లేకుండానే నిర్లిప్తంగా, ప్రశాంతంగా ఉంటుంది కదా!

❖

ఓ రాఘవేంద్రా! చక్కగా విచారణ చేసియున్నట్టి జీవన్ముక్తులగు మహాశయులు, యోగులు అయినవారు తమయొక్క నిండైన మనస్సుతో ఈ జగత్తునందు సంచరించు చున్నారు. ఆ విధంగా వారు చిరకాలం వసించి, అటు తరువాత ఈ ఉపాధి వ్యవహారములను కూడా త్యజించి ఒకానొకప్పుడు అపరిచ్ఛిన్నమగు విదేహముక్తిని స్వభావానుకూలంగా పొందుచున్నారు.

'విచారణ' అనునది అత్యంత ముఖ్యమైనదని నేను చేతులెత్తి ప్రకటిస్తున్నాను. దృష్టాంతంగా ఒక చక్రవర్తిని తీసుకో. అతనికి కష్టకాలంలో ఏదైనా సందేహం వస్తే ఏం చేస్తాడు? "ఇది సత్ఫలమైనదా? లేక, నిష్ఫలమైనదా?" అని తన మంత్రులతో కూడి యోచిస్తాడు. చీకట్లో దీపమే ఉపకరణమగుచున్నది కదా! 'విచారణ' వలననే మానవుడు ఇటు కర్మకాండలోని, అటు జ్ఞానకాండలోని ధర్మ సూక్ష్మమును గ్రహిస్తున్నాడు. "ఇది ధర్మం. ఇది అధర్మం. ఇది ఉచితం. ఇది అనుచితం" అని లౌకిక విషయాలను నిర్ణయించుకుంటున్నాడు. ఇదంతా మనం చూస్తున్నదే కదా! అదే విధంగా విచారణ చేతనే బ్రహ్మతత్త్వము కూడా గాంచగలరు.

'విచారణదృష్టి' అనునది ఈ భౌతిక దృష్టి వంటిది కాదు సుమా! అందుచేత అది చీకటిచే వినష్టం కావటంగాని, లేక అమిత తేజస్సును చూచి చెదిరిపోవటం గాని జరుగదు. అట్టి విచారణదృష్టికి ఎంతో దూరంగా ఉన్నవి, భూత భవిష్యత్ వర్తమానములలో ప్రాప్తించేవి కూడా కనబడతాయి. మా దృష్టిలో వివేకరహితుడే నిజమైన గ్రుడ్డివాడు. అతని స్థితి అతి శోచనీయం. వివేకము కలవాడే చివరికి అన్నిటిలోను, అందరిలోను ఉత్తముడగుచు, జయిస్తున్నాడు. ఈ 'ఆపదలు' అను వాటిని ప్రక్కకునెట్టి 'ముక్తుడు' అగుచున్నాడు.

ఓ రామా! వివేకము అనబడే మహత్తరమైన సుందరవస్తువు వలననే పరమాత్మ సులభ్యుడగుచున్నాడు. అందుచేత వివేకమును ఒక్క క్షణమైనా విడిచి ఉండరాదు. జ్ఞానులు వివేకవంతుని మాత్రమే కనికరించి ఆత్మవస్తువును బోధించుచున్నారు.

వివేకమును ఆశ్రయించినవారు మాటిమాటికీ గుంటలలో పడరు. విచారణ లేకపోవటమనేది ఆత్మఘాతుకం, ఆత్మద్రోహం కూడా. అట్టి మూర్ఖుడు జన్మ జన్మాంతరాలుగా అనుభవించే బాధల ముందు విషశస్త్ర ఘాతాలు కూడా ఎందుకూ పనికిరావు. విచారణహీనుడు మనుజుడై పుట్టి లాభమేమున్నది చెప్పు? అంతకంటే బురదలో కప్పగానో, మలములో కీటకముగానో, అంధకారంలో పాముగానో పుట్టడం మంచిది. (కనీసం, 'మానవజన్మ' అనే మహత్తర అవకాశం లభించి వృథా అయినట్లన్నా అవదు). పరిశీలనారాహిత్యమే సకల అనర్థముల నివాసభూమి. అందుచేతనే సాధు

పురుషులు విచారణ రహితులగు జనులను తిరస్కార భావంతో చూస్తారు. ఈ జీవుడికి ఎక్కడెక్కడినుండో అనేక దుఃఖములు, అనర్థములు వచ్చిపడుతున్నాయంటే దానికి మూలకారణం అవిచారణ, దూరదృష్టి మాంద్యములేనని గుర్తు చేస్తున్నాను. 'రాగ ద్వేషములు' అనే అంధకార కూపంలో (చీకటి నుయ్యిలో) చిక్కుకొన్నజీవుడు నిరంతరం విచారణను ఆశ్రయించి ఉంటేనే, ఎప్పటికైనా, ఆ నుయ్యిలోంచి బయటపడగలడు.

❖

"నేను ఎవడను? ఈ సంసారదోషమంతా నాకు ఎక్కడి నుండి వచ్చిపడింది?" – అను ప్రశ్నలకు జీవుడు మొట్టమొదట రావాలి. వాటి సమాధానము కొరకు సాధు పురుషులను, ఆత్మవిషయ ప్రతిపాదకములగు శాస్త్రములను, స్వబుద్ధిని ఆశ్రయించాలి. సునిశితమైన బుద్ధిచే విజ్ఞానపూర్వకమైన పరిశీలనం చెయ్యాలి. అట్టి పరిశీలననే "విచారణ" అని పిలుస్తున్నాం.

విచారణ హీనుని హృదయం రాయి కంటే మౌఢ్యమైనది. గ్రుడ్డికంటే గ్రుడ్డిది. ఆ హృదయం మోహము వలన మరింత ఘనీభవించి, నిరంతరం అనేక దుఃఖములను చేకూర్చుకుంటోంది.

ఓ రామచంద్రా! ఈ భూమిపై అనంత సంఖ్యలో జీవులు పుట్టుచున్నారు. చస్తున్నారు. అయితే వారిలో కొందరు మాత్రమే సత్యమును గ్రహించుటకు, అసత్యమును పరిత్యజించుటకు ప్రయత్నిస్తున్నారు. అట్టివారు మాత్రమే వందనీయులగుచున్నారు. వారు తత్త్వమును పరిపూర్ణముగా ఎరుగుటకుగాను 'విచారణ' అనుదానినే ఆశ్రయిస్తున్నారు. అందుకు వేరే ఉపాయమేమీ లేదు.

విచారణ → తత్త్వజ్ఞానం → ఆత్మవిశ్రాంతి → మనశ్శాంతి → దుఃఖవినాశనము.

కాబట్టి విచారణయే మనశ్శాంతిని, దుఃఖ నాశనమును ప్రసాదించగలదనుటలో సందేహం ఏమాత్రం లేదు. జనులంతా వివేకపూర్వకమైన విచారణను ఆశ్రయించి "ఇది ఇట్లు చేయుట ఉచితము" అని నిశ్చయించుకొని, ఆపై లౌకికమైన, వైదికమైన ప్రయోజనములను పొందుచున్నారు కదా! 'ఆధ్యాత్మ విషయం' కూడా అట్టిదేనని మరల మరల ప్రకటిస్తున్నాను. ఉత్తమ విచారణయే లేకపోతే లోకంలో సత్కర్మలు ఉండవు. హింస, లోభము, జాతిద్వేషము, మాత్సర్యము మొదలైనవన్నీ అవిచారణ చేతనే ప్రబలుచున్నాయి. ఓ రాఘవా! అత్యంత శమముతో కూడుకొని ఉన్నట్టి నీకు కూడా 'విచారణ' అనునదే ప్రీతికరమగుగాక!

❖❖❖

20. సంతోషము

సంతోషోహి పరంశ్రేయః సంతోషః సుఖముచ్యతే ।
సంతుష్టః పరమభ్యేతి విశ్రామమరిసూదన ॥ (XV. 1)

ఓ శత్రుమర్దనా! రామచంద్రా! "సంతోషము" అనునది పరమ శ్రేయస్సు, సుఖము, విశ్రాంతి, మోక్షము కూడా అయివున్నది. అట్టి 'సంతోషము' అను దానిని సొంతం చేసుకొన్నవారికి సంపదలు,

రాజ్యాధికారములు, వందిమాగధ జనము వంటివి కూడా ఎండుగడ్డి పరకలవలె అతి తుచ్ఛమైనవే అయి ఉంటాయి.

సంతోషముతో కూడిన బుద్ధిని సంపాదించినవారు ఈ సాంసారిక దుఃఖములు వాటిల్లినప్పుడు తల్లడిల్లకుండా ఉంటున్నారు. సుఖములు పొందినప్పుడు తబ్బిబ్బు కాకుండా ఉంటున్నారు. ఆ మహనీయులు స్వయంగా సంతోషమనే అమృతం త్రాగి తృప్తులై, శాంతియుతులై ఈ భూమిపై సంచరిస్తున్నారు. వారికి ఈ భోగసంపదల యొక్క అర్థమేమిటో తెలియదు. (వీటిలో వారికి క్రొత్తగా ప్రాప్తించవలసినదేదీ కనిపించదు). మధురమైన సంతోషం అనే గుణం ఆశ, దైన్యము మొదలైన దుర్భరమైన అల్ప గుణములను నశింపచేస్తుంది. అన్నివైపుల ఆనందం వెల్లివిరియచేస్తుంది.

'సంతోషం' అంటే ఏమిటి?

అప్రాప్త వాంఛాముత్సృజ్య సంప్రాప్తే సమతాంగతః
అదృష్టఖేదాఽ ఖేదో యః ససంతుష్ట ఇహోచ్యతే ॥ (XV.259)

ప్రాప్తించని వాటి గురించి వేదన చెందక, పొందిన వాటి గురించి తబ్బిబ్బుకాక, సుఖ-దుఃఖములచే చంచలుడుగాక, భేదాభేదములకు అతీతుడై ఉండువాడే సంతుష్టుడు. సర్వదా పొందబడియే ఉన్నట్టి స్వస్వరూపముచే ఆనందము పొందుచు సర్వులను, సర్వమును ప్రశాంతముగా దర్శించువాడే సంతుష్టుడు. అట్టివాని మనస్సు తనయందు తానే మౌనస్వరూపమైన తృప్తి, ఆనందములను పొంది ఉంటుంది.

వాస్తవానికి ఈ జీవుడు స్వతహాగా ఆనందస్వరూపుడే కదా! అయితే మనస్సు వివిధ విషయములను కోరుకోవటం ప్రారంభించుటచే, అట్టి వాంఛలనుండే సర్వ మనోరుగ్మతలు వచ్చిపడుచున్నాయి. సంతోషముచే శీతలము పొందిన చిత్తమునందే విశుద్ధమైన విజ్ఞానము వికసిస్తోంది. సంతోష సూర్యుడు ప్రకాశించే చోట "దిగులు - అసూయ - దోషదృష్టి" మొదలైనవాటి రూపమైన అజ్ఞానపు చీకటి తొలగిపోతోంది.

'ఆశ' అనుదానికి వివశమై సంతోషం కోల్పోతున్న చిత్తము ధూళిచే కప్పబడిన 'దర్పణము' వంటిది. అందు జ్ఞానవాక్యములు ఎట్లా ప్రతిబింబిస్తాయి చెప్పు? "మాకీ లోటుపాట్లన్నీ ఉన్నాయి కదా! మేము జ్ఞాన విషయాలు ఎట్లా వింటాం? మేము పొందాలనుకొన్నవి పొందనివ్వండి. అప్పుడు చూద్దాం" అని జీవుడు ఆశల వెంటే పోవుచున్నాడు. దుఃఖించుట, ద్వేషించుట, ఒకరినొకరు తప్పులు ఎంచుకొనుట - ఇవే అలవాటు అయి ఉంటున్నాయి. "సంతోషముగా ఉండుట" అనునది ఎందుకు అభ్యాసముగా (As a Practice) చేసుకోరాదు? సంతోష మనస్కుని నుండి శారీరక - మానసిక వ్యాధులు దూరంగా ఉంటాయి. ఒకానొకడు నిరుపేదయే అయినప్పటికీ, అతడు కనుక తన మనస్సు నందు ఆకృత్రిమమైన 'సంతోషము'ను నింపుకోవటం జరిగితే అట్టివాడి ముందు ఈ రాజ్యాలు ఏలే వాళ్ళుకూడా ఎందుకూ పనికిరారు. "అట్టి అభ్యాసము తప్పకుండా సాధ్యమే" అని సర్వజనులను దృష్టిలో పెట్టుకొని చెప్పుచున్నాం.

నాభివాంఛత్యసంప్రాప్తం ప్రాప్తం భుంక్తే యథాక్రమమ్
యః సుసౌమ్య సమాచారః సంతుష్ట ఇతి కథ్యతే ॥ (XV. 12)

అప్రాప్తములైన విషయముల గురించి ఖేదము చెందకుండా, ప్రాప్తములైన వాటిని ఉత్తమ అవగాహనతో అనుభవిస్తూ, సౌమ్యమైన ఆచరణ కలిగియుండే వానికి 'సంతోషము' ఒక అలవాటుగా అవగలదు. అట్టి సంతోషముతో పరిపూర్ణముగ తృప్తి పొందిన విశుద్ధ చిత్తముగల మహాత్ముని వదనము చూచినవారు అనిర్వచనీయమైన సంతోషానుభవం పొందుతారు. లక్ష్మీదేవి వేంచేసియున్న క్షీరసముద్రం ఎట్లా ఉంటుందో ప్రసన్నత్వము సంతరించుకొనియున్న అతని ముఖము కూడా అట్లే అత్యంత శుభదాయకమై ఉంటుంది.

❖

ఓ జనులారా! మీరు సర్వదా నిరతిశయమైన ఆనందరూపమునే అవలంబించండి. అభ్యాసవశంచేత ఇది తప్పక సాధ్యమే. "మేము ఏమి పొందామని?" అని స్వల్ప విషయములను దీర్ఘ దర్శనం చేయుటచే మీకు అట్టి అభ్యాసం కొరవడుతోంది. స్వయంకల్పిత దోషములైనట్టి తృష్ణ, అసంతృప్తులు అత్యంత ప్రమాదకరమైనవి. అవి మనస్సును అనేక దోషములచే, మోహములచే, అపార్థములచే నింపివేస్తున్నాయి. అందుచేత పౌరుషబలం చేత తృష్ణను జయించి వేయండి. 'తృష్ణ' ఉన్నచోట సంతోషమెట్లా ఉంటుంది చెప్పండి?

'సంతోషము' అను మాధుర్యముతో నిండియున్న చిత్తము స్వయముగా తనంతట తానే శాంత శీతలమగు బుద్ధి స్థైర్యములను పొందుతోంది. సంపదలు కూడా సంతోష చిత్తుని భృత్యునివలె అనుసరిస్తున్నాయి. తనయందు తానే సంతుష్టుడైన వాడు ఇతరుల శారీరక-మానసిక రుగ్మతలను క్షీణింపచేయగలడు. కళంకరహితము, శీతలము, విశుద్ధము అయినట్టి చిత్తవృత్తి స్వయంగా సంతోషమును పొందుతోంది. అట్టి చిత్తవృత్తి కలవాడు సమబుద్ధితో కూడుకొనినవాడై ప్రశాంతము, మౌనము, ఆనందము, ఉత్సాహము ఒకే సమయంలో తన ముఖమునందు ప్రకటించుచున్నాడు. అట్టి వాని ముఖము చూచినంత మాత్రం చేత మనందరికీ ఆనందము, సుఖము కలుగుచున్నాయి. అట్టి పురుషుడు తారస పడినప్పుడు ఆతనికి దేవతలు, మునులు కూడా నమస్కరించుచున్నారు.

❖❖❖

21. సాధు సాంగత్యం

ఓ రఘురామా! మహాత్ములు సాధుసాంగత్యాన్ని, తద్వారా లభించే ఉత్తమ వివేకమును సర్వదా కాపాడుకుంటూ ఉంటారు. అదే మోక్ష ఫలమును ప్రసాదించ గలదని వారు ఎరుగుదురు. ఒక వ్యక్తి యొక్క అభ్యున్నతి - పతనములను అతడు ఆశ్రయించు స్నేహములే నిర్ణయిస్తాయి.

ఈ లోకంలో ఉత్తమ పురుషులైనవారు, విద్వజ్జులు, ఆత్మవిషయమై పూర్ణులైనవారు - కొందరు సంచరించుచున్నారు. వారితో సమాగమం శూన్యప్రదేశమును కూడా జనమయం చేస్తుంది. మృత్యువు

కూడా ఉత్సవంగా, ఆపదలు కూడా సంపదలుగా మారిపోతాయి. మోహము కూడా అట్టి స్నేహప్రభావం చేత తప్పక తోక ముడుస్తుంది.

హిమం ఆపత్ సరోజిన్యా, మోహనీహార మారుతః ।
జయత్యేకో జగత్యస్మిన్ సాధుః సాధుసమాగమః ॥ (XVI.4)

"ఆపదలు అనే పద్మములకు మంచును, మోహమనే మంచునకు మారుతమూ అయనట్టిది సాధుత్వము. సాధుత్వము పొంద యత్నించువారే సాధుసాంగత్యము పొందుచున్నారు." అట్టి సాధువులు – ఆ సాధువులను ఆశ్రయించినవారు కూడా ఈ జగత్తును అతి సులభంగా జయించి వేస్తున్నారు. సాధు సాంగత్యం వలన బుద్ధి సునిశితమౌతుంది. అనాదిగా పెరిగి ఊడలు వేసుకొనియున్న 'అజ్ఞానము' అనే విశాలవృక్షం, "సాధు సంగం" అనే ఝంఝూమారుతం చేత కూకటివ్రేళ్లతో సహా పెకలించివేయబడగలదు. మనోవ్యాధులు వాటంతట అవే నశిస్తాయి. మనోహరమైన సువాసనలు వెదజల్లగల వివేకము ఉదయిస్తుంది. అట్టి సాధుసమాగమములకు సర్వదా దిగ్విజయమగుగాక!

సాధు సంగం పొందుచున్నవాని సంపదలు కూడా అనపాయకరమై, బాధారహితమై, నిత్యప్రవర్ధకమై యజమానికి శుభమే చేకూరుస్తాయి. కొందరు, "అనేక సమస్యలచేత సతమతమగుచున్న మాకు సాధు సంగానికి సమయమెక్కడిది?" అని సరిపుచ్చుకొంటున్నారు. అయితే, మనిషి కష్టముల చేత వివశుడగుచున్నప్పుడు సాధుసంగం మరీ ముఖ్యమని నేను గుర్తు చేస్తున్నాను. అది దీపపు వెలుగువలె హృదయములోని చీకటిని తొలగించివేస్తుంది. 'జ్ఞానప్రకాశము' అనే శాశ్వతమైన వెలుగును ప్రసాదిస్తుంది. చిత్తశుద్ధిని, మంచి ప్రవర్తనను మనశ్శాంతిని ప్రసాదించగలిగే సత్పురుషుల సాంగత్యమే ఉంటే – ఇక, "గంగాస్నానం చేయలేదే? యజ్ఞ తపోధ్యాన తీర్థాదులు సేవించలేకపోతున్నామే?" అనే బెంగతో మానవునికి పనిలేదు.

ఓ రామచంద్రా! రాగశూన్యులు, మమకారాహంకారాలు లేనివారు, సందేహ రహితులు అయినట్టి సాధు పురుషులతో స్నేహం లభించటమంటే * – అది మహత్తరమైన విషయమేసుమా! ఎందుకంటే, నీవు కూడా రాగరహితుడవైతేగాని, వారితో స్నేహము చేయగల బుద్ధి పుట్టదు.** అట్టి మహాపురుషులు ఎక్కడన్నా తారసపడినా రాగబద్ధులైన జనులు వారిని గుర్తించలేరు. వారి

---

* "మహత్సంగస్తు దుర్లభో, అగమ్యో, అమోఘశ్చ. లభ్యతే తత్కృపయైవ"॥ మహనీయులతో స్నేహం దొరకటం దుర్లభమే. కాని దొరికిందా, అమోఘమైనది. అది ఆ పరమాత్మయొక్క కృపచేత మాత్రమే లభించగలదు.

(నారదభక్తి సూత్రాలు)

** **దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహహేతుకమ్ ।**
మనుష్యత్వం, ముముక్షుత్వమ్ మహాపురుష సంశ్రయః ॥ – *వివేకచూడామణి; ఆదిశంకరులు*

మనుష్యజన్మ, మోక్ష స్వరూపులం కావాలనే లక్ష్యము, మహాపురుషులతో స్నేహం – ఈ మూడు భగవంతుని అనుగ్రహంచేతనే లభిస్తాయి. అందుచేత మనం మహాపురుషులతో సాంగత్యం కలిగియుండుటకు ప్రయత్నించాలి.

స్నేహమును (స్వాభిమాన కారణంగా) పొందలేరు. ఆత్మజ్ఞానులగు మహనీయులతో సామీప్యత గొప్ప తపస్సు, తీర్థములతో సమానం. అది అతి పవిత్రమైనదని సర్వజనులు గ్రహించెదరు గాక! దరిద్రునకు ఒక మణి లభించటం ఎటువంటిదో, జ్ఞానులతో స్నేహం అట్టిదని విజ్ఞుల అభిప్రాయం. కనుక వినయము, గౌరవము, స్నేహము, సహకారము మొదలైన సత్ప్రవర్తనతో, సద్భావముతో జనులు అట్టివారి స్నేహములకై యత్నించాలి.

ఎంత ప్రయత్నం చేసైనా సరే, సాధుపుంగవుల దర్శనం చేసుకోవాలి. వారితో సంభాషణమే పూర్వజన్మ సుకృతం అనక తప్పదు. బుద్ధి, మేధస్సు కూడా సత్సంగమము వలన సౌందర్యమును పొంది, సునిశితమౌతాయి. సాధుసంగం వదలనివాడు నిర్మల విచారణచే తప్పక బ్రహ్మపదమును పొందుతాడు.

బంధరహితులు, తత్త్వజ్ఞులు, సర్వ సమ్మతులు అగు సాధుపుంగవులు మనకు అక్కడక్కడ తారసపడుతూనే ఉంటారు. వారిని తప్పకుండా సేవించాలి. గౌరవించాలి. సర్వ ప్రయత్నములచే సంతసింపచేయాలి. ఎందుకంటావా? ఈ సంసార సముద్రం దాటటానికి వారే ఉపాయ స్వరూపులు సుమా! ఈ జీవుడిని నరకాగ్నులు సమీపిస్తుంటే వారు ఆ అగ్నులను ఆర్పగల వర్షధారలవంటివారు. అంతటి సాధు పురుషులను అనాదరించటం ఎంతటి దౌర్భాగ్యమైన విషయం! అట్టి అనాదరణ చేయువారు నరకాగ్నులకు ఇంధనం కాదలచుకొన్నారా? ఓ రాఘవా! దారిద్ర్యం, దుఃఖం, మోహం, అజ్ఞానం మొదలైన సంసార రోగములకు సాధుపుంగవుల సాన్నిధ్యమే ఔషధం. వారి వచనామృతము వలన మాత్రమే పూర్ణార్థపూరితమైన అవగాహన వృద్ధి చెందుతోంది. తద్వారా లోకంలో శాంతి స్థాపించబడగలదు.

❖❖❖

22. మార్గాన్వేషణం

చూచావా రామా! సాధన చతుష్టయములైనట్టి సంతోషము, శమము, విచారణ, సాధు సంగం – అనేవి సంసార సాగరము నుండి తరింపచేసే ఉపాయాలు.

సంతోషః పరమోలాభః ! సత్సంగః పరమాగతిః !

విచారః పరమం జ్ఞానం ! శమోహి పరమం సుఖమ్ ॥ (XVI.19)

సంతోషమే పరమలాభము. సత్సంగమే పరమగతి. విచారణమే పరమజ్ఞానం. శమమే పరమసుఖం. ఈ నాలుగు రకములైన ఉపాయములను అభ్యసించేవారే ఘనీభూతమైయున్న ఈ మోహజాలమును జయిస్తున్నారు. వీటిలో ఏ ఒక్కటైనా సర్వశక్తి యుక్తులచే అభ్యసింపబడినప్పుడు, మిగతా మూడు కూడా లభిస్తున్నాయి. అందుచేత రామా! తాత్సారం చెయ్యకుండా ఎంతటికైనా సిద్ధపడి అందులో ఒక్కదానినైనా అభ్యసించాలి.

స్వచ్ఛమైన శమము వలన హృదయం నిర్మలమైనప్పుడు అట్టివాని వద్దకు మిగతా మూడు వచ్చి చేరుచున్నాయి. సంతోష, విచార, సాధు సాంగత్యాలు ఉన్నచోట 'జ్ఞానం' రూపు దిద్దుకుంటోంది. సుగుణములన్నీ ఆశ్రయిస్తున్నాయి. విజయలక్ష్మి వరించుచున్నది.

ఓ జనులారా! మీరంతా "స్వప్రయత్నము" అనబడే పురుషకారం చేత మనస్సును జయించి, ఈ నాల్గిటిలో ఏ ఒక్కదానినైనా నిరంతరం ప్రయత్నపూర్వకంగా అవలంబించ కోరుచున్నాను. "శ్రద్ధతో, ఓర్పుతో, నేర్పుతో ఒక్కదానినైనా దైనందికమైన అలవాటుగా మార్చుకోండి" – అని మీ శ్రేయోభిలాషులమగు మేము మరలమరల చెప్పుచున్నాం. కొంచెం కొంచెం ఈ నాల్గిటిని ఆశ్రయిస్తూ పోగా, కొంతకాలానికి అంతా సుసాధ్యమే అవుతుంది. మొదట్లో కొంత పట్టుదల వహించి, ఆ తరువాత, ప్రయత్నము వీడకుండా ఉంటే మీకు సాధ్యము కానిదంటూ ఏదీ ఉండదు. కొంతవరకు సాధించగలిగినా, అక్కడి వరకు, మీకు శుభమే కలుగుతుంది. అసలు ప్రయత్నమనునదే చేయకుండా, "మానవమాత్రులం! మావల్ల ఏమౌతుంది?" అని మిమ్ములను మీరే సముదాయించు కుంటూ తుచ్ఛ విషయములకై పరుగిడితే అది మూర్ఖత్వమే కదా! ఎందుకంటే మానవులలోనే అత్యంత మహనీయులు, ఆత్మజ్ఞులు ... అత్యంత మూర్ఖులు కూడా ఉన్నారు. అందుచేత సాధన పూనండి. అసలు ఉన్న రహస్యమంతా సాధనలోనే ఉన్నదికాని, దైవమునందు కాదు.

ఈ చిత్తము అనుదానిని పురుషకారంతో (పౌరుషంతో) జయించి ఈ నాల్గిటిలో ఒక్కదానినైనా వశం చేసుకుంటేనే 'ఉత్తమగతి'. అట్లా కాకుండా, చిత్తము యొక్క ఇచ్ఛ ప్రకారం వర్తించటం, ఇంద్రియ విషయములను మాత్రమే ఆశ్రయించటం, కల్పిత వ్యవహారములనే నమ్ముకొని ఉండటం ... అది శుభప్రదమౌతుందా? పళ్ళతో పళ్ళు నొక్కిపెట్టి ఎట్లాగైనా సరే, ఈ నాల్గిటి కొరకు యత్నించెదరు గాక!

❖

ఒకానొకడు 'మానవుడు' అగుగాక! లేదా దేవత అగుగాక! యక్షుడు అగుగాక! లేదా ఒక చెట్టు అగుగాక! ఏది ఏమైనా ఉత్తమ గుణములు ఆర్జించకపోతే గతిలేదని గ్రహించాలి. ఈ చంచల చిత్తము అనుక్షణం అనేక గుణదోషములనే, ప్రీతిపూర్వకంగా, ఆశ్రయిస్తోంది. ఆ గుణదోషములను మొట్టమొదట జాగ్రత్తగా గుర్తించాలి. అయ్యో! ఈ సాంసారిక జీవులు తమ చిత్తమును ఆశ్రయించు గుణ దోషములేమిటో గమనించుటకు కొంచెమైనా ప్రయత్నించకుండా, పరుల దోషములు మాత్రం మహా తెలివితేటలతో ఎంచుచు కాలం వెళ్ళబుచ్చుచున్నారే? ఇది అత్యంత దౌర్భాగ్యకరమైన విషయం. అట్టి మూర్ఖజనులకు ధిక్కారమగు గాక!

అయితే స్వచిత్తము యొక్క గుణదోషములు తొలగేదెట్లా? సుగుణములను ఆశ్రయించుటయే అందుకు ఉపాయం. "క్రమక్రమంగా సుగుణములను ఆశ్రయిస్తూ పోగా దోషగుణములు సన్నగిల్లుతాయి. దోషగుణములు వృద్ధిచెందుచున్న కొద్దీ, సగుణములు బలహీనపడతాయి" – అని కూడా గుర్తు పెట్టుకోండి.

కనుక రామచంద్రా! నీకు ఏ త్రోవ కావాలో ఈ బాల్యంలోనే నిర్ణయం చేసుకో. చక్కగా విచక్షణ చేయి. మార్గాన్ని అన్వేషించు. అనుసరించు. అంతేకాని, దుఃఖిస్తూ కూర్చుంటే నీకుగాని, నీ వలన మరెవరికి గాని ఎట్టి లాభం ఉండదు.

ఈ మనస్సు తనయొక్క వాసనా వేగంతో (force of tendencies) ఎప్పటికప్పుడు జీవుని ముంచెత్తుతోంది. అయితే అట్టి వాసనలు, నదికి రెండువైపుల ఉన్నట్టి గట్లవలె, శుభ–అశుభ రూపములలో ఉంటున్నాయి. 'శుభం' అనే ఆవలి ఒడ్డుకు చేరుతావా? 'అశుభము'నే ఆశ్రయిస్తూ రోజులు గడుపుతావా? నీ ఇష్టం. ప్రయత్నమును బట్టే ప్రయోజనం ఉంటుంది. తాత్సారం చేసేవారికి అనేక జన్మలు గడచిపోతున్నాయేగాని, నివృత్తి లభించటం లేదు. కాబట్టి రాఘవా! పురుషకారమును ఆశ్రయించు. అప్పుడు అశుభవాసనలు నిన్ను ఏమాత్రం సమీపించలేవు.

❖❖❖

23. దృష్టాంతములు

ఓ రామచంద్రా! ఏదైనా ఒకానొక క్రొత్త విషయం గురించి ఒకరికి తెలియజేయాలనుకున్నామనుకో. అట్లు తెలియచేయుటకు వీలుగా రోజూ చూచే విషయాలను ఉపమానంగా తీసుకొంటూ ఉంటాము. అట్లు విషయమును గ్రహింప చేయుటకు ఉపకరించే ఉదాహరణనే 'దృష్టాంతము' అని అంటున్నాం. రాత్రిపూట గదిలోని వస్తువులను దీపం లేకపోతే గ్రహించలేము కదా! దృష్టాంతముల సహాయం లేకపోతే శిష్యునకు ఒకానొక నూతనార్థం బోధించటం చాలా కష్టం. అసాధ్యమేమో కూడా. ఎందుకంటావా? గురువు తపోధ్యానాదులచే ఎంతో ప్రయత్నించి సత్యమును గ్రహించి ఉంటాడు. సత్యమును అత్యంత వివేక దృష్టితో చూస్తూ ఉంటాడు. కాని శిష్యుడో – మనస్సునందు అనేక జన్మలలో పేర్చుకొనియున్న దుర్వ్యసనములను, దురభిప్రాయములను పొరలుగా కలిగియుంటాడు. కాని, సత్యమును గ్రహించుటకై ఆరాటపడుతూ ఉంటాడు. వాస్తవానికి 'సత్యము' నిర్దుష్టమైనది. సుస్పష్టమైనది. ఒక్క వాక్యంలో చెప్పగలిగేదే. కాని శిష్యుని వివేకము అంతటి సునిశితంగా (అనేకమంది విషయంలో) ఉండదు. అందుకే బోధకులంతా దృష్టాంతాలు ఉపయోగించుచున్నారు.

❖

అయితే ఒక్క విషయం నీవు గమనించాలి. దృష్టాంతాలన్నిటికీ 'కారణము' అనేది ఒకటి ఉంటుంది. కాని జ్ఞేయము, సర్వప్రయత్నముల ప్రయోజనకంగా తెలియబడే ఆత్మవస్తువు, సద్వస్తువు అయినట్టి 'పరబ్రహ్మము' అనునది సర్వదా కార్య– కారణరహితమైయున్నది. కారణము లేదు కనుక నిత్యమైనది కూడా. ఈ విధంగా, ఒక్క పరమాత్మయందు తప్ప తక్కిన ఉపమాన – ఉపమేయములందు కొంత కార్య – కారణ భావములు ఉండనే ఉంటాయి.

ఈ బ్రహ్మోపదేశ సందర్భంలో కూడా నేను కొన్ని దృష్టాంతాలు ఉపయోగించ బోతున్నాను. అయితే, నేను ఒక దృష్టాంతమును ఏ బోధయొక్క అంశమును (విషయమును) దృష్టిలో పెట్టుకొని చెప్పుచున్నానో అది గ్రహిస్తూ ఉండాలి. అంతవరకే ఆ దృష్టాంతము గ్రహించాలి. అందుచేత నీవు నిర్మలమైన, సూక్ష్మమైన బుద్ధితో నేను చెప్పేది విను.

ఉదాహరణకు "త్రాటియందు పామువలె, బ్రహ్మమునందు జగత్తు కలదు" అని మనం చెప్పుకున్నామనుకో. ఇందులో వివర్తాంశమును (that deduced) మాత్రమే గ్రహించాలి. అనగా చీకట్లో త్రాడు 'సర్పము' అనే పదార్థంగా తోచుచున్నట్లే బ్రహ్మమే సర్వదా ఉండి ఉన్నది. చూచేవారి భ్రమ వలన జగత్తు అనబడుదానిగా తోచుచున్నది" – అని గ్రహించాలి. అంతేకాని, "ఏ విధంగా బ్రహ్మము నిత్యము, అఖండము, నిరతి శయానందము అయిన స్వభావము కలిగియున్నదో, అట్లే ఈ జగత్తులోని పదార్థ జాలం అట్టి స్వభావమే కలిగి ఉన్నది" – అనే నిశ్చయానికి రాకూడదు.

బ్రహ్మమును బోధించటానికి మనం తీసుకొనే ఉపమానాలన్నీ స్వప్నవస్తువుల లాగా, మిథ్య అయినట్టి ఈ జగత్తులోనివే కదా! అయితే ఏం? అట్టి ఉపమానములు మేము ఉపయోగించి శిష్యుని అజ్ఞానం తప్పకుండా పోగొట్టగలుగుచున్నాం. అందుచేత, "నిరాకారమగు బ్రహ్మము విషయంలో సాకారమగు దృష్టాంతాలు ఎందుకు పనికి వస్తాయి?" అని తలచి బోధకు తిరస్కరించకండి.* ఓ సర్వ సభికులారా! నేను ఏది దృష్టిలో పెట్టుకొని ఒకానొక దృష్టాంతము చెపుతూ వస్తున్నానో, అది గ్రహించగలిగినట్టి సుతీక్ష్ణమైన బుద్ధి మీరంతా కలిగిఉండాలి సుమా!

పరమవస్తువును ఏ ఒక్క దృశ్య పదార్థముతో కూడా పోల్చి "ఇది ఇట్టిది" అని చెప్పలేనిమాట నిజమే. ఎక్కడ వాక్కు, మనస్సు గ్రహించజాలక వెనుకకు మరలుతాయో, ఏదైతే 'అనుభవమాత్రమే' అయి శేషించుచున్నదో, అట్టి ఆత్మతత్త్వం విషయంలో ఏది సమగ్రమైన దృష్టాంతముగా ఉపయోగించగలదు చెప్పు? అందుచేత ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విశేషమును ఒక్కొక్క దృష్టాంతమును ఉపయోగించి ప్రతిపాదిస్తున్నాం. దృష్టాంతముల సహాయంతో "ఇది మాత్రం ఇట్లు కాదు" అని తప్పక ప్రతిపాదించి చూపుచున్నాం. నేను ఉపయోగించే ఒక దృష్టాంతమును మాత్రమే దృష్టిలో పెట్టుకొని, "ఈ దృష్టాంతములోని దోషము ఇది. కనుక వీరు చెప్పేది కుదరదు" అని వితండవాదాలు చేసుకోకండి. దృష్టాంతాలను చూచి మాచే ప్రతిపాదించబడుచున్న బ్రహ్మతత్త్వము యొక్క అస్థిత్వమును తిరస్కరించే వారితో వాదించి లాభమేమున్నది?

కొంచెం విచారించిచూస్తే, ఈ జాగ్రదవస్థలోని వస్తువులకు, స్వప్నావస్థలోని వస్తువులకు భేదమేమి లేదు. ఇది కల్పనచే ఇప్పటికి సత్యమువలె అనిపిస్తున్నట్లే స్వప్న సమయంలో కూడా స్వప్నదృశ్యం సత్యమనియే అనిపిస్తోంది. అయితే ఈ రెండూ మిథ్యయే. అందుచేత ఈ జగత్తు సర్వ కాలములందు అవస్తువే అయివున్నది. ఆహా! చూచావా రామా! ఎంతటి చమత్కారమో! సరే, –

---

*గణితం (Mathematics) లో "X" అనుకొనుము అని అంటాం. "X" – అనునది ఒక అక్షరం కదా! ఆ కావలసిన సమాధానం ఒక సంఖ్య కదా? – అని అనుకొంటున్నామా?

ఇప్పుడు, "బాల్యము నుండి మనలను ఆవహించియుండే ఈ 'జగత్తు' అనే భ్రమ మిథ్యయే" అనునట్టి నగ్న సత్యము బోధించుట ఎట్లా? అందుకుగాను మేము "స్వప్నము, సంకల్పము, ధ్యానము, వరము, శాపము, ఔషధము" – ఇత్యాది అనేక దృష్టాంతాలు సమయోచితంగా తీసుకొని చెప్పుచున్నాం. అప్పుడా శిష్యుడు, "ఔను. నిజమే. ఇది స్వప్నము వంటిదే" అనే నిశ్చయానికి వస్తున్నాడు. ఇదే నియమము తత్త్వబోధన చేసే అన్ని గ్రంథములలోను అనుసరించబడింది.

కనుక మేము దృష్టాంతం చెప్పుచున్నప్పుడు బోధింపబడుచున్న అంశమును సూక్ష్మబుద్ధితో గ్రహించాలి!

❖

మరొక ముఖ్యమైన విషయం. "ఈ జగత్తు స్వప్న – సంకల్పములలోని వస్తు జాలమువలె భ్రమమాత్రమే. లేక అసత్యమే" అనే జ్ఞానం ఈ శాస్త్రం పఠించుటచే తప్పకుండా కలుగుతుందని కూడా చెప్పలేం. ఎందుకంటావా? విషయం బోధ పడినప్పటికీ, వాసనలు కూడా శమించాలి కదా! కాబట్టి అది సంస్కారమును అనుసరించి క్రమంగా ప్రాప్తించవలసినదే. అయితే, అట్టి ప్రయత్నమునకు సిద్ధంగా ఉన్న జీవులకు తగిన విచారణ, ప్రోద్బలం ఇందు లభిస్తున్నాయి.

ఏది ఏమైనా, నిష్కల్మష సంస్కారవంతులు, విచారశీలురు మాత్రం ఇది పఠించు చుండగానే ఉత్తమమగు సర్వసమత్వం, ఆత్మ తాదాత్మ్యము పొందటం జరుగుతోంది.

❖

ఈ కనబడేదంతా స్వప్న, సంకల్ప, ధ్యానములందలి 'నగరము' వంటిదే కనుక, నేను ఈ స్వప్న – సంకల్ప – ధ్యానములను, అందలి అనుభవములను దృష్టాంతంగా తీసుకుంటున్నాను.

ఒకడు నిద్రిస్తున్నప్పుడు ఒక 'కల'కంటాడనుకో.... ఆ కలలోని అనుభవములు గుర్తు చేసుకోవటంలోనూ, భూతకాలపు 'జాగ్రుదవస్థ'కు సంబంధించిన అనుభవములను గుర్తు చేసుకోవటంలోనూ భేదమేమున్నది? అది అట్లుండగా, స్వప్నంలోని ఘోర దృశ్యములు (బాధింప బడటం, ప్రేమించటం వంటివి) జాగ్రత్తులో 'అరవటం, కలవరించటం, వణకటం' వంటి ప్రతి–స్పందములుగా అప్పుడప్పుడు పరిణమిస్తూ ఉంటాయి కదా! ఈ స్వప్న జాగ్రత్తులు ఎప్పటి కప్పుడు, అప్పటికి మాత్రం, వాస్తవమేనని అనిపిస్తూ, మరొకప్పటికి (ఆ రెండూ కూడా) గడచిపోయినట్టి అనుభవమాత్రంగా, జ్ఞాపకమాత్రంగా ఉండిపోతున్నాయి. అందుకే ఆ రెండింటికి భేదంలేదని చెప్పుచూ దృష్టాంతంగా తీసుకొంటున్నాం.

"సువర్ణమే ఆభరణమునకు కారణం కదా" అనే దృష్టాంతము చెప్పాననుకో. నా ఉద్దేశం, "బ్రహ్మమే ఈ జగత్తునకు కారణం" అని చెప్పాలని. అట్లు చెప్పినప్పుడు "బంగారము ఆభరణములుగా ఆకారం పొందునట్లు, బ్రహ్మము జగత్తుగా ఆకారాదులు పొందుచున్నది"... అని గ్రహించవద్దని మరల గుర్తుచేస్తున్నాను. ఎందుకంటే, ఇక్కడ సువర్ణము యొక్క సర్వధర్మములు గ్రహించకుండా ఒకానొక "అంశ (character)" మాత్రమే తీసుకొని తత్త్వవిషయమై బోధిస్తున్నానని గ్రహించాలి.

అట్లాగే, "ఆభరణం రాళ్ళు దాగి ఉంటాయి కదా!" అనే మీమాంస చేయబడకుండుగాక. చీకట్లోగల వస్తువు చూడాలంటే దీపపు వెలుగే ఉపయోగిస్తుంది కాని, "ప్రమిద–నూనె–వత్తి" కాదు కదా! అదేవిధంగా ఉపమానంలోని ఒకానొక లక్షణం ఉపమేయానికి ఉన్నట్లు గ్రహించటమే శిష్యుని సూక్ష్మబుద్ధికి తార్కాణం.

❖❖❖

24. కుతర్కములు

బ్రహ్మజ్ఞానమే మన ఈ విచారణ యొక్క ఏకైక లక్ష్యము! మహావాక్య బోధను, ఆ బోధయొక్క అర్థమును నిశ్చయపూర్వకంగా గ్రహించుటచే తప్పకుండా బ్రహ్మజ్ఞానం ప్రాప్తిస్తుంది.

1. ప్రజ్ఞానం బ్రహ్మ = ప్రజ్ఞ (ఎరుక)యే బ్రహ్మము
2. అయమాత్మా బ్రహ్మ = ఈ జీవాత్మ బ్రహ్మమే అయివున్నది
3. తత్త్వమసి = అదియే (ఆ పరమాత్మ వస్తువే) నీవై ఉన్నావు.
4. అహం బ్రహ్మాఽస్మి = నేను బ్రహ్మమునే అయివున్నాను.

ఈ నాలుగు వాక్యములు పరమ నిత్య–సత్యమును బోధించటానికి నాలుగు వేదములు ఉపయోగించాయి. వీటిని గురుముఖతః విని, వీటి అర్థమును గ్రహించి, ఆ అర్థముయొక్క ధ్యాస అలవర్చుకుంటే (నిరంతర ధ్యానం చేస్తే) బ్రహ్మజ్ఞానం కలుగుతోంది.

ఈ మన సంవాదము అదే అర్థమును, అనేక దృష్టాంతములద్వారా, కథానికల ద్వారా నిరూపిస్తోంది.

ఇంతకన్నా ఉత్తమమైన సత్యము ఏదైనా ఉంటే ఎవరైనా ప్రకటించవచ్చు. లేదా, ఇదే సత్యమును ఇంతకన్నా మధురంగా, సుస్పష్టంగా చెపితే, అదీ మంచిదే. అట్లా కాకుండా, అనుభవం లేకయే, అపవిత్రంగా తర్కంలోకి దిగుటకు ప్రయత్నించే వారికి నేను చెప్పుచున్నదొక్కటే! నాయనలారా! స్వానుభవముచే మేము చెప్పుచున్న తత్త్వజ్ఞానాన్ని ఎందుకు తిరస్కరిస్తారు? అనేకమంది ముముక్షువులను దృష్టిలో పెట్టుకొని, అనేక సోదాహరణములతో "మీరు బ్రహ్మముకంటే వేరుకాదు" అని మేము నిరూపిస్తున్నాం. ఈ పరమ సత్యమును సర్వజనులపైగల ఆప్యాయత చేతనే ప్రకటిస్తున్నాం. ఓ కుతర్కము చేయు మిత్రులారా! మీరు అనుభవపూర్వకంగా సత్యమును ఎరుగకుండానే, ఎవరైనా చెప్పినదానిని వ్యతిరేకించుటకు మాత్రమే ఎందుకు ప్రయత్నిస్తారు చెప్పండి? మీపై మాకు ప్రేమయే సర్వదా ఉంటుంది. దయచేసి మొట్టమొదట మీ దృష్టిని శుద్ధపరచుకోండి. యత్నశీలురై ప్రాణాయామ, ప్రత్యాహార, తితిక్షాది అష్టాంగ యోగములచే బుద్ధిని సునిశితం చేసుకోండి. అప్పుడు ఈ శాస్త్రమును విచారించండి. ఇది సత్యమో, కాదో మీరే నిర్ణయం చేసుకోండి. ఇంతకు మించి మీకు మేము ఏమి చెప్పగలం?

❖

ఓ సర్వ జనులారా! మీలోని ప్రతి ఒక్కరిలో స్రవించుచున్న అమృత తత్త్వమును మేము గ్రహించాం. అట్లు ఎరిగినదానినే మీ అందరికీ ఈ ప్రయత్నముచే, ఇట్టివేయగు అనేక ప్రయత్నములచే గుర్తు చేస్తున్నాం. అట్టి మేము శ్రేయోభిలాషులమేకాని, ఏమాత్రం శత్రువులంకామే! ఈ సంసారములోని దోషమేమిటో గ్రహించినట్టి మేము బ్రహ్మ జ్ఞానమును ఉదయింపజేసే వాక్యములనే చెప్పుచున్నాం. అందుచేత శ్రద్ధగా వినండి. వింటూ ఉంటే సత్యమేమిటో మీ అంతట మీరే, మీ మీ హృదయాకాశములోనే గాంచగలరు. పరమార్థసత్యమేమిటో నిర్దుష్టంగా, దోషరహితంగా, ఆనందోత్సాహాలు కలుగజేసేవిధంగా చెప్పటానికే ప్రయత్నిస్తాం. ఏ వాక్యాలైతే పూర్ణమగు మీ స్వరూపము గురించి, ఈ దృశ్యముతోను, శరీరాదులతోను గల సంబంధం గురించి సమగ్రంగా బోధించుట లేదో, అవి ఆప్తవాక్యాలు కాజాలవు సుమా!

ఓ రామచంద్రా! మేము తపోధ్యానాది అనేక ప్రయత్నములచే బ్రహ్మసాక్షాత్కారము కలిగించగల బుద్ధిని కలిగియున్నాము. భగవంతుని సంకల్పముచేతనే ఇట్లు మీ అందరిపై కురుస్తున్న కరుణామృత రసంగా ఈ మా వాక్యాలు చేరుచున్నాయి. మనం చేయబోయే ఈ విచారణ, సమస్త వేదోపనిషత్తులు ప్రతిపాదించుచున్న ఏక వాక్యమగు "అఖండ బ్రహ్మతత్త్వమే" లక్ష్యముగా కలిగియున్నది.

❖

కనుక, సర్వజనులారా! నిస్సంకోచంగా ఇది వినండి. ఇది గ్రహిస్తే పరమ పురుషార్థము లభించగలదని చేతులెత్తి ప్రకటిస్తున్నాను.

జీవుని యందలి పరమాత్మతత్వమును మరుగున పరచు వేదాంత విరోధములగు అనేక శాస్త్రములచే అనేక తర్కములు ప్రతిపాదించబడ్డాయి. "ఈ దృష్టిచే దర్శించబడుటచే ఇట్లు ప్రతిపాదించబడింది" అను రూపమైన విచారణచే ఆయా ప్రచారములో ఉన్న వేఱు వేఱు సిద్ధాంతములు, అభిమతములు మనం ముందు ముందు చర్చించబోతున్నాం. ఈ విచారణ అంతా విజ్ఞానదృష్టితో, పరిశీలనాత్మకమైన వివేచనాపూర్వకంగా చేయబడుచున్నది. "మేము చెప్పుచున్నాము. కనుక మీరు గ్రుడ్డిగా నమ్మవలసిందే" అని చెప్పటం మా ఉద్దేశం ఏమాత్రం కాదు. అందుచేత, చెప్పబోవునదంతా వివేక – విమర్శక దృష్టులచే తప్పక పరిశీలించవచ్చు.

మరొక్క ముఖ్యమైన విషయం. మేము అనేక పురుషప్రయత్నములచే, తపోధ్యానాదులచే మా చిత్తమును పరిశుద్ధపరచుకొని, అప్పుడు మాకు అనుభవమైన సత్యమును మీముందు ఉంచుచున్నాం. జనులలో అనేకమంది తగుయత్నం చేసి ఉండకపోవుటచే, వారి మనస్సులలో పదార్థికదృష్టి (material view point), ప్రాపంచకదృష్టి బలవత్తరమై ఉండిఉండే అవకాశమున్నది. అందుచేత కొంచెము మాపై విశ్వాసముంచి ఈ విచారణను స్వీకరించెదరు గాక! "మేము తపోధ్యానాదులు అధికంగాచేసి ఉండలేదు కదా! మరి ఇది వినటానికి అర్హులమా?" అనే శంకను కూడా త్యజించండి. ఉత్తమ కార్యాచరణము కొరకు ఇందలి విచారణ జీవుని తీర్చి దిద్దగలదు. అందుచేత ఇది పఠించునపుడు, వినునపుడు ఓర్పును, శ్రద్ధను వీడకండి. ఒకచోట కొంచెము అర్థమగుట సులభంగా

లేనంతమాత్రం చేత వెనుకకు మరలవద్దు. అవసరమనుకొంటే, విజ్ఞులైనవారితో సంభాషించి, అనుమాన నివృత్తి చేసుకోండి. గ్రంథమంతా చక్కగా పరిశీలించటం జరిగితే, అటు తరువాత దీని ప్రయోజనమేమిటో మీరే గ్రహిస్తారు.

❖

"ఈ జీవుడు బ్రహ్మమే కదా! ఇక ప్రయత్నం మాత్రం ఎందుకు?" అనే తర్కమునకు లోబడి, అప్రయత్నశీలత్వం ప్రతిపాదించే వాదోపవాదములను నెత్తిపై మోయటానికి మేము సిద్ధంగా లేము. ఊరకే వాదోపవాదములచే మనస్సు కలత చెందుటయే జరుగుతోంది. జీవితము అమూల్యమైనది. కేవలం తర్క – వితర్కములచే ఉత్తమ వస్తువును సాధించలేమని మా ఉద్దేశం.

అనుభవమాత్రమగు 'పరమాత్మ తత్త్వము'ను పొందుటకు, చివరికి పఠించు వాని అంతరంగమే స్థానము సుమా! మన ఈ విచారణ యొక్క పాత్ర 'లేనిదానిని లేనట్లుగా, ఉన్నదానిని ఉన్నట్లుగా' చెప్పటం వరకే. గ్రహించువాడు దోషరహితమైన వివేకంతో ఈ బోధను పరిశీలిస్తూ ఉండగా "అద్వితీయమగు ఆత్మను నేనే" అనే అనుభవము పొందగలడు.

మేము ప్రతిపాదించుచున్నదంతా వేద–వేదాంగములలోని విజ్ఞానసారమునకు అనుకూలంగానే ఉంటుందని మాత్రం చెప్పగలము. 'మహావాక్యములు' అని చెప్పబడే "అహం బ్రహ్మాస్మి" వంటి వేదవాక్యములే మన ఈ విచారణ అంతటికీ ప్రమాణాలయి ఉన్నాయి.

❖❖❖

25. ప్రమాణ నిరూపణ

మనం ఉపయోగించబోయే ప్రమాణముల విషయమై మరికొన్ని విషయాలు చెప్పుచున్నాను విను.

మనం ఒక ఉపమానం తీసుకొనునపుడు, ఆ ఉపమాన–ఉపమేయాలలో ఉండే ఒకానొక సమానధర్మం మాత్రమే తీసుకుంటూ ఉంటామని చెప్పాను కదా! 'ఉపమానము (comparison)' అంటేనే అది. ఒకవేళ ఉపమాన – ఉపమేయాలు అన్ని అంశము లందు ఒకేవిధంగా సమాన ధర్మములు కలిగి ఉండటం జరిగితే, అప్పుడు ఆ రెండింటికీ భేదమే ఉండదు కదా! ఇక ఒకదానిని 'ఉపమానం' అని, రెండవదానిని 'ఉపమేయం' అని అనటం దేనికి? లోకంలో, ఏ సందర్భాలలోనైనా సరే, ఏ ఉపమానం గ్రహించటం జరిగినా … అట్టి అన్ని సందర్భములలోను "ఒకానొక అంశ" అనునదే ఉద్దేశం. ఉదాహరణకు "ఆమె కనులు కలువలవలె తీర్చిదిద్దినట్లు ఉంటాయి", అని ఒక కవి వర్ణించాడనుకో "అట్లాగా? అయితే మరి ఆ కళ్ళు తటాకంలో తేలియాడుట లేదేమి?" – అని తర్కం చేయటం ఉచితం కాదు కదా!

జీవబ్రహ్మముల స్వరూపం గ్రహించటానికి ఈ శాస్త్రం చేతను, తదితర ఆధ్యాత్మ శాస్త్రముల చేతను అనేక దృష్టాంతములు తీసుకోబడ్డాయి. (ఉదా : మాండూక్యోపనిషత్తు. కప్ప యొక్క నాలుగు

కాళ్ళు దృష్టాంతంగా జాగ్రత్ స్వప్న సుషుప్తి, తురీయములు విశదీకరించబడ్డాయి). అట్టి దృష్టాంతములను, ప్రమాణములను సరైన రీతిలో అర్థం చేసుకుంటే అప్పుడు అఖండాకార చిత్తవృత్తి ఉదయిస్తుంది. మహావాక్యార్థ బోధ వలన ఆత్మ తత్త్వము స్ఫురిస్తుంది. ఆ 'స్ఫూర్తి' వలన అజ్ఞానము, దాని కార్యములైయున్న అనేక వికారములు నశిస్తాయి. సర్వ సంకల్పములు, వాటి స్వభావములు గ్రహించబడగా, వాటన్నిటికీ ఆవల ఉన్న "శుద్ధ స్వస్వరూపము" యొక్క అనుభవము మాత్రమే శేషించుచు, 'నిర్వాణస్థితి' అనునది సుస్థిరమౌతుంది. అట్టి ఉత్తమ ప్రజ్ఞ దృష్టాంతజ్ఞానము వలననే లభిస్తోంది.

❖

ఓ జనులారా! మీరు ఉపమాన – ఉపమేయముల గురించి ఘర్షణ పడకండి. దానివలన సాధించేదేమీ ఉండదు. ఎందుకంటారా? సర్వవేద – వేదాంతముల యొక్క, ఋషుల ప్రవచనముల యొక్క సారమైన విషయం ఇది!

"ఓ జీవుడా! నీవు నిత్యమగు బ్రహ్మమువే! బ్రహ్మమునకు వేరుగా జగత్తు లేదు.

భూత –భవిష్యత్ – వర్తమాన కాలములో ద్రష్టగా, ద్రష్టాతీతుడుగా కూడా ఉన్నది నీవే."

మనం ఏ యుక్తిని అనుసరించినా ఫరవాలేదు. "తత్త్వమ్ – సోఽహమ్" మొదలైన వాక్యముల అర్థసారమును ఎంతవరకు అనుభవమునకు తెచ్చుకోగలిగాం? ఎంతవరకు ఆశ్రయించాం" – అనునదే మనందరికీ ముఖ్యం. అప్పుడే జీవునకు 'శాంతి' లభిస్తుంది. శాంతియే పరమశ్రేయస్సు కదా! అట్టి అంతరంగ ప్రశాంతస్థితి విచారణ చేతనే ప్రాప్తిస్తోంది. ఈ మా ప్రయత్నము యొక్క ఉత్తమ లక్ష్యము అదే. ఇందు విచారించబడిన వస్తువు గ్రహించుటకు సర్వజీవులు తగియే ఉన్నారు.

అసలు విషయం వదలి ఒక ఉపమానమో, ప్రమాణమో విమర్శిస్తూ ప్రక్క త్రోవలు పట్టుటచే లాభమేమి ఉంటుంది? ఆహారం లభించినప్పుడు చక్కగా స్వీకరించాలి. అంతేకాని, "ఈ బియ్యం ఎవరి చేనులో, ఎప్పుడు పండాయి? ఆ చేను పొడవు – వెడల్పులు ఎట్టివి?" – అనునవి ముఖ్యమైన విషయాలు కావు కదా!

❖❖❖

26. ఏకాగ్రదృష్టి

కారణముతో కూడుకొన్న ఉపమానమునకు (i.e. Simile or example), కారణరహితమగు ఉపమేయమునకు (ఆత్మ వస్తువు Absolute self which is the subject matter of the present book) కొంతభేదముండవచ్చు. అయితే కొంత పోలిక కూడా (ఒకానొక లక్షణము దృష్ట్యా) ఉండుటచేతనే అట్టి ఉపమానము, ప్రమాణము (reference) కొనిరాబడినది. గురువు అట్లు ప్రయోగించుటచే శిష్యునియందు సాదృశ జ్ఞానము ఉదయిస్తోంది.

నాయనలారా! వివేకహీనులై భోగములందు ఆసక్తులైయుండు మనుజులకు, రాతియందు పుట్టి పెరిగి, నశించే గోదురుకప్పలకు జ్ఞానుల దృష్టిలో తేడా లేదు. కనుక, వివేక దృష్టితో శాస్త్రములలో చెప్పబడిన దృష్టాంతములను గ్రహించాలి. పాఠకునిలో ఉండే అనుమానాలు నివృత్తంజేసి, బోధ దృఢపరచుటకే గురువులు ప్రమాణాలు చెప్పుచున్నారు. వీటన్నిటి యొక్క లక్ష్యము శాంతియుతమగు పరమ పదము సాధించుటయే కదా! ఆ పని వదలి, "ఈ దృష్టాంతము – ఉపమానములలో మరొక లక్షణము మాటేమిటి? ఆయా ప్రమాణములు మాకు సరిపడవు" – అని పలుకుచూ, చెప్పే విషయాన్ని ప్రక్కత్రోవ పట్టించకుండెదరుగాక. మీరంతా మహా బలవంతులు కావాలి. మేము భగవత్ప్రేరణచే, శుభ–సంకల్పులమై, పరమశాంతిని ప్రసాదించగల మీ స్వస్వరూపముయొక్క ఔన్నత్యం ప్రకటిస్తున్నాం. మా వాక్యములలోని అంతర్లీన సత్యమును వివేక దృష్టితో గ్రహించుటకు సిద్ధంగా ఉండండి.

❖

ఆత్మజ్ఞానం లభించనంతవరకు శాస్త్రోపదేశములను, సౌజన్య స్వభావమును, సాధు సంగములను ఆశ్రయించవలసిందే. పురుషార్థములను సంపాదించవలసిందే. అట్లు ప్రయత్నించుచున్నవాడే క్రమంగా శాస్త్రముల అంతరార్థమును గ్రహించి ఉత్తమ విచారణ పారాయణుడగుచున్నాడు. తద్వారా ఆత్మానుభవమునకు తగిన వాడగు చున్నాడు. అప్పుడు 'తురీయము' అను మరొక పేరుచే చెప్పబడుచున్న పరమ శాంతిని పొందుచున్నాడు. ఎవడైతే భావసముద్రమును దాటివేసి శుద్ధ స్వస్వరూపమగు అట్టి తురీయపదమున సుస్థితుడై ఉంటాడో, అతడే సర్వులకు వందనీయుడు. అట్టివాడు గృహస్థుడు కావచ్చు. సన్యాసి కావచ్చు. అతడు సర్వవిధములైన ఐహిక – ఆముష్మిక ఫలములను మాత్రం త్యజించివేసి ఉంటాడు. ఒకానొక నిశ్చలత్వమును సదా అనుభవిస్తూ ఉంటాడు.

❖

ఓ రామచంద్రా! నీ దృష్టి అంతా ఆశయము పైననే నిలిపెదవుగాక. ఉపమాన, ఉపమేయములను నీ మనోపథంలో ఒక్కసారి ధరించు. ఆ రెండింటిలోని ఏకాంశ ధర్మమును సూక్ష్మబుద్ధితో గ్రహించు. మరల తరువాత చెప్పుచూ పోయేది విను.

అర్థమును నాలుకపై ఉంచుకొని ప్రయోజనవేమున్నది? దానిని చిత్తములోనికి ప్రవేశింపచేసినప్పుడే ఉపయోగం. బోధార్థం సదవగాహన రూపము, అనుభవరూపము పొందాలి. అందుకు యుక్తి ఏదైనా ఫరవాలేదు. అయితే, కొందరు చంచల బుద్ధి కలిగియున్నవారు, తాము భ్రమయందు ఉన్నవారై, భ్రమాత్మకమైన దృష్టితో, యుక్తా యుక్తములను చూడలేకపోవటం మేము గమనిస్తున్నాము. వారిని "బోధచంచువులు" అని పిలుస్తారు. వారు ఉత్తమమైన ఆత్మవస్తువుయొక్క స్వభావ స్వరూపములు నోటితో మాట్లాడకలిగినప్పటికీ "పరమాత్మ ఈ సర్వమునకు వేరైనది కాదు" అనునట్టి అనుభవాత్మకమైన భావన కలిగి ఉండలేకపోతున్నారు.

అనుభవమే స్వరూపముగా కలిగినట్టి బ్రహ్మవస్తువు ఒక పురుగు నుండి బ్రహ్మదేవుని వరకు సర్వజీవులయందు ఉండనే ఉన్నది. అట్టి బ్రహ్మమును గ్రహించునప్పుడు అనర్థములైన కల్పనలను అనుసరించేవానికి ఏమి చెప్పగలం? అల్ప పరిశీలనాత్మకుడగు అతడు అనేక అభిమానరూపములగు కుకల్పనలు కలిగి ఉంటున్నాడు. " 'అహం బ్రహ్మాఽస్మి' – 'తత్త్వమ్.' నేను బ్రహ్మము అయున్నాను. నీవుకూడా అదే" ... అనునట్టి బ్రహ్మ – భావాకారవృత్తికి అనేక దురభిప్రాయములను ఆపాదిస్తూ, బోధను కలుషితం చేయడం మేము అక్కడక్కడ చూస్తున్నాము. మేఘములు ఆకాశమును కప్పివేయుట లేదా? అయితే ఆకాశమునకు లోటేమి ఉంటుంది? అట్లే సత్యమగు బ్రహ్మతత్త్వము సనాతనమై, శుద్ధమై అన్నివేళలందు ప్రకాశించుచునే ఉంది. సరైన సమయంలో, మేఘాలు తొలగునట్లు, విజ్ఞాన దృష్టిచే అజ్ఞానం తొలుగగలదు.

❖❖❖

27. అపరోక్షానుభవం

జలములన్నిటికీ సముద్రమే ఉనికి స్థానమైనట్లు ప్రమాణములన్నిటికీ ప్రత్యక్షమే ఆధారం. అనగా ఇప్పుడు ఇక్కడ మనకు లభించేదే ప్రమాణం కాని, ఎప్పుడో – ఎక్కడో – ఏ మరణించిన తరువాతో లభించేది ప్రమాణం కాజాలదు. అయితే ప్రత్యక్ష జ్ఞానములన్నిటిలోను ఉత్తమమైనది "అపరోక్షానుభూతి" అని మనకు ఆత్మజ్ఞులు చెప్పుచున్నారు.

ఈ దృశ్య ప్రపంచంలో అనేక పాంచభూతాత్మికమైన వస్తువులు మనకు కనిపిస్తున్నాయి! అనగా, ఇవన్నీ ప్రత్యక్షమై మన ఈ ఇంద్రియములకు అనుభవమౌతున్నాయి. కాని 'ఆత్మ' అనునది ఇంద్రియములనే ప్రకాశింపచేయునది, ప్రవర్తింపచేయునది. పాంచభూతాత్మకమై ఎదురుగా కనబడే వస్తువు కాదు. కనుక, అది ప్రత్యక్షము అని అనలేము.

పోనీ, 'ఆత్మ' అనగా, అది ఎప్పుడో – ఎక్కడో – ఎప్పటికో లభించేదా? కాదు. అది అనుభవమే స్వరూపముగాగల నీకంటే–నాకంటే వేరైనది కాదు. అందుచేత దానిని "పరోక్షము" అని అనుటకు వీలులేదు. అందుచేత దానిని "అపరోక్షానుభవం" అని అంటున్నారు. అదియే........,

"జ్ఞాత – జ్ఞానము – జ్ఞాతృత్వము" ["Perceiver - object - perception"]

"తెలుసుకొనువాడు – తెలుసుకొనబడునది – తెలుసుకొనుట" ["Knower - Object to be known - process of Knowing"] అగుచున్నది.

❖

అనుభవం, ఎరుక, ప్రతిపత్తి (Experience - knowing - Reflective Existence) అను మూడిటితో కూడుకొన్న సాక్షి చైతన్యమే అపరోక్షానుభవం యొక్క స్వరూపం.

❖

అట్టి సాక్షి చైతన్యమే ఈ జీవుడు. ఆ సాక్షి చైతన్యము "అహం–నేను" అను భావన కలిగియున్నప్పుడు "పురుషుడు" లేక "ప్రమాత" అని అంటున్నాం.

ఆ సాక్షి చైతన్యము ఉపాధి (body) పట్ల వృత్తి కలిగియున్నప్పుడు అట్టి స్థితిని "సంవిత్తు" అని పిలుస్తున్నాం. "శుద్ధ సంవిత్" – అని ప్రయోగించినపుడు మనం శుద్ధ చైతన్యమునే ఉద్దేశిస్తున్నాము.

అట్టి సంవిత్తు పదార్థములపట్ల 'దృష్టి' కలిగి ఉన్నప్పుడు అట్టి పదార్థాకర్షణలను లేక దృశ్యాకర్షణలను "విషయములు" అని చెప్పుకుంటున్నాం. ఆ సంవిత్తును "పదార్థ సవితుడు" అని కూడా అంటున్నాం.

అనగా :

1. సాక్షి చైతన్యము = వృత్తిరహితము, శుద్ధ తత్త్వము అగు ఆత్మ. ఆత్మయే ఈ జీవుని వాస్తవ స్వరూపము.
2. సాక్షి చైతన్యము + 'నేను' అనుభావన (అహంభావన) = పురుషుడు, ప్రమాత
3. సాక్షి చైతన్యము + 'నేను' అను భావన + ఉపాధిపట్ల వృత్తి = సంవిత్తు
4. సాక్షి చైతన్యము + అహంభావన + ఉపాధిపట్ల వృత్తి + ఇంద్రియములకు ప్రాప్తిస్తున్న పదార్థజ్ఞానం = పదార్థ సవితుడు / విషయములు

ప్రతి శాస్త్రములోను కొన్ని సాంకేతిక శబ్దములు ఉన్న విధంగానే, ఈ శాస్త్రంలో కూడా, "శుద్ధ తత్త్వము, సాక్షీ చైతన్యము, పురుషుడు, ప్రమాత, సంవిత్తు, విషయములు, జీవుడు" .... ఇత్యాది శబ్దములు ఉపయోగించబోతున్నాం. ఈ శబ్దముల అర్థముల ముందు ముందు మరికొంత వివరించబడతాయి.

❖❖❖

28. చైతన్యము - జగత్తు

ఈ జీవుని వాస్తవ స్వరూపము "శుద్ధచైతన్యమే" అని అనుకొన్నాం కదా.

ఒకే నీరు అనేక తరంగములుగా, సుడులుగా, బుడగలుగా అనేక రూపములు దాల్చుచుండుట గమనించావా? అదేవిధంగా చైతన్యమే సంకల్ప – వికల్పాది నానావిధ భ్రాంతులతో జగత్తు రూపమున ప్రతిభాసితమగుచున్నది. అనగా, అద్దంలో ఎదురుగా ఉన్న దృశ్యం ప్రతిభాసం (reflect) అగుచున్నట్లు చైతన్యమునందే సంకల్పమాత్రంగా ఈ దృశ్య జగత్తు స్ఫురిస్తోంది.

అయితే సృష్టికి పూర్వం, సృష్టి సమయంలోను, సృష్టి లయించినప్పుడు కూడా అట్టి చైతన్యమే సత్యమై, నిత్యమైయున్నది. అట్టి చైతన్యము దేనికి కారణముగాని, కార్యముగాని కాకపోయినప్పటికీ, ఈ 'సృష్టి' అనబడే లీలను తనయందుతానే ప్రకాశింప చేయుచున్నది.

❖

తన వాస్తవ స్వరూపము శుద్ధ చైతన్యమే అయినప్పటికీ, ఈ జీవుడు తనయందు విచారించని కారణంగా ఒకానొక అజ్ఞానం పొందుచున్నాడు, చూచుచున్నాడు. అట్టి అజ్ఞానం స్వయముగా అసత్యమే అయినప్పటికీ - అది జగత్తు రూపముగా సత్యమువలె అనుభవమగుచున్నది.

అవిచారముతో కూడిన ఆత్మ "ప్రకృతి" అనబడే దృశ్యభావనయందు ప్రవేశించి, ఈ జగత్తును సత్యమైనదానివలె స్ఫురింపచేస్తోంది.

చైతన్య రూపుడగు ఈ జీవుడు ఒకానొకప్పుడు ఈ దృశ్యవిషయమై కొంత విచారణ శీలుడగుచున్నాడు. "ఈ దృశ్య వ్యవహారమంతా నాకు ఎక్కడి నుండి, ఎట్లా ప్రాప్తిస్తోంది? ఇంతకీ నేనెవరు?" అను ప్రశ్నలకు వస్తున్నాడు. అప్పుడు ప్రయత్నశీలుడై, విచారించి చూచి అంతా గ్రహించినవాడై జగద్భావమును త్యజించి వేస్తున్నాడు. "పరమ మహత్" రూపమున ప్రకాశించుచున్నాడు.

అయితే, ఒక ముఖ్యమైన విషయం. కెరటం ఉన్నా, లేకున్నా జలము జలమే కదా. అదేవిధంగా ఈ జీవుడు విచారించకపోవుటచే జగద్భావము కలిగియుండి ఉండవచ్చు. లేదా సర్వ సంకుచిత భావములను త్యజించివేసి ఆత్మానందములో తేలియాడవచ్చు. (అనగా జ్ఞానముచే అజ్ఞానము త్యజించినవాడై విచారణ పూర్వకమగు అఖండత్వమును వహించి ఉండవచ్చు). ఏది ఏమైనా, ఈ జీవుని వాస్తవ స్వరూపము సర్వదా శుద్ధచైతన్యమే అయియున్నది సుమా!

అందుచేత ఈ జగత్తునందు చైతన్యమే వ్యాహ్యాళి చేయుచున్నది. అదియే భావనా పూర్వకంగా ఈ జగత్తును ఉత్పత్తి చేయుచు స్థితింపచేసి, చివరకు లయింప చేస్తోంది. అది సర్వజగత్తునకు అతీతమైనట్టి తన విలక్షణత్వమును ఏ క్షణమందును కోల్పోవుచుండుట లేదు. దేనినీ పొందుట లేదు, కోల్పోవుట లేదు, తాను జన్మించుట లేదు, క్షయించుట లేదు. ఇందుకు ఒక దృష్టాంతం చెపుతాను. విను. నీవు ఒకానొక భావన పొందావనుకో అప్పుడు 'నేను రాముడను' అనే స్ఫురణను కొంచెము మరచి ఆ భావావేశంలో తాదాత్మ్యము చెందవచ్చునేమో. కాని నీవు రాముడివి కానిది ఎప్పుడు? ఆ భావము జనించునప్పుడు, ప్రభావితమగునప్పుడు, తొలగునప్పుడు నీవు అట్లే ఉన్నావు కదా! జీవునికి ప్రాప్తించుచున్న ఈ సృష్టి స్థితి లయములుకూడా అట్టివే.

❖

ఓయీ జీవుడా! నీ స్వస్వరూపము, "స్వ-సత్త-సామాన్య అనుభవమగు (Self - Exisence - Commonality - Experience) శుద్ధ చైతన్యమే కదా! అట్టి శుద్ధ చైతన్యమునకు చావు-పుట్టుకలు ఎక్కడున్నాయి? మరి నీవు దుఃఖించవలసిన పనేమున్నది? "నేను-నీవు, అట్లే ప్రతి ఒక్కరు అమృతతుల్యమగు ఆ అద్వితీయ చైతన్యమే" - అని ఈ మన విచారణ సర్వులకు నిరూపించగలదు.

ఎవరైతే విచారణపరులై ఆత్మను, దాని స్వభావ - స్వరూపములను గ్రహిస్తారో - అట్టివారు, "సర్వ శబ్దములకు, మనస్సునకు అతీతమైయున్న పరబ్రహ్మమునే నేను" - అను అనుభవముతో ప్రకాశించుచున్నారు. "ఈ ప్రపంచము నానుండి వేరుగా సత్యమైయున్నది కాదు. స్వకీయ కల్పనచే

నేనిదంతా ఇట్లు గాంచుచున్నాను ఇదంతా నా ఆత్మస్వరూపమే!" అని తెలియబడుటచే మనస్సు శూన్యమై శాంతిస్తోంది. అట్టి స్థితిలో జ్ఞానేంద్రియములు తమ తమ కార్యక్రమములు నిర్వర్తించుచున్నప్పటికీ "కర్మఫలము" అనునది అతనిని ఏమాత్రం తాకుట లేదు. "ఇది చేశాను. ఇది ఇట్లున్నదేమి?" అనునట్టి కర్తృత్వ అహంకారమును, స్పర్థను త్యజించివేస్తున్నాడు. మనస్సు శూన్యమైనచోట వాసనల ప్రభావం మాత్రం ఏమి ఉంటుంది? కర్మేంద్రియములు ఆసక్తులను త్యజిస్తాయి. 'మనస్సు' అనే యంత్రం కదలాలంటే 'విషయవాసనలు' అనే త్రాడు కావాలి. విషయవాసనలు క్షీణించినప్పుడు మనస్సు శాంతించక ఏం చేస్తుంది? అట్టివాడు జీవన్ముక్తుడే అవుతాడు.

జీవన్ముక్తులు కూడా అనేక సందర్భములలో ఇతరులవలెనే కర్మలు నిర్వర్తిస్తున్నారు. అయితే వారికి ఆసక్తికాని, భ్రమలుగాని ఉండవు. అందుచేత వారి ప్రవర్తనచే లోకులకు శుభమే జరుగుతుంది. ఎవనికి దేనిపట్ల ఏమాత్రం ఆసక్తి ఉండదో – అట్టివాడు ఆ కర్మ విషయంలో 'అకర్మపరుడు' అనియే చెప్పబడుచున్నాడు.

గాలియందు చలనశక్తి అంతర్హితమై ఉంటుంది కదా. అట్లే ఈ జగత్తు కూడా జీవుని యొక్క వాసనలందే సంస్కార రూపమున ఉన్నది. ఆ సంస్కారములే బాహ్యమున భోగములు మొదలైన అనుభవములుగాను, అంతరంగమున అనేక చింతలుగాను వ్యవహరిస్తున్నాయి.

❖

ప్రాణుల కర్మఫల భోగము కొరకే ఈశ్వరునియందు సత్వగుణ ప్రధానమగు వాసన (tendency) ఉదయిస్తోంది. వెనువెంటనే ఆవాసన విశాల దిక్–మండల రూపముగాను, కాలముగాను, బాహ్య – అభ్యంతర* పదార్థములుగాను ప్రకాశిస్తోంది. ఆ తరువాత ఆ ఈశ్వరుడే నానావిధములైన మలిన – ఉపాధులతో సంసర్గమును (స్వకీయమైన self made) మాయచే అంగీకరించుచున్నాడు. అట్లు అంగీకరించి, "ఈ దేహములు మొదలైన దృశ్య స్వరూపములే తనయొక్క వాస్తవ స్వరూపము" అను అసత్ భావనమును పొందుచున్నాడు. "నేను జీవుడను" అనునట్టి ప్రమేయత్వమును, పరిమితత్వమును వహించి ఉంటున్నాడు. ఇక ఈ వస్తువుల స్వభావమంటావా – ఇదంతా నిజ (own) స్వభావా సంకల్పానుసారమే ప్రకాశించుచున్నది. వాస్తవానికి సర్వాత్ముడే అయి ఉన్నట్టి ఇతడు ఎచ్చట ఏ భావమున విరాజిల్లుతాడో అచ్చట ఆ రూపమునే (ఆ అనుభవమునే) పొందటం జరుగుతోంది.

'సర్వదర్శి'యగు ఆ పరమాత్మ సర్వ రూపములందు వెలయువాడేకదా. అతడు (జీవభావమును పొందిన ఈశ్వరుడు) ఎట్లు ఎచ్చట సంకల్పిస్తున్నాడో, ఈ దృశ్యము కూడా అట్లే ప్రాప్తించుచున్నది.

---

* బాహ్యపదార్థములు = ఈ దృశ్యములోని పదార్థజాలం. ఈ శరీరం కూడా అట్టి 'జగద్దృశ్యము'లోని భాగమే. అభ్యంతర పదార్థములు = మనసు (మనన స్వభావం). బుద్ధి (నిర్ణయాత్మక స్వభావం) చిత్తము (ప్రియము కలిగియుండు స్వభావం). అహంకారము (నేను – నాది అను స్వభావం).

ద్రష్ట ఉంటేనే కదా, దృశ్యము ఉండేది! కనుక ద్రష్టను అనుసరించే దృశ్యముంటోంది. దర్శించువాడు (ఈశ్వరుడు) దర్శనమునకు మునుముందే ఉన్నాడు.

❖

వాస్తవానికి దృశ్యముగాని, దృశ్యత్వముగాని, ద్రష్టత్వముగాని సత్యమైనవి కావు సుమా! ఈ జగత్తులోని పదార్థజాలమంతా సంకల్పమాత్రం చేతనే (స్వకీయ భావన చేతనే) అనుభూతమగుచున్నది. అందుచేతనే "ఈ జగత్తు మిథ్య" అని చెప్పబడుతోంది.

❖

సత్యరూపము, సర్వుల వాస్తవ స్వరూపము అయిన 'బ్రహ్మము' సర్వదా కారణ రహితమే అయి ఉన్నది. ప్రత్యక్ష – అనుమానముల* ద్వారా విచారించినప్పుడు ఆ అద్వితీయ బ్రహ్మమే సర్వుల వాస్తవ స్వరూపంగా సిద్ధించుచున్నది.

ఓ సాధూ! మనం తత్త్వవిషయంలో ప్రవేశించేముందు మరొక్కసారి ఒకానొక నగ్నసత్యమును సర్వజనులకు ప్రకటిస్తున్నాను.

స్వయత్నమాత్రే యదుపాసకోయః తద్దైవశబ్దార్థమపాస్య దూరే
శూరేణ సాధోపదముత్తమం తత్ స్వపౌరుషేణైవహి లభ్యతేంతః (XIX. 34)

ఇతఃపూర్వపు, వర్తమానపు స్వప్రయత్నములకు వేరుగా, 'దైవము' అనబడు స్వయం నిర్ణయాధికారంగల వస్తువేదీ ఎచ్చటాలేదు. నీవు ఆ 'దైవము' అనబడు శబ్దార్థములను దూరంగా ఉంచి, ప్రయత్నశీలుడవయ్యెదవుగాక! 'ముముక్షువు' అయినవాడు తనను ప్రతి రోజు సమీపిస్తున్న అనేక వ్యవహారములను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. తన ఇంద్రియ–మనస్సులు వాటిపట్ల ఆసక్తిపూర్వకంగా ప్రసరించకుండా చూచుకోవాలి. దృష్టిని అపరోక్షమగు ఆత్మ వైపు తరలించాలి. అప్పుడే అతడు 'శూరుడు' అని అనిపించుకొంటాడు. అట్టివాడు దైవము అనుదానిని పరిత్యజించి, పౌరుషప్రభావం చేత తన హృదయంలోనే "ఆత్మసాక్షాత్కారం" పొందుచున్నాడు.

స్వీయ బుద్ధిబలంచేత 'బ్రహ్మము'ను సాక్షాత్కరింపచేసుకొనేవరకు 'స్వప్రయత్నము' అనుదానిని ఏమాత్రం విడచిపెట్టరాదు. ఒకవైపు ఆయా ఆచార్యులు నియమించినట్టి విధివిధానపూర్వకమైన ప్రార్థన, పూజ, ధ్యానము మొదలైనవి నిర్వర్తించవలసిందే! మరొకవైపు తత్త్వవిషయమై విచారణచేస్తూ ఉండవలసిందే!

❖❖❖

---

* ఏదైనా గ్రహించాలంటే (మీమాంసయందు) రెండు మార్గములు చెప్పబడుచున్నాయి.

1. ప్రత్యక్షము : Whatever evidence that can be seen, felt etc., physically here and now, to ascertain truth.

2. అనుమానము : Something that is logically filtered out basing on circumstances / situations "As this is like this .... that must have been like that".

29. సదాచార నిరూపణ

ముముక్షువైనవాడు మొట్టమొదట సాధువులతో స్నేహంచేసి వారి ఉపదేశములను, ఆ ఉపదేశముల ఉద్దేశమును, అంతర్లీన సారమును సుతీక్షణమైన బుద్ధితో గ్రహించాలి. వారు బోధించే మార్గంలో ప్రయత్నం చేయాలి. అట్టి ప్రయత్నముల వలన బుద్ధి ఇంకా ఇంకా వికసిస్తుంది. అప్పుడు క్రమంగా అతడు మహాపురుషత్వమును పొందగలడు.

మహాపురుషత్వం సాధించాలనుకుంటే, అట్టి మహాపురుషుల కొరకై వెతకాలి. వారిని గుర్తించి, సమీపించి సేవాదులచే సంతోషపెట్టాలి. అయితే, నీకు కావలసిన మహాపురుష లక్షణాలన్నీ ఒక్కనియందే లభించకపోవచ్చు. ఒకనిలో కొన్ని విశేషములు మాత్రమే ఉండవచ్చు. అంతమాత్రంచేత అతనిని త్యజించరాదు. ఎవనియందు ఎంతవరకు, ఏ ఉత్తమ లక్షణం నీవు గమనిస్తావో, - అంతవరకు అతనిచే బోధింపబడి అద్దానిని గ్రహించాలి. క్రమంగా నీ బుద్ధిని సునిశితం చేసుకోవాలి.

ఓ రాఘవా! 'శమము' మొదలైన ఉత్తమగుణములతోకూడిన "ప్రజ్ఞ"యే మహా పురుషుల లక్షణమైయున్నది. నీవు కూడా శమము, శాంతమును ఆశ్రయించు. అయితే 'సమ్యక్' జ్ఞానం (comprehension that all are equal) లేకపోతే శమాదులు సిద్ధించవు. బాహ్య-అంతరంగ ఇంద్రియములను సరైయిన మార్గంలో నియమించి, సత్ప్రవర్తన, సత్సంగమము ఆశ్రయించినప్పుడే ఉత్తమజ్ఞానం పొందటానికి ఈ జీవుడు తగినవాడగుచున్నాడు. జ్ఞాన ప్రభావం వృద్ధి చెందుచుండగా, అట్టి సర్వసమత్వ దర్శనము ఉత్తమ సుఖమును ప్రసాదిస్తోంది. జీవుడిని సంసారబంధము నుండి విముక్తునిగా తీర్చిదిద్దుతోంది.

ఆహారం వలన భూతజాలం, ఆ భూతజాలం చేయు పరిశ్రమ వలన ఆహారం వృద్ధి చెందుతూ ఉంటాయి కదా! అదేవిధంగా జ్ఞానము వలన శమ-దమాదులు, శమ-దమాదుల వలన జ్ఞానం వృద్ధిచెందుతూ ఉంటాయి. పద్మము - సరస్సులు పరస్పరం శోభింపచేసుకొనునట్లు జ్ఞాన-శమ దమాదులు ఒకటి మరొకదానిని శోభింప చేసుకొంటున్నాయి. శమదమాదులే సదాచారము యొక్క స్వరూపం. జ్ఞానమున్న చోట సదాచారం కూడా ఉంటుంది.

అందుకే శమ, ప్రజ్ఞాదులలో నిపుణులైన మహాపురుషుల చరిత్రలు చదివి, అందలి ఆదర్శం గ్రహించాలి. అట్లు ఆదర్శం గ్రహించకపోతే వారి చరిత్రలు చదివి ప్రయోజన మేమున్నది? శమ దమములు, సదాచారములవల్లనే జీవితం పవిత్రమౌతోంది.

వత్సా! రామచంద్రా! "జ్ఞానసముపార్జన సదాచారము" (Acquisition of Knowledge & Good conduct) ఈ రెండింటినీ ఒక్కసారే సమానంగా ఆచరించాలి. "మేము జ్ఞానము సంపాదిస్తున్నాము కదా. ఇక సదాచారంతో మాకు పనేమున్నది?" - అను మాట ఉచితం కాదు. "సదాచారులమగు మాకు జ్ఞానవిచారణతో పనిలేదు" - అనేమాట కూడా సరికాదు. ఈ రెండింటిలో ఒక దానిని నీవు తిరస్కరిస్తే, రెండవది నిన్ను తిరస్కరిస్తుంది. పొలంలో పాటలు పాడుతూ, చప్పట్లు చరుస్తూ,

పక్షులను పారద్రోలే వనితను చూడు. ఆమె పాటలు పాడటం, పక్షులను తరమటం ఒకేసారి చేస్తోంది కదా! ముముక్షువు కూడా జ్ఞాన, సదాచారముల రెండిటినీ ఒకేసారి అనుసరించాలి.

ఈ లౌకిక వ్యవహారములపట్ల కొంత నిస్సంగత్వమును అలవరచుకోవాలి. "శుద్ధచైతన్య స్వరూపుడనైన నేను దేనికీ, కర్తను కాను. కర్తను కాను కనుక భోక్తను కూడా కాదు" – అని అంతరంగమునందు ఉద్వేగరహితమైన అకర్తృత్వ భావనను అలవరచుకొన్నవాడు మా ఈ బోధను సులభంగా గ్రహిస్తున్నాడు. భ్రమ – ప్రమాదము (బద్ధకము) మొదలైన విఘ్నములను వినాశనమొనర్చి, ప్రయత్న – పరాక్రమములతో పరమ పదమును అధిరోహించాలి. అదియే ఈ జన్మల, కర్మల ఉత్తమ ప్రయోజనమై ఉన్నదని జనులు గ్రహించెదరు గాక!

ఓ సభికులారా! సదాచారము అత్యంత ప్రాముఖ్యమైనదని మాత్రం కొంచెము కూడా మరువవద్దు. ఇక మనం జ్ఞానవిషయ చర్చలోకి ప్రవేశించబోతున్నాం.

ఈ చెప్పబడబోవు మోక్షశాస్త్రం అందరి మనస్సులకు శాంతిని ప్రసాదించుగాక మానవ జీవితములకు, ఆయుష్షులకు అర్థ–పరమార్థములు ప్రసాదించును గాక! ఆప్తులగు జ్ఞానులచే ఇది అనేకులకు బోధింపబడు గాక! శ్రద్ధాసక్తులు గల అనేక ముముక్షువుల హృదయాలను అలరించును గాక! అనేకులు ముందు ముందు దీనిపై వ్యాఖ్యలు వ్రాయపూనెదరు గాక!

మురికినీటిలో చిల్లగింజలు వేసినప్పుడు, అందలి నిర్మలమైన నీరు పైకి లేచి, ఆ నీటిలోని దోషమంతా క్రిందకు జారిపోతుందికదా! ఈ మన విచారణ వినుచున్నవారి చిత్తములను శుద్ధి పరచి వారికి పరమపరాన్ని ప్రసాదించుగాక!

నాయనలారా! మీ మీ సాధనలు మాత్రం విడచిపెట్టకండి. ఎందుకో తెలుసా? సాధన వలన మనస్సులు పరిశుద్ధమొందుచుండగా, ఈ విచారణ అంతఃకరణమునందు ప్రవేశించినప్పుడు, తత్త్వజ్ఞానం జనిస్తుంది.

సాధనలను, వివేకసహితమైన జ్ఞానార్తిని, కలిగి ఉండండి. ఉత్సాహవంతులై సర్వదా ఉత్తమ ప్రయత్నమును నిర్వర్తించండి. జడమైన అభిప్రాయములందు, సంగమములందు రాగద్వేషములందు ఇరుకు కొనియున్న మీ మీ మనస్సులను ఉద్ధరించి, "ఆత్మజ్ఞానము" అను మంచినీటి సరస్సు వద్దకు చేర్చండి. బద్ధకము, అశ్రద్ధ ఆశ్రయించారా – మిమ్ములను ఆ హరిహరాదులు కూడా కాపాడలేరు. ఇక నేను చేయగలిగినదేముంటుంది?

శ్రద్ధాసక్తులతో ఈ శాస్త్రమును వినండి. అప్పుడు మీరు కోరకపోయినా మీ బుద్ధి పరమపదమున ప్రవేశిస్తుంది. అజ్ఞానం నశించగా, ఇక అట్టి పరమపదము మీ అంతఃకరణమును మరెప్పటికీ వీడజాలదు.

❖❖❖

ముముక్షు వ్యవహార ప్రకరణం సమాప్తం

బ్రహ్మార్పణమస్తు – లోక కళ్యాణమస్తు

ఓం తత్సత్

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

III. ఉత్పత్తి ప్రకరణం

ఉత్పత్తి ప్రకరణము

I. ప్రకరణ పరిచయము

1. మహావాక్య ప్రభావము

శ్రీ వసిష్ఠమహర్షి : "సోఽహం" "తత్త్వమ్" "త్వమేవాఽహమ్"
"జీవో బ్రహ్మేతి నాపరః" "అయమాత్మా బ్రహ్మ"

సోఽహం : అతడే నేను (నన్ను నేను అల్పుడిగా భావించుకోకూడదు).
తత్త్వమసి : అదియే నీవు అయివున్నావు.
త్వమేవాఽహమ్ : నీవే నేను
జీవో బ్రహ్మేతి నాపరః : ఈ జీవుడు బ్రహ్మముకంటే వేరైనవాడు కాదు.
అయమాత్మా బ్రహ్మ : ఈ జీవాత్మయే బ్రహ్మము.

ఈ విధంగా వేదములు మహావాక్యాలు ప్రసాదించాయి. ఈ మహావాక్యాలు బాగా విచారిస్తే, అప్పుడు అఖండ బ్రహ్మాకారవృత్తి కలిగి, జీవునికి తన నిజరూపం ప్రకాశిస్తుంది. ఈ జీవుడిని ఆవరించి ఉన్న అజ్ఞానం పటాపంచలు అవుతుంది. అట్టి అఖండాకార మహావృత్తినే, "మోక్షం" "నిర్వాణం", "జీవబ్రహ్మ స్వరూపం", "శుద్ధ – బ్రహ్మైక్యం" ... మొదలైన అనేక పేర్లతో పిలుస్తున్నారు.

ఆ పదాలన్నింటి అర్థం ఒక్కటే.

ప్రతి జీవి యొక్క ప్రయత్నములలోని అంతర్లీన లక్ష్యం నిత్య–ముక్త–పూర్ణ–స్వరూపంతో ప్రకాశించుటయే. అదే అతని ఆవేదన, ఆరాటం కూడా!

ఆత్మ యొక్క స్వభావం ..... "నిత్య శుద్ధత్వము , నీవు–నేను మొదలైన భేదములకు చోటులేని అఖండత్వము, ప్రశాంతత్వము" .... అయివున్నది. "నేను ఆత్మనే" అను ఎఱుక గలవాడు ఈ స్వభావములన్నీ పొందుచున్నాడు. అప్పుడాతడు ముక్తస్వరూపుడగు చున్నాడు. ముక్తికి మహావాక్యార్థజ్ఞానం కంటే ఇక వేరే ఏమీ అవసరం లేదు. ప్రతి జీవుని యందు అట్టి బ్రహ్మజ్ఞానం

సర్వదా జాజ్వల్యమానంగా వెలుగుతోంది. అయితే ఈ దృశ్యమును జీవునకు స్ఫురింపచేయుచున్నట్టి మాయ, అట్టి బ్రహ్మజ్ఞానమును కప్పి ఉంచుతోంది. అంతేకాదు. అతనిని వేలాది దుఃఖపరంపరలలో నిరంతరం ముంచి తేల్చుచున్నది. దిక్కుతోచనట్లు చేస్తోంది.

రామచంద్రా! ఈ మాయయొక్క దుశ్చర్యల గురించి భయపడవలసిన పనేమీ లేదు. ఎందుకంటే, ఈ దృశ్యప్రపంచ భావములలో జీవుని బంధించుచున్నట్టి 'మాయ' అనునది స్వప్నము వంటిది మాత్రమే. "మహావాక్యార్థజ్ఞానము" అనబడు మెలుకువ రాగానే ఈ భ్రమలన్నీ ఎక్కడికి పోతాయి ...? అది నన్ను అడుగవద్దు.

నిద్ర లేవగానే స్వప్నంలో చూస్తున్న పదార్థజాలమంతా ఎక్కడికి పోతున్నది?ఈ వర్తమాన జాగృత్-దృశ్య-భ్రమల గతి కూడా అంతే! "నేను ఏది అయివున్నాను? ఏది ఏ క్షణమునందునూ కాకయే ఉన్నాను?" అను రూపముగల ఎఱుక (లేక తెలివి, లేక జ్ఞానము, లేక ప్రబోధము) వలన సర్వము విదితము కాగా ... ఇకప్పుడు ఈ జీవుడే శివస్వరూపుడై స్వయంప్రకాశంతో జాజ్వల్యమానంగా వెలుగుచున్నాడు.

"ఈ సంసారము అనబడు దుస్తరమైన సాగరము జీవునికి ఎదురుగా ప్రాప్తించటానికి అసలు కారణమేమిటి?" అను ప్రశ్నను మనం పరిశీలిస్తే, "అజ్ఞానము కలిగియుండుటయే" అను సమాధానము లభిస్తోంది. ఇదంతా ప్రత్యగాత్మ యందే .... లేక, జీవ-చైతన్యము నందే .... లేక, నీ స్వస్వరూపమునందే ... కారణము లేకుండా ఇట్లు తోచుచున్నది. "ఇదంతయు బ్రహ్మమే" అని చెప్పు స్వబోధమైన మహావాక్యాలను, తద్వారా ప్రకటించ బడుచున్న స్వాత్మరహస్యమును ఎవరైతే గ్రహిస్తారో వారే ఈ వర్తమాన జన్మ యొక్క ఉత్తమ ప్రయోజనము పొందుచున్నారు. అట్టి వాడే "బ్రహ్మజ్ఞుడు" అని అనిపించు కొంటున్నాడు.

కాబట్టి ఈ జీవుడు మహావాక్యముల అర్థం అభ్యసించి అఖండాకారవృత్తిని అలవరచు కోవాలి.

ఇది ఎవరి సృష్టి? ఎవరియందున్నది? ఎక్కడ ఉత్పత్తి పొందుచున్నది?

దీనికి సమాధానం విను.

ఈ జగత్తును ఎవరూ సృష్టించియుండలేదు. ఒకడు చీకటి కారణంగా తాను చూచుచున్న త్రాడుయందు పామును ఆరోపించి దర్శించునట్లు, అజ్ఞానియే ఉత్తమ విచారణ చేయక పోవుటచే ఏర్పడిన అజ్ఞానము వలన బ్రహ్మము నందు 'జగత్తు'ను ఆరోపించుచున్నాడు. అట్లు దర్శించుచు, స్వయముగా అనేక అనుభవములు పొందుచున్నాడు. అందు ప్రాప్తిస్తున్న సుఖ-దుఃఖభావములతో తాదాత్మ్యము చెందుచు, జన్మపరంపరలు పొందుచున్నాడు. అజ్ఞానం తొలగిందా – అంతా అతనికి సుస్పష్టమవగలదు. ఈ విషయమై యథార్థజ్ఞాన మేమిటో నీ ముందు ఉంచుతాను. దీనిని సూక్ష్మబుద్ధితో గ్రహించి పవిత్రుడవయ్యెదవుగాక!

❖

ఓ రాఘవా! ప్రతి జీవుని యొక్క నిజస్వరూపము "ఆత్మతత్త్వమే". అట్టి ఆత్మయొక్క స్వరూపము ఆకాశమువలె నిరాకారమైనది, చైతన్యమాత్రము. అయితే అట్టి నిర్లిప్త, నిస్సంగ, నిష్క్రియమగు ఆత్మ, "నేను జీవుడను" అనునట్టి జీవరూపమును దాల్చి ఈ జగత్తును చూడటం జరుగుతోంది. అందుచేత ఇదంతా ఒక కలవంటిది మాత్రమే. "నేను – నీవు – అతడు" .... మొదలైన రూపములుగా తోచుచున్న ఈ దృశ్యజగత్తు స్వప్నములోని ఆయా వస్తువులతో పోల్చవచ్చు.

"ఈ జగత్తును మేము వాస్తవముగానే చూస్తున్నామే?" అని ఎవరైనా అంటారేమో? వారు ఇంద్రియతాదాత్మ్యము పొందినవారై చూచు చుండుటచే అట్లు తోచుచున్నదని గుర్తు చేస్తున్నాను. అంతేకాని, ఇందలి వస్తువులు సత్యములు కావు. స్వప్నంలోని వస్తువులు కూడా అప్పటికి అవి సత్యములుగా తోచుచుండుటయే ఇందుకు మనకు దృష్టాంతం.

2. బంధహేతువు

దృశ్య ప్రపంచము యొక్క అనుభవం పట్ల, "ఇది వాస్తవమే" అను ఆరూఢత, నమ్మిక కలిగియుండుటచేతనే బంధము ఏర్పడుతోంది. "దృశ్యము అవాస్తవమే. ఇది లేదు" అను సదవగాహనచే దృశ్యము స్వప్నతుల్యమై "లేనిదే" అగుచున్నది. అప్పుడు బంధము అనునదే ఉండదు. మరి ఈ దృశ్యభావం తొలగిపోయేదెట్లా? ఇదంతా అసత్తుల్యమని గ్రహించేది ఎట్లా?

ఈ జగత్తులో ఏదైతే జన్మించుచున్నదో .... అదియే వృద్ధిచెందుతోంది. అదే స్వర్గ– నరకములకు ప్రయాణం చేస్తోంది. అట్టిదానికే "ముక్తి" అనునది అవసరమగుచున్నది. ఈ జీవుడు వాస్తవానికి సర్వాతీతుడు. ద్రష్ట స్వరూపుడు. స్వస్వరూపజ్ఞానము లేకపోవుటచేతనే జీవుడు బద్ధుడు అగుచున్నాడు. "స్వస్వరూపమగు ఆత్మ ఇతఃపూర్వమున్నట్లే సర్వవేళల ఉంటున్నది. అట్లే సర్వదా కేవల సాక్షిమాత్రమై ఉండబోవుచున్నది" అనునదే జ్ఞానం.

అయితే ఆత్మ ఎప్పటియట్లే ఉంటూ, ఎట్లు ఉత్పత్తి–బంధములను కలిగించుకొంటోంది?

ఈ ప్రకరణంలో ఈ విషయమై అనేక విశేషాలు నీముందు ఉంచబోవుచున్నాను. దీనిని వింటే ఆత్మస్వరూప జ్ఞానం లభించగలదు. మొట్టమొదట కొంత సంగ్రహంగా చెప్పి, ఆ తరువాత నీవు కోరిన విధంగా విస్తారంగా చర్చిస్తాను. ఇకపై మనం కొన్ని సంఘటనలు (ఉపాఖ్యానాలు) కూడా పరిశీలించబోవుచున్నాం.

❖

స్వప్నము 'సుషుప్తి'లో లీనమగుచున్నది కదా! స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తు కూడా ఒకానొకప్పుడు "ప్రళయము" అనుదానిలో లీనమగుచున్నది. అనగా, ఈ దృశ్య తతంగమంతా స్వస్వరూపమునందు విలీనమైపోతోంది. అప్పుడు మిగిలియుండు సత్పదార్థమునకు నామరూపములు ఉండవు. అభివ్యక్తము ఉండదు. అది తేజము కాదు. అంధకారము కాదు, అది "నిష్క్రియము, అపరిచ్ఛిన్నము" అని మాత్రం గుర్తుగా శాస్త్రాలు చెప్పుచున్నాయి. లోకవ్యవహారం కోసం, పండితులు

అద్దానికి "ఋతము", "ఆత్మ", "పరబ్రహ్మము", "సత్యము", "శివము" మొదలైన అనేక నామములు కల్పించుచున్నారు. అయితే, అయ్యది శుద్ధ చిత్స్వభావమే అయినప్పటికీ, స్వమాయ వలన తనంతట తానే జడ రూపమున వివర్తమగుచున్నది. జీవభావము ఆశ్రయించినదానివలె కన్పట్టుచున్నది.

ఆ చైతన్యమయమైన వస్తువే సంకల్ప-వికల్పరూపమగు మనస్సుగా మారుచున్నది. క్రమంగా అది ప్రాణము యొక్క పంచభూతములయొక్క ఆకృతిని గైకొనుచున్నది. తన పరమార్థరూపమును మరచుట వలన ఆ చైతన్యము నుండే ఈ సంకల్ప-వికల్పములతో కూడుకొనిన మనోధర్మములన్నీ ప్రకటితమౌతున్నాయి. నిశ్చల సముద్రంలో తరంగములు లేస్తున్నాయి కదా! ఇది కూడా అట్టిదే.

హిరణ్యగర్భుడు : చైతన్యము సమష్టి (Collective) మనోభావము పొందినప్పుడు 'హిరణ్యగర్భుడు' అను శాస్త్రీయమైన పేరుతో చెప్పబడుతోంది. ఇట్లు ఆ చైతన్యమే వ్యష్టిగాను, సమష్టిగాను వెలయుచున్నది.

ఈ చైతన్యము "సత్య - సంకల్పతత్త్వము" అని కూడా చెప్పబడుతోంది. ఎందుకంటే అది తాను ఏది 'సత్యము' అని సంకల్పిస్తుందో, దానిని అట్లే పొందుతూ ఉంటుంది. తాను ఏది 'ప్రియము' అని భావిస్తుందో అది అట్లే ప్రియముగా ఏర్పడుచున్నది.

చైతన్యమే పూర్వసంస్కారములను అనుసరించి ఈ "అగ్ని, వాయు, జల, భూమి" అనబడే చతుర్విధ భూతములతో విరాట్‌భావమును (పదార్థజలములతో కూడిన విశ్వసృష్టిని) ఇంద్రజాలమువలె సంకల్పిస్తోంది. బంగారుతీగ బంగారము కంటే వేరా? బ్రహ్మ సత్త వలననే నిలిచియున్న ఈ జగత్తు బ్రహ్మము కంటే వేరుకాదు. బ్రహ్మము కూడా జగత్తు కంటే వేరుకాదు. అనగా ఈ జగత్తు యొక్క ఉనికి (ఉన్నచోటు, స్థానము) ఆదికారణమగు బ్రహ్మమునందే పర్యవసితమగుచున్నది.

జగత్తు భావమునందే ఉన్నది. భావమో? బ్రహ్మమునందే కలదు. ఇట్లు 'జగత్తు యొక్క ఉనికి స్థానం బ్రహ్మమే' అని చెప్పబడుతోంది.

ఎడారిలో ఎండమావుల ప్రభావంచేత నదీతరంగాలు కనబడతాయి. అవి అసత్యములే అయినప్పటికీ, "ఇవి జలకెరటములే" అని భావించి మృగములు అక్కడి జలం గ్రోలాలనే భ్రమచే పరుగెత్తుచున్నాయి. ఇంద్రజాలమయమగు ... ఈ "నీవు-నేను-అతడు" మొదలైన వాటితో కూడుకొని కనబడే ఈ జగత్తు ... అసత్యమే అయినప్పటికీ, 'మనస్సు' యొక్క ప్రభావం చేత నిత్యమైనదానివలె ప్రసిద్ధి పొందుతోంది.

దృశ్యవ్యవహారం : అందుకే, తత్త్వజ్ఞులైన పండితులు ... అనేకమైన భేదములతో కూడుకొని ఎదురుగా కనిపిస్తున్న ఈ దృశ్యవ్యవహారమునకు కొన్ని సాంకేతిక నామములు (technical terms) ఉపయోగిస్తున్నారు. ముందుముందు, వాటిని మనం కూడా ఉపయోగించబోతున్నాం కనుక వాటిని వివరిస్తున్నాను, విను.

1. అవిద్య : ఆయా భావనలు, పదార్థానుభవములు, ఆవేశపూరితమైన అభిప్రాయముల రూపంలో ఇప్పుడు 'వాస్తవం' లాగానే ఉంటాయి. కానీ, విద్య లేక జ్ఞానము ప్రాప్తించినప్పుడు తొలగిపోతాయి. ... అట్టి వ్యవహారమును 'అవిద్య' అని పిలుస్తున్నాను.

2. సంసృతి : యేయే భావనలు లేక దృశ్యమునకు సంబంధించిన అనుభవములు ఈ జీవుని స్వర్గ, నరక, పాతాళాది (లేక సుఖ, దుఃఖ, జడత్వాది) అనేక లోకములలో త్రిప్పుటకు కారణమగుచున్నాయో .... వాటిని 'సంసృతి' అని చెప్పుచున్నారు.

3. బంధము : ఈ 'దృశ్యభావన' లేక 'తాదాత్మ్యము' ఆత్మయొక్క స్వభావసిద్ధమైయున్న నిత్య స్వాతంత్ర్యమును అప్రకటితం (unmanifested, covered) చేస్తున్నది. అదియే 'బంధము'.

4. మాయ : "యామా" ... ఏదైతే సొంతంగా ఏ క్షణమందుకూడా ఉండి ఉండలేదో, కాని అజ్ఞానదృష్టికి మాత్రం వాస్తవమువలెనే తోచుచున్నదో .... అద్దానిని 'మాయ' అని అంటున్నాం.

5. మోహము : ఏదైతే .... భ్రమను కలుగజేయడానికి హేతువు అగుచున్నదో .... అట్టిదానిని 'మోహము' అని చెప్పుచున్నారు. లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా గారడీ లోలాగా తోచుట ఈ మోహము యొక్క వికారప్రభావమే.

6. మహత్తు : ఏదైతే దాటుటకు అత్యంత కష్టమైనదానివలె తోచుచున్నదో .... అద్దానినే 'మహత్తు' అను పేరుతో చెప్పుకొంటున్నాం.

7. తమస్సు : ఏదైతే స్వస్వరూపముయొక్క అనుభవమును కప్పి ఉంచి, ఈ జీవుని తన ఆత్మస్వభావం మరచేటట్లు చేస్తోందో ... దానినే 'తమస్సు' అనే మాటతో ఉదహరిస్తున్నారు.

ఇప్పుడు మనం 'బంధము' అంటే ఏమిటో విచారిద్దాం. అటు తరువాత మోక్ష విషయం కూడా.

❖❖❖

3. బంధ - మోక్షములు

"బంధము" అంటే ఏమిటి? ద్రష్టయొక్క "ప్రతిబింబ చైతన్యము"నకు బాహ్యంలో ప్రాప్తిస్తున్న ఈ దృశ్యమునకు గల సంబంధమునే 'బంధము' అని అంటున్నాం.

ఈ ద్రష్ట దృశ్యభావముచే బంధింపబడుచున్నాడు. దృశ్యము తొలగటం జరిగిందా, బంధము కూడా తొలగుతోంది. అయితే, "దృశ్యము" .... అంటే ఏమిటి? నీవు – నేను – మొదలైన మిథ్యా కల్పనలతో కూడిన జగత్తే కదా! అట్టి ఈ జగత్తు రూపు మాయనంత వరకు ముక్తి లభించదు.

అయితే రామచంద్రా! "ఇదంతా లేదు. ఇది ప్రతిబింబము వంటిదే" అని పైపై వాక్యాలు పలికినంత మాత్రంచేత ఈ "దృశ్యబోధ - Perceptual experience" నశిస్తుందా? లేదు. ఒక విధంగా చూస్తే ..... అధికమైన వాక్యాలు, సాంకేతిక పదజాలం చిత్త విక్షేపమునే కలిగిస్తూ

దోషమును వృద్ధిచేస్తాయి కూడా. ఎక్కువగా తర్కం చేయటంవలననో, లేక తీర్థయాత్రలు సేవించినంతమాత్రంచేతో ... ఈ జగత్తు మనోవీథి నుండి తొలగించటం సులభసాధ్యం అయ్యేదికాదని విచారణశీలురగువారు మనకు చెప్పుచున్నారు.

ఇక్కడ ఒక చమత్కారం ఉన్నది. చెపుతాను విను.

జగద్దృశ్యంతు యద్యస్తి నశామ్యతేవ కస్యచిత్
నాఽసతోవిద్యతే భావో నాఽభావోవిద్యతే సతః ॥ (I. 26)

ఈ జగత్తు వాస్తవంగానే ఉండి ఉంటే, ఇక దీనిని తొలగించే ప్రసక్తి ఎక్కడ? ఎందుకంటావా? ఏది వాస్తవానికిలేదో ... అనగా అసత్తో .... అట్టిదానికి ఉనికి ఎక్కడ? ఏది ఉండియే ఉన్నదో .... అనగా సత్తో .... ఇకదానికి 'లేమి' అనునది అసంభవమే కదా!

కాబట్టి ఈ దృశ్యము లేదు. ద్రష్ట మాత్రం యథాతథుడై సర్వదా ఉండియే ఉన్నాడు.

కాని, స్వస్వరూపం యొక్క అపరిజ్ఞాన కారణంగా ఈ దృశ్యము ఉన్నట్లే తోచుచున్నది. చైతన్య స్వరూపమగు ఆత్మ స్వయముగా సర్వము తెలుసుకొంటోంది కనుక జ్ఞేయము. అది కొంతవరకే తెలుసుకొని మరికొంత గ్రహించలేదు కనుక "అపరిజ్ఞేయము" కూడా. అది దృశ్యనివృత్తి పొందనంతవరకు, తాను ఎక్కడ ఉంటే అక్కడ ఒక పరమాణువులో కూడా దృశ్యమును గాంచుచునే ఉంటుంది.

ఓ జీవుడా! నీవు ఇప్పుడు మానవజన్మ పొందావు. ఇదొక సదవకాశం. ఆత్మానుభవము కొరకై నీవు ఇప్పుడు ప్రయత్నించాలి. "ఈ దృశ్యము నా దృష్టిలో లేకుండా ఉండేది ఎట్లా?" అనుదాని కొరకై ప్రయత్నశీలుడవు కావాలి. సురాపానము (మత్తు-పానీయములు) సేవించువాడు, "ఈ మత్తు పానీయముల వలన నాకు తృప్తి కలుగుతుంది" అనే దురభిప్రాయం పరిత్యజించాలంటే ఎంతో ప్రయత్నం చేయవలసి ఉంటుంది కదా! "ఈ దృశ్యము వాస్తవమే" అను 'భ్రమ' మనస్సులో దృఢం అయివుండటం అట్టిదే. అది సూక్ష్మబుద్ధితో గ్రహించినట్టి మేము తపో, ధ్యాన, జపాది సాధనముల వలన చిత్తశుద్ధిని ముందుగా సంపాదించుకొన్నాం. అట్టి శుద్ధచిత్తము యొక్క సహాయం చేత "ఈ దృశ్యమునకు అస్థిత్వము లేదు" అను బుద్ధిని పెంపొందించుకొన్నాం. అందుచేత ఇప్పుడు దృశ్యము యొక్క మచ్చ కూడా మాకు కనబడటం లేదు.

ఓ రామచంద్రా! ఈ జగత్తుకు సంబంధించిన సంస్కారం నీయందున్నంత వరకూ నీవు పారిపోయి ఒక పరమాణువులో దాగినా లాభం లేదు. ఆ పరమాణువులో కూడా నీకు అనేక జగత్తులు ప్రాప్తిస్తూనే ఉంటాయి. చిత్స్వరూపదర్పణంలో ప్రతిబింబ పరంపరలవంటి అనేక జగత్తుల అనుభవం తప్పేది కాదు. ఒక అద్దము ఇరకు చోటులో ఉన్నా, లేక, ఒక సువిశాల ప్రదేశంలో ఉన్నా .... ఆయా తావులలో ఉన్నట్టి కొండలు, వాగులు, నేల, ఆకాశం, గోడ మొదలైనవి తనయందు ప్రతిబింబిస్తూనే ఉంటుంది కదా. ఈ చిత్స్వరూప దర్పణం విషయంలో కూడా అంతే

జరుగుతుంది. అట్లు ప్రతిబింబించటం వలననే చిత్స్వరూపమగు జీవునికి మాటిమాటికి ఈ జరా–మరణ దుఃఖములు, జాగ్రత్ – స్వప్న – సుషుప్తి అవస్థలు .... కలుగుచునే ఉన్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! "ఈ దృశ్యము లేదు" అని మీరు సిద్ధాంతీకరించుచున్నారు కదా! ఇక మేము ఇందులో పాల్గొనటం దేనికి? సర్వము త్యజించివేస్తే పోతుంది కదా! కర్మరాహిత్యమును ఆశ్రయిస్తేనే మంచిదా? 'సమాధి' మాత్రమే మమ్ములను ఈ దృశ్యము నుండి కాపాడుతుందేమో? మరి ఈ దృశ్యము మాకు బంధమే కదా?

శ్రీ వసిష్ఠమహర్షి : నిజమే. కాని, నీవు ఇక్కడ గమనించవలసింది ఒకటి ఉన్నది. సమాధి సమయంలో కూడా "ఇప్పుడు నేను దృశ్యమును గాంచటం లేదు. దానిని తుడిచి వేయుచున్నాను" అనే సంస్కారం ఉండనే ఉంటుంది కదా. ఈ సంస్కారము మరల సంసృతి స్మరణమునకు అనువు అయినట్టి .... ఒక అక్షయమైన బీజము అగుచున్నది. మరల మరల సంసారం ఉద్భవించటానికి ఆమాత్రం బీజం చాలు. దీనినిబట్టి మనం గ్రహించేదేమిటి? 'సవికల్పసమాధి' (నేను దృశ్యమును త్యజించివేస్తాను ... అను భావన ఉండి ఉన్నట్టి స్థితి) దృశ్యనాశనమునకు హేతువు కాగలదని మనం చెప్పలేం. మరి నిర్వికల్పసమాధి (thoughtless state) మాటేమిటంటావా? అవును. నిర్వికల్ప సమాధి లభిస్తే చైతన్యరూపమును, నిర్వాణమును కూడా పొందవచ్చు. కాని, నీ దృష్టిలో దృశ్యమున్నంతవరకు నిర్వికల్ప సమాధి సిద్ధించేదెట్లా?

అసలు 'సమాధి' అంటే ఏమిటి? ఆ సమయంలో జగత్తు యొక్క లేమిచే ఏర్పడు "నిశ్చేష్టత" వంటిదే కదా! ఒకడు గాఢంగా నిద్రిస్తున్నాడనుకో. అట్టి గాఢనిద్రలో జాగ్రత్‌కు సంబంధించిన ఏ అనుభవనం అతనికి ఉండదు. కాని, మేల్కొనిన తరువాత మరల ఇతఃపూర్వపు ప్రాపంచిక జ్ఞానమంతా వచ్చిచేరుతోంది కదా! సమాధి నుండి లేచినవాడు మరల మునుపటి విధంగానే అంతులేని దుః ఖములతో పరిపూర్ణమైయున్న జగత్తులను పొందుచునే ఉన్నాడు. మరల దుఃఖములు పొందవలసివున్నప్పుడు, ఇక క్షణిక సమత్వస్థితి (లేక సమాధి) వలన వచ్చే లాభమేమిటో చెప్పు?

"నేను నిర్వికల్పసమాధిని సంపాదిస్తాను. అది ఎన్నటికీ భంగము కాకుండా చూచు కొంటాను. ఆ విధంగా, అనంత సుషుప్తితో సమానమైన పవిత్ర బ్రహ్మపదమును పొంద వచ్చును కదా! ఈ జగత్తుతో నాకేమి పని? కాబట్టి నేను ఇప్పుడే నిష్క్రియుడను అవుతాను". అని నీవు అంటావేమో? ఇటువంటి అభిప్రాయం నీవు (వైరాగ్య ప్రకరణంలో) చెప్పావు కూడా. కాని, ఈ 'మనస్సు' అనబడే మూలదృశ్యము అంతరంగంలో ఉన్నంతవరకు, మహాయోగులు కూడా బాహ్యదృశ్యమును సంపూర్ణంగా రూపుమాపలేకపోతున్నారు. ఈ చిత్తము ఏ పదార్థములపై "పొందవలెను" అనే రూపమును గల ఆసక్తి కలిగి ఉంటుందో .... ఆయా విషయములందు జగద్భ్రమ కలిగి ఉన్నట్లే అవుతుంది. ఆ ద్రష్ట "లేదు. నేనొక పాషాణమును" అని తననుతాను భావించి ఊరుకొంటే మాత్రం ఏమి లాభం? అట్టి కల్పన నుండి తేరుకోగానే, మరల దృశ్యము ఎదురుగా ప్రత్యక్షమై నిలవనే నిలుస్తుంది. పైగా, ఇంతవరకు ఏ ఒక్క యోగియొక్క సమాధి కూడా పాషాణతుల్యమై

అనంతకాలం ఉండటంలేదు. ఇది పరిశీలకులమగు మా అనుభవం. పోనీ, పాషాణస్వరూపమైన 'స్థితి' లేక 'పరిణామం' కలిగివున్నట్టి 'నిర్వికల్ప సమాధి' అనునది ఒకటి ఉన్నదనే అనుకొందాం. అది అనంత కాలం స్థిరంగా ఉన్నప్పటికీ, ముక్తిని ప్రసాదించజాలదు. 'ముక్తి' .... అనునది శాంతము, జ్ఞానస్వరూపము, శ్రేష్ఠము, అనాది, అనంతము కదా! "పాషాణము వంటి నిర్వికల్పత్వములో ఘనీభూతమైన ఆలోచనారాహిత్య స్థితిలో అట్టి ముక్తిలేదు" .... అనేది మా అనుభవం, అభిప్రాయం కూడా.

❖

కాబట్టి రాఘవా! ఒకవేళ ఈ దృశ్యమే సత్యమై ఉంటే, ఇది ఎన్నటికీ నశించే ప్రసక్తే లేదు. "ఈ దృశ్యమును మేము తపోజపధ్యానాదుల సహాయంచేత నశింపచేస్తాం" అనునది ఎంతటి హాస్యాస్పదం! మూఢులే అట్లు భావిస్తున్నారు. లేనిది తొలగించటమేమిటి? దృశ్యము అసలేలేదు. ఒకవేళ ఉంటే .... నశించదు. మరి "దృశ్యము సంబంధము" ... అనే సంసారము తొలిగేది ఎట్లా? "దృశ్యము మిథ్య" .... అని తపోధ్యానాదులచే శుద్ధి పొందిన చిత్తమునకు సుస్పష్టమగుచున్నది. అనగా, తపోజప ధ్యానాదులు మోక్షమునకు నేరుగా కారణము కాదు. అవి చిత్తమును శుద్ధము చేయటానికి మాత్రమే ఉపకరిస్తాయి. అట్టి శుద్ధచిత్తము యొక్క సహాయంతో, "ఈ జగత్తు బ్రహ్మమే" అని సుస్పష్టముగా సందేహరహితంగా, అనుభవపూర్వకంగా తెలియవచ్చుటే మోక్షము" అని గ్రహించెదవు గాక! అనగా, "ఈ కనబడే సర్వము బ్రహ్మమే" అను అనునిత్యాభ్యాసం తపోధ్యానాదుల అంతిమ ఫలమునకు సమానమే కదా!

ఒక తామరపూవులో గింజలు (విత్తులు) తీసుకో, ... ప్రతి గింజలోను భవిష్యత్తులో మొలవబోవు తామరతీగె యొక్క లక్షణములన్నీ సంస్కారరూపంలో అణిగి ఉంటాయి కదా! అదేవిధంగా, ద్రష్టయందు కూడా దృశ్యము సూక్ష్మరూపమున (సంస్కార రూపమున) అణిగి ఉంటుంది. పదార్థములలో రుచి, నువ్వులలో నూనె, పువ్వులలో వాసన దాగి ఉంటాయి కదా! ద్రష్టయందు దృశ్యము కూడా అట్లే ఇమిడి ఉంటుంది.

కర్పూరం, ఎక్కడ ఉన్నా వాసన వెదజల్లుతూనే ఉంటుంది. 'నేను ఒక జీవుడను' అను జీవభావము వహించియున్న చిదాత్మకూడా ఎక్కడ ఉన్నప్పటికీ తన హృదయంలో దృశ్య జగత్తును పొందుచునే (గాంచుచునే) ఉంటుంది. "స్వప్నము, సంకల్పములు, మనోరాజ్యము" .... ఇవన్నీ ఎక్కడున్నాయి? ఈ జీవుని హృదయమునందే కదా! అదే విధంగా దృశ్య పదార్థములు కూడా నీ హృదయమునందే ఉన్నాయని స్వానుభవంచేత గ్రహించెదవుగాక!

ఒకానొక బాలుడు తన చిత్తము యొక్క వికల్పము చేతనే కొద్దిపాటి చీకటిలో ఒక దయ్యమును చూడటం, గజగజ వణకటం, చావటం కూడా జరుగుతోంది. ఈ దృశ్య పిశాచి ద్రష్టను కూడా అనేక శరీరప్రాప్తి .... వినాశముల రూపమున హింసించుచున్నది. ఒక గింజలో "మొలచుట" అను స్వభావం దాగివున్నది కదా! ఆ గింజ తగిన నేలను, ఋతువును పొందినప్పుడు మహావృక్షం

అవుతోంది. అట్లే "చిత్తు" (The Seer consciousness or substratum) లో రూపుదిద్దుకొని ఉన్న ఈ చిత్తమునందు 'దృశ్యజ్ఞానము' అనునది సంస్కార రూపంలో ఉంటోంది. అది దేశ-కాల పరిస్థితులను అనుసరించి వృద్ధి పొందుచున్నది. "విత్తనం" యొక్క 'మధ్య'లో చెట్టును వెలువరించగల శక్తి ఎప్పటికీ ఇమిడి ఉంటుంది. అయితే ఆ శక్తి అనువైన దేశకాలములు లభించనప్పుడు ప్రకటితం (manifest) కాకపోవచ్చు. అప్పుడు మొలకెత్తు శక్తి లోపించినట్లో త్యజించబడినట్లో అజ్ఞాన దృష్టిచే పైకి కనిపించవచ్చు. అదేవిధంగా "చిన్మాత్రశరీరి" (ఎరుకయే రూపముగా కలిగియుండి .... ఈ శరీరమును ధరించినవాడు) అయినట్టి ఈ జీవుని అంతరమున కూడా అతని స్వభావమే అయినట్టి ఈ జగత్తు సర్వకాలములందు ఉండనే ఉంటున్నది. అయితే, సమయ-భేదమును అనుసరించి సమాధికాలంలో అణగిపోయినట్లో, విడచి పోయినట్లో తోచుచున్నది. మరల వ్యుత్థాన కాలంలో వచ్చిపడుతోంది.

❖

మోక్షస్వరూపులగు జ్ఞానులదృష్టి ఎలా ఉంటుందో చెపుతాను విను.

"నేను ఈ జగత్తులో కనుపించుచున్న ఏదైనా ఒకానొక పదార్థము వంటి వాడను కాను. నన్ను బంధించగలిగినదంటూ ఏదీ ఎక్కడా లేదు. దేనికీ సంబంధించనట్టి శుద్ధ-చైతన్య స్వరూపుడనే నేను. అనంతుడనై సర్వదా, సర్వమును వెలిగించుచు, సర్వమునందు వెలుగొందుచున్నాను. ఈ జగత్తు నా స్వభావమే. నా గుణములు నేను కానట్లు, జగత్స్వరూపుడనగు నేను జగత్తుగా అగుటలేదు."

అట్టి ఉత్తమ భావనతో భావనారాహిత్యము పొందినవాడై తనను తాను అకర్తగా, అభోక్తగా, నిష్ప్రపంచకుడుగా, అద్వితీయుడుగా దర్శించుచున్నాడు. పూర్ణుడై ఉంటున్నాడు.

ఓ ప్రియరామచంద్రా! ప్రతి జీవీ పూర్ణుడే అయివున్నాడు సుమా! అయితే సంసార బద్ధుడగు జీవుడు అది మరచి ఇందు సంచరిస్తున్నాడు. "ఓయీ! జీవుడా! నీవు పూర్ణుడవేనయ్యా!" అని శాస్త్రకారులు, గురువులు గుర్తు చేయుటకు ప్రయత్నిస్తున్నారు. అంతే!

❖❖❖

II. ఆకాశజుడు - మృత్యువు*

1. కథావిభాగం

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రాఘవా! "మృత్యువు" యొక్క అన్వేషణకు సంబంధించిన ఒక కథ ఉన్నది. చెపుతాను. దీనిని వింటే ఈ ఉత్పత్తి ప్రకరణమంతా చక్కగా గ్రహించగలవు.

"ఆకాశజుడు" అనబడే ఒక బ్రహ్మవేత్త ఉండేవాడు. అతడు గొప్ప ధ్యానపరాయణుడు. ఎల్లప్పుడు ఇతరుల హితము కోరుకొంటూ ఉండేవాడు. అత్యంత ధార్మికుడు.** అతడు కాలానుగతమైన హాని – వృద్ధులు లేకుండానే జీవిస్తూ ఉండేవాడు. సృష్టిలోని ప్రతి అణువును పొట్టన పెట్టుకోగల మృత్యువు అతనిని ఏమాత్రం సమీపించలేకపోయేది. అనేకసార్లు అతనిని మ్రింగివేయాలని అభిలషించిన మృత్యువు తనకు అతడు లభించకయే పోవటం చూచి ఆశ్చర్యపడింది. ఇతః పూర్వమైనదంతా హరించివేసి, నూతనత్వమునకు 'నాంది' పలకటమే మృత్యువు యొక్క కార్యక్రమం కదా!

"నాకు నాశనం లేదు. నేను మాత్రం క్రమంగా జీవులందరిని భక్షిస్తూ వస్తున్నాను. కాని చిత్రం! ఈ ఆకాశజుడిని మాత్రం భక్షించలేకపోతున్నానేమిటి? ఇతని "ఇతః పూర్వము" ను మ్రింగివేసి ఈతనిని 'నూతనత్వం' లో ప్రవేశింప చేయలేక పోతున్నానే? కొండరాయి ముందు కత్తిలాగా ఇతనిపట్ల నా ప్రయత్నమంతా వ్యర్థమైపోతోంది. ఎందుచేత?" అని ఆలోచించ సాగింది.

అసలు విషయమేమిటో తేల్చుకోవాలని నిశ్చయించుకొన్నది.

"త్యజంత్యుద్యమముద్యుక్తా న స్వకర్మాణి కేచన" (II. 5)

సమర్థులైనవారు అనుకున్నది సాధించేవరకు ప్రయత్నం వదలరుకదా! ఆ మృత్యువు ఆకాశజుడు ఉండే పురమునకు వెళ్ళి అతని మందిరంలో ప్రవేశించింది. వెనువెంటనే 'ప్రళయాగ్ని'తో సమానమైన అగ్ని ఆ మృత్యువును దహించటం ప్రారంభించింది. ఆకాశజుడు తీవ్ర ధ్యానంలో ఉన్నాడు. అట్టి సమయంలో విఘ్నం పొందటం ఇష్టం లేక అతడే ఆ అగ్నిని అక్కడ తనచుట్టూ నియమించాడు. కాని మృత్యువు ఏదో విధంగా ఆ అగ్నిజ్వాలల వలయమును భేదించి లోన ప్రవేశించింది. ఎట్లాగైనా అతిప్రయత్నంతో అతని చేతులు పట్టుకోవాలని ప్రయత్నించింది. మృత్యువు మహాబలిశాలి అయినమాట నిజమే. కాని ఏం లాభం? ఒకడు తన "ఊహ"లో చూస్తున్న ఒక భీకరమైన ఆకారమును మనం ఈ భౌతికమైన చేతులతో తాకగలమా? అట్లే మృత్యువుకు వేలాది చేతులు ఉన్నప్పటికీ, ఎదురుగానే ఉన్న ఆ బ్రహ్మవేత్తను తాకలేకపోయింది.

---

* ఆకాశజుడు = ఆకాశము నుండి పుట్టినవాడు ; మృత్యువు = పరిణామతత్త్వము

** ఎవడైతే తన స్వధర్మమును శ్రద్ధాభక్తులతో నిర్వర్తిస్తాడో .... అట్టివాడు 'ధార్మికుడు' అని చెప్పబడతాడు.

అప్పుడు మృత్యువు ఇక చేసేదేమీ లేక, తన నిష్ఫలమైన ప్రయత్నం విరమించింది. తన యొక్క నియామకుడు, యజమాని, భగవంతుడు అగు యముని సమీపించింది. "ప్రభూ! నేను ఎందుచేత ఆ ఆకాశజుడిని భక్షించలేకపోవుచున్నాను?" అని ప్రశ్నించింది.

యముడు : ఓ మృత్యువా! నీవు ఒంటరిగా నీ బలంతో ఏ ఒక్కరినీ ఏమీ చేయలేవు. చంపలేవు. వాస్తవానికి ఆయావ్యక్తుల పురాతన (ఇతఃపూర్వపు) కర్మలే వారివారి మరణములకు కారణములు అగుచున్నాయి. నీవు ఈ ఆకాశజుని సమీపించలేక పోవటానికి కారణం బహుశా అతనికి దృష్టి అవగాహనల యందు 'కర్మలు' అనునవే లేకపోవటం అయివుండవచ్చు. మరింకే కారణం ఉండటానికి వీలులేదు. అందుచేత, అతనికి ఇంకేమైనా అంతరంగంలో సంస్కారాలు, కర్మలు మిగిలి ఉన్నాయేమో పరికించిచూడు. అట్లు వెతికినప్పుడు ఇంకేమైనా కర్మలు మిగిలి ఉంటే అప్పుడు మాత్రమే నీవు అతనిని జయించగలవు. ("ఇది నేను చూశాను : ఇది నేను చేయవలసి ఉన్నది".... అను రూపములైన ఆసక్తులు ఉన్నప్పుడు మాత్రమే జీవునియందు కర్మలు శేషించి ఉన్నట్లు. కర్తృత్వభావమే లేనిచోట కర్మలు లేనట్లే)

మృత్యువు అతని కర్మలు వెతుకుచు సర్వభూమండలమును, దిక్కులను గాలించింది. గొడ్రాలి యొక్క రెండవ కుమారుడు ఎక్కడన్నా తారసపడతాడా? ఒకని సంకల్పిత నగరంలోని భవనాలు ఆ ప్రక్కనే ఉన్నట్టి మరొకడు చూడజాలడు కదా! అదేవిధంగా మృత్యువుకు ఆ ఆకాశజుని యొక్క కర్మలంటూ ఎక్కడా ఏమీ లభ్యపడనేలేదు. తిరిగి తిరిగి విసుగుపుట్టి ఆ మృత్యువు మరల సర్వార్థకోవిదుడైనట్టి యమభగవానుని వద్దకు వెళ్ళింది.

మృత్యువు : స్వామీ! నేను అంతా వెతికాను. కాని, అతని మనో ఆకాశంలో కర్మల జాడ ఏమాత్రం కనుగొనలేకపోయాను. మీరు సర్వజ్ఞులు. సంకట-సంశయ సమయములందు సేవకులకు ప్రభువులే దోవచూపించగలరు కదా! అతని కర్మలు ఎక్కడ ఉన్నాయి? నాకు అతని మనోఆకాశంలో కర్మల జాడ కనిపించలేదే!

ధర్మ-స్వరూపుడగు యముడు చాలాసేపు సమాలోచించి, ఆ తరువాత ఇలా పలుక సాగాడు.

❖

యముడు : ఓ మృత్యువా! ఈ ఆకాశజుని విషయం నేను కూడా సుదీర్ఘంగా పరికించాను. అతనికి 'కర్మలు' అనేవే లేవు. అతడు కేవలం నిర్విషయ-ఆకాశం నుండే జన్మించాడు. ఆకాశము నుండి జన్మించినవన్నీ నిర్విషయ-నిర్మల ఆకాశ స్వరూపములే కదా! అందుచేత ఆతనియందు .... మృత్యువునకు అవకాశము కలుగజేయగలుగు, "అభిమానము-రాగము" ...లతో కూడిన కర్మలంటూ ఏమీ లేవు. ఇతని హృదయమంతా వెతికి చూచాను. ఇతనికి తన ప్రాక్తన - కర్మలలో (ఇతః పూర్వం తనచే నిర్వర్తించబడిన కర్మలలో) ఏ ఒక్కదాని పట్లకూడా "ఇది నేనే చేశాను. అహమేవకర్తా" అనునట్టి అహంకారపూర్వకమైన సంబంధం కించిత్ కూడా లేదు. అతడు తనను జన్మరహితునిగాను, నిరాకారునిగాను గాంచుచున్నాడు. 'ఆకారము' అను వికారమే లేనిచోట ఇక కర్తృత్వమెక్కడిది?

కర్మలతో సంబంధమెక్కడిది? అతని దృష్టిలో అతని ఉనికికి ఆకాశముకాక మరింకే కారణమూ లేదు. కనుక ఇక అతడు ఆకాశమే స్వరూపముగా కలిగి ఉంటున్నాడు. ఆకాశము (Absolute-Space) ఎల్లప్పుడు ఆకాశముగానే ఉంటుంది గాని, దానికి అగ్ని, వాయు, జల, భూములతో సంబంధమేమి ఉంటుంది? (There may be form or may not. But 'Space' remains as space). ఆకాశమునకు – ఒక చెట్టునకు ఏమాత్రం పదార్థపూర్వక సంబంధం లేదు. అవి ఒక దానిని మరొకటి తాకజాలవు. కనుక "ఆకాశము, చెట్టు అయి ఉంటున్నది." "ఆ ప్రదేశం ఒకప్పుడు ఒక దట్టమైన అడవి. ఇప్పుడో, అది ఒక మహాపట్టణము అయినది" .... అనునవన్నీ అసమంజసమే కాదా! అట్లే అతడు తనను నిర్వికార–నిరాకార రూపునిగా భావిస్తూ (లేక తెలుసుకొంటూ) ఉండటం చేత అతని యందు కర్మలు చోటు చేసుకోలేకపోతున్నాయి. ఇతఃపూర్వం నేను ఈ ఈ కర్మలు చేశాను" అను రూపంగల సంస్కారమే లేనందువలన, అతని చిత్తము వర్తమానమునందు అత్యంత సుస్థిరమైయున్నది. "ఇప్పుడు నేను ఈ కర్మలు చేస్తున్నాను. భవిష్యత్తులో ఈ కర్మ ప్రయోజనములో, లేక వేరువేరు కర్మలో పొందెదనుగాక" .... అను వాసన అతనియందు లేదు. అట్లు చిత్తము సుస్థిరత పొందియుండుటచే అతనిని "ప్రారబ్ధకర్మ" లేక ఇదివరకు నిర్వర్తించబడి, ఇప్పుడు దానియొక్క ప్రయోజనము ఫలించుటకు సిద్ధంగా ఉన్నట్టి కర్మ కూడా ఏమాత్రం లేదు.

ఆ విప్రుడు, "నేను ఆకాశకోసుడనై, విశదాకాశరూపుడనుగా, అనంత – విశాల – అఖండ రూపుడనుగా, స్వకారణముననే (ఎట్టి బాహ్యమైన కారణము లేకుండా) నిలచియున్న వాడను" .... అని తన స్వరూప విషయమై భావన చేస్తున్నాడు. ఈ కారణంచేత అతడు నిత్యుడు. అతనికి ఇంకొక కారణమంటూ ఏమీ లేదు. ప్రాక్తనకర్మలు లేనట్లే నూతన కర్మలేవీ అతడు అసలు చేకూర్చుకోవటం లేదు. ఇతడు "కేవలం విజ్ఞానాకాశ స్వరూపుడే" అని అనవచ్చు."నేను కర్మలు నిర్వర్తిస్తున్నప్పటికీ కర్మలతో సంబంధం లేనివాడిని"..... అని తనగురించి భావన చేసుకుంటున్నాడు.

మృత్యువు : స్వామీ! అతనియందు కర్మలయొక్క సంస్కారమే లేదు కనుక, అతనిపట్ల కర్తృత్వ–భోక్తృత్వములు నిష్ఫలమౌతున్నాయి. (లేకయేపోతున్నాయి). మీరు చెప్పిన దానిని బట్టి ఇంతవరకు గ్రహించాను. కాని, నాదొక సందేహం. మనకు ఇతనియందు ప్రాణము యొక్క, దేహేంద్రియముల యొక్క చలనము కనిపిస్తున్నాయి కదా! మరి అతడు "నేను జీవిస్తున్నాను" అను కర్మ నిర్వర్తిస్తున్నట్లే కదా!

యముడు : అతనిని ప్రాణ–దేహ–ఇంద్రియముల స్పందరూపంగా చూడటమనేది మన 'అవిద్య' యొక్క భ్రమ మాత్రమే. అతడు మాత్రం అట్టి అవిద్యకు లోబడుటలేదు. "ఇది చేస్తున్నాను. ఇది చేయటంలేదు'' .... అనునట్టి కర్మలకు సంబంధించిన బుద్ధి అతని యందు లేదు. "జీవితము–మరణము–పునర్జీవితము" అనే భ్రమను అతడు దరికి రానీయటం లేదు. "ఈ దేహ–దేహస్పందనములు నాకు సంబంధించినవి కావు. నేను నిత్యనిర్మలాకాశరూపుడను" .... అను భావనచే సకల భౌతిక భావములకు అతీతత్వము సంతరించుకొని ఉన్నాడు.

ఒక దృష్టాంతం చెపుతాను. ఒక పెద్ద 'స్తంభము' ఉన్నది. అందు ఒక పద్మము, దానిపై స్త్రీ యొక్క ఆకారం శిల్పిచే చెక్కబడినది. ఆ స్త్రీ ఆకారం పొందిన శిల, అందుగల ఒక పద్మమునకు సంబంధించి శిల, స్తంభము యొక్క శిల ఒక్కటే కదా! అజ్ఞాన దృష్టి కలవానికి "ఇది శిల యందలి స్త్రీ, ఇది పద్మము, ఇది స్తంభము" అనే భేదదృష్టి ఉంటుంది. వాస్తవానికి మొత్తమంతా శిలయేకదా!

"చిన్మయ బ్రహ్మము" నందు ఈ "ప్రపంచరచన" కూడా తన వాస్తవ తత్త్వమగు బ్రహ్మము కంటే వేరైన దానివలె అజ్ఞానదృష్టికి కనిపిస్తోంది. కాబట్టి, ప్రియమైన ఓ మృత్యువా! ఆకాశము నుండి ప్రకటితమైన ఈ ఆకాశజుని నీవు ఆకాశమునకు అభేదముగానే గ్రహించెదవు గాక! తనను తాను శుద్ధునిగా, అఖండునిగా, కర్మరహితునిగా గాంచు చున్నాడు కనుక "ఇతడు బ్రహ్మవేత్త" అని అంటున్నాం. నీటియందు ద్రవత్వము, ఆకాశము నందు శూన్యత్వము, వాయువునందు స్పందత్వము సహజమే కదా! బ్రహ్మము నందు జగదత్వము అట్టిదే. "ఒకడు తనను తాను ఎట్లు గ్రహించుచున్నాడు?" అన్నదాని ననుసరించి "ఇది జీవుడు, ఇది శివుడు" అను విధమైన పదజాలం శాస్త్రం కల్పిస్తోంది. వాస్తవానికి బ్రహ్మము కానిదెవరు? కానిదేది?

ఈ విప్రుడు పరమపదమును పొందియున్నాడు. కర్మలకు అతీతముగా తననుతాను గ్రహించు చున్నాడు. ఇతనికి సంచిత (the total culmination of past deeds) –ప్రారబ్ధ (that part of past deeds that is to manifest in the present) – ఆగామి (the culmination of past and present deeds that dates ahead to future) ఏమీ లేవు. అందుచేత సంసారమునకు వశుడవడం లేదు.

ఒక 'కారణము' నుండి ఎటువంటి సహకారి–కారణము లేకుండానే ఏదైనా ఉత్పన్న మైనప్పుడు అట్లు జనించినది – ఆ 'కారణము' కంటే – వేరైనది కావటం లేదు కదా! బంగారము నుండి లభించిన ఆభరణం బంగారమే కదా! ఇతనికి చిదాకాశ కారణము కంటే వేరేమీ కారణం లేక పోవుటచేత, ఇతడు "స్వయంభువు" అని చెప్పబడుచున్నాడు. ఓ మృత్యుదేవతా! నీవు కర్మ–స్వరూపిణివి మాత్రమే కదా! 'పూర్వాపరకర్మలు' లేని చోటును నీవెట్లా ఆక్రమించగలవు చెప్పు?

ఈ జీవుడు వాస్తవానికి సత్యసంకల్పుడు. అతడు దేనిని ఎట్లు సత్యముగా భావిస్తాడో ... అతనికి అది అట్లే అనుభవమౌతుంది. అతడు, "నేను పంచభూత వికారమగు ఈ శరీరమునే" .... అని తలచినప్పుడు ఈ పార్థివ శరీరం (material body) అగుచున్నాడు. నీవు కాలక్రమంగా అతనిని గ్రహిస్తున్నావు. అసత్యదృష్టి ఉన్నచోటే నీ ఆటలు సాగుతాయి. ఏది అసత్యమో, అది అనిశ్చలమే అవుతుంది. అది మాత్రమే కాలస్వరూపమగు నీ పాల పడుచున్నది. ఈ ఆకాశజుడు అట్టివాడు కాదు సుమా! "ఈ పృథివి – మొదలైన పంచ భూతముల వికారములతో నాకు ఎటువంటి సంబంధం ఏ క్షణమందు లేదు. నేను .... అంతటా నిత్యమై, నిత్యోదితమై వెలయుచున్న చిదాకాశమునే" .... అనునట్టి దృఢ నిశ్చయము అతడు కలిగియున్నాడు. కాబట్టి రూపహీనుడే అగుచున్నాడు. రూపరహితుడగు వానిని, నీవు చేయకలిగినదేమున్నది? ఎంత గట్టి త్రాడు అయినప్పటికీ, ఆకాశమును బంధించగలదా? లేదు కదా! కాబట్టి నీవు అతనిని ఏమీ చేయలేవు.

మృత్యువు : భగవానుడా! ఆ ఆకాశజుడు "ఆకాశము నుండి జన్మించినాడు" అని అంటున్నారు. కాని, ఆకాశము శూన్యముకదా! శూన్యము నుండి ఇతడు ఎట్లా ఉద్భవించాడు? నాకు ఇంకొక సందేహం కూడా ఉన్నది. అది కూడా చెపుతాను. ఈ భూమి మొదలైనవి ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకపోవటానికి కారణం ఏమిటి?

యముడు : మన ఈ విప్రుడు ఏ కాలమందును, జన్మించియే ఉండలేదు. ఇతడు 'జన్మ' అనునదే లేనివాడు. నిత్యుడు. విజ్ఞానస్వరూపుడు. (విజ్ఞానమే రూపముగా కలవాడు).

దృశ్య సంబంధమైన సర్వసంకల్పములు స్వస్వరూపముయొక్క నిర్దుష్టానుభవముచే మ్రింగి వేయబడగా అట్టి మహాప్రళయ సమయమందు ఇక మిగిలిఉండేదేది? కేవలము ఏక మాత్రము, శాంతము, శూన్యము, నిత్యము, ప్రకాశము, సూక్ష్మము, నిరుపాధికము, అనంతము, జరామరణాది వృత్తులు లేనిది అయిన బ్రహ్మమే కదా! అట్టి బ్రహ్మమునకు, లేక బ్రహ్మభావనకు ఇక మార్పు-చేర్పులు ఏమి ఉంటాయి? మన ఆకాశజుని స్వరూపము ఆ పరబ్రహ్మమే అయివున్నది. మార్పు-చేర్పులు లేనిచోటికి నీవు చేరలేవు. ఎందుకంటే .... మార్పు-చేర్పులే నీయొక్క రూపము కదా!

మృత్యువు : హే యమ దేవా! ఈ ఆకాశజుని జన్మవృత్తాంతమేమిటి? ఇతని స్వరూప - స్వభావములు ఎట్టివి? ఇతడు ఏమి కానున్నాడు? సర్వమార్పులకు అతీతుడైన ఇతని విషయము మరికొంత వివరించండి.

యముడు : 'పరబ్రహ్మము' అని చెప్పబడుచున్న ఒకానొకటి ఉన్నది. అది శుద్ధ చైతన్యము, అనిర్వచనీయముకూడా. జ్ఞానమాత్ర స్వభావకమగు అట్టి 'పరబ్రహ్మము' నందు "నేను దేహమును" అను రూపముతో తేజోమయమగు విరాట్ పురుషుని విశాలదేహము 'కించిత్' ఆవిర్భవిస్తోంది. అప్పుడు బ్రహ్మమునందు ఈ మిథ్యామయమగు ఆకారవికారం కాకతాళీయంగా మనబోటి బద్దదృష్టి కలవారికి గోచరిస్తోంది. అట్టి బద్దదృష్టి (Bonded Perception) లేనివారికి అన్నివేళల కూడా బ్రహ్మమే ప్రస్ఫుటమౌతోంది.

ఒకానొక దృష్టాంత సహాయంతో విషయం చెపుతాను.

"బ్రహ్మము ఆకాశమువంటిది" అని అనుకొందాం. అప్పుడు, హిరణ్యగర్భుని ఉపాధియగు అజ్ఞానము ఒకానొక విశాల జలాశయం వంటిది. జలాశయంలో ఆకాశం ప్రతిబింబించినట్లు, హిరణ్యగర్భునియందు 'బ్రహ్మము' ప్రతిబింబిస్తోంది. అనేక ఉపాధులయందు ప్రవేశిస్తూ ఇంతలోనే త్యజిస్తూ ఉండే సమష్టి మనస్సే 'హిరణ్యగర్భుడు'.

ఆ జలాశయంలో నీరు కదలుచున్నదనుకో. అప్పుడు అక్కడ ఉండి చూచేవారికి "ఆకాశమే కదులుచున్నది కదా" అని అనిపిస్తుంది. కాని "ఆకాశం ఎప్పుడూ నిశ్చలంగానే ఉంటుంది. తరంగములు కదులుచుండగా అందు ప్రతిబింబిస్తున్న ఆకాశం కదులుచున్నట్లు నా అవగాహన యొక్క దోషంచేత అనిపిస్తోంది", అనే విషయం సూక్ష్మదృష్టి గలవానికి మాత్రం తెలిసిపోతోంది.

"బ్రహ్మము ఉపాధి దోషం పొందుతోంది" అని మనకు మన అజ్ఞానం చేతనే అనిపిస్తోందని మరల గుర్తుచేస్తున్నాను.

- ఆ జలాశయంలో ప్రతిబింబించే ఆకాశమును చూస్తున్నప్పుడు, అందులో కొద్ది నీటి భాగం 'వ్యష్టి'
- మొత్తం నీరంతా కలిపిచూస్తే 'సమష్టి'
- ఈ విధంగా వ్యష్టి-సమష్టిలు రెండూ అసత్యములే
- జలాశయంలోని కొద్ది భాగంలో కనిపించే ఆకాశం, విశాలజలంలో (మొత్తం జలాశయంలో) కనిపించే ఆకాశం కూడా వాస్తవంకాదు. జలాశయంలో కనిపించే ఆకాశమంతా ప్రతిబింబమాత్రమే.
- జలాశయంలో ఆకాశానికి ప్రాప్తిస్తున్న అనేక స్పందములు వాస్తవం కాదు.
- పైనున్న ఆకాశం వాస్తవం. అది యథాతథంగా ఉండగా, తరంగముల కదలికచేత జలంలోని ప్రతిబింబం - ఆకాశం, క్రింద - మీద అగుచున్నట్లు అనిపిస్తూ ఉంటుంది.
- ఈ అనేక స్థావర-జంగమములందు గల 'మనస్సు' అను జలంలో ప్రతిబింబించే బ్రహ్మము మనయొక్క అవగాహన లోపం చేత మార్పు-చేర్పులు పొందుచున్నట్లు మన దృష్టికి అనిపిస్తోంది.

బ్రహ్మము సర్వదా నిత్యసత్యమై, శుద్ధమై, శాంతమై వెలుగొందుచున్నది.

ఈ వ్యష్టి-సమష్టిలు ఉండనీ, లేకుండనీ, బ్రహ్మమునకు వచ్చు లోపమేమీ ఉండదు. తటాకంగాని, అందలి మొత్తం జలంగాని, లేక కొద్ది జలంగాని ఉన్నా, లేకున్నా, భీకర తరంగములు పొందినా, సుడిగుండములు ఏర్పడిన ... పైనున్న ఆకాశమునకు లోటేమిటో చెప్పు?

జలాశయజలంలోని ఒక విభాగంలో ప్రకటితమగుచున్న, ప్రతిబింబిస్తున్న ఆకాశం 'వ్యష్టి' అని, మొత్తం జలంలో ప్రతిబింబిస్తున్న ఆకాశం 'సమష్టి' అని అన్నాను కదా! "సమష్టి ప్రతిబింబిత బ్రహ్మము - "విరాట్-పురుషుడు, సమష్టి-జీవుడు, హిరణ్య గర్భుడు" .... అని చెప్పబడుతోంది.

ఓ మృత్యువా! ఈ జీవుడు, పై దృష్టాంతములోని జలాశయమునకు సంబంధించని ఆకాశమువలె "నేను బ్రహ్మమునే" అనునట్టి జ్ఞానానుభవ-దృఢత్వముచే నిన్ను అధిగమించి వేస్తున్నాడు.

మన ఈ ఆకాశజుడే విరాట్పురుషుడు. ఎందుచేత?

"నేను వేలాది శరీరములోని ఒకానొక శరీరమును కాను. ఈ స్థావర జంగమాత్మకమగు సమష్టి సృష్టిని నేనే" అని భావించటం చేతనే సుమా! బిడ్డా! మనం ఇంతకు ముందు "ఈ జీవుడు సత్యసంకల్పుడు" అని అనుకొన్నాం కదా! అతడు ఏది దృఢంగా భావిస్తే అది అతనికి సత్యమై తీరుతుంది. మన మందరము ఇట్టి స్వసంకల్పములచేతనే ఈ ఈ రూపములను, క్రియలను పొందుచున్నాం. అట్లే ఈ ఆకాశజుడు కూడా. అతడే సృష్టి ప్రారంభంలో పరమాకాశము, నిర్విశేష - చిదాకాశరూపుడుగా సంస్థితుడై ఉన్నాడు. అతనికి శరీరములుగాని, కర్మలుగాని, కర్తృత్వబోధగాని, వాసనలుగాని లేవు. విశుద్ధాకాశ స్వరూపుడై, కేవలుడై, జ్ఞానఘనుడై వెలయుచున్నాడు. ఇతనికి

ప్రాక్తన వాసనలు (tendencies that devolved from the past) ఏవీ లేవు. తేజస్సుకు దీప్తి కాక మరింకే రూపములేనట్లు, ఈ ఆకాశజునికి ఆకాశము కాక మరింకే రూపము లేదు.

ఇప్పుడితని ప్రాతిభాసితరూపము మనకు కనిపిస్తోంది కదా! అందుకు కారణం అతనిలో శేషించి ఉన్నట్టి స్వల్పచిత్తవృత్తులే. అవి కూడా రహితమైనప్పుడు ఇతనికి ఈ ప్రాతిభాసిత రూపము (Reflective appearence) కూడా ఉండదు. 'నేను చిదాకాశమే' అని గ్రహించినప్పుడు ఈ బహిర్ముఖ చిత్తవృత్తులు కూడా నశించిపోతాయి. కాబట్టి ఓ మృత్యువా! ఇతనికి 'ఘన-ద్రవ-వాయు' మొదలైన వాటితో సంబంధం లేదు. ఇతనిని నిగ్రహించాలని నీవు చేసే ప్రయత్నం వ్యర్థమైనదే. ఆకాశమును ఎవరైనా మ్రింగగలరా?

ఈ మాటలు విన్న మృత్యువు ఆశ్చర్యపడింది. ప్రభువగు యమధర్మరాజు వద్ద సెలవు తీసుకొని తన నివాసస్థానమునకు వెళ్ళిపోయింది.

❖❖❖

2. స్వయంభువు

శ్రీరాముడు కొంచెంసేపు మౌనం వహించాడు. వసిష్ఠమహర్షి చెప్పిన ఆకాశజ – మృత్యు – యమదేవుల కథ కొద్ది క్షణాలు మననం చేశాడు. పరిశీలనాత్మకంగా దర్శించి ఇట్లు పలుకసాగాడు.

శ్రీరాముడు : మీరు చెప్పిన ఆకాశజుని వృత్తాంతం, యమ-మృత్యువుల సంభాషణ విన్నాను. మీరీ కథ ఏదో గూఢార్థంతో చెప్పారని నాకు అనిపించింది.

మీరు చెప్పిన 'ఆకాశజుడు' అనగా లోకపితామహుడైన బ్రహ్మదేవుడే కదా! అతడే హిరణ్య గర్భుడు, స్వయంభువు, అద్వితీయుడు, జీవసమష్టిరూపుడు ... అని కూడా చెప్పబడ్డాడు. వివిధ రీతులైన భావాభావములకు అనుసంధానకర్తయే ఆ ఆకాశజుడు. మీరు చెప్పిన దానిని బట్టి ఈ జగత్తు మిథ్యయే అయివున్నది.

శ్రీ వసిష్ఠమహర్షి : అవును. నీకు బ్రహ్మదేవుని గురించే చెప్పాను. ఒకప్పుడు ఒకానొక మన్వంతరంలో మృత్యువు జీవులందరిని భక్షించి, బ్రహ్మను కూడా ఆక్రమించాలని అనుకొన్నది. అప్పుడు మనం చెప్పుకొన్న విధంగా యముడు బోధించటం జరిగింది. ఎవడు ఏ పని చేయాలనుకొంటాడో .... అతడికి ఆ విషయంలో సహజమైన ప్రవృత్తి ఉంటుంది కదా! అందుచేత మృత్యువు బ్రహ్మదేవుని భక్షించాలని ప్రయత్నించింది. అయితే బ్రహ్మ ఆకాశ-శరీరి మాత్రమే కదా! మృత్యువు అతనిని ఎట్లా ఆక్రమిస్తుంది?

"నేను మనోమాత్రుడను. పృథివి మొదలైన ఆకారాదులు లేనట్టి సంకల్పమాత్రుడను. చిదాకాశరూపుడను" అని ఎవడైతే సుస్థిరంగా భావిస్తాడో .... అతడు చిదాకాశమే అగుచున్నాడు.✵ అట్టివాడు కారణహీనుడు. 'ఉత్పత్తి' అనునదే లేనివాడు. అట్టివానిని మార్పు-చేర్పులు తాకజాలవు.

✵ చిదాకాశము : చిత్ = ఎరుక, ఆకాశము = ప్రసరణము

బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి : బ్రహ్మమును ఎరిగినవాడు బ్రహ్మమే అగుచున్నాడు.

మనస్సుచే సంకల్పించబడినప్పుడు ఆ మనస్సులోనే వస్తువులు, పురుషులు అగుపిస్తారు కదా! ఈ పంచభూతములతో సంబంధం లేనివాడు, స్వయంభువు అగు బ్రహ్మ కూడా 'ఆకాశజుడు' అనే రూపంలో పరిమిత దృష్టి గలవారికి గోచరిస్తున్నాడు. నిర్మలాకాశంలో సంకల్పబలం చేత ఒకనికి ముత్యాలు ఉన్నట్లు తోస్తుంది. స్వప్నం, స్వసంకల్పము ప్రవర్తిస్తున్నప్పుడు కల్పిత నగరం కనబడటం అందరికీ అనుభవమగుచున్న విషయమే. ఈ 'స్వయంభువు' కూడా అట్లే శరీరములతో అగుపడటం జరుగుతోంది. ఇతడు కేవలం పరమాత్మయే. అందుచేత అతని యందు దృశ్యత్వము గాని, ద్రష్టత్వము గాని లేవు.

❖

సంకల్పము లేక భావించటం మనస్సు యొక్క రూపము. శుద్ధమనస్సే బ్రహ్మము. అనగా మనోభావాలు ధరిస్తున్న చైతన్యమునకు నామరూపాలు లేకపోయినప్పటికీ, గుర్తుకోసం 'బ్రహ్మము' అను పేరు పెట్టబడింది. అట్టి శుద్ధ-మనోమయాకాశంలో ఈ పృథివి మొదలైన వస్తుజాలం లేదు. ఒక చిత్రకారుడు ఒకానొక సుందరమైన ప్రకృతి దృశ్యం చిత్రించాలను కొన్నాడనుకో .... ఇప్పుడు అతని మనస్సులో దేహరహితమైన ఆ 'ప్రకృతి దృశ్యం' రూపుదిద్దుకొంటుంది కదా! ఈ బ్రహ్మదేవుని చిదాకాశమునందు ప్రతిబింబము గ్రహించు స్వభావము గల శుద్ధమయినట్టి మనస్సుయొక్క స్వరూపము ఉదయించి ప్రకాశిస్తోంది.

కాబట్టి రాఘవా! 'బ్రహ్మము' అనునది వేరే ఏదో ఎక్కడో ఉన్నది కాదు. అది ఆదిమధ్యాంత రహితము. కేవలము, స్వస్వరూపము అయినట్టి చిదాకాశమే అయ్యది. అద్దానిని సృష్టించునది అంటూ ఇంకేమీ ఉండదు. అది సంకల్పించుటచేతనే సర్వము సృష్టించ బడుతోంది. స్వయముగా, సంకల్పరూపంచే ప్రదర్శితమగుచుండుటచే అద్దానిని 'స్వయంభువు' అని అంటున్నాం.

ఈ మనస్సు ఆకార రహితము అయినప్పటికీ చిత్తము వలన, ఆకారయుతముగా ప్రకాశించు చున్నది. వంధ్యాపుత్రునివలె (గొడ్రాలి కుమారునివలె) దానికి వాస్తవానికి శరీరాదులు లేవు.

❖❖❖

3. స్మృతి - మనస్సు - బంధము

శ్రీరాముడు : ఓ బ్రహ్మజ్ఞా! మీరు మనస్సును శుద్ధమని అంటున్నారు. "పృథివి మొదలైన భూతజాలమునకు ఏమాత్రం సంబంధించనిది" అని వర్ణిస్తున్నారు. ఈ మనస్సే బ్రహ్మమని కూడా చెప్పుచున్నారు. ఇంతవరకు ఈ విషయాలు నేను ఒప్పుకొంటున్నాను. అయితే, ఇక్కడ ఒక సందేహం. మీరుగాని, నేనుగాని, ఈ సభికులుగాని ఈ వర్తమాన శరీరములను ధరించుటకు ఇతఃపూర్వపు స్మృతియే కారణమైయున్నది కదా! అదే విధంగా ఆత్మకు ప్రప్రథమ సృష్టి సంకల్పుడగు బ్రహ్మదేవునికి కూడా ఇతఃపూర్వపు స్మృతే కారణమని ఎందుకు అనకూడదు? అతడు కారణరహితుడని, 'స్వయంభువు' అని ఎందుకు అనాలి?

శ్రీ వసిష్ఠమహర్షి : పూర్వకర్మలతో కూడి ఉన్నప్పుడు "సంస్కారము" అనేది ఉంటుంది. అట్టి సంస్కారమునే "లింగదేహము" అని కూడా అంటున్నాం. "ఇతఃపూర్వపు స్మృతి"యే ఆ తదుపరి శరీరము దాల్చుటకు కారణమగుచున్నదనునది వాస్తవమే.

అయితే ఆకాశజునకు ప్రాక్తన కర్మలే లేవు. ఇక ఇతఃపూర్వపు స్మృతి ఎట్లా ఉంటుంది? స్మృతియే లేకపోతే జన్మకు ఏది కారణమౌతుంది? అందుచేత "అతని రూపం దానంతట అదే ఉత్పన్నమైనది" అని చెప్పటానికి "స్వయంభువు" అని చెప్పుచున్నారు. లేదా "చిత్తరూపమగు మనస్సే అతని శరీరమునకు కారణం" అనికూడా అనవచ్చు. అట్టి మనస్సు అనబడు చిత్పదార్థమునుండి అతడు భిన్నుడు కాడు. ఎందుచేత? "నేను చిత్పదార్థమునే" అనునట్టి నిత్యోదితమైన ఎరుకవలననే. ఇతని దేహము ఈ కనబడే కాళ్ళు, చేతులు, తల కాదు. అతని వాస్తవ దేహము 'అతివాహికము' లేక 'సూక్ష్మదేహము' అయివున్నది. జన్మరహితమగు అతనికి సామాన్యమైన పంచభూతములతో ఏమాత్రం సంబంధం లేదు. అతని వాస్తవ స్వరూపం పంచభూతములతో నిర్మించబడినది కాదు. "నేను పంచభూతనిర్మితమైన ఈ శరీరమును. ఇది శిథిలమగునప్పుడు నేను చచ్చుచున్నాను. రహితమగుచున్నాను." అని ఎవరైతే తలుస్తారో వారికి మాత్రమే జన్మ–మృత్యువులు, త్రిలోకములు ఉంటాయి. ఆ బ్రహ్మదేవునికి అట్టి భావము లేదు.

❖

శ్రీరాముడు : మహర్షీ! ప్రతి ప్రాణికి ఈ స్థూలదేహము – సూక్ష్మదేహము (లింగ శరీరం / అతివాహిక శరీరం) (Gross body & Subtle body) అనేవి రెండు ఉంటాయి కదా! మరి బ్రహ్మదేవునికి అతివాహిక శరీరం మాత్రమే ఉండటానికి కారణమేమిటి?


శ్రీ వసిష్ఠమహర్షి : "పంచభూతములపట్లగల ఆసక్తి" అను కారణముతో కూడుకొనియున్న ప్రాణులందరికీ నీవు చెప్పినట్లు రెండు దేహాలు ఉంటాయి. కాని జన్మరహితుడగు బ్రహ్మకు కారణమంటూ ఏదీ లేదు. అందుచేత ఒక్క సూక్ష్మ శరీరం మాత్రమే ఉన్నది. జన్మ రహితుడగు ఆ బ్రహ్మయే భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశము.... అనబడు పంచభూతములకు పరమకారణము. అతనికి ఇంకొక కారణం లేకపోవటం చేత అతివాహిక శరీరమొక్కటే ఉన్నది. (He is beyond all causes. And all causes exist because of him)

❖

విషయరహితమగు ఆత్మనుండి ప్రప్రథమంగా నిశ్చల జలములో ఉత్పన్నమగు కెరటంలాగా "భావనచేయుట" అను స్వభావముతో కూడిన కర్తృత్వము ప్రకటితమౌతోంది. శాస్త్రములు ఆ తత్వమును 'ప్రజాపతి' అని పిలుస్తున్నాయి. సృష్టిలో ప్రప్రథముడగు ఈ ప్రజాపతికి భౌతిక శరీరం లేదు. ఇతడు అతివాహిక (లేక సూక్ష్మ) శరీర మాత్రుడగుటచే చిదాకాశ స్వభావమున స్వయంగా ప్రకాశించుచున్నాడు. అతడు "సంకల్పించుట" అనునదే రూపముగా కలిగియున్నాడు. ఈ పృథివి మొదలైన భూతముల క్రమసంబంధం అతనికి లేదు. ప్రథముడగు ఈ ప్రజాపతియే

ఆకాశ శరీరము దాల్చి ప్రజాసమూహమును సృష్టించు చున్నాడు.

చిదాకాశము చిత్తాకాశము స్థూలాకాశము



1. ప్రతివానియందు 'స్థూలదేహము - లింగదేహము' అనునవి ఉంటున్నాయి.
2. లింగదేహమును అనుసరించి స్థూలదేహం ఉంటోంది.
3. లింగదేహము సర్వకారణమగు 'చిదాకాశము' లేక 'శుద్ధ-చైతన్యము'ను ఆశ్రయించి ఉంటోంది.
4. చిదాకాశము కారణరహితము. చిదాకాశమే స్థూల-సూక్ష్మములకు కారణము, కర్త కూడా. కనుక అదియే 'కారణ-కారణం' అని పిలువబడుతోంది.
5. మృత్యువు అనబడునది స్థూలదేహమునకు సంబంధించినది మాత్రమే. సూక్ష్మ - కారణములను అది తాకజాలదు.

❖

ఓ రామచంద్రా! ప్రజాపతి ఆకాశ-శరీరమును దాల్చి ప్రజాసమూహం సృష్టిస్తున్నాడనుకొన్నాం కదా! ఈ ప్రజలందరు కూడా ఆకాశస్వరూపులే. ఎందుకంటావా? ఒక వస్తువు నుండి ..... ఏ బాహ్యమైన కారణము లేకుండా .... బయల్వెడలిన మరొక వస్తువు మొదటి వస్తువుకు అభిన్నమైనదే కదా! కాబట్టి 'పరమబోధ' స్వరూపుడైన పురుషుడు (జీవుడు) భ్రాంతిచేత చిత్తమాత్రుని వలె అగుపించవచ్చు. అయినప్పటికీ వాస్తవానికి ఇతడు చైతన్యస్వరూపుడే. అంతేగాని పాంచభౌతికస్వరూపుడుగా మారడు.

సంసారమున చరించుచున్న జీవులందరికి సూక్ష్మశరీరముతో కూడిన చిదాత్మయే కారణం. అహంకారం దానినుండే జన్మిస్తోంది. కనుక, 'నీవు-నేను' .... అనునదంతా అద్దాని రూపమే. వాయువునందు 'స్పందము' లేక చలనము కలుగుటచే "వాయువీచికలు" ఏర్పడుచున్నాయి కదా! ఆ వాయువీచికలన్నీ మొట్టమొదటిదయినట్టి వాయువు కంటే వేరు ఎట్లా అవుతాయి? మొదటి కదలిక (చలనము) అయినట్టి బ్రహ్మదేవుని నుండి అట్టివారేయగు ప్రజలు విస్తరిల్లుచున్నారు.

ఈ జీవసమూహమంతా పరమార్థ చిన్మాత్రకారుడగు 'బ్రహ్మ' నుండే జన్మిస్తోంది. కాబట్టి ఇదంతా చిన్మాత్రాకారమే. కాని, దర్శించువాని యొక్క సంకల్ప-దృఢత్వంచేత జడాకారముగా

ప్రకాశించుచున్నది. భౌతికమైన దృష్టికి ప్రాప్తించే ఆకారాదులే సత్యమని, వాస్తవమని సంసారదృష్టిగల జీవుడు భావిస్తున్నాడు. కనుక, ఇక్కడ 'దృష్టి' పవిత్రమైతే సర్వమూ సర్వదా బ్రహ్మమే!

❖

"అసద్వస్తువు సత్యమువలె క్రియ నిర్వర్తించుట" అనునది సుస్పష్టమవటానికి నీకొక దృష్టాంతము చెపుతాను. "ఒకడు ఒక స్వప్నం పొందాడు. ఆ స్వప్నంలో అత్యంత సుందరియైన స్త్రీ తారసపడింది. ఆమెను ఆతడు ఆలింగనం చేసుకొన్నాడు." .... అనే విషయం తీసుకొందాం. వాస్తవానికి అది సత్యమైన అనుభవమా? కాదు. ఎందుకంటే ఆ స్త్రీ ఊహామాత్రమే కదా! కాని, ఆ వ్యక్తి ధాతుక్షయానుభవం పొందుతాడు. ఈ జగత్తులో కనిపించే పదార్థముల సంస్పర్శ-అనుభవం కూడా అట్టివే. పంచమహా భూతత్వమంతటికీ ఈశ్వరుడు, నిరాకారుడు అయిన స్వయంభువే. అతడు దేహాదులు లేనివాడు. కాని "దేహి" వలె ప్రకాశిస్తున్నాడు. సంకల్పరూపి, స్వస్థుడు అయినట్టి స్వయంభువు ఉదయించినట్లు అగుపడటం కేవలం భ్రాంతివలననే సుమా! పారమార్థిక దృష్టితో చూస్తే అతడు ఉదయించుటయే లేదు. 'పృథివి' మొదలైన వాటితో సంబంధంలేనట్టి చిత్తమాత్రశరీరుడు, సంకల్పపురుషుడు అయిన బ్రహ్మ ముల్లోకముల స్థితికి కారణమగుచున్నాడు.

❖

మరొక ముఖ్యమైన విషయం. ప్రాణుల కర్మలను అనుసరించే సంకల్పములు రూపుదిద్దుకుంటున్నాయి. ఆకాశాత్ముడగు స్వయంభువు ఏఏ రూపములను భావిస్తున్నాడో ఆయారూపములనే ఈ కనబడే ప్రాణుల రూపముగా దాల్చుచున్నాడు. అంతేగాని, 'ఇతని రూపము ఇదే' ... అనునట్టి పరిమిత రూపమంటూ అతనికి ఏదీ లేదు. ఒకానొక పర్వతమును నీవు చూచావనుకో, నీవు దానిని ఎట్లు తలుస్తావో.... అది ఆ రూపముననే నీ చిత్తవృత్తిలో ప్రతిఫలిస్తోంది కదా! ఈ కొండ శిలామయము – ఇది పర్వత దేవుడు – ఇది వృక్ష, జంతువులకు ఆలవాలమైన ఒక ప్రదేశము – ఇది నిరుపయోగమైన స్థలము – ఇది ఒక గోపురము వంటిది – ఒక మునీశ్వర స్వరూపం..... మనస్సును అనుసరించే ఇదంతా రూపుదిద్దుకొంటోంది.

అది నీవు ఎట్లా తలస్తే ... నీ చిత్తంలో అది అట్లే ప్రతిఫలిస్తోంది. అదేవిధంగా ఈ జీవులు కూడా తమ అంతరమునందలి నిరాకారత్వమును మరచి పిశాచంలాగా పాంచభౌతిక శరీరమున ప్రకాశిస్తున్నారు. "నేను ఈ శరీరమునకు పరిమితమైనవాడను ...." అను దృఢమైన భావనను ఆశ్రయించటం జరుగుతోంది.

మాయతో కూడిన ఈ లోకములను సృజించుచున్న మూలకారణం సూక్ష్మభూతాత్మకమే. అట్టి సూక్ష్మభూతాత్మకము (లింగ శరీరము) యొక్క సంకల్పబలం చేతనే ప్రత్యక్ష జగత్తు ఆవిర్భవిస్తోంది. లింగదేహము (మనస్సు) వాస్తవానికి తమోరహితమైన సంవిత్స్వరూపమే. అందుచేతనే అది ఏ సమయమందు కూడా తన అతివాహిక (సూక్ష్మతత్వ) భావమును కోల్పోవుటలేదు. అట్లు కోల్పోకుండానే ఈ స్థూలత్వం అనుభవించటం జరుగుతోంది. మొట్టమొదటే పాంచభౌతిక శరీరం

ఉత్పన్నం కావటం లేదు సుమా! సూక్ష్మదేహం క్రమంగా స్థూలత్వం పొందగా ఈ పాంచభౌతికానుభవం సిద్ధిస్తోంది. దేహికి దేహము ఐహిక మోహము. కాబట్టి, భ్రమ దాయకమైన ఈ స్థూలదేహం తనకు కారణమైనట్టి సూక్ష్మదేహమును బాధించుటయేమిటి? అట్లు శరీరము మనస్సును బాధింపచేయుట .... అనునది అజ్ఞానం వలననే సిద్ధిస్తోంది.

కనుక ఓ రఘురామా! సృష్టికర్త బ్రహ్మదేవుడు మనోమయుడు మాత్రమే. అతడు శరీరాది ఆకారములు కలవాడు కాదు. దీనిని అనుసరించి, "ఈ విశ్వము మనోమయము మాత్రమే. ఇది పంచభూత సంబంధమాత్రమైనది కాదు" .... అని గ్రహించు. కార్యము తనకు కారణమైనదానికంటే వేరైనది ఎట్లా అవుతుంది?

జన్మరహితుడైన బ్రహ్మకు ఎట్లా సహకారి కారణాలు లేవో, అదేవిధంగా బ్రహ్మ నుండి జనించిన ఈ జగత్తుకు కూడా ఎట్టి సహకారి కారణాలు లేవు. కార్య-కారణములకు భేదం ఉండదని, కారణము ఎట్టిదో, కార్యము అట్టిదేనని అనుకున్నాం కదా! కనుక పరబ్రహ్మము ఎట్టిదో, ఈ త్రిజగత్తులు (దేవ-మర్త్య-పాతాళలోకములు - జాగృతి - స్వప్న - సుషుప్తులు - స్థూల - సూక్ష్మ - కారణములు) అట్టివేనను విషయంలో ఏమాత్రం సందేహం లేదు. నీరు నుండి ద్రవత్వం వేరా? అగ్నికంటే ఉష్ణత్వం వేరైనది కాదు కదా! బ్రహ్మ మనోభావములను పొందినవాడై ఈ జగత్తులను సృష్టించుచున్నాడు. బ్రహ్మ విశుద్ధ తత్త్వమే కదా! జగత్తు కూడా విశుద్ధతత్త్వముకంటే వేరేమీ అయివుండ లేదు. అవబోవుటలేదు.

❖

మిథ్యాభావన : ఈ మనస్సే సంకల్ప-పూర్వకంగా, గంధర్వనగరంలా, 'మిథ్య' అయినట్టి ఈ విశాల ప్రపంచమును కల్పించుచున్నది. ఇక్కడ 'మిథ్య' అంటే ఏమిటి? "ఈ జగత్తు బ్రహ్మము కంటే వేరు" .... అనే భావనే మిథ్య అని విజ్ఞుల అభిప్రాయం. ఒకడు చీకటిలో త్రాడును చూచి 'పాము' అని భ్రమించినాడనుకో. "ఆతడు భయముతో వణుకుచున్నాడు కదా! కనుక అది పామే అయివుంటుంది".... అని అనటం ఎంతవరకు సమంజసం? వాస్తవానికి "భూతత్వము" (Phenomenal Existence) అనునది ఈ జగత్తునందు లేదు. "సంకల్పత్వము" (Will or Volition) మాత్రమే ఉన్నది. అయితే ఈ సంకల్పత్వము ఎవరికి ఉంటుంది? అల్పజ్ఞులకే కదా! బ్రహ్మదేవుడు మొదలైనవారు తత్త్వజ్ఞులు కదా! వారియందు ఈ భూతత్వము ఎట్లా ఉంటుంది? తత్త్వజ్ఞులైనవారి దృష్టికి అతివాహికశరీరమే (మనోరూపమే) ఉండదు. ఇక భౌతిక దేహమెక్కడిది?

ఈ జగత్తు "మనస్సు" అనుదానియొక్క భావనయే అయివున్నది. అనగా జీవునియొక్క మనోరాజ్యమాత్రమే ఇదంతా! మనోరాజ్యము వంటి ఈ జగద్దృశ్యము ప్రాప్తిస్తోంది. 'మూఢత్వము' అంటే ఏమిటి? తన వాస్తవ స్వరూప-స్వభావములను మరచిన ఈ జీవుడు ఇంద్రియానుభవములతో తాదాత్మ్యము పొందుచూ భ్రమనే వాస్తవమన్నట్లుగా అనుభవించుటయే. అట్టి అనుభవమునే 'జగత్తు' అని అంటున్నాం. మనస్సే 'విరించి' లేక బ్రహ్మ యొక్క శరీరం. ఇక మనస్సు అంటే

ఏమిటి? సంకల్పమాత్రమే కదా! సంకల్పాత్మకమనోరూపియగు ప్రప్రథమ తత్త్వమే నిజశరీరమును (అనగా సంకల్పములను) విస్తరించి ఇట్లు ఈ జగత్తును సృష్టించుచున్నది.

❖

బ్రహ్మయొక్క రూపము, శరీరము కూడా మనస్సే. అందు 'పృథివి' మొదలైన పంచ భూతములు లేవు. "అట్లే ప్రతిప్రాణియొక్క మనస్సు విషయం కూడా" అని గ్రహించబడుగాక! కాని, మనస్సు చేతనే పృథివి మొదలైన పంచభూతములు కల్పించ బడుచున్నాయి. ఒక చిన్న కలువ విత్తులో, కలువ పుష్పము లక్షణములన్నీ ఇమిడి ఉన్నాయి కదా! అదే విధంగా మనస్సునందే ఈ దృశ్యమునకు సంబంధించిన సమాచారమంతా ఇమిడి ఉన్నది. మనస్సు-దృశ్యము వేరువేరని ఎవరైనా అనగలరా? మనస్సు ఉండటంచేతనే దృశ్యమగుపడుచున్నది. మనస్సు లేకపోతే, దృశ్యము కూడా లయించి పోతుంది. ఒకడు స్వప్నములోను, మనోవీథిలోను, వస్తుజాలము చూస్తున్నాడు. ఆ వస్తుజాలమంతా ఉన్నదెక్కడ? హృదయమునందే కదా! అదే విధంగా ఎదురుగా కనబడుచున్న ఈ దృశ్యమంతా ఒకడు తన హృదయమునందే గాంచుచున్నాడు. కాని, బాహ్యమున కాదని, సూక్ష్మబుద్ధితో గ్రహించెదవుగాక! బాలుడు తన చిత్తమున కల్పించబడిన పిశాచము చేతనే భయకంపితుడగుట చూస్తూ ఉంటాము. ఈ దృశ్య పిశాచము కూడా అజ్ఞానబుద్ధులగు మనుజులను పీడించి పీల్చి పిప్పిచేయుచున్నది.

ఒక బీజములో ఇమిడియున్న అంకురము, తగిన దేశ-కాలములు ప్రాప్తించినప్పుడు ఒక పెద్ద మహావృక్షమగుచున్నది. మనస్సులో ఇమిడివున్న ఈ దృశ్యము కూడా తగిన దేశకాలములు లభించినపుడు సంకల్ప రూపమున ప్రకాశిస్తోంది.

ఓ రామచంద్రా! ఒకవేళ ఈ దృశ్యము వాస్తవమే అయివుంటే, ఇక ఇది రూపుమాసే ప్రసక్తి ఎక్కడుంటుంది? అపుడు దుఃఖశాంతి చేకూరే వ్యవహారమే ఉండదు. జీవుని దృష్టిలో దృశ్యము ఉపశమించనంతకాలము ఆనందమయమగు కైవల్యము పొందే అవకాశమే లేదు. దృశ్యత్వము తొలగినపుడు ఈ జీవునకు ద్రష్టత్వము కూడ ఉండదు కదా! అపుడు శేషించేదేమిటి? "కేవలత్వం" అని ఈ స్థితిని విజ్ఞులు పిలుస్తున్నారు. అట్టి "కేవలత్వమే" మోక్షము అని చెప్పబడినది.

❖

శాంతి మంత్రాలు ఉచ్చరించబడిన తరువాత సభ చాలించబడింది.

❖❖❖

(రెండవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

మూడవ రోజు

4. మనస్సు - దృశ్యము

శ్రీరాముడు : ఓ భగవానుడా! వసిష్ఠ మహర్షీ! మీరు నిన్న రెండవ రోజు బోధించిన దానిని బట్టి "ఈ జగత్తు అంతా మనస్సు నుండే వెలువడి ప్రకాశిస్తోంది" .... అనే విషయం సుస్పష్టమౌతోంది. అయితే ఈ మనస్సు యొక్క రూపమేమిటి? ఎక్కడ, ఎందుచేత, ఎట్లు ఉంటోంది? మాకు వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఆకాశము అని మనం పిలుస్తున్నది దేనిని? అక్కడ శూన్యత్వము కాకుండా మరింకేదైనా ఉన్నదా? నీలపు రంగుగల ఏదైనా పదార్థమున్నదా? లేదే! అదే విధంగా శూన్యాకాశాత్మకమైన మనస్సుకు కూడా వేరే రూపం అంటూ ఏదీ లేదు. దాని వెలుపల గాని, లోపలగాని ఏదీ కానరాకుండానే ఉన్నది. అయినప్పటికీ, ఆకాశమువలె సర్వత్రా వెలయుచునే ఉన్నది. 'మృగతృష్ణ' యందు నీరు యొక్క అనుభవంలాగా, మనస్సు నుండి ఈ జగత్తు యొక్క అనుభవం ప్రాప్తిస్తోందనుమాట నిజమే. ఒకడు తన 'స్వసంకల్పము' చేతనే మనోదృశ్యం చూస్తున్నట్లుగా .... ఈ మనస్సు యొక్క రూపకల్పన కూడా భ్రమపూర్ణమే. శూన్యమైన ఈ మనస్సును నిర్వచించటమెట్లా చెప్పు? నీ బోధ కొరకు ఒక నిర్వచనం చెపుతాను. విను.

"సత్+అసత్ (వాస్తవ-అవాస్తవ) వస్తువులను ప్రకాశింపచేసేదే మనస్సు" .... అని చెప్పవచ్చు.

ఇంతకుమించి దానికి వేరే ఆకృతి లేదు. నిరాకారమైన చిత్తు (Absolute & Formless Consciousness) అర్ధాకారముగా అధ్యవసితమైనప్పుడు (taking half - form) 'మనస్సు' అంటున్నాం. అనగా మనస్సు చిత్తు కన్నా వేరైనది కాదు. 'మట్టి' నిరాకారం కదా! 'మట్టిగడ్డ' అనునది ఆకారము కలిగి 'మట్టి' కంటే వేరు కాకుండానే ఉన్నది కదా.

సంకల్పించువాడు - సంకల్పములు : సంకల్పమే మనస్సు యొక్క రూపము. సంకల్పము అనుదాని కంటే ముందే సంకల్పించు వాడు ఉన్నాడుకదా! సర్వమునకూ ముందేగల శుద్ధత్వము 'చిత్తు' అని, ఆ చిత్తు సంకల్పిస్తున్నప్పుడు 'మనస్సు' అని చెప్పబడుతోంది. అయితే నీటి నుండి ద్రవత్వము వేరా? వాయువునుండి వాయుచలనము వేరైనదిగా చెప్పగలమా? ఎక్కడ సంకల్పముంటే అక్కడ మనస్సు ఉంటుంది. ఈ రెండు వేరువేరుగా ఎక్కడా ఎవ్వరూ అనుభవించియుండలేదు.

వస్తు జాలమును, విషయములను 'ఎరుక' రూపమున అనుభవరూపమున ప్రకాశింప జేయునదే మనస్సు. "అట్లు - ప్రకాశింపజేయబడునది సత్యమైనదా? అసత్యమైనదా? అల్పకాలికమా?; అధికకాలికమా?" .... అనేది వేరే విషయం. మనస్సు దేనిని ఎట్లు సంకల్పిస్తుందో, దానిని అది అట్టి అనుభవంగానే పొందుతూ ఉంటుంది. అట్టి మనోభావముతో కూడుకొనిన శుద్ధ చైతన్యమే పితామహుడగు 'బ్రహ్మదేవుడు'. అతడే - "ఆధిభౌతిక బుద్ధి" (ఇది పదార్థజాలము ... అని గుర్తించుతత్త్వము)ను సృష్టించుచున్నాడు. నాయనా! రామా! ఉత్తములగువారు మనస్సున

ప్రాప్తిస్తున్న ఈ దృశ్యప్రపంచమునకు .... "అవిద్య, సంసృతి, చిత్తము, మనస్సు, బంధము, మలము, తమస్సు" ... అనునవి మారుపేర్లేనని గ్రహించి ఉంటున్నారు.

మననము చేయు స్వభావమే మనస్సు : ఈ దృశ్యప్రపంచము కాకుండా మనస్సునకు వేరే రూపమే లేదు. మనస్సు సంకల్పించ బడినప్పుడు ఉంటోంది. అందుచేత "అది ఇప్పుడు ఇట్లు ఉత్పత్తి అయినది" అని మనం నిర్దేశించలేం. అట్లే "ఈ దృశ్యమునకు కూడా వాస్తవానికి 'ఉత్పత్తి' అనునదే లేదు" ... అని చెప్పబడుతోంది. నిన్న చెప్పిన దృష్టాంతమే చెపుతాను. విను. తామరపువ్వు యొక్క బీజంలో ఆ పువ్వుయొక్క సూక్ష్మభావమంతా సంస్కారరూపంలో ఇమిడి ఉన్నది కదా? అట్లే చిత్-పరమాణువునందే ఈ జగత్తు అంతా సంస్కార రూపమున ఇమిడియున్నది. అనగా ద్రష్టయందే దృశ్యత్వము ఇమిడివున్నదని గ్రహించు. అయితే, ఒక చమత్కారం. బంగారమునకు ఆభరణత్వం ఉన్నదా? లేదు. కాని ఆభరణము బంగారము కంటే వేరు కాదు కదా! ఎండమావులలో జలమెక్కడ? కాని జలము యొక్క ఆకారమేకదా .... ఎండమావులలో స్ఫురించేది? స్వప్నపురంలో కనబడే గోడలకు పునాది ఉన్నదా? అదేవిధంగా ద్రష్టయందుగల ఈ దృశ్యత్వబుద్ధి కూడా భ్రమత్మాకమే. కార్యమునకు కారణము కంటే వేరైన 'సత్త' లేదు. అదేవిధంగా ..." ఈ దృశ్యము యొక్క ఉనికికి కారణం? "నీవు దీనిని ఈ రీతిగా దర్శించుటయే సుమా!" అనునదే సమాధానమగుచున్నది. ఇయ్యది నీకంటే వేరు కాదు. అనగా నీ మనస్సు నీకంటే వేరుకాదు. మనస్సు ఉన్నది నీయందే. నీ స్వరూపము చేతనే అది తయారగుచున్నది. స్వతత్త్వమే మనస్సు యొక్క మూలపదార్థం.

ఈ దృశ్యములన్నీ ద్రష్టయందే ఉన్నాయనేది పరిశీలించి చూచి గ్రహించినప్పుడు నీకే అవగతం కాగలదు. ఈ విషయం సుస్పష్టపడటానికే నీ చిత్తదర్పణమున ఉన్న మాలిన్యమును ఈ బోధచే తొలగించే ప్రయత్నం చేస్తున్నాను. చిత్తమాలిన్యము చేతనే ఒకనికి తనయందు ఈ విశ్వము అనబడే 'దృశ్యము' తోచుచున్నది. చిత్తములో గల మాలిన్యము తొలగించివేస్తే దృశ్యము ఉండదు. అప్పుడీ జీవుడు నిర్మలుడై, స్వచ్ఛుడై ప్రకాశించగలడు. గాలి వీచనప్పుడు ఆకులు కదలవు కదా! ఆత్మతో ఏకత్వము సంభవించినప్పుడు చిత్తము యొక్క స్పందనము ఆగి ఉంటుంది. అప్పుడు ఈ చిత్తము నందు ఉండి ఉన్న రాగ-ద్వేషములు, వాసనలు తొలగిపోతాయి.

చైతన్యమయజ్ఞానము వల్లనే ఈ దిక్కులు, భూమి, ఆకాశము మొదలైనవి ప్రకాశించు చున్నాయి కదా! (లేక అవి తెలియవచ్చుచున్నాయి కదా!) ఆ చైతన్యము యొక్క ప్రకాశము నందు దిక్కులు మొదలైనవన్నీ లేకపోయివున్నప్పుడు దానినే "ఆత్మప్రకాశం" అంటున్నాం. "నీవు-నేను-లోకములు" .... మొదలుగాగల దృశ్యములన్నీ - అసత్తే" అని బోధ పడినప్పుడు ఆ దర్శించువాడు లేక ద్రష్ట మలరహితుడై కైవల్యము పొందినట్లే! దర్పణంలో (అద్దంలో) కొండలు మొ॥వి ప్రతిబింబించనప్పుడు ఆ అద్దము కేవలం అద్దముగానే ఉంటుంది కదా! ద్రష్టయందు నేను-నీవు-జగత్తు .... మొదలైన భావాలు లేకపోయినప్పుడు (ప్రదర్శితమవనపుడు లేక అనుభవమవనప్పుడు) ఆ ద్రష్ట కూడా కేవలుడు అగుచున్నాడు.

❖❖❖

5. దృశ్యము - అదృశ్యము

శ్రీరాముడు : బ్రహ్మజ్ఞా! వాస్తవానికి సత్తునకు వినాశనమనునదే లేదు. అసత్తునకు ఉత్పత్తి లేదు. ఇంతవరకు నాకు సుస్పష్టమే అని అనిపిస్తోంది. కాని చిత్రం చూచారా? ఈ 'దృశ్యము' అనేక ఎడతెగని దోషములతో కూడినదై, సత్యమైనదానివలెనే మాపై ప్రభావం చూపిస్తోంది. "ఇది అసత్తు లేక అవాస్తవం" అని మేము గ్రహించలేక పోతున్నాము. ఇదంతా మాకు ఎంతో శ్రమను, దుఃఖమును మరలమరల కలిగిస్తూనే ఉన్నది. అందుచేత, ఈ దృశ్యవిషూచి శాంతించేది ఎట్లాగో చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఈ దృశ్యపిశాచమును శాంతిపజేయగల ఒకానొక మంత్రము (విచారణ) చెపుతున్నాను. విను.

ఓ రామా! ఈ దేహాదులను చూడు. ఇవి చేతనములవలె కనిపిస్తున్నాయి కదా! అయితే ఇవి కాలక్రమంగా ఒకనాటికి మృతి చెందుచున్నాయి. ఈ దేహాదులే నశిస్తుంటే, ఇక అచేతనమైన వస్తువుల గురించి వేరే చెప్పవలసినదేముంటుంది? అందుచేత ఏమేమి కనిపిస్తున్నాయో అవన్నీ నశించబోతున్నాయి. ఇంతకుముందు లేనివై, ఇప్పుడు ఉండి, ఒకప్పుడు నశించబోయేవి సత్యమెట్లా అవుతాయి? ❖ ఒక చిన్న ఉదాహరణ. జలం తరంగాకారంలో అనుక్షణం పారుచున్నది కదా! 'తరంగము' అనే వస్తువు ఎలా ఎప్పుడు లభిస్తుంది? అది జలమునందుగల జలము యొక్క ఆకారమే కదా! కాని, వేరైనట్లు కనబడుచున్నది. ఈ దృశ్యవ్యవహారమంతా అట్టిదే. ఇదంతా స్వస్వరూపాత్మ యొక్క విన్యాసమే!

నీవు చెప్పినట్లు ఉన్నదానికి (సద్వస్తువునకు) నాశనము ఏనాటికీ సంభవించదు. అట్టి అవినాశనమగు వస్తువు (ద్రష్టయే) జగత్తుకు, ఈ జగత్తులోని "నీవు-నేను-శరీరములు -జన్మలు-మృత్యువులు" మొదలైన పదార్థజాలానికి "మూలస్థానము" లేక "ఉనికిస్థానము" అయున్నది. అనగా అది ఈ సర్వదృశ్యము యొక్క బీజమును తనయందు సంస్కార రూపమున కలిగి ఉంటోంది. ఆ సంస్కారం సుషుప్తి సమయంలో బుద్ధియందు, ప్రళయ కాలంలో ప్రకృతి యందు అణగి ఉంటోంది. మరల, సుషుప్త్యానంతరం, ప్రళయానంతరం - "ద్రష్ట-దృశ్యము" రూపమున ప్రకటితమౌతోంది. అయితే ఈ ద్రష్ట-దృశ్యము లేనట్టి ముక్తి అసంభవమందామా? అట్లు అనటానికి వీలులేదు. ఎందుకంటే, ఈ రెండింటిని అధిగమించిన స్థితియందు సుస్థితులైనట్టి జీవన్ముక్తులు దేవతలలోను, ఋషుల లోను, మనుష్యులలోను, పాతాళజీవులలోను అనేకులు మనకు తారసపడుతున్నారు. అట్లు జీవన్ముక్తులై ప్రకాశించువారు ఈ దృశ్యమును పొందుచున్నారు. తదనుగుణంగా ప్రవర్తిస్తున్నారు కూడా. మరి ఆ జీవన్ముక్తులకు, సంసార జీవులకు గల భేదమేమిటి చెప్పు? అట్టి భేదము అంతరంగమున ఏర్పడియున్న అవగాహనయందే ఉన్నది సుమా!

ఈ దృశ్యము బయట ఉంటే ఉండనీ. లేదా లేకుండనీ. దానివలన లాభనష్టములేమీ లేవు. అది హృదయంలో ప్రవేశించకుండా చూచుకోవాలి. పడవ నీళ్లలో ఉన్నా, నీరు పడవలోకి

ప్రవేశించనీయము కదా! ఒకవేళ ఈ దృశ్యము హృదయంలోకి రాగ-ద్వేష- ఆసక్తుల రూపమున ప్రవేశించిందా ... ఇక అది ఈ జీవుని గాలిపటంలాగా మూడు లోకాలు త్రిప్పగలదు. ఆ త్రిప్పుటకు అంతు ఉండదు. అందుచేత జీవుడు మనస్సు విషయంలో జాగరూకుడై ఉండాలి. నీరు పడవలో ప్రవేశించకుంటే పడవకు వచ్చే ఇబ్బంది ఏం ఉంటుంది?

ఓ రామచంద్రా! అనుభవపూర్వకమైన మరియు ప్రతిజ్ఞాపూర్వకమైన ఈ నా వాక్యాలు విను. ఆ తరువాత నీవు అడిగినది చెపుతాను.

బాహ్యమున కనిపిస్తున్న ఈ ఆకాశాది పంచభూతములు గాని, అంతరమున అనుభవ మగుచున్న "అహం" మొదలైనవిగాని వ్యవహారదశలో మాత్రమే అపరిజ్ఞాన దృష్టికి వేరు-వేరుగా తోచుచున్నాయి. వాస్తవానికి పరమార్థ దృష్టిలో - ఇదంతా అవ్యయము - జరామరణరహితము అగు బ్రహ్మమే అయివున్నది. బ్రహ్మమునకు వేఱైనట్టి "జగత్తు" అనబడు ఒకానొక పదార్థము ఏ క్షణమందు లేనేలేదు. పూర్ణమున పూర్ణుడు, ఆకాశమున ఆకాశద్రష్ట, శాంతమున శాంతుడు, బ్రహ్మమున బ్రహ్మము ఉన్నాయని గ్రహించేవాడే జ్ఞాని. ఉన్న సత్యము అదే. వాస్తవానికి ఈ "దృశ్యము-ద్రష్ట-దర్శనము" ... అనునవి లేవు. అంటే అవి శూన్యములని నా అభిప్రాయం కాదు. ఇదంతా శాంతమగు చైతన్య భరితమేనని గ్రహించబడుగాక!

శ్రీరాముడు : ప్రభూ! "ఈ జగత్తు లేదు" అని మీరు చెప్పుచున్నప్పుడు వినటానికి బాగానే ఉన్నది. కాని మా అనుభవం అందుకు తగినట్లు లేదు.

- గొడ్రాలి కుమారుడు పర్వతమును పగులగొట్టుచున్నాడు.
- కుందేటి రెండు కొమ్ములు ఎంత అందంగా ఉన్నాయి!
- బండరాయి చేతులు చాపి నృత్యం చేస్తోంది.
- ఇసుక చమురును ప్రసాదిస్తోంది.
- రాతిబొమ్మ ఎంతబాగా చదువుతోంది!
- ఆ చిత్రపటంలోని మేఘములు చేసే గర్జనచే నా చెవులు పూడిపోతున్నాయి.

పై వాక్యాలు ఎట్టివో, మాపట్ల "ఈ జగత్తు లేదు" అను వాక్యము కూడా అట్టిదే. ఎందుకంటారా? మృత్యువు, ముసలితనము, దుఃఖములు, వస్తుజాలం, ఆకాశం, పర్వతములు .... ఈ మొదలైన అనేక విషయములతో కూడిన ఈ జగత్తే లేదని అంటున్నారు కదా! ఇవన్నీ లేనప్పుడు మేము చూచే ఈ తతంగమంతా ఏమిటి?

అయితే, బ్రహ్మజ్ఞులగు మీరు వృథా అయిన ఏ వాక్యం పలుకరని కూడా నాకు తెలుసు. అందుచేత, "ఈ విశ్వము ఇతఃపూర్వము లేదు. ఇప్పుడు కూడా ఉత్పన్నమగుట లేదు. ఇంకెప్పటికీ ఉండదు" అని చెప్పుటలో అర్థమేదైయున్నదో మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రాఘవా! నా వాక్యములు అసంగతం కాదు. నేను చెప్పేది శ్రద్ధగా, ఉద్వేగరహితంగా విను.

నిజంగానే గొడ్రాలి కుమారునివలె ఇదంతా భ్రమమాత్రమే. “నాకు కనబడుచున్నది కదా!” అంటావా? స్వప్నంలో కూడా నీవు గృహములను, జనులను చూస్తున్నావు కదా! అవన్నీ ఉన్నాయా? ఉంటే ఎక్కడ ఉన్నాయి? లేకుంటే వికారాలన్నీ ఎట్లు కలుగుచున్నాయి? అదంతా మనస్సు యొక్క వికల్పము మాత్రమేనని తెలుసుకదా! స్వస్వభావమే స్వప్నమును చూచేటట్లు, స్వప్నానుభవం పొందేటట్లు చేస్తోంది. మనస్సు అసత్తే అయినప్పటికీ, నిజేచ్ఛ వలన నిజశరీరమును కల్పించుకొని, ఇక ఆపై ఇంద్రజాలమువలె ఈ జగత్తును ఇట్లు విస్తరింపచేస్తోంది.

చంచలశక్తితో కూడుకొనియున్న మనస్సే స్వయముగా స్ఫురిస్తోంది. అదే భ్రమిస్తోంది. సర్వమును కల్పించుకొని స్వర్గనరకాలకు పోయి వస్తోంది. యాచిస్తోంది. సంసారంలో నిమగ్నమౌతోంది. ఇంతలోనే ముక్తిని పొందుతోంది. ఇదంతా మనస్సు యొక్క కల్పన మాత్రమే. మనస్సు కాకుండా వేరే జగత్తు లేనేలేదు.

❖❖❖

6. బ్రహ్మము - స్వభావము

శ్రీరాముడు : స్వామి! “ఈ మనస్సు కూడా మిథ్యయే” అని అంటున్నారు కదా! ఎందుకని? మాయామయమగు ఈ మనస్సు ఎక్కడి నుండి ఉత్పన్నమౌతోంది? మొట్టమొదట ఈ విషయం గురించి వివరంగా చెప్పండి. అటుపై మిగతా విషయాలకు వద్దాం.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ దృశ్యసృష్టి అంతా నామరూపాలతో సహా లయించిపోయే “మహాప్రళయము” సమయంలో ..... అప్పుడిక శేషించేదేమిటి? ప్రశాంతము, అఖండము, నిర్లిప్తము, అద్వితీయము అయినట్టి సత్–వస్తువే. (A state of absolute self-existence). అనుభవమాత్రమగు అట్టి ఈ జీవుని స్థితికి నామరూపాలు లేకపోయినప్పటికీ శాస్త్రములు అద్దానికి ‘బ్రహ్మము’ అను పేరుపెట్టాయి.

అట్టి బ్రహ్మవస్తువుకు జన్మగాని, ప్రకాశముగాని, లయముగాని లేవు. అది నిత్యము, స్వస్వరూపము, సర్వశక్తివంతము, కారణరహితము అయివున్నది. దానినే ‘పరమాత్మ’, ‘మహేశ్వరుడు’ అని కూడా అంటున్నారు. ఎన్నిపేర్లతో ఎంత చెప్పినా ఏం లాభం? ఆ పరమవస్తువు వాక్యములచేత గ్రహించబడగలిగేది కాదు. ముక్తపురుషులు దానిని తమ యొక్క అనుభవమాత్రంగా ఎరుగుచున్నారు.

“ఆత్మ, బ్రహ్మము, బ్రహ్మ, పరమాత్మ, శివుడు.... అనునవన్నీ బోధించుటకు వీలుగా అద్దాని యందు కల్పించబడ్డాయి. అయితే ఈ పేర్లన్నీ దాని స్వాభావికములు కావని, నామరూపముల కల్పనమాత్రంచేత భేదభావం పొందవలసిన పనిలేదని సర్వజనులకు మనవి చేస్తున్నాను.

సాంఖ్యులు = దానిని ‘పురుషుడు’ అని పిలుస్తున్నారు.
వేదాంతులు = ‘బ్రహ్మము’ అని చెప్పుచున్నారు.
విజ్ఞానవాదులు = ‘సునిర్మల విజ్ఞానము’ అంటున్నారు.
శూన్యవాదులు = అది “పదార్థరహితము”, ‘శూన్యము’ – అని పిలుస్తున్నారు.

అయితే అది సర్వ "నామ-రూప-భావన"లకు అతీతమైనది. అదియే సూర్య-చంద్ర-నక్షత్రాదులను, సర్వజీవులను ప్రకాశింపచేస్తోంది. కనుక సర్వజీవుల వాస్తవ స్వరూపమదే. నామరూపముల కల్పన అద్దానిని పొందే మార్గం సుగమం చేయటానికే సుమా! అదే వక్త-వినువాడు -భోక్త-ద్రష్ట-కర్తల రూపమున ప్రకాశిస్తోంది. అది 'సత్తు' అయికూడా అసత్తువలె ఉంటోంది. సర్వదేహములందు సర్వదా ఉంటూ కూడా దూరస్థమువలె అనిపిస్తోంది. చిత్ప్రకాశమే అది.

సూర్యుని నుండి కిరణపుంజములు బయలుదేరుచున్నట్లు ఆ చిత్తాకాశము నుండే బ్రహ్మ - విష్ణువు - ఇంద్రుడు మొదలైన దేవతలంతా బహిర్గతమవుతున్నారు. సముద్రజలంలో బుద్బుదములవలె (బుడగలవలె) అనంత సంఖ్యలో జగత్తులు బయల్వెడలటం జరుగుతోంది. నదులన్నీ సముద్రమువైపుకే అభిముఖమగుచున్నట్లు, ఈ దృశ్యములన్నీ అద్దానివైపుకే కదులుచున్నాయి. దీపంవలె అది తనను తానే ప్రకాశింపచేసుకొనుచు, తద్వారా సర్వ పదార్థములను ప్రకాశింపచేస్తోంది. అదియే ఆకాశంలో, శిలలలో, పర్వతములలో, పాతాళంలో, వాయువులో, ప్రతి ప్రాణియొక్క హృదయంలో సుస్థిరమై వెలుగొందుచున్నది. అదియే శరీరములందు ప్రవేశించి ఈ కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు తమ తమ పనులను నిర్వర్తించునట్లుగా శాసిస్తోంది. అయ్యది ఒకప్పుడు స్వస్వరూపమును మరచి మూఢునివలె, మూగవానివలె, జడునివలె ప్రవర్తిస్తోంది. శిలలు నిశ్చలంగాను, ఆకాశము శూన్యముగాను, పర్వతములు కఠినముగాను, జలము ద్రవత్వముతోను ఉండేటట్లు శాసించేది, నియమించేది ఆ బ్రహ్మవస్తువే. దాని శాసనమును అనుసరించే సూర్యుడు ఒకానొక నియమంగా ప్రకాశిస్తూ ఉదయిస్తూ అస్తమిస్తున్నాడు.

మేఘాల నుండి వర్షం కురుస్తుంది కదా! అదే విధంగా అక్షయసుఖముతో నిండిన ఆ పరమవస్తువు నుండి, "సంసారము" అనబడే అసారవృష్టి కురుస్తోంది. ఈ 'త్రిలోకములు' అనే వీచికలు దానినుండే వెలువడుచు అందులోకే పయనిస్తున్నాయి. అదే సర్వభూతముల అంతర్యామియై, అంతర్లీనగానమై, శాశ్వతమై, సర్వమై ఉండికూడా ... లేకయే ఉన్నట్లు భ్రమింపచేస్తోంది. మహత్తరమై ఉండికూడా అందరియందు సమాన భావమున వెలయుచున్నది. వాయువు తన వీచికలచే లతలను నాట్యం చేయిస్తుంది. చూచావా? అట్లే, అది .... 'ఇంద్రియములు' అనే దళములతోను, 'బ్రహ్మాండములు' అనే ఫలముల తోను 'చిత్' అనే మూలముతోను కూడుకొనియున్న ఈ "ప్రకృతి" అనే లతను నాట్యం చేయిస్తోంది. 'దేహములు' అనే అసంఖ్యాకమైన పెట్టెలలో చిన్మయమగు మనస్సును ఉంచింది అదే సుమా! చంద్రునినుండి కిరణములు వస్తున్నట్లు ఆత్మనుండే సృష్టులు వెలువడుచున్నాయి.

ఓ రాఘవా! ఆ చిదాకాశమునందు సృష్టి అనే విద్యుత్తు ప్రకాశిస్తోంది. 'ప్రాణములు' అనే శీతల వాయువులు వీచుచున్నాయి. అసద్వస్తువులను కల్పించేది, సద్వస్తువును మరుగుపరిచేది, లేక 'సత్త' ఏర్పరచేది అదే. దాని సాన్నిధ్యము చేతనే జడములైన ఈ శరీరాదులు చలించటం జరుగుతోంది. 'సత్త'లన్నిటికీ సత్త అయివున్నట్టి దానివలననే దేశకాలములు, నియతి (cause & effect), చలన-స్పందాది క్రియలు ప్రవర్తించటం జరుగుతోంది. శుద్ధ - చిన్మయమగు ఈ

పరమవస్తువే ఆకాశమున పదార్థములను స్వయముగా చింతించి, ఆయారూపములను అప్పటికప్పుడు దాల్చుచున్నది.

❖

ఆ పరమవస్తువే ఈ విశాల బ్రహ్మాండములను ఒక ప్రక్క సృష్టిస్తూ, మరొకవైపు ఏమీ చేయనట్లు మౌనము, నిష్క్రియత్వము, నిర్లిప్తత్వము, శాంతము వహిస్తోంది. సర్వప్రాణుల వాస్తవ స్వరూపము కంటే వేరైనది కానట్టి అద్దానికి స్థితిగతులు లేవు. అది సర్వదా ఈ ప్రపంచము యొక్క 'దృశ్యత్వము – ద్రష్టత్వము' లయించినట్టి నిర్వికార-చైతన్యముగా తనయొక్క అద్వైత ఆత్మతత్త్వమునందే నిలచియున్నది. ఓ రామచంద్రా! అదికాక- ఇక్కడ గాని మరెక్కడ గాని మరొక వస్తువు ఏదీ లేదు. అదియే సర్వులచే సర్వవిధముల ఆరాధించబడతగినది. నమస్కరించబడతగినది. దానిని గ్రహించినవారియందు సర్వ స్వల్పత్వములు నశిస్తాయి.

❖❖❖

7. బ్రహ్మ సాక్షాత్కారం

దేవదేవుడగు ఆ పరమాత్మునితో లేక, సర్వుల వాస్తవ స్వరూపమగు – శుద్ధ చైతన్యాత్మ భగవానునితో ఏకత్వము "జ్ఞానయోగము" వలన మాత్రమే లభిస్తుంది. అంతేకాని, శరీర కష్టములతో కూడిన ఆయా కర్మలు నిర్వర్తించినంత మాత్రంచేత లభించేది కాదని సర్వులకు గుర్తు చేస్తున్నాను. ఏ కర్మానుష్ఠానమైనప్పటికీ – అది 'మనస్సు యొక్క పవిత్రత' అను లక్ష్యముతో చేయబడాలి. అప్పుడు దోషరహితమగు మనస్సులో జ్ఞానస్ఫురణ స్వయముగా ఉదయిస్తుంది. ఆపై, ఆత్మదర్శనము యొక్క అనుభవం ప్రాప్తిస్తుంది.

ఓ రామచంద్రా! మేము ఈ సంసార వ్యవహారమంతా తరచి-తరచి పరిశీలించాం. ఇందు ఏర్పడుచున్న సుఖ-దుఃఖముల భ్రమ అంతా – మృగతృష్ణను చూచినప్పుడు ఏర్పడుచున్న జలభ్రాంతి వంటిది మాత్రమే. ఈ భ్రమను శాంతిపజేయగల ఉపాయం "తత్త్వజ్ఞానం" ఒక్కటేనని మేము గ్రహించిన తరువాతనే, ఆ విషయం ప్రపంచమంతటికీ చాటుచున్నాం. "నేను ఎవరు? వీరంతా ఎవరు? ఈ దృశ్యము, దృశ్యాంతర్గతములైన ఈ శరీరములు ఏమై ఉన్నాయి?" అను విషయమై సంపూర్ణ అవగాహనపూర్వకమైన జ్ఞానమే సర్వభ్రమలకు సరయిన ఔషధం.

ఓ జనులారా! వృత్తి-రహితుడు, శుద్ధ-స్వరూపుడు అయినట్టి పరమాత్మ ఎక్కడో దూరంగా ఉన్నవాడు కాదు. లేక దగ్గరగా ఉండేవాడుకూడా కాదు. దూరస్థుడు కాదు. సమీపస్థుడు కాదు. ఏదైనా బాహ్యమున ఉన్న వస్తువైతే .... ఇది దూరంగా ఉన్నది, లేక దగ్గరగా ఉన్నది ... అని అనవచ్చు. కాని పరమాత్మ ద్రష్ట యొక్క వాస్తవ స్వరూపమే అయినప్పుడు, ఇక దగ్గర, దూరములు ఎట్లా ఉంటాయి? అతడు లభించి ఉండనిది ఎప్పుడు? అతడు సులభుడు కాదు. దుర్లభుడు కూడా కాదు. స్వానంద ప్రకాశరూపమగు ఆ బ్రహ్మము మీ మీ నిజ-శరీరములందే, సర్వదా లభించియే

ఉన్నాడు. ప్రయత్నశీలురైనప్పుడు మీయందు అతని ఉనికిని తప్పక గాంచగలరు. మీయందే దివ్యమై వెలుగుచున్న ఆ ఆత్మదేవుని వదలిపెట్టి ఎక్కడెక్కడో ఎందుకు వెతుకుతారు చెప్పండి? తపస్సు – దానము – వ్రతములు మొ॥ మీ దృష్టిని శుద్ధపరచుటకు మాత్రమే ఉపకరిస్తాయి. వాటిలో ఏ ఒక్కటీ స్వయముగా తత్త్వజ్ఞానమును చేకూర్చలేవు. అయితే, వాటి సహాయం తీసుకోండి. మీరే స్వయముగా మీమీ స్వస్వరూప ఔన్నత్యమును దర్శించుటకు సిద్ధులు కావాలి. విజ్ఞులైన మహనీయులు స్వస్వరూపమును ఆశ్రయించి తమయందు ఆ పరమాత్మయొక్క అనుభవమును పొందుచున్నారు.

నాయనలారా! మీరు "దృశ్య సంసక్తత – (Attachment towards sensory impressions & experiences) అనబడు మోహజాలంలో చిక్కుకొనియున్నారని గుర్తుచేస్తున్నాను. ఈ మోహం తొలగేదెట్లాగో కొంచెం యోచన చేయండి. ఇందుకు మాకు తోచుచున్న ఉపాయములు చెప్పుచున్నాం. సాధుజనులను సమీపించండి. వారు చెప్పేది శ్రద్ధగా వినండి. మనన–నిధిధ్యాసలను సంపాదించండి. ఆత్మతత్త్వమును విశదీకరించే శాస్త్రములు జ్ఞానుల ప్రసాదమే కదా! అవి కూడా మిమ్ములను ఉద్ధరించగలవు. క్రమంగా "ప్రశాంతము – సర్వశేష్యము" అగు బ్రహ్మమే మీ స్వస్వరూపమై యున్నదని అనుభవపూర్వకంగా గ్రహించండి.

అయం సదేవ ఇత్యేవ సంపరిజ్ఞానమాత్రతః
జంతోర్నజాయతే దుఃఖమ్, జీవన్ముక్తత్వమేతి చ ॥ (VI. 6)

"నాయందే వెల్లివిరిసియున్నట్టి ఇతడే దేవదేవుడగు పరమాత్మ" అను జ్ఞానము లభించిన తరువాత, ఇక ఈ దుఃఖానుభవముల క్రీనీడ కూడా ఉండదు. అట్టి జ్ఞానమునే "ఆత్మజ్ఞానం" అని అంటున్నాం. అది పొందినవాడు జీవన్ముక్తుడగుచున్నాడు.

❖

శ్రీరాముడు : మహాత్మా! 'ఆత్మయోగం' చేత స్వస్వరూపమే ఆ పరమాత్మగా గ్రహించుటచే ఈ జనన–మరణ–సంసారాది దోషములన్నీ తొలగిపోతాయని మీ మాటల వలన గ్రహిస్తున్నాను. అయితే మహర్షీ! ఆ దేవదేవుని శీఘ్రంగా పొందాలంటే ఏ కఠోర నియమాలు ఆచరించాలో చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : రఘురామా!

స్వపౌరుషయత్నేన వివేకిన వికాసినా
స దేవో జ్ఞాయతే, రామ! న తపః స్నాన కర్మభిః ॥ (VI. 9)

తనయొక్క ప్రయత్నముల చేత (పురుషకారము చేతనే) "వివేకము – వికాసము(Discrimination & Knowledge\wisdom)"లను పొందినవాడే బ్రహ్మసాక్షాత్కారం పొందుచున్నాడు. వివేకముతో కూడిన బుద్ధిని ఉపయోగించకుండా కేవలం స్నానము తపము మొదలైన కార్యక్రమముల చేత 'బ్రాహ్మీదృష్టి' అలవడదు. "కుటుంబ పోషణ" మొదలైన లౌకిక వ్యవహారములు నిస్సంగత్వముతో

ఆచరించువారికి, అవేమీ జ్ఞానసముపార్జనకు అడ్డుకావని ప్రకటిస్తున్నాను. "మేము ఈ భౌతిక వ్యవహారములందు నిమగ్నులమైయున్నాము. ఇప్పుడీ జ్ఞానమును, బ్రహ్మ సాక్షాత్కారమును పొందాలనుకొంటే లౌకిక వ్యవహారములు నిర్వహించలేమో ...." అని తలచి ఆత్మజ్ఞాన సమాచారమును పరిశీలించనివారు మా దృష్టిలో మూర్ఖులు మాత్రమే.

రాగ ద్వేష తమః క్రోధ మదమాత్సర్య వర్జనమ్
వినా, రామ! తపోదానం, క్లేశఏవ న వాస్తవమ్ ॥ (VI. 10)

ఓ రామా! "కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ఎంతవరకు త్యజించ గలిగాం?" అనునదే ముఖ్యం. అవి వదలాలనే "లక్ష్యము" కలిగియుండకుండా, తపోదానాదులు ఆశ్రయించటం కాయక్లేశకరములే అవుతాయి కాని, ఉత్తమోత్తమమైన ప్రయోజనం సిద్ధింపచేయలేవు. ఒకడు రాగద్వేషములకు లోబడి పరులను వంచించి సంపాదించినదానిని దానం చేశాడనుకో. అసలు ఆ ధనము ఎవరిదో అతడే దాని ఫలమును పొందుచున్నాడు. రాగద్వేషములకు లోబడి చేయబడే వ్రతములు మొ॥ సత్కార్యములు "దాంభికములు" అని చెప్పబడుచున్నాయి. ఇట్టి కార్యముల వలన ఏం ప్రయోజనం? "నేను నా మనస్సును శుద్ధి చేసుకొనుటకే ఈ వ్రత, జప, తపో దానాదులను ఆశ్రయిస్తున్నాను. మరెవరినీ ఉద్ధరించుటకు కాదు. అట్టి శుద్ధమైన మనస్సుచే – నాతో సహా సర్వులయందు వెలుగుచున్న ఆత్మదేవుని దర్శనం చేసుకుంటాను" అను అవగాహనతో తపస్సు, దానము మొ॥నవి నిర్వర్తించబడాలి.*

కనుక ఓ జనులారా! మీరంతా ప్రయత్నశీలురు అవండి. ఎంత కష్టపడైనా సరే, సాధు–పుంగవుల సామీప్యత, సచ్ఛాస్త్రముల బోధసారం సంపాదించండి. నిజంగా మీరు దుః ఖరహితులు కాగోరుచున్నారు కదా! ఆత్మదేవుని పొందగోరుచున్నారు కదా! అయితే, ఈ రాగాది దోషములను వదలవలసినదే! అందుకు పురుషకారం కాకుండా వేరే ఉపాయమేమి ఉన్నది?

పురుషకారముచే తత్త్వజ్ఞానం ఎట్లా లభిస్తుందో చెపుతాను, వినండి. దీనిచే రాగద్వేషాది దోషముల రూపమున ఉన్న విషూచివ్యాధి ఉపశమించగలదు.

యథా సంభవయా వృత్యా లోకశాస్త్ర–విరుద్ధయా
సంతోష సంతుష్టమనా భోగగంధం పరిత్యజేత్ ॥ (VI. 16)

మొట్టమొదట వీలైనంతవరకు లోక–శాస్త్రములకు విరుద్ధములు కానట్టి జీవితమును అవలంబించండి. యాదృచ్ఛికంగా పొందుచున్నదానితో సంతుష్టులు కండి. భోగవాసనల వలననే అసంతృప్తి బయలుదేరి మిమ్ములను పీల్చి పిప్పిచేస్తోంది. అందుచేత భోగవాసనలు (tendencies that keep you craving) త్యజించండి. ఆవేశ కావేశాలు వదలండి. క్రమంగా చిత్తమునకు ప్రశాంతత అలవాటు చేయండి. సాధువులు ఏమి చెప్పుచున్నారో వినండి. సచ్ఛాస్త్రములు ప్రకటించుచున్నది

---

* "దానాద్యస్యార్థాస్తస్య తత్ఫలమ్" అన్నట్లు.

గ్రహించండి. నిషిద్ధమైన కర్మలను వదలుచు విచారణ – ప్రయత్నములను ఆశ్రయించువాడు అతి శీఘ్రంగా ముక్తిని పొందగలుగు చున్నాడు. ఇది మా అనుభవసారం. ఏ బుద్ధిమంతుడైతే విచారణచే బ్రహ్మస్వరూపమును గ్రహిస్తాడో, అట్టివానిపట్ల బ్రహ్మ – విష్ణు – మహేశ్వర – ఇంద్రాది దేవతలు కూడా దయ చూపుతూ ఉంటారు. ఒక రైతు తన తోటలోని అందమైన పూలమొక్కలను కాపాడునట్లు కాపాడుకొంటారు.

ఓ రామా! 'సాధువు' అనగా ఎవరు? జ్ఞాన–వైరాగ్యాది విశిష్ట గుణములతో ప్రకాశించు నట్టివాడే సుమా! అట్టి సాధువులను సుజనులే గుర్తించగలరు. సుజనుల అభిప్రాయం ప్రమాణంగా తీసుకొని 'సాధువు'ను గుర్తించాలి. ఎంత ప్రయత్నించైనా సరే, అతనిని ఆశ్రయించి, అతడు చెప్పేది భక్తి–శ్రద్ధలతో వినాలి. అణకువతో ప్రశ్నించి, చెప్పింది విని, స్థిరీకరించుకొని పరిశీలనాత్మక బుద్ధిచే ఆత్మజ్ఞానివి కావాలి.

శాస్త్రముపై, గురువుపై, తనపై విశ్వాసము కలవాడే సద్వస్తువును దర్శించుచున్నాడు.

సచ్ఛాస్త్రము : విద్యలన్నిటిలో శ్రేష్ఠమైనది 'ఆధ్యాత్మవిద్య'. అట్టి ఆత్మవిద్యను బోధించే శాస్త్రమే "సచ్ఛాస్త్రము".

యోగము అభ్యసించినవారి మనస్సులోని వృత్తులన్నీ తొలగుతాయి కదా! అదేవిధంగా "సాధుసంగము – సచ్ఛాస్త్రపఠనముల వలన వైరాగ్యము, దృశ్యముపట్ల రాగము తొలగుట" మొ॥ ప్రాప్తిస్తున్నాయి. తత్కారణంగా 'అవిద్య' అనబడే సంసారము నశిస్తోంది. సర్వదా సర్వత్రా సర్వవిధాలా దేవదేవుడగు పరమాత్మను సర్వకర్మలచే ఆరాధించటమే సర్వోత్కృష్టమైన ఉపాయం.

❖❖❖

8. మిథ్యాభ్రాంతులు

శ్రీరాముడు : ఓ మహర్షీ! దేవదేవుడగు పరమాత్మను సేవించమని ఆజ్ఞాపించుచున్నారు. అట్టి పరమాత్మతో సమీప్యతచే అమోఘమైన ప్రభావం ప్రాప్తించగలదని మీ వాక్కులచే గ్రహిస్తున్నాం. తత్వవేత్తలు, మా శ్రేయోభిలాషులు అయినట్టి మీయొక్క వాక్యములు మమ్ములను ఈ 'సాంసారిక దృష్టి' నుండి తప్పక కాపాడుతాయి.

కాని మహాశయా! నాకు మరొక సమస్య వచ్చిపడుతోంది. మీరు చెప్పు ఆ "పరమాత్మ" అనునది ఎవరి గురించి? ఎవని గురించి ఎరిగిన తరువాత ముక్తి లభిస్తుందని అంటున్నారో అట్టి పరమాత్మ ఎక్కడుంటాడు? అతనిని మేము తెలుసుకోవటం ఎట్లా? చేరటం ఎట్లా? మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : నేను చెప్పుచున్న ఆ ఆత్మ భగవానుడు ఎక్కడో దూరంగా లేడు సుమా! అతడు చైతన్యరూపమున మనందరి శరీరములలో నివసించుచున్నాడు. ఈ విశ్వమే అతడు.

కాని అతడు విశ్వరూపముగా అగుటలేదు. ఉన్నది అతడొక్కడే. అతనికి వేరుగా విశ్వము అనునది ఎక్కడా ఎన్నడూ లేదు. "ఆ చిన్మయ తత్త్వమే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, సూర్యుడు, నీవు, నేను, కూడా" .... అని గ్రహించెదవు గాక. సర్వము ఆ చైతన్య స్వరూపమే కాని, మరింకేమీ కాదు.

శ్రీరాముడు : స్వామీ! ఈ విశ్వమంతా చైతన్యస్వరూపము మాత్రమే అయివుంటే .... ఆ విషయం ఇప్పటికే అందరు గ్రహించి ఉండాలి కదా! మరి మీవంటి సాధువులచే ఉపదేశములు ఇవ్వబడవలసిన అగత్యం ఎందుకు ఉంటోంది? ఆ చిత్‌తత్త్వము ఈరీతిగా "జడము – చైతన్యము : నీవు–నేను" అనబడు అనేక రూపములుగా ఎందుకు ప్రకటితమౌతోంది ....?

శ్రీ వసిష్ఠమహర్షి : "ఈ భౌతిక దృష్టికి అనేకత్వముగా కనిపించు దృశ్యము చిత్ తత్త్వము యొక్క పరిణామము" అనునది సరికాదు. చిదాత్మ లేక చిద్వస్తువు సర్వదా పరిణామ రహితంగానే ఉండి ఉంటోంది. "అది అనేకత్వము పొందుచున్నది ....." అనే అభిప్రాయముతో కూడిన జాడ్యము ఉన్నంతవరకు ఈ జీవునికి 'సంసారము' అనే అనుభవము కొంచముకూడా ఉపశమించదు.

"సంసారము అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు విజ్ఞులు, "అనేకత్వ రూపము దాల్చుచున్న ఈ దృశ్యమే సారవంతమైనది ... అని అనుకొనే పశుతుల్యులగు చేతన జీవుల దృష్టియే సంసారము" అని నిర్వచనం చెప్పుచున్నారు. అట్టి ఆలోచనా విధానమే జనన మరణాది ఫలములను కలుగజేస్తోంది.

ఈ జీవుని చూచావా? ఇతడు అజ్ఞుడై, సత్యవిషయమును గ్రహించనివాడై, తన వాస్తవ స్వరూప–స్వభావములు మరచినవాడై అందుకు ఫలితంగా అనేక దుఃఖపరంపరలు అనుభవిస్తున్నాడే? ఎందుచేత చెప్పు? "నే నీ శరీరమును. ఈ నా ఇంద్రియ అనుభవములు – వాస్తవం. ఇతరులతో ఏర్పరచుకొన్న సంబంధ బాంధవ్యములు సత్యము" అని భావించుటచేతనే సుమా! అతడు "స్వస్వరూపానుభవము" ను వదలినవాడై ప్రతిబింబితమగు అంతఃకరణ చైతన్యమున పడి వ్యర్థముగా అనర్థములు అనుభవిస్తున్నాడు. బహిర్ముఖ వృత్తులే (Avocations of external matters) ఇందుకు కారణం. అట్లు బహిర్ముఖం అగుచున్న చిత్తవృత్తి .... నిత్యచేతనమగు ఆత్మయొక్క దర్శనముచే ... నశించుచున్నది. బాహ్యమగుచున్న వృత్తులు అంతర్ముఖం కాగా ... అప్పుడు ఈ జీవునియందు ఒకానొక పూర్ణత్వము ప్రకాశించుచున్నది. అనగా ఈ జీవుడప్పుడు పూర్వాపూర్వస్వభావుడు అగుచున్నాడు. నేను "పూర్ణుడను – శుద్ధుడను – నిత్యుడను" అను అవగాహననే "తత్త్వసాక్షాత్కారం" అని అంటున్నాం. దానిని పొందిన వానికి ఇక శోక–మోహములు ఉండవు. పరాత్పరుడగు బ్రహ్మమును ఎరిగినవాని యొక్క హృదయగ్రంథులు, కుసంస్కారములు విచ్ఛిన్నమైపోతున్నాయి. "నేను ఒక రక్త–మాంస–బొమికలతో నిర్మించబడిన గూడు వంటివాడిని. వీరు మాత్రమే నా వారు. వారు పరాయివారు" .... అనునట్టి దుర్భాషలన్నీ త్యజించబడతాయి. సందేహములన్నీ తొలగిపోతాయి. సంచితకర్మలన్నీ లయించిపోతాయి.

❖

కాబట్టి ఓ రామచంద్రా! "నేను ఎవరు? ఏది కాదు? ఈ దృశ్యమేమిటి?" అనునది గ్రహించినప్పుడే ఈ జీవుని జాడ్యం మొదలంట తొలగిపోతుంది. అప్పుడీ జీవుడే శివుడు అవుతాడు.

అయితే ఈ చిత్తమును బాహ్యమువైపుకు ప్రసరించకుండా హఠంతో బలవంతంగా నిరోధిస్తే దృశ్యదర్శనం ఆగుతుందా? దృశ్యశాంతి ప్రాప్తిస్తుందా? లేదు. "ఈ దృశ్యభ్రాంతులన్నీ మిథ్యాభ్రాంతి చేతనే కలుగుచున్నాయి" అనే జ్ఞానం లేకపోతే, బహిర్ముఖమగుచున్న చిత్తవృత్తులను నిరోధించటం ఎవరి తరం? జ్ఞానసముపార్జన లేకుండా దృశ్యదర్శనం శాంతించటం అసంభవం. "దృశ్యవస్తువు మిథ్య" అనునట్టి సుస్థిరమైన అవగాహన (లేక జ్ఞానము) లేకపోతే దృశ్యాతీతమైనట్టి చిత్స్వరూపమోక్షం ఎట్లా లభిస్తుంది.

అందుచేత రాఘవా! ఏ హఠయోగంతోనో ఈ దృశ్యమును తిరస్కరించినంతమాత్రంచేత ఒరిగేదేమీ ఉండదు. పైగా, అట్టిదానితో ఈ జగత్స్వరూపమేమిటో అర్థం కాకపోగా, అపార్థమే మిగులుతుంది. మేము ఈ వర్తమాన బోధవంటి ఆయా ప్రవచనముల ద్వారా ఈ జగత్స్వరూపమేమిటో విడమర్చి చెప్పుచున్నాం.

మా ఈ ప్రయత్నము ... "ఈ జీవునిలో ఇతఃపూర్వమే సర్వదా వేంచేసియున్న "పరిశుద్ధాత్మ తత్త్వము"ను గుర్తుచేయటం మాత్రమే. అంతేగాని, క్రొత్తగా మరొకటేదీ తెచ్చి ప్రతిష్ఠాపన చేయుచుండుట లేదు సుమా!

❖❖❖

9. పరమాత్మ స్వరూపమెట్టిది?

శ్రీరామచంద్రుడు : హే మహర్షీ! "నేను ఇది" అని తెలుసుకోకపోవటం చేతనే జీవునికి ప్రాప్తించియున్న ఈ సంసారము తొలగకున్నది కదా! అయితే ఈ సర్వజీవులలోను ఉండి ఉంటూ, సర్వజీవులు 'తానే' .... అయినవాడు ఎవడు? అతడు ఆకాశరూపియా? అతడు ఏ ఆధారంతో ఎక్కడ, ఎట్లు వసించుచున్నాడు? మీరు చెప్పుచున్నట్లు సాధు సంగమములచే, సచ్ఛాస్త్రములచే లభ్యుడుకాగల ఆ పరాత్పరుని స్వరూపమెట్టిది? దయచేసి చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! రామా! "జన్మ" అనే అరణ్యంలో సంచరించుచున్న ఒకానొక చేతన – జీవునియందు "ఇతడే పరమాత్మ" అనునట్టి బుద్ధి ఉంచువారు ఎంతటి పండితులైనా మా దృష్టిలో సంపూర్ణమైన అవగాహన కలవారు కాదు. ఎందుకంటావా? ఈ సంసారమునకు, తదంతర్గతమైన దుఃఖములకు కారణం జీవభ్రాంతియే కదా! ఒక్కనిని ఎరిగినంత మాత్రం చేత లాభమేమున్నది? ఒకానొక జీవుని జీవత్వముతో ఉపాసన ప్రారంభించి అటుపై క్రమక్రమంగా "సర్వజీవులు పరమాత్మ స్వరూపమే" అనునట్టి సర్వాత్మభావమును గ్రహించినప్పుడే దుఃఖములన్నీ తమంతటతాము స్వయముగా ఉపశమిస్తున్నాయి. విషము తొలగితే ఆ విషము యొక్క ప్రభావం తొలగుతుంది కదా! అట్లాగే దృశ్యము పరమాత్మ స్వరూపంగా అనుభూతం కాగలదు.

శ్రీరాముడు : ఓ బ్రహ్మజ్ఞా! పరమాత్ముని రూపమేమిటో ఉన్నది ఉన్నట్లు వర్ణించండి. మీరు చెప్పేది విని, ఆ పరమాత్మను దర్శించి మేము ఈ మనోమోహము నుండి సంపూర్ణముగా విడివడ గలుగుతాం.

శ్రీ వసిష్ఠమహర్షి : ఏ జ్ఞాన స్వరూపమైతే క్షణంలో ఒకచోటినుండి మరొక చోటికి వెళ్ళుచున్నదో....

– ఏ బోధరూప సముద్రంలో అయితే ... ఈ భూత–భవిష్యత్–వర్తమానముల రూపములుగా ఉండునట్టి "కాలము" కూడా 'మిథ్యయే' అయిఉన్నదో ....

– ఏ "ఎరుక" అను దానిలో ఈ జగత్తు అంతా తేలియాడుచున్నదో ....

– దేని యందు ద్రష్ట–దర్శనము–దృశ్యము స్వతహాగా ఉన్నవి కానప్పటికీ, ఉన్నట్లే అగుపిస్తున్నాయో

– ఈ ప్రపంచమంతా అసత్తే అయినప్పటికీ దేని యందు సత్తువలె (సద్రూపము వలె) కనబడుతోందో

– అనాదియగు ఈ సృష్టి ప్రవాహమంతా దేనియందు మిథ్యారూపముతో భాసిస్తోందో....

– ఏ చిన్మాత్రము (Knowing concept) చైతన్యమే అయివుండికూడా బండరాయి వలె మార్పు–చేర్పులు లేకయే సర్వదా నిశ్చేష్టితమై ఉన్నదేదో ...

– ఏది జడము అయి కూడా జడము కాకయే ఉన్నదో ...

– ఈ బాహ్య–అభ్యంత (శరీరాదులు–మనోబుద్ధి అహంకారాదులు) వస్తువులన్నిటితో కూడి ఉండి, సర్వ వ్యవహారములు నిర్వర్తించుచున్నదేదో...

నాయనా! అదియే 'పరమాత్మ' యొక్క స్వరూపము. సూర్యుడు మొదలైన ప్రకాశ పదార్థము లన్నిటి యొక్క రూపము వెలుతురే కదా! ఈ కనబడేదంతా దేనిలో ఉన్నదో అదే పరమాత్మ యొక్క పరివేష్టితమని గ్రహించు.

❖

శ్రీరాముడు : "పరమాత్మ ఒక్కటే సద్రూపము. ఈ దృశ్యజగత్తు అంతా అనిత్యము–మిథ్య" ... అని మాకు అనుభవపూర్వకంగా తెలిసేదెట్లా?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! అటు ఆ ఆకాశమువైపు చూడు. అక్కడ ఏదో నీలంగా కనబడుచున్నది కదా! అయితే, ఆకాశంలో నీలపురంగుగల పదార్థం ఉన్నదా? లేదు కదా! ఆకాశము వాస్తవానికి శూన్యము, రూపహీనమయి ఉన్నట్లు, చిన్మయ బ్రహ్మము నందు ఈ భ్రాంతిమయజగత్తు కూడా కనిపిస్తోంది. అట్టి జ్ఞానము లభించినప్పుడు బ్రహ్మము యొక్క స్వరూపము స్వయముగా బోధపడుచున్నది. "ఈ జగత్తు మిథ్యయే" అను జ్ఞానము కాకుండా, బ్రహ్మమును ఎరుగుటకు వేరే ఉపాయం అంటూ ఏదీ లేదు.

"ప్రళయకాలము" అనబడు స్థితిలో ఈ దృశ్యసమూహములన్నీ నశిస్తున్నాయి. అప్పుడు ఆ పరమపురుషుడొక్కడే శేషించుచున్నాడు అట్లు మిగిలియుండేదే "బోధస్వరూపము".

అనగా... నీ దృష్టిలో "నీవు - నేను - అతడు - జగత్తు" అనబడునదంతా సంపూర్ణంగా లయించగా... అప్పుడు నీయందు శేషించేదే అది. శుద్ధవిజ్ఞానతత్త్వమగు అద్దానియందే ఈ దృశ్య జాలమంతా జనించటం, ఉండటం, లయించటం కూడా జరుగుతోందని గ్రహించు.

అయితే ఒక ముఖ్యమైన విషయం. "గాఢనిద్రలో ఏర్పడే జడస్థితియే బోధస్వరూపము" అని భ్రమ పడకూడదు. 'ప్రతిబింబము' అనునదే ఉండని దర్పణం ఎక్కడన్నా ఉంటుందా? దృశ్యభావం లేకపోతే బ్రహ్మము యొక్క ప్రతిబింబము కూడా ఉండదు.

శ్రీరాముడు : మరి మీరు "సర్వము లయించగా అప్పటికీ శేషించు స్థితి" అని చెప్పునది దేనిని?

శ్రీ వసిష్ఠమహర్షి : "ఈ జగత్తు సత్తుకాదు" అనునట్టి వాస్తవజ్ఞానమే అట్టి స్థితి. "ఇది మిథ్య మాత్రమే"... అని గ్రహించనంతకాలం పరతత్త్వమును ఎక్కడా ఎవరూ ఎరుగలేరు. కనుక "దృశ్యమును త్యజించటం" అంటే "జడత్వము ఆశ్రయించటం"... మాత్రంకాదని మరల గుర్తు చేస్తున్నాను. గాఢనిద్రాసమయంలో పిపీలికాది బ్రహ్మపర్యంతము (పురుగు నుండి - బ్రహ్మదేవుని వరకు) దృశ్యరహితమైన జడత్వం పొందుచూనే ఉన్నారు కదా! అది మోక్షం అనిపించుకుంటుందా? లేదు "ఈ దృశ్యము నేను చూడను" అని కళ్ళు మూసుకొన్నంత మాత్రంచేత పరతత్త్వానుభవం ప్రాప్తించదు.

ఈ దృశ్యము స్వతఃగా ఉన్నది కాదు. ఇది స్వకల్పితమాయ చేతనే ఈ సమస్త ప్రాణులకు ఆయా విధములుగా తోచుచున్నది. సమస్త జీవరాసులలో ఏకస్థమైయున్న బ్రహ్మము ఈ 'దృశ్యా నుభవము'చే ఏమాత్రం ఏ క్షణమందుకూడా తాకబడటంలేదు"... అనునట్టి ఉత్తమ సంస్కారం లేక దృష్టియే మోక్షము. కనుక రామా! ఈ దృశ్యము లేదు. బ్రహ్మము మాత్రమే ఉన్నది.

❖❖❖

10. భౌతికదృష్టి

శ్రీరాముడు : మాకందరికీ ఎదురుగా కనిపిస్తూ ఈ దృశ్యము స్పష్టముగా అనుభవ మగుచున్నది కదా! ఇది మిథ్య ఎట్లా అవుతుంది? మరొక ప్రశ్న. బ్రహ్మము అత్యంత సూక్ష్మమైనదిగా చెప్పబడింది కదా! అట్టి సూక్ష్మమైనదానిలో ఈ అత్యంత విస్తారమైన జగత్తు ఎలా ఇమిడి ఉన్నది?"* ఆవగింజలో మేరుపర్వతం ఇమడగలదా?

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! నీయొక్క ఇతఃపూర్వపు దృఢాభ్యాసం చేతనే ఇప్పుడు ఈ ప్రపంచమును పాంచభౌతిక దృష్టితో చూస్తున్నావు. అందుచేతనే నీపట్ల "ఇది స్థూలము - ఇది సూక్ష్మము" ... మొదలైన వ్యవహారములన్నీ ప్రవర్తిస్తున్నాయి.

ఇప్పుడు నీవు ఏకాగ్రతచిత్తంతో సాధుసంగం, సచ్ఛాస్త్రం, స్వవిచారణలను ఆశ్రయిస్తూ ....

---

* **"తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్"** అతి సూక్ష్మమై, హృదయాం తర్భాగమందున్న అద్దానియందే సర్వము ప్రతిష్ఠితమైయున్నది .... మంత్రపుష్పం.

"ఈ దృశ్యము వాస్తవానికి ఏమైయున్నది?" అనునది పరిశీలించటం జరుగుతోంది కదా! ఇక నీ చిత్తమును అంటిపెట్టుకొని ఉన్నట్టి దృశ్యభ్రాంతి తొలగుతుంది. ఎప్పుడైతే "ఈ దృశ్యము ఇట్లు ఉన్నది" అనునట్టి ఆసక్తిపూర్వక జ్ఞానం తొలగుతుందో ... అప్పుడు ద్రష్టత్వము యొక్క ఆవరణ కూడా నశించుచున్నది. అనగా "వీటిని దర్శించునట్టి ద్రష్టనగు నేను ఈ దృశ్యమునకు మాత్రమే పరిమితుడనై ఉన్నాను" అను భావన ఉండదు. అప్పుడు శేషించేదేమిటి? స్వస్వరూపమగు శుద్ధ చైతన్యమే. అద్దానియందు ప్రజ్ఞాపూర్వకంగా నిలకడ కలిగియుండుటే మోక్షం.

అసలు దృశ్యానుభవం ఎక్కడి నుండి సిద్ధిస్తోంది? ద్రష్టత్వము నుండే కదా! ఈ ప్రపంచంలో ద్విత్వము (రెండు కలవు) అనుదానినుండి ఏకత్వము; ఏకత్వయోచన (ఆలోచన) నుండి ద్విత్వము కలుగుచున్నాయి. 'ఒకటి' లేకపోతే 'రెండవది' కలుగదు. ఈ 'ద్విత్వ వివర్జితమైనట్టి సద్వస్తువు (that which is absolutely true) మాత్రమే మిగిలి ఉంటుంది. "ఈ జగత్తు (లేక దృశ్యము) అవాస్తవము. మిథ్య, భ్రమ వంటిది" అను బోధ నీకు కలిగించాననుకో ... అప్పుడు నీ చిత్త దర్పణమును అంటిపెట్టుకొనియున్న "అహంకారం, బుద్ధి, మనస్సు, వస్తుభావన" .... మొదలైన రూపమునగల "దృశ్యమలము" తొలగి పోతుంది. ధూళి తుడిచివేయబడినప్పుడు దర్పణము (అద్దం) సుస్పష్టముగా ప్రతిబింబములు చూపునట్లు, శుద్ధ చిత్తమునందు ఆత్మవస్తువు తన నిత్య అఖండాది స్వభావములతో మహా స్పష్టముగా ప్రకటితం కాగలదు.

"ఈ దృశ్యమూలము తొలగుట కష్టసాధ్యము కదా" అని నీవు భావించకూడదు సుమా! ఎందుకంటావా? అసత్తు అయినదానికి సత్తు (లేక ఉనికి) ఎక్కడ? సత్తుకు "లేకుండటం" అనునది ఎప్పుడుంటుంది? స్వాభావికంగానే మిథ్య అయినదానిని తొలగించటంలో కష్టమేమి ఉంటుంది చెప్పు?

ఓ ప్రియరాఘవా! ఈ కనబడు విశాల బ్రహ్మాండము ఎన్నడూ ఉత్పన్నమే అయి ఉండలేదు. ఇదంతా ఆ నిర్మల చైతన్యముననే కల్పితమైయున్నది. అందుచేత దీని వాస్తవ స్వరూపం బ్రహ్మమే. ఆభరణము బంగారమే అయివున్నది కాని మరింకేమీ కాదుకదా! అదే విధంగా ఈ జగత్తు కూడా మిథ్యయే. ఇది ఏనాడూ సృష్టించబడలేదు. "ఉంగరము" అనబడునది బంగారమునకు వేరుగా ఎక్కడైనా ఉన్నదా? కొయ్యయందు చెక్కబడిన వస్తుజాలమంతా కొయ్య కన్నా వేరుకాదు కదా! స్వతఃగా లేకుండా, ద్రష్టయందు కల్పితమాత్రంగా రూపుదిద్దుకొనియున్న ఈ జగత్తును మనస్సు నుండి తొలగించుటలో శ్రమ ఏమి ఉంటుంది చెప్పు? బ్రహ్మతత్త్వము నిత్యసత్యమైయున్నది. కనుక "అత్యంత సహజమైనది?" నీకు ఈ విషయం అనేక యుక్తులతో విశదీకరిస్తున్నాను.

ఎడారిలో భ్రమ చేతనే సూర్యకిరణముల ప్రతిభాస (refraction) వలన "సరోవరం" అగుపిస్తోంది. కాని మరుభూమి (లేక ఎడారి)లో సరోవరమెక్కడ? ఒకానొక కంటి దోషం చేత ఆకాశంలో రెండు చందమామ కనిపిస్తాయి. కాని ఇద్దరు చంద్రులు వాస్తవంగా ఉన్నారా? వంధ్య (గొడ్రాలు)కు కుమారులు ఉండటం ఏమిటి? భ్రమచేత ఆకాశంలో మేఘముల ఆకృతి కారణంగా ఆకాశంలో ఆయా వస్తుజాలముల ఆకారములు (కొండకొండల మధ్య సరోవరం మొ॥వి)స్ఫురించి

నంత మాత్రంచేత ఆ పదార్థములు అక్కడ ఉన్నాయా? ఈ జగత్తు కూడా లేదు. దీనికి అస్థిత్వము లేకపోయినప్పటికీ ... భ్రమచేతనే ఇట్లు గాంచబడుచున్నది.

ఓ రామచంద్రా! మరల చెప్పుచున్నాను. నీవు చూస్తున్నది, నీకు కనబడుచున్నది ... అంతా బ్రహ్మమే సుమా! ఇప్పుడు నేను చెప్పుచున్నదానిలో తగినంత నమ్మిక నీకు కలుగవచ్చు. కలుగక పోవచ్చు. నేను యుక్తియుక్తంగా చెప్పబోయేదంతా వినిన తరువాత ఈ విషయం నీవే గ్రహిస్తావు.

సర్వజనులారా! తత్త్వజ్ఞులు లోకానికి ప్రసాదిస్తున్న యుక్తితో కూడిన ఉపదేశములను చక్కగా వినండి. అంతేకాని, "ఇదంతా మాకెందుకు?" అని తలచుచు దృష్టాంతముల సహాయంతో ఆత్మజ్ఞులు, అనుభవజ్ఞులు అగువారు బోధిస్తున్నది తిరస్కరించకండి. అట్టి జ్ఞానుల వాక్యములను తిరస్కరిస్తూ ఆత్మ (స్వస్వరూపము) యొక్క స్వరూప – స్వభావములను గ్రహించకుండా, యుక్తిరహితమైన పంథాను అనుసరించేవారు తమ విలువైన 'కాలము' అను అవకాశమును వృథా చేసుకొంటున్నారు. అశ్రద్ధ కారణంగా ఆత్మసమాచారము విషయమై స్తబ్ధత వహించియుండే మూఢ బుద్ధులను, మంద భాగ్యులను, అజ్ఞులను, అప్రయత్నశీలురను ఈ ప్రపంచములోని పదార్థములు గాని, మరెవరుగాని కాపాడగలరా? లేదు.

❖❖❖

11. జీవన్ – విదేహముక్త లక్షణములు

శ్రీ వసిష్ఠమహర్షి : బ్రహ్మమునందు చిత్తమును నిలిపి, బ్రహ్మగతప్రాణులై ఒకరినొకరు బ్రహ్మము గురించి సంభాషించుకొనువారు కొందరు జ్ఞానదృష్టిచే సంతుష్టులై ఆనందమును పొందుచున్నారు. బ్రహ్మవిచారపరులగు అట్టి జ్ఞాననిష్ఠులకు జీవన్ముక్తి లభించుచున్నది. అట్టి జీవన్ముక్తులు విదేహముక్తులు కూడా అగుచున్నారు.


శ్రీరాముడు : హే బ్రహ్మజ్ఞా! మీరు మాకు "జీవన్ముక్తుల – విదేహముక్తుల" లక్షణములు ఏమిటో చెప్పండి. మీరు చెప్పినది విని శాస్త్రదృష్టితో, స్వబుద్ధితో వాటికొఱకై మేము ప్రయత్నం చేయగలుగుతాం.

శ్రీ వసిష్ఠమహర్షి :

జీవన్ముక్తుడు : శాస్త్రవిధిని అనుసరించుచూ, ఈ విశ్వమును శూన్యముగా గ్రహిస్తూ ఉండేవాడినే మనం "జీవన్ముక్తుడు" అని పిలుస్తున్నాం. ఆయా ప్రవాహపతితమైన లోకక్రియలను నిర్వర్తిస్తూ జ్ఞానసహితుడై, జాగ్రదవస్థయందు కూడా నిద్రితుని లాగానే, నిర్వికారుడై మెలగువాడే జీవన్ముక్తుడు.

అతని ముఖము సుఖము లభించినప్పుడు వికసించదు. దుఃఖము ప్రాప్తించినపుడు ముకుళించదు. అన్ని సమయములందు ఒకే రీతిగా ఉంటుంది. ఎప్పుడు ఏది చేయవలసి ఉంటుందో, అది ఆయా సమయములందు అట్లే ఇతరులకు అనుకూలంగా అవలంబిస్తూ ఉంటాడు. మేలుకొని ఉన్నప్పుడు కూడా నిర్వికార ఆత్మతత్త్వమును ఆశ్రయించినవాడై సుషుప్తునివలె ఉంటాడు కదా! అందుచేత "ఇతడు సుషుప్తుడేమో!" అనిపించవచ్చు. కాని, "అవిద్య" అను నిద్ర నశించియుండటంచే

ఆత్మయందు అతడు సర్వదా జాగ్రతుడే అగుచున్నాడు. ఈ దేహేంద్రియముల విషయంలో "ఇవి నాకు సంబంధించినవి" అనిగాని, "నేను వీటికి సంబంధించినవాడిని" అనిగాని అతడు అనుకోడు. అందుచేత అంతరంగంలో ఎట్టి ఉద్వేగం పొందకుండానే ఉంటాడు. జాగ్రత్ వాసనలన్నీ నశించియే ఉండటంచే అతడు స్వప్నస్థితికి కూడా సంబంధించినవాడు కాదు.



గాలి వేగంగా వీస్తున్నదనుకో... ఆ గాలి వేగానికి కొండపై చెట్లు కదులుతాయేమోగాని, కొండ కదలదు కదా! బయటకు సంతోష, దుఃఖ, రాగ, ద్వేష, భయాదులు అతడు ప్రకటించినప్పటికీ, అంతరంగంలో మాత్రం ఆకాశంవలె స్వచ్ఛుడై వెలయుచు ఉంటాడు. తన వాస్తవ స్వరూపమేమిటో, ఏది తాను కాకయే ఉన్నాడో తెలుసుకొనే ఉంటాడు. "నేను దేనికి కర్తను కాదు. చైతన్యస్వరూపుడనగు నేను పుట్టుటలేదు. చచ్చుటలేదు. ఏదియు నిర్వర్తించుట లేదు. ఇక నాకు బంధమేమిటి? మోక్షమేమిటి?" అనునట్టి నిరహంకారత్వము, అకర్తృత్వభావన కలిగి ఉంటాడు. కర్తృత్వాభిమానము లేనివాడూ, కర్మలు చేసినా, చేయకున్నా బుద్ధిచే దేనిని స్పృశించనివాడు అయి ఉంటాడు.

"చిదాత్మస్వరూపమగు నేనే ఆవరణము తొలగినప్పుడు ప్రళయమును, ఆవరణమున్నప్పుడు సృష్టిని కల్పించుకొనుచున్నాను" అనునట్టి గ్రాహ్యబుద్ధితో ఉంటాడు. చేస్తూ – చెయ్యనివాడుగా, చూస్తూ–చూడనివాడుగా కాలగమనం సాగిస్తాడు. ఎవరికీ భీతి కలిగించడు. తాను లోకములను చూచి భీతిచెందదు. సంతోషము–దుఃఖము–భయము ... అనువాటినుండి పూర్తిగా విడివడి ఉంటాడు.

జీవన్ముక్తునికి ఈ సంసారముపట్ల 'కించిత్' కూడా ఆసక్తి ఉండదు. ఆసక్తి ఉంటేకదా బంధము? ఆసక్తి లేకపోయినప్పుడు ఇక ఎవరికైనా జీవన్ముక్తత్వము వలన వచ్చే లోటు ఏం ఉంటుంది? అతడు దేహి అయి ఉన్నప్పటికీ నిరాకారుడై, మనస్సు ఉన్నప్పటికీ అమనస్కుడై ఉంటాడు. అందరిలాగానే ఈ జగత్తులో సంచరిస్తూ కూడా సర్వదా నిశ్చింతుడై ఉంటాడు. ఈ జగద్వ్యాపారములందు పాల్గొనుచున్నప్పటికీ, కామాదుల వేగానికి ఏమాత్రమూ లొంగడు. ప్రతి ఒక్కరియందును ఆత్మయొక్క పూర్ణత్వమును సదా దర్శిస్తూ ఉంటాడు.

విదేహముక్తుడు : అట్టి జీవన్ముక్తుడు కాలక్రమంగా దేహము త్యజించిన తరువాత విదేహ ముక్తుడగుచున్నాడు. వాయువు స్పందము వదలిన తరువాత నిశ్చలత్వము పొందుతుంది కదా! అట్టి విదేహముక్తుడు మరల జన్మించడు. మరణించడు. వ్యక్తుడుకాడు. అవ్యక్తుడుకాడు. దూరముగాని,

దగ్గరగాని ఉండడు. 'నేను–ఇతరులు' అను భేదదృష్టి అతనికి ఉండదు. సర్వాత్మకమగు బ్రహ్మమే తానగుచున్నాడు. అందుచేత, సూర్యరూపమున తాపమును, బ్రహ్మ అయి జగత్‌సృష్టిని, విష్ణువై రక్షణను, శివుడై సంహారమును చేస్తూ ఉంటాడు. ఆకాశస్వరూపుడై గాలియొక్క స్పందమును గ్రహిస్తూ ఉంటాడు. మేరుపర్వత స్వరూపుడై .... సుర, అసుర దైత్య, పాలకులకు, ఋషులకు కూడా నివాసస్థానమై ఉంటూ ఉంటాడు. భూమి అయి ఈ సృష్టినంతా వహించుచున్నాడు. వృక్షస్వరూపుడై మధురఫలములను ప్రసాదిస్తూ ఉంటాడు.

జలరూపంతో ద్రవత్వము, 'అగ్ని' రూపంతో దాహకత్వము ధరిస్తూ ఉంటాడు. ఆ ముక్త పురుషుడే దిక్కుల రూపమును సంతరించుకొని వెలుతురు, చీకటిలను విస్తరింపచేయుచూఉంటాడు. 'శూన్యరూపి' అయి ఆకాశమును, పర్వతమై స్థలమును ఆక్రమించుచు ఉంటాడు. వికసిత చైతన్యమై ఈ కనబడే జంగమపదార్థములను సృష్టించుచున్నాడు. సముద్రమై భూమిని చుట్టుకొని ఉంటున్నాడు. ఆవరణ లేనట్టి చిదాత్మ రూపమున (అనావృత్తంగా) ఈ విశాల విశ్వమును వెలిగించుచు .... శాంత రూపమున అవస్థితుడై ఉంటున్నాడు. ఓ రాఘవా! భూత–భవిష్యత్–వర్తమాన కాలములలో ప్రకాశితమైనది, అగుచున్నది, అవబోవుచున్నది అయినట్టి ఈ దృశ్యసమూహమంతా కూడా ఆ విదేహముక్తుడే అయివున్నాడు సుమా!

❖

శ్రీరాముడు : మహర్షీ! "సమదృష్టి పొందటం" ... అనునది చాలా కష్టమైనది, దుష్ప్రాప్యమైనది కూడా కదా! కనుక మీరు చెప్పుచున్నట్టి ఆ 'విదేహముక్తి' ఏమంత సులభమైన విషయం కాదేమో? ఈ చిత్తమును చూచారా? ఇది క్షణక్షణం చంచలమై ఉన్నది కదా! దీని చాంచల్యమును నిరోధించేదెట్లా? స్వామీ! ఇందుకు సరైన ఉత్తమమైన ఉపాయం ఉంటే చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రాఘవా! చిత్తమును నిరోధించాలని అనుకొంటే ఆ చిత్తముయొక్క వాస్తవ స్వరూపమేమిటో మొట్టమొదట గ్రహించాలి. చిత్తము విషయమై మనం విస్తారంగా చర్చించబోతున్నాం. శత్రువును మట్టుపెట్టాలనుకొంటే ... ఆ శత్రువు యొక్క స్వరూప – స్వభావాలేమిటో, శక్తి – యుక్తులేమిటో, గ్రహించాలి కదా! అయితే ఆ చిత్తము విషయమై నీవు దిగులు చెందవలసినపనిలేదు. ఈ మన విచారణను వెంటనంటి వస్తూ ఉండగా సర్వము విదితమౌతుంది. అప్పుడు నీ ముక్త స్వరూపము నీకే అవగతమౌతుంది.

'ముక్తి' అని దేనిని అంటున్నామో, అదే బ్రహ్మము, అదే నిర్వాణము. అది పొందటానికి ప్రతిజీవునకు హక్కు ఉన్నది. స్వగృహం చేరుటను ఎవరు కాదనగలరు? ఇక అది పొందటానికి ఉపాయమంటావా? విను.

"నేను' అను బుద్ధితో కూడుకొని కనబడుచున్న ఈ దృశ్య – జగత్తంతా గొడ్రాలి కుమారుని వలె 'భ్రమ' మాత్రమే. ఇందేదీ సత్యము లేదు".... అనునట్టి జ్ఞానము వలన అట్టి ముక్తి లభిస్తోంది.

❖❖❖

12. దృశ్యము తొలగేదెట్లా?

శ్రీరాముడు : హే వేదజ్ఞా! ఇక్కడ నాదొక సందేహం.

"విదేహముక్తులే త్రిభువనములుగాను, సూర్యాది మహత్తర పదార్థములుగాను అగుచున్నారని మీరు చెప్పారు కదా! అనగా ఆ విదేహముక్తి – స్వరూపులే ఈ సృష్టిగా మారుచున్నారని అనుకోవచ్చా?"

శ్రీ వసిష్ఠమహర్షి : నీ ప్రశ్న బాగానే ఉన్నది. అయితే నేను నిన్ను మరొక ప్రశ్న అడుగుతాను. అసలు "త్రిభువనములు (స్వర్గలోకం, మర్త్యలోకం, పాతాళలోకం) ... అనే పేరుతో ఏదైనా ఉండి ఉన్నదంటావా? ఉండి ఉండటం వాస్తవమైతే "వారు అట్లు మారినారు" అని అనవచ్చు. "త్రిలోకములు" అనబడే పదార్థమే లేదని జ్ఞానులు ఎరిగియే ఉన్నారు. "ఆ బ్రహ్మమే చిత్‌శక్తి వలన ఈ సంసారముగా మారుచున్నది" అను ప్రవచనం కూడా భ్రమమాత్రమే అయ్యున్నది. 'జగత్తు' అను శబ్దము, అర్థము కూడా కేవలము కల్పనయేనని సిద్ధాంతీకరించబడుచున్నది.

ఈ నా వాక్యములు సూక్ష్మబుద్ధితో గ్రహించాలి సుమా! వాస్తవానికి ... "అతి నిర్మలము – శాంతము – చిద్రూపము" ... అయినట్టి బ్రహ్మము ఒక్కటే ఉన్నది. 'జగత్తు' అనబడు వేరొకటి లేనేలేదు. నీవు సద్వస్తువును సూక్ష్మబుద్ధితో గ్రహించినప్పుడు ఈ సత్యము బోధపడగలదు. ఈ విషయంలో బ్రహ్మజ్ఞానుల అనుభవం అది. మేము కూడా ఈ "జగద్దృశ్యము"ను ఎంతో తరచి–తరచి పరిశీలించాం. ఎంత విచారించి చూచినా "బంగారు ఆభరణం" అనబడు దానిలో బంగారము కాకుండా 'ఆభరణము' అని చెప్పబడుదానిగా ఏదైనా పదార్థముగాని, వస్తువుగాని లభిస్తున్నదా? జలకెరటంలో జలము కాకుండా 'కెరటము' అనబడే ఏదైనా ఎక్కడున్నది? గాలి వీచికలు గాలి కంటే వేరా చెప్పు? శూన్యత్వము ఆకాశము కంటే వేరా? సూర్యుని కంటే సూర్యకిరణములు లేక సూర్యప్రకాశము వేరు కాదు కదా! అదే విధంగా "జగత్తు కూడా బ్రహ్మము కంటే వేరుకాదు" అనునదే సత్య ద్రష్టలగు మా అంతిమ నిర్ణయం. కనుక ఇదంతా బ్రహ్మమే అయ్యున్నది.

❖

శ్రీరాముడు : స్వామీ! దేనియొక్క అత్యంత అభావము (భావించకుండటం) వలన ఈ దృశ్యజగత్తు అంతర్ధానమైపోతుంది? దేనిని వినటంచే మాలో పేరుకొనిన ఈ అజ్ఞానము తొలగుతుంది? అట్టి విషయమును, రహస్యమును మాకు బోధించండి.

అంతేకాదు, "పరస్పర సాపేక్షల రూపముననే (relative to each other) .... ఈ దృశ్యము–ద్రష్ట ప్రవర్తించుచున్నాయి" అనునది నిర్వివాదాంశమే కదా! ద్రష్ట–దృశ్యములలో ఒకటి ఉండటంచే రెండవదానికి ఉనికి లభిస్తోంది "ఈ ద్రష్ట–దృశ్యము అనునవి రెండు అంతరించినపుడు మిగలి ఉండేది నిర్వాణమే" అని మీరు చెప్పారు. ఈ జగత్తు యొక్క అభావము, అప్పుడు ఉండి ఉండే స్వభావస్థితి యగు బ్రహ్మము గురించి మరికొంత వివరించి చెప్పండి. దేనిని పొందిన తరువాత ఆపై మరింకే సాధనములచే పని ఉండదు? అట్టి దాని గురించి ప్రవచించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! ఈ జీవునియందు ... "జగత్తు లేక దృశ్యము" ... అనబడు జ్ఞానము అనేక జన్మలుగా పాతుకుపోయి ఉన్నది. ఎందుచేతనంటావా? అతడు ఈ దృశ్యజగత్తులోని వస్తుజాలముపట్ల, "ఇవి నన్ను సంతసింపజేయగలవు. ఇవి పొందినప్పుడే తృప్తుడను, లేదా అసంతృప్తుడనే" .... అనబడు ఒక విధమైన మూర్ఖత్వముతో కూడిన నమ్మకము కలిగి ఉంటున్నాడు. ఇంద్రియానుభవముల పట్ల తనయందు ఏర్పరచుకొన్న ప్రియత్వముచే, అట్టి అనుభవము కొరకు వేలాది జన్మలుగా పరుగులు తీస్తూనే ఉన్నాడు. సరే, అయినదేమో అయినది. ఇప్పుడైనా చక్కగా విచారించటం ప్రారంభిస్తే "మిథ్యాజ్ఞానము" అనబడే విషూచివ్యాధి తప్పక నయమౌతుంది.

కాని ఒక విషయం. నిట్టనిలువుగా, ఎత్తుగా ఉన్న కొండ ఎక్కడం-దిగటం అంత తేలికైన విషయం కాదుకదా! ఈ జ్ఞానం కూడా తనంతటతానే సహజంగా స్వయంగా లభించేది కాదు. నేనిట్లా అంటున్నానని నా ప్రియశ్రోతలు నిరుత్సాహపడకుండెదరు గాక! 'చాల కష్టము' అని చెప్పి నిరుత్సాహపరచటం నా ఉద్దేశమే కాదు.

ఈ ప్రపంచంలో మానవుడు అనేక కఠినమైన విషయాలు కూడా సాధిస్తున్నాడు. ఎట్లా?.... అభ్యాసము-యుక్తులను ఆశ్రయించే కదా! అదేవిధంగా ఈ జగద్భ్రాంతి కూడా .... అభ్యాసము వలన, యుక్తి - ఉపాయము వలన, సత్పురుషుల ఉపదేశములను వినటంచేత, శాస్త్రములచే చెప్పబడిన విజ్ఞానయుక్తమైన ప్రయత్నముల చేత ... తప్పక ఉపశమిస్తుంది. నీకు చెప్పబోవు ఈ కథనము వలన బోధ (Awareness) స్వరూపమగు ముక్తి తప్పక లభిస్తోంది.

❖❖❖

13. నిత్యలభ్యమగు పరబ్రహ్మము

శ్రీ వసిష్ఠమహర్షి : శ్రీరామచంద్రా! ఈ 'ఉత్పత్తిప్రకరణం'లో మనం ... "జగద్భ్రాంతి జన్మరహితమైన ఆకాశమువలె ప్రభాసితమగుచున్నది" అని ప్రతిపాదించబోవుచున్నాము.

ఈ దృశ్యజగత్తు దేవ-దానవ-మానవ-పక్షి-మృగ-పిపీలిక (చీమలు) మొదలైన జంగమ పదార్థములతోను, కొండ-నేల మొదలైన స్థావర పదార్థములతోను నిండియున్నట్లు నీవు చూస్తున్నావు కదా! అట్టి ఈ దృశ్యజగత్తు అంతా మహాప్రళయ సమయమున అదృశ్యమై పోతోంది. వినష్ట మగుచున్నది. రుద్రాది దేవతాగణం కూడా అదృశ్యమై పోతోంది. ఎందుచేత? ఇదంతా అసత్తే. కనుకనే, "ఏదైతే కనబడుతోందో, అది నశించబోవుచున్నది" ... అనునది లోకవిదితమైన అనుభవమే కదా!* ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకుండా పోయేది సత్యమెలా అయి వుంటుందయ్యా? సద్వస్తువునకు 'లేకపోవటం' అనేది ఏ క్షణమందును ఉండదు. అసద్వస్తువునకు భ్రమచే కనబడినంత మాత్రంచేత 'ఉనికి' ఉన్నదా? లేదు. అయితే ఈ రెండింటినీ విభాగం చేయగల (వేరుచేయగల) దృష్టి కావాలి.

* యత్‌దృశ్యమ్ ..... తత్ నశ్యమ్

ఈ దృశ్యమంతా నీ దృష్టిలో అదృశ్యమైనప్పుడు, ఇక మిగిలేదేమిటి? అప్పుడు తేజము ఉండదు. అంధకారము కూడా ఉండదు. ఒకానొక సత్త (Absolute Existence Awareness) మాత్రమే మిగిలి ఉంటుంది. "అది అట్టిది" అనిగాని, "దాని పేరు ఇది" అనిగాని చెప్పటానికి వీలుపడదు. మనస్సు ఉన్నంతసేపు మాత్రమే... "ఇట్టిది – ఈ పేరు" అనేవి ఉంటాయి. కాని ఆ 'సత్త' మనస్సుకు ఆవల ఉన్నది కదా! అది శూన్యమా? కాదు. పోనీ నిరాకారమందామా? అదీకాదు. దృశ్యము కాదు. దర్శనము కాదు. పంచ భూతములలో ఏ ఒక్కటి కాదు. లేక మరియే ఇతర పదార్థము కాదు. దానిని 'ఇది' అని నిర్ణయించి చెప్పలేమని మరొక్కసారి ప్రకటిస్తున్నాను. సర్వపూర్ణములకంటే పూర్ణమైనదది. దానిని 'సత్తు' అని మనం మన సంవాదము కొరకు అనుకున్నప్పటికీ అది 'సత్తు' (ఉన్నది) కూడా కాదు. అసత్తు కూడా కాదు (That is beyond existence & non-existence). భావ పదార్థం కాదు. అభావ పదార్థం కూడా కాదు.

మాటలకు* అందనట్టి దానిని గురించి ఏమి చెప్పమంటావు? అయినప్పటికీ, నీవు సూక్ష్మగ్రాహివి కనుక, నీ బోధ కొరకు దాని గురించి కొన్ని గుర్తులు చెపుతాను : అది కేవల చిన్మాత్రము. అనంతము. ఆదిగాని, మధ్యగాని లేనిది. జన్మలేనిది. నిరామయమైనది. మంగళ స్వరూపమైనది. చమత్కారం చూచావా! సత్–అసత్‌రూపియగు ఆ పరమవస్తువు సర్వస్వరూపములు తానే అయివుండి కూడా ... ఏదియు కాకయే ఉన్నది. ఒక అతి ప్రావీణ్యము గల శిల్పి కొయ్యతో ఏనుగును తయారుచేసినప్పుడు, అది చూచుచున్నట్టి ప్రేక్షకునికి అక్కడ కొయ్య కాకుండా ఏనుగే కనిపిస్తుంది కదా! ఆ పరమ వస్తువునందే ఈ జగత్తు కనబడుతోంది.

చిదాకాశస్వరూపము, నీ–నా–సర్వుల వాస్తవ స్వరూపము అయినట్టి ఆ పరమ వస్తువునకు ... కళ్ళు, కాళ్ళు, ముక్కు, చెవి, నాలుక, చర్మము ... మొదలైనవి లేవు. అయినను అది అన్నిచోట్ల, ఎల్లవేళల చూస్తోంది. వింటోంది. వాసనచూస్తోంది. రుచిచూస్తోంది. స్ఫురిస్తోంది. అద్దాని ప్రకాశము వల్లనే సత్–అసత్ వస్తువులు వీక్షింపబడుచున్నాయి. అనాది, నాశనశీలము అయినట్టి ఈ సృష్టి దానియందే చిత్రింపబడినదని గ్రహించు. సగం మూసుకొన్న కళ్ళతో ఈ దృశ్యమును ప్రతిబింబ మాత్రంగా చూచేది కూడా అదియే సుమా!

సర్వవ్యాపియగు ఆ బ్రహ్మమునకు కారణమంటూ ఏదీ లేదు. నీటిలో తరంగములు లేస్తాయి. చూచావా? అట్లే బ్రహ్మమునందే ఈ సృష్టులన్నీ నిరంతరం ఉదయిస్తున్నాయి. కనబడుతున్నాయి. లయిస్తున్నాయి. ఎన్ని తరంగాలు లేచినా, లేవకున్నా–నీరు మార్పు చెందదు కదా! బ్రహ్మము విషయము కూడా అంతే. అయితే, అది ఎక్కడో ఉన్నదని, ఎన్నడో లభిస్తుందని భ్రమించకుండెదవు గాక! ఎందుకంటే అది చిత్తమునందే చిన్మాత్ర దీపమై వశించుచు, స్వతేజముచే ముల్లోకములను ప్రకాశింపజేయుచున్నది. ఆ పరమ వస్తువు యొక్క ప్రకాశము ఉండటం చేతనే, 'సూర్యుడు' మొదలైన తేజోమయ పదార్థములు చీకటిమయం కాకుండా ఉండగలుగుతున్నాయి. ఎండమావులలో

---

* యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసాసహా.

నీరు కనబడుచున్నట్లు అద్దాని సత్తయందే మూడు లోకములు ప్రకాశించటం జరుగుతోంది. దాని యందు 'ఇచ్ఛ' అనునది జన్మించినప్పుడు ఆ ఇచ్ఛను అనుసరించే ఈ 'జగత్తులు' అనే నిప్పురవ్వలు వెలువడటం, అట్టి ఇచ్ఛ త్యజించబడినపుడు, అవి కరిగిపోవడం జరుగుతోంది. ఆ మహద్వస్తువు యొక్క నిర్మల-అక్షయ స్వభావము లేక స్పందము వలననే సృష్టి - స్థితి - సంహారములు ప్రవర్తిల్లుతున్నాయి.

ఆ పరమవస్తువు యొక్క సత్త, వాయుస్వభావం వలెనే, సర్వగతము (All-Pervading), స్పందాస్పందమయము అయివున్నది. స్వల్పదృష్టిచే ఒకానొకప్పుడు అది "తన సద్రూప పూర్ణత్వము నుండి వేరుపడినదా?" అను విధంగా తోచుచున్నప్పటికీ ... వాస్తవానికి ఎట్టి భిన్నత్వము అది పొందటం లేదు. ఆ బ్రహ్మము సర్వదా నిద్రితము. సర్వదా జాగృతము. మరియు సర్వదా, సర్వత్రా జాగృతము కాదు. నిద్రితము కాదు. అద్దాని స్పందమునందే శాంతము, శివము అయినట్టి 'ముల్లోకములు' ఇమిడి ఉన్నాయి. అది ఏకాత్మకము, పూర్ణము. నశించే పదార్థాలలో ఉన్నప్పటికీ నాశనము లేకయే ఉన్నది. కుండ ఉండుటచే గాని, పగులుటచేత గాని ఆకాశమునకు వచ్చు లోటేమున్నది? మార్పు చేర్పులేమి ఉంటాయి? ఆ పరమ సత్త ఈ జగత్తు యొక్క భావము పొందుగాక, లేదా, త్యజించుగాక. దానికేమీ సంబంధము లేదు. అది మరొకటిగా కాబోదు.

అది వాగింద్రియము లేనిదగుటచే 'మూగ'. అయితే ఏం? వాక్ప్రవృత్తికి అదే కారణం. కనుక మూగది కాదు. రాతివలె సర్వదా నిర్వికారంగా ఉంటోంది. కాని, మననశక్తి అంతా దానిదే. నిత్యపరితుష్టమైనప్పటికీ, సర్వమునకు 'భోక్త' అదే. అది క్రియలకు ఏమాత్రమూ సంబంధించినది కాదు. కాని సర్వమునకు 'కర్త' అదే. అది ఆకారరహితమైనప్పటికీ, అసంఖ్యాకములగు హస్తపాదాది అవయవములతో విశ్వమంతా వ్యాపించియున్నది. ఇంద్రియశక్తులన్నిటికీ అది అతీతమైనప్పటికీ, సర్వ శరీరములలో ఇంద్రియ - వ్యాపారములన్నీ నిర్వర్తించేది అదే. తనకు 'మనస్సు' అనునది లేకపోయినప్పటికీ మనోచర్యలన్నీ తానే నిర్వర్తిస్తోంది.

ఓ రామచంద్రా! ఈ జీవుడు స్వస్వరూపమగు ఆ పరమవస్తువును గాంచకపోవటం చేతనే .... భ్రమ, సంసార వ్యాధి పొందుచున్నాడు. దానిని దర్శించాడా ... ఇక ఆపై సకలభయాలు, సర్వ వాసనలు ఎచటికో పారిపోతాయి.

దీపం ఉంటేనే కదా ... రంగము పై నాట్యము మొదలైన విన్యాసాలన్నీ జరిగేవి. సర్వవ్యాపియగు బ్రహ్మము అపరిచ్ఛిన్న ప్రకాశరూపమున "సాక్షి" అయి వెలయుచుండటం చేతనే ఈ చిత్తవృత్తులన్నీ తమ తమ కార్యములను నిర్వర్తిస్తున్నాయి. ఓ రాఘవా! సముద్రమందలి ఒకే జలము కెరటములుగా, ఆవర్తములుగా, బుడగలుగా, సుడులుగా ప్రకటితమగుటలేదా? ఒకే బంగారం గాజులుగా, గొలుసుగా, ఉంగరముగా, మరెన్నో నామరూపములుగల ఆభరణములుగా వ్యవహరించబడుతోంది కదా! అట్లే బ్రహ్మమే అవిభాజకమై కూడా అనేక రూపములతో వేర్వేరుగా కనబడటం అజ్ఞాన దృష్టికి జరుగుతోంది.

అయితే, నీకు జ్ఞానం లభించనంత కాలం ... "వీరు-వారు-నేను-నీవు" .... అను భేదముతో కూడుకొనిన బోధ తొలగదు. జ్ఞానము సుస్థిరమైనప్పుడు "ఆ చిన్మయ స్వరూపుడు ప్రకాశించుచున్న ఏ వస్తువుతోనూ నాకు భేదం లేదు" అని నీవు గ్రహించగలవు. నీటియందు అలలు లేచుచున్నట్లు ఆ బ్రహ్మవస్తువునుండే ఈ 'దృశ్యజగత్తు' అంతా ప్రభవిస్తోంది. అట్లాగే కాలము కూడా ఉత్పన్నమౌతోంది. తేజము ప్రకాశిస్తోంది. ఈ మానసిక సృష్టి అంతా జరుగుతోంది. నీవు గ్రహిస్తున్న ఈ రూప - రస - గంధ - శబ్ద - స్పర్శాదులన్నీ దానివలననే గ్రహిస్తున్నావని గ్రహించు. అవన్నీ కూడా అదియే. ఈ జ్ఞానమంతా ఆ బ్రహ్మమువల్లనే కలుగుతోంది. ఓ సాధూ! నీవు ఏకాగ్రచిత్తు డవగుదువు గాక! ద్రష్ట - దర్శన - దృశ్యముల మధ్య ఉన్నట్టి సాక్షి స్వరూపమగు ఆత్మను గ్రహించెదవు గాక! దర్శన-ద్రష్ట-దృశ్యములను త్యజించి, స్వస్వరూపమగు ఆత్మను పరిశీలించినప్పుడే నీకు ఆత్మ లభించగలదు. ఏకాగ్రచిత్తము లేనివాని చిత్తము పరిపరి విధముల ద్రష్ట-దర్శన-దృశ్యముల వెంట పరుగులు తీయుటచే ఆత్మను గ్రహించలేకపోవుచున్నది.

అట్టి స్వస్వరూపమగు బ్రహ్మమునకు ఉత్పత్తి లేదు. క్షయము లేదు. ఆద్యంతములు లేవు. అయ్యది శాశ్వతమై, నిత్యమై, మంగళస్వరూపమై, పవిత్రమై, పదార్థత్వరహితమై, వందనీయమై, అనింద్యమైయున్నది. దానికి ఆగంతుక (శరీరములు పొందటం - త్యజించటం వంటి) ధర్మములు లేవు. రాకపోకలు లేవు. సర్వకారణములకు కారణము అదే. అది అజ్ఞేయము (తెలియబడజాలనిది). ఎందుకంటావా? తెలుసుకొనునది అదే అయినప్పుడు తెలుసుకోవటమనేది ఎక్కడ ఉంటుంది? ఒకడు తనకు వేరైన వస్తువునైతే తెలుసుకోగలడు. ఆత్మయో, తన వాస్తవ స్వరూపమే కదా! అది స్వానుభవము చేతనే తెలియబడగలదు గాని, మరొకరు ప్రసాదించునది కాదు. అయ్యది ఏకమాత్రజ్ఞేయమై వెలయుచున్నది. నీయొక్క-నాయొక్క-సమస్త ప్రాణులయొక్క - సర్వము యొక్క సత్యస్వరూపము అదే. మనం అదికాకుండా మరింకేదీ అయివుండలేదు. దానిని దూరముగా, భవిష్యత్తులో ఎన్నడో ఎప్పుడో ఎక్కడో లభించునదిగా చూచువారు మా దృష్టిలో మూర్ఖులు మాత్రమే. అది నీకు-నాకు వేరైనది కాదు కనుకనే 'అద్వితీయము' అని చెప్పుకొంటున్నాం.

❖❖❖

14. ఈ జగత్తు బ్రహ్మమే

శ్రీరాముడు : హే వసిష్ఠ ప్రభూ! మీరు అనిర్వచనీయ బ్రహ్మము గురించి చెప్పిన విషయాలు యుక్తియుక్తంగా ఉన్నాయి. మహాప్రళయ సమయంలో మిగిలి ఉండే ఆ సద్వస్తువు మీరు చెప్పినట్లు నామరూపరహితమనటంలో నాకు ఎట్టి సందేహమూ లేదు. "అది శూన్యము కాదు. ప్రకాశము కాదు. అంధకారం కాదు. తమోరూపం కాదు. చిత్స్వరూపము (Form of Consciousness) కాదు. జీవుడు కాదు. బుద్ధి-తత్వము కూడా కాదు. మనస్సు కూడా కాదు" ... అని చెప్పారు. బాగానే ఉన్నది. ఇంతలోనే "అన్నియు అదే" అని అంటున్నారు. మీ వాక్యములలోను అర్థసమన్వయం నేను గ్రహించలేకపోతున్నాను. మరి కొంత స్పష్టంగా వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : నీ ప్రశ్నను మెచ్చుకొంటున్నాను. ప్రశ్న కొంత క్లిష్టమైనదే. సరే సూర్యుడు ఉదయిస్తే చీకటి పోతుంది కదా! నీ సందేహం పోగొట్టుతాను. విను.

'సర్వవిషయ రహితం' అయి ఉండునట్టి మహాప్రళయ సమయంలో శేషించి ఉండేది. "శూన్యము కాదు" :

ఒక కళాకారుడు ఒక శిలయందు సుందర స్త్రీయొక్క శిల్పమును మలచాడనుకో ....

– స్త్రీ శిల్పం చెక్కక ముందే 'శిల' అనునది ఉన్నది కదా!

– ఆ స్త్రీ యొక్క రచనకు శిలకన్నా వేరైన 'సత్తా' ఉన్నదా? లేదు. స్త్రీ యొక్క ఆకారమంతా శిలయే కదా!

– ఇప్పుడు కనబడుచున్న స్త్రీ ఆకారమంతా అంతకు ముందు ఎక్కడున్నది? శిలలోనే కదా!

– ఈ స్త్రీ ఆకారమునకు శిలకు ఏమి సంబంధం? శిల 'స్త్రీ'గా అగుచున్నదా? లేదే!

– శిల లేనిదే స్త్రీ ఆకారమెక్కడ ఉన్నది?

ఈ జగత్తు కూడా సృష్టికి పూర్వం బ్రహ్మమునందే ఉన్నది. అందుచేత, "బ్రహ్మము శూన్యము" అనటానికి వీలు లేదు. ఈ విశాల బ్రహ్మాండము జీవుని భోగనిమిత్తమై రచించబడినట్లు తోచుచున్నది. ఈ జగత్తు వాస్తవమే అయివుండనీ .... లేక శూన్యమే కాని ... లేదా ఎక్కడో ఏ మనస్సునందో ఉండనీ ... ఏది ఏమైనా, ఇది ప్రకాశించునట్టి అధిష్ఠానము (ఇది ఎందుకలదో – అయ్యది) శూన్యము కాదు. ఎందుకంటావా? శూన్యంలో "ఆరోపణ, విషయములు–జగత్తుకు సంబంధించిన అనుభవములు"... మొదలైన కార్యములు ఎలా సంభవిస్తాయి?

"శిలచే తయారుచేయబడిన 'స్త్రీ శిల్పం' ఇంతకుముందు శిలలోనే ఉన్నది." ఈ జగత్తు కూడా ఉత్పత్తికి పూర్వం బ్రహ్మమునందే ఉండి ఉన్నది.

– (శిల – స్త్రీ శిల్పములవలె) జగత్తు – బ్రహ్మము అభేదమైనది.

– స్త్రీ శిల్పం యొక్క కనులు, కాళ్ళు, ముక్కు వేరువేరైనట్లు 'శిల్పదృష్టి' కలవారికి కనిపిస్తుంది. కాని శిల దృష్టితో చూచేవారికి ఆయాభాగములన్నీ శిలగానే తెలియవస్తాయి కదా! ఖండదృష్టి గలవారికి ఈ జగత్తు "నీవు–నేను–వారు–వీరు– నీది–నాది–తదితర పదార్థములు"గా కనిపిస్తోంది. విజ్ఞానరూపమగు బ్రాహ్మీదృష్టి కలవారికి సర్వము బ్రహ్మముగానే ప్రదర్శితమౌతున్నది.

❖

నీకు ఇంకొక దృష్టాంతము చెపుతాను. ఒక తటాకంలో నిశ్చలంగా నీరు ఉన్నదనుకో ... ఇప్పుడు ఆ జలం నిశ్చలంగా కదలకుండా ఉన్నందుచేత తరంగములు కనిపించవు. అయితే 'తరంగములు' అనునవి బాహ్యము నుండి వస్తున్న ఏవైనా పదార్థములు కాదు కదా! ఆ నిశ్చలమైన నీరే స్పందము (చలనము) పొందినప్పుడు తరంగాలుగా మనకు కనబడటం జరుగుతోంది. "తరంగములు – అనునవి కదలికలేని జలంలో అంతర్లీనంగా ఉండియే ఉన్నాయి" అని మనం

అర్థం చేసుకోక తప్పదు. ఈ జగత్తు విషయం కూడా అట్టిదే. ఇది బ్రహ్మమునందే శూన్య-అశూన్య రూపమున ఉండీ-లేనట్లు, అనిర్వచ నీయంగా, నిలచియున్నది.

శిల, తదితర పరికరములు ఉన్నప్పటికీ, శిల్పి యొక్క ఇచ్ఛలేకపోతే శిల్పము ఎట్లా తయారవుతుంది? కల్పాంత కాలంతో కూడా బ్రహ్మయొక్క ఇచ్ఛ లేకపోతే ఈ జగత్తు సృష్టించబడదు. అయితే రామా! "జగత్తు బ్రహ్మమునందు ... శిలయందు శిల్పమువలె .... చిత్రించబడి ఉన్నది" అని చెప్పాను కదా! ఇక్కడ నేను ఉపయోగించిన ఉపమానం గ్రహించేటప్పుడు 'శిల-స్త్రీ శిల్పము వేరువేరు కానట్లు జగత్తు - బ్రహ్మము వేరువేరు కాదు" అని మాత్రమే బోధిస్తున్నానని గ్రహించు. ఆ అంశమును అంతమాత్రమే గ్రహించాలి. "ఈ జగత్తు అను శిల్పమునకు ద్రష్టయే శిల్పి. బ్రహ్మమే శిల" .... అని గ్రహించు. వాస్తవానికి ఈ 'జగత్తు' అనబడునది బ్రహ్మమునందు ఏనాడు ఉదయించి ఉండనేలేదు. ఏది ఉదయించనే లేదో ... అది ఇక అస్తమించటమనే ప్రసక్తి ఎక్కడ? ఇదంతా బ్రహ్మము కంటే వేరైనది కాదు. కనుక, సత్స్వరూపముననే నిలచియున్నది. ఇక ఈ జగత్తు విషయంలో "ఇది శూన్యము కాదు" అని చెప్పబడుతోంది.

పరబ్రహ్మము తమస్సు (చీకటి) కాదు, తేజము కాదు. అది సర్వదా మనందరి స్వస్వరూపమై విరాజిల్లుతూనే ఉన్నది.

నాయనా! రామా! ఈ సూర్యుడు, అగ్ని, నక్షత్రములు మొదలైన తేజోమయ పదార్థములు ఆ బ్రహ్మమును ప్రకాశింపజేయజాలవు. అవ్యయమగు పరమాత్మకు ఇట్టి తేజోమయ పదార్థములతో ఏమాత్రం సంబంధం లేదు. "చీకటి" అని మనం దేనిని అంటున్నాం? వెలుతురు లేకపోవుట (లేక వెలుతురు యొక్క అభావము)నే కదా! ఇట్టి భౌతికమైన తేజము లేకపోయినప్పటికీ బ్రహ్మము స్వయంప్రకాశమగుటచే, అది ఉండనే ఉంటుంది. అందుచేతనే "అది తమస్సు కాదు. తేజము కాదు" అని మనం చెప్పుకొన్నాం.

ప్రకాశస్వరూపమగు ఆ బ్రహ్మము స్వయంప్రకాశమై, బుద్ధి గుహ యందు ఉండి ఆ బుద్ధిని ప్రకాశింపచేస్తోంది. దానిని మరెవరూ, దేని చేతను ప్రకాశింపజేయలేరు. కాబట్టి "అది తమస్సు" అని కూడా చమత్కారంగా అంటూ ఉంటారు. అది సర్వప్రకాశములకు వేరైనదని గ్రహించు. అది అజరము (జరామరణములులేనిది). అవ్యయము, ఆకాశమువలె ఆది-మధ్య-అంతములు లేనిది. ఈ జగత్ స్థితికి ఆవల నిత్యమై స్వస్వరూపచమత్కారంగా జాజ్వల్యమానంగా సర్వదా ప్రకాశిస్తోంది. అందుచేత అది "పరమాత్మ" (ద్రష్ట - దృశ్యత్వ - దృశ్యములకు పరమై, ఆవలగా ఉన్నది....) అను శబ్దార్థము.... "పరమ్ ఆత్మః..." గా ప్రవచించబడుతోంది.

'మారేడుపండు' అని మనం పిలుస్తున్నదానికి, అందలి 'గుజ్జు'కు గల భేదమేమిటో చెప్పు? బ్రహ్మమునకు, జగత్తుకు కొంచెము కూడా భేదం లేదు. నీటియందు అలలు, మట్టియందు కుండలు ఉన్నట్లు ... బ్రహ్మమునందు ఈ జగత్తు ఉన్నది. అట్టి బ్రహ్మ పదార్థము శూన్యమెట్లా అవుతుంది? బ్రహ్మము నిరాకారమే అయినట్లు జగత్తు కూడా నిరాకారమే. ఆకాశరూపమగు ఆ

చిన్మయబ్రహ్మము ... ఈ పాంచభౌతికాత్మికమైన ఆకాశము కంటే అత్యంత సూక్ష్మమైనది. స్వచ్ఛమైనది. దాని అంతర్గతమై ఉన్నట్టి ఈ 'జగత్తు' అని చెప్పబడునది కూడా స్వచ్ఛమైనదే. సూర్యకిరణములకు ఉష్ణత్వము కాకుండా మరొక అనుభవం లేదు కదా! చిన్మయబ్రహ్మము "ఎరుక" అను అనుభవము మాత్రం కలిగి ఉంటోంది.

❖

పరమ్ – ఆత్మః = జగద్దర్శనమునకు మునుముందే సర్వాంతర్గతమై ఏర్పడియున్న స్వస్వరూపం.

"చిత్తు – అచిత్తు" అని రెండుగా శాస్త్రములచే చెప్పబడుచున్నదంతా పరమాత్మయందే ఉన్నాయి. ఆ "పరమాత్మ"యే దృశ్యముగా దర్శనముగా ప్రభవించుచున్నాడు. వాస్తవానికి పరమాత్మయే స్వరూపముగా గల జీవునకు 'దృశ్యత్వము' అనునది లేదు. దృశ్యత్వములేనట్లే జగత్తు కూడా లేదు. నామ–రూపములతో కూడిన బహిర్విషయములు, వీటికి అర్థములను కల్పిస్తున్న మనఃబుద్ధి – అహంకారాదులు, ఆయా విషయములు పరమాత్మయందు కల్పితమాత్రంగా ఉంటూ ... పరమాత్మకు వేరైనవి కాకుండానే (అద్వితీయమై) ఉన్నాయి.

ఈ విశ్వము ఏ విధంగానైనా ఉండనీ, చివరికి ఇందులో ఎదురౌతున్న ప్రతి విషయము 'సుషుప్తి'గా మారక తప్పదు. అనగా విషయములన్నీ ఒక స్థితిలో నిర్విషయమై పోతున్నాయి. అందుచేత "సుషుప్తి భూమిక" యందున్న యోగి ఈ జగత్తును పొందుచున్నప్పుడు ... అనగా ఇందు పాల్గొనవలసివచ్చుచున్నప్పుడు, (లేక) దీనిని త్యజించి ఒక మూల చతికిలపడి కూర్చొనవలసి వచ్చినప్పుడు ... ఉభయ సమయాలలో కూడా శాంత–చిత్తుడై ఉంటున్నాడు. సర్వప్రకాశము – అప్రకాశ్యము కూడా అయినట్టి (సర్వమును వెలిగించునది – దేనిని వెలిగించనిది కూడా అయినట్టి) బ్రహ్మభావమునందే సుస్థిరుడై నిశ్చింతగా ఉంటున్నాడు. ప్రశాంతత పొందిన జలంలో నానా విధములైన కెరటములు అణిగి ఉంటాయి కదా! అట్లే ఉత్తమయోగి దృష్టిలో నిర్వికార బ్రహ్మమునందు, నిర్వికారము, నిరాకారము అయినట్టి ఈ జగత్తు కూడా ... అన్నివేళల అణిగిపోయి ఉంటోంది. పూర్ణ బ్రహ్మము నుండి వెలువడుచున్న ఈ ఉపాధి–భేదముల వ్యవహారమంతా వాస్తవానికి నిరాకారమైనదే. మరి పూర్ణబ్రహ్మము నుండి వెలువడుచున్న అనేక అనుభవములతో, పదార్థములతో కూడుకొనిన ఈ జగత్తు యొక్క పాత్రఏమిటి? ఈ విషయంలో ఋషులమగు మేము ఇట్లు అర్థం చేసుకొంటున్నాం.

"'ఈ జగత్తు' అనే సువిశాల నాటకరంగం ఆయా ప్రాణులకు వారివారి ఇచ్ఛలకు అనుకూలములైన శరీరములు, అనుభవములు పొందుటకు తగిన స్థానమైయున్నది. ఈ జీవునకు ఆధికారిక శరీరమును (a body which he deserves and desires) ప్రాప్తింపచేస్తోంది. ఇదంతా 'స్వస్వరూపజ్ఞానము' అనబడు ప్రయోజన సిద్ధికొరకు కూడా ... అట్టి లక్ష్యముతో శరీరము పొందువారికి ... అనువైన స్థానమైయున్నది. కనుక ఈ జగత్తంతా ఉత్తమ దృష్టి కలవారికి ఉత్తమ ప్రయోజనము కొరకే సంకల్పించబడియున్నది.

పూర్ణాత్ పూర్ణం ప్రసరతి సంస్థితం పూర్ణమేవతత్
అతో విశ్వమనుత్పన్నం యచ్చోత్పన్నం తదేవతత్ ॥* (X.28)

పూర్ణము నుండి వెలువడునది పూర్ణమే అయివుంటోంది. ఈ జగత్తు పూర్ణమునందు ఏర్పడియున్న 'కల్పన' మాత్రమే. అందుచేత ఈ విశ్వము ఉత్పన్నమై, స్థితి పొందియున్నట్లు తోచుచున్నప్పటికీ ... వాస్తవానికి "అనుత్పన్నమైనదే" (that which is never created) అని మేము గ్రహించుచున్నాము. ఎందుకంటావా? జ్ఞానులకు దృశ్యము – దర్శనముల భేదమే కనిపించదు. ఎవరు ఎట్లు చూస్తే ఈ విశ్వము వారికి అట్లే కనబడుతూ ఉంటుంది.

చూచే ఆయన = "ద్రష్ట"

ఎట్లు చూస్తే = "దర్శనము"

అట్లు కనబడుట = "దృశ్యము"

అందుచేత జ్ఞానులకు 'జగత్తు' అని చెప్పినప్పుడు, 'బ్రహ్మము' అని చెప్పినప్పుడు ఒక్క అర్థమే కనబడుచున్నది. "సూర్యకిరణములు వేడిగా ఉంటాయి" అనే విషయము ... అట్లు వేడిపొందు స్వభావము గల ఉపాధి కలిగియున్నప్పుడు, 'ఆ ఉపాధి యొక్క అనుభవముతో జీవుడు ఏకత్వము అనుభవిస్తున్నప్పుడు మాత్రమే' .... ఏర్పడగలదు. 'అనుభవించువాడు' లేకుంటే 'అనుభవము'నకు ఉనికిగాని, అర్థముగాని లేవు కదా! అనుభవమయ్యేదంతా అనుభవించువాని స్వస్వరూపవిన్యాసమే! అయితే, వాక్యజ్ఞానము మాత్రమే కలిగియుండి, అర్థజ్ఞానము ఇంకను పొందనివారికి ఈ విషయము తగినంతగా గ్రాహ్యమగుట లేదు. అభ్యాసమే అందుకు దివ్యౌషధం.

❖❖❖

15. సాక్షి చైతన్యము

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! "ఘనీభూతమై, సత్యమువలె కనిపించుచున్న ఈ దృశ్యపదార్థములు – అట్టి దృశ్యపదార్థములను దర్శించుచు, పొందుచున్న ఈ చిత్తము" ... ఈ రెండూ కూడా మిథ్యయే. ఇక ప్రతిబింబమాత్రమైనట్టి 'జీవుడు' అనబడునది మాత్రం సత్యదృష్టికి ఏం నిలబడగలదు చెప్పు? కనుక "నీవు–నేను–అతడు' మొదలైన జీవభావము కూడా భావనామాత్రమే. ఈ సర్వము బ్రహ్మము కంటే వేరుగా (అనేకముగా) ఏనాడూ ఉండుటలేదు.

అట్టి బ్రహ్మము అణువు కంటే కూడా అణువు. ఆ బ్రహ్మము యొక్క 'శుద్ధత్వము – సూక్ష్మత్వము'ల విషయానికి వస్తే .... అది ఆకాశము కంటే కూడా అనేకరెట్లు మహోన్నతమైనది. ఆకాశకోశము (మధ్యప్రదేశము) కంటే కూడా అత్యంత శాంతమైనది. దానికి రూపమంటూ ఏదీ లేదు. అది 'దిక్కు–కాలము' మొదలైనవాటిచే బంధింపబడునది కాదు. అందుచేత అది విస్తృతము,

---

* పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమదాయ పూర్ణమేవావశిష్యతే ॥ ..... ఋగ్వేదము

అనాది, స్వప్రకాశము అయివున్నది. అట్టి చిద్రూప బ్రహ్మము లేనిచోట వాసనలు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, జీవము కూడా ఉండవు. ఈ విధంగా ఆ బ్రహ్మము పూర్ణమై నిరాకారమై ప్రశాంతమైనట్టి పరమపదముగా ఉత్తమ జ్ఞానులకు గోచరిస్తోంది. అయ్యది స్వస్వరూపంగా, సర్వస్వరూపంగా, సర్వాంతర్యామిగా, సర్వాతీతంగా సర్వదా అనుభవమౌతోంది.

శ్రీరాముడు : ఓ మహర్షీ! 'చిత్తు' అను ఆకృతి మాత్రమే కలిగియున్నట్టి ఆ పరమార్థ 'తత్త్వము' యొక్క రూపమెట్టిదో ... మరొక్కసారి "సూక్ష్మదృష్టి"ని అవలంబించి చెప్పండి. దాని వలన మాకు జ్ఞానం వృద్ధి చెందగలదని, మీరు చెప్పబోయేదంతా మరింత స్పష్టంగా గ్రహించగలమని అనుకొంటున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి : సర్వవర్ణనములకు అతీతమై, మహాప్రళయ సమయమున కూడా ఇంకా శేషించి ఉండే .. కారణ-కారణమగు పరబ్రహ్మమును వర్ణించి చెపుతాను. విను.

అది ఎక్కడో ఉన్నది కాదు. ఎప్పటికో లభించేది కాదు. ఇప్పటికే సర్వజనులయొక్క వాస్తవ స్వరూపముగా ఎల్లవేళల లభించియే ఉన్నది.

ఓ మానవుడా! ఒకసారి నీ చిత్తవృత్తులను నిరోధించు. మనస్సును ఆయత్తమొనర్చి (సిద్ధం చేసి) చూడు. అప్పుడు మిగిలి ఉండేదేది? ఆ అవర్ణనీయ సాక్షి చైతన్యమే 'చిత్' అనబడు పరమాత్మ. అట్టి తత్త్వానుభవ సమయంలో ఈ దృశ్యజగత్తు నశిస్తుంది. శుద్ధ చైతన్య భావనచే దృశ్యము లేనిదగుటచే, దర్శనము కూడా లేనిదగుచున్నది. దర్శనము లేనప్పుడు ఇక ద్రష్ట ఎక్కడ ఉంటాడు? అట్టి త్రిపుటి లయించగా భాసించునదే బ్రహ్మము యొక్క స్వరూపానుభవం. ఈ త్రిపుటి అంతా భాసిస్తున్నది ఆ బ్రహ్మము వలననే, అద్దాని యందే. కనుక అది భాసించని క్షణమే లేదు. దాని అనుభవం మాత్రం ... ఈ త్రిపుటి (ద్రష్ట - దర్శనము - దృశ్యములు) పట్ల కించిత్ తన్మయత్వము కారణంగా మరుగునపడటం జరుగుతోంది. జీవ చైతన్యము యొక్క చేత్యభావము (ఆయా వస్తు - విషయములను ఆసక్తితో సమీపించి స్వీకరించు స్వభావము) లోపించిపోగా అప్పుడు మిగిలి యుండు "ప్రశాంత చిన్మాత్రమే" ఆ పరమాత్మ స్వరూపము.

ఒకానొకడు శరీరాదులతో కూడినవాడై ఈ లౌకిక జగత్తునందు సంచరిస్తున్నప్పటికీ .... అతని చిత్తము శబ్ద-స్పర్శాది-వికారములచే స్పృశించబడకయే నిర్లిప్తంగా, మౌనంగా, ప్రశాంతంగా ఉన్నదనుకో ... అప్పుడా చిత్తము ఉండే స్థితే పరమాత్మ యొక్క స్వరూపము.

మనస్సు స్వప్నరహితము, జాడ్యహీనము, అపరిచ్ఛిన్నము అయివుండగా ... అప్పుడు కలుగగల ఒకానొక "సుషుప్తస్థితి" వంటి అనుభవసారమే "పరమాత్మ" యొక్క స్వరూపము.

ఓ రాఘవా! ఆకాశము యొక్క, వాయువుయొక్క, శిలయొక్క హృదయములను గమనించావా? అవి శూన్యత్వము, పూర్ణత్వము, ఘనత్వము కలిగివుంటాయి కదా! "ఇవే చిన్మయబ్రహ్మము యొక్క విశేషములు"... అని గ్రహించు. 'అద్రష్ట' యొక్క భావాతీత స్వరూపమే శుద్ధతత్త్వమగు ఆత్మయొక్క

రూపము. ఈ జీవునియందు చైత్యభావము (తెలియబడటం) చిత్తభావము (తెలుసుకొనటం) .... శాంతించాయనుకో... అప్పుడు మిగిలియుండు శాంతి రూపసత్తయే ఆ ఆదివస్తువుయొక్క స్వరూపము.

చిత్ప్రకాశము యొక్క ఆకాశప్రకాశము యొక్క, ఇంద్రియ వృత్తులయొక్క అంత రాంతరాలలో సర్వదా వికసించియుండేదే బ్రహ్మము యొక్క స్వరూపము. 'సమస్త దృశ్య పదార్థములు', మరియు 'అంధకారము' కూడా ఏ 'అనాది-అనంత-చిచ్ఛక్తి' వలన తెలియబడుచున్నాయి? ఒక్కసారి ప్రశ్నించి, తర్కించి చూడు. అయ్యదియే పరమాత్మ. ఈ జగత్తంతా ఎద్దానియందు ఉత్పన్నమై, అద్దానికి అభిన్నమైనప్పటికీ .... వేరైనట్లుగా కనబడుతోంది? ఏది వ్యవహారపరమై కూడా, శిలలాగా నిశ్చేష్టితమై యున్నది? ఏది ఆకాశము కాకపోయినప్పటికీ, ఆకాశస్వరూపమైయున్నది? అన్నివైపుల అఖండితమై యున్నది? సర్వదా ప్రసరించుచు అనుద్వేగం (unemotional)గా ఉండి ఉన్నట్టి ఎద్దాని నుండి - ఈ జ్ఞాని - జ్ఞానము - జ్ఞేయములు ఉదయించి అస్తమిస్తున్నాయి? దర్పణంలోని ప్రతిబింబ వస్తువుల వలె ఎద్దానియందు ఈ జ్ఞాత-జ్ఞేయములు ప్రతిబింబిస్తున్నాయి? నాయనా! రామా! అయ్యదియే పరమాత్మ యొక్క స్వరూపము.

మనస్సు జాగ్రత్-స్వప్నముల నుండి విడివడినపుడు 'మహాచైతన్యము' అనబడే సుషుప్తి దశ వంటి శుద్ధ చైతన్యము నందు ప్రవేశిస్తోంది. చరాచర సృష్టి లయమైపోయినట్టి అట్టి స్థితి యందు పరమాత్మానుభవమే మిగులుచున్నది.

ఓ సూక్ష్మగ్రాహీ! వింటున్నావా! పరమాత్మ ఎక్కడ ఉన్నాడో అర్థమౌతోందా? ఒక ఉపమానం చెపుతాను, విను. అచలస్వభావముగల స్థావరపదార్థములను చూస్తున్నాము కదా! వాటికి మనస్సు బుద్ధి ఇంద్రియములు లేవు. అయితే వాటియందు శుద్ధ చైతన్యభావన మాత్రమే ఉన్నదనుకో ... అట్టి స్థితిని పరమాత్మతో పోల్చవచ్చు. బ్రహ్మ, విష్ణు, హర, ఇంద్రాదులు కూడా నశించగా, అప్పుడు పరమశివమగు సద్వస్తువు ఒక్కటే మిగిలివుంటుందో అద్దానికి ఎట్టి ఉపాధి ఉండదు. కాబట్టి 'నిరుపాధికము', 'నిర్వికల్పము' అను పేరుతో చెప్పబడుతోంది. "విశ్వసంజ్ఞ" పరిత్యజించ బడినప్పుడు, ఇక ఆపై చైతన్యమందు బ్రహ్మమే శేషించుచున్నది. నీయొక్క, నాయొక్క, ప్రతి ఒక్క జీవునియొక్క ... నిత్యమై వెలుగుచున్న సత్యస్వరూపము ఆ పరమాత్మయే గాని, వేరేమీ కాదు. "వేరు" అని తలచుటయే సంసారము "వేరు కాదు" అని తలచుటయే, అసంసార స్వరూప మోక్షము.

❖❖❖

16. జగత్తు అనగా ఏమిటి?

శ్రీరాముడు : ఓ బ్రహ్మజ్ఞా! ఈ స్థావర జంగమాత్మకమగు జగత్తు అంతా అత్యంత స్పష్టంగా ఘనీభూతమై కనబడుచున్నది కదా! ఇట్లు ప్రాప్తిస్తున్న ఈ జగత్తు ప్రళయ కాలంలో ఎక్కడికి పోతోంది? ఏమౌతోంది?

శ్రీ వసిష్ఠమహర్షి : ఒకానొక గొడ్రాలి యొక్క రెండవ కుమారుడు ఎక్కడి నుండి వచ్చుచున్నాడు?

ఎక్కడ ఉంటున్నాడు? ఎక్కడికి పోవుచున్నాడు? ఆకాశంలో ఒక బాలునికి మేఘాకృతి కారణంగా కనిపించే వనములు, జంతువుల ఆకారములు ఎక్కడి నుండి వచ్చాయి? ఎక్కడ ఉన్నాయి? ఎక్కడికి కదలిపోతున్నాయి? ముందుగా ఈ నా ప్రశ్నలకు సమాధానమేమిటో చెప్పు?

శ్రీరామచంద్రుడు : గొడ్రాలికి కుమారుడు, ఆకాశంలో వనము ... అనేవి ఏ కాలము నందు జన్మించియుండలేదు. అవి అసలు ఎక్కడా ఉండవు. కనుక వాటికి అస్థిత్వమెక్కడ? అభావమెక్కడ? రెండూ ఉండవు. ఆ భావమునకు అర్థమేలేదు.

శ్రీ వసిష్ఠమహర్షి : ఆ రెండూ అభావ పదార్థములే కదా! అదే విధంగా ఈ జగత్తు కూడా అభావ పదార్థమే. దీనికి అస్థిత్వమే లేదు. ఇక "ఎట్లు ఉత్పన్నమైనది?" అనే ప్రశ్న ఎక్కడుంటుంది? మొదలే అభావముచే కూడుకొనియున్న ఈ జగత్తుకు ఉత్పత్తిగాని, అస్థిత్వముగాని, వినాశనముగాని లేవు. "స్వప్నంలో కనిపించిన భవనం ఎవరు కట్టించారు? ఎప్పుడు ఎందుకు కట్టించారు?" .... అను ప్రశ్నలకు అర్థమేమున్నది?

శ్రీరాముడు : అయితే నాదొక చిన్న ప్రతిపాదన. "వంధ్యాపుత్రుడు", "ఆకాశవృక్షము (లేక ఆకాశవనము)" అనునవి కల్పనలు మాత్రమేనని అనుకొందాం. 'కల్పన' అనునది ఒకప్పుడు ప్రారంభమై, మరొకప్పుడు నశిస్తోంది. కనుక కల్పనలకు ఉత్పత్తి-క్షయాలు ఉన్నాయి కదా! ఈ జగత్తుకు కూడా ఉత్పత్తి-క్షయాలు ఉన్నాయని అనుకొంటే తప్పేమున్నది?

శ్రీ వసిష్ఠమహర్షి : ఔను, 'కల్పన' అనునది ఉన్నప్పుడు "ఆకాశ వృక్షము - వంధ్యాపుత్రుడు" అనునవి ఉంటున్నాయి. కల్పన క్షయిస్తే అవికూడా లేనివే అవుచున్నాయి. ఈ జగత్తు విషయం కూడా అట్టిదే కూడా! కల్పన ఉన్నప్పుడు జగత్తు ఉన్నది. లేనప్పుడు లేదు. ఈ విధంగా వంధ్యాపుత్రునకు జగత్తుకు పోలిక ఉన్నది.

"మరి ఈ జగత్తు ఏదై ఉన్నది? ఎక్కడ ఉన్నది?" అను ప్రశ్నలకు వద్దాం. "బంగారపు గాజులు" అను దానిలో బంగారమునకు వేరుగా "గాజులు" అనుబడునది ఎక్కడైనా విడిగా ఉన్నదా? ఆకాశమునందు శూన్యత్వము కాకుండా వేరే ఆకాశత్వము ఎక్కడున్నది? అట్లే ఈ జగత్తు బ్రహ్మమునందే ఉన్నప్పటికీ, దీనికీ బ్రహ్మము కంటే వేరైన రూపం లేదు. కాటుక-నలుపు, మంచు-చల్లదనములకు భేదము ఏమాత్రం లేదు. ఎండమావి యందలి నీటికి, (మెల్లకన్ను దోషంచే చూడబడుచున్న) ద్వితీయ చంద్రుని చంద్రత్వమునకు గల అస్థిత్వమేమిటి? ఈ రెండూ లేకయే ఉన్నాయి. కనుక, 'అత్యంత అభావమే సిద్ధిస్తోంది కదా! ఒకానొకడు నీ దగ్గరకు వచ్చి "ఎండమావులలో నాకు నీరు కనబడుతోంది కదా! లేదంటే నాకేం ప్రయోజనం?" అంటే నీవు ఏం అంటావు?

"నాయనా! నీకు కనబడవచ్చు. కాని మేము దానిని నిశింతగా పరిశీలించి చూచాం. నీవు కూడా దృష్టిని శుద్ధం చేసి పరిశీలించు. నీకే ఆ విషయం తెలుస్తుంది. అక్కడ ఏమాత్రం జలం లేదు. తరంగాలు లేవు" అని అనవలసిందే కదా!

ఈ జగత్తు విషయం కూడా అంతే. ఇది సంసారదృష్టికి లోభమోహమదమాత్సర్యాదుల కారణంగా, అవిమర్శ నాత్మకంచేత, ఇంద్రియదృష్టిమాత్రంచేత, సంకుచిత-హ్రస్వదృష్టిచేత ఘనీభూతమై తోచుచుండవచ్చు. కాని శుద్ధ-స్వస్వరూపమగు బ్రహ్మము గ్రహించబడినప్పుడు .... ఈ జగత్తు యొక్క అభావమే సిద్ధించుచున్నదని మేము ప్రకటిస్తున్నాము.

అనేక కోణముల నుండి 'జగత్తు' అనబడుదానిని పరిశీలించినప్పుడు, "ఇది ఇట్లు" అని లభించకయే ఉన్నది. వేరువేరు దృష్టులకు వేరువేరు అనుభవమగుచున్నది.... వాస్తవానికి ఏమైఉన్నట్లు? అసలు ఉన్నట్లా? లేనట్లా? నాయనా! రామచంద్రా! ఈ జగత్తు అనబడునది ఇతఃపూర్వం లేదు. ఇప్పుడు కూడా లేదు. ఇదివరకు గాని, ఇప్పుడుగాని, లేనట్టి దానిని ... "ఇది ఒకానొకప్పుడు వినాశనమగును" అను వాక్యము సమంజసమెలా అవుతుంది? అయితే ఒకానొక ద్రష్ట దృష్టిలో, ఈ 'జగత్తు' అను భావము లయించిపోవుట సంభవించుచున్నది 'జగత్తు' అను రూపముగా అనుభవమయ్యే 'భావము' యొక్క ఉత్పత్తి-వినాశనములే "సృష్టి-ప్రళయములు" అను శబ్దములచే శాస్త్రములు బోధిస్తున్నాయి.

శ్రీరాముడు : మహర్షీ! ఈ జగత్తుకు కారణమేలేదని ఎట్లు నిశ్చయిస్తున్నారో చెప్పండి?

శ్రీ వసిష్ఠమహర్షి : "ఈ జగత్తుకు బ్రహ్మమే కారణం" అని అంటామనుకో ... పృథివి మొదలైన జడవస్తువులకు జడమైనదేదో కారణం కావాలికాని, శుద్ధ-చైతన్య స్వరూపమగు 'బ్రహ్మము' ఎట్లా కారణమౌతోంది? "ఎండ" అనగా ప్రకాశము ... 'నీడ' అనగా ప్రకాశ రాహిత్యము. సూర్యకాంతికి ఏదైనా అడ్డు వచ్చినప్పుడు ఏర్పడు దానినే 'నీడ' అని అంటున్నాము. కాని "నీడ" అనుదానికి కారణం ఎండయే" అని అనలేము కదా! బ్రహ్మము జడము కాదుకదా! ఎండ అనునది నీడకు ఎట్లా కారణమౌతుంది? ...అట్లాగే, అఖండము- చైతన్యవంతము - సూక్ష్మాతిసూక్ష్మము - నిష్క్రియము - అనిర్వచనీయము అయివున్నట్టి బ్రహ్మము ఈ జగత్తును నిర్మించుటకు కారణమెట్లా అవుతుంది? బ్రహ్మము కాకుండా వేరే ఏదీ ఈ జగత్తుకు కారణంగా లభించుటలేదు. అందుచేత "ఈ జగత్తుకు కారణం లేదు" అని గ్రహించబడుతోంది. కారణము లేని చోట కార్యము ఎట్లా సిద్ధించగలుగుతుంది?

❖

ఇక మేము ఈ జగత్తును ఎట్లు గ్రహిస్తున్నామో చెపుతాను విను.

ఆదికారణమగు ఆ బ్రహ్మవస్తువే విశ్వమువలె గోచరించుచున్నది. ఇక ఈ అభాస* కు కారణమేమిటంటావా? అజ్ఞానము. బ్రహ్మవస్తువు నిష్క్రియమైనదగుటచే "బ్రహ్మము విశ్వమును సృష్టించుచున్నది" అను మాట సరికాదు. అతి సూక్ష్మమైనట్టి స్వస్వరూపము యొక్క స్వరూప - స్వభావములను జీవుడు ఏమరచి ఉంటున్న సమయంలో ఈ 'జగత్తు' అనబడు అనుభవం ప్రాప్తించి వాస్తవమువలె గోచరించుచున్నది.

---

* అభాస = ప్రతిబింబత్వము, లేనిది వాస్తవమువలె తోచుట (Illusionary)

కాబట్టి రాఘవా! ఈ జగదృశ్యమంతా స్వప్నమునందు కనిపించే వస్తుజాలము వంటిదేనని గ్రహించెదవు గాక! స్వప్నంలో ఒక పెద్ద మేడ కనిపించుచున్నప్పటికీ – అది వస్తువా? దేనితో తయారుచేయబడింది? స్వకీయమైన కల్పనయే స్వప్నసమయమందు అట్లు ప్రాప్తిస్తోంది కదా! అదేవిధంగా బ్రహ్మమునందు 'జగత్తు' అనబడు వస్తువు లేక పోయినప్పటికీ .... అజ్ఞానము వలన ఘనీభూతమైన అనుభవమువలె భావనాచమత్కారంతో కూడుకొని గోచరించుచున్నది" ... అనునది జ్ఞానులకు నిస్సందేహముగా, సుస్పష్టముగా తెలియవచ్చుచున్నది.

ఈ 'జగత్తు' అనబడునదంతా పరమాత్మయందు ఎల్లప్పుడు నిలచియున్నది. అంతేకాని, ఇది ఒకప్పుడు ఉదయించి, మరొకప్పుడు అస్తమించటం లేదు. నీరు ద్రవభావమును, వాయువు స్పందరూపమును, ప్రకాశము కాంతి ఆకారమును దాల్చియే ఉంటున్నాయి కదా! ఒకదానితో మరొకటి లేనిదెప్పుడు? బ్రహ్మము కూడా జగదాకారమును వహించియే ఉంటోంది. స్వప్నంలో గాంచబడే నగరం ఎక్కడి నుండి వచ్చింది చెప్పు? "ఆ స్వప్నద్రష్ట యొక్క చైతన్యమే అంతరమున అట్టి నగరమును కల్పించుకుని, తానే ఆ 'కల్పన' అయి, ఆపై తననుతానే అట్లు దర్శించుచున్నది" అని మనం ఒప్పుకోక తప్పదు. అదే విధంగా ఈ జగత్తు యొక్క విషయం కూడా!

స్వీయ ఆత్మయే బ్రహ్మమైయుండి, బ్రహ్మమునందు జగదాకారముగా కల్పనామాత్రంగా అభాసించుచున్నది.

❖❖❖

17. దృశ్యభ్రమ తొలిగేదెట్లా?

శ్రీరాముడు : బ్రహ్మజ్ఞా! విషంతో సమానంగా మమ్ములను అనేక యాతనలు పెట్టుచున్న ఈ దృశ్యజగత్తు స్వప్నానుభూతివలె "మిథ్యయే" అయిఉన్నదంటారా, స్వామీ! మీరు అత్యంత చమత్కారమైన విషయమే ప్రతిపాదిస్తున్నారు. ఇది స్వప్నసమానమే అయివుంటే ... మనుజునకు (జీవునకు) అనాదికాలం నుండి ఈ దృశ్యము విషయంలో విశ్వాసం ఎట్లా ఏర్పడుతోంది?

మరొక విషయం. దృశ్యము ఉంటే ద్రష్ట ఉంటాడు. ద్రష్ట ఉన్నంతవరకు దృశ్యము కూడా ఉంటుంది. ఈ రెండింటిలో ఒకటి ఉంటే రెండవదానితో సంబంధం ఏర్పడుతోంది. ఈ రెండిటిలో ఏ ఒక్కటి లేకపోయినా ... రెండవదానికి 'ముక్తి' కలుగుతోంది కదా! నేను అనుకోవటం ఏమంటే ... దృశ్యబుద్ధి సంపూర్ణంగా నశించనంతవరకు దృశ్యము కనిపిస్తూనే ఉంటుంది. ఈ దృశ్యము మా దృష్టిలో ఉన్నంతవరకు మాకు జ్ఞానం లభించనట్లే – అని.

మొట్టమొదట దృశ్యజ్ఞానము కలిగి ఉండి ... మధ్యలో ఎదురుగా ఉన్నది నశించటం జరిగినా ... మరలా సంసార రూపమున ఉద్భవిస్తూనే ఉన్నది. కాబట్టి మన ఎదురుగా ఉన్న ఈ దృశ్యము ఇక్కడినుండి తొలగించినంతమాత్రంచేత (దృశ్యబుద్ధి ఉండియే ఉన్నది కనుక) అనర్థమగు

బంధము తొలగుతుందని చెప్పలేం. గాఢ నిద్రా సమయంలో దృశ్యము ఉండదు. కనుక జీవుడు దృశ్యరహితుడు అయినట్లే, కాని నిదురలేవగానే మరల దృశ్యభావం వచ్చిపడుతోంది కదా!

కనుక, ఈ దృశ్యములోని వస్తుజాలము నశించటంచేతగాని, వీటిని వదలి మనం ఎటకో వెళ్ళటంచేత గాని ... ఈ దృశ్యబుద్ధి ఉన్నంతవరకు బంధము తొలగదు. అది మన సమస్యకు సమాధానం కూడా కాదు.

ఇంకొక విషయమేమంటే ... అద్దం ఎక్కడ ఉంటే అక్కడ అది ప్రతిబింబాన్ని గ్రహిస్తూనే ఉంటుంది కదా! 'చిద్వస్తువు' అనే అద్దం ఎక్కడ ఏ స్థితిలో ఉంటే అక్కడ స్మృతి నుండి జనించే సంసార సంస్కారం ప్రతిబింబితమౌతూనే ఉంటుంది.

"అసలు ఈ దృశ్యము ఉత్పన్నమే అయివుండలేదు. ఇదంతా వాస్తవానికి లేదు" అను వాక్యం సత్యమైనా, అసత్యమైనా "దృశ్య - దృష్టి" లేక "దృశ్య-బుద్ధి" గల మాపట్ల నిరర్థకమే అగుచున్నది. "దృశ్యరాహిత్యము" అను నిష్కల్మషమైన మనఃస్థితి ప్రాప్తించనంత కాలం ముక్తి అసంభవమే అవుతోంది. కనుక ఓ ఆత్మ విద్వరా! మా యొక్క "ముక్తి"ని అరికట్టుచున్న ఈ 'దృశ్యభావం' లేక 'దృశ్యబుద్ధి' తొలగిపోవటం ఎట్లా? అట్టి సంయుక్తులు మాకు ఉపదేశించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! సర్వాత్మకమగు ఈ జగత్తు అసత్యమైయుండి కూడా సత్యమువలె ప్రతిభాసిస్తోంది. దీని విధము ఎట్టిదో .... నీకు కొన్ని దీర్ఘమైన కథల ద్వారా తెలియజేస్తాను. ఈ చెప్పబోవు కథలన్నీ ఇతఃపూర్వమే వర్ణించబడ్డాయి. వర్షపుజల్లు పడితే ధూళి గాలికి లేవదుకదా! ఈ కథలు చక్కగా విను. అప్పుడు దృశ్యబుద్ధి తనంతట తానే తొలగుతుంది. నీ మనోనగరంలో ప్రశాంతత వర్ధిల్లగలదు.

మానవుడైనవాడు "ఈ జగత్ స్థితి అంతా సంపూర్ణముగా భ్రమాత్మకమే" అని గ్రహించాలి. అది వివేకాదుల చేతనే సాధ్యపడగలదు. సర్వవేళల బ్రహ్మవస్తువును ఒక్కదానినే చింతించుచు వ్యవహరించాలి. మహాపాషాణమును (కొండరాయిని) బాణము ఏమీ చేయలేదు కదా! బ్రహ్మభావమును అలవరచుకొంటే, ఇకప్పుడు ఈ భావాభావములు, స్థూల సూక్ష్మాదిభ్రమలు, స్థిరాస్థిర సంకల్ప వ్యవహారములు, నిన్ను ఏమీ చెయ్యలేవు.

ఓ ప్రియరాఘవా! ఆత్మవస్తువు ఒక్కటి మాత్రమే ఉన్నది. దానియందు ఇక ఎట్టి వికల్పములు లేవు. అట్టి ఆత్మవస్తువునందు ఈ జగత్తు ఎట్లు ఉత్పన్నమైనదో గ్రహిస్తే ... అంతా నీకే అవగతమౌతుంది. ఈ ఉత్పత్తి ప్రకరణంలో "జగత్తు" ఎట్లు ఉత్పన్నమైనది? అనే విషయం విచారించబోవుచున్నాము.

ఓ ప్రియతనయులారా! అమృతానంద స్వరూపులారా! సర్వజనులారా! ముందుగా ఒక విషయం నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా లోకమునకు ప్రకటిస్తున్నాను. వినండి. ఆత్మ వస్తువు నుండే స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తు అంతా విజృంభిస్తోంది. ఆ మహదాత్మయే ఈ 'చక్షువులు' మొదలైన ఇంద్రియములచే ప్రాప్తిస్తున్న నామ రూపములతో కూడిన "బాహ్యదర్శనము" అగుచున్నది. అదేవిధంగా అదే సమయంలో అంతరింద్రియ గ్రాహ్యమగు మననము మొదలైన పదార్థముల

రూపముగను ప్రకాశించుచున్నది. మరల అదియే ఒకానొకప్పుడు తనయందు తానే లీనమగుచున్నది. అప్పుడు వృత్తిరహితమగు ఆత్మైకత్వమును ప్రకటిస్తోంది.

అట్టి ఆత్మభగవానునికి ఇవే మా ప్రణామములు.

❖❖❖

18. జగత్ భావోత్పత్తి

శ్రీ వసిష్ఠ మహర్షి : పరమపవిత్రము, పరమశాంతము అయినట్టి బ్రహ్మపదము నుండి ఈ దృశ్యజగత్తు ఎట్లు ఉత్పన్నమైనదో చెపుతాను. విను.

నిద్ర పోతున్నవాడే కలలు కంటున్నాడు కదా! అదేవిధంగా స్వస్వరూపమే అయివున్నట్టి బ్రహ్మము కూడా సృష్టితో కూడుకొన్నదై ప్రతిభాసిస్తోంది.

ఈ విశ్వము ఏది అయివున్నది?

అనంత ప్రకాశ స్వరూపము, అనంత చిన్మయము అయినట్టి పరమాత్మయొక్క స్వాభావిక సత్తయే ఈ విశ్వమైయున్నది. ఇది మరింకొకటి ఏదీ కాదు. సర్వప్రాణుల స్వస్వరూపమగు ఆ పరమాత్మ ఆకాశము కంటే కూడా సూక్ష్మము, నిర్మలము అయివున్నాడు. అతనియందు తెలియబడుదానివలె ప్రకాశించుచున్నట్టి జ్ఞానమే, "అహం – నేను" అనునట్టి భావనతో కూడుకొని ఉంటోంది.

అట్టి పరమాత్మ నుండి ఈ ఈ జ్ఞాన సంస్కారములన్నీ లేచుచున్నాయి. ఆ జ్ఞాన సంస్కారము తదితర సంస్కారములతో కూడుకొని 'చిత్తము'ను ఉద్బోధించుచున్నాయి.

చిత్ = "చిత్తవృత్తులతో కూడుకొనియున్న చేతనాత్మక బ్రహ్మసత్త"

ఆ పరమవస్తువు అనాదికాలం నుండి అనుసరిస్తూ వస్తున్న "క్షణ–సంవేదము" వలన దృశ్యజ్ఞానఘనము అగుచున్నది. అనగా ఆ ఆత్మస్వరూపుడు ఒక్కక్షణంలో ద్రష్టత్వము (State of Perceiver) వహిస్తున్నాడు. అట్లు దృశ్యములలో సంచరిస్తూ ఆసక్తిపరుడై క్రమంగా ఆత్మభావమును విస్మరించుచున్నాడు. అనగా పరమపదమును త్యజించి, సంసారోపాధితో కూడిన జీవభావమును పొందుచున్నాడు. అయితే, ఆ విధంగా, "నేను జీవుడను, ఖండుడను, శరీరమాత్రుడను" అను భావము పొందుచున్నప్పటికీ – అతనియందు 'బ్రాహ్మీస్థితి' (బ్రహ్మమునే ... అను స్థితి లేక భావము) ఏమాత్రం తొలగకయే ఉన్నది. ఎందుచేతనంటావా? బ్రహ్మసత్త (లేక చిత్)యే ఒకానొక విశేష – భావంచేత "నేను జీవుడను" అను విధంగా భావిస్తోంది. కాని, వాస్తవానికి అది వేరే ఆకారమును పొందటంలేదు కదా!

ఈ విధంగా బ్రహ్మమునందు "జీవసత్త" ప్రకాశించిన తరువాత, క్రమంగా శూన్య రూపమగు ఆకాశసత్త (Space factor) ఆవిర్భవిస్తోంది. ఈ ఆకాశసత్తయే "ఆకాశము – శబ్దగుణము" అనబడు

భవిష్యత్-వ్యవహారములకు స్థానభూతమగుచున్నది. క్రమంగా కాలసత్త (time factor) జనిస్తోంది. దానితోకూడి అహంకారముతో కూడిన అభిమానము ఉద్భవిస్తోంది. ఇవే భావిసృష్టికి, ఈ జగత్ సృష్టికి మూలములు.

చిత్ చైతన్యము
జీవ చైతన్యము
ఆకాశ సత్త ... శబ్ద గుణము
కాల సత్త
అహంకారాభిమానము
జగత్ సృష్టి

ఆకాశ - అహంకార - కాలరూపమగు ఆ సృష్టిని సంకల్పమాత్రంగా సృష్టిస్తున్న తత్త్వమునే "హిరణ్యగర్భుడు" లేక "సమష్టిజీవుడు" అని శాస్త్రములు పిలుస్తున్నాయి. అయితే ఇదంతా చైతన్యతత్త్వమగు పరమాత్మసత్తను ఆశ్రయించే ఉంటున్నది. ఒక శిల్పి ఒకానొక గొప్ప శిల్పమును తయారుచేయాలనుకొంటున్నప్పుడు ... అతని మనస్సు నందు చిత్రించబడబోవు శిల్పము సంకల్పరూపంలో ఉంటుంది. అట్లే హిరణ్యగర్భుడు సమష్టిసృష్టి సంకల్పమే రూపముగా కలవాడు. కాని శిలసత్త వలననే శిల్పము నిలచి యున్నదికదా! నిష్క్రియమగు చైతన్యమే ఇదంతా అయివున్నది. ఆత్మచేతనే ఎరుగబడుచున్నట్టి ఈ అసద్రూపజగత్తు (illusionary world) పరమాత్మ నుండియే ఉత్పన్నమై సద్రూపమున ప్రకాశిస్తోంది.

అహంకారము మొదలైన తత్త్వములతో కూడుకొనిన సంవిత్తే 'సంకల్పము' అను వృక్షమునకు బీజమైయున్నది. అట్టి సంవిత్తు (Existence knowledge) యొక్క అంశము వలననే స్పందధర్మమగు వాయువు ఉత్పన్నమగుచున్నది. 'అహం'భావముతో కూడుకొనిన ఆకాశ రూపమగు సత్తను 'శబ్దతన్మాత్ర' అని అంటున్నాం. దీని నుండి క్రమంగా "ఆకాశ తన్మాత్ర (Physical space)" ఉదయిస్తోంది. శబ్దమయమగు శబ్ద తన్మాత్రము నుండి పదవాక్యముల ప్రమాణముతో కూడిన 'వేదములు' వికసిస్తున్నాయి. అర్థములతో కూడిన శబ్దములుగా పరిణమించిన వేద-స్వరూప బ్రహ్మమునుండే ఈ 'జగత్తు' అనునది ఉదయిస్తోంది.

క్రమంగా 'అహం-తన్మాత్ర'ల తత్త్వము నుండి ప్రియత్వము యొక్క ప్రభావంచేత "ప్రాణ తత్త్వము" ఉదయిస్తోంది. భావి (future) జీవుడగు ఈ ప్రాణతత్త్వమే ఇంద్రియములచే గ్రహించబడుచున్న ఈ రూపాదులకు కారణము. ఆ ప్రాణతత్త్వము నుండే పదునాలుగు లోకములు, జరాయుజ - అండాయుజ - శ్వేదాయుజ - బీజాయుజములైన చతుర్విధ ప్రాణసమూహములన్నీ జన్మిస్తున్నాయి. ప్రాణతత్త్వాభిమాని యొక్క చిత్స్ఫురణ వలన ఈ భౌతికదేహము ఉత్పన్నమగుచున్నది. "స్పర్శతన్మాత్ర" అనబడే తత్త్వము నుండి నలుబదితొమ్మిది వాయుప్రసరణములు వెలువడుచున్నాయి.

తద్వారా, సర్వభూతముల స్పంద–కార్యనిర్వహణకు .... 'స్పర్శ తన్మాత్ర' కారణభూతమగుచున్నది. దీనినుండే ప్రకాశతత్త్వభావన వలన "తేజోతన్మాత్ర" (లేక రూపము) అను అనుభవము ఉత్పన్న మౌతోంది. అట్టి తేజస్సు నుండి సూర్యుడు, అగ్ని, విద్యుత్ మొదలైన తేజోపదార్థములన్నీ ఉత్పన్నం అవటం జరుగుతోంది. దానివల్లే రూపవిభజన జరిగి, ఈ సంసారం విస్తరిల్లటం కూడా జరుగుతోంది.

ఆ పరమవస్తువే సంకల్పమాత్రం చేత జలమయ శరీరమును గ్రహిస్తోంది. దాని ఆస్వాదననే 'రసతన్మాత్ర' అని అంటున్నాం. ఈ రసతన్మాత్రే ద్రవపదార్థములన్నింటికీ కారణమై, ఈ ఇంద్రియము లచే గ్రహించబడుచున్న సంసారవిస్తృతికి తోడ్పడుచున్నది.

కల్పనామయమగు ఆత్మయే తన కల్పనాప్రభావం చేత "గంధతన్మాత్ర" (Experience of Smelling)ను వీక్షించుచున్నది. అది భూగోళము, శరీరములు మొదలైన ఆకృతులకు కారణభూతమగు చున్నది.

❖

చూచావా? రామచంద్రా! నీరు బుడగలయి, మరల నీరు అగుచున్నది కదా! అట్లే చిత్‌శక్తి యొక్క భావనాప్రభావంచేత కలిగిన తన్మాత్రలే ఒకదానితో మరొకటి కలిపి బ్రహ్మాండములగుచున్నవి. ఈ బ్రహ్మాండములన్నీ అనేక బుద్బుదమువలె (బుడగలవలె) కొంతకాలం కూడి ఉంటాయి. మరల విడిపోతాయి. మహాప్రళయమై, ఇవన్నీ నశించనంతవరకు .... ఈ సంయోగ–వియోగములు ఇట్లు జరుగుతూనే ఉంటాయి. అయితే "ఇవన్నీ విశుద్ధ–శక్తిసంపన్నములే" ... అనే విషయం అల్పబుద్ధిచే గ్రహించలేము. ఒకచిన్న మఱ్ఱివిత్తులో ... భవిష్యత్ మహావృక్షము, దాని వేలాది ఆకులు, పూలు, కొమ్మలు, విత్తులు, ఆ విత్తుల నుండి మరల వేలాది వృక్షములు ... మొదలైన వ్యవహారమంతా అప్రకటితమై దాగివుంటుంది కదా! "చెట్టు నుండి విత్తు – విత్తు నుండి చెట్టు"వలె ఈ శబ్ద–స్పర్శ–తేజ–రస–గంధములనే పంచతన్మాత్రలు* ఆకాశముననే వెలయుచున్నాయి. మరల వాటి నుండి ఆకాశాదులు ప్రకాశిస్తున్నాయి.

అయితే నీవు ఇక్కడ ఒక విషయం సూక్ష్మబుద్ధితో గ్రహించాలి. "ఒక విత్తు అంకురించటం – ఆ అంకురము నుండి మహావృక్షము – ఆ వృక్షము వందలాది కొమ్మలతో ప్రకాశించుట – ఫలములను ఇవ్వటం" .... ఇవన్నీ ఆ విత్తులో అప్రకటిత సంస్కారరూపములో దాగివున్నాయి కదా! అట్లే చిదాత్మ పరమాణువులో ఈ విస్తారమైన చరాచర జగత్తు అంతా ప్రకటితమౌతోంది. అట్లు ఒక చిదాత్మ పరమాణువు నందు ఇదంతా కనబడుచున్నప్పటికీ .... వాస్తవానికి ఇదంతా 'మాయ'యేనని గ్రహించు.

శ్రీరాముడు : 'చిదాత్మ' అను సూక్ష్మపరమాణువులో ఇంతటి విస్తారమైన జగత్తు ఉండటమేమి? ఇదంతా ఎట్లా ఇముడుచున్నది?

---

* పంచతన్మాత్రలు = శబ్దము – స్పర్శ – రూపము – రసము – గంధము అనినబడు అనుభవములు.


శ్రీ వసిష్ఠమహర్షి : స్వప్నంలో అతిసూక్ష్మనాడియందు పెద్దపెద్ద వస్తుజాలమంతా కనబడుట లేదా? ఇదికూడా అట్టిదే. కాని ఈ కనబడేదంతా వాస్తవమైనది కాదు.

ఈ స్థూలభావములన్నీ ఒకప్పుడు రూపము పొందుచున్నాయి. మరొకప్పుడు రూపము పోగొట్టుకొంటున్నాయి. అనగా, 'చిత్' అను ఆధారమునందు సూక్ష్మత్వం పొందు చున్నాయి. ఒకానొకప్పుడు మరల స్థూలములౌతున్నాయి. సంకల్పాత్మకమగు చిత్–శక్తి వలననే ఈ 'జగత్తు' అను అనుభవం శబ్దస్పర్శరూప రస గంధముల ఆకారంగా ఏర్పడుతోంది. ఇంకొకప్పుడు ఆకారరహితమగుచున్నది.

ఓ రాఘవా! ఈ దృశ్యజగత్తుకు కారణం పంచతన్మాత్రలే. వీటికి పరమాత్మతో నిత్య సంబంధమున్నది. ఈ పంచతన్మాత్రలకు సాక్షాత్ కారణం మాయాశక్తియే. ఇక పరబ్రహ్మమో ... సర్వమునకు పరమకారణమగుచున్నది. మరి మాయాశక్తికి కారణమేమిటంటావా? 'ఆదిశక్తి' అని చెప్పబడే మాయాశక్తికి కారణం ... ఆదిభావమై, అనుభూతికి మాత్రమే గ్రహించబడునదై, జన్మరహితమై, చిత్స్వరూపమైనట్టి ... "పరమాత్మ"యే సుమా! పరమాత్మ లేక పరబ్రహ్మము కారణరహితము.

'మాయ' కారణంగానే జగత్తు వికసించటం – మరల ముకుళించటం జరుగుతోంది. "పరమాత్మ" అనునది సర్వదా ఒకే రీతిగా మార్పు–చేర్పులకు అతీతమైనదై ఉండి ఉంటోంది.

❖❖❖



19. జగత్తు లేదు

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! ఈ ఆకాశము తేజస్సు తమస్సు మొదలైనవన్నీ తమంతట తాము ఉత్పన్నమైనవి కావు. ఇవన్నీ కూడా చిదాత్మమగు పరబ్రహ్మము యొక్క సత్త వలననే నిలచివున్నాయి. అంతేకాని, వీటికి స్వతంత్రమైన ప్రతిపత్తి లేదు. అన్నిటికి కారణం చిదాత్మయే సుమా! ఆ చిదాత్మయే తెలియబడుచున్న విషయమునకు సంబంధించిన కల్పనను, ఆ తెలియబడు దానితో కలిసిన జీవభావమును, 'అహం' జ్ఞానమును కల్పించుచున్నది. అహంభావము యొక్క పరిణామము వలన బుద్ధి వికసిస్తోంది. అట్టి బుద్ధి, శబ్దము-మొదలైన తన్మాత్రలతో కూడి 'మననము' అను ధర్మముగల 'మనస్సు'గ మారుచున్నది. ఆ మనస్సే తన్మాత్రలతో కలిసి, మహా భూతములుగా మారి జగత్తుగా ప్రాప్తించుచున్నది.

'జగత్తు' అనబడే పూతీగకు ఈ విధంగా బీజము చిదాకాశమే. అయితే ఈ 'జగత్తు' అనబడుదానికి బీజము ఎవరూ ఎక్కడా పాతవలసిన అవసరం లేదు. భౌతికమైన పాదువలె నీరు, నేల, వెలుతురు అవసరం లేకుండానే ... భావనామాత్రంగా దానంతట అదే అంకురించుచున్నది.

'కేవల చిద్రూపము' అయినట్టి ఆ పరమవస్తువు స్వప్న సృష్టిలాగా ఈ పృథివి మొదలైన వాటిని సృష్టిస్తోంది. అయితే రాఘవా! ఆ విశుద్ధ చైతన్యము ఎక్కడ ఉన్నప్పటికీ ... అది ఈ 'జగత్' అను విషయమునకు అతీతమైయున్నదని గ్రహించెదవుగాక! దాని స్వభావము అసంగత్వమైనది. (It never gets attached to anything). అనగా సర్వసంగమములకు అతీతమైనది. నీవు స్థూల జగత్తును చూస్తున్నావు కదా! ఈ స్థూలజగత్తు యొక్క బీజము .... పంచతన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు). పంచతన్మాత్రలయొక్క బీజమో – అక్షయము, అవ్యయము అగు చైతన్యమే అయివున్నది. దీనినిబట్టి "ఈ జగత్తంతా బ్రహ్మమయమే" అని గ్రహించబడుగాక!

ఈ భూత (లేక/దృశ్య) సృష్టికి పూర్వమే మహాకాశమున తన్మాత్రపంచకము ఉన్నది. ఆ తన్మాత్రలను చైతన్యమే ... ఎట్టి ఉపకరణం లేకుండా ... స్వసామర్థ్యం చేత కల్పించుచున్నది. కల్పన వాస్తవం ఎట్లా అవుతుంది? అందుచేత పంచతన్మాత్రలు కూడా వాస్తవంకాదు. అవాస్తవమైన పంచతన్మాత్రలు వర్ధిల్లి, స్థూలజగత్తుగా మారుచున్నది.

❖

దీనినిబట్టి .... "సత్తు-కల్పన"లకు అధిష్ఠానమైయున్నట్టి "నిష్క్రియ – నిర్వికల్ప – చైతన్యము" నందు ఒక స్వప్న-కల్పనలాగా ఈ జగత్తు అవస్థితమైయున్నదని తేలుచున్నది. కాబట్టి రాఘవా! "నీవు-నేను-అతడు-అది-ఇది" మొదలుగా గల ఈ సమస్తము ఆ అద్వితీయ-చైతన్యమే అయివున్నది. దానికి వేరుగా ఈ త్రిలోకములలో ఏదీ లేదు సుమా!

"ఈ జగత్తు చైతన్యమునందు ఏర్పడుచున్న 'కల్పన' మాత్రమే" అని మనం నిర్వచించాము కదా! మరి కేవలం కల్పనచేత మాత్రమే వర్ధిల్లునది సత్యమెట్లా అవుతుంది? సృష్ట్యాదిగా మనం ఈ

వ్యవహారమంతా పరిశీలించినప్పుడు ... ఈ తన్మాత్ర-పంచకము, దాని నుండి ఉద్భవిస్తున్న ఈ జగత్తు కూడా బ్రహ్మచైతన్యము నుండే వికసిస్తున్నాయని తెలియవస్తోంది. బ్రహ్మమే ఈ 'జగత్తు' అను కార్యమునకు కారణము కూడా. చూచావా రామా! ఇక్కడ ఈ జగత్తుకు కార్య-కారణములు రెండూ బ్రహ్మమే అయివున్నాయి. కనుకనే మేము .... " 'జగత్తు' అనబడు మరొక పదార్థమేదీ ఉత్పన్నమే అయివుండలేదు" .... అని నిర్ద్వంద్వముగా లోకమునకు ప్రకటించుచున్నాయి. "లేదు, జగత్తు అనబడునది ఒకప్పుడు ఇన్ని సంవత్సరముల క్రితం జన్మించింది" అని ఎవరైనా అంటారేమో? పంచమహా భూతములు (ఆకాశము, భూమి, అగ్ని వగైరా), పంచతన్మాత్రలు .... ఈ రెండిటి కలయికే ఈ జగత్తు కదా! ఈ "అనుభవము - అనుభవించువాడు" అను రెండు తత్త్వములలో ఒకదాని కాలనియతి మనకు పూర్ణార్థమును ప్రసాదించజాలదు. ఇంద్రియాసక్తులను అనుసరించి అనేక విధములుగా తోచే ఈ జగత్తును నిర్వచించి, నిర్దేశించి, కాలనియతిని ఆపాదించుటెట్లు?

శబ్ద-స్పర్శ-రూపాది-అనుభవ సంస్కారం-జగత్‌పదార్థముల కలయిక-ఇదే జగదనుభవంగా ముందు ముందు నిరూపించబడుచున్నది.

"ఇదంతా లేదు" అని మేము అనునప్పుడు, "మాకు అనుభూతమగుచున్నది కదా! లేదంటారేం?" అని ఎవరైనా అంటారేమో? వారికి మేము ఒక దృష్టాంతము చూపుచున్నాం. స్వప్నంలో కనబడే నగరాలు వాస్తవానికి అసత్తే కదా! స్వకల్పిత మాత్రములే కదా! అయినప్పటికీ, అవి ఆ స్వప్నసమయంలో సద్వస్తువులవలెనే అనుభూతములగుచున్నాయి కదా! అట్లే ఈ జీవుడు స్వకీయకల్పనచే జగత్తు యొక్క అనుభవం తన స్వస్వరూపమునందే స్వసంకల్పానుసారం పొందుచున్నాడు. ఈ జీవుడు బ్రహ్మాకాశస్వరూపుడే. పరమప్రకాశ స్వరూపమగు బ్రహ్మాకాశమున .... బ్రహ్మాకాశమే అయివున్నట్టి ఈ "కాల్పనిక" యొక్క అస్థిత్వం గోచరిస్తోంది.

❖

విశుద్ధమగు బ్రహ్మమునందు "పృథివి" మొదలైన పదార్థముల ఉనికి అసంభవమని మనం అనుకొన్నాం కదా! అందుచేత ... ఈ 'జగత్తు' అనబడునది భ్రమాత్మక దృష్టికి మాత్రమే గోచరిస్తోందని సత్య-ద్రష్టలు మనందరికీ గుర్తు చేస్తున్నారు. ఆకాశమున ఊహాపూరితమైన నగరాదులు భ్రమదృష్టిచే దర్శించువానికి గోచరిస్తాయి. అట్లే బ్రహ్మము నందు కూడా 'జీవుడు' అనబడునది గోచరించటం జరుగుతోంది. 'ఉపాధి' దృష్టిని త్యజించి 'శరీరి' దృష్టితో పరిశీలించినప్పుడు ఈ విషయం సుస్పష్టమగుచున్నది. ఆహా! ఎంతటి చమత్కారం! శుద్ధ స్వరూపమగు బ్రహ్మమే ఈ జీవుని రూపమున ప్రకాశించటం జరుగుతోంది. అనగా ఆ పరమేశ్వరుడే ఈ "జీవుడు-సమష్టి" మొదలుగాగల ఆకారమున ... జీవసమష్ట్యాకాశమున (సద్రూపమున) ప్రతీయమాను డగుచున్నాడు.

❖❖❖

20. స్థూలదేహ ఆవిర్భావము

శ్రీరాముడు : స్వామీ! ఈ జీవుడు – పరమేశ్వరుడు ఒక్కటే పని ప్రతిపాదిస్తున్నారు కదా! సర్వమునకు అతీతుడు, స్వరూపమంటూ ఏదీ లేనివాడు అయిన ఈశ్వరుడు ఈ స్థూలదేహమును ఎందుకు, ఎట్లు ఆశ్రయిస్తున్నాడు? "నేను జీవుడను మాత్రమే ... అత్యల్పుడను" అను రూపమున గల ఈ సంకుచిత స్వభావమంతా ఎక్కడినుండి వచ్చిపడుతోంది?

శ్రీ వసిష్ఠమహర్షి : స్వయంప్రకాశమగు ఆత్మవస్తువును అత్యంత అసంగతమైనట్టి ఈ స్థూలదేహము యొక్క ఆపాదనంతా ఏర్పడుచున్న ఒకానొక క్రమమును విశ్లేషించి చెపుతాను. విను.

❖

మొట్టమొదట పరమేశ్వరునకు జీవకల్పన అగ్ని స్ఫులింగమువలె కొద్దిగా ఉదయిస్తోంది. క్రమక్రమంగా కల్పనాబలం చేత ఆయనే స్థూలజీవిగా భావన పొందటం జరుగుతోంది. ఆకాశంలో చంద్రుడు ఒక్కడేగాని, ఇద్దరు చంద్రులు లేరుకదా! కాని, మెల్లకన్ను దోషము కలవానికి రెండవ చంద్రుడు వాస్తవమువలెనే గోచరించుచున్నాడు. అట్లే, ఈ జీవభావము 'అసత్తు' అయివుండికూడా సత్తువలె ప్రతీయమానమగుచున్నది. అటు తరువాత భావనాబలము వలన ద్రష్టత్వము ... ఆ ద్రష్టత్వము నుండి దృశ్యత్వము ఏర్పడుచున్నాయి.

క్రమంగా, ఆ సూక్ష్మతేజము తనయొక్క స్ఫులింగభావమును మరచినదై, తనను స్థూలముగా భావించుచు ... స్థూలమే అగుచున్నది. ఒకడు స్వప్నంలో "నేను మరణించాను, నా బంధువులు నా చుట్టూ కూర్చుని ఏడ్చుచున్నారు" అనే అనుభవం పొందుతూ ఉంటాడు. తానే మరణిస్తే ... ఆ స్వప్నం ఎవరికి? అందలి ఏడ్చుచున్న జనులు ఎవరు? తాను ఉంటే కదా, స్వప్నము గాంచుట! ఇట్లు స్వప్నంలో తన మరణం ఎంతటి హాస్యాస్పదమో ... శుద్ధచైతన్యము స్వకీయమైన స్ఫురణచే ఈ జీవత్వము, జీవభావము, "నేను ఒక జీవుడను" అను భ్రమ పొందటం అట్టిదే. కంటి యందు 'పొర' అను దోషము పొందినవాడు ప్రతి వస్తువును రెండు వస్తువులుగా చూస్తాడు. వాస్తవానికి ఇక్కడ వస్తువులు 'రెండు అగుట లేదు కదా!

శుద్ధ చైతన్యము నందు జలతరంగమువలె ఉదయించినట్టి లింగదేహము* "జ్ఞానము – చిత్తము" అను కల్పనల ద్వారా స్థూల దేహములను గ్రహిస్తోంది. ఆయా ఉపాధులతో ఏకత్వము పొందుచు, "నేను ఈ రక్తమాంసమయ శరీరమునే" అని భ్రమిస్తోంది. ఆహా! చూచావా? ఎక్కడి .... నిత్య–నిర్మల–వృత్తి రహితమగు ఆత్మతోటి 'ఏకత్వము'? ఎక్కడి శరీరము తోటి తాదాత్మ్యము? ఎక్కడి "శరీరమే నేను–అను భావన?" ఎక్కడి "అఖండమగు ఆత్మయే నేను" అను ఎరుక?

ఇట్లు లింగాకారమే క్రమంగా స్థూలత్వమౌతోంది. ఒక లక్షాధికారి స్వప్నంలో తనను తాను ఒక భిక్షుకునిగా గాంచునట్లు, "వాస్తవానికి శుద్ధచైతన్యమే" అయున్న ఈ జీవుడు .... "నేను

---

* లింగదేహము = (Subtle body or Mind)

శరీరమును లేక శరీరమాత్రుడను, శరీరము చేతనే ఉంటున్నాను" అని భావించుకొనుచున్నాడు. ఒక దాని వెనుక మరొకటి చొప్పున భ్రమాత్మకమైన అనేక ఆశలకులోనై, నానాయాతనలు అనుభవించుచున్నాడు. చిత్తము ఏయే విషయముల ఆకారమును (లేక భావనలను) దాల్చుచున్నదో ... ఈ జీవుడు కూడా అట్టివే అగు ఉపాధులను దాల్చుచున్నాడు. ఒక దర్పణం (అద్దము) తనయందు, తన ఎదురుగా ఉన్న పర్వతమును ప్రతిబింబిస్తుంది చూచావా? అట్లే 'సర్వగామి'యగు ఈ ఆత్మకూడా తన జ్యోతిర్మయలింగ శరీరమును "అహం" అనునట్టి అభిమానమును దాల్చి వెలయుచున్నది. లోతైన నూతిలో పడినవాడు బయటకు రాలేక కొట్టుమిట్టాడు చున్నట్లు ... ఈ జీవుడు కూడా దేహాభిమానమును వదలలేకున్నాడు. అతడు తన ఆత్మయొక్క స్వరూప - స్వభావములను ఎరిగినప్పుడు మాత్రమే 'స్వస్థత' పొందగలడు సుమా! ఓ రాఘవా! ఈ జీవునికి అతని ఆత్మయొక్క స్వరూపమును గుర్తు చేయటానికే .... మేము ఈ 'ప్రవచనము' అను ప్రయాసతో కూడిన వ్యవహారమంతా చేస్తున్నామయ్యా! అయితే, జీవుడు తన ఆత్మతత్త్వమును ఏ క్షణంలో కూడా త్యజించి ఉండనే లేదు. ఇది సత్యము. మా ఈ ప్రబోధముచే "ఉండివున్న సత్యము"నే (that which is already true) ఎరుక పరుస్తున్నాము. లేక గుర్తు చేస్తున్నాము. అంతేగాని, మేము క్రొత్తగా ఏదీ తెచ్చి ఇచ్చుటలేదు.

❖

"స్వప్న దర్శనం - సంకల్పమునందలి కల్పితమైన దృశ్యము యొక్క అనుభవం" ... ఇవి రెండూ నిజశరీరమునందే జరుగుచున్నాయి కదా! ఈ జీవుడు ఆత్మతత్త్వమగు స్ఫులింగరూపమున (చైతన్య రూపమున) అహంకారాదులతో కూడినవాడై ఉపాధిని ఆశ్రయిస్తున్నాడు. అట్లు ఆశ్రయిస్తూ క్రమంగా తన వాస్తవమగు స్వరూప - స్వభావములను ఏమరచి, "నేను ఈ ఉపాధియందు ఉండువాడిని. ఈ ఉపాధికి మాత్రమే సంబంధించినవాడిని" అను భావనకు బద్ధుడగుచున్నాడు. ఇక ఆపై అట్లే కల్పనామయ దేహములను (స్థూల-సూక్ష్మ దేహములను) అనుభవించుచున్నాడు. అయితే ఈ జీవబుద్ధియొక్క నివాసస్థానము ఏది? ఇది "సత్త-చిత్తము" అను రెండిటితో కూడినదై, "ఉండటం-ఇష్టపడటం" అను రెండు స్వభావములతో స్వయముగా జ్యోతిరాకాశ మధ్యమున, తన లింగశరీరముననే లేక సూక్ష్మశరీరముననే వెలయుచున్నది. ఆ లింగ శరీరము జలమునందలి తరంగమువలె ఆత్మయందు ఉనికిని పొందియున్నది.

❖

మొట్టమొదట, "నేను అనుభవమును పొందెదను గాక! (ఉదాహరణకు .... చూచెదను గాక! వినెదనుగాక! మొదలైన రూపమున)" .... అను ఆసక్తితో కూడిన భావన ఉదయిస్తోంది. అప్పుడు నేత్రము నుండి దృష్టి రూపమున చైతన్యము ప్రసరించి "భవిష్యత్ బాహ్య దృశ్యము"ను సమీపిస్తోంది. అప్పుడు ఈ 'జీవుడు' అనబడు చైతన్యమూర్తి తనయందు ఆ వస్తువు యొక్క ఆకార-లక్షణములకు సంబంధించిన వృత్తిని పొంది, ఆ వృత్తిని అనుభవించుచున్నాడు. దేనివలన

చూచుచున్నాడో, అవి 'కళ్ళు' అని, దేనియందు స్పర్శానుభవం ప్రాప్తిస్తోందో అది 'చర్మము' అని, దేనివలన వింటున్నాడో అది 'చెవి' అని, దేనివలన వాసన పొందుచున్నాడో (అఘ్రాణిస్తున్నాడో) అది 'ముక్కు' అని పేర్లు ఇవ్వబడ్డాయి. ఈ విధంగా చైతన్యమునందలి వివిధ వృత్తులు .... 'వివిధ అనుభవములు ... వివిధ-ధర్మములు'గా పరిణమించి నామరూపములను సంతరించుకొంటున్నాయి.

దేనివలన అయితే "ప్రయత్నము-కర్మేంద్రియములు" కూడా వికసిస్తున్నాయో, దానిని 'వాయువు' అంటున్నాం. అది సర్వదా 'స్పందము' అను లక్షణము కలిగియున్నది కదా! ఈ వాయువే తన స్పంద క్రియ ద్వారా జీవునకు బాహ్యవిజ్ఞానము, అంతర్విజ్ఞానము కలిగించుచున్నది.

ఈ విధంగా ఆతివాహిక దేహి (లేక సూక్ష్మ – దేహి లేక 'అపంచీకృత దేహి' .... మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములే దీని రూపము) ... స్థూలాకారము ధరించుట వలన స్థూలధర్మము ప్రకటితమౌతోంది. అయితే అతని స్వస్వరూపము ఆత్మచైతన్యమే కదా! అనగా ఆత్మచైతన్య స్వరూపుడే "లింగ-స్థూల" శరీరములను ధరించి, అందలి "స్థూల-సూక్ష్మ" విషయముల మధ్య ఆకాశమువలె వెలయుచున్నాడు. అసత్యమే అయి కూడా సత్యమువలె తోచునట్టి కల్పనను ఆశ్రయించి బ్రహ్మ-జీవ శబ్దార్థబోధకమగు (ఆరెండు శబ్దముల అర్థమును ప్రతిబింబించు) జీవత్వమును .... స్వయంగా, లీలామాత్రంగా, అనిర్వచనీయ కారణంగా .... స్వీకరించుచున్నాడు.

ఈ 'జగత్' అనబడు దృశ్యప్రాప్తికి ఇస్తున్న ఒకానొక నిర్వచనం విను.

"ఆ పరమాత్మయే 'అతివాహికదేహి' అయి స్థూలదేహ – ఆవరణము నుండి స్వబుద్ధిచేత కల్పించబడిన ఈ బ్రహ్మాండమును గాంచుచున్నాడు".

శ్రీరాముడు : మరి వేరువేరు జీవుల మాటేమిటి? ఇక్కడ ఒక్కొక్క జీవుడు ఒక్కొక్క విధంగా ఇచ్ఛ, హావ-భావములు ఉనికి ప్రకటిస్తున్నాడు కదా! ఈ కనబడుచున్నదంతా ఏమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి : ఔను! ఒక జీవి జగత్తును, మరొకజీవి విశాల బ్రహ్మాండ స్వరూపమును, ఇంకొక జీవి భావి బ్రహ్మాండమును గాంచుచున్నారు. ఒకే శక్తి అనేకచోట్ల అనేక వ్యవహారములను నిర్వర్తించుట లేదా? ఒకే చైతన్యము ... ఒకచోట జీవునిగాను, మరొకచోట విరాట్ స్వరూపము (విస్తారమైన పంచభౌతిక సృష్టి సమన్వయము) గాను, ఇంకొకచోట దీర్ఘ – హ్రస్వకాలస్వరూపము గాను... తనను తానే వ్యక్తీకరించుకొంటోందని గ్రహించెదవుగాక. అట్లు గాంచుచు, ఆయా అనుభవములను అంగీకారబుద్ధితో దర్శించుటయే ఈ బ్రహ్మాండ నిర్మాణములోని అంతర్లీన లక్షణము.

ఈ జీవుడు "నిజగర్భ గృహము (own inner recess of the house)" అనతగినట్టి తన చిత్తమునుండే... కల్పనానుసారంగా కాలము, కార్యము, కల్పన, ద్రవ్యములను అనుభవించు చున్నాడు. ఆయా రూప – నామ – శబ్దములకు బద్ధుడగుచున్నాడు. అయితే వస్తుతః ఇదంతా స్వప్న కల్పనవలె అసత్తు లేక అళీకము (భ్రమమాత్రము) అయివున్నది. అందుచేత, జ్ఞానులు "ఇదంతా అనుత్పన్నమైనది" అనే నిర్ణయిస్తున్నారు. "విశ్వరూపుడు, ఆదిప్రభువు అయినట్టి ఆత్మ

'స్వయంభువు'. అట్టి ఆత్మకు వాస్తవానికి "ఉత్పత్తి" అనునదే లేదు. కాని స్వకీయమగు మాయచే వ్యష్టి-సమష్టి సృష్టి రూపములుగా ప్రకటితమగుచున్నాడు" ... అని వేదములు ప్రవచించుచున్నాయి, బోధించుచున్నాయి. బ్రహ్మాండాకారముగా కనిపించే ఈ భ్రమయందు ... ఆతివాహిక దేహస్వరూపి, ఆది ప్రభువు అగు 'ప్రజాపతి' అని పిలువబడుచున్న శుద్ధస్వరూపుడగు 'ద్రష్ట' కాక మరింకేదీ ఎక్కడాలేదు. ఈ 'దృశ్యజగత్తు' అనబడుదానియందు ఏదీ ఉత్పన్నమయి ఉండలేదు. ఏది ఉత్పన్నము అవబోవుట లేదు. ఇంకేమీ ఎవరిచేత చూడబడటంలేదు. ఓ రామచంద్రా! మేము ఈ జగత్ వ్యవహారమంతా బాగా పరిశీలించాము. అనేక కోణముల నుండి ఈ "నీవు-నేను" మొదలైనవాటిని పరీక్షించి చూచాం. అనేక చర్చల తరువాత జగద్విషయమై మేము చేస్తున్న నిర్ణయం విను.

ఆతివాహిక రూపమును (మనోరూపమును) స్వయముగా ఆశ్రయించిన పరమాత్మ ఈ జగత్తును తనకుతానే చిత్తమునందు రచించుకొని - ఆ రచనచే బ్రహ్మాండముగాను, వస్తుజాలముగాను, ఉత్తమ - మధ్యమ - ప్రథమ పురుషులుగాను దర్శించుచు, అనుభవించుచున్నాడు.

"ఇక్కడ-అక్కడ, ఇప్పుడు-అప్పుడు బ్రహ్మాకాశమే ఉన్నది" అని గ్రహించుటే జ్ఞానం.

అందుచేత, రామా! ఈ దృశ్యవ్యవహారమంతా సత్తవలె (As if exists truly) గ్రహించబడవచ్చు. అనుభవించబడవచ్చు. కాని, వాస్తవానికి ఇదంతా స్వప్నములో గాంచబడే నగరమువలె "కల్పితము, ప్రతిబింబమాత్రము, భ్రమ, అలీకము" అని నీవు గ్రహించెదవుగాక! ఇదంతా వాస్తవానికి అనిర్మితం, రాగరహితం, బంధరహితం. అయితే ఏం? అత్యంత ఆశ్చర్యం కలిగిస్తూ ప్రకాశిస్తోంది.

ఆకాశములోని నక్షత్రములు, చంద్రుడు మొదలైనవి తటాకజలంలో ఎవరి కారణంగా ప్రతిబింబిస్తున్నాయి? ఈ అలీకదృశ్యము, నీటిలో ప్రతిబింబించే ఆకాశ దృశ్యమువలె, ఎవ్వరూ సృష్టింపకున్నప్పటికీ సత్యానుభవమువలె వెల్లివిరుస్తోంది. మహాప్రళయ సమయంలో బ్రహ్మాదులు కూడా లయమైపోతున్నారనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఒకప్పుడు ఉండి .... మరొకప్పుడు లేకుండా పోయేది సత్యమెట్లా అవుతుంది? ఈ సృష్టి అంతటికీ కర్తయగు బ్రహ్మయే ఒకానొక దృష్టిచే, 'మాయ'లోని భాగంగా, "లేనివాడే" అగుచుండగా, ఇక ఆయన సృష్టియగు ఈ జగత్తు గురించి వేరుగా మనం చెప్పుకునేదేమున్నది? ఇది కూడా అట్లే లేనిదే అగుచున్నది. సృష్టికర్త ఎట్టివాడో, ఆ సృష్టికర్తచే కల్పించబడిన ఈ జగత్తుకూడా అట్టిదే అవుతుంది కదా!

శ్రీ ప్రియరాఘవా! 'జ్ఞానము' అనబడే జాగ్రత్ ప్రవర్తించినప్పుడు ఈ 'జగద్దర్శనము' అనే స్వప్నము తనంతటతానే అంతర్ధానమగుచున్నది. అప్పుడు పరమాత్మ తన జీవత్వభ్రమలు వదలి, తనయొక్క "కేవలం - అద్వితీయం - అద్వయం" అగు బ్రహ్మ స్వరూపమున వెలియుచుండటం జరుగుచున్నది. అప్పుడిక అతనిపట్ల ఈ దృశ్య జాడ్యములేవీ ఉండవు. స్వప్నం త్యజించుటచే మెలుకువ వచ్చిన తరువాత ... ఆ స్వప్నములోని గృహములు, మనుష్యులు, సంఘటనలు అసత్యముగా తెలియవస్తాయి. అప్పుడవన్నీ జ్ఞాపకమాత్రంగా మాత్రమే ఉంటాయి కదా! అట్లే ఈ జగత్తు - శరీరాదులు ఉండివున్నా, జ్ఞానము ప్రాప్తించినట్టి స్థితిలో ఇవన్నీ, వీటి మూలకారణముతో

సహా .... ఆకాశరూపముననే సాక్షాత్కారమౌతాయి. అప్పుడు "నేను - నీవు - అది - ఇది"లతో కూడిన జగత్తంతా 'బ్రహ్మము'గానే అనుభూత మగుచున్నది. జలమునకు వేరుగా ద్రవత్వమున్నదా? సృష్టికూడా పరమాత్మ నుండి వేరుకాదు.

"జ్ఞానులు" అంటే ఎవరు? తపస్సు మొదలైన ఆయా ప్రయత్నములచే మనస్సును నిర్మలం చేసుకొనినవారే కదా! అట్టి నిర్మల మనస్కులకు ఈ కనబడే బ్రహ్మాండము ఆకాశమువలె అతి నిర్మలము, ప్రశాంతము, నిరాధారము (ఏదీ ఆధారముగా కలిగి ఉండనిది) నిరాధేయము (దేనికీ కూడా తాను ఆధారము కానిది). అద్వయము, అద్వితీయముగా (తనకు వేరైనది కానిదిగా) తెలియవచ్చుచున్నది. ఇదంతా బ్రహ్మము నుండే ప్రాప్తిస్తున్నప్పటికీ, బ్రహ్మమునకు వేరుగా ఏదీ, ఏ సమయమందును ఉత్పన్న మగుటలేదు. ఇది పరమాకాశమువలెనే శూన్యము, నిర్మలము అయి వెలయుచున్నది.

ఓ మహాసూక్ష్మబుద్ధీ! ఒక విషయం ప్రకటిస్తున్నాను. వాస్తవానికి "సంసారము" అనునదే లేదు. ఇది (ఈ కనబడునది) ఆధారముగాని, ఆధేయముగాని, ద్రష్టగాని, దృశ్యముగాని కాదు. దీనియందు బ్రహ్మము - బ్రహ్మాండము అనబడు పదార్థములేవీ లేవు. ఇక్కడ రూపనామములకు సంబంధించిన కార్యకారణములను, కాలప్రతిపాదనలను నిరూపించాలని, సిద్ధాంతీకరించాలని ప్రయత్నించటం ఒక విధంగా "వితండవాదమే" నని అనిపించుకొంటుంది. అయితే శాస్త్రములు కొన్ని నామ-రూపముల సహాయం తీసుకొని, శిష్యునియందు సంసారరాహిత్యమును వెలిగించటానికి ప్రయత్నం చేస్తున్నాయి. పదజాలము యొక్క ప్రాస్త్యము అంతవరకే. (అనగా శిష్యులకు బోధించటం కొరకే).

వాస్తవానికి, ఇక్కడ జంగము-స్థావరాదులు కూడా లేవు. జలములో తరంగములు, ఆవృత్తములు, సుడిగుండాలు లేస్తాయి చూచావా? ఒకే జలం ఆ విధంగా అనేక రూపములలో ప్రవర్తిస్తోంది. బ్రహ్మము తనయందు తానే "జగత్కల్పన" చేసుకొని ఇంతలోనే ఆ కల్పనలన్నీ విలీనం చేసుకొంటోంది. ఇదంతా ద్రష్టకు వేరుగా చూచినప్పుడు అసత్తు అయివుండి కూడా దృశ్యదశలో దృశ్యరూపమున అనుభూతమై అనేక అనుభవములకు ఆలవాలమగుచున్నది. ఆహా! ఈ అసత్తు అయినట్టి దృశ్య వ్యవస్థలో ఎన్ని వేదనలను, ఎన్ని దుఃఖములను, ఎన్ని భయములను జీవుడు నిష్కారణంగా అనుభవించుచున్నాడో కదా! ఒకడు స్వప్నంలో తాను మరణించినట్లు కలగాంచుచున్నాడు. ఇంతలోనే, నిదుర లేచిన తరువాత, "ఈ స్వప్నానుభవం నాయొక్క భ్రమచే కల్పించబడినదే కదా! మరి నేను అంతగా ఎందుకు రోదించాను?" అని ఆశ్చర్యపడతాడు. ఇక ఆపై పట్టించుకోకుండా ఆ అనుభవంపట్ల మౌనం వహిస్తాడు. అదే విధంగా జ్ఞానము ప్రాప్తించినప్పుడు "ఈ సంసారము మిథ్యయే కదా" అని బోధపడుచున్నది. అప్పుడాతడు కేవలము అఖండము, అనాది, అనంతము అగు బ్రహ్మమునే జ్ఞానాకాశమునందు దర్శించగలడు. ఆపై పూర్వ-తత్పూర్వ జగత్ వ్యవహార మననము ఉండజాలదు.

ఆ పరమాకాశమునందే స్వయముగా శూన్యరూపమున "అతివాహిక దేహధారి" అయి ప్రజాపతి* వెలయుచున్నాడని గ్రహించు. అతని దేహము పాంచభౌతికము కాదు. కార్యము, కారణము కంటే వేరు కాదుకదా! (Effect in not different from the cause). ఆ ప్రజాపతి సంకల్పమాత్ర వ్యవహారమైనట్టి ఈ పృథివి మొదలైన స్థూలసృష్టి 'సత్తు' కాదు సుమా! ఇదంతా ప్రజాపతి నిజ స్వరూపమైన బ్రహ్మమే. "సర్వము సర్వదా బ్రహ్మమే" అని గ్రహించిన తరువాత ఇక్కడ నీకు తారసపడగల సుఖ - దుఃఖములేమి ఉన్నాయి? "సంసారము" అనునది ఎక్కడ ఉన్నది చెప్పు?

❖❖❖

21. ఈ జీవుడు పరిమితుడా? అపరిమితుడా?

శ్రీ వసిష్ఠమహర్షి : ఇప్పటి వరకు మనం విచారించిన దానిని అనుసరించి "అహంభావము గాని, దానిని ఆశ్రయించి ఉన్న 'జగత్తు' మొదలైన దృశ్య సమూహములు గాని లేవు" ... అని తేలుచున్నది కదా! ఇదంతా జన్మరహితమైయుండుటచే "లేవు" అనునది యుక్తియుక్తమే అవుతుంది. 'బ్రహ్మము' ఒక్కటే సత్పదార్థము. ఇక ఇతరమైనదేదీ ఎక్కడా లేదు.

పరమాకాశము - స్థూల/సూక్ష్మ దేహములు - దృశ్యము :

నిశ్చలమగు సముద్రజలము తన జలత్వము త్యజించకుండానే చంచలమగు కెరటములుగా మారినది కదా! పరమాకాశమే తన ఆకాశరూపమును త్యజించకుండా జీవరూపమున ప్రకాశమును పొందుచున్నది. సంకల్పమే రూపముగా గల "చిద్వృత్తి" ఈ అసంఖ్యాకములగు జీవ రూపములను దాల్చుచున్నది.

ప్రథమజీవి (జీవత్వమునకు నాంది), విరాట్టు ప్రజాపతి అయివున్న ఆ బ్రహ్మదేవుని చిత్స్వరూప-ఆకాశదేహమునే మనం "అతివాహికము, సూక్ష్మదేహత్వము" అని పిలుస్తున్నాం.

ఇక ఈ 'దృశ్యము' విషయానికి వస్తే ఇదంతా కలలో కనబడే కొండలాగా భాసిస్తోంది. ఇది ... ఏ చిత్రకారుడో ఏకాగ్రచిత్తము నందు కల్పించిన "సేవాదళము" అను పంచరంగుల చిత్రమువంటిది. ఒక చిత్రకారుడు ఒక గొప్ప చిత్రమునకు రూపకల్పన చేసాడనుకోండి... ఆ చిత్రము యొక్క ప్రావీణ్యత అతని చిత్తమునందే అన్ని వేళల దాగియున్నది కదా!

ఈ జగత్తు ఒక స్తంభములో చెక్కబడిన శిల్పదృశ్యము వంటిది. విరాట్పురుషుడు (లేక ప్రజాపతి లేక బ్రహ్మదేవుడు లేక సమష్టి సృష్టి) ఆ స్తంభమున గల 'శిల' వంటివాడు, "ఆది ప్రజాపతి" ** అయిన ఆ బ్రహ్మదేవునికి, సామాన్యజీవునికి ఉన్నట్లు... సహకారికమైన "ఉత్పాతక కారణం" అంటూ ఏమీ లేదు. ఎట్లు అంటావా? జీవుడు... "ఈ ఇంద్రియానుభవములను

---

* ప్రజాపతి = సూక్ష్మతత్వము (Subtle body) యొక్క ఆదికారణ చైతన్యమే ప్రజాపతి యొక్క స్వరూపము.

** ఆది ప్రజాపతి = ప్రతిజీవుడు పూర్ణమగు ఆత్మయే కదా! శుద్ధతత్వమగు ఆత్మ సమష్టి-సృష్టి భావమును పొందునట్టి తత్వమునే 'ఆది ప్రజాపతి'గా చెప్పబడింది.

పొందెదనుగాక! వీరితో కలిసి జీవించెదను గాక" ... ఇట్టి ఆసక్తిపూర్వకమైన సంకల్పములచే అనేక శరీరములను పొందుచున్నాడు. ప్రజాపతియో ... అట్లు కాదు. అతడు స్వయముగానే పరమాకాశమున తననుతాను ప్రకటించుకొనుచున్నాడు.

ఇతఃపూర్వపు ప్రజాపతులు మహాప్రళయ సమయమున 'ముక్తులు' అయినారు. ముక్తులైన వారికి పూర్వపు కర్మలు, సంస్కారములు ఉండవు కదా! కెరటాలు జలంలో లేచి లయిస్తున్నట్లు బ్రహ్మమునందు బ్రహ్మలు వారివారి సృష్టులతో సహా లేవటం, లయించటం జరుగుతోంది.

శ్రీరాముడు : అనగా ఆ ఆదిప్రజాపతియే దృశ్యములో ఎదురుగా ప్రాప్తిస్తున్న ఈ వస్తువులుగా అగుచున్నాడా?

శ్రీ వసిష్ఠమహర్షి : ఈ జగత్ పదార్థములు అద్దంలోని ప్రతిబింబములాగా జీవుని చిత్తమునందు ప్రతిబింబిస్తున్నాయి. చిత్తమే శరీరముగాగల ప్రజాపతి "స్వతంత్రసత్త శూన్యుడు" అని చెప్పబడుచున్నాడు. దృశ్యమునకు అతీతమైన ఆత్మయే అతనికి ఆధారము. అతడు దృశ్యము గాని, దర్శనముగాని, ద్రష్టగాని స్వతహాగా కాకపోయినప్పటికీ ... అన్నీ తానే అగుచున్నాడు. దీపం నుండి మరొక దీపం వెలిగించబడునట్లు, ఆ ఆది ప్రజాపతి నుండే ఈ దృశ్య సమూహములన్నీ ఉత్పన్నమౌతున్నాయి. ఒక సంకల్పములో మరింకెన్నో సంకల్పములు, ఒక స్వప్నములో మరికొన్ని దుస్స్వప్నములు కలుగుచున్నట్లు, ఆ ఆది ప్రజాపతి యొక్క "సమష్టిసృష్టి" అను స్వప్నంలో అనేక 'జీవులు' అను అసంఖ్యాక స్వప్నములు ఉంటున్నాయి. చెట్టు నుండి కొమ్మలు, ఆ కొమ్మల నుండి అనేక ఆకులు ఉత్పన్నమగుచున్నట్లు, సమష్టి-సృష్టి స్వరూపుని స్వప్నము నందు అనేక వృష్టి-అల్ప-సమష్టి సృష్టులు బయల్వెడలుచున్నాయి. అతని స్పందము వలననే ఈ జీవుడు ఉత్పన్నమగుచున్నాడు. మట్టితో అనేక బొమ్మలు తయారు అయినప్పుడు ... ఆ మట్టికి - బొమ్మలకు అభేదమే సిద్ధిస్తోంది కదా! బాహ్యమైన సహకారి కారణము లేనప్పుడు - కార్య - కారణములు అభిన్నమే కదా! అదేరీతిగా ఈ సృష్టికి, పరమాత్మకు భేదం లేదు.

ఎవనియందు ఈ 'పృథివి' మొదలైన అలీకమైన (జలము నందలి ప్రతిబింబము వంటి) వస్తువులన్నీ కనబడుచున్నాయో, అతడే జీవాకాశస్వరూపుడగు* ఆదిబ్రహ్మ. అతడే ఈ "విరాట్ ఆత్మ ... విస్తారపదార్థ సృష్టి స్వరూపము" అని వేదజ్ఞులు చెప్పుచున్నారు.

❖

శ్రీరాముడు : భగవంతుడగు ఓ వసిష్ఠ మహర్షీ! మీరు చెప్పినదంతా విన్న తరువాత, ఇప్పుడు నాకు కొన్ని సందేహాలు కలుగుచున్నాయి. జీవుడు పరిమితుడా? అపరిమితుడా? జీవులు అనేకులు ఉన్నారా? ఒక్కడే ఉన్నాడా? ఒక వేళ అనేకులు ఉంటే వారందరు కూడా అనంతస్వరూపులేనా?

---

* ఈ కనబడే వస్తుజాలం ఇట్లు ఇంద్రియముల అనుభవంగా ప్రాప్తిస్తున్నాయి. ఆ ఇంద్రియములు శబ్దస్పర్శరూప రసగంధములను తన్మాత్రలలో ఉన్నాయి. ఆ తన్మాత్రలు చిత్తాకాశంలో ఉన్నాయి. చిత్తాకాశం జీవాకాశంలో ఉన్నాయి. 'శుద్ధచిత్' యొక్క ప్రథమ ప్రకటన అజీవాకాశమే.

వారందరు అచలము (కొండ) వలె మార్పుచేర్పులు లేకుండానే ఉంటున్నారా? అసలు ఈ జీవులందరు ఎక్కడి నుండి వెలువడుచున్నారు? విచిత్రం చూచారా? మేఘం నుండి జలధారలు పడుచున్నట్లు, సముద్రం నుండి అనంత సంఖ్యలో జలకణములు వెలువడుచున్నట్లు, అగ్ని నుండి రవ్వలవలె ఈ జీవులందరు అసంఖ్యాకంగా ఎటునుండో వెలువడుచున్నారు. ఉంటున్నారు. వీరందరు బయలుదేరినది ఎందులోంచి? ఎక్కడికి వెళ్ళుచున్నారు?

శ్రీ వసిష్ఠమహర్షి : నీ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పమన్నావా? విను.

'జీవుడు' అనబడువాడు ఒక్కడూ లేడు. ఇక "చాలామంది జీవులు" అనే మాట ఎక్కడ ఉన్నది? నీ ప్రశ్న "కుందేటికి కొమ్ములు ఎందుకు కనబడుచున్నాయి?" అన్నట్లు ఉన్నది. జీవుడు లేడు. జీవరాశి లేదు. పర్వతమువలె జీవపిండము కూడా లేదు. నీకు కనబడుచున్న 'జీవుడు' అనబడుచున్నదంతా ... ప్రతిభాస, లేక ప్రతిబింబము వంటిదే కాని, వాస్తవము కాదు.

శుద్ధము, సర్వగతము (అంతయు ఆక్రమించి, ప్రసరించియున్నది), పవిత్రము అగు బ్రహ్మముగాక మరొక వస్తువే లేదు. ఆ బ్రహ్మము సర్వశక్తిమంతము. అందుచేత, ఈ కల్పనా కౌశలమంతా దానియందే ఉపస్థితమైయున్నది. ఆ చైతన్యమునందు సంకల్ప వృత్తులు ప్రతిబింబించి, తద్వారా ప్రతిబింబ (అళీక) మాత్రములైనట్టి ఈ సాకార – నిరాకారములగు పదార్థములుగా ఆవిర్భవిస్తున్నాయి. కాబట్టి ఇవన్నీ బ్రహ్మ ద్రష్టలకు ... బ్రహ్మమునందు, బ్రహ్మముగా కనిపిస్తున్నాయి. 'విత్తు' (Absolute knowing) అను లత "చైతన్యము" అను సంసర్గముచే "నీవు–నేను– పదార్థములు – అంతరంగ విషయములు" .... అను రూపుగల 'పూలు–కాయలు'గా వికసిస్తోంది. కనుక ఈ కల్పనా వృత్తుల ప్రకాశమంతా పూలు–కాయలతో కూడిన 'లత'గా పోల్చబడుచున్నది. దీనిని గాంచునది కూడా బ్రహ్మమే. "జీవుడు – బుద్ధి – స్పందము – మనస్సు – ద్వైతభావము – బ్రహ్మసత్త" ... ఇవే జ్ఞానగమ్యములగుచున్నాయి. అయితే వీటిలో ఏ ఒక్క దానికి స్వకీయమైన సత్త (Independent existence) లేదు. "ఏకమాత్ర బ్రహ్మము"నకు మాత్రమే అస్థిత్వమున్నది. మిగతావాటికన్నిటికీ బ్రహ్మము వలననే అస్థిత్వం ఏర్పడుతోంది. ఆ బ్రహ్మసత్తను తత్త్వపూర్వకంగా (తత్త్వమ్ = అదియే నీవు అను ఎరుకగా) తెలుసుకోకపోవటం చేతనే అది వేరైన సత్తవలె ప్రతిభాసమౌతోంది. తత్వతః గ్రహించిన తరువాత అది కాకుండా వేరొకటేదీ అగుపించదు. బ్రహ్మసత్తను అజ్ఞానము ఆవరించియున్నది. అయితే, భయపడ వలసినదేమీ లేదు. ఎందుకంటే, అట్టి అజ్ఞానమును 'ఆత్మజ్ఞానం' అనతికాలంలో వినాశనమొర్చుచున్నది.

❖

ఒక చమత్కారం ఏమిటంటే, "అజ్ఞానం ఎట్టిది? ఎందుకు సంభవిస్తోంది?" అనే విషయమై ఏమీ చెప్పలేం. "దీపపు వెలుతురు వలన చీకటి నశిస్తుంది"... అనే విషయం మనందరికీ తెలుసు. కాని 'చీకటి' అనగా ఏమో ఏమిచెప్పగలం? "వెలుతురు లేకపోవటమే చీకటి" అనిమాత్రం ఒక మాట అనగలం. అదేవిధంగా, "జ్ఞానము ఉదయించినప్పుడు అజ్ఞానము నశించుచున్నది"

... అని మనం తప్పకుండా చెప్పగలం. కాని, "ఈ అజ్ఞానం ఇట్టిది. ఇక్కడి నుండి వచ్చింది, ఇక్కడ ఉన్నది" అని మాత్రం నిర్వచించలేము. మేము బోధించునపుడు ... అజ్ఞానము తొలగే ఉపాయము లేమిటో చెప్పుచున్నాం. అజ్ఞానం ఎందుకు ప్రాప్తించిందో అది అనిర్వచనీయమే సుమా!

"పరిశుద్ధ తత్త్వమగు ఆత్మ మనన కారణంగా జగత్తును పొందుతోంది" అని చెప్పుచున్నాం. అట్టి బాహ్యప్రియత్వముతో కూడిన మననము ఎందుకు ప్రాప్తిస్తోంది?

శ్రీరాముడు : అవును ... ఎందుకు ప్రాప్తిస్తోంది?

శ్రీ వసిష్ఠమహర్షి : అది మేము చెప్పజాలకపోతున్నాము. వాస్తవానికి అది అనిర్వచనీయము. నిజానికి మనకు ఆ విషయం అనవసరం కూడా! వ్యాధి ఏమిటో, దానికి చికిత్స ఏమిటో తెలిసిన తరువాత, "ఇతనికీ వ్యాధి ఎందుకొచ్చింది? ఎప్పుడు, ఎట్లా ప్రారంభమైంది?" అనునది అప్రస్తుతమేనని మా అభిప్రాయం. ఒకవైద్యుడు సుదీర్ఘకాలం వెచ్చించి వాటికి సమాధానాలు వెతక పూనటం కాలమును వృథాచేయుటయే కదా! వైద్యం చేయటానికి ఉపక్రమించటమే తక్షణ కర్తవ్యం కదా!

ఇప్పుడు మేము ప్రతిపాదించునది, "బ్రహ్మమే ఈ 'జీవుడు' అయివున్నది" అని కదా! కనుక నీవు నీ ప్రశ్నలలో తరచితరచి చెప్పుచున్న 'జీవుడు' అనువాడు బ్రహ్మమే. అట్టి బ్రహ్మము – "సర్వశక్తిమంతము, అఖండము, అపరిచ్ఛిన్నము, అనాది, అనంతము, సత్యము, చైతన్యరూపము" ... అయివున్నది. ఈ లక్షణములన్నీ జీవునియొక్క వాస్తవ స్వరూపము యొక్క స్వభావమే అయివున్నది. 'బ్రహ్మము' అనునది ఎక్కడో లేదు. ఎప్పటికో లభించునది కాదు. ఓ మహాబుద్ధిశాలీ! రామచంద్రా! ఈ జీవుని వాస్తవ స్వరూపమే బ్రహ్మము సుమా! దానియందు భేదకల్పనలు లేవు. ఈ కనబడుచున్న జగత్‌కౌశలమంతా కూడా (అపరోక్షానుభూతి సమయమందు) బ్రహ్మమునందే పర్యవసించుచున్నదని గ్రహించెదవుగాక!

శ్రీరాముడు : స్వామి! మీరు చెప్పేదంతా బాగానే ఉన్నది. ఒప్పుకొంటున్నాను కూడా. కాని, మీరు "జీవసమష్టియే మహాజీవుడు" అంటున్నట్లు నాకు అవగతమౌతోంది. మరి ఈ వ్యష్టిజీవుడు ఎవడు? ఇతడు సమష్టిజీవుని అంగము వంటివాడా? ఒకవేళ అది నిజమైతే ... ఒక జీవుని యందు ఒక ఇచ్ఛ అన్ని జీవులలోను పుట్టాలి కదా? అలా జరుగుతోందా? లేదే! జీవులకు పరస్పరభేదమేదీ లేదని మీ అభిప్రాయమా? అట్లైతే ఈ వేరువేరు అభిప్రాయములు, జ్ఞానములు, సంకల్పములు మాట ఏమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి : మంచి ప్రశ్నే వేశావు. చెపుతాను, విను.

బ్రహ్మమే సమష్టి జీవరూపమును గ్రహించి, అటు తరువాత వ్యష్టిరూపమును కూడా దాల్చుచున్నదని ... నేను ఇంతవరకు చెప్పినదానినిబట్టి గ్రహించే ఉంటావు కదా!

ఆ సర్వశక్తిమంతుడు, మహాజీవియగు అఖండ–బ్రహ్మమునందే ఈ 'జగత్‌వ్యవస్థ' అంతా ఇచ్ఛారూపమున ఉంటోంది. అతడు నిరంతరం దేనిని కోరుచూ ఉంటాడో, అయ్యది సత్వరము

ఫలిస్తూ ఉంటుంది. సత్యసంకల్పము (ఇది సత్యమైయున్నది – అను సంకల్పము) కూడా అతని ఇచ్ఛకు లోబడియే ఉంటోంది. అనగా ఆ బ్రహ్మము ఏది ఎట్లు సత్యమని భావిస్తే, అది అట్లే ప్రాప్తించుచున్నది.

అతనియందు ఇంతకుముందే "నేను 'వ్యష్టిజీవత్వము' అను అనుభవమును పొందెదను గాక" అనునట్టి భావబీజము ఉండి ఉంటోంది. ఈ విధంగా, సమష్టిజీవుడు 'వ్యష్టి' అగుట కూడా ఆ బ్రహ్మము యొక్క ఇచ్ఛాలీలయే. అతడు తన అంశలగు జీవన సమూహములను, "ఇది ఇట్లు అగును" అని సంకల్పించి కల్పించుచున్నాడు. ద్విత్వము (the second one) అనునది ఏకత్వము నుండే వస్తోంది కదా!

లౌకిక వ్యవహారం దృష్ట్యా ... ఏ కార్యము ఎట్లు చేయాలో సంకల్పించుటయే కాకుండా, తదనుకూలంగా అవలంబిస్తేనే ఆయా కార్యములు సిద్ధిస్తాయి కదా! కాని సమష్టిజీవి విషయం అట్లు కాదు. అతడు సంకల్పించినంత మాత్రం చేతనే, క్షణంలో కార్యము సిద్ధించుచున్నది. వ్యష్టిజీవి ఆయా కర్మలు నిర్వర్తించటం ద్వారా ప్రయత్నించినపుడు మాత్రమే ఏదైనా పొందుచున్నాడు. ఈ వ్యష్టి–సమష్టి జీవులకు (1) "సంకల్పించి + ప్రయత్నించి పొందటం, (2) సంకల్పించినంతమాత్రంచేత పొందటం" ... అనునట్టి నియమమునకు వ్యతిరిక్తంగా ఏదీ సంభవించదు.

శ్రీరాముడు : మహర్షీ! మహర్షుల కార్యములు సంకల్పమాత్రంగానే ఈడేరుచున్నాయి కదా!

శ్రీ వసిష్ఠమహర్షి : నిజమే. కాని, అది అట్లు జరుగుట కూడా మనం సమష్టి జీవుల ఇచ్ఛకే ఆపాదించవలసి వస్తుంది. "మహర్షుల సంకల్పము సత్యమై ప్రవర్తించుగాక" అనునట్టి సమిష్టి–జీవుని నిర్ణయమే అట్లు వారి వర–శాపాదులను శక్తివంతం చేస్తోంది. వ్యష్టి–జీవుని ఇచ్ఛకు కూడా కారణం సమిష్టిజీవుని ఇచ్ఛయే. అట్టి ఇచ్ఛ ఫలించటానికి కూడా అదే కారణం.

బ్రహ్మము
→ ప్రధాన జీవుడు మహాజీవాత్మ → కల్పనా శక్తి → అనేక → వ్యష్టి జీవుడు
→ క్రియాక్రమమునకు సంబంధించిన ఇచ్ఛ ⟶ ⟶ ⟶

'సమష్టిజీవి' లేక 'ప్రధానశక్తి' యొక్క నియమమునే "ఈశ్వరేచ్ఛ" అని అంటున్నాం. అట్టి ఈశ్వర–నియమమునకు వ్యతిరేకముగా ఏ కార్యమూ సిద్ధించదు. సర్వము దానిని అనుసరించే ప్రతిష్ఠితమై ఉంటుంది. కాబట్టి ఇవన్నీ ఈశ్వరేచ్ఛానుసారమే జరుగు చున్నాయి. వ్యష్టిజీవి ఇచ్ఛ వలన సిద్ధించేదంటూ ఏదీ లేదు.

బ్రహ్మమే స్వరూపముగాగల "మహాజీవి" ఆద్యంతరహితుడైయున్నాడు. అతడే కోట్లకొలది వ్యష్టిజీవుల – సమష్టిజీవుల యొక్క స్వరూపం. అతడు కాకుండా ఇంకేదీ ఇక్కడ లేదు. 'బ్రహ్మదేవుడు' అని మనం పిలుస్తున్నది సమష్టి జీవుని గురించేనని ఇతఃపూర్వమే చెప్పాను కదా! అయితే

"జీవుడు-బ్రహ్మ" ... లకు చైతన్యాంశమున భేదమేమీ లేదు. కాని ఉపాధియందు భేదమున్నది. 'జీవసమష్టి' అని మనం చెప్పుకొంటున్నవానికి ...

1. సూక్ష్మశరీరము (Subtle body),
2. కారణశరీరము (causal body - that body which causes every thing else)

... అని రెండు ఉంటాయి. ఇక వ్యష్టిజీవి విషయానికి వస్తే, అతనికి ఈ రెండు శరీరములే కాకుండా, క్రియకు ఆశ్రయమైన స్థూలశరీరము కూడా ఉన్నది.

నీవు చెప్పినట్లు, వేరువేరైన "వృత్తి-ఇచ్ఛ-ఫలము"ల తారతమ్యము వ్యష్టివిషయంలో తారసపడటానికి కారణం ఉపాధి భేదములే సుమా! "నాకీ శరీరము ప్రియము. నేను ఈ శరీరమునకు సంబంధించినవాడను మాత్రమే. ఈ శరీరమునకు సంబంధించిన హాని వృద్ధులు నావే. ఈ శరీరమునందుగల ఇంద్రియములకు అనుభవమగుచున్న ఆయా బాహ్యపదార్థముల సంస్పర్శచేత మాత్రమే నేను ఆనందించగలను" ... అని బ్రహ్మము (తాను చైతన్యతత్త్వమైనప్పటికీ) ఒకానొకప్పుడు జడభావమును పొందుచున్నది. జడవస్తువు చేత ఏర్పడుచున్న సంసర్గము చేతనే బ్రహ్మమునకు 'నేను జీవుడను' అనే అనుభవము, తద్వారా విస్తారమైన సంసారము వచ్చిపడుచున్నాయనే విషయం ఈ గ్రంథము చేతను, ఉపనిషత్తులు మొదలైన ఆత్మవిషయ ప్రతిపాదకమగు తదితర గ్రంథముల చేతను అనేక దృష్టాంతముల ద్వారా మరల మరల నిర్దుష్టముగా నిరూపించ బడుతోంది. ఈ సంసర్గము (attachment) దూరమైనప్పుడు "వ్యష్టిజీవభావము" తొలగిపోయి, ఆ స్థానంలో "మహాజీవత్వము" సిద్ధిస్తోంది. అదికూడా లయించినపుడు... ఇక సర్వదా సమరసపూర్వకమగు సమస్వరూపమే ఏర్పడుచున్నది. ఒక జడమైన కొయ్య, అగ్ని యొక్క స్పర్శచే అగ్నికణముగా మారుచున్నది కదా! రాగి, బంగారము యొక్క స్పర్శచేత గాని, ఔషధ ప్రభావం చేతగాని 'బంగారము'గా రూపమును పొందుతోంది కదా! వ్యష్టిజీవుడు కూడా తన సమష్టిత్వమును పొందుచున్నాడు. పరంపరా క్రమంగా ఆ సమష్టి జీవభావమును కూడా త్యజించటం జరిగినప్పుడు "నేను బ్రహ్మమునే" అనునట్టి బ్రహ్మభావమును పొందుచున్నాడు. అట్టి బ్రహ్మ భావమును పొందువాడు, "నేను అఖండుడను. సర్వదా సర్వతత్త్వములందు నిండియుండి, సర్వమునకు కారణమగుచు, దేనికి అంటకుండా ఉండెడివాడనైన నేను సర్వదా శుద్ధుడను. అనిర్వచనీయుడను. అనిర్దేశమగు సత్స్వరూపుడను" అనునట్టి అనుభవము కలిగి ఉంటున్నాడు. అట్టి స్వానుభవపూర్వకమగు అవగాహన కలిగియున్నవానికి ... పరమాత్మతత్త్వమగు బ్రహ్మమునకు భేదమేమీ ఉండదు. 'నేను బ్రహ్మమును' అని గ్రహించినవాడు బ్రహ్మమే కాక మరింకేమౌతాడు? చూచావా రామా! ఈ 'జీవుడు' అనబడువాడే కనిష్ఠ - జీవత్వము నుండి జేష్ఠ-జీవత్వము, జేష్ఠ-జీవత్వము నుండి జీవరాహిత్యమగు బ్రహ్మభావమును పొందుచున్నాడు. అట్లే ఇప్పుడు నీకు 'జీవుడు' అనబడు విధంగా కనబడువాడు ఒకప్పుడు 'నేను బ్రహ్మమునే" అను ఎరుకను త్యజించి, క్రమంగా 'నేను వ్యష్టిని' అనునట్టి స్వల్ప (లేక కనిష్ఠ) జీవత్వ భావనను పొందియున్నాడు.

నేను బ్రహ్మమును. జీవతత్వమునకు అతీతుడను శుద్ధుడను / శాశ్వతుడను అఖండుడను అపరిమితుడను	నేను సమష్ఠి జీవత్వమును. జ్యేష్ఠ జీవత్వమును	నేను వ్యష్ఠిని. కనిష్ఠ జీవత్వమును పరిమితత్వమును

ఈ వ్యష్టిజీవుడు (Individual soul) గా మనం (స్వదృష్టిదోషంచేత) చూస్తున్న ప్రతిజీవుని హృదయంలోను మహాకాశస్వరూపమగు ఆత్మ జాజ్వల్యమానంగా ప్రకాశిస్తోంది. అట్టి ఆత్మయందే ఈ జగత్తు 'అసత్తు' అయినప్పటికీ, సత్తువలె ప్రకాశించుచున్నది. వాస్తవానికి, ఆ విధంగా సత్తువలె ప్రకాశించటం చైతన్యముయొక్క చమత్కారమేగాని, వేరేమీకాదు. అనగా, చైతన్య స్ఫూర్తియే 'స్వచమత్కారం' చేత తనంతటతానే, భవిష్యత్ నామరూపములను గ్రహించుచు, "ఈ రూపమే నేను. ఈ పేరు నాది. ఈ వస్తువులు, వ్యక్తులు నాకు సంబంధించినవి" అనునట్టి అహంభావమును స్వీకరించుచున్నది. కాబట్టి రాఘవా! "ఈ వ్యష్టిజీవుడు 'చైతన్య బింబము' యొక్క చిదాభాస ప్రతిబింబమే" అని గ్రహించు.* చైతన్యము-చిదాభావము (Reflective) అనబడు బింబ- ప్రతిబింబాలు "చిన్మయము" గాక వేఱేమీ కాదు. అట్టి చిదాభాసయే జగత్తు రూపంలో ఆత్మచైతన్యము నందు ప్రతిబింబిస్తోంది. కనుక ఈ ప్రకాశము కూడా చైతన్యప్రకాశమే.

❖

'వ్యష్టిజీవుడు' అనబడుచున్న చిదాభాస చైతన్యము లేక ప్రతిబింబ చైతన్యము / (Reflection of pure consciousness) ..... బింబ చైతన్యము (సమష్టిజీవము, మహాజీవము) కంటే అభిన్నమే అయినప్పటికీ "పరిణామము" మొదలైన విషయాల దృష్ట్యా విభిన్నముగా తెలియబడుచున్నది. ఇట్టి విభిన్నత్వము కూడా చైతన్యము వలననే సంభవించుచున్నది. "చేతనము - జడము - జడప్రకాశము''... ల అభిన్నానుభవం, భ్రాంతిచేత భిన్నముగా కనబడటం... అనునదే జగద్రూపవ్యవహారమని గ్రహించెదవు గాక! చేతన-స్వరూపమగు బ్రహ్మము యొక్క విశాలశక్తి ఆకాశముకంటే కూడా అత్యంత సూక్ష్మమైనది. ఈ అహంభావం కంటే కూడా అత్యంత సూక్ష్మమైనది. ఈ అహంభావ దర్శనమంతా బ్రహ్మమునందే, దానిచేతనే, దానివలననే ఏర్పడుచున్నదని గ్రహించువారు బ్రహ్మస్వభావులే అగుచున్నారు.

"వ్యష్టిజీవుడు-సమష్టిజీవుడు" ... అను రెండు విషయములు వాస్తవదృష్టిలో అభిన్నములు. వ్యష్టిలో సమష్టిత్వమున్నది. సమష్టిలో వ్యష్టిత్వమున్నది. జలములోని అనేక తరంగములకు, అందులో

---

* సూర్యబింబము ఆకాశములో ప్రకాశించునప్పుడు ఆ బింబము ఒక తటాకంలోని జలంలో కూడా ప్రతిబింబిస్తుంది కదా! ఆకాశమున ఉన్న సూర్యుడు "బింబము" అని, నీటిలో ప్రతిబింబించే సూర్యుడు "ప్రతిబింబము" అని ఇక్కడ దృష్టాంతంగా గ్రహించాలి. ఆకాశ సూర్యుడు వాస్తవంగాని, ప్రతిబింబ సూర్యుడు కాదు కదా!

గల ఒకానొక తరంగమునకు భేదమేమున్నదో చెప్పు? ఒక తరంగమునకు, అనేక తరంగములకు, జలమునకు అభేదమే సిద్ధిస్తోంది కదా! అట్లే వ్యష్టిజీవుడు – సమష్టిజీవుడు – చైతన్యములు అభేదమైనవని గ్రహించెదవు గాక! భేదముగా గ్రహించబడటం అజ్ఞానము చేతనే సుమా! అజ్ఞానమే "నీవు – నేను – అతడు – జడము – చేతనము"లతో నిండినట్టి ఈ జగద్దర్శనమునకు అసలైన కారణమగుచున్నది. చైతన్యశక్తియే అహంకారముతో కూడినట్టి ఈ బ్రహ్మాండమును తనయందు తాను లీలామాత్రంగా దర్శిస్తోంది. ఇంతకుమించి ఇక్కడ ఏ ప్రత్యేకమైన విషయము లేదు. 'చిత్' శక్తి తన నిజరూపమున స్వయముగా కల్పించుకొనుచున్న మనోహర 'వివర్తవైచిత్ర్యమే' (down word view) ఈ 'జగత్తు' అనబడుచున్నది.

❖

ఈ 'బుద్ధి' మరియు 'అహంకారము' అనబడునవి కూడా ఆ చిత్‌శక్తి యొక్క వివర్తము మాత్రమేనని గ్రహించు. అనగా 'నేను జీవుడను' అను, మూలభావంతో కూడుకొని కనబడేదంతా ఒక 'కల్పన' వంటిదేగాని, వాస్తవము కాదు. అదేవిధంగా, "శబ్ద – స్పర్శ–రూప–రస–గంధములు" ... అనబడే పంచతన్మాత్రలు కూడా చైతన్యము యొక్క వివర్తములే అయివున్నాయి. ఇక ఈ ద్వైత–ఏకత్వభావం గురించి వేరుగా చెప్పేదే మున్నది? ఇదంతా చిత్‌శక్తి (లేక ఆత్మభగవానుని) కంటే వేరుగా కనబడుటకు మూలకారణం వాసనలే. వాసనలు అజ్ఞానము నుండే కలుగుచున్నాయి. "వాసనలు" అనగా ... అనేక శారీరక–మానసిక క్రియాపరంపరల పర్యవసానమే. కనుక రామా! నీవు ఈ వాసనలను, తత్సంబంధమైన కర్మల పర్యవసానమును మొదలంట పరిత్యజించెదవు గాక! ఈ "నీవు –నేను–నీది–నాది" అను స్వల్పదృష్టులకు అతీతుడవగుము. అప్పుడుగాని, నీకు సత్యము సుస్పష్టం కాదు. "సత్యము–భ్రమ"... అను ఈ రెండు అత్యంత జటిలంగా కలిసిపోయి ప్రవర్తిస్తున్నాయి. నీవు ఎప్పుడైతే వాసనలను, భేదభావనలను త్యజించివేస్తావో ... అప్పుడు సత్యము శేషించి అనృతము (అసత్యము) తొలగిపోగలదు.

నాయనా! రామా! "ఈ దృశ్యము ఏమై ఉన్నది?" అనునది ఎరిగినవాడవై, దాని కారణ – కారణమైయున్న నీ స్వస్వరూపముయొక్క ప్రాప్తియందు రమించుచుండుము. మేఘములచే కప్పబడి ఉన్నప్పుడు ఆకాశము యొక్క స్వరూపము గ్రహించగలమా? మేఘములు తొలగిపోయినప్పుడో? ఆకాశము యొక్క వాస్తవమైనట్టి, అఖండమైనట్టి స్వరూపము గోచరిస్తుందికదా! స్వస్వరూపము విషయము కూడా అట్టిదే. శరీరముల పట్ల, దృశ్యముల పట్లగల భ్రమలు తొలగిన మరుక్షణం స్వస్వరూపము యొక్క వాస్తవమైన అఖండత్వము, నిత్యత్వము, "దేశ–కాల"–అతీతత్వము గోచరిస్తాయి. ఈ ఆకాశము యొక్క స్థితత్వము ఆకాశమునందే గోచరిస్తుంది కదా! అదేవిధంగా దృశ్య ప్రపంచము తొలగిపోయినప్పుడు కూడా 'చిత్‌శక్తి' యొక్క స్వాభావికసత్త గోచరించ గలదు. నీ స్వరూపము ఆ స్వాభావికసత్తయే. చిత్‌శక్తి కంటే దాని స్వాభావికసత్త వేరైనది కాదు సుమా!

అసలు సత్త అంటే ఏమిటి? 'అసత్త' అంటే ఏమిటి? మాకీ తేడా ఏమిటో తెలియవచ్చుట లేదు. ఒక్క విషయం నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను. విను. "దృశ్యప్రపంచము విచారణచే తొలగిపోగా

... ఈ జీవుడే అప్పుడు స్వచ్ఛుడై వెలయును" అని ఖచ్చితంగా, అనుభవ పూర్వకంగా చెప్పుచున్నాం. ఆ స్థితిలో చిత్‌శక్తి యొక్క స్వాభావికత్వమునకు, స్వస్వరూపమునకు అభేదమే అనుభవమవుతోంది.

❖

ఓ రామచంద్రా! మనఃచేష్టారూపమగు సూక్ష్మజగత్తు (ఆతివాహిక జగత్తు Zone of thought process) శూన్యము మాత్రమే. ఇంద్రియములచే అధిష్ఠితమైయున్న ఈ శరీరాదులు, ఈ బ్రహ్మాండములు ... ఇవన్నీ చైతన్యము యొక్క భావనావివర్త మాత్రములే కదా! చైతన్యము కంటే భిన్నమైనది ఎక్కడ ఏమున్నది చెప్పు? ఏ పదార్థం ఎద్దాని నుండి ఉత్పన్నమౌతోందో, అట్లు ఉత్పన్నమైనది తన మూలమైన దానికంటే వేరైనది ఎట్లా అవుతుంది? నీటి నుండి ఉత్పన్నమైన మంచు నామ-రూప-రంగు భేదంచేత జలముకంటే వేరుగా తోచుచున్నప్పటికీ .... మంచుగడ్డ ఏ సమయమందు కూడా ... జలము కంటే వేరైనది అయివుండదు కదా! స్థావరపదార్థములకే ఈ నియమము చెల్లుచున్నప్పుడు ఒక నిరవయవ పదార్థముల గురించి వేరుగా చెప్పేదేమున్నది? వ్యష్టివలె తోచుచున్న అహంకారము, శుద్ధ బ్రహ్మ చైతన్యము నిరవయవములైనవే! అవి రెండు వేరువేరైనవి కావు.

❖❖❖

22. అహంకార స్వరూపము

చిత్‌శక్తి స్వయం ప్రకాశకము. దానికి నామరూపాలు లేవు. దాని స్వయంకల్పిత స్ఫురణయే 'జగత్తు' రూపంగా ప్రతిబింబిస్తోంది. ఈ మనస్సు, బుద్ధి, అహంకారము, పంచభూతములు, పర్వతములు, దిక్కులు... ఇదంతా చైతన్యము యొక్క సంకల్ప పూర్వక రచనా చమత్కారమే. ఎందుకంటావా? ఈ జగత్తు యొక్క స్వరూపము దీని దర్శనము చైతన్యమునందే పర్యవసిస్తోంది కదా! కనుక, "ఈ జగత్తు చిత్‌శక్తి యొక్క ధర్మము (function)" అనునది గ్రహించెదవు గాక! జగత్తును వదిలివేస్తే చిత్‌శక్తి యొక్క శక్తిత్వమే శేషిస్తోంది. అప్పుడు శేషించుదానికి నామరూపాలు లేవు. "జగత్తును వదలుట" అంటే ఏమిటి? జగద్భావమును వదలుటయే. ఓ రామచంద్రా! వాస్తవానికి నీవు భావములకు అతీతమై, భావములను కల్పించువాడవేగాని భావనా సిద్ధుడవు కాదు. ఇది నిత్యసత్యము. 'జగత్' భావము తొలగినప్పుడు జడపదార్థము యొక్క పరిణామము కూడా "చిత్‌శక్తి"లో కరిగిపోవుచున్నదని అనుకొన్నాము కదా! జగద్భావం ఉన్నంతవరకు భేదభావం తొలగదు.

ఇప్పుడు చెప్పు! ఈ జగత్తుకు స్వతంత్రసత్త ఎక్కడున్నది? మరల చెప్పుచున్నాను. విను. "చిత్‌శక్తి" యందు, "ప్రపంచమును ప్రకటించటం" అను శక్తి స్వయంకృతమై (Self designed) ... ఆ శక్తి నుండి వేరుకానట్టిదైయున్నది. అది జీవరూపమున, తన్మాత్ర ... (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధముల అనుభవములను పొందునది) రూపమున ప్రతిభాసమై జగత్తుగా కన్పట్టుచున్నది.

చిత్తుతో కూడిన అహంభావ స్ఫురణయే ప్రాణముతో కూడి, "జీవుడు" అనబడు సంజ్ఞను పొందుచున్నది.

చమత్కారం చూచావా? "చిత్‌శక్తి" .... దానియొక్క 'స్ఫురణ' అనునవి అహంభావం చేత వేరుపరుపబడినవై జీవసంజ్ఞను దాల్చుచున్నాయి. అయితే ఈ వ్యవచ్ఛాధర్మము (the function of differentiation) క్రీనీడవంటిది మాత్రమే కాని వాస్తవము కాదు. "అహంభావమును జయించటం" అనగా ..... అద్దానిని అవాస్తవ - దృష్టిచే దర్శించుటయే. అంతేగాని, దానిని ఒక వస్తువులాగా భావించి, తొలగించుటకు యత్నించుట కాదు. లేదంటావా, అట్లు ప్రయత్నిస్తూ ఉంటే, 'అహంకారము' యొక్క ఉనికిని అంగీకరించుటయే అయి, ఇక ఆపై మాయ పరిఢవిస్తూనే ఉంటుందని గ్రహించు.

క్రీనీడ వంటిదే అయినట్టి 'అహంభావము' వాస్తవదృష్టిచే పరికించబడినప్పుడు, "ఇది బ్రహ్మమే" అని తెలియవచ్చుచున్నది.

❖

ఈ 'జగత్తు' విషయమై మరికొన్ని విశేషాలు చెపుతాను. విను.

చైతన్య ప్రధానమగు అహంకారమే అన్నింటికి కర్త. క్రియా ప్రధానమగు ప్రాణమే 'కర్మ'. "కర్త" అనగా ... 'క్రియనిర్వర్తించునది' అని కదా! కర్తకు - క్రియకు భేదం లేదు. అందుచేత, అహంకారమునకు - ప్రాణమునకు భేదంలేదు. కర్తయొక్క ధర్మ (functional) విశేషమే కర్మ. అందుచేత, మనం 'జీవుడు' అని పిలుస్తున్నది కర్మనే సుమా!

క్రియామయమగు జీవుడే పురుషుని* యొక్క చిత్తము. ఈ చిత్తమే ఇంద్రియరూపమున ప్రకటితమై నానావిధాలుగా ప్రతీయమానమగుచున్నది. ఇక కార్య-కారణభావముల (Effect & cause experiences) విషయానికి వస్తే ఇదంతా అళీకమే. (లేక దర్పణములోని ప్రతిబింబము వంటిదే). ఈ జగత్తు అంతా చిత్ప్రకాశముయొక్క అంశయే కనుక ఇందు భేదత్వమునకు తావు లేదు. ఇదంతా అభేదత్వమే అయివున్నది.

❖

అచ్ఛేద్యోఽహమదాహ్యోఽహమక్లేద్యోఽశోష్యయేవచ
నిత్యః సర్వగతః స్థాణురచలోఽహమితి స్థితమ్ ॥

అహంకారమునకే స్థానభూతమైన ఆత్మకు ఛేదింపబడుట, దహింపబడుట, తడుపబడుట, శోషింపబడుట అనునవి లేవు. అది సర్వవేళలందు సర్వవికారములకు అతీతమైయున్నది. అయ్యది నిత్యము, సర్వగతము, స్థిరము అచలము కూడా. ఓ రాఘవా! మేము ఆత్మయొక్క స్వరూపము (లేక బ్రహ్మతత్త్వమును) గ్రహించియున్నాం. అట్లు స్వానుభవంగా గ్రహించిన దానినే లోకములకు ప్రకటిస్తున్నాం. తమ స్వస్వరూపమును గ్రహించనట్టి అనేకమంది జీవులు భ్రమాత్మకము, దుఃఖప్రదము అయినట్టి పరహింస, పరదూషణ వంటి నీచకార్యములను ఆశ్రయిస్తున్నారు. శాస్త్రములు

* పురుషుడు : పురుషకారము (Effort) రూపముగలవాడు.

ప్రతిపాదించుదానిని తిరస్కరిస్తున్నారు. ఫలితంగా అనేక దౌర్భాగ్యములు అనుభవిస్తున్నారు. అయితే ఈ దృశ్యవ్యవహారము యొక్క ఆటలన్నీ 'అజ్ఞాని' వద్ద మాత్రమే సాగుచున్నాయి. అతనికి మాత్రమే ఇదంతా మూర్తివంతమై, వికారాదులతో కూడి సార్థకత పొందుతోంది. జ్ఞానికో ... ఈ దృశ్య ప్రపంచమే అగుపడటం లేదు. అతడికి అనుభవమగుచున్నది చిదాకాశమే. స్వీయా అహంకారంతో సహా ఈ సర్వ సత్-అసత్ భావములన్నీ నదీజలం సముద్రం చేరునట్లు, చిదాకాశమునందే ప్రవేశిస్తున్నాయి. నీటిలో వేయబడిన ఉప్పువలె, అతనిని చేరుచున్న రూప-నామాలన్నీ స్వస్వరూపమునందు నిశ్శేషముగా లయించిపోతున్నాయి. ఓ రామచంద్రా! ఇప్పుడు మనం జ్ఞానుల దృష్టినే మరల-మరల స్వీకరించాలి. అంతేకాని, అజ్ఞానుల భేదదృష్టిని ఎంతవరకు తరచి చూస్తే మాత్రం ఏం ప్రయోజనం?

❖

"చిత్"ను (ఉపనిషత్తు ద్రష్టలు) ఒక వృక్షముతోను,
"మాయ"ను వసంతము యొక్క రాకతోను,
"జడశక్తి"ని ఆ వృక్షములోని రసముతోను,
"కాల దూరాదుల"ను ఆ చిత్‌వృక్షము యొక్క పుష్ప-ఫలములతోను పోల్చుచున్నారు.

ఆ బ్రహ్మమే అన్నివేళల, అన్నిచోట్ల, అన్ని రూపములతోను ప్రకటితమగుచున్నదని చెప్పటానికే నేను ఈ ఉపమానం తీసుకొన్నాను. కనుక, శూన్యమే రూపముగా గల ఆకాశము, స్పందమే ధర్మముగా గల వాయువు, తేజము, జలరాశి, భూమి, ఓషధ స్వరూపుడగు చంద్రుడు, మహాజ్యోతి స్వరూపుడగు సూర్యుడు మొదలైన రూపములుగా ప్రకటితమగుచున్నది - ఆ అద్వితీయ బ్రహ్మమే సుమా! 'బ్రహ్మసత్త' కాకుండా వీటికి వేరైన స్వతంత్రసత్త లేదు. స్వస్వరూపజ్ఞానం చేత దృశ్యప్రపంచము లయించిందనుకో .... అప్పుడు 'చిద్బ్రహ్మము' తనయొక్క పూర్వభావముననే వెలయగలదు.

జాగ్రత్-స్వప్న-సుషుప్తులతో కూడా బ్రహ్మమే అట్లు స్ఫురించుచున్నది. ఈ మూడు స్థితులు - "జడభావ సమ్మేళనము" లేక "మనోభావ ప్రాప్తి" అనువానియందే ఉండి ఉన్నాయి కదా! వాటిలో కనబడే తేడా అంతా ఈ రెంటి యొక్క సమ్మిళితము నందు మాత్రమే. 'బ్రహ్మసత్త' నుండే 'జగత్‌సత్త' ఏర్పడుచున్నది. అయితే ద్రష్ట నుండి వేరుగా స్వరూపతః చూచినప్పుడు జగత్తు అసత్యమే. "మాకు ఈ జగత్తు ఇట్లు ఎందుకు ప్రాప్తించుచున్నది?" అను ప్రశ్నకు సమాధానంగా, "మీరు అద్దానిని అట్లు భావించటం చేతనే" అని చెప్పుచున్నాము.

ఈ "జగత్తు" అనబడునది :

చిత్‌స్వరూప - మహాకాశము యొక్క "శూన్యము"
చిత్‌స్వరూప - వాయువు యొక్క "స్పందము"
చిత్‌స్వరూప - గాఢాంధకారము యొక్క "స్పందము"
చిత్‌స్వరూప - సూర్యుని "దినకల్పన"

... అని విజ్ఞులు రసమయంగా చెప్పుచున్నారు. కనుకనే, ఇది స్వరూపతః చూచినప్పుడు "అసత్యము" అని నేను ప్రకటించాను.

కాని అధిష్ఠానరూపమున (ఇదంతా ఎందు నిక్షిప్తమై ఉన్నదో అట్టి శుద్ధతత్వమున) సత్యము. దీపశిఖ ఆరిపోతే మసి మాత్రమే మిగులుచున్నది కదా! జగత్తు నశించినప్పుడు బ్రహ్మమే మిగులుచున్నది. ఆకాశము నందు "నీలిరంగు పదార్థము ఉండుట" అను ప్రసక్తి అవాస్తవమైనట్లు, ఇక్కడ (ఈ దృశ్యమునందు) భేదవికారములు కనబడు చున్నప్పటికీ ... వాస్తవానికి ఈ భేదవ్యవహారం బ్రహ్మమునందు లేదు. ఈ స్వర్గ – మర్త్య – పాతాళ లోకములు అసత్తులే (స్వకీయమైన ఉనికి లేనివి) అయినప్పటికీ, సన్మయంగా (సత్+మయము .... వాస్తవమైన ఉనికి కలిగియున్నట్లు) కనబడటంచే ... అనేక శబ్ద వ్యవహారములకు యోగ్యములు అవుచున్నాయి.

ఒకడు చీకట్లో త్రాడును చూచి 'పాము' అని తలచుచున్నాడనుకో ... ఆ త్రాడు – పాముగా చూడబడుచున్నదాని కంటే వేరైనది కాదు కదా! అట్లే ఈ జగత్తే బ్రహ్మము. కల్పిత పదార్థముల సత్త (లేక అసత్త) అధిష్ఠాన సత్త కంటె వేరైనది కాదు. త్రాడు – పాముల (వాస్తవము – అవాస్తవము నందు కల్పించబడిన) భ్రమ సత్ – అసత్తులు ఒక్కటే కాని వేరువేరు అయిన విషయాలు కావు కదా! అట్లే బ్రహ్మము – ఈ జగత్తు ఒక్కటే.

"అవయవి–అవయవములు" అను శబ్దములకు నిరాకార–సాకార అర్థకల్పనలు చేసి "ఆ రెండింటికి వేరువేరైన 'సత్త' ఉన్నది" అని ఆరోపణ చేయటం దోషభూయిష్ఠమైన యోచన – అని మా అభిప్రాయం. ఇట్టి శబ్దార్థ – కల్పన కుందేటి కొమ్ములాగా అర్థం లేనిదే. "నది" అని మనం దేనిని పిలుస్తున్నాం? నీరు–నేల–గట్లు ... ఈ మూడింటి సమన్వయమే కదా? ఇవి కాక, నది అనునది ఎక్కడున్నది? ఇట్లే సముద్రం కూడా? అట్లే తదితర శబ్దార్థములన్నీ. అట్టిదే ఈ కనబడు "అవయవి–శరీరము" అనునవి కూడా! ఇట్లు ఈ జగత్తే బ్రహ్మము.

❖

ఒక దృష్టాంతము చెపుతాను. ఒక స్ఫటికం తన బైట–లోపల కూడా నిండి ఉన్నట్లు అగుపడుచున్నప్పటికీ, దానియందు ఆకాశము ఉండనే ఉండివున్నది కదా! ఐతే ఎదురుగా ఉండే పదార్థములను తనయందు ప్రతిబింబింపచేయుటకు (ప్రతిబింబమునకు అధిష్ఠానం) ఆ స్ఫటికమే కదా! అదేవిధంగా, చిన్మయమగు 'మాయ' కూడా, లోన–బయట జడమే అయినప్పటికీ, దానియందు "చిత్ ప్రతిబింబము" పడుతోంది. చిత్ ప్రతిబింబముతో కూడిన మాయయందు ఈ 'అసత్తు' అయినట్టి జగత్తు ప్రతిభాసితమగుచున్నది.

"స్ఫటికం" మొదలైన పదార్థ సమూహములలో అంతర్గతమైయున్న స్థూలాకాశంలో ఈ ఆకాశజనితమైన 'వాయువు' మొదలైనవాటి సంపర్కము ఉండదు కదా! అట్లే చిదాకాశమునందు కూడా "నీవు–నేను–అతడు" మొదలైనవాటి యొక్క 'సత్–అసత్తు'ల మాలిన్యం ఉండదు.

మరొక దృష్టాంతం ద్వారా జగత్–బ్రహ్మముల అభేదం చెపుతాను, విను. ఆకులో ఉండే

ఈనెలు ... ఆ ఆకునుండి వేరుకాకున్నప్పటికీ వేరైనట్లు తోచటం లోకవిదితమే కదా! జగత్తు కూడా బ్రహ్మము నుండి వేరుకాకపోయినప్పటికీ వేరైనట్లు కనిపించుటయే మాయ యొక్క చమత్కారం. కనుక జగత్తు-బ్రహ్మము పరస్పరం అభిన్నములే. బ్రహ్మము ఈ జగత్తును ధరిస్తోంది. కారణమునకే కారణము - ఆదికారణము బ్రహ్మమే. చిత్తమునకు అధిష్ఠానమగు చైతన్యము అదే. బ్రహ్మదేవునికే ఆదికారణం బ్రహ్మము. అదియే శివము, తత్త్వము, మర్మము మొదలైన అర్థపూరితమైన ప్రవచనములచే చెప్పబడుతోంది.

❖

చిత్తు : ఈ జగత్తు నందు స్వరూపాదులు తోచుచున్నాయి కదా! అయితే అట్టి స్వరూపాదుల అనుభవమునకు మూలకారణమేమిటి? ఆ స్వరూపాదులకు సంబంధించిన అంతరంగమునందలి జ్ఞానస్ఫురణయే కదా! అట్టి చిత్తు లేక జ్ఞానము అకారణమే (కారణరహితమే) అని చెప్పబడుతోంది. "సర్వ స్వరూపావస్థలకు ఉపాధి కారణము ... బ్రహ్మమే" అని కూడా శాస్త్రములు చెప్పుచున్నాయి. అట్టి ఈ చిత్తు స్వానుభవమాత్రమే గాని, మరొకరిచే ప్రసాదించబడునది, తెలియజేయబడునది కాదు.

చేత్యము : చేత్యము (తెలియబడునది) చిత్తు (లేక ద్రష్ట) యొక్క భావనను అనుసరించి మాత్రమే ఉంటోంది. జ్ఞానదృష్టిచే "చేత్యము-లేదు" అనునదే సిద్ధిస్తోంది. "ఇది బాగున్నది. ఇది పొందుటయే గొప్ప. ఇది లేకున్న దుఃఖమే" ... మొదలైన సమాచారమంతా ద్రష్ట యొక్క కల్పనను ఆశ్రయించే ఉంటోంది. ఒక కల్పనచే ఉండి, వేరొక కల్పనచే లేకుండటం వల్ల చేత్యమును "సదసత్తు" (ఉండి - లేకవున్నది) అని అంటున్నారు.

అయితే అసత్తా వ్యవహారమగు ఈ దృశ్య జగత్తు పట్ల 'దృష్టి' (లేక ఆసక్తి) ఉన్నంత కాలం, చేత్యమునకు (తెలియబడుదానికి) అతీతమైయున్నట్టి చిత్తు అనుభవమునకు వచ్చుట లేదు. అనగా నీవు, నీ స్వస్వరూపమగు ఆత్మ యొక్క అనుభవం (చిత్తు యొక్క అనుభవం) పొందాలనుకొంటే :

1. "ఎదురుగా ఉన్న ఈ దృశ్యము స్వతహాగా ఉన్నది కాదు. ఇది నా యొక్క సంస్కారములచే చేయబడుచున్న కల్పన యందే ప్రతిష్ఠితమైయున్నది" అని గ్రహించాలి.

2. అట్లా గ్రహించుటచే దృశ్యాతీతుడవు కావాలి. (అదియే సంసారాతీతము - లేక - చేత్యాతీతము).

ఇక్కడ నీవు మరొక విషయం కూడా గ్రహించాలి. "చేత్యచిత్తు"* మాత్రమే అనుభవమునకు లభ్యమౌతోంది. చేత్యరహితమైన చిత్తు** (Perceiver without perception or Knower without the function of knowing) లౌకిక వ్యవహారమునకు, పదజాలమునకు వర్ణనలకు లభ్యమవదు.

---

* చేత్యచిత్తు = చేత్యము లేక తెలియబడు దానిని గ్రహించు సంస్కారవృత్తులు గల చిత్తు.

** చేత్యరహితచిత్తు = బాహ్యసంస్కారవృత్తులు అంటూ లేని చిత్తు

చేత్యవృత్తితో కూడిన చిత్తు మాత్రమే ప్రకటితమౌతోంది. లేదా చేత్యరహిత చిత్తు అప్రకటితంగానే ఉండిపోతోంది. బీజము లోని అంకురమే వెలువడుతుంది కాని, బీజములో లేని అంకురం వెలువడదు కదా! ఓ రామా! బ్రహ్మమునందు జగద్బీజము ఉండనే ఉండి ఉన్నది సుమా! కనుక కృత్రిమదృష్టితో "ఈ జగత్తు తొలగుగాక" అనునట్టి ప్రయత్నముతో వ్యవహరించవలసిన పనేమున్నది? "ఈ జగత్తు ఎట్లైనను ఉండుగాక! లేక తొలగుగాక! ఇదంతా బ్రహ్మమే. ద్రష్టనగు నేను కూడా బ్రహ్మమే" ... అనునదే ఉత్తమదృష్టి.

ఆకాశమునకు ... "ఇది వేరు – అది వేరు" అను భేదము ఎక్కడ ఉన్నది? ఒకవేళ వేరు–వేరుగా (దిక్కులు, పదార్థరూపనామముల దృష్ట్యా) కనబడినా అదంతా ఆకాశము యొక్క స్వరూపమే కదా! కనుక నీవు భేద శూన్యుడవై "ఈ త్రిభువనములన్నీ బ్రహ్మ స్వరూపములే" అనునట్టి నిశ్చయము కలిగియుండుము.

సభ్యులందరు తమ సాయంసంధ్యా కార్యక్రమములు నిర్వర్తించుటకుగాను సాలోచనలతో గృహోన్ముఖులయ్యారు.

❖❖❖

(మూడవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

నాల్గవ రోజు

III. లీలోపాఖ్యానం - కథావిషయం

(మండపోపఖ్యానము)

1. జగద్భ్రమ

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ దృశ్యజగత్తు చిదాకాశమే కాని వేరేమీ కాదని నిన్న మూడవ రోజు చెప్పుకొన్నాం కదా! ఇక మనం నాల్గవ రోజు విచారణలో ప్రవేశిస్తున్నాం.

సభికులంతా శ్రద్ధాసక్తులతో వినండి.

ఒకనికి నిర్మల-ఆకాశంలో ఆకారాదుల భ్రమ కలుగుచున్నట్లు, నిర్మలమగు ఆత్మయందే ఈ జగద్భ్రమ కలుగుతోంది. ఒక స్తంభమున చిత్రించబడిన శిల్పము ఆ స్థంభము లాగానే శిలయే అయివున్నది కాని - మరింకేమీ కాదు కదా! చిత్-రూపము అనే స్తంభమున చెక్కబడిన ఈ జగత్తు కూడా చిద్వస్తువు కంటే వేరు ఏమాత్రం కాదు. అయితే, మనం ఇక్కడ చెప్పుకొంటున్న ఉపమానంలో ఉన్న తేడా ఒక్కటే. మామూలు శిలాస్తంభములో శిల్పము లభించాలంటే, ఒకానొక శిల్పి ఉండాలి. కాని ఈ జగత్తు చిత్ - వస్తువు నందు ప్రకటితమవటానికో ... ఏ శిల్పి అవసరం లేదు. సముద్రజలంలో తరంగములు ఉండటం సహజమైన విషయమే కదా! బ్రహ్మము నందు ఈ దృశ్యజగత్తు ప్రతీతమై ఉండటం కూడా సహజమైన విషయమే. అజ్ఞాని యొక్క దృష్టిలో జగత్తు అత్యంత స్థూలమై ఎదురుగా నిలచి ఉంటోంది. ఇక జ్ఞాని దృష్టికో ... ఇదంతా అనేక మట్టి పాత్రలలోని ఒకే 'మట్టి' లాగా, అనేక కిరణములలోని ఒకే సూర్యతేజములాగా, సూక్ష్మముగాను, భేదశూన్యముగాను అనుభవమౌతోంది. వేరువేరు సూర్యకిరణములు వేరువేరు వస్తు సమూహములను ప్రకాశింపజేస్తున్నప్పటికీ, కిరణములన్నీ సూర్యతేజము నుండి బయల్వెడలుతూ, దానికి అభేదంగానే ఉంటున్నాయి కదా! అయితే, బ్రహ్మజ్ఞానము లేకపోతే జగత్తు యొక్క సూక్ష్మ భావము అనుభవము కాదు సుమా!

కనుక, ఈ జగత్తునందు భూమి, ఆకాశము మొదలైనవి అనుభూతమగుచున్నప్పటికీ వాటి స్వరూపము చిదాకాశమే. అవన్నీ స్వప్నమునందలి కల్పనవలె భ్రమాత్మకము, (భేదానుభవం దృష్ట్యా) అసత్యము మాత్రమే. ఎండమావుల గురించి తెలిసినవానికి, "ఇక్కడ ఒక నది ఉన్నది. ఈ కనబడేవన్నీ ఆ నదియొక్క తరంగములే" ... అను ఆవేశము ఉంటుందా? జలము - జ్ఞాన - విజ్ఞానముల యొక్క అనుభవపూర్వకమైన ఎరుకగలవానికి ఈ జగత్తుపట్ల పదార్థజ్ఞానము, భేదజ్ఞానము ఉండవు. కనుక రామా! "ఈ దృశ్యజగత్తు నిరాకారము, భ్రమమాత్రము, సంకల్పము

నందలి నగరము వంటిది" అని మొట్టమొదట నిశ్చయించుకో. ఇక ఆపై శాస్త్రోచితమైన విహిత కర్మలను ఎట్లు నిర్వర్తించాలో నిర్ణయించుకొని ప్రవర్తించు. అప్పుడు ఈ "అనేకత్వము" అనే మాయాజాలం నిన్నేమీ చెయ్యలేదు. "మెలుకువ" వచ్చిన తరువాత స్వప్నంలో చూచిన వస్తువుల కొరకు వెతకేవాడెవరైనా ఉంటాడా? జ్ఞానులకు "ఈ జగత్తు అసత్తే" అని బోధపడుచున్నది. వారు, "ఇదంతా బ్రహ్మతత్త్వమునకు వేరైనది కాదు" అని ఎరిగియే ఉంటున్నారు. అజ్ఞానులు మాత్రమే ... "ఇది జగత్తు - అది బ్రహ్మము" అనునట్టి శబ్దభేదములను ఆశ్రయించుచున్నారు. "వాస్తవానికి బ్రహ్మము - జగత్తులకు ఏమాత్రం భేదం లేదు" అని, మేము, అనేక పరిశీలనల తరువాత నిస్సంకోచంగా నిర్ణయించుకొన్నాం. ఆకాశంలో సూర్యమండలము, స్థూలమగు మేఘములు, సూక్ష్మజల కణములు, వాటి ఆకారములు ప్రతిభాసితమగుచున్నట్లు ఈ జగత్తుకూడా చిన్మయ బ్రహ్మమున ప్రకాశించుచున్నది.

ఒకనికి స్వప్నంలో కనబడేదంతా అతని కల్పనయొక్క ప్రభావంచేతనే తన హృదయాకాశంలోనే ప్రాప్తిస్తున్నట్లు, ఈ జాగ్రత్తులో కూడా ఇక్కడ కనిపించేదంతా "స్వకీయకల్పనచే ఏర్పడినట్టి దృష్టి" (Perception born of one's own volition / imagination) చే దర్శించబడుచున్నది. ఈ జాగ్రత్ జగత్తు కూడా సంకల్ప-జగత్తు లాగానే 'భ్రమ' మాత్రమే. ఈ రెండిటినీ తప్పకుండా ఒక దానితో మరొకదానిని పోల్చవచ్చు.

ఓ రామచంద్రా! నీవు జ్ఞానివే కావాలి సుమా! "ఈ జగత్తు చిన్మయాకాశమే కాని, మరింకేమీ కాదు" అని అనుభవపూర్వకముగా గ్రహించు! "జగత్తు-మహాకాశము" అను రెండు శబ్దములకు గల అర్థము ఒక్కటే. అవి చిన్మయబ్రహ్మము యొక్క రూపాంతరములే. ఈ కనబడే "జాగ్రద్దృశ్యము" ఏ సమయమందును ఉత్పన్నమే అయివుండలేదు. ఇది నిరుపాధికము (ఉపాధిలేనిది). దీనిని ఎక్కడి నుండీ, ఎవ్వరూ నియమించుటలేదు. ఇది ఎప్పటికప్పుడు 'యథాస్థితి' యందే వెలయుచున్నది. ఈ జగత్తు మహాకాశమున ఉన్నప్పటికీ ... దీనిచే బ్రహ్మము కప్పబడజాలదు. ఎక్కడన్నా మేఘములు ఆకాశమును కప్పివేయగలవా? "మేఘములు దట్టముగా పట్టినప్పుడు ఆకాశమును కప్పివేస్తున్నాయి కదా?" అంటావా? ఒక స్థలమున నిలుచున్నప్పుడు నీకు అట్లు తోచవచ్చును గాని ... నీవు చూచు మేఘములు ఆకాశమునంతటినీ కప్పివేస్తోందనుమాట భ్రమ మాత్రమే. ఈ కల్పిత-జగత్తు చిదాకాశమును ఒక అణుమాత్రం కూడా ఆవరించజాలదు. ఈ 'జగత్తు' అనబడునది వాస్తవానికి ఆకాశమువలె నిర్మలము, నిరాకారము అయి, సంకల్పనగరంలాగా, మహాకాశము నందు రచించబడిన చిత్రమువలె వెలయుచున్నది.

ఈ విషయమును నిరూపించుటకు నీకు ఒక ప్రాచీనమైన ఇతిహాసమొకటి చెపుతాను. సరస్వతీమాత - లీలల సంభాషణారూపమునగల ఈ ఇతిహాసం వినటంచేత నీకు అనేక సందేహాలు తొలగిపోతాయి. శాంతి లభిస్తుంది.

❖❖❖

2. శ్రీ సరస్వతీమాత వరం

పూర్వకాలంలో "పద్మడు" అను ఒక మహారాజు ఉండేవాడు. అతడు ఐశ్వర్యవంతుడు. బహు సంతానవంతుడు. వివేకి కూడా. అతడు విధివిహితంగా రాజ్యపాలన చేస్తూ ఉండేవాడు. దోషరహితమైన ఉత్తమ గుణములు అతనిని ఆశ్రయించి ఉండేవి. అతని భార్య "లీల". ఆమె సౌభాగ్యవతి. మధురభాషి. సౌందర్యరాశి. ఆమె తన భర్తను నీడవలె సర్వదా వెన్నంటి సేవలు చేస్తూ ఉండేది. అవ్యాజమైన పరస్పరప్రేమతో, పరిహాస వాక్యములతో, పుణ్యకథాశ్రవణములతో, పరమాత్మ-తత్త్వము వంటి విషయ చర్చలతో వారు కాలం గడుపుతూ ఉండేవారు.

ఒక రోజు లీల అంతఃపురంలో ఒకచోట ఒంటరిగా కూర్చుని ఇట్లు యోచించసాగినది.

"ఈ నా భర్త పద్మడు నాకు నా ప్రాణముల కంటే కూడా అధికుడు. మా ఈ దాంపత్యము ఎప్పటికీ ఇదేవిధంగా ఉంటే ఎంత బాగుంటుంది! నా భర్త ముసలితనముగాని, చావుగాని పొంద కుండా ఉండే ఉపాయం ఏదైనా ఉన్నదా? నేను కూడా నా ఈ యౌవనం పోగొట్టుకోకుండా అనంతకాలం ఇతనితో వనసంచారాలు చేస్తూ ఉండేది ఎట్లా? ఏమి చేస్తే మనుష్యులు మరణమును జయించవచ్చు? శాస్త్రములలో దీనిగురించి చెప్పే ఉంటారు. యమ-నియమ-జప-తప-ధ్యానము లను వేటినైనాసరే, అనుసరించి నేను నా భర్తను ఎల్లకాలం పొంది ఉండేది ఎట్లా? దేశంలోని జ్ఞానవృద్ధులను, తపస్సంపన్నులను రప్పించి మరణమును జయించే ఉపాయం తెలుసుకొంటాను. అట్టి ఉపాయం ఆశ్రయించి నా భర్తను ఎప్పటికీ ఇట్లే పొంది ఉంటాను."

❖

ఇట్లు ఆలోచించి ఆ లీల దేశంలోని మహాజ్ఞానులందరినీ పిలిపించింది. "అమరత్వము" పొందటం గురించి తరచి-తరచి ప్రశ్నించింది. అప్పుడు ఆ జ్ఞానవృద్ధులు ఇట్లు పలికారు : "అమ్మా! లీలాదేవీ! జప-తప-నియమాదులు ఆచరిస్తే ఏదైనా సిద్ధిస్తాయి. కాని, అమరత్వం మాత్రం సాధ్యంకాదు. శరీరధారి అయిన ప్రతివాడు ఎప్పటికైనా ఆ శరీరము త్యజించక తప్పదు. ఇది అప్రతిహతమైన ప్రకృతి నియమము."

అది విని లీలాదేవి ఎంతో వ్యాకులత నొందినది. "అయ్యో! అయితే పతివియోగం పొందే అవకాశము ఉన్నదన్నమాట? దైవవశాత్తు నా భర్త పద్మనికన్నా ముందుగా నేనే మరణించినా - మంచిదే, గొడవవుండదు. ప్రియమైన భర్త నుండి వియోగదుఃఖం ఉండదు కాబట్టి సుఖంగానే ఉంటాను. కాని, కాలనిర్ణయం ఎవరికి తెలుస్తుంది? నా భర్తయే నాకన్నా ముందుగా మరణిస్తే? ఈ మహాజ్ఞానులు చెప్పినదానినిబట్టి శరీర క్షయము అనివార్యము కదా! అతని ప్రాణాలు శరీరం నుండి బహిర్గతం కాకతప్పనప్పుడు ఆ ప్రాణాలు అంతఃపురంలోని ఈ పడకగది నుండి బయటకు వెళ్ళకుండా ఉండేటట్లు చూచుకొంటాను. అప్పుడు నా పతి ఈ అంతఃపురంలోనే ఉంటాడు. నేను అతనిచే చూడబడుచు శేషించియున్న ఆయుష్షును సుఖంగా గడిపివేస్తాను. అందుకుగాను ఈ రోజు నుండే జప-ఉపవాసాది అనుష్ఠానముల ద్వారా చిద్రూపి, జగన్మాత అయివున్న సరస్వతీదేవిని

ఆరాధిస్తాను" అని అనుకొన్నది. స్థిరచిత్తురాలై శాస్త్రానుసారం కఠోర నియమాలతో ఆ జగజ్జనని సరస్వతీదేవిని ఆరాధించటం ప్రారంభించింది. అయితే ఈ విషయాలుగాని, ప్రయత్నాలుగాని, తన భర్తకు ఏమాత్రం తెలియనీయనేలేదు.

అత్యంత శ్రద్ధాభక్తులతో ఉపవాసాలు, పూజలు చేయసాగింది. దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, పండితులను సత్కరించింది. ప్రతి మూడు రాత్రుల తరువాత సరస్వతీమాత ఆరాధనావిధానము ముగింపుకు వచ్చేది. వెనువెంటనే ఆమె మరొక మూడు రోజుల నియమమును స్వీకరించేది. ఈ విధంగా స్నాన-దాన-తపో-ధ్యానాది అనేక క్లేశకర కార్యములందు శరీరమును వినియోగించుచు, శాస్త్రములందు, తనయందు, జగదీశ్వరి సరస్వతీదేవిపై అకుంఠితమైన విశ్వాసంతో ప్రయత్నం సాగించింది. అదే సమయంలో భర్తను సేవించుచు అతనికి సంతోషము చేకూర్చుచుండెడిది. ఈ విధంగా నూఱు "త్రిరాత్రివ్రతములు" పూర్తిచేసింది. ఆ వ్రతారాధనచే పూజింపబడిన భగవతి వాగ్దేవి అత్యంత ప్రసన్నురాలైనది. ఒక పవిత్ర క్షణంలో లీల ముందు ప్రత్యక్షమై "వత్సే! లీలా! పతిభక్తితో కూడిన నీ తపస్సుకు మెచ్చాను. నీకు ఏమి కావాలో కోరుకో" అని ప్రసన్నమైన వాక్కుతో పలికింది. లీల ఆ జగన్మాత దర్శనం చేత పునీతురాలై పరమానందం పొందింది.

లీల :

> **జయ జన్మజరాజ్వాలా దాహదోష శశిప్రభే!**
> **జయ హార్దాంధకారౌఘ నివారణ రవిప్రభే!**
>
> **అంబ మాతర్జగన్మాతస్త్రాయ స్వకృపణామిమామ్!**
> **ఇదం వరద్వయం దేహి! యదహం ప్రార్థయే శుభే ॥** (XVI.37, 38)

జన్మజరా అనెడి జ్వాలలచే దహింపబడుతున్న వారికి శశిప్రభవైన ఓ జగన్మాతా! హృదయాంధకారమును నివారించు రవిప్రభువైన ఓ జగజ్జననీ! అంబా! నీకు జయమగుగాక! నిన్ను దర్శించిన తరువాత జన్మజన్మల జాడ్యం తొలగక ఏం చేస్తుంది? ఇదే నా భక్తిపూర్వకమైన సాష్టాంగ నమస్కారం. నేను నిన్ను రెండు వరములు అర్థిస్తున్నాను. అందుకు నేను తగివుంటే ప్రసాదించమ్మా!

1. ఒకవేళ నా కన్నా ముందే నా భర్త మరణించటం జరిగితే, అతని ప్రాణములు లేక జీవాత్మ నా ఈ అంతఃపురములోని మా పడకగది నుండి వెలువడకుండా ఇక్కడే ఉండుగాక!
2. నేను నిన్ను తలచుకొన్నప్పుడు నీ దర్శనభాగ్యం నాకు ప్రాప్తించుగాక!

లీలాదేవి యొక్క అభ్యర్థనను విని, పుత్రికావాత్సల్యశీలియగు సరస్వతీదేవి, "అట్లే అగుగాక" అని పలికి, సముద్ర తరంగమువలె అంతర్ధానమయింది.

❖❖❖

3. పద్మని దేహ పతనం

కాలచక్రం తిరుగసాగింది. ఆకునందలి రసము శుష్కించునట్లు, పద్మని స్థూలదేహము ప్రకృతి నియమానుసారం శుష్కించసాగింది. ఒకానొక రోజు అతని స్థూలదేహ చైతన్యము సూక్ష్మ శరీరమున (లింగదేహమున లేక అతివాహిక దేహమున) లీనమైనది.

గృహమధ్యమున మృతుడైన భర్త భౌతిక దేహమును చూచి లీల ఎంతో రోదించింది. రోదనలోనే మూడు రోజులు గడిచాయి. విరహపీడితురాలై లీల తానుకూడా చచ్చిపోవాలని నిశ్చయించుకొన్నది. అత్యంత విషాదంతో, దిక్కుతోచకుండా ఉన్న ఆ లీలాదేవిని చూచిన ఆకాశవాణియగు సరస్వతీదేవి అశరీర వాక్కుతో :

"పుత్రీ! లీలా! నీవేల దుఃఖిస్తున్నావమ్మా? నేను ఇచ్చిన వరమును మరచిపోయావా ఏమిటి? నీ భర్తయొక్క భౌతిక శరీరమును పుష్పములతో కప్పి, జాగ్రత్తగా ఉంచు. అతనిని నీవు తప్పక మరల పొందుతావు. ఈ శరీరం పాడుకాదు. పూవులు వాడవు. ఇతడు మరల జీవించి, నిన్ను పాలిస్తాడు. ఆకాశమువలె నిర్మలమైనట్టి ఇతని జీవాత్మ నీ అంతఃపురమును, నీ శయన మందిరమును విడచి వెళ్ళదనునది నేను నీకు ఇచ్చిన వరము కదా!" అని మృదుమధురంగా పలికింది.

లీలాదేవి, ఆమె బంధువులు భగవతియగు సరస్వతీదేవి అశరీర వాక్కులు విన్నారు. ఊరట పొందారు. లీల తన భర్త భౌతిక దేహమును పుష్పములతో కప్పి ఉంచింది. ఆ రాత్రి అందరు నిదురించిన తరువాత ఆమె ధ్యానపరాయణియై సరస్వతీదేవిని ఆహ్వానించింది.

❖❖❖

4. అదే ఇంట్లో ద్వితీయ సృష్టి దర్శనం

శ్రీ సరస్వతీదేవి : వత్సే! నీవు ఎందుకు ఆహ్వానించావు? ఇదేమిటి దుఃఖిస్తున్నావు? ఈ సంసారమంతా భ్రమమయమని నీకు తెలియదా? ఇదంతా మృగతృష్ణలోని జలంలాగా మిథ్యయే కదా!

లీల : హే జగన్మాతా! నీ పాదములు స్పృశిస్తూ నేను చేస్తున్న ఈ నమస్కారం స్వీకరించు.

అమ్మా! ఇప్పుడు నా భర్త పద్మడు ఎక్కడ ఉన్నాడు? ఏమి చేస్తున్నాడు? ఎట్లా ఉన్నాడు? నన్ను అతని వద్దకు తీసుకొని పోకూడదా? అతడు లేకుండా నేను ఒంటరిగా జీవించలేను.

శ్రీసరస్వతీదేవి : బిడ్డా! ఇప్పుడు నీవు నీ కళ్ళతో అనేక పదార్థజాలములతో కూడిన ఈ పాంచభౌతిక జగత్తును చూస్తున్నావు కదా! ఇది 'భూతాకాశము' లేక 'స్థూలాకాశము' అంటారు. ఇంతకన్నా సూక్ష్మమైనది చిత్తాకాశము. దానిని ఈ కళ్ళతో చూడలేవు. అయితే అంతకన్నా కూడా సూక్ష్మాతి–సూక్ష్మమైన, ఒకానొక ఆకాశము ఉన్నది. అదే "చిదాకాశము". ఆ చిదాకాశమునందే నీభర్త యొక్క ఆత్మ ఉన్నది. ఆ చిదాకాశమును ధ్యానించి, దానిని అనుభూతమొనర్చుకొన్నావా ... నీవు తప్పక దానిని గాంచగలవు. అవిద్యమానమగు ఈ పాంచభౌతిక దృష్టి ఘనీభూతమై ఉండటం

చేతనే (Crystallised material outlook) నీ అనుభవము (Range of Experiencing) పాంచభౌతిక వ్యవహారమునకు పరిమితమగుచున్నది. ఈ దృశ్యమానమగుచున్న వస్తుజాలమును ధ్యానించుట ఆపి చిత్తాకాశమును కూడా ధ్యానించటం వదలి, చిదాకాశమునే ధ్యానించుము. అప్పుడు అంతా నీవే ఎరుగగలవు.

"నాతో సహా సర్వము చిదాకాశమే", అను భావనను దృఢీకరించి, ఆ భావనలో ప్రవేశించు.

❖

లీల : అమ్మా! ఈ చిత్తము యొక్క ప్రవర్తనను గమనించారా? ఇది ఒక నిమిష మధ్యకాలంలోనే ఒకచోటి నుండి మరొకచోటికి పరుగులు తీస్తోంది కదా! అట్టి ఈ చిత్తము స్వయముగానే ప్రకాశించుచున్నదా? లేక, దీనిని మరెవరైనా ఎక్కడినుండైనా నియామకం చేస్తున్నారా?

సరస్వతీదేవి : లేదు. చిత్తమునకు స్వయముగా ప్రకాశించగల, ప్రసరించగల, శక్తి లేదు సుమా! మరి ఈ చిత్తమును కూడా ప్రకాశింపజేసేది, ప్రవర్తింపజేసేది ఏది? చిదాకాశము, లేక, బ్రహ్మమే దీనిని ప్రకాశింపజేస్తోంది. చిత్తము స్వతహాగా జడమైనది మాత్రమే. నీవు నీ చేతిని కదల్చుచున్నావనుకో. 'చేయి' స్వయంగా కదలదు కదా! దానిని కదల్చు చైతన్యమూర్తివి 'నీవు'. అవయవములు స్వయముగా జడమై చైతన్యమగు 'సత్తు'చే సంచలనము నిర్వర్తించబడునట్లుగానే, జడమగు చిత్తమును 'చిత్‌సత్త'యే క్రియాశీలత్వమొనర్చుచున్నది. ఒక్క చిదాకాశము మాత్రమే స్వయం చైతన్యవంతమని గ్రహించు. అట్టి చిదాకాశము యొక్క ప్రకాశమునే 'సంవిత్తు' లేక 'జ్ఞానము' అని అంటున్నాం. అటు 'మహాకాశము'ను ఇటు చిత్త-భూత-ఆకాశములను, ప్రకాశింప చేసేది, ఆధారభూతమైనది కూడా చిదాకాశమే సుమా! చిత్తవృత్తుల ప్రబలత్వం చేతనే నీకు విరహదుఃఖము, తదితర దుఃఖములు ప్రాప్తిస్తున్నాయి. చిత్తవృత్తులను పరిత్యజించి, చిదాకాశానుభవమున సుస్థిరమవగలిగినచో, నీవు నిశ్చయంగా సర్వాత్మకమగు బ్రహ్మ పదమును పొందగలవు కూడా. ఇందులో సందేహం లేదు.

లీల : మాతా! ఇప్పుడు నన్ను ఈ దృశ్య ప్రపంచము, నీవు చెప్పినట్లు ఎంతగానో భ్రమింపజేస్తోంది. ఎందుచేత? కారణమేమిటి?

శ్రీసరస్వతీదేవి : చెప్పాను కదా! నీవు మరల - మరలా పాంచ-భౌతిక దృష్టిని ఆశ్రయిస్తూ :

"నేను ఈ భౌతిక శరీరమును! నా భర్తయగు 'పద్మడు' అనగా మరొక పాంచభౌతిక దేహము ! నా ఈ శరీరమునకు - ఈ నా భర్తయగు 'పద్ముడు' అనబడువాని శరీరమునకు చిరకాలం సామీప్యత ఉండుగాక!" అనునట్టి భౌతిక భావావేశము ఘనీభూతం చేసుకోవటం జరిగింది. క్రమంగా ఈ దృశ్యముపట్ల 'ఇది సత్యము' అను రూపముగల సత్యత్వబుద్ధి ఏర్పడి ఉండటం చేతనే, నేడు ఈ దైన్యమును, దుఃఖమును అనుభవిస్తున్నావు. ఈ చిత్తవృత్తులను పరిత్యజించి, అప్పుడు శేషించియుండుదానినే భావించుచున్నావనుకో ... నీకీ దైన్యత్వము ప్రాప్తించి ఉండేదే కాదు. అప్పుడు మాత్రమే ఈ దృశ్యము యొక్క అభావత్వము బోధపడగలదు. అట్టి తత్త్వజ్ఞానము

... తత్త్వానుభవము లభించటం కష్టతరమైనదనుమాట నిజమే. కాని నీవు నా భక్తురాలవుకదా! నా ప్రసాదము చేతను, నేను చెప్పునది 'స్వబుద్ధి'తో గ్రహించటంచేత, స్థిరమైన బుద్ధిని ఆశ్రయించటంచేత అట్టి 'తత్త్వదృష్టిని' తప్పకుండా పొందుతావు. 'సత్యస్వరూపిణి' అయినట్టి నా మాటలు అసత్యమెలా అవుతాయి? అందుచేత ఇప్పటికిప్పుడే సందేహములన్నీ జయించి 'తత్త్వదృష్టి'ని ఆశ్రయించు.

ఇట్లు పలికి ఆ వాగ్వాణి అంతర్ధానమైనది.

❖

ఇట్టివే అయినట్టి అనేక వాక్యములు - శ్రవణానందకరములుగా బోధించుటచే లీలాదేవి ఉద్బోధితురాలై, అనాయాసంగా, అభ్యాసశ్రమ లేకుండా నిర్వికల్పసమాధిని ఆశ్రయించినది.

శ్రీరాముడు : హే మహర్షీ! లోకమాతయగు సరస్వతీదేవి ఏ విధమైన జ్ఞానముచే? తన భక్తురాలగు లీలయందు ఆత్మదృష్టిని సుస్థిరీకరించగలిగింది?

శ్రీ వసిష్ఠమహర్షి : విను.

అంతఃకరణముతో కూడుకొనిన ఈ స్థూలదేహాభిమానం లోహ పంజరము వలె అత్యంత దుర్భేధ్యమైనదే. అయితే ప్రయత్నశీలుడు ఈ పంజరమును తప్పకుండా భేదించివేయగలడు. 'వాణి' యొక్క వరప్రసాదంచేత, దర్శన భాగ్యంచేత ఉత్తేజితురాలై, ఆ లీలాదేవి గూటి నుండి ఎగిరే పక్షిలాగా దేహాభిమానము వదలింది. చిత్తాకాశమును కూడా అధిగమించినది. చిదాకాశమునందు 'సత్తస్వరూపిణి' అయి ప్రవేశించింది. ఆ చిదాకాశమునందు స్వప్రయత్నముచే తన భర్త కొరకు వెతుకుట ప్రారంభించింది. అట్టి చిదాకాశమున ఒకానొకచోట పద్ముడు కనిపించాడు. అతడు ఒక రాజసింహాసనముపై ఆసీనుడై ఉన్నాడు. ఆ సభలో మంత్రులు, సేవకులు, సైనికజనం, ప్రజలు ఆయా ఆసనములపై పరివేష్టించి ఉన్నారు. సింహాసనారూఢుడై ఉన్న ఆ పద్ముడు ఏవేవో రాచకార్యములు నిర్వర్తిస్తున్నాడు. ఆ సభకు తూర్పువైపు ఉన్న ద్వారంవద్ద ఆశీనులై ఉన్న ఋషులు, మునులు, విప్రులు "జయ-జయ-దేవ" అంటూ ఆ పద్ముని ఆశీర్వదిస్తున్నారు. దక్షిణ ద్వారంవైపున అనేక మంది రాజులు, మహారాజులు ఆశీనులై ఉన్నారు. ఉత్తరద్వారంవైపుగా ఉన్న విశాల ప్రదేశంలో గుఱ్ఱాలు, ఏనుగులు పెద్దసంఖ్యలో ఉండి ఉన్నాయి. పశ్చిమ ద్వారంవైపు అనేకమంది యువతులు కూర్చుని ఉన్నారు. ఇంద్రసభలోని ఇంద్రునివలె, ఆకాశమున చంద్రునివలె ... రాజాధిరాజు, చక్రవర్తి అయిన ఆ పద్ముడు అనేకమందితో సంభాషిస్తూ, అనేక రాచకార్యములను నెరవేరుస్తున్నాడు.

ఇంతలో ఒక భృత్యుడు ఎక్కడినుండో పరుగుపరుగునవచ్చి ఆ సభలో ప్రవేశించాడు. రాజును సమీపించి "మహారాజా! మీకు జయమగుగాక! దక్షిణాపథములోని శత్రురాజు అకస్మాత్తుగా మన సామ్రాజ్యముపై దండెత్తివచ్చాడు ..." అని చెప్పి యుద్ధవిషయాలు చెప్పసాగాడు. అట్లు అతడు చెప్పుచుండగానే మరొక భృత్యుడు మహారాజువద్దకు వచ్చి "మహారాజా! ఇబ్బంది కలిగిస్తున్నందుకు క్షమించండి. ఒకప్పటి మనదేశమిత్రుడు కర్ణాటకరాజు తూర్పువైపు రాజ్యమును ఆక్రమించటానికి దండెత్తి వస్తున్నాడు. ఈ ఆకస్మిక పరిణామమునకు మన సైన్యం పూర్తిగా

సన్నద్ధమై లేదు. ఈ విషయమై సమాలోచించెదరు గాక!" అని పలికి ఊరుకున్నాడు. అట్లే మరికొంతమంది భృత్యులు ఆయా సరిహద్దురాజుల దండయాత్రలకు సంబంధించిన యుద్ధవార్తలు తెచ్చారు. ఆ రాజ్యమును ఒక్కసారి అనేకమంది శత్రురాజులు అనేకవైపుల నుండి చుట్టుముట్టినట్లు తెలియవచ్చింది. అంతవరకు ప్రశాంతముగా ఉన్న ఆ సభలో రణగొణధ్వనులు, సమాలోచనలు ప్రారంభమయ్యాయి. మంత్రులు, సామంతరాజులు మహారాజును సమీపించారు. యుద్ధవిషయమై మంతనాలు సాగించసాగారు.

❖

ఆకాశస్వరూపిణి (అశరీర స్వరూపిణి) యగు లీలాదేవి అట్టి సమయంలో సభాప్రవేశం చేసింది. ఆమె సభలో సంచరిస్తున్నప్పటికీ అక్కడివారు ఆమెను చూడలేకపోయారు. సంకల్పములోని నగరమును ప్రత్యక్షంగా (జాగ్రత్‌లో) చూడలేనట్లు, ఒకని సంకల్పము లేదా స్వప్నములోని వస్తు జాలమును ఆ ప్రక్కనే ఉన్న మరొకరు చూడజాలనట్లు, అక్కడి వారెవరికి ఆమె కనబడటం లేదు.

లీల ఒక్కసారి సభ అంతా కలయచూసింది. ఎంత ఆశ్చర్యం! అక్కడంతా ఆమెకు ఇతః పూర్వపు భృత్యులు, సామంతులు, మంత్రులు కనిపించారు. వారంతా తమ రాజసభలో ప్రతిదినము కనిపించే సభికులు. "మా రాజ్యసభ అక్కడి నుండి ఇక్కడికి తీసుకొనిరాబడిందా ఏమి?" ... అని ఆమెకు అనిపించసాగింది. అందరు మునుపటి వారే. వారి ఆచరణ కూడా మునుపటిలాగానే ఉన్నది. ఆ పరిచారికలే, ఆ మంత్రులే, ఆ పండితులే, ఆ సేవకులే, ఆ స్నేహితులే ఇక్కడ కూడా కనిపించారు. తమ రాజ్యము లాగానే ఇక్కడ కూడా పగలు, దిక్కులు, సూర్యచంద్రులు, ఆకాశము, మేఘములు, వాయువు కనిపిస్తున్నాయి. అట్టివేయగు వృక్షములు, నదులు, పర్వతములు, నగరములు, గ్రామములు, అడవులు కూడా ఇక్కడ ఉండటం గమనించింది.

మరల సభ అంతా అన్నివైపులా ఆ లీల సంచరించింది. అందరు మునుపటి విధంగా ఉన్నారు. కాని, సింహాసనం మీద ఆసీనుడైన పద్ముడు మాత్రం ఇతఃపూర్వమువలె అంతటి ముదుసలిగా లేదు. అతడు కొంత మధ్యవయస్కుడై ఉండటం కనిపించింది. "ఇది ఏమిటి? మా పట్టణంలోని వారంతా మరణించారా? లేకపోతే, వారే ఇక్కడెట్లా ఉన్నారు? ఇది ఎంతటి దుఃఖకరమైన విషయం!" అని ఆశ్చర్యచకితురాలై యోచించ సాగింది.

❖

ఇట్లు ఆమె చింతించుచుండగా, సరస్వతీదేవి అనుగ్రహంచేత ఆమెకు "సమాధి" భంగం అయినది. ఆమె నిద్రనుండి మేల్కాంచినట్లు లేచికూర్చుని చుట్టూ చూచింది. తాను యథారీతిగా తన అంతఃపురంలోనే ఉన్నట్లు గమనించింది. తన చుట్టూ పరిచారికలు మునుపటివలెనే నిద్రిస్తున్నారు.

"ఓ పరిచారికలారా! నిద్రలేవండి. ఇప్పుడు నా మనస్సంతా ఎంతో విషాదంగా ఉన్నది. మన సభలోని మంత్రులు, సామంతులు, తదితర సభికులు అనేకులు మరణించినట్లు నాకు అనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు సభను సమావేశపరచండి. సభలో సింహాసనం అధిరోహిస్తాను. సభ్యులందరు

యథారీతిగా ఉన్నారా ... మంచిదే. అందరు మరణించారా ... ఇక నేనుమాత్రం ఉండి చేసేదే ముంటుంది? నేను కూడా మరణిస్తాను. పొండి. పరుగులుతీసి మంత్రులకు సభను సమాయత్తపరచ వలసినదిగా నా ఆజ్ఞను తెలియజేయండి."

పరిచారికలు ఆశ్చర్యపోయారు. ఆ అర్ధరాత్రి సభ సమావేశమవటమేమిటి? అయినా చేసేదే మున్నది? మహారాజ్ఞి ఆజ్ఞ కదా! పరుగుపరుగున వెళ్ళి ఈ విషయం మంత్రులకు, పురవాసులకు తెలియచెప్పారు. ఆ క్షణంలో లీలాదేవి ప్రాణాలు కాపాడుకోవటమే అక్కడి పురజనుల తక్షణ కర్తవ్యమైనది. అక్కడి పురజనులు, భృత్యులు సభాసమావేశమునకు సిద్ధమైనారు. 'డప్పులమోత' ద్వారా సభాసమావేశం గురించి నగరమంతా తెలియజేయ బడింది. కొందరు సభలో ప్రవేశించి సమావేశమునకు అంతా సిద్ధం చేశారు. క్షణాలలో పురజనులు సభలో ప్రవేశించి ఉచితాసనములలో ఆశీనులైనారు. మంత్రులు, సామంతులు ఆయాస్థానములు ఆక్రమించి ఉన్నారు. ఇంతలో లీలాదేవి స్నానాదులు ముగించుకొని, సభలో ప్రవేశించి, సింహాసనం అధిష్ఠించింది. సభంతా కలియచూచింది! ఎంత ఆశ్చర్యం! అక్కడ రాజన్యులు, స్త్రీలు, గురువులు, బంధుజనం, స్నేహితులు ఎప్పటిలాగానే సభలో ఉన్నారు. సభ అంతా యథాతథంగానే ఉన్నది. లీలాదేవి ఉపశాంతి పొందింది. అందరు జీవించి ఉన్నందుకు సంతోషపడుచూ, ఒక్కసారి పద్మని సింహాసనం వైపు చూచింది. ఒక్క మహారాజు మాత్రం అక్కడ లేడు. సింహాసనం బోసిపోయి ఉన్నది. అతని భౌతికదేహం (విగతజీవుడై) అంతః పురంలోనే ఉన్నదికదా! అప్పుడు లీలాదేవి సభను ఉద్దేశించి "ఓ సభికులారా! నా చిత్తము మహారాజు వియోగంచే భరించరానంత దుఃఖము పొందినది. దానిని కొంత వినోదింపచేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశము ఏర్పరచాను. మీ అందరికి ఇప్పటికిప్పుడు ఇంత శ్రమయిచ్చినందుకు నన్ను క్షమించండి" అని పలికి, అక్కడనుండి లేచింది. పరిజనం వెంటరాగా, అంతఃపురమునకు నడుస్తూ వెళ్లింది. తన భర్త పద్మని భౌతిక శరీరాన్ని సమీపించింది. ఆ దేహము పూలతో కప్పబడి, ఎప్పటి యట్లే ఉన్నది. ఆ గదిలోనే ఒకచోట చతికిలపడి కూర్చుని ఇట్లు యోచించసాగింది.

"ఆహా! ఈ మాయ ఎంతటి విచిత్రమైనది! ఈ సభికులు, తదితరులు నా భర్త యొక్క భౌతిక దేహము ఉన్నచోట–ఈ నగరంలో–ఉన్నట్లే, చిదాకాశంలో కూడా అతని సూక్ష్మదేహము వెంటనంటి ఉన్నారే? ఇక్కడ ఉన్న కొండలు, భవనములు మొదలైన స్థావర వ్యవహారమంతా కూడా ... అక్కడా అట్లే ఉన్నదే? అద్దంలో ప్రతిబింబించే కొండయే బాహ్యమున కూడా ఉన్నట్లు, చిదాకాశమునందు వెలుపల కూడా సృష్టి ఒకే తీరుగా కనబడుతోంది. అయితే, నేను చూచిన ఈ రెండు దృశ్యములలో ఏది వాస్తవం? ఏది భ్రాంతి? ఈ కనబడేది వాస్తవమా? చిదాకాశమున నేను చూచిన మధ్య వయస్కుడగు నా భర్త 'రాజ్యము–ప్రజలు' వాస్తవమా? ఈ రెండింటిలో పారమార్థికమైనదేది? ఈ విషయం నేను నా స్వబుద్ధితో గ్రహించలేను. అందుచేత నా ఆరాధ్యదేవతయగు 'వాగ్దేవి'నే అడిగి తెలుసుకొంటాను".

ఇట్లు అనుకొని లీలాదేవి ఏకాగ్రతతో సర్వస్వతీ జగన్మాతను ధ్యానించింది. తన భక్తురాలి

పిలుపును అందుకొని, కుమారి రూపధారిణియై జగన్మాత, దర్శనమిచ్చింది. మహాశక్తి స్వరూపిణియగు వాణీదేవిని సువర్ణ సింహాసనం అధిరోహింపజేసి, లీలాదేవి ఉత్తమ స్తోత్రములతో ఆనందింపచేసింది.

❖❖❖

5. ఇక్కడ ఏది సత్యం? ఏది అసత్యం?

లీల : దేవీ! పరమేశ్వరీ! నీవు 'సృష్ట్యాది' యందు స్థాపించిన మర్యాద (System) విషయంలో నాకు చాలా సందేహాలు వస్తున్నాయి. వాటి గురించి ప్రశ్నిస్తాను. తెలియపరచి నా పట్ల నీకున్న దయను సఫలంచేయి మాతా!

ఈ 'జగత్తు' అనబడునది ఆకాశము కంటే కూడా అత్యంత నిర్మలమైనది కదా! కోటియోజనముల విస్తీర్ణం కూడా విస్తారజగత్తు దృష్ట్యా అత్యంత స్వల్పమైనదే. వేద మహావాక్యములు ఈ జగత్తును "జ్యోతిర్మయము, సూక్ష్మము, శీతలము" మొదలైన విశేషణములతో వర్ణించి చెప్పుచున్నాయి. ఇది "గోడలేకుండానే చిత్రం ఉన్నట్లు" ✻ ... నిరావరణమైనదానివలె కనబడుతోంది. ఇందు 'ఆకాశము, భూమి, దిక్కులు, కాలము' ... మొదలైన అనేక విశేషాలు కనబడుచున్నాయి. ఈ జగత్తే అన్నిటిని ప్రకాశింప చేస్తోంది. దీనిని ప్రకాశింపజేస్తున్న మరొకటి ఎక్కడన్నా ఏదన్నా ఉన్నదా? లేదనే నేను అనుకొంటున్నాను. వస్తువులన్నీ ఇందులోనే ప్రతిబింబించి, విలీనం అయిపోతున్నాయి. ఈ త్రిలోకసృష్టి కనబడుచున్నది "చిద్వస్తువు" అను దర్పణమునందే కదా!

ఇప్పుడు నాకు కలిగిన సందేహమేమిటో చెపుతాను. ఈ బయట కనబడే వస్తుజాలము వాస్తవమా? లేక ఇదంతా ప్రతిబింబిస్తున్న "చిద్వస్తువు" (The absolute consciousness in which phenomenal universe is reflected.) వాస్తవమా? ఈ జగత్తు సత్యమా? దీనిని దర్శించి అనుభవమును పొందుచున్న 'నేను' అనబడునది సత్యమా? ఈ రెండింటిలో కృత్రిమమైనదేది? అకృత్రిమమైనదేది? ఈ సృష్టితత్త్వమంతా ఏదైనా మరొకదానిలో ఉన్నదా? ఉంటే ఆ మరొకటి ఇంకెందులో ఉన్నది?

నీ ఆజ్ఞను అనుసరించి నేను స్థూలసూక్ష్మములను త్యజించి చిదాకాశంలో ప్రవేశించాను. ఆ చిదాకాశంలో ఒకానొకచోట నా భర్త పద్ముడు ఒక విస్తారమైన సామ్రాజ్యమునకు మహారాజై ఉండటం చూచాను. అతని సభలో ఇట్టి మంత్రులే, ఇట్టి ప్రజలే నాకు గోచరించారు. ఆ చిదాకాశములో నాకు కనిపించిన సభాదృశ్యము వాస్తవమా? ఇక్కడ సమావేశమైన సభ వాస్తవమా? ఈ ప్రశ్నలన్నీ నన్ను వేధిస్తున్నాయి. చిగురుటాకు కొనవలె నా మనస్సు చంచలమగుచున్నది. ప్రసన్న స్వరూపిణియగు నీవు ఇప్పుడు ఏది బోధించాలనుకొంటే, అదియే బోధించవేడుకొనుచున్నాను.

✻ గోడపై ఒకానొక చిత్రము (painting) చిత్రించటం మనం చూస్తూ ఉంటాం. అయితే లీలాదేవి ఈ జగత్తును "గోడ లేకుండానే చిత్రం కనబడువిధంగా (Painting without canvas or wall) పోల్చుచున్నది.

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! నీ ప్రశ్నలు అత్యంత చమత్కారంగా ఉన్నాయి. ఈ సృష్టిలో ఏది కృత్రిమమైనది? అకృత్రిమమైనదేది? సరే! ఇప్పటి వరకు నీకు తోచిన దానినిబట్టి ఏది వాస్తవమనుకొంటున్నావో, ఏది అవాస్తవమనుకొంటున్నావో చెప్పు? నీకు అర్థమైనదేమిటో చెప్పితే, దానిని అనుసరించి, నీకు అర్థము కావలసినదేమిటో సవివరంగా తప్పక చెపుతాను.

లీల : సరే! నేను ఏది వాస్తవమని అనుకొంటున్నానో చెపుతాను. నాకు ఇదంతా ఎట్లు అనిపిస్తోందో, అర్థమౌతోందో చెపుతాను.

ఇప్పుడు ఇక్కడ నీవు–నేను ఉండి సంభాషించుకొంటున్నాము కదా! ఇది అకృత్రిమ సర్గము లేక వాస్తవమైన 'సృష్టి'. నా భర్త పద్ముడు చిదాకాశమునందు ఉండియున్న విధానము 'కృత్రిమసర్గము' లేక కల్పిత స్వప్నతుల్యమైన సృష్టి అని భావిస్తున్నాను. ఎందుకంటావా? స్వప్నములోని అనుభవంలాగా అది శూన్యమైనదే కదా! దేశకాలముల (Space & time) దృష్ట్యా అది, "ఇక్కడ ఆకాశములో ఇట్లు ఇప్పుడు ఉన్నది" అను విధంగా లభించటం లేదు కదా! ఇప్పుడు మనిద్దరం పాల్గొనుచున్న ఈ దృశ్యము దేశ–కాలముల పరిచ్ఛేదం కలిగియుండుటచే ఇది వాస్తవమని అనుకొంటున్నాను. (As this is available for factors of time and distance, this looks to me as true).

శ్రీ సరస్వతీదేవి : నీవు అంటున్నట్లు ఇక్కడ కనిపిస్తున్న ఈ సృష్టి అకృత్రిమమైనదనే అనుకొందాం. అకృత్రిమ సృష్టి నుండి కృత్రిమసృష్టి ఎట్లా ఉత్పన్నమౌతుంది? ఏదైనా ఒకానొక కారణము (cause) నుండి, ఆ కారణమునకు సంబంధంలేని విజాతీయమైన కార్యము (Entirely different type of "EFFECT") ఉత్పన్నము కాదు కదా! అందుచేత "ఈ సృష్టి అకృత్రిమం" అని అనుకొంటే ఇందులో పదార్థజాలమంతా అకృత్రిమమైనదే అయివుండాలి. ఈ సృష్టి నుండి బయలుదేరిన నీవు చూడటం జరిగినట్టి 'చిదాకాశము'లోని నీ భర్త రాజ్యం కూడా అకృత్రిమమే అయివుండాలి. ఇక్కడ, అక్కడ కూడా నీ అనుభవం ఒకే తీరుగా కొనసాగుతూ ఉన్నది కదా!

లీల : మాతా! "ఒక కారణము నుండి, ఆ కారణమునకు ఏమాత్రం సంబంధంలేని కార్యములు ఉత్పన్నమౌతాయి" అని అనటానికి అనేక దృష్టాంతాలు మనకి ప్రపంచంలో లభ్యమౌతున్నాయి. ఉదాహరణకు మట్టిలో మంచినీరు నిలువ ఉంచలేము. కాని ఆ మట్టితో తయారైన కుండలో నీరు నిలువ ఉంచగలం కదా!

శ్రీ సరస్వతీదేవి : సహకారి కారణం నుండి కలుగు కార్యము ముఖ్యకారణం కంటే కొంచెం విజాతీయమై కనబడటమే నీ దృష్టాంతములోని "మట్టి–కుండ"లలో చూస్తున్నాం. మట్టి కుండగా ఆకారము పొందుట అందుకు కారణమగుచున్నది.

కారణము = Main Cause ; సహకారికారణము = Supportive Cause

ఇప్పుడు నీ భర్త విషయానికి వద్దాము. అతడు ఇక్కడ ఒకతీరుగా, అక్కడ మరొక తీరుగా ఉండటానికి తగినంత కారణమేదైనా ఉన్నదా?

ఒక్క విషయం నీవు ముందుగా దృష్టిలో పెట్టుకో. ఈ పృథివి మొదలైన పంచభూతములు నీ భర్త యొక్క సృష్టికి కారణములని అనుకొంటున్నావా? లేదు. ఇప్పుడు నీ భర్త ఇక్కడ జన్మించి అక్కడికి వెళ్ళాడంటావా? అసలు ఈ భూమండలమంతా ఎక్కడ ఉన్నది? ఆ భూమండలం ఎక్కడున్నది? ఇదే అక్కడికి వెళ్ళి ఉంటుందంటావా? ఒకవేళ ఇది అక్కడకు వెళ్ళకపోతే ఇట్టిదే అయిన సృష్టి అక్కడ ఎందుకు సంభవిస్తోంది?

వాస్తవానికి నీ భర్త ఈ బ్రహ్మాండంలోగాని, అతనిచే అనుభవించబడుచున్న ఆ సృష్టిలో గాని పుట్టుకకు సహకారి కారణమంటూ ఏదైనా ఉన్నదా? లేదే! అన్య (బాహ్య) కారణమంటూ ఏదీ లేకుండా ఏదైనా సంభవిస్తుంటే అద్దానికి అతని పూర్వపు సృష్టులందలి కామకర్మ-వాసనలే కారణములగుచున్నాయా? ఆలోచించి చెప్పు?

లీలాదేవి : నీవు చెప్పినట్లు, "నా భర్త అసలు ఎట్లు సృష్టించబడ్డాడు?" అను ప్రశ్నకు "అతని ఇతః పూర్వపు జన్మలందలి జ్ఞానమే కారణము" అనునది సమాధాన మగుచున్నదని నేను అనుకుంటున్నాను. అట్టి 'జన్మాంతరజ్ఞానము' (The knowledge gained in past lives & Carried forward in thier life) వృద్ధి చెందుచుండగా, అదే ఈ సృష్టికి కారణమగుచున్నదని నాకు తోచుచున్నది.

శ్రీ సరస్వతీదేవి : అంటే, నీవు "సృష్టికి స్మృతియే కారణము" అనునట్టి వాక్యానికి వస్తున్నావు. నీ ఈ అభిప్రాయం ప్రకారం "ఈ జీవుడు జ్ఞప్తి లేక జ్ఞాపకము స్వరూపముగా గలవాడు మాత్రమే" అని కదా! అయితే 'జ్ఞాపకము' అనునది అనుభవము ఉన్న తరువాతే ప్రారంభమౌతుంది కదా! అట్టి అనుభవము కంటే ముందే అనుభవజ్ఞుడు ఉండి ఉండాలి కదా! జ్ఞప్తి ఎవరికి కలుగుతోందో అతడు ముందుగా ఉంటేనే, అతనియందు అనుభవములు రచించబడగలవు. కనుక 'జీవుడు' అనగా 'జ్ఞాపకములు' అని గాని, 'సంస్కారములు' అనిగాని అనటం సమగ్రమైన సమాధానం కాదు. ఈ 'సంస్కారములు' అనబడునవి మొదలంట అధ్యయనం చేస్తే అవి 'శూన్య రూపములే' అని తెలియవస్తున్నాయి. వాటి రూపము ఆకాశమే. అట్టి సంస్కారము ఆకాశరూపమే అయి ఉండటంచే, దాని నుండి కలిగిన సృష్టులు కూడా 'ఆకాశమయమే' అని గ్రహించు.

లీలాదేవి : మాతా! ఇప్పుడు నీచేత బోధింపబడటంచే ఒకానొక నూతన విషయం తెలుసుకొంటున్నాను. నాభర్తయొక్క "చిదాకాశసృష్టి" .... స్మృతి + ఊహ" జనితమే కదా! అది ఆకాశస్వరూపమే. శూన్యమే. అందుచేత ఇక్కడ ఇప్పుడు నాచేత గాంచబడుచున్న సృష్టి కూడా పైనచెప్పిన దృష్టాంతము ప్రకారం ఆకాశస్వరూపమేనని అనిపిస్తోంది. ఈ రాజ్యాదులు, నా భర్తతో గల సంబంధము, ఈ అనుభవములు ... ఇవన్నీ కూడా ఆకాశమువలె శూన్యరూపములే, సంకల్పమాత్రములే (లేక) ఊహామాత్రములే అయివున్నాయి.

శ్రీసరస్వతీదేవి : సువ్రతీ! ఇప్పుడు నీవు సరయిన అవగాహనకే వస్తున్నావు. నీ భర్త యొక్క చిదాకాశసృష్టి అతని ఊహామాత్రమే! అది అసత్తు-అవాస్తవం అయినట్లే, దృశ్యమానమగుచున్న ఈ సృష్టి కూడా అసత్తు-అవాస్తవమే. జ్ఞానప్రభావం చేత మేము ఇదంతా అట్లే దర్శించుచున్నాము. నీవు కూడా ఇది గ్రహించు.

లీల : హే జగజ్జననీ! నీవు సత్యస్వరూపురాలవు. అసత్యం ప్రకటిస్తావా? లేదు. కాని, నాలో ఏదో భ్రమ ఇంకా తొలగిపోలేదు. అందుచేత నాభర్తయొక్క భ్రమాత్మకమైన చిదాకాశసృష్టి ఎలా సంభవించిందో ... ఆ రీతిని నాకు వివరించు. అది వినటంచేత నా ఈ భ్రమ తొలగిపోగలదనే నేను భావిస్తున్నాను.

శ్రీ సరస్వతీదేవి : ఇతఃపూర్వపు స్మృతినుండే స్వప్నభ్రమవలె, 'కల' లోని మరొక 'కల' వలె .... ఈ ఈ సృష్టులన్నీ ప్రకాశిస్తున్నాయి. కనుక 'సృష్టి' అనబడేదంతా ద్రష్టయొక్క స్వయంకృత సంబంధమైన సంస్కారములతో కూడిన ఊహాపరంపరా ప్రదర్శనం మాత్రమే! ఈ విషయం ఇంకా సుస్పష్టపడటానికి ఒక చిత్రమైన సంఘటన గురించి చెపుతాను, విను.

❖❖❖

6. ఇతఃపూర్వపు సృష్టి - బ్రాహ్మణ దంపతులు

శ్రీ సరస్వతీదేవి : చిదాకాశమున, ఒక మారుమూల ఒక సంసారమండపము ఉన్నది. ఆ సంసారమండపము పంచభూత విభాగమగు "ఆకాశము" అనే గాజుతో కప్పబడివున్నది. ఆ మండపములో లోకపాలకులు స్తంభముల వంటివారు. దేవతాస్త్రీలు అందు చెక్కబడిన బొమ్మలు, పదునాలుగు లోకాలు అందుగల గదులు. ఆ గదులందు ఆమూల – ఈమూల పుట్టలవలె అనేకమంది ప్రాణులు ఉన్నారు. "ప్రజాపతి (బ్రహ్మదేవుడు)" అందు నివసించు బ్రాహ్మణుడు. సాలెపురుగు తనగూటిలో తానే చిక్కుకున్నట్లు, అందుగల అనేక ప్రాణులు (లేక జీవులు) తమ ఆశలతో కట్టుకొన్న గూటిలో తామే చిక్కుకొనియున్నారు. 'ఆకాశము' అనునది ఆ మండపముపై పట్టిన బూజువలె కనిపిస్తోంది. ఆకాశంలో సంచరించే సిద్ధులే ఆ ఇంటిలో రొదచేసే దోమలు, లోకములు, నగరములు అందలి 'కుండలు' వంటివి. అట్టి మండపంలో ఒకచోట 'గిరి' అను పేరుగల ఒక గ్రామము ఉన్నది. ఆ గిరి గ్రామంలో గల ఒక గృహమునందు వసిష్ఠుడు అను పేరుగల ఒక బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. అతడు శ్రోత్రియుడై, వేదములలో చెప్పబడిన నిష్ఠలను, విధివిధానములను అనుసరించినవాడై, భార్య – పిల్లలతో కాలం వెళ్ళబుచ్చుచున్నాడు. రోగహీనుడై, భయరహితుడై, శాంతచిత్తుడై ధర్మపరాయణుడై, సేవానిరతుడై, గృహస్థాశ్రమమును నిర్వర్తించుచున్నాడు. అతని పేరు, విత్తము, వయస్సు, విద్య, వైభవము, యత్నముల దృష్ట్యా వసిష్ఠమహర్షి వంటివాడే అయినప్పటికీ ... అతను ఇక్ష్వాకు వంశజుల పౌరోహిత్యము వహించు సప్తర్షి మండల సంబంధితుడగు వసిష్ఠమహర్షి కాదు. అతనిభార్య పేరు కూడా అరుంధతియే. ఇక్ష్వాకుల సద్గురువగు వసిష్ఠుని ధర్మపత్ని 'అరుంధతి' జీవన్ముక్త. కాని ఈమె విషయం అట్టిది కాదు. (అనగా ఆ దంపతులు వేరు. వీరు వేరు.)

ఆ బ్రాహ్మణుడు తన భార్యపై అకృత్రిమమైన ప్రేమ రసము కురిపిస్తూ ఉండేవాడు. అతని సంసారమంతా ఆమెయే అయివుండేది.

ఆ బ్రాహ్మణుడు ఒక రోజు ఒక పర్వతముపై గల 'పచ్చికబయలు' నందు ఆశీనుడై ఒంటరిగా ప్రకృతి సౌందర్యమును, ప్రశాంతతను అనుభవిస్తున్నాడు. అప్పుడు ఒకానొక రాజు తన పరివారమును వెంటబెట్టుకొని వేటవినోదమును ఆస్వాదించుచు ఆ కొండ క్రింద గల బాటవెంట రావటం జరిగింది. మన బ్రాహ్మణుడు ఆ సంరంభమంతా గమనించుచు తన అంతరంగమున ఇట్లు సమాలోచించసాగాడు. "ఆహా! ఈ రాజు ఎంతటి వైభవము అనుభవించుచున్నాడు! ఈ గుఱ్ఱాలు, ఈ ఏనుగులు, ఈ సేవకులు, ఈ నారీజనం! ఇవన్నీ నేనుకూడా పొందితే ఎంతబాగు! నేనుకూడా ఎప్పటికైనా ఇంతటి వైభవం అనుభవిస్తానా?"

ఆ రోజునుండి అతడు ఇట్లే చింతనచేయసాగాడు. అట్లా అనుక్షణికంగా 'చింతన' చేస్తూనే తన దైనందిక కర్మలను యథావిధిగా నిర్వర్తిస్తూ ఉన్నాడు. కాలక్రమంగా ముసలివాడయ్యాడు. ఒక రోజు అతని భార్య "అయ్యో! ఈ నా భర్త ఇక ఎంతోకాలం జీవించనట్లే ఉన్నదే?" అని అనుకొన్నది. మరణ రహితమనేది అసంభవమని ఆమెకు బాగా తెలుసు. ఆమె తన భక్తిప్రపత్తులతో నన్ను ప్రసన్నురాలిని చేసుకొని, "అమ్మా! ఈ నా భర్త ఒక వేళ విధివశాత్తూ మరణిస్తే అతని జీవము – నేను కూడా నా ఈ గృహమునుండి బయటకు వెళ్ళకుండునట్లు దీవించు" అని నన్ను వరం కోరుకున్నది. నేను అట్లే వరం ప్రసాదించాను.

కొంతకాలానికి ఆ బ్రాహ్మణుడు మరణించాడు. అయితే, అతని జీవచైతన్యము జీవ వాసనా ప్రభావం చేత ఆ ఇంట్లోనే నివసించసాగింది. అతడు ఆ గృహాకాశము నందే తన కల్పనాబలం చేత పరమశక్తి సంపన్నుడగు రాజు అయ్యాడు. తన ప్రతాప శక్తులతో ముల్లోకములను జయించి పాలించసాగాడు. అతడు సాధువులకు దిక్కై, శాస్త్రములకు ఆదర్శమై, యాచకులకు కల్పవృక్షమై, ద్విజులకు ఆశ్రయమై, ధర్మమునకు ఆలవాలమై రాజ్యపాలనం చేస్తూ వస్తున్నాడు. చూచావా బిడ్డా! ఆ బ్రాహ్మణుడు తన పాంచభౌతిక శరీరమును పరిత్యజించి ... ఆ గృహాకాశమునందే చిత్తాకాశ మయమగు శరీరమును దాల్చి విస్తారమైన రాజ్యపాలనను అనుభవించుచున్నాడు.

అతని భార్య విగతజీవుడైన తన భర్త శరీరమును చూచి అత్యంత దుఃఖమును పొందింది. కొద్ది సమయం ఎంతగానో దుఃఖించింది. అప్పుడామె కొయ్యబారిపోయి, తన దేహమును పరిత్యజించి తానుకూడా అతివాహిక దేహము (లేక చిత్తాకాశము)ను ఆశ్రయించి తన భర్త వద్దకు వెళ్ళినది. అక్కడ ఆమె తన భర్తతో సంతోషంగా కాలం గడపసాగింది. అది ఆమె కోరుకున్నట్లు ఆ బ్రాహ్మణ గృహంలోనే ఏర్పడి కొనసాగుతోంది.

❖

ఓ లీలాదేవీ! ఆ బ్రాహ్మణదంపతులు మరణించి నేటికి ఆ గిరి గ్రామంలో ఎనిమిది రోజులు గడచింది. వారిద్దరు తమ స్థూలదేహములను పరిత్యజించారు కదా! వారి ఇరివురి భౌతిక శరీరములు ఆ గిరి గ్రామంలో ఆ ఇంటికి సమీపంలో ఖననం చేయబడ్డాయి. అక్కడ, వారి భూములు 'స్థిర–చర' ఆస్తులు, ధనరత్న, గృహాదులు ఇప్పటికి అట్లే ఉన్నాయి.

ఓ పుత్రికా! ఆ బ్రాహ్మణ దంపతుల కథ అంతా చెప్పాను కదా! ఇప్పుడు విను. ఆ బ్రాహ్మణుడే నీ భర్తయగు 'పద్ముడు' ... అతడే ఇప్పుడు చిదాకాశమునందు - నీవు చూచిన-రాజ్యమును పొంది పాలన చేస్తున్నాడు. నీవే ఆ 'అరుంధతి' అనబడు బ్రాహ్మణ పత్నివి. అప్పుడు ఆ గిరి గ్రామంలో మీరిద్దరు పార్వతీ పరమేశ్వరులవలె బ్రాహ్మణ దంపతులుగా చాలాకాలం ఉండి ఉన్నారు. ఇప్పుడో ఆ నీవే ఇక్కడ నీ భర్త యొక్క వియోగమును పొందినదానవై, విరహము అనుభవిస్తూ, ఈ రాజ్యమును పాలించు చున్నావు.

"ఇతఃపూర్వపు - సృష్టులు, ఇప్పటి-సృష్టులు, ఇకముందు-సృష్టులు" భ్రమ మాత్రమేనని చెప్పానుకదా! బ్రహ్మాకాశమే (లేక శుద్ధ చైతన్యమే) భ్రమ వలన జీవ స్వరూపమును గ్రహించుచున్నది. భ్రమ వలననే చిదాకాశమునందు భ్రమ ప్రతిబింబిస్తోంది. ఏది సత్యమో, ఏది మిథ్యయో అనుభూతిపూర్వకంగా సుస్పష్టపడితే .... అప్పుడిక్కడ ఇక మిగిలేది ఏమీ ఉండదు. అందుచేత నీవు ఏది భ్రమయుతమో చక్కగా గ్రహించటానికి ప్రయత్నించు. అప్పుడు, "ఈ సృష్టి స్వతహాగా లేదు. నేను నాయొక్క స్వకీయ సంకల్పనాబలంచేత, కల్పనను ఆశ్రయించటంచే లేనిదానికి అస్థిత్వమును ప్రసాదించుచున్నాను. అట్లు ప్రాప్తించిన అస్థిత్వమును మరల అనుభవించుచున్నది నేనే" .... అనునట్టి ఆత్యంతికమైనట్టి "సృష్టి కేవలం దృష్టి మాత్రమే" అనే అవగాహన కలుగగలదు.

❖❖❖

7. జ్ఞాపకాలు

సరస్వతీ మాత చెప్పినదంతా విని లీలాదేవి మరల-మరల యోచిస్తూ అత్యంత ఆశ్చర్యం పొందింది. కొద్దిసేపు మౌనం వహించింది.


లీల : హే దేవీ! నీ పలుకులు కొంత అసందర్భముగా ఉన్నట్లు నా బుద్ధికి అనిపిస్తున్నాయి. ఆ బ్రాహ్మణుడు ఒక చిన్నగృహంలో మరణించి ఉండటమేమిటి? మేము ఇక్కడ ఉండటమేమిటి? మేమే ఆ బ్రాహ్మణ దంపతులమై ఉండి ఎనిమిది రోజుల క్రితం మాత్రమే మరణించియుండుటమనేది ఎంతటి చమత్కారం! బహు విస్తారమైన మా ఈ రాజ్యము ఆ బ్రాహ్మణ గృహములో ఇమిడి ఉండి ఉన్నదంటావా? ఇప్పుడు నా భర్త పరలోకమున ఉన్నాడు కదా! అక్కడి మహారాజ్యములు, విస్తారమైన భూములు, పర్వతములు, దిక్కులు ఈ చిన్న గదిలో ఎట్లా ఇముడుతాయి? మదించిన ఒక పెద్ద ఏనుగు ఆవగింజలో ఇమిడేదెట్లా? ఒక చిలక సింహముల గుంపును, అటువంటి చాలా చిలకల గుంపులను ఒక దోమ మ్రింగగలవా? "ఒక తుమ్మెద ఐదు క్షణములలో ఒక మేరుపర్వతమును నమిలి జీర్ణం చేసుకొన్నది" అన్నట్లున్నాయి నీ మాటలు. నా స్వప్నంలో చూస్తున్న మేఘములకు స్పందించి నేను నిద్రిస్తున్న గది వెలుపలగల నెమళ్ళు నాట్యం చేస్తాయా? ఓ సర్వేశ్వరీ! ఇవన్నీ అసంభవమైనట్లే ఆ విప్రభవనంలో పృథివీ - పర్వతాలు ఉండటం అసంభవమని నేను అనుకొంటు న్నాను. అమ్మా! మూఢురాలు, అజ్ఞానియగు నావంటి బిడ్డలు ఏదో తెలిసో-తెలియకో ప్రశ్నించి

నప్పటికీ మహాత్మురాలవు, జగత్తుకే మాతవు అయినట్టి నీకు కోపం వస్తుందా? లేదు. నాకు చిత్తశుద్ధి ప్రాప్తించే విధంగా నీవు ఉన్న-సత్యము ఉన్నట్లు నాకు విశదపరచ వలసినదని ప్రార్థన చేస్తున్నాను.

శ్రీ సరస్వతీదేవి : పుత్రికా! లీలాదేవి! ఈ మాయ యొక్క స్వరూపస్వభావములను గ్రహించి, దీనికావల ప్రతిష్ఠితమైయున్న మేము నీ ప్రశ్నలకు ఆశ్చర్యపడం. నేను ఏదీ అసత్యం చెప్పటంలేదు సుమా! "జనులు అబద్ధము చెప్పరాదు" అను నియమమును లోకమున ప్రబోధించినది సత్యస్వరూపుల మగు మేమే కదా! మేమే ఆ నియమమును ఉల్లంఘిస్తే ఇక ఉత్తమ ఆచారములను పాలించే వారెవరుంటారు? కనుక నేను చెప్పుచున్నదంతా వాస్తవమేనని గ్రహించు. ఆ బ్రాహ్మణుని జీవాత్మ అక్కడి గృహాకాశంలో ఆకాశరూపమును పొంది అట్టి 'ఆకాశరూపము'నే విస్తారజగత్తువలె గాంచుచున్నది.

లీలాదేవి : అయితే మరి "నా భార్య, నా భర్త, నా పుత్రులు, మా గృహములు" .... వంటి స్మృతులన్నీ ఏమయ్యాయి?

శ్రీ సరస్వతీదేవి : రాత్రివేళ స్వప్నము గాంచుచున్నప్పుడు, ఏర్పడియున్న "నా భార్య – నా భర్త – నా పుత్రులు – నా గృహములు" ... అనునవన్నీ నిదుర నుంచి లేవగానే ఏమైపోతున్నాయో చెప్పు? స్వప్న సమయంలో ఆస్వప్నములోని పదార్థములు, సంఘటనలు, వ్యక్తులు 'సత్యము' వలె తోచుచు, జాగ్రత్ వ్యవహారమంతా అసత్యమువలె, అస్థిత్వము లేనిదానివలె అనుభవమౌతోంది. అదేవిధంగా, ఈ జాగ్రత్తుకు వచ్చినప్పుడు (నిదురలేచినపుడు) స్వప్నములోని వ్యవహారమంతా భ్రమమాత్రంగా, అవాస్తవంగా తోచుచున్నది. కాని ఈ జాగ్రత్ వ్యవహారము మాత్రం జాగ్రత్ సమయంలో ఘనీభూతమై సత్యమైనదానివలె అనుభవించబడుతోంది.



స్వప్న సమయంలో ఈ జాగ్రత్ స్మృతులు లేకుండా (అవాస్తవమై) ఉంటున్నట్లే. జాగ్రత్ సమయంలో స్వప్నస్మృతులు అవాస్తవముగా, అస్థిత్వము లేనివిగా మిగిలి పోతున్నాయి కదా!

అదేవిధంగా "మేము విప్రదంపతులమై ఉండి ఉంటిమి కదా!" అను విషయజ్ఞానం ఈ "రాజు–రాజ్ఞి" జన్మలలో మీకు ప్రాప్తించటం లేదు. అది "స్వప్నతుల్యమాత్రంగా, భ్రమగా భావన కలిగియుండుటయే అందుకు కారణం. ప్రతి ప్రాణియొక్క పూర్వ జన్మానుభవం ఇట్లే ఉంటున్నది.

అసలు, ఆ మాటకు వస్తే .... "మేము విప్ర దంపతులము" అనునది ఉల్లిపొరలవలె ఒకానొక స్వప్నతుల్యమే కదా! అనేక కెరటములలో నీరు మాత్రమే సత్యమై యున్నట్లు, మీ ఇరువురి యందు, నాయందు, సర్వులయందు గల "చిదాత్మ" మాత్రమే సత్యము.

1. ఒకడు తన స్వప్నములో జనులను, పదార్థములను దర్శించటం.
2. మరొకడు తన సంకల్ప ప్రపంచమందు 'నగరములు' మొదలైనవి పొందటం.
3. ఎడారిలో జలభావము కారణంగా నీటి కాలువలను (ఎండమావులను) గాంచటం.
4. ఆ బ్రాహ్మణుడు గృహాకాశంలో వన-పర్వతాదులతో కూడిన పృథివిని చూడటం.

ఇవన్నీ ఒక తీరుగల విషయాలే అయివున్నాయి. ఒక చిన్న అద్దంలో పెద్దవస్తువులు, విశాలమైన దృశ్యము కనబడటంలేదా? కాని ఆ కనబడునది అవస్తువే అయివున్నది కదా! అదేవిధంగా సూక్ష్మమైన అంతఃకరణమున ప్రతిబింబించు విశాలజగత్తులు కూడా మిథ్యయే. అందులో కనబడే పృథివి మొదలైనవి కూడా మిథ్యయే. అవన్నీ సత్యస్వరూపమగు 'చిదాకాశము' యొక్క - జలంలో 'ప్రతిబింబాలు' వంటి ప్రతిబింబ చమత్కారములు మాత్రమే.

దీనినిబట్టి నీవు గ్రహించవలసినదేమిటి?

"నిర్మలాకాశస్వరూపమగు పరబ్రహ్మమున - అసత్యమగు ఈ సృష్టి సత్యమైనదానివలె ప్రతిభాసితమగుచున్నది" అని ఓ లీలాదేవీ! జగత్తునందు ఇంతకుమించి వాస్తవమగు సత్యమంటూ ఏదీలేదు. సర్వుల హృదయాంతర్గతమైనట్టి, 'చిదాత్మ' యొక్క అనుభవమే ... ఆరోపమాత్రమగు ఈ జగత్తునందు ప్రతిబింబిస్తోంది. ఎడారిలోని ఎండమావులలో నీరెక్కడిది? భావనామాత్రంచే ఏర్పడిన స్మృతి నుండి కథా సంఘటనలవలె జనించే ఈ "పృథివి, అనుభవములు, సంఘటనలు, సంబంధములు" .... మొదలైనవన్నీ సత్యమెట్లా అవుతాయి? ఈ నీ గృహము, ఈ గృహాకాశమున ఉన్న నీవు, నేను, తదితరములగు వస్తువులు .... ఇవన్నీ చిదాకాశమే గాని, మరింకేమీ అయి ఉండలేదు. అయితే, చీకట్లో ఉన్న దానిని చూడటానికి దీపం సహకరిస్తున్నట్లు, ఇవన్నీ మనకు, "ఈ జగత్తు యొక్క మిథ్యాత్వం" అర్థం చేసుకోవటానికి ప్రమాణాలుగా, దృష్టాంతాలుగా సహకరిస్తున్నాయి.

❖

"గిరి" గ్రామంలో గల ఆ ఇంటిలోని చిదాకాశమునందే ఆ విప్రుడు ఉన్నాడు. ఆ గృహాకాశంలోనే సముద్రములతో గూడిన పృథివి కూడా ఉన్నది. ఓ పుత్రికా! ఒక త్రసరేణువులో (పరమాణువులో) అనేక జగత్ సమూహములు అనుభవం కాగలవు. ఇక ఆ విప్రగృహంలో నగరములు, ఉపవనములు మొదలైనవి ఇమిడి ఉండటంలో ఆశ్చర్యమేమున్నది? 'కల్పన' అనుదానికి అంతెక్కడ? అడ్డేముంటుంది? 'చిన్మయ పరమాణువు' అయినట్టి యీ 'మనస్సు'లోనే యీ జగత్తంతా ఉండివున్నదని నీవు ఎఱుగవా? ఇది అత్యంత సామాన్యమైన విషయమే. దీనిని గురించి నీవు యింతగా శంకిస్తున్నావేమిటి?

❖❖❖

8. కాల కల్పన

లీలాదేవి : ఓ పరమేశ్వరీ! ఇదంతా బాగానే ఉన్నది. కాని ఆ వసిష్ఠ నామధేయుడగు బ్రాహ్మణుడు మరణించి ఇప్పటికి ఎనిమిది రోజులు మాత్రమే అయినదని అన్నావు కదా! నేను-నా భర్త ఇచట ఈ రాజ్యం పాలిస్తూ ఈ అంతఃపురంలో అనేక పదుల సంవత్సరములు గడిపామే! ఇదెట్లా సాధ్యం? ఈ విషయం మరికొంత నాకు సుస్పష్టం చేయి.

శ్రీ సరస్వతీదేవి : "ఈ స్థలము ఇక్కడ ఉన్నది" అను మాట ఆయా సరిహద్దు స్థలములను దృష్టిలో పెట్టుకొని మాత్రమే అనగలం. అంతేకాని స్థలమునకు స్వయంనిర్మితమైన నామరూపస్థితులు ఎక్కడ ఉన్నాయి? 'దేశము' అనబడుదాని విషయము కూడా అంతే. "ఇది ఈ పేరుగల దేశము, దీని సరిహద్దులు ఇవి. దీని ఆవల ఆ దేశమున్నది" అను కల్పనల చేతనే దేశము యొక్క ఉనికి అనుభవమౌతోంది. అంతేకాని, దేశమునకు స్వతఃసత్త ఎక్కడ ఉన్నది? అదేవిధంగా "కాలము" అనుదానికి కూడా స్వతఃసిద్ధ నిర్ణీతమైన కొలత లేదని గ్రహించు. (Time and distance are relatively experienced. They do not have form and existence if relativity is removed or dropped).

"ఈ 'జగత్‌సృష్టి' అంతా బ్రహ్మము నందే దర్శించబడుచున్నది" .... అని అనుకొన్నాము కదా! అదే విధంగా "క్షణము-కల్పము" .... అనునట్టి కల్పనామయమగు కాలము కూడా "బ్రహ్మము" నందే అధ్యాసింపబడుచున్నది. అనగా .... "క్షణములు, సంవత్సరములు, యుగములు, కల్పములు, త్రిభువనములు, నీవు, నేను" .... మున్నగు వస్తువులన్నీ పరమాత్మయొక్క ప్రతిభాసలే అయివున్నాయి. అది ఎట్లో చెపుతాను. విను.

❖❖❖

9. మిథ్యామోహ స్వీకారం

ఈ జీవుడు క్షణకాలంలో మిథ్యామోహమున పడి, తన ఇతఃపూర్వపు విశేషములన్నీ మరచి, "అన్యధా" గాంచుచున్నాడు. అదియే భౌతిక దృష్టిచే 'మరొక జన్మ' వలె తోచుచున్నది. స్వప్నంలో ప్రవేశించుచున్నప్పుడు 'జాగృత్'ను క్షణంలో త్యజిస్తున్నాడు కదా! ఇది కూడా అట్టిదే.

శరీరమును ఆశ్రయిస్తున్నప్పుడు కూడా ఇతడు చిదాకాశమునందే చిదాకాశమే స్వరూపముగా కలిగినవాడై ఉంటున్నాడు. అయితే, మాయాబద్ధుడై ఉన్నప్పుడు అతని భావపరంపరలు ఇట్లు ఉంటున్నాయి.

"నేను ఈ పంచభూతాత్మికమైన వస్తుస్థితిపై ఆధారపడియున్నాను. ఇదియే నా రూపము. ఈ చేతులు-కాళ్లతో కూడుకొనియున్న శరీరము నాది. నేను ఈ శరీరమున నిండి ఉన్నాను కాని, మరింకెక్కడా లేను. ఈ తండ్రికి కొడుకునైనాను. క్రమంగా నాకు ఇంత వయస్సు గడచిపోయినది. ఈ బంధువులు అందరు నా వాళ్ళు. ఈ అందమైన ఇల్లు నాది. నేను పుట్టిన తరువాత బాల్యము

గడిపాను. ఇప్పుడు యువకుడనయ్యాను. అది కూడా గడచిపోయి, ఇప్పుడు వృద్ధుడనయ్యాను. నా బంధుమిత్రులు ఇదివరకటిలాగానే ఉన్నారు.”

చూచావా లీలా? ఇట్టి భ్రమపూర్వకమైన జ్ఞానమంతా వచ్చిపడుతోంది. అయితే అట్టి జ్ఞానము యొక్క కారణము, అధిష్ఠానము (cause and substratum) కూడా చిదాకాశమే సుమా! అందుచేత ఈ ద్రష్ట దృశ్యములు, అనుభవజ్ఞుడు – అనుభవములు (Experiencer - Experiences) అనునవి చిత్స్వభావములే కాని, వేరేమీ కావు. చిదాకాశము (Zone of Consciousness / Awareness) కాకుండా ఇక్కడగాని, మరెక్కడాగాని మరింకేదీ లేనేలేదు.

ఈ జీవునియొక్క వాస్తవస్వరూపము ‘చిత్–శక్తి’యే. సర్వవ్యాపియగు చిత్‌శక్తియే “నేను జీవుడను” అను రూపముగల స్వప్నమును గాంచుచున్నది. ఈ దృశ్యము – దర్శనముల స్వరూపమంతా అదియే. అందుచేతనే అసత్యములగు ఈ లోకములన్నీ సత్యములవలె కనబడుచున్నాయి. నీటికి–కెరటములకు భేదమేమున్నది చెప్పు? ఇహలోక–పరలోక – స్వప్నములకు భేదమేమీ ఉండదు. ఇహలోకము కూడా ఇతఃపూర్వమునకు పరలోకమే కదా! అసలు ‘భేదబుద్ధి’ అనునది భ్రమనుండే కలుగుచున్నది. “జగత్ – భావము” అనునది భ్రమయొక్క పరిణామమే. అనగా, ‘జగత్తు అనబడుదానికి అస్థిత్వమే లేదు. భ్రమను ఆశ్రయించియున్నది వాస్తవమెట్లా అవుతుంది? ఆ కారణంగా “ఈ జగత్తు పుట్టుకయే లేనిది” అని చెప్పబడింది. పుట్టుకయే లేనప్పుడు ఈ దృశ్య జగదత్వమునకు నశించటం మాత్రం ఎక్కడ ఉంటుంది?

❖

ఓ లీలా! ఈ ప్రతిభాతమగుచున్నదంతా, లేక, మనస్సుచే జగత్తుగా చూడబడు చున్నదంతా “చిత్తు (consciousness) కాక మరొకటేదీ కాదు సుమా! ఇదంతా సర్వదా ఆకాశస్వరూపమే. దృశ్యములన్నీ ఈ చిత్తునందే ఆరోపించబడుచున్నాయి. ఒకడు చీకట్లో మెలితిరిగి పడియున్న త్రాడును చూచి ‘పాము’ అని భ్రమించటం ఎట్టిదో – ఈ జగద్దృశ్యము కూడా అట్టిది మాత్రమే. ఎందుకంటావా? ఈ దృశ్యములకు ద్రష్ట కన్న వేరైన ‘సత్త’ లేనేలేదు. ‘తరంగములు’ అని మనం చెప్పుకునేదంతా జలము అయివున్నది కదా! ఆరోపితమాత్రమైన ఈ సృష్టి (Superimposed one) కూడా చిదాకాశము కంటే వేరేమీకాదు. “నీటి నుండి తరంగములు వేరైనవా?” అని ఎవరు విమర్శించి పరీక్షిస్తారో వారికి “తరంగభావము మిథ్య” అని తెలియవచ్చుచున్నది. అదేవిధంగా జ్ఞానదృష్టితో ఈ సర్వము పరీక్షించినవారికి మాత్రమే “చిదాకాశమునకు వేరుగా సృష్టి లేదు” అని తెలియవచ్చుచున్నది. ఒకవేళ వేరుసృష్టి కనబడుతుంటే, అది “అవిచారణ, వ్యతిరిక్తమైన అభ్యాసము”ల చేత మాత్రమే. అందుచేత పుత్రీ! చిదాకాశమే స్వప్రకాశంచేత జగదాకారముగా కనబడుచున్నదని గ్రహించు. ఈ విధంగా ‘దృశ్యపదార్థము’ అనునదే మిథ్య (లేనిది) కాబట్టి, “ద్రష్ట – దృశ్యబోధ” … అనునవి కూడా మిథ్యయే.”

❖❖❖

10. "మరణము పొందటం" అనగా?

ఈ ప్రాణి (లేక జీవుడు) 'మరణము' అనునది పొందటం మనం చూస్తూనే ఉన్నాము కదా! అట్టి సమయంలో నశించుచున్నదేమిటి? ఈ స్థూలశరీరము మాత్రమే నేలకూలుచున్నది. అనేక భావములు, ఆర్తులు, అభిప్రాయములు, కోరికలు, అభిరుచులు, ఉబలాటములు మొదలైనవన్నీ తన రూపముగా గల "సూక్ష్మదేహము" (ఆతివాహిక శరీరము లేక Subtle body) యథాతథంగా ఉండనే ఉంటుంది. అందుకు దృష్టాంతము గాఢనిద్రయే. గాఢనిద్రాసమయంలో మనోగతమైనదంతా అప్రకటితంగాను, జడంగాను ఉంటోంది. అంతేగాని, లేకుండా పోవుటలేదు కదా!

అట్టి సూక్ష్మ శరీరము ఉన్నంతవరకు మోహము ఎక్కడికీ పోదు. అది మరలమరల వచ్చి పడుతూనే ఉంటుంది. మోహము వికసించగానే మరల దృశ్యమునకు చెందిన అనుభవము స్వభావసిద్ధంగా ప్రాప్తిస్తూనే ఉంటుంది. అనగా, అద్దములో ప్రతిబింబము లాగా ఆత్మయందు జగత్తు ప్రతిభాసితమౌతూనే ఉంటుంది. అయితే దృశ్యములోని మార్పు – చేర్పులు, అది ప్రతిబింబించే అద్దమునకు ఏమాత్రం సంబంధించి ఉండదు కదా! ఆత్మయందు ప్రతిభాతమయ్యే జగదనుభవము ఆత్మకు ఏమాత్రం మార్పుచేర్పులు కల్పించటం లేదని గ్రహించు.

జీవ చైతన్యము - సూక్ష్మ దేహము - స్థూల శరీరము :

అతని జీవచైతన్యమునకు (లేక శుద్ధ–స్వస్వరూపమునకు) 'మృత్యువు' అనునది ఉండదు. అనగా మననమే స్వరూపముగా గలిగినట్టి సూక్ష్మదేహము ఎవరి కర్తృత్వమైయున్నదో అట్టి 'చిదాత్మ'కు పుట్టుకలుండవు. ఈ జీవుని వాస్తవ స్వరూపము అట్టి చిదాత్మయేగాని, ఈ సూక్ష్మ–స్థూలదేహములు కావు సుమా! 'మృత్యువు' అనునది పాంచభౌతిక దేహమునకు మాత్రమే పరిమితము. అద్దంలో ప్రతిబింబములాగా అతని చైతన్యము నందు ప్రతిబింబించేదంతా .... శరీరము ఉన్నప్పుడూ – లేనప్పుడూ కూడా .... ఇంతకుముందటి స్మృతి లేక జ్ఞానమునకు అనుసరించే ఉంటోంది. అనగా, మరల శరీరము ధరించిన ఈ జీవుడు తాను ఇంతకు ముందు గాంచిన "కాలము ఆరంభము – క్రమము – జగత్తు – తల్లి – తండ్రి – వయస్సు – జ్ఞానము – బంధువులు – భృత్యులు – యత్నములు – స్థానములు – క్షయము" మొదలైనవాటిని చిదాకాశము నందు గాంచుచున్నాడు. అట్లు ఎరుగుట అతని స్వభావం. "నేను జన్మించాను. వీరు నా తల్లిదండ్రులు. ఇప్పుడు నేను బాలుడను" అనునదంతా పూర్వస్మృతి బలంచేతనే కలుగుతోంది. క్రమంగా దేశ–కాలముల బోధకూడా ఏర్పడుతోంది. పువ్వు నుండి కాయ – పండు లాగా అవన్నీ రూపుదిద్దుకుంటున్నాయి.

అట్టి సమయంలో అతడు 'ఒక్క క్షణం'లో 'కల్పము' – అంతటి కాలమును కూడా అనుభవించగలడు. "స్వల్పకాలంలో దీర్ఘకాలము యొక్క అనుభవం" .... అనుదానికి అనేక దృష్టాంతాలు మనకు లభిస్తున్నాయి. 'హరిశ్చంద్రుడు' అను ఒక మహారాజు ఒక్కరాత్రిలో పంద్రెండు సంవత్సరముల కాలమును అనుభవించియున్నాడు. ఒకడు అత్యంత విరహముతో బాధ

పడుచున్నప్పుడు ఒక్కరోజు కాలం అత్యంత దీర్ఘంగా అనుభవమవుతూ ఉంటుంది కదా! బాగా ఆకలిచే బాధపడువానికి ఆయా జడాకారములు ఆహారపదార్థలవలె గోచరిస్తూ ఉంటాయి. ఈ జీవచైతన్యమునకు కూడా, "నేను జన్మించాను. మరణించాను. నా తల్లి, నా తండ్రి, నా బంధువులు" అనునట్టి బుద్ధి కలుగుచున్నది. ఇక అతడు అప్పుడు శూన్యస్థానములో జనసమూహమును దర్శిస్తాడు. విపత్తు ఉత్సవంలాగా ఉంటుంది. వంచన లాభంవలె తోస్తుంది. ఈ బుద్ధి యొక్క కల్పనకు అంతు ఎక్కడిది? అర్థమేమున్నది?

❖

ఇది ఇట్లుండగా, మరొక విషయం చెపుతాను విను. మిరియపుగింజలో 'కారం' బైటకు అగుపడకుండానే ఉంటుంది. ఒక శిలయందు శిల్పము చెక్కబడకపోయిన సమయంలో కూడా "శిల్పత్వము" ఉండే ఉంటుంది. శిల్పి ఆ శిలయందు శిల్పము చెక్కుచున్నప్పుడు బైటనుండి ఏదీ తెచ్చి అందు ఉంచుట లేదుకదా? "భ్రమ మయమైనట్టి ఈ జగత్తు ఉన్నది ఎక్కడ?" అనే ప్రశ్నకు సమాధానం విను :

"భ్రమాత్మకమగు ఈ దృశ్యజగత్తంతా మరెక్కడా లేదు. ఇదంతా జన్మరహితుడు, నిత్యుడు అయినట్టి ఆ పరమపురుషుని ఆశ్రయించుకొనే ఉన్నది. అంతేకాని దీనికి స్వకీయమైన 'సత్త' లేదు. ఈ జీవుడు స్వతహాగా ఆ పరమపురుషుడే సర్వదా అయివున్నాడు?"

❖❖❖

11. ఇదంతా స్వకీయ కల్పనయే!

ఓ లీలా! శ్రద్ధగా వింటున్నావు కదా! ఇందుకు ... ప్రతిరోజు, ప్రతిక్షణం, ప్రతి ఒక్కరికి అనుభవమగుచుండే ఒక చిన్న దృష్టాంతము నీ అవగాహన కొరకు చెపుతాను, విను.

"కళ్ళు మూసుకున్నప్పుడు ఏ రూపములు కనుపించవు. కాని, కళ్ళు తెరిచి చూచినప్పుడో ... నానావిధ రూపములు కనిపిస్తాయి కదా! అదేవిధంగా ద్రష్టయందు 'జ్ఞానదృష్టి' బలవత్తరమైనప్పుడు, "నానా రూపములుగా కనిపించేవన్నీ నానావిధములు కావు" అనునట్టి అంతర్గతమైన దృష్టి లేక అవగాహన తప్పకుండా సుసాధ్యమే. అజ్ఞాన దృష్టికి మాత్రం ఇవన్నీ పూర్తిగా మరొక విధంగా అనుభవమౌతున్నాయి.

ఈ జీవుడు మృతి పొందిన వెంటనే (శరీరము నేలకూలిన వెంటనే) అతనికి అసంఖ్యాకములగు దృశ్యజగత్తులు కనిపిస్తున్నాయి. ఈ దిక్కులు, కాలము, ఆకాశము, ధర్మము, కర్మలు .... ఇవన్నీ కల్పాంతము వరకు స్థిరముగా ఉండే వస్తువులే సుమా! ఇవన్నీ చిదాకాశములోనే ప్రస్ఫుటమౌతున్నాయి. చిదాకాశమునకు ఆద్యంతాలు ఎక్కడ? కల్పన ఉన్నంతవరకు జగద్వ్యవహారము ఉంటుంది. కల్పన తొలగితే ఏమీ ఉండదు. కల్పన లేనట్టి స్థితినే "కల్పాంతము" అని పిలుస్తున్నాము.

'స్మృతి' (జ్ఞాపకము) అనుదానినుండి ఉద్భవిస్తున్న ఈ 'స్మరణము' అనునది అత్యంత విచిత్రమైనది. స్వప్నంలో ... అంతకుముందు అనుకోనివి, చూడనివి, కోరనివి కూడా స్మరణకు వస్తాయి కదా! అదేవిధంగా ఈ జీవుడు అంతకుముందు గాంచనట్టి, ఒనర్చనట్టి విషయములు కూడా మరణానంతరం స్మరణకు వస్తున్నాయి. అయితే ఈ స్మరణ అంతా అతని అంతరంగమున గల సంస్కారమునకు వేరుగా ఉండినది కాదు. మనస్సుచే కల్పించబడి గాంచబడు ఊహానగరమునకు మూలమంటూ ఏదీ లేనట్లే, ఈ భ్రాంతికి కూడా మూలమంటూ ఏదీ లేదు. ఇదంతా వెలిసి ఉండేది చిదాకాశమునందే కదా! భ్రాంతియే పూర్వస్మృతిని ఆధారంగా చేసుకొని, "ఇది జగత్తు – ఇది సృష్టి', 'ఇది దూరము – ఇది దగ్గర', 'ఇది క్షణము – ఇది యుగము', 'ఇది స్వల్పము – ఇది దీర్ఘము' " అను రూపములుగా ముందుముందు భ్రమలన్నీ కల్పించుకొనుచున్నది.

'చిద్రూపము' ఒక్కటే కారణరహితమైనది. తదితరములన్నీ కల్పన యొక్క ప్రభావమే అయివున్నది. ఆ కల్పనకు కారణం చిద్రూపమే. స్వప్నంలో కనబడే వస్తువులు, వ్యక్తులు ఏమి అయివున్నాయి? అక్కడ అనుభూతమయ్యేదంతా స్మృతి యొక్క కల్పనయే కదా! తండ్రివలె ఉన్నవానిని చూచినప్పుడు తండ్రి గుర్తుకు వచ్చినట్లు. ఆయా నూతన వస్తువులు తారసపడినప్పుడు అంతరంగమున నూతనానుభవములు ఉద్భవించి బహిర్గతం అవుతున్నాయి. ఇట్లు జ్ఞప్తి రెండు విధాలుగా వర్తిస్తోంది.

1. స్మృతి 2. సంస్కారము

ఈ రెండు కూడా, నిశితంగా, పరిశీలించినప్పుడు, "ఈ రెండూ చిదాకాశము కంటే వేరు కాదు" అని తెలియవచ్చుచున్నది.

స్మృతి - ముక్తి :

ఓ లీలా! సంకల్పమయమగు ఈ సంసారమంతా కూడా సృష్టికాలంలో విధాత (లేక 'బ్రహ్మదేవుడు' లేక 'సమష్టి–సృష్టికర్త') యొక్క కల్పన యందే ఇమిడివున్నది. ఆ తరువాత స్థూలమగుచు క్రమముగా ఈ విస్తారమైన రూపమును దాల్చుచున్నది. కొందరు ఈ జగద్దృశ్యమును ఒకానొక బాహ్యమైనదానివలె గాంచుచున్నారు. మరికొందరు ఇదంతా తమ స్మృతియందే అనుభవమాత్రమై ఉండి ఉండుటను గమనించుచున్నారు. మరికొందరికి కాకతాళీయంగా స్మరణలేకుండానే ఇది అనుభవమునకు వస్తోంది.

ఈ సంసారవ్యవహారం ఈ విధంగా 'స్మృతి' చేతనే నిర్వచించబడుచు, స్మృతికి అందనిదై ప్రవర్తిస్తోంది కదా! అయితే జ్ఞానులు "ముక్తి" అనబడు మరొక స్థితిని మనందరికి ప్రతిపాదిస్తున్నారు. 'ముక్తి' అంటే ఏమిటి? ఈ సంసారము సంపూర్ణముగా విస్మరించబడుటయే సుమా! "ఈ సంసారము నందు నాకు కోర తగినది గాని, నిరాకరించ తగినదిగాని ఏదీ లేదు" అనునట్టి భావము సుస్థిరముగా యుండుటే "ముక్తి". ఈ 'అహం' అను జ్ఞానము దానిని అనుసరించియున్న దృశ్య జగత్తు అభావాన్నొందినప్పుడు మాత్రమే 'ముక్తి' అనునది బోధపడగలదు. "అహం–దృశ్యము"లు అంగీకరించబడినంతకాలం ఈ జన్మ–కర్మలు, అనుబంధ–బాంధవ్యములు ఉంటూనే ఉంటాయి.

అనగా దృశ్య పరంపరలు ఒకదానివెనుక ఒకటి వచ్చిపోతూనే ఉంటాయి. అవి జీవుని ప్రభావితం చేస్తూ, పోతూ ఉంటాయి. చీకట్లో మెలికలు తిరిగి-ఉండియున్న త్రాటియందు, "ఇది పాము" అనునట్టి "శబ్దము- దాని అర్థము" తొలగనంతవరకు సర్పము యొక్క భయం తొలగేదెట్లా?

ప్రయత్నపూర్వకమైన చిత్తనిరోధము :

"ఈ దృశ్యమును మరచిపోతాను. అట్లు మరచుటచే త్యజించివేస్తాను. దీనిని 'తిరస్కరించటం' అనునట్టి యోగమును ఆశ్రయిస్తాను" ... అని కొందరు యోగముచే చిత్తమును నిరోధింప ప్రయత్నిస్తున్నారు. అయితే అట్టి 'చిత్త-నిరోధము' అను బలవత్తర ప్రయత్నముచే కొద్దిసేపు శాంతి, ఉపశమనము లభించినప్పటికి, అది నిజమైన, శాశ్వతమైన శాంతి కాదు. ఆ 'యోగము' భంగమైనప్పుడు మరల, మరుక్షణం, 'సంసృతి' లేక 'సంసారము' వచ్చిపడుతోంది. ఒక దయ్యం వదలి మరొక దయ్యం పట్టుకొంటే లాభమేమున్నది? అందుచేత లీలా! నీవు జ్ఞానదృష్టిని అలవరచుకో.

'జ్ఞానదృష్టి' అంటే ఏమిటి? :

"ఈ దృశ్యము ఇట్లు ఉన్నప్పటికీ, ఇది సత్యము కాదు. ఇందు కనబడే అనేకత్వము వాస్తవము కాదు. అద్వితీయమగు❖ చైతన్యమే ఇట్లు "నేను-నీవు-దృశ్యము"గా స్వకీయమైన మాయచే ప్రవర్తించుచున్నది. "ఇందలి చిదాకాశస్వరూపమగు ఆత్మ తత్త్వమును దృష్టియందు ఉంచుకొని, ఆపై ఇక, ఏది ఎట్లో అట్లే ఆచరించెదనుగాక!" అనునదే జ్ఞానదృష్టి.

ఏది – 'భ్రమ' అయివున్నదో ... అది భ్రమగాను, ఏది – సత్యమైయున్నదో ... అది సర్వదా, సర్వత్రా, సర్వవేళల కార్య – కారణ రహితముగాను దర్శించుము. అప్పుడు నీకీ జాడ్యము తొలగిపోయి మావలెనే 'ముక్తస్థితి'ని అనుభవించగలవు. తత్త్వజ్ఞానమే ముక్తికి కారణం అవుతోంది. జ్ఞానము లభించినప్పుడు, "ఈ సంసారము బ్రహ్మమే అయివున్నది. ఈ ద్రష్ట – దర్శన – దృశ్యములందలి సారవస్తువు బ్రహ్మమే" అను బోధ కలుగుతోంది. నిద్రలేచిన వానిని కలలో చూడబడిన 'పులి' ఏమి చేయగలదు చెప్పు? ఈ సంసారముకూడా, నీవు జ్ఞానివైనప్పుడు, నిన్ను ఏమాత్రం స్పృశించలేదు. దుఃఖింపజేయలేదు.

❖❖❖

12. స్మృతికి ముందే ఉన్నదేది?

లీల : అమ్మా! నీవు చెప్పుదానిని అనుసరించి సృష్టికి పూర్వసంస్కారమే కారణమని గ్రహించు చున్నాను. అయితే ఒక ప్రశ్న. "అరుంధతి – వసిష్ఠులు" అనబడే ఈ బ్రాహ్మణ దంపతుల సృష్టికి కారణమగు అంతకుముందటి సంస్కారాలు నాకు ఎక్కడినుండి వచ్చాయి? నేను ఎప్పుడూ అవి అనుభవించినట్లే లేదేమిటి?

శ్రీ సరస్వతీదేవి : మెలుకువ రాగానే స్వప్న వృత్తాంతాలన్నీ త్యజించబడుచున్నట్లు, ... నూతన దేహసందర్భముచే పూర్వ-తత్పూర్వ దేహ వ్యవహారాదులు స్వప్నమాత్రానుభవత్వం సంతరించు

కుంటున్నాయి. 'మృతి' అనబడు శరీరత్యాజ్యము తరువాత దృశ్యము అగుపడుటకు కారణం ... ద్రష్ట యొక్క స్మృతియే కదా! అసలు ఆ 'స్మృతి' అనబడుదానికి ప్రారంభము ఎక్కడ? స్మృతికి ముందు ఉన్నదేది? "స్మృతికి ముందు ఏదీ లేదు. లేక శూన్యము ఉంటుంది?" అను అభిప్రాయం సరికాదు. శూన్యములో నుండి స్మృతి ఎట్లా వస్తుంది? "ఏదీ లేనట్టి శూన్య ప్రదేశంలో, లేదా, శూన్యాకాశంలో బంగారు సంచులు లభించాయి" అనునది ఎంతటి అసమంజసమైన విషయం?

స్మృతికి కూడా ముందు ఆ స్మరణమునకు 'కర్త' అయినట్టి నీవు ఉండనే ఉండాలి. నీవు ఉన్నావు కనుకనే 'స్మృతి' అనునది ఉంటుంది. అట్టి నీ శుద్ధ స్వరూపమే. (స్మరణమునకు ఆవల ఉన్న శుద్ధ చైతన్యమే) పరమాత్మయొక్క స్వరూపము.

❖

సరే! ఇప్పుడు ప్రథమ జీవుడగుబ్రహ్మదేవుని గురించి శాస్త్రములు ఎట్లు విశద పరుస్తున్నాయో చెపుతాను. విను. ఇది వింటే నీ సందేహాలన్నీ తొలగుతాయి.

'స్మృతి'కి ఆవల ఉన్నది ముక్త స్వరూపము. బ్రహ్మ స్వతహాగానే ముక్తజీవుడు. ఎవడు ముక్తుడో అతడు తన స్వతత్త్వమునందు సుస్థిరుడై ఉంటాడు. అందుచేత బ్రహ్మకు 'పూర్వస్మృతి' అనే ప్రసక్తి ఉండదు. సృష్టికర్త. సమష్టిజీవుడు, చిత్తాకాశస్వరూపుడు (cosmic mind process) అగు బ్రహ్మ యొక్క కల్పనయే ఈ జీవుడు కదా! అట్టి ఈ జీవుని యొక్క ఈ 'జగత్' సృష్టికి కారణం 'స్మృతి' అనటానికి వీలులేదు. కనుక ఇక్కడ సిద్ధాంతీకరించబడిన విధం విను.

వ్యష్టిజీవుడు : ఒకానొక ఉపాధికి సంబంధించిన ద్రష్టత్వము – కర్తృత్వము.

సమష్టి - జీవుడు లేక ప్రజాపతి : పునర్జన్మ పరంపరల రూపంగా ఏర్పడి ఉంటున్న అనేక ఉపాధులలోని ద్రష్టత్వము – కర్తృత్వము.

అనేక జన్మలలోని వాడు, ఒక జన్మలోని వాడు ఒక్కడే అయివున్నాడు కదా! కాబట్టి ఆ ఇరువురు ఒక్కటే.

ఒక ప్రజాపతి (సమష్టి జీవుడు) నుండి మాయయొక్క సంపర్కముచే మరొక ప్రజాపతి ఉదయిస్తూ సృష్టిని దర్శించటం జరుగుతోంది. ఒకే ద్రష్ట వేరువేరు సందర్భములలో అనుభవం స్వీకరించుచున్నాడు.

ఇది ఇట్లుండగా, జన్మలు అంగీకరించుచున్న "ప్రజాపతి" నుండి ఉద్భవించుచున్న ప్రజాపతులలో కొందరికి కాకతాళీయంగా 'పూర్వస్మృతి'తో కూడిన ప్రతిభ వికసిస్తోంది.

❖

సృష్టులన్నీ చైతన్యాకాశంలో ఉదయించి కనబడుచున్నాయి. వాస్తవానికి ఈ సృష్టులన్నీ సంకల్పమాత్రములే కనుక, మిథ్యారూపములే. సంకల్పమున్నచోటే స్మృతి – సంస్కారములు కూడా ఉంటాయి. "సంకల్పమునకు ముందు ఉండక – సంకల్ప సమయంలో ఉన్నట్లు తోచుచు

– సంకల్పము తొలగినప్పుడు తాము కూడా తొలగుచుండే ఈ సృష్టులు ఏ సమయమందును ఉదయించి ఉండలేదు" ... అనునది ఇక్కడ సిద్ధాంతము. ఓ లీలా! నేను చెప్పుచున్నది కొంచెం సూక్ష్మదృష్టితో యోచించు. సంకల్పముచేత జనించి, ఆ సంకల్పము లయించినప్పుడు లేనట్లు అనుభూతమయ్యేది .... ఎప్పుడు ఉదయించినట్లు? ఎప్పుడు అస్తమించినట్లు? కనుక "నా సృష్టిని నేనే నా 'సంకల్పములు' అను ప్రక్రియచే సృష్టించుకొనుచున్నాను. నేను సంకల్పములు త్యజించినప్పుడు నా శుద్ధతత్త్వమే శేషించుచున్నది. సృష్టికి అతీతమై వెలుగుచున్నట్టి చిత్ చైతన్యమే 'పరమాత్మ' అను శబ్దముయొక్క అర్థము" అని గ్రహించు. అదే పరబ్రహ్మము.

బ్రహ్మకు కలిగే "పూర్వ–అపూర్వ" స్మృతులకు కారణం పరబ్రహ్మమే. అనగా పరబ్రహ్మమే కార్య–కారణస్వరూపమై చిదాకాశమున వెలయుచున్నది. కార్యకారణముల అభేదజ్ఞానమే ముక్తి. "అట్టి అభేదజ్ఞానము సుస్థిరం కానంతవరకు ముక్తి లభించునది కాదు" ... అని ముక్త స్వరూపులమగు మేము అనుభవపూర్వకంగా గ్రహించి, ప్రకటిస్తున్నాము. అందువల్ల 'పూర్వస్మృతి' అనునది కూడా "అఖండచిన్మయము" నకు వేరైనది కాదని గ్రహించు. అగ్ని–ఉష్ణము ఆకాశము–శూన్యమువలె కార్యము – కారణము (Effect-Cause) అనునవి శబ్దము నందే భేదము కలిగివున్నాయి గాని, అర్థము నందు కాదు. ఆ రెండింటికి భిన్నమైన సత్త లేదు. అందుచేతనే, "నాయనలారా! 'జగత్' అనబడు దృశ్యము ఏమాత్రము ఉత్పన్నమగుట లేదు. 'బ్రహ్మసత్త'నే నీవు నీ స్వకీయ కల్పనారచనచే ఇట్లు జగత్తుగా దర్శించుచున్నావు" ... అని గురువులు లోకములకు బోధిస్తున్నారు. "తత్త్వమ్" ("తత్ = అదియే, త్వమ్ = నీవు అయిఉన్నావు") అను మహావాక్యము యొక్క గూడార్థము ఇదే కదా! కేవల పరబ్రహ్మస్వరూపమగు చిదాకాశముననే సర్వము వెలయుచున్నదని గ్రహించు.

❖❖❖

13. అన్య జగత్తులను ఎందుచేత చూడలేకపోతున్నాం?

లీల : హే జగజ్జననీ! మాతా! నీవు ఈ రోజు నీ వాక్యపరంపరలచే నాకు దివ్యమైన దృష్టిని ప్రసాదిస్తున్నావు. సూర్యుడు ఉదయించగానే సర్వము చూడబడునట్లు, నేను పరమజ్ఞానమును నీ ప్రసాదముచే పొందుచున్నాను.

హే లోకపావనీ! సత్యస్వరూపిణియగు నీవు సర్వదా సత్యమునే ప్రకటిస్తావు. అయినప్పటికీ, ఇతఃపూర్వపు సంస్కారములచేత కాబోలు, నాలో కించిత్ శంక, కుతూహలము మిగిలియే ఉంటున్నాయి. నీకు అభ్యంతరం లేకుంటే, నన్ను ఆ 'గిరి' గ్రామమున గల అరుంధతి – వసిష్ఠులు నివసించిన గృహమునకు తీసుకొని వెళ్ళు.

శ్రీ సరస్వతీదేవి : సరే. అట్లే అగుగాక. అయితే నీవు మొట్టమొదట సమాధిని ఆశ్రయించి, అట్టి సమాధియొక్క ప్రభావంచేత స్థూలదేహమును పరిత్యజించాలి. "అచేత్య (భౌతిక దృష్టిచే తెలియబడు దానికంతటికీ అతీతమైన) చిద్రూపమైనట్టి నేను చిత్‌చైతన్యమును" అనునట్టి పవిత్రదృష్టిని అవలంబించి,

మావలెనే పవిత్రురాలవు కమ్ము. అప్పుడు నీవు ఆకాశస్వరూపమగు సృష్టిని గాంచగలవు. ఈ నీ స్థూలదేహభావము ఆ సృష్టి దర్శనమునకు ప్రతిబంధకమైయున్నది సుమా! అందుచేత ఇప్పుడు "నేను చిదాకాశ స్వరూపమును" అను జ్ఞానదృష్టిని అవలంబించు.

లీల : దేవీ! ఈ భౌతిక దేహభావోద్రేకం ఉన్నంతవరకు అన్యజగత్తును ఎందుకు చూడలేము? దానికి కారణమేమిటి? నాపై కనికరంతో ముందుగా ఈ విషయం వివరించి చెప్పు.

శ్రీ సరస్వతీదేవి : వాస్తవానికి ఈ దృశ్యజగత్తు ఆకృతిరహితమైనది. అయితే మిథ్యా జ్ఞానవశం చేత ఆకృతి ఉన్నట్లు అగుపడుచున్నది. దృష్టాంతానికి ... "బంగారపు ఉంగరం" అను దానిలో ఉన్నదంతా బంగారమే కదా! కాని 'ఉంగరం' అను శబ్దంతో పిలుస్తున్నాం. బంగారంలో ఉంగరం ఉన్నదా? మరి ఉంగరం ఉన్నది దేనిలో? ఉంగరము అనునది ఆకారమే కదా! ఆ ఆకారము బంగారమునకు వేరైనది కాదుకదా! అట్లాగే ఈ దృశ్యజగత్తు కూడా పరమాత్మకంటే వేరైన సత్త లేదు. అందుచేతనే ఇది "మిథ్య" అని అనిపించుకొనుచున్నది.

ఈ జగదాకాశము బ్రహ్మము కంటే వేరు కాదు. తటాకంలోని జలంలో (పైనున్న) ఆకాశం లేకపోయినప్పటికీ, ప్రతిబింబిత–కారణంగా ఆ నిశ్చల–జలంలో "మేఘావృతమైన ఆకాశం" కనబడుతోంది కదా! నిరాకారమగు బ్రహ్మమునందు మిథ్యయగు జగత్తు యొక్క ఆకృతి అట్లే తోచుచున్నది.

అయం ప్రపంచో మిథ్యైవ సత్యం బ్రహ్మాఽహమద్వయమ్ ।
అత్రప్రమాణమ్ వేదాంతా గురువోఽనుభవస్తథా ॥ (XXI.35)

"ఈ ప్రపంచమంతా మిథ్యయే. నేనే బ్రహ్మమును" అను జ్ఞానమొక్కటే సర్వవేళల సత్యమైయున్నది. "బ్రహ్మము నాకంటే వేరైనది కాదు" అనునదే ఉత్తమ జ్ఞానము. ఈ విషయంలో శాస్త్రమహావాక్యములే ("అహం బ్రహ్మాస్మి", "జీవోబ్రహ్మేతి నాపరః", "అయమాత్మా బ్రహ్మమ్", "సోహం", "తత్త్వమ్" మొదలైనవి) ప్రమాణాలు. 'స్వవిచారణ' అను ప్రయత్నముతో కూడుకొనిన మహనీయులగు గురువుల స్వానుభవమే, మరియు ఆత్మానుభవమే ప్రమాణం.

"బ్రహ్మైవ పశ్యతి బ్రహ్మ, నాఽబ్రహ్మ బ్రహ్మపశ్యతి।
సర్గాదినామ్నా ప్రథితః స్వభావో అస్యైవచేదృశః॥ (XXI.36)

బ్రహ్మమే బ్రహ్మమును గాంచగలదు. బ్రహ్మము కానిది బ్రహ్మమును దర్శించగలదా? లేదు. ఆ బ్రహ్మమే జగత్తును కల్పించి జగత్తు అను పేరుచే తానే వ్యవహరించుచున్నది. అట్లు "కల్పించుట–దర్శించుట–అగుట" బ్రహ్మము యొక్క స్వభావమైయున్నది. అయితే బ్రహ్మము నందు జగత్తుయొక్క, కారణముగాని, కార్యముగాని లేవు. ఎట్టి బాహ్యమైన సహకారి కారణములు కూడాలేవు. బ్రహ్మము విశుద్ధమైనది. బ్రహ్మమే తన స్వకీయమైన అభ్యాసంచేత జగత్తును గాంచుచున్నది. అందుచేత, మరల అభ్యాసవశం చేతనే భేదజ్ఞానం తొలగుతోంది. భేదజ్ఞానము

తొలగనంతవరకు ఏ ఒక్కరు బ్రహ్మ స్వరూపమును పొందలేరు. అనగా – బ్రహ్మదర్శనం కావాలంటే భేదజ్ఞానం తొలగటం ఒక్కటే ఉపాయం. అట్టి లక్ష్యము సాధించు నిమిత్తమే చెప్పబడిన – చెప్పబడ బోవుచున్న శాస్త్ర – విధి – నియమాదులన్నీ ఉన్నాయి. ఓ లీలా! నీవు బ్రహ్మము విషయమై అభ్యాసబలంచేత దృఢజ్ఞానం సంపాదించాలి. అప్పుడు మాత్రమే ఆ పరమపదమును దర్శించు అధికారం లభిస్తుంది. నీచే చూడబడుచున్న ఈ నా భౌతిక శరీరము కూడా సంకల్పనగరమువలె ఆకాశస్వరూపమే. అట్టి ఎరుక చేతనే నేను దీనియందు కూడా బ్రహ్మపదమును గాంచగలుగుచున్నాను.

లీల : ఓ జగదీశ్వరీ! 'సమాధి' మొదలైన ఉపాయముల ద్వారా ఆతివాహికజ్ఞానం (Subtle consciousness) దృఢమైనదనుకో .... అప్పుడు ఈ శరీరం ఏ స్థితిలో ఉంటుంది? ఇది నశిస్తుందా? నశించకుండా ఇట్లాగే ఉంటుందా?

శ్రీ సరస్వతీదేవి : నీ ప్రశ్నకొంత అసంగతమైనదనే చెప్పాలి. ఎందుకంటావా? ఉన్న వస్తువుకు మాత్రమే క్షీణించటం–నశించటం వంటివి ఉంటాయి. అసద్వస్తువు స్వతహాగా లేనట్టిది. ఇక ఉద్భవించటమేమిటి? క్షీణించటమేమిటి? నశించటమేమిటి? చీకట్లో 'త్రాడు'ను చూచి 'పాము' అని భ్రమించావనుకో ... అప్పుడు ఒక దీపం తెచ్చి ఆ వెలుతురులో పరీక్షగా చూచినప్పుడు "ఇది త్రాడు మాత్రమే" అని తెలిసిపోతుంది కదా! భ్రమ తొలగిపోయింది. అప్పుడు, సర్పము ఏమైనది? చచ్చినదా? అసలు అట్టి ప్రశ్న ఎక్కడ ఉంటుంది? సత్యజ్ఞానం కలిగిన తరువాత 'త్రాడు'నందు పాము కనిపించదు కదా! ఆతివాహిక భావము (సూక్ష్మతత్త్వము) గ్రాహ్యమైన తరువాత ఆధిభౌతిక భావమే తొలగిపోతుంది. అనగా "నేను రక్త మాంసమయమైనట్టి ఈ భౌతిక దేహమును" అను భావమునకు చోటు ఉండదు. "ఈ శరీరము యొక్క పెరుగుదల – తరుగుదలలకు, ఉత్పత్తి – వినాశనములకు నాకేమీ సంబంధము లేదు" అనునట్టి నూతన జ్ఞానానుభవం ఉదయిస్తోంది.

"కల్పన"యే సర్వభ్రమలకు కారణం. అయితే, ఈ కల్పన కల్పిస్తున్నవారెవరు? ఎవరో బాహ్యము నుండి కల్పించుచుండటం జరుగుతుంటే, బాహ్యమైన ఉపాయాల కొరకు వెతుకవచ్చు. అది ద్రష్టయే తనకు తాను కల్పించుకొనుచున్నాడు. స్వప్నములోని శిల 'లేనిదే' అయివున్నది కదా! ఈ శరీరాలు కూడా వాస్తవానికి లేకయే ఉన్నాయి.

లీల : మరి ఈ కనబడుచున్న శరీరముల మాట ఏమిటి?

శ్రీ సరస్వతీదేవి : ఇవన్నీ 'పరబ్రహ్మము' అనబడు పరిపూర్ణ భావమునందే కల్పనా చమత్కృతిచే ఉన్నాయి. వీటినన్నిటినీ మేము సత్యస్వరూపమునందే గాంచుచున్నాము. మరి, నీవో? ... నిత్యసత్యమగు స్వస్వరూపభావన సన్నగిలియుండుటచే, మిథ్యా జ్ఞానముచే, "అనేక శరీరములు" అను భావన పొందుచున్నావు. అందుచేతనే, ఇందలి సత్యత్వమేమిటో, అసత్యత్వమేమిటో తెలుసుకొలేకపోతున్నావు. ఇదంతా సృష్ట్యాదియందే చిత్స్వభావమున కల్పితమైయున్నది. అప్పటి నుండి అద్వయసత్తయే దృశ్యరూపమున పరిగ్రహించబడుచున్నది.

లీల : అనగా "దిక్కులచే, కాలములచే పరిచ్ఛిన్నము కానట్టి అద్వయపరతత్త్వము' ఒక్కటే ఉండి ఉన్నది. మరింకేదీ ఎక్కడాలేదు" ... అని నీ అభిప్రాయము కదా. మరి అట్టి దానికి, ఈ "నీవు–నేను–దృశ్యము" .... వంటి కల్పనలతో పని ఏమి వచ్చింది? ఈ భ్రమలన్నీ ఎందుకు ఉన్నాయి? ఎందుకు, ఎట్లు, ఎవరి వలన, ఎవరి కొరకు ప్రవర్తిస్తున్నాయి?

శ్రీ సరస్వతీదేవి : బంగారమునకు ఆభరణత్వము సత్యమా? జలమునకు తరంగత్వము వాస్తవమా? స్వప్నములోనో, సంకల్పములోనో, తారసపడే వస్తువులకు అస్థిత్వమెక్కడిది? అదేవిధంగా విశుద్ధ సత్స్వభావమగు బ్రహ్మమునందు ఈ "నీవు–నేను–దృశ్యము" అను కల్పనలు ఏమాత్రం ఏ క్షణమందు కూడా లేవు. సృష్ట్యాదియందు పరబ్రహ్మమునకు ఎట్టి రూపమూ లేదు. ఆ బ్రహ్మము శాంతము, అద్వయము, జన్మరహితము అయివున్నది. ఒక మణి లేక దర్పణమునందు ప్రకాశించేదంతా దృశ్యము యొక్క ప్రతిబింబమేకాని ఆ మణి లేక దర్పణమునందు ఉండి ఉన్న వస్తుజాలము కాదు కదా! ఈ దృశ్యమంతా బ్రహ్మము యొక్క ప్రతిబింబము మాత్రమే. బ్రహ్మమే ఇట్లిట్లు దర్శింప బడుచున్నదని గమనించు.

❖❖❖

14. అభ్యాస ప్రభావం

లీల : అట్లా అయితే మమ్ములను ఈ విధంగా ద్వైత అద్వైత జ్ఞాన విమూఢులుగా చేసి భ్రమింపజేసేదెవరు?

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! నిన్ను ఇంతవరకు భ్రమింపజేసేది బయట నుండి మరెవ్వరో కాదు. నీయొక్క 'అవిచారము' అను స్వరూపము గల మోహమే సుమా! అయితే స్వభావజనితమైన "అవిచారణ" .... విచారణ మాత్రం చేత తప్పక నశిస్తోంది. "అవిచారణ"ను ఎదుర్కొన గలిగినది "విచారణ" కాకుండా మరింకేముంటుంది? అయితే ఈ అవిద్య కూడా 'బ్రహ్మసత్త' కంటే భిన్నమైనది కాదు. బ్రహ్మసత్తయే ఇచ్ఛామాత్రంగా అవిద్యను అవలంబించటం, త్యజించటం కూడా నిర్వహిస్తోంది.

వాస్తవానికి 'బ్రహ్మము' ... అభిన్నము, అఖండము, శుద్ధము అయివున్నది. ఇంక విచారణ ఏమిటి? అవిచారణ ఏమిటి? అవిద్యలేదు, బంధములేదు, మోక్షములేదు. కేవలము విశుద్ధరూపమగు బ్రహ్మమొక్కటే సర్వదా ఉండి ఉన్నది. 'జగత్తు' అనునది అందు ఆరోపితమగుచున్నది. ఈ తత్త్వము నీవు ఇంతవరకు విచారించి ఉండ లేదు. అందుచేతనే భ్రాంతి నిన్ను కలచివేయటం జరుగుతోంది. కాని ఇప్పుడు ఉన్న విషయమేమిటో గ్రహించి ప్రబుద్ధురాలవగుచున్నావు కదా! అనగా "విదేహజ్ఞానము"ను పొందావు. ముక్తిని పొందావు. నీయందు వాసనలన్నీ క్షీణించిపోయాయి.

"నిర్వికల్ప సమాధి" సమయంలో చిత్తము "అద్వయబ్రహ్మము" నందు స్థిరీకృతమై ఉంటుంది. అందుచేత ద్రష్ట – దర్శనము – దృశ్యములు స్వస్వరూపమునందు లయించిపోయి ఉంటాయి. అట్టి సమయంలో ఒకవేళ హృదయ క్షేత్రంలో వాసనాబీజము ఒకింత అంకురించి ఉన్నప్పటికీ,

అది రాగ-ద్వేషాది భావములను ఏమాత్రం ఆశ్రయించదు. సంసారకారణములైనట్టి రాగద్వేషాలు నశిస్తే స్వయముగా సుస్థిర 'నిర్వికల్పసమాధి' స్థితి లభ్యమవుతుంది. సమరసభావమే స్వరూపముగా కలిగినట్టి సమాధి అభ్యసిస్తూరాగా, సంసారభావన క్రమంగానో, లేక వెంట-వెంటనేనో .... తొలగిపోతుంది. అందుచేత ఓ లీలా! నీవు నిర్మలపరమాత్మను అవలంబించు. తద్వారా భ్రాంతి మయమగు కార్యములు, సంకల్పములు నీనుండి తొలగిపోతాయి. అప్పుడు నీవు మోక్షస్వరూపురాలవు అవుతావు. అవధులు లేని "ప్రశాంత -ఆనందమయ స్వస్వరూప" స్థితిలో నిలిచియుంటావు.

❖

"ఇది స్వప్నము" అని తెలిసిన మరుక్షణం, ఆ స్వప్నములోని పదార్థములు, వ్యక్తులు, సంఘటనలు "మిథ్యయే" అని తెలిసిపోతాయి కదా! వాసనలు క్షయించి పోయినప్పుడు, ఇక ఆపై ఈ స్థూలదేహము అగుపడుచున్నప్పటికీ, "ఇది అసత్తే" అను బోధ కలుగుతుంది. సర్వవాసనలు క్షయమైనప్పుడు ఈ జాగ్రత్‌దేహము కూడా శామ్యత్వము పొందుతుంది. అనగా "ఈ శరీరము కలిగియున్నాను. ఇది నాకు ప్రియము. ఇది నాయొక్క పరిధులను నిర్ణయించుచున్నది. ఇది ఉన్నప్పుడే, ఉన్నచోటే ఉండి ఉన్నప్పటికీ,.... "దీని హాని వృద్ధులను అనుసరించే నేను హాని వృద్ధులను పొందుచున్నాను" అను భావములన్నీ తొలగిపోతాయి. "నేను సర్వదా శుద్ధ చైతన్యమునే! నా సంస్కారములను అనుసరించే ఈ శరీరాదులన్నీ ఉంటున్నాయి. సర్వమునకు కర్తనైయుండి కూడా, నేను అకర్తృత్వమే స్వభావముగా గల సాక్షి స్వరూపుడను" అను దివ్యమైన అవగాహన స్థిరీకరణ పొందుచున్నది.

స్వప్నము అనుభవించువాడు "నేను శరీరమునకు, శరీర-ధర్మములకు సంబంధించిన వాడను" అను భావనను త్యజించి, తన అంతరంగమునందు (లేక తన ఆతివాహిక దేహమునందు) ఆయా పదార్థములను, సంఘటనలను గాంచుచున్నాడు. కాని నిదుర లేవగానే జాగ్రత్‌లో "నేను కాళ్ళు-చేతులుగల భౌతిక దేహము యొక్క ధర్మములకు సంబంధించినవాడిని" అను భావన, అనుభవం పొందుచున్నాడు. సంకల్పములోని అనుభవములు కూడా స్వప్నమువలెనే ఉంటున్నాయి. ఎప్పుడైతే ఈ జీవుడు "నేను ఈ దేహస్వరూపుడను" అను భావమునుండి విడివడుతాడో, అప్పుడు "ఆతివాహిక దేహభావన" ప్రకాశిస్తోంది. వాసనలన్నీ తొలగటం జరిగితే ఒకానొక జాగ్రత్ - మౌనరూపమగు సుషుప్తివంటి 'భావనావ్యవస్థితి' కలిగి ఉండగలడు. వాసనాబీజము తొలగినప్పుడు "నేను శరీరమును, శరీరమునకు సంబంధించినవాడను" అనునది కూడా లేకుండా పోతుంది. అట్టి జీవునే "ముక్తస్వరూపుడు" అని అంటున్నాము. అతడే జీవన్ముక్తుడు.

జీవన్ముక్తులలో మనము చూచే వాసనలు ఈ సాంసారిక జీవుల వాసనలవంటిది కాదు. వారియందలి జీవసంస్కారము (లేక) వాసన - "శుద్ధ-సత్త్వ స్వభావము : సామ్య-సత్త" (An Experience of all pervading equality)-అని చెప్పబడుతోంది.

గాఢనిద్రాలో మనస్సు జడత్వం వహిస్తోంది. ఆ సుషుప్తిలో వాసనలన్నీ అప్రకటితంగా ఉంటున్నాయి. జాగ్రత్-స్వప్నదశలలో ఆ వాసనలు జడత్వమును త్యజిస్తున్నాయి. జాగ్రత్ -

సుషుప్తులు రెండూ వాసనాశూన్యములు అయినాయనుకో ... అప్పుడు, ఒకానొక ప్రపంచరహిత – మనోరహితస్థితి అట్టి జీవునియందు శేషించి ఉంటుంది. ఆ స్థితినే శాస్త్రములు 'తురీయము' అను పేరుతో పిలుస్తున్నాయి. జ్ఞానాగ్నిచేత వాసనలన్నీ నశించినప్పుడు అట్టి తురీయ స్థితి ఈ జీవునియందు జాగ్రత్‌లో ప్రకాశిస్తుంది. వాస్తవానికి ఆ స్థితి ప్రతిజీవుని వాస్తవ-స్వభావమే అయివున్నది. అట్టిస్థితినే, "బ్రాహ్మీస్థితి" లేక "మోక్షస్థితి" అనికూడా పిలుస్తున్నారు. ఇక దీనికంటే ఉత్కృష్టమైన స్థితి అంటూ ఏదీ లేదు. వాసనలు కలిగియుండుటే 'బంధము', లేకయుండుటయే 'మోక్షము'. ఒకానొకడు వాసనారహితుడై కూడా ఈ సంసారమునందు ఇతరులవలెనే యథాతథంగా ఉంటూ ఆయా కర్తవ్య- అకర్తవ్యములను నిర్వర్తించుచున్నాడు. అంతరంగమున పూర్ణమగు ఆత్మ భావననే కలిగి యున్నట్టి, అట్టివాడే జీవన్ముక్తుడు. అతడు స్వస్వరూపజ్ఞాన ప్రభావంచేత సర్వ సామ్యమును, పూర్ణానుభవమును (నేను "పూర్ణుడను" అను అనుభవమును) పొందుతూనే ఉంటాడు. ప్రవాహపతితంగా ప్రాప్తించుచున్న కర్మల వ్యవహారములు అతని నిశ్చలత్వమునకు ఏమాత్రం ప్రతిబంధకం కాదు. అతడు అంతరంగాన 'కొండ'వలె గాంభీర్యం వహించి, బాహ్యమునకు మాత్రం లోకానుకూలార్థం ప్రవర్తిస్తూ ఉంటాడు. అట్టి జీవన్ముక్తుని బద్ధజీవులు గుర్తించలేకపోవచ్చు కూడా!

మంచు వేడి వలన కరిగినప్పుడు తన ఇతఃపూర్వపు స్వభావమైనట్టి జలముగానే అగుచున్నది కదా! వాసనాశూన్యమైన చిత్తము కూడా తన సహజస్వరూపమైయున్న "శుద్ధసత్త్వ స్వభావము"నే పొందుచున్నది. అది తన స్థూలభావము (స్థూల విషయము స్మరించుట)ను త్యజించి స్వభావసిద్ధమైన సూక్ష్మత్వము వహించుచున్నది. 'స్థూలభావం' తొలగనంతవరకు ఈ ఇంద్రియములు, వీటిని అంటిపెట్టుకొని ఉండే పదార్థజాలము మరల మరల ప్రోగుపడుతూనే ఉంటాయి. 'జ్ఞానబలము' ప్రబుద్ధమైనప్పుడు ఆతివాహిక భావము పొందిన చిత్తము అన్యచిత్తములలో ప్రవేశించగలదు. అదేవిధంగా, ఆ చిత్తము జన్మాంతరీయములైన, సృష్టాంతరీయములైన పదార్థములతో కలియగలుగు సామర్థ్యమును కలిగివుంటుంది.


కాబట్టి ఓ లీలా! నీవు అభ్యాసబలం చేత "నేను ఈ దేహమును, ఈ దేహమునందు మాత్రమే ఉన్నాను" అనునట్టి దేహాభిమానత్వం దూరంచేయి. అప్పుడు నీయందు దట్టంగా పేరుకొనియున్న .... "ఈ దృశ్యము వాస్తవము. ఇది అనేక పదార్థములతో, నీవు-నేను-నీది-నాది అను అనేక వ్యవహారములతో నిండివున్నది." .... అను అజ్ఞానపూరిత – దోషం తొలగుతుంది. సంకుచిత లేక పరిమిత అనుభవజ్ఞానంతో కూడిన ఇప్పటి నీ బుద్ధి విశాలత్వము, అపరిమితత్వము సంచరించుకొంటుంది. "నేను చైతన్య తత్త్వమును" అనునట్టి దృఢమైన స్థిరమైన, అవగాహనను స్వీకరించునప్పుడు, అప్పుడు ఏర్పడుచున్న "ఆతివాహికదృష్టి" లేక "జ్ఞానము" సహాయంచేత పవిత్రమైన లోకములను గాంచగలుగుతావు.

పుత్రీ! వాసనలు క్షయింపజేయ గల ఉపాయములనే సర్వదా ఆశ్రయించు. వాసనలు క్షయించుటచే ఏర్పడు స్థిరబుద్ధియే నిన్ను జీవన్ముక్తురాలిగా తీర్చిదిద్దుతుంది. ఉత్తమోత్తమమైన

బోధ మరియు అనుభవజ్ఞానము ఉదయించేవరకు క్రమంగా స్థూలదేహానుభవమును సన్నగిల్లచేసుకొంటూ, ఆతివాహిక దృష్టికొరకు ప్రయత్నిస్తూ ఉండవలసినదే.

మాంసమయదేహము – మాంసమయదేహమును మాత్రమే తాకుతుంది. మాంసమయ దేహం చిత్తదేహమునుగాని, చిన్మయ దేహమునుగాని కలియగలదా? లేదు. నీ చిత్తదేహముతో మాత్రమే ఇతరుల చిత్తదేహమును గాంచగలవు. చిత్తస్వరూపమును స్వప్రయత్నముచే ధరించవచ్చు. సత్యదేవతాస్వరూపిణియగు నేను నీపైగల పుత్రికా వాత్సల్యంతో ఈ విషయాలు చెప్పుచున్నాను. వాస్తవానికి నేను చెప్పు ఈ వాక్యములలోని సత్యము ఆబాలగోపాలం అందరికీ అంతరంగంలో తెలిసియున్నదే. కాని, స్థూల దృష్టియొక్క అభ్యాసము ఈ జీవుని చిదాకాశత్వమును కప్పియుంచుటచే అనేకులకు తమపై తమ యొక్క ఆత్మ స్వరూపముపై తమకింకా విశ్వాసము కలుగటం లేదు. కనుక లీలా! చిత్తశరీరమును స్వయముగా అభ్యాసయోగంచేత ధరించవచ్చు. ఆ చిత్తశరీరము ఆయా వ్యవహారములు కూడా నిర్వర్తించగలదు. వరములు–శాపములు, ఇతర చిత్తాకాశములందు ప్రవేశించి ఆయా ప్రయోజనములను సిద్ధింపజేయుట మహనీయులగు గురువులు దేహానంతరం శిష్యులతో సంభాషించటం మొ॥నవి ఇందుకు మనకు దృష్టాంతము.

ఓ లీలా! మరల ప్రకటించుచున్నాను, విను. నిరంతర జ్ఞానాభ్యాసంచేత వాసనా సమూహములన్నీ క్షీణించగా, ఈ దేహము ఇట్లా ఉండగానే ఆతివాహిక దేహము పొందవచ్చు. ధరించవచ్చు. మరణించినప్పుడు మాత్రం జరిగేదేమిటి? అప్పుడు ఈ పాంచభౌతిక దేహము ఉండదు కదా! అనగా ఆ స్థితిలో ఆ ప్రాణి (లేక జీవచైతన్యము) ఆతివాహిక దేహి స్వరూపుడే అయివుంటాడు. అయితే, ఈ ఆతివాహిక దేహముయొక్క ఉత్పత్తి గురించి మాత్రం ఎవరికీ తెలియదు. ఈ జనులు భౌతిక దృష్టికి పరిమితు లగుటచే మృతదేహమును మాత్రమే చూడగలుగు చున్నారు. కాని, ముక్తపురుషుని దృష్టి యందు (ఆతివాహికదేహము దృష్ట్యా) జీవునకు ఉత్పత్తి వినాశనములు లేవు. అందుచేత, ఘనీభూతమై కనబడుచున్న ఈ 'జీవన్మరణములు' అనునవి భ్రమమాత్రమే. సంకల్ప–పురుషునికి పుట్టుక ఏమిటి? చావు ఏమిటి? అది మొదలే మిథ్యకదా! అదేవిధంగా, "జీవన్మరణములు మిథ్యయే" అని గ్రహించు.



సంకల్పము ఉన్నను, లేకున్నను నీకు లోటేముంటుంది? నీవు సర్వదా చిత్‌స్వరూపమువే కదా! శరీరముల విషయము కూడా అట్టిదే.

❖

లీల : హే భగవతీ! నీవు ఉపదేశిస్తున్న ఈ పవిత్రజ్ఞానం వింటుంటే నా దృశ్య–దర్శన రోగము దానంతట అదే ఉపశమించిపోతోంది. అయితే, "అభ్యాసము అవసరము" అని అంటున్నావు

కదా! ఇప్పుడు దీనిని, ఎట్లు, అభ్యసించాలి? ఆ అభ్యాసం దృఢపరచటానికి నేను ఏంచెయ్యాలి? అట్లు ఆచరిస్తే లభించే ప్రయోజనం ఏమిటి? నాపై దయతో వివరించి చెప్పు.

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! ఎవరైనా, ఎప్పుడైనా, ఏ పనైనా చేయాలంటే, ఆ పని అభ్యాసం లేకపోతే సిద్ధించదు కదా! బ్రహ్మమును గురించే చింతనచేయటం, మాట్లాడుకోవడం, ప్రసంగించటం, ప్రబోధించటం, స్థిరభావన కలిగివుండటమునే పండితులు (లేక నిత్యా నిత్యజ్ఞానము కలిగియున్నట్టి మహనీయులు) "అభ్యాసము" అని పిలుస్తున్నారు. మహాత్ములగువారు ఈ సంసారమందలి దోషములను గమనించినవారై, ఇందలి సత్యాన్వేషణమునకు ఉపక్రమించుచున్నారు. జనన-మరణ శాంతిని కోరినవారై భోగవాసనలను త్యజించివేయుచున్నారు. శాస్త్రములచే బోధింపబడిన అనేక విధి, విధానములలో తమకు తగినవాటిని ఎన్నుకొని, సర్వదా ప్రయత్నశీలురై ఉంటున్నారు. అందుచేతనే, వారు ఈ జగత్తును జయించివేయగలుగుచున్నారు. వారిబుద్ధి నిత్యమూ అన్ని పరిస్థితులందు ఔదార్యముచే సుందరంగా అలంకరించబడి ఉంటోంది. ఆ ఉత్తమ సాధకుల చిత్తము పరమ-వైరాగ్యముతో నిండియుండి, సర్వదా అకృత్రిమమగు స్వస్వరూపానందమును పొంది ఉంటోంది. "బ్రహ్మాభ్యాసులు" అని పిలువబడే అట్టివారు అనేకయుక్తులను ఆశ్రయిస్తూ, శాస్త్రావలోకనం చేస్తూ ఈ జ్ఞాతృజ్ఞేయముల ("Knower" and "that being known") యొక్క అత్యంత 'అభావము'ను పరిగ్రహించుచున్నారు.

ఓ ప్రియమైన లీలా! వాస్తవమేమిటో చెప్పుచున్నాను, విను. సృష్ట్యాదియందు దృశ్యము లేదు. ఇప్పుడూ లేదు. మరింకెప్పుడూ కూడా లేదు. అందుచేత "ఈ జగత్తు గాని, నేను-నీవు-అను పదార్థములు గాని లేవు" .... అనునట్టి జ్ఞానమునే "బోధాభ్యాసము" అని అంటున్నాం. ఈ విధంగా "దృశ్యము అసంభవము" అని గ్రహించిన తరువాత, పరమాత్మయందు ఆసక్తి స్వయముగానే కలుగుతుంది. అట్టి ఆసక్తియే "బ్రహ్మాభ్యాసము" అని కొందరు, "భగవద్భక్తి" అని మరికొందరు చెప్పుచూ ఉంటారు. పుత్రీ! "రాగ-ద్వేష క్షయము" అనునది సాధించుకోకుండానే, "మేము బ్రహ్మమును అభ్యసిస్తాం" అంటే ప్రయోజనం ఏముంటుంది. అట్టి ప్రయత్నములు రాగ-ద్వేషములు త్యజించనంతవరకు మూఢములు, తాపదాయకములు, దుఃఖకారకములే అయివుంటాయి. "దృశ్యము అసంభవము" అనునట్టి బోధనే (ఉపనిషత్తులు మొదలైన) శాస్త్రములు "జ్ఞానము, జ్ఞేయము" అని వ్యవహరిస్తున్నాయి. అట్టి అభ్యాసమే ఉత్తమమైన అభ్యాసము. దానినే 'నిర్వాణము' అని కూడా అంటున్నారు. వేసవికాలం వచ్చిన తరువాత మంచు-వర్షం ఉంటుందా? "నిరంతర వివేకాభ్యాసము" యొక్క ప్రభావంచేత ఈ చిత్తమునందు వర్షిస్తున్న సంసార- వ్యవహారమంతా రూపనామాలు లేకుండా తొలగిపోతుంది. నిద్రలేస్తే ఇక స్వప్నదృశ్యం ఎదురుగా ఉండి ఉంటుందా? ఉండదు కదా!

❖❖❖

(నాలుగవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

ఐదవ రోజు

15. ఇతఃపూర్వానుభవ సృష్టి

శ్రీ వసిష్ఠమహర్షి : ఆ రాత్రి ఆ విధంగా లీలాదేవి, సరస్వతీదేవి సంభాషించుకొంటున్నారు. అంతఃపురంలోని పరిజనులంతా గాఢనిద్రాపరవశులై ఉన్నారు. ఆ ప్రక్కనే పద్మని దేహము వాడని పూలతో కప్పబడియున్నది. అక్కడే వారిద్దరు (లీలా-సరస్వతులు) సమాధిని ఆశ్రయించి నిశ్చల శరీరులయ్యారు. వారి వదనములు ఒకానొక కాంతితో ప్రజ్వరిల్లుచున్నాయి. వారి ఇంద్రియ వ్యాపారములన్నీ స్తంభమున చెక్కబడిన శిల్పము యొక్క అవయవములవలె కట్టుబడ్డాయి.

వారిద్దరు సూక్ష్మభావమును పొందారు. నిర్వికల్పసమాధిని ఆశ్రయించి బాహ్య జ్ఞానమును త్యజించివేశారు. "నేను-నీవు-దృశ్యజగత్తు ... అనునదంతా మిథ్య" అని వారిద్దరిచే గ్రహించబడుటచే వారి చిత్తము నుండి దృశ్యపిశాచి తొలగిపోయింది. చూచావా, రామచంద్రా! ఈ 'జగత్తు' ఎంతగా ఘనీభవించి ఈ జీవుని మభ్య పెడుతోందో!

ఆ ఇద్దరు దృశ్య-దర్శన భావము నుండి విడివడినవారై, శూన్యమగు ఆకాశము వలె శాంత భావము వహించారు. జ్ఞప్తిదేవతయగు ఆ సరస్వతీదేవి వాస్తవానికి 'అశరీరి' అయినప్పటికీ, తన భక్తురాలి బుద్ధిని సునిశితం చెయ్యటానికి జ్ఞానమయమగు సూక్ష్మశరీరం దాల్చినది. ఆ లీలాదేవి "భౌతికదేహాభిమానము" లేనట్టి సూక్ష్మ శరీరముగా అవధరించినది. ఆ విధంగా, వారు ధ్యాన-జ్ఞాన మయమగు ఆతివాహిక దేహము అవలంబించి సంచరించసాగారు. పరిమితగృహాకాశము నుండి చిదాకాశ స్వరూపమును గ్రహించినవారై, పూర్వజ్ఞానము ననుసరించి "చిత్‌వృత్తి" సహాయంతో విహరించసాగారు.

వారి ఇప్పటి శరీరములు పాంచభౌతికము కాదు. అయినప్పటికీ, పూర్వ సంకల్పముతో కూడిన మనస్సు కలవారగుటచే, పరస్పర స్నేహదృక్కులతో ఒకరినొకరు వీక్షిస్తూనే ఉన్నారు.

❖

వారు చేతులు కలుపుకొని దూర-సుదూర ప్రదేశాలు దాటుకుంటూ, నభోమండలం వీక్షించసాగారు. అక్కడి ఆకాశమండలము ఒక ప్రశాంత-మహాసముద్రంలాగా అతి విస్తీర్ణముగా, గంభీరంగా, నిర్మలంగా కోమలంగా ఉన్నది. అది చిత్తమునకు ఆహ్లాదం కలిగిస్తూ సుందరంగాను, సుఖదాయకంగాను ఉన్నది. తమ ప్రయాణంలో మధ్యమధ్య వారిద్దరు దేవతల సౌధములలో విశ్రమించారు. మరికొంతసేపు శూన్యపథంలో ప్రయాణించుచు, అనేక జగత్తులు దాటారు. ఎన్నో లోకములు, ఎన్నో జగత్తులు కూడా ఆ ఆకాశపు 'శూన్యత్వము'ను ఏమాత్రం నింపలేకే పోతున్నాయి. కొన్నిచోట్ల సురాసురులు సంచరిస్తున్నారు. కాని, వారు ఒకరినొకరు గుర్తించలేకే పోతున్నారు. మరికొన్ని చోట్ల కూష్మాండ రాక్షస-పిశాచమండలములను కూడా వారు గమనించారు. మరికొన్ని

చోట్ల ఢాకినులు నృత్యం చేస్తున్నారు. ప్రళయమేఘాలు గల ప్రదేశాలు, కిన్నెర– గంధర్వ – దేవతా స్త్రీలు గానం చేస్తున్న ప్రదేశాలు, రుద్రపురములు, బ్రహ్మ పురములు చూచారు. ఇంకా మాయా నిర్మితమైన పట్టణాలు, కదలికలే లేని సరోవరాలు, సిద్ధులు వచ్చిపోయే స్థానాలు, చీకటి రాత్రులచే ఆక్రమించబడిన ప్రదేశాలు, పగలు మాత్రమే ఉన్న ప్రాంతాలు చూచారు. ఈ విషయములన్నీ వారు గమనిస్తూ సాగిపోతున్నారు. మధ్యమధ్యలో ఆకాశమండలమున విశ్రమిస్తున్నారు. జ్ఞప్తిదేవియగు సరస్వతీ జగన్మాత కల్పనా బలమును అనుసరించే ఆయా భూమి ప్రదేశములను చూస్తూ వెళ్ళుచున్నారు.

❖

ఓ రామచంద్రా! ఈ భూమండలము "బ్రహ్మాండము యొక్క హృదయపద్మమా?" అని అనిపిస్తోంది కదా! అష్టదిక్కులచే ఆవరించబడిన ఈ భూమిపై ప్రాణికోట్లు దోమల గుంపువలె ఉంటున్నారు. దీనిచుట్టూ దీనికి మూడింతలు లవణసముద్ర మున్నది. దానికి రెండింతలు శాకద్వీపం, దానికి రెండింతలు క్షీరసముద్రం ఆవరించి ఉన్నది. దానికి రెండితలు 'కుశద్వీపం'. ఆ ద్వీపం చుట్టు 'దధిసముద్రం' ఆవరించి ఉన్నది. దానికావల క్రౌంచ ద్వీపం. దానినావరించి ఘృతసముద్రం, దాని చుట్టూ గోమేధిక ద్వీపం, దానికావల ఇక్షు సముద్రం, దానిచుట్టూ పుష్కరద్వీపం, అక్కడ చుట్టు మంచినీటి సముద్రమున్నది. ఆ తరువాత ఒక బిలము ఉన్నది. అది పాతాళమునకు దారి తీస్తోంది. దానికి ఆవల పదిరెట్లు విస్తీర్ణముగల అరణ్యం ఉన్నది. ఆ అరణ్యంలో జీవరాశి లేదు. ఆ తరువాత అగ్నిజ్వాలలు, వాయు ప్రవాహం, శూన్యాకాశం, బ్రహ్మాండ కుడ్యము–ఇవన్నీ కూడా, ఒకదానికంటే మరొకటి పదిరెట్లు ఉండి ఉన్నాయి. ఇవన్నీ దాటి ఆ ఇరువురు వనితలు 'గిరి' అను గ్రామం ఉన్న భూమండలం చేరారు.

❖

క్రమంగా వారు 'వసిష్ఠుడు' అనబడు బ్రాహ్మణుని గృహంలో ప్రవేశించారు. ఆ ఇల్లు ఉత్సవరహిత నగరంలాగా, దుఃఖముతో నిండియున్న స్త్రీలాగా, కూలిన వృక్షంలాగా ఉన్నది. గృహపాలకులు లేకపోతే అంతేకదా!

అప్పుడు నిర్మల జ్ఞానము పొందియున్నప్పటికీ ఆ లీలాదేవి కొంత అజ్ఞానముచే ప్రభావితమవటం జరిగింది. ఉబలాటం అణచిపెట్టుకోలేక ... "ఇక్కడ ఉన్న నా బంధువులు నన్ను, ఈ సరస్వతీదేవిని చూడగలుగుదురు గాక!" అని తన చిత్తమున సంకల్పించినది. అంతే ... ఆ ఇంటిలోని బంధువులు ఆ ఇద్దరిని ఎదురుగా చూడగలిగారు. వారి రాకచే ఆ గృహములోని దుఃఖమంతా మటుమాయమైంది. వాతావరణమంతా అత్యంత ప్రకాశవంతమైనది. వారి చల్లని చూపులు అనే అమృతం చేత అక్కడి వారందరు పరమానందం పొందారు. ఆ గృహము యొక్క పెద్ద కుమారుడు అయినట్టి జ్యేష్ఠశర్మ వారిద్దరికి పుష్పాంజలి సమర్పించి పాదములకు నమస్కరించాడు.

❖

జ్యేష్ఠశర్మ : ఓ వనదేవతలారా! సుస్వాగతం. మీకు జయమగు గాక! మీరాకచే మా దుఃఖాలన్నీ ఒక్కసారి పటాపంచలు అయ్యాయి. సాధుజనులైనవారు దుఃఖజనుల ఆర్తిని పోగొట్టుటే అభ్యాసముగా కలిగివుంటారు. అందుచేతనే మీరిద్దరు మా ఈ గృహమును పావనం చేశారు.

శ్రీ సరస్వతీదేవి : నాయనా! ఈ గృహములోని వారంతా ఏదో దుఃఖమును పొందినట్లున్నారు. కారణమేమిటి? మీకు వచ్చిన కష్టమేమిటి?

జ్యేష్ఠశర్మ : అమ్మలారా! ఈ ఇల్లు ఎల్లప్పుడూ అతిథులకు ఆశ్రయమై, బ్రాహ్మణ మర్యాదలకు ఆధారమై ఉండేది. దీనులు ఇక్కడి ప్రేమ-సహకారములచే ఆనందము పొందుతూ ఉండేవారు. మా తల్లి-తండ్రులు ఈ ఇంట్లో సంచరిస్తూ ఉంటే, ఈ పరిసరమంతా దేవలోకంలోని నందనవనంలా ఉండేది. ఎనిమిది రోజుల క్రితం మా తల్లితండ్రులు మా గృహం విడచి స్వర్గస్తులయ్యారు. ఇంకేమున్నది? మాకీ మూడు లోకములు శూన్యములే అయ్యాయి. నాలుగు – ఐదు రోజుల క్రితం వారి దేహాలకు దహనసంస్కారాలు చేశాము. అటు చూడండి. ఆ పెంపుడు పక్షులు ఇంకా మా తల్లి-తండ్రుల మృతదేహములను గుర్తు తెచ్చుకొని కరుణతో రోదిస్తూనే ఉన్నాయి. అవి అశ్రుధారలతో తమ అమితదుఃఖమును వెలిబుచ్చుచున్నాయి. ఈ గిరి గ్రామ వాసులంతా ఇంకా నెత్తి-నోరు బాదుకొని దుఃఖిస్తూనే ఉన్నారు. కొందరు బంధువులు బ్రతకాలని లేకపోవుటచే తిండిని కూడా మానివేశారు. వీథులు నిర్మానుష్యమయ్యాయి. ప్రకృతి కూడా రోదిస్తోంది. ఆ దుఃఖముచే మా అంగములు సత్తువను కోల్పోయాయి. పుష్ప సుగంధం దుర్గంధంగానే తోస్తోంది. మా తల్లిదండ్రులు వచ్చి ఉండటంచేత కాబోలు – స్వర్గనరకవాసులు సంతోషంతో విద్యాధరగానం చేస్తున్నారు. మీవంటి మహాత్ముల దర్శనం వృథా అవుతుందా? లేదు. మీరు మా దుఃఖమును తప్పక పోగొట్టగలరని నేను అనుకొంటున్నాను.

❖❖❖

16. విస్తార దృష్టి

అది వింటున్న లీలావతి సరస్వతీదేవి వైపు అర్థయుక్తంగా చూచింది. పుత్రుడు జ్యేష్ఠశర్మ నుదురు ప్రేమగా స్పృశించింది. ఆమె హస్తస్పర్శచే అతడు "దుఃఖము" అనే దురదృష్టము నుండి క్షణంలో విడివడ్డాడు.

శ్రీ రామచంద్రుడు : హే మహర్షీ! వసిష్ఠా! ఇప్పుడు నాదొక చిన్న సందేహం. ఆ లీలావతి తన ఇతఃపూర్వపు జన్మకు సంబంధించిన పుత్రుడగు ఆ జ్యేష్ఠశర్మకు తన ఇతఃపూర్వపు రూపముతోనే కనబడి ఉండవచ్చును కదా! అట్లు ఎందుకు చేయలేదు?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రాఘవా! ఈ నేల మొదలైన పదార్థములను చూస్తున్నప్పుడు, భౌతికదృష్టితో చూస్తున్నవారికి ఇక్కడ అనేక పదార్థములు, నీవు-నేను వంటి అనేక విశేషములు ఉన్నట్లు కనబడుచున్నాయి. జ్ఞానదృష్టి గలవారికి, (ఉత్తమమగు ఆత్మదృష్టిని అభ్యాసయోగముచే అవలంబించిన

వారికి)... ఇదంతా 'పరమాకాశము' గానే కనబడుతోంది. పాంచభౌతిక దృష్టి బలవత్తరమై ఉన్నంత వరకు అసత్పదార్ధములు (అనగా, వాస్తవమైన ఉనికి లేనివి) కూడా సత్పదార్ధమువలె తోచుతాయి. 'మాయ' యొక్క చమత్కారం అదేమరి! ఒక బాలుడు బేతాళదృష్టితో చీకట్లోకి చూచినప్పుడు అతనికి ఆ చీకట్లో ఉన్న బండరాయో, చెట్టో బేతాళుని ఆకారముగానే దర్శనమిస్తోంది. "అసలు బేతాళుడు (దయ్యము) అనబడే పదార్ధమే ఉండదు" అను దృఢదృష్టితో చూస్తే, అక్కడ బేతాళుడే ఉండదు. "ఇది స్వప్నము" అను జ్ఞానం కలిగిన తరువాత ఇక స్వప్న పదార్ధములకై "అవి ఎక్కడ ఉన్నాయి?" అని వెతుకువాడెవ్వడు? అదే విధంగా జాగ్రత్ అవస్థయందు కూడా! "ఆత్మవిషయ జ్ఞాన దృష్టి"చే, ఇక్కడి పదార్ధములన్నీ 'మిథ్య' గానే గోచరిస్తాయి. పైత్యరోగముచే విచలితమైన మనస్సు గలవానికి ఈ పరిసరమంతా గిఱ్ఱున తిరుగుచున్నట్లు తోచుచున్నది. సత్యజ్ఞానము, సమగ్రమైన అవగాహన లేనివాడే "సంసారము" అనబడుదానిని చూస్తున్నాడు. అనుభవిస్తున్నాడు, "ఈ భూమి మొదలైనవన్నీ 'భావన-భావికుడు'ల పరస్పర సంబంధమును అనుసరించి మాత్రమే ఉంటున్నాయి. స్వతహాగామాత్రం ఇదంతా ఆకాశసదృశమే" అను బుద్ధి పెంపొందించుకున్నవారికి ఇవన్నీ ఆ రీతిగానే గోచరిస్తాయి.

స్వప్నంలో కనబడే ఆకాశము, భూమి, జనులు మొదలైనవన్నీ శూన్యమే రూపముగా కలిగి యున్నవి కదా! స్వప్నంలో ఒకడు చూచు సుందరస్త్రీ శూన్యరూపమే. అయినప్పటికీ, ఆ స్వప్నానుభవము, 'స్ఖలనము' మొదలైన ప్రభావములు ఈ బాహ్యదేహమునందు కలిగింపజేయుచున్నది. అదేవిధంగా ఆకాశమునందు "ఇది పృథివి" అనునట్టి జ్ఞానము కలిగినప్పుడు, అది అట్లే పృథివి మొదలైన పదార్ధములుగా దర్శనమిస్తోంది. బాలుడు స్వల్పములగు ఆటవస్తువులలో మహత్తరమైన విశేషములు గాంచుచున్నాడు. మరణించబోవువాడు తనచుట్టు జలపాతమును, వాయు ప్రహారమును అనుభవించటం జరుగుతోంది. ఒకానొకడు మూర్ఛలో పరలోకములను గాంచు చున్నాడు. కొందరు పిచ్చివారు తమ ఎదురుగా ఏవేవో జ్ఞాపకములకు సంబంధించిన జనులను, పదార్ధముల ఆకారములను గాంచుచున్నారు. చక్షురోగము కలవాడు ఒక్క వ్యక్తినే అనేకమందిగా చూస్తాంటాడు. వారికి ఇవన్నీ అజ్ఞానావేశం ఉన్నప్పుడు వాస్తవముగానే అనిపిస్తూ ఉంటున్నాయి.

దీనిని బట్టి నీవు గ్రహించవలసినది ఏమిటి? ఈ జగత్తులోని పదార్ధ సమూహముల ఆకారము లన్నీ కల్పన యందే ప్రతీతమై ఉంటున్నాయి. వాస్తవానికి వీటికి ఎట్టి ఆకృతి లేదు. కనుక ఈ దృశ్యమంతా 'భావన-భావించువాడు' అను రెండిటి మధ్య ఏర్పడి ఉన్న సంబంధం యొక్క ప్రకటనయే.

❖

ఇక మనం లీలాదేవి విషయానికివస్తే, ఆమె "పృథివి-శరీరములు" మొదలైన వాటినన్నిటినీ 'అసత్తు' గానే గ్రహించుచున్నది. "చిదాకాశమే భ్రాంతి బలం చేత నానారూపములను దాల్చుచున్నది" అని ఆమె స్పష్టముగా గాంచుచున్నది. "ఇదంతా చిదాకాశ స్వరూపమగు బ్రహ్మమే" అని గ్రహించినట్టి మననశీలునకు, ... ఈ "నా కొడుకు – నా స్నేహితుడు – నా భార్య – నా జాతి" అను పరిమిత

భావనలు వీగిపోతాయి. అసలీ దృశ్యపదార్థములు ఏక్షణంలోను ఉత్పన్నమై ఉండలేదు. నీవు చూచేదంతా జన్మరహితమగు బ్రహ్మమేసుమా! సంపూర్ణ జ్ఞానం కలిగిన తరువాత ఇక రాగద్వేషాలు, అహంకార-మమకారాలు ఉంటాయా? ఉండవు.

శ్రీరాముడు : మరయితే స్వామి! ఆ లీలావతి జ్యేష్ఠశర్మను ఎందుకు ప్రేమగా స్పృశించింది?

శ్రీ వసిష్ఠమహర్షి : అదా? అది అతనికి తత్త్వజ్ఞానము కలుగటం కొఱకే. ఆ స్పర్శ అతనికి ప్రాప్తించటం పూర్వజన్మల ప్రయత్నముల ప్రయోజనమే అయివున్నది. అంతేగాని లీలకు "ఇతడు నా పుత్రుడు. నాకు చెందినవాడే. ఇతనిని నేను కలిగియుండెదను గాక" అనునట్టి బుద్ధి లేదు. అందుచేతనే ఆమె అతనికి ఇతఃపూర్వపు మాతృరూపంలో దర్శనం ఇవ్వలేదు.

ఓ రాఘవా! 'బోధ' అను జ్ఞానానుభవం నీయందు ఉదయించిందా .... ఇక ఆపై నీకు సర్వేసర్వత్రా ఆకాశముకంటే కూడా అత్యంత సూక్ష్మమగు విశుద్ధ బ్రహ్మ పదార్థమే గోచరిస్తుంది. నాయనా! ఈ జాగ్రత్ పదార్థములు, స్వప్నమునందు చూడబడుచున్న పదార్థములు, సంకల్పపురమున అనుభవించబడేవి ... ఇవన్నీకూడా బ్రహ్మమే కాని, ఇంకేమీ కావు.

ఇక మనం మరల లీలాదేవియొక్క మరొక జన్మకు సంబంధించిన విశేషములకు వద్దామా?

❖❖❖

17. జన్మ - జన్మాంతరదృష్టి

అప్పుడు లీలా-సరస్వతులు ఆ గిరి గ్రామములోని బ్రాహ్మణ గృహములో ఉంటూనే అదృశ్యరూపులయ్యారు. ఆ గృహములోని జనులు "ఆహా! వనదేవతలు మన మీద అనుగ్రహంతో దర్శనమిచ్చి మాయమయ్యారు కదా!" అని అనుకొన్నారు. ఆ సంఘటనను తమతమ అనుభవరీతుల ననుసరించి మరలమరల చెప్పుకొన్నారు. దుఃఖములను త్యజించివేశారు. తమతమ పనులయందు ఇతఃపూర్వమువలె నిమగ్నులయ్యారు.

లీల-సరస్వతులిద్దరూ ఆ గృహమండపాకాశంలోనే లీనమై సూక్ష్మరూపమున ఉండి ఉన్నారు కదా! లీలాదేవి .... తాను గిరి గ్రామంలో ఆ ఇంటి ఇల్లాలుగా అనేక సంవత్సరములు ఉండివుండటం, తన మరణం ఎనిమిది రోజుల క్రితమే జరిగి ఉండటం, ... మొదలైనవిషయాలన్నీ చూచి చాలా ఆశ్చర్యపడింది. కొంచెము విచలితభావంతో ఉన్న లీలను చూచి సరస్వతీదేవి చిరునవ్వు చిలికించింది.

❖

శ్రీరాముడు : మహర్షీ! వారిద్దరు అశరీరులు కదా! ఎట్లా సంభాషించుకొంటున్నారు? ఎక్కడ సంభాషించుకొంటున్నారు?

మహర్షి : స్వప్నంలోను, సంకల్పమునందు జరిగే సంఘటనలు ఎట్లా జరుగుచున్నాయి? ఎక్కడ జరుగుచున్నాయి? అందు శరీరములు ప్రవర్తించటం లేదుకదా! అట్లే సూక్ష్మ శరీరమాత్రులగు

వారిరువురి సంభాషణలు కూడా కార్యరూపము పొందుచున్నది. భౌతిక శరీరము, నాడీ ప్రాణములు లేకున్నప్పటికీ స్వప్న-సంకల్పాలలోలాగానే వారిద్దరి మధ్య సంభాషణా రూపమగు జ్ఞానము ఉండియే ఉన్నది.

❖

శ్రీ సరస్వతీదేవి : ఓ లీలా! మనం ఇక్కడికి వచ్చినందుకు ఏది తెలుసుకోవాలో, అదంతా తెలుసుకున్నావు. నేను నీ జన్మాంతరవిషయమై చెప్పిన దానికి నిరూపణను గ్రహించావు కదా!

'బ్రహ్మసత్త' స్వరూపమే ఇదంతా! అజ్ఞానం ఉన్నంతకాలం జగద్భ్రమ కలుగుతూనే ఉంటుంది. జ్ఞానోదయమైన మరుక్షణం జగత్తు ఉండదు. దృశ్యము ఉండదు. అప్పుడు "స్వసత్తసామాన్యము" (All pervading Absolute self) అను స్థితియే శేషించుచున్నది. ఈ జీవులందరు స్వతఃగా మోక్ష స్వరూపులే అయినప్పటికీ, నిష్కారణంగా స్వకల్పితమోహంచేత భ్రమాత్మకమైన జగత్తును అనుభవించుచున్నారు. మరల ఒకానొకప్పుడు జ్ఞానోదయమగుటచే నిదురలేచి, ఇదంతా క్షణంలో కాకతాళీయంగా త్యజించివేస్తున్నారు. ఏది తమ వాస్తవస్వరూపమైయున్నదో అట్టిదానియందు సుస్థిరులై, 'జగద్వినాశనము'ను అనుభవించుచున్నారు. ఇంతకుమించి ఇందు ఏమీ విశేషం లేదు. ఇప్పుడు చెప్పు. ఈ విషయంలో ఇంకా నీకేమైనా సందేహాలు ఉన్నాయా?

లీలాదేవి : హే లోకపావనీ! నేను ఇతఃపూర్వం నాభర్త పద్మని యొక్క తదనంతరం జీవుడు (విదూరథుడు) రాజ్యమేలుచున్న చిదాకాశ నగరానికి వెళ్ళి ఉన్నాను కదా! అక్కడివారు నన్ను చూడలేకపోయారేమిటి? కాని ఇక్క డ "నేను వీరికి కనబడెదనుగాక" అని సంకల్పించగానే జ్యేష్ఠశర్మ, తదితర బంధువులు నన్ను చూడగలిగారు. అప్పుడుకూడా "వీరు నన్ను చూడటం జరిగితే వీరితో నేను సంభాషించెదను" అను రూపముగల ఇచ్ఛ ఉండేది సుమా!

శ్రీ సరస్వతీదేవి : ఓహో! అదా! అప్పటికి నీకింకా అభ్యాసం దృఢం కాలేదు. "నేను రాజపత్నియగు లీలాదేవిని" అనే ద్వైతభావము నీయందు గాఢంగా మిగిలియే ఉన్నది. ద్వైతము ఉన్నంతవరకు అద్వైతకర్మ యొక్క ప్రయోజనం లభించదు. ఎండలో నిలబడి "నాకు చల్లగా లేదేమిటి? అక్కడ చల్లగా ఉన్నది కదా" అంటే ఎట్లా? అభ్యాసం లేనంతకాలం "నేను లీల" అని పిలవబడుచున్న శరీరమాత్రమును" అను దృఢభావం తొలగదు. అందుచేతనే నీకు అప్పుడు సత్యసంకల్పము ఉదయించలేదు. నీవు కోరుకున్నప్పటికీ అప్పటి సభలో సమావేశమైయున్న నీ పతి, తదితర సభికులు నిన్ను చూడనేలేకపోయారు. ఇక ఇప్పటి విషయానికి వస్తే, "నేను 'శరీరము' అనబడు నిర్వచనముచే బంధింపబడజాలని నిష్కళంకచైతన్య తత్త్వమును, ఆత్మైక్యస్వరూపమును" అనునట్టి దృఢానుభవం మరికొంతగా బలపడియున్నది. అందుచేత, సత్యసంకల్పురాలవయ్యావు. అనగా, నీవు దేనిని ఎట్లు భావన చేస్తావో, అది ఆ రీతిగానే అనుభవమౌతోంది. "ఇతఃపూర్వపు జన్మయందలి ఈ నా పుత్రుడు నన్ను గాంచుగాక" అనునట్టి నీ అభిలాష ఇక్కడ నెరవేరింది. ఇప్పుడు నీవు నీభర్త వద్దకు వెళ్ళి ఇట్లే సంకల్పిస్తే నిన్ను అతడు తప్పక చూడగలడు.

లీలాదేవి : ఆహా! ఈ బ్రహ్మాండముల కల్పనావ్యవహారమంతా ఎంత చిత్రంగా ఉన్నది! గిరి గ్రామంలోని ఈ మందిరాకాశం (Space pertaining to this house) లోనే ఈ బ్రాహ్మణుడు (వసిష్ఠుడు) నా భర్త అయ్యాడు. మరల ఇక్కడే అతడు తన వసిష్ఠదేహమును త్యజించి, "పద్ముడు" అను రాజై విస్తారమైన రాజ్యమును పాలిస్తూ నన్ను అలరించాడు. మేమిద్దరం డెబ్బది ఏండ్లు దాంపత్యం చేశాము. ఈ అంతఃపురంలోనే అతడు మృతి చెందాడు. మరల ఈ అంతఃపురంలోనే వేరైన జనపదంలో విస్తారమైన సామ్రాజ్యానికి చక్రవర్తి అయి విదూరథనామ ధేయంతో రాజ్య మేలుచున్నాడు. ఒక చిన్నకాయలో అనేక వేరువేరు ఆవగింజలు ఉన్నట్లు, ఈ గృహాకాశంలో వేరువేరైన బ్రహ్మాండాలు అనేకం వర్తిస్తున్నాయన్నమాట. అమ్మా! ఏమి ఈ సృష్టి చమత్కారం!

ఇదంతా గమనిస్తుంటే, "ఇప్పుడు మనం నా భర్త ఉండి ఉన్న చిదాకాశ జగత్తుకు సంబంధించిన అంతఃపురానికి అత్యంత సమీపంలోనే ఉండి ఉంటాము కదా!" అని అనిపిస్తోంది. హే జగజ్జననీ! నేను నా భర్తయొక్క వ్యవహారసత్తనంతా ఇక్కడ ఉండే చూడగలిగేటట్లు అనుగ్రహించు. నా భర్తను విడచి నేను ఉండగలనా చెప్పు?

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! భూతల అరుంధతీ! నీకు అనేకమంది భర్తలు ఉండి ఉన్నారు. ఇప్పుడు మనం చూస్తున్న వ్యవహారం దృష్ట్యా కూడా ముగ్గురు ఉన్నారు. వారిలో మొదటివాడు 'వసిష్ఠుడు' అను బ్రాహ్మణుడు. అతడు భస్మమై 'పద్ముడు' అనుపేరుగల రాజయ్యాడు. అతని శవమే నీ అంతః పురంలో పుష్పగుచ్ఛములతో కప్పబడియున్నది కదా! అతడే ఈ సంసారమున 'విదూరథుడు' అను పేరుతో గొప్పరాజ్యం ఏలుచున్నట్లు చిదాకాశరూపిణివై నీవు వీక్షించావు. ఇప్పుడు విధూరథుడు 'సంసారము' అనబడే మహాసముద్రజలంలో పడి భ్రాంతుడై కొట్టుకుంటున్నాడు. భోగసమూహాలలో పడి వికలుడై ఉన్నాడు. 'మహాతమస్సు'లో మునిగిపోయి ఏవేవో రాచకార్యములను అత్యంత విశ్వాసముతో నిర్వర్తిస్తూ భ్రమనుండి మేల్కొనటం లేదు.

ఓ వనితా! ఇప్పుడు చెప్పు. సుగంధ కణములు గాలిచే ఒకచోటినుండి, ఇంకొక చోటికి తీసుకొని పోబడినట్లు, నీవు ఇప్పటికి అనేక దేహములలో ప్రవేశించియున్నావు. మరల వాటిని త్యజించావు. ఆయా జన్మలలో అనేక మంది బంధువులు ఉండి ఉన్నారు. "నాభర్త, నేను చూడాలి-నేను దూరమై ఉండలేను" అను ఆవేదన వెలిబుచ్చుచున్నావు కదా? అనేక జన్మలు చవిచూచినట్టి నీవు "నా భర్త" అని చెప్పుచున్నది ఎవరి గురించి? ఇప్పుడు నిన్ను నేను ఎక్కడికి తీసుకుపోవాలి?

ఈ 'సంసారము' అనునది ఒక తీరుగా ఉంటోంది. మరల బ్రహ్మాండముల విషయానికి వస్తే, అవన్నీ మరొక తీరుగా ఉంటున్నాయి. ఈ వ్యవహార పరంపరలన్నీ చైతన్యము యొక్క స్వయం కల్పితములే కదా! అందుచేత జ్ఞానదృష్టితో పరికించి చూచినపుడు ఈ సంసార మండపములన్నీ నీ ప్రక్కనే, ఎదురుగానే ఉన్నాయి. అట్లా కాకుండా, సంసార దృష్టితో చూస్తే ఒకదానికి మరొకటి కోటానుకోట్ల యోజనముల దూరంలో ఉన్నాయి. జ్ఞానదృష్టికి ఇవన్నీ ఆకాశస్వరూపములే కదా! నీ ఇతఃపూర్వపు అసంఖ్యాకమైన జన్మలన్నీ ఇట్టివే. సూర్యకిరణములందు అనేక త్రసరేణువులు

(కాంతి రేణువులు) ఉదయిస్తున్నట్లు (కిటికీగుండా ఇంట్లో ప్రవేశించే సూర్యకిరణములలో అట్టి త్రసరేణువులను మనం గమనించవచ్చు) కనబడటం లేదా? ఆ మహాచైతన్యము నందు గల ప్రతి పరమాణువునందు అనేక సృష్టిసమూహములు వికసించుచున్నాయి. ఈ బ్రహ్మాండ సమూహముల సృష్టి అంతా మహాకష్టతరంగా, గొప్ప ఘనీభూత స్వభావంతో ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తున్నప్పటికీ ... పరమార్థ దృష్టితో చూస్తే ఇవన్నీ కలిపి 'మట్టిగింజ' అంతకూడా ఉండవు. రకరకాలైన రత్నములను ఒకచోట ఉంచామనుకో ... అప్పుడు ఆ గుట్ట నుండి బయల్వెడలే రంగురంగుల కిరణముల సమన్వయం ఒక అరణ్యమువలె గోచరిస్తుంది. అట్లాగే ఈ జగత్తులు కూడా మాయవల్లనే ఇట్లు కనిపిస్తున్నాయి. జ్ఞాన చింతనతో చూచినప్పుడు ఈ 'పృథివి' మొదలైనవన్నీ శూన్యరూపములుగానే కనిపిస్తాయి.

"భ్రాంతి" వలన మాత్రమే ఆత్మయందు జగద్వ్యవహారమంతా స్ఫురిస్తోంది. వాస్తవానికి పృథివి మొదలైన పంచభూతజాలమంతా 'సృష్ట్యాది' యందే లేవు. ఆహా! సరోవరంలో తరంగాలు మాటిమాటికీ లేచి లీనమౌతాయి చూచావా? అట్లే "జ్ఞానచైతన్యము" అనే తటాకంలో దేశ-కాలముల పట్ల ఏర్పడుచున్న "అనుభవములు" అనునవి అనేక విభాగముల రూపంలో సంసారతరంగాలుగా లేస్తున్నాయి. మరల లీనమైపోతున్నాయి.

లీలాదేవి : హే వాణీ! హే సర్వార్థశోభితా! నీ కరుణాప్రభావంచేత నా ఇతఃపూర్వపు అనేక జన్మలను ఇప్పుడే - ఇక్కడి నుండే చూడగలుగుచున్నాను. నీవు చెప్పుచున్నదంతా వాస్తవమేనని నాకు తెలియవస్తోంది. ఈ నా వర్తమాన జన్మ సాత్వికము కాదు. తామసికము కూడా కాదు. ఇది రాజసమైనదానివలె నాకు గుర్తుకు వస్తోంది*.

బ్రహ్మమే స్వరూపముగా కలిగి, బ్రహ్మమునుండి వెలువడినట్టి నేను నానా విధములైన యోనులలో జన్మించాను. ఇతఃపూర్వము ఎనిమిది వందల జన్మలు ఎత్తినట్లు ఇప్పుడు స్పష్టంగా గాంచుచున్నాను. ఒకప్పుడు ఒక విద్యాధరిని అయ్యాను. చెడ్డకోరికలచే కలుషిత మనస్కురాలనై మనుష్య జన్మనెత్తాను. మరల ఇంకొక సంసార మండపంలో 'నాగరాజపత్ని (సర్పరాజభార్యను)' అయ్యాను. ఆ తరువాత ఒక ఆటవిక స్త్రీనై ఆకులు ధరించి అడవులలో సంచరించాను. ఆ జన్మలో మానవునకు ఉండవలసిన దయ - దాక్షిణ్యములను వదలటంచే ఒక వనంలో పూలతీగనై జన్మించాను. అయితే, పుణ్య ప్రదమైన మునుల ఆశ్రమములో ఉండుటచేత, అగ్నిచే దహింపబడిన నేను ఆ మునికి కూతురునై పుట్టాను. అప్పటి పుణ్యకర్మల ప్రభావంచేత ఒక రాజునై నూరేళ్ళు ఉన్నాను. కాని రాజుగా నేను నిర్వర్తించిన పాపముల ప్రభావం చేత 'ముంగిస'నై పుట్టాను. ఆ తరువాత ఒక ఆవునై ఎనిమిదేళ్ళు గడిపాను. ఒక పక్షినై బోయవానికి చిక్కి, అతని వలలోంచి ఎట్లాగో తప్పించు కొన్నాను. తుమ్మెదనయ్యాను. ఒక లేడినై ఒకానొక బోయవాని చేతిలో మరణించాను. ఆ తరువాత

---

* లీలాదేవి ఇక్కడ తాను ఎట్టి మానసిక ప్రవృత్తిచే వర్తమాన జన్మపొందటం జరిగినదో గాంచగలుగుచున్నది; లేక గుర్తు చేసుకోగలుగుచున్నది.

'చేప'నై నీటిలో తేలియాడుచు, ఒక తాబేలు వీపుపై షికార్లు కొట్టాను. ఆ సమయంలో ఒకసారి ఒక జాలరి దెబ్బ తప్పించుకొని నీటిలోకి ఉరికాను కూడా!

అటు తరువాత కిరాత స్త్రీనై జన్మించి కొబ్బరికల్లు త్రాగుచూ ఉండేదానను. మరుజన్మలో ఒక సారసపక్షిగా జన్మించాను. ఆపై స్వర్గలోకంలో 'అప్సరస'గా జన్మించి యువకులతో రతిక్రీడలందు నిమగ్నమైనాను. ఆ తరువాత ఒక తాబేలునై పుట్టి చాలా రోజులు జీవించాను. చెట్టుపై రాజహంసనై కొన్నాళ్ళు ఊయలలూగాను. అప్పుడు ఒక బూరుగు చెట్టుపై అటు–ఇటూ ఊగుచూ దోమలను చూచి, ఆ దోమల పట్ల గల బుద్ధి కారణంగా దోమనై పుట్టాను. అటుపై ఒక లతనై జన్మించి కొండ వాగు యొక్క జలప్రవాహంచేత క్రిందకు–పైకి ఊగుతూ ఉండేదానిని. ఆ తదుపరి విద్యాధర పురంలో పుట్టాను. ఆహాఁ! హే జగన్మాతా! వింటున్నావా? ఎండమావులలో నీరు ఉన్నదని భ్రమించి ఒక లేడి పరుగులు తీస్తుంది చూచావా? నేను కూడా అనేక దుఃఖ భరితములైన జన్మలు ఎత్తాను. ఎంతటి భ్రమ, ఎంతగా అనుభవించానో చెప్పలేను! ఆ వేదన, పరితాపం వర్ణనాతీతమనే చెప్పాలి.

❖❖❖

18. బ్రహ్మాండ భ్రాంతి

శ్రీరాముడు : ఆ లీలయొక్క జన్మలు బహుచమత్కారంగా ఉన్నాయి. అనేకమంది జీవుల పరంపరలు ఇట్టివేనని నాకు అర్థం అవుతోంది. అయితే మహాత్మా! ఆ బ్రహ్మాండము కోటి యోజనముల విస్తీర్ణం వ్యాపించి వజ్రమువలె కఠినమై ఉన్నదని అనుకొన్నాంకదా! ఆ స్త్రీలిద్దరూ బ్రహ్మాండములను ఛేదించి ఎట్లా బయల్వెడలారు?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! నీ ప్రశ్న బాగానే ఉన్నదయ్యా! కాని, బ్రహ్మాండము లెచట? వజ్రత్వమెక్కడ? వారిద్దరు ఆ అంతఃపురాకాశంలోనే ఉన్నారు సుమా! ఆ గిరి గ్రామంలోని గృహాకాశంలోనే 'వసిష్ఠుడు' అను పేరుగల బ్రాహ్మణుడు ఉండి ఉన్నాడు కదా! అదే శూన్యాకాశంలో పద్ముడై గొప్ప రాజ్యమును కూడా ఏలాడు. ఆ అరుంధతి రాణి అయి రాజ్యమును అనుభవించింది. ఆ లీల అనబడే రాణి సరస్వతీదేవిని ఆరాధించి, ఆమె కరుణచే, ఆ గృహాకాశంలోనే ఆమెతో కూడి మనోహరమైన ఆకాశ మండలమును దాటింది. వారిద్దరూ ఆ పరిమిత గృహాకాశంలోనే ఇంకొక బ్రహ్మాండమునకు పయనించటం చేస్తున్నారు. ఇదంతాకూడా .... ఒక నిద్రలోని స్వప్నము నుండి మరొక నిద్రలోని స్వప్నమున ప్రవేశించటం వంటిదే!

అందుచేత, ఇదంతా భ్రాంతిమాత్రమేనని గ్రహించు. వాస్తవానికి 'ఆకాశము' తప్పితే వేరొక వస్తువేలేదు. "బ్రహ్మాండము – సంసారము – దూరము" అను పదజాలమంతా మిథ్యయే. వాసనా ప్రభావం చేతనే వారిద్దరి చిత్తమునందు ఆయా మనోహర దృశ్యములన్నీ ప్రతిఫలిస్తున్నాయి. వాసనలే లేకుంటే, బ్రహ్మాండములెక్కడ? సంసారమెచ్చట? వారి చిత్తము యొక్క చమత్కృతి చేత చిదాకాశము ఆవరణసహితమైన బ్రహ్మాండమువలె కల్పించబడినది. చిదాకాశము సర్వత్రా, సర్వదా

జన్మరహితముగా శాంతముగా వెలయుచున్నదని గ్రహించు. చిదాకాశము తనయందు తానే 'జగత్తు' రూపమున ప్రకాశిస్తోంది. ఈ తత్త్వము గ్రహించినవారికి ఈ కనబడే జగత్తంతా ఆకాశము కంటే కూడా అత్యంత శూన్యముగా కన్పట్టుచున్నది. అట్లు కొందరు గ్రహించ గలుగుచున్నారు. ఇక మరికొందరో,.... గ్రహించలేకపోవుచున్నారు. ఎందుచేత? అజ్ఞానమే అందుకు కారణం. అట్టి అజ్ఞానానికి ఇదంతా వజ్రమువలె దృఢంగా కన్పట్టుచున్నది.

స్వప్నంలో నగరములు, బంధుజనులు ఆ స్వప్నసమయంలో వాస్తవమైన వాటివలెనే అనుభవమౌతాయి కదా! కాని అవి సత్యమా? కాదు. అసత్తే అయివున్న ఈ సంసారము కూడా చిత్పదార్థము నందు సత్తువలె ప్రతిభాసిస్తోంది. విశాలమైన ఎడారిలో కనబడే ఎండమావులలోని జలజ్ఞానం వాస్తవం కాదుకదా! బంగారంలో ఆభరణత్వమున్నదా? ఆత్మయందు ఈ దృశ్య సమూహములు అసత్తు అయివుండి కూడా సత్తువలె అగుపిస్తున్నాయి.

❖❖❖

19. పూర్వస్మృతులు

ఆ విధంగా లీలాదేవి పూర్వజన్మలను, అందలి కొన్ని సంఘటనలను జ్ఞానదృష్టిచే దర్శిస్తూ నెమరువేస్తోంది. వారట్లు సంభాషించుకొంటూ గిరి గ్రామంలోని బ్రాహ్మణ గృహంలోంచి బయటకు వచ్చారు. వారికి ఎదురుగా ఆ గ్రామంలో విశేషాలన్నీ కనబడుచున్నప్పటికీ, వారు మాత్రం ఎవరికీ కనబడటం లేదు. అప్పుడు ఎదురుగా వారికి ఒక పెద్దకొండ కనిపించింది. ఆ కొండలపైగల అడవిలో విచిత్ర వృక్షాలు, పక్షులు, సెలయేళ్ళు చిత్రమైన ధ్వనులను వినిపిస్తున్నాయి. లీలాదేవిలో తన పూర్వజన్మ జ్ఞాపకాలు పెల్లుబకసాగాయి. సరస్వతీదేవి అది చిరునవ్వుతో గమనిస్తూ లీలను తీసుకొని గ్రామమంతా సంచరించ సాగింది.

ఊరికి చివరిగా ఉన్న దట్టమైన వృక్షసమూహము నుండి పక్షుల కిలకిలారవాలు వినిపిస్తున్నాయి. పొలములన్నీ సస్యశ్యామలంగా ఉన్నాయి. మేకలను, పశువులను ఊరిచివర మేపుతున్న బాలురు కొందరు ఒక తాడిచెట్టు క్రిందకు చేరి చద్ది మూటలను విప్పుతూ, పైన కావుకావు మంటున్న కాకులకు భయపడి కాబోలు, జున్ను ముక్కలను ఒడిలో దాచుకొంటున్నారు. ఆ చుట్టుప్రక్కల గల అడవిబాటలలో నిస్సహాయులగు కొందరు బిచ్చగాళ్ళు తమ జీర్ణవస్త్రములతో వచ్చే-పోయే బాటసారులను యాచిస్తూ సంచరిస్తున్నారు. సోమరులు కొందరు వీథులలోని అరుగులపై కూర్చుని త్రోవలో వచ్చే పోయే వారితో సరసవిరసాలు చేస్తున్నారు. పాలు-పెరుగు వాసనలకు కాబోలు, కొన్ని ఇళ్ళలో ఈగలు వెట్టిగా ముసురుతున్నాయి. గుడిసెల ముందు పిల్లలు ఒంటికి మట్టిని పూసుకొని ఆడుకొంటున్నారు. ఒక ఇంటి ముందు ఒక వనిత కళాపి చల్లి ముగ్గులు వేస్తూ సహచరులతో పరిహాసాలాడుతోంది. ఆవులు 'అంబా' అని అరుస్తున్నాయి. అనేక విచిత్రమైన అలంకరణలతో కొన్ని గృహాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

'శాంతి' మొదలైన సాధన సంపత్తిగల ఆత్మజ్ఞానిని భోగమోక్షాలు సమీపించి పావనం చేసినట్లు, ఆ ఇద్దరు వనితలు గ్రామంలో సంచరిస్తూ ఆ చోటులను పావనం చేస్తున్నారు. అభ్యాస వశంచేత జ్ఞానమయదేహం ధరించిన లీలాదేవి అక్కడ సంచరిస్తూ కూడా పూర్వజన్మల జనన మరణములను, భూత–భవిష్యత్–వర్తమాన కాలముల స్థితి గతులను, ఈ సంసారము యొక్క రచనా చమత్కృతుల గురించి యోచిస్తూ ఆశ్చర్యచకితు రాలగుచున్నది.

❖

లీలాదేవి : హే వాగ్వాణీ! విశ్వేశ్వరీ! నీ అనుగ్రహంచేత ఈ దేశమును చూస్తున్న నేను ఈ క్షణంలో ఒకప్పుడు ఇక్కడి నా జన్మలోని విశేషాలన్నీ స్మరించగలుగుచున్నాను.

ఇక్కడ నేను 'అరుంధతి' అను పేరుగల బ్రాహ్మణినై జన్మించిన విషయమంతా ఇప్పుడు నాకు గోచరమవుతోంది. నా శరీరము అప్పుడు జీర్ణమై, శుష్కమై, మలినమై ఉండేది. ఎండు దర్భలను చీల్చే అభ్యాసంచేత నా అఱచేయి మోటుబారి ఉండేది. ప్రతిరోజు కవ్వముతో మజ్జిగ చిలుకుతూ ఉండేదానను. నాకు అనేకమంది సంతానం ఉండేవారు. మేము అతిథులను, దేవతలను, ద్విజులను, సాధువులను భక్తితో సేవిస్తూ ఉండేవారము. ఆ విధంగా దేహమున్నంత వరకు పనిపాటలతో గడిపాను. ఎప్పటికప్పుడు ఏదో పనితొందరే. అందుచేత "త్వరగా .... త్వరగా ...." అంటూ పని వాళ్ళను అదలిస్తూ ఉండేదానను. నా భర్త కూడా ఛాందసుడై ఎప్పుడూ ఏవేవో పనులలో మునిగి – తేలుతూ ఉండేవాడు. చిత్రం చూచావా? అప్పుడు, "మేమెవరము? ఈ సంసారము ఎట్టిది?" అనునట్టి ప్రశ్నలు మాకు కలలో కూడా తట్టలేదు. క్రమంగా నా శరీరం శుష్కించింది. బొమికలు బైటపడ్డాయి. అయినా సరే, అట్లాగే దుప్పటి కప్పుకొని కూరలు, కట్టెపుల్లలు, పేడ ప్రోగుచేస్తూ ఉండేదానను. ఆ పనిలో ఎంత శ్రద్ధ, ఆసక్తి, ఆవేశం చూపేదాననో మాటలలో వర్ణించలేను.

ఎప్పుడైనా కొంచెం పనిలేకపోతే ఆవు–దూడల చెవులలో పురుగులు తొలగించేదాన్ని. అప్పుడప్పుడు ఆకు–కూరమళ్ళకు నీరు కట్టడానికి పాలేర్లను పురమాయించేదాన్ని. అదిగో, ఆ ఇల్లు చూచావా? ఆ ఇంటి గడపలకు ఎన్నిసార్లు రంగులు దిద్దానో! నా మర్యాద అతిక్రమించకుండానే అక్కడ ఇప్పుడు పనిచేస్తున్న ఆ సేవకులను అదమాయించేదాన్ని. ఈ విధంగా చాలాకాలం గడిచింది. ఇంతలో ఎక్కడి నుండో వృద్ధాప్యం వచ్చిపడింది. నా చెవులు, తల ఉయ్యాలలాగా ఊగుతూ ఉండేవి. అబ్బా! వార్ధక్యం ఎంతటి దుర్భరమైనది! ఒక్క జ్ఞానులను మాత్రమే ముసలితనం బాధించదేమో!

అమ్మా! వాఙ్మయీ! అదుగో. ఆ పుష్పవనం చూచావా? ఆ అశోకవృక్షాల మధ్య ఉద్యాన మండపం ఉన్నది కదా! ఆ ప్రక్కనే చెఱువుగట్టుపై కట్టబడియున్న దూడ నా కళ్ళ ముందే కొద్దిరోజుల క్రితం పుట్టింది. దానికి 'కర్ణిక' అని పేరుపెట్టి ముద్దుగా పిలుస్తూ ఉండేదానను. అది నా వియోగదుఃఖం భరించలేక కాబోలు 'అంబా' అని ఇంకా అరుస్తూనే ఉన్నది. ఈ పరిచారికలకు చెప్పిచెప్పి అలసిపోవలసిందే. వీళ్ళు ఈ దూడ గురించి పట్టించుకోరేం? పాపం వాళ్ళు మాత్రం ఏమిచేస్తారు? నా వియోగం చేత ఇంకా దుఃఖిస్తూనే ఉన్నారు కాబోలు. వాళ్ళ కళ్ళు వాచి ఉన్నాయి చూచావా?

నేను ఎటైనా వెళ్ళితే ఒక్కపని సరిగా జరుగదు కదా! ఇక్కడే రోజూ వచ్చి కూర్చుండేదానను. ఎండవేళ ఇక్కడ నీడలో కాస్త నడుంవాల్చేదాన్ని. చక్కటిగాలి వీస్తుంటే క్షణంలో కునుకు పట్టేది. ఇక్కడే నీళ్ళు తాగేదాన్ని. ఆ చెక్క వస్తువుల అమరిక చూచావా? అదంతా తీర్చిదిద్దేది నేనే! అటు చూడు. వాడు మా పెద్దపిల్లవాడు జ్యేష్ఠశర్మ. వాడు పాపం అలసి అలసి ఉన్నాడు. నేను లేకపోతే నా పిల్లలు ఎన్ని పాట్లు పడుచున్నారో కదా! ఈ వనంలో మా పాడి ఆవులు ఇంకా తిరుగుచూనే ఉన్నాయి.

ఈ మా ఇల్లు చూచావా! శరీరానికి ఐదు ఇంద్రియాలు ఉన్నట్లు, మా ఇంటికి ఐదు ద్వారాలు ఉన్నాయి.

సరస్వతీ దేవి, లీల చెప్పేదంతా మౌనంగా, చిరునవ్వుతో "ఊఁ" కొడుతూ వింటోంది.

❖

ఈ మా ఇల్లు అంటే ఎంత ఇష్టమో! అయినా ఏం లాభం? ఇప్పుడు ఎండవేడిమికి చౌడుబారి ఉన్నది. దొడ్లో అంత పేడ దొరుకుచుండగా, చక్కగా అలకవచ్చునుకదా! ఈ పనివాళ్ళు దగ్గరుంటే గాని మాట వినరు. ఈ ఇల్లు నా రెండవ శరీరమువంటిది సుమా! దీనిపై నేను పెంచిన ఆనపపాదును చూచావా? దీని విత్తనాలు మా బంధువుల ఇంటినుంచి చెప్పించాను. తయారైన ఆనప (సొర) కాయలను వీళ్ళు సరిగ్గా కోస్తున్నారో? లేదో? లేకపోతే, పాడైపోతాయి కదా! పాదుకు నీళ్ళు పోయమని కూడా నేను చెప్పాలి.

అక్కడ తిరుగుచున్న వాళ్ళందరు ఎవరో తెలుసా? వాళ్ళందరు ఆయా ఊళ్ళ నుంచి వచ్చిన మా బంధువులే. అదేమిటి? వీళ్ళ ఆభరణములన్నీ ఏమైనాయి? ఓహో! నేను మరణించాననే దుఃఖంతో వీళ్ళు తమ ఆభరణములన్నీ త్యజించి రుద్రాక్షమాలలు ధరించారా? నా వలన ఎన్ని కష్టాలు ఈ ఇంటికి వచ్చాయి? నా ఈ ప్రియమైన బంధువుల కళ్ళు నిరంతర రోదనంచేత ఎఱ్ఱబడ్డాయి. వీరికి సదుపాయాలన్నీ సక్రమంగా జరుగుచున్నాయో? లేదో? ఈ మా గృహమండపం ఆవలవున్న నదిని చూడు. ఈ నది ఒడ్డున చెట్లు నేలకు వంగి ఉన్నాయి. వాటి కొమ్మలు నేలకు వ్రాలి చివరలు నదీజలమును తాకుతున్నాయి. చూచావా? ఆ తాటిచెట్లకు తాటిపండ్లు సమయానికి కోసుకోకపోతే ఎండిపోతాయి. ఈ పనివాళ్ళు ఏమిచేస్తున్నారో? వీళ్ళకి తిండి ఘనంగా కావాలి. పని విషయాలు పట్టించుకోరు!

❖

సరస్వతీదేవి ఆ మాటలన్నీ వింటూ పకాపకా నవ్వింది. మరుక్షణం లీలాదేవి తన వాగ్ధోరణి పూర్వసంస్కారములను ఆశ్రయించటం గుర్తించి తానుకూడా కొద్దిసేపు నవ్వుకొని, మరల చెప్పసాగింది.

నా భర్త వసిష్ఠుని జీవాత్మ ఈ గృహాకాశంలోనే వెలసియున్నది. అతడు స్వతఃగా ఆత్మ స్వరూపుడే కదా! అనగా నిష్క్రియుడే కదా! అయితే ఏం? ఇప్పుడు విదూరథ మహారాజై, గొప్ప సామ్రాజ్యమునకు ఆధిపత్యం వహిస్తున్నాడు.

ఔను! ఇప్పుడు నాకొక విషయం బాగా గుర్తుకు వస్తోంది. నా భర్త వసిష్ఠ బ్రాహ్మణుడు "నేను మహారాజును అయితే ఎంత బాగుంటుంది!" అని ఎప్పుడూ నాతో అంటూ ఉండేవాడు. "ఏమిటి నీ చాదస్తం! నీవేమిటి? రాజు కావడమేమిటి?" అంటూ నేను కొంచం హాస్యం పట్టించేదాన్ని. అతని వాంఛాబలం చేతనే కాబోలు, ఇప్పుడు ఎనిమిది రోజులలో మహాచక్రవర్తి అయ్యాడు. ఏమి ఆశ్చర్యం! ఆకాశంలో వాయువు – ఆ వాయువులో సుగంధం ఈ మూడు ఒకదానిని మరొకటి తాకవు. కాని, ఒకదానిలో మరొకటి అదృశ్యస్థితిలో ఉండి ఉంటాయి కదా! నా భర్తకూడా ఈ గృహాకాశంలో అదేవిధంగా రాజ్యపాలనలో తలమునకలై ఉన్నాడు. మాయ ఎంతటి చమత్కార పూరితమైనది! వ్రేలెడెంత ఉండే ఈ గృహాకాశంలో కోటానుకోట్ల యోజనముల విస్తీర్ణము గల మహా సామ్రాజ్యమును చూచుచున్నాడు. మేమిద్దరం ఆకాశస్వరూపులమే కదా! నా భర్త పాలించే రాజ్యం కూడా ఈ గృహమండపా ఆకాశమునందే ఉన్నది. కాని స్వకీయమైన కల్పనా మహిమవలన వేలకొలది పర్వతములతో నిండి ఉన్నట్లు అగుపిస్తోంది. హే లోకమాతా! ఇప్పుడు నా భర్త యొక్క స్థితిని, రాజ్యపాలనను తిలకించాలని కోర్కె కలుగుతోంది. కాబట్టి మనిద్దరం ఆ రాజ్యమునకు వెళ్ళుదామా! ప్రయత్నవంతులకు కష్టమైన కార్యమేముంటుంది?

❖❖❖

20. అన్య జగత్ పునః ప్రవేశం

విఘఘ్నియగు సరస్వతీదేవి అందుకు చిరునవ్వుతో అంగీకరించింది. వారిద్దరు ఆ గృహంలోని ఆకాశమండలమున ప్రవేశించారు. మేఘమార్గమును, వాయుపథమును, సూర్యచంద్రమార్గములను, ధ్రువలోకమును, సిద్ధ–సాధ్య–భూ–స్వర్గ–బ్రహ్మలోకములను అధిగమించారు. శివలోకం, విష్ణులోకం, విదేహులు–సదేహులు ఉండే లోకములను దూరప్రదేశములను దాటివేస్తూ ఉండగా, ఇంతలో ఒకానొక క్షణంలో లీలాదేవి తన అపరిచ్ఛిన్న స్వరూపమును విస్మరించింది.

ఒక్కసారి వెనుకకు చూచింది. వెనుకగా ఎక్కడాకూడా సూర్య–చంద్ర–నక్షత్ర–గ్రహాదులు కనబడనేలేదు. అభేద్యమైన చీకటి మాత్రమే కనబడుతోంది. ఆ చీకటి నలుదిక్కులా వ్యాపించియున్నది.

లీల : మాతా! ఇదేమిటి? సూర్యచంద్రాదుల తేజము ఏమాత్రం కనబడటం లేదేం? ఈ కొండవలె ఘనీభూతమైన చీకటి ఎక్కడి నుండి వచ్చింది?

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! మనం సూర్యచంద్రాదుల తేజము చొరలేనంతదూరం వచ్చేశాం. అందుకే అవి మనకు కనిపించటం లేదు. లోతైన నూతిలో అట్టడుగులో ఉండి చూస్తే భూమిపై ఉన్న మిణుగురుపురుగు – మెఱుపులు కనిపిస్తాయా?

లీల : ఓహో! సూర్యుడు ఒక అణువులాగా కూడా కనబడనంత దూరం వచ్చేశామా? ఎంత ఆశ్చర్యం? ఓ తేజోస్వరూపిణీ! ఇంకా మనం ఎంతదూరం పయనించాలి? ఎటు వెళ్ళుచున్నాం? ఎంత సేపు?

శ్రీ సరస్వతీదేవి : ఇక మనకు "బ్రహ్మాండ కర్పరము" అగుపడబోతోంది. సూర్య-చంద్ర- నక్షత్రములు ఆ బ్రహ్మాండ కర్పరము నుండి లేచిన ధూళికణముల వంటివారే సుమా!

❖

వారిద్దరు అట్లు సంభాషించుకొంటూ బ్రహ్మాండమండపం చేరారు. దానిని వారు ఒక శూన్య ప్రదేశం దాటినట్లు దాటివేశారు. దేనిపట్ల ఎవరికి సత్యత్వబుద్ధి ఉంటుందో అది మాత్రమే వారికి వజ్రంలాగా కఠినమై అగుపడుతోంది.

క్రమంగా శుద్ధ చిత్తులగు ఆ ఇద్దరు బ్రహ్మాండము వెలుపల గోడవలె ఆవరించియున్న జల ప్రదేశాన్ని దాటారు. దానికంటే పదిరెట్లు మంచుచే చర్మమువలె కప్పియున్న చోటును కూడా దాటారు. అటు తరువాత వారు అగ్ని-వాయువు-మేఘ-ఆకాశములను చూచారు. ఇక ఆ ఆకాశము నందు "ఇది ఇక్కడ మొదలు. అది అక్కడ చివర" అనబడునదంతా 'గొడ్రాలి కుమారుడు' అను దృష్టాంతములాగా భ్రమమాత్రమే. అదంతా విశాలము, శాంతము, ఆదిమధ్యాంతరహితము అయినట్టి ఆత్మయందే దర్పణంలోని దృశ్యం వలె వెలయుచున్నదని గ్రహించు. వాస్తవానికి చిదాకాశం నందు ఎట్టి భ్రమలకు తావులేదు. ప్రళయ-వాయువులు కూడా చిదాకాశమును తాకలేవు.

❖

ఆ విధంగా వారు ఆ బ్రహ్మాండ మండలములోని పంచభూత - ఆవరణలన్నీ దాటి వేశారు. పరమాకాశమును దర్శించారు. ఆ పరమాకాశంలో ఈ జగత్తువంటి అండ ప్రమాణంగల అనేక అసంఖ్యాక జగత్తులు ఉన్నాయి. సూర్యకిరణములలోని త్రసరేణువుల (Moles of dust in Sun-beams) వలె వారు అక్కడ అనేక ఆవరణలను కూడా చూచారు. ఇంకొక చిత్రం. ఆ 'మహాకాశం' అనే శూన్యంలోంచి కోట్లకొలది జగత్తులు లేస్తూనే ఉన్నాయి. మరికొన్ని లయించిపోతున్నాయి. కొన్ని నిశ్చలంగా ఉన్నాయి. కొన్నికొన్ని వంకరటింకరగా తిరుగుతున్నాయి. ఇదంతా ఆయా బ్రహ్మాండములందున్న జీవుల జ్ఞానమును అనుసరించే జరుగుచున్నది సుమా!

ఎవరికి ఎచ్చట ఎట్లు ప్రాక్తన (ఇతఃపూర్వపు) వాసనా జ్ఞానం స్ఫురించటం జరుగుతుందో వారికి ఆ తావులలో అట్టి రూపములే కనిపిస్తూ ఉంటాయి. అందుచేత తత్వజ్ఞుల దృష్టిలో ఈ ఊర్ధ్వ-అధో-మధ్య లోకముల కల్పనయే ఉండదు. వారు వాటిని అసద్వస్తువులుగా దర్శిస్తూ స్వసత్తాసహితులై ఉంటారు. స్వసత్తరూపమగు బ్రహ్మము కాక, ఇక మిగిలినదంతా కల్పనా చాతుర్యమునకు సంబంధించినదే కదా! వారు "వచ్చుట-పోవుట-ఉండుట" అను వ్యవహారమంతా అంతరంగమునందు ఏమాత్రం పొందకుండానే ఉంటున్నారు. సర్వత్రా, సర్వదా, స్వస్వరూపముతో బ్రహ్మానుభవమునందే ఉంటున్నారు.

శ్రీరాముడు : పరమాకాశము నిశ్చలము, అద్వితీయము" అని చెప్పియున్నారు కదా! అందులోంచి జగత్తులు పుట్టటమేమిటి? లయించటమేమిటి?

❖❖❖

21. బ్రహ్మాండముల చమత్కారం

శ్రీ వసిష్ఠమహర్షి : ఈ 'జగత్తులు' అనబడునవన్నీ చిదాకాశము కంటే వేరు కాదు. కాని, అజ్ఞానుల దృష్టికి స్వకల్పనా కారణంగా అట్లు పదార్థజాలానుభవంలో ప్రాప్తిస్తున్నాయి. వారి అనుభవమును దృష్టిలో పెట్టుకొనే ఇదంతా చెప్పాను. అజ్ఞానము చేతనే ఈ జగత్తులు ఉత్పన్నమై నశిస్తున్నాయి. దీనికి మనకు దృష్టాంతము బాలుని చిత్తము యొక్క కల్పనా వ్యవహారమే. ఆటబొమ్మలలో "ఇది పెళ్ళికూతురు, ఇది పెళ్ళికొడుకు" వంటి వివాహాదికల్పనల్ని కల్పించి బాలుడు అదంతా వాస్తవమువలె క్రీడించుచున్నాడు కదా! ఈ బ్రహ్మాండముల సృష్టి స్థితి లయాలు కూడా అట్టివే. అవి కల్పనయందే ఉద్భవించి, కల్పన చేతనే నశిస్తున్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ "ఊర్ధ్వ-అధో-తిర్యక్ (పైన-క్రింద-వెనుక)" కల్పనలు, ఈ బ్రహ్మాండములు ఎక్కడినుండి వస్తున్నాయి? ఇవన్నీ అధిష్ఠానమగు బ్రహ్మము నందు స్వతహాగా ఉన్నవి కావు కదా! కాని బ్రహ్మాండములోకి ఈ పైన-క్రింద-వెనుక-ముందు కల్పనలు వచ్చిపడు చున్నాయే? ఈ బ్రహ్మాండముల గురించి మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : రేచీకటి దోషం ఉన్న కన్నులు కలవానికి ఆకాశంలో జడలు కనిపిస్తాయి చూచావా? అవిద్య యందున్న వానికి నాశరహితమగు పరబ్రహ్మము నందు ఈ బ్రహ్మాండములన్నీ అగుపిస్తున్నాయి.

పదార్థములన్నీ ఈశ్వరేచ్ఛను అనుసరించే ప్రవర్తిస్తున్నాయి. అంతేకాని, వాటికి ఎట్టి స్వాతంత్ర్యం లేదు. ఈ మన బ్రహ్మాండంలో పార్థివ (స్థూల) భాగము క్రిందకు, ఆకాశం పైన ఉన్నాయి. జ్యోతిశ్చక్రమును దర్శించునట్టి మహాపండితులు, "ఈ బ్రహ్మాండము ఆకాశమున ఉన్నట్టి మట్టి-ముద్ద వంటిది. దశదిక్కులు దీని 'కాళ్ళు' వంటివి. ఒక చీమ యొక్క దేహంవలె దీని క్రింది భాగంలో భూమండలం ఉన్నది" అని వర్ణిస్తున్నారు.

కొన్ని-కొన్ని బ్రహ్మాండభూములలో మనుష్యులు లేరు. చెట్టు-పుట్టలు మాత్రమే ఉన్నాయి. వాటిలో ఆకాశభాగంలో మాత్రం దేవతలు, కిన్నెరలు ఉన్నారు. మరికొన్ని బ్రహ్మాండములు అప్పటికప్పుడు కల్పించబడినట్టి ప్రాణసమూహములతో, గ్రామములతో, పురములతో, పర్వతములతో ఉత్పన్నములౌతున్నాయి. ఇవన్నీ చిదాకాశము నందే ఉంటూ, అందులోనే లీనమౌతున్నాయి. మంచుగడ్డలు అనేక ఆకారములు సంతరించుకొంటున్నప్పటికీ స్వతహాగా అంతా జలమే కదా! "ఈ సృష్ట - వస్తువులన్నిటికీ ఆత్మవస్తువే కారణం" అని చెప్పబడుతోంది. అదియే అంతా అయివున్నది.

శుద్ధబోధమయమైన చిదాకాశసముద్రంలో "బ్రహ్మాండములు" అనే తరంగాలు నిరంతరం లేస్తున్నాయి. మరల అందులోనే లీనమగుచున్నాయి. భవిష్యత్తులో కూడా అనేక బ్రహ్మాండ తరంగాలు లేవబోతున్నాయి. అందులో కొన్ని, "సంకల్పరాహిత్యం చేత, 'అంధకార' స్వరూపములై శూన్యమునందు నిద్రిస్తూ ఉన్నాయి" అని అనుమానించబడుతోంది. కొన్ని కొన్ని బ్రహ్మాండతరంగాలు కల్పాంత

సూచకమైన ధ్వనులు చేస్తున్నప్పటికీ, విషయరస మోహితులైన ఆ బ్రహ్మాండములందలి జీవుల చెవులకు అవేమీ వినిపించటం లేదు. వారి బుద్ధికి ఏదీ గోచరించటం లేదు.

కొన్ని బ్రహ్మాండములు అప్పుడే ఉద్భవిస్తూ ఉండగా వాటిలో మొట్టమొదటి విశుద్ధములైన జీవసమూహములు లేచుచున్నాయి. మరికొన్ని బ్రహ్మాండములలో మహాప్రళయ సమయం ఆసన్న మగుట చేత సూర్య-చంద్ర-నక్షత్రాదులు భూమిని దగ్ధం చేస్తున్నాయి. భూమి కరిగిపోతోంది. కొన్నిటికి పట్టుకొమ్మ దొరక్క పడిపోతున్నాయి. మరికొన్నిటి యందు లేవవలెననే ఆశ కూడా కలిగియుండటం లేదు. "అట్లు బ్రహ్మాండములు కూలిపోవటం ఎట్లా సంభవం?" అని అనుమానించ వలసిన పనిలేదు. ఇవన్నీ చిద్రూపములే కదా! కనుక బ్రహ్మాండములయొక్క ఉత్పత్తి పతనాలు తప్పకుండా జరుగుచున్న విషయాలే.

కొన్నికొన్ని స్తబ్ధములై ఉన్నాయి. వాయువునందు స్పందము (లేక ప్రసరణ) ఉదయిస్తున్నట్లు "చిత్‌తత్త్వము" (Knowledge consciousness) నందు పైన చెప్పిన కల్పనలన్నీ ఉదయిస్తున్నాయి. అయితే, ఈ బ్రహ్మాండముల నిజస్వరూపమేమిటి? చెపుతాను. విను. పూర్వపూర్వ జన్మలందు ఆచరించబడిన జ్ఞానకర్మాదుల అనుష్ఠానంచేత ఒకానొక ద్రష్ట (లేక జీవుడు) సంకల్పమాత్రంచేత సృష్టిని నిర్మించగల సామర్థ్యం పొందుచున్నాడు. అట్లు "ప్రజాపతి" అయినట్టి ఒకానొకనిచే ఈ బ్రహ్మాండములు నిర్మించబడుచున్నాయి. తత్కారణంగా ఈ కల్పమున ఉన్న సృష్టికి, ముందు-ముందు రాబోయే కల్పములందు ఏర్పడబోయే సృష్టులకు భేదం ఉంటే ఉండవచ్చు. ఈ విషయం శాస్త్రాలు కూడా అంగీకరిస్తున్నాయి.

కొన్ని బ్రహ్మాండములు బ్రహ్మదేవుడు రచించాడు. మరికొన్నిటిని విష్ణువు కల్పించాడు. ఇంకొన్నిటిని ప్రజాపతులు రచిస్తున్నారు. కొన్నింటికి కర్తయే లేడు. అందుచేత అవి వృక్షాదులతో మాత్రమే ఉన్నాయి. అందు బుద్ధిజీవులు లేరు. కొన్ని బ్రహ్మాండములు కొందరు కలిసి విచిత్రంగా సృష్టిస్తున్నారు. కొన్ని బ్రహ్మాండముల సమూహం ఏకైక నియమము ననుసరించి ప్రవర్తిస్తున్నాయి. కొన్నిటిలో సృష్టియే లేదు. కొన్నిటిలో మానవులు మాత్రం లేరు. మిగతావన్నీ ఉన్నాయి. కొన్ని పాషాణములతో మాత్రమే నిండివున్నాయి. కొన్నిటినిండా క్రిములు మాత్రమే ఉన్నాయి. కొన్నికొన్ని కేవలం దేవతలతోను, మరికొన్ని కేవలం మనుష్యులతోను, ఇంకొన్ని ఈ రెండిటితోను నిండి ఉన్నాయి. కొన్నిట్లో చలనములేని జంతువులు మాత్రం ఉన్నాయి.

ఓ రాఘవా! ఇట్టివేయైన సృష్టులతో నిండిన బ్రహ్మాండములు ఇంకా అనేకం ఉన్నాయి. వాటివాటి వ్యవహారాదులు యోగుల ఊహలకు కూడా అందనంతటివి. అవన్నీ శూన్యమునందే ఉండి మహాకాశస్వరూపమై వ్యవహరిస్తున్నాయి. విష్ణువు మొదలైన దేవతలు కూడా తమ జీవితమంతా వెచ్చించినప్పటికీ వాటి పరిణామము తెలియజాలరు. ఆభరణములలో రత్నములు పొదగబడినట్లు, ఈ బ్రహ్మాండములలో 'భూతాకర్షణశక్తి' ఉన్నది. అందుచేతనే అవి జలము, జీవులు మొదలైన వాటిని కోల్పోకుండా ఉన్నాయి. ఓ మహామతీ! ఈ జగత్తుల విషయం నా దృష్టి పథంలో ఉన్నంతవరకు,

ఇక్కడ మనకు అవసరమైనంత వరకు వర్ణించాను. వాస్తవానికి వాటినన్నిటిని వర్ణించి నేను చెప్పలేను. ఎన్ని లక్షల, కోట్ల బ్రహ్మాండములు ఎన్నెన్ని విభేదములతో ఉన్నాయో ... అదంతా భాషకు, భావానికి అందదని మాత్రం మనం ఇక్కడ చెప్పుకోవచ్చు.

❖❖❖

22. విదూరథుని యుద్ధ విన్యాసం

లీలా-సరస్వతులు ఆ విధంగా కబుర్లు చెప్పుకొంటూ పయనిస్తున్నారు. తాము చూస్తున్న జగత్తుల నుండి మరల వెలువడుచున్నారు. అట్లు పయనిస్తూ హఠాత్తుగా ఒకానొక క్షణంలో లీలయొక్క అంతఃపురంలో ప్రవేశించారు. అక్కడ పద్మని భౌతికదేహం, ఆ ప్రక్కనే సమాధియందు నిమగ్నమైయున్న లీలాదేవి శరీరం ఉన్నాయి. అక్కడ ఉన్న వారందరు కలతనిద్ర అనుభవిస్తున్నారు. లీలాదేవి అచ్చటికి వెళ్ళాలనే ఇచ్ఛ కలిగి ఉన్నంతమాత్రంచేత వాళ్ళిద్దరు అక్కడికి వచ్చారు. మరల అతికొద్ది సేపట్లో లీల సరస్వతీ దేవితోసహా బ్రహ్మాండ కర్పమును భేదించి భర్తయొక్క సంకల్పమయ సంసారంలో ప్రవేశించింది.

❖

ఆ సమయంలో సింధురాజు తన సర్వ సైన్యముతో సహా విదూరథుని (క్రితం ఉపాధిచే లీలాదేవి భర్త పద్ముడు) రాజ్యంపై దండెత్తి ఉన్నాడు. అక్కడ గొప్ప యుద్ధం జరుగుతోంది. భూత, పిశాచ, రాక్షసగణాలు రక్తమాంస పిపాసతో యథేచ్ఛగా యుద్ధభూమిలో సంచరిస్తున్నాయి. మునులు ఆ భయంకర యుద్ధం చూచి లోకశాంతి కొరకు దేవస్తవం పఠిస్తున్నారు. ఎందరో వీరులు నేలకూలుచున్నారు.

❖

శ్రీరాముడు : ఓ వసిష్ఠమహర్షీ! ఎట్టి భటుడిని 'వీరుడు' అని అంటాం? ఎట్టి వారు వీరస్వర్గమునకు అర్హులౌతారు?

శ్రీ వసిష్ఠమహర్షి : శాస్త్రానుకూలమైన ధర్మయుద్ధం ఆచరించే ప్రభువు యొక్క ప్రయోజన నిమిత్తం యుద్ధంలో ప్రావీణ్యం చూపేవాడే వీరుడు. అట్టి ప్రయత్నంలో ప్రాణములు త్యజిస్తే అట్టివాడు వీరస్వర్గం అలంకరిస్తున్నాడు. శాస్త్రవిరుద్ధంగా సంచరించే ప్రభువు కొరకు పోరాడి మరణించినవాడు స్వర్గానికిపోడు. అతడు నరకమును పొందుచున్నాడని, అట్టివాడు ఉత్తరోత్తర వేదన- రోదనలను పొందుచున్నాడని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. 'ధర్మరక్షణ' అను ప్రవృత్తిగల రాజు కొరకు, గోబ్రాహ్మణహితము కొరకు, మిత్రుని కొరకు, శరణాగతులను రక్షించటం కొరకు యుద్ధంచేసి మరణించేవాడు స్వర్గమునకు ఆభరణమే అగుచున్నాడు.

స్వదేశరక్షణార్థం పోరాడి మృతి చెందే రాజు, అతని భటులు కూడా స్వర్గమునకు వెళ్ళుచున్నారు. అట్లాకాకుండా, ప్రజాపీడనం చేస్తూ, పరరాజు కొరకు పోరాడుతూ మరణించేవాడు నరకమునే

పొందుచున్నాడు. ఒకడు రాజు కావచ్చు. మరెవ్వరైనా కావచ్చు. శాస్త్రవిరుద్ధంగా ఆచరించువాని కొరకు పోరాడి మృతిచెందితే నరకపతనం నిశ్చయం. అధర్మయుద్ధమత్తులై ప్రాణులను చంపి పాపమే మూటకట్టుకొంటున్నారని నేను గుర్తు చేస్తున్నాను. "శూరుడు ఎటువైపు, ఏ స్థితిలో యుద్ధం చేసి మరణించినా స్వర్గమే చేరుకొంటాడు" అను ఒక అభిప్రాయం లోకంలో ప్రచారంలో ఉన్నది. కాని, "శాస్త్రప్రవచనం ప్రకారం ధర్మయుద్ధం ఒసరించినవాడు మాత్రమే స్వర్గం చేరుతాడు" అని చెప్పబడుచున్నది. సదాచార పరాయణులగువారిని రక్షించటానికి యుద్ధం చేసేవారే శూరులు. ఇక తక్కినవారు చేస్తున్నది బాలుర పోట్లాట వంటిది మాత్రమే. ఆకాశమున చరించు దేవతాస్త్రీలు ధర్మయుద్ధం చేసే శూరులను ఆహ్వానించి గౌరవించటానికి ఉత్కంఠతో సిద్ధంగా ఉంటారు.

❖

ఆ యుద్ధ ప్రదేశంలోని ఆకాశం దేవతాస్త్రీలతో, దేవతా-విమానములతో, ఉత్సవ స్థానమువలె శోభిల్లుతోంది. ఇరువైపు రాజులు యుద్ధరచనలలో తలమునకలై ఉన్నారు. లీలా-సరస్వతులు ఇద్దరూ యుద్ధవిన్యాసం చూడాలనే ఉత్సుకతతో తమ సత్యసంకల్ప ప్రభావంచే ఆకాశంలోనే ఒక విమానం నిర్మించుకొని, అందు అధిరోహించి యుద్ధ విశేషమంతా చూడసాగారు.

ఇరువైపుల మత్స్య-మకరవ్యూహాలు రచించబడ్డాయి. ఆయుధాల తళతళ మెరుపులు, భీకర శబ్దాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. లీలాదేవి తన భర్తయొక్క సైన్యం హింసించబడటం చూచి ఓర్చుకోలేక, "నేను కూడా యుద్ధం చేస్తే ఎంతబాగు!" అనుకొంటూ ఉద్వేగపడుతుంటే, విమానంలో ఆ ప్రక్కనే ఆశీనురాలైన సరస్వతీదేవి గంభీరంగా చిరునవ్వు చిలికిస్తూ తన భక్తురాలిపై చేయి వేసి ఉంచుతూనే యుద్ధం వైపు దృష్టి సారిస్తోంది.

అక్కడ యుద్ధ శబ్దాలు గాక ఇంకేమీ ఎవరికీ వినబడటం లేదు. అనేకమంది సేవక జనం వేలాది మానవ-జంతు కళేబరాలను తొలగించటంలో నిమగ్నమైయున్నారు. అర్ధమృతులు కటిక నేలపై పరుండి మూలుగుచున్నారు. "ప్రళయం దాపురించిందా?" అన్నట్లు యుద్ధ వాతావరణమంతా అతిభయంకరంగా ఉన్నది. "ఓ మిత్రులారా! వీరులారా! విజయమో, వీరస్వర్గమో, అంతే. స్వదేశరక్షణ కొరకు మరణించామా ... ఈ యుద్ధభూమిలోని ధూళిలో ఎన్ని కణాలు ఉన్నాయో అన్ని వేల సంవత్సరములు వీరస్వర్గం అనుభవిస్తాం. మన మాతృదేశపు గడ్డపై జన్మించినవారికి పిరికితనం, భయం గురించి అసలు తెలుసా? లేదు. మన మాతృదేవతలు మనకు చనుపాలలో వీరరసాన్ని ప్రసాదించారు. ఆకాశంలో దేవతాస్త్రీలు మీ వీరత్వము చూచి మురిసి పోతున్నారు. తాము తెచ్చుకొన్న పూలదండలు మీరు చేస్తున్న త్యాగముల ముందు వెలవెలపోవటం చూచి సిగ్గుతో తలవంచుకొంటున్నారు. మనకు వెనుకంజ ప్రసక్తే లేదు. పదండి ముందుకు" అని ఉభయ సైన్యములలోని సేనానాయకులు ఎలుగెత్తి అరుస్తున్నారు. అయినప్పటికీ పిరికిపందలైన కొందరు సైనికులు మాత్రం వెనుకకు మరలుచున్నారు. రక్తప్రవాహం పైనుండి ప్రసరిస్తున్న గాలి దిక్కులను ఎఱ్ఱదనంతో నింపివేస్తోంది. యుద్ధ శబ్దములు, నినాదములు పర్వతగుహలను ప్రతిధ్వనింప

చేస్తున్నాయి. తోటివారు నేలకూలుతుంటే ఇరువైపు సైనికులు వీరావేశం పొందుచున్నారు. దిక్కులు పిక్కటిల్లుచున్నాయి. సైనికులు "మేము ముందర .... మేము ముందర ...." అంటూ యుద్ధభూమిలోకి దూకుతున్నారు. ఇంతలోనే అనేకులు నిహతులగుచున్నారు. ద్వంద్వ యుద్ధాలలో కొంచెం విజయం చవిచూచినవారు హాస్య నృత్యగానాలు చేస్తూ, మరొకవైపుకు ఉరుకుచున్నారు. కొందరు ఆయుధం చేయి జారిపోగా, కోపావేశంతో శత్రువు యొక్క ఖడ్గఘాతానికి ఎదురుచూస్తూ తదితర మృతదేహాలకు నమస్కరిస్తున్నారు. ఉపనాయకుని పోగొట్టుకొన్న కొన్ని సైనిక సమూహాలు ఇతర సమూహములతో జేరి యుద్ధం కొనసాగిస్తున్నారు.

ఈ విధంగా యుద్ధం అతిభీకరంగా సాగుతోంది. ఇంతలో ఎనిమిదవ జాము ముగిసింది. ఉభయపక్ష సేనాపతులు యోచించి యుద్ధమును ఆ రోజుకు ఆపు చేయుటకు తమ దూతలను ఒకరివద్దకు మరొకరు పంపారు. ఇరువైపువారు బాగా అలసి ఉండటం చేత యుద్ధవిరామం అందరికీ అంగీకారమే అయింది. క్షణాలలో ఆ కల్లోలమంతా శాంతించింది. ఉభయ పక్షములకు సంబంధించిన సేవకులు యుద్ధరంగంలో ప్రవేశించి క్షతగాత్రులైనవారిని తీసుకొనిపోతున్నారు. అక్కడ మృత్యుదేవతకు కడుపునిండా మృష్టాన్నము లభించినట్లైనది.

❖

క్రమంగా రాత్రి అవటంచేత అంతటా అంధకారం అలముకొన్నది. ప్రాణులందరు నిద్రితులయ్యారు. రాజమందిరంలో విదూరథుడు మరుసటిరోజు యుద్ధం గురించి మంత్రులతో సమాలోచన చేసి, ఆ తరువాత విశ్రాంతి గైకొనమని ఆజ్ఞాపించి వారినందరిని పంపివేశాడు. తన పానుపుపై పవళించి కళ్ళుమూసుకొని ఒకింత నిదురించాడు.

లీలాదేవి సరస్వతీదేవి ఆకాశమును పరిత్యజించి తలుపు రంధ్రం గుండా రాజగృహంలో ప్రవేశించారు.

❖❖❖

23. స్థూలదేహ భ్రాంతి - చిత్త నైపుణ్యం

శ్రీరాముడు : ప్రభూ! సన్నటి తలుపు రంధ్రం గుండా వారు ఎట్లా రాజగృహ ప్రవేశం చేశారు?

శ్రీ వసిష్ఠమహర్షి : ఆధిభౌతిక భ్రాంతియుతులైన వారు అణుప్రమాణమైన సన్నటి రంధ్రంలో ప్రవేశించలేరన్నమాట నిజమే. "నేను స్థూలశరీరబద్ధుడను. ఒక స్వల్ప రంధ్రంలో నేనెట్లా ప్రవేశించగలను?" అను సంస్కారము కలవారు అట్లు ప్రవేశం చేయలేరు. కాని, స్థూలదేహబుద్ధిని జయించివేసినవారు, "నేను ఆతివాహిక దేహమును. ఆకాశము కంటే కూడా సూక్ష్మాతిసూక్ష్మ స్వరూపుడను" అను నిశ్చయం కలవారు మాత్రం తమ సంస్కారబలంచేత సూక్ష్మ ప్రదేశమునకు కూడా వెళ్ళిరాగలరు. ఏ వస్తువునకు ఏ స్వభావం స్వతహాగా ఉంటుందో, ఆ వస్తువు ఆ స్వభావమును వీడజాలదు. నీరు మెరకవైపు పారుతుందా? అగ్నిజ్వాలలు అధోముఖంగా ప్రజ్వరిల్లుతాయా?

లేదు కదా! "నేను ఈ భౌతిక శరీరమునై ఉండలేదు" అనునట్టి అనుభవపూర్వకమైన 'ఎరుక' గలవారు ఈ పంచభూతతత్త్వమును అధిగమించి ప్రవర్తించగలరు.

అయితే, ఒక్క ముఖ్యమైన విషయం. నీడలో ఉన్నవానికి ఎండవేడిమీ తగలదు కదా! పరమాత్మను తెలుసుకొన్న తరువాత ఎట్టి దుఃఖములు కలిగే ప్రసక్తే ఉండదు. అన్నిటికీ కారణం ఈ చిత్తమే. ఈ చిత్తము శరీరత్వము యొక్క దృఢభావం వదలి చైతన్యమును ఆశ్రయించాలి. అందుకుగాను యోగాభ్యాసాది ప్రయత్నములు చెయ్యాలి. భక్తి-జ్ఞాన- వైరాగ్యాది మార్గాలన్నీ ఈ చిత్తముయొక్క 'స్థూలత్వము' అనే జాడ్యం వదలించుటకొరకే. ఒక త్రాడును చూచి "ఇది పాము" అనే అభిప్రాయాలు, అట్టి అభిప్రాయముల వలన కలిగిన వికటచిత్తవృత్తులు తొలగేదెట్లా? "తెలుసుకొనటం" అను ప్రక్రియ వలననే అది సాధ్యం.

1) త్రాడును చూచి 'పాము' అని భావించటం.

2) "కాదు. ఇది త్రాడు మాత్రమే" అని గ్రహించటం.

పై రెండూ కూడా 'తెలుసుకొనటం' అను రూపముగల జ్ఞానశక్తి వలననే ఏర్పడు చున్నాయి కదా! అందుచేత "జ్ఞానశక్తి మాకింతవరకు పరిచయమైన విషయం కాదు" అని ఎవరూ అనకుండెదరు గాక! ఉత్తమప్రయత్నం ఆశ్రయించాలి. అట్టి ప్రయత్నము వలన స్థూలశరీరబుద్ధి నశిస్తుంది. "చిత్తము సంవిత్తును అనుసరించి ఉన్నట్లే, ప్రయత్నము చిత్తమును ఆశ్రయించి ఉంటుంది" అని సకల జనులు గ్రహించండి.

చిత్తము: మరొక విషయం. స్వప్న పురుషునితో లేక సంకల్పములోని పురుషునితో పోల్చదగిన ఆకాశరూపము గల వానిని ఎవరు ఎట్లు దేనిచే నిరోధించగలరు? 'చిత్తము అనునదే ఆకృతిగా కలిగినట్టి ఆతివాహిక దేహమును నిరోధించకలిగినదేదీ ఎక్కడా ఉండదు. ఈ స్థూలశరీరమే జ్ఞానప్రభావం చేత ఆతివాహిక భావమును పొందుతోంది. ఓ రామచంద్రా! పరమాత్మ యొక్క చిత్తవృత్తులను అనుసరించే ఈ భౌతిక దేహము యొక్క ఉత్పత్తి-లయములు జరుగుచున్నాయి సుమా! "ఈ పంచీకరణమునకు (పంచభూత సమన్వయమైన దేహముల నిర్మాణమునకు) అసలు కారణమేమిటి?" అనునట్టి ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం శాస్త్రకారులు వెతికి, "జ్ఞానస్వరూపమగు చిదాత్మ అజ్ఞానమును అంగీకరించుటయే" అనే సమాధానమును నిర్ణయిస్తున్నారు. ఆ అజ్ఞానమే స్థూలదేహ విభాగము ఒనర్చుచున్నది. వాస్తవానికి "అధిష్ఠానసత్త (the absolute self in which every thing else is placed)"కు వేరుగా ఏదీ ఎక్కడా లేదు. అందుచేత "చిదాకాశము", "చిత్తాకాశము", "మహాకాశము" అనునవి వేరువేరు కావు. అవి వేరుకావని, ఒక్కటేనని గ్రహించుటే "జ్ఞానం". 'జ్ఞానేచ్ఛ'ను అనుసరించే 'జ్ఞానం' ఉదయిస్తోంది. అందుచేత, చిత్తమునందు ఉదయించే శరీరభావమే దృశ్యవస్తువులందు కూడా స్ఫురిస్తోంది.

ఈ చిత్తము అనబడునది అత్యంత సూక్ష్మమైనది. అది త్రసరేణువుల మధ్య అత్యంత సూక్ష్మమై వెలయుచున్నది. ఒక భావమునకు మరొక భావమునకు మధ్య భావాభావములకు కారణమై

వెలయుచున్నది. ఈ చిత్తము ఆకాశము కంటే బాగా అంతర్హితమై ప్రవర్తిస్తోంది. అది అంకురము (మొలచుట అను ప్రక్రియయందు)లో విలీనమై, చిగురాకులందు రసస్వరూపమై వెలయుచున్నది. జలమందలి తరంగంగా, శిలా మధ్యమునందు సౌమ్యంగా, మేఘములలో వర్షస్వభావంగా ప్రవర్తిస్తోంది. తన ఇచ్ఛ వచ్చినట్లు ఆకాశంలో మనగలదు. కొండ గుహలలో ప్రవేశించగలదు. ఆహా! ఈ చిత్తము యొక్క మహిమ ఏమని చెప్పమంటావు? ఇది అనంతాకాశవ్యాపి అయివుండి కూడా, అదే సమయంలో పరమాణువుగా మారగలదు. పర్వతమై దృఢంగా వెలయునది, ఆ పర్వతంపై 'వనము' రూపమున ప్రకటితమయ్యేదికూడా ఈ చిత్త-శరీరమే.

సముద్రజలమునకు ఆ జలం కంటే సుడిగుండములు వేరా? కావు కదా! కోటానుకోట్ల బ్రహ్మాండములు ఉండవచ్చు. కాని అవన్నీ చిత్తము కంటే ఏమాత్రం వేరు కాదు. ఈ 'బ్రహ్మాండములు' అను రూపమును దాల్చుచున్నది ఆ చిత్తాకాశమే. అదియే సృష్ట్యాది యందు ఉద్వేగరహితమైన జ్ఞానస్వరూపముగా వెలయుచున్నది. మరల, అదియే ఆకాశ రూపమున ప్రారబ్ధ కర్మలను అనుసరించు చున్నది. ఎండమావుల పట్ల "ఓహో! అది జలమే" అను జలత్వబుద్ధి ఎందుకు ఉదయి స్తోంది? విచారణ రహితంగా అసత్యమును ఆశ్రయించుటచేతనే కదా! "అతడు గొడ్రాలి రెండవ కుమారుడు" అను అర్ధరహిత ప్రయోగం ఏర్పడుచున్నట్లే చిత్తమునందు 'జగత్తు' అనబడు మహా చమత్కారమంతా జరిగిపోతోంది. వాస్తవానికి ఆకాశాత్మస్వరూపుడే అయినట్టి ఈ జీవుడు తన యందు స్వయంకల్పితంగా ఏర్పడుచున్న భ్రమాత్మకమైన బుద్ధిచే బ్రహ్మాండ రూపుడై విస్తరిల్లుచున్నాడు.

❖

"నేను శరీరమును. కర్మ బద్ధుడను. ప్రారబ్ధకర్మలు నన్ను బంధిస్తున్నాయి. ఈ దృశ్యము లోని ఈ పదార్థములు నేను పొందకపోతే ఎట్లా? ఈ భౌతిక దేహములు నా వారు. ఇక వారో ... పరాయి వారు. ఈ శరీరము క్షీణిస్తున్నప్పుడు నేనే పీడించబడు చున్నాను..."

ఈ జీవుడు ఇటువంటి అనేక అసత్యభావపరంపరలను గాలిలో ఏర్పడే సుడులులలాగా పొందుచున్నాడు. ఫలితంగా, చిత్తము సంకుచితమై ప్రవర్తిస్తోంది. అట్టి సంకుచితత్వము త్యజించ బడినప్పుడు ఈ చిత్తము ఉత్తమోత్తమమైన కల్పనాసామర్థ్యమునే పొందగలదు. అట్టి సామర్థ్యముతో స్వయముగా బ్రహ్మాండములను నిర్మించగలదు. తనకుతానే బ్రహ్మాండమై విస్తరిల్లగలదు.

శ్రీరాముడు : మహర్షీ! మీరు చాలా చిత్రమైన విషయం చెప్పుచున్నారు. మా చిత్తమునకు బ్రహ్మాండమై విస్తరిల్లునట్టి శక్తియున్నదా? అది నూతన బ్రహ్మాండములను కూడా కల్పించగలదా? ఎంత ఆశ్చర్యం! మేము, "ఎవరో కల్పించిన జగత్తులో కర్మల ప్రభావం చేతనో, ఆసక్త్యాదుల కారణంగానో ప్రవేశించాం" అని మాత్రమే అనుకొంటున్నాం. మేము ఈ ప్రకృతి యొక్క నిరంకుశంచే అస్వతంత్రులమై ఉన్నామని భావిస్తున్నాం. ప్రారబ్ధకర్మల చేతిలో కీలుబొమ్మలమై ఉన్నామని నమ్ముతూ వస్తున్నాం. కాని, మీరు చెప్పుచున్న దానినిబట్టి మా చిత్తమునకు మహత్తరమైన ప్రభావం ఉండియే ఉన్నదని తెలియవస్తోంది.

ఇక్కడ నాకొక సందేహం కలుగుతోంది. మా చిత్తములన్నీ వేరువేరు జగత్తులను చూస్తున్నాయా? లేక, ఒకే జగత్తును చూస్తున్నాయా? ఈ కనబడే జగత్తు సద్రూపము (స్వతహాగా అస్థిత్వము కలిగి సత్యమైయున్నది) కాదంటారా? ఎందుచేత? ఎట్లు?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ ప్రియరాఘవా! నేను చెప్పేది నీవు అత్యంత సూక్ష్మబుద్ధితో గ్రహిస్తున్నావు. చాలా సంతోషం. నేను చెప్పేది నిజమే. ప్రతి చిత్తమునకు ఇట్టి అనేక బ్రహ్మాండములు విస్తరిల్లజేయగల శక్తి ఉండియే ఉన్నది. నాయనా! "అసలు ఈ చిత్తము ఎవరికి చెందినది?" అను ప్రశ్నకు మొట్టమొదట సమాధానం తెలుసుకో. "ఆకాశాత్మ స్వరూపుడే తనయందున్న భ్రమతో కూడిన బుద్ధి వలన ఈ విధంగా బ్రహ్మాండమై విస్తరిల్లుచున్నాడు" అని చెప్పాను కదా! అట్టి అసత్యత్వము యొక్క మనన ప్రభావమే 'చిత్తము'గా చెప్పబడుతోంది. కనుక, నీవు-నేను-ఈ సభికులు-భూత భవిష్యత్ వర్తమానమునందలి ప్రతి ఒక్కరు .... చిదాకాశ స్వరూపులమే. తరంగములు లక్షలాదిగా ఉండవచ్చు. కాని జలం సర్వదా ఒక్కటే అయి ఉంటోంది కదా! తరంగములు జలమును భిన్నముగా, ఖండముగా చేయుచున్నాయా? లేదు. అట్లే చిదాకాశము సర్వదా అభిన్నము, అఖండము. చిదాకాశస్వరూపుడే బ్రహ్మాండముగా విస్తరిల్లి, మరల ఆ బ్రహ్మాండములో తననుతాను ఒక వ్యష్టి జీవుని (Individual soul) గా గాంచటం జరుగుతోంది. జలమే మహాసముద్రముగా విస్తరిల్లి, అందు ఆ జలమే లక్షల-కోట్లాది తరంగములుగా ప్రకటితమవటం లేదా? 'వ్యష్టిజీవుడు' అంటే ఎవరు? "నేను బద్ధుడను, నేను శరీరమును, నేను జన్మలు ఎత్తువాడను, నాకు ఇంకే త్రోవ లేదు" అనునట్టి భావావేశమే వ్యష్టిజీవుని రూపము కదా! స్వయముగా అట్టి భావావేశమును, స్వల్పత్వమును తనకు తానే అతడు ఆపాదించుకొంటున్నాడు. కారణం? (స్వయముగా అసత్యత్వ బుద్ధిని అంగీకరించి అద్దానిని అనుసరించుటచేతనే.)

సరే, నీకీ విషయం మరికొంత సుస్పష్టపడటానికిగాను "ప్రళయానంతర సృష్టి" గురించి చెపుతాను. అప్పుడు నిమిషంలో లెక్కకు మించిన జగత్తులు ఎట్లు ఉద్భవించి, విలీనమైపోతున్నాయో గ్రహించగలవు. విను.

❖❖❖

24. ప్రళయానంతర సృష్టి - భ్రమయొక్క 'ప్రవేశం'

ఓ సునిశితమతీ! రామచంద్రా! ఈ జగత్తులో 'మరణము' అనబడే మూర్ఛ అందరు పొందటం మనం చూస్తూనే ఉన్నాము కదా! దీనినే "ప్రళయరాత్రి" అని కూడా అంటూ ఉంటారు. అట్టి ప్రళయరాత్రి గడచిన తరువాత అందరూ కూడా వేర్వేరు సృష్టులను కల్పించుకొనుచున్నారు. మోహబుద్ధి కలవాడు, లేక, ఒక త్రాగుబోతు "ఈ కొండ భలే నృత్యం చేస్తోంది" అని అనుకొంటాడు చూచావా? అదేవిధంగా మరణించిన వారందరు తమతమ సంస్కారములకు తగినట్టి దృశ్యములను తమ చిత్తమునందే గాంచుచున్నారు.

ఇక సమష్టి మనోరూపుడగు హిరణ్యగర్భుని విషయానికి వస్తే, అతడు మహా ప్రళయానంతరం మరల సమష్టి-భోగ సమూహములను విస్తరింపజేయుచున్నాడు. అదేవిధంగా, "నేను వ్యష్టిని " అనునట్టి స్వయం సంభావన కలిగినవారు మృత్యువు తరువాత వ్యష్టిభోగ సమూహములను కల్పించుకొనుచున్నారు. ఏది ఏమైనా మహా ప్రళయానంతరం సమష్టి జీవునియందు, వ్యష్టి జీవుని యందు కూడా ప్రవర్తించుచు విరాజిల్లునది శుద్ధ స్వస్వరూపమే. "అట్టి శుద్ధ స్వస్వరూపము ఏకైక అద్వితీయ చిదాకాశమే" .... అని సునిశితమైన బుద్ధితో గ్రహించెదవు గాక. దీనిని బట్టి మనం గ్రహించవలసినదేమిటి? "ఆ చిదాకాశమే బంధముక్తులను తనకు తానే చిద్విలాసంగా, చమత్కార పూర్వకంగా కల్పించు కొనుచున్నది" అని మనం గ్రహించాలి సుమా! అందుకే ....

"ఓ జీవుడా! నీవు ఏమాత్రం స్వల్పుడవు కాదు సుమా! నీయొక్క వాస్తవ స్వరూపము చిదాకాశమే. మరి ఎందుకు విచారిస్తున్నావు? నీకు నీవే బంధమోక్షములను కల్పించుకొని, అనుభవిస్తున్నావు. ఈ రెండిటి ఆవలనున్న నిత్య-నిష్కళంక-ఆత్మచైతన్యమైయున్న స్వస్వరూపమును గాంచుటే జ్ఞానము యొక్క పరాకాష్ఠ" ....

అని శాస్త్రములు సర్వజనులకు ఎలుగెత్తి బోధిస్తున్నాయి. ఇదంతా మేము స్వానుభవము క్రోడీకరించి చెప్పుచున్నదే.

శ్రీరాముడు : స్వామీ! జీవుడు తాను మరణించిన తరువాత మరల సృష్టిని తన స్మృతిని అనుసరించి పొందుచున్నాడని మీరు అనియున్నారు కదా! ఈ విశ్వసృష్టిని రచించుచున్న సమష్టి జీవుడగు హిరణ్యగర్భుడు కూడా తన యొక్క స్మృతిని అనుసరించే ఈ జగత్తును ఇట్లు నిర్మించియున్నాడని మనం ఎందుకు అనుకోకూడదు? జీవుడు స్మృతిని అనుసరించి మరొకజన్మ పొందుచున్నాడని మనం అంగీకరిస్తే అప్పుడు "ఈ జగత్తును సమష్టి సృష్టికర్త తన స్మృతిలో కల్పనచేసి రచించాడు" అని చెప్పవచ్చు. అప్పుడు "ఈ జగత్తు కారణరహితము" అనే బదులు సమష్టి సృష్టికర్త (లేక హిరణ్య గర్భుడు) దీనికంతటికీ కారణము" అని అనవచ్చు కదా?

శ్రీ వసిష్ఠమహర్షి : "ఈ 'జగత్తు' అనబడే కార్యమే లేదు" అని ఉపనిషత్తులు మొదలైన ఆత్మవస్తువును ప్రతిపాదించు గ్రంథాలద్వారా శాస్త్రకారులు నిర్ద్వంద్వముగానే చెప్పుచున్నారు. అందుకు శాస్త్రములచే చెప్పబడిన ఒకానొక నిరూపణ చెపుతాను. విను.

మహాప్రళయసమయంలో హరి-హరాది దేవతలు కూడా విదేహముక్తులగుచున్నారు. అప్పుడు ఇంకేమీ మిగలనప్పుడు ఇక 'స్మృతి' అనునది ఎవరికి? ఎట్లు? మాబోటి తత్వవేత్తలే ఆ మహాప్రళయ సమయంలో ముక్తులౌతుంటే ఇక బ్రహ్మాదుల విషయం వేరే చెప్పేదేమున్నది?

నాయనా! రామా! ఎప్పుడైతే ఈ చిదాత్మ తన అఖండ విన్యాసత్వమును మరుగు పరుచుకొని, "నేను బద్ధుడను" అను భావమును పొంది ఉంటుందో, అట్టి సమయంలో అది అనేక ఉపాధి పరంపరలను పొందటం-త్యజించటం అను తతంగంలో ప్రవేశిస్తోంది. అట్టి తర్వాతి ఉపాధులకు స్మృతియే కారణమగుచున్నమాట నిజమే. అయితే స్మృతి ఉండుటకు, ఉపాధి నిర్మాణములకు

.... వీటన్నిటికి మూలకారణం ఆ చిదాత్మ తనయొక్క పూర్ణమగు మోక్షస్వరూపమును, విస్మరించుటయే. దృశ్యము భావించబడిన చోట ఆత్మ బావము కలుగరు. "ఇక్కడ కనబడుచున్న నీవు-నేను-అతడు-మనస్సు- అహంకారములు-పదార్థములు-వ్యష్టి-సమష్టి-ఇదంతా ఆత్మయే. ఆత్మయొక్క ప్రభావమే" .... అను రీతిగా ఆత్మ స్మరించబడుచున్నప్పుడు, స్వస్వరూపము అనుభవంకాగా, దృశ్యము యొక్క అదృశ్యత నిత్యానుభవమౌతుంది. ఈ జీవుడు ఇతఃపూర్వమే సర్వదా మోక్షస్వరూపుడై ఉన్నాడు. "ఓయీ, జీవుడా! నీవు సర్వదా స్వతంత్రమగు చైతన్యమూర్తివేగాని "స్మృతి" అనబడు ఒకానొకదానిచే బంధింపబడి అటూయిటూ దొర్లింపబడు జడవస్తువు కాదు. స్మృతికి ముందే నీ స్వరూపమున్నది. 'స్మృతి' యొక్క స్వరూప - స్వభావములు నిర్ణయిస్తున్నది నీవే" .... అని మేము సర్వజనులకు గుర్తు చేస్తున్నాం.

"ఈ జీవుడు మృతి తరువాత స్మృతిని అనుసరించి స్వకీయ - కల్పితమైన సృష్టిని గాంచుచున్నాడు" అనునది (బ్రహ్మపురాణం మొదలైన శాస్త్రములందు) ఇతఃపూర్వమే శాస్త్రకారులచే ప్రతిపాదించబడింది. స్వస్వరూపము గ్రహించబడనంత వరకు ఇట్టి సృష్టులు ప్రవర్తిస్తూనే ఉంటాయి. అట్టి సృష్టులనే "ఆకాశప్రకృతి" అని కూడా అంటారు. అయ్యది వ్యక్తము-అవ్యక్తము, జడము-అజడము కూడా అయివున్నది. నీకిక్కడ సృష్టి గురించి, జన్మాదుల గురించి కొన్ని విషయాలు చెపుతాను. విను.

❖

ఈ "ద్రష్ట-దృశ్యము" అనబడు రెండు పదార్థములు సమ్మేళనమైనట్లు తోచుచున్న ఆకాశ ప్రకృతి "చిద్వస్తువు" నందు ప్రతిఫలించినప్పుడు ... అహంభావము, శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములనబడు పంచతన్మాత్రలు, దిక్కులు ... మొదలైన సూక్ష్మభావాలన్నీ ఉదయిస్తున్నాయి. అట్లు ఉదయించిన 'సూక్ష్మభావ ప్రకృతి' మరికొంత విస్తరిల్లుటచే ఈ సూక్ష్మేంద్రియ పంచకమునకు (శబ్దానుభవం, స్పర్శానుభవం, రూపానుభవం, రసానుభవం, గంధానుభవం పొందటానికి) కారణమగుచున్నది. దానినే మనం 'ఆతివాహిక దేహం' అని అంటున్నాం. కొంతకాలానికి బాలుడు ఆటవస్తువులను, ఆ ఆటవస్తువుల ఆయాఆరోపణలను కల్పించుకొనునట్లు ఆదిభౌతిక దేహము సూక్ష్మదేహ ప్రభావం చేత రూపుదిద్దుకొంటోంది. అప్పుడు స్థూల-దేహమును ఆశ్రయించుకొనియున్న ఈ కళ్ళు, చెవులు, చర్మము మొదలైన ఇంద్రియములు వాటికి సమీపంలో ఉన్న పదార్థముల పట్ల మిథ్యాభావములను పొందుచున్నాయి. వాయువునందు స్పందముండటం లేదా? అట్లే జగద్భ్రాంతి కూడా 'చిలువలు-పలుకలు'గా వర్ధిల్లుచున్నది. స్వప్నంలోని స్త్రీ సాంగత్యములాగా ఇదంతా ఈ విధంగా అనుభూతమగుచున్నప్పటికీ ... ఇది అసత్యమే అయివున్నది సుమా!

ఈ జీవుడు ఎక్కడ మరణించటం జరిగినా, అతడు అక్కడే తక్షణమే తన అంతరంగము లోని సంస్కారముల ప్రభావం అనుసరించి "నీవు-నేను-అతడు-పదార్థజాలము" మొదలైన వ్యవహారమంతా గాంచుచున్నాడు. అయితే స్థూలాకాశమునందు ఈ "కాలము - దూరము" వంటి విషయాలు ప్రవర్తిస్తున్నాయి. సూక్ష్మాకాశమునందు ఈ దూరాదులు వర్తించవు. అందుచేత, "ఎంతకాలం

తరువాత? ఎంతదూరంలో?" అనే ప్రశ్నలు స్థూలాకాశబుద్ధికి సంబంధించినవి మాత్రమే. సూక్ష్మాకాశమున (నిశితబుద్ధికి) ఇట్టి ప్రసక్తి ఏర్పడదు. ఎంత చిత్రమో చూచావా! వాస్తవానికి ఆకాశమువలె సూక్ష్ముడగు ఈ జీవునకు జన్మాదులు లేవు. కాని ఆగంతుకములైన ఈ దేహాదుల యొక్క భావనలలో పడి జన్మాది భ్రమలకు లోనగుచున్నాడు. భ్రాంతియే అంతటికి కారణం. ఈ భ్రాంతియే .... దేవపురం, సూర్యుడు, నక్షత్రములు, భూమి - మొదలగు వాటితో కూడుకొని సుందరమై కన్పట్టుచున్నది. జరా-మరణ-వ్యాధులతో బహుసంకటంగా అగుపిస్తున్న ఈ "దేహఛిద్రము" యొక్క అనుభవమునకు కూడా భ్రమయే కారణమై ఉన్నది. ఓ రాఘవా! ఒక్కసారి పరికించి చూడు. ఈ జగత్తంతా విస్తరించియున్న చరాచర జంతువులన్నీ తమ స్థూల-సూక్ష్మ దేహములతో కూడుకొన్నవై "ఇష్టాను భవముల ప్రాప్తి - అయిష్టానుభవముల పరిహారము" అను రూపముగల అనేక ప్రయత్నములందు నిమగ్నమై ఉంటున్నాయి. అట్టి వ్యవహారం చేతనే "నదులు, కొండలు, భూమి, దిశలు, రాత్రింబవళ్ళు, క్షణములు" అనునట్టి భ్రమలన్నీ కలుగుచున్నాయి. "ఇష్టాయిష్టములే భ్రమలకు దారితీయగలవు" అని గ్రహించెదవుగాక.

"నేనతనికి పుట్టాను. వీరు నా తల్లిదండ్రులు. వీరు నా మిత్రులు. ఇది నా ధనము. ఇది నా కోర్కె. ఇవి నా పుణ్య-పాపములు, నేను బాలుడను, ఇప్పుడు యువకుడను, కాని క్రమంగా వృద్ధాప్యం పొందుచున్నాను." ఇటువంటి భ్రమాత్మకదృష్టులే జీవుని "పరిమితునివలె" చూపుతున్నాయి. ఈ జగద్భ్రమ మాటిమాటికీ వేరువేరుగా హృదయమునందే స్ఫురించటం జరుగుతోంది.

'మరణము' అను మూర్ఛను పొందిన ఈ జీవుడు మరల తన హృదయము యొక్క బాహ్యప్రసరణం కారణంగా తనయందే తన సంస్కారములకు, ఇచ్ఛలకు అనుకూలమైన జగత్తును గాంచుచున్నాడు. అదేవిధంగా ఈ జీవించియున్న తరుణంలో జీవునిచే గాంచబడునది కూడా సంస్కారానుగుణంగానే ఉంటోంది కదా! జీవుడు ఇట్లు ఎక్కడ మరణిస్తే అక్కడ ఇట్టి సంసారవనభూమిని దర్శించుచునేఉన్నాడు. ఈ విధంగా త్రిలోకములు, బ్రహ్మ, విష్ణు, ఇంద్ర, సూర్యాది దేవతలు, పర్వతములు, సముద్రములు, ద్వీపములు ... ఇట్టివి కోట్లకొలది కనబడుచున్నాయి. మరల నిష్క్రమిస్తున్నాయి. నిరాకారమగు పరబ్రహ్మమునందు ఈవిధంగా ఎన్ని అసత్స్వరూపములు ఉద్భవించాయి? ఎన్ని ఉద్భవించబోతున్నాయి? ఇవన్నీ లెక్కించటం, నిరూపించటం ఎవరితరం చెప్పు!

ఈ విశ్వము ఒక గోడవలె స్థూలంగా ఎదురుగా నిలచియున్నది కదా! వాస్తవానికి ఇదంతా మనస్సు యొక్క సంకల్పమే అయివున్నది. మనో సంకల్పమునకు వేరుగా ఎక్కడా ఏదీ లేదు. మనస్సే తనకొరకు ఈ దృశ్యవ్యవహారములతో కూడిన సృష్టులను నిర్మించుకొని, అనుభవించి, మరల త్యజించివేస్తోంది. కనుక 'జగత్తు' అనబడునది మనస్సులోనే సంకల్పరూపమున ఉద్భవించి బాహ్యమైన వస్తుజాలమువలె ప్రాప్తిస్తోంది. స్వప్నములోని వస్తుజాలం "అంతరంగమున ఏర్పడియున్న భ్రమ" అయినప్పటికీ అదంతా ఆ స్వప్న సమయంలో "బాహ్యజగత్తు"వలె తోచుచున్నది కదా! ఈ జాగ్రత్ అనుభవం కూడా అట్టిదే.

శ్రీరాముడు : అయితే, ప్రభూ, "మనస్సు చంచలము - ఈ విశ్వము స్థిరము" అని మనం అనుకోవచ్చా? ఎందుకంటే ఈ విశ్వమంతా మాకు ఎదురుగా ఘనీభూతమై అనుభవమగుచుండగా, ... "ఇదిలేదు" అనునది సమంజసమెట్లా అవుతుంది?

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! ఈ కనబడేదానిని కొంచెం విచారించిచూడు. ఈ విశ్వము కూడా చంచలమని, క్షణభంగురమని నీవు తప్పక గ్రహించగలవు.

చిదాకాశమే మనస్సునకు ఆశ్రయమైయున్నది. అట్టి చిదాకాశమే 'పరమపదము' కూడా. నీరే, కెరటము. నీరే సుడిగుండము కూడా కదా! ఆ రెండింటికీ భేదమేమున్నది? అట్లే ఈ విషయం విను.

"ద్రష్టయే దృశ్యముగా ప్రసరించుచున్నాడు. (Perceiver is extending himself as perception) ద్రష్ట - దృశ్యములకు భేదమేమీ లేదు."

"ద్రష్టేవాస్తేదృశ్యమివ దృశ్యంనత్వస్తివస్తుసత్"

ద్రష్టయే దృశ్యంగా అవతరిస్తున్నాడు. ద్రష్టకు వేరుగా దృశ్యమనునది వస్తుతః ఎక్కడా లేదు.

ఐంద్రజాలికుడు ఆకాశము నుండి వివిధ వస్తువులను కల్పించి నానావిధములైన వాటిని మన కళ్ళకు సత్యమువలె అగుపడేట్లు చేస్తాడుకదా! అదేవిధంగా అనాదియగు మాయ కూడా - నామరూపములను కనుగొనజాలునట్టి జీవభావమును చిదాకాశము నందే (లేక చిత్తాకాశమునందు) స్ఫురింపజేయుచున్నది. 'అహం' అను జ్ఞానం ఉన్నంత మాత్రంచేతనే ఆ 'అహం' అనబడుదానియొక్క 'ఉనికి' ప్రభావంచేత పరమార్థ స్వరూపము నందు జగత్తు యొక్క శబ్ద-అర్థములు ప్రాప్తిస్తున్నాయి. అనుభవ మౌతున్నాయి. 'అహం' అనుదాని యొక్క స్వరూపము వాస్తవమునకు అమృతమయమగు చిదాకాశమే అయివున్నది. 'అహం' అను "భావన మరియు ఉనికి" యొక్క ప్రభావం చేతనే, 'నీవు' అను జ్ఞానము కలుగుచున్నది. నీవు అను ''శబ్దము-అర్థము'' .... ఆరోపితమైనట్లు, బోధితమగుచున్నది.

"అహమ్‌బ్రహ్మాఽస్మి", "తత్ త్వమ్" అను రెండు మహావాక్యములు అహమ్-త్వమ్ (నేను-నీవుల) అభేదమునే సిద్ధాంతీకరిస్తున్నాయి.

❖❖❖

25. విదూరథుని సుదీర్ఘ జీవితం

మరల మనం కథలోకి ప్రవేశిస్తున్నాం. ఆకాశస్వరూపులగు లీలా, సరస్వతులిద్దరూ తమ తమ ఇచ్ఛలను అనుసరించే ఆ గృహంలో ప్రవేశించగలిగారు.

చిద్వస్తువు సర్వవ్యాపి కదా! "యథార్థజ్ఞానము", "సత్యకామ", "సత్యసంకల్పము", ఈ మూడు కూడా చిద్వస్తువు యొక్క ధ్యానము చేతనే కలుగుచున్నాయి. సర్వగామి, అప్రతిహతము, సూక్ష్మము

అగు చిద్వస్తువును ఎవరు ఎట్లు అడ్డగించగలరు చెప్పు?

ఆ యువతులిద్దరు రాజాంతఃపురంలో ప్రవేశించటంచే అక్కడ ఇద్దరు పూర్ణచంద్రులు ఉదయించినట్లైనది. ఆ చోట సుగంధపూరితమైన పిల్లగాలులు వీచాయి. ఆ సమయంలో ఆ గృహంలో ఒక రాజు తప్ప అంతా యుద్ధరంగమున అలసి ఉండుటచే గాఢనిద్రా పరవశులై ఉన్నారు.

రాజు ఎందుకో పాన్పుపై నుండే కనులు తెరచి చూచాడు. ఎదురుగా రెండు సింహాసనములపై అధిష్ఠితులైయున్న అప్సరసల వంటి వారిద్దరినీ చూచి తటాలున లేచాడు. ప్రక్కనే ఉన్న సువర్ణపాత్రలో నుండి దోసిలి నిండుగా పూలు తీసుకొని వారి పాదములపై ఉంచాడు. ఎదురుగా పద్మాసనాసీనుడై కూర్చుని ఇట్లు పలుకరించసాగాడు.

విదూరథుడు : ఓ దేవతాస్త్రీలారా! మీ ఇద్దరికీ మరల మరల నమస్కారం. మిమ్ములను చూడగానే ఈ "జన్మములు పొందియుండటం" ... అను రూపముగల దాహ దోషములన్నీ తొలగిపోతున్నాయి. బాహ్యాభ్యంతర తమస్సు అంతా పటాపంచలై పోతోంది. మీకు జయమగుగాక!

ఆ ఇద్దరు పద్మని వాత్సల్యంగా పలకరించారు. ఇంతలో సత్యసంకల్పురాలగు సరస్వతీ దేవి యందు "ఈ నా భక్తురాలు లీలకు తన భర్తకు సంబంధించిన ఇక్కడి సమాచారం తెలియజేసెదను గాక" అను సంకల్పం ఉదయించింది. ఆమె ఇచ్ఛను అనుసరించి ఆ ప్రక్కనే నిదురిస్తున్న మహామంత్రి నిదురలేచాడు. ఆ అప్సరసలిద్దరికి పుష్పాంజలి సమర్పించాడు. రాజు ప్రక్కన వినమ్రతతో ఆశీనుడై కూర్చునియున్నాడు.

శ్రీ సరస్వతీదేవి : ఓ రాజా! నీవెవడవు? ఎవరి పుత్రుడవు? ఎట్లు జన్మించావు? ఇక్కడికి ఎట్లా వచ్చావు? నీ వృత్తాంతమేమిటో సమూలంగా వినగోరుచున్నాము. మీ మహామంత్రి మాకు వివరించుగాక!

మహామంత్రి : ఓ దేవతలారా! మీకు శుభమగుగాక! మీరు కోరినట్లు మా ఈ ప్రభువు యొక్క వృత్తాంతము నేను చెపుతాను, వినండి.

ఇక్ష్వాకువంశీయుడైన 'కుందరథుడు' అను నాతడు లోకప్రసిద్ధుడైయున్నాడు. ఆయన వంశపరంపరలోని 'నభోరథుడు' అను మా పూర్వరాజు కుమారుడే ఈ మా మహారాజగు 'విదూరథుడు'. ఇతడు తన స్నేహాది సుగుణములచే మా అందరిని సంతోషపెట్టుచూ, మమ్ము పాలించుచున్నాడు. ఇతని తల్లి – తండ్రులగు 'నభోరథుడు – మిత్ర"లు ఇతనికి పదవఏటనే రాజ్యాభిషేకం చేసి తాము 'వానప్రస్థం'* జేరారు. అప్పటి నుండి ఈతడు యేబది ఏండ్లుగా ధర్మానుసారం రాజ్యపాలన చేస్తున్నాడు. నేడు మీ రాకచే మా పుణ్యం ఫలించింది. ఎంతో తపస్సు చేసినప్పుడు మాత్రమే

* వానప్రస్థం : పూర్వం రాజులు వృద్ధాప్యంలో రాజ్యం యువరాజులకు అప్పచెప్పి, నిర్జన ప్రదేశంలో (లేక) అరణ్యంలో ఆశ్రమం నిర్మించుకొని తపోధ్యానాదులతో శేష జీవితం గడిపివేసేవారు. అదే 'వానప్రస్థాశ్రమం'.

మీవంటి దేవతల దర్శనం లభిస్తుంది. మీ దర్శనముచే ఈ రాజ్యసేవకునిగా నేను, మహారాజుగా, ఈ మా విదూరథుడు కూడా ధన్యులమైనాం.

అప్పుడు సరస్వతీదేవి సింహాసనం దిగింది. ఆరాధనాపూర్వకంగా తనవైపే చూస్తున్న 'విదూరథమహారాజు'ను సమీపించింది. భక్తులపాలిటి అమృతహస్తమయిన ఆమె అభయ హస్తముతో అతని మస్తకమును స్పృశిస్తూ "నాయనా! వివేకబలంచేత పూర్వజన్మను స్మరించు" అని లాలనగా పలికినది. నాగస్వరం విన్న సర్పమువలె జగన్మాత పలికిన పలుకులకు రాజు అర్థనిమీలితనేత్రుడు అయ్యాడు. అంతే. అతని హృదయంలోని తమస్సు అంతా తొలగిపోయింది. హృదయం వికసించింది. ఒక్క క్షణంలో తన పూర్వ వృత్తాంతమంతా గ్రహించగలిగాడు.

- తాను 'పద్మడు' అనే రాజై ఉండటం ....
- 'లీల' తన ధర్మపత్ని. ఆమెకుగల అత్యంత త్యాగపూర్వకమైన అనురాగం ....
- కాలక్రమంగా తాను దేహమును, రాజ్యమును పరిత్యజించటం ....
- సరస్వతీదేవి వృత్తాంతము. లీలాదేవి విలాసము?

అంతా సవివరంగా గ్రహించాడు. సముద్రముపై తేలియాడుచున్న వానివలె అయ్యాడు. "ఆహాః! ఎంత ఆశ్చర్యం! నేటికి ఇప్పుడు ఈ సరస్వతీదేవి కరుణ వలన సంసార మాయ అంతా గ్రహించాను. ఇదంతా ఎంత చిత్రమైనది!"

❖❖❖

26. జగత్తు యొక్క నిజరూపం

విదూరథుడు : ఓ దేవతలారా! నేను 'పద్మడు'గా మరణించి మూడు రోజులు మాత్రమే అయినది కదా! మరి ఇక్కడ నాకు అరువది ఏండ్ల అనుభవం గడచిపోయింది సుమా! పైగా, ఈ అరువది ఏండ్లుగా నా తాతలు, తండ్రులు, పుత్రులు, సేవకులు, మిత్రులు, బంధువులు నా స్మరణలో ఉండియే ఉన్నారు. ఓ జ్ఞప్తిదేవతా! ఇదంతా ఏమిటమ్మా? నాకసలు ఏమీ అర్థమగుటలేదు. విషయమంతా నాకు వివరించి చెప్పమని నిన్ను ప్రార్థిస్తున్నాను.

శ్రీ సరస్వతీదేవి : నాయన! 'వసిష్ఠుడు' అను బ్రాహ్మణుడిగా పిలువబడుచున్న శరీరము శిథిలం కావటం జరిగినది. 'మృత్యువు' అను మూర్ఛను పొందిన తరువాత అంతకు ముందు అధిష్ఠించియున్న దృశ్య వ్యవహారము నీ దృష్టి పథము నుండి తొలగిపోయింది. ఆపై 'పద్మడు' అని పిలువబడిన ఉపాధిని నీవు ఆశ్రయించావు. గిరి గ్రామంలోని విప్రగృహాకాశమే గొప్ప రాజ్యంగా నీ హృదయంలో ప్రతిబింబించింది. ఇక్కడ ఇప్పుడు నీకు కనబడుచున్నవి కూడా ఆ గృహమండపములోనే ఉన్నాయి. పద్మడుగా నీవు నన్ను ఉపాసిస్తూ ఉండేవాడవు. పద్మడుగా గృహములు, రాజ్యములు చూచావు కదా! ఆ అంతఃపురాకాశంలోనే మరణానంతరం ఈ వర్తమాన బ్రహ్మాండమును చూచుచున్నావు.

వసిష్ఠ బ్రాహ్మణుని – పద్మని – ఈ విదూరథునికి సంబంధించిన దృశ్యానుభవములన్నీ ప్రాప్తిస్తున్నది ఎక్కడా బాహ్యమునందు కాదు సుమా! నిర్మలాకాశంకంటే కూడా నిర్మలమైన నీ చిదాకాశమునందే నీ 'ఇచ్ఛ'ను అనుసరించి ఇవన్నీ ఇట్లు ప్రాప్తిస్తున్నాయి.

"నా పేరు ఇది. ఇది నా జన్మ. నేనీ వంశమున జన్మించాను. వీరు నా తల్లిదండ్రులు. నా తండ్రి నా పదేళ్ళ వయసులో నాకు రాజ్యము ఇచ్చి తాను పరివ్రాజకుడయ్యాడు. నేను శత్రువులను జయించి, మంత్రులతో విశాల సామ్రాజ్యమును, ప్రజలను పరిపాలిస్తున్నాను. యజ్ఞక్రియా సహితుడనై ప్రజలకు అనుకూలమైన విధంగా రాజ్యపాలన సాగిస్తున్నాను. నాకు అరువది(60) ఏండ్లు గడచిపోయాయి. ఇప్పుడు శత్రురాజులు మాపై దండెత్తివచ్చారు. దారుణయుద్ధం జరుగుతోంది. నా కళ్ళు తెరవగానే సింహాసనా రూఢులైన ఇద్దరు దేవతా స్త్రీలను చూచాను. వీరిని పూజించాను. పూజిస్తే వారు నా కోర్కెలు తీర్చగలరు. ఈ దేవి నా పూర్వస్మృతిని వికసింపజేసింది. నేనిప్పుడు కృతకృత్యుడనయ్యాను. నా సంశయములన్నీ తొలగిపోతున్నాయి. ఇప్పుడు నాకెట్టి దుఃఖములు లేవు. ఏక రసరూపమగు సుఖమున మగ్నుడనయ్యాను."…. ఇట్టివేయగు అనేక భ్రాంతులు అద్దమునందు ప్రతిబింబములవలె నీ శుద్ధ చిత్స్వరూపము నందు ప్రతిబింబిస్తున్నాయి.

అయితే నీవు ఇతఃపూర్వం మరణించినప్పుడే ఇట్టి జ్ఞానపరంపరావ్యవహారం హృదయంలో ఉదయించివున్నది. నీరు ఒకచోటి నుండి మరొకచోటికి ప్రవహిస్తూ …. ఒక సుడిగుండం నుండి మరొక సుడిగుండమును ఆశ్రయిస్తూ పోతుంది చూచావా? నీయొక్క ప్రజ్ఞాప్రవాహం కూడా అట్లే ఒక దృశ్యమును వదలి ఇంతలోనే మరొక దృశ్యమును ఆశ్రయించి ప్రతిభాసింపజేయుచున్నది. ఒకానొక సుడిగుండం ఇంకొక దానితో కలసి ప్రవర్తించటం ఎట్లా జరుగుతూ ఉంటుందో, ఈ సృష్టి–విభవము కూడా 'మిశ్రమ–అమిశ్రమ' భావములతో పెంపొందించబడుచున్నది. చిత్రమేమిటంటే, నీ మరణసమయంలో 'చిత్' స్వరూపము నందు ప్రతిభాసితమగుచుండే ఈ జగత్తులన్నీ అసత్స్వరూపములే సుమా! స్వప్నంలో ఒక్క 'నిమిషం' కాలంలో అనేక సంవత్సరాలుగా విస్తరిల్లినట్టి అనుభవము భ్రమవలన కలుగటం జరుగుతోంది. ఊహయందు ఊహచే నిర్మించబడే గంధర్వనగరంలోని సౌధాలకు కూడా గోడలు, పునాదులు అగపడుతాయి. సంకల్ప నగరంలో శత్రువుల జననమరణాలు ఆ సంకల్పములోనే సంకల్పద్రష్టకు కనిపిస్తూ ఉంటాయి కదా! నావ నీటిలో కదులుచూ ఉండగా, ఆ నావలో ఉన్న జనులకు ఒడ్డున ఉన్న చెట్లు కదులుచున్నట్లు తోచదా? స్వప్నంలో, "నేను చచ్చినానట. అప్పుడు నా చుట్టూచేరి నా బంధువులు ఏడ్చుచున్నారు" అని ఒకానొకడు గాంచటం లేదా? హాస్యరసపూర్వకమైన విషయమేమంటే, స్వప్నద్రష్టయే మరణిస్తే, ఆ స్వప్నములోని బంధువులు ఎవరు? ఎక్కడ ఉన్నారు? ధాతువులు ప్రకోపించినప్పుడు పర్వతములు నృత్యమాడుచున్నట్లు కనబడుతుందికదా! ఈ వర్తమానపు – ఇతఃపూర్వపు – ఇక ముందటి జన్మకర్మల వ్యవహారము అట్టిదే. ఇది ఎంత ప్రౌఢంగా ఘనీభూతమై కనిపిస్తున్నప్పటికీ …. ఈ దృశ్యజగత్తు భ్రాంతిమాత్రమై, మిథ్య అయి ప్రాప్తిస్తోంది.

పుత్రా! విదూరథా! వాస్తవానికి నీవు జన్మించటం లేదు. మరణించటం లేదు. నీవు ఉన్నది మరెక్కడో కాదు. సర్వదా శుద్ధవిజ్ఞాన స్వరూపము, శాంతము అయినట్టి పరమాత్మయందే వెలయుచున్నావు. అట్టి నీ స్వస్వరూపమునకు సంబంధించిన వాస్తవ జ్ఞానం నీయందు విచారణ ప్రభావంచే వికసించవచ్చు. లేదా, నీయందు 'విచారణ' అను వెలుగు తగినంత ప్రభవించకపోవటం చేత, 'దృశ్య తాదాత్మ్యము' అనునది ఆత్మజ్ఞానమును కప్పి ఉంచుటచే, నీవు ఇట్లే అనేక శరీరములందు సంచరిస్తూపోవచ్చు. ఏది, ఏమైతేనేం? నీ వాస్తవస్వరూపము శుద్ధ-విజ్ఞాన సత్తయే! అట్టి నీశుద్ధ స్వస్వరూపమునకు కలుగగల బంధముగాని, అవాంతరముగాని లేనేలేదు. ప్రతి ఒక్క తరంగము జలముయొక్క రూపమే అయినట్లు, ప్రతిజీవుని యొక్క వాస్తవ స్వరూపము పరబ్రహ్మమే అయివున్నది.

ఏ దృశ్యజగత్తైతే ఇప్పుడు ఘనీభూతమై ఎదురుగా ఉండి ఉంటోందో .... అట్టి ఈ దృశ్య సర్వసంకల్ప రాహిత్యముచే "నిర్వికల్ప సమాధి" అను "అంతరంగమౌనస్థితి" యందు లేకయే పోవుచున్నది. అయితే, ఆ సమయంలో కూడా "స్వస్వరూపసత్త (లేక) "ఉనికి" ఉండియే ఉన్నది. ఆ ఉనికి 'జాగ్రత్'ను స్వీకరించడానికి అనుక్షణం సిద్ధంగానే ఉన్నది కదా!

కాబట్టి, ఓ లీలాపతీ! నీవు సర్వాత్మకుడవేగాని, వాస్తవానికి ఒకానొక స్వల్ప ఉపాధి మాత్రుడవు కాదు. ఇందులో సందేహం లేదు. నీవు నీయందే దృశ్య-అదృశ్యములనబడు ఉభయ సమయము లందు సర్వదా ప్రకాశించుచున్నావు. "భూపీటము, సూర్యప్రకాశము, 'గిరి' మొదలైన గ్రామాదులు, నీవు నేను" .... ఇవన్నీ మిథ్యయే అయివున్నాయి. వసిష్ఠవిప్రుని గృహాకాశమండపమే లీలాదేవి-పద్ముల విస్తార రాజ్యమునకు స్థానభూతమైనది. ఆ ఇద్దరి అంతఃపురాకాశ మండపంలోనే ఈ విదూరథ రాజ్యమంతా ఉండివున్నది. అయితే ' మండపాకాశము,' 'ఈ నీవు చూస్తున్న రాజ్యము' కూడా నిర్మలమగు బ్రహ్మమే అయివున్నాయి. అట్టి బ్రహ్మమునందు భూమి, పట్టణములు, అరణ్యములు, పర్వతములు, నదులు మొదలైనవి లేవు. ఈ జనుల పరిభ్రమణము, పరస్పర దర్శనము కూడా మిథ్యయే. "అంతయు చిన్మాత్రముచే పూర్ణమైయున్నది" అని గ్రహించు!

విదూరథుడు : సర్వజ్ఞప్తులకు మూలకారణమైన ఓ జ్ఞప్తిదేవీ! అయితే, ఈ నా అనుచరులంతా ఎవరు? వీరంతా కూడా ఆత్మయందే జన్మించి, ఆత్మయందే వెలయుచున్నారా? లేక, వారి ఉనికికి ఆధారం ఇంకేదైనా వస్తువు ఉన్నదా? స్వప్నంలో చూడబడే నామరూపాలవలె, వీరంతా ఉండి ఉన్నట్లు నాకు అనుభవమవటం మిథ్యానుభవమేనంటావా? వీరందరు ఆత్మయందు సత్స్వరూపులై వెలయుచున్నారా? లేదా? లేక 'ఆత్మ' అనబడునది కూడా మిథ్యయేనా? నీ వాక్యములచే కొంత విషయం చూచాయగా అర్థమౌతున్నప్పటికీ, కొంత అయోమయమే ఏర్పడుచున్నది. నన్ను సందేహాలు ఇంకా పట్టుకొనే ఉన్నాయి.

శ్రీ సరస్వతీదేవి : ఓ విదూరథా! ఆత్మస్వరూపము 'విదిత-వేద్యము' (తెలుసుకొనబడు చున్నది - తెలుసుకొనుచున్నది), శుద్ధస్వరూపము కూడా అయివున్నది. చిదాకాశ స్వరూపమగు "ఆత్మ-తత్త్వము" నందు ఆత్మ కాకుండా వేరుగా సద్రూపమంటూ ఏదీ లేదు. శుద్ధబోధ స్వరూపమగు దానియందు

జగద్భ్రమ ఉండి ఉండటమేమిటి? ఆ భ్రమ వాస్తవమైన రూపము పొందటం ఏమిటి? చీకట్లో చూడబడిన త్రాడు విషయంలో "అది పాము కాదు, త్రాడు మాత్రమే" అను సత్యజ్ఞానము ఉదయించిన తరువాత ఇక వికారములకు చోటెక్కడ? "అసత్‌భ్రమ" యొక్క స్వరూపమేమిటో గ్రహించిన తరువాత ఇక జగద్భ్రాంతికి చోటు ఉండదు. 'ఎండమావులు' అనగా ఏమిటో గ్రహించే వారికి వాటియందు జలభ్రాంతి శేషించి ఎందుకు ఉంటుంది? స్వప్నము నుండి తేరుకున్న తరువాత స్వప్నములోని సంఘటనలకు అస్థిత్వమెక్కడ?

వత్సా! 'అజ్ఞానము' అనే మేఘం తొలగితే "స్వస్వరూపాకాశము" స్వచ్ఛమై, పూర్వమైన దానికంతటికి పూర్వమై, ఏకరసస్వరూపమై ప్రకటితమౌతోంది. అట్టి స్వస్వరూపానుభవము" నందు ... "నేను, నీవు, జగత్తు" మొదలైన కుత్సిత శబ్దములకు అర్థమేమిటో కూడా బోధపడదు. వాస్తవానికి ఈ నేను నీవు–జగత్తు అనబడునదంతా వాచారంభము మాత్రమే. నీవు–నీ అనుచరులు పరమాత్మానందస్వరూపులే!

❖❖❖

(ఐదవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

ఆరవ రోజు

27. స్వప్నజాగ్రత్తులు

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఇక మనం ఆరో రోజు విచారణ ప్రారంభిస్తున్నాము.

మూఢుడు, అప్రబోధితుడు, ఉత్తమబుద్ధిలేనివాడు .... అగువానికి ఈ అసత్‌జగత్తు వజ్రతుల్యమై సత్యమువలె అగుపడుచున్నది. అజ్ఞాని, అమాయకుడు అయిన బాలుడు చీకట్లో ఒక మోడుబారిన చెట్టును చూచి "ఇది బేతాళుడే" అని భావించి దుఃఖమును పొందుతాడు చూచావా? అసత్ ఆకారము కలిగియున్నట్టి ఈ జగత్తు కూడా తత్త్వజ్ఞాన ప్రయత్నము లేనట్టి మూర్ఖజనులకు అనేక దుఃఖపరంపరలను కలుగజేయ గలుగుచున్నది. సూర్యకిరణములు ఎడారిలో జంతువులకు నీటియొక్క భ్రమ కలుగజేయుచున్నట్లు, మూఢునకు ఇదంతా సత్యమువలెనే గోచరిస్తోంది, ప్రాప్తిస్తోంది. స్వప్నంలో ఒకానొకడు "నేను మరణించాను" అనే అనుభవం పొందటం లేదా? మూఢునకు, మూర్ఖత్వము వహించినవానికి ఈ 'జగత్తు' అను దృశ్యము నుండి ప్రాప్తించని కష్టమంటూ ఏదీ ఉండదు.

అజ్ఞునకు ఆభరణమే కనబడుతుంది గాని, ఆ ఆభరణములో బంగారము కనిపించదు కదా! బంగారము చూచు కంసాలికి అనేక ఆభరణములలో ఏకత్వమే అనుభవం కాగలదు. "మహాశయత్వము" లేని వానికి ఈ జగత్తు నందు పరమవస్తువు కనబడకుండా, "నీవు-నేను-పురము-నగరము" ... వంటి భ్రమాత్మకమగు విషయములు మాత్రమే గోచరిస్తున్నాయి. ఒకానొక చక్షురోగికి ఆకాశంలో పుష్పాలు, కేశములు, పింఛాలు మొదలైన అసత్యవస్తువులు అగుపిస్తూ ఉంటాయి కదా! అట్లే పరమార్థ దృష్టిహీనునకు ఈ జగత్తు కనిపిస్తోంది. కనుక, రాఘవా! 'అహంకారము' మొదలైన భావములతో కూడుకొనియున్న ఈ జగత్తు ఒక దీర్ఘస్వప్నమువంటిది మాత్రమేనని గ్రహించెదవుగాక!

శ్రీరాముడు : 'విదూరథుడు' తనకంటే వేరుగా తాను చూస్తున్న సృష్టిలో కనిపిస్తున్నవారి గురించి సరస్వతీదేవిని అడిగినాడు కదా! స్వప్నసదృశులగు ఆ పురుషులు ఎంతవరకు సత్యమో మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : శుద్ధ స్వరూపమైనట్టి పరమాత్మ మనోబుద్ధులచే ప్రకటింపబడజాలని వాడు. అందుచేత అతనిని 'అచేత్యుడు'* అని చెప్పుచున్నారు. అతడు చిన్మాత్ర స్వరూపుడు, శాంతుడు, నిరతిశయుడు. అతడే సత్యము. నీయొక్క, నాయొక్క సర్వుల యొక్క వాస్తవ స్వరూపము అతడే. సర్వగతుడు, సర్వశక్తియుతుడు, సర్వాత్మకుడు అయి వుండి కూడా ఖండునివలె భ్రమాత్మకమైన

* చేత్యము = తెలియబడునది.

దృష్టికి కానవచ్చుచున్నాడు. అతడు స్వమాయ వలన అర్థక్రియాదులకు అనుకూలమై ఉదయించ సంకల్పించినప్పుడు, తదనుసారమే ఈ క్రియలన్నీ ఏర్పడుచున్నాయి. ఇక్కడ మనం స్వప్నమునే దృష్టాంతంగా తీసుకుందాం. స్వప్నములో చూడబడే నగరంలోని నగరవాసులందరు ఆ స్వప్న సమయంలో సత్యముగానే తోచుచున్నారు కదా! వారిని కల్పించినది ఎవరు? స్వప్నద్రష్టయే కదా! ద్రష్టయొక్క స్వరూపచైతన్యమే స్వప్నాకాశమధ్యమున ఉన్నది. ఆ చైతన్యము స్వప్నద్రష్టయొక్క వాసనలను అనుసరించి, తనకు ఆధారమైనట్టి 'చిత్తము'*తో కలిసి ప్రకాశత్వం పొందుతోంది. ఫలితంగా, ఆ ద్రష్టకు "నేను మానవుడను .... వీరు నా వాళ్ళు .... వారు వేరైనారు" ఇత్యాది రూపములు గల బోధ కలుగుతోంది. అయితే చైతన్య శక్తియొక్క ప్రభావం చేతనే "నేను నరుడను. నేను ఇట్టివాడను" అనునట్టి 'బోధ' (Sense of deep understanding) కలుగుచున్నది. అట్టి భావన యొక్క పటిమ చేతనే స్వప్న – జాగ్రత్ జగత్తులు సత్యములైనట్లు అనుభవమగుచున్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! మాయామాత్ర శరీరుడగు "స్వప్నద్రష్ట" (లేక స్వప్న స్వరూపుడు), అతనిచే గాంచబడు స్వప్నదృశ్యము .... ఈ రెండూ కూడా మిథ్యయేనని నేను ఒప్పుకుంటాను. కాని, ఈ 'జాగ్రత్'లో కనబడే జగద్వ్యవహారం 'మిథ్య' అని అనటం ఎట్లా? ఈ 'నీవు–నేను' మొదలైనవన్నీ ఘనీభూతమై మాకు సుస్పష్టంగా అనుభవమగుచుండగా, "ఇదంతా అసత్యము" అని భావించియుండుట ఎట్లు? మీరు "ఇవన్నీ అవాస్తవములే" అని చెప్పుచున్నప్పటికీ మాకు మాత్రం ఈ విషయమై పూర్ణమగు విశ్వాసము కలుగుచుండటంలేదనే చెప్పాలి.

శ్రీ వసిష్ఠమహర్షి : "స్వప్నము నందు .... ఆ స్వప్నములోని వ్యక్తులు, వస్తువులు .... ఆ స్వప్న సమయంలో వాస్తవమనే అనిపిస్తున్నాయి" .... అని చెప్పటానికి ప్రమాణం ఏమిటి? ప్రత్యక్షానుభవం తప్ప వేరే ప్రమాణం లేదుకదా! ఈ జాగ్రత్ విషయంలో కూడా ప్రత్యక్షానుభవమే ప్రమాణం. "ఇది ఇప్పుడు సత్యము" అని ఈ దృశ్యము విషయంలో భావించబడునదంతా ... ఆయా వ్యక్తులపట్ల, సంఘటనల పట్ల, పదార్థ జాలముపట్ల ఏర్పడియున్న అభిప్రాయ సమూహముల సారమే కదా! (It is all the essence or "culmination of opinions" on persons, incidents and matters). కాని అవన్నీ క్షణక్షణం మార్పు చెందుచూనే ఉన్నాయి. పైగా వాటి మూలము కల్పనయే. కల్పననుసరించే ఈ జాగ్రత్ వ్యవహారమంతా ప్రాప్తించుట జరుగుతోంది. "అనుభవ పరంపరలు" ఏర్పడుచుండగా, మరొక దృష్టిచే .... "ఇదంతా స్వప్నమువలె అసత్యము" .... అనటం మా అనుభవం ప్రకారం సమంజసమే అయివున్నది.

❖

సృష్టి ప్రారంభమునకు ముందు ఉన్నట్టిదేది? సృష్టిరహితమగు శుద్ధచైతన్యము కదా! అట్టి "నిర్మల–అఖండ–అద్వితీయ" చైతన్యము నుండి సమష్టి–సృష్టి స్వరూపముగా స్వయంభువు (Self creator) లేక సమష్టి మనస్సు స్వప్నతుల్యుడై, అనుభవాత్మకుడై ప్రకాశించుచున్నాడు. అట్టి 'స్వయంభువు'

* చిత్ = సర్వము గ్రహించునట్టి శుద్ధతత్త్వము;

యొక్క సంకల్పరూపమున జనించిన ఈ జగత్తు కూడా స్వప్నతుల్యమే! "సమష్టి జీవుడు, – అతనిచే రచించబడిన ఈ విశ్వము – స్వప్నతుల్యములే" .... అని ఉత్తమ పరిశీలకులగు వేదాంత శాస్త్రకారులు సిద్ధాంతీకరించుచున్నారు.

అయితే ఇక్కడ "నేను–నీకు, నీవు–నాకు" సత్యమైనవారుగా ప్రాప్తిస్తున్నట్లు, జగత్తులో ఒకరు మరొకరికి సత్యమువలె ప్రాప్తిస్తున్నారు. "స్వప్నంలో కనబడే నగరవాసులు సత్యము కాదు" అని అనుకొందాము? మరి అట్టివారే అయినట్టి ఈ జాగ్రత్ జగత్తులో అనుభవమయ్యే 'నీవు–నేను' మొదలైనవి సత్యముకానివిగానే అయివుండాలి సుమా!

నావద్ద నీవు సత్యాత్ముడవై ప్రాప్తిస్తున్నట్లే, తదితరములు కూడా 'సత్యాత్మ' అయి ప్రాప్తిస్తున్నాయి. కనుక "ఇక్కడ భ్రమ ఏది? సత్యమేది?" అనునది విభాగించబడినప్పుడు కానీ ఈ జాగ్రత్ యొక్క వాస్తవస్వభావం మనకు అవగతం కాదు. "స్వప్నములో సంసారము సిద్ధించుచున్నది" అనగా, "అప్పటికి అదంతా సత్యమువలెనే ప్రాప్తిస్తున్నది" అనే అర్థం. అందుకు ఈ వర్తమానంలో సత్యమై ప్రాప్తిస్తున్న 'నీవు–నేను' అనునవే దృష్టాంతము (లేక ప్రమాణం).

ఈ విశాలమగు స్వప్నసంసారమున నేను నీకు సత్యమైనట్లు, నీవు కూడా నాకు సత్యమగుచున్నావు. అనగా నీవు నీ స్వప్నమున నన్ను గురువుగా, బోధకుడుగా పొందుచున్నట్లే, నేను నా స్వప్నమునందు నిన్ను దశరథమహారాజు కుమారునిగా, నా ప్రియ శిష్యునిగా, నాకిష్టునిగా నిన్ను గాంచుచున్నాను. వాస్తవానికి శుద్ధ–వ్యాపక– అద్వితీయ చైతన్యము అఖండమై, నీ–నా స్వరూపాలుగా వెలయుచున్నది. దానికి వేరుగా కనబడేదంతా స్వప్నమాత్రమే! "ఇది స్వప్నమాత్రము" అను విషయం సత్యదృష్టి దృఢతరమగుచుండగా స్వయంగా అవగతం కాగలదు.

శ్రీరాముడు : మహర్షీ ! ఈ జాగ్రత్‌లోని 'నీవు–నేను' మొదలైనవి అధిష్ఠానమగు చైతన్యదృష్టిచే సద్రూపములేకదా! స్వప్నము కూడా ఇట్టిదేకదా! స్వప్నద్రష్ట మేల్కొనిన తరువాత స్వప్నములో చూడబడిన నగరాదులు అట్లే ఉంటాయా? లేక స్వప్న ద్రష్ట మేల్కాంచగానే అవన్నీ తొలగిపోతాయా?

శ్రీ వసిష్ఠమహర్షి : ద్రష్ట ఎక్కడుంటే అక్కడ ద్రష్టను అనుసరించే జాగ్రత్‌గాని, స్వప్నము గాని ఉంటుంది. 'జాగ్రత్'గా దేనినైతే నీవు గ్రహిస్తున్నావో .... అదంతా నీవు ఆ విధంగా సంకల్పించుట చేతనే అట్లు లభించుచున్నదని గ్రహించు. చైతన్యము తనను తాను ఇంద్రియానుభవమాత్రంగా ఖండితముగా దర్శించుచున్నప్పుడు అనగా తనను తాను పరిమితమైనదానిగా దర్శించునప్పుడు .... ఆ సమయంలో ఇంద్రియానుభవములపట్ల ఏర్పడియున్న ఘనీభూతమైన భావనయే 'జగత్తు' అని చెప్పబడుచున్నది. స్వప్న దేశకాలాదులు ... జాగ్రత్ దేశకాలాదులు .... ఇవన్నీ "ఇవి ఇట్లు" అని భావించు దృష్టిలోనే ఏర్పడి ఉంటున్నాయి సుమా!

మరొక చమత్కారమేమంటే, అనేకులు ఒక విషయమును ఒకే తీరుగా దర్శించుచు స్వప్నము పొందుచుండటం జరుగుతోంది.

ఒకానొక స్వప్నద్రష్ట యొక్క స్వప్నములోని వ్యష్టిచైతన్యము, ఆ స్వప్నం త్యజించబడిన తరువాత కూడా, ఉనికిని పొందియుండటం జరుగుతూ ఉంటుంది. ఈ విషయం మనం ముందు-ముందు చర్చించబోతున్నాం. 'మాయ'లో సాధ్యము కానిదేది? ఇవన్నీ స్వతహాగా సత్యములు కాకపోయి నప్పటికీ సత్యముల వలెనే వెలయుచున్నాయి. స్వప్నంలోని 'స్త్రీ సంగమము'వలె మోహమును వెలయుచున్నట్లు తోచుచున్నప్పటికీ .... చైతన్యము దేశకాలాది సంకల్పములను అంగీకరించుట చేతనే ఈ మాయాజాలమంతా ప్రాప్తిస్తోంది. మరల జ్ఞానభావన వికసించటంచే సర్వత్రా అకృత్రిమమగు సమరసభావన వెల్లివిరుస్తోంది. చిదాకాశమే తనయందు 'జగత్తు' యొక్క స్వప్నము కలిగియుండి, ఆ స్వప్నములోని "నీవు-నేను" .... అనబడు పదార్థజాలమంతా తానే అయి, ప్రకటన-అప్రకటనలను నిర్వర్తించుచున్నది. ఇది మాత్రమే ఇక్కడ ఉన్న విశేషం, సన్నివేశం కూడా!

❖❖❖

28. యుద్ధరంగ ప్రవేశం

ఆ విధంగా జ్ఞప్తిదేవి కరుణచే విదూరథుని హృదయం జ్ఞానామృతంతో నిండిపోయింది. వివేకము అంకురించింది.

శ్రీ సరస్వతీదేవి : ఓ రాజా! అంతా గ్రహించావు కదా! ఈ లీలకు జ్ఞానబోధ చేయు నిమిత్తమే ఇక్కడకు తీసుకువచ్చాను. ఈమె ఇప్పుడు దృష్టాంతపూర్వకంగా "ఈ బ్రహ్మాండకల్పన అంతా మిథ్య మాత్రమే" అని గ్రహించినది. మేము వచ్చినపని పూర్తి అయినది. నీకు శుభమగుగాక! ఇక మేము సెలవు తీసుకుంటాము.

విదూరథుడు : అమ్మా! జ్ఞప్తిమాతా! మానవులలో ఉత్తములైనవారి దర్శనభాగ్యమే వ్యర్థముకాక, శుభము ప్రాప్తింపజేస్తుంది కదా! ఇక కరుణాసముద్ర స్వరూపిణివగు నీ దర్శనము వృథా అవుతుందా? లేదు. నీ ఆజ్ఞ ప్రకారమే సర్వము జరుగుతుంది. ఒకడు ఒక స్వప్నము నుండి మరొక స్వప్నమునకు వెళ్లునట్లు ... నేను ఈ దేహమును పరిత్యజించి నీ సంకల్పానుసారం పూర్వదేహమును గ్రహిస్తాను. నిన్ను దర్శించినందుకు నాకెంతో సంతోషంగా ఉన్నది. నేను సర్వదా నీకు శరణాగతుడనే. నాదొక విన్నపం. ఉత్తములకు తమను ఆశ్రయించిన వారిని త్యజించటం తగదు కదా! అందుచేత, నేను వెళ్ళబోవుచోటికి నా ఈ మంత్రి, మహారాణి కూడా వచ్చేటట్లు అనుగ్రహించు.

శ్రీ సరస్వతీదేవి : అటులనే అగుగాక. ఈ రణరంగమున నీవు మరణించవలసి ఉన్నావు. మీరు 'ఆతివాహికదేహం'చే పద్మని నగరం చేరబోవుచున్నారు. అక్కడ జీవచ్ఛవమై, శరీరమాత్రమై పడివున్న నీ దేహము పొందుతావు. అక్కడ నీ మంత్రిని, మహారాణిని కూడా పొందుతావు. ఆపై యథాతథంగా రాజ్యం ఏలుతావు.

మేము ఎట్లు వచ్చామో అట్లే మరలగలము.

❖

ఆవిధంగా వారు సంభాషించుకొంటూ ఉండగా, ఇంతలో ఒక సైనికుడు అక్కడికి వచ్చాడు. "ప్రభూ! సముద్రము లాంటి శత్రుసైన్యము ఈ వైపునకు వస్తోంది. మన నగరము నాలుగు వైపుల నిప్పు అంటుకొని 'ఛటఛట' ధ్వనులతో తగులబడిపోతోంది" అని చెప్పసాగాడు.

కోలాహలం మిన్నుముట్టింది. ఒక్కసారిగా పురజనుల గావుకేకలు, అగ్నిశిఖల 'ధగధగ' ధ్వనులు వినవచ్చాయి. ఆకాశమంతా పొగతో నిండిపోయింది. కర్కశ శబ్దఘోషలతో స్త్రీలు, బాలురు, తదితరులు రోదించసాగారు. ఆ అగ్ని ఎంతో రాజసంపదను బూడిద చేసింది. సజ్జనుల మనస్సులలో ఉపదేశములు దాగివుండునట్లు, కొందరు జనులు తగులబడుచున్న ఇళ్ళను వదలి ప్రశాంతమగు కొండగుహలలో సకుటుంబముగా పరుగులు తీసి దాగుకొనియున్నారు. మరికొందరు అగ్నికి ఆహుతి అయిన తమ బంధువుల కళేబరములను వదలి ఈవలకి రాలేకపోతున్నారు. ఆహాఁ! ఈ ప్రాణులను మమకార బంధములు ఎంతగా కట్టి పడేస్తాయి! సైనికులు కూడా "మమ్ములను రక్షించేవారెవరూ లేరా?" అని ఆ అగ్నిశిఖల మధ్యలోంచి ఆక్రందనం చేస్తున్నారు.

❖

ఇంతలో రాజ పట్టమహిషి తన చెల్లికత్తెలతో రాజప్రసాదం ప్రవేశించి, రాజును సమీపించింది. చెలికత్తెలు, "ఓ రాజా! ఆయుధములు ధరించి శత్రుసైనికులు అంతఃపురంలో అకస్మాత్తుగా ప్రవేశించారు. మీ భార్యలనందరినీ బంధించి గొనిపోయారు. శాఖ-ప్రశాఖలుగా విస్తరిల్లుచున్న ఈ ఆపదల నుండి మమ్ము రక్షించేశక్తి మీకొక్కరికే ఉన్నది" అని రోదిస్తూ చెప్పుకోసాగారు. అప్పుడు రాజు లీలాసరస్వతుల వైపు చూచి, "ఓ దేవతలారా? నేను యుద్ధసన్నద్ధుడనై వెళ్ళుచున్నాను. నా శత్రురాజులు యుద్ధనీతిని అతిక్రమించి అంతఃపురంలో సైన్యప్రవేశమునకు ఉద్యుక్తులైనట్లున్నారు. ఇక విజయమో, వీరస్వర్గమో తేల్చుకోక తప్పదు. మిమ్ములను విడచి వెళ్ళుచున్నందుకు క్షమించండి. నా భార్యను రక్షించే భారం మీదే" అని పలికి వినమ్రతగా నమస్కరించాడు. ఆయుధ పాణియై భీకరంగా గర్జనచేస్తూ యుద్ధభూమివైపు తరలివెళ్ళాడు. అతని రాకకై వేచియున్న సైనికులు అతనిని అనుసరించారు.

లీలాదేవి యుద్ధభూమికి తరలివెళ్ళుచున్న విదూరథుని వైపు నుండి దృష్టిని మరల్చి రాజ పట్టమహిషి వైపు చూచింది. ఎంత ఆశ్చర్యం! ఆ పట్టమహిషి అచ్చు తనలాగానే .... తన ప్రతిబింబమా అన్నట్లున్నది.

❖❖❖

29. చిత్తము ఎట్లా ఉంటే .... దృశ్యము అట్లే!

లీలాదేవి : అమ్మా! జగన్మాతా! ఇది గమనించావా? ఈ మహారాణిని చూడు. పద్మని రాజ్యంలో నేను ఏ రూపము కలిగి ఉన్నానో, ఈమె కూడా అచ్చు అదే రూపము కలిగి ఉన్నదేమిటి? దీనికేమైనా ప్రత్యేక కారణమున్నదా? ఇది కాకతాళీయమా? ఇక్కడి మంత్రులను, సామంతులను చూస్తుంటే "ఇదంతా పూర్వరాజ్యమే" అన్నట్లు తోచుచున్నది? అద్దంలో ప్రతిబింబించే దృశ్యంలాగా

వీరు నా 'వెలుపల-లోపల' కూడా ఉన్నట్లున్నారే? వీరంతా సచేతనులా? లేక కల్పిత రూపము కలవారా?

శ్రీ సరస్వతీదేవి : హృదయంలో .... వ్యక్తులకు, వస్తువులకు సంబంధించిన జ్ఞానం- కలుగుచున్నది కదా! అదేవిధంగా క్షణకాలంలో అనుభూతులు కూడా కలుగుచూ ఉంటాయి. స్వప్న సమయంలో వస్తువులను, వ్యక్తులను, సంఘటనలను చూస్తున్న చిత్తమే .... ఆయా రూపములన్నీ స్వయముగా ధరించి వ్యవహరిస్తోంది. అంతేకాని స్వప్నంలో చిత్తమునకు వేరైనది, బాహ్యమైనది ఏ సమయమందు ఏదీ లేదు.

చిత్‌శక్తియే చిత్తముయొక్క ఆకారమును పొందుచున్నది. చిత్ చైతన్యము అను దర్పణమును అనుసరించే ఈ 'జగత్తు' అను దృశ్యము అందు ప్రతిబింబిస్తోంది. చైతన్య దర్పణమును అనుసరించే దృశ్యముయొక్క అనుభవం ఉండి ఉంటోంది.

1. కుంభాకార (Concave Lense) దర్పణంలో పెద్ద దృశ్యము చిన్నగా కనబడుతోంది.
2. పుటాకార (Convex Lense) దర్పణంలో చిన్నవి పెద్దవిగా కనిపిస్తాయి.

సంస్కారము ఎట్టిదై ఉంటుందో ... చిత్తమున ప్రతిబింబించే జగత్తు కూడా అట్టిదే అవుతుంది.

వాస్తవానికి చిత్‌చైతన్యము సర్వావస్థలందును (జాగ్రత్ - స్వప్న - సుషుప్తులందును) మధ్యస్థమైయున్నది. కాని, అది ఎక్కడో బాహ్యమున ఉన్నట్లుగా తోచుచున్నది. స్వప్నంలో కనబడే వస్తువులే ఇందుకు మనకు దృష్టాంతము. స్వప్నపదార్థజాలమంతా అంతరముననే ('with-in' only) ఉన్నప్పటికీ ఎక్కడో బయటగా ఉన్నట్లు తోచుచున్నది కదా! ఓ లీలాదేవీ! కొంత సూక్ష్మబుద్ధితో విను.

"జగత్తు" అనగా ఎక్కడో బాహ్యమున ఉన్నది కాదు. అంతఃపరికల్పితమైన దృశ్యావ గాహనయే (Internally or Inwandly visualised perception) బాహ్యజగత్తువలె ప్రాప్తిస్తోంది. కాబట్టి ఈ జగత్తు అనబడునది బాహ్యమున కాకుండా అంతరంగము నందే భావనారూపమున ఉండియున్నది.

అట్టి అంతఃపరికల్పితమైన ఈ జగత్తే ఎక్కడో బయట ఉన్నట్లు తోచుచున్నది.

లీలాదేవి : అమ్మా! నీవు చెప్పేది అత్యంత చమత్కారంగా ఉన్నది సుమా! "ఈ మాచే చూడబడేదంతా వాస్తవానికి మేము మా అంతరముననే కల్పనా వ్యవహారముచే అట్లు గాంచుచున్నాము" అని నీవు ప్రతిపాదిస్తున్నట్లున్నావు. కాని మేము వాస్తవానికి ఇదంతా బాహ్యముననే ఉన్నట్లు పొందుచున్నామే? ఎందుచేత?

శ్రీ సరస్వతీదేవి : అట్లు తోచుటకు (లేక పొందుటకు) కారణమేమిటో చెపుతాను. విను.

"ద్రష్ట-దృశ్యము" .... ఈ రెండూ చైతన్యమే కదా! కనుక "స్వస్వరూపము .... ఈ నేను - నీవు - జగత్పదార్థములతో కూడిన జగత్తు" .... ఇదంతా వాస్తవానికి శుద్ధ చైతన్యమునకు వేరైనది కాదు. అయితే చైతన్యము సర్వవ్యాపకము కదా! అందుచేత "అంతరముననే తోచుచున్న మిథ్యాజగత్తు

చిరకాలపు అభ్యాసం వలన, ఎట్టి ఆటంకము లేకుండా, బాహ్యమున సంస్థితమైన వ్యవహారమువలె తోచుచున్నది" .... అని గ్రహించు. "ఈ దృశ్యప్రపంచము ఇట్లు బయటగా ఇప్పటికిప్పుడే చూస్తున్నాను" అని ఈ జీవుడు అనేక జన్మల అభ్యాసవశంచేత దృఢంగా భావించుటచే అది అతనికి అట్లే ప్రాప్తించుచున్నది కాని, "ఇదంతా నా అంతరంగమే ఇట్లు గ్రాహ్య విషయముగా కల్పించి, దర్శించుచున్నది" .... అనునది గ్రహించలేకున్నాడు. తాను ఎచ్చటికైతే ప్రసరించడో అచ్చట అతనికి ఏ అనుభవం ఏర్పడియే ఉండదు. అయితే ఈ జీవుడే ఒకానొకప్పుడు గురువాక్యశ్రవణ ప్రభావం చేతనో, లేక, శాస్త్రబోధ గ్రహించటం చేతనో, లేక స్వవిమర్శచేతనో .... లేక ఈ మూడిటి సమన్వయం చేతనో .... "ఈ చూడబడునదంతా నా అంతరంగమునందే చిత్తముచే సంస్కారరూపమున ఇట్లు అనుభవమగుచున్నది" అని గ్రహిస్తున్నాడు. అట్టి అవగాహన సుస్థిరపడగా అభ్యాసవశం చేత .... "ఔను! నేను చైతన్యమే స్వరూపముగా గలవాడను. ఈ సర్వము కూడా చైతన్యమే. చైతన్యము కంటే వేరుగా 'నేను-నీవు-జగత్తు' అనునవి లేవు" .... అను చైతన్యానుభవం పొందుచున్నాడు. అదియే దివ్యమగు స్వస్వరూపానందానుభూతి. అట్టివాడు మోక్షస్వరూపుడే అగుచున్నాడు. అట్టి అనుభవజ్ఞానము గల జీవుడే శివ స్వరూపుడై శేషిస్తాడు.

❖

ఇప్పుడు, ఈ మహారాణి – ఈ మంత్రులు ఇతఃపూర్వపు రాజ్యములోని వారివలె ఎందుకు ఉంటున్నారో చెపుతాను. విను.


నీ భర్త ఇతఃపూర్వము మరణించియున్నాడు కదా! అట్లు 'పద్ముడు'గా మరణించినప్పుడు శేషించియున్నట్టి సంస్కారములను అనుసరించే, అతడీరూపములను గ్రహించినాడు. మహారాణి విషయమే కాకుండా, మంత్రుల విషయంలో కూడా అట్లే జరిగింది. అతడు ఇప్పుడు కూడా "ఈ నా మంత్రి నా వెంటనే ఉండును గాక" అని నన్ను అభ్యర్థించటం విన్నావు కదా! అయితే వీరందరు మునుపటివలెనే అగుపడుచున్నప్పటికీ "మనస్సు – బుద్ధి – అహంకారము"ల దృష్ట్యా వీరు వారికి అభిన్నులనుకొంటున్నావా? కాదు. వీరు వేరైనవారే. అయితే చైతన్యమునందు వీరంతా 'సద్రూపులే' సుమా!

జాగ్రత్‌లో అనుభూతములగుచున్న వస్తువులు స్వప్నవస్తువులవలె కాకుండా కొంత సర్వ సాధారణత్వముతో కూడి ఉన్నట్లనిపిస్తున్నమాట నిజమే. కాని, ఈ జాగ్రత్ వస్తువుల సంబంధము కూడా కాలవశంచేత నశిస్తూనే ఉన్నాయి కదా! అనగా "ఏ ఏ సంబంధములు అత్యంత ఘనీభూతము లగు వాస్తవమని ఒక సమయంలో తోచుచున్నాయో, మరొక సమయంలో అవి అట్లు తోచటంలేదు" .... అనే విషయం పసిపిల్లవాడు కూడా గ్రహించగలుగుచున్నట్టి విషయమే. ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు తొలగిపోయే సంబంధాలు 'వాస్తవము' అని ఎట్లా నిర్ణయిస్తాము?, దృష్టాంతానికి – "ఈమెను నేను ప్రేమించాను. ఈమె నా దేవత. ఈమె లేకుంటే నా జీవితమే నిస్సారము" అని భావించబడిన ఒకానొక సంబంధము, మరికొంత కాలం తరువాత, "ఈమె నాకెట్లా ఎందుకు


దాపరించింది?" అను రూపమును కూడా పొందవచ్చును కదా! ఇక ఇక్కడేది వాస్తవం? అయితే ఈ జీవుడు ఎప్పటికప్పుడు .... "ఇది ఇంతే, ఇంత మాత్రమే" అనునట్టి ఘనీభూతభావము కలిగి యుండుటచేత .... ఈ జగద్దృశ్యము యొక్క చంచలత్వమును, అసత్యత్వమును గ్రహించ లేకపోవు చున్నాడు. అన్నిటికీ కారణం అవిచారణయే సుమా! దూరదృష్టి గల జ్ఞానులగు మహనీయులకు ఈ వర్తమానజగత్తులోని అసత్యత్వము, స్వప్నదృశ్యమువలెనే బుద్ధియందు సుస్పష్టముగా తోచుచున్నది.

ఓ లీలాదేవి! మన ఈ విచారణను అనుసరించి "స్వప్నజాగ్రత్తులలో అనుభూతమగుచున్న వస్తుజాలమంతా, 'నాస్తిత్వము' అను గతియే కలిగియున్నది" .... అని తెలియవచ్చుచున్నది.

"స్వప్నే జాగ్రదసద్రూపా స్వప్నో జాగ్రత్యసన్మయః"



స్వప్నకాలంలో జాగ్రత్ 'అసత్తు' అగుచున్నట్లే, జాగ్రత్‌కాలంలో స్వప్నము 'అసత్తు' అగుచున్నది. అట్లే సూక్ష్మబుద్ధితో మరొక విషయం కూడా విను : జన్మించిన క్షణం నుంచి మృత్యువునకు సంబంధించిన స్థితి అసద్రూపమే అగుచున్నది కదా!



అట్లే మృత్యుసమయంలో ఈ జన్మయందలి అనుభవములు స్వప్నమాత్రంగా 'అసద్రూపములు' అగుచున్నాయి. వస్తువులు ధ్వంసమగుచున్నప్పుడు .... మొట్టమొదట ఆ వస్తువు యొక్క అవయవములు వినష్టమౌతున్నాయి. ఆ తరువాత క్రమంగా ఆ వస్తువు యొక్క అభావం సిద్ధిస్తోంది. అట్లు ఆ వస్తువు తొలగిపోతున్న సమయంలో ఒకానొక విపర్యానుభవం (Altogether a different state of Experience) కలుగుచున్నది కదా! అట్లే (1) జన్మకు ముందు ఎదురుగా ఉండే అనుభవం, (2) జన్మించేటప్పుడు అనుభవం, (3) ఆ శరీరము కలిగియున్నప్పుడు ఏర్పడుచున్న అనుభవం, (4) దేహానంతర అనుభవం ఇవన్నీ ఒకదానిని మరొకటి మ్రింగివేస్తున్నాయి. అయితే లీలా! ఈ అన్ని స్థితి-గతులు ఏ ద్రష్ట యొక్క అనుభవంగా రాక-పోకలు చేస్తున్నాయో ... అట్టి ఆ ద్రష్టయే ప్రత్యగాత్మ స్వరూపుడు. అతడే శుద్ధచైతన్య స్వరూపుడు. అతనికి ఈ జన్మమృత్యువులు ఆపాదించబడజాలవు.

ఓ ప్రియపుత్రీ! లీలాదేవి! ఈ విధంగా ఈ జగత్తు "సత్తు" (ఉండియున్నది that which exists) కాదు. "అసత్తు" (లేకయున్నది : that which does not exist) కాదు. ఇదంతా చిత్తమును అనుసరించి కేవలము భ్రాంతి రూపంగా భాసిస్తోంది. "మహాప్రళయము" అనబడు ఒకానొక స్థితి శాస్త్రములచే బోధింపబడుచున్నది. ఆ స్థితి యందు జీవుడు ఈ జగత్తు, ఇందలి 'నేను-నీవు' మొదలైన పదార్థములు ఉండవు. ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లభించనిది సత్యమెట్లా అవుతుంది. సత్యమైనది త్రికాలములచే (భూత-భవిష్యత్-వర్తమానములచే) అబాధ్యమై (బాధింపబడజాలనిదై, తొలగింపబడజాలనిదై) ఉండాలి. "మరొకప్పుడు లేకపోవునది ఇప్పుడు కూడా ఉండియుండలేదు" అని గ్రహించుటే జ్ఞానము.

అందుచేత, "అధిష్ఠానమగు 'బ్రహ్మము' ఒక్కటే సత్యము" అని గ్రహించు. బ్రహ్మమే ఈ జగత్తు అయివున్నది. ఎందుకంటే, ఆ 'బ్రహ్మము', నందే 'సృష్టులు' అను భ్రాంతులు ఉదయిస్తున్నాయి. సముద్రము నందు తరంగములు లేచుచున్నట్లు బ్రహ్మమునందే ఈ జగత్తులు తోచుచున్నాయి. కానీ – "ఈ 'జగత్తులు' అనబడేవన్నీ ఆకాశములో దృష్టిదోషం చేత కనిపించే కేశములు (వెంట్రుకల వంటి ఆకారములు) వలె మిథ్యమాత్రమే" .... అనటంలో సందేహం లేదు. ఆహాఁ! ఏమి చమత్కారం! ఏమి వైచిత్ర్యం! పెనుగాలియందు వాయువీచికలు లేచి, కొంతసేపు ప్రసరించి, ఇంతలోనే లయించుచున్నట్లు .... ఈ సృష్టులు కూడా ఉత్పన్నములై మరల బ్రహ్మము నందు విలీనములై పోతున్నాయి. అందుచే, లీలాదేవీ! ఆత్మవస్తువునందు ఒనర్చ బడుచున్న ఈ "నీవు-నేను-నీది-నాది-అప్పుడు-ఇప్పుడు" అను విభాగములన్నీ మిథ్యయే అని గ్రహించు. మృగతృష్ణా జలమువలె భస్మప్రాయమై, భ్రమాత్మకమైయున్న సృష్టిపై నీకు విశ్వాసమెందుకో చెప్పు? ఎచ్చటైయితే ఎట్టి భ్రాంతికి ఏమాత్రం చోటు ఉండదో .... అదియే 'పరమపదము' అయివున్నది సుమా!

గాఢాంధకారమువైపు చూచుచున్న అజ్ఞానబాలుడు, "అవును! అక్కడ ఒక దయ్యము నాకు కనబడుతోంది. ఆ కదలికలు దయ్యానివే! అనుమానం లేదు" అనునట్టి భ్రాంతిని పొందుచున్నాడు. "నాయనా! అక్కడ దయ్యమేమీ లేదు. నీ భ్రమయే నీకు అట్లు తోపింపచేస్తోంది. అవన్నీ వెలుతురులో నీవు చూచే చెట్టు, గుట్ట, గోడలే" అని ఎవరైనా చెప్పినా, అతనికి నమ్మకం కుదరకపోవుటచే "లేదు. అది దయ్యమే" అని పలుకుతాడు, చూచావా? అట్లే జనన-మరణములతో కూడుకొనియున్న "అజ్ఞాన-వ్యామోహ ఫలితము" అయివున్న ఈ జగత్తుపై గల అజ్ఞానపూర్వక అభిప్రాయముల వలన ఈ జీవుడు సత్యమేమిటో గమనించలేకపోవుచున్నాడు. దురభ్యాసమే, ... అనగా, "పదార్థములు వాస్తవం. నేను శరీరమాత్రుడను. ఏదో శక్తి చేతిలో కీలుబొమ్మను" .... మొదలైన దురభిప్రాయాల్ని అనేక జన్మలుగా అభ్యసించుటయే అందుకు కారణం. అయితే ఈ 'దురభ్యాసము' "ఆత్మయొక్క స్వభావము నా వాస్తవస్వభావమైయున్నది. మరి నేను ఆత్మనేకదా" .... వంటి "సదభ్యాసము"చే జయింపబడగలదు. ఈ 'జగత్తు' అనబడు భావావేశం జీవునియందు శేషించగా ... అప్పుడు మిగులునది పరమసత్యమగు బ్రహ్మము ఒక్కటే.

"ఈ జగత్తు సత్యము కాదు. నాకు ద్రష్టత్వము లేదు. ద్రష్టత్వమే లేనిచోట దృశ్యమెట్లా ఉంటుంది? కనుక 'నేను' అను రూపమున స్ఫురించుదానితోసహా ఈ సర్వము చైతన్య స్వరూపమగు బ్రహ్మము యొక్క ప్రసరణమే అయివున్నది." .... అనునట్టి జ్ఞానముచే ఈ జగద్వ్యాకులతలు, విపరీత–ధోరణులు తొలగిపోతాయి. అందుకొరకై జీవుడు ఎందుకు ప్రయత్నించరాదో చెప్పు? స్వకీయమగు అజ్ఞానమే అందుకు అడ్డు అగుచున్నది. అజ్ఞానముచే ఉత్తమమార్గములను ఉపేక్షించటం చేతనే ఈ జీవుడు తన వాస్తవ స్వభావమును గ్రహించలేకపోవుచున్నాడు.

'బ్రహ్మము' కాక ఇక సత్యమంటూ మరేదీ లేదు. ఈ దృశ్యము సత్యము కాదు. ఒకే పదార్థము "సత్యము–అసత్యము" .... అనునట్టి రెండు వేరువేరు ధర్మములను పొందలేదు కదా! "మార్పు చెందటం" అను ధర్మము గలిగినట్టి సర్వము విడనాడి "మార్పుచెందని" తత్త్వమును గ్రహించినప్పుడు లభించునదే ఆ బ్రహ్మము యొక్క స్వరూపము.

"ఈ జగత్తుయొక్క మిథ్యాత్వము గ్రహించటం అత్యంత దుర్లభమైన విషయం" అను అభిప్రాయం కలిగి ఉండువారితో మేము ఏమాత్రం ఏకీభవించటం లేదు.

❖

లీలావతి : అమ్మా! అసలు ఈ జగత్తు యొక్క నిజరూపమేమిటి? అట్టి దీని నిజరూపమును గ్రహించగలిగేవారెవరు? మేము ఇందు గ్రహించవలసినదేమిటి? త్యజించవలసినదేమిటి? జననీ! "ఈ జగద్వ్యవహారములు మమ్ము పట్టి పీడించు చుండగానే మేము పరమాత్మను గ్రహించగలమా?" .... అను సందేహం మమ్ము వదలటం లేదు.

శ్రీ సరస్వతీదేవి : ద్రవ్యాదులందు, ఆకాశమునందు పరమాణువులే ఉన్నాయి కదా! ఆ పరమాణువుల మధ్యగల చైతన్యతత్త్వమే ఈ జగత్తు యొక్క నిజరూపము సుమా! అయితే, అణు సముదాయ మాత్రముచే బాహ్యేంద్రియములకు లభిస్తున్న ఈ నామరూప వ్యవహారము ఈ జగత్తు యొక్క వాస్తవ స్వభావముగాని, రూపముగాని ఏమాత్రం కాదు. ఆకారాదులుగా ప్రాప్తించేదంతా 'మిథ్యయే' అని గ్రహించు. ఈ "నేను–నీవు–పదార్థములు" .... అనునదంతా వాస్తవముగా ఉన్నది కాదు. కాని, 'భ్రమ' కారణంగా అనుభూతమగుచున్నది.

ఇక, ఈ జగత్తు యొక్క వాస్తవస్వరూపము 'బ్రహ్మము' అని గ్రహించునది కూడా బ్రహ్మమే అగుచున్నది. బ్రహ్మమే బ్రహ్మమును గ్రహించగలదు. బ్రహ్మము కానిదేదీ బ్రహ్మమును గ్రహించ జాలదు. (బ్రహ్మైవ పశ్యతి బ్రహ్మన్! నాఽబ్రహ్మన్ బ్రహ్మపశ్యతి) చిదాత్మయే తన వాస్తవ స్వరూప స్వభావములను మరచి తన తత్త్వమునే జగత్తుగా గాంచుచున్నది.* మరొకప్పుడు ఆ చిదాత్మయే తన స్వరూప స్వభావములను ఎరిగి, అట్టి ఎరుకయొక్క దృఢత్వముచే ఈ జగత్తును అద్వితీయమగు స్వస్వరూపముగా గాంచుచున్నది.

* "నారుద్రో రుద్రమర్చతి" ..... రుద్రుడు కానివాడెవ్వడూ రుద్రుని అర్చించజాలడు .... అను రుద్రంలోని వాక్యార్థం ఇదే.

అందుచేత ఓ లీలాదేవి! నీవు బ్రహ్మముయొక్క తత్త్వమును గ్రహించుటకే ప్రయత్నం చేయి. "ఇది మాకెట్లు సాధ్యం? మరెప్పుడో, ఎక్కడో ఈ విషయం యోచిద్దాం" .... ఇట్టి అజ్ఞాన దృష్టి నీవు పొందకుండెదవు గాక!

సూర్యోదయమైనప్పుడు కిటికీ గుండా, ఇంట్లోకి ప్రవేశించి సూర్యకిరణాలలో 'త్రస రేణువులు' పరిభ్రమిస్తాయి, చూచావా? అదేవిధంగా 'పరమాకాశము' అనబడు దానియందు "బ్రహ్మాండ సమూహములు" వంటి అనేక త్రసరేణువులు (ధూళికణములు) పరిభ్రమిస్తున్నాయి. వాయువునందు 'చలనము' ఆ చలనమునందు పుష్పముల నుండి బయలుదేరిన "సుగంధం" ఇమిడివున్నాయి కదా! ఆకాశము నందు 'శూన్యత్వము' అనునది ఆ ఆకాశముయొక్క స్వరూపము-స్వభావము అయివుంటోంది కదా! 'అవయవ హీనము' అయినట్టి ఈ జగత్తు అట్లే బ్రహ్మమునందే ఉండి ఉంటోంది. పైకి సాకారంగా అజ్ఞానదృష్టికి కనబడుచున్న ఈ జగత్తు వాస్తవానికి నిరాకారమైనదే సుమా! అయితే "ఇదంతా నిరాకారము" అను అభ్యాసాన్ని ఆశ్రయించాలి. అట్లు గ్రహిస్తున్న అభ్యాస బలంచేత అతిశీఘ్రంగా సర్వవికారాలు వాటంతట అవే తొలగిపోగలవు.

❖❖❖

30. భావాతీతం

లీల : "అసలు ఈ విశ్వము ఎక్కడి నుండి వచ్చి ఈ జీవునకు దాపరించింది?"

శ్రీ సరస్వతీదేవి : ఇదంతా ప్రాప్తిస్తున్నది నిజభావనాబలము చేతనే. "భావనలన్నిటికీ ఆవల అఖండమై, శుద్ధమైయున్న "శుద్ధచిత్‌తత్త్వము" ... తన వాస్తవ స్వభావములగు అద్వితీయత్వము, సర్వాంతర్యామిత్వము మరచి, స్వకీయ కల్పనలను ఆశ్రయించటం చేతనే అయ్యింది ఈ జగత్తు యొక్క అనుభవం పొందుచున్నది" ... అని వేదజ్ఞులు ప్రకటించుచున్నారు.

అందుచేత లీలా! భావనచే ప్రాప్తించినదానిని భావనాబలంతోనే ఎదుర్కోవాలి. ముల్లును ముల్లుతోనే తొలగించాలి కదా! "ఈ జగత్తు పరిపూర్ణబ్రహ్మమునందే నిలిచియున్నది 'పూర్ణమిదమ్' " .... అనునట్టి భావనాబలమునే ఆశ్రయించాలి.

"ఈ జగత్తు అసత్యము" అని చెప్పుటలో, "ఇదంతా లేదు" అని ప్రతిపాదించటం శాస్త్రముల ఉద్దేశం కాదు సుమా! "రజ్జువునందు సర్పముయొక్క అనుభూతివలే .... బ్రహ్మమే అయివుండి స్వతహాగా నిరాకారమైయున్న ఈ జగత్తునందు నీవు భ్రమాత్మకమైన అనేకత్వమును దర్శించుచున్నావు. అట్టి భ్రమను త్యజించు" అనునదే శాస్త్రముల ఉపదేశసారమైయున్నది.

ఒకానొకచోట ఒక మిథ్యాభావం (False impression) అనుభూతమై ఉంటోందనుకో ... ఆ దురవగాహన తొలగేదెట్లా? సత్యాసత్యముల రెండిటినీ సూక్ష్మబుద్ధి - వివేచనములతో పరిశీలించి "ఇది సత్యము ... ఇది అసత్యము ; ఇది గ్రాహ్యము. ఇది త్యాజ్యము" .... అని గ్రహించుటచేతనే కదా! మాయ తొలగింపబడిన తరువాత ... ఇక అప్పుడు "ఈ జీవుడే సర్వమునకు పరమకారణము"

అను విషయం అనుభవపూర్వకంగా తప్పకుండా తెలియవచ్చుచున్నది. ఈ జీవుడు స్వతహాగానే పూర్ణుడు. అయితే 'నేను జీవుడను' అను జీవభ్రాంతివలననే జీవత్వము ప్రాప్తిస్తోంది. ఈ జగత్తు సత్యమవనీ! కాకపోనీ! ఏది ఏమైనా ఇది చిదాకాశమునందే నెలకొనియున్నది. మోక్షస్వరూపులమగు మేము అట్టి అనుభవమునే కలిగియుంటున్నాము. మమ్ములను ఆశ్రయించు మా భక్తులకు అట్టి విజ్ఞాన యోగమునే ప్రసాదించుచున్నాము. బోధించుచున్నాము.

అసలు ఈ సంసారము యొక్క ఉత్పాదనమునకు మూలకారణం ఏమిటి? "జీవుని యందుగల భోగేచ్ఛయే ఇందుకు మూలకారణము" .... అని చెప్పబడుచున్నది. వాస్తవానికి ఈ "సృష్టి" అనబడు దానికి, ఇందలి సత్యత్వ-మిథ్యత్వములకు సంబంధమే లేదు. ఒక విషయం సత్యము కావచ్చు. మిథ్య కావచ్చు. ఇందులో గొప్ప విశేషమంటూ ఏదీ లేదు. కాని .... "ఇది పొందినప్పుడే నేను సంతోషము పొందువాడనగుదును. లేకున్న దుఃఖితుడను" అను రూపముగల భోగేచ్ఛావృత్తియే సర్వసంసారానర్థములకు ఉత్పత్తిస్థానమగుచున్నది. అనగా, ఈ జీవుడు స్వయముగా శివస్వరూపుడై ఉండి కూడా, తనకుతానే 'ఇచ్ఛ' అను దోషముచే, లేక, "కోరుకొను విషయములు" అను దోషధూళిచే కప్పబడి ఉంటున్నాడు. ఆ ఇచ్ఛలే తదనంతరము అతనికి ఇష్టాయిష్టములుగా, సుఖ-దుఃఖములుగా ప్రాప్తిస్తున్నాయి. ఆ అనుభవం ఒక్కొక్కప్పుడు సంపూర్ణంగా మునుపటివలెనే ఉంటోంది. మరొకప్పుడు ఒకింత పోలికతోనూ, ఇంకొకప్పుడు పూర్తి వ్యతిరిక్తముగానో ఉంటోంది. చూచావా! లీలా! 'ఇచ్ఛ'ను అనుసరించి దృశ్యము పొందబడడం ఈ జీవుని 'సత్యసంకల్పత్వ న్యాయము'ను నిరూపించుచున్నది. కాని, ఈ 'అనుభవములు' అనబడునవన్నీ మిథ్యా స్వరూపములే అయివుండి, జీవాకాశమును ఆశ్రయించుకొని ఉంటున్నాయి.

❖

ఈ జీవుని ఇచ్ఛా-సంకల్పముల బలమును అనుసరించి కొన్నిసార్లు శరీరత్యాగానంతరం కూడా వెనుకటివలెనే యత్నములు, సంబంధములు, వ్యక్తులు మొదలైనవి సంభవింపజేసు కుంటున్నాడు. అట్లు జరుగునట్లే మన ఈ విదూరథుని విషయంలో మంత్రులు భార్య మొదలైనవారు ఇతఃపూర్వమువలెనే ప్రతిభాసించటం జరుగుతోంది. అయితే అట్టి ఈ సంసార వ్యవహారమంతా సత్యస్వరూపమగు ఆత్మయందు ఏర్పడి ఉంటోంది. "ఇది సత్యము" అని ఎట్లు ఏది సంకల్పించ బడుచున్నదో, అది అట్లే వాస్తవమై ప్రాప్తించుచున్నది. విదూరథుని శుద్ధ సంకల్పతత్వమగు ఈశ్వరుని ఇచ్ఛను అనుసరించే ఈ పట్టమహిషి లీల అచ్చు నీ వలెనేయున్నది. సర్వమునందు ఏకరీతిగా ప్రసరించి ఉండే ఆత్మచైతన్యమునందు ఇట్లు 'ప్రతిభ' సర్వదా ప్రతిబింబిస్తూనే ఉన్నది. ఆయా రూపములన్నీ ఆయా అంతరంగ భావనాబలం అనుసరించే ఉదయిస్తూ ఉంటాయి. జీవాకాశమునందు మొట్టమొదటగా సంకల్పము ఉదయించి, ఆ తరువాత క్రమంగా ఆ సంకల్పమే బాహ్యమునందు ఇట్లు దృశ్యరూపమున గాంచబడుచున్నది. అంతరంగమున ఉన్నదే బాహ్యమున ప్రకాశించుచున్నది సుమా!

ఓ లీలాదేవి! నీవు, నేను, ఆకాశము, పృథివి, ఈ రాజు, ఇతని పట్టమహిషి, మంత్రులు .... మొదలైనవన్నీ చిన్మాత్రమే స్వభావముగా కలిగినవై అహంభావము నందు స్ఫురించుచున్నాయి. ఈ జగత్తులో కనబడేదంతా 'సత్త' మాత్రస్వభావము కలిగియుండుటచేత, తత్త్వజ్ఞులు "ఈ జగత్తంతా చిదాకాశము యొక్క గర్భమునందే, వాయువునందు స్పందమువలె, ఉండివున్నది" అని చెప్పు చున్నారు. ఇది గ్రహించినప్పుడే, నీ స్వస్వభావము ఏమిటో కూడా గ్రహించి, స్వస్థురాలవు అవుతావు.

❖❖❖

31. ఆరాధన - లక్ష్యార్థం

ఇంతలో, క్రోధావేశంతో ఆయుధములు ధరించి యుద్ధరంగమునకు వెళ్ళుచున్న తన భర్తను చూస్తూ ఉన్న "ద్వితీయలీల (విదూరథుని పట్టమహిషి) అతడు కనుమరుగు అవగానే, తన దృష్టిని మరల్చి ఆ ప్రక్కనే ఉన్న సరస్వతీదేవిని చూచింది. వెంటనే ఆమెను సమీపించి ప్రణామం చేసింది.

ద్వితీయలీల : హే మాతా! అప్సరసవలె, దేవతామూర్తివలె, కరుణారసమూర్తివలె వెలుగొందుచున్న మీరెవ్వరు? నేను ప్రతిరోజు జ్ఞప్తిదేవతయగు సరస్వతీదేవిని అర్చిస్తూ ఉంటాను. ఓ అంబా! అట్టి నా ప్రియాతిప్రియమగు హృదయదేవత నీవే అయి ఉంటావనిపిస్తోంది. ఆ తల్లి నాకు ప్రతిరోజు రాత్రిపూట దర్శనం ప్రసాదిస్తూ ఉండేది.... అవును. ఆ పరమపావనిని నీవే. ఈ ఆపత్కాలంలో మమ్ము కాపాడటానికి వచ్చావా? నా తల్లీ! నీకు మరల మరల నమస్కరిస్తున్నాను.

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! విదూరథ పత్నీ! నీవు యావజ్జీవితము నాపట్ల చెల్లించిన భక్తి ప్రపత్తులకు నేను ఎంతగానో మెచ్చుకొంటున్నాను. అందుచేత నిశ్చింతురాలవు కమ్ము. నీ ఇచ్ఛ వచ్చిన వరం కోరుకో.

ద్వితీయలీల : దేవీ! ఒకవేళ, నా భర్త విదూరథుడు ఈ యుద్ధంలో పరాజయం చవిచూడవలసివస్తే దేహమును త్యజించి మరొకచోటికి వెళ్ళటం జరుగుతుంది కదా! అతడు ఎక్కడికి వెళ్ళునో అక్కడ నేను ఈ దేహముతోనే అతని భార్యనై ఉండునట్లు వరం ప్రసాదించు.

శ్రీ సరస్వతీదేవి : వత్సే! నీవు చిరకాలంగా నిర్విఘ్నంగా ధూప-దీప-పుష్పాదులతో అర్చించావు. అందుచేత నీ కోరిక అట్లే నెరవేరుగాక!

ద్వితీయలీల పరమసంతుష్టురాలై కృతజ్ఞతాపూర్వకంగా ప్రణామం చేసింది. ఇదంతా గమనిస్తున్న పూర్వలీల సరస్వతీదేవి వైపుకు తిరిగి తనకు కలిగిన సందేహం వెలిబుచ్చసాగింది.

❖

పూర్వలీల : ఈశ్వరీ! నీవు సత్యసంకల్పురాలివి కదా! నీవంటి సత్యసంకల్పులకు ఏది ఎట్లు సంకల్పిస్తే అది అట్లే సిద్ధిస్తుంది. నాకొక సందేహం వచ్చింది. నీవు నన్ను ఇతఃపూర్వం గిరిగ్రామం తీసుకువెళ్ళునప్పుడు నా పూర్వశరీరముతో తీసుకుపోలేదు. ఆ శరీరమును పద్మని దేహము ప్రక్కనే త్యజింపచేయించావు. ఆతివాహిక దేహముతో (మనోమయరూపముతో) మాత్రమే నీవు-నేను

కూడా గిరి గ్రామం వెళ్ళాము. నీవు అప్పుడు అట్టి నిర్ణయం ఎందుకు తీసుకొన్నావు? ఇప్పుడు ఈ ద్వితీయ లీల విషయంలో భౌతిక దేహంతో భర్తను ఉత్తరలోకములవరకు అనుసరించటానికి అనుజ్ఞ ఇస్తున్నావే? ఎందుచేత?

శ్రీ సరస్వతీదేవి : ఓ వరవర్ణనీ! నీ ప్రశ్న ఉత్తమమైనదే. కాని, "సరస్వతీదేవి" అను నామ-రూపములతో మీరు ఆరాధించుచున్న నేను వాస్తవానికి ఎవరిని? "నిష్క్రియతత్త్వమగు ఆత్మవస్తువు"ని మాత్రమే. నేను స్వయముగా ఏదీ చేయను. దేనికీ కూడా కర్తనుకాను. నాకు వాస్తవానికి ఈ నామ-రూపాదులు కూడా లేవు. ప్రతిజీవిలో ఇచ్ఛ-జ్ఞాన స్వరూపిణిగా ఉన్న నాకు భౌతికరూపం ఏమి ఉంటుంది? అయితే ఈ ఈ నామరూపాదులు నన్ను ఉపాసించుచున్న నా భక్తులయొక్క ఉపాసన - ఆరాధనల సౌలభ్యం కొరకు అంగీకరించుచున్నాను. ఈ జీవులు నన్ను ఆరాధించటం ద్వారా చేస్తున్నది. తమతమ స్వస్వరూపారాధనయే. అట్టి ఆరాధనయొక్క ప్రయోజనంగా వారు ఆయా కోరుకొనుచున్న ఫలితములను పొందటం జరుగుతోంది. ఇందులో నేను దేనికీ 'కార్యమును' గాని, 'కారణమును' గాని కాను.

సంవిత్ - స్వరూపమే అధిష్ఠానముగా గలిగినట్టి 'జ్ఞప్తి' అనునదే నా బాహ్యరూపము. జీవశక్తి స్వరూపమగు 'చిచ్ఛక్తి'యే నేను కదా! ఇట్లు నేను సర్వజీవుల అంతరంగము నందు "సాక్షిత్వము" రూపమున ఉండియే ఉన్నాను. అట్లు ఉండి జీవుల వాంఛితములను సత్తమాత్రంచేతనే ప్రకాశితమొనర్చుచూ ఉంటాను. దీపం వెలుగుచుండుట మాత్రంచేతనే తనకు 'ఇచ్ఛ' లేకుండానే గదిలోని వస్తువులనన్నిటినీ ఆ దీపం కనబడునట్లుగా చేస్తోంది. నాయొక్క 'ఉనికి' మాత్రంచేత జీవుల హృదయములోని ఆయా వాంఛిత విషయములు ప్రకాశిస్తున్నాయి. ఏ జీవునియందు ఎట్టి శక్తి ఉదయిస్తోందో, అది అట్లే ఫలించుచున్నది. నేను ఎవరి ఇచ్ఛకు కారణము కాదు సుమా!

అందరూ ఉపాసిస్తున్నది స్వస్వరూపమునే :

నీవు నన్ను ఆరాధిస్తున్నప్పుడు, నీయొక్క జీవశక్తి "నేను ముక్తిని పొందెదను గాక" అను రూపమున ఉండి ఉన్నది. దానిని అనుసరించే నీకు ఇంతవరకు ప్రబోధం చేశాను. చేస్తున్నాను. నా ప్రవచనము, చర్చ మొదలైనవాటిచే యుక్తిపూర్వకంగా నీకు దోషరహితమైన భావమును ప్రసాదించుచున్నాను. "ముక్తి పొందాలి" అను అంతరంగము నందలి తీవ్రేచ్ఛ మరియు బుద్ధి ఉండి ఉండుటచే 'చిత్‌శక్తి' ప్రభావంచేత అట్లే ముక్తిని పొందావు. ఎవని పురుషకారము లేక ప్రయత్నశీలత్వము ఏ రీతిగా ఉంటుందో, అతడు ఆ ఫలమునే యథాసమయమునందు, పొందుచున్నాడు. ఓ సూక్ష్మబుద్ధీ! లీలా! వాస్తవానికి "స్వీయచిచ్ఛక్తి"యే, 'తపస్సు'గానో, లేక 'దేవత'గానో అయి, "ఆకాశము నుండి వాలే ఫలములా?" .... అను విధంగా ఆయా మిథ్యా భూతములగు ప్రయోజనములను సిద్ధింపచేయుచున్నది. అయితే ఈ జీవుడు అట్టి సమయంలో కించిత్ భ్రమకు లోనగుచు, "ఈ పేరుగల దేవుడు, ఆ శక్తిగల దేవత, ఈ విధంగా నాకు ఈ ప్రయోజనములను ప్రసాదిస్తోంది" .... అని భావించుచున్నాడు.

అనగా .... ఎవరు, ఏ పేరుతో, ఎట్లు ఆరాధించినా ... అట్లు ఆరాధించబడునది "స్వీయ చిచ్ఛక్తియే" .... అని గ్రహించెదవు గాక! స్వీయచిత్ ప్రయత్నము కాకుండా ఇంకెక్కడా ఏదీ లేదు. "ఆరాధన" అనునది పురుషకారము యొక్క రూపము. అట్టి ప్రయత్నశీలత్వమే ఆయా ఫలములను ఇస్తోంది. అందుచేత నీవు ఏది పొంద గోరుచున్నావో అద్దానికి అనుగుణంగా ప్రయత్నించు. అంతేగాని, నామ-రూప- క్రియాక్రమాదుల భేదదృష్టిచే భ్రమ చెందకుండెదవుగాక.

స్వసంవిద్యతత్ అన్య న కించిత్ కదాచన ।
ఫలం దదాతి తేనాశు! యథేచ్ఛసి తథాకురు ॥

'చిద్భావము' అనునది సృష్టియందంతటా వ్యాపించియున్నది. దాని యత్నానుసారమే 'ఫలశ్రీ' ఉదయించటం జరుగుతోంది. కాబట్టి ఓ లీలా! ఏది ఉత్తమమో, ఏ మార్గము నందు వ్రతశీలురాల వగుట సముచితమో, శ్రేయస్కరమో, మొట్టమొదట బాగుగా విచారణ చేయి. శాస్త్రములు, గురువులు అందుకు నీకు సహకరించగలరు. ఆ పవిత్రమైన మార్గమును గ్రహించి, అందుకొరకే ప్రయత్నించు. ఈ సంసార భ్రమలను త్యజించి ఆత్మ పథమందు 'అచ్యుత స్థితి'ని ఆశ్రయించు.

❖❖❖

32. యుద్ధ విశేషాలు

సరస్వతీదేవి ప్రసాదంచేత పూర్వలీల, ద్వితీయలీల, ఆకాశములోంచి యుద్ధ విశేషాలు గమనించసాగారు. జయజయశబ్దములు వెన్నంటి రాగా, విదూరథుడు తన రథములో శత్రుసేనల మధ్య ప్రవేశించాడు. యుద్ధం అతిభయంకరంగా సాగుతోంది. ఇటు - అటువైపు వారిచే నానా విధములైన శస్త్రాస్త్రములు దోమలగుంపువలె విరజిమ్మబడుచున్నాయి. ఎటువైపు చూచినా ధనుచ్చల చట చట, కవచముల ఝణ ఝణ.... శబ్దములు, సైనికుల యుద్ధోన్మాద-ఘీంకారాలు, హాహాకారాలు వినబడు చున్నాయి. ఆ యుద్ధంలో సింధురాజుదే కొంచెము పైచేయి కావటం ఉభయలీలలు గమనించారు.

ఉభయలీలలు : హే జగన్మాతా! ఇదేమిటి? ఈ మన విదూరథుని సైన్యం వెనుకంజ వేస్తూ, "ఓటమిని, చవిచూడబోవుచున్నదా"? .... అని అనిపిస్తోందే? నీ భక్తుడగు విదూరథునికి నీవు తోడు ఉండి-ఉండగా అపజయం కలుగటమా? శత్రువగు సింధుదేశ రాజు విజయము పొందటమా? అట్లు జరగటం అసాధ్యమని మేము అనుకొంటున్నాము.

శ్రీ సరస్వతీదేవి : బిడ్డలారా! అదిగో, విదూరథుని శత్రువగు ఆ సింధుదేశ రాజును గమనించారా? అతడు "నేను నా శత్రువులపై విజయము పొందెదను గాక! విస్తారమైన రాజ్యమునకు చక్రవర్తిని అగుదును గాక!" అని కాంక్షించినవాడై నన్ను చాలాకాలం ఆరాధించాడు. అందుచేత అతడే ఈ యుద్ధంలో జయించవలసియున్నది. విదూరథునికి విజయము ప్రసాదించే ప్రసక్తి లేదు. అతడు అపజయమే పొందబోవుచున్నాడు. ఎందుచేతనంటారా? వినండి.

నేను చిత్‌స్వరూపిణిని కదా! అందుచేత ఇచ్ఛ-జ్ఞాన-క్రియాశక్తుల రూపమున అందరి మనస్సులలో ఉండియే ఉన్నాను. ఎవడెవడు ఎట్లెట్లు ఎంతగా ఆరాధించుచున్నాడో, అతనికి అట్టి ప్రయత్నము అనుసరించి అట్టి ఫలమునే ప్రసాదించుచున్నాను. ఎవరు ఏ విధంగా ఏ నామ రూపాదులతో ఆరాధించినా చిచ్ఛక్తి స్వరూపమగు నన్నే ఆరాధించి నట్లగుచున్నది.* అగ్నియొక్క ఉష్ణ స్వభావము మారనట్లు, నా స్వభావము కూడా ఒక్క తీరుగానే ఉంటోంది. నేను సర్వదా, సర్వులందు జ్ఞప్తి తత్త్వమునై (జ్ఞాపకాలను-ఆశయములను స్వరూపంగా కలిగి, ఇచ్ఛాశక్తి స్వరూపిణినై) వెలయుచుండగా ఇక నాకు శత్రువులేమిటి? మిత్రులేమిటి? అందరు నా వారే. అంతయు నాదే. నేను అప్రకటిత చైతన్యమూర్తినై, అందరికీ అధిష్ఠానమునై వెలయుచున్నానని గ్రహించండి.

ఇక ఈ వర్తమాన విషయానికి వస్తే .... ఈ విదూరథుడు, "నేను ముక్తుడనగుదును గాక" అనునట్టి తీవ్రేచ్ఛతో నన్ను ఆరాధించాడు. అంతేగాని, ఈ యుద్ధము నందు విజయము పొందటమనేది అతని ప్రప్రథమ లక్ష్యమై యుండలేదు. అతని ఆరాధనకు ప్రయోజనంగా అతడు ముక్తస్వరూపుడు కాగలడు. ఇతని సరిహద్దు దేశపు సింధురాజు, "నేను ఎట్లాగైనాసరే, ప్రక్కరాజ్యమును జయించాలి. చక్రవర్తిని కావాలి" అని నన్ను ఆరాధించుటచే, అతని పట్ల ఆ ప్రయోజనము అట్లే సిద్ధిస్తోంది. యుద్ధంలో గెలిచిన తరువాత ఈ సింధురాజు చక్రవర్తి అవుతాడు. చాలాకాలం ప్రజారంజకంగా ఈ భూమండలం పాలించబోవుచున్నాడు.

❖

ఆ రోజు యుద్ధం ముగిసింది. మరునాడు మరల యుద్ధం ఆరంభమైనది. త్రిశూలములు, గండ్రగొడ్డళ్ళు, బాణములు, అస్త్రములు .... మొదలైన వాటిచే సంకులసమరం జరిగింది. క్రమంగా ఇరువైపుల సైన్యం పలచబడింది. సింధురాజు-విదూరథ రాజు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. వారు అపర నరసింహమూర్తులవలె తమ యుద్ధవిన్యాసాలతో ఆకాశాన్ని కప్పివేశారు. విష్ణువును ఆరాధించి యున్న వారిద్దరు ఒకరినొకరు తీసిపోవుటలేదు. ఆయుధముల శబ్దములతో, ధనుష్టంకారములతో దిక్కులు పిక్కటిల్లాయి.

తన భర్త యొక్క బాణ ప్రయోగ నైపుణ్యం గాంచిన ద్వితీయలీల, "మాతా! దేవీ! చూచావా, నా భర్త యొక్క యుద్ధ విన్యాసం? నా నాథుడు తప్పక గెలుస్తాడు" అని తల త్రిప్పకుండానే చెప్పుకు పోతోంది. అది చూచి పూర్వలీల-సరస్వతులు గుంభనగా నవ్వుకొంటున్నారు.

---

* **యేయథామాంప్రపద్యన్తే తాంస్తథైవభజామ్యహమ్ ।**
మమవర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ – *భగవద్గీత*

భగవద్గీత జ్ఞానయోగంలో కృష్ణపరమాత్మ "అర్జునా! ఎవరు ఏ విధంగా నన్ను సేవిస్తున్నారో, వారిని ఆ ప్రకారంగానే అనుగ్రహిస్తున్నాను. వాస్తవానికి ఎవరు ఎట్లు ఆరాధించినా (ఏ రూప-నామములు ఆశ్రయించినా) వారు వస్తున్నది నా వైపుకే" .... అని చెప్పియున్నారు కదా!

ఆ ఇద్దరు రాజులు ఒకరి అస్త్రప్రయోగములను మరొకరు వ్యర్థపరచుచున్నారు. సింధురాజు "మోహనాస్త్రం" ప్రయోగిస్తే అందుకు ప్రతిగా విదూరథుడు "ప్రబోధాస్త్రం" ప్రయోగించి నిర్వీర్యం చేసివేశాడు.

సింధురాజు "నాగాస్త్రం" ప్రయోగించాడు. పదార్థములన్నీ విషపూరితమైనాయి. అందుకు గాను "గరుడాస్త్రం" ప్రయోగించబడింది. సింధురాజు "తమోస్త్రం" ప్రయోగించాడు. అక్కడంతా భయంకరమైన చీకటి క్షణంలో అలుముకున్నది. అందుకు ప్రతిగా "సూర్యాస్త్రం" ప్రయోగించబడింది. అనంతరం సింధురాజుచే ప్రయోగించబడిన "రాక్షసాస్త్రం" .... "నారాయణాస్త్రం" చేత, ఆగ్నేయాస్త్రం .... వారుణాస్త్రం చేత, శోషణాస్త్రం ... మేఘాస్త్రం చేత ఉపశాంతింపజేయబడ్డాయి. అప్పుడు సింధురాజు కోపావేశంతో వాయువ్యాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రముచే జనించిన వాయువీచికలచే విదూరథుని రథం గిఱ్ఱున తిరుగసాగింది. ప్రతిగా 'పర్వతాస్త్రం' ప్రయోగించబడింది. వాయువు యథాతథంగా ప్రశాంతత పొందినది. సింధూరరాజు 'వజ్రాస్త్రం' ప్రయోగిస్తే, అది 'బ్రహ్మాస్త్రం'చే నిరోధించబడింది. వెంటనే సింధురాజు 'పిశాచాస్త్రం' ప్రయోగించాడు. అప్పుడు పుట్టిన పిశాచాలు విదూరథుని మ్రింగటానికి నాలుకలు సాచి సమీపించసాగాయి. వెంటనే విదూరథుడు "పిశాచవశ (వినష్ట) అస్త్రంచే వాటిని నియంత్రించాడు. పిశాచాలన్నీ ధూళిగా మారి నేలరాలాయి. అప్పుడు సింధురాజు ప్రయోగించిన 'రూపికాస్త్రము' నుండి పుట్టిన భూత–ప్రేత గణం తన సైన్యంపై ఉరకటం గమనించిన లీలాపతి బేతాళాస్త్రం ప్రయోగించాడు. బేతాళుడు జన్మించి ప్రేతగణాస్త్రాన్ని మ్రింగివేశాడు.

లీలాపతి ఉగ్రుడై ఒక గడ్డిపరకను చేత్తో పట్టుకొని 'మహారాక్షసాస్త్రం' సంకల్పించి ప్రయోగించాడు. దానిని నిరోధించడానికి ఉన్న ఉపాయం ఒక్కటేనని గ్రహించిన సింధురాజు 'వైష్ణవాస్త్రం' ప్రయోగించాడు. అది గమనించిన విదూరథుడు తాత్సారం చేయకుండా తానుకూడా, వైష్ణవాస్త్రం ప్రయోగించాడు. ఆ రెండు అస్త్రముల నుండి ఇతర అస్త్రములు, ఆయుధములు జలప్రవాహంలా వెలువడసాగాయి.

❖

సింధురాజు అంతా గమనించాడు. "ఆహా! ఈ విదూరథుడు ఇంతవరకు అస్త్రములను నిరోధిస్తూనే కాలం గడిపివేస్తున్నాడే? ఇతనికి ఉన్న అస్త్రబలం ఎంతటిదో కదా! ఇట్లా కాకుండా ఇతనిని ఖడ్గయుద్ధంలో నిర్జించివేస్తాను" అని అనుకున్నాడు. ఖడ్గమును చేబూనినవాడై రథం మీద నుంచి క్రిందకు దుమికాడు. విదూరథుడు యుద్ధ మర్యాదను అనుసరించి తానుకూడా ఖడ్గధారియై రథం దిగాడు. వారిద్దరి మధ్య చాలాసేపు భీకరమైన పోరాటం జరిగింది. చివరకు సింధురాజు విదూరథుని విగతజీవుని చేసివేశాడు. విజయోత్సాహంతో సింహనాదం చేశాడు. తమ రాజు నేలకూలడం చూచిన విదూరథుని సైనికులు పరాజయం అంగీకరిస్తూ లొంగిపోయారు.

విదూరథరాజు నేలకూలినాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. శత్రు సైనికులు నగర ప్రవేశం చేశారు. "ఏకఛత్రమండలాధిపుడైన సింధురాజుకు జయమగుగాక" అను నినాదములు

నగరంలోని నలువైపుల వినవచ్చాయి. అతని అభిషేకమునకు రంగం సిద్ధం చేయ బడసాగింది. యుద్ధ పరిసమాప్తిచే దిక్కులు ప్రశాంతములయ్యాయి. నూతన రాజు సింహాసనం అధిరోహించాడు.

❖❖❖

33. "ద్రష్టత్వము" నకు ముందే ఉన్న 'ద్రష్ట'

పూర్వలీల మూర్ఛితుడై ఉచ్ఛ్వాస నిశ్వాసములను మాత్రం ప్రకటిస్తూనే నేలపై పడియున్న .... తన ప్రియుడగు విదూరథుని చూచింది. ఆమె హృదయం చెప్పరానంత బాధతో నిండిపోయింది.

పూర్వలీల : అంబా! నేను ఈ దుఃఖము భరించలేకుండా ఉన్నాను. నా భర్త అక్కడ రక్తపుమడుగులో కొట్టుకుంటున్నాడు. అతడు ప్రాణాలు త్యజించబోవుచున్నాడు. ఆయన అంతటి దుఃఖమును పొందే బదులు నేను ఖండఖండములుగా చీల్చబడవచ్చును కదా! అమ్మా! నీ శిక్షలతో అతనిని బాధించవద్దు. నన్నే శిక్షించు. నీవు చల్లటి తల్లివి కదా! నీ భక్తులమగు మాకు ఇన్ని కష్టాలా చెప్పు?

శ్రీ సరస్వతీదేవి : ఏవమ్మా? లీలాదేవీ? మరల నీవు చమత్కారంగా మాయలో పడుచున్నావుసుమా! ఇప్పుడు నీవిక్కడ ఒక అద్భుతమైన విప్లవం-సంగ్రామం చూచావు కదా! అయితే, స్థిరదృష్టి మరియు వాస్తవ దృష్టులతో చూస్తే ... ఇదంతా స్వప్నతుల్యము మాత్రమే సుమా! ఈ స్వప్నమాత్ర జగత్తులో స్థిరమైనదంటూ ఏమి ఉన్నది చెప్పు? విదూరథుని యొక్క ఈ విస్తారరాజ్యము పద్మని గృహాకాశంలోనే ఉన్నదని, ఆ పద్మని సామ్రాజ్యమంతా వసిష్ఠని గృహాకాశంలోనే ఉన్నాయని మరచావా? అనగా వసిష్ఠబ్రాహ్మణ గృహాకాశంలోనే ఇదంతా విదూరథుని సంకల్పజగత్తుగా ఉండియున్నది.

"నీవు-నేను-ఈ మూర్ఛితురాలైన ద్వితీయలీల-విధూరథుడు-సింధురాజు - వీరి శస్త్రాస్త్ర ప్రయోగాలు - చతుస్సాగర పర్యంతమగు ఈ బ్రహ్మాండము" .... ఇవన్నీ గిరిగ్రామ గృహాకాశంలోనే వెలయుచున్నాయి. ఇట్టి స్వప్నసదృశము, అసత్యము అయిన సంఘటనలకు నీవు దుఃఖించవలసిన పని ఏమున్నదో నాకర్థమగుటలేదు.

కనుక పుత్రికా! నీవు మోహము చెందకుండా ఈ సంబంధ-బాంధవ్యములు ఎట్టివో, ఎవరిచేత కల్పించబడి దుఃఖములను ప్రసాదిస్తున్నాయో గ్రహించు. ఇదంతా స్వయం కల్పితమేకాని వేరేమీ కాదు.


శుద్ధ స్వరూపమగు ఆత్మే ఒకానొకప్పుడు వ్యర్థంగా దృశ్యమును, ప్రేమ మొదలైన భావములను కల్పించుకొని, అందు తాదాత్మ్యము చెందుచు, తన 'స్వస్వరూప స్వస్థితి'ని ఏమరచి అనేక ఉపాధులలో తన్మయమై ప్రవర్తిస్తోంది. మరొకప్పుడు ఉపాధితో ఏకత్వము చెందక, తన 'చిన్మయత్వము' నందే ప్రశాంతబుద్ధిని కలిగియుంటున్నది. సర్వమునకు అధిష్ఠానమగు (ఈ సర్వము ఎందులో ఉండి-ఉన్నదో అట్టిదగు) ఆత్మకు వాస్తవానికి ఉత్పత్తి వినాశనములు లేవు. ఈ శరీరాదుల ఉత్పత్తి - స్థితి - లయములు ఆత్మ - యొక్క 'శుద్ధత్వము- నిత్యత్వము- అఖండత్వము- అప్రమేయత్వము' "

మొదలైన లక్షణములు గల స్వభావమునకు ఏమాత్రం హాని కలిగించలేదు. ఇక నీకు దుఃఖ మెందుకు? అందుచేత ఓ లీలా! "ఇతడిట్లున్నాడేమి? ఈ ఈ సంఘటనలు ఇట్లు ఎందుకు జరగాలి?" అనునట్టి సంసారమునకు సంబంధించిన స్వల్ప ప్రశ్నాసరళిని ప్రక్కకునెట్టి, ఆత్మత్వమునే అనుభవిస్తూ మనస్సులో ఆత్మయొక్క స్వభావమునే ప్రతిక్షేపించుకోవాలి సుమా!

అప్రమేయము : దేనిచేతను ఎట్టి మార్పు-చేర్పులు పొందదు. అందుచేత ఆత్మకు దేనితోను ప్రమేయం లేదు.

సర్వదా, సర్వత్రా, సర్వమునందు వెల్లివిరిసియున్న ఈ ఆత్మయే ద్రష్టత్వముతో కూడుకొని దృశ్యమునందు ప్రకటితమగుచున్నది. అట్లు ప్రకటితమైన తరువాత, ఆ ద్రష్టత్వమును, దృశ్యమును తనకు బాహ్యమైన దానివలె గాంచుచున్నది. ఇక ఈ ఈ బ్రహ్మాండ మండపముల రెండిటి మధ్య ఉన్న ఆకాశమే ఈ బ్రహ్మాండముల యొక్క ఉనికికి స్థానము, కారణభూతము కూడా! కాని అట్టి చిదాకాశము వాస్తవానికి పదార్థశూన్యమైనదే సుమా! అందుచేత ఈ 'జగత్తు' అనబడునది వాస్తవానికి లేదు. "మరి కనబడుతోందే?" అంటావేమో? అట్లు కనబడునది స్వయం కల్పితమగు భ్రమాభ్యాసము మాత్రమే!

భ్రమను గాంచువాని (ద్రష్టయొక్క) వాస్తవ-స్వరూపము శుద్ధచైతన్యమే కదా! అనగా, 'ద్రష్టత్వము' కన్నా ముందే ఈ జీవుడు శుద్ధచైతన్య స్వరూపుడై ఉండియే ఉన్నాడు.



సూర్యుని నుండి కిరణములవలె, సముద్రము నుండి తరంగములవలె 'శుద్ధచైతన్యము' నందు ఈ ద్రష్టత్వము బహిర్గతమౌతోంది.

❖❖❖

34. దృశ్యం తొలగేదెట్లా?

ఇట్లు భ్రమను గాంచువాడే (ద్రష్టత్వము-ద్రష్ట) అసత్యమై, లేకయే ఉండగా, ఇక భ్రమాత్మకమగు విషయమెక్కడ? అట్టి భ్రమలు కలుగుచున్నది ఎవరికి? అందుచేత "భ్రమ" అనబడుదానికి 'సత్త'యే లేదు. ఉత్పత్తి-వినాశరహితమగు పరమపదము లేక ఆత్మ ఒక్కటే ఉండి ఉన్నది.

ప్రథమ (పూర్వ) లీల : మరి ఈ దృశ్యమంతా ఎక్కడి నుండి వచ్చింది? ఇది తొలగే ఉపాయమేమిటి?

శ్రీ సరస్వతీదేవి : ఇదంతా "నేను ద్రష్టను అగుదునుగాక" అనునట్టి స్వకీయకల్పిత భావన నుండి ఏర్పడినట్టి .... ద్రష్ట వ్యాపారము యొక్క - ఫలితము మాత్రమే. ద్రష్ట యొక్క చైతన్యతత్త్వమే

కార్యమునకు, కారణమునకు స్థానభూతమై యున్నది. అందుచేత ఈ దృశ్యము ఉంటే ఉండనీ, దానివలన మనకు వచ్చే లాభముగాని, నష్టముగాని లేదు. ఈ కనబడేదంతా జ్ఞానదృష్టితో చూడబడితే చాలు. అప్పుడు ద్రష్ట-దర్శనముల అభావం సహజంగానే సిద్ధించగలదు.

ప్రథమ లీల : అమ్మా! "పరమ పదము" అంటే ఏమిటి?

శ్రీ సరస్వతీదేవి : నిన్ను నీవు జనన-మరణ రహితముగాను, స్వయం-ప్రకాశకముగాను, శాంతముగాను, ఆద్యముగాను, అనామయము (It only exists in it, nothing else exists in it)గాను గ్రహించు. "అట్లే తదితరుల వాస్తవ స్వరూపము కూడా" అనునట్టి 'ఎరుక' కలిగియుండుము. నీవు "నిన్ను - తదితరులను" అట్లు దర్శించుచుండుటయే "పరమపదము" అని చెప్పబడుతోంది. (పరమ=ఆవలనున్న ; పదము= స్వస్వరూపస్థానము)

❖❖❖

35. ఈ కనబడేవారంతా ఎవరు?

ప్రథమ లీల : జగజ్జననీ! ఈ విదూరథుడున్న చిదాకాశ బ్రహ్మాండములోను, అట్లే గిరిగ్రామ జగత్తునందు... అనేకమంది జనులు కనిపిస్తున్నారు కదా! వారంతా ఎవరు? 'స్వప్న కల్పిత రూపాలు' వంటివేనా? వారందరికీ స్వకీయమైన 'అస్థిత్వము', 'అనుభవము' ఉండి ఉన్నాయా? లేదా?

శ్రీ సరస్వతీదేవి : ఆ జనులందరి ఆత్మ వారివారి స్వభావమును అనుసరించే అట్లట్లు స్ఫురించుచున్నది. ప్రతివారు వారివారికి అనుకూలమగు స్థితియందే సంచరించు చున్నారు. అయితే తత్త్వజ్ఞులగువారు మాత్రం ఈ జగత్తును గాని, సృష్టినిగాని తమ అంతరంగమున పొందకుండానే ఉంటున్నారు. వారు ఈ దృశ్యమధ్యమునందు తదితరులతోపాటు ఆయా సాంసారిక వ్యవహారములందు ఇంద్రియాదులచే పాల్గొనుచున్నప్పటికీ, ఇందలి సత్యాసత్యముల విభాగము గ్రహించియుండుటచే, ఈ దృశ్యమునందలి స్వప్నత్వము-అసత్యత్వములను అవగాహన చేసుకొనిన తరువాతనే అట్లు పాల్గొనుచున్నారు. కనుక ఓ లీలా! ఈ జగత్తు, ఇందలి నేను-నీవు -మొదలైన సర్వ పదార్థములతో సహా, జన్మరహితమైనది. ఇదంతా ఆకాశ స్వరూపమగు 'బ్రహ్మము' కంటే వేరు ఏమాత్రం కాదు. దృశ్యభాగమై చెన్నొందుచున్న ... ఈ భూమి, పర్వతములు, వస్తుజాలములు .... మొదలైనదంతా అజ్ఞానముచేతనే హృదయము నందు విజృంభిస్తోంది. దృష్టాంతానికి, 'స్వప్నద్రష్ట' చూచే మహానగరం యందలి కోటలు శూన్యాత్మకములే కదా! ఈ జాగ్రత్ దృశ్యము కూడా అట్టిదే. హృదయాంతరాళమై యున్న ఆకాశమునందు ఆత్మచైతన్యము పర్వత-భూమయమైయున్న ఈ జగత్తును గాంచుచున్నది.

'జగత్తు' అనునది 'ఆత్మ' లేక 'చిత్' యొక్క కల్పన మాత్రమే! అందుచేత ఒక అణు మాత్రమైన చోటునందు కూడా నానా ఆకారములతో కూడిన జగత్తులు అరటిపట్టలవలె ఇమిడివున్నాయి. స్వప్నపురము ఎంతటి విస్తారమైనదైనప్పటికీ, అదంతా ఉన్నది ఒకానొక 'చిత్అణువు' నందే కదా! ఈ విస్తారమైన జగత్తు కూడా ఒకానొక చిత్-అణువు'లో ఇమిడివున్నది. ఇట్టి ఈ జగత్తులో

అనంతసంఖ్యలో చిదణువులు ఉన్నాయి. అందలి ప్రతి చిదణువులో మరల ఇట్టివేయగు అనేక జగత్తులు ఉన్నాయి. ఆ జగత్తులలోని ప్రతి అణువులో మరల అనేకానేక జగత్తులు ... అట్టి జగత్తులలో ఒకానొకదాని యందు గల ఒక ప్రదేశంలోని అంతఃపురంలో పద్మని భౌతిక శరీరం ఉండియున్నది.

ఈ విధంగా గిరిగ్రామజగత్తు - పద్మరాజ్య జగత్తు - విధూరథ రాజ్యజగత్తులలో తారసపడే వరకూ నీవు-నేను వంటి స్వస్వరూపాత్మ ప్రదర్శనారూపులే సుమా!

❖❖❖

36. మరణానంతరం

నీ సహ-పత్నియగు ద్వితీయలీల తన భర్తయగు విదూరథుడు నేలకొరగటం చూడగానే తాను మూర్ఛిల్లటం చూచావు కదా! విదూరథుని జీవచైతన్యము పద్మని దేహం ఉన్నచోటికి పయనించుచున్నది. ఈ ద్వితీయలీల జీవచైతన్యము కూడా పద్మని చేరుటకే ఆరాటపడుచున్నది.

ప్రథమలీల : ఈ ద్వితీయలీల మా అంతఃపురం ఎలా జేరనున్నదో? అక్కడ ఎట్లు ధరిస్తుందో? నీవు "నీ సహపత్నియగు ద్వితీయలీల" అని వర్ణించావు కదా! నేను ఆమెకు సహపత్నిని ఎట్లా అవుతాను? అక్కడ పద్మని రాజభవనంలోని పరిచారికలు ఈమెను ఎట్లా చూడబోవుచున్నారు? ఇదంతా బహుచమత్కారంగా ఉన్నది కదా!

శ్రీ సరస్వతీదేవి : అవును. ఇదంతా బహుచమత్కారమే. ఇందులోని కొన్ని విశేషాలు చెప్పుచున్నాను. విను. ఇది వింటే నీవు నీ స్వప్న వృత్తాంతమును, మరణానంతర దశలను కూడా గ్రహించగలవు. విదూరథుని రూపములో ఉన్న నీ భర్త పద్ముడు ఆ 'పద్మని భౌతిక శరీరము' ఉండివున్న గృహంలోనే ఈ జగద్భ్రాంతినంతా దర్శించు చున్నాడని అనుకొన్నాము కదా! ఇక ఈ యుద్ధము, ఇందలి జనన, మరణము మొదలైన సంఘటనలన్నీ స్వప్న సంఘటలనలవలె భ్రాంతి మాత్రములేనని మరల ఒకసారి గుర్తు చేస్తున్నాను. అనగా అర్థం ఏమిటి? ఇందులో కనబడే జనులంతా జన్మాది వికారములు ఏమాత్రం లేనట్టి ఆత్మస్వరూపులే అయివున్నారు సుమా! భ్రాంతి చేతనే లీల ఇక్కడ ఆ విదూరథుని భార్య అయినట్లు కనబడినది. వాస్తవానికి ఆమే కాదు. నీవు కూడా స్వప్నదృశ్యము వలెనే ప్రాప్తించుచున్నావు. ఈ 'జగత్తు' అనబడుదానిని పొందుచున్న ప్రతిప్రాణి (జీవుడు) ఇట్లే ఇదంతా స్వప్నసదృశంగా గాంచుచున్నాడు.

"నీవు నన్ను చూడటం - నాతో సంభాషించటం" అనబడు మనిద్దరి మధ్య ఇప్పుడు ఏర్పడుచున్న ఇదంతా కూడా స్వప్నమువంటిదే సుమా! ఈ జగత్తు ఇట్లు ప్రతిభాసించటం వలననే, ఇది "దృశ్యము" అని చెప్పబడుతోంది. తత్త్వము గ్రహించినప్పుడు మాత్రమే ఈ దృశ్యత్వము తొలగి పోతోంది. ఆత్మ ఒక్కటే సర్వకాలము లందు సంపూర్ణసత్యమై ఉండివున్నది. దానిని ఆశ్రయించే నీవు - నేను - మహారాజు మొదలైనవన్నీ విజృంభిస్తున్నాయి. అదేవిధంగా, ద్వితీయ-లీల విషయం

కూడా. ఈమె పద్ముని మనోవృత్తి వలన ఉద్భవించింది. నీ భర్త పద్ముడుగా మరణించిన మరుక్షణం అతని చిత్తము లీలయొక్క ఆకృతి దాల్చగా, అట్టి మనోవికారరూపమగు ఆకృతి నుండే ఈ ద్వితీయ లీల వెలువడింది. అతని సంకల్పానుసారమే నిన్ను బోలిన లీలను బాహ్యమున గాంచగలిగినాడు.

ఈ చిత్తము అతిచిత్రమైనది. అది "ఆధిభౌతిక భావము," అనగా, భౌతిక రూపములను భావించటం .... అను సంకుచితత్వము పొందుచున్న సమయంలో "ఈ నామ రూపములే సత్యము" అని తలచుచు ఉంటుంది. మరల "ఈ ఆధిభౌతిక వ్యవహారమంతా పంచభూత - సంగమమై, స్వప్న-సదృశమై, అసత్యమై ఉన్నది కదా" అనునట్టి బుద్ధి సుస్థిరపడినప్పుడు 'ఆతివాహకభావన'యే సత్యమని తలచుచుండటం జరుగుతోంది.

నీ భర్త 'మరణము' అనబడు మూర్ఛను పొందిన తరువాత, 'పునర్జన్మ' అనబడు మరొక భ్రమను పొందటం ప్రారంభించాడు. ఇదంతా ఒకడు ఒక స్వప్నములో నుండి మరొక స్వప్నములోనికి ప్రయాణించటం వంటిది మాత్రమే. అట్టి ఈ పునర్జన్మానుభవంలో తన వాసనలనే ఈ 'లీల' రూపంగా అతడు ఇక్కడ పొందినాడు. పునర్జన్మ అనునది ఒక స్వప్నము నుండి మరొక స్వప్నములో ప్రవేశించటం వంటిదని, ఆ రెండిటిని దర్శించు ద్రష్టయొక్క వాస్తవ స్వస్వరూపమే పరమాత్మ యొక్క స్వరూపమని చెప్పాను కదా! చూచావా! నీ గురించి ఏర్పడిన సంకల్పమే ఆ లీల అయి వుండటంచే, నీవే ఆ లీలవై ఉన్నావు సుమా! "చిదాత్మ" సర్వగతమైయున్నది కదా! అందుచేత, వాసనా మయమగు మరొక శరీరమును (నీవే, నిన్ను, బోలిన రూపమును) గాంచితివి. ఆ చిదాత్మ యొక్క ఇచ్ఛా ప్రభావం చేత ద్వితీయ లీల కూడా నిన్ను గాంచగలిగినది.

సర్వగతమైనట్టి బ్రహ్మవస్తువునకు ఒకానొక చమత్కారయుతమైన స్వభావ-విశేషము కానవచ్చుచున్నది. అది ఎక్కడ నీ రూపమున ఎట్టి వాసనలు కలిగివుంటుందో, అచ్చట ఆ తీరుగానే ఆయా దృశ్యవ్యవహారమంతా "బాహ్యమునందువలె" గాంచుచుండును. ఇందుకు స్వప్నమే మనకు దృష్టాంతము. "నేను స్వప్నములో ఒక ఊరు వెళ్ళినాను. అక్కడ గల కాలిబాటలో కొందరు జనులతో సంభాషించాను" .... అనునట్టి స్వప్నాను భవమంతా అంతరంగముననే ఏర్పడుతోంది. కాని, బాహ్యమందువలె ప్రాప్తిస్తోంది. ఆత్మ సర్వదా సర్వవ్యాపి, సర్వశక్తియుతము కదా! అందుచేత, అది తనయొక్క వాసనాను సారం కనబడటం, ప్రకాశించటం, అనుభవాదులు పొందటం మొదలైనవి లీలామాత్రంగా జరుగుతోంది. దృష్టాంతమునకు, "వసిష్ఠుడు-అరుంధతి" .... బ్రాహ్మణ దంపతులు ఇద్దరు తమతమ "మరణమూర్ఛ"లను పొందిన తరువాత, మరల "మరొకచోటు" అను భ్రమను పొందుచుండిరి. ఆ మరొకచోటు అని భావించబడుచున్న చోట, ".... వీరు మా తల్లిదండ్రులు ... ఇది మా దేశము .... ఇది మా ధనము .... ఇది మా కర్మము .... మేము ఇట్లు వివాహం చేసుకొన్నాం .... ఏకమయ్యాం .... వీరు మా పరిజనులు ... ఈ నా భార్య నాకు అత్యంత ప్రియమైనది ... ఈ నా భర్త నాకుగల ఒక మధురానుబంధం .... ఇతడు నన్ను ఏ సమయమందును విడచి ఉండకూడదు ....." అనునట్టి బుద్ధి-బలమును సమకూర్చుకొని ఉన్నారు. అవన్నీ ఇరువురిపట్లా

అట్లే ప్రవర్తిస్తున్నాయి. ఈ సృష్టిలోని జీవులందరు ఆయా వస్తువుల పట్ల, వ్యక్తులపట్ల, విషయముల పట్ల ఇట్లే తమయొక్క బుద్ధిబలంచే, భ్రమాత్మకమైన అనేక విధములైన సంబంధములు తమకుతామే, కల్పించుకొనుచున్నారు. ఇందుకు మనం నిత్యానుభవమైన స్వప్నమునే దృష్టాంతముగా తీసుకోవచ్చు. స్వప్నంలో చూచిన ఇంటిని, "ఇది నా ఇల్లు" అని, స్వప్నంలో చూచిన జనులను, "వీరు నా శత్రు–మిత్రులు" .... అని ఆ స్వప్న సమయంలో స్వప్నద్రష్ట వాస్తవానుభూతినే పొందుచున్నాడు కదా! కాని ఆ ఇల్లు, ఆ జనులు, ఉన్నారా? ఉంటే ఎక్కడ ఉన్నారు? లేకుంటే అనుభవాలన్నీ ఎక్కడి నుండి వచ్చిపడ్డాయి? ఆ స్వప్నద్రష్ట "భయము, ఉద్వేగము, ఆవేశములు....." వంటివి ఎందుకు పొందుచున్నాడు? స్వప్నంలోని ఆయా సంఘటనలు అతనికి అనుకూలంగానో, ప్రతికూలంగానో ప్రాప్తిస్తూ ... అతనిని సంతోషింపజేయటం, దుఃఖింపజేయటం .... మొదలైన వ్యవహారసరళి గలిగి ఉంటున్నాయి కదా! ఈ జాగ్రత్‌దృశ్యము, ఇందలి జనులు, పదార్థజాలము కూడా అట్టిదే. అయితే తగినంత పరిశీలనాత్మకమైన బుద్ధి లేకపోవుటచే "ఇది వాస్తవము" .... అను బుద్ధి ఏర్పడుతోంది. ఇందలి క్షణక్షణ .... "మార్పుచేర్పులు" .... గమనించిన వారికి ఇక్కడ కూడా ప్రవాహములోని జలమువంటి అస్థిరత కనబడుచూనే ఉంటున్నది.

ఈ ద్వితీయలీల తన భర్త మరణించటానికి కొద్ది క్షణాల ముందే జీవము–ప్రాణములతో సహా ఈ దేహము నుండి బయల్వెడలినది."మరణమూర్ఛ"ను పొందిన తరువాత ఆమె స్వసంకల్పానుసారంగా చిత్తాకాశమునందు 'ఉనికి' యొక్క అనుభవమును పొంద సాగినది. క్రమంగా ఆమె పూర్వవాసనలు (ద్వితీయలీలగా కలిగియున్న సంస్కారములు) అనుసరించి వికాసము పొందసాగింది. పూర్వస్మృతిని అనుసరించి తన భర్త సాన్నిధ్యము పొందుటకు పద్మని భౌతిక శరీరం ఉన్న గృహమండపమునకు వెళ్ళుచున్నది. అక్కడ ఆమె పద్మని కలుసుకోవటం జరుగగలదు.

❖❖❖

37. ద్వితీయలీల

శ్రీ వసిష్ఠమహర్షి : వింటున్నావా, రామచంద్రా! ద్వితీయలీల సరస్వతీదేవిని తన పూజాదులచే ప్రసన్నం చేసుకొన్నది. అయితే, స్వస్వరూపము యొక్క అవగాహన విషయంలో మాత్రం కొంత అసంపూర్ణత్వము కలిగియున్నది. బుద్ధి మరికొంత వికసించ వలసియున్నది. తన ఆ వాసనామయ దేహముతోనే భర్తయొక్క సమక్షమును పొందాలనుకొన్నది. తన శరీరముతో సహా ఆకాశమునందు కోమలాకారమగు పక్షివలె పయనించసాగింది. "నా భర్తను పొందబోవుచున్నాను కదా" .... అను ఏకైక భావన ఆమెను పులకింపజేస్తోంది. అట్లు వెళ్ళుచూ ఒకచోట ఎదురుగా ఒక స్త్రీని చూచింది. అనగా, ద్వితీయ లీలాదేవి యొక్క 'సంకల్పము' అనే అద్దంలో సరస్వతీదేవి సంకల్ప ప్రభావంచేత 'కుమారి' అను స్త్రీరూపం ప్రతిబింబించింది.

❖

కుమారి : ఓ జ్ఞప్తిదేవత యొక్క భక్తులారా! సుందరీ! నీకు స్వాగతం! నేను నీ కొరకే సరస్వతీదేవి ఆజ్ఞపై ఈ ఆకాశపథంలో వేచియున్నాను.

ద్వితీయలీల : ఓహో! నీవు నాకంటే ముందేవచ్చి ఇక్కడ వేచియున్నందుకు కృతజ్ఞతలు. దైవాంశసంభూతురాలవైన నీవు కనిపించకపోతే ఈ సువిశాల ఆకాశంలో ఇక నా గతి అగమ్యగోచరమే అయ్యేది.

"మహతాందర్శనం యన్మాంన్నకదాచన నిష్ఫలమ్"

నీవంటి ఉత్తముల దర్శనం ఊరకే పోగూడదు కదా! నా భర్త ఎక్కడున్నాడు? నన్నక్కడికి వెంటనే తీసుకొనిపో.

కుమారి : అట్లే అగుగాక! "నేను స్థూలముకంటే అతిసూక్ష్మము, స్వభావసిద్ధము అయినట్టి ఆతివాహిక దేహమును. లేక, సూక్ష్మశరీరమును" అను భావనను దృఢంగా ఆశ్రయించు. అట్టి సూక్ష్మశరీర ధారిణివై నన్ను అనుసరించు. అప్పుడు నిన్ను నీ భర్త ఉన్నచోటికి కొనిపోగలను.

ద్వితీయలీల అట్లే ఆతివాహిక దేహధారియై కుమారిని అనుసరించసాగింది.

❖

జ్ఞప్తిదేవతయగు సరస్వతీదేవిచే పంపబడిన ఆ కుమారి ముందుదారి చూపుతూ ఉండగా, ద్వితీయలీల బ్రహ్మాండ ఛిద్రమగు ఆకాశమున ప్రవేశించింది.

క్రమంగా వారిద్దరు 'మేఘమండలం' దాటివేసి, 'వాయుమండలం' ప్రవేశించారు. సూర్య మార్గమును దాటారు. నక్షత్రమండలమును అధిగమించారు. ఇంద్రుడు, దేవతలు, సిద్ధలోకమును, త్రిమూర్తులను కూడా అనాయాసంగా దాటివేశారు. 'బ్రహ్మాండ కర్పరము' చేరుకొన్నారు. మంచు ముక్కలు కుండలో పెట్టినప్పుడు ఆ కుండకు, చిల్లి లేకున్నప్పటికీ, బాహ్యమునకు మంచు ఖండములు నీటిబిందువుల రూపమున చేరుతూ ఉంటాయి కదా! అట్లే 'సంకల్పసిద్ధ'యగు ద్వితీయలీల బ్రహ్మాండము నుండి వెలువడింది. చిత్తమాత్ర శరీరియగు ఆమె సంకల్పమాత్ర జనితములైన 'బ్రహ్మాండములు' అనే విభ్రమములన్నీ తన అంతరముననే అనుభవించుచున్నదని గ్రహించు. అన్ని అనుభవములకు మూలకారణం సంస్కారములే.

ఈ విధంగా ఆమె బ్రహ్మాదిలోకములన్నీ దాటింది. కుమారి దేవతతో కూడుకొన్నదై, బ్రహ్మాండ కర్పరము (సర్వలోకముల కావలనున్న space) దాటివేసింది. జలము మొదలైన ఆవరణములన్నీ అధిగమించింది. అంతము అంటూ లేనట్టి చిదాకాశంలో ప్రవేశించింది. ఆ చిదాకాశమునందు అసంఖ్యాకములగు బ్రహ్మాండములు ఒకదాని కింకొకటి కనబడకుండా ఉండి ఉన్నాయి. ఒక పురుగు ఒక రేగుపండులో ప్రవేశిస్తుంది చూచావా? అట్లే, అక్కడ ఉన్న అసంఖ్యాకములగు బ్రహ్మాండములలోని ఒకానొక దానిలో మన ద్వితీయలీల, మరియు, కుమారి ప్రవేశించారు. ఆ బ్రహ్మాండమండలము క్రింద ఉన్న పద్మని రాజ్యమును సమీపించారు. క్రమంగా అంతఃపురంలో, పద్మని భౌతిక దేహము ఉన్న గదిలో ప్రవేశించారు.

ద్వితీయలీల ఎదురుగా భర్తయొక్క భౌతికదేహము చూచి భర్తతో పునఃసమాగమం పొందుచున్నందుకు పరమానందభరితురాలైనది. అప్పటికప్పుడు తాను భౌతికదేహము కలిగియున్న అనుభవమును పొందినది. తన మృదువైన చేతివ్రేళ్ళను విదుల్చుచు, కించిత్ పరిశీలనగా అరచేతులను చూచుకొన్నది. నుదురుపై పడేజుట్టును సరిచేసుకొనుచు, కుమారితో సంభాషించటానికి ప్రక్కకు చూచినది. కాని, ఆ ప్రక్కన ఎంతగా ఆమె కనులు వెతికినా, కుమారి కనబడలేదు. "ఈ కుమారి ఎటు వెళ్ళిపోయినదో కదా! అవునులే! మాయ ఎరుగబడిన తరువాత భ్రమ కారణంగా ఏర్పడిన దృశ్యానుభవం, అట్టి దృశ్యదర్శనంచేత ఏర్పడిన వికారాలు ఎక్కడికి పోతున్నాయో ఏమి చెప్పగలం?" అని అనుకొన్నది. ఆమె తన దృష్టిని శవరూపి అయి పరుండియున్న తన భర్త ముఖమువైపు మరల్చినది. తన "స్వయంప్రతిభ"చే విషయమంతా గ్రహించ నారంభించింది. "ఆహాఁ! ఇతడే నా భర్త. విదూరథుని రూపమున యుద్ధంలో సింధురాజుచే చంపబడి, వీరలోకములను పొంది ఇచట సుఖంగా నిదురిస్తున్నారు కాబోలు! దేవీప్రసాదంచేత నేను ఈ భౌతిక శరీరంతో ఇచటికి రాగలిగాను. నావంటి అదృష్టవంతులు ఇంక ఎక్కడైనా, ఎవరైనా, ఉంటారా? ఇదంతా సరస్వతీమాత కృపయే కదా!" అని అనుకొంటూ ఆ గది అంతా కలియజూచింది. అక్కడ గల ఒక నెమలిపింఛపు చామరము (విసనికఱ్ఱవంటిది) చేతికి తీసుకొన్నది. తన భర్తయొక్క ఆహ్లాదము కొరకు వీచసాగింది.

❖❖❖

38. సూక్ష్మదేహ భావనా ప్రభావం

పూర్వలీల సరస్వతీదేవి ప్రక్కనే ఉన్నది కదా. ఆమె తాను ఉన్న స్థానంలోంచే – ద్వితీయలీల పద్మని భౌతికదేహం ఉండియున్నట్టి తమయొక్క అంతఃపుర గృహంలో ప్రవేశించటం గమనించింది.

ప్రథమలీల : అమ్మా! సరస్వతీదేవీ! నీ వరప్రసాదంచేత ఆ ద్వితీయలీల పద్మని దేహం ఉండి ఉన్నట్టి మాయొక్క అంతఃపుర గృహంలో ప్రవేశించటం గమనించాను. ఈ మాయాతతంగమంతా గమనిస్తున్న నాకు అంతా అవగతమగుచుండటంచే నాకు ఏ సంఘటన కూడా ఆశ్చర్యంగాని, సుఖంగాని, దుఃఖంగాని, మరింకే భావావేశంగాని కలిగించటంలేదు. కాని ఆ గృహంలోని దాసీగణం, భృత్యులు ద్వితీయలీలను చూచినప్పుడు ఏమి అనుకొంటారో కదా? వారు ఏమి చేయనున్నారో?

శ్రీ సరస్వతీదేవి : పరమాత్మ సర్వవ్యాపకము కదా! 'నియతి' యొక్క ప్రేరణవలన, చిత్-ప్రతిభాస వలన, మనఃసంకల్పము యొక్క ప్రభావము వలన అక్కడి భృత్యులు, లీలకూడా తమ్ము తాము చిరపరిచితులుగానే భావించుకొనుచున్నారు. దాసీగణం మొదలైన వారిని చూచి ద్వితీయలీల. "వీరందరు నా భర్తకు సంబంధించినవారే కదా! కనుక, నాకుకూడా సంబంధించినవారే. ఇందులో నూతనమైన విశేషం అంటూ ఏదీ లేదు" అనే భావించుచున్నది.

పైగా, నీకు – నాకు – ఆ ద్వితీయలీలకు, ఆశ్చర్యకరమైన "జన్మ-జన్మాంతరము"ల వృత్తాంతము తెలుసు. అక్కడి పరిచారికలకు తెలియదుకదా! వారు ఎప్పటిలాగానే నిదురలేచి తమ యజమానుల సేవలో నిమగ్నమగుచున్నట్లే భావించటం జరుగుతోంది.

ప్రథమలీల : ఈ చమత్కారమంతా బాగానే ఉన్నది. కాని, నాదొక సందేహం. "ఈ స్థూలదేహము తోడనే నేను నా భర్తయొక్క సామీప్యత పొందాలి" అనే వరం నీ వద్ద నుండి ఆ ద్వితీయలీల పొందియున్నది కదా! మరి ఆమె తన భౌతిక దేహమును ఆకాశంలో త్యజించింది. బ్రహ్మాండములను సూక్ష్మదేహం తోడనే దాటివేసింది. ఆ పద్ముడు ఉన్న గృహంలో, అనగా నా అంతఃపురంలో, ప్రవేశించగానే ఎక్కడి నుండో ఆమెకు స్థూలదేహం ప్రాప్తించింది. అట్లా ఎందుకు జరగాలి? ఆమె భౌతిక దేహంతోనే బ్రహ్మాండకర్పరము దాటివుండవచ్చును కదా!

శ్రీ సరస్వతీదేవి : 'ఎండ'లో నీడ ఉండగలదా? ఎండవున్నచోట నీడగాని, నీడ ఉన్నచోట ఎండగాని ఉండజాలవు కదా!

అప్రబుద్ధులగువారు పుణ్యవశంచేత సిద్ధలోకములు పొందినప్పటికీ, వారు స్థూల దేహంతో ఆయా సిద్ధలోకములలో ప్రవేశించలేరు. హిరణ్యగర్భుడు (బ్రహ్మదేవుడు) మొదలైన సృష్టి నియామకులు సృష్టియొక్క ప్రారంభమునందే .... ఒక ఆటలో కొన్ని నియమములు రచించబడినట్లు, ... ఈ సృష్టి వ్యవహారమునందు కొన్ని నియమములను కల్పించియున్నారు. "సత్యము అసత్యముతో కలువకుండుగాక" .... అను నియమమును నిర్ణయించి ఉన్నారు. ఒకనియందు అసత్యదృష్టి పూర్తిగా తొలగనంత వరకు అతడు భౌతికదేహముతో బ్రహ్మాండాంతర్గతంగా పయనించలేడు.

కానీ, బిడ్డా! ఉత్తమోత్తమమైన ఆత్మజ్ఞానం కలవారు సంకల్పపూర్వకమైన భావన –ఆశయము కలిగివుంటే, వారు తమ భౌతిక దేహములతో సహా సిద్ధలోకములలో ప్రవేశించగలరు. సర్వేసర్వత్రా ఆత్మనే దర్శించు అట్టివారు తమను ఆశ్రయించు శిష్యులకు బోధించుట కొరకో, లేక, దుష్ట శిక్షణ కొరకో, తమ స్థూలదేహముతోనో, లేక వేరైన స్థూలదేహముతోనో, వేరువేరు లోకములు ప్రవేశించ గలుగుచున్నారు. ఒక దృష్టాంతం విను. ఒక బాలుడు, అత్యంత అజ్ఞానం అంతరంగమున పేరుకొని వుండగా, చీకటివైపు చూచినప్పుడు, అతనికి ఆ చీకటిలో బేతాళుడు లేక భూతములు కనిపిస్తాయి. కాని అట్టి బేతాళభ్రాంతి లేని పెద్దవారికి ఆ చీకట్లో దయ్యాలు కనిపిస్తాయా? లేదు కదా! "అవివేకము" అను జ్వరం ఉన్నంతవరకు 'వివేకము' అను శీతలత్వము ఉదయించదు.

అసలు "అవివేకము" అని మనం దేనిని పిలుస్తున్నాం? "నేను పృథివి మొదలైన పంచభూత నిర్మితమైన ఈ దేహమును కలిగియున్నాను. ఈ దేహముచే, ఇట్లు ఇంతవరకు నియమించబడ్డాను. నా ఈ పరిధి దేహసంచలనమునకు పరిమితమై యున్నది. అనురూపముగల దేహాత్మభావనయే 'అవివేకము' అని అనిపించుకొంటోంది. "స్థూలదేహధారి అయిన నాకు ఆకాశమున పయనించగల శక్తి ఎక్కడ ఉంటుంది?" అనునట్టి కృతనిశ్చయము గలవారు ఆకాశ సంచారం ఎట్లా చేయగలరు? చెప్పు? అందుచేత, "జ్ఞానము–వివేకము–వరము–పుణ్యదేహము" ల శక్తి వలననే జనులు ఈ భౌతిక దేహముతో అనేక లోకములందు సంచరించగలుగు చున్నారు. అయితే, ఎండుటాకులపై నిప్పురవ్వపడితే అవి దగ్ధం అగునట్లు, జీవునకు 'ఆతివాహిక దేహభావము' ప్రస్ఫుటమై ప్రాప్తించి నప్పుడు ఈ స్థూలదేహము అధిగమించబడినది – తిరస్కరించబడినది అగుచున్నది.

ప్రథమ లీల : ఆకాశ గమనములు, పరలోక సంచారములు, వర-శాపములచే ప్రాప్తించ గలవని నీవు అంటున్నట్లునావు. అంటే అట్టి సామర్థ్యములు స్వప్రయత్నముచే ప్రాప్తిస్తున్నాయా? లేక, జగన్మాతవగు నీచే ఆయాదేవతల రూపమున వరశాపములు ప్రసాదించుటచే లభిస్తున్నాయా?

శ్రీ సరస్వతీదేవి : వర-శాపములు కూడా ప్రాక్తనకర్మలను (ఇతఃపూర్వము నిర్వర్తించ బడిన శారీరక-మానసిక క్రియలను), అనుసరించే ఉంటున్నాయి. కాబట్టి, "జీవునకు ప్రయత్నములను అనుసరించే ప్రయోజనములు సిద్ధిస్తున్నాయి" అను అప్రతిహత సిద్ధాంతమునకు వరశాపాదుల వ్యవహారంచేత వచ్చే లోటు ఏమీ ఉండదు. ఓ ప్రియ భక్తులారా! లీలా! ఈ సంసార వ్యవహారమంతా కొంత సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఈ విషయం అవగతమౌతోంది.

నిత్యసత్యమగు సద్వస్తువు సర్వదా అవ్యయమై, శుద్ధమై, శాన్తమై ... తన స్వరూప – స్వభావములు త్యజించకుండానే ... సర్వదా ఉండి ఉంటోంది. త్రాడునందు ఒకనికి సర్పభ్రాంతి కలిగితే కలుగవచ్చు. కాని, ఆ త్రాడు సర్పమువలె పనిచేయలేదు కదా! స్వస్వరూపము లేనట్టిదేదీ ఎట్టి కార్యము ఒనర్చలేదు. కాబట్టి కార్యనిమగ్నులగుచున్న ప్రతి ఒక్కరు స్వస్వరూపము కలిగియే ఉన్నారు. అట్టి స్వస్వరూపము సద్వస్తువే అయివున్నది. అట్టి సద్వస్తువే బ్రహ్మమని, ఆత్మభగవానుడని, పరమేశ్వరుడని యిట్లు అనేక నామరూపములతో కీర్తించబడుతోంది.

అందుచేత, ఓ లీలా! మనందరిలో ఏ ఒక్కరు పుట్టుటలేదు. చచ్చుటలేదు. ఈ చావు – పుట్టుకలనబడునవన్నీ దేహాత్మదృష్టిలో మాత్రమే ఉండి ఉంటున్నాయి. కాని "ఇది మృతిచెందినది. నేను పుట్టాను. చచ్చుచున్నాను" అనునట్టి మిథ్యానుభవమంతా పూర్వాభ్యాసము (Previous Experience) వలననే విజృంభిస్తోంది. జీవునకు అత్యంత అనాయాసంగా ఈ స్వానుభూతములగు సంస్మృతభ్రమ కలుగుచున్నది. "జన్మించుట, ఇంద్రియములు, ఇంద్రియానుభవములు – సర్వ అనుభవముల రహితస్థితి అయిన నిర్విశేషానుభవం" ... ఇవన్నీ కల్పన చేతనే భావించబడుచున్నాయి. "కల్పన" .... కల్పనయే అవుతుందికాని సత్యమెట్లా అవుతుంది? ఈ 'సంసారస్మృతి' అంతా అజ్ఞానుల 'అంతరము'ననే ఉదయిస్తోంది కాని, ఎక్కడో బాహ్యమున మాత్రం కాదని గ్రహించు. నీటిలో ప్రతిబింబించే చంద్రుని చూచి "అవును. ఇదియే వాస్తవమగు చంద్రుడు" అని బాలుడు భ్రమిస్తాడు చూచావా? ఈ సంసారము అనే భ్రమ కూడా, "ఇది బాహ్యముననే వాస్తవత్వము కలిగియున్నది" అను రూపమున అజ్ఞానము చేతనే వికసిస్తోంది.

ఓ లీలాదేవీ! తత్త్వజ్ఞులు, ధర్మపరులు అగువారు మాత్రమే ఆతివాహిక లోకములకు వెళ్ళగలుగుతారు. భౌతికదృష్టి ఉన్నవారు వెళ్ళలేరు. ఎందుచేతనంటావా? మిథ్య – భ్రమమయము అయినట్టి ఈ 'ఆధిభౌతిక దేహము' సత్యమును ఆక్రమించుకొనగలదా? లేదు.

మన ద్వితీయలీల పూర్ణత్వము గాంచి ఉండలేకపోయినప్పటికీ తత్త్వజ్ఞురాలే! నన్ను నిరంతరం ఆరాధించి ఉండటంచే ఉత్తమభావము ('నేను ఆత్మను' అనునట్టి ఆత్మ భావము) పొందియే ఉన్నది, అందుచేతనే పద్ముడు ఉన్న నగరం వెళ్ళగలిగింది.

జ్ఞాన దృష్టిలో ఈ జగత్తు లేనిదానిగను, అవాస్తవముగాను తెలియవచ్చుచున్నది. ఇందు కనిపిస్తున్న కష్టసుఖములవంటివన్నీ భావనచేతనే ఏర్పడుచున్నాయి. కాని, స్వతహాగా ఏర్పడుచున్నవి కావు. అట్లే సకల సంబంధములు కూడా సుమా!

❖❖❖

39. కష్ట - సుఖములు

ప్రబుద్ధలీల : అమ్మా! జగన్మాతా! ఈ జగత్తులోని కష్టసుఖముల రూపమున ఏర్పడుచున్నవన్నీ అవాస్తవమని, స్వకల్పితమని అనటం వినటానికి బాగానే ఉన్నది. అటుచూడు నేలపై ఒరిగియున్న నా భర్త ఇప్పుడు ప్రాణములు త్యజించనున్నాడు కదా! ఇది నాకు సంభవిస్తున్న కష్టమే కదా! ఇట్లు మాకు ప్రాప్తిస్తున్న అనేక దుర్భర సంఘటనల వలన "దృశ్యము అసత్యము" అను వాదన ఎట్లా సమర్థించగలదగును చెప్పు? "సుఖము - దుఃఖము" అను రూపములు కలిగినట్టి "అదృష్ట దురదృష్టములు" ఈ జీవుని సమీపించటం, దూరం కావటం ఎప్పుడూ దైనందికంగా జరుగుచున్న విషయాలే కదా! ఈ అదృష్ట – దురదృష్టముల స్వభావం ఎట్లా సిద్ధిస్తోంది? అసలు ఈ పదార్థముల 'సత్త' అంతా ఎట్లా ఏర్పడుతోంది?

పోనీ! ఈ అదృష్ట–దురదృష్టములు కేవలం కల్పనామాత్రములేనని కొద్దిసేపు అనుకొందాం. కాని అగ్నికి ఉష్ణత్వము, పృథివి మొదలైన ఘనపదార్థములకు స్థిరత్వము, 'మంచు'కు చల్లదనము, ఈ ఆకాశము, ఈ కాలము ... ఈ పదార్థముల ఉనికి ఇవన్నీ ఎట్లా ఏర్పడుచున్నాయి? ఈ ఇంద్రియములు, వాటి అనుభవములు, దృశ్యములు, వాటి బంధమోక్షములు .... ఇవన్నీ ఎట్లా ప్రాప్తిస్తున్నాయి? ఇవన్నీ ఇట్లు ఉండగా "జగత్తు లేదు" అని మనం ఎట్లా సమీక్షించగలం? ఇవన్నీ ఎవరు కల్పిస్తున్నారు? ఎందుకు ప్రాప్తిస్తున్నాయి? తృణములు, కొండలు, సముద్రములు వంటి ఆయా ఆకారములన్నీ కనబడుచున్నాయి కదా! ఇవన్నీ ఎట్లా రూపం పొందుచున్నాయి? ఈ జన్మ–మృత్యువులు ఎట్లు ఎవరికి ఎందుకు సంభవిస్తున్నాయి? ఈ విషయాలు సందర్భోచితంగా నేను ఎంతవరకు తగివుంటే అంతవరకు వివరించు."

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! చాలా పెద్ద ప్రశ్న వేశావు. సరే, నీవు అడిగిన విషయమై కొన్ని విషయాలు వివరిస్తాను. విను.

❖

"మహా ప్రళయము" అని పిలువబడుచున్న ఈ జీవునికి సంబంధించిన ఒకానొక స్థితియందు సర్వపదార్థములు వినష్టమై పోతున్నాయి. అనగా జీవుని దృష్టియందు సర్వ పదార్థములకు అతీతమైన మౌనస్థితి శేషించుచున్నది. అప్పుడు బ్రహ్మవస్తువు ఒక్కటే సద్రూపమై వెలయుచున్నది.

మహాప్రళయము : అనగా ఈ జీవునియొక్క (లేక ద్రష్ట యొక్క) "దృశ్యమును అవగాహన చేసుకొను ఒకానొక స్థితి"గా గ్రహించాలి. అంతేగాని ఈ పదార్థ జాలమునకు సంబంధించినది కాదు.

బ్రహ్మము ఒక్కటే సద్రూపమై శేషించటం – అనగా ఈ జగత్తులోని పదార్థములు కరిగిపోవుటయో, లేక, ఇవి సముద్రంలో మునిగిపోవుటో కాదు. "ఇదంతా ద్రష్టయగు నాతోసహా ఏకైక అద్వితీయ బ్రహ్మమే. ద్వితీయమైనదేదీ ఎక్కడా లేదు. నేను – నీవు – అతడు – అది – ఇది – అక్కడ – ఇక్కడ – నాది – నీది ... అనునదంతా బ్రహ్మమే" అను దృఢభావన ఏర్పడుటయే. అప్పుడు చూడబడునదంతా బ్రహ్మముగానే శేషిస్తోంది.

❖

ఒకడు తన స్వప్నంలో పదార్థములు, నీవు – నేను – నీది – నాది వంటివి, ఆకాశ గమనాదులు పొందుచున్నాడు కదా! అతడే స్వప్నద్రష్ట అయివుండి, ఆ స్వప్నమంతా రచించబడుచున్నది తనయందే అయివుండికూడా ...ఆ స్వప్నమునందు పదార్థ జాలము మొదలైన వాటిని తనకు వేరైనవాటివలె దర్శించి "సుఖము – దుఃఖము – మానము – అవమానము" మొదలైన అనుభవములు పొందుచున్నాడు. అదేవిధంగా బ్రహ్మము – బ్రహ్మప్రకాశ స్వరూపములు మాత్రమే అయినట్టి – సూక్ష్మభూతములను, పంచభూతములను – (ద్రవ–ఘన–వాయు–తేజ–ప్రదేశములను) తనయందు అనుభవించుచున్నాడు. సూక్ష్మభూతరూపమును దాల్చిన అబ్రహ్మవస్తువు ఈ జలము మొదలైన ఆవరణముల రూపములుగా అనుభవమగుచున్న స్థూలత్వమును తన కల్పనా బలముచే పొందుచున్నాడు. అట్టి సమయంలో ఆ బ్రహ్మము తనకు తానే ఈ బ్రహ్మాండ స్వరూపముగా గోచరించుచున్నది. బాహ్యమున ఉన్నట్లు తోచుచున్న ఈ వ్యవహారమంతా వాస్తవానికి అసత్యమే అయినప్పటికీ "దృఢమైన సత్యము"వలె అభ్యాసవశంచేత గోచరిస్తోంది. చూచావా? ఇట్లు బ్రహ్మవస్తువు "నేను సమష్టి జీవుడను" అని చింతన చేసి తన మనోరాజ్యమును ఈ 'బ్రహ్మాండము' రూపమున విస్తరింపజేస్తోంది. అట్టి మనోరాజ్యమునే 'జగత్తు' అనే పేరుతో మనం చెప్పుకొంటున్నాం.

ఓ ప్రియలీలా! సంకల్పమాత్రమే అయినప్పటికీ ఇదంతా ఒకానొక "సంకల్ప వృత్తి –నియమము"ను అనుసరించే ప్రవర్తిస్తోంది. అట్టి నియమము సృష్ట్యాదియందు ఎట్లున్నదో, ఇప్పుడు అట్లే ఉండి ఉన్నది. చిత్తవృత్తులు ఏ రీతిగా ఉంటాయో ఆత్మచైతన్యం ఆరీతిగానే స్ఫురిస్తూ ఉంటుంది.

ఈ జగత్తునందు 'అనియతి' యగు కార్యము ఒక్కటి కూడా జరగటంలేదు.

బంగారము తన ఆకారమును ఎప్పుడైనా వదలి ఉంటుందా? లేదుకదా! అట్లే ఈ జగత్తు కూడా. ఇది మాయతో కూడుకొనిన బ్రహ్మమునందే ఉండివున్నది. బ్రహ్మము నందే వెలసియున్న ఈ 'జగత్తు' ప్రళయసమయంలో కూడా శూన్యం కాజాలదు. సృష్టి ప్రారంభంలో ఎట్లు ఏ వస్తువు ఆవిర్భవించియున్నదో అట్లే ఇప్పుడు కూడా ఉన్నది. నీటికి తరంగత్వమువలె బ్రహ్మమునకు జగదత్వము ఉండియే ఉంటోంది. జగత్తు ప్రకటితం కావచ్చు. లేక కాకపోవచ్చు. సర్వ సందర్భములోను బ్రహ్మము తన స్వసత్తను ఏమాత్రం వదలుటయే లేదు.

బ్రహ్మము తన "స్వసత్త – అఖండత్వము – శాశ్వతత్వము" మొదలైన లక్షణములు ఏక్షణమందు పరిత్యజించటం లేదు.

'మంచు–చల్లదనము' 'నిప్పు–ఉష్ణము'వలె 'చైతన్యము–నియతి' కలిసియే ఉంటాయి.

చైతన్యము ఉన్నచోట సృష్టికూడా ఉండి ఉంటోంది. ఆకాశరూపములే అయిన ఈ పృథివి – జలము– వాయువు మొదలైనవి ఒకానొక నియతిని అనుసరించి సృష్ట్యాది యందు ఎట్లా ఉన్నాయో ఇప్పుడూ అట్లాగే ఉన్నాయి. వాటి స్వభావము నందు కొంచెము కూడా మార్పు ఉండటంలేదు.

ఆకాశము - (Space) ⟶	శూన్యస్వరూపము
జలము – (ద్రవము - Liquid) ⟶	ప్రసరించు స్వభావము

ఇట్లు ఆయా నియమములు అట్లే ప్రవర్తిస్తున్నాయి. చావు–పుట్టుక–బ్రతుకుల నియమము కూడా అట్లే మారకుండానే ప్రవర్తించుచున్నది. జీవులందరు ఆ నియమమును అనుసరించే ప్రవర్తిస్తున్నారు. కాని, ఈ జీవుని వాస్తవ స్వరూపము సర్వ సంఘటనలకు అతీతమైనట్టి "నిత్యోదిత చైతన్యమే". ఇందు సందేహించవలసినదంటూ ఏమీ లేదు.

❖❖❖

40. ఈ అనుభవమంతా ఏమిటి?

అయితే ఈ "నియతి–పదార్థములు–స్వభావములు–శరీరములు–ఉత్పత్తి– వినాశనములు" ... మొదలైన దృశ్యజగత్తు వ్యవహారమంతా మాయయొక్క, లేక భ్రమయొక్క ప్రభావమును దృష్టిలో పెట్టుకొని చెప్పాను. కాని, ప్రియమైన లీలాదేవి! వాస్తవానికి ఈ 'జగత్తు' అనబడునది ఉత్పన్నమే అయివుండలేదు.

లీల : అదేమిటమ్మా? మరి ఈ అనుభవించబడుచున్నదంతా ఏమిటి?

శ్రీ సరస్వతీదేవి : స్వప్నములోని స్త్రీ సంగమమువలె దృశ్యమునకు సంబంధించిన అనుభవమంతా మిథ్యయే. అయితే, ఈ జీవునకు తన స్వస్వరూపము గురించిన అజ్ఞానము చేత, అజ్ఞాన జనితమైన అభిలాషచేత, అభిలాష జనితమైన దృఢాభ్యాసం చేత ఈ బాహ్యానుభవములపై ఒకానొక భ్రమాత్మకమైన విశ్వాసం ఏర్పడుతోంది. తత్ఫలితంగా అతడు అనేక సుఖదుఃఖానుభవములకు లోనగుచున్నాడు. చిదాకాశము యొక్క లీలయే ఇదంతా. ఇప్పుడు మనం చెప్పుకొన్న నియతి స్వభావములైనట్టి జీవన–మరణాది అనుభవములు అసత్యములే అయివుండి కూడా జీవునకు అభ్యాసవశం చేత సత్యమువలెనే తోచుచున్నాయి. ఇదంతా సత్త (Absolute self) + సంస్కారములు – రెండిటి యొక్క సమన్వయ ప్రభావమని గ్రహించు.* అయితే ఓ లీలా! జ్ఞానార్తితో నేను చెప్పుచున్నదంతా వింటున్న నీకు, ఒక హెచ్చరిక చేస్తున్నాను. మనం సద్వస్తువు గురించి గ్రహించటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, "జ్ఞాని అనుభవము"నే అధికంగా ప్రమాణంగా అంగీకరించాలి సుమా! అంతేగాని, అజ్ఞాని అనుభవములు క్రోడీకరించి ఎంతగా తర్జన–భర్జనలు చేస్తే మాత్రం ఏం ప్రయోజనం?

---

* శివ తత్త్వజ్ఞానము ప్రవచించు శివపురాణం 'సత్త'యే శివుడుగా, సంస్కారములు లేక ప్రకృతియే పార్వతిగా, జలతరంగములవలె ఆ ఇద్దరి అభేదమే ఉత్తమ జ్ఞానయోగముగా చాటుచున్నది.

'నేను-నీవు' మొదలైన వాటితో కూడుకొని కనిపిస్తున్న ఈ సర్వము చిదాకాశమే అయివున్నదని అనుకున్నాము కదా! ఆ చిదాకాశమే సృష్ట్యాదియందు

"ఆకాశ సంవిత్తు"ను గ్రహించుటచే 'ఆకాశము' గాను,

"కాలసంవిత్తు"ను స్వీకరించుటచే 'కాలము' గాను,

"జలసంవిత్తు"ను అవధరించుటచే 'జలము' గాను

గాంచుచున్నది. ఒకడు తన అంతరంగమునందలి స్వప్నంలో తనయందే ఆయా వస్తుజాలమంతా గాంచుచున్నాడు కదా! అట్లే చిద్వస్తువు తనయందు ఆయా ఆకాశాది భావములను పొందుచున్నది. మరి 'మాయ' యొక్క మహిమ అట్టిది. అది లేచి వస్తువులను కల్పించగలదు. అంతేనా .... అట్లు కల్పించబడి, సత్యమువలె అనుభవించబడుచున్న వస్తువులను, ... కల్పనయొక్క అంతమును ఆశ్రయించుట ద్వారా, "ఇదంతా అవాస్తవమే" అను భావనను పొందగలదు. అందుచేత లీలాదేవీ! ఈ ఆకాశతత్త్వము, జలతత్త్వము పృథ్వీతత్త్వము, వాయుతత్త్వము ... ఇవన్నీ అసత్తులే సుమా! ఈ శరీరవే 'అసత్తు' అయివుండగా అట్టి ''శరీరములోని ఇంద్రియముల అనుభవమాత్రములు'' అయినట్టి ఈ 'దృశ్యము' సత్యము ఎట్లా అవుతుంది? చిత్‌శక్తియే పంచభూతములతో కూడిన ఈ సృష్టిని, ఇంద్రియాదులకు సంబంధించిన ప్రియా ప్రియములను, ఆ ప్రియాప్రియముల అనుభవమునకు అనుకూలమైన ఉపాధులను (శరీరములను) తనయందు స్వప్నములోని వస్తువులవలె కల్పించుకొంటోంది. అనుభవమును పొందుతోంది. ఈ నేను చెప్పుదానికి దృష్టాంతముగా;

1. స్వప్నం : ఒకడు ఒక 'కల' కంటూ, ఆ కలలో పొందుతున్న ఆయా సంఘటనలు, సుఖ దుఃఖాలు, ప్రియ-అప్రియములు, భయ-ఆందోళనలు అదంతా 'స్వకల్పితమాయ' అనక తప్పదు.

2. సంకల్పము : మరొకడు సంకల్పములో ఆయా ఊహకు సంబంధించిన పదార్థజాలము, వాటి అనుభవం పొందుతాడు. ఒకానొక పిచ్చివాడు తన ప్రక్కనే తాను ప్రేమించే, లేక ద్వేషించే ఆకారమును సంకల్పించుకొని, అట్టి సామీప్యతకు స్పందిస్తూ ఉంటాడు. అదంతా స్వయంకల్పితమైన భ్రమయే కదా!

3. ధ్యానము : ఒక మాంత్రికుడు తన ధ్యానశక్తిచే ఒకానొక దృశ్యమును కల్పించి ప్రేక్షకులకు ఎదురుగా చూపించగలడు. అది అతనిచే కల్పించబడినదే అయినప్పటికీ, ప్రేక్షకులు అది వాస్తవమని తలచి చూస్తూ ఉంటారు.

కాబట్టి ఇక్కడ ఎవడు ఎట్లు దర్శిస్తున్నాడో అతడు 'అట్లు దర్శించటం' అనేది స్వయంకల్పితమైన మాయ, లేక భ్రమయే సుమా!

సరే! ఇప్పుడు నీకు .... "మరణానంతరం జీవుడు కర్మఫలములను ఎట్లా అనుభవిస్తాడు?" .... అనే విషయం విశదీకరిస్తాను. అప్పుడు ఈ విషయంలో నీకు ఉన్నట్టి అనేక సందేహాలు తొలగిపోతాయి. నీకు శ్రేయస్సు చేకూరగలదు.

ముందుగా ఈ "మానవుని ఆయుష్షు" అనబడుదాని నియతి గురించి విను. సృష్ట్యాదియందే ఒకానొక నియమము ప్రకారం ఈ మానవుని ఆయుష్షు ఈ విధంగా నిర్ణయించబడినది.

కృతయుగం	=	400 సం॥లు	త్రేతాయుగం	=	300 సం॥లు
ద్వాపరయుగం	=	200 సం॥లు	కలియుగం	=	100 సం॥లు

అయితే ఈ 'ఆయుర్దాయం' విషయంలో హెచ్చు తగ్గులు ఉంటున్నాయి. దేశ, కాల, క్రియ, ద్రవ్యముల యొక్క "పవిత్రత-అపవిత్రతలు" అనుసరించి ఆయా మనుష్యుల జీవితములు నడుస్తున్నాయి. వారు నిర్వర్తించు కర్మ - అకర్మల ఫలములు జీవితమును ప్రభావితం చేస్తున్నాయి. అందుచేత ఆయుర్దాయంలో కూడా మార్పు-చేర్పులు కలుగుతూ ఉంటాయి. నిర్దుష్టములైన 'కర్మ'ల యొక్క - ఆ కర్మల యొక్క ఫలితము అయినట్టి 'ధర్మము' యొక్క హెచ్చు-తగ్గులను అనుసరించే ఆయువు యొక్క హెచ్చుతగ్గులుంటాయని అధర్వణవేదము మొదలైన శాస్త్రములు వచిస్తున్నాయి. నిర్దుష్టములైన స్వధర్మమునకు సంబంధించిన శ్రద్ధతో కూడిన ఆచరణము పెరుగుచున్నప్పుడు జనుల ఆయువు కూడా పెరుగుతూ ఉంటుంది. ప్రజలు స్వధర్మములను మరచి చరిస్తూ ఉన్నప్పుడూ వారి సరాసరి ఆయుష్షు తగ్గుతోంది. నిర్దుష్టకర్మల ఆచరణము ఏ విధంగా ఉంటే జనుల సరాసరి ఆయుర్దాయం ఆ విధంగానే ఉంటోంది. ఈ విధంగా వ్యష్టి-సమష్టి జనుల ఆయుర్దాయం ఆయా మార్పులు-చేర్పులు పొందటం జరుగుతోంది.

ముఖ్యంగా ఆయా నిర్వర్తించబడు కర్మలను అనుసరించే ఈ ఆయుర్దాయము మొదలైనవి ఉంటున్నాయి. ఉదాహరణకు, ఒకడు బాల-మృత్యుకారకమగు కర్మలు ఆచరించాడనుకో. అప్పుడు అతనికి తదనంతర జన్మలందు బాల్యమునందే మృత్యువు ప్రాప్తిస్తోంది. అదేవిధంగా నిషిద్ధ కర్మలు ఆచరించినప్పుడు, తదనుసారంగా అకాల మృత్యువు యౌవన-కౌమారాలలో వచ్చిపడుతోంది. శాస్త్రములచే విధించబడిన ఆయా సుకర్మలను ఆచరించుచు ప్రశాంత చిత్తమును అలవరచుకొనుచున్న వాడు నిర్దుష్టమైన దీర్ఘాయుర్దాయమునకు తగిఉంటున్నాడు.

ఆయుష్షు క్షీణించి అంతిమకాలము ప్రాప్తించగానే అప్పుడు కర్మానుసారం మర్మ ఛేదకమగు 'వేదనం' ప్రారంభమౌతుంది. క్రమంగా మృత్యువు లేక మరణము జీవుని ఆక్రమించివేస్తుంది.

❖❖❖

41. మరణానుభవం : అందుకు విచికిత్స

ప్రబుద్ధలీల : హే సర్వజ్ఞానవిధాతా! జగన్మాతా! 'మరణము' అంటే ఏమిటో చెప్పు. మరణం విషయంలో నన్ను అనేక సందేహాలు వేధిస్తున్నాయి. మరణదుఃఖం ఎట్లా ఉంటుంది? అప్పుడేమైనా సుఖం ప్రాప్తించగలదా? ఏదైనా తెలుసుకొనటం చేతగాని, ఆచరించటం చేతగాని అనివార్యమగు మరణము ఒక సునాయాసమైన అనుభవంగా ఉండుటకు వీలున్నదా? మరణానంతరం ఏమి జరుగుతోంది? యోగుల మృతికి సాధారణ జనుల మృతికి భేదమేమైనా ఉన్నదా?

శ్రీ సరస్వతీదేవి : మనం మరణము గురించి చర్చించటానికి వీలుగా ఈ చనిపోవుచున్న జీవులందరిని మూడు రకాలుగా విభజించవచ్చు.

1. మూర్ఖులు: కొందరు దృశ్యములోని విషయములపట్ల, ఇంద్రియానుభవముల పట్ల అత్యంత తాదాత్మ్యము, విశ్వాసము, మమకారము, భ్రమ కలిగివుంటున్నారు. అట్టి వారిని 'మూర్ఖులు' అని పిలుస్తున్నాం. వారు వివేచనారహిత స్థితిలోనే మరణమును పొందుచున్నారు.


2. ధారణాభ్యాసులు : "ధారణ"ను అభ్యసించేవారు. అనగా, ప్రాణములను స్వసంకల్పవశం చేసుకొని అభ్యాసంచే నాడీ మండలములోని ప్రాణసంచారము నిరోధించగలిగినవారు. ప్రాణములను + మనస్సును నాభివద్దగాని, హృదయ ప్రదేశమున గాని, కంఠమున గాని, భ్రూమధ్య ప్రదేశమునగాని, బ్రహ్మరంధ్రము వద్దగాని అభ్యాసవశం చేత నిలుప గలిగినవారు.

3. యుక్తిమంతులు: "మేము శుద్ధ – చైతన్య – స్వరూపములమైయున్నాము. ఈ దృశ్యములోని ఒక వస్తువు కాము. ఈ దృశ్యము మాకు సంబంధించినది కాదు. ఈ దృశ్యమునకు మేము సంబంధించినవారము కాము.

"శుద్ధ – సంవిత్ – స్వరూపులమగు మేము జన్మించటం లేదు. మరణించటం లేదు. తరంగములు పొందుచున్నప్పుడు, పొందనప్పుడు కూడా జలము జలమే కదా! ఈ శరీరాదుల రూపములను మేము స్వీకరించవచ్చు. లేక త్యజించవచ్చు. మాకు ఏ భేదములేదు. మా స్వస్వరూపమునకు వేరుగా ఎప్పుడూ ఎక్కడా ఏదీ లేదు. ఇక్కడ తారసబడేదంతా పరమాత్మ యొక్క సంప్రదర్శనావిన్యాసమే!"

ఇట్టి మోక్ష భావములను గురువులతో సంభాషించుటచేత, శాస్త్రములను విచారించటం చేత, స్వబుద్ధిచేత (స్వవిచారణచేత) కొందరు మృత్యువు ప్రాప్తించుటకు మునుముందుగానే పెంపొందించు కొంటున్నారు. అట్టివారిని "యుక్తిమంతులు" అంటున్నాం.

వీరిలో ధారణాభ్యాసులు, యుక్తిమంతులు అగువారు ఈ దేహమును పరిత్యజించే టప్పుడుగాని, ఆ తరువాత గాని ఏమాత్రం దుఃఖం పొందరు. సుఖమునే పొందుచున్నారు. అట్లు కానట్టి మూర్ఖులు మరణసమయంలో దుఃఖమునే పొందుచున్నారు. ఎందుకంటావా? విను.



ధారణాభ్యాసముగాని, వివేక–విచారణలుగాని ఆశ్రయించనట్టివారి చిత్తము జీవించి యున్నంతకాలం అనేక వాసనలచే ఎల్లప్పుడు చలిస్తూనే ఉంటుంది. వాటి గురించి ఆలోచిస్తూనే ఉండటం చేత అట్టివారు మరణసమయంలో అత్యంత దీనత్వమును పొందుచున్నారు. చిత్తమే వాసనలకు ఉనికి స్థానం కదా!

ఈ జీవులలో అనేకులు శాస్త్రసంస్కారం, ఉత్తమ అభ్యాసం పొందకుండానే "మానవులై జీవించటం" అను ఒకానొక అవకాశమును చేజార్చుకొంటున్నారు. దుస్సాంగత్య పరులగుటచే నిప్పులో పడినవా-నివలె మరణసమయంలో ఎడతెగని దుఃఖములను పొందుచున్నారు.

❖

మృత్యువు సమీపించినప్పుడు .... కంఠము బొంగురుపోతోంది. చూపు తగ్గిపోతోంది. రంగు వాడిపోతోంది. వారి దృష్టికి దిక్కులన్నీ వెలుగు తగ్గి, అంధకారమయం అగుచున్నాయి. దిక్ మండలములన్నీ కారుమేఘములు క్రమ్ముకొన్నట్లు అయిపోతున్నాయి. పగటిపూటనే నక్షత్రములు ఏర్పడుచున్నాయి. ఆ జీవుడు అపరిమితమైన బాధతో .... భూమిని ఆకాశంగాను, ఆకాశమును భూమిగాను ... చూస్తూ ఉంటాడు. కళ్ళు తిరిగిపోతున్నట్లు ఉంటుంది. దిక్చక్రములు తేలిపోతున్నట్లు, ఆకాశంలోనికి కొనిపోబడుచున్నట్లు, గాఢమగు నిద్రచే ఆవరించబడుచున్నట్లు వారికి అనిపిస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి చీకటి నూతిలో పడిపోవుచున్నట్లు, రాతి మధ్యభాగంలో ఒక కప్పవలె చిక్కిపోయినట్లు అనుభవం పొందుచున్నారు. ఏదో చెప్పాలని ఉంటుంది. కాని నోరు పెగలదు. హృదయం ఛిన్నమై పోయినట్లు ఉంటుంది. ఈ అనుభవములన్నీ జన్మ-జన్మార్జితమైన అజ్ఞానం చేతనే ప్రాప్తిస్తున్నాయి సుమా!

❖

అందుచేతనే, ఈ జీవుడు శరీరధారి అయి, జీవించి ఉన్నంతకాలం "నేను ఎవరు? ఈ దృశ్యము యొక్క వాస్తవ స్వరూప-స్వభావములు ఏమై ఉన్నాయి?" అనునది గ్రహించుటకు ప్రయత్నించాలి. అట్లు ప్రయత్నించటమే ఉచితమని మా అభిప్రాయం. స్వవిచారణచేత, శాస్త్రపరిశీలనచేత, గురువాక్యమననము చేత, దైవోపాసనచేత, సర్వులయందు వెలసియున్నట్టి ఆత్మదేవుని సంతోషింపజేయుటచేత మనస్సు నిష్కల్మషమౌతోంది. అట్టి ప్రయత్నముల ప్రయోజనంగా ఆసక్తులు, వాసనలు, మనో వ్యసనములు సన్నగిల్లుచున్నాయి. సర్వాత్మకుడగు ఆత్మదేవుని సర్వమునందు దర్శించటం అభ్యసిస్తూ రాగా, అప్పుడు ఆత్మజ్ఞానం ఆరూఢమగుచున్నది. అనగా "స్వసత్త సామాన్యము (Absolute Self - Existence) ..... అనబడు మోక్షస్థితి సుస్థిరమౌతోంది. అట్టివానికి శరీరముయొక్క రాకపోకలు ఉన్నప్పటికీ అతడు "నేను పుట్టుచున్నాను. చచ్చుచున్నాను" ... వంటి భావనా సంపర్కములు పొందటంలేదు. అట్టి ఉత్తమ స్థితి కొరకే మానవ జన్మ వచ్చినందుకు ప్రయత్నించాలి. అంతేకాని, మహత్తరమైన అవకాశమైయున్నట్టి మానవజన్మను శుష్కవాదనలతోను, అజ్ఞానక్రియాకలాపములతోను, స్వల్ప లక్ష్యముల తోను వృథా చేసుకోకూడదని సద్గురువుల స్థానములో ఉన్న మేము ప్రియులగు సర్వజనులకు గుర్తు చేస్తున్నాం.

❖

అజ్ఞానిని మృత్యువు సమీపించినప్పటి మనోగతమైన స్థితి విషయమై మరికొన్ని విశేషాలు చెప్పుచున్నాను. విను.

మూర్ఛత్వమును ఆశ్రయించి, దృశ్య–సంపర్కముతో కూడి మునిగితేలుతున్న జీవుడు, మరణం ఆసన్నమైనప్పుడు చిత్ర–విచిత్రములైన స్థితిగతులు అంతరంగమునందే అనుభవిస్తున్నాడు. సుడిగాలిచే లేవనెత్తబడిన గడ్డిపరక క్రింద పడినట్లు తాను కూడా ఎగిరి క్రిందపడుచున్న అనుభవం పొందు చున్నాడు. వేగంగా ప్రయాణిస్తున్న రథం ఎక్కినట్లు, మంచులాగా కరిగిపోతున్నట్లు తాను తనకే కనిపిస్తాడు. అట్టి స్థితిలో అతడు తను పొందుతున్న సంసారదుఃఖములన్నీ తన బంధువులకు తెలియచెప్పు కోవాలని తాపత్రయపడుతూ ఉంటాడు. కాని మాట పెగలదు. తను అరుస్తూ ఉండటం అనుభవిస్తాడు. కాని, తన కేకలు తనకే వినబడవు. ఒక పెద్ద క్షేపణ యంత్రమునో (Giant wheel) లేక వాయు యంత్రమునో, లేదా ఒకానొక భ్రమయంత్రమునో అధిరోహించినట్టి భావన పొందుతాడు. నాలుకను ఎవరో పట్టి లాగినట్లు ఉంటుంది. సుడి–గుండమున పడినవానివలె ఉంటాడు. సముద్రము, భూమి తలక్రిందు లగుచున్నట్లు, తాను ఏదో అగాధంలో పడిపోవుచున్నట్లు, మరల ఇంతలోనే పైకి లేచుచున్నట్లు ఉంటుంది. ఇదంతా అతడు భ్రమవంశంచేత, లేక, అజ్ఞాన ప్రభావం చేత అట్లు అనుభవమును పొందుచున్నారు. తనయొక్క 'ఉచ్ఛ్వాస–నిశ్వాస' ధ్వనులను విని తుఫాను – శబ్దములను వింటున్నట్లు భయమును పొందుతూ ఉంటాడు. ఇంద్రియములకు సంబంధించిన వ్రణబాధలు అనుభవిస్తూ ఉంటాడు.

లీలాదేవి : అసలు ఈ దౌర్భాగ్యమంతా ఈ జీవునికి ఎందుకు ప్రాప్తిస్తోంది?

సరస్వతీదేవి : ఈ జీవుడు జీవించి ఉన్నంతకాలం సరైన జ్ఞానసముపార్జనకు ప్రయత్నించక, అవసానదశలో, శరీరము నేలకూలునట్టి దశలో "నేను ఈ భౌతిక శరీరమును. నేనీ శరీరమునందు మాత్రమే శరీరపరిమితుడనై ఉన్నాను. ఈ శరీరముతో ఏర్పడుచున్న సంబంధ–బాంధవ్యములు అత్యంత వాస్తవములు. ఈ ధన–గృహాదులు నావి. ఈ బంధుజనులు నా వారు" అను భ్రమ కలిగియే ఉంటున్నాడు. అట్టి శరీర తాదాత్మ్యము చేతనే జీవునకు ఈ బాధలన్నీ వాటిల్లుతున్నాయి. "నేను చైతన్యస్వరూపుడను. సర్వాత్మకమగు ఆత్మస్వరూపమే నాయొక్క స్వరూపము" అనునట్టి ఎరుకను ఈ దృశ్య తాదాత్మ్యము కప్పివేస్తోంది. ఫలితంగా ఆత్మ వ్యతిరిక్తమగు అనుభవములన్నీ వచ్చి పడుచున్నాయి. మేఘములు ఆకాశమును కప్పివేస్తున్నప్పుడు, ఆ ఆకాశము యొక్క నీలత్వాదులు కనబడకుండానే ఉంటాయి. అయితే ఆకాశము యొక్క సహజ నిర్మలత్వము, అఖండత్వము, అనంతత్వము ఎక్కడికి పోతున్నాయి? అట్లే ఉంటున్నాయి కదా! జీవుని వాస్తవస్వరూపమునకు ఈ మృత్యువు యొక్క దుర్భర – అనుభవం వలన వచ్చే లోటుగాని, మార్పుగాని ఉండదు.

❖

సూర్యుడు అస్తమిస్తూ ఉండగా, వెలుగులు తగ్గిపోవుచుండగా, దిక్కులన్నీ క్రమంగా మలినమై పోతూ ఉంటాయి కదా! అట్లే, మృత్యువు సమీపిస్తున్న కొలదీ, ఆ జీవుని ఇంద్రియములన్నీ చావ తగ్గి మాలిన్యమును పొందుతాయి. క్రమంగా 'స్మృతిశక్తి' (జ్ఞాపకశక్తి) తగ్గిపోతుంది. పూర్వాపరా జ్ఞానం (Knowledge of Past and inquisitiveness for Future) క్రమంగా సన్నగిల్లిపోతుంది. చూపు

కనబడకుండా పోతుంది. మనస్సు తన కల్పనా సామర్థ్యమును కోల్పోయి, వివేకరహితంగా ఉండిపోతుంది. అది ఒకానొక మహామోహమును పొందుచున్నది. ఆ మోహమునకు ఇక అంతు కనబడదు. ప్రాణవాయువులు అతని అంగములలో ప్రవేశించవు. అందుచేత, అవయవములన్నీ క్రమంగా నిస్తేజమైపోతాయి. అతడు అట్లే మోహమున పడిఉంటాడు. మోహము, పూర్వ సంస్కారములు, భ్రాంతులు .... ఈ మూడు ఒకదానిని మరొకటి బలపరచుకొంటూ ఉంటాయి. అతడు పాషాణమువలె జడుడై ఉంటాడు. ఓ లీలా! మూర్ఛజీవుని తిప్పలు ఇట్లు ఉంటాయి. సృష్టి మొదలుగా అజ్ఞానజీవుని విషయంలో ఇట్లే జరుగుతూనే ఉంటుంది. జ్ఞానము ప్రాప్తించువరకు ఈ తతంగమునకు అంతు ఉండదు.

ప్రథమలీల : అమ్మా! సరస్వతీదేవీ! ఇక్కడ నాకొక సందేహం. ఈ శరీరమును చూడు. ఇది .... శిరస్సు, రెండు పాదములు, రెండు చేతులు, గుహ్యము, గుదము ... అనబడు అష్టాంగములతో కూడుకొని మనకు ఎదురుగా కనబడుతూనే ఉన్నది. ఇట్టి ఈ శరీరమునందు "బాధ- మోహము- మూర్ఛ-భ్రాంతి-వ్యాధి-జడత్వము" .... అనునవన్నీ ఎట్లా ఏర్పడుచున్నాయి? ఈ దౌర్భాగ్యములను పొందుచున్న జీవాత్మ అట్లు దుఃఖములు ఎందుకు పొందుతోంది? ఇవి తప్పించగల ఉపాయమేమిటి? ఈ ప్రశ్నలు నన్ను వేధిస్తూ ఉన్నాయి.

శ్రీ సరస్వతీదేవి : శుద్ధచైతన్యమే వాస్తవ స్వరూపంగా కలిగియున్నట్టి ఈ జీవుడు "సంకల్పించటం" చేతనే సర్వము ప్రాప్తించటం జరుగుతోంది. కనుక అదంతా సంకల్పనా వైచిత్ర్యమే అయివున్నది.

"క్రియాశక్తి" అను బాహ్యత్వమును స్వీకరించిన ఈశ్వరుడు .... "నా కంటే అభిన్నుడగు జీవుడు బాల్య-యౌవన-వార్ధక్యములందు ఆయా కర్మఫలముల అనుభవమును పొందుగాక" .... అని, ఏదో కారణంచేత సంకల్పించుచున్నాడు. అప్పుడాతడు, తన చిత్తము నందే కల్పించబడిన దృశ్యమునకు పోల్చదగిన ఈ స్వసంకల్పజనితములైన అనుభవములన్నీ పొందుచున్నాడు. ఈశ్వరుడే "జీవుడు-గుణములు" అను వ్యాపకమును స్వయముగా కల్పించుకొని జగన్నాటకంలో క్రీడిస్తున్నాడు.

'కారణము అనిర్వచనీయము' అని కూడా శాస్త్రములచే ప్రతిపాదించబడింది.

❖

జీవుని దేహమునందున్న నాడులు పిత్తము, మొదలైనవి ధాతుప్రకోపంచేత రసపూరిత మగుచున్నాయి కదా! అయితే, ఆ నాడులు మృత్యుసమయము ఆసన్నమగుచుండగా క్రమంగా తమ స్పందత్వాన్ని కోల్పోతున్నాయి. ధాతువులు బలహీనపడుటచే నాడులు రసరహితమై నిస్తేజమై పోతున్నాయి.

ఆరోగ్యవంతుని శరీరంలో "సమానవాయువు" సంచరిస్తూ ఉంటుంది. ప్రాణవాయువు శరీరమంతా ప్రసరించు ప్రవర్తన (లేక క్రియ) కలిగియున్నప్పుడు ఈ అవయవములు క్రియాపూర్వక మౌతున్నాయి. అయితే, సమానవాయువు తన సమత్వపూరితమైన (Balanced) సంచారం త్యజించినప్పుడు, జీవుని శరీరం అనారోగ్యవంతమగుచున్నది. నాడులందు ప్రవేశించిన వాయువు

బయటకు వెలువడకపోవుటచేతనో, లేక బయటకొచ్చిన వాయువు మరల నాడులందు ప్రవేశించకపోవుటచేతనో ... నాడుల వ్యాపారము కుంటువడిపోవుచున్నది. అప్పుడు కళ్ళు మొదలైన ఇంద్రియములు తమతమ శక్తిసామర్థ్యములను కోల్పోవుచున్నాయి. అనగా, ఈ జీవుడు ఇంద్రియజ్ఞానమును, క్రమక్రమంగా, సమాన వాయువుయొక్క ప్రసరణము సన్నగిల్లుచున్న కొలదీ, కోల్పోవుచున్నాడు. నాడుల వ్యాపారము ఆగిపోయి వాయువుయొక్క గతి పూర్తిగా నిరోధమైనప్పుడు "ఇతడు మృతుడైనాడు" అని అంటున్నాం. ప్రాణవాయు ప్రసరణమే జీవనము, దాని ప్రసరణము ఆగిపోవుటయే మరణము.

"నేను జన్మించెదను. మరల ఒకానొకప్పుడు మరణించెదను" అనునట్టి ఇతఃపూర్వపు చిత్ సంకల్పనియతియే మృతికి కారణమగుచున్నది. అట్టి నియతిని ఈశ్వరస్వరూపుడగు ఈ జీవుడే తనకు తాను కల్పించుకొనుచున్నాడు. "నేను ఈ స్థానమున ఇట్లు అగుదును అనునట్టి "సంకల్ప మాయాశక్తి" సృష్ట్యాదియందే ఉదయించింది.* అది ఎన్నటికీ నాశం పొందదు. ఈ బాహ్యత్వమును ప్రాప్తింపజేస్తున్న మాయాశక్తి అవినాశి. దానికి నాశనము అంటూలేదు. అట్టి ఈ స్వభావజ్ఞానమే జనన-మరణముల రూపమున ప్రకటితమౌతోంది. అయితే, ఆత్మకు, ఈ వచ్చి-పోవుచున్న ఉపాధులతో గాని, భావాభావములతోగాని సంబంధము లేదు. సర్వులందు వెలుగొందు ఆత్మ ఎప్పుడూ శుద్ధముగానే ఉండి ఉంటోంది.

❖❖❖

42. ద్వంద్వ వ్యవహారం

ప్రథమ (ప్రబుద్ధ)లీల : అమ్మా! " 'ఆత్మ' అనునది సర్వుల వాస్తవస్వరూపమై సర్వదా నిర్మలంగానే ఉండి ఉన్నది" అని నీవు అంటున్నావు కదా! మరి, ఈ 'జ్ఞానులు- అజ్ఞానులు', 'పుణ్యులు-పాపులు', 'సుఖి-దుఃఖి' మొదలైనవారు లేరా? ఉన్నారా? ఈ తత్వము తెలుసుకొనుచున్నవాడు-తెలియనివాడు .... మొదలైన అనేక తీరులుగా జనులు మాకు తారసపడుచున్నారు కదా! వీరి మాట ఏమిటి?


శ్రీ సరస్వతీదేవి : నదీజలం చూచావు కదా! అది ఒకచోట అనేక తరంగములతో కూడి కలుషితమై ఉంటుంది. ఇంకొకచోట 'తరంగములు' అనునవి లేకుండానే నిర్మలంగా, ప్రశాంతముగా ఉంటుంది. ఈ చైతన్యము కూడా జీవధర్మము తనయందు ఆరోపించుకొనుటచేత రాగ-ద్వేష రూపములతో కూడిన అజ్ఞానముచే కలుషితమై ఉంటోంది. మరొకప్పుడు 'సాధన' యొక్క ప్రయోజనంగా కర్మల వలన అత్యంత నిర్మలత్వము సంతరించుకొని ఉంటోంది. ఏది ఏమైనప్పటికీ .... జ్ఞానియందలి, అజ్ఞానియందలి 'చైతన్యతత్త్వము' మాత్రం ఒక్కటే అయివున్నది కాని, వేరువేరు కాదు. అది వేరువేరు

---

* సృష్ట్యాది = అఖండ-శుద్ధ-సంవిత్ (Existence - knowledge) – స్వరూపుడగు ఈశ్వరుడు ఒకానొకప్పుడు తన వాస్తవస్వభావం మరచి బాహ్యదృష్టిని ఆశ్రయించుటయే "సృష్ట్యాది" లేక "సర్గాది" అని ఈ శాస్త్రంలో చెప్పబడింది. అంతేగాని, "సృష్ట్యాది" అంటే "ఈ కనబడే వస్తుజాలం యొక్క ప్రారంభం" అని అర్థం చేసుకోకూడదు.

అగుటలేదు. అజ్ఞానదృష్టికి వేరువేరువలె కనబడుతోంది. ఋషులందు, మునులందు, దేవతలందు, మానవులందు, రాక్షసులందు, జంతువులందు, నీ యందు, నా యందు .... నిత్యసత్యమై ఒప్పుచున్న ఆత్మ సర్వదా ఒక్కటే. అది వేరువేరుగా లేదు. ఉండబోదు. ఓ ప్రియపుత్రికా! లీలాదేవీ! భేదమును దర్శించుటయే "సంసారము". అభేద దర్శనమే "ముక్తి". పొడవైన లతలందు మధ్యమధ్య కణుపులు ఉంటాయికదా! అదేవిధంగా ఈ "అచేతనసత్త" యందు జనన-మరణరూపములైన గ్రంథులు, అనుభవములు ఉంటున్నాయి.

శరీరదృష్టితో చూచేవారికి, అట్లు చూచేంతకాలం ఈ "చావు-పుట్టుకలు' కనిపిస్తూనే ఉంటాయి. చైతన్యదృష్టి వేరొకవిధంగా ఉంటోంది. వాస్తవానికి చైతన్యపురుషుడు జన్మించటంలేదు. మరణించటం లేదు.



ప్రథమ (ప్రబుద్ధ)లీల : అమ్మా! మరి ఈ కనబడుచున్నదంతా ఏమిటి? సత్యమును అనేక కోణముల నుండి అనేకమార్లు వింటేగాని, మాయందు సత్యభావన దృఢంకాదు. అందుకే మరలమరల అడుగుచున్నాను.

శ్రీ సరస్వతీదేవి : లీల! నీవు సందేహనివృత్తి అయ్యేవరకు నన్ను ప్రశ్నించవలసినదే. సరే! ఇదంతా ఏమిటో చెపుతాను విను.

శుద్ధ స్వరూపమగు 'చైతన్య పురుషుడు' కేవలము స్వప్నభ్రాంతివలె ఈ జనన- మరణములు, ప్రియ-అప్రియములు, స్థూల-సూక్ష్మములు మొదలైనవన్నీ స్వకీయ మాయచే గాంచుచున్నాడు. ఈ జీవుడు చైతన్య స్వరూపుడేగాని, మరింకేదీ కాదు. చైతన్య స్వరూపుడగు పురుషునకు నాశనము లేదు. ఇక చేతన రహితమైనదానికి పురుషకారం గాని, కర్తృత్వముగాని లేవు. ఇంతవరకు ఎక్కడా ఏ కాలమందు చేతన వస్తువు నశించటంలేదు. కేవలం అచేతనములు,* స్వయంప్రతిపత్తి లేనట్టి ఈ శరీరములు మాత్రమే నశిస్తున్నాయి. అది చూచి జనులు 'అయ్యో! నేను చచ్చుచున్నాను కదా! ఆహా! నేను పుట్టుచున్నానే!" అని భ్రమించుచున్నారు. చేతనము సర్వదా అక్షయమై, సుస్థిరమై ఉంటోంది. అది అన్నివేళల ఏకమేగాని, అనేకము కానేకాదు.

---

* చేతనము = కదిలించేది; : అచేతనము = కదిలించబడేది.

ప్రబుద్ధలీల : ఈ "శరీరములు పొందటం, చిత్తములు కలిగి ఉండటం" ... ఆత్మయొక్క స్వభావమై యున్నదంటావా?

శ్రీ సరస్వతీదేవి : శరీరములుగాని, చిత్తములుగాని ఆత్మయొక్క స్వభావము అయివుంటే, ఒకడు మరణించిన మరుక్షణం అందరు మరణించేవారే. అట్లు జరుగుట లేదు కదా! కనుక ఈ శరీరములు, చిత్తములు ఆత్మయందు లేవని గ్రహించు.

అసలు జీవునకు ఈ జననమరణాలు ఉన్నాయా? మా దృష్టిలో లేవు. ఇవన్నీ శరీరదృష్టి కలవారిచేతనే పరికల్పించబడింది గాని, ఇవి ఏమాత్రం వాస్తవం కాదుసుమా! అట్లు చూడబడుచున్న దంతా వాసనావైచిత్ర్యమే. ఈ సుఖ-దుఃఖములు, ఈ దృశ్యతాదాత్మ్యము, ఈ జీవభావము, ఈ -నీవు - నేను మొదలైనవి .... ఇవన్నీ వాసనాప్రభావములే కాని మరింకేమీ కాదు. వాసనావైచిత్ర్యమే జనన-మరణముల అనుభవమని గ్రహించేవారు భ్రమచెందరు.

కనుక, జీవునికి జనన-మరణములు లేవు. అతడు జన్మించడు. మరణించడు. కాని, నిష్కారణంగా "వాసనాప్రవాహం" అనబడు సుడియందు కొట్టుకొనుచున్నాడు. ఎందుచేత? దృఢ విచారణ లేకపోవుట చేతనే. దృఢ విచారణ ఆశ్రయించటంచేత దృశ్య వస్తువుల యొక్క 'అత్యంత అభావము' ఏర్పడుచున్నది. అప్పుడు వాసనలన్నీ వినాశనమొందుచున్నాయి. 'ఈ దృశ్యముపై గల దృఢమైన నమ్మకం' కాకుండా వాసనలకు వేరు రూపం ఎక్కడ చెప్పు? వాసనలు క్షయించగా దృశ్య సత్త కూడా క్షీణించి పోవుచున్నది. కాబట్టి లీలా! వైరాగ్యముతో కూడిన సాధన సంపత్తి గల వాడు వికారములను జయించి వేస్తున్నాడు. అప్పుడాతడు తత్త్వదృష్టిచే, "ఈ దృశ్య జగత్తు మిథ్యయే" అని గ్రహించుచున్నాడు. అట్టివాడు ద్వైత వాసనల నుండి తొలగినవాడై భవ భయముల నుండి ముక్తుడగుచున్నాడు.

ఓ బిడ్డా! ఒకానొక ఉత్తమ సత్యమును సర్వజనులను దృష్టిలో పెట్టుకొని మరల మరల ప్రకటిస్తున్నాను. "శుద్ధాత్మ స్వరూపము ఒక్కటే సత్యము. తదితరములన్నీ మిథ్య మాత్రమే."

❖❖❖

43. పునర్జన్మ

ప్రబుద్ధలీల : హే జగజ్జననీ! దేవేశీ! మనుజుడు మరణించిన తరువాత మరల ఎట్లు జన్మిస్తాడో నాకు వినాలని ఉన్నది. అట్టి విషయములు వినటంచే నా జ్ఞానము వృద్ధి చెందుతుందని నీవు అనుకుంటే ఆ విషయం చెప్పు.

శ్రీ సరస్వతీదేవి : సరే చెపుతాను. విను.

ఈ శరీరముయొక్క నాడీస్పందము శాంతించినప్పుడు ప్రాణవాయు చలనము కూడా ఆగిపోతుందని అనుకున్నాము కదా! అప్పుడు మనుజుని చైతన్యము ఉడిగినట్లు అనిపిస్తుంది. అయితే, స్వాభావికంగా చూస్తే ఈ చైతన్యము శుద్ధము, నిత్యము. దీనికి క్షయము గాని, ఉత్పత్తిగాని

ఉండదు. శుద్ధ చిన్మాత్రమే స్థావర – జంగమము లందు, ఆకాశమునందు, శిలలయందు, వాయువునందు, సర్వపదార్థములందు వెలయుచున్నదని సూక్ష్మగ్రాహ్యులగు జ్ఞానులు సర్వదా ఎరుగుచునే ఉన్నారు.

ప్రాణవాయువు నిరోధమైనప్పుడు నాడీస్పందము ఆగిపోతోంది. అప్పుడు "ఈ జడదేహము మృతి చెందినది" అని చెప్పబడుతోంది. అయితే, మృతి అనునది శరీరము యొక్క ధర్మమేగాని, ఆత్మధర్మము ఏమాత్రమూ కాదు. ప్రాణవాయువులు మహా వాయువులలో కలసిపోవుటచే శరీరము శవముగా మారిపోవుచున్నది. కాని చైతన్యము తన వాసనలతో కూడినదై ఆత్మతత్త్వముననే వెలయుచున్నది. సూక్ష్మమగు ఈ చైతన్యము పునర్జన్మకు కారణములగు వాసనలతో కూడుకొని ఉంటోంది. అందుచేత శాస్త్రములు, శాస్త్రవేత్తలు, అద్దానిని "జీవుడు" అను పేరుతో పిలుస్తారు. అయితే 'వాసనలు' అనునవి చైతన్యముకంటే వేరైన బాహ్యపదార్థములు కావు సుమా! జలము కంటే తరంగములు వేరు కావు కదా! చైతన్యము యొక్క "దృశ్యాసక్తి"నే 'వాసనలు' అను పేరుతో పిలుస్తున్నాం.

ఈ చైతన్యము ఎక్కడికో వెళ్ళటంలేదు. ఎక్కడి నుండి రావడంలేదు. ఎందుచేతనంటావా? ఈ "ఇక్కడ – అక్కడ, దూరము – దగ్గర" అనునవి పంచభూత దృష్టికి మాత్రమే ఉంటున్నాయి. సర్వము చైతన్యమయమే అయివుండగా, జీవుని చైతన్యము వెళ్ళుటకు వేరుగా చోటు ఎక్కడ ఉన్నది? కాబట్టి లీలా! ఈ సూక్ష్మమగు చైతన్యము వాసనా బలంచేత శరీరము ఉన్నప్పుడు ఏ స్వస్థానంలో ఉన్నదో, శరీరం తొలగినప్పుడు కూడా అదే 'స్వస్థానం'లో ఉంటోంది. అనగా అది శరీరము వచ్చినప్పుడు ఒక చోటికి, ఈ శరీరము నేలకూలినపుడు మరొకచోటికి వెళ్ళటంలేదు సుమా! "పరలోకమునకు వెళ్ళటం – ఇహలోకమునకు రావడం" ... ఈ వ్యవహారమంతా స్వప్నతుల్య వ్యవహారమే. అంతేకాని, ఈ జీవుని జీవచైతన్యము స్థానభ్రంశము పొందటం లేదు.

❖

సంస్కార సహితము – ఉపాధిరాహిత్యము అయినప్పుడు, వ్యవహారజ్ఞులు (లేక) శాస్త్ర రచయితలు ఈ జీవుని "ప్రేతము" అను పేరుతో పిలుస్తున్నారు. చైతన్యము జీవవాసనలు కలిగి యున్నప్పుడు అట్టి వాసనాసహిత – చైతన్యమే అది. వాయువునందు సుగంధం వేరైన రూపం అంటూ లేకుండానే ఉన్నట్లు చైతన్యమునందు సంస్కారము లేక వాసనల రూపమున జీవత్వము ఉండి ఉంటోంది.

ఆ జీవుడు "మృత్యువు" అను ప్రక్రియ ద్వారా "వర్తమాన శరీరమును గాంచటం" అను దానిని త్యజించుచున్నాడు. ఇంతలోనే మరొక శరీరమును గాంచుచున్నాడు. స్వ–వాసనా వశంచే (Indulgence of one's own tendencies) అట్టి వాసనలను అనుకూలమగు వ్యవహారముగా గాంచు చున్నాడు. భోగానుభవములు పొందుచున్నాడు. అదియే అతనిపట్ల పరలోకమగుచున్నది. అచట మరల మునుపటివలెనే భావములను, ఆవేశములను, స్మృతిసంస్కారములను ప్రకటించుచున్నాడు

.... "నా 'మరణమూర్ఛ' అనే అనుభవం గతించినది" .... అని భావించుచు క్రమంగా మరణ స్థితి (శరీర రహిత ప్రేతస్థితి)ని స్వప్నతుల్యంగా త్యజించి వేస్తున్నాడు. ఒకడు నిదురలేవగానే మనస్సు నుండి స్వప్నానుభవమంతా తుడిచివేసి జగత్‌లో ప్రవేశించి ప్రవర్తిస్తున్నట్లు, అతడు ఇప్పుడు "ఈ నూతన శరీరమే వాస్తవము, దీనికి ముందుగా ఏదీలేదు. ఆవలా ఏదీ లేదు. నేను ఈ శరీరమునకు సంబంధించిన వాడిని మాత్రమే. ఇప్పుడు ఇక్కడ గాంచుచున్న దృశ్యములు, వ్యక్తుల సంబంధములే వాస్తవం" అనునట్టి ఒకానొక భ్రమాత్మకమైన బుద్ధిచాంచల్య స్థితిని పొందుచున్నాడు. తనకుతానే అట్టి బుద్ధి వ్యవహారమునందు తన అఖండ స్వస్వరూపమును – బంధింప బడినదానివలె గాంచుచున్నాడు.

ఓ లీలా! ఇదంతా ఇట్లు అనేక జన్మల దురభ్యాసముచేతనే ప్రాప్తించుచున్నది. 'భావన' నుండే జీవునకు బంధ–మోక్షములు ప్రాప్తిస్తున్నాయి. ఆకాశంలో మేఘ సమూహములు ఏర్పడుచున్నట్లు, ఈ జీవుని చిత్తాకాశములోకూడా పృథివి మొదలైన పదార్థములతో కూడిన విశ్వమంతా ప్రాప్తిస్తోంది. అతడట్లు చూచునదంతా అతని ఆత్మయందే సుమా! అదే విధంగా మనం ఇప్పుడు ఇక్కడ చూచునదంతా వాస్తవానికి మన ఆత్మయందేగాని వేరుగా ఎక్కడా లేదు. అట్లే ప్రతి ఒక్క శరీరధారుడగు జీవుని విషయం కూడా.

ఇట్లు శరీర పతనానంతరం ప్రాప్తించే తదనంతర దృశ్యము, ఉపాధి, అనుభవములు, సంబంధములు మొదలైనవి ఈ క్రింది లక్షణములు కలిగి ఉంటాయి.

1. సంస్కారములు - వాసనలు - అభిలాషలు :

ఆ జీవుని సంస్కారములు పూర్వవాసనలను అనుసరించే ఉంటాయి. అనగా జీవుడు ఇతః పూర్వము దేనిదేనిపట్ల ఎట్లెట్లు అధికమైన ఆసక్తి – అభిలాషలు కలిగివుంటాడో – వాటిని అనుసరించి అవన్నీ అట్లే గాంచుచు ఉంటాడు.

2. తన అంతరంగమునందే తాను దర్శించుట :

ఒకడు తన స్వప్నంలో జగత్తులు గాంచుచున్నట్లు, ఆ జీవుడు తన సంస్కారములను అనుసరించి, తనయందే సర్వమును (పూర్వం చూచినది, ఇప్పుడు చూస్తున్నది. ఇక ముందు చూడబోవునది) గాంచుచున్నాడు.

3. సృష్టి - పరిమితమైన దర్శనం :

అతడు అట్లు గాంచుచున్న జగత్తును ఇతరులు గాంచలేరు. ఇతరులకు ఆ స్థానం గృహాకాశంగానే కనబడటం మనం నీ విషయంలోను, పద్మని విషయంలోను చూచాము కదా! ఒకడు తన స్వప్నంలో గాంచు విషయములను, దృశ్యములను, వ్యక్తులను ఆ ప్రక్కనే ఉన్నవాడు గాంచలేడు కదా!

❖❖❖

44. ప్రేతస్థితి

శరీరము త్యజించినప్పుడు, అప్పుడు శేషించు ఈ జీవునిస్థితి 'ప్రేతము' అని అంటారు. అట్టి ప్రేతస్థితులు ఆరు విధములుగా విభజించి వివరిస్తాను. విను.

1. స్థూలపాపి : గొప్ప దుష్టకార్యములను నిర్వర్తించినవాడు, మనస్సునందు క్రూరత్వము వహించినవాడు – శరీరము త్యజించినప్పుడు 'స్థూలపాపి' కోవకు చెందుతాడు. అతడు పాషాణమువలె జడుడు అయి దీర్ఘకాలం 'మరణమూర్ఛ' అను ఘనీభూతస్థితిని అనుభవి స్తున్నాడు. మరల యథాసమయంలో ప్రబుద్ధుడై వాసనల మధ్య చిక్కుకుని – ఉండిపోయి చాలాకాలం నరకయాతనలు పొందుచున్నాడు. క్రమంగా నూర్లకొలది జన్మలు ఎత్తి అసంఖ్యాకములగు ఉపాధులలో అనేక దుఃఖములను అనుభవించుచున్నాడు. మరల ఈశ్వరప్రసాదముచే ఒకానొకప్పుడు వాని సంసార స్వప్నము శాంతిస్తోంది.

ఇట్టివారిలో కొందరు తమ 'మరణమోహము' గడచిపోయిన తరువాత, అత్యంత దుఃఖ పూర్ణమై యుండే "నేను వృక్షమును" మొదలైన భావనలను తమ హృదయము నందే అనుభవిస్తున్నారు. తరువాత భూతలంపై నానావిధములైన యోనులలో పరిభ్రమించటం జరుగుతోంది.

2. మధ్యపాపులు : మధ్యరకములైన ద్రోహచింతనలు, ఇతరులను బాధించటం వంటి పాపములను చేసిన వారు 'మరణమూర్ఛ'ను పొందిన తరువాత కొంత కాలం పాషాణము వలె జడత్వం పొందుచున్నారు. ఆ తరువాత యథా సమయంలో ప్రబుద్ధులై 'పశువులు' మొదలైన యోనులందు తిరుగాడటం జరుగుతోంది.

3. సామాన్యపాపులు : వీరు స్వల్ప పాపములు చేసియున్నవారు. అందుచేత వాసనానుసారంగా ఉత్పన్నమైనట్టి ఆతివాహిక దేహమును పొంది, స్వప్న – సంకల్పములందువలె జనన – మరణములు పొందుతూ ఉంటున్నారు. వారియందలి భ్రమతో కూడిన 'ఆశ'యే వారిని అనేక దుఃఖ స్థితులను ప్రాప్తింపజేస్తోంది. అనగా "అది పొందుతాను. అప్పుడు సుఖ వంతుడనౌతాను" అని తలచుచు మూఢమృగములు ఎండమావుల కొరకై పరుగులు తీస్తున్నట్లు అనేక ఉపాధులందు ద్రష్టత్వము వహిస్తూ ఉంటున్నారు. కాని శాంతి పొందటం లేదు.

4. సామాన్య ధర్మి : ఇతడు స్వల్పముగా మాత్రమే ధర్మము నిర్వర్తించినవాడు. ధర్మము నిర్వర్తించుటయే పుణ్యస్వభావము అగుచున్నది. అయితే, ఇతడు కూడా సామాన్య పాపివలె అనేక జన్మ–మృత్యువులు పొందుతూనే ఉంటున్నాడు. కాని 'సామాన్యపాపి' కంటే కొంత ధర్మాధిక్యత పొందియున్నాడు కదా! అందుచేత ఇతనికి ధనాదుల ప్రాప్తి జరుగుతూ ఉంటుంది. కొంత సమృద్ధిని అనుభవిస్తూ ఉంటాడు. స్వధర్మనిరతి, లోకోపకారములు, శాస్త్రవిహితమైన కర్మల నిర్వహణ శ్రద్ధాసక్తులతో నిర్వర్తించువాడే 'ధర్మి' అని చెప్పబడుచున్నాడు.

5. మధ్యధర్మి : ఇతడు మరణానంతరము ఆకాశవాయువులచే కొనిపోబడి ఉత్తమ స్థానము లందు ఉంచబడుచున్నాడు. తన ధర్మమును కొంత చక్కగా నిర్వర్తించి ఉండటంచే కిన్నర – కింపురుష – యక్ష – మొదలైన సుఖవంతములగు శరీరములను పొందుచున్నాడు. అచ్చట పుణ్యము యొక్క ఫలము (సుఖము) అనుభవించి, మరల ఆ పుణ్యము క్షయించగా, అక్కడి నుండి చ్యుతుడు (displaced) అగుచున్నాడు. వీర్యరస సమన్వితమగు భోజన ద్రవ్యములందు రసరూపమున ప్రవేశిస్తున్నాడు. ఆ తరువాత తనకు యథోచితమైన జాతి (సామాన్యధర్మి–మధ్యధర్మి వగైరా)కి చెందినవాని హృదయంలోను, రేతస్సులోను ప్రవేశిస్తున్నాడు. స్త్రీ గర్భంలో కొంతకాలం వసించి, అటు తరువాత జన్మను గ్రహిస్తున్నాడు.

6. ఉత్తమధర్మి : ఉత్తములు, మహాపుణ్యశీలురు అయినట్టి కొందరు మరణానంతరం తమ పూర్వస్మృతిని అనుసరించి ... స్వర్గము, విద్యాధరపురము మొదలైనవి అనుభవించుచున్నారు. ఇలావత (దేవత) కింపురుషాది రూపానుభవములను, ఇతర కర్మల ఫలములను అనుభవించు చున్నారు. ఇక ఆ తరువాత సంపద యుక్తము, సజ్జనులతో నిండియున్నట్టి ప్రదేశములో మానవులై జన్మించుచున్నారు. ఇట్లు మనుష్య లోకంలో ప్రవేశించి పూర్వసంస్కారములు కారణంగా మరల తపస్సు, ధ్యానము, త్యాగము మొదలైన ఉత్తమ క్రియలయందు ప్రేరితులగు చున్నారు.

❖

ఎట్టి వ్యక్తి అయినాసరే, పైన చెప్పినట్టి నియమములకు లోను అవుతూనే ఉన్నాడు. అయితే క్రమము నేను చెప్పినట్లే ఉండవచ్చు. కొంతవేరుగా ఉండవచ్చు. "మోకాలి బొటనవేలు బండరాయిని వేగంగా తాకినప్పుడు గాయము అగును" అనునది నిర్దుష్టమైన సత్యము కదా! అట్లే ఈ లోకంలో ధర్మ–పాపముల నియతి కూడా ప్రవర్తిస్తోంది. "పాపము వలన దుఃఖము, పుణ్యము వలన సుఖము, జ్ఞానము వలన మోక్షము" అనునట్టి ఒకానొక అప్రతిహతమైన సిద్ధాంతము ఈ అంతర్ బహిర్ సృష్టి – వ్యవహారమునందు ప్రవర్తిస్తోంది. వాస్తవానికి ఆత్మ వ్యతిరిక్తమైనదంతా స్వప్న తుల్యమే అయినప్పటికీ, ఈ సిద్ధాంతము యొక్క నియమమునకు లోటు ఉండటం లేదు. బ్రహ్మ రుద్రాదులైనా సరే, ఈ సిద్ధాంతము యొక్క ఫలితము నుండి తప్పించుకో లేకపోతున్నారు.

❖

మృతుడు శరీరము నేలకూలినప్పుడు (లేక శరీరము త్యజించబడినప్పుడు) ఒకానొక "మరణ మూర్ఛ"లో ప్రవేశిస్తున్నాడని అనుకొన్నాం కదా! అట్టి మరణమూర్ఛ నుండి నిద్ర లేచినవాని వలె తేరుకొనిన తరువాత "ఓహో! నేను మరణించితిని" అని భావించు కొనుచున్నాడు. "మరల పిండప్రదానానంతరం శరీరము వచ్చినది కాబట్టి నేను ఇప్పుడు పుట్టాను" అను వేరొక భావపరంపరను పొందుచున్నాడు. పిండప్రదానమునకు ముందు చిత్రమైన అనుభవములు పొందుచున్నాడు. "నేను ఇట్లిట్లు ఈ ఈ విధముగా వీరిని బాధించియున్నాను. అందుకు ఫలితం లేకుండా పోతుందా?

అందుచేతనే కాలపాశమును ధరించి యమభటులు నన్ను గొనిపోవుచున్నారు" అను భావమును అనుభవమును పొందుచున్నాడు. ఆ మృతులలో పుణ్యవంతులు దివ్యములగు విమానములను, ఉద్యానవనములను అనుభవించుచున్నారు. ఓ లీలా! ఈ భావనలు, అనుభవములు ఆ మృతుని శారీరక-మానసిక కర్మలు అనుసరించే ఉంటున్నాయి. అందుచేతనే ప్రతిజీవుడు ప్రతిక్షణం, తనను తాను ఇట్లు ప్రశ్నించుకొంటూ ఉండాలి.

1. ఉత్తమ కర్మలను ఆశ్రయించటం - దుష్ట కర్మలను త్యజించటం.

నేను ఉత్తమ కర్మలనే ఆచరిస్తున్నానా? (లేక "ఇతరులను బాధించటం - వేధించటం" వంటి పాపకర్మలను నిర్వర్తిస్తున్నానా?)

2. రాగము - ద్వేషములను జయించి వేయటం.

రాగ - ద్వేష పూరితుడనై వ్యవహరిస్తున్నానా? అట్లు ప్రవర్తించుటచే ప్రాప్తించు ప్రయోజనం దుఃఖమే కదా!

3. జన్మను, కాలమును సద్వినియోగపరచుకోవటం.

నేను సోమరివలె కాలం వృథా చేయటం లేదుకదా?

ఇట్లు ఆత్మవిమర్శ చేసుకొంటూ సర్వదా ఉత్తమ కర్మలనే ఆశ్రయించాలి. అంతేగాని, కర్మలకు సుస్థానమైన ఈ మానవజన్మను వృథా చేసుకోకూడదు.

పాపకర్మలను ఆచరించియున్నవాడు, "అయ్యో! నాకర్మలకు తగినట్లే మంచు - ముళ్ళు - పెద్ద గుంటలతో కూడిన "అసివ్రతము" మొదలైన నరకములే నాకు ప్రాప్తిస్తున్నాయి" అని తలపోయుట జరుగుతోంది. దీనినే జనులు "నరకమునకు వెళ్ళుట" అను పదములచే చెప్పుకొంటున్నారు.

మధ్యరకమగు పుణ్యము ఆచరించినవాడు, "ఆహా! నేను ఇప్పుడు ఉన్నది. ప్రయాణించునది.... చల్లటి పచ్చికతో కప్పబడిన సుందర మార్గమునందు కదా! చల్లటి నీడగల ఈ మార్గమున నేను 'యమపురము'నకు వచ్చాను. కృతపతియగు యముడు ఈ నా పుణ్య-పాప కార్యములను విచారించుచున్నాడు" అనునదంతా తన హృదయంలోనే పొందుచున్నాడు.

❖

చూచావా లీలా! ఈ విధంగా అందరు కూడా మరణానంతరం భిన్నభిన్నములైన పారలౌకిక అనుభవములను తాము శరీరం త్యజించినచోటే అనుభవిస్తున్నారు. అయితే, ఇందలి చమత్కారమేమిటో గమనించావా! అనేక అర్థ క్రియలతో కూడిన ఈ విస్తారమైన సంసారమంతా "సత్యమే అయివున్నది" అని అనేకమంది జీవులు భావించుకొనటం జరుగుతోంది. మరి, మాయ యొక్క ప్రభావం అట్టిది. ఒకవైపు ఈ సంసార వ్యవహారమంతా ఇట్లు ఉంటూ, జరిగిపోతూ ఉండగానే మరి కొందరు జీవులయందు మరొకవైపు సుస్థిరమైన 'ఆత్మదృష్టి' లేక 'స్వస్వరూపదృష్టి' ఉంటోంది. అట్టి స్వస్వరూప దృష్టి శాస్త్రముల యొక్క అర్థమును గ్రహించటం చేత, గురువులు చెప్పు వాక్యములను మననము

చేయుటచేత, స్వప్రయత్నరూపమగు సునిశితబుద్ధి చేత కలుగుచున్నది. అట్టి దృష్టి కలవారు, "ఆకాశ సదృశ్యము – ఆకార రహితము – అద్వయము – స్వస్వరూపమునకు అభిన్నము – సర్వుల సత్యస్వరూపము ..... అయినట్టి "ఆత్మ" ఒక్కటే ఉన్నది. అది మాత్రమే జాగరిల్లియున్నది. ఈ దేశ – కాల – క్రియలు, హ్రస్వ – దీర్ఘములైన ఈ ఆకృతులు, ఈ దృశ్యములు .... ఇవన్నీ సత్యము కాదు సుమా" .... అని గ్రహించే .... ఉంటున్నారు.

❖

అది అట్లా ఉంచి, యముని పురమునకు పోయినట్టి జీవుల గురించి విచారిద్దాం. వారు ఇట్లు అనుభవమును పొందుతూ ఉండటం జరుగుతోంది.

"ఆహాఁ! యముడు మా కర్మలను మాచే అనుభవింపచేస్తున్నాడు. ఇక ఆ అనుభవం పూర్తి అయినది .... ఇప్పుడు త్వరగా స్వర్గలోకం వెళ్ళుచున్నాం.... స్వర్గానుభవం కూడా, చేసిన పుణ్యం ఖర్చు అయిపోవుటచే గతించింది... అయ్యో! ఇప్పుడు పశువు జన్మలు ఎత్తుచున్నామే! ధాన్యములోని అంకురమునయ్యాను .... ఇప్పుడొక 'ఫలము' అయ్యాను...."

ఇట్లు వారివారి అనుభవములు కొనసాగుతూ పోతున్నాయి. "శరీరము – అంతఃకరణములు – క్రియలు" .... ఈ మూడు లేనట్టి ఆ ధ్యానాంకురము మనుష్యునిచే తినబడినప్పుడు 'రేతస్సు'గా మారుచున్నది. ఆ తరువాత అది యోని ద్వారం గుండా మాతృగర్భంలో ప్రవేశిస్తోంది. గర్భవాసి యగు ఆ జీవుడు పూర్వకర్మానుసారంగా అదృష్టవంతుడుగానో, దురదృష్టవంతుడుగానో, చక్కటి బాలుడుగానో, లేక అవయవముల లోపముగల అనారోగ్య బాలుడుగానో జన్మించుచున్నాడు. ఇక ఆతరువాత చంచలముతో కూడుకొనియున్న బాల్య–యౌవనములను అనుభవించుచున్నాడు. ఇంతలో అతనికి ఎక్కడినుండో వృద్ధాప్యం వచ్చిపడుతోంది. మరల వ్యాధి – మరణము – మరణమూర్ఛ ... మామూలే. ఇదంతా ఒక మహాచక్రమువలె ప్రవర్తిల్లుతోంది. మరల ఇంకొక దేహము గ్రహించటం ఒక 'కల' వలె జరిగిపోతోంది. ఎంత విచిత్రమో చూచావా? ఆకాశమే రూపముగా గల ఆత్మ చిత్తాకాశమునందు "జీవభ్రాంతిని పొందటం" అనబడు స్థితి మొదలుకొని, "స్వస్వరూపమేమిటో గ్రహించి మోక్షమును పొందటం" అనబడు ప్రశాంత – మౌన – చిదానంద స్థితివరకు ఆయా భ్రాంతిపరంపరలన్నీ ఒకదానివెనుక ఒకటి పొందుతూనే ఉన్నది. పక్షి తన గూడు విడచి ఎక్కడెక్కడో సంచరించి మరల తన గూటికి సాయంకాలం చేరుతుంది చూచావా? ఈ జీవుడు కూడా తన వాస్తవమగు ఆత్మ స్వభావమును మరచి బాహ్యాడంబరములను ఆశ్రయిస్తూ అనేక సుఖ–దుఃఖ, జీవన – మరణ అనుభవములను పొందుతూ ఒకానొకప్పుడు కాకతాళీయంగా సర్వదా – స్వభావ సిద్ధమైయున్న ఆత్మత్వమును పొందుచున్నాడు.

❖❖❖

45. సృష్ట్యాది - జీవభ్రాంతి

ప్రబుద్ధలీల : హే జగజ్జననీ! సరస్వతీదేవీ! నాయొక్క జ్ఞానాభివృద్ధి కొరకు మరొక ప్రశ్న అడుగుచున్నాను. అసలు "సృష్ట్యాది" యందు అఖండ స్వభావమగు ఆత్మకు ఈ "జీవభ్రాంతి" (లేక – "నేను పరిమితుడను" అను భ్రాంతి) ఎట్లా కలుగుతోంది? నాపై అనుగ్రహంతో ఈ విషయం చెప్పు.

శ్రీ సరస్వతీదేవి : నీకు కనబడుచున్నట్టి, లేక నీవు చూస్తున్నట్టి, ఈ "పర్వతములు – వృక్షములు – పృథివి – ఆకాశము" మొదలైనవన్నీ విశుద్ధ – చైతన్య స్వరూపములే సుమా! అందుచేత వీటిని ఆత్మవేత్తలు "పరమార్థ ఘనములు" అని పిలుస్తున్నారు. అనగా, అద్వితీయ* విశుద్ధ చైతన్యమే ఇన్ని రూపములతో మాయా ప్రభావంచేత ఉదయించుచున్నట్లు అగుపిస్తోంది.

చేతనామయమగు ఈశ్వరుడు సర్వాత్మకుడై, సర్వవ్యాపి అయి వెలయుచున్నాడు. అతడు ఏ రూపమున ప్రతిభాసించుచున్నాడో, అచ్చట ఆ రూపముననే వెలయుచున్నాడు. అట్లే పేర్కొనబడుచున్నాడు. అతడే ... ఒక కలగంటున్న పురుషునిగా .... జీవసమష్టి రూపమున 'ప్రజాపతి' అగుచున్నాడు. అతడే అట్లు ప్రజాపతి రూపమున సప్త లోకములుగా వివర్తము పొందుచున్నాడు. సృష్టి ప్రారంభమున ఉన్న ఆ సంకల్పమే నేటికీ నిలచియున్నది. ఆ సంకల్పమే పదార్థముల అనుభవంగా ప్రాప్తిస్తోంది.

"నేను పరిమితుడను, అసంపూర్ణుడను, ఏదో పొందవలసినవాడను" అను భావన ఏర్పడటం యొక్క ప్రారంభముచే సృష్టి ప్రారంభముగా చెప్పబడింది.

ఈ దేహమును చూచావా? వాయువు రోమకూపములగుండా ఈ దేహమును ప్రవేశిస్తోంది. ప్రాణవాయువు శరీరంలో ప్రవేశించి అన్ని అవయవములు కదలాడేటట్లు చేస్తోంది. ఇట్టి ఈ 'మానవ – జంతు' దేహములను "జీవిత దేహములు" లేక "జంగమములు" అని అంటున్నాం. ఇక వృక్షాల విషయానికి వస్తే వాటికి కూడా దేహములు కనబడుచున్నాయి కదా! అయితే అవి చేతనములు అయివుండి కూడా చలనము లేక ఉంటున్నాయి. అందుచేత, వాటిని "స్థావరములు" అని అంటున్నాం. అయితే, ఈ స్థావర – జంగమ జీవారణ్యంలో విహారం చేస్తున్నదెవరు? ఈశ్వరుడే సుమా! ఈశ్వరుడే ఈ స్థావర జంగమములలో ఏకస్థుడై, హృదయస్థుడై ఉండి ఉన్నాడు. ఉపాధి భేదములచేత "ఇది జడము – ఇది జంగమము" అనునదంతా ఏర్పడుతోంది.

చిదాకాశమే తన స్వరూపము కంటే అన్యము కానట్టి 'బుద్ధి' అను దానిలో తనకు తానే ప్రవేశించుచున్నది. అట్టి బుద్ధితో కూడి ఈ ఉపాధి అను నగరం ప్రవేశిస్తోంది. ఈ శరీరములో "చక్షువులు – చెవులు – ముక్కు – చర్మము" .... మొదలగు ఇంద్రియ స్థానములను ఆ చిదాకాశ చైతన్యమే దర్శిస్తోంది. అటు తరువాత అయ్యది బుద్ధివృత్తులు ద్వారా 'బాహ్యము' అనుదానిని కల్పించుకుని ఆ బాహ్యమునందు ఆయా పదార్థ జాలమంతా ప్రకాశింపజేస్తోంది. ఓ లీలా! ఈ

---

* అద్వితీయము = దేనికైతే రెండవది అనుదే ఉండదో, అద్దానిని 'అద్వితీయము' అని అంటాం.

కళ్ళు మొదలైనవి స్వయంగా చేతనములు కావు. అవి తమంతట తామే ఎట్టి అనుభవమును పొందలేవు. కనుక జడములే అయివున్నాయి. కాబట్టి సర్వనియామకములకు కారణము, కారణ కారణము చిత్సంకల్పమే సుమా! కొంత సూక్ష్మదృష్టి గలవారే .... "సర్వేంద్రియములలో ఏకరీతిగా వెలుగుచున్నట్టి – సర్వేంద్రియములకు సంబంధించనట్టి" .... చిత్సకంల్పమును గుర్తించుచున్నారు. విభాగించుచున్నారు.

- శూన్యాకారమగు చిత్సంకల్పమే ఆకాశము.
- భూమ్యాకారమైన చిత్సంకల్పమే .... ఈ విశాల నదీ నద గ్రామ పట్టణాలతో ఉన్న భూమి.
- జలశక్తి సంపన్నమగు చిత్సంకల్పమే "జలము".
- ఆ చిత్సంకల్పమే జంగమ సంకల్పము వలన జంగమ పదార్థములుగాను, స్థావర సంకల్పము వలన స్థావర – పదార్థములుగాను వివర్తము పొందుచున్నది.
- "చిత్ సంకల్పమే అన్నివైపులా ప్రసరిస్తూ ఉండి ఉంటోంది. చిత్ సంకల్పము తప్ప వేరుగా 'జగత్తు' అనబడునది లేదు. ఆ చిత్ శక్తియే మనుష్యులు – జంతువులు – వృక్షములు – శిలల రూపమును గ్రహించుచున్నది" అని జ్ఞానులు నిస్సంకోచంగా గ్రహించుచున్నారు.

ఇక అజ్ఞానుల దృష్టి అంటావా? అది అట్లు లేదని వేరుగా చెప్పనక్కర్లేదు. అజ్ఞానులు ఎట్లా భావిస్తున్నా, అది మనకు ప్రమాణం కాదు కదా!

❖

చూచావా లీలా? ఆ చిత్సంకల్పము "సృష్ట్యాది" యందు .... అనగా అది తన అఖండత్వము అప్రమేయత్వములతో, కూడిన చిత్స్వభావము నుండి 'చ్యుతి' పొందినప్పుడు ... ఏయే రూపములుగా ఉండగోరినదో, ఇప్పుడు కూడా ఆయా రూపములుగానే ఉన్నది. అప్పుడు ఏ విధంగా అయితే 'వృక్షములు' మొదలైన పదార్థములు భావించబడ్డాయో ఇప్పుడు కూడా అవన్నీ అట్లే ఉంటున్నాయి. అయితే బిడ్డా! "జడము" అని "చేతనము" అని వేరువేరు పదార్థములు లేవు సుమా! ఈ జడ–చేతముల "సత్త"గా బ్రహ్మపదార్థము ఒక్కటే ఉండి ఉన్నది. సద్వస్తువగు ఆత్మ ఒక జడవస్తువునుగాని, లేక, ఆత్మను జడవస్తువుగాని ఆశ్రయించుకొని ఉండజాలవు. అందుచేత " 'జడము' అనబడు విభాగమే మిథ్య అయివున్నది" అని సత్య ద్రష్టలగు మేము సిద్ధాంతీకరించు చున్నాము. వృక్ష – పర్వతాదులు కూడా చిదేకరసముతోడనే నిండియున్నాయి. ఇక, "ఇవి జడములు" అనునట్టి కల్పనచే ఏర్పడుచున్న అనుభవం – 'బుద్ధి' యొక్క 'ఆరోపణ' మాత్రమే అయివున్నది.

ఆయా వస్తువులయందున్న "ప్రత్యక్‌బుద్ధి" తమ్ము ఆయా వృక్ష–శిలాదులుగా భావించుకొనుచు, ఆరూపముననే అభివ్యక్తమౌతున్నాయి. అట్లే వ్యవహరించబడు చున్నాయి. అట్లే–క్రిమి–కీటక–పక్షి–జంతువులు మొదలైన జంగమ పదార్థముల భావన కూడా. ఆయా జంగమ – జాతులపట్ల గల బుద్ధి – వికారభేదములే ఆయా నామ–రూప భేదములతో ప్రాప్తిస్తున్నాయి. ఒకే జలంలో తరంగములు, ఆవర్తములు, బుడగలు, నురుగు, సుడిగుండములు కలుగుచున్నట్లు, ఒకే చిత్స్వభావము

నందు ఏర్పడు బుద్ధివృత్తులే ఈ స్థావర – జంగమ వ్యవహారమంతా కల్పిస్తున్నాయి. అయితే, 'కల్పన'తో కూడిన బుద్ధియందే నామ – రూపభేదములు ఉండి ఉన్నాయని గ్రహించు. ఒక సముద్రము యొక్క ఉత్తరమున ఉన్నవారు దక్షిణమున ఉన్నవారి గురించి తెలియకనే ఉండటం జరుగవచ్చుకదా! అదేవిధంగా, ఈ స్థావర – జంగమ పదార్థములు కూడా తమ 'స్వస్వరూపము'ను గ్రహించలేకపోతున్నాయి. ఇవి తమతమ "ప్రత్యక్ చైతన్య జ్ఞానవలయము" నందే పడివుంటున్నాయి. అనగా, "నేను వేరు. ఈ కనిపించేదంతా వేరు. నీవు వేరు, ఇవి నాకు చెందినవి. ఇవి నాకు సంబంధించినవి కావు. వీరు మాత్రమే నా వారు" .... అనునట్టి భావావేశమునే ఇక్కడ మనం ''ప్రత్యక్ జ్ఞానవలయము'' (Compartmentalised individual sphere of consciousness)గా చెప్పుకొంటున్నాం. అట్టి వలయమున బంధింపబడటం చేతనే ఒక ఉపాధిలోని బుద్ధి మరొక బుద్ధిలోని కల్పనలను ఎరుగజాలకున్నది. ఇదంతా కూడా బుద్ధికల్పనను అనుసరించే జరుగుతోంది.

"పరబ్రహ్మము" సత్ + చిత్‌రూపము కదా! అది వాస్తవానికి నామరూపరహితమై ఉన్నది. అట్టి పరబ్రహ్మమునందు సత్యదృష్టికి .... వాయువు, భూమి, ఆకాశము, మొదలగు పదార్థముల సత్త లేనేలేదు. అయినప్పటికి వాటికి కల్పనా మాత్రమైన సత్త ప్రాప్తిస్తోంది. రాతిలో ఉన్న కప్ప బైట కప్పను, బైట ఉన్న కప్ప రాతిలోని కప్పను కనుగొనలేవు కదా! ఈ ఈ నీవు–నేను మొదలైన వ్యవహారములు, వాటితో ముడి వేసుకొని ఉంటున్న ఈ పదార్థజాలం .... ఇవన్నీ ఆక్రమించి ఉన్న సమయంలో "సర్వసమత్వము" మరుగునపడి ఉంటోంది.

అయితే ఆత్మకొరకై అన్వేషిస్తున్న విజ్ఞులు ఈ జగత్తు యొక్క "సూక్ష్మావస్థ"వైపు దృష్టిని సారిస్తున్నారు. "మహాప్రళయ సమయంలో ఈ సమష్టి చిత్తము మాయయందు లీనమై ఉంటోంది. అట్టి సృష్టి చిత్తమే ఈ బాహ్యానికి కనబడే 'జగత్తు' యొక్క "సూక్ష్మావస్థ"గా వారు దర్శిస్తున్నారు. మహాప్రళయస్థితి తరువాత మరల ఆ ప్రత్యక్ చైతన్యము చిదాకాశమునందు భావనావ్యవహారమును గావించుచున్నది. అట్టి భావనను ప్రారంభించటంచే సృష్టి ప్రారంభము అని అంటున్నాం. సృష్ట్యాదియందు ఇదంతా ఎట్లు ప్రారంభించబడినదో, నేటికీ అట్లే నిలిచియున్నది. ఉదాహరణకు, సృష్ట్యాది యందు వాయువు స్పందన ధర్మముగా చింతించబడినది. అది ఇప్పటికీ అట్లే నిలచియున్నది. ఉపాధులు వచ్చి పోవుచున్నంత మాత్రంచేత ఈ కల్పన తొలగదు. సర్వకల్పనలు త్యజించబడునట్టి 'మహా ప్రళయము' వరకు ప్రత్యక్ చైతన్యము పట్ల ఈ కల్పన ఇట్లాగే ఉంటోందని గ్రహించాలి.

❖

అట్లు ఛిద్రరూపమున చింతింపబడినదే ఇక్కడ ఎదురుగా ఆకాశము రూపమున ప్రాప్తిస్తోంది. అట్టి ఆకాశమునందు 'స్పందము' అను ధర్మము గల వాయువు వెలయుచున్నది. వాయువు సర్వవ్యాపి కదా! అయినప్పటికీ శుష్క గడ్డిపరకలను కదల్చగలుగుతోంది కాని, భారమైన పదార్థములు కదల్చకలుగుతోందా? లేదు. దాని ధర్మము అట్లు సంకల్పించబడింది. ఈ కల్పనలను చేయుచున్న 'చిత్తము' యొక్క వ్యవహారం కూడా చమత్కారంగా ఉంటోంది. ఇది సర్వత్రా వ్యాపించియుండి,

సర్వత్ర ప్రసరించగలిగిన శక్తి కలిగియే ఉన్నది. కాని ఇది తనను తానే స్వయముగా పరిమితము చేసుకొనుచున్నది. వాయువునకు 'స్పందము' అనునది ధర్మము అగుచున్నట్లు, అగ్నికి 'ఉష్ణత్వము' సహజమగుచున్నట్లు, ఈ చిత్తమునకు "పరిమితత్వము" సహజధర్మమగుచున్నది. ఈ చిత్తమే స్పందాస్పందములను రెండు ధర్మములను స్వీకరిస్తోంది. అట్టి స్పందము – అస్పందము (Responsive - Non-responsive) అను ధర్మముల ననుసరించి 'స్థావరములు – జంగమములు' అను రెండు ఆకారములను దాల్చుచున్నది.

ఈ విధంగా "బుద్ధి–చైతన్యము" నందు భ్రమమయములైనట్టి జగత్ పదార్థములు కిరణముల వలె సృష్ట్యాది నుండి నేటివరకు ప్రకాశిస్తూనే ఉన్నాయి. ఇదంతా ప్రత్యక్ చైతన్యము తనయందు కల్పించుకొని ఇట్లు దర్శించుటయేనని నీవు గ్రహించు. ఈ జగత్ పదార్థముల విజృంభణమంతా అసత్యమే అయినప్పటికీ సత్యమువలె ప్రతిభాసిస్తోంది. కాబట్టి లీలా! నీవు నీ అత్యంత సుతీక్షణమైన సూక్ష్మదృష్టిని అలవరచుకో. అట్టి నిర్మల–సూక్ష్మ దృష్టిచే, "ఈ దృశ్యజగత్తు ఏమైయున్నది? జగత్తులోని విషయములేమిటి? నేను–నీవు .... మొదలైనవాటి వాస్తవమైన స్వరూప – స్వభావములు ఏమిటి?" అనే విషయాలు స్వవిచారణాపూర్వకంగా గ్రహిస్తావు.

ఓ ప్రియలీలా! అటు చూడు. అక్కడ యుద్ధభూమిలో ఏమి జరుగుతోందో గమనించు. చైతన్యము యొక్క 'పరిమిత దృష్టి'చే, ఒకప్పటి పద్ముడు అయిన విదూరథుడు ఇప్పుడు నేలపై మృతప్రాయుడై పడియున్నాడు కదా! ఈతడిప్పుడు మరణించి, పుష్పములచే కప్పబడియున్న పద్ముని మృతదేహముయొక్క హృదయ కమలంలో ప్రవేశించ బోవుచున్నాడు.

ప్రబుద్ధలీల : అమ్మా! ఈతడిప్పుడు ఏ మార్గం అనుసరించి ప్రయాణం చేయబోవు చున్నాడు? ఆ పద్ముని మృతదేహము ఉన్నచోటికి ఎట్లా చేరబోవుచున్నాడు? మనం కూడా అట్లే ఆతనిని అనుసరించి ప్రయాణం చేద్దామా?

❖❖❖

46. వాసనలు - పరలోక ప్రయాణం

శ్రీ సరస్వతీదేవి : చిన్మయస్వరూపుడగు జీవుడు "దూరముగా ఉన్నట్టి పరలోకమునకు వెళ్ళుచున్నాను" అని భావిస్తూ ఉంటాడు. అట్లే విదూరథుని విషయం కూడా. అతడు అట్లే భావించుచు, తన హృదయంలో గల వాసనాపథమును అనుసరించే పయనించుచున్నాడు. మనం కూడా ఆ మార్గమునందే పోదాము, పద! నీవు అతని సాన్నిధ్యం కోరుకొంటున్నావు కదా! నీ అభీష్టం కూడా తీరగలదు. నీ వాంఛ సిద్ధించినప్పుడే మన స్నేహం దృఢం అవుతుంది. అందుచేత, నీవు సర్వము దర్శించటానికి వీలుగా దివ్యదృష్టి ప్రసాదిస్తున్నాను.

సరస్వతీదేవి యొక్క ఈ పలుకులు వినుటచే లీలాదేవి హృదయంలో ఎక్కడో దాగివున్న శోకమంతా ఉడిగిపోయింది. ఆమెయందు జ్ఞానసూర్యుడు ఉదయించాడు.

❖

అక్కడ యుద్ధభూమిలో విదూరథుని దేహం క్రమంగా చైతన్యం కోల్పోసాగింది. మూర్ఛితులై పడివున్న అతని కనుపాపలు తిరుగసాగాయి. పెదవులు ఎండిపోసాగాయి. ప్రాణము ఒక్కటే మిగిలియున్నది. శరీరమంతా ఎండిన ఆకువలె తయారయింది. ముఖములో కాంతి క్షీణించుటచే పాలిపోయింది. ప్రాణవాయువులు తుమ్మెదలవలె ధ్వనిస్తూ ముక్కు వద్ద సంచరించసాగాయి. ఇంద్రియముల చేతలన్నీ కట్టుబడిపోయాయి. అవయవముల కదలిక ఆగిపోయింది. ఒక పక్షి వృక్షపు కొమ్మలను త్యజించి ఆకాశంలోకి ఎగిరిపోతుంది చూచావా? ప్రాణవాయువులు అట్లే క్రమంగా అతని భౌతిక శరీరాన్ని విడచాయి. ఆ పడతులిద్దరూ దివ్యదృష్టిచే ఆకాశంలోకి ఎగిరిన ఆ జీవుని గాంచసాగారు. అతని జీవచైతన్యము వాయువుతో కలసినదై, తనయందలి వాసనలను అనుసరించి, ఆకాశపథంలో దూరంగా పయనించసాగింది. సరస్వతీ-లీలలు ఆ జీవచైతన్యమును అనుసరించారు.

శరీరము త్యజించినప్పుడు "మరణమూర్ఛ" అను జడత్వము పొందిన ఆ జీవచైతన్యము ఆ మరణమూర్ఛ నుండి చేరుకొని అనుభవజ్ఞానం పొందసాగింది. వాయువులో ఉండే సువాసన యొక్క కణమువలె, ఆ జీవచైతన్యము ఆకాశప్రదేశంలోనే ఉండి ఈ విధమైన అనుభవం పొందసాగినది .....

❖

.... "బంధువులు నన్ను ఉద్దేశించి" ఊర్ధ్వదైహిక (Trace-body) కార్యములను ఒనర్చటం జరిగింది. అట్టి సంకల్పపూర్వకమైన, మంత్రముగ్ధమైన కార్యముల ప్రభావంచేత నేను ఇప్పుడు ఒకానొక సూక్ష్మతత్వపూర్వకమైన ఏదో దేహమును పొందాను. అట్టి నా ఈ నూతన సూక్ష్మదేహమును యమభటులు వచ్చి గొనిపోవుచున్నారు. ఇప్పుడు కర్మఫలములను అనుభవించునట్టి యముని పట్టణము చేరాను. నేనిప్పుడు యముని సమక్షమునకు కొనిరాబడ్డాను. ఇప్పుడు యముడు నావైపు చూచాడు. తన దూతలవైపు తిరిగి "ఓ దూతలారా! ఇతడు ఎన్నడూ ఈ పాపములు ఒనర్చలేదే? పైగా, ఎల్లప్పుడూ ఏదైనా పవిత్ర కార్యములనే నిర్వహించాలనే ప్రయత్నంలో ఉండేవాడు. జగజ్జననియగు సరస్వతిని ఎల్లప్పుడూ భక్తితో పూజించుచుండటంచే ఆమె దయకు పాత్రుడయ్యాడు. ఆమె వరప్రసాదంచేతనే ఇతడు వర్ధిల్లినాడు. ఇతని ఇతః-పూర్వపు 'పద్మని' ఉపాధి ఇప్పుడు పుష్పములతో కప్పబడి, చెక్కుచెదరకుండా ఉన్నది. ఇతనిని విడచిపెట్టండి. ఇతడు ఆ శరీరములో ప్రవేశించును గాక!" మరుక్షణం యమభటులు నన్ను బంధవిముక్తుని చేశారు. యంత్రము నుండి విడివడిన రాయివలె నాయొక్క జీవచైతన్యము ఆకాశదేశంలో పడింది. నేను జగద్గృహము నుండి వెలువడి ద్వితీయ బ్రహ్మాండములో ప్రవేశిస్తున్నాను. ఇక్కడ నాకు చెందిన భౌతిక దేహము ఉన్నది....." ఇట్లు ఆ విదూరథ జీవచైతన్యము అనుభవము పొందుతోంది. అతని దృష్టిలో పడకుండానే సరస్వతీ-లీలలు కూడా అతనిని అనుసరిస్తూ రాజగృహంలో ప్రవేశించారు.

❖

శ్రీరాముడు : హే బ్రహ్మజ్ఞా! వసిష్ఠమహర్షీ! విదూరథుని జీవచైతన్యము పద్మని భౌతికదేహము ఉన్నట్టి రాజగృహమునకు మార్గము ఎట్లా గ్రహించింది? ఆ గృహంలో ఎట్లా ప్రవేశించింది?

శ్రీ వసిష్ఠమహర్షి : విదూరథుని జీవచైతన్యము యొక్క హృదయంలో పూర్వ వాసనాబలం చేత, "నేను పద్మని శరీరమును" అనునట్టి అహంకారము ఇమిడియున్నది. అందుచేతనే పద్మని దేహము ఉన్నట్టి రాజమందిరమునకు అనాయాసంగా ప్రయాణించింది. ఒక మఱ్ఱివిత్తు తనయందు సూక్ష్మరూపంలో ఒక "ఊడలతో కూడిన మహావృక్షము" కలిగియుండి, ఆయా తగినట్టి దేశకాలాదులు ప్రాప్తించినప్పుడు విస్తారమైన మహావృక్షంగా ప్రకటితమౌతోంది కదా! అదేవిధంగా జీవచైతన్యము కూడా తన హృదయమందు ఉన్నట్టి వాసనల "ఉద్బోధకము" లభించినప్పుడు, అవి "పరిపుష్టం" అవటం (లేక దృఢంగా ప్రకటితం కావటం) గాంచుచున్నది. బీజంలో అంకురం ఉంటున్నట్టు, హృదయంలోనే స్వప్నం ఉంటున్నట్లు ... చిత్స్వరూపుడగు ఈ జీవుడు తనయందే ఈ ముల్లోకములను అనుభవించు చున్నాడు. ఒకడు ఒకచోట ఉండి స్వీయ కల్పనాజగత్తులో ఎక్కడో ఉన్న స్త్రీ, పురుషులు, సమస్త వస్తుజాలమును గాంచుచున్నాడు కదా! జగత్తుగా, ముల్లోకములుగా కనిపించేదంతా ఆ జీవుని యొక్క సంస్కారములే సుమా! ఈ జీవుడు వందలకొలది జన్మలను, స్వీయ వాసనలను అనుసరించి అభీష్టములను, అందుకు ప్రయోజనంగా సుఖదుఃఖ ములను, ఆ సుఖదుఃఖములకు సముచితములై కర్మలను, ఆ కర్మల నుండి వాసనలను ... ఇట్లు చెట్టు-విత్తుల వలె పొందుతూ పోతూనే ఉన్నాడు. ఇదంతా భ్రాంతియే సుమా! వాస్తవానికి జీవుడు జన్మించడు. మరణించడు. అయినను ఈ జననము – జీవనము – మరణము – అంతా సత్యమువలెనే అతనికి కనిపించుచున్నది.

❖❖❖

47. పిండప్రదానం

శ్రీరాముడు : హే భగవానుడా! వసిష్ఠమహర్షీ! సర్వము సంస్కారబలంచేతనే ప్రాప్తిస్తున్నదని అంటున్నారు కదా! మరి "పిండప్రదానము బంధువులచే ఒనర్చబడినప్పుడు, ఆ పిండప్రదాన ప్రభావం చేత ఒకానొక నూతన శరీరం ప్రాప్తిస్తోంది" అని మీరు ఎందుకు చెప్పారు? బంధువులు చేసే పిండ ప్రదానము వలన మృతుడికి ఏమైనా లభిస్తుందా? లభిస్తే ఎట్లా లభిస్తుంది?

శ్రీ వసిష్ఠమహర్షి : పిండము వేయబడవచ్చు. వేయబడకపోవచ్చు. కాని, "వేయబడినది" అని మృతుడు భావించినంతమాత్రంచేతనే అతనికి పిండప్రదాన ఫలము లభిస్తుంది.

"చిత్తము ఏ రూపంలో ఉంటే, జీవుడు కూడా ఆ రూపమునే దాల్చును" అని విద్వాంసులు గ్రహిస్తున్నారు. ఈ నియమము మృతులపట్లనే కాదు. జీవితులపట్ల కూడా వర్తిస్తోంది. పిండము పొందినవాడు, "పిండమును పొందితిని" అని భావించటంచే అతనికి పిండ ఫలము దక్కుచున్నదని అనుకొన్నాం కదా! అదే విధంగా పిండము ప్రదానము చేయబడినవాడు, "నేను పిండము పొందలేదు" అని భావిస్తే అతనికి ఆ ఫలము లభించటంలేదు.

నేను చెప్పేది చమత్కారంగా ఉన్నమాట నిజమే. కాని, నేను చెప్పేదానికి దృష్టాంతము ఈ జగత్తులోని పదార్థములే. భావనాబలము చేతనే ఈ ఎదురుగాగల దృశ్యములోని పదార్థములు సత్యమైన విషయములవలె అనుభవించబడుచున్నాయి. చూపునుండే సౌందర్యము అనుభవించబడు చున్నది కదా! భావన నుండే పదార్థముల ఉనికికి సంబంధించిన అనుభవం ప్రాప్తిస్తోంది. భావనాబలంచే విషము అమృతంకాగలదు. "గరుడోపాసకుల"* విషయంలో ఇది మనకు కనిపిస్తోంది కదా!

అసత్యపదార్థములు, విషయములు కూడా భావనాబలముచే ఆ భావనను అనుసరించి సత్యములే అగుచున్నాయి. ఈ అసత్య – పదార్థములన్నీ సత్యమైయున్నట్టి బ్రహ్మము నందే అధ్యారోపితములై ఉన్నాయి. అందుచేత రామా!

"కారణము లేకుండా ఎవరికీ ఎట్టి భావన ఉదయించదు. సర్వమునకు మూలకారణము సద్వస్తువే. ఆత్మకు సంబంధించని విషయముగాని, ఆత్మయందు బీజత్వము లేనట్టి వ్యక్తిగాని, ఆత్మకు బాహ్యమైయున్నట్టి (వేరుగా ఉన్నట్టి) ప్రవర్తనగాని, వ్యవహారములు గాని లేవు....."

అనునట్టి సమాధానము అంతరంగమున పొందియుండుము. సర్వసమత్వ సాధనచే మాత్రమే ఆత్మ అనుభవమునకు రాగలదు. అట్టి బ్రహ్మమునకు వేరు కారణమంటూ లేదు. అనగా అది కారణరహితము. అదియే సర్వమునకు కారణము, స్థానము, ప్రేరణము కూడా. ఈ జగత్తు విషయానికి వస్తే, ఇక్కడ 'మహాప్రళయము' అను స్థితివరకు ఏ ఒక్క కార్యమునకైనా కారణము ఉండియే తీరుతుంది. కారణం లేనట్టి కార్యము ఎవ్వరూ గాంచటం లేదు. వినటంలేదు.

విశుద్ధమగు చైతన్యమే వాసనారూపమున 'కార్య–కారణములు' అను ఉభయ భావములను పొందుచున్నది. చైతన్యమే జగత్తుగా ప్రతిభాసిస్తోంది. అందుచేతనే జీవించియున్నవారి శుభ సంకల్పములు ప్రేతమును స్పర్శించగలుగుచున్నాయి.

శ్రీరాముడు : ఒకానొక జీవుడు ఈ విధంగా తలచాడనుకోండి : "నాకు పిండప్రదానాదులను చేసేవారు లేరు"

ఇప్పుడు ఇట్టి అభిప్రాయంగల ఆ జీవుడు మృతిచెందాడని అనుకొందాం. అట్లు మృతిచెందన వ్యక్తిని ఉద్దేశించి అతని బంధువులు గోదాన, భూదానాది అనేక ధర్మ కార్యములు కూడా నిర్వర్తించారనే అనుకొందాం. అప్పుడా ధర్మకార్యములన్నీ ఆ జీవునిపట్ల ఫలప్రదం అవుతాయా? కావా? బంధువులు చేస్తున్న దాన–ధర్మాది కార్యములు క్రియాపూర్వకమైన సత్–సంకల్పము. కాని, అతడు చింతించునది అసత్యము కదా! మరి, వీటిలో ఎద్దానిబలం ఎక్కువగా ఉంటుంది? "నాకు వీటి నుండి ప్రాప్తించగల ధర్మమంటూ ఏదీ లేదు" అని తలచినప్పుడు అట్టి మృతుని పట్ల జరుగుచున్నదేమిటి?

* (గరుడోపాసకులు = "నేను ఈ పేరుగల వ్యక్తియొక్క శరీరమునందు పాముకాటుచే ప్రవేశించిన విషమును బయటకు తోలివేయుచున్నాను" అని దూరముగా ఉన్న ఒకని శరీరము గురించి సంకల్పించినప్పుడు, అది అట్లే సిద్ధిస్తూ ఉంటుంది. ఇది సంకల్పము యొక్క బలమునకు నిదర్శనం)

శ్రీ వసిష్ఠమహర్షి : మరణించినవాని బంధువులు ధర్మవాసనతో కూడుకొన్నవారై, శాస్త్రములచే విధించబడిన ద్రవ్య-క్రియ-మంత్ర-స్థల-కాలముల నియమమును అనుసరించి చేస్తున్నారు కదా! కాబట్టి శాస్త్రములచే చెప్పబడిన విధంగా శ్రాద్ధాదులు, దాన - ధర్మాదులు ఆ ప్రేతమునకు శుభమే కలుగజేస్తాయి. ప్రేతము యొక్క వాసనల కంటే 'ధర్మము' యొక్క వాసనయే సాధారణంగా బలవత్తరమై ఉంటుంది. ప్రేతవాసన స్వకల్పితము. అంతేగాని శాస్త్రప్రమాణితము కాదు కదా! కనుక ప్రేతమును (మరణించినవానిని) ఉద్దేశించి చేసిన సశాస్త్రీయములైన దాన-ధర్మాదులు ఆ ప్రేతమునకు సుఖ-శాంతులనే కలుగజేస్తాయి. ఆ కర్మను నిర్వర్తిస్తున్న బంధువుయొక్క శుభసంకల్పమే అందుకు కారణమగుచున్నది.

అయితే ఇక్కడ ఒక విషయం నీవు గమనించాలి. ప్రేతము (మరణించిన జీవుడు) శాస్త్రకర్మలను ద్వేషించువాడు, వేదములను మొదలంట తిరస్కరించువాడు, నాస్తికుడు అయితే, ఆ ప్రేతము యొక్క సంకల్పమే అధికబలము కలిగియుంటుంది. అట్లు కాకపోతే అతని నికృష్టవాసన తప్పకుండా ధర్మవాసనచే (బంధువులచే నిర్వర్తించబడిన దానాదుల సంకల్పబలంచే) జయించబడగలదు. ఈ విధంగా, "బంధువుల శాస్త్రీయమైన సంకల్పబలం - మృతుని అభిప్రాయబలం" .... ఈ రెండిటిలో ఏది అధికబలము కలిగినదైతే అయ్యదియే రెండవదానిని జయించి వేస్తోంది. అందుచేత, మిక్కిలి ప్రయత్నముచే శుభకర్మలను (దాన-ధర్మములను) నిర్వర్తించటం, "ఈ ప్రేతమునకు శుభమగుగాక! శాంతమగుగాక" అని సంకల్పించటం ఉచితమే అని మా అభిప్రాయం. ప్రేతమును దృష్టిలో పెట్టుకొని, శుభకర్మలు శుభసంకల్పములచే నిర్వర్తించబడుగాక!

❖❖❖

48. వాసనయొక్క ఆరంభం

శ్రీరాముడు : హే మహర్షీ! ఇక్కడ నాకు ఒక ముఖ్యమైన సందేహం ఉదయిస్తోంది.

అంతరంగమున ఉన్న "వాసన" దేశ-కాలాదుల సానుకూల్యతను అనుసరించి వికసించినప్పుడు విత్తు మహావృక్షం అగుచున్నట్లుగా, ఈ శరీరాదులు, బాహ్య జగత్తు ప్రాప్తిస్తున్నాయని మీరు అన్నారు కదా! మరి మొట్టమొదటగా ఈ సృష్టి ఎక్కడి నుండి వచ్చింది? కల్పాది* లో దేశ-కాలాదులు లేవంటారా? అట్లా అయితే, ప్రథమ సృష్టికి కావలసిన వాసన ఎక్కడి నుండి వచ్చింది? ఈ దృశ్యసమూహములు ఇట్లు ప్రాప్తించుచుండుటకు అంతరంగమునందలి వాసనలే కారణమని పెద్దలు అంటున్నారు కదా! ఎవరి యొక్క వాసనలచే మొదలు ఏది? అవి జీవచైతన్యము నందు... దేశము - కాలము అనబడే సహకారికారణాలు (supportive cause) లేక పోయినప్పుడు కూడా... ఎట్లా దాగి ఉంటున్నాయి?

---

* కల్పాది = శుద్ధచిత్ స్వరూపమగు ఆత్మ, "అభిలాష ఆకాంక్ష"లతో కూడిన బాహ్యకల్పన నాశ్రయించినప్పుడు, అదియే సృష్టి అనబడుదానికి ప్రారంభంగా చెప్పబడింది. శాస్త్రములు దానిని "సృష్ట్యాది" అని పిలుస్తున్నాయి. అదియే 'కల్పాది' కూడా.

శ్రీ వసిష్ఠమహర్షి : మంచి ప్రశ్నే వేశావు. సరే సమాధానం చెబుతాను. సూక్ష్మబుద్ధితో విను. "సృష్ట్యాదియందు దేశకాలాదులు లేవు" అని నీవు నీ మాటలననుసరించి గ్రహించియే ఉన్నావు కదా! అవును. అది అక్షరాలా నిజం. ఎందుచేతనంటావా? సృష్టికి ముందు బ్రహ్మము మాత్రమే కలదు. అట్టి బ్రహ్మమందు దృశ్యపదార్థములు ఉత్పన్నము అగుటకు కారణము లేదు. ఎందుకంటే, "కారణము" అనేది ఎంత పరిశీలించినా లభించకయే ఉన్నది. ఒకవేళ "ఈ దృశ్యము బ్రహ్మమునందు ఉండి ఉండుటకు ఒకానొక కారణము ఉన్నది" అని ఎవరైనా నిర్ణయిస్తే, అకారణమునకు మరల కారణ-కారణం (cause for that cause)గా మరొకటి ఉండి ఉండాలి. ఈ విధంగా దీనికి అంతువుండదు. 'కారణము' అనునది లభించక పోవుటచే ఈ "దృశ్య-పదార్థములు" అనబడు కార్యము కూడా లేనిదే అగుచున్నది. అనగా ఈ దృశ్యపదార్థములు స్వతహాగా ఉత్పన్నమే అయి ఉండలేదు.

సృష్ట్యాది యందే ఉత్పన్నము అయివుండనట్టి ఈ 'జగత్తు' అనబడు దానికి ఇక వినాశనమెక్కడ ఉంటుంది? ఏదైనా ఉత్పన్నమైతేకదా, దానికి వినాశనం ఉండటం!

అందుచేత, ఈ కనబడేదంతా ఇందలి దేశకాలాదులతో సహా సర్వదా చిదాకారమగు బ్రహ్మమే అయివున్నది. మరింకేమీ అయి ఉండలేదు. ఈ విషయం నిరూపించటానికి నేను మన ఈ విచారణయందు అనేక యుక్తుల సహాయంతో ప్రయత్నించబోవుచున్నాను. "ఈ దృశ్యము ఏ సమయమందు కూడా ఉద్భవించియుండలేదు. ఇదంతా బ్రహ్మముకాక మరింకేమీ కాదు" అని తెలియచెప్పుటయే ఆ మన ఇరువురి సంవాదము యొక్క ప్రయోజనమైయున్నది. ఈ ఉత్పత్తి ప్రకరణము యొక్క సారము అదే. అయితే ఇదంతా జీవుడు తన వాసనానుసారంగా మాత్రమే గాంచుచున్నాడు" అనుశబ్దములచే "సృష్టి-సంసారము" అనుశబ్దములచే ఉద్దేశ్యించబడుతోంది.

మరల మనం కథలో ప్రవేశిద్దాం.

❖

జ్ఞప్తి దేవతయగు సరస్వతీదేవి, లీలాదేవి పద్మని అంతఃపురంలో ప్రవేశించారు. పద్మని భౌతిక దేహం ఇతఃపూర్వంవలెనే ఒక విశాల గృహం మధ్యలో సువాసనలు వెదజల్లు పూలతో కప్పబడి ఉన్నది. తలవైపు మంగళ ద్రవ్యములు ఉండే పూర్ణకుంభములు ఉంచబడి ఉన్నాయి. గది తలుపులు, కిటికీ తలుపులు మూయబడి ఉన్నాయి. అవతలి గదులలో దాస-దాసీజనం గుఱ్ఱుపెట్టి నిద్ర పోతున్నారు. పద్మని భౌతికదేహము ప్రక్కనే ద్వితీయలీల కూర్చుని ఉన్నది. ఆమె కళ్ళలో ప్రేమ, ఆవేదన గూళ్ళు కట్టుకొని ఉన్నాయి. చేతిలో వింజామరులు ఉన్నాయి. ఆమె వేషము, నడవడి, శరీరము, వాసనలు, ఆకారము, రూపము, అవయవములు, స్పందము, కట్టుబట్టలు, నగలు .... మొదలైనవన్నీ మునుపటివలెనే ఉన్నట్లు ప్రబుద్ధలీల గమనించింది. భేదమల్లా .... ఆమె విదూరథుని ఇల్లు విడచి ఇక్కడ ఉండటం మాత్రమే. ఎడమచేతిమునివ్రేళ్ళతో ముఖమును స్పృశించుకొనుచు ఆ ఉత్తమ ఇల్లాలు మౌనము వహించియున్నది. మధ్యమధ్యలో అభిలాషతో భర్త మోము చూస్తోంది.

ప్రబుద్ధలీల సరస్వతులు, ఆమెను చూచుచున్నారు. కాని ఆమె మాత్రం "సత్య-సంకల్పి" కాకపోవుటచే వారిని చూడలేకపోవుచున్నది.

❖❖❖

49. ఆధిభౌతిక భ్రాంతి

శ్రీరాముడు : ప్రభూ! ప్రబుద్ధలీల అదే గృహంలో తన శరీరమును ఉంచి ధ్యానబలం చేత విదూరథుని భవనమునకు వెళ్ళియున్నదని మీరు చెప్పియున్నారు కదా! మరల ఆమె భౌతిక-దేహము విషయమై మీరు ఏమీ ప్రస్థావించలేదే? ఆ దేహం ఏమైనది? ఎచ్చటికి అరిగినది?

వసిష్ఠమహర్షి : ఓహో! ఆ దేహము గురించా, నీప్రశ్న? బాగానే ఉన్నది. ముందుగా జీవుని "దేహభ్రాంతి" విషయమై ఈ విశేషాలు విను. లీల యొక్క ఆ దేహము సత్యము అయినప్పుడు కదా, ఆ ప్రశ్న? ఆ శరీరము ఎడారిలోని ఎండమావులందలి జలం వలె భ్రాంతి మాత్రమే. ఓ రాఘవా! మహత్తరమైన ఆశయముతో కూడిన బుద్ధి కలవాడవై ఈ విషయంలో నేను చెప్పబోవునది గ్రహించు.

ఈ జగత్తు అంతా ఆత్మయే. ఇందులో దేహాదుల కల్పనకు తావు ఎక్కడ ఉన్నది చెప్పు? ఇక ఎదురుగా కనిపిస్తున్న నామరూపములతో కూడిన, ఈ శరీరముల మాటేమిటంటావా? ఇదంతా ఆనందరూపమగు చిన్మయబ్రహ్మమే సుమా!

❖

పూర్వలీల యొక్క జ్ఞానము వృద్ధి అగుచున్నకొలది, ఆమె శరీరము మంచులాగా కరిగిపోయింది. అయితే ఇప్పటి ఆమెయొక్క ఆతివాహిక దేహముతోటి ద్రష్టత్వము కూడా మునుపటి భౌతిక + ఆతివాహిక దేహములతో కూడిన ద్రష్టత్వమును పోలియే ఉన్నది. కాని, ఆమెయందు మునుపటి 'ఆధిభౌతిక భ్రాంతి' మాత్రం లేదు.

ఓ రామచంద్రా! వాస్తవానికి "ఆధి భౌతికము" అనునదే లేదు సుమా! దాని శబ్దము - అర్థములు కూడా సత్యములు కావు. "కుందేటి కొమ్ములు" అను పదప్రయోగం ఎంతటి అర్థరహితమో, ఈ కనబడే నామ-రూపాత్మక సృష్టి అట్టిది. ఇదంతా మొదలంట అసత్యమై ఉన్నప్పటికీ, ఈ జీవుడు ఆ విషయం ఎందుకో గ్రహించటంలేదు. అతడు ఈ శరీరము గురించే అనేక రీతులుగా భ్రమాత్మక భావములు కలిగి ఉంటున్నారు. అంతేకాని, "ఈ శరీరము ఏమిటి? ఇందు ఉన్నట్లు తోచుచున్న నేనెవ్వడను? నా వాస్తవ స్వరూప-స్వభావములు ఎట్టివి?" అని విచారణ చేయకుండానే ఉంటున్నాడు. స్వప్నంలో అనేక అనుభవములు, దృశ్యములు పొందుచున్న స్వప్నద్రష్ట." "ఇదంతా నా కల్పనయే కదా!" అని గ్రహించకుండానే, అప్పుడు ప్రస్తావించబడు, ప్రాప్తించు విషయములతో తాదాత్మ్యము చెందుచూ అనేక సుఖదుఃఖము పొందుచున్నాడు. ఆయా వ్యక్తులు, వస్తువులు, నగరములు వాస్తవమేనని దృఢమైన భ్రమపొందుచున్నాడు. స్వప్నములోని అనేక సంఘటనలతో

కూడిన కథనమంతా మెళుకువ వచ్చే వరకు అట్లే ఉంటుంది కదా! ఈ జాగ్రత్‌కు సంబంధించిన, భౌతికశరీరమునకు సంబంధించిన అనుభవములు కూడా .... జ్ఞానము వికసించేవరకు వాస్తవమై ఉంటూనే ఉన్నాయి. త్రాడుపట్ల ఉన్న సర్పభ్రాంతి తొలగిపోతే సర్వవికారాలు తొలగిపోతాయి. భ్రాంతి, భ్రమ తొలగిపోతే సత్యదృష్టే శేషించుచున్నది.

ఈ ఆధిభౌతిక ప్రపంచమంతా అప్రబుద్ధమగు మనస్సు చేతనే కల్పించబడుతోంది. ఈ మిథ్యాభావము క్రమంగా మనస్సునందు సత్యమువలె ఆరూఢమై ఉంటోంది. జనులు ఏ చక్ర యంత్రమునో ఎక్కినపుడు భూమి, భవనములు, ఎదురుగాగల జనులు చక్రము వలె తిరుగుచున్నట్లు కనిపిస్తారు చూచావా? అట్లే అజ్ఞానులు మాత్రమే స్వప్నమును బోలినట్టి ఈ సృష్టులను, అట్టి ఈ సృష్టులలోని ఈ బాంధవ్యములను వాస్తవమైనట్లు అనుభవించుచున్నారు. ఇది ఇట్లుండగా, స్వప్నంలో భౌతికదేహం లేకుండానే అనుభూతులు-అనుభవాలు కొనసాగుచున్నాయి కదా!

శ్రీరాముడు : ఒక 'యోగి' పూర్తిగా 'ఆత్మప్రాప్తి' పొందాడని అనుకొందాం. ఆ యోగి దేహమునకు సంబంధించిన "ఆధిభౌతిక భావము" పూర్తిగా త్యజించి, "ఆతివాహిక భావము"నే సర్వదా ఆశ్రయించుకొని ఉంటాడు కదా! మీరు, "ఆతివాహికదేహము కన్నులకు కనబడనిది. నాశ రహితమైనది కూడా" అని చెప్పియున్నారు.

ఇప్పుడు నా సందేహము ఏమిటంటే, "ముక్తి" సమయంలో కూడా ఆధిభౌతికదేహం ఉంటుందా? ఉండకుండా, పోతుందా? ఆధిభౌతిక దేహం ఉన్నంతవరకు 'ముక్తి' సాధ్యమా? అసాధ్యమా?

శ్రీ వసిష్ఠమహర్షి : జాగ్రత్‌లో ఘనీభూతమై కనిపిస్తున్న ఈ భౌతికదేహము త్యజించ బడకుండానే, స్వప్నంలో స్వప్నద్రష్టకు మరొక దేహం లభిస్తోంది కదా! ఈ జాగ్రత్ దేహం ఇట్లు పాన్పుపై జడత్వముచే పడి ఉండగానే, స్వప్నద్రష్ట నూతన దేహంతో శబ్దాలు వింటున్నాడు, నడుస్తున్నాడు, పరుగులు తీస్తున్నాడు, నవ్వుచున్నాడు. ఆ స్వప్నంలో తారసపడే బంధుమిత్రులతో సంభాషిస్తున్నాడు కూడా.

యోగులు "కాయవ్యూహము"* అను ప్రక్రియ ద్వారా, ఈ భౌతిక దేహము ఇట్లు ఉండగానే, తమ ఆతివాహిక దేహప్రభావంచేత వేరైన దేహములు పొంది అనుభవములు పొందుచున్నారు. అంతేకాదు, కొందరు యోగుల శరీరములు అదృశ్యవస్తువులవలె ఆతివాహిక దేహమాత్రమై ఉంటున్నాయి. వారు "నేను భౌతిక శరీరధారినై ఈ భక్తునికో, శిష్యునికో కనిపించెదను గాక" అని సంకల్పించినపుడు, అట్లే భౌతిక శరీరధారులై ఇతరులకు కనిపించటం జరుగుతోంది. "ఈ నా

---

* **కాయవ్యూహం :** యోగశాస్త్రంలో ఈ కాయవ్యూహం గురించి చెప్పబడింది. యోగి ధ్యాననిష్ఠలో ఉంటూనే తన ప్రారబ్ధకర్మలను నశింపచేసుకోవటానికి, స్వకల్పన యొక్క సామర్థ్యముచే తదనుకూలములైన దేహములను ఆతివాహికము నందు నిర్మించుకొను చున్నాడు. అట్టి కల్పిత దేహములచే అట్టి యోగులు ఆయా కర్మలను నిర్వర్తించటం, సుకృత - దుష్కృత కర్మలను అనుభవించుచు, తద్వారా ప్రారబ్ధకర్మలను తొలగించుకొని 'కైవల్యం' పొందటం చేస్తూ ఉంటారు.

భౌతిక శరీరము ఇతరుల దృష్టికి అదృశ్యమై ఉండుగాక" అనునట్టి సంకల్పబలంచేత వారు అదృశ్య రూపులు అగుచున్నారు. అప్పుడు వారి శరీరములను తదితర యోగులు కూడా గాంచలేకపోతున్నారు. ఇక ఇతరులు గాంచలేరని వేరుగా చెప్పాలా?

"ఒకడు బ్రతికియున్నాడు. మరణించుటచే గతించినాడు...." అను రూపమున దర్శించటం స్వవాసనా ప్రభావముచేత మాత్రమే సుమా! త్రాడునందు పామును చూచువాడు, సర్పజ్ఞానము తొలగిపోయినప్పుడు "ఇది త్రాడు మాత్రమే" అని గ్రహించునట్లు, జ్ఞానోదయము అయిన తరువాత శరీరభ్రాంతులు నశిస్తున్నాయి. "నేను పూర్వదేహమును చూచెదను గాక! పొందెదను గాక" అనునట్టి భ్రమాత్మకమైన ఆవేశం ఇక ఉండదు. అట్టి జ్ఞాని ఇట్లు "భావన" కలిగి ఉంటాడు.

"ఈ 'శరీరము' అనగా ఏమి? దీని ఉనికి ఎక్కడ? ఇది నశించుట ఏమి? ఇవన్నీ 'ప్రతిబింబము' వలె అవస్తువులే కదా! ఈ శరీరమును ధరించు 'శరీరి' – స్వరూపుడనగు నేను సత్యమై, నిత్యమైవున్నాను. ఉండవలసినదేదో సర్వదా, సదా ఉండనే ఉంటోంది. అసత్తుకు ఉనికి ఎక్కడ? ఉనికి లేనిదాని వలన సుఖ దుఃఖాదులు ఎక్కడివి? అజ్ఞానమున్నంతవరకే అవి ఉంటున్నాయి. అజ్ఞానము తొలగిపోయిన తరువాత, ఇక ఈ దేహాదులు ఉండాలనిగాని, తొలగాలనిగాని అభినివేశం ఉండవలసినపని లేదు. ఏది ఎక్కడ ఎట్లు ఎందుకు ఉన్నా, ఉండకున్నా ... నేను ఆత్మయే 'స్వరూప – స్వభావము' లుగా కలవాడిని కదా!"

జ్ఞాని యొక్క సంకల్పములు, అభిప్రాయములు, భావనలు పై విధమైన పునాదిని కలిగి ఉంటాయి.

❖❖❖

50. ఆధిభౌతికం - ఆతివాహికం

శ్రీరాముడు : హే సద్గురూ! యోగుల యొక్క ఆధిభౌతిక దేహమే యోగబలంచేత "ఆతివాహికం" అగుచున్నదంటారా? లేక, ఆధిభౌతికం తిరస్కరించబడి (త్యజించబడి) 'ఆతివాహికం' కలుగుచున్న దంటారా? ముందుగా ఈ విషయం చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! నీకీవిషయం ఇదివరలో చాలా మార్లు చెప్పాను. కొంత వివరణతో ముక్కుకు సూటిగా కూడా చెప్పాను. అయినా నీవు ఇంకా గ్రహించటం లేదేమిటి? సరే. మరల ప్రకటిస్తున్నాను. విను. ఈమారు మరింత నిర్దుష్టంగా సత్యమైయున్నదానిని చెప్పుచున్నాను.

"ఆతివాహికదేహము" (లేక సూక్ష్మదేహము) ఒక్కటే ఉన్నది. 'ఆధిభౌతికదేహము' అనునది లేనే లేదు. ఇక శరీరభ్రాంతి అంటావా .... అది స్థూలమునకు సంబంధించిన "అధ్యాస" (superimposition) వలననే కలుగుచున్నది. ఆ అధ్యాస తొలగితే, ఆధిభౌతిక బుద్ధి పోయి, "ఆతివాహిక బుద్ధి" ఉదయించగలదు. ఒకడు ఒక 'కల'లోంచి తేరుకున్న తరువాత, ఆ కలలోని "భవనము–ఆ భవనముయొక్క కాఠిన్యము" .... మొదలైనవి ఏమైనా కనబడుచున్నాయా? లేదు

కదా! అట్లే, ఆతివాహిక జ్ఞానము ఉదయించిన తరువాత ఇక ఈ భౌతిక దేహము యొక్క గురుత్వ* కాఠిన్యాదులు తోచవు ఆధిభౌతికమైన పరిమితభావన స్ఫురించక లయించిపోతోంది.

స్వప్నమునందు ఏర్పడుచున్న దట్టమైన స్వప్నభ్రాంతి తొలగాలంటే ఉపాయం ఏమిటి? "ఇది స్వప్నము మాత్రమే" .... అను జ్ఞానము కలుగుటయే కదా! ఆతివాహిక బుద్ధి, లేక, "నేను అంతః తత్త్వమును. ఎట్టి వస్తుజాలము చేతను బంధింపబడనంతటి సూక్ష్మ – అంతఃకరణ స్వరూపుడను" .... అను బుద్ధి లేక "బోధ" ఉదయించిన మరుక్షణం ఆధిభౌతిక శరీరబుద్ధి ఎటో పోతుంది.

అట్టి ఆతివాహిక జ్ఞానము ఉదయించిన యోగుల శరీరము దూదివలె అతితేలిక, లాఘవము అగుచుండ వచ్చుకూడా! దృష్టాంతము స్వప్నమే. స్వప్నసమయంలో, "ఇది స్వయం కల్పితమైన స్వప్నము. నిజానికి స్వప్నము అవాస్తవమే కదా!" అను జ్ఞానము కలగటం జరిగితే, అప్పుడు ఆ స్వప్నద్రష్ట యొక్క శరీరం తేలికయి, 'భారం' అనిపించకుండా ఉంటుంది. అట్లే జ్ఞానోదయమైన తరువాత, కొందరు యోగులు తమ ఇచ్ఛను అనుసరించి ఆకాశమున ఎగురగలగటం మనం చూస్తూ ఉంటాం.

సంకల్పమే ఆతివాహికము యొక్క స్వరూపము కదా! చాలాకాలం సంకల్పదేహమునే ఆశ్రయించువారు, అనగా, – "నేను సూక్ష్మస్వరూపుడనే గాని, భౌతిక దేహమును గాను" .... అను భావనయందు దీర్ఘకాలం ఉండేవారు ..... వారి పూర్వదేహము దగ్ధమైనను, శవంగా మారినను సూక్ష్మదేహము అట్లే ఉంటున్నది. ఇక యోగులైతే వేరుగా చెప్పేదేమున్నది? వారికి జ్ఞానాతిశయంచేత సూక్ష్మదేహత్వము ఈ జీవదశ యందు లభించుచున్నది. వారిలో కొందరు, "నేను సంకల్పమయుడను" అనునట్టి స్మృతిని పొందినప్పుడు, అట్టి జ్ఞానమహిమచే ఆకాశవిహారం, అదృశ్యమగుట మొదలైన స్థితులు వారు కోరుకొనటం, పొందటం జరుగుతోంది. స్వప్నంలో, "నేను సంకల్పమయుడను" అని అనుకోగానే, స్వప్నంలోని ఆకాశంలో విహరిస్తున్న అనుభవం ప్రాప్తిస్తోంది కదా! ఇది కూడా అట్టిదే.

ఓ రామచంద్రా! "ఈ స్థూలదేహమే నేను" అనునట్టి అనుభవం కేవలం భ్రాంతి వలన, అజ్ఞానము వలన, అవిచారణ వలన ఏర్పడుచున్నది మాత్రమే సుమా! అట్టి భ్రాంతి తొలగిపోతే ఆధిభౌతికభావం తొలగిపోతుంది. దానితో ఈ సంసారాడంబరం కూడా తొలగిపోతుంది. దుః ఖములన్నీ కూడా తొలగిపోతాయి. భ్రాంతి ఉన్నచోటికి మాత్రమే దుఃఖములన్నీ వచ్చి చేరుచున్నాయి.

❖

శ్రీరాముడు : ప్రభూ! మరొక ప్రశ్న. ఆతివాహిక దేహముతో కూడినదై, ఇప్పుడు ప్రబుద్ధలీల పద్మని మందిరంలో ప్రవేశించియున్నది కదా! ఆమె కనుక, "నేను ఈ అంతఃపురములో ఉన్నవారికి కన్పించెదనుగాక" అని సంకల్పేచ్ఛ కలిగి ఉంటే, అక్కడివారు ఆమెను చూడగలుగుతారా? ఒకవేళ

---

* గురుత్వము = Experience of physical body as weight and mass.

చూడగలిగితే వారు ఏమనుకొంటారు? గిరిగ్రామంలోని జ్యేష్ఠశర్మలాగా "ఈమె దేవత" అని అనుకొంటారా? లేక, "ఈమె మా మహారాణియే కదా" అని గుర్తిస్తారా?

శ్రీ వసిష్ఠమహర్షి : ఆ గృహములోనివారు ఆమెను "ఈమె దుఃఖముచే ఆక్రమించ బడియున్న మా మహారాణియే కదా" అని భావిస్తారు. పరమేశ్వరుడు తమకు రాణిని తిరిగి ప్రసాదించినట్లు భావిస్తారు. ద్వితీయ లీలవైపు చూచినప్పుడు మాత్రం, "ఈమె ఎక్కడి నుండో వచ్చిన చెలికత్తె" అని అనుకొంటారు. ఎందుచేతనంటే, అక్కడివారు ద్వితీయ లీలను ఎప్పుడూ చూచి ఉండలేదు కదా! అయితే ఇప్పటికి మాత్రం "ఈమె ఎవరు?" అనే అనుమానం ద్వితీయలీల విషయంలో వారికి వచ్చుట లేదు. రాజు మరణించాడనే దుఃఖం వారి మనస్సులను కలచివేయుచున్నది. అందుచేత అక్కడివారు సూక్ష్మమైన విషయములను గ్రహించుటకు ఆ సమయంలో సిద్ధంగాలేరు.

మరొక విషయం. అవివేకులైనవారు తాము చూచిన పదార్థములను అనుసరించే వ్యవహరిస్తూ ఉంటారు. వారికి తీవ్రమైన విచారణశక్తి ఎక్కడినుండి వస్తుంది చెప్పు? తమ చుట్టుగల పరిస్థితులందు రాగద్వేషములు ఏర్పరచుకొని, వాటియందు ఆవేశ పూరితంగా నిమగ్నమైనవారికి పరీక్షాత్మకమైన సూక్ష్మదృష్టి ఏర్పడుతుందా? లేదు. మట్టిగడ్డతో వృక్షము యొక్క కాండమును కొట్టినప్పుడు ఆ మట్టి నేలరాలుతుందేకాని, కాండములోనికి ప్రవేశించదు కదా! పశుతుల్యులగు అజ్ఞానులు కూడా పదార్థములను సూక్ష్మదృష్టితో గాంచలేరు. అందుచేతనే వారు తత్త్వనిర్ణయం చేయలేకపోతున్నారు. వారు – ఈ శరీరాదులు వాస్తవమై ఉన్నట్లు, వీటితో ఏర్పడుచున్న సంబంధాలు, బంధాలు నిజమే అయినట్లు భావిస్తున్నారు. భావనను అనుసరించే వారికి ఆయా అనుభవములు సత్యమై ప్రాప్తిస్తున్నాయి.

వాస్తవానికి ఈ ఆధిభౌతికశరీరము 'మిథ్య' మాత్రమే సుమా! ఆతివాహిక దృష్టి (లేక సూక్ష్మదేహదృష్టి) కలవారు ఈ భౌతిక శరీరములను గాంచకయే ఉన్నారు. అనగా, ఈ కనబడే శరీరాదులన్నీ వారి దృష్టిలో స్వప్నములోని పదార్థములవలె భ్రమాత్మకములు మాత్రమే. ఈ ఆధిభౌతిక దేహములు ఏమగుచున్నవో, ఎటువైపు పోవుచున్నవో ఎవరమూ చెప్పలేం. స్వప్నంలో గాంచబడిన శరీరములు, పదార్థములు మెళుకువ వచ్చినప్పుడు ఏమౌతున్నాయి? ఎక్కడికి పోతున్నాయి? భ్రమ, భ్రమగానే తేలిపోతోంది కదా! వర్తమానంలో కనిపించే ఈ దృశ్యవ్యవహారం కూడా అంతే.

శ్రీరాముడు : ఓ సర్వజ్ఞా! వసిష్ఠమహర్షీ! స్వప్నంలో చూచిన పర్వతములు, జనులు ... మొదలైనవి నిద్రమేల్కాంచినప్పుడు ఎక్కడికి పోతున్నాయి? ఏమౌతున్నాయి? ఈ సందేహం కూడా తొలగించండి.

❖❖❖

51. స్వప్నంలోని వస్తుజాలం ఏమౌతున్నాయి?

శ్రీ వసిష్ఠమహర్షి : గాలిలో కదలిక ఉన్నది. అట్లు కదలుచున్న గాలి కదలని గాలిలో ప్రవేశిస్తోంది. కదలని గాలి కదలుచున్నది. లేక కదలుచున్న గాలి కదలిక త్యజిస్తోంది. కాని, గాలి సర్వదా గాలియే కదా! కలలో గాంచబడుచున్న కొండలు మొదలైనవి నిదురలేవగానే స్వప్న-చైతన్యము నందు విలీనమగుచున్నాయి. స్వప్న పదార్థముల వాస్తవ స్వరూపమేమిటి? శూన్యమే కదా! అవి 'చైతన్యము'ను కప్పిపుచ్చునవై ఉంటున్నాయి. ఇంతలోనే చైతన్యములో విలీనమైపోతున్నాయి. ఆత్మ యొక్క చైతన్యమే స్వప్నమున కనబడే ఆయా పదార్థముల రూపమున స్ఫురిస్తోంది. అంతయు ద్రష్ట యొక్క 'స్ఫురణ', 'కల్పన', 'భ్రమ' కాకుండా మరింకేమీ కాదు. ఆ స్ఫురణ లేక కల్పన లేక భ్రమ తొలగినప్పుడు సర్వము అద్వయమగు ఆత్మతత్త్వముగానే శేషించుచున్నది. జాగ్రత్తు కూడా అట్టిదే సుమా!

ఒకడు ఒకానొక 'ఊహ' యందు ఒక దృశ్యమును సంకల్పించుకొని అంతరంగము నందు దర్శిస్తున్నాడనుకో .... అతడు ఆ ఊహను త్యజించినప్పుడు, అంతరంగ దృశ్యములోని వస్తుజాలం, జనులు మొదలైనవి ఏమౌతున్నాయి? శూన్యము నుంచి జనించినవి శూన్యమే అయిపోతున్నాయి కదా! స్వప్నములోని పదార్థజాలం విషయం కూడా అంతే! ఈ జాగ్రత్తు కూడా అందుకు వేరైనదికాదు. ఈ జాగ్రత్‌లో ప్రాప్తిస్తున్న "నేను - నాది - నీవు - ప్రియములు - అప్రియములు - కాలము - స్థానము - శరీరములు - సంబంధములు - మిత్రులు - శత్రువులు" ..... ఇవన్నీ కూడా జ్ఞాన ప్రాప్తి పొందిన తరువాత స్వప్నతుల్యముగా తెలియబడుచున్నాయి. అంతయు అద్వయమగు ఆత్మగానే ఎరుగబడుచున్నాయి.

నీటికి - ద్రవత్వమునకు భేదమేమిటో చెప్పు? గాలి - స్పందత్వములు వేరువేరు కాదుకదా! వీటికి భేదము తెలియబడనట్లే ఆత్మచైతన్యము - స్వప్న పదార్థములకు భేదము తెలియబడదు. "ఆత్మ చైతన్యము వేరు - స్వప్న పదార్థములు వేరు - ఈ జగత్తు వేరు. ఇవన్నీ ఆత్మకు ఎక్కడి నుండో దాపురించాయి" అనునట్టి భేదజ్ఞానమే మహాదట్టమైన అజ్ఞానం. అట్టి భేదదృష్టియే మిథ్యాజ్ఞానాత్మకమైనట్టి "సంసారము", అని "సంసృతి" అని, "అలీకము" అని శాస్త్రములచే ఆయా శబ్దములచే చెప్పబడుతోంది. "స్వప్నములో తోచు పదార్థములు స్వప్నద్రష్ట (లేక చైతన్యము) కంటే వేరు" ... అని చెప్పటానికి మనకేమైనా - నిమిత్త కారణములు (purpose & cause) లభిస్తున్నాయా? లేదు. అందుచేత "స్వప్న పదార్థములు నిరర్థకములే. అర్థరహితములే" .... అని అనక తప్పదు.

ఇప్పుడు స్వప్న పదార్థములను, జాగ్రత్ పదార్థములను పోల్చి చూద్దాం. "ఈ రెండు ఒకే తరగతికి చెందినవి" అని చెప్పటానికి మాకు కించిత్ సందేహం కూడా లేదు. స్వప్నంలో కనబడే గ్రామ - నగరాలు ఏ విధంగా అసత్యమో 'సృష్ట్యాది' యందు ప్రతిభాసితమగుచున్న ఈ జాగృత్-జగత్తు కూడా అసత్యమే. మేము తపోధ్యానాదులచే మా దృష్టిని శుద్ధిపరచుకొనియున్నాము. అందుచేత సత్యద్రష్టలమగు మాయొక్క అనుభవ పూర్వకమైన వాక్యముల పట్ల మీరంతా కొంత

విశ్వాసము ఉంచక తప్పదు. ఎందుకంటే, దృశ్య – సంబంధమైన "అజ్ఞానదృష్టి" పేరుకొని ఉన్నంతసేపు, ఈ దృశ్యములోని స్వప్నత్వము దర్శించగల ప్రజ్ఞ ప్రాప్తించటం లేదు.

❖

స్వప్న పదార్థములు సత్యములని ఎవరైనా అనగలరా? అవి అసత్యములే కదా! ఓ రాఘవా! ఒక్క "ఆత్మచైతన్యము" మాత్రమే ఇటు జాగ్రత్ నందు, అటు స్వప్నము నందు, అట్లే సుషుప్తియందు ... అన్ని దశలందు కూడా .... సత్యమై, నిత్యమై, సాక్షియై వెలయుచున్నది. ఇది మాయొక్క అనుభవసారం. వేదాంగములైన ఉపనిషత్తులు, తదితర ఆత్మ ప్రతిపాదక శాస్త్రములు అనేక దృష్టాంతముల సహాయంచేత ఈ విషయం నిరూపిస్తున్నాయి. మనం కూడా ఈ గ్రంథంలో అదే విషయం నిర్ద్వంద్వంగా నిరూపిస్తున్నాం. స్వప్నంలో గాంచబడిన పర్వతం మేల్కొనగానే ఏమౌతోంది? ఆ ఆధిభౌతిక శరీరభావన, ... ఆ దృశ్యప్రాప్తి, ఆధిభౌతిక తాదాత్మ్యము, ఆ దృశ్యతాదాత్మ్యము శూన్య మాత్రములే అగుచున్నాయి. ఆతివాహిక భావము, ... పొందిన ఉత్తమ పురుషుల విషయంలో, "ఇతడు శరీరము పొందుచున్నాడు జన్మిస్తున్నాడు. మరణిస్తున్నాడు, జీవిస్తున్నాడు" అని లోకులు గాంచటం వారివారి అజ్ఞానము వలన మాత్రమే సుమా! యోగపురుషులకు తమపట్లగల అవగాహన అందుకు వేరుగా ఉంటోంది. వారు, "మేము ఈ ఉపాధులను నియమించువారము. సర్వము నిర్ణయము చేస్తున్న సత్త స్వరూపులము" ..... అని భావన చేస్తున్నారు.

స్వప్నద్రష్ట చూస్తున్న స్వప్న పదార్థమువలెనే ఈ 'సృష్టి' అనబడునది కూడా శూన్య స్వరూపము, మిథ్య, మోహకల్పితము, భ్రాంతి మాత్రమే!

ఓ జనులారా! మీరు మీ స్వస్వరూపమగు 'ఆత్మ' ను ఏమరచి భ్రమాత్మకమైన వస్తువులందు, భ్రమయుతమైన వ్యవహారములందు సత్యత్వమును నిష్కారణంగా ఆపాదిస్తున్నారు. అట్లు ఆపాదించటం చేతనే అనేక దుఃఖపరంపరలను అనుభవించు చున్నారు. ఈ భ్రమ – అను నిద్రను వదలండి. మహావాక్యములను శ్రద్ధగా వినండి. ఆత్మ స్వరూపమందు నిదురలేవండి. మరుక్షణం సర్వవికారాలు తొలగిపోతాయి.

ఓ రామా! 'అనాది' అయినట్టి భ్రమప్రవాహమున పడిన ఈ జీవుడు 'మరణమూర్ఛ'కు ముందు "ఆతివాహికశరీరము"ను పొందుచున్నాడు. అయితే, భ్రాంతి వలన భవిష్యత్ సృష్టికి అనుకూలమైనట్టి "సృష్టి-ప్రతిభాస"ను అనుభవిస్తున్నాడు. అవియే అతని యందు మనకు కనబడుచున్న ఈ దేహములు. ఇవన్నీ అతని మనస్సునందే వెలయుచున్నాయి. అంతేగాని, బయట ఎక్కడో, ఏదీ లేదు. కాని చమత్కారం చూచావా? అతడు భ్రాంతి ప్రభావం చేత "సృష్టి ప్రతిభాస" అంతా బాహ్యము నందే ఉన్నదని తలచుచున్నాడు.

❖❖❖

52. భౌతికదేహము - యోగిదృష్టి

ఆ మందిరంలో ఇప్పుడు జ్ఞప్తి దేవతయగు సరస్వతీదేవి, ప్రబుద్ధలీల ప్రవేశించియున్నారు కదా! ఇంతలో పద్మని జీవచైతన్యము కూడా (అనగా యుద్ధభూమిలో విదూరథ – ఉపాధి త్యజించిన జీవచైతన్యము) ఆ గృహంలో ప్రవేశించింది. పద్మని భౌతిక దేహం పొందటానికి ప్రయత్నించ నారంభించింది. ఈలోపు జ్ఞప్తిదేవతయగు సరస్వతీదేవి విదూరథుని జీవచైతన్యము ఆ దేహములో ప్రవేశించనీయకుండా నిరోధించింది. ఒకడు తన సంకల్పబలంచేత చిత్తవృత్తిని నిరోధిస్తాడు చూచావా? ఇది కూడా అట్టిదే.

❖

ప్రబుద్ధలీల : హే లోకపావనీ! జగజ్జననీ! జ్ఞప్తిదేవీ! ఈ మందిరంలో నేను ఎంతకాలంగా సమాధిలో ఉండటం జరిగింది? నా శరీరము కనబడటం లేదేమి? అది ఇక్కడ, నేను త్యజించిన తరువాత ఎంతకాలమున్నది. ఎప్పుడు, ఎట్లు తొలగినది? ఈ పద్మరాజు ఇట్లా ఎంతకాలంగా శవమై పడియున్నాడు?

శ్రీ సరస్వతీదేవి : పుత్రీ! నీవు నీ శరీరమును ఇచటనే త్యజించి విదూరథుడు ఉండియున్న బ్రహ్మాండములోనికి వెళ్ళియున్నావు కదా! అది జరిగి ఇక్కడికాలమానం ప్రకారం ఒక నెల గడిచినది.

నీ శవమును రక్షించుచు ఇద్దరు దాసీలు రాత్రింబవళ్ళు ఇక్కడే ఉండేవారు. ఇక శవము ఏమైనదంటావా? పదిహేను రోజుల తరువాత నీ భౌతిక దేహము శుష్కించసాగింది. బాష్పభావము పొందసాగింది. జీవరహితమై ఎండిపోయిన ఆకులాగా నేలపై పడియున్నది. మరొక రోజుకు 'కొయ్య'వలె బిగదీసుకుపోయింది. మంచువలె చల్లనైపోయింది. ఆ తరువాత మీ మంత్రులు ఇక్కడికి వచ్చి నీ భౌతికకాయమును పరిశీలించారు. "ఈమె మరణించినది" అని స్థిరపరచుకొన్నారు. ఇంకేమున్నది? నీ శరీరమును బైటకు కొనిపోయారు. దానిని చితిపై ఉంచి గంధపు చెక్కలతోను, నేతితోను కాల్చి భస్మం చేశారు. ఇక నీ పరిజనులు "అయ్యో! ఎంతకష్టం? మా రాణి మరణించినది కదా!" అని ఎంతగానో ఆందోళన చెందుతూ రోదించారు. నీ కొరకు పారలౌకిక "శ్రాద్ధము" మొదలైన కర్మలు నిర్వర్తించబడ్డాయి. ఇప్పుడు వాళ్ళు నిన్ను చూడటం జరిగితే "పరలోకం నుండి మరల దిగి వచ్చింది కాబోలు" అని భావించి ఆశ్చర్యపడతారు కూడా! ఇప్పుడు నీవు ఆతివాహిక దేహముతో ఉన్నావు కదా! అందుచేతనే నీవు వారికి కనిపించటం లేదు. సత్యసంకల్ప ప్రభావంతో ఇతఃపూర్వపు దేహంతో కనబడితే శారీరక దృష్టి మాత్రమే కలిగినట్టివారు ఆశ్చర్యపడక ఏం చేస్తారు?

బాలా! నీకు నీ పూర్వ శరీరము నందు ఉన్న 'అనురాగము'ను అనుసరించే ఇప్పటి నీ దృష్టియందు అవే రూపలావణ్యములు కలిగియున్నావు. అందరు తమతమ వాసనలను అనుసరించే అందుకు అనుకూలములైన వస్తువులను గాంచుచున్నారు. "బాలుడు చీకట్లో కల్పిత బేతాళుని దర్శించటం" అనునదే ఇందుకు మనకు సుస్పష్టమైన దృష్టాంతము. నీ వర్తమాన విషయానికి వస్తే, నీవు పూర్తిగా "ఆతివాహిక దేహభావము"ను పొందావు. అందుచేత, "ఇతఃపూర్వపు వాసనలతో

కూడిన దేహమును విస్మరించి వేశావు. "ఆతివాహిక దృష్టి" దృఢమైనప్పుడు "ఆధి–భౌతిక దేహభావన" ఉపశమించగలదని చెప్పానుకదా.

ఒకవేళ, ఈ భౌతిక శరీరములు, బాహ్యజగత్తులు అజ్ఞానులకు అగుపడుచున్నప్పటికీ, 'జ్ఞానులు' మాత్రం ఇదంతా క్షణం ఉండి పోయేదానిగా మాత్రమే దర్శించుచున్నారు. ఒకనిలో "ఆతివాహిక భావము" దృఢమైనప్పుడు, అట్టివానికి ఈ సర్వశరీరములు నీరులేని మేఘంలాగా, వాసనలేని పుష్పంలాగా నామమాత్రమే అవుతాయి. అనగా అతని దృష్టిలో వీటిలో శాశ్వతము, ప్రత్యేకము, స్పష్టము, ఆశ్చర్యము అయినదేదీ ఉండకుండానే పోతోంది. అట్టివారిలో కొందరు తమ ఆధిభౌతిక దేహమును విస్మరిస్తారు. మరి కొందరు దానిని జ్ఞప్తి పథంలో కలిగి ఉన్నప్పటికీ, దానిని ఒక బాహ్యమైన వస్తువు వలెనే దర్శిస్తున్నారు. గృహము, వస్త్రము, పొలమువలెనే ఈ దేహము కూడా వారికి తోచుచున్నది. తదితరుల దేహములు కూడా వారికి అట్లే స్వప్న వస్తు జాలంలాగా కనిపిస్తున్నాయి. "నేను ఈ శరీరమునకు సంబంధించినవాడను కాను. ఈ శరీరము నాకు సంబంధించినది కాదు" అను రూపముగల ఒకానొక ఉత్తమ ప్రజ్ఞ వారు కలిగి ఉంటున్నారు. ఓ ప్రియ లీలా! దృఢమైన సద్వాసనలు కలవారికి, "నేను బాలుడను. నేను యువకుడను" అను భావమే ఉండదు సుమా! ఎవరి దృష్టిలో ఈ దేహము స్వప్నతుల్యమో, అట్టివారు "ఈ దేహము లేనట్టి వారే" అని చెప్పబడుచున్నారు. ఇక ఇతరులకు వారిపట్ల గల దృష్టి విషయమేమిటంటావా? అది ఆ ఇతరుల జ్ఞానాజ్ఞానముల బట్టి ఉంటోంది కాని, అది ఆ యోగికి సంబంధించినది కాదని గ్రహించు.

ఈ విధంగా నీవు నీ శరీరము ఇక్కడ వదలి ముప్పది రోజులు అవుతోంది. మనము ఈ ఉదయమే ఈ ఆకాశంలో ప్రవేశించాం. నేను నీ ఇరువురి పరిచారికలను నిద్రమోహితులను చేశాను కూడా. ఓ లీలాదేవీ! ఇక, రమ్ము. మనం మన సంకల్ప ప్రభావం చేత ఈ ద్వితీయలీలకు 'దర్శనం' ఇద్దాం. అప్పుడు నీవు యథోచితంగా ప్రవర్తించెదవు గాక!

❖❖❖

53. పద్ముని పునరుజ్జీవనం

అప్పుడు జ్ఞప్తిదేవి, "ఈ ద్వితీయలీల మా ఇద్దరిని గాంచుగాక" అని సంకల్పించినది. అప్పుడు ఆ ద్వితీయలీలకు వారిద్దరు ప్రకాశపూర్వకంగా కనిపించసాగారు. వారి తేజము ఆ గృహమున ప్రవేశించగానే, ఆమె ఉలిక్కిపడి, తలెత్తి ఆ ఇంటి నాలుగువైపులా కలియచూచింది. ప్రబుద్ధలీల – సరస్వతులను చూచి ఎంతో సంతోషమును, ఉత్తేజమును పొందింది. వారి పాదములపై వ్రాలింది.

ద్వితీయలీల : ఓ దేవతలారా! నా సాష్టాంగ నమస్కారం స్వీకరించండి. మీ రాక నాకు ఎంతో సంతోషమును కలుగజేస్తోంది. మీరు నాకు ప్రాణదాతలు. వరప్రదాతలు కూడా. మీ పరిచారికనైయున్న నేను మీకంటే ఒకింత ముందుగా ఇక్కడికి వచ్చియున్నాను. మీకు సుస్వాగతం. ఇదిగో, ఈ సింహాసనములను అధిరోహించి సుఖాసీనులు కండి.

శ్రీ జ్ఞప్తిదేవి : పుత్రీ! నీవు ఇచటికి మాకన్నా ముందే ఎట్లా వచ్చావు? దారిలో ఎచట ఏమి చూచావు? ఆ వృత్తాంతమంతా మాకు చెప్పు.

ద్వితీయలీల : నేను మీరు చూచియున్నచోట 'కాలాగ్ని'వలె దహించబడ్డాను. ఒకానొక మూర్ఛను పొందియున్న నేను అప్పుడు "ఇది - అది" అను జ్ఞానమే లేక ఉంటిని. కళ్ళు మూసుకొనియున్న నేను మరణమూర్ఛ గతించిన తరువాత తేరుకొని చూడగా, ఎక్కడో ఆకాశంలో ఎగురుతున్నట్లు స్థితిపొందియున్నాను. అట్లు కొంతసేపు ఎగురుట జరిగిన తరువాత, ప్రాణములు అనే రథమును అధిరోహించాను. సువాసన కణము (the particles of sweet smell) వలె పయనించి ఇచ్చటికి వచ్చాను. ఇక్కడ ఈ అంతఃపురం అనేక దీపకాంతులతో ప్రకాశిస్తోంది. కొందరు దాస-దాసీ జనం అక్కడక్కడ గాఢనిద్రాపరవశులై నిద్రిస్తున్నారు. ఇక్కడి వాతావరణమంతా మౌనంగా, ప్రశాంతముగా ఉన్నది. ఉత్తమమైన పాన్పులు కూడా నాకు కనిపించాయి. ఈ గృహంలో ఉత్సుకతచే సంచరిస్తూ ఉండగా, ఇక్కడ ఈ మూల నాభర్త విదూరథుడు శయనించి ఉండి కన్పించాడు. అతడు పూలచే కప్పబడియున్నాడు. ఇతడు ఇంతక్రితమే మహాశ్రమయుతమైన యుద్ధం చేసియున్నాడు కదా! పాపం, ఎంతో దస్సి ఉంటాడు. అందుకే, నిదుర లేవలేదు. ఇతడు తన అలసట మరువటానికి వింజామరం వీస్తూ ఉన్నాను. ఇంతలో మహాతేజస్వరూపులగు మీరిద్దరు ప్రత్యక్షమయ్యారు. మీ కరుణ అపారమైనది కదా! నన్ను కరుణించ వేడుకొనుచున్నాను.

❖

జ్ఞప్తిదేవి : ఓ ఉభయ లీలలారా! ఇప్పుడు "శవశయ్య"పై పరుండియున్న ఈ రాజును నేను నిదుర లేపుచున్నాను.

❖

ఇట్లు పల్కి రుద్రాక్షమాలచే అలంకితురాలగు ఆ జగజ్జనని సరస్వతీదేవి, సంకల్ప బలంచేత శరీరంలో ప్రవేశించకుండా బైటయే నిరోధించియున్న విదూరథుని ప్రాణములను సంకల్పమాత్రముగా విడచివైచింది. అప్పుడు ఆ జీవుడు ప్రాణ వాయు స్వరూపంతో ముక్కురంధ్రముల ద్వారా శరీరంలో ప్రవేశించాడు. సముద్రగర్భంలో మణులు ఉంటాయి చూచావా? అట్లాగే, ఆ జీవునియందు 'వాసనలు ఉన్నాయి. జీవుడు ఆ శరీరంలో ప్రవేశించగానే అతని ముఖం కాంతివంతమైంది. క్రమంగా అవయవములు చైతన్యవంతం కాసాగాయి. జీవరసము శరీరమంతా ప్రసరించింది. నెమ్మదిగా కనులు విప్పాడు. అప్పుడు ఇరువురు - లీలలు అతని ముందు వినమ్రతతో, ప్రేమభావముతో "స్వామీ! మీకు శుభమగుగాక! మమ్ములను ఆజ్ఞాపించవేడుకొంటున్నాం" అని ఒక్కసారిగా పలికారు.

లేచికూర్చున్న పద్ముడు ఇరువురు లీలను చూచాడు. ఎంత ఆశ్చర్యం! అతనికి ఇద్దరు లీలలు... ఆచార-వ్యవహార-రూప-మర్యాద-వాక్య-ప్రయత్న-వినమ్రతలో-సమానులైయుండటం కనిపించింది.

పద్ముడు : ఓ వనితలారా! మీరిద్దరు ఎవరు? ఇది అత్యంత చిత్రంగా ఉన్నది సుమా! మీరిద్దరు అచ్చు ఒకే తీరుగా ఉన్నారే? ఎందుచేత?

ప్రబుద్ధలీల : ఓ దేవా! ఉద్వేగరహితులై మీరు మేం చెప్పేది వినండి. నేను మీ అర్ధాంగిని. "వాక్కు – అవాక్కు యొక్క అర్థము" ఏ విధంగా అవినాభావసంబంధం కలిగియుంటాయో, నేను కూడా మీతో కలసి అట్లే ఉండేదానను. బహుదీర్ఘకాలం మనమిద్దరం భార్యా – భర్తలమై సంచరించాం. ఇక ఈ ద్వితీయలీలను చూచారా? ఈమె కూడా మీ భార్యయే. మీ కొరకే నా ప్రతిబింబము అయినట్టి ఈమెను మీరు కల్పించుకున్నారు. అదిగో అటు, మీ తలవైపు చూడండి. ఆ బంగారు సింహాసనముపై కూర్చున్న వనితవైపు చూడండి. ఆమెయే త్రిలోక జననియగు సరస్వతీదేవి. ఆమె మనయొక్క పూర్వపుణ్యవశంచేత మనపైగల అవ్యాజమైన ప్రేమచే మనకు సాక్షాత్కరించింది. ఆమెయే మనలను తన భక్తవత్సలత కారణంగా స్వమహిమచే పరలోకము నుండి ఇక్కడికి చేర్చింది. ఆమెకు భక్తి – పూర్వకంగా నమస్కరించండి!

ఆ మాటలు విన్న రాజు తటాలున కొంత తొట్రుపాటుతో లేచి నిలబడ్డాడు. మాలలు, వస్త్రములు నేలతాకుచుండగా, లోకమాతయగు జ్ఞప్తిదేవత పాదాలుపై పడ్డాడు. భక్తి పూర్వకంగా మరలమరల కళ్ళకు హత్తుకొన్నాడు.

పద్మడు : సర్వహితప్రదమగు ఓ తల్లీ! సరస్వతీమాతా! నా ఈ నమస్కారం కొంత ఆలస్యమైనందుకు క్షమించమ్మా! నీ దర్శనము ఊరకే పోతుందా? లేదుకదా! మాకు గొప్ప మేధను, దీర్ఘాయువును, ధనమును ప్రసాదించెదవు గాక!

శ్రీ సరస్వతీదేవి : ఓ ప్రియపుత్రా! శుభమస్తు – వాంఛితార్థములన్నీ పొంది ఈ గృహంలో వసించుము. నీ విషయంలో అన్ని ఆపదలు, పాప–బుద్ధులు తొలగుగాక! నీ ప్రజలు నిత్యసంతోషమును పొందెదరు గాక! నీ రాష్ట్రమునందు లక్ష్మి స్థిరమై వెలయును గాక! ఇట్లు పలికి జగదోద్ధారిణియగు సరస్వతీదేవి అంతర్ధానమైనది.

అప్పుడే తెల–తెల్లవారుతోంది. లీల పునర్జీవితుడైన తన భర్తను చూచి పులకిత శరీరురాలైనది. క్రమంగా అక్కడ అంతఃపురంలోని జనులు నిదురలేచి అటు–ఇటు సంచరించ ప్రారంభించారు.

❖

రాజభవనం ఆనందపరవశులగు జనుల సంచారంతోను, గీతములతోను, జయ–జయ ధ్వానాలతోను, మంగళప్రదమగు పుణ్యాహవచన మంత్రధ్వనులతోను ఒక్కసారి ఉత్తేజం పొందినది. రాజు పునర్జీవితుడయ్యాడనే వర్తమానం మంత్రులకు, సామంతులకు, పురజనులకు అందింది. అప్పటికప్పుడు "రాజు, రాణి పరలోకము నుండి మనకొరకు మరల తిరిగి వచ్చారు" అనే అర్థం వచ్చే పాటలు రచించబడి, గానం చేయబడ్డాయి.

లీల జరిగినదంతా వివరించగా, పద్మభూపతి శ్రద్ధగా ఆలకించాడు. అప్పటికప్పుడు నాలుగు సముద్రాల నుండి జలం తేబడ్డాయి. అతడు మంగళస్నానాలు చేశాడు. మరల అతనికి మంగళాభిషేకం చేయబడింది. ఆ రాజు, ఇరువురు లీలలు తమ పూర్వవృత్తాంతము గురించి చిత్రంగా గుర్తు చేసుకొంటూ, ప్రసంగం చేసుకొంటూ, ఉద్యానవనాలలో విహరించారు.

❖

చూచావా, రామా! ఆ పద్మడు నిజప్రయత్నబలంచేత, సరస్వతీదేవి కటాక్షంచేత పరమ శ్రేయోదాయకమగు జ్ఞానమును పొందాడు. అట్లే పునర్జన్మను, రాజ్యమును కూడా పొందాడు. ప్రబుద్ధలీల సరస్వతీదేవిచే ప్రసాదించబడిన జ్ఞాన విషయములన్నీ ఆ ఇద్దరితో కూడి విచారించేది. ఆ ముగ్గురు జీవన్ముక్తులై రాజ్యమును పాలిస్తూ చాలా సంవత్సరాలు గడిపారు. ఆ రాజు ప్రజాహితంగా, పండితులకు సంతోషం కలుగజేసేట్లుగా, దోషరహితంగా రాజధర్మాన్ని నిర్వర్తించాడు. యశస్సు, ధర్మము, సౌభాగ్యము స్వయముగానే అతనియందు ఉత్తమత్వము పొందాయి.

ఆ తరువాత కొంతకాలానికి సాధన-విచారణలు ప్రయోజనంగా పద్మడు - ద్వితీయలీల కూడా ఉత్తమజ్ఞానము పొందారు. విదేహముక్తి పొందారు.

ప్రథమలీల ఇతఃపూర్వమే ముక్తస్వరూపిణి కదా!

❖❖❖

IV. లీలోపాఖ్యానం - సమీక్ష

1. కాలము - భావన - పురుషకారము - దైవము - అఖండ బ్రహ్మము

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ జీవుని యందు "దృశ్యముతో ఏర్పరచుకొనిన బంధము" అనబడు ఒకానొక దోషము రూపుదిద్దుకొని ఉంటోంది. అట్టి దోష నివృత్తి కొరకే నీకు ఈ 'లీలోపాఖ్యానం' చెప్పాను. "ఈ దృశ్యజగత్తు సత్యము" అను రూపము గల భ్రమావేశము నీవు కలిగియుండకూడదు సుమా! ఈ దృశ్యము నీపై చూపుచున్న ప్రతాపమును నిరోధించతలచుకొంటే, అదొక్కటే ఉపాయం. ఈ ఎదురుగా ఉండి, ప్రాప్తించుచున్నట్టి దృశ్యమునందు, "ఇది వాస్తవమే" అను "సత్యత్వబుద్ధి" ఉన్నంత వరకు దీనిని నిర్మూలించటం బహుకష్టతరమగుచున్నది. ఉత్తమ భావనచే ఆ భ్రమబుద్ధి తొలగిపోయిందా .... ఇక సంసారాన్ని జయించటంలో, ముక్తిని పొంద గలగటంలో, కష్టమైనదేదీ ఉండదు.

జ్ఞానులగు వారు ఈ దృశ్య పదార్థములను చూస్తున్నప్పుడు "ఇవన్నీ ఆకాశము వలె 'శూన్యము, మిథ్య' మాత్రమే" అని స్వవిచారణా సామర్థ్యంచే ఎరుగుచున్నారు. ఈ ప్రపంచమంతా ఆకాశతుల్యుడగు పరమపురుషుని యందే వెలయుచున్నది. అతడే అన్నిటికి కారణము – కార్యముకూడా. అతడొక్కడే స్వయంప్రభువు. తన ఉనికికి తానే కారకుడాతడు. అట్టి ఆ పరమాత్మ ఈ పృథివి మొదలైన పంచభూతములకు సంబంధించినవాడు కాదు సుమా! అతడు చిన్మాత్రమే (that which knows, sees, experiences all else) శరీరముగా కలవాడు. అతడు మాయాపూర్వకముగా తనయందు ఈ వివర్తమంతా కల్పించుకొని, అందు వెలయుచున్నాడు. అంతే గాని, ఎక్కడా ఏదీ బాహ్యమునందు లేదు. అనగా, ద్రష్టగా, దృశ్యముగా భాసించుచున్నది అతడే. అతడు ద్రష్టత్వముకన్నా ముందే ఎల్లప్పుడూ ఉన్నాడు. ఆ చైతన్యరూపుడగు స్వయంభువు ఎప్పుడు ఎట్లు యత్నించునో, లేక భావించునో, లేక సంకల్పించునో, ... అప్పుడు అట్లే వివర్తము పొందుచున్నాడు. అతడు 'సృష్టి' కొరకు యత్నించి నపుడు లేక సంకల్పించినపుడు సృష్టియే జరుగుతోంది. 'స్థితి' కొరకు భావించుచుండగా స్థితియే ప్రాప్తిస్తోంది. లయము కొరకు ప్రయత్నించుచుండగా 'ప్రళయము' ప్రాప్తించుచున్నది. (He Creates, sustains and destroys of his own volition)

ఓ ప్రియ రఘురామా! ఈ జగత్తంతా "బ్రహ్మాత్మకము అగు (బ్రహ్మమే స్వరూపముగా కలిగి నట్టి) నిర్మల చిదాకాశమునందే ప్రతిభాసించుచున్నది. అయితే పరమార్థదృష్టితో పరికించి చూచి నప్పుడు మాత్రం బ్రహ్మమున "జగత్తు" అనబడు పదార్థమునకు తావే లేదు. పరిమితాశయముల దృష్ట్యా చూచినపుడు "వ్యవహారదృష్టి" అని, మహోన్నతమగు సత్యమే ఆశయముగా కలిగియున్నప్పుడు 'పరమార్థదృష్టి' అని చెప్పబడుతోంది. ఈ జగత్తు బుద్ధి వికారముచే ప్రాప్తిస్తున్నది మాత్రమే!

అందుచేత ఇదంతా బుద్ధిపరిచ్ఛిన్నుడగు జీవుని యందు మాత్రమే వెలయుచున్నదని గ్రహించు. మరి అట్టి వ్యర్థమగు భ్రాంతికి 'సత్త' ఏమి? వాసనఏమి? స్థిరత్వమెక్కడ? నియతి ఏమి ఉంటుంది? దేనికొరకు ఏది ఆవశ్యకత కలిగి ఉంటుంది? మాయవలన మాత్రమే ఇదంతా ఇట్లు స్వప్నములోవలె దీర్ఘమైన దృశ్యముగా ప్రాప్తిస్తోంది. ఘనీభూతమైనదానివలె, ఈ జీవులను తోలుబొమ్మల వలె ఆడించుచు, వ్యవహర్తవలె ప్రవర్తిస్తోంది. పరమార్థదృష్టిచే ఇదంతా శూన్యమే! 'మాయ' అను శబ్దమునకు గల అర్థమేమిటి? "ఏదైతే లేదో" ... అని కదా! అవాస్తవకతతో కూడినదై, భ్రమ మాత్రమే అయినదానినే 'మాయ' అంటున్నాం. అంతేకాని ఇక్కడ 'మాయ' అనబడు ఒకానొకదానికి కర్తృత్వం ఆపాదించటం మన ఉద్దేశం కాదు సుమా!

❖

శ్రీరాముడు : హే భగవన్! మీరు ఈ 'లీలోపాఖ్యానం'లో యథోచితమైన దృష్టాంతము లచే, జీవులకు శాంతిని ప్రసాదించకలిగినట్టి పరమార్థ దృష్టిని ప్రదర్శించారు. ఆహా! ఆశ్చర్యం! ఎంతో కాలం తరువాత ఇప్పుడు మేము తెలుసుకోవలసినది తెలుసుకొంటున్నామని మాకు అనిపిస్తోంది. స్వామీ! మీరు చెప్పిన ఉపాఖ్యానం, అందలి శాస్త్రవ్యాఖ్యానం అత్యంత అద్భుతంగా ఉన్నాయి. అది విని, స్వయముగా విచారణ చేయుచుండుటచే, తత్త్వమును గ్రహించి శాంతిని, నిర్వాణమును తప్పకుండా మేమంతా పొందగలం. మీ వాక్యామృతం ఎంత విన్నప్పటికీ తనివి తీరటం లేదు. ఇప్పుడు నాకు కలుగుతున్న కొన్ని సందేహములు ప్రస్తావిస్తున్నాను. అనుగ్రహించండి.

ఒకే కాలము యొక్క వివిధ గతులు - రీతులు

ఒకానొక జీవుడు "వసిష్ఠ-పద్మ-విదూరథుల" .... సృష్టులందు జీవించియుండటం మనం చెప్పుకున్న కథనంలో జరిగినది కదా! అట్లు మూడు తీరులుగా గడచినట్టి కాలము యొక్క స్వరూపము ఎట్టిది? ఆ కాలము కూడా మన ఈ కాలంలాగానే రాత్రింబవళ్ళు కలిగియున్నదేనా? అది మాసములు - సంవత్సరములు - క్షణములుదీర్ఘకాలం మొదలైనవి కలిగియున్నదా? ఒకేసారి వేరువేరు ప్రమాణములతో వేరువేరు రీతులుగా కాలగమనం ఉంటుందా? ఆ జీవుని వేరువేరు జన్మస్థానము లందు కాలగమన ప్రక్రియ వేరువేరు సాపేక్షలు ఎట్లు కలిగియున్నది? ఒకచోట ఎనిమిది రోజులు జరుగగా మరొకచోట డెబ్బది సంవత్సరములు గడచినాయే? నా సందేహం ఇది. ఈ విషయమై మీరు చూచాయగా కొన్ని విషయాలు చెప్పియున్నారు. కాని నాయందు ఇంకా సందేహనివృత్తి కాలేదని నాకు అనిపిస్తోంది. అజ్ఞానులమగు మేము ఒక్కసారి విన్నంత మాత్రంచేత గ్రహించవలసినదంతా గ్రహించగలమా? ఎండిన మట్టి ఒకటి రెండు జలబిందువులు పొందినంత మాత్రంచేత తడుస్తుందా? లేదు. హే సద్గురూ! నా బుద్ధి తగినంతగా వికసించియుండక పోవచ్చును. నన్ను క్షమించండి. ఈ 'కాలము' విషయమై మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : 1) సంకల్పము 2) జ్ఞానము 3) అనుభవము .... ఈ మూడింటికి ఒకానొక చమత్కారమైన అవినాభావసంబంధం ఉన్నది. ఎవడు ఎక్కడ ఎట్టి జ్ఞానమును పొందుతాడో,

అతడు దానిపట్ల అట్టి అనుభవమునే పొందుచున్నాడు. జ్ఞానము– సంకల్పములు ఒకటికి మరొకటి తోడు, ఆధారము, మూలము అగుచున్నాయి.

ఈ విషయం కొన్ని దృష్టాంతములను తీసుకొని మరికొంత స్పష్టంగా చెపుతాను. విను. "ఇతడు నాకు ప్రియమైనవాడు" అని నిరంతరం భావించుటచే ఒకడు అట్లే ప్రియమైనవాడు అగుచున్నాడు. "ఇతడు నాకు మిత్రుడు" అని భావించుటచే శత్రువు కూడా మిత్రుడైపోతాడు. ఒకానొకడు విషమును "ఇది నాకు అమృతముతో సమానం" అని భావించుటచే కొంత కాలమునకు అది అతనికి అమృతప్రాయమే అగుచున్నది. పదార్థములు, వ్యక్తులు, సంఘటనలు .... ఇవన్నీ ఏ భావంతో భావించబడితే, అట్టి భావనా ప్రభావంచేత ఆయా పదార్థములు, వ్యక్తులు, సంఘటనలు అట్లే ప్రతిభాసిస్తున్నాయి. కార్యకారకములు కూడా అగుచున్నాయి.

"ఒక నిమిషము"ను అనేక కల్పములుగా భావించి, అట్టి బుద్ధిని బడయకలిగితే, అట్టివానికి ఆ ఒక్క నిమిషమే కల్పములుగా తోచగలదు. అదేవిధంగా కల్పముల యందు "ఇది ఒక్క నిమిషముతో సమానం" అనునట్టి బుద్ధి ఉంచినప్పుడు అవన్నీ మరుక్షణం నిమిషమాత్రములే అగుచున్నాయి. చిత్తముయొక్క స్వరూపమే అట్టిది. మనం దృష్టాంతంగా లౌకిక–జీవిత విశేషములే తీసుకొందాం. దుఃఖములతో, భయముతో బాధితుడగుచున్నవానికి 'ఒక రాత్రి' అత్యంత భారంగా, అనేక సంవత్సరము లంత పొడవైనదిగా తోచుచున్నది. సుఖసంపదలు పొందియున్నవానికో .... అదే రాత్రి – బంధు సమాగమంతో, ఆనంద–ఆహ్లాదములతో – ఒక క్షణమువలె గడచిపోతోంది. అది అట్లా ఉండగా, ఒకడు స్వప్నానుభవం పొందుచున్నప్పుడు, అతనికి స్వల్పకాలం అతిదీర్ఘంగా, దీర్ఘకాలం అతిస్వల్పంగా అనుభవమగుచున్నది. స్వప్నంలో, "అయ్యో! మరణించాను. మరల పుట్టాను బాల్య–యౌవనాలు గడచిపోయి, ముసలివాడినయ్యాను. వందలాది యోజనముల విస్తీర్ణం ప్రయాణం చేశాను. ఎక్కడో, ఎప్పుడో ఉండియున్న వారితో కలసి సంభాషించాను" –అనునట్టి భావనోద్వేగం కలుగుతోంది కదా! ఇట్లు దీర్ఘకాలం స్వల్పంగా ఉండటం, కొద్దికాలం దీర్ఘంగా అనుభవమవటం ప్రతివారికి ఏదో ఒక సందర్భంలో ఏదో ఒకరూపంగా అనుభవం అవుతూనే ఉన్నది సుమా! 'హరిశ్చంద్రుడు' అనే రాజు ఒక్కరాత్రి యందు 12 సంవత్సరముల కాలక్రమము యొక్క అనుభవం పొందినట్లు వినియున్నావు కదా! 'లవణుడు' అనే మరొక రాజు ఒక్కరాత్రి యందు డెబ్బది సంవత్సరముల ఆయువును అనుభవించియున్నాడు.* అంతేకాదు. "మహర్షి మనువు' యొక్క ఒక్క జీవితకాలం .... ప్రజాపతి బ్రహ్మదేవునికి ఒక ముహూర్తకాలం అగుచున్నది. బ్రహ్మయొక్క ఒక జీవితకాలం విష్ణువునకు ఒక రోజు అగుచున్నది. విష్ణువుయొక్క జీవిత కాలం శివునకు ఒక్కరోజు. నిర్వికల్ప సమాధియందు దివారాత్ర భేదమే ఉండదు. ఎందుచేత నంటావా? నిర్వికల్ప సమాధిని ఆశ్రయించినవానికి ఇక 'కాలము' అనునది మొదలంటా అసత్యముగును, ఆత్మపదార్థమొక్కటే సత్యముగాను అనుభవమగుచున్నది.

---

* లవణుని కథ ఈ ప్రకరణంలో "ఇంద్రజాలోపాఖ్యానం" లో చెప్పబడింది.

ఒకప్పుడు ఈ ధన-దార-పుత్ర-రాజ్యాది భోగఫలములు అత్యంత మధురంగా, గొప్పవైన వాటివలె ఉంటున్నాయి కదా! ఇవన్నీ వైరాగ్యభావముతో దర్శించినప్పుడో? వాటి యొక్క చింతనయే అప్రియం అవుతోంది. ఎంతమంది చక్రవర్తులు త్రుటిలో సర్వ భోగములు త్యజించి వానప్రస్థం స్వీకరించలేదు చెప్పు? మధుర భావముతో చింతించుట చేతనే కదా. "ఉపవాసములు, తీర్థయాత్రలు, సుదీర్ఘమైన పాదయాత్రలు" .... మొదలైనవి ఆహ్లాదకరంగా తోచుచున్నాయి. మధురభావము యొక్క ప్రభావము చేతనే అతి కష్టతరమైనట్టి "మనోనిరోధము" కూడా ఆత్మ సుఖమును ప్రసాదిస్తూ, మధురముగా ప్రాప్తించుచున్నది. మహాపురుషులగు కొందరు తమపట్ల శత్రుత్వము వహించువారు తారసపడినప్పుడు కూడా, "వీరు నాకు మిత్రులతో సమానమే. తమ తమ ఈ పరుష వాక్యములచే నాకు మేలే చేస్తున్నారు" అని సౌమ్యభావంతో చింతించుచూ ఉంటారు. అట్టి చింతనా ప్రభావంచేత లోకరీతిగా అప్రియులు కావలసినవారు కూడా ఆప్త పురుషులగు మిత్రులుగానే పరిణమించుచున్నారు. అట్లే విషయభోగాదులు పొందుటకు గాను, కొందరు బంధువులు సాయపడువారు కావచ్చు. కాని, "వీరు నా ఉత్తమ పురుషార్థమునకు విఘాతమునే కలుగజేస్తున్నారే!" అని భావించినప్పుడు ఆ బంధువులు అతనికి అప్రియులే అగుచున్నారు కదా!

ఓ మహాభాగా! రామచంద్రా! "అసలు ఈ జగత్తు అంతా ఏమిటి? ఏమైయున్నది" అని పరిశీలించినప్పుడు "ఇదంతా కేవలం భావనామయం మాత్రమే" అని మనకు తెలియవచ్చుచున్నది.

"శాస్త్రాలు పఠించటం, జపములు, తపములు" మొదలైనవి .... ఉత్తమమైన "భావన, అభ్యాసం" .... ఈ రెండూ లేకపోవటం చేత ... కొందరికి ఎంతో దుస్సాధ్యమైన వాటివలె అనిపిస్తున్నాయి. మరికొందరికి "చక్కగా గ్రహించి ఉండటం .... 'ఇవి శుభప్రదములు' అని భావన కలిగియుండటం .... అభ్యాసం" .... వీటి వలన జపతపాది వ్యవహారములు ఎంతో తేలికైనవిగా, ఆహ్లాదకరమైనవిగా, సుఖకరమైనవిగా అనుభవ మగుచున్నాయి. పరిశీలనాత్మకమైన బుద్ధి లేనట్టివాడు, నౌకలో పయనించుచున్నప్పుడు, ఒకవైపుకు చూచి "ఆహా! ఈ వృక్షములు గుండ్రముగా కదులుచున్నాయి" అని అనుకొంటున్నాడు. అట్లా కాకుండా, "ఈ విధంగా చెట్లు కదులుచున్నట్లు కనబడుచున్నప్పటికీ, అట్లు జరుగుట అసాధ్యం. వాస్తవానికి ఈ నౌకయే కదులు చున్నదిగాని, చెట్లు కాదు" అను భావనను దృఢం చేసుకొన్నవాడో, భ్రమకు లోనుకాడు.

ఓ రామా! బాగుగా పరిశీలించకపోవటం, విచారణ చేయకపోవటం చేతనే .... శూన్యము కూడా అనేక వస్తుజాలముతో కూడుకొని పూర్ణమువలె అనుభవం అవుతోంది. స్వప్నంలో గోడలు, భవనములు, తదితర వస్తుజాలం, బంధుజనులు కనబడటం జరుగుతోంది. వారు వాస్తవమా? కాదు. కాని అనుభవం మాత్రం ఉంటోంది. అంతరంగమందు 'భావన' గావించబడటం చేతనే ఆ స్వప్నవస్తువులన్నీ కనబడటం జరుగుతోంది. అవన్నీ 'జాగ్రత్తు'కు లభించకపోయినా, స్వప్న సమయంలో స్వప్నద్రష్టకు వాస్తవమనే అనిపిస్తున్నాయి. "గ్రహించటంలో గల దోషం" చేత పసుపు-పచ్చుటి పదార్థములు కూడా నీలంగానో, తెలుపుగానో కనిపిస్తూ ఉంటాయి. రంగుటద్దం

(coloured glass) లోంచి సూర్యకాంతి పడుచున్నవైపు చూస్తుంటే ఎదురుగా ఆ రంగే సర్వత్రా ఉన్నట్లు తెలియవస్తూ ఉంటుంది.

బాలుడు తన "పుట్టినరోజు పండుగ" వంటి ఆనందించవలసిన సమయంలో కూడా "ఈ ఆటవస్తువు చెడిపోయిందే" అని క్షణంలో ఖిన్నుడై దుఃఖం పొందుచున్నాడు. పేదవాడు "అయ్యో! నాకు కనుక ధన–ధాన్య సమృద్ధి ఉంటే ఎంత బాగు!" అని అనుకొంటున్నాడు కదా! మరి, ధన–ధాన్య సమృద్ధి కలిగినవాడు సుఖించవలసినది పోయి, "నేను ఆ స్త్రీ యొక్క ప్రేమను పొందలేకపోతిని కదా!" అని తలచుచు, ప్రపంచములోని 'నిస్తేజము' నంతా ప్రోగుచేసుకొని కొంపకు తెచ్చుకొంటున్నాడే? వివేకహీనుడు, – తన ఎదురుగా ఉన్నది గోడే అయినప్పటికీ ... ఆ గోడపై నేర్పుతో రచించబడిన రంగులచిత్రం చూచి, "ఇది సరస్సు. అది ఖాళీ స్థలం. ఇవి చెట్లు. ఇవి పుట్టలు. అక్కడ హంసలు నీటిలో ఈత కొడుతున్నాయి" అని భ్రమను పొందుతాడు. వస్తుతః మిథ్యయే అయివున్న చీకటిలోని 'దయ్యం' అనబడునది, పిరికివాని దృష్టికి ఆయా కదలికలతో సహా కనిపించి, అతనికి చెమటలు పట్టేటట్లు చేస్తోంది. చివరికి ఒక్కొక్కసారి ఆ పిరికివాడిని చంపేస్తోంది కూడా! "ఇది వాస్తవమే" అను రూపముగల జ్ఞానము వలననే ఒకడు స్వప్నంలో చూచిన సుందర స్త్రీతో ఆలింగన భావం పొంది, తత్కారణంగా ఆయా వికారములు ఈ జాగ్రత్–భౌతిక దేహమునందు పొందుచున్నాడు.

ఓ రాఘవా! నిన్నొక ప్రశ్న వేస్తున్నాను. సమాధానం చెప్పు. ఎదురుగా ఘనీభూతమై నిలచి ప్రాప్తిస్తున్న ఈ "జగత్తు" ఏమయి ఉన్నదంటావు?

శ్రీరాముడు : ఇది మిథ్యయగు ఆకాశము మాత్రమే.

శ్రీ వసిష్ఠమహర్షి : ఒక్కొక్కడు మేఘముల ఛాయను చూచి, తన కల్పనా బలంచేత, అది కదులుచున్నప్పుడు .... "ఇక్కడ ఒకానొక మిథ్యానటుడు ఉన్నాడు. అతని నీడే ఇది. అతనిదే ఈ అభినయం. అవును, ఇప్పుడు అతడు కోపం చూపిస్తున్నాడు" .... అని భ్రమ చెందుతాడు చూచావా! అదంతా అజ్ఞాన చాపల్యమే కదా! అజ్ఞాన ప్రభావం చేతనే అనేక పదార్థములు, నీవు – నేను మొదలైనవాటితో కూడిన ఈ జగత్తు అనుభవమగుచున్నది. "స్వకీయమగు భ్రమయే ఆత్మయందు 'జగద్రూపము'ను విస్తరింపజేయుచున్నది" .... అని అనేకమంది జ్ఞానులచే, శాస్త్రములచే నిర్ద్వంద్వముగా ప్రకటించబడుతోంది.

"సర్వ సమష్ఠిరూపమగు ఆకాశము నందు వృత్తి రూపమున ఏర్పడుచున్న మనోస్పందమే ఈ జగత్తు".

అని మేము అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నాం. బాలుడిని అదలించటానికి, పెద్దవాళ్ళు .... "అదుగో బూచి. నీవు ఏడ్చావా, అది వచ్చి మీద పడుతుంది" అని పలుకుతూ ఉంటారు. అప్పుడా అజ్ఞాన బాలుడు, "ఔను. నిజమే కాబోలు" అని అల్లరి మానుకొంటాడు. "మోహము – మూర్ఖత్వము – ప్రజ్ఞారాహిత్యము"ల కారణంగా అక్కడ నిజంగానే "బూచి" అనబడునదేదో చూస్తాడు. అతను

చూస్తున్నదంతా మనోవికారములు కాక మరింకేమిటో చెప్పు? ఈ దృశ్య విషయం కూడా అట్టిదే. లేకుంటే ఇక్కడ సుఖములేమిటి? దుఃఖములేమిటి? ప్రియములేమిటి? అప్రియము లేమిటి? నీవారేమి? నావారేమి? అంతా మనోవికారములే సుమా! అట్లే "అక్కడ - ఇక్కడ, అప్పుడు - ఇప్పుడు" .... లతో కూడిన దూరము, స్థానము, సమయము కూడా అంతే! ఇవన్నీ మనస్సుయొక్క స్వకీయకల్పనను అనుసరించే ఏర్పడుచున్నాయి. అనుభవమునకు వస్తున్నాయి.

❖

ఓ రామచంద్రా! ఈ జగత్తు మాయాకల్పితము. ఆకార రహితము. స్వతహాగా ఎట్టి నిర్ణయము లేనట్టి జడము, 'బోధ' శక్తిహీనము. అందుచేతనే తత్త్వజ్ఞులైనవారు, ఈ జగత్తు విషయమును, "అనిద్రుడైనవాడు చూచుచున్న అపూర్వ-స్వప్నము వంటిది మాత్రమే" అని చక్కగా ఎరుగుచున్నారు.

❖

స్తంభము తనయందు ఆయా శిల్పదృశ్యములను (స్త్రీ, ప్రకృతి, జంతువు మొదలైన ఆకారములను) అగుపింపచేస్తోంది చూచావా? సర్వమునకు ఆధారమై, చిన్మయమై, నిర్వికారమై, పరమార్థసత్యమై, మార్పు-చేర్పులులేనట్టి 'ఆత్మ' అనబడు స్తంభమునందు ఈ సృష్టి ప్రాప్తిస్తోంది. "ద్రష్ట - దృశ్యము" .... ఈ రెండూ కూడా ఆత్మకంటే ఏమాత్రం వేరైనవి కావు. ఆహా! ఎంతటి చమత్కారమైనవిషయం! ఒకడు మహా విద్వాంసుడు, తెలివిగలవాడు అయివుండి కూడా, తన స్వప్నమునందు తారసపడిన యోధులచే బాధించబడుతూ, గావుకేకలు వేస్తూ ఉంటాడు. అయితే, ఆ యోధులందరు అంతరంగమున స్వయముగా తనచేత కల్పన చేయబడినవారే కదా! మరి స్వప్న - శత్రుయోధులకు బాధించగల సామర్థ్యం ఎట్లా వచ్చింది? ఆ సామర్థ్యము ప్రసాదించిన వారు ఎవరు? స్వప్నద్రష్ట యొక్క కల్పనాచాతుర్యమే అదంతా అయివుండి కూడా, అతడు అది ఎరుగనివాడై ఎలుగెత్తి ఏడ్చుచున్నాడు. ఈ జాగృత్ - దృశ్యానుభవముల విషయము కూడా అట్టిదే అనటంలో మాకేమీ సందేహం లేదు.

"శీతకాలం తరువాత వసంతకాలం వస్తోంది. అప్పుడు భూమి పుష్పములతో, ఫలములతో లేత చిగురులతో 'రసమయము' అగుచున్నది" అనునది జనులు చూస్తూనే ఉన్నారు కదా! ఆ 'రసత్వము' ఎక్కడ దాగివుంటోంది? వసంతకాలం వచ్చేసరికి ఎక్కడి నుండి బయల్వెడలుతోంది, చెప్పు? ఆ రసత్వం భూమియందే అప్రకటితంగా ఒదిగి ఉండి, తగిన దేశ - కాలములు ప్రాప్తించి నప్పుడు బహిర్గతం అవుతోంది. బంగారం కరగించినప్పుడు ద్రవమగుచున్నది. అంతకుముందు ద్రవత్వము ఎక్కడ దాగివుంటోంది? బంగారమునందే కదా!

అట్లాగే సూక్ష్మమగు "పరమచైతన్యము" నందే ఈ ప్రపంచము అణిగి ఉంటోంది.

నీ కాళ్ళు - చేతులు మొదలైన అంగములు 'రాముడు' అనబడు నీకంటే వేరుకాదు కదా! ఈ జగత్తు కూడా బ్రహ్మము కంటే వేరుకాదు. కాని 'బ్రహ్మము' లేక 'పరమాత్మ' అవయవరహితము. అట్టి ఈ జగత్తునందు తోచుచున్న ఈ 'జీవాత్మ' కూడా 'పరమాత్మ' కంటే వేరైనది కాదు. కనుక

'జీవాత్మ' కూడా వాస్తవానికి ప్రజ్ఞామాత్రము, అవయవరహితము అయివున్నది. ఇక ఈ జగత్తు విషయం ఏమిటంటావా? ఒక దృష్టాంతము చెపుతాను. విను.

ఒకడు ఒక పెద్ద స్వప్నమును గాంచుచున్నాడు. అందులో తాను గొప్ప చక్రవర్తి అయి శత్రురాజులతో భీకరంగా యుద్ధం చేస్తున్నాడు ..... అప్పటికి ఆ విషయం అతనికి సత్యముగానే తోచుచుండును కదా! ఇతరులకో? అదంతా మిథ్యమాత్రమే. ఇంతలోనే, అతడు తటాలున కనులు తెరచి, తన ప్రక్కన పరుండినవానితో "ఏమయ్యా? ఆ శత్రురాజు నన్ను అంతగా హింసిస్తుంటే నీవు వచ్చి సహాయపడవచ్చును కదా? నేను నీకు ఇదివరలో ఎన్నిసార్లు ఎన్ని సహాయాలు చేయలేదు చెప్పు?" అని ప్రశ్నించాడట.

ఇది ఎంత హాస్యాస్పదం! ఆ స్వప్నం దర్శిస్తూ మధ్యలో నిదురలేచి కనులు తెరచిన వాని ప్రశ్నకు అర్థమేమున్నది? అతని స్వప్నము అతని మిత్రునకు అనుభవం అవదు కదా!

ఈ జగత్తు మాయా దృష్టికి పరమనిర్దుష్టమైన సత్యముగాను, విశుద్ధదృష్టికి మొదలే అసత్యమైన దానివలె తోచుచున్నది. వాస్తవానికి ఈ 'జగత్తు' అను పేరుతో చెప్పబడుచున్నదంతా సృష్టికాలమందు ప్రళయకాలమందు ... మధ్యకాలమందు కూడా పరమాత్మయందే సత్ (that which exists) + అసత్ (that which does not have existence as such) రూపమున వెలయుచున్నది. ఇదంతా "స్మృతి-జ్ఞప్తు"ల (Remembrance and Knowledge retained) నుండి మాత్రమే ఇట్లు అనుభవ మగుచున్నది. అంటే,... ఈ 'జగత్తు' యందు సంస్కార రూపమగు సత్త మాత్రమే సంచరిస్తోంది. ద్రష్ట కనుక సంస్కారమును త్యజించటం జరిగితే, ఈ 'జగత్తు' అనబడునది లేనట్లే. అనగా ఏమిటి? ఒకడు తన పూర్వ స్మృతి-జ్ఞప్తులను అనుసరించి సంస్కారపూర్వకంగా దేనిని ఎట్లు దర్శించుతాడో, అది అట్లే ప్రాప్తిస్తోంది. అందుచేతనే, ఒకే 'సంఘటన' లేక 'విషయము' (లేక 'వ్యక్తి' లేక 'వస్తువు') ఒకనికి సుందరంగా తోచుచుండగా, మరొకనికి అందవిహీనంగా ఉంటోంది. ఒకినికి ప్రియంగా, మరొకనికి అయిష్టంగా, ఒకనికి అనుకూలంగా, మరొకనికి ప్రతికూలంగా, ఒకనికి రాగభరితంగా, మరొకరికి ద్వేషయుక్తంగా ... ఇట్లు రకరకములుగా ప్రాప్తిస్తోంది. అంతేగాని ఈ జగత్తులో, ఏ విషయమైనాసరే, ... "ఇది ఇట్లే ఉంటుంది. ఇది ఇట్లు పరిమితము" అని మనం పరిధులు కల్పించి, నిర్వచించలేము. అందుచేతనే ఇది "అనిర్వచనీయము" అని అంటున్నాం.

శ్రీరాముడు : స్వామి! మీరు ఇప్పుడు మహోన్నతమైన విషయమునే ప్రతిపాదించారు. అయితే ఇక్కడ నాది మరొక సందేహం. లీలోపాఖ్యానంలోని విదూరథుని వంశపరంపర అక్కడ మంత్రులకు, పౌరులకు ఒకే తీరుగా కనిపించింది. 'విదూరథుడు' అనువాడు పుట్టటం, పెరగటం మొదలైనవన్నీ ఒకానొక జీవుని స్వప్న మాత్రమై ఉన్నది కదా! ఇదంతా ఒకరికి - మరొకరికి ఎట్లా పొసగుతోంది? ఒకరు చూస్తున్నదే మరొకరు ఎట్లా చూస్తున్నారు? ఒకని స్వప్నములోనిది మరొకరికి కనబడగూడదు కదా! ఈ జగత్తులో అనేకులకు ఒక విషయం ఒకే తీరుగా కనిపించటం ఎట్లా జరుగుతోంది? ఉదాహరణకు, "ఇది గోడ. ఇది ఇల్లు. ఇతడు మానవుడు. ఇది జంతువు" అని నేను ఎట్లా

చూస్తున్నానో, మీకు కూడా అట్లాగే కనిపిస్తోంది కదా? ఒకని మరణం అనేకమంది బంధువులకు దుఃఖకారణమౌతుంది. ఇవన్నీ ఎట్లా సంభవిస్తున్నాయి?


శ్రీ వసిష్ఠమహర్షి : (1) ముఖ్య సంస్కారం (2) సహకారి సంస్కారములు.

ఒక చిన్న 'వాయురేఖ' విశాలమగు వాయువీచికను అనుసరించే పయనిస్తుంది కదా! ఈ "చిత్తము" యొక్క ముఖ్య సంస్కారమును అనుసరించే మిగతా జ్ఞానమంతా ఉండటం జరుగుతోంది. అందుచేతనే, పౌరులకు, మంత్రులకు కూడా పరంపరాక్రమమంతా ఒకే రీతిగా కనిపిస్తోంది. "ఇతడు మా రాజు, ఈ కులము నందు జన్మించిన ఇతడు ఇక్కడి వంశపారపర్య వ్యవస్థను అనుసరించి మమ్ములను పాలించువాడగుచున్నాడు! మేము ఇక్కడి పురవాసులము" అను స్వకల్పిత స్వప్నభావనను ఇక్కడి అనేకులు పొందుచున్నారు. ఆ అందరి వాస్తవ స్వరూపము 'సంవిత్తే' కదా! ఒకే వాయువు అనేక వీచికలగుచున్నట్లు, ఒకే జలము అనేక కెరటములగుచున్నట్లు, ఒకే సంవిత్తు ఆయా ప్రజలందరి రూపము దాల్చుచున్నది సుమా!

అయితే ఇక్కడ ఒక విచిత్రం. విదూరథుడు-రాజు-రాజ్యము-మంత్రులు-ప్రజలు .... ఇవన్నీ కూడా ఆరోపితవిషయాలే కదా! 'సంవిత్తు' ఈ విధంగా ఆరోపిత విషయాలలో 'ఇది వాస్తవమే' అని భావన (లేక) అనుభవం ఎందుకు పొందుతోంది? ...... అనేది ఒక ప్రశ్న. 'ఎందుకు'? అను ప్రశ్నకు మా వద్ద సమాధానం లేదు. అయితే "ఆరోపిత విషయములను స్వీకరించుట" అనునది సంవిత్తు యొక్క స్వభావమే అయివున్నదని మాత్రం చెప్పబడుతోంది. "ఇది ఆరోపిత విషయము - ఇది వాస్తవము" .... అని గ్రహించినప్పుడు ఆ సంవిత్తు తన వాస్తవస్వరూప - స్వభావానుభవం పొందటం మాత్రం జరుగగలదు. మణి ఇచ్ఛారహితంగానే తన కాంతి పుంజములను ఎదురుగా ఉన్న వస్తువులపై వెదజల్లుచున్నట్లు, సంవిత్తు సంకల్ప-వికల్పాదులను కలిగి ఉంటోంది. ఒకడు ఒకచోట ఒక త్రాడును చూచాడు. 'పాము' అని అనుకొన్నాడు. సర్వ వికారములు పొందుచున్నాడు. ఇప్పుడు అతనికి, "అది పాము కాదు. త్రాడే" అని తెలియటం ముఖ్యం. వెనువెంటనే వికారాలన్నీ పోతాయి. అతడు ప్రశాంతమగు స్వస్థితిని మరల సంతరించుకుంటాడు. సత్యవిషయము ప్రతిపాదించుటను వదలిపెట్టి, తదితర చర్చలు ఎంత చేస్తే ఏం ప్రయోజనం?

❖

'చింతామణి' ఏది కోరితే అది ఇస్తుంది చూచావా? అదేవిధంగా విదూరథుని జీవ చైతన్యము కూడా, "నేను ఈ వంశమున ఈ తీరుగా జన్మించెదను గాక" అనునట్టి అంతర్గత వాసనాబలం కలిగియుండటంచే అట్లే జన్మించటం జరిగింది. "చిత్పదార్థము సర్వగామి (All pervading). ఈ "జీవుడు" అని మనచే పిలవబడుచున్నవాడి వాస్తవస్వరూపము చిత్పదార్థమే కదా! అందుచేత, 'జీవచైతన్యము' నందు ఏమేమి అధ్యస్థమై ఉంటున్నాయో అవన్నీ సృష్టి సమయంలో పరస్పరం సంబంధితములై ప్రాప్తిస్తున్నాయి. వాసనా ప్రభావంచే ఏర్పడే అనుభవజ్ఞానమునకు జీవచైతన్యమే ఉనికి - స్థానము అగుచున్నది.



ఒక గ్రామమునకు ఎల్లలు కల్పనయే అయినట్లే, ఈ 'జీవుడు' అనబడే తత్త్వము యొక్క పరిధులు భ్రమతో కూడుకొన్న 'కల్పన' మాత్రమే.

ప్రతి జీవుని యందు ఒకానొక బ్రహ్మాకార స్వభావం వెలయుచున్నది. అది విషయ దోషములచే ఏమాత్రం స్పర్శించబడకుండా సాక్షీభూతమై ఉండియున్నది. గదిలోని దీపమునకు, ఆ వెలుగులో జరుగు సంఘటనలకు సంబంధములేనట్లు అది దేనికీ సంబంధించకుండా ఉండి ఉంటోంది. "ఒక బాలుడు దీపపు వెలుగులో పఠించు చున్నాడు" అను విషయమే తీసుకొందాం. దీపపు వెలుగు అతని చేత చదివించు చున్నదా? లేదు. కాని వెలుగులేకపోతే చదవటం జరిగేది కాదు. బ్రహ్మాకార తత్త్వము కూడా అట్లే .... "సర్వమునకు కారణమై, కాని ఎట్టి 'కర్తృత్వము' అనునది లేకనే" .... ఉండి ఉంటోంది. అది 'విదేహముక్తి' వరకు ఉండి, అటుపై బ్రహ్మమున విలీనమగు చున్నది. అయితే బ్రహ్మమునకు వేరైనది ఏ క్షణంలో కూడా, ఎక్కడా ఏదీ లేదు సుమా! ఆ బ్రహ్మాకార స్వభావం అట్లు ఉండి ఉండగానే, ఈ జీవునియందు భావనాబలము వెల్లివిరియుచున్నది. భావనాబలంచేత చిన్మయ వస్తువు ఆయా ఆకారంలో స్ఫురిస్తోంది. జీవులందరు కూడా స్వాభావికంగానే ఇట్లు స్ఫురిస్తున్నారు. అనగా, "నేను ఎక్కడ ఏ రూపమున స్ఫురిస్తున్నానో అక్కడ ఆ రూపమున నాకు ప్రాప్తిస్తున్నాను. నేను లేనిదేది నాకు ప్రాప్తించదు. అందుచేత అంతటియందు నేను విస్తరించియున్నాను" అనునది ఆత్మజ్ఞానుల అనుభవం.

❖

ఓ రామచంద్రా! ఆ విధంగా చిన్మయవస్తువు 'జగత్తు' ఆకారంగా స్ఫురించటం సహజం. పరిపాటి కూడా. అంతమాత్రం చేత సత్యజ్ఞానమునకు వచ్చే ప్రమాదమేదీ ఉండదు. మట్టి ఎన్ని ఆకారములు పొందితే ఏమున్నది? ఆ మట్టికీ, ఆకారములకు సంబంధం లేదుకదా! మట్టితో ఏనుగును చేసినంతమాత్రంచేత మట్టి ఏనుగు అవుతుందా? మట్టి ఎప్పుడు, సర్వదా మట్టిగానే ఉంటున్నట్లు, జగత్తును పొందుచున్న ఈ జీవుడు, - జీవునిచే పొందబడుచున్న జగత్తు .... ఈ రెండు చిన్మయమగు ఆత్మ స్వరూపములే. అయితే, సముద్రమువైపు పయనించే మహానది ఇతర ఉపనదులను తనయందు విలీనం చేసుకొంటుంది చూచావా? అదేవిధంగా, "మాయ - చిత్‌స్ఫురణ" అయినట్టి ఈ "జగత్ - స్వభావన"ను, నిత్యసత్యమై ఉండి ఉంటున్నట్టి "బ్రహ్మాకారపు జ్ఞానము" లోబరచుకొనుచున్నది. ఈ సృష్టులు, ఈ జన్మలు, ఈ జగద్వ్యవహారములు ముక్తిని నిరోధించజాలవు.

అనగా, ఇవి ఇట్లు ఉండి ఉండగానే జీవుడు "నేను సర్వదా ఆత్మ స్వరూపుడనే కదా!" అనునట్టి ముక్తస్వభావము తప్పకుండా పొందవచ్చు. వాస్తవానికి ఈ జీవుడు ముక్తస్వరూపుడేకాని, బద్ధుడుకాదు. అట్టి ముక్త స్వరూపమును మరుగునపరచి ఉంచుచున్నది .... "అజ్ఞానము - అవిచారణ"యే సుమా! అంతేకాని ఈ భౌతిక దేహముయొక్క రాకపోకలు ముక్తత్వమును భేదపరచజాలవని గ్రహించబడు గాక! జీవునకు అతని "సర్వదా సిద్ధించియున్న ముక్త స్వరూపము"ను గుర్తుచేయుట కొరకే శాస్త్రములు, శాస్త్రములచే చెప్పబడు విధి - విధానములు, నియమనిష్ఠలు, సద్గురువులు ఉండటం జరుగుతోంది.

"నేను బ్రహ్మమును. అంతేగాని ఖండ – సంకుచిత స్వరూపములగు శరీరముగాని, పరిమితాత్మ స్వరూపముగాని కాను" .... అనునదే బ్రహ్మ భావముగా చెప్పబడుచున్నది. అత్యంత దృఢంగా యత్నించువాడు ఈ జీవభావము త్యజించివైచి, విజయుడై, బ్రహ్మ భావమునందు తప్పక ప్రవేశించగలడు. ప్రతి జీవియొక్క వాస్తవస్వరూపము అపరిమితము, శుద్ధము, అప్రమేయము అగు బ్రహ్మమే కనుక, ప్రతిజీవి బ్రహ్మభావన పొందుటకు తాపత్రయపడుచూనే ఉన్నాడు. తెలిసినా, తెలియకున్నా... ప్రతిజీవి తన పూర్ణత్వమును ఎరుగుటకు, ప్రకటించుటకు .... బాహ్యజగత్తునందు, అంతరంగమునందు ఆయా ప్రయత్నములను చేస్తూనే ఉంటున్నాడు.

ఓ రామచంద్రా! ఒక పరమాణుకణము నుండి కూడా భ్రాంతిమయ జగత్తులు వెలువడు చున్నాయి. నశించుచున్నాయి. అజ్ఞానవశంచేత, ఉత్తమోత్తమమైన ఆశయం కలిగియుండకపోవుటచేత, ఈ జీవుడు అనేక మూర్ఖయత్నములను కలిగియుండి ఈ జగత్తులలో ప్రవేశిస్తున్నాడు. ఎంతగా ప్రయత్నిస్తే ఏం ప్రయోజనం? ప్రతిబింబ మాత్రమగు ఈ బాహ్యజగత్తులో లభించగలిగినదేమి? లభించకపోవటం ఏమిటి? జ్ఞానము లభించనంతవరకు అతనికి ఉత్తమశాంతి లభించటంలేదు.

❖

తుదిగాని, మొదలుగానిలేనట్టి (ఆద్యంతములు లేనట్టి), 'జన్మ' మొదలైన వికారములు గాని లేనట్టి 'చిదాకాశము' (The All-Pervading Consciousness) ఒక్కటే సర్వదా ఏకమై వెలయుచున్నది. సత్–చిత్ (Absolute Existence-Absolute Knowledge) దాని స్వరూప–స్వభావములని చెప్పబడుతోంది. ఇక, జగత్తు ఎక్కడ? బంధమెక్కడ? విముక్తి ఎవరికి? వివేక రహితమగు లేక స్వప్నతుల్యమగు బుద్ధి కలిగియున్నప్పుడు మాత్రమే "నేను బద్ధుడను, ముక్తిని పొందవలసియున్నది" అను అభిప్రాయ పరంపరలు ఏర్పడు చున్నాయి. సర్వమునకు అధిష్ఠానము (that which support & substraction of everything) బ్రహ్మమే అయివున్నది. అట్టి బ్రహ్మము మాత్రమే సత్యము. జగత్తు మిథ్యయే. ఇక బంధమేమిటి? మోక్షమేమిటి?

ఇదంతా ఒకానొక సుదీర్ఘమైన వ్యవహారము వలె, కథారచన వలె .... ఒకదాని కొకటి సంబంధించినదై ఉంటే ఉండనీ, ఏదిఏమైనా ఇది మిథ్యయే. ఒక వృక్షము ఆకులతోను, పండ్లతోను, పువ్వులతోను నిండి ఉన్నప్పటికీ అవన్నీ ఉన్నది వృక్షమునందేకదా! అనేక పళ్ళు–పూలు–కాయలు

ఉండవచ్చునుకాని, "వృక్షము మాత్రం సర్వదా ఏకమే (ఒక్కటే) అయివున్నది" అనటంలో సందేహం ఎక్కడిది? బ్రహ్మము కూడా సర్వశక్తి సంపన్నమై, నానావిధ – ఆకారములలో స్ఫురించుచున్నప్పటికీ .... అది సర్వదా "ఏకము – అఖండము – అద్వితీయము" అయివున్నది. దానియందు నానాత్వాది కల్పనలు (that - this - I - you - he - mine - your - his - now - then మొదలైన కల్పనలు) ఏ క్షణమునందు కూడా ఉండియే ఉండలేదు. అంతేకాదు. అది సర్వవ్యాపకము. అది కానిదంటూ ఏదీ లేదు. బ్రహ్మతత్త్వము గ్రహించబడినదా, ఇక మరెన్నటికీ ఎట్టి వికారములు ఉండవు.

ఆత్మకు ఉదయాస్తమయములు లేవు. అంధకారములను కూడా ప్రకాశింపచేయటం, 'ఇది అంధకారము' అని గుర్తించటం, అనుభవమును పొందటం.... ఇవన్నీ ఆత్మ వలననే జరుగుచున్నాయి. ఆత్మయే దిక్కుల రూపము. కాలరూపము కూడా అదే. అయినప్పటికీ, అది ఆదిమధ్యాంతరహితము, అద్వితీయము అయివున్నది. నీయొక్క, నాయొక్క, ఈ సర్వులయొక్క స్వస్వరూపము అట్టి 'బ్రహ్మము' లేక 'ఆత్మ'యే కాని, మరింకేదీ కానే కాదు. అది సర్వదా సౌమ్యముగా మృదుతరంగములతో కూడిన సముద్రమువలె వెలయుచున్నది. ఓ రాఘవా! వాస్తవానికి ఈ 'నీవు–నేను' .... అను భావములే మూలముగా కలిగియుండి కనబడుచున్న ఈ జగత్తు వాస్తవమైనది కాదు. ఇదంతా .... ద్వైత – ఐక్య – సంకల్ప – వికల్ప .... రూపకమైనట్టి "మనస్సు" నుండే ప్రతిభాసించుచున్నట్లు అగుపించుచున్నది. ఆకాశము శూన్యమే అయినప్పటికీ, అందు భ్రాంతిచేత నీలత్వము, ముత్యములు మొదలైనవి గోచరిస్తున్నాయి చూచావా? ఈ జగత్తు కూడా బ్రహ్మమునందు భ్రమాత్మకమైన దృష్టి కారణంగా గోచరిస్తోంది. భ్రమ అజ్ఞానముచేత ఏర్పడుచున్నది. 'అజ్ఞానము' అంటే ఏమిటి? జ్ఞానరాహిత్యమే సుమా! 'చీకటి' అనగా వెలుగు లేకపోవటం మాత్రమేకాని మరింకేమీ కాదు.

❖❖❖

2. జగత్స్వభావం

శ్రీరాముడు : హే బ్రహ్మజ్ఞా! సాధూ! ఈ "నేను–జగత్తు" అనునవి భ్రాంతి మాత్రములని మీ వాక్యానుసారం గ్రహిస్తున్నాను. అయితే ఈ భ్రాంతి ఏ కారణంచేత ఏర్పడుచున్నది? ఏ కారణము లేకుంటే, అవి ఎట్లా ప్రభవిస్తున్నాయి? వాటి స్వరూప–స్వభావాలు ఏమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! నీ ప్రశ్న బాగానే ఉన్నదయ్యా! ఉత్తమము, నిర్మలము, సుతీక్ష్ణము అయినట్టి బుద్ధిచే ఈ క్రింది ప్రశ్నలను ముందుగా పరిశీలించు.

1. నేను ఎవరు?
2. ఈ చిత్తమేమిటి?
3. ఈ జగత్తును నేను ఎట్లా పొందియున్నాను?
4. దీనియందు నాచే అనుభవించబడుచున్న ఆయా పదార్థములతోటి, వ్యక్తులతోటి ఏర్పడుచున్న సంబంధ – బాంధవ్యములు సత్యములా? కల్పితములా?

5. ఒకవేళ కల్పితములైతే, అవి కల్పించుచున్నది నేనేనా? లేక, బాహ్యమున ఎక్కడో ఉన్నట్టి మరెవరోనా?
6. బాహ్యమున ఉన్నట్టి ఎవరో ఈ కల్పనలకు కారణమైయుంటే, అతడు ఎట్లు ఏ ప్రయోజనము కోరి చేస్తున్నాడు?
7. ఈ ప్రశ్నలకు 'ఉపనిషత్తులు' మొదలైన శాస్త్రములు ఇస్తున్న సమాధానమేమిటి? ఈ విషయమై అనుభవజ్ఞులగు ఆత్మజ్ఞానులు ఏమంటున్నారు?
8. బుద్ధి దోషరహితం అయితేకానీ ఉత్తమజ్ఞానం వికసించదు. మరి స్వబుద్ధిని సుతీక్ష్ణం నిర్మలం చేయాలంటే అనుసరించవలసిన మార్గములేమిటి?

ఈ ప్రశ్నలను పరిశీలించటం, ఉత్తమ ప్రయత్నములను ఆశ్రయించటం చేయుచుండగా ఈ జీవుడు "విదితవేత్త" (తెలుసుకొనవలసినది తెలుసుకొనినవాడు) అగుచున్నాడు. అప్పుడాతడు, "ఆహాఁ! నేను చైతన్యమే స్వరూపముగా కలిగియున్నాను. ఈ భ్రాంతి అంతా చైతన్యము నందు అంతర్గతమైయున్నది. చైతన్యమునకు బాహ్యమున, దానికంటే వేరుగా ఏ పదార్థము ఎక్కడా ఉండకయే ఉన్నది. నేను కానిదేదీ నా ముందు ప్రాప్తించటం లేదు" అని గ్రహించుచున్నాడు. అట్టివాడు తనను తాను సర్వజీవుల యొక్క అంతర్యామిగా, నిష్క్రియుడుగా, నిస్సంగుడుగా దర్శిస్తున్నాడు.

అయితే రామచంద్రా! ప్రయత్నశీలుడు మాత్రమే 'విదితవేద్యుడు' అగుచున్నాడు. ఉత్తమ ఆశయముతో ప్రయత్నించనట్టి 'అప్రయత్నశీలుడు' .... ఉత్తమభావనను పొందలేక పోవుచున్నాడు. అతడు ఈ భ్రమాత్మకమైన సంసారంలో నిష్ప్రయోజనంగా పైకి – కిందికి సంచరిస్తూనే ఉంటున్నాడు.

❖

సర్వాత్మకము (సర్వులయొక్క ఆత్మస్వరూపమైయున్నది), జన్మరహితము అయినట్టి బ్రహ్మము ఒక్కటే త్రికాలములందు సత్యము. ఇక ఈ అసత్యములైనట్టి 'నీవు – నేను – జగత్తు' మొదలైనవన్నీ భ్రమ కారణంగానే ప్రవర్తిస్తున్నాయి. అట్టి సత్యమును అధికారులగు జనులు (Those who have become competent to receive this knowledge by cultivating dispassion & discrimination) గ్రహించటం కొరకే, నిన్ను–నన్ను నిమిత్తంగా చేసుకొని, ఈ 'వాసిష్ఠ రామాయణము' అను గ్రంథమును సర్వతత్త్వస్వరూపుడగు పరమాత్మ వారిముందు ఉంచుచున్నాడు.

❖

అవయవములకన్నా వేరైన 'అవయవి'

ఈ జగత్తులో జనులకు అనుభవమయ్యే పదార్థములన్నీ "పంచేంద్రియములచే గ్రహించబడు చున్నవి" మాత్రమే కదా! అట్లు ఇంద్రియములకు అనుభవమగుచున్న పదార్థములన్నిటికీ వాస్తవానికి శాశ్వతమైన రూపమంటూ ఏదీ లేదు. "ఇవన్నీ బ్రహ్మమునందే. బ్రహ్మముగానే వెలయుచున్నాయి" అని బ్రహ్మజ్ఞులు చెప్పుచున్నారు. ఆభరణము బంగారము నుండి వేరా? 'తరంగము' అనబడునది నీరు కాకుండా వేరుగా ఇంకేదన్నా అయివున్నదా? ఈ జగత్తు కూడా ఈశ్వరునకు వేరైనది కాదు.

ఈ అభిప్రాయం అనేకమంది జ్ఞానులచే, శ్రుతిస్మృతులచే నిర్ద్వంద్వంగా ప్రకటించబడింది. ఈశ్వరుడే జగత్తు రూపమున స్ఫురించుచున్నాడు.

కాని ఈ జగద్రూపము ఈశ్వరునియందు లేదు సుమా! దృష్టాంతము సువర్ణాభరణమే. బంగారమే ఆభరణంగా ప్రాప్తిస్తోంది. అయితే 'బంగారము తన స్వరూప-స్వభావములు కోల్పోయి ఆభరణముగా మారినది" అనునది సమంజసము కాదు కదా! బంగారము బంగారముగానే ఉంటోంది. ఒకానొక ఆకారమునకు "గొలుసు-గాజు" మొదలైన ఆభరణనామము మనం ఇస్తున్నాం.

మరొక దృష్టాంతము. ఈ 'శరీరి'ని తీసుకో. ఈ అవయవి (అవయవములు కలిగియున్నవాడు. The Experiencer cum operator of the body) సర్వ అవయవాత్మకుడై .... చెవులందు వినటం, కళ్ళయందు చూడటం, చర్మమునందు స్పర్శ అనుభవించటం ... మొదలైన క్రియలన్నిటికీ 'కర్త' అయి ఉంటున్నాడు. అంతమాత్రంచేత అతడు "చూపు – వినికిడి – స్పర్శ" మొదలైనవిగా మారిపోవటం లేదు కదా! అదేవిధంగా చిదాత్మ (లేక అవయవశూన్యమగు చిద్వస్తువు) కూడా సర్వాత్మకమై ఉండటంచేత నానారూపములుగా ప్రకాశించుచున్నాడు. కానీ సర్వదా యథాతథుడు.

ఈ ప్రాణుల అంతరమున ఒకానొక సమయంలో అజ్ఞానంచేత "నేను – జగత్తు" మొదలైన రూపములన్నీ ప్రకాశిస్తున్నాయి. అయితే, "సూర్యుడు-సూర్యకిరణములు" వలె అట్టి భావన కూడా బ్రహ్మము యొక్క స్వభావమే అని గ్రహించు. అంతమాత్రము చేత బ్రహ్మమునకు వచ్చేలోటేమీ ఉండదు. "అజ్ఞానమును స్వీకరించటం కూడా బ్రహ్మము యొక్క స్వభావమైయున్నది" అని గ్రహించి నప్పుడే ఆ బ్రహ్మము యొక్క సర్వాత్మకత్వము అనుభవమవగలదు. ఈ 'అనేకత్వము' అను రూపముగల 'జగత్ జాడ్యము' అప్పుడు మాత్రమే తొలగుచున్నది.

ఒక స్ఫటిక శిలయందు (అట్లాగే ఒక దర్పణమునందు) ఎదురుగా ఉన్న అరణ్యం ప్రతిబింబిస్తోందనుకో .... అప్పుడు ఆ స్ఫటికంలో కనిపించే ప్రతిబింబ దృశ్యము స్ఫటికము కంటే వేరైనదా? కాదు కదా! దర్పణంలో ప్రతిబింబించే నీ ముఖము దర్పణమునకు వేరైనదని అనలేము కదా! చిన్మయుడగు పరమేశ్వరుని నుండి ఈ "అహంభావాత్మకము" అయినట్టి జగత్తు వేరైనది కాదు. కాని, వేరైనట్లు తోచుచున్నది. నీటినుండి తరంగాలు లేస్తున్నాయి. మరల ఇంతలోనే విలీనమైపోతున్నాయి. ఆ తరంగములు జలముకంటే వేరైన రూప-నామములతో ప్రాప్తించినప్పటికీ, "తరంగములు జలము కంటే వేరు" అని ఎవరనగలరు? అదేవిధంగా 'బ్రహ్మము' అను మహా సముద్రంలో "సృష్టులు" అనే తరంగాలు లేస్తున్నాయి. మరల లీనమై పోతున్నాయి. కాని ఆ సృష్టులన్నీ బ్రహ్మముకంటే వేరేమీకాదు.

ఓ రఘుకుల తిలకమా! రామచంద్రా! వాస్తవానికి పరబ్రహ్మము పదార్థరహితము. సృష్టియందు పరబ్రహ్మము లేదు. పరబ్రహ్మమునందు సృష్టియు లేదు. ఎందుకంటావా? పరబ్రహ్మ దృష్టితో దర్శిస్తే ఇక్కడ 'సృష్టి' అనబడునదే తోచదు. 'సృష్టి' అనబడు భేదదృష్టికి 'పరబ్రహ్మము' అనబడు అఖండ-అప్రమేయ- అద్వితీయ తత్త్వము యొక్క అనుభవము లభించుచున్నది. దర్పణంలోని

ప్రతిబింబము వలె ఈ సృష్టి 'మాయా ప్రతిభాస' మాత్రమే. జ్ఞానులగువారికి 'బ్రహ్మసత్త' మాత్రమే ఇక్కడ లభిస్తోంది. అజ్ఞానులకే ఈ నీవు-నేను-జగత్తు అనబడు వివిధత్వమంతా తోచుచున్నది. చిత్ నందు ప్రతిఫలిస్తున్న 'విషయజ్ఞానము' కారణంచేత చిన్మయపరబ్రహ్మమే జగత్తుగా గాంచబడుచున్నది. కల్పన చేస్తున్నది .... కల్పనగా గాంచబడుచున్నది కూడా చిన్మయ బ్రహ్మమే సుమా!

అట్టి కల్పన యొక్క ఆరంభమున ... "కారణ-కారణము" (కారణముల కెల్ల కారణము) అయినట్టి బ్రహ్మమున అంతవరకు లీనమైయున్న శబ్దతన్మాత్ర ఆకాశరూపమును ధరించుచున్నది. అట్టి ఆకాశరూపమగు బ్రహ్మము ఆ తరువాత స్పర్శతన్మాత్రతో గూడి వాయుత్వము అనుభవిస్తోంది. అట్లు వాయురూపము ధరించిన బ్రహ్మమే తేజః ప్రకాశమువలె రూపతన్మాత్రతో గూడి తేజోమయత్వము పొందుతోంది. అట్లు తేజోరూపము పొందిన బ్రహ్మమే రస తన్మాత్రతో గూడి జలత్వము పొందుచున్నది. ఈ జలరూపాభిమానియగు బ్రహ్మము 'గంధ తన్మాత్ర'తో గూడి తన చిత్తముతో పృథ్వి భావము పొందుతోంది. ఇట్లు జగత్తు చిన్మయాకారముననే ప్రకాశించుచున్నది. ఈ క్రమము ప్రకాశించటం - ఇదంతా నిమిషములో లక్షవ భాగ సమయంలో జరిగిపోతోంది. ఇదే కోటి కల్పముల వరకు వెలయుచున్న సృష్టి. కాని, 'బ్రహ్మము' అన్ని సమయములందు మార్పు చేర్పులు లేకయే ఉంటోంది. అయ్యది "విశుద్ధము, నిత్యప్రకాశము, సృష్టి-ప్రళయములకు కూడా స్థానము, ఉదయాస్తమయరహితము, ఎట్టి ఆధారము లేకయే ఉంటున్నది" అయివుంటోంది. అయ్యది నిర్లిప్తంగా, నిష్కళంకంగా, నిర్లేపంగా సర్వదా స్వమహిమ యందే వెలయుచున్నదని గ్రహించు.

❖

'పరమార్థసత్త' యందు సృష్టి-ప్రళయములు ఉంటున్నప్పటికీ, అందు ఏర్పడుచున్న 'వైషమ్యం' అంటూ ఏదీ లేదు. ఈ జీవుడు అజ్ఞానముచే కప్పబడియున్నప్పుడు అనేక భేదములు పొందుచున్నట్లు కనిపించినప్పటికీ అతని వాస్తవస్వభావమగు ఆత్మ యొక్క అఖండత్వమునకు ప్రమాదమేమీ ఏర్పడటంలేదు. అదే జీవుని బుద్ధి ప్రబుద్ధమైనప్పుడు "మనస్సు-దృశ్యము" మొదలైనవి ఇట్లు ఉండగానే అతడు ముక్తి స్వభావము పొందుచున్నాడు. ముక్తి స్వభావముచే అంతరంగమున ప్రశాంతబుద్ధిని పొంది బాహ్యమునకు యథాతథముగా వ్యవహరిస్తున్నాడు.

ఎవరు ఎట్లు తమ అంతరమున బ్రహ్మ వస్తువును గ్రహిస్తారో అది అప్పుడు వారిపట్ల అట్లే ప్రతిఫలిస్తూ ఉంటుంది. అదియే 'మాయాశక్తి విలాసము' అని చెప్పబడుతోంది. అట్టి పరిణామము గ్రహించినట్టి సత్యద్రష్టలగు మేము "ఈ జగత్తు బ్రహ్మముయొక్క విలాసమే కాని, మరింకేమీ కాదు" అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాం. తపస్సు, ధ్యానము, విచారణల మొదలగువాటిచే మేము ఈ విషయం గ్రహించిన తరువాతనే ఈ విషయం చెప్పుచున్నాం. "ఈ మనస్సు ఇంద్రియములతో కూడినదై బహిర్వృత్తులను పొందుచున్నది. తత్ఫలితంగా చూచేది, వినేది, అనుభవించేది ... అంతా కేవలం నామరూపాత్మకమైన స్వకీయ కల్పనయే" అని మేము గుర్తించుచున్నాము. కాబట్టి ఇవి భేద దృష్టి దృష్ట్యా సత్యమే అవుతాయి కాని, వాస్తవము కాదు.

❖

వాయువు చలించనప్పుడు దాని ఉనికిని మనం గ్రహించము. చలించునప్పుడు మాత్రమే దాని స్పర్శను అనుభవిస్తున్నాం. చలనము లేనప్పుడు గాలి లేనట్లే అనిపిస్తుంది. కాని, అది లేని సమయమెప్పుడో చెప్పు? 'అజ్ఞానము' ఉన్నంతవరకు "చైతన్య బ్రహ్మము" మరుగునపడి, జగత్తే కనిపిస్తోంది. అజ్ఞానం తొలగితే జగత్తు లేదు. చైతన్య బ్రహ్మమొక్కటే వాస్తవమైన సత్త కలిగియున్నది. ఆ సత్తయే "సర్వుల యొక్క - సర్వము యొక్క స్వరూప - స్వభావముల గురించి ఎరుక"గా ప్రభవిస్తోంది. ఒక్కొక్కచోట అది తన స్వస్వరూపమును ఏమరచి ఉంటోంది. మరొకచోట పూర్ణమగు స్వస్వరూపజ్ఞానముతో ప్రకాశిస్తోంది. ఆకాశం అఖండమై నిర్మలమై ఉండగా అందు కొంతభాగం నిర్మలంగాను, మరికొంతభాగం మేఘాదులచే కప్పబడి ఉంటోంది కదా! ఇది కూడా అట్టిదే. అట్టి ఎరుక యొక్క త్యాజ్య-గ్రాహ్యములనే (స్వస్వరూపము గురించిన జ్ఞానము త్యజించి ఉండుట .... గ్రహించియుండుటనే) మనం "బంధము" అని, "మోక్షము" అని వ్యవహరిస్తున్నాం.

ఒకడు "తేజము వేరు, ప్రకాశము వేరు. సూర్యుడు వేరు. కిరణములు వేరు" అనునట్టి బుద్ధితో చూడటం జరిగితే, అవి అట్లే వేరువేరుగా తోచటం జరుగుతుంది. "తేజ - ప్రకాశములు అభిన్నములు. సూర్యుడు - సూర్యకిరణములు వేరు-వేరు కావు" అనునట్టి దృష్టితో చూచినప్పుడు మాత్రం, అభిన్నత్వమే అనుభవముగా శేషించుచున్నది. "బ్రహ్మతత్త్వము" ప్రాప్తించుచున్నది.

శ్రీరాముడు : మహాత్మా!

1) సృష్టికి ముందు 'బ్రహ్మము' ఒక్కటే కలదు.

2) జగత్తు - బ్రహ్మము ఒక్కటే

ఈ రెండు వాక్యములు ఒకేసారి ఒనగూడగలవంటారా? ఏ విధంగా?

శ్రీ వసిష్ఠమహర్షి : మట్టితో ఒకబొమ్మ తయారుచేశామనుకో ... ఆ బొమ్మ మనం తయారు చేయటానికి ముందే "మట్టి" ఉన్నది కదా! కొయ్యతో ఒక బొమ్మ లేక ఆకారము (ఏనుగు, గుఱ్ఱము మొదలైనవి) ఒక కమ్మరి శిల్పి మలచినాడనుకో .... ఆ ఆటబొమ్మ ఆకారమునకు ముందే 'కొయ్య' ఉండి ఉన్నది కదా! మట్టిబొమ్మగా మలచబడినప్పుడు, కొయ్య బొమ్మగా తయారు చేయబడినప్పుడు .... మట్టి-మట్టిగానే, కొయ్య-కొయ్యగానే ఉండి ఉంటున్నాయి. అట్లే ఆ మట్టి బొమ్మ ముక్కలైనప్పుడు కూడా మట్టిమట్టే కదా! ఈ "జగత్తు" అనబడునది కూడా, (బొమ్మ ఆకారము మట్టితో ఉండియే ఉన్నట్లు), బ్రహ్మమునందు అవ్యక్తమై ఉండి ఉంటున్నది. వ్యక్తమగుట జరిగినప్పుడు కూడా, (జగత్తు ప్రాప్తిస్తున్నప్పుడు కూడా) ఇదంతా బ్రహ్మము కంటే ఏమాత్రం వేరైనది కాదు. అయితే సాంసారికదృష్టి గలవానికి మాత్రం "పరబ్రహ్మము" అనబడే ఒకానొక సువిశాల ఎడారిలో నీటిచెలమల వలె లభిస్తున్న ఈ జగత్తులు ఎండమావులవలె అసత్యములే అయినప్పటికీ "సత్యమేనా?" అన్నట్లుగా భ్రమింపచేస్తున్నాయి. విచిత్రం ఏమిటంటే, "చిన్మయ బ్రహ్మము" .... భ్రాంతి వలన జీవరూపమును గ్రహించి, 'సృష్టి-క్రమము' అనుదానికి లోబడు చున్నది. ఇక్కడ ప్రాప్తిస్తున్న జగత్ చమత్కారమంతా అదియే కారణంగా కలిగియున్నది.

పాలలో 'తీపి' ఉన్నది. మిరియపు గింజలలో 'కారము' ఉంటోంది. నీటియందు ద్రవత్వం ఉంటోంది. గాలియందు కదలికలు ఉన్నాయి. అవన్నీ ఆ పదార్థములకు వేరైనదానివలె పదప్రయోగం దృష్ట్యా చెప్పబడుచున్నప్పటికీ .... ఒకదాని నుండి మరొకటి వేరు కాదు. వాటికి భిన్న-భిన్నమైన సత్త ఎక్కడ ఉన్నది? "బ్రహ్మసత్త దృశ్యము వంటిది కాదు. సృష్టికి వేరుగా బ్రహ్మమనునది ఎక్కడో లేదు. ద్రష్టయొక్క సత్తకు వేరుగా 'బ్రహ్మము' అనబడునదేదీ లేదు. అందుచేత 'జగత్తు' అనబడునది "మిథ్య" అనియే సిద్ధాంతీకరించబడుచున్నది.

❖

ఎట్టి కారణం లేకుం.డానే బ్రహ్మము జగత్తు రూపమున ప్రకాశించుచున్నది. అట్టి ప్రకాశము బ్రహ్మముకంటే వేరేమీ కాదు. "వాసనలు-చిత్తము-జీవులు" ... అనబడునవన్నీ మనస్సునుండే ఉత్పన్నమౌతున్నాయి. ఉన్నదంతా మనస్సులోనే ఉన్నది. మనస్సు కానట్టి జగత్తే లేదు. ఇక మనస్సుయొక్క రూపమేమిటి? మననమే కదా! అనగా .... బ్రహ్మసంవిత్తే తన మనన శక్తిని ఉత్తేజితం చేసి 'జగత్తు-జీవుడు' అను జాడ్యమును స్వయముగా అనుభవించుచున్నది. "జ్ఞాన యోగము" వలన, "దృఢాభ్యాసం" వలన, "పురుషప్రయత్నం" వలన, ఈ మనస్సు లయించి పోయినప్పుడు, అట్టివాని దృష్టిలో ఈ జగత్తు "లేనిదే" అగుచున్నది.

ఓ రఘురామా! బ్రహ్మము సర్వాత్మకమై, శాంతమై, అజమై, చిన్మయమై, నిత్యప్రకాశకమై ఉన్నది. దానికి జనన-మరణములనునవే లేవు. అది చిద్ఘనము అయివున్నది. ఇక ఈ సృష్టి పరంపరాప్రాప్తి అంటావా.... ఇదంతా నిజానికి పరమాణు సమూహ రూపమున సంకల్పానుసారంగా ప్రతిభాసిస్తోంది. భ్రాంతి-చిత్తము యొక్క సహాయం చేతనే కలుగుచున్నది కాని, అందుకు వేరెవరో కారణం కాదు. అసలు పరమాణువులేమి? ఆ పరమాణువునందు సృష్టి ఉండటం ఏమిటి? ఈ కనబడుచున్న - అనుభవమగుచున్న "సుఖ-దుఃఖ-రాగ-ద్వేషము"లతో కూడిన జగత్తు మిథ్య మాత్రమే .... అనటంలో సందేహం లేదు. (లేక) స్వకీయకల్పిత భావనావైచిత్ర్యమే!

❖

నీటియందు అలలు వెలువడుచు, ఇంతలోనే అణిగిపోతున్నాయి చూచావా? ఈ జీవుని యందు కూడా జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలు ఏర్పడుచున్నాయి. తొలగుచున్నాయి. అట్లే ఈ శరీరాదులు ఏర్పడుచున్నాయి, తొలగిపోవుచున్నాయి. "ఈ శరీరములు, భావనలు, సంకల్పములు ఎందులేచి విలీనమైపోతున్నాయో అట్టి తత్వమే 'స్వస్వరూపము' అనబడునది" అని విజ్ఞులు నిర్వచించు చున్నారు. ఈ జీవుడు తన స్వస్వరూపము గ్రహించలేకపోవుటచేతనే స్వస్థత పొందలేకపోతున్నాడు. అతనికి ఒకింత భోగముల యెడ విరాగము కలిగిందా అంతమాత్రం చేతనే అతడు ఉత్తమమగు పదము పొందగలుగుచున్నాడు. సంపూర్ణంగా విరాగము కలిగినదా ... ఇక 'జీవన్ముక్తి'కే తగినవాడగు చున్నాడు. "నేను-దేహము" అను రూపముగల దేహాత్మబుద్ధి కలిగియున్నవానియందు మాత్రమే "రాగములు-భోగములు" మొదలైనవన్నీ ప్రదర్శితములు అవుచున్నాయి. 'దేహాత్మబుద్ధి' లేనివానికి జనన మరణములే లేవు. ఆ అనుభవములన్నీ అతని దృష్టిలో స్వప్నసంఘటనవంటివే.

"ఈశ్వరచైతన్యము – జీవుని చైతన్యము" ... ఈ రెండూ కూడా కారణము–కార్యము–ఉపాధి (cause - effect - adjunct) లేనివేనని గ్రహించెదవు గాక! వాటి అభేదమును, ఐక్యత్వమును గ్రహించిన వారే ఈ సంసారమును జయిస్తున్నారు. ముక్తికి అర్హులు అగుచున్నారు. ఈ బాహ్య దృశ్యబంధము నుండి విముక్తులై తరిస్తున్నారు. నీటినుండి తరంగములన్నీ వేరుకానట్లు, తరంగములన్నీ జలమే అయివున్నట్లు, జీవచైతన్యము ఈశ్వర చైతన్యము నుండి వేరు కానేకాదు. ఈశ్వర చైతన్యము అద్వితీయమై స్వయంప్రకాశరూపమై (Self effulgent or luminous) వర్ధిల్లుచున్నది. ఆ ఈశ్వరచైతన్యమే ఒకానొకప్పుడు, – ఆకాశము మేఘముల ఆచ్ఛాధన పొందుచున్నట్లు,– 'అహంభావము' అను ఆచ్ఛాదన పొందుచున్నది. అప్పుడది జగద్భావనను ధరించటం జరుగుతోంది. అట్లు అహంకారాచ్ఛాదముతో జగద్భావనను పొందుచున్న ఈశ్వర చైతన్యమే ఈజగత్తు. ఈశ్వర చైతన్యాత్మకమై (లేక ఈశ్వరచైతన్యమే అంతఃతత్త్వముగా గల) 'జగత్తు' అని చెప్పబడే ఇది 'సత్తు' కాదు. ఇదంతా అసత్తు కూడా కాదు.

చైతన్య స్వరూపుడగుచు, బాహ్యమున అహంభావముతో ప్రకటితం అయ్యేది బ్రహ్మమే సుమా! ఆ బ్రహ్మము యొక్క భావనయే సంకల్ప భేదానుసారంగా విశ్వమును ప్రకాశింపచేస్తోంది. అట్టి 'అహం' యొక్క స్వరూపము బ్రహ్మమే. ("అహం బ్రహ్మోస్మి" .... ఋగ్వేదం)

ఓ రాఘవా! ఈ జగత్తుగా బాహ్యమున దృఢమై అనుభవమగుచున్నదంతా జ్ఞానదృష్టిచే దర్శించినప్పుడు క్షణంలో స్వస్వరూప సత్త యందు లయిస్తోంది. స్వస్వరూపంగా సందర్శించబడుతోంది.

❖❖❖

3. "దైవము" - అర్థము

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఒక పరమాణువును లక్ష భాగములుగా విభజించామనుకో .... అట్లాగే ఒక నిమిషకాలమును కూడా లక్ష భాగములుగా చేసినా మనుకో ... అప్పుడు ఆ లక్షవభాగమైన కాలము నందు వేలకొలది జగత్తులు, వేలకొలది కల్పములు ("కల్పన" యొక్క చమత్కారం చేత) సత్యమువలె ప్రతిభాసించగలవు సుమా! మరల అట్లు ప్రతిభాసించు ప్రతి జగత్తులోని ప్రత్యేక పరమాణువునందు ఇట్టివేయగు అనేక జగత్తులు అనుభవమునకు లభిస్తున్నాయి. అందుకే ఈ "జగత్తు" అనబడునదంతా "అంతులేని భ్రాంతి మాత్రమే" అని చెప్పబడుతోంది.

నీటియందు సుడిగుండములు లేదా ఆవర్తములు (circles) స్పష్టంగానే కనిపిస్తున్నాయి కదా! ఈ భూత–వర్తమాన–భవిష్యత్ సృష్టులు కూడా స్పష్టంగా స్థిరంగా ఉన్నట్లే కనిపిస్తున్నాయి. అయితే నీకు ఆ సుడిలో కనిపిస్తున్న నీరు ఏ క్షణంలో అయినా స్థిరంగా ఉంటోందా? అసలు అక్కడ నీరు కాకుండా వేరుగా 'సుడి' అనబడునది ఎక్కడ ఉన్నది?

ఎడారిలో కనబడే ఎండమావుల రూపమైనట్టి నదీతరంగములు, ఆ తరంగములలో "పెద్ద–చిన్న– పొడవు–వెడల్పు" కెరటముల వ్యత్యాసములు వాస్తవమా?

బ్రహ్మమునందు స్వకీయ అజ్ఞానముచే కనిపిస్తున్న ఈ సృష్టి పరంపరలన్నీ కూడా 'మిథ్య' మాత్రమే! స్వప్నంలోను, ఇంద్రజాలంలోను కనబడుచున్న ఆయా పదార్థములు, సంఘటనలు అప్పటికి వాస్తవమనే అనిపిస్తున్నాయి కదా! ఈ జగత్తులోని పదార్ధములు, సృష్టులు మిథ్యా రూపమునే కలిగి ఉండి, కేవలం సంకల్పబలంచేత మాత్రమే అనుభవ యోగ్యములౌతున్నాయి. ఇప్పటికిప్పుడు ఇదంతా "సత్యమే"... అని అనిపించటం అట్టిదే!

శ్రీరాముడు : ఓ తత్త్వజ్ఞా! జ్ఞానులు తమ విచారణా బలం చేత "ఏకాత్మరూపకము-నిర్వికల్పము" అయినట్టి పరమాత్మ బోధ" అను స్థితిని పొందుచున్నారు కదా! ఇక అప్పుడు ఆ స్థితిలో వారికి ఈ శరీరము నిలచి ఉంటుందా? లేక 'దైవము' అనబడు దానిచే ఆక్రమించబడి ఉంటుందా? వారిపట్ల దైవము ఎట్లా వర్తించటం జరుగుతుంది?

మరొక ప్రశ్న. "అంతా 'నియతి'యే నిర్ణయిస్తోంది. మనదేమీ లేదు" అని చెప్పు 'నియతివాదం' గురించి మీ అభిప్రాయం చెప్పమని వేడుకొంటున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామా! ఒకానొక "మహానియతి" ఉన్నది. ఆ మహానియతియే ప్రాణ ప్రయోజనము కొరకు "స్పందరూపిణి" గాను, వస్తు శక్తి - ప్రయోజనం కొరకు "అవశ్యం - భావని"గాను సంకల్ప - ప్రయోజనం కొరకు "ఈశ్వర సంకల్పి" గాను అగుచున్నది. ఆ నియతి వలననే తత్త్వజ్ఞుల శరీరములు కూడా నిలచియుండటం, ఆ శరీరములు లౌకిక వ్యవహారముల కొరకు యోగ్యం అవటం జరుగుతోంది. ఆ నియతియే సృష్టి యొక్క ప్రారంభము. లేక కల్పన యొక్క ప్రారంభమే అది. కనుక కల్పారంభమందు "ఇది అగ్ని, దీని నియతి ఇట్టిది, ఇది ఊర్ధ్వమునకు జ్వలించును గాక! ఇది జలము, దీని ధర్మములు ఇవి. ఇది పల్లమునకు ప్రవహించునుగాక!" అను రూపంగా పరబ్రహ్మమునందు కల్పనా వృత్తిగా జనించుచున్నది. అట్టి ఈ మహానియతియే "మహాసత్త-మహాచిత్-మహాశక్తి-మహాదృష్టి-మహాక్రియ-మహోద్భావము-మహాస్పందము-మహాత్మరూపము" ... ఇత్యాది నామరూపములతో శాస్త్రములచే ఆయా విలక్షణములను అనుసరించి వ్యవహరించబడుతోంది. అట్టి మహానియతి యొక్క బలముచేతనే బ్రహ్మదేవుడు జగత్సమూహములను గడ్డిపరకలవలె పరివర్తన మొనర్చుచున్నాడు. దానిని అనుసరించే రాక్షసులు, దేవతలు, దైత్యులు, నాగులు ... మొదలైనవారు కల్పాంతము వరకు వ్యవస్థితులై ఉండటం జరుగుతోంది.

ఓ రామా! "బ్రహ్మ సత్త" యందు జగత్తు ఉంటే ఉండవచ్చు. లేక "జగత్తు లేదు" అని చెప్పబడవచ్చు. ఏది ఏమైనా, 'నియతి' మాత్రం ఎన్నటికీ మారజాలదు. అయితే, "బ్రహ్మము, నియతి, సృష్టి" .... ఈ మూడు ఒక్కటేగాని, వేరువేరు కాదు. తత్వజ్ఞులు దీనిని ఇట్లే గాంచుచున్నారు. అజ్ఞానులకు విషయం తెలియపర్చే ఉద్దేశంతోనే ఈ నియతికి, "సృష్టి" అనే పేరు పెట్టారు. అట్టి ఈ సృష్టి ఆదిమధ్యాంత రహితమైన బ్రహ్మమునందే నిలచియున్నది.

స్ఫటికము నందు ఎదురుగా ఉన్న వనం ప్రతిబింబించుచున్నదనుకో ... అట్లు ఆ వనం స్ఫటికము యొక్క స్వచ్ఛత వలననే ప్రకాశిస్తోంది కదా! 'మాయ'తో కూడుకొని ఉన్న 'బ్రహ్మము'

స్వరూపముగా గల 'సమష్టి సృష్టి సంకల్పుడు' .... (అతడే 'బ్రహ్మదేవుడు, హిరణ్యగర్భుడు, ప్రజాపతి' అని కూడా పిలువబడుచున్నాడు) .... తనయందున్న నియతిని గ్రహించి, దానికి తగినట్లే సృష్టిని ఒనర్చుచున్నాడు. ఇది "నిద్రించేవ్యక్తి యొక్క హృదయాకాశంలో స్వప్నము లభించటం" వంటిదేసుమా! దేహి యొక్క ఈ దేహమునందు "ఇవి చేతులు, ఇవి కాళ్ళు....." ఇట్లే వేరువేరు అవయవములు వేరువేరుగా చూడబడుచున్నాయి కదా! బ్రహ్మము కూడా 'హిరణ్యగర్భ భావము' పొంది, చైతన్యబలంచేత ఈ నియతి మొదలైన వ్యవహార సరళిని గాంచుచున్నది. తద్వారా, ఈ కనబడేదంతా తననుండి వేరుకాకున్నను, వేరైనట్లు గాంచుచున్నది.

ఆ మహానియతినే 'దైవము' అనికూడా అంటున్నాము. అదియే సర్వకాలములందు, సర్వ వస్తువులందు ప్రసరించి ఉంటోంది. విశుద్ధచైతన్య స్వరూపమగు "ఈశ్వర సంకల్పము" అనగా ఆ మహానియతియే. "ఇది ఇట్లు నిర్వర్తించబడుటచే కాలాను గుణంగా ఇట్లు అవశ్యము ఏర్పడును" అను నియమమునే పెద్దలు 'దైవము'గా వర్ణిస్తున్నారు.

'పురుషకారము' (effort) అను స్పందము, సర్వక్రియలు, వృక్షములు, జంతువులు, మానవులు, రాత్రింబవళ్ళు .. ఇదంతా ఆ నియతియే. అయితే ఆ నియతికి మూలం పురుష ప్రయత్నశీలత్వమే. పురుషప్రయత్న శీలత్వము వలన నియతి, నియతి వలన పురుష ప్రయత్నశీలత్వము .... ఒకదానిపై మరొకటి ఆధారపడి ప్రళయం వరకు అట్లే నిలచి ఉంటున్నాయి. మహాప్రళయానంతరం ఈ రెండూ ఏకమైపోతున్నాయి. అనగా, అవి రెండూ స్వస్థానమగు బ్రహ్మమునందు కలిసిపోతున్నాయి.

అయితే రాఘవా! నియతి – పురుషకారము* .... ఈ రెండూ పురుష ప్రయత్నము మీదే ఆధారపడి, అనుసరించి ఉంటున్నాయని మరల ప్రకటిస్తున్నాను. ఇన్ని మాటలు దేనికి? నీవు నన్ను "దైవ–పురుషకారము"ల గురించి ప్రశ్నించటం, నేను చెప్పటం. ఇదంతా కూడా పురుష – ప్రయత్నరూపమే. "ఈ పురుష ప్రయత్న వ్యవహారము కూడా నియతియొక్క విభవమే" అని నీవు తప్పక గ్రహించాలి.

"ఒక్కొక్కడు దైవపరాయణుడై 'దైవమే నన్ను నడుపును' అని తలచి నిష్క్రియుడై ఉండటం కూడా 'నియతి' యొక్క ప్రభావమే. నియతి యొక్క నిర్ణయం ప్రకారం 'పురుషుడేమీ చేయకుండుగాక' అని అయివుంటే, అప్పుడు ఏమైనా చెయ్యవలెననే బుద్ధిగాని, ఆ బుద్ధి వలన జరుగు కర్మగాని, ఆ కర్మ వలన ఏర్పడు ప్రయోజనములు గాని జరిగెడివి కావు. అందుచేత కల్పారంభం నుండి, ప్రళయము వరకు జరిగెడివన్నీ నియతివలననే జరుగుచున్నాయి". ... అని నియతివాదులు చెప్పుచున్నారు. అవశ్యము జరుగవలసి యున్న దానిని రుద్రుడు మొదలైన వారి బుద్ధి కూడా అతిక్రమించలేక పోతోందని వారి అభిప్రాయం.

---

* నియతి = An arrangement of cause and effect.
పురుషకారము = That which results because of efforts.

ఓ రామా! నియతి యొక్క ప్రభావము చెప్పుచున్న 'నియతి'వాదుల అభిప్రాయము అట్లే ఉండనిమ్ము. బుద్ధిమంతుడైనవాడు పురుషకారమును త్యజించి "నియతియే అంతా చేసుకుపోతుంది" .... అను నిర్లిప్తత్వమును ఆశ్రయించుకుండునుగాక! ఎందుకంటావా! నియతి పురుషకారముల రూపముననే కర్మలను నియమించుచున్నది. ఆయా కర్మలు ఆచరించినప్పుడే ఆయా ఫలితములు లభిస్తున్నాయి. వివిధ ప్రయోజనములు పురుష ప్రయత్నముల దృష్ట్యా వీక్షించబడకుండా, "ఈశ్వర సంకల్పము" అనబడు భావనచే దర్శించినప్పుడు, అద్దానిని "నియతి" అను పేరుతో పిలవటం జరుగుతోంది. అట్లుగాక సృష్టి-క్రియ ప్రయోజనముల దృష్ట్యా చూచినపుడు 'పురుషకారము' అని పిలుస్తున్నారు. ఈశ్వరసంకల్పము కూడా తుదకు పురుషకారము రూపమునే దాల్చి జీవుని సమీపిస్తోంది సుమా!

❖

"నేను నియతినే ఆశ్రయిస్తాను. జరుగవలసినదేదో జరుగుతుంది. నిష్క్రియుడనై ఉంటాను" అని పనిచేయటం మానివేసి చతికిలపడి కూర్చునేవాడు సాధించగలిగినదేమీ ఉండదు. అట్లని భోజనం, ఊపిరిపీల్చటం కూడా మానివేయగలుగుతాడా? "పురుషకారము ఆశ్రయించండి. అప్పుడే ఉత్తమ ప్రయోజనం పొందగలరు" అని మనం ఈ విధంగా పునరుద్ఘాటించుకుంటున్నాం. "ప్రయత్నము యొక్క తీవ్రతను అనుసరించే ప్రయోజనం ఉంటుంది" అనునట్టి సర్వదా సిద్ధించియేయున్న విధానమునే 'నియతి'గా జనులు గ్రహించెదరుగాక!

❖

"అసలు పురుషకారమే ముక్తి అని ఎందుకు అనాలి? ఒకడు సర్వకర్మలు త్యజించి, నిర్వికల్ప సమాధియందు వాయువును - మనస్సును నిరోధించి ముక్తిని పొందుచున్నాడు కదా! అందుచేత పురుషకారమును ప్రక్కకునెట్టి నియతివాదమునే స్వీకరించటం ఉచితం" అని కొందరు నియతివాదుల అభిప్రాయం. అయితే నిర్వికల్ప సమాధిని ఆశ్రయించటం, వాయువును నిరోధించటం ఇవి కూడా పురుషకారము వల్లనే సాధ్యపడుచున్నాయి కదా! పురుషకారం లేకుండా ఎక్కడైనా, ఎన్నడైనా, ఎవ్వరికైనా, ఏదైనా లభిస్తోందా? లేదు సుమా! అయితే ఒకానొకని వర్తమాన ప్రయత్నములను మనం చూడగలమేమో కాని, అతని ఇతఃపూర్వపు కర్మలను, వాటి ఫలితంగా వర్తమానంలో ప్రాప్తిస్తున్న ప్రయోజనములను మనం సమన్వయపరచలేము. అందుచేతనే "ఇతనికి ఇది అదృష్ట కారణంగా ప్రాప్తించింది. అతనికి అది ఎంత ప్రయత్నించినా దురదృష్టకారణంగా ప్రాప్తించలేదు" ఇత్యాది వాక్యముల సహాయం చేత 'అదృష్టము' అనబడుదానికి ఆరోపిస్తున్నాం. వాస్తవానికి నిశిత దృష్టితో పరిశీలించి చూచినప్పుడు, పురుషకారం లేకుండా ఏదైనా లభిస్తోందని నిరూపించటం అసాధ్యమే. అందుచేత, శాస్త్రవిధిని అనుసరించి "పురుషకారమును అవలంబించటం, అనగా, ప్రయత్నమును ఆశ్రయించటం" అనునదే పరమశ్రేయోదాయకమని మా అభిప్రాయం. సిద్ధి లభించిందా .... ఇక ఆపై అట్టి జీవుని కర్మలేవీ బంధించజాలవు. ఆ సిద్ధి యొక్క ఫలితమే నైష్కర్మ్య రూపమగు మోక్షము. ఎవడు 'తాను కర్మలకు, ఆ కర్మల ప్రయోజనములకు అతీతమైన

శుద్ధచైతన్యతత్త్వము అయివున్నాను', అని తెలుసుకుంటాడో అట్టి వానిని ఈ జన్మమృత్యువులు గాని, కర్మ–అకర్మలు గాని ఏమాత్రం నిర్దేశించలేవని గ్రహించు. "మోక్షస్థితి" అని చెప్పబడుచున్నట్టి అట్టి అంతరంగ – అవగాహన స్థితియే పరమశ్రేయోదాయకమైనది సుమా!

అయితే, కేవలం కర్మలు త్యజించినంతమాత్రంచేత ఏ ఒక్కరికి 'నైష్కర్మ్యసిద్ధి (కర్మరాహిత్య స్థితి)" ప్రాప్తించదు. మనస్సును ఇచ్ఛారహితంచేసినప్పుడే అది లభిస్తోంది. అది అట్లా ఉంచి, మేము సాధ్యము–సాధనము (achievement - process of achieving) లను బాగా పరిశీలించి చూచి, "కర్మలకంటే జ్ఞానమే ఉత్తమమైనది" అని కూడా ఇక్కడ ఒప్పుకొంటున్నాం.

❖

ఈ నియతి .... 'జ్ఞానుల నియతి' – 'అజ్ఞానుల నియతి' .... అనునట్టి రెండు విధములైన వ్యవహారశీలత్వము మనకు జగత్తులో లభిస్తోంది. "జ్ఞానుల నియతి" యందు దుఃఖరాహిత్యమే అంతిమ ప్రయోజనమగుచున్నది. దానివలన 'అవిద్య' (Ignorance) నాశనమైపోవుచున్నది. అట్టి నియతికి అనుకూలమైన పురుషప్రయత్నముచే 'పరమప్రాప్తి'యగు ఉత్తమ గతి లభిస్తోంది.

ఇక అజ్ఞానుల నియతి .... "ఇది ఇట్లు చేయుడు, ఫలితంగా ఈ దృశ్యమునకు సంబంధించిన ప్రాపంచిక లేక లౌకిక ప్రయోజనములు సిద్ధించగలవు" అను రూపము కలిగి ఉంటోంది. సంకల్ప – ప్రయత్నబలముల ననుసరించి ఆయా లౌకిక ప్రయోజనములు ఒనగూడుచున్నాయి. అయితే జీవుని సముద్ధరించగలిగినది బ్రహ్మజ్ఞాన మొక్కటే. నీటియొక్క ద్రవత్వమే కెరటములుగా, సుడులుగా, బుడగలుగా ప్రదర్శితములగు చున్నాయి కదా! బ్రహ్మమే నియతిరూపమున ప్రకాశించుచున్నది. బ్రహ్మమే సకల పురుషార్థముల సాధకము, సాధ్యము, సాధనము కూడా అయివున్నదని సూక్ష్మ ద్రష్టలగు ఆత్మజ్ఞానులు గ్రహించుచున్నారు.

❖❖❖

4. బ్రహ్మమే - ఇదంతా!

ఓ రఘురామా! ఆ బ్రహ్మతత్త్వమే సర్వకాలములందు, సర్వదేశములందు, సర్వశక్తి మంతమై వెలయుచున్నది. అంతేకాదు. సర్వుల ఆకారము అదియే. సర్వైశ్వర్యము, సర్వవ్యాపి, సర్వము కూడా అదే. ఆ బ్రహ్మమే ఆత్మ. అది సర్వశక్తిమంతమగుటచే, దాని ఇచ్ఛను అనుసరించి కొన్నిచోట్ల ప్రకటితం అవుతోంది. మరికొన్నిచోట్ల ప్రకటితం అగుటలేదు. కాని సర్వేసర్వత్రా ఆక్రమించియే ఉన్నది. ఎదురుగా దర్పణం ఉంటే నీ ప్రతిబింబము కనబడుతుంది. దర్పణం లేకపోతే ... ప్రతిబింబము కనబడదు కాని, ప్రతిబింబము అక్కడ వరకు ప్రసరించియే ఉన్నది కదా! ఉండియే ఉన్నది కదా! బుద్ధి ఉన్నచోట మనస్సు – ఉపాధి మొదలైన రూపములుగా కనబడుతోంది.

ఆ బ్రహ్మము సాత్విక ఉపాధులందు శాంతభావమును, రాజస ఉపాధులందు చలనశక్తిని, తామసిక ఉపాధులలో జడత్వమును ప్రకటించుచున్నది. ప్రళయ – సుషుప్తులందు ప్రకటనారహితంగా

ఉంటోంది. అది ఎచ్చట ఏ రూపమును ఎట్లు సంకల్పించుచుండునో, అచ్చట అట్టి రూపమునే అవలోకిస్తూ ఉంటుంది. దానిశక్తి ఎచ్చట ఏ రూపమున ఉదయిస్తుందో అచ్చట ఆ రూపముననే 'వివర్తము' చెందగలదు. అదియే నానా రూపములుగా వ్యవహృతమగుచు, వ్యవహారదృష్టికి విభిన్నములుగా అగుపించుచున్నది. కాని పరమార్థదృష్టికి ఈ జగత్తులో తోచుచున్నదంతా ఒక్కటే అయివున్నది కాని, వేరువేరు కాదు. బ్రహ్మమే ఇదంతా. ఈ "ఉపాధి-మనస్సు-బుద్ధి-జీవుడు - ఈశ్వరుడు" ... మొదలైన పేర్లు బుద్ధిమంతులచే లౌకిక వ్యవహారము కొరకు కల్పించబడ్డాయి. ఇంతమాత్రంచేత ఆత్మయందు ఎట్టి భేదమూ లేదు. "నీరు-అలలు-నదులు-సముద్రములు -కాలువలు-చెరువులు" .... ఇదంతా నామాదుల కల్పనయే కదా! అన్నిచోట్ల ఉన్నది జలమే కదా! ఒకే బ్రహ్మతత్త్వము త్రిమూర్తులు మొదలుకొని ఒక పురుగు వరకు సర్వేసర్వత్రా అంతర్యామిత్వము వహించియున్నది. ఆభరణములు అనేకం కావచ్చు. కాని బంగారం ఒక్కటే కదా! బ్రహ్మము, అది ప్రకటించుచున్న మనోబుద్ధ్యహంకారరూపములగు 'శక్తి' ఒక్కటే కాని వేరువేరు కాదు.

ఈ 'బుద్ధి'ని చూచావా? ఇది దేనిని ఎట్లు నిర్ణయించుకొంటోందో, అట్లే బాహ్యదృష్టి ఏర్పడటం, అట్లే అనుభవం కావటం జరుగుతోంది. బుద్ధి కూడా బ్రహ్మము యొక్క శక్తిస్వరూపమే కదా! ఈ బుద్ధి పరమార్థదృష్టిని పొందటం జరిగినప్పుడు మరుక్షణం సర్వే-సర్వత్రా ఆత్మనే దర్శించుచున్నది. అట్టి దర్శనముచే బుద్ధియందున్న దోషములన్నీ భస్మమైపోతున్నాయి. సర్వ సమత్వభావన, సమరసానుభూతి అనుభవమగుచున్నాయి. "బ్రాహ్మీస్థితి" అని చెప్పబడుచున్నది అదియే!

బ్రహ్మము సర్వాత్మకమైయున్నది. అందుచేత జ్ఞానులకు సర్వత్రా సమభావముగానే గోచరిస్తోంది. జ్ఞానము - అజ్ఞానము .... ఈ రెండిటికీ అది ఒకే రీతిగా సాక్షీభూతమై ఉంటోంది. ఒక క్షణంలో "నేను నిష్కళంక సాక్షీతత్వమును" అని గ్రహించినదై ఉంటోంది. మరొక క్షణంలో భ్రాంతికిలోనై ఎచ్చటనో, ఎద్దానినో గాంచుచున్నది. అభిలాష పూర్వకంగా రాగద్వేషములకు లోనై తనను తానే తిరస్కరిస్తోంది. అయితే "అట్టి దర్శనమంతా స్వప్నసదృశమే" అని జ్ఞానులు బోధించుచున్నారు.

ఈ చిత్తము ఎద్దానిని, ఎట్లు సంకల్పించుతోందో, ఎద్దానియందు "అభినివేశం (Desire to have)" పొందుతోందో, అద్దానిని అట్లే గాంచుచున్నది. కనుక, 'జగత్తు'గా నీకు ప్రాప్తించుచున్నదంతా చిత్తము యొక్క చమత్కారమే సుమా! అట్లు జగత్తుగా పొందటం "చిచ్ఛక్తి"యే అయివున్నది కదా! అందుచేత బ్రహ్మమొక్కటే సత్యము. తక్కినదంతా లేకయే ఉన్నది.

మరి "నేను జీవుడను అయివున్నాను కదా! నాకింక గతి ఏది?" అను నైరాశ్యం దేనికి? ఎవరికి? బలహీనత - స్వల్పత్వము త్యజించబడుగాక.

ఓ రామచంద్రా! నిదురలే! అజ్ఞానము త్యజించు. ఆత్మస్వరూపుడవై నిశ్చింతుడవై వెల్లివిరియుము!

❖❖❖

5. బ్రహ్మము - ద్వితీయ 'సత్త'

శ్రీ వసిష్ఠమహర్షి : "పరమాత్మ" ఎల్లప్పుడూ "నిర్మలము, స్వప్రకాశము, ఆనంద స్వరూపము, ఆద్యంతములు లేనిది, విశుద్ధము, సర్వగమము (అన్నివైపుల ప్రసరించి యున్నది)" అయివున్నది. అది ఏకాలమందు ఎట్టి మార్పు-చేర్పులు పొందటం లేదు. అట్టి పరమానందమయమగు పరమాత్మ నుండి తటాక జలంలో మొట్టమొదటి పెద్ద కెరటము ఉత్పన్నమైనట్లు, ప్రథమచిత్తయుతుడగు 'బ్రహ్మదేవుడు' ఉత్పన్నమగు చున్నాడు. "నేను సమష్టిసృష్టి స్వరూపుడను" అను చిత్తము యొక్క స్వభావమే అతని శరీరము. శాస్త్రములచే 'హిరణ్యగర్భుడు' అని చెప్పబడుచున్న 'ప్రథమ జీవతత్వము' నుండి ఇక ఈ మిగతా జగత్తు అంతా వచ్చిపడుతోంది.

శ్రీరాముడు : హే మహర్షీ! బ్రహ్మము అపరిచ్ఛిన్నము, అద్వితీయము, స్వప్రకాశకము, అఖండము కదా! ఇక ఈ జీవుని చూచారా? ఇతడు పరిచ్ఛిన్నుడు. "రెండవది కలదు. నాకన్నా 'ఇది' వేరు" అనునట్టి ద్వితీయత్వమును అనుభవిస్తున్నాడు. "నేను పరిమితుడను. ఆధారపడిఉన్నవాడను" అను భావనోద్వేగమును పొందుచున్నాడు.

నా సందేహమేమిటో వినండి.

అట్టి బ్రహ్మము నుండి, అందుకు వ్యతిరిక్తములైన గుణములు గల ఈ 'జీవునిసత్త' ఎట్లు బయల్వెడలుతోంది? లేక, బ్రహ్మము ఈ 'జీవసత్త' అనబడు పరిమితానుభవం ఎట్లా పొందటం జరుగుతోంది? ఈ జగత్తులు ఎక్కడి నుండి ఉత్పన్నమౌతున్నాయి?

ఈ విషయం నేను గ్రహించలేకపోతున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి : అట్టి బ్రహ్మము నందు 'మిథ్య' అయినట్టి ద్వైతభావము అకారణం గానే కలుగుచున్నది. పెద్ద-చిన్న తరంగములు సముద్రజలంలో లేస్తాయి చూచావా? అట్లాగే "నేను సమష్టిజీవుడను. నేను వ్యష్టిజీవుడను" అనునట్టి పెద్ద-చిన్న తరంగ రూపకల్పనలు బ్రహ్మము నందు కలుగుచున్నాయి.

అయితే, బ్రహ్మము ఏనాడూ 'జీవుడు' అగుటలేదు. "మరి మాకు జీవుడు కనిపిస్తున్నాడు కదా?" అంటావా? అట్లా తోచటం అవిద్యాసంస్కారము చేతనే సుమా! మట్టితో బొమ్మను తయారుచేశామనుకో .... మట్టి తన ఆకారమును పోగొట్టుకుంటోందా? అసలు మట్టికి ఆకారమంటూ ఏదైనా ఉన్నదా? మరి బొమ్మకు ఆకారం ఉన్నది కదా? బొమ్మకు ఆకారం మట్టిలోంచే వచ్చింది కదా! అట్లే బ్రహ్మము కూడా సర్వదా నిర్మలము, సర్వవ్యాపి అయివుండి కూడా, "జీవుడు" అనబడు ఒకానొక సంకుచితత్వము తనయందు ఆపాదించుకుంటోంది. కాని బ్రహ్మమునందు "జీవుడు అగుట" అను స్వభావం లేదు. ఈ జీవుడు బ్రహ్మమే అయివున్నాడు కాని, మరింకేమీ కాదు.

మరి ఈ స్వల్పత్వాదులు ఎక్కడి నుండి వస్తున్నాయంటావా? "ఆత్మ దర్శనము" అను విషయంలో కొంత భ్రమ, అసామర్థ్యము, అవిచారణ స్వయముగా కారణరహితంగా ఆత్మయందు ఏర్పడుచున్నాయి.

ఫలితంగా "విశాలచిదాకాశమే" అత్యంత భీషణమై తోచుచున్నది. కాని అదే చిదాకాశము జ్ఞానులకు మాత్రం ఆనందమయము, శాశ్వతము, ప్రశాంతము, ఉద్వేగరహితముగా తెలియవచ్చుచున్నది. అట్టి చిదాకాశము ఉపాధి రహితము, పరిపూర్ణము, సత్వమయము అగుటచేత, పండితులు కూడా అద్దానిని "ఇది" అని నిర్దేశించలేకపోతున్నారు. ఆ బ్రహ్మమునే .... "శాంతిమయమగు పరమపదము" అని శాస్త్రములు నిర్వచిస్తున్నాయి. అదే పరమాత్మయొక్క ఆద్య స్వరూపము. ఓ రామా! నీవుగాని, నేనుగాని, మరెవరుగాని ఏ క్షణములో కూడా అద్దాని నుండి వేరైన వారము కాదు. దానిని గ్రహించుటయే జ్ఞానము. "అది వేరు, నేను వేరు. నేను అద్దానిని పొందవలసియున్నది" ... అనునట్టి స్థితి 'బ్రాహ్మీస్థితి కాదు" అని గ్రహించు. "అద్దాని నుండి నేను వేరు" – అను భావమును జయించి అనిర్వచనీయమైన స్థితి పొందియుండుము. లేదా, అట్టి ప్రయత్నమునే ఆశ్రయించుము.

❖

ఆ బ్రహ్మమే ఒకానొకప్పుడు ఉపాధితో కూడినదై, సంవిదాత్మకమై (సత్ = Entity experience విత్ = knowing experience) ప్రాణములను ధరించుచున్నది. అప్పుడు, "నేను ప్రాణతత్వమును, లేక నాకు ప్రాణములు ప్రియమైనవి" అని భావిస్తోంది. అట్టి భావము తొలగి, ముక్తి లభించేంత వరకు ఆ సంవిత్తు "జీవుడు" అని పిలువబడుతోంది. కనుక జీవుడు అనునది బ్రహ్మము యొక్క ద్వితీయ రూపమని, 'మరొక ప్రస్ఫుటము' (another manifestation) అని అనవచ్చు.

శ్రీరాముడు : స్వామీ! బ్రహ్మమునకు నామరూపములే లేనప్పుడు, ఇక 'జీవుడు' అనబడు ద్వితీయరూపమేమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి : నిజమే. అయితే, 'జీవుడు' అని మనం పిలుస్తున్న తత్వమునకు మాత్రం నామరూపములు ఎక్కడ ఉన్నాయి? జీవుడు ప్రజ్ఞాతత్వమే కాని కాళ్ళు–చేతులు కాదుకదా! ఇక నామరూపాదులు ఆపాదించటం, దర్శించటం భ్రమాత్మకమగు అవగాహన వలననే ఏర్పడుచున్నాయి. బ్రహ్మము ఎట్లు వాక్కునకు అందనిదై అనిర్వచనీయమైయున్నదో, ఈ జీవుని విషయము కూడా అట్టిదే. ఈ జీవుడు కూడా వాక్కుకు అందనివాడు, అనిర్వచనీయుడు. వాస్తవానికి ఈ జీవునకు, బ్రహ్మమునకు భేదం వట్టి కల్పన మాత్రమే. అయితే అశాంతితో నిండియున్న ఈ జనుల అవగాహనను చూచినప్పుడు సత్యద్రష్టలమగు మా హృదయం ఆర్ద్రతతో నిండిపోతోంది. అందుచేతనే "ఇది సత్యము – ఇది భ్రమ" అని బోధించుటకు ఉపక్రమిస్తున్నాం. అందుకు అనువుగా "జీవుడు" "బుద్ధి" "మనస్సు" "నేను" "నీవు" "జగత్తు" అను పదజాలం ఉపయోగిస్తున్నాం. "ఈ జీవుడే పూర్ణమగు బ్రహ్మమైయున్నాడు. కనుక సర్వసందేహములను, వివాదములను, స్వప్నతుల్యములను త్యజించి నిశ్చింతులై పూర్ణభావము వహించి ఉండండి." అని నిరూపిస్తున్నాం. ఫలితంగా అనేకమంది విచారణపరులు విచారణ–విమర్శ–విశ్వాసములను సమన్వయించుకొని, ప్రయత్నశీలురై పూర్ణానందమయులగుచున్నారు. ఇదంతా బ్రహ్మముయొక్క చమత్కారము, కల్పనా చాతుర్యమే కాని మరింకేమీ కాదు.

చిదాకాశరూపమగు పరబ్రహ్మమున అసంఖ్యాకములు, అనుభవాత్మకములు అగు జగత్తులు ప్రతిబింబిస్తున్నాయి. అయితే ఏది ప్రతిబింబించినా, ప్రతిబింబించక పోయినా దర్పణములో మార్పు చేర్పులేమి ఉంటాయి? ఏమీ ఉండవు కదా! అట్లే చిదాత్మ విషయం కూడా! వాయువు ప్రసరించనప్పుడు సముద్రం ప్రశాంతంగా ఉంటుంది. వాయువు ప్రసరించినప్పుడో .... జలమంతా అనేక తరంగాలతో కల్లోలమై ఉంటుంది. కాని సముద్రజలం 'జలం'గానే ఉభయస్థితులందు ఉంటోంది.

నిశ్చలజలంలో వేయబడ్డ గులకరాయివలె .... చిత్తచాంచల్యము కలిగినప్పుడు, మనోవృత్తులతో కూడిన జీవసత్తనే 'జీవుడు' అని అంటున్నాం. నిర్మలమగు బ్రహ్మ వస్తువునందు ప్రాణస్పందము అధ్యారోపితమైనప్పుడు.... జలం కనిపించకుండా తరంగం కనిపిస్తున్నట్లు ..... బంగారం తోచకుండా ఆభరణమే తోచునట్లు ..... ఆ బ్రహ్మవస్తువునందు గల "నిష్క్రియత్వము" కనిపించకుండా ఉన్నది. అప్పుడు పరిచ్ఛిన్నానుభవంతో కూడిన 'అహంభావం' యొక్క స్ఫురణ ఏర్పడుతోంది. అట్టి స్ఫురణయే జీవుడుగా నిర్వచించబడుతోంది.

నిప్పులో 'వేడి' ఉన్నట్లు, మంచులో 'చల్లదనము' ఉంటున్నట్లు .... బ్రహ్మము నందు చాంచల్య స్వరూపమగు జీవభావము కూడా, ముక్తి లభించనంతవరకు, ఉండి ఉంటోంది.

చిద్రూపమగు ఆ ఆత్మతత్త్వమునందు స్వభావవశంచేత కలుగు పరిచ్ఛిన్నత్వమే ఈ జీవుడు. బ్రహ్మము యొక్క 'పరిచ్ఛిన్నత్వము' లేక జీవభావము మొదలైనదంతా దృఢమగు వాసనాబలం చేత క్రమంగా అహంభావ రూపమును దిద్దుకొనుచున్నది.

❖

ఓ రామచంద్రా! అటు ఆకాశంవైపు చూడు. అక్కడ నీకు 'నీలిరంగు' కనబడుతోంది కదా! ఆ వర్ణము ఎక్కడ ఉన్నది? అసలు ఉన్నదా? లేదు. అయినను కనిపించుచున్నది. ఈ అహంభావము జీవునియందు "ఇక్కడ ఇట్లు ఉన్నది" అని గుర్తించుటకు వీలుగా లభించటం లేదు. కాని, అనుభవం అవుతోంది. ఆత్మదర్శనం కాకపోయినట్టి కారణంచేత 'చిత్‌చైతన్యము' తననుతాను అహంభావముచే కుదించబడినదానివలె గాంచుచున్నది. ఈ జీవుడు పూర్వసంకల్ప సంస్కారములచే ప్రబోధితుడై, అట్టి అధ్యాసవలన 'అహంభావము' అను అనుభవం పొందుచున్నాడు. ఆ అహంభావమే స్వసంకల్పబలం చేత పరిచ్ఛిన్నమై "దేశము – కాలము – దేహము" మొదలైన భావావేశములకు లోనగుచున్నది. ఈ దేహాది ఆకారములను దాల్చుచున్నది. వాయుస్పందమువలె స్ఫురించుచు. "స్వసంకల్పించటం" అను స్వభావంచేత "చిత్తము, జీవుడు, మనస్సు, మాయ – ప్రకృతి" అనే పేర్లతో పేర్కొనబడుతోంది. సంకల్పాత్మకమైనట్టి ఈ చిత్తమే 'హిరణ్యగర్భుడు' అగుచున్నది. అదే సంకల్పబలంచేత పంచభూతములను, వాటి స్వభావములైనట్టి పంచతన్మాత్రలను కల్పించుచున్నది. చూచావా, రామా! ఈ విధంగా ఆ బ్రహ్మము చేతనాత్మకమగు "పూర్వావస్థ" నుండి చ్యుతిపొంది జడమగు పంచతన్మాత్రలుగా మారుచున్నది.

పంచభూతములు	**పంచ తన్మాత్రలు**
ఆకాశతత్త్వము నుండి	శబ్దతత్త్వము
వాయుతత్త్వము నుండి	స్పర్శతత్త్వము
తేజోతత్త్వము నుండి	రూపతత్త్వము
జలతత్త్వము నుండి	రసతత్త్వము
భూతత్త్వము నుండి	గంధతత్త్వము

"పంచతన్మాత్రభావము" (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ భావన లేక సంస్కారము) పొందినట్టి ఇతఃపూర్వపు శుద్ధ చిత్తము ఆకాశంలోని నక్షత్రంలాగా తేజఃకణంగా మారుచున్నది. బీజము, అంకురిస్తుంది చూచావా? నీరు గడ్డకట్టి ఆయా రూపములను పొందుచున్నట్లు ఆ తేజఃకణము, తనయందు బ్రహ్మము ప్రకాశించుచుండగా, అండత్వము పొందుతోంది. 'దివ్యదేహకల్పన' ఆశ్రయించి దివ్య దేహమును పొందుచున్నది. అహంభావ శూన్యమైన పదార్థములందు అహంభావమును పొందుతోంది. ఇక ఆయా లోకములన్నిటియందు సంచరిస్తోంది. కొన్నిటియందు స్థావర భావమును, మరికొన్నిటియందు జంగమభావమును, ఇంకొన్నిటియందు ఖేచరత్వమును (ఆకాశ సంచారభావనను) స్వసంకల్పమహిమచేత పొందుచున్నది.

❖

సృష్టికి పూర్వం "పంచతన్మాత్ర సంకల్పము" నుండి ఉదయించినట్టి జీవదేహమే క్రమంగా బ్రహ్మదేవుని పదమును పొందుచున్నాడు. అట్లు పొంది, సమష్టి-జీవభావముచే అతడు ఈ జగత్తును నిర్మించుచున్నాడు. స్వయంభువు అయిన సమష్టి సృష్ట్యానుభవి, స్వభావవశంచేత తాను సంకల్పించి దర్శించుదానిని తానే "ఆహాఁ! ఇది ఎక్కడినుండో ఉత్పన్నమైనది కదా" అని భావిస్తున్నాడు. అట్లే అనుభవం కూడా పొందుచున్నాడు. అయినప్పటికీ, అతడు చిత్స్వభావుడే అయివున్నాడు కదా! అందుచేత అన్నిటికీ కారణము, స్థానము అయివున్నట్టి బ్రహ్మభావమును త్యజించివేయటం లేదు సుమా! అట్లు త్యజించకుండానే 'జగత్తు'కు కారణమైన కర్మలను నిర్మించుచున్నాడు. జలము తన జలస్వభావం త్యజించకుండానే తనయందు "తరంగములు" అనబడు ఆకార వికారమును ప్రకటిస్తోంది కదా! 'చిత్తు' నుండి స్వాభావికంగానే 'చిత్తము' ఉదయించు చున్నది. తరంగములు వేరైన క్రియ - రూప - నామము కలిగియున్నప్పటికీ, విచారించి చూచినపుడు, చేతితో స్పృశించినప్పుడు జలంగానే అగుచున్నది కదా! అట్లే జగత్కారణమగు కర్మలు 'జలములోని నురుగు యొక్క తెలుపు'వలె భ్రమాత్మకములు గానే ఉండి ఉంటున్నాయి. ఎందుకంటావా? వాస్తవానికి 'చిత్' అనునది ఈ జగత్తుల చేత గాని, జన్మలచేత గాని, కర్మలచేతగాని, మరింకెద్దాని చేతనైనాగాని, 'బద్ధము' అగునది కాదు. అయినప్పటికీ, భ్రమచే "నేను పరిమితాచరణ పరుడను" అను స్వప్న సదృశభావన మాత్రం పొందుతోంది. ఈ జీవుడు సర్వదా చిత్స్వరూపుడే సుమా! అట్లే సమష్టిరూపుడగు హిరణ్యగర్భుడు కూడా!

❖

ఒకడు తన అంతరంగమున, లేక మనస్సు నందు సంకల్పించి, అట్టి సంకల్పాను సారంగానే ఈ జగత్తును దర్శిస్తున్నాడు. అనగా, సంకల్పములు ఉదయించటానికి ముందే మనస్సు ఉన్నది. మనస్సు ఉదయించటానికి ముందే 'జీవుడు' ఉన్నాడు. మొట్టమొదట అతడు నిష్క్రియుడైయున్నాడు. ఆ తరువాత సంకల్పించి కర్మలను ఒనర్చుచున్నాడు. ఒక విత్తనములో "అంకురము మొలుచుట" అను సూక్ష్మభావమున ఉత్పన్నమై పెరిగి, క్రమంగా "ఆకులు–కాండము–శాఖలు–ఫలములు –పుష్పములు" .... మొదలైన రూపములుగా మారుచుండుట చూచావు కదా!

అట్లే హిరణ్యగర్భునియందు ఇంతకుముందే 'సంకల్పము' రూపమున ఉండిన జీవులు ఇట్లు నానారూపములుగా ప్రకాశము నొందుచున్నారు. అదే సమయమున "ఈ జీవులు పూర్వకల్పములలో తాము ఒనరించిన కర్మలను అనుసరించి, తదనుగుణములైన శరీరములను ఇందు పొందుచున్నారు" అనునది కూడా ఇక్కడ సహేతుకమే అగుచున్నది. ఆ తరువాత వారు జనన–మరణ కారణమగు తమ కర్మలను అనుసరించి స్వర్గ–నరకాదులను పొందుచున్నారు. అయితే "కర్మ" అనునది కూడా చిత్‌స్పందమేకాని వేరేమీ కాదు. అట్టి చిత్‌స్పందమే లేక సంకల్పచమత్కారమే "దైవము–చిత్తము–కర్మ –శుభము–అశుభము" ..... కూడా అయివున్నది.

చెట్టునుండి పూలు–కాయలు ఉత్పన్నమగుచున్నట్లు ఆదికారణమగు 'చిత్‌స్పందము' నుండే ఈ జగత్తులు మరల–మరల ఉద్భవిస్తున్నాయి. మరల మరల లయిస్తున్నాయి. జగత్కారకుడగు ఆత్మభగవానుడు మాత్రం నిశ్చింతుడై యథాతథంగా ఉండి ఉంటున్నాడు.

❖❖❖

6. మనస్సు - జీవుడు - బ్రహ్మము

శ్రీ వసిష్ఠమహర్షి : ఆ పరమకారణమగు బ్రహ్మము నుండి మొట్టమొదట 'మనస్సు' ఉదయిస్తోంది. కనుక ప్రతి అనుభవమునకు వస్తున్న వస్తువు మనోమయమే సుమా! ఈ దృశ్యపదార్థముల వ్యవస్థితి అంతా మనస్సునే ఆశ్రయించుకొని ఉన్నది. అయితే, ఈ 'మనస్సు' కూడా స్వకారణము అయినట్టి 'పరబ్రహ్మము' కంటే వేరైనది ఏమాత్రం కాదు.

ఈ మనస్సు తరంగమువలె 'అటు–ఇటు' మారుతూ తాను ఆశ్రయిస్తున్న వస్తు జాలముల మార్పు–చేర్పులను తనయందు, అనుభవరూపంగా పొందుతూ ఉంటోంది. ప్రపంచంలో ఉన్న భేదములన్నీ మనస్సుచే కల్పించబడుచున్నవి మాత్రమే సుమా! ఈ మనస్సే నాశనమైతే ఇక ఈ "సుఖ–దుఃఖ–అధిక–అల్ప" .... భేదభావములు తొలగిపోతాయి. అప్పుడు ఆ "సద్వస్తువు" ఒక్కటి మాత్రమే ప్రతిష్ఠించబడగలదు. మనస్సు లయమైతే ఆత్మ ఒక్కటే శేషిస్తోంది. ఇక .... "సమష్టి స్వరూపజీవుడగు హిరణ్యగర్భుడు (బ్రహ్మ)–జీవుడు–మనస్సు–మాయ–కర్త–జగత్తు" మొదలైన భేదములు తొలగుతాయి. ఈ కనబడేదంతా అప్పుడు "ఆత్మజ్ఞానము" అను జలముతో కూడిన చిత్‌సముద్రమై వెలయుచున్నది.

ఈ "జగత్తు – చిత్తము" .... అనునవి ఒకానొకప్పుడు ఉంటున్నాయి. మరొకప్పుడు లేనివి అగుచున్నాయి. అనగా, "అవి అనిత్యములే" అని అనక తప్పదు కదా! అందుచేత అవి "అసత్తు" అని చెప్పబడుచున్నాయి. ఒక్క అజ్ఞానులకే ఈ "జగత్తు – చిత్తము" అనబడునవి సంకుచిత దృష్టి వలన సత్యమువలె ప్రతిభాసించుచున్నాయి. వారిపట్లనే అవి సత్త కలిగి ఉంటున్నాయి.

సదసదాత్మకము

వ్యవహారదృష్టితో చూచినప్పుడు కూడా ఈ జగత్తు "సదసదాత్మకము" (ఉన్నది–లేదు) అని తెలియవస్తోంది. ఎట్లాంటావా? విను. ఒక మనస్సు "ఇది ఉన్నది" అను విధంగా సంకల్పించు చున్నప్పుడు అది అట్లే ఉంటోంది. ప్రాప్తిస్తోంది కూడా. "ఎక్కడ ఉన్నది? లేదు కదా?" అని తలచినప్పుడు ఈ జగత్తు లేకయే పోతోంది. అందుచేతనే పెద్దలు దీనిని "సదసదాత్మకము" అని చమత్కారంగా పిలుస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ పారమార్థికదృష్టియందు "చిత్తము", "జగత్తు" ... ఈ రెండూ కూడా స్వప్నములోని అనుభవంలాగా అలీకములు (ప్రతిబింబమాత్రములు) మాత్రమే. ఇందులో సందేహమంటూ ఏదీ లేదు. జ్ఞానముచే ఈ చిత్తము సంస్కరించబడనంత వరకు ఈ 'జగత్తు' యొక్క అనుభవం సత్యముగానే ప్రాప్తిస్తూ పోతుంది. ఎప్పుడైతే చిత్తమునందు ఉత్తమజ్ఞానము జాగృతమౌతోందో .... ఇక ఆ క్షణము నుండి ఈ జగత్తు, ఇందలి పదార్థముల అనుభవం .... ఇదంతా "మిథ్య"గానే తెలియవచ్చుచున్నది. అందుచేతనే 'చిత్తము ఈ జగత్తును గాంచటం' అనునది ఒకవిధంగా సత్యము, మరొక విధంగా అసత్యము కూడా అయిఉంటోంది.

ఓ రామచంద్రా! అంతటికీ కారణం మనస్సేనయ్యా! మనస్సే వ్యర్థంగా ఈ సంసార స్వప్నమును గాంచుచున్నది.

భ్రాంతిచే విచలితుడైయున్న బాటసారి చీకట్లో కొంచెము దూరములో గల కొండరాయిని చూచి "ఇది క్రూరమృగమో, కసాయిదొంగో కాదు కదా?" అని బెంబేలు పడతాడు చూచావా? అట్లాగే ఆత్మజ్ఞానహీనమైన ఆ మనస్సు పరమాత్మయందు మిథ్యా మాత్రమగు ఈ జగత్తును గాంచుచున్నది. అజ్ఞానబాలుడు చీకట్లోకి చూచి "అదిగో, అక్కడ బూచి ఉన్నది. అది వచ్చి నాపై పడదు కదా?" అని గజగజ వణుకుచున్నాడనుకో .... అందుకు కారణమేమిటో చెప్పు? తన చిత్తమునందు కలిగిన భయమునకు కారణమైనట్టి ఆ 'బూచి' అనబడునది అక్కడ వాస్తవంగా ఉన్నదో, లేదో సమగ్రంగా విచారించకపోవుటయే కారణం" అని మాకు అనిపించుచున్నది. ఆహాఁ! ఆత్మభావము నుండి 'చ్యుతి' నొందినట్టి ఈ చిత్తము మరల తన ఉనికి స్థానమై ఉన్నట్టి ఆత్మ తత్త్వమును విచారించకయే ఉంటోంది. అట్లు విచారించనంతకాలం, "జగత్తులు–జన్మలు–కష్టములు–సుఖములు–అస్మదీయులు–ఇతరులు" ... అనునట్టి భ్రమలను పొందుతూనే ఉంటుంది.

ఆత్మ అవ్యక్తము, సర్వశాంతి స్వరూపము అయివున్నది. అట్టి ఆత్మయొక్క "సృజనేచ్ఛ" నుండే చిత్తము జనిస్తోంది. లేదా, ఆ సృజనేచ్ఛ (desire to project)నే 'చిత్తము' అని పిలుస్తున్నాం.

సృజనేచ్ఛ → చిత్తము → జీవత్వము → అహంకారము

అహంకారము → "విషయతన్మాత్ర" (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములకు సంబంధించిన ఆవేశము) → ఇంద్రియములు → దేహములు

దేహములు → శోక-మోహములు → స్వర్గ-నరకములు → బంధ-మోక్షములు

ఆత్మస్వరూపుడే అయివుండి కూడా తనను తానే మరచి ఉంటున్న జీవుడు అంతు లేకుండా అనేక దేహపరంపరలు, వాటి నుండి స్వర్గ నరకములు, బంధమోక్షములు అనుభవమౌతున్నాయి. బీజం నుండి వృక్షం - వృక్షం నుండి బీజం అంతులేకుండా వస్తున్నట్లు, జన్మల నుండి కర్మలు, కర్మల నుండి జన్మలు .... ఈ విధంగా ఒకానొక పరంపర అంతు లేకుండా సాగిపోతోంది.

అయితే రామా! ఏది ఎట్లాగైనా కావచ్చు గాక! ఆత్మ సర్వదా నిష్కళంకమే. అది జన్మించుట లేదు. దానికి దేహములు లేవు. జననమరణములు లేవు. ఈ జన్మలు, మరణాదులు, అనగా, ... "ఇప్పుడు నేను జీవిస్తున్నాను. మరొకప్పుడు జీవించను" .... మొదలైనదంతా మనస్సే అనుభవిస్తోంది. ఒక గదిలో వెలుగుచున్న దీపపు కాంతిలో ఒక బాలుడు చదువుకొనుచున్నాడనుకో ... ఆ చదువబడుచున్న విషయమునకు, దీపమునకు సంబంధం లేదుకదా! దీపపు వెలుగు లేనిదే అతడు చదువగలడా? లేదు. ఆత్మకూడా, నిష్క్రియమై, సర్వమునకు సాక్షియై, సర్వమునకు కారణమై, అకర్త అయి ఉంటోంది. ఇట్లు ఆత్మ ఎన్నడు తన స్వచ్ఛతను కోల్పోవుటలేదు. ఈ దేహమునకు 'కర్మలు' కాకుండా వేరే "సత్త" లేదు. అందుచేత కర్మలే చిత్తము. చిత్తమే అహంభావ సమన్వితమగు ఈ జీవుని రూపము. చిత్తము కాకుండా జీవునకు వేరే రూపమేమి ఉన్నది? ఆ జీవుడే బ్రహ్మము. బ్రహ్మమే శుద్ధచైతన్య దృష్టిలో ఆత్మతత్త్వముగా, మననాదుల ద్వారా 'జీవుడు'గా వ్యవహార నామములు పొందుచున్నదని గ్రహించ బడుగాక!

❖❖❖

7. దృశ్యాభిలాష

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఒక దీపం నుండి లక్షలాది దీపములు వెలిగించ వచ్చు కదా! ఒకే పరమాత్మ ఈ నానావిధరూపములుగా వెలుగొందుచున్నాడు. అయితే, విచారపూర్వకమైన దృష్టికి మాత్రమే బ్రహ్మము యొక్క యథార్థరూపం గోచరించటం జరుగుతోంది.

ఓ జనులారా! మీరు 'పరమాత్మజ్ఞానము' పొందటానికి సంసిద్ధులు కండి. పరమాత్మ జ్ఞానము లభించినపుడు, "ఈ చిత్తముయొక్క జీవకల్పన, దృశ్యసంగము, తత్ఫలితంగా ప్రాప్తిస్తున్న బంధము

.... ఇదంతా మిథ్యాకథనమే" అని బోధపడగలదు. అప్పుడు స్వతఃసిద్ధమైయున్నట్టి 'మోక్షము' యొక్క అనుభవం ప్రాప్తించుచున్నది. అనగా, "భ్రమ–శోకము–మోహము–సంకుచిత్వము–నైరాశ్యము –భయము–ఉద్వేగము" .... మొదలైన స్వకల్పిత దోషములు తొలగిపోతున్నాయి.

చిత్తమే "నేను జీవుడను" అను రూపముగల జీవస్వభావం తనపై ఆపాదించుకొంటోందని విచారణ చేయబడుగాక! విచారణ చేసినంతమాత్రంచేత ఈ చిత్తము, దానిచే ఆరోపించబడి, అనుభవించబడుచున్న ఈ దృశ్యప్రపంచము తమంతటతామే స్వయముగా తొలగిపోతాయి. సత్యమేదో ఎరిగిన తరువాత అసత్యమును దర్శించు చున్నప్పటి భావనలు, ఉద్వేగాలు ఏమౌతున్నాయి? ఈ చిత్తము–ప్రపంచముల విషయం కూడా అంతే. ఇక ఇంతమాత్రం ప్రయత్నంచేసి, విచారణశీలురు అగుటకు సిద్ధంకాకుంటే, అట్టివారిని ఎవరు రక్షించగలరు? మూర్ఖుడు తనకు శుభం కలుగచేయ యత్నించువాని వాక్యములలో స్వార్థమును, మోసమును, గాంచునట్లు, అజ్ఞానియే పరమాత్మకు అజ్ఞానమును ఆపాదించుచున్నాడు. అజ్ఞానమే ప్రపంచము రూపమున అగుపించుచున్నది. అజ్ఞాన దృష్టినే "సంసారము" అని అంటున్నాం.

❖

ఓ ప్రియరఘురామా! మరల–మరల చెప్పుచున్నాను. భ్రాంతికి లోనైన చిత్తమే ఈ జనన–మరణములను, బాల్య–యౌవన–వార్ధక్యములను, స్వర్గ–నరకములను గాంచుచు నృత్యం చేస్తోంది. సురాపానం చేసినవానికి శూన్యాకాశంలో కెరటములు, వృత్తములు, కేశములు, రూపములు కనిపిస్తూ ఉంటాయి చూచావా? అజ్ఞానముతో కూడిన చిత్తము ఈ జీవునిచే అసంఖ్యాకములైన బ్రహ్మాండములను తిలకింప చేస్తోంది. "తిమిరరోగము" అను దోషముతో కూడిన కళ్ళు కలవానికి ఆకాశంలో ఇద్దరు చంద్రులు కనిపిస్తారు. 'చిత్తరోగము'చే పీడింపబడుచున్న ఈ జీవుడు కూడా పరమాత్మయందు ద్వైతభ్రాంతిని గాంచుచున్నాడు. నల్లమందు మ్రింగినవాడు స్థావరములైనట్టి వృక్షాలు గాలిలోకి లేచి నృత్యం చేస్తున్నట్లు చూస్తున్నాడు. చిత్తవిమోహితుడైన ఈ జీవుడు కూడా నిశ్చలమగు ఆత్మయందు సంసారమును గాంచుచున్నాడు. బాలుడు గుండ్రంగా తిరిగే యంత్రం ఎక్కి .... "అహో! చూచారా? ఈ ఇళ్ళు, నేల, చెరువులు, కొండలు ... అన్నీ గుండ్రములుగా తిరుగుచున్నాయి కదా" అని కేకలు వేయునట్లు, చిత్తముయొక్క అనుక్షణ పరివర్తనము వలననే ఈ ఈ దృశ్యములన్నీ ఇట్లు అత్యంత అనేకత్వముతో కూడుకొని చిత్రాతి చిత్రంగా అగుపిస్తున్నాయి. చిత్తము ద్వైతభ్రాంతి పొందినప్పుడు మాత్రమే ఈ ద్వైతభ్రమ అంతా కలుగుతోంది. ద్వైతానుభూతి నశిస్తే అప్పుడు ద్వైత ప్రపంచము నశించిపోవుచున్నది. "అనగా, లేనిదే అగుచున్నది". ఒక్క పరమవస్తువు మాత్రమే ప్రతిష్ఠింపబడుచున్నది.

❖

కట్టెలు తొలగిస్తూపోతే నిప్పు ఆరకేం చేస్తుంది? "ఆత్మ తత్త్వవిచారణ" చేత, తదనుకూలమైన అభ్యాసంచేత ఈ "విషయదర్శనము" అనే అగ్ని తొలగిపోతుంది. అప్పుడు చిత్తముకూడా

తొలగిపోతుంది. "ఇదంతా, ఆత్మయే. వీరంతా ఆత్మ స్వరూపులే" అని చిత్తమును అభ్యసింపచేయాలి. చిత్తము కంటే వేరుగా ఇంద్రియ విషయములు గాని, మరింకేది గాని లేవు. అందుచేత, ఓ జనులారా! ఆత్మవిషయమై జ్ఞానమును, అజ్ఞానమును వేరుపరచగల క్రియా విశేషములను అభ్యసించండి. చిత్తము యొక్క "విషయములను దర్శించటం - ఆశ్రయించటం" అనే దుర్వ్యసనములను లుప్తం చెయ్యండి. అట్టి అభ్యాసంచేత జీవుడు "ఇది నేను. ఇది నేను కాదు" అను రూపముగల ఉత్తమజ్ఞానం పొందగలడు. అప్పుడు కర్మలను ఆచరించుచున్నను, లేక త్యజించు చున్నను .... అతడు "ముక్తుడు" అనియే చెప్పబడుచున్నాడు.

వత్సా! రాఘవా! కొద్దిగా కల్లుత్రాగితే కొంచెము కైపు కలుగుతుంది. అప్పుడు బుద్ధి కొంత చంచలమౌతుంది. అదే కనుక అధికంగా త్రాగితే? మత్తు పూర్తిగా కలిగి మనిషి 'నిశ్చేష్టితుడు' అవుతాడు కదా! చైతన్యము సంపూర్ణంగా ప్రకాశించినప్పుడు ఇక, విషయముల దర్శనమే ఉండదు. కొంత చైతన్యదృష్టి, కొంత జడత్వదృష్టి ఏర్పడి ఉన్నప్పుడు మాత్రమే ఈ జీవుడు విషయోన్ముఖుడై ప్రవర్తిస్తున్నాడు. 'నిర్వికల్ప సమాధి' యందు చైతన్యము యొక్క ప్రకాశము అత్యధికంగా ఉంటుంది. "ఘన చైతన్య పూర్వక స్థితి" లేక "ప్రపంచరహిత స్వసత్త"యే "పరమపదము" అని చెప్పబడుతోంది. సర్వకల్పనలు లయించినట్టి – సిద్ధి పొందినట్టి చిత్తమే విషయరహితం అవగలుగుతోంది. దృశ్యమంతా స్వస్వరూపంగా ఆస్వాదించేస్థితియే "నిర్వికల్పస్థితి"!

❖

ఈ చిత్తము వలన, శుద్ధచైతన్యము చేత్యభావము ('నేను అనుభవించుచున్నాను' అను భావము) పొందుచున్నది. అనగా, "నేను కర్తను. నేను ద్రష్టను" అను భ్రమను సత్యమువలె అనుభవించుచున్నది. అయితే, గాలికి 'స్పందము' కంటే వేరైన సత్త లేనట్లుగా, ఈ చిత్తమునకు "విషయోన్ముఖత్వము" కంటే వేరైన 'సత్త' లేదు. వేడి తొలగితే నిప్పు ఆరిపోవునట్లు, ఇంద్రియ విషయములు తొలగిపోగా! 'చిత్తము'నకు ఇక ఆకారమంటూ కనిపించదు. శుద్ధచైతన్యము అనుభవించు విషయముతో "శుద్ధ చేత్యములు (లేక) శుద్ధ దర్శనములు" అని చెప్పబడుచున్నాయి.

అప్పుడిక చైతన్యము చైతన్యరూపజగత్తును చైతన్య మాత్రంగా ఆస్వాదిస్తున్న దగుచున్నది.

❖❖❖

8. పరమాత్మను ఎరుగుటయే ఉపాయం

'త్రాడు' నందు 'ఇదిపాము' అను భ్రాంతి ఏ విధంగా కలుగుతోందో, అదే విధంగా అవిద్య కారణం చేత ఏర్పడుచున్న మిథ్యాభ్రాంతియే శుద్ధచైతన్యము నందు విషయముల భ్రమానుభవమునకు కారణమగుచున్నది. ఈ సంసార వ్యాధికి 'ఆత్మజ్ఞానం' ఒక్కటే సరయిన ఔషధం. అయితే చిత్తము బాహ్యవిషయములందు వైముఖ్యాన్ని (ఆకర్షించబడకపోవటం) అభ్యసించినప్పుడు మాత్రమే అంతరంగమునందు ఆత్మజ్ఞానం సుస్థిరం అవుతుంది. అందుకు వేరే ఇంకే ఉపాయం లేదు.

ఓ రామా! ఎవడైతే బాహ్యదర్శనములను, అంతరమున ఉన్న వాసనలను పరిత్యజిస్తాడో ... అతనికి ఇక్కడే ఇప్పుడే ముక్తి లభించినట్లే! వాసనలుండటమే బంధం. వాసనా త్యాగపూర్వకమైన స్వసత్తా సామాన్యమే ముక్తి. యథార్థజ్ఞానం కలిగిన తరువాత రజ్జువు పట్ల సర్పభ్రాంతి తొలగక ఏం చేస్తుంది?

❖

ఆత్మజ్ఞానం లభించగానే యీ వర్తమానపు సంసారభ్రాంతి అంతా తొలగిపోగలదు. విషయ వాసనలు పరిత్యజించావా .... మోక్షము నిశ్చయంగా లభించగలదని మరల గుర్తు చేస్తున్నాను. దృశ్య విషయముల పట్ల ఆసక్తి, నమ్మకము, మూర్ఖత్వము, అభిలాష తొలిగితే వాసనలు జయింప బడినట్లే కాబట్టి ఓ రఘుకులతిలకమా! రామచంద్రా! నీవు ఆసక్తిరహితుడవై ప్రవాహపతితములైన కర్మలను ప్రశాంత స్వభావముతో నిర్వర్తించుము. ఇందులో కష్టమేమీ ఉండవలసిన పనిలేదు. అనేకమంది తాము కోరుకొన్న వస్తువుకోసం, ప్రాణములైనా సరే, తృణంలాగా త్యజించివేయటం మనం ప్రపంచంలో చూస్తూనే ఉన్నాం. మరి కేవలం "అభిలాష"ను త్యజించినంత మాత్రంచేత ఉభయతారకమైనట్టి మోక్షము లభిస్తున్నప్పుడు, అందుకు వెనుకాడవలసిన అవసరమేమున్నది చెప్పు? నీవు కనుక వాంఛితములన్నిటినీ (ఇది ఇట్లు ఎందుకు ఉన్నది? అది నానుండి తొలగుగాక .... ఇటువంటి అభినివేశములను) పరిత్యజించి నిర్వికారుడవై ఉండకలిగితే ఈ నిమిషంలోనే కృతార్థుడవు అవుతావు. చేతిలోని పండులాగా, ఎదురుగా గల పర్వతం లాగా పరమాత్మతత్త్వమును, ఇప్పుడే, ఇక్కడే, ప్రత్యక్షంగా పొందగలుగుతావు. దృశ్యాసక్తి తొలగగా, వృత్తిరహితుడవై ఉన్నప్పుడు ఇక నీయొక్క ఏ రూపము శేషిస్తుందో అదియే పరమాత్మ యొక్క స్వరూపం. అంతేకాని, ఆ పరమాత్మ స్థానంలేక, స్వరూపం ఎప్పుడో ఎన్నడో ఏదో నిర్వర్తించగా ఎక్కడినుండో వచ్చిపడేది కానే కాదు సుమా!

తరంగముల రూపంలో కనిపించేదంతా ఒకే సముద్రజలము కదా! పరమాత్మయే అజ్ఞానులకు 'జగత్తు' రూపమున ప్రతిభాసించుచున్నాడు. జ్ఞానులకో ... జగత్తు స్వస్వరూపంగా అనునిత్యంగా అనుభూతమగుచున్నది. ఈదృశ్యమును ఆత్మగా ఎరుగుటచేతనే మోక్షం లభిస్తోంది. ఎరుగకున్నంత కాలం ఈ సంసారబంధం ఉండియే తీరుతుంది.

❖❖❖

V. కర్కటి ప్రశ్నలు

1. ఈ జీవుడెవ్వడు? ఎందుకు ఉద్భవిస్తున్నాడు?

శ్రీరాముడు: మహర్షీ! "చిత్తము" అను ఉపాధితో కూడుకొనియున్న ఈ 'జీవుడు' అనువానికి, ఆ "పరమాత్మకు" గల సంబంధం ఏమిటి? అసలు ఈ జీవుడు ఎవ్వడు? ఇతడు పరమాత్మనుండే ఉద్భవించాడా? ఎప్పుడు ఏ కారణంచేత ఉద్భవిస్తున్నాడు? లేక ఇంకెక్కడినుంచో వచ్చాడా?

ఈ విషయమై మరికొంత వివరించి చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : శ్రద్ధగా విను. చెప్పుచున్నాను.

స్వతహాగా "శుద్ధము-నిర్మలము-నిత్యము-అఖండము" అయినట్టి బ్రహ్మము ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కచోట అవిద్యతో కూడుకొని ఉంటోంది. అట్లు అవిద్యతో కూడుకొని ఉన్నప్పుడు... అది ఏ విధమైన శక్తితో కూడుకొని ప్రకటితం అగుచున్నదో, తనను తాను ఆ స్వరూపముగానే భావన, అవగాహన, దర్శనములను కలిగి ఉంటోంది. అట్టి దర్శనమునే 'సంసారము' అని అంటున్నాం.

అట్టి 'దృష్టి' లేక 'సంభావన' యొక్క రూపములే బంధ - మోక్షములు. అంతేగాని, ఈ బంధ-మోక్షములు అనేవి భౌతికమైన జన్మ - కర్మలకు సంబంధించినవి కావు. అఖండ చైతన్యమే స్వరూపముగా గల ఈ 'ద్రష్ట' యొక్క అవగాహనను అనుసరించే బంధమోక్షములు ఉంటున్నాయి.

బ్రహ్మమునందు అనాదికాలంగా ప్రకటితమౌతున్న 'చేతనశక్తి' ని "జీవుడు" అని అంటున్నాం. చిచ్ఛక్తి (The manifestation of knowing) ఒకానొకప్పుడు సంకల్ప స్వరూపమును, చిత్త సంస్కారములను అవలంబించి ఉంటోంది. ఇట్లు భావనలను తనంతట తానే సంకల్పించుకొని "ద్వైతభావన"ను దృఢంగా పొందుతోంది. దాని ఫలితంగా "నేను జీవుడను.... నేను పుట్టుచున్నాను.... నేను చచ్చుచున్నాను...." అను రూపముగల జననమరణాది భావములన్నీ పొందుతోంది.

శ్రీరాముడు : మునిశ్రేష్ఠా! మీరు చెప్పేదానిని బట్టి "ఉత్తమోత్తమమైయున్నట్టి 'చిచ్ఛక్తి'యే స్వభావవశంచేత 'జీవుడు' అగుచున్నది. జనన - మరణాది భావములు పొందుచున్నది".... అని నాకు అర్థం అవుతోంది. అయితే జీవుడే చిచ్ఛక్తి అయి ఉండి, ఇదంతా స్వభావవశం చేతనే జరిగిపోతున్నప్పుడు ఇక "ఇది దైవము, ఇది కర్మ, ఇది బద్ధజీవి, ఇది మోక్షజీవి, ఇది కారణము" అని చెప్పటంలో అర్థం ఏమున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆకాశము నందు వాయువు ఉంటోంది. ఆ వాయువు ఒకప్పుడు అధికమైన స్పందన కారణంగా వేగంగా సంచరిస్తోంది. మరొకప్పుడు అల్పమైన స్పందనముచే కదలిక లేకయే ఉంటోంది. ఇట్లు స్పంద-అస్పందములు (Vibration - Non vibration) కలిగియుంటున్న వాయువును

మనం స్పర్శ–అస్పర్శలను అనుసరించి గుర్తిస్తున్నాం. అయితే ఆకాశము అనేది అనిర్వచనీయం. అది సాపేక్ష (By Relativity / In relation to certain Presumptions & Assumptions) చేత మాత్రమే మనం గ్రహించగలుగుచున్నాం. అది నిరాకారముకూడా!

ఆత్మాకాశమునందలి 'జీవ చైతన్యము' నందు 'భావనచేయుట' అను వాయు సంచలనమువంటి స్వభావతత్త్వము ప్రకటితమగుచున్నది. అట్టి భావన (లేక) కల్పన యొక్క స్పంద–అస్పందములే "ఈ జగత్తు ఉండటం – లేకుండా పోవటం" అను రూపములుగల సృష్టి ప్రళయములుగా ఏర్పడుచున్నాయి. ఇక ఈ జీవునియొక్క వాస్తవతత్త్వానికి వస్తే, అది ఆకాశమువలె అనిర్వచనీయము. అయినప్పటికీ అది సర్వదా లభ్యమైయున్నది. నిత్యానుభవమైయున్నది. ఈ జీవుడు వాస్తవానికి ఆకారరహితుడే. దేహమునకు ఆకారం ఉన్నది. దేహికి ఆకారం ఏది ?

ఈ జగత్తంతా చైతన్యమే సుమా! చైతన్యము కాక ఈ జగత్తుకు వేరు సత్త లేదు. ఆ చైతన్యము తాను రజోగుణసంపన్నమైన తరుణంలో తదనుగుణమైన ఉపాధిని ఆశ్రయిస్తున్నప్పుడు ఈ సృష్టి సంరంభమంతా ఏర్పడుతుంది. తాను రజోగుణమును ఉపశమింపజేసినప్పుడు తనయందు తానే శాంతమై వెలయుచున్నది. "అనిర్వచనీయం, స్వవిషయకం" అయినట్టి అజ్ఞానము కారణంగా, ఆ చైతన్యము తనయొక్క "చిద్భావము" ను, బాహ్యమైనదానివలె 'ఇది నా చిత్తము' అని తలచుచున్నది. అట్లు తలచుటను శాస్త్రకారులు "చిత్స్పందము" అనే పేరు పెట్టారు.

అట్టి చిత్స్పందమే ఈ "జగత్తు"
అస్పందమే (స్పందరాహిత్యమే) "బ్రహ్మము"

ఆ చిత్స్పందము యొక్క వేరువేరు అవస్థలకు ఇవ్వబడిన సాంకేతిక నామములు (Jargons) ఈ "జీవుడు–దైవము–కర్మలు" మొదలైనవి. ఈ జీవుడు, ఈ శరీరమునకు కారణమైనట్టి కర్మలు, ఆ కర్మల ప్రయోజనమైనట్టి దైవము.... ఇవన్నీ జల–తరంగములవలె బ్రహ్మము యొక్క స్పందములు. కాబట్టి, "అనుభూతి స్వరూపమగు చైతన్యమే చిత్ స్పందము" అని తేలుచున్నది. దానికి జీవుడు, సంసృతి, కారణము.... ఇట్లు వివిధ శాస్త్రములలో ఆయాచోట్ల చెప్పటం జరిగింది.

❖

చైతన్యము తనకు తానుగా అవిద్యను ఆశ్రయించి, ఆ అవిద్యయందు ప్రతిబింబించుచున్నది. అట్టి ప్రతిబింబత్వం "ద్వైతభ్రమ" ('యిదివేరైనది'– అను భావన)కు కారణమై ఈ దేహాదుల అనుభవం పొందుతోంది. అనగా చైతన్యం స్వవిషయకమైనట్టి అజ్ఞానం వలన ఈ కనబడుచున్న నానావిధములైన రూపములను ధరించి సృష్టిగా కనబడుచున్నది. ఇదంతా స్వసంకల్పానుసారమే అనుభవమగుచున్నది. జీవచైతన్యము తనయొక్క "ఇచ్ఛ – అభిలాష" ల కారణంగా నానావిధములైన యోనులందు "ప్రవేశము – నిష్క్రమణము"లను అవిశ్రాంతంగా చేసుకుంటూ పోతోంది. అయితే స్వస్వరూపాత్మ సర్వదా యథాతథం సుమా!

❖

ఈ విధంగా చైతన్యము నానావిధములైన జన్మలు లేక యోనులందు ఎందుకు సంచరిస్తోంది? అవిచారణ, అజ్ఞానము, ఇంద్రియములకు సంబంధించిన దృశ్యతాదాత్మ్యము అందుకు కారణమ గుచున్నాయి. ఏది ఏమైతే ఏం? చేతనము యొక్క అంశయే ఈ జీవుడు.

అట్టి దృశ్యాసక్తితో కూడిన చేతనాంశమును "పరిమిత ద్రష్ట" అని అంటున్నాం. అద్దం మరొక వైపు తిరిగి ఉండుటచే దృశ్యము ప్రతిబింబించదు కదా! చేతనాంశము బాహ్యానుభవ దృష్టి కలిగి యుండుటచే అది తనయొక్క వాస్తవ స్వరూపమునకు సంబంధించిన 'ఎరుక' (లేక) 'దృష్టి' ని ఏమరచుచున్నది. ఆ చేతనాంశమే మరొకసారి 'ఆత్మ' (లేక) 'నిర్మల సత్త' యొక్క పూర్ణానుభవమును ఆశ్రయించి ఉంటోంది. అనగా అది సర్వ జగత్ విశేషములకు అతీతత్వము సంతరించుకుంటోంది. అట్టి స్థితియే "ఉత్తమ జ్ఞాన స్థితి", "స్వయంజ్యోతిత్వము", "ముక్తి" మొదలగు పేర్లతో చెప్పబడుతోంది.

అట్టి ఎరుక స్థితి పొందేది ఎట్లా?

'నేను దృశ్యమునకు సంబంధించినవాడను కాను. ఈ దృశ్యము నాకు సంబంధించినది కాదు. నిష్కళంకము, నిర్మలము, సర్వాత్మకము అయినట్టి శుద్ధతత్వమునే నేను" అనునట్టి 'మననము' దృఢపడుటచేతనే అట్టి జ్ఞానార్హత లభిస్తోంది. "ఏది తానో, అదే తదితరులు" (తత్ త్వమ్ అసి – సోఽహమ్) అను సంభావనచే ఆ జ్ఞానము పూర్ణమగుచున్నది.

ఈ చైతన్యము ఏ ఉపాధియందు 'దృష్టి' ఉంచుచున్నదో, అది ఆ దృష్టికి సంబంధించిన ఆకృతినే పొందుచున్నది. తనయొక్క "సంకల్పము–ఆసక్తి–అభిలాష"లను అనుసరించి సూక్ష్మ భూతము లతో ఏకత్వము పొందుచున్నది. పితృశరీరమునుండి 'శుక్రము' రూపమున వెలువడి ఆయా అభిలషిత దేహములను ఒక దానివెనుక మరొకటి పొందుతూనే పోతోంది. అట్టి ప్రతి శరీరము పొందినట్టి కాల – స్థానము లందు (Time and place) కొన్ని అనుభవములను పొందుతోంది. మరల ఆ అనుభవము–జ్ఞానములను అనుసరించి బంధమో, స్వర్గమో, మోక్షమో పొందుచున్నది.

ఏది ఏమైనప్పటికీ, ఆయా ఉపాధులందు సంచరిస్తున్న ఈ "చైతన్యాంశము" తనయొక్క "సర్వమునందు విస్తరించి ఉండుట" అను స్వరూపమును ఏమాత్రం ఏక్షణంలో కూడా త్యజించుట లేదు. కాని, ఇక్కడ కేవలం మరచుట–భ్రమించుట... మాత్రం జరుగుతోంది. అనేక శాస్త్రములు, అనేక ప్రవక్తలు అనేక రీతులుగా చెప్పుచున్నదంతా అంతిమసారం దృష్ట్యా చూస్తే "ఈ జీవునికి ఇతని సర్వసమత్వరూపమైనట్టి సర్వాత్మకత్వమును గుర్తు చేయుటయే" అని మా అభిప్రాయం.

❖

ఈ సర్వజీవులలోని వాస్తవతత్వమగు చైతన్యము సర్వదా ఒక్కటిగానే ఉన్నది. దానియందు ఏ క్షణమునందుకూడా అనేకత్వమునకు తావే లేదు. కాని కేవలం భిన్నభిన్న ఉపాధులతో భిన్నభిన్న విధములుగా తననుతాను సందర్శించుకుంటోంది. "ఇతడు తండ్రి, ఇతడు కుమారుడు. ఇతడు మిత్రుడు. వీరంతా తదితరులు"... ఇత్యాది వ్యవహారమంతా కేవలం ఉపాధికి సంబంధించినదే. స్వయంకృతమగు మనోకల్పితమే! సువర్ణము సర్వదా ఒక్కటే అయినప్పటికీ, "ఉంగరం– గాజులు

– కంకణము" వంటి ఆకృతులను పొంది భిన్నము అయినట్లు అగుపడుచున్నది కదా! చైతన్యము సర్వదా ఒక్కటే! అది అద్వితీయము! అయినప్పటికీ వేరువేరు స్థావర–జంగమ శరీరములను ధరించి భిన్నము, ఖండము అయినట్లు ఒకానొక విచిత్రమైన భ్రమానుభవం తనకుతానుగా కల్పించుకుని పొందుతోంది. ఈ శరీరములకు ఉపాదానకారణం పంచభూతములుకదా! పంచభూతముల ఉత్పన్నము, రకరకములైన సమ్మేళనములు, నానాత్వపు అనుభవం, జ్ఞాన–అజ్ఞానములు.... ఇవన్నీ జలములో ఏర్పడే తరంగాలవలె ఏర్పడుచున్నాయి. "కెరటము–ప్రశాంత జలం" లాగా చింత – నిశ్చింతలు ఆ నిత్యసత్య చిద్వస్తువునందు స్వప్నసదృశంగా ఏర్పడుచున్నాయి. "శుద్ధము – నిత్యము– అనంతము" అను స్వభావము కలిగియున్నట్టి ఆ చిద్వస్తువు, "నేను జన్మించుచున్నాను. మరణించు చున్నాను".... మొదలగు భ్రాంతులన్నీ పొందుతోంది. స్వప్నంలో 'కాలుజారి పడడం' మిథ్యయే అయినప్పటికీ ఆ స్వప్నసమయంలో దృఢమైన సత్యమువలెనే అగుపించుచున్నది కదా! "నేను–నాది" మొదలైన భ్రాంతులతో కూడిన ఈ చిత్తము..... మిథ్యా మాత్రము అయి ఉన్న...... ఈ జనన మరణములను అనుభవించుచున్నది.

లవణుడు అను ఒక మహారాజు ఒక గంట సమయంలో అనేక సంవత్సరములుగా విస్తరించి యున్న సుదీర్ఘమైన–చండాలుని జీవితం చవిచూడడం మనం ఈ ప్రకరణంలో గమనించబోవుచున్నాం. 'అవిద్య' చే మోహము చెందినట్టి ఈ చిత్తము తనయొక్క అధిష్ఠానమైయున్న ఆత్మయందు "జగద్దృశ్యము" అనబడు స్వప్నమును గాంచుచున్నది. ప్రశాంత సముద్రంలో తరంగాలు లేచినట్లు, శాంతిమయమగు "చిదాకాశము" నందు సృష్టివైపు ఉన్ముఖమైన 'చిత్తు' ఉదయిస్తోంది.

❖

ఓ రామచంద్రా! ఇలా జగత్తుగా గాంచబడుచున్నదంతా 'మనోవికారము' మాత్రమే సుమా! ఉల్లాసముతో కూడిన మనోతరంగములు మననరూపము ధరించి, ఆత్మకు వేరైనదానివలె ప్రవర్తించు టయే ఈ సంసారచమత్కారం. అయితే, మనస్సు ఒకానొకప్పుడు ఉద్బోధింపబడినదై "స్వసత్త" యందు లయించిపోతోంది. అనగా అది స్వరూపస్వభావముల దృష్ట్యా 'ఆత్మ' యే అగుచున్నది.

"చిత్" అను జలముతో కూడిన "బ్రహ్మసాగరము" నందు ఈ కనబడుచున్న అనేక జీవులంతా 'సుడులు' వంటివారు. ఈ దృశ్యమునందు పాల్గొనుచున్న చిత్తములు దానియందు కెరటముల వంటివి. ఇక్కడ కనిపించే స్వర్గము–నరకము మొదలగునవన్నీ నీటి బుడగలవంటివి. ఇక్కడి చమత్కారమేమిటంటే... "పరిశీలించి చూడటం జరిగితే, ఏదైతే స్వతహాగా, (లేదా, ఉత్తమమైన వాస్తవదృష్టిచేత) లేనే లేదో"...... అట్టిదే ఇదంతా! అయితే, ఇదంతా కూడా "నిర్దుష్టమైన సత్యమా?" అన్నట్లుగా ప్రాప్తిస్తూ వస్తోంది. అట్టి రూపముగల అనుభవమునే "మాయ" అని అంటున్నాం.

మరి ఈ మాయ తొలిగేది ఎట్లా?

పరబ్రహ్మమును గ్రహించటం ఒక్కటే ఈ మాయను ఛేదించుటకు ఉపాయం. పరబ్రహ్మము యొక్క సమక్షము అచింత్యము, మహాశక్తియుతం కూడా. అట్టి శుద్ధ పరబ్రహ్మమునందు 'మాయ'

యొక్క విజృంభణము స్వాభావికంగానే ఒకచెట్టు యొక్క నీడవలె ఏర్పడుతోంది. అట్టి విజృంభణమే ఒకవైపు జీవుడు (లేక ద్రష్ట) యొక్క రూపముగాను, మరొకవైపు జగత్తు (లేక దృశ్యము) రూపముగాను ఒకే సమయంలో ప్రకటితం అవుతోంది.

వాస్తవానికి జ్ఞానుల దృష్టిలో- ఈ జీవుడు, సంకల్పాత్మకమగు ఈ మనస్సు, ఈ బుద్ధి, చిత్తము, అహంకారము, మాయ- ఇవన్నీ కూడా చిత్తు యొక్క వివిధ నామములే అయిఉన్నాయి. అంతటికీ కారణం మనస్సే. మనస్సే స్వయముగా తనయందు శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములను (పంచతన్మాత్రలను) కల్పించుకొని 'మిథ్య' యే అయినట్టి జగత్తును సత్యమువలె విస్తరింపచేస్తోంది. మనస్సుయొక్క ఈ జగద్దర్శనం ఒకడు తన స్వప్నంలో ఆయా వస్తువులను చూచుటవంటిది. నిజానికి శుద్ధము-నిత్యము అయినట్టి ఆత్మ సర్వదా శాంతభావముననే వెలయుచున్నది. పరమార్థ దృష్టితో చూస్తే... అది దేనినీ గాంచుటయే లేదు. అట్లు అయివుండికూడా, వ్యవహారికంగా చూచినప్పుడు ఈ ఆత్మ 'చిత్తము' అనబడు ఒకానొక స్వభావమును ఆశ్రయించి, తత్ఫలితంగా భ్రమను అనుభవిస్తోంది.

1. 'జాగృత్' అవస్థ (జాగృత్‌లో 'నేను') : ఈ చిత్తము ఒక సమయంలో ఇంద్రియముల ద్వారా బాహ్యత్వమును పొందుచున్నది. దీనినే "సంసృతమగుట (లేక) సంసృతి" అని యోగశాస్త్రం చెప్పుచున్నది. అప్పటి ఆత్మయొక్క స్థితిని "జాగ్రదవస్థ" అని అంటున్నాం.

2. స్వప్నావస్థ (స్వప్నంలో 'నేను') : మరొకప్పుడు ఇదే చిత్తము అహంభావముతో కూడుకొని హృదయ-కంఠమధ్య ప్రదేశంలో సంచరిస్తోంది. అది "స్వప్నావస్థ" అనబడుచున్నది.

3. సుషుప్తి (సుషుప్తిలో 'నేను') : ఈ చిత్తమే ఇంకొకప్పుడు "స్మృతి" అనబడు గూటిలో వాసనలన్నీ దాచివేసి మౌనావస్థను అనుభవిస్తున్నది. దానిని "సుషుప్తి" అని అంటున్నాం.

4. తురీయస్థితి (నాలో జాగృత్-స్నప్న-సుషుప్తిజగత్తులు) : పై మూడు అవస్థలను కూడా దాటి అది తన యొక్క చిత్స్వరూపమున వెలయుచున్నది. అప్పుడు ఆ స్థితి యందు తననుతానే సర్వే-సర్వత్ర, సర్వమునందు చూచుచున్నది. ఈ సర్వము తనయందే ఉన్నట్లు గాంచుచున్నది. "జాగృత్‌లో నేను - స్వప్నంలో నేను - సుషుప్తిలో నేను" అను దర్శనమును అధిగమించి "నాలో జాగ్రత్ స్వప్న సుషుప్తులు" అను రూపంగా సందర్శిస్తోంది. అట్టి దర్శనమే 'తురీయము' అని పిలవ బడుతోంది. ఈ స్థితి 'దృక్ - దృశ్యము' అను రెండింటిని అధిగమించినప్పటిది సుమా! ఆ 'తురీయపదము' లేక 'పరమపదము' అత్యంతశుద్ధము, సన్మాత్రము, నిరామయము, శాంతము, అఖండానందప్రదము అయి ఉన్నది. అద్దానిని పొందడం జరిగినప్పుడు ఈ దుఃఖములు, శోకములు సమూలంగా వినష్టమైపోతున్నాయి.

❖

ఓ రాఘవా! ఒకనికి మిథ్యాదృష్టి కారణంగా నిర్మలాకాశంలో ముత్యములు ఉన్నట్లు అనిపిస్తూ, ఇంతలోనే మటుమాయం అగుచున్నట్లు తోచుతూ ఉంటుంది చూచావా? అదేవిధంగా ఆ

పరమపదమందు (లేక) పరమాత్మయందు బ్రహ్మాండములు ప్రకాశించటం, ఇంతలోనే విలీనమై పోవటం, ద్రష్టయొక్క మిథ్యాదృష్టిచేత కానవచ్చుచున్నాయి. భ్రమచేత నిర్మలాకాశంలో కనిపించే ముత్యములకు వాస్తవమైన 'సత్త' ఎక్కడఉన్నది? ఏ సమయంలోకూడా మిథ్య అయినట్టి ముత్యములకు నిర్మలాకాశం ఆధారమని అనలేం కదా! అదంతా చూచువాని దృష్టిలోపమే అయినట్లు, ఈ బ్రహ్మాండములకు కూడా 'సత్త' లేదు. ఇవి బ్రహ్మమునందు అధిష్ఠితమై ఉండియుండనేలేదు. కాని, అజ్ఞాన దృష్టిచే ఈ దృశ్య బ్రహ్మాండములు ఆత్మకు వేరైనట్లు వీక్షింపబడుచున్నాయి.

ఒక బాలుడు తనకు తానే కల్పించుకొనిన 'కల్పన' కారణంగా ఆకాశంలో ఏదో పెద్ద వృక్షం ఉన్నట్లు చూస్తూ ఉంటాడు. అట్టి భ్రమాత్మకమైన వృక్షమును "ఆకాశవృక్షం" అంటారు. "ఆ వృక్షమునకు ఉత్పత్తిగాని, ఉనికిగాని, వృద్ధిగాని, వినాశముగాని పొందుటకు ఆకాశము కారణము" అని అన గలమా? లేదు. ఎందుకంటే అదంతా చూచిన అజ్ఞానబాలకుని భ్రమయేకాని, అసలు ఆకాశంలో వృక్షం ఎట్లా ఉంటుంది?

నిష్క్రియమగు బ్రహ్మము దేనికీ కారణం కాదు.

❖❖❖

2. జగత్తుకు కారణం బ్రహ్మమా?

శ్రీరాముడు: అయితే మహర్షీ! "మాయచే విజృంభించుచున్న ఈ జగత్తుకు మూలకారణం బ్రహ్మమే. సర్వమునకు కర్త బ్రహ్మమే" అని లోకమునందు వ్యవహరించబడుతోంది కదా!

శ్రీవసిష్ఠమహర్షి: అవును. అట్టి లోకరీతి ఉన్నమాట నిజమే, కాని అట్టివాక్యము బోధకొరకు మాత్రమే చెప్పబడుతోంది. "ఈ 'జగత్తు' అనబడునది లేదు" అనునట్టి సత్యమునకు సంబంధించిన దృఢనిశ్చయం ఏర్పడే వరకే ఆ వాక్యాలు చెల్లుతాయి.

ఇక్కడ నీకు మరొక దృష్టాంతం చెపుతాను. విను. ఒక దర్పణంలో ఎదురుగా ఉన్న వస్తుజాలం, ఆ వస్తువుల కదలికలు ప్రతిబింబించుతాయికదా! ఆ దర్పణం తనయందు ఎట్టి ఇచ్ఛాద్వేషములు, ప్రియ- అప్రియములు, రాగ-విరాగములు లేకుండానే తనయందు చూపుతోంది. అనగా, "నేను ఈ వస్తువులనైతే చూపుతాను. వాటిని చూపను. ఎందుకంటే, అవి నాకు ఇష్టం కాదు...." అనునది ఆ అద్దమునకు ఉండదు. అందుచేత, ఆ ప్రక్రియ యొక్క కర్త ృత్వమును దర్పణమునకు ఆపాదించలేం. సామీప్యత-సన్నిధానముల మాత్రం చేత దృశ్యము అద్దము నందు ప్రతిబింబిస్తోంది. అంతమాత్రం చేత ఆ ప్రతిబింబిస్తున్నది అద్దములోని భాగమని కూడా అనలేం కదా! అట్లాగే, సామీప్యత-సన్నిధానం కారణంగా ఈ 'జగత్తు' అనబడునది ప్రకాశించబడుటచే "ఈ జగత్తుకు కారణం ఆత్మచైతన్యము" అని చెప్పబడుతోంది. అద్దమే లేకపోతే ప్రతిబింబమే ఉండనట్లు, ఆత్మచైతన్యమే లేకుంటే 'జగత్తు' అను అనుభవం ఎక్కడిది? ఎవరికి?... కాని, ఈ జగత్తు ఆత్మయొక్క ఒక శరీర భాగమని అనటానికి కూడా వీలు లేదు.

ఒక బీజము నుండి అంకురములు, ఆకులు, ఫలములు ఉత్పన్నమగునట్లు, 'చిత్తు' నుండే చిత్తము – జీవులు–మనస్సులు.... అంతా కలుగుచున్నాయి. ప్రళయసమయంలో సృష్టిరహితమై 'శుద్ధ చిత్తు' శేషిస్తోంది. ప్రళయానంతరం మరల "సృష్టి" ఆకారమున వివర్తమునొందుచున్నది. అంకురశక్తి మౌనంగా నిదురించియున్న బీజంలోంచి వృక్షంగా.... మరల ఆ వృక్షంలోంచి బీజముగా ఉత్పన్నమగుట లేదా? ఇది కూడా అట్టిదే.

బీజంలో ఉండిఉంటున్న "వృక్షమును జనింపజేయగల శక్తి" మరియు బ్రహ్మమునందు ఉండి ఉన్నట్టి "జగత్తును జనింపజేయగల శక్తి".... ఈ రెండూ ఒక రకంగా సమానములైనవే. అయితే ఆ రెండింటిమధ్య ఒక భేదము గోచరిస్తోంది. 'బీజము' కంటే వేరుగా 'వృక్షము' అనబడునది ప్రాప్తిస్తోంది కదా! కాని బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానము ఉదయించిన తరువాత "బ్రహ్మము కంటే వేరుగా విశ్వము లేదు" అనబడు బోధ ఏర్పడుచున్నది. బీజము–వృక్షములు, బ్రహ్మము – జగత్తులు అను దృష్టాంతములకు ఉన్న తేడా ఇంతే.

❖

దీపం ప్రకాశిస్తూ ఉండగా, ఆ దీపపు కాంతిలో వస్తువులు కనబడతాయి. కాని "ఆ దీపమే ఈ వస్తువులను మాకు చూపుచున్నది" అని అనగలమా? అనలేము. ఎందుకంటే, "ఈ వస్తువులను ఇతనికి చూపాలి. ఇవి ఇతనికి చూపకూడదు" అనునట్టి ఇచ్ఛ ఆ దీపమునందు లేదుకదా! అయితే దీపమే లేకుంటే చూడనేలేమే! బ్రహ్మము యొక్క సమక్షంలో ఈ జన్మాదులు, భావాభావములు ఉంటున్నాయి, లేకుండా పోతున్నాయి కూడా. అయితే "వీటికి బ్రహ్మము కారణము" అని అనలేం. కాని, బ్రహ్మమే లేకుంటే ఇక ఈ జగత్తు, జన్మమృత్యువులు, మొదలైనవన్నీ పొందేదెవరు? కాబట్టి, బ్రహ్మము ఉన్నది కాబట్టే జగద్వ్యవహారము, తదితరములు ఉంటున్నాయి.

భూమిని ఎక్కడ త్రవ్వటం జరిగితే.... అక్కడ ఆకాశం ఉండనే ఉండి ఉంటుంది కదా! విచారించి చూస్తే.... సర్వేసర్వత్ర "ఏకము–అద్వితీయము" అగు చైతన్యమే గోచరించగలదు.

ఒక పిల్లవాడు ఒక అద్దంలోనో, లేక స్ఫటిక శిలాఖండంలోనో ప్రతిబింబిస్తున్న ఆకాశంలోని చంద్రుని చూచి "ఇతడు వాస్తవ చంద్రుడే. ఇతనిని మనం పట్టుకోగలం" అని అనుకుంటూంటాడు చూచావా? అవిద్యామోహితులైన వారు మాత్రమే బ్రహ్మమునందు 'జగత్తు'ను గాంచుచున్నారు. స్ఫటికశిలాఖండంలో స్ఫటిక పదార్థమే ఉన్నది గాని చంద్రుడు మొదలైనవి ఉన్నాయా? జలంలో పున్నమిరోజు చంద్రుడు కనిపిస్తున్నాడనుకో.... జలంలో జలమే ఉన్నదికాని చంద్రుడు ఎక్కడ? అద్దములో 'గాజు–తగరము' అను రెండు పదార్థములే కాని, అందు చంద్రుడు–ఆకాశం ఎక్కడ ఉంటాయి? 'అరణ్యం' అద్దములో ప్రతిబింబిస్తున్నప్పుడు, ఆ అద్దంలో మృగముల, పక్షుల కదలికలు కనిపించినంత మాత్రంచేత అవన్నీ అద్దంలో ఏర్పడుచున్నాయని అనగలమా? బ్రహ్మముకూడా 'ప్రపంచము' వలె ప్రతిభాసిస్తోంది. బ్రహ్మమునందు జగత్తుగా ప్రతిభాసించేదంతా బ్రహ్మమే అయిఉన్నది.

కాబట్టి ఓ రామచంద్రా! నీచే గాంచబడుచున్న 'ప్రపంచము' అనబడునదంతా నీ స్వస్వరూపమునకు ఏమాత్రం వేరుకానట్టి "బ్రహ్మమే" అయిఉన్నది. "వేఱు"గా గాంచుట స్వకల్పితమైన 'మాయ' చేతనే. ఇట్టి ఆత్మస్వరూపమునకు సంబంధించిన 'ఎరుక' అంతరంగమున దృఢత్వం పొందిన జ్ఞానికి – జన్మ మృత్యువులతో సహా ఇందు ఏదీ విపరీతమైనదిగా కనిపించదు.

శ్రీరాముడు : మీరు చెప్పుచున్నదంతా ఎంత చిత్రమైన విషయం! చూచారా మహర్షీ! పరిదృశ్యమానమై, ఘనీభూతమై కనిపిస్తున్న ఈ జగత్తు వాస్తవానికి 'మిథ్య' యే అయిఉన్నది కదా! కాని మా అనుభవమునకు మాత్రం "ఇదంతా ఇట్లే వాస్తవం" అను రూపముగల ఏదో దృష్టి ఏర్పడుతోంది. ప్రభూ! మీరు చెప్పినది వింటూ ఉండటంచేత ఈ జగత్తు యొక్క స్వరూప – స్వభావాలు క్రమక్రమంగా తెలియవస్తున్నాయి. ఇదంతా ఎంతో సూక్ష్మం, స్వచ్ఛం, ప్రస్ఫుటం అయి ఉన్నది. మహాత్మ స్వరూపమే అయిఉన్నది. కాని "మంచుతుంపరలుతో పోల్చతగిన ఈ తన్మాత్రల (శబ్ద–స్పర్శ–రూప–రస –గంధముల) అసత్ దృష్టి కారణంగా, అందుకు వ్యతిరిక్తంగా కానవస్తున్నది.

తండ్రీ! ఇప్పుడు "సమష్టి – వ్యష్టి" దేహముల గురించి, ఆ దేహముల అభిమానులగు "విశ్వుడు (Universal 'I') – వైశ్వానరుడు(Individual 'I')" అనబడువారి గురించి... వారు ఎట్లా ఉత్పన్నమగుచున్నారో చెప్పండి.

శ్రీవసిష్ఠమహర్షి : 'ఆకారము' అంటూ ఏదీ లేనట్టి "పిశాచము" అనబడునది ఒక అమాయిక బాలుని హృదయంలో ఆకృతి కలిగిఉన్నట్లు స్ఫురిస్తుంది కదా!

ఈ జీవుడు వాస్తవానికి 'ఆకృతి' అంటూ ఏదీ లేనివాడే! అతడు మొట్టమొదట పరబ్రహ్మమున ప్రకాశించుచున్నాడు. అతని స్వరూపము సర్వదా పరబ్రహ్మమే. పూర్వ కల్పీయమైన జీవ సంస్కారములను అనుసరించి 'జీవభావము' అనునది పరబ్రహ్మమునందు జలమునందలి తరంగమువలె ప్రకాశిస్తోంది. ఈ జీవుడు ఒకవైపు పరమశుద్ధుడు. పరబ్రహ్మము యొక్క సర్వలక్షణములను కలిగియే ఉన్నాడు. అట్లు స్వతహాగా 'శుద్ధుడు' అయి ఉండి కూడా వాసనలచే ఉద్భవించిన దేహములను అనుభూతిచెందుచున్నాడు. ఇతడు పరమాత్మకు అభిన్నుడే కాని, భిన్నుడుగా గోచరిస్తున్నాడు. అతడు సత్యస్వరూపుడై ఉండికూడా కల్పనతోకూడి ఈ జగత్తును దర్శిస్తున్నాడు.

పరమాత్మయే "నేను జీవుడను–దేహమును–ఖండుడను" అను కల్పనను ఆశ్రయించుటద్వారా జీవభావమును పొందుచున్నాడు. చైతన్యమే ఈ జీవుని స్వరూపము. అట్టి ఈ జీవుడు మననజ్ఞానము వలన "మనస్సు" గా ప్రకాశమును పొందుచున్నాడు. ఆ మనస్సే తన్మాత్రల గురించి చింతించుటచేత శబ్దస్పర్శాదుల అనుభవం పొందుతోంది. పరమాణువుకంటే కూడా ఎంతో సూక్ష్మమైనట్టి ఆ మనోచైతన్యం నిర్విషయ చిదాకాశమున చమత్కార పూర్వకంగా స్ఫురించటం జరుగుతోంది.

ఒకేజలం "ఒక నీటిబిందువు.... అనేక తరంగములు"గా కూడా అవుతోంది చూచావా! చిదాకాశమునందు వ్యష్టి (Individual 'I')– సమష్టి (Universal 'I')తత్వములు కూడా అట్లాగే ప్రభవిస్తున్నాయి.

సమష్టి పట్ల అభిమానము గల జీవుడు = హిరణ్యగర్భుడు (విశ్వుడు)

వ్యష్టితత్వము పట్ల అభిమానముగల జీవుడు = వ్యష్టిజీవుడు (వైశ్వానరుడు)

సమష్టిమనో రూపుడగు హిరణ్యగర్భుని యందు మనోకల్పనా రూపంగా అసంఖ్యాకములైన బ్రహ్మాండములు స్ఫురిస్తున్నాయి. అనగా, ఈ బ్రహ్మాండములన్నీ సమష్టిమనస్సు నందే ఉన్నాయి ఇక ఈ బ్రహ్మాండములందు సూక్ష్మదేహములు ఒక గొప్ప శిలయందు చిత్రించబడిన అనేక చిత్రముల వలె ఉంటున్నాయి. విచిత్రం చూచావా? అట్టి మనోరూపమును పొందిన జీవ చైతన్యము తన స్వస్వరూపమును విస్మరించుటచే తన వాస్తవస్వభావమును గుర్తించజాలక "నేనెవడను?" అను ఒకానొక సందిగ్ధజ్ఞానము పొందుచున్నది.

ఇట్లు 'మననము' అను రూపముగల సూక్ష్మదేహములను (మనస్సు + బుద్ధి + చిత్తము + అహంకారములను) ఆ జీవచైతన్యం ధరిస్తోంది. ఎప్పటికప్పుడు ఇతఃపూర్వపు సంస్కారములు, పురుషార్థములతో కూడి 'ఉపాధి' రూపమున ఉదయిస్తోంది. క్రమంగా 'జగత్తు' అను శబ్దము యొక్క అర్థమును, తత్వమును అస్ఫుట – జ్ఞానరూపమున పొందుతోంది. మనోచైతన్యం "నేను శరీరమును, వ్యష్టిని" అనునట్టి మననముచే ఈ శరీరములను ప్రకాశింపచేయుచున్నది. అట్లు ప్రకాశిస్తున్న ఈ శరీరము నుండి ఆ "జీవచైతన్యస్ఫూర్తి", అంతరమున మనో–బుద్ధి–చిత్త–అహంకారములను, వెలుపల ఇంద్రియముల ఉత్పత్తిని, ఆ ఇంద్రియములకు అనుభవమగుచున్న వస్తుజాలముతో కూడిన జగత్తును పొందుచున్నది.

వెలుపల "రసము"	---	శరీరమునందు 'నాలుక'
వెలుపల "రూపము"	---	శరీరమునందు 'కనులు'
వెలుపల "గంధము"	---	శరీరమునందు 'ముక్కు'
వెలుపల "శబ్దములు"	---	శరీరమునందు 'చెవులు'

ఇట్లు ఆయా ఇంద్రియ భావనలు ఘనీభూతమగుచుండగా అతనికి "శబ్దములను వినుట" మొదలైన ప్రక్రియవ్యవహారమంతా సమీపిస్తోంది. ఇట్లు జీవాత్మ కాకతాళీయంగా క్రమక్రమంగా దేహభావమును అనేకసార్లు గ్రహించుచున్నాడు.

ఈ జీవాత్మ ఏ అంశమునందు శబ్దం వినటం జరుగుతోందో దానిని 'చెవులు' అని అంటున్నాం. వాస్తవానికి 'జీవాత్మ' అనునది మిథ్యయేనని జ్ఞానులు గ్రహిస్తున్నారు. ఎందుచేతనంటే, జగన్నాటకాంతర్గతంగా పాత్రధారునివలే కనిపించే ఈ జీవుడు... జగదతీతంగా పరంజ్యోతి స్వరూపుడే! అయినా, 'అజ్ఞాన' అనే పాత్ర రూపంగా అజ్ఞానదృష్టికి సత్యమువలె గోచరిస్తున్నాడు.

'చెవులు' లాగానే ఆ జీవచైతన్యము రూపమును గ్రహించే చోటును 'కళ్ళు' అని, గంధమును గ్రహించేచోటును ముక్కు అని అంటున్నాం. ఈ ఇంద్రియములన్నీ భావనామయములే సుమా! ఈ జీవాత్మ భావావేశముచే, "నేను ఈ దేహము కలవాడను. బాహ్యవిషయములను 'గుర్తించుట, అనుభవించుట, ప్రకాశింపచేయుట' మొదలగు ధర్మములను నిర్వర్తించగల ఇంద్రియ రంధ్రములు కలవాడను" అని తలపోయుచున్నాడు.

సమష్టి జీవుని–వ్యష్టిజీవుని భావమయములైన 'ఆతివాహిక దేహములు' (లేక సూక్ష్మ దేహములు) మొట్టమొదట ఉత్పన్నమౌతున్నాయి.

ఓ రామచంద్రా! ఈ విధంగా అవ్యక్తమైనట్టి పరమాత్మయే అజ్ఞానముతోగూడి – ఆతివాహిక – దేహములను పొందుచున్నది. అజ్ఞానము తొలగిందా, ఇక "నేను స్థూలదేహిని, సూక్ష్మదేహిని" అను భ్రమకూడా తొలగుతోంది. ఆత్మజ్ఞానము కలిగిన తరువాత ప్రమాణము ఉండదు. ప్రమేయము (జీవుడు : Objected Created) కూడా ఉండదు. ప్రమాతృత్వమూ (process of creation) ఉండదు. అజ్ఞానముచే ఏర్పడినట్టి "వ్యష్టి అభిమాని–సమష్టి అభిమాని"... లేనివే అవుచున్నాయి.

ఒకే 'పరాసత్త'– "నేను బ్రహ్మమును" అను భావనచే బ్రహ్మముగను, "నేను సమష్టిజీవుడను" అను భావనచే 'సమష్టి'గను, "నేను వ్యష్టిజీవుడను" అను భావనచే 'వ్యష్టి' గను ప్రతిభాసిస్తోంది.

శ్రీరాముడు : ఈ జీవుని స్వస్వరూపమైనట్టి "చిన్మాత్రతత్వ" అగు బ్రహ్మమునందు అజ్ఞానము యొక్క ఉనికి ఎలా సాధ్యం? అందుచేత బ్రహ్మముయొక్క అద్వైతస్థితి (దానికి వేరైనదంటూ ఏదీ లేకపోవడం) స్వతఃసిద్ధమే అయిఉన్నదికదా! మరి ఇంక విధి–నియమములు–విచారణ–మోక్షము.... మొదలైన భేదకల్పనతో ఆవశ్యకత ఎందుకుంటోంది?

శ్రీవసిష్ఠమహర్షి : మంచి ప్రశ్నే వేశావు. ప్రశ్న గొప్పది అయినప్పటికీ అది తగిన సమయంలో వేస్తేనే ప్రాశస్త్యం. ఏదైనా యోగ్యమైన కాలంలోనే శోభిస్తుంది కదా! నీ ప్రశ్న ఇప్పటికి తగినట్లే ఉన్నది. ఇక విను. "ఈ జగత్తంతా సమష్టి జీవాభిమాని అయినట్టి 'హిరణ్యగర్భుడు' అను పేరుతో పిలువబడువాని స్వప్నము' అని చెప్పబడుతోంది. ఆ హిరణ్యగర్భుడు (అతడే బ్రహ్మదేవుడు – పితామహుడు అని శాస్త్ర ప్రసిద్ధి) ఓంకారరూపమగు ప్రణవమును ఉచ్చరించుచు అద్దాని యొక్క అర్థమును గ్రహించుచు మనోరాజ్యమును విస్తరింపజేయుచున్నాడు.

ఇక ఈ 'జీవాత్మ' (వ్యష్టిజీవుడు) కూడా అట్లే యథాకాలమున స్వప్నతుల్యంగా స్వప్నాత్ముడగు హిరణ్యగర్భుని స్వప్నవ్యవహారమునందు ఆవిర్భవించుచున్నాడు. జీవాత్మలన్నీ హిరణ్యగర్భుని రూపమే. స్వప్నములో కనబడే స్వరూపములన్నీ స్వప్నద్రష్టవేగాని, మరింకెవరివో కాదు కదా!

అయితే, ఈ సమష్టిమనోరూపము 'పరమాత్మ' యందు దర్పణాంతర్గత ప్రతిబింబమువలె అగుపిస్తున్న ఈ దృశ్యజగత్తు స్వప్నప్రాయమే కనుక, "ఇదంతా అసత్తే" అని చెప్పబడుతోంది. అదేవిధంగా 'వ్యష్టి – మనోరాజ్యము' అయినట్టి జగత్తు, కూడా చిదాకాశమునందు అసత్తే అగుచున్నది. వాస్తవానికి ఈ 'జగత్తు' అనబడునదేదీ జన్మించుట లేదు. మరణించుటలేదు. స్వప్నంలోని సంకల్పమాత్ర రూపములకు జన్మఏమి? మరణం ఏమిటి? ఒక్క బ్రహ్మము మాత్రమే సర్వదా పరమార్థ సత్యము. ఆ బ్రహ్మమే జగద్రూపంగా, మరియు 'ప్రతిభాసితమాత్ర సత్యము'గా అగుపిస్తోంది. ఊహాతత్వముగా ప్రకాశిస్తోంది.

అట్లు 'ప్రకాశించుట' లేక 'తోచుట' కేవలం అవిచారణచేత మాత్రమే సుమా! పరిశీలించి చూస్తే 'బ్రహ్మదేవుడు' మొదలుకొని ఒక పురుగు వరకు.... ఈ జీవుల అందరి 'సత్త' కూడా

'సత్–అసత్' మయమే. అజ్ఞానం తొలగిపోతే అన్నీ అసత్తులే అగుచున్నాయి. అజ్ఞానకాలంలో ఉండియే తీరుచున్నాయి.

ఒక్కొక్క జీవిది ఒక్కొక్క సృష్టి

పిపీలికాది బ్రహ్మపర్యంతము (ఒక పురుగు మొదలుకొని బ్రహ్మదేవుని వరకు) అందరి సృష్టులు సమానమే. ఇక బేధమేమిటంటావా? 'విశుద్ధ – సత్వప్రధానము' చే బ్రహ్మదేవుడు 'గొప్ప వాడు' మహోన్నతుడు, మహాశయుడు అని అంటున్నాం. 'మలినసత్వ ప్రధానము అగుటచే 'కీటకము తుచ్ఛమైనది' అంటున్నాం. ఆ రెండిటిలోని ఇచ్ఛ, భావన మొదలైనవాటి యొక్క మూలము "సంకల్పము" ఒక్కటే. ఉభయుల అనుభవములు స్వయంకల్పితమే!

శ్రీరాముడు : "బ్రహ్మదేవుని సృష్టి – పురుగుయొక్క సృష్టి" అంటున్నారేం? ప్రతి ఒక్కజీవునికి ఒకానొక సృష్టి ఉన్నదా? మీకు ఒకతీరు సృష్టి, నాకు మరొక తీరుసృష్టి ఉన్నదని మీ ఉద్దేశమా?

శ్రీ వసిష్ఠమహర్షి : అవును. ఎందుకంటే, దృష్టియే సృష్టి కదా! బ్రహ్మదేవాఽహంకారి... "నేను ఈ సమష్టి సృష్టియందలి సూక్ష్మదేహతత్వమును, సర్వమునకు అంతర్యామియై కల్పనకు కారకుడనగు చున్నాను" అను దృష్టి కలిగి ఉంటున్నాడు. కీటకాహంకారియో– "ఈ రెక్కలు – కాళ్ళు – తల గల శరీరమునే నేను. ఈ శరీరమునకు ఆకలి తీర్చటం, – నిద్ర కంటే వేరుగా యింక ఎక్కడా ఏదీ లేదు".... అను పరిమిత దృష్టి కలిగి ఉంటున్నాడు. సూర్యుడు ఒక్కడే అయినా, సూర్యకిరణాలు అనేకమై, ఒక్కొక్క కిరణం ఒక్కొక్క వస్తువును వెలిగిస్తోంది కదా! ఎవరు ఎట్టి దృష్టి కలిగి ఉంటారో, వారికి అట్టి సృష్టియే అనుభవమగుచున్నది.

శ్రద్ధ భావనలను అనుసరించే "జీవుడు – అతని పురుషకారము" ఉంటున్నాయి. అట్టి పురుషకారము ననుసరించి కర్మలను ఆచరించటం, ఆ కర్మల ఫలములు లేక ప్రయోజనములు, ఉపాధులు ఏర్పడుచున్నాయి. సుకృతఫలముచే బ్రహ్మదేవుని జన్మలు, దుష్కృత ఫలముచే కీటక జన్మలు వస్తున్నాయి. అయితే ఈ "జన్మలు–కర్మలు–సుకృతకర్మలు–దుష్కృత కర్మలు".... ఇదంతా బ్రహ్మజ్ఞానము యొక్క 'అభావము', లేక, 'ఏమరుపు' చేతనే ఉనికిని సంతరించుకొంటున్నాయి. అనగా ఉత్తమ పరిశీలన సన్నగిల్లిన సమయంలో 'ఉన్నవి' అగుచున్నాయి. జ్ఞానోదయం అయినదా.... ఇక ఈ భేదబోధలన్నీ సమసిపోగలవు. ఎందుచేతనంటావా? బ్రహ్మదేవునియందు, కీటకమునందు ఉన్నట్టి 'సత్త' ఒక్కటే కదా!

1. తెలుసుకొనువాడు = జ్ఞాత (Knower - Experiencer - Perceiver)
2. తెలియబడుచున్నది = జ్ఞేయము (The object being known - the experience - the perceived)
3. తెలుసుకోవటం = జ్ఞాతృత్వము (Knowledge - Experience - Perception)

ఈ మూడు తత్వములు సర్వద్రష్టలందు, లేక, సర్వ జీవులందు ఒకే రీతిగా ఏర్పడి ఉంటున్నాయి. 'శక్తి' అనునది ఒక్కటే అయి ఉండి, అనేక చోట్ల అనేక నామరూపములను పొందుచున్నట్లే ఒకే

బ్రహ్మము ఆయా ద్రష్ట-దర్శన-దృశ్యములను సంతరించుకొంటోంది. ధారణ కలిగి ఉంటోంది. ఏది ఏమైతేనేం? బ్రహ్మమునకు భిన్నమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు. ఇక ఈ 'ద్వైత-అద్వైత' భేదములన్నీ భ్రమలు మాత్రమే. సాలెపురుగు తన లాలాజలముచే నిర్మించుకొనిన సాలెగూడులో తానే చిక్కి, శల్యమై బంధమును అనుభవిస్తోందికదా! అట్లాగే స్వయంగా, సహజంగా బ్రహ్మానందమయ స్వరూపుడే అయిఉన్న ఈజీవుడు తన కల్పనాశక్తిచే తానే నిర్మించుకొనినట్టి తన మాయవలన తానే 'బంధం' అనుభవిస్తున్నాడు.

సమష్టి మనోస్వరూపుడైన బ్రహ్మదేవుడు దేనిని ఎట్లు భావిస్తున్నాడో, ఈ జీవుడు కూడా దానిని అట్లే గాంచుచున్నాడు. ఇది 'నియతి' యొక్క వ్యవస్థ. ఈ 'నియతి' లేక 'స్వభావము' ను అనుసరించే 'మఱ్ఱివిత్తు నుండి మఱ్ఱి వృక్షమే రావటం; బ్రహ్మాండములు మహాకల్పాంతము వరకు వెలసి ఉండటం'.... మొదలైనవన్నీ సిద్ధించటం జరుగుతోంది.

❖

అయితే రామా! "ఇక్కడ ఒక నియతి (ఒకానొక నియామకపూర్వకమైన విధానం) జరుగుచున్నది కదా! కనుక ఇదంతా సత్యమే" అని తలచరాదు సుమా! ఎందుకంటే, ఇదంతా ద్రష్ట యొక్క 'భావన' ను అనుసరించే దర్శించబడుతోంది. 'భావనామయములు' అయివున్న ఈ సృష్టి యొక్క స్థితిలయాలు అవాస్తవములే అనటంలో ఏమాత్రం సందేహం లేదు. శుద్ధము, సర్వవ్యాపి, ఏక మాత్రము, అనంతము అయివున్న బ్రహ్మము జ్ఞానము యొక్క స్వల్పత్వ కారణంచేత అశుద్ధంగా, ఉపాధి పరిమితంగా, అనేకములుగా, జన్మ-మృత్యు సహితంగా కనిపించడం జరుగుతోంది. మూఢుడైన ఒక బాలుడు తటాక జలంలోని అలలనుచూచి, ఆ అలలను "ఇదంతా జలమే" అను దృష్టిని ఏమరచినవాడై, "ఇవన్నీ ముందుకు దూసుకుపోతున్న చమత్కార పూర్వపు ఎత్తు - పల్లములతో కూడిన వేరువేరు కెరటములు" అని అనుకుంటూ ఉంటాడు. వివేకములేనట్టి ఒకడు చీకట్లో త్రాడునుచూచి 'పాము' అనుకొని అనేక వికారములు పొందుచూ ఉంటాడు. అట్లాగే ఇదంతా ప్రాప్తిస్తోంది. అయితే, ఏ జీవునియందైతే 'ఉత్తమము - పవిత్రము' అయినట్టి దృష్టి, మరియు "సంపూర్ణము - సమగ్రము" అయినట్టి అవగాహన లేవో, ...అట్టి వాడు మాత్రమే ఈ జగద్భేదములన్నీ అనుభవిస్తున్నాడు. కాని ఇక్కడ జీవునికి - జీవునికి మధ్యగా కనిపించే ఆయా భేదములన్నీ సత్యదృష్టికి లభించవు. ఒకడు ఇతరులతో తనచే కల్పించబడిన భేదములను అనుసరించి 'ఇతడు నా మిత్రుడు. అతడు వేరైనవాడు. వీరు నాకు ప్రియులు. వీరికి కలుగు దుఃఖము నా దుఃఖమే".... అనునవన్నీ "వాస్తవములే" అనునట్లు పొందుచున్నాడు. "శత్రువు - మిత్రుడు" మొదలైన ఏవేవో పరస్పర విరుద్ధములైన భేదవ్యవహారములు గాంచుచున్నాడు.

బ్రహ్మమునందు పరస్పర విరోధములైన భేదాభేదములన్నీ వెలయుచున్నాయి.

తరంగాలు అనేకంగా వేరువేరుగా కనిపించినా, అవన్నీ వేరువేరా? అంతా జలమే కదా! "సువర్ణం - ఆభరణం" అనే ద్వంద్వం ఉన్నదా? 'ఏక మాత్రమగు బ్రహ్మము' నందు ఈ 'జగత్తు' అనబడునది ఆరోపించబడుతోంది. ఇక ఆపై "జగత్తువేరు... బ్రహ్మమువేరు" అనునదంతా ప్రాప్తిస్తోంది.

మొట్టమొదట శుద్ధతత్వము, పరిపూర్ణము అగు 'ఆత్మ' యే ఉన్నది. ఆ 'ఆత్మ' యే మనో రూపమున ప్రకాశించుచున్నది. ఆ 'మనస్సు' నుండి అహంకారం ఉత్పన్నమౌతోంది. అనగా.... ఈ మనస్సు మొట్టమొదట "నిర్వికల్పము" నందు మౌనరూపమున ఉండి ఉన్నది. నిశ్చల జలంలో తరంగములవలె, ఆ తరువాత కల్పనా ప్రభావమునకు లోనై 'అహంభావము' అనుదానిచే విశిష్టమగుచున్నది. అట్టి అహంభావ – విశిష్టమైన మనస్సునుండి పూర్వానుభవరూపమైన 'స్మృతి' ని అనుసరించి "శబ్దేచ్ఛ–స్పర్శేచ్ఛ–రూపేచ్ఛ–రసేచ్ఛ–గంధేచ్ఛ" అనబడే పంచతన్మాత్రలు కలుగు చున్నాయి. ఈ భూతతన్మాత్రలు కల్పించబడిన తరువాత, చిత్తాత్ముడు (చిత్తముతో కూడిన ఆత్మ స్వరూపుడు) అగు ఈ జీవుడు కాకతాళీయంగా జగత్తును దర్శించుచున్నాడు.

ఈ మనస్సు దేనిని దీర్ఘకాలం 'సత్తా' గా భావిస్తుందో, అయ్యది అట్లే సద్రూపంగానే భాసించటం జరుగుతోంది.

కనుక మనస్సే అంతటికీ కారణం.

❖❖❖

3. కర్కటి తపస్సు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ సందర్భంలో ఒక పురాతన ఇతిహాసం చెపుతాను. ఇందులో ఒక రాక్షసి అధ్యాత్మశాస్త్ర పూర్వకమైన కొన్ని జటిల ప్రశ్నలు ప్రతిపాదించింది.

❖

హిమాలయపర్వతపు ఉత్తరభాగంలో గల ఒక అరణ్యంలో ఒకచోట 'కర్కటి' అనే పేరుగల ఒక భయంకర రాక్షసి ఉండేది. అక్కడ నివసిస్తున్న జనులు ఆ రాక్షసిని 'అన్యాయబాధిక' అని కూడా పిలుస్తూ ఉండేవారు. ఆ రాక్షసి కాటుకవలె నల్లగా, అతి భయంకరంగా ఉండేది. అది అసామాన్యమైన బలంతో భీతిని గొలుపు కార్యములు చేస్తూ ఉండేది. లోతైన కళ్ళతో, పొడవైన గోళ్ళతో, నర – కంకాళములను పుష్పమాలగా ధరించి బేతాళ నృత్యం చేస్తూ ఆ మహారణ్యంలో సంచరించేది. దానిని చూడటం తటస్థించిన జనులు బెంబేలెత్తిపోయేవారు.

దానికి ఎందుకో, ఎంత తిన్నా ఆకలి తీరేది కాదు. తీవ్ర జఠరాగ్నితో ఆకలి అరుపులు అరుస్తూ, ఒక రోజున ఇట్లు ఆలోచించసాగింది.

"ఆహాఁ! ఈ నా ఆకలి ఎంత క్రూరమైనది? ఈ జంబూ ద్వీపంలో నివసించే మనుష్యులందరినీ ఒక్కసారి మ్రింగినా ఈ ఆకలి తీరేటట్లు లేదే? వీరందరిని నేను చంపగలనా? వీరిలో కొందరు మంత్ర – ఔషధములు కలిగి ఉంటున్నారు. వారిని నేనేమీ చెయ్యలేను. ఇక మరికొందరు 'నీతి–దానము–పూజ' మొదలైనవి నిర్వర్తిస్తూ ఉంటారు. వీరందరిని నిర్జించటం, తినటం, నాకు ఒనగూడే పని కాదేమరి? ఇప్పుడు నా ఆకలి తీరేది ఎట్లా?.... పోనీ, ఒకపని చేస్తాను. తపస్సుచే సాధించరానిదంటూ ఏదీ ఉండదుకదా! అందుచేత వీరందరిని అడ్డంకులు లేకుండా నమిలి

మ్రింగుతూ, పీల్చివేస్తూ ఉండగలందులకు శక్తి సంపాదిస్తాను. అటువంటి శక్తియుక్తుల కొరకు తపస్సు ప్రారంభిస్తాను".

ఈ విధంగా యోచించి ఒక కొండ యొక్క అగ్రభాగంచేరింది. అక్కడ గల ఒక ప్రదేశంలో ఒంటికాలుపై నిలబడి తీవ్రమైన తపస్సు ప్రారంభించింది. అనేక రోజులు, మాసములు, ఋతువులు గడచిపోయాయి. అది నిశ్చలంగా ఘోరతపస్సు చేస్తూనే ఉన్నది.

కొంతకాలానికి బ్రహ్మదేవుడు ఆ రాక్షసియొక్క ఏకాగ్రతపస్సుకు మెచ్చి ప్రత్యక్షమయ్యారు.

శ్రీబ్రహ్మదేవుడు : పుత్రీ! పట్టుదలతో కూడిన నీ సుదీర్ఘ తపస్సుకు మెచ్చాను. ఏమి కోరి తపస్సు చేస్తున్నావో చెప్పు. నీకు ఇష్టసిద్ధిని ప్రసాదిస్తాను.

కర్కటి : హే భగవానుడా! పితామహా! నమోనమః! మీ దర్శనంచేత నా భాగ్యం పండింది. నా బాధ ఏమని చెప్పమంటారు? నాకు ఆకలి దంచివేస్తోంది. ఓ భూతభవ్యేశా! నన్ను "అనాయసి-ఆయసి".... రెండూ అయినట్టి "జీవి సూచిక"*గా చేసివేయండి. అప్పుడు నేను జీవుల శరీరములలో ప్రవేశించి, వారి రక్తమును జుఱ్ఱుకుంటాను.

శ్రీబ్రహ్మదేవుడు : వత్సే! సరే అట్లే అగుగాక! నీవు రూపముకలిగి ఉండి, లేనిదానివౌతావు. అతి సూక్ష్మమైన 'రూపము' ను అవలంబించి, నీవు – నిషిద్ధమైన, అపక్వమైన, అకాలమైన అతి అయిన – "భోజనం" చేయు జనుల శరీరములలో ప్రవేశిస్తూ ఉంటావు.

కుకర్మలను నిర్వర్తించేవారిని, కుప్రదేశవాసులను (People who stay at unhealthy places) సర్వదా హింసిస్తూ ఉండగలవు. వాయు పరమాణువువలె అయి, ఆయా జనుల 'ముక్కు' ల ద్వారా శరీరములలో ప్రవేశించి, అపాన మార్గంగా ** హృదయప్రదేశమును ఆక్రమించగలుగుతావు. ప్రేగులను, ఇతర అవయవములను పీడించుచు, అక్కడి రక్తమాంసములను భక్షిస్తూ ఉంటావు. జనులు ''వాతలేఖాత్మక, విసూచికావ్యాధి'' అను పేర్లతో నిన్ను పిలుస్తూ ఉంటారు. గుణవంతులు-గుణహీనులు" అను భేదము లేకుండా నీవు ఎందరినో బాధిస్తూ ఉంటావు.

అయితే, గుణవంతులను దృష్టిలో పెట్టుకొని, నీ వలన కలుగు 'విసూచికావ్యాధి' చికిత్స కొరకు సాధక జనులకు ఒక మంత్రము ప్రసాదిస్తున్నాను.

ఓ సాధకజనులారా! వినండి! హిమాలయ పర్వతములకు ఉత్తరంగా 'కర్కటి' అనే ఒక రాక్షసి ఉన్నది. దానికి 'విసూచి – అన్యాయబాధి' అనే పేర్లు కూడా ఉన్నాయి. అది వరప్రభావం

---

* ఆయసి : లోహమయము; ఆనాయసి : కంటికి కనబడనంత సూక్ష్మము;
జీవిసూచిక : రక్తం పీల్చే సూక్ష్మజీవి

** ప్రాణవాయువులు శరీరములో కదులుచుండు విధిని అనుసరించి "ప్రాణము-అపానము-వ్యానము-ఉదానము-సమానము" అనే పేర్లతో చెప్పబడింది. ఈ విషయమై ఈ గ్రంథంలో 'నిర్వాణప్రకరణం'లో 'భుశుండోపాఖ్యానం'లో విస్తారంగా చర్చించబడింది.

చేత రక్తాన్ని పీల్చే వ్యాధిరూపంతో బయల్వెడలుతోంది. అది కలుగచేయగల బాధకు, రోగమునకు ఇప్పుడు నాచే ఉచ్చరించబడుచున్న మంత్రము 'ఉపశమనము' గా పరిణమించుగాక!

" ఓం హ్రీం హ్రాం రీం రాం విష్ణుశక్తయేనమః

ఓం నమో భగవతి విష్ణుశక్తిమేనాం !

ఓం హర-హర! నయ-నయ! పచ-పచ! మథ-మథ!

ఉత్సాదయ దూరేకురు స్వాహా !

హిమవంతం గచ్ఛ జీవ సః స ః సః

చంద్రమండల గతోసి స్వాహా ॥ "

("ఓం హ్రీం హ్రాం రీం రాం బీజాక్షర రూపమగు "విష్ణుశక్తి" కి ఇదే నా నమస్కారం. ఓ భగవతీ! విష్ణుశక్తీ! నీ 'అంశ' యే అయిఉండి, రోగరూపమున ఉన్నట్టి ఈ నీ శక్తిని దయయుంచి హరించు. ఉపసంహరించు. పచనమొనర్చు. మథింపుము. దూరము చేసివేయి. స్వాహా రూపిణివగు ఓ రోగశక్తీ! నీవు నీ స్వస్థానమగు హిమాలయమునకు వెళ్ళిపో.")

❖

సాధకుడు ఈ 'మహా మంత్రము' ను తన ఎడమచేతిపై వ్రాసి, ఆ చేతితో రోగి దేహమును తుడుస్తూ, ఏకాగ్రచిత్తంతో.... "ఈ కర్కటి రాక్షసి మంత్రముచే మర్దించబడుచున్నది. రోగి దేహము నుండి వెలువడి, హిమాలయములవైపు పారిపోవుచున్నది" అని మనస్సుతో సంకల్పించాలి. "ఈ రోగి చంద్రమండలము నుండి అమృతరసమును పొందుచున్నాడు. అందుచేత సర్వవ్యాధి వినిర్ముక్తుడు అగుచున్నాడు..." అని భావన చెయ్యాలి. ఈ విధంగా సాధకుడు శుచిఅయి, ఆచమనం చేసి, ఏకాగ్రతచిత్తంతో శబ్దమును – అర్థమును ఒక్కసారే ఆశ్రయిస్తూ నిస్వార్థ–ప్రేమభావంతో అనుష్ఠానం చేస్తే, అప్పుడా విసూచికావ్యాధి సమూలంగా ఉపశమించగలదు.

త్రిలోకనాథుడగు బ్రహ్మదేవుడు ఇట్లు పలికి, ఆకాశమార్గంగుండా వెళ్ళసాగారు. ఆకాశంలోని సిద్ధులు అతనికి నమస్కరించారు. ఇంద్రునికి పై మంత్రం ప్రసాదించి తన నిజలోకానికి చేరారు.

❖❖❖

4. కర్కటి సూక్ష్మజీవత్వం

పర్వతమంత నల్లటి శరీరంగల ఆ రాక్షసి క్రమంగా సూక్ష్మత్వం పొందసాగింది. 'సూది' అంత అయినది. ఆ తరువాత అణుమాత్రమంత అయింది. నల్లటి యినుపసూదిగాను, 'జీవసూచిక' గాను అయినది. పంచ మహాభూతములచే, పంచ జ్ఞానేంద్రియములచే, పంచకర్మేంద్రియములచే, అవిద్యచే, కామముచే, కర్మముచే (వీటినే "పుర్యష్టకము" అంటారు) కదలించబడుచు, ఆకాశంలో సంచరించసాగింది.

శ్రీరాముడు : మహర్షీ! ఇప్పుడు ఆ కర్కటి ఒక 'విసూచి – వ్యాధి' రూపమై పరిణమించింది కదా! ఇప్పుడు దాని దేహము–రూపము లోహము వంటివా?

శ్రీ వసిష్ఠ మహర్షి : "సూచి (సూది) రూపత్వము" అని మనం చెప్పుకొంటున్నది. ఆ రాక్షసి తనయందు తనయొక్క కల్పనచే అనుభవముగా గాంచుచున్నది మాత్రమే. అంతేగాని దానియందు 'లోహత్వము' అనునది లేదు. భ్రమచేతనే అది అట్లు అగుపిస్తోంది.

అది ఒకానొక రక్తపిపాసియగు సూక్ష్మజీవి.

అది మననశీలమగు మనస్సుతో, మిలమిలమెరిసే అతి సూక్ష్మమైన కంటి పాపలతో ఇక సంచరించసాగింది. ఆకాశమువలె నీలంరంగును పొంది, ఇతరులచేత తెలియబడకుండానే తన వ్యాపారము కొనసాగించసాగింది. ఇతరులకు మహాహానికరమై, బాధను ప్రసాదించునదై, అవయవములను క్షీణింపచేయునదై ప్రవర్తించసాగింది.

ఆహాఁ! చూచావా? ఆ రాక్షసి ఈ జగత్తంతా భక్షించాలనే కోరికతో సూది రూపమును దాల్చింది. కాని, స్వల్పమైన రూపంతో దేనిని భక్షించగలదు చెప్పు? అది తనయొక్క మూర్ఖత్వం చేత సూచీరూపం పొందిందేకాని, "ఈ అల్పమగు సూచి (సూది) రూపంతో ఇంతటి తుచ్ఛత్వముతో నేను ఏ రుచి అనుభవించగలను?"..... అని ముందు చూపుతో యోచించనే లేదు. అవును మరి. ముందు – వెనుకలను, గుణ దోషములను విచారించకుండానే "అది నాకు ఇష్టం. కనుక పొంద వలసిందే" అని మూర్ఖంగా అభిలషించేవారు చివరికి లేని–పోని దుఃఖములన్నీ తెచ్చిపెట్టుకొంటారు. పాపం, ఆ రాక్షసి.... "నేను విసూచిని అవుతాను".... అని ప్రయత్నించి ఆయా శరీరములలో ప్రవేశించే హింసాతత్వముగా మారిపోయింది. కాని, "నేను ఎంతో ఆహారం భక్షించి ఆనందిస్తాను" అను రూపము గల దాని సంకల్పము చివరకు నిరర్థకమే అయింది. 'రుచి' అను అనుభవం లేకుండా రక్తపానం మాత్రం చేయసాగింది.

మూఢబుద్ధితో ఇతరులను బాధించవలెనని చింతించే వారికి 'పూర్వ–పర' విచారణ లోపిస్తూ ఉంటుంది. వారు స్వార్థంతో అభిలషించిన వస్తువుపై మాత్రమే దృష్టిఅంతా కేంద్రీకరిస్తారు కనుక, వారియొక్క ఉత్తమమైన బుద్ధి కలుషితమైపోతుంది. చివరకు అనుకున్నది లభించదు.

❖

ఆ రాక్షసి తన స్థూల దేహమును పోగొట్టుకొని, "సూచిత్వము" గ్రహించి, కొద్దికాలం తరువాత, "అయ్యో! ఈ అతిసూక్ష్మమగు 'సూచి' రూపంతో నేనేమీ చేయలేకపోతున్నానే? ఇంతకన్నా ఆకలితో అలమటించినప్పటి స్థూల శరీర స్థితియే బాగున్నదే !" అని వాపోవటం ప్రారంభించింది. ఆహా! ఒకే వస్తువు (లేక) విషయముపై అనురాగము కలిగియున్న జీవునిగతి అధోగతి కాగల ప్రమాద మున్నది. ఇతరజీవుల రక్తమాంసములపై గల ప్రీతిచే ఆ కర్కటి, తన ఇతఃపూర్వపు స్థూల శరీరమును కూడా తృణమువలె వర్జించివేసింది.

ఓ రామచంద్రా! ఈ జీవుని చూచావా? ఇతడు ఆయా వస్తువులపై, విషయములపై, నామ రూపములపై పెంచుకొంటున్న "అతిప్రీతి – అభిమానము"ల కారణంగా జ్ఞాన సముపార్జనకు అర్హత – సామర్థ్యములను పోగొట్టుకొంటున్నాడయ్యా!

❖

ఆ విధంగా మరికొంతకాలం గడచిపోయింది. ఆ కర్కటి మూఢబుద్ధిని ఆశ్రయించుటచేత "నేను స్థూల దేహమును కోల్పోయాను".... అనే విషయమే యోచించుట మానివేసింది. 'వ్యాధియే స్వరూపముగా గల విసూచి' అయి ఇతర దేహములందు ప్రవేశించటం ప్రారంభించింది. "మూర్ఖునకు తన వినాశనము కూడా ప్రీతినే కొలుపుతుంది" అని అందుకే అంటూఉంటారు కాబోలు. అది ప్రాణులందు కంటికి కనబడనంత సూక్ష్మ రూపమున చుట్టలుచుట్టుకొని యున్న 'దారము' వలె ఆకారం కలిగియుండేది. పాపయుక్తము, క్రూరము అయిన మనోవృత్తి కలిగియుండి ప్రాణుల దేహములలో ప్రవేశిస్తూ, అక్కడ తారసపడుచున్న రక్తమాంసములను పీల్చసాగింది. అది ఏదైనా ప్రాణిని ఆశ్రయించిందా.... ఇక ఆ ప్రాణియొక్క రక్తమంతా హరించిపోవలసిందే. అది ఆ సమయంలో "లోహదేహము – సూక్ష్మదేహము" అను రెండు దేహములు కలిగిఉండి, విచ్చల విడిగా, అన్ని వైపుల.... ఆ రెండు దేహములతో కూడి తిరుగసాగింది.

శ్రీరాముడు : హే మహర్షీ! ఆ కర్కటి ఉగ్రమైన తపస్సుచేసి భగవానుడగు బ్రహ్మదేవునే ప్రత్యక్షం చేసుకొన్నదికదా! అయినప్పటికీ, అది తన తుచ్ఛమైన 'విసూచికత్వము' ను (The form of a disease) ఎందుకు కోరుకొన్నది? "తపస్సుచే బుద్ధి పవిత్రత పొందుతుంది" అని అంటారు కదా! మరి ఆ కర్కటి విషయంలో అట్లు జరుగలేదేం? పైగా, బ్రహ్మదేవుడు, "నీవు పొందగోరునది అతితుచ్ఛమైనది" అని చెప్పిఉండవచ్చును కదా! ఎందుకు చెప్పలేదు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ సృష్టిలో కనబడుచున్న సర్వజీవులు తమయొక్క సంకల్పవశంచేతనే స్థూలంగానో, సూక్ష్మంగానో అగుచున్నారు. ఆ కర్కటికూడా స్వకీయ అభిలాషతో కూడిన సంకల్పము కారణంగానే గొప్ప స్థూలశరీరము వదలి 'సూచిత్వము' (సూదిభావము) కోరుకొన్నది. క్షుద్రబుద్ధి కలిగి ఉన్నప్పుడు ఈ జీవుడు నీచవస్తువులనే అభిలషిస్తూ ఉంటాడు. ఆ రాక్షసి గొప్పతపస్సుచేసి సూచియై పిశాచత్వమును అనుభవిస్తోంది. "తపస్సు" అనునది కోరుకొనుదానిని సముపార్జించుటకు మార్గము అయిఉన్నది. ఈ జీవుడు తాను కోరుకొనునది తన జ్ఞాన–అజ్ఞానములను అనుసరించే ఉంటుంది. మరొక విషయం. తపస్సుచే పవిత్రమైనప్పుడు కూడా గుణ–కర్మ విభాగములను అనుసరించి ఆయా జీవులకు కొన్నికొన్ని వాసనలు, ఆ వాసనలను అనుసరించి లౌకికయత్నములు ఉంటూనే ఉండవచ్చు.

కర్కటి ఆ విధంగా తన తపస్సుచే ఇతరులను బాధించుటకొరకే సూచీత్వము కోరుకొన్నది. అట్లే అభ్యర్థించింది. అట్లే పొందింది. భగవంతుడు నిష్క్రియుడు సర్వసాక్షి. అకలంకుడు. జీవుడు సంస్కారము, లక్ష్యములను అనుసరించి సాధనను, సాధనను అనుసరించి ప్రయోజనములను;

ప్రయోజనములను అనుసరించి ఆయా స్థితిగతులను పొందుచున్నాడు. ఎవడు దేనికొరకు విధి - విధాన పూర్వకంగా ప్రయత్నించటం, కర్మలను నిర్వర్తించటం జరుగుతుందో అద్దాని దిశలోనే బుద్ధి, ప్రయోజనములు మొదలైనవన్నీ ఉంటున్నాయి. అందుచేత మానవుడు ఉత్తమ ఆశయములను మాత్రమే కలిగి ఉండాలి.

మహాశయుడు కావాలి.

❖❖❖

5. పశ్చాత్తాపం

ఆ విసూచి స్వస్థుల దేహములలో ప్రవేశిస్తూ ఉండేది. ప్రాణవాయువులతో కలసియుండి, దేహము లందు మరింతగా వ్యాధిని కలిగిస్తూ ఉండేది. 'రక్తము పీల్చుట' అను హింసాక్రియ ద్వారా బుద్ధిమాంద్యము గాని, రోగము గాని లేనివారిని కూడా క్షణములలో ఆక్రమించివేసేది. ఒక్కచోట ఒక శరీరములో ప్రవేశించి రక్తమాంసములను పీల్చుచు తృప్తిగా ఉండేది. ఆ శరీరం ప్రాణరహితమైన తరువాత మరొక శరీరంలో ప్రవేశించేది. మరొకచోట మణి (మరకతము మొదలైన ఆయా రాళ్ళు, మణులు) - మంత్రము - ఔషధములచే నిరోధించబడుచూ ఉండేది. ఈ విధంగా స్థూల-సూక్ష్మము లైన రెండురూపములతో ఆకాశమునందు, భూమియందు సంచరిస్తూ అనేక సంవత్సరములు గడపివేసింది. అది ఎల్లప్పుడూ ధూళియందు, మురికివస్త్రములందు, దోషముతో కూడిన నాడులందు, శిథిలమైన తృణములందు, ఎముకలందు, పక్షులు విశ్రమించేచోట, వికృతమైన ఆవేశాదులు కలిగియున్నవారి యందు, సురాపానమువంటి మత్తు కలిగించు దురాభ్యాసములు ఉన్నచోట, యాత్రికులు ఉండే ప్రదేశంలో, బురదతో కూడిన మడుగులలో, మురికి కాలువలలో సంచరిస్తూ ఉండేది. ఇట్లా అది ఒకచోటినుండి మరొకచోటికి అవిశ్రాంతంగా పయనిస్తూ, జీవులను దుఃఖింప చేస్తూ కొంతకాలానికి ఎంతగానో అలసిపోయింది. దాని బారినపడిన ఎందరో ప్రాణుల శరీరాలు నేలకూలాయి. ఇతరులను బాధించకలిగినపుడు ఆనందమును, నిరోధించబడినప్పుడు దుఃఖమును పొందుతూ వచ్చేది. క్రూరత్వం, బాధించటం - ఈ రెండూ దాని స్వరూప, స్వభావాలు అయినాయి.

ఈ విధంగా అది అంతఃకరణముచే ప్రేరేపించబడుచున్నదై, తన లోహసూచిక (స్థూలము), జీవసూచిక (సూక్ష్మము) రూపముతో దిక్కులన్నీ తిరుగుతూ చాలాకాలం గడిపింది.

అనేక సంవత్సరాల తరువాత అది ఒకప్పుడు తన దేహమును చూచుకొని పశ్చాత్తాపం పొందసాగింది. పాపం! ఆ కర్కటి కూడా ఆనందమే పొందాలని అనుకొన్నది కదా! కాని ఆకలికి 'దాసోఽహం' అయి, అట్టి దుస్థితి తెచ్చుకొన్నది. దాని హృదయంలోకూడా ఇతర జీవుల పట్ల కరుణ - ప్రేమలు ఎక్కడో కొంతైనా లేకపోలేదు. అయితే, అది కాస్త మౌనం వహించి 'ప్రశాంతత' ను ఆశ్రయిస్తూ ఉండగా ఇంతలోనే, రాక్షస స్వభావం ప్రవృత్తమౌతూ ఉండేది. వస్త్రములందు

ప్రవేశించి, "ఈ జీవుని బాధించటం ఎట్లా?" అని మరల యోచిస్తూ ఉండేది. ఒకప్పుడు ఉన్ని వస్త్రములలోను, మరొకప్పుడు పిల్లల చేతివ్రేళ్ళ-కాలివ్రేళ్ళ సందులందు ఉంటూ ఎంతో గర్వంపొందేది. కొయ్య-మట్టిగోడ కూడా దానికి నివాసయోగ్యమైన స్థానములే. మధ్య మధ్యలో ఏదో చెప్పరాని నిస్తేజమును, పశ్చాత్తాపమును, అనిర్వచనీయమైన దిగులును పొందుతూ ఉండేది.

ఈ విధంగా ఆ కర్కటి అనేకమంది మనుష్యుల రక్తమాంసములను పీల్చుచు, ఆకలి తీర్చుకొంటున్నప్పటికీ, దానియందు 'తృష్ణ' ఏమాత్రం చల్లారలేదు.

ఒకరోజు అది తన అంతరంగంలో ఎట్లు యోచించసాగిందో రేపు విచారిద్దాం.

❖❖❖

(ఆరవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

ఏడవ రోజు

6. పునః తపస్సు

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ కర్కటి ఇట్లు యోచించసాగింది.

అయ్యో! ఈ సూచీత్వమును నేను ఎందుకు గ్రహించినట్లు? ఇంత సూక్ష్మమైన, శక్తిహీనమైన రూపంతో ఒక కబళం కూడా తినలేను కదా! ఇతఃపూర్వపు నా సువిశాలమైన అవయవములన్నీ ఏమైనాయి? అప్పట్లో రుచికరమైన మాంసపు ముద్దలను సమృద్ధిగా భుజించేదానిని. ఇక ఇప్పుడో.... ఇతరుల పాదములందు గ్రుచ్చుకొనుచు, నేలపై దొర్లుచు, రక్తమాంసములలో ఇంకిపోతూ ఇట్లు నికృష్టస్థితులు పొందుచున్నాను. మరలమరల మలినమగుచున్నాను. ఏమి నా బ్రతుకు? అనాథనైన నాకు బంధువులుగాని, మిత్రులుగాని లేరు. ఆశ్రయమంటూ ఏదీ లేదు. ఎంత దయనీయమైన విషయం! ఎంతటి దుఃఖసంకటం! సఖిగాని, దాసిగాని, తల్లిగాని, తండ్రిగాని, బంధువులుగాని, సేవకులుగాని, సోదరులుగాని, పుత్రులుగాని లేనట్టి ఈ బ్రతుకు ఎందుకు? ఊరికే గాలివాటుగా అటూఇటూ తిరగటానికేనా?

అస్సలు, విషాదమైన విషయం ఏమిటంటే,.... నేను తపస్సు చేసి మరీ ఈ “విసూచిస్థితి” అనే విపత్తు మరియు సంకటమును తెచ్చిపెట్టుకున్నాను. ఇప్పుడు చావాలన్నా, చావురాదు కదా! మూఢబుద్ధితో చక్కటి శరీరమును పోగొట్టుకున్నాను.

ఎక్కడ ‘అజ్ఞానం’ ప్రవేశిస్తుందో అక్కడ ముందుగా ‘దుర్బుద్ధి’ వచ్చి చోటు చేసుకొంటుంది కాబోలు. అట్టి దుర్బుద్ధితో కూడిన చిత్తమే అనేక అనర్థములకు దారి తీస్తుంది.

పొగలోను, తృణములలోను పడత్రోయబడుచున్న ఈ నా దుఃఖములకు అంతు ఎక్కడున్నది? ఇతరుల (అనగా మంత్రద్రష్టల) ఆజ్ఞలకు లోబడి వారి ఆజ్ఞలచే నియమించబడుచు, విరమించబడుచు, వారి ఆధీనంలో ఉంటున్నాను. మంత్ర – తంత్ర – ఔషధములచే నిరోధించబడుచు, అంతులేకుండా బాధలను పొందుచున్నాను. ఛీ! తుచ్ఛమైన రక్తం త్రాగాలని నేను ఎందుకు కోరుకొన్నట్లు? నాకు నాలుక ఉన్నదా? రుచి తెలుసా? లేదు. కాని, నా కారణంగా ఇతర జీవులు మాత్రం హింసించ బడుచున్నారు. “ఒక దయ్యం వదిలితే, మరొకదయ్యం పట్టుకొన్నది”.... అను ‘నానుడి’ నాపట్ల అక్షరాలా నిజం అయింది. ‘వినాశకాలే విపరీత బుద్ధిః” అన్నట్లుగా నాపని తయారైనది. ఇక, ఒక క్రిమికీటకము వంటి శరీరముగల నన్ను ఉద్ధరించగల వారెవ్వరు? పోనీ, శాంతి సముపార్జనకై జ్ఞానముకొరకు మహాత్ముల నెవరినైనా ఆశ్రయిద్దామా? దుష్టజీవినైన నన్ను వాళ్ళు దగ్గిరకు రానిస్తారా? ఈనా అజ్ఞానస్థితి తొలగేదెట్లా? ఈ విపత్తు తొలగటానికి ఏదైనా త్రోవ ఉన్నదా? ఇంకా ఎంతకాలం ఈ దుస్థితులలో దొర్లవలసి ఉన్నదో కదా!

ఇప్పటికిప్పుడు నేను నా పూర్వపు విశాలదేహమును పొందగలిగితే ఎంత బాగుంటుంది. ఆహాఁ! భీకరమైన ఆకృతిని ధరించి ఈ కొండపై ఒక కాలు, ఆ కొండపై రెండవ కాలు ఎప్పటికి ఉంచగలుగుతానో? మానవ కంకాళములను దండగా అలంకరించుకొని, కొండగుహలు దద్దరిల్లేటట్లు నవ్వుతూ హిమాలయ పర్వత ప్రాంతములలో ఎప్పటికి హుందాగా సంచరిస్తానో? ఒక చేత్తో మద్యపు కుండను, మరొకచేత్తో శవమును పట్టుకొని శిఖరాగ్రంపై కూర్చుని ఎప్పటికి తింటూ, త్రాగుతానో? దృఢమైన ఆ నల్లని విశాల శరీరమెక్కడ? అతి సూక్ష్మమైన ఈ 'విసూచి' ఉపాధి ఎక్కడ? ఓ నా పొడవైన చేతులారా? మీరు ఇప్పుడు ఎక్కడికి వెళ్ళారు? నా ఈ దుస్థితికి కారణం నేనేకదా! మిమ్ములను పోగొట్టుకొన్నది నేనే!"

❖

ఈ విధంగా ఆలోచించిన ఆ కర్కటి కొంతసేపు 'ఏకాగ్రచిత్త' అయింది. మౌనం వహించింది. ఇంతలోనే అద్దాని మనోపథంలో పూర్వసంస్కారముల ప్రేరేపణచేత "తపస్సు" అనే విషయం తళుక్కున మెరిసింది. "ఔను. ఇప్పుడు నేను తపస్సు చేయటమే ఉచితం. అదియే నా ఈ ప్రవృత్తికి తగిఉన్నది" అని యోచించింది. తన సూచీరూపమును ప్రాణవాయురూపమగు ప్రాణములందు, ప్రాణములను 'జీవసూచిక' యందు, జీవసూచికను 'లోహసూచిక' యందు ప్రవేశింపజేసింది. హిమవత్పర్వతములపై జేరి తపస్సు చేయటం ప్రారంభించింది. అప్పుడు ఇంద్రుడు చేస్తున్న విఘ్నములను కూడా లెక్కచేయకుండా, స్వస్థానమునుండి కదలకుండా, అనేక సంవత్సరములు తపస్సులో గడపివైచింది.

'శ్రద్ధ'తో కూడిన తపస్సు ఊరికేపోతుందా! ఆ రాక్షసి బాహ్యచేష్టలను త్యజించివేసి ఏకాగ్రతతో తపస్సు చేయటంచేత, 'సత్స్వరూపమగు ఆత్మభావన'తో అనుసంధానం ఏర్పడింది. స్వయముగా ఆత్మయొక్క స్వరూప స్వభావములను విచారించుటచే, ప్రబోధం పొందింది. ఆత్మసాక్షాత్కార అనుభవం లభించింది. భూతభవిష్యత్తులందలి ఆత్మయొక్క సమస్థితిని ఎరిగినదై పవిత్రత పొందింది. తపస్సుచే పాపమంతా నశించిపోగా, తెలుసుకొనవలసిన ఆత్మను చక్కగా తెలుసుకొన్నది.

ఆ విధంగా సర్వలోకములను తపింపజేయుచు ఏడువేల సంవత్సరాలు తపస్సు చేసింది. ఆ తపస్సు కలుగజేస్తున్న తాపమును గమనించిన ఇంద్రుడు కూడా వ్యాకులత పొందాడు. అతడు నారదమహర్షిని సమీపించి, "మహర్షీ! ఇది ఏమి?" అని అడిగాడు. అప్పుడు నారదమహర్షి "ఓ ఇంద్ర దేవా! మహాతపస్వినియగు కర్కటీదేవి అనేక సంవత్సరాలు తపస్సు చేసింది కదా! ఇప్పుడు విజ్ఞానమయ శరీరం పొందింది. అందుచేతనే దాని తపోతేజస్సుచే జగత్తంతా ప్రదీప్తం అవుతోంది. ఆ ఉగ్రతపస్సుచే ప్రకృతి కూడా ఎంతగా శుష్కించుచున్నదో చూచారా?" అని పలికారు.

ఇంద్రుడు: ఓ నారదమహర్షీ! ఆ కర్కటి యొక్క అప్రియమైన వృత్తాంతమంతా విన్నాను. అది ఇతః పూర్వం తన తపస్సుచే బ్రహ్మదేవుని మెప్పించి పిశాచంలాగా అదృశ్యమగు జీవసూచిత్వమును పొందింది కదా! జడబుద్ధితో అది ఏమైనా భోగములను పొందకలిగిందా? అది ఎక్కడేమి చేసింది?

శ్రీ నారదుడు : అది నల్లటి లోహసూచిక అయి 'కత్తి' లేక 'ముల్లు' చివరిభాగం ఆశ్రయంగా కలిగిఉండేది. చంచలత్వంతో, పైశాచిక భావంతో.... ప్రాణవాయు మార్గంగా జీవుల శరీరములో ప్రవేశించేది. అచట ప్రవాహరూపమున సంచరిస్తూ 'శూలబాధ' కలిగించేది. మేధస్సు, ప్రేగులు, మొదలైనవి దానికి విశ్రాంతి స్థానం. ఆయా జీవుల భోజనమును, మాంసవిశేషములను తాను అనుభవించేది. జీవుల శరీరాంతర్భాగమును హింసించుచు అపవిత్రరసములను పొందేది. అది ఎందరు జీవుల శరీరములను పీల్చివేసిందో లెక్కే లేదు. అయితే మాత్రం ఏమున్నది? విషయ భోగముల అనుభవము యొక్క ఆనందం పొందలేకపోయింది. అశక్తతతో దుఃఖముపాలు అయినది. అనేకసార్లు "మంత్రము–ఔషధము–తపస్సు"లచే దండింపబడి, హిమాలయములవైపు పరుగులు తీసింది కూడా. ఎంత ఆహారం పొందినా దానికి 'తృప్తి' అంటూ ఉండేది కాదు. శరీరములేని వానికి అనుభవమే ఉండదుకదా మరి! అందుచేత "నేను నా ఇతఃపూర్వపు దీర్ఘదేహమును పొందెదను గాక!" అని ఇచ్ఛపొందింది. ఒక పక్షి శరీరంలో ప్రవేశించి, దానిని ప్రేరేపించుటద్వారా హిమాలయం చేరింది. ఆ పక్షి ముక్కులోంచి బయటికి వచ్చింది. ఒకచోట ఆసీనురాలై దీర్ఘతపస్సు ప్రారంభించింది. అప్పటినుండి ఇప్పటిదాకా తపస్సు చేస్తూనే ఉన్నది. చాలా సంవత్సరములు గడచిపోయాయి. ఆ కర్కటికి ఏదైనా వరం ఇచ్చి సంతోషింపచేసి తపస్సు నుండి విరమింపజేయటమే ఇప్పుడు ఉచితం.

❖

నారదుడు చెప్పినదంతా విన్న ఇంద్రదేవుడు వాయుదేవునితో "ఓ వాయుదేవా! మీరు నలుదిక్కుల ప్రసరించి ఆ కర్కటి ఏ ప్రదేశమున ఉన్నదో గమనించండి. అది ఎట్లు ఏ స్థితిలో ఉన్నదో నాకు తెలియజేయండి. ఆ వర్తమానమును అనుసరించి తరువాత చేయవలసినది నిర్ణయించుకొందాము" అని ఆజ్ఞాపించాడు.

అప్పుడు వాయుదేవుడు భూతలముపై 'దివ్యజ్ఞానాంశము' వలె చరించుచు, జంబూద్వీపం పైగల హిమాలయ పర్వతంపై ఒకచోట కర్కటిని చూచాడు. అది అత్యంత సూక్ష్మమై, శిథిలమై ఉండి ఏకాగ్రతతో తపస్సు చేసుకొంటోంది. వాయుదేవుడు ఆ కర్కటిని సమీపించాలని ప్రయత్నించి కూడా విఫలుడైయ్యాడు. "ఓరాక్షసీ! నీవు ఎందుకు ఈ తపస్సు చేస్తున్నావు?" అని ఎలుగెత్తి బిగ్గరగా పలికాడు. కాని ఏం లాభం? ఆ శబ్దం ఆ రాక్షసి చెవులను సమీపించనే లేదు. అప్పుడాతడు ఇంద్రుని వద్దకు తిరిగివెళ్ళి ఇట్లు పలికాడు.

వాయుదేవుడు : ఓ ఇంద్రదేవా! మీరు ఆజ్ఞాపించిన విధంగా ఆ 'విసూచి' కొరకు వెతకి అది ఉన్నట్టి స్థానం గుర్తించాను. అది ఎందుకొరకో, ఏమో.... ఉగ్రతపస్సు చేస్తోంది. ఆ తపోసమయంలో వాయువును కూడా భక్షించుటలేదు. అది తన శరీరమును లోహమయం ఒనర్చుకొన్నది. మనమెవ్వరం కూడా దానిని వరములచే తృప్తిపరచలేం. మనం పితామహుడగు బ్రహ్మదేవుని, ఈ విషయంలో, ఆశ్రయించటం మంచిది. దాని తపఃప్రభావం చేత ఆ హిమవత్పర్వతం తన సహజలక్షణమై యున్న శీతలత్వమును వదలి ఉష్ణత్వము సంతరించుకొంటోంది. అందుచేత అట్టి తీవ్రమైన తపస్సు లోకమునకు హానికరమే అయిఉన్నది.

అప్పుడు ఇంద్రాదిలోకపాలకులు బ్రహ్మదేవుని సమీపించి విషయం నివేదించారు. పితామహుడు అంతా విని వారికి అభయం ఇచ్చి, వారిని పంపివేశారు.

❖❖❖

7. స్థూలదేహప్రాప్తి

ఆ కర్కటి తన యొక్క తీవ్రమైన తపస్సు యొక్క ప్రభావం చేత పవిత్రమైన బుద్ధిని పొందింది. ఆత్మవిషయమై విచారించసాగింది. అనేక యుక్తులతో బ్రహ్మమును సుస్పష్టంగా తెలుసుకొన్నది. "ఆహాఁ! 'నేను ఆత్మనే' అను భావనయే సర్వస్వము. ఆత్మజ్ఞానమే గురువు. దైవము. మమాత్మయందే ఈ సర్వము కూడా!" అని గ్రహించసాగినది. జ్ఞానదృష్టిచే ప్రశాంతముగా అనేక సంవత్సరములు మౌనం వహించియున్నది. ఒకరోజు బ్రహ్మదేవుడు ఆ కర్కటికి ప్రత్యక్షమైనాడు. కర్కటియొక్క మనోదర్పణంలో ప్రతిబింబించి సంబోధించసాగాడు.

శ్రీబ్రహ్మదేవుడు : ఓ పుత్రీ! దీక్షాపూర్వకమైన నీ తపస్సుకు మెచ్చాను. ఏమి కావాలో కోరుకో.

జీవము మాత్రమే కలిగియుండి, కర్మేంద్రియములు లేనట్టి ఆ విసూచి బ్రహ్మదేవుని మధురవచనములు విన్నది. కాని, ఎట్టి ప్రత్యుత్తరం ఇవ్వలేదు. తనలో తాను ఇట్లు అనుకొన్నది.

"నా సంశయాలన్నీ నశించాయి. పూర్ణత్వం పొందాను. ఇక వరములతో నాకేమిపని? ఇప్పుడు నేను శాంతమును, తృప్తిని సుఖమును పొందుచున్నానుకదా! తెలుసుకోవలసినదంతా తెలుసుకొన్నాను. వివేకము లభించిన తరువాత ఇక పొందవలసినది ఏమి ఉంటుంది? ఇప్పుడు ఎట్లు ఉన్నానో, అట్లే ఉంటానుగాక! నేనే సత్యస్వరూపిణినై యుండగా, ఇక నాకు మిథ్యయగు వస్తువులను ఆశించవలసిన పని ఏమి ఉన్నది? ఆహాఁ! ఇంతకాలం అవివేకంతో ఎక్కెడెక్కడో సంచరిస్తూ అనేక దుఃఖములను పొందాను. ఇప్పటికి ఆత్మవిచారణ మాత్రంచేత నా అవివేకమంతా నశించింది. నాకు ఇష్టములేమిటి? అయిష్టములేమిటి?.....!"

అని అనుకొంటూ బదులు చెప్పకుండా మౌనం వహించియున్నది. నియతియుక్తుడైన బ్రహ్మదేవుడు ఇది చూచి చాలా సంతోషించారు. రాగరహిత అయిన ఆ కర్కటితో ఇట్లు పలికాడు.

శ్రీ బ్రహ్మదేవుడు : ఓ పుత్రీ! ఆత్మజ్ఞానము పొందుటచే పరమపవిత్రురాలవయ్యావు. నీ తపస్సుకు ప్రయోజనంగా వరం స్వీకరించు. మరి "నియతి" గౌరవించబడాలికదా! ఈ భూమండలమునందే ఉంటూ మరికొంతకాలం భోగములను అనుభవించు. ఆ తరువాత ఉత్తమోత్తమమగు బ్రహ్మపదమును పొందెదవుగాక! ఇది ఈశ్వరనియతి. దీనిని మేము కూడా మార్చలేము సుమా!

ఈ తపస్సు యొక్క ప్రయోజనంగా నీ సంకల్పము ఈడేరుగాక! మరల నీ ఇతఃపూర్వపు విశాల శరీరం పొందుతావు. రాక్షసివై హిమాలయములపై సంచరిస్తావు. ఒక బీజంలో సూక్ష్మ రూపమున అంకురం (మొలకెత్తు స్వభావం) దాగి ఉంటుంది కదా! అదే విధంగా "నేను పూర్వ దేహమును పొందాలి" అనే కోరిక నీయందు అంతర్భూతమై ఉన్నది. అయితే ఏం? చిత్తశుద్ధిచే

స్వస్వరూపమగు పరబ్రహ్మమును తెలుసుకొన్నావు కదా! అందుచేత, నీవు నీ పూర్వదేహము పొంది నప్పటికీ, ఇంతకుముందువలె లోకములను బాధించవు. విశాలమైన రాక్షసి ఉపాధి పొందినప్పటికీ, నీవు ఎల్లప్పుడు నిర్వికల్పసమాధియందే ఉండి ఉంటావు. ఎప్పుడైనా ఆ సమాధినుండి లేచినప్పుడు, ఆ సమయంలో సర్వులను ఆత్మస్వరూపులుగానే చూస్తూ ఉంటావు. వ్యావహారిక దృష్టికి మాత్రం "ధారణ-ధ్యానము" లను అవలంబిస్తూ ఉంటావు. వాయువుకు స్పందము ఎట్లా స్వభావసిద్ధమో, అట్లాగే నీవు కూడా నిర్వికారంగా ఉంటూనే ఈ చేష్టాయుక్తమైన శరీరం బాహ్యానికి కలిగిఉంటావు. జ్ఞానముచే మనోపవిత్రత ఆర్జించిన నీవు రాక్షసస్వభావులు నిర్వర్తించే ఆశాస్త్రీయ హింసకు స్వభావసిద్ధంగానే దూరంగా ఉంటావు. న్యాయమును పరిపాలిస్తూనే, ప్రకృతి సిద్ధమైన ఆకలిని తీర్చుకొనుటకు మాత్రమే కొన్ని ప్రాణులను భక్షిస్తావు. నీయందు అకృత్రిమమైన న్యాయవృత్తి వచ్చి చేరుటచే, న్యాయమును అతిక్రమించువారలను మాత్రమే బాధిస్తావు. జీవన్ముక్తవై వివేకము కలిగియుండి, ఈ భూమిపై సంచరిస్తావు. నీకు శుభమగుగాక!

❖

ఇట్లు పలికి భగవంతుడగు బ్రహ్మదేవుడు అంతర్ధానమైనారు. అప్పుడా రాక్షసి, "పితామహుడు బ్రహ్మదేవుని అభిప్రాయం అనుసరించి, అట్లే అగుగాక! ఒకానొక ఉపాధి ప్రాప్తించినంత మాత్రంచేత ఆత్మజ్ఞానమునకు లోటు ఉండవలసిన పని ఏమున్నది?" అని తలచి, తన పూర్వశరీరము గురించి చింతించసాగింది. అట్టి సంకల్పబీజంచే క్రమంగా పూర్వపు దేహం యథాతథంగా పొందింది.

ఆ విధంగా స్థూలత్వము పొందినదై హిమాలయ పర్వతములపై సంచరించసాగింది. చిత్స్వరూపమునకు సంబంధించిన జ్ఞానము తనయందు ఉదయించియుండుటచేత ఆ సంచారం కూడా ఆ రాక్షసికి ఆనందమే ఇచ్చింది. ఆ కర్కటి యందు ఇప్పుడు రాక్షసస్వభావం లేదు. ప్రాపంచిక దుఃఖ సమ్మిళితములైన వాసనలు లేవు.

❖❖❖

8. వాయుదేవుని ఉద్బోధ

ఆ కర్కటి ఆయా ప్రదేశాలలో సంచరిస్తూ ఒకసారి ఒకచోట పద్మాసనం వైచుకొని, శుద్ధ జ్ఞానమును ఆశ్రయించి ఆత్మధ్యానపరాయిణ అయి స్థిరంగా పర్వతంవలె ఉండిపోయింది. అట్లు ఆరునెలలు గడచిపోయాయి. ఒకరోజు సమాధినుండి లేచింది. మరల బాహ్యవృత్తులు పొందింది. మరుక్షణం ఆ రాక్షసికి ఎంతో 'ఆకలి' అనిపించింది. శరీరము ఉన్నంతవరకు, ఆ శరీరము యొక్క స్వభావం ఉండనే ఉంటుంది కదా!

"ఆహా నాకిప్పుడు ఎంతో ఆకలి వేస్తోందే? ఏమైనాసరే! నేను న్యాయమును మాత్రం అతిక్రమించను. పూజ్యులగు మహానుభావులను బాధించటం, వారిచే దూషించబడటం, అన్యాయంగా సంపాదించి భుజించటం.... ఇట్టి క్రియల కంటే చావటం మంచిది. ఒకవేళ న్యాయంగా సంపాదించ

బడిన ఆహారం దొరకకపోవటం జరిగితే, అట్టి పరిస్థితులలో ఈ శరీరం నశించినా కూడా మంచిదే. అన్యాయార్జితమైన ఆహారం విషతుల్యమే. లోకసమ్మతము కాకుండునట్టి భోజనం సంపాదించి జీవిస్తే మాత్రం ఏంప్రయోజనం? పైగా, ఆత్మయే స్వరూపముగా కలిగియున్నట్టి నాకు జీవించితే ఏం ఉన్నది? మరణిస్తే మాత్రం ఏం? ఈ శరీరాదుల రాకపోకలచే సత్స్వరూపుడనగు నాకు లభించునది గాని, నేను కోల్పోవునది గాని ఏమీ ఉండదు. ఈ 'దేహం' అనబడే వ్యవహారమంతా సంకల్ప మాత్రమే కదా! దేహాభిమానం ('నేను దేహమును' అనునట్టి అల్పజ్ఞత) ఉన్నంతవరకు ఆత్మజ్ఞానం లోపిస్తూనే ఉంటుంది. కనుక ఈ జీవన్మరణముల వైపు దృష్టినే సారించను."

ఇట్లు తలచుచు, మౌనం వహించి ఉన్నది. సర్వప్రసరణశీలుడైయున్న వాయుదేవుడు ఆ కర్కటిని, ఆమె ఆలోచనల తీరును గమనించాడు. రాక్షస స్వభావం త్యజించినందుకు సంతోషం పొందాడు. ఆకాశమునందు ఉంటూనే ఇట్లు పలికాడు.

వాయుదేవుడు : బిడ్డా! కర్కటీ! నీ వితరణశీలము చాలా ఉత్తమంగా ఉన్నది. ఉత్తమ జ్ఞానివయ్యావు. అయితే, నీయొక్క శరీరధారణ, తదితర సంసారిక క్రియలు శుభప్రదమే అవుతాయి. ఆత్మ జ్ఞానులు తమయొక్క ఆయా మాటలచే, చర్యలచే ఈ భూమిని పవిత్రం చేస్తూ ఉంటారు. నిన్ను జ్ఞానము కొరకు ఆశ్రయించేవారికి జ్ఞానోపదేశం చెయ్యవచ్చును కదా! మూఢులకు అజ్ఞానం తొలగించుటయే మహాత్ముల స్వభావమైయున్నది. ఇంద్రియవిషయముల పట్ల మాత్రమే ధ్యాసగల అల్పజీవులు తారసపడినప్పుడు, అట్టివారు నీకు ఆహారమవటానికే ఉత్పన్నమైనారని భావించవచ్చు. అట్టివారిని నీవు న్యాయముగా లభించిన ఆహారంగా తలచవచ్చు. అట్టివారిని భుజించుటచే దోషము ఉండదని నా అభిప్రాయం.

కర్కటి : తండ్రీ! వాయుదేవా! మీరు నాకు ఉత్తమమైన విషయమునే గుర్తుచేశారు. నన్ను అనుగ్రహించి ఉద్ధరించినవారయ్యారు. మీరు చెప్పినట్లే ఈ ఆత్మజ్ఞానమును అజ్ఞానులకు వినిపిస్తాను. అట్లు వినుటకు తగినట్టి సంస్కారం లేనివారిని మాత్రమే భక్షిస్తాను. తద్ద్వారా ప్రకృతి సిద్ధమైన ఈ నా ఆకలిని తీర్చుకొంటాను. ఇట్టి ఆలోచనను ప్రసాదించినట్టి సద్గురుతుల్యులగు మీ పాదములకు నమస్కరిస్తున్నాను.

❖❖❖

9. అరణ్య ప్రవేశం - కిరాతరాజుతో సమావేశం

ఇట్లు పలికి ఆ కర్కటి అక్కడి నుండి లేచింది. వనభూములు, పర్వత ప్రదేశములు దాటి, ఒక కిరాతరాజ్యం ప్రవేశించింది.

అప్పుడు అర్ధరాత్రి సమయం. అంతా చీకటి తాండవిస్తోంది. ఆకాశంలో దట్టంగా మేఘాలు క్రమ్ముకొని ఉండటంచేత, నేలపై కాటుకవంటి చిమ్మచీకటి వ్యాపించి ఉన్నది. అల్లంత దూరంలో ఆ కిరాతరాజ్యంలో గల ఇండ్లలో దీపాలు మినుకుమినుకుమంటూ వెలుగుతున్నాయి. ఆ చీకట్లో

పిశాచాలు తాండవిస్తున్నాయి. ఆ చుట్టుప్రక్కల దూరంగా కనిపిస్తున్న అనేక గ్రామాలలో ఆయా జీవరాశులు నిద్రాసుఖం అనుభవిస్తున్నాయి. కప్పల బెకబెకలు, కీచురాళ్ళ రణగొణలు, వాయు వీచికలకు చెట్లు కదులుచున్న శబ్దాలు వినబడుచున్నాయి.

❖

ఆ కిరాతరాజ్యాన్ని "విక్రముడు" అనే రాజు పాలిస్తున్నాడు. అతడు మహాధీశాలి, వీరుడు కూడా. ఆరోజు అతడు తనమంత్రితో కూడుకొని ఆయుధములు ధరించి, రాజ్యమునకు సమీపంలో ఉన్న ఆ అరణ్యంలో సంచరిస్తూ ఉన్నాడు. ప్రజలను బాధించే మృగములను, బేతాళాది దుష్టజీవులను నిరోధించి ప్రజలకు ప్రశాంతత కలిగించటానికి వారు ఆ అడవిలో ప్రవేశించారు. తమ ప్రజలను ఆయా దుష్టవ్యాధులనుండి రక్షించటానికి ఏవైనా ఉపాయాలు వెతకటం కూడా వారి ఉద్దేశ్యం.

కిరాతరాజును, అతని మంత్రిని దూరమునుండి చూచి మన కర్కటి తనలో, "ఆహాఁ! సంతోషం, నాకిప్పుడు మంచి భోజనం లభించింది. వీరు ఒకవేళ ఆత్మజ్ఞానము లేనట్టి మూర్ఖులే అయితే, వీళ్ళ ఉనికి భూమికి భారమే అవుతుంది కదా! మూఢులు, మూర్ఖులు ఇహ-పర లోకములందు దుః ఖములను, వినాశనములను మరల మరల పొందనున్నారు. అనర్థం కలుగజేయు ప్రాణులను భక్షించటం కూడా లోకహితమే అవుతుంది. ఏ అజ్ఞాని ఆత్మను ఎరుగకుండానే జీవిస్తూ ఉంటాడో, అట్టివాడు మరణించి, నా ఆకలి తీర్చటమే ఉచితం. నేడు ఈ ఇద్దరిని భుజిస్తాను. అయితే వీరు జ్ఞానులో, అజ్ఞానులో తెలుసుకోవాలి. ఎట్లా? రూపురేఖలను బట్టి మనం జ్ఞానులను, అజ్ఞానులను నిర్ణయించలేమే? జ్ఞానులైనవారు మానవులలోను, జంతువులలోను, రాక్షసులలోను, పిశాచములలోను, దేవతలలోను ఉండవచ్చు. అట్లే అజ్ఞానులు కూడా. అందుచేత వీరిని ముందుగా పరీక్షిస్తాను. వీరు కనుక ఉత్తమజ్ఞానాన్వితులైతే మాత్రం వీరిని తాకను. సుఖము, కీర్తి, ఆయువు అభిలషించేవాడు గుణవంతులను పూజించాలే కాని, బాధించకూడదు. నేను చావటానికైనా సిద్ధమేకాని గుణవంతుల జోలికిమాత్రం పోను. ఆత్మజ్ఞానులైన సాధువులు తమవాక్యములచే తదితర జనులకు ఈ "జీవించుట" అనుదాని కంటే కూడా అధికమైన సుఖమును, ప్రసాదించగలరు. ఈ 'శరీరపోషణ' అను వ్యవహారం కూడా "ఆత్మగురించి వినుట" అనుదాని కొరకు నిర్వర్తించబడినప్పుడే సార్థకత కదా!

నేను నా శరీరాన్ని అర్పించి అయినా సరే గుణవంతుని రక్షిస్తాను. అట్లు రక్షించి ఈ భూమాత యొక్క సంతోషమునకు కారణమవుతాను. ఎందుకంటే, గుణవంతుడైనవాడు తన సాంగత్యంతో ఈ లోకమును పవిత్రమొనర్చగలడు. అతని సాంగత్యం ఉన్నచోట మృత్యువు కూడా సుఖప్రదమై తోచగలదు. నేను రాక్షసినైనప్పటికీ గుణవంతులైన ఆత్మజ్ఞానులను పూజించినప్పుడే కర్తృత్వమునకు సంబంధించిన తృప్తి-సంతోషములు కలుగుతాయి. ఉత్తమ గుణాన్వితులైనట్టి జ్ఞానధనులు ఈ భూమిపై సంచరిస్తూ ఉంటే, ఆ భూదేవతల వాక్యామృతములచే జనులకు పవిత్ర దృష్టి, ఉత్తమ అవగాహన, సామరస్యము, కారుణ్యము, ఐకమత్యము, అభివృద్ధి మొదలగు శుభములు యాదృచ్ఛికంగానే చేకూరుతాయి.

అవును. అట్టివారు తమ సాంగత్యముచే, అమృతమయమగు గుణములచే నావంటివారి హృదయాలలో శాంతి – సౌఖ్యములను నెలకొలుపగలరు. "గుణవంతులను తిరస్కరించి, వారి వచనములను సాంగత్యమును కోల్పోవటమే మృత్యువు" అని నాకు అనిపిస్తుంది. ఓ గుణవంతులారా! మీరు ఎక్కడెక్కడ ఉండి ఉన్నా మీకు నమస్కరిస్తున్నాను. మీతో స్నేహం లభించిందా, ఇక నాకు స్వర్గమోక్షములు కూడా అక్కర్లేదు. ఎన్నో సత్క్రియలకు ప్రయోజనంగా గుణవంతులతో, జ్ఞానవంతులతో నేస్తం ఏర్పడటం జరుగుతుంది.

వీరిని కొన్ని ప్రశ్నలు అడుగుతాను. వీరు ఏమి సమాధానం ఇస్తారో వింటాను. వీరి సమాధానం అనుసరించి వీరు జ్ఞానులగు గుణవంతులో, లేక జ్ఞానహీనులగు గుణహీనులో నాకు తెలిసిపోతుంది. వీరు గుణహీనులైతే సుష్టుగా భుజించివేస్తాను. కాక, గుణవంతులా.... పూజించి తరిస్తాను. వీరిని సంతసింపజేస్తాను.

❖

ఈ విధంగా తనలో అనుకొన్న కర్కటి ఆ కీకారణ్యంలో కారుచీకటి యొక్క అంతర్భాగం నుండి "రాళ్ళవానయా?" అన్నట్లు మేఘగర్జన చేస్తూ ఇట్లు నిష్ఠూరంగా పలుకసాగింది.

కర్కటి: ఓ అల్పజీవులారా! మీరెవ్వరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు? మాట్లాడక పోయారో, ఒక్కక్షణంలో మీరిద్దరు మృత్యువాత పడగలరు. ఊ! త్వరగా మీరెవ్వరో చెప్పండి.

విక్రముడు: ఓరీ! తుచ్ఛుడా! ఇంతకూ నీవెవ్వరు? ఎక్కడినుండి మాట్లాడుచున్నావు? ఏదీ? నీ అల్పశరీరం మాకు కాస్త చూపించు. నీ అరుపులు విన్నంత మాత్రంచేత భయపడి మూర్ఛిల్లేవారు ఇక్కడెవ్వరూలేరు. కాస్త క్రోధం త్యజించు. అరుపులతో మమ్ము భయపెట్టాలనే ప్రయత్నం కట్టిపెట్టు. నీ సామర్థ్యమేమిటో మాకు కూడా చూడాలనే ఉన్నది.

నీవు మమ్ము భయపెట్టాలని పెద్దగా అరచి, ఆ అరుపులకు నీవే భయపడుచున్నట్లు మాకు అనిపిస్తోంది. ఆ గావుకేకలు ఆపి ఇటు రా. నీకేం కావాలో చెప్పు. ఆలస్యం చేసేవారికి కార్యసిద్ధి కష్టతరమే అవుతుందని వినియుండలేదా?

ఆ రాక్షసి ఆ మాటలు విన్నది "సరే. ఇదీ బాగానే ఉన్నది. నా భీకర రాక్షస స్వరూపం వీరికి చూపుతాను. అప్పుడు వీరి ధైర్యమెంతటిదో చూద్దాం!" అని అనుకొన్నది. మందహాసంతో గర్జిస్తూ ఒక దీర్ఘమైన కేక వేసింది. ఆ శబ్దమునకు దిక్కులు పిక్కటిల్లాయి. "ఒక పెద్దనల్లటి కొండయా?" అనుకునేంత శరీరంతో వారికి ఎదురుగా ప్రత్యక్షమైనది. ఆ రాక్షసి ఆకారం చూస్తే పిశాచాలకు కూడా గుండె బెంబేలెత్తి పోగలదు. కాని, మహావీరులగు ఆ రాజు, మంత్రి – ఇద్దరికీ కించిత్ కూడా క్షోభ కలుగలేదు. సత్యాసత్యములను వివేచన చేయగల బుద్ధి కలవారిని మోహింపజేయ గలిగినట్టిది ఈ సృష్టిలో ఏ దృశ్యం ఉంటుంది?

❖

మంత్రి : ఓ రాక్షసీ! నీకు అంత క్రోధం దేనికి చెప్పు? అల్పులు మాత్రమే స్వల్పకార్యము లందు కూడా అత్యధికమైన కోపతాపాదులు చూపిస్తూ ఉంటారని నీవు విని ఉండలేదా? కాస్త ఆ కోపం విడచిపెట్టు, బుద్ధిమంతులకు కోపము తగినది కాదు కదా! ధీమంతులు ఎల్లప్పుడూ యోగ్యమైన, న్యాయమైన రీతిలో మాత్రమే తమతమ కార్యక్రమములను నిర్వర్తించుకొంటూ ఉంటారు. ఓ అబలా! ఇక మా ధైర్యము సంగతి అంటావా? నేను ఒక్కమాట చెపుతాను విను. మా ధైర్యవాయువు యొక్క వీచికచే, నీవంటి అల్పకీటకములు వేలాది కూడా ఎండు గడ్డిపరకల వలె ఎగురగొట్టబడ గలదు. కనుక, దయచేసి నీ క్రోధమును ముందు త్యజించు, ఎవ్వరైతే సమత్వము, నిర్మలబుద్ధి కలిగి ఉండి, ఉచితరీతిగా వ్యవహరిస్తారో.... అట్టివారు మాత్రమే కార్యసిద్ధిని పొందగలుగుచున్నారు.

ఒక పని సిద్ధించవచ్చు, లేదా, సిద్ధించక పోవచ్చు. ఏది ఏమైనా, మొట్టమొదట మాత్రం సామమునే అవలంబించాలి కదా! వ్యవహారసమర్థులలో అనేకులు అట్లే చేస్తారు. కార్యము సునిశ్చితమైన తరువాత ఇక మూర్ఖంగా ప్రవర్తించవలసినపనేమి ఉంటుంది?

ఉపాయములు నాలుగు రకములుగా చెప్పబడ్డాయి.

1. సామము (Requesting & seeking consent)
2. దానము (Offering - increased consideration)
3. భేదము (differentiating)
4. దండము (Applying force - punishing)

ఎదుటివారి సంసిద్ధత మొ॥ వాటిని అనుసరించి ఆయా పరిస్థితులకు ఆయా ఉపాయములను అవలంబించటం ఉచితం. ఇప్పుడు నీ కార్యసిద్ధి కొరకు 'సామము' ను ఉపయోగించవచ్చు. మేము అందుకు మా 'సుముఖత'ను ప్రకటిస్తున్నాం.

మంత్రియొక్క ఉత్తమమైన, సందర్భోచితమైన వాక్యములు విని ఆ కర్కటి ఆశ్చర్యపడింది. తనలో ఇట్లు అనుకొన్నది.

"ఆహాఁ! పురుషులలో శ్రేష్ఠులైన ఈ ఇద్దరిబుద్ధి ఎంతో నిర్మలమైన దానివలె నాకు తోచుచున్నదే? ఓహో! ఏమి బుద్ధిబలం! ఏమి ధైర్యం! వీరిద్దరు అనేకమంది మూఢజనులవలే నాకు అనిపించుటలేదు. వీరి వాక్కు ఎంతో ప్రశాంతత, విజ్ఞత కలిగిఉంది. ముఖకాంతులను పరిశీలించిచూస్తుంటే కూడా, వీరు ఆత్మజ్ఞానులవలెనే ఉన్నారే! రెండు నదులు ఒకచోట కలుస్తున్నప్పుడు, ఆ రెండు నదులలోని జలం ఏకమైపోతాయికదా! అదే విధంగా, ఇద్దరు – ముగ్గురు బుద్ధిమంతులు ఒకచోటికి చేరి యున్నప్పుడు వారి "చూపు, వాక్కు, అభిప్రాయములు"– ఏకం అవుతూ ఉంటాయి. అవి మహాశయమును కలిగి ఉంటూ ఉంటాయి.

ఇప్పుడు నేను వీరియొక్క అభిప్రాయము లేమిటో తెలుసుకొంటాను. వీరిని చంపను. ఎందుకంటే, ఆత్మదృష్టిచే, "మేము నాశరహితులము" అని తెలుసుకొన్నప్పుడు మాత్రమే ఈ విధంగా – మృత్యువు ఎదురుగా నిలిచినప్పుడు కూడా – ఇంతటి ధృతి–ఉత్సాహములు ఉండటం జరుగుతుంది. అందుచేతనే నా ఈ భీకరాకారం చూచిన తరువాత కూడా వీరు వ్యథ చెందలేదు కదా!

ఒక్క ఆత్మజ్ఞానులే మృత్యువు యొక్క వాస్తవతత్వం తెలుసుకొనగలుగుతారు. జీవులలో అట్టివారు మాత్రమే ఇంత నిర్భయంగా నిలబడి ఉండగలరు. ఆత్మజ్ఞానము ఇటు జీవించుటయందు, అటు మరణించుట యందు కూడా గల 'ఆశ-భ్రమ' లను మొదలంట్లా లేకుండా చేసివేయగలదు. అట్టిజీవుడు 'జన్మ-మృత్యువులు' రెండిటినీ బాహ్యమైన విషయములవలె దర్శించగలడు.

ఇప్పుడు నాకుగల సందేహములను వీరిముందు ఉంచుతాను. మహాత్ముల సామీప్యత పొందిన తరువాత వారిని ప్రశ్నించాలి. వారి వచనామృతమును గ్రోలాలి. ఏవైనా సందేహాలు మిగిలి ఉంటే, వాటిని నివృత్తి చేసుకోవాలి. అట్టివారి 'సమక్షం' పొందికూడా చక్కగా ప్రశ్నించి, విని, విచారణ చేయనివారి దౌర్భాగ్యం ఏమనిచెప్పాలి? వారు అరచేతిలోని ఆహారం నేలవిడుస్తూ ఆకలితో అలమటించేవారే అవుతారు.

ఇట్లు ఆలోచనలు పొంది, ఇక కల్పాంత మేఘగర్జన వంటి గొంతుకతో ఇట్లు ప్రశ్నించసాగింది.

❖

కర్కటి: ఓ పాపరహితులగు ధీరపుంగవులారా! మీరెవ్వరు? కాస్త సవివరంగా చెప్పండి. నిర్మల చిత్తులను చూచిన మరుక్షణం మనయందు మిత్రత్వం స్వయంగానే సిద్ధిస్తుందని పూజ్యులు అంటారు. మీ విషయంలో నాకిప్పుడు అట్లే అనిపిస్తోంది. అందుచేత ముందుగా మీ వివరములు తెలియజేయండి.

మంత్రి: ఓ రాక్షసీ! ఇతడు కిరాతరాజ్య ప్రభువు. పేరు 'విక్రమమహారాజు'. నేను ఇతని మంత్రులలో ముఖ్యుడను. ఈ రాజ్య ప్రజల క్షేమము కోరి నీవంటి హింసక స్వభావులను దండించటానికి ఉద్యుక్తులమై ఈ రాత్రివేళ ఇటు వచ్చాం. "దుష్టశిక్షణ-శిష్టరక్షణ" అనునది రాజుల కర్తవ్యమే కదా! ఇట్టి మా స్వధర్మం ఉపేక్షిస్తే మేము ధర్మభ్రష్టులమౌతాము. అందుకే ఈ మా ప్రయత్నమంతా!

కర్కటి: ఓ విక్రమరాజా! నీ మంత్రి స్వల్పబుద్ధి కలవాడని నాకు అనిపిస్తోంది. ఇతని సలహా అనుసరించే ఈ అర్ధరాత్రి వేళ ఇటు వచ్చి నాపాల బడ్డావు. ఇట్టివానిని మంత్రిగా పెట్టుకొన్నావేమిటి? నీవేమిరాజువయ్యా? ఉత్తమ మంత్రి ఉంటేనే రాజు కీర్తివంతుడౌతాడని నీకు తెలియదా ఏమి? రాజును అనుసరించే ప్రజలు కూడా ఉంటారు. "యథారాజా తథాప్రజా" అని లోకప్రసిద్ధి కదా!

సరే అది అట్లా ఉంచు. నీకు ఒక విషయం తెలుసా?

❖❖❖

10. ప్రశ్నలు

సమస్త జ్ఞానములందు 'ఆత్మజ్ఞానము' ఉత్తమోత్తమమైనది కదా! రాజులందరిలోకూడా ఆత్మజ్ఞానము కలిగియున్నరాజు మాత్రమే ఉత్తమోత్తముడని అనిపించుకొంటాడు. 'ఆత్మజ్ఞుడు' అయినట్టి మంత్రి మాత్రమే దూరదృష్టిచే రాజును, రాజ్యమును కాపాడి – "శోభ" కలిగించగలడు.

"ఆత్మజ్ఞానము" ను 'రాజవిద్య' అనికూడా అంటారు. అట్టి ఆత్మజ్ఞానము లేకపోతే రాజు సమదృష్టితో వర్తించటం అసంభవం.

'ఆత్మజ్ఞానం' అనబడే రాజవిద్య ఎరుగని రాజు రాజే కాదు. ఆ మంత్రి మంత్రే కాదు.

అట్టి ఆత్మజ్ఞానము మీరు ఎరుగుదురా? ఎరిగియే ఉంటే, మీరు ధన్యులే. అప్పుడు మీరు నా వలన శ్రేయమునే పొందగలరు.

ఆత్మజ్ఞానము ఎరుగకుండానే జీవిస్తుంటే మాత్రం మీరు.... మీ రాజ్యమునకు, మీ ప్రజలకు, లోకములకు, అంతదాకా దేనికీ.... మీకుమీరే కూడా అనర్థమును కలుగజేసుకొంటున్నవారవుతారు. మీరు జ్ఞానులు కాకపోతేమాత్రం, నా స్వభావానుసారం మిమ్ములను మ్రింగి నా ఆకలి తీర్చుకొంటాను.

ఓ రాజ – మంత్రులారా! ఇప్పుడు నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. మీరు ఇవ్వబోయే సమాధానాలు నాకు తృప్తిని కలిగించాయా.... ఒక బిడ్డ తన తల్లికి ప్రీతిపాత్రమైనట్లు మీరు కూడా నాకు ప్రీతిపాత్రులౌతారు. లేదా, ఇక పర్యవసానమేమిటో మీరు ఇప్పటికే గ్రహించి ఉండాలి!

ఓ స్నేహితులారా! నేను అడగబోయే ప్రశ్నలకు చక్కగా, స్వానుభవం దృష్టిలో పెట్టుకొని, నిర్భయంగా, విమర్శనాపూర్వకంగా సమాధానం ఇవ్వండి. "నీ కార్యము సునిశ్చితమైనట్లే" అని మంత్రి చూచాయగా పలికాడు కదా! అనగా, నా కోర్కె సఫలంచేస్తానని మీరు 'ప్రతిజ్ఞ' చేసినట్లే! మీవంటి ఉత్తములు అన్నమాట తప్పుతారా? ఇక నా ప్రశ్నలు దయచేసి శ్రద్ధగా వినండి.

❖

యథార్థానికి "ఒక్కటే" అయినప్పటికీ, ఉపాధిభేదంచేత మాత్రమే అనేకముగా కనబడుచున్నదేది?

సముద్రంలో అసంఖ్యాకంగా కెరటములు లేచి లయిస్తున్నట్లు, ఏ పరమాణువులో ఈ అనేక బ్రహ్మాండములన్నీ లేచి లయిస్తున్నాయి?

'శూన్యము' కానట్టి ఆకాశము ఏది?

"లేనిది" అయినప్పటికీ, ఉనికిని కలిగియున్నదేది?

ఇంతకీ నేనెవ్వరు?

మీ ఇద్దరిలోను ఉండి ఉంటూ, "అహం" అను భావమును కలిగి ఉంటున్నదేది?

తాను నడుస్తూకూడా, కదలక ఉంటున్నదేది?

తన 'గతి' (Direction) ని నిరోధించుకోకుండానే, ఒకేచోట స్థిరంగా ఉంటున్నదేది?

అది చేతనవస్తువే, కాని, ఒక పెద్ద బండరాయిలాగా ఎటూ కదలకుండా ఉంటోంది. అదేమిటి?

"చిదాకాశము" నందు ఈ విచిత్రమైన జగత్తులన్నీ చిత్రించుచున్నదెవ్వరు?

ఏకాలమునందూకూడా--- తనరూపమును ఏమాత్రం త్యజించనట్టిదేది?

తాను అగ్ని అయివున్నప్పటికీ, దహనశక్తి లేకయే ఉన్నట్టిదేది?

అది స్వయముగా అగ్ని కాకపోయినప్పటికీ, దాని నుండి నిరంతరం ప్రకాశం ఉత్పన్నమౌతోంది. అది ఏది?

తాను నాశరహితుడై, ఈసమస్తమును ప్రకాశింపజేయుచున్నవాడెవడు?

చంద్ర, సూర్య, అగ్ని, నక్షత్రముల కంటె విలక్షణమైనట్టి ప్రకాశము కలిగినట్టిది ఏది?

చూచుటకు అది విషయమేకాదు. కాని అది దృష్టికి హేతువు. అనగా, చూడటానికి తానే కారణమైయున్నది. అదేమిటి?

చెట్లను, తీగలను, పుట్టు గ్రుడ్డివారిని, ఇంద్రియములు లేనివారిని, తదితర సర్వజీవులను ప్రకాశింపజేయునది ఏది?

ఈ ఆకాశము మొదలైనవాటిని ఉత్పన్నం చేసినవారు ఎవ్వరు?

అన్నిటికీ కూడా "సత్త" కలుగజేస్తున్నదెవ్వరు?

ఈ జగత్తంతా ఎందులో ఉన్నది?

జగత్తంతా నిండియున్నదేది?

ఈ జగత్తు వాస్తవానికి ఏదై ఉన్నది?

చీకటిని కూడా ప్రకాశింపజేసేదేది?

ఉన్నది – లేనిది కూడా అయిన అణువు ఏది?

అత్యంత దూరంగాను, అత్యంత సమీపంగాను ఉండేది ఏది?

గొప్ప మహాపర్వతమువలె ఉండే అణువు ఏది?

నిమేషస్వరూపమై [నిమిషములు – (minutes) స్వరూపముగా కలిగినదై].... తానే ఒక 'కల్పము' రూపమున కూడా ఉండేదేది?

ప్రత్యక్షంగా ఉన్నప్పటికీ, లేనట్లే తోచేది ఏది?

చేతనము అయినప్పటికీ "ఇది అచేతనము" అని నిర్ణయింపబడగలిగేది ఏది?

వాయువువలె ప్రసరించగలిగి కూడా, వాయురూపము కానిది ఏది?

శబ్దరూపమైనప్పటికీ, అశబ్దమై ఉండేది ఏది?

అంతయు 'తానే' అయి ఉండి, ఏదీ కానిది ఏది?

'అహం' భావనారూపంగా–'అనహం' భావనారూపంగా.... ఈ రెండు విధాలుగా ఒక్కసారే ఉంటున్నదేది?

ఒకానొకటి ఉన్నది. అది జీవుని స్వస్వరూపమునకు వేరైనది కాదు. కానీ, అదేమి చిత్రమో, అట్టి అనుభవం ఈ జీవునకు అనేక జన్మలలోని ప్రయత్నములచేత మాత్రమే లభిస్తోంది. ఏమిటది?

ఏది లభించిన తరువాత, ఇక అంతకు మించిన లాభము కలుగజేయునదిగాని, లాభమైనదిగాని, కోరతగినదికాని ఉండదో అది ఏది?

దేనియొక్క సర్వస్వము ఎప్పటికీ లభించకుండానే ఉంటోందో.... అది ఏది?

విషయ భోగములందలి ఆసక్తిచే, తాను ప్రసరించియున్నట్టి చోటునే తనకు బాహ్యామైన దానివలె గాంచుచు, స్వస్థతకోసం వెతుకుతోంది. తనకుతానే విస్మరించుకొంటోంది. అది ఏది?

మేరుపర్వతమును కూడా తనయందు ధరించుచు, త్రిలోకములను తృణప్రాయంగా చేసివేస్తున్నది ఏది?

దేనిని అవలోకించినంతమాత్రంచేత ఈ జగద్వ్యవహారమంతా ఒక చిన్నపిల్లవాడి నృత్యమువలె హాస్యంగా తోచగలదు?

గొప్పపర్వతములు కూడా ప్రవేశించగలిగే అణువు ఏది?

తన అత్యంతసూక్ష్మత్వము త్యజించకుండానే, మేరువు కంటే కూడా అధికమైన స్థూలత్వము కలిగి ఉండేది ఏది?

ఒక వెంట్రుకకొసలో లక్షవవంతుకంటే కూడా సూక్ష్మంగా ఉండి, అదే సమయంలో అనంతకోటి యోజనముల విస్తీర్ణం విస్తరించి ఉండేది ఏది?

ప్రకాశమును - అంధకారమును కూడా వ్యక్తపరచునది ఏది?

'వృత్తి' తో కూడిన జ్ఞానమంతా అసలు ఉంటున్నది ఎందులో?

అత్యంత ఆనందమయము, రుచికరము అయిఉండికూడా.... ఈ 'తీపి' మొదలైన రసములు లేకయే ఉన్నట్టిది ఏది?

సమస్త పదార్థములకు విలక్షణమై ఉన్నప్పటికీ, అన్నిటికీ ఆశ్రయభూతమై ఉండేది ఏది?

తననుతాను ఆచ్ఛాదించుకోలేక పోయినప్పటికీ, ఈ జగత్తునంతా ఆచ్ఛాదించివేస్తున్నది ఏది?

ఎద్దానిశక్తిచేత ఈ జగత్తంతా ప్రళయసమయంలోకూడా సత్స్వరూపమై వెలయుచున్నది?

తాను అవయవరహితమైనప్పటికీ, ఈ సమస్తమైన కాళ్ళు, కళ్ళు, "తనవే" అయిఉన్నదేది?

అనేక కల్పములు, మహాకల్పములు కూడా ఎద్దానికి ఒక నిమిషమాత్రం కూడా కాకుండా ఉంటున్నాయి?

తాను యథార్థానికి ఉత్పత్తి అనునదే లేక ఉంటోంది. కాని, దాని నుండే సృష్టికాలంలో 'జగత్తు' అనే వృక్షం ఆవిర్భవిస్తోంది. అది ఏమిటి?

ప్రళయకాలంలో ఈ 'జగత్తు' అంతా అస్పష్టమయిపోయి లయించేది ఎందులో?

మఱ్ఱి బీజములో తదనంతర మహావృక్షం దాగి ఉన్నది. అదేవిధంగా ఈ కల్పములు, ఈ సృష్టులు, ఈ జగత్తులు, నీవు, నేను ఈ మంత్రి మొదలైన చమత్కారమంతా దాగి ఉన్నది ఎందులో?

ఎట్టి ప్రయోజనముగాని, కర్తృత్వము గాని లేకపోయినప్పటికి అన్నిటికీ "కర్త" అయి ఉన్నవాడెవ్వడు?"

ఒకానొక "ద్రష్ట" ఉండి ఉన్నాడు. అతడు తన అభిలాషను అనుసరించి భోగ్యపదార్థములు

సిద్ధించుటకుగాను, తనయొక్క రూపమునే దృశ్యముగా దర్శింపజేయుచున్నాడు. అతడు ఎవ్వరు?

బంగారము తనయందు "గొలుసులు - ఉంగరములు - గాజులు" మొదలైన ఆభరణత్వము కలిగిఉన్నది కదా! అదేవిధంగా, "దృశ్యము-దర్శనము-ద్రష్ట".... అనబడు త్రిపుటిని తనయందు వ్యక్తీకరించుచున్నది ఎవరు?

ఒక మహాసముద్రం ఉన్నది. అందులో సహజంగానే అసంఖ్యాకంగా తరంగాలు ఉన్నాయి. అయితే, ఆ సముద్రంలో తరంగాలన్నీ జలంకంటే వేరైనవి కాదుకదా! అట్లాగే ఈ కల్పనామయ జగత్తులన్నీ ఒకానొకదానికంటే ఏమాత్రం వేరైనవి కావు. అది ఏది?

తరంగములు సముద్రముకంటే వేరైనవన్నట్లు అనిపిస్తూ ఉంటాయి. ఎవని కోర్కెను అనుసరించి ఈ దృశ్య జగత్తు అంతా అతనికి వేరైనదానివలె అనిపించటం జరుగుతోంది?

జలము కంటే, సముద్రము కంటే, ద్రవత్వము వేరా? కాదుకదా! అట్లాగే, ఈ ద్వైతప్రపంచ మంతా కూడా అతి సూక్ష్మమైయున్న ఏ అద్వితీయవస్తువునకు వేరు కాకుండానే ఉండియున్నది?

ఒకచిన్న విత్తనం తనయందు మహావృక్ష తత్వమంతా ధరించియున్నది కదా! ఈ త్రిలోకములన్నీ ద్రష్ట-దర్శన-దృశ్యములతో కూడియున్నాయి. సత్-అసత్ స్వరూపమైయున్నాయి. అట్టి ఈ త్రిలోకములను సర్వదా తనయందు ధరించియున్నది ఎవరు?

భూత-భవిష్యత్-వర్తమాన రూపముతో కూడియున్న ఈ మిథ్యాజగజ్జాలమంతా ఏ సమరసపూరిత వస్తువునందు ఎల్లప్పుడు స్థితి కలిగియున్నది?

ఉత్పత్తి రహితమగు ఏ వస్తువు తన ఏకస్వరూపమును త్యజించకుండానే సవికారమగు ఈ జగత్తు అగుచున్నది?

బీజము వృక్షముగాను, వృక్షము బీజముగాను అగుటకు, అట్లే తదితర సర్వ పర్యవసానములకు కారణమై ఉంటున్నది ఏది?

దేనిసమక్షంలో 'మేరుపర్వతం' వంటి మహాఘనముకూడా ఒక కలువపూవులోని ఒక తంతువువలె అతిస్వల్పమైన దానివలె అగుచున్నది?

ఏది తనయందు కోట్లకొలది బ్రహ్మాండములుకూడా ఒక్కసారే కలిగియున్నది?

ఉపాధి భేదముల దృష్ట్యా (due to different adjuncts) అనేక చైతన్యములతో ఈ విశ్వమును విస్తరింపచేస్తున్నది ఎవరు?

దేనిశక్తియొక్క ప్రభావంచేతనే నీవు, ఈ మంత్రికూడా ఆయా సమస్త వ్యవహారములలో చక్కగా నిర్వర్తించగలుగుతున్నారు? ప్రవర్తించగలుగుచున్నారు?

దేనిని ఒక్కసారి దర్శించామా.... ఇక మనమంతా నిర్మలమైన బుద్ధిని పొందినవారమై అద్దానిని తప్ప, ఇంకదేనిని తలచకయే ఉంటాం?

❖

ఓ రాజా! నా ప్రశ్నలన్నీ విన్నావుకదా! నేను చిత్తశాంతిని పొందుటకుగాను అట్టి వస్తువు లేక 'విషయము' గురించి సవివరణపూర్వకంగా చెప్పండి.

మీ ప్రత్యుత్తరంతో నాలోని సంశయమంతా తొలగిపోగలదని నేను అనుకొంటున్నాను. ఎవడైతే ఈ సంశయములను తొలగించుటకు శక్తుడై ఉండడో, అట్టివాడు అవిద్యతో కూడుకొన్నవాడే కదా! అట్టివాడు అపండితుడే. ఓ బుద్ధిమంతులారా! నా సంశయాలన్నీ నివారించమని మరల మరల అర్థిస్తున్నాను.

ఆ విషయమేదీ మీకు ఇప్పటివరకు ఏమాత్రం తెలియదంటారా? మీరిద్దరు నాకు ఆహారం అవండి. మిమ్ములను భక్షించిన తరువాత, మీ రాజ్యములోని ప్రజలనుకూడా మ్రింగివేస్తాను.

కనుక నా ప్రశ్నలకు సమాధానమిచ్చి, తద్వారా మీ ప్రజలను కాపాడుకోండి. ఆత్మజ్ఞాన శూన్యులకు భోగాదులు ఉండి ఏమి లాభం? అదంతా వారి వినాశనము కొదికే అగుచున్నదిసుమా! అందుచేత మీరు కనుక 'అజ్ఞానులే' అయిఉంటే, ఆకలిచే బాధింపబడుచున్న నేను మిమ్ములను ఆరగించుటలో దోషం ఏమి ఉంటుంది? ఉండదు కదా!

❖

ఈ విధంగా గంభీరంగా పలికి ఆ రాక్షసి మౌనం వహించింది. ఒక్కసారి ఆ అంధకారారణ్యం అంతా నిశ్శబ్దం తాండవించింది. రాజు, మంత్రులిద్దరూ అత్యంత ఆశ్చర్యంతో ఆ ప్రశ్నలన్నీ విన్నారు. మహాధీశాలియగు మంత్రి ఒకచిరునవ్వు నవ్వి, ఆపై ఇట్లు ప్రత్యుత్తరమివ్వసాగాడు.

❖❖❖

11. మంత్రి సమాధానం - "ఆత్మ యొక్క స్వరూప - స్వభావాలు"

మంత్రి : ఓ రాక్షసీ! నీ ప్రశ్నలన్నీ ఎంతో శ్రద్ధగా విన్నాం. నీవన్నీ అత్యంత ఆశ్చర్యకరమైన ప్రశ్నలే. ఆ ప్రశ్నలలో మహాజ్ఞానం శోభించటం మేము గమనించాము. వాస్తవానికి నీ ప్రశ్నలకు చెప్పగల సరిఅయిన సమాధానం మనోవాక్కులచే ప్రకటించబడేదికాదు. అయితే ఆత్మజ్ఞానులు, శాస్త్రములు వ్యవహరిస్తున్నతీరుగా అనుభవమే నిరూపణ అయిఉన్న సమాధానం చెప్పచున్నాను. విను.

❖

నీ యొక్క ఉత్తమోత్తమవచనములచే "పరమాత్మ" గురించే తెలిపావు. ఆ పరమాత్మయే నేను, నీవు, మరియు ఈ సర్వంకూడా.

ఈ వర్తమానక్షణంలోనే ప్రతి ఒక్కరి స్వరూపం అది! : అట్టి ఆ పరమాత్మ "వాక్కు" నకు అతీతమై, మనస్సుకు కూడా అలభ్యమై, పంచేంద్రియముల అనుభవమునకు అందనిదై ఉంటోంది. అణుస్వరూపమై, 'ఆకారము' కంటేకూడా అత్యంత సూక్ష్మమై వెలయుచున్నది. ఒక విత్తనంలో "ఫలములు-పుష్పములు-ఆకులు-కొమ్మలు-కాండము-వ్రేళ్ళు -భవిష్యత్ విత్తులు".... మొదలైన వ్యవహారమంతా ఉండిఉన్నట్లు, 'చిత్' అణువునందే 'సత్-అసత్' రూపమగు ఈ జగత్తంతా

స్ఫురిస్తోంది. అట్టి ఆ సద్వస్తువు ఎప్పటికో ఎక్కడో ఉన్నదికాదు. అందరియొక్క ఈ క్షణములోని ఆత్మస్వరూపము అదే. అనుక్షణం ప్రతిజీవుడు అదియే అయిఉన్నాడు. సృష్టి మొదట్లో స్థితి కలిగియున్నది అదొక్కటే. అందుచేత, సమస్తపదార్థములు దానియందే సత్త పొందుచున్నాయి.

సర్వము - సర్వరూపము - రూపరహితము! : ఆ పరమాత్మయే సర్వము. అందుచేత, ఇకదానికి బాహ్యమైనదంటూ ఏదీ లేదు. అదియే ఆకాశము. అయితే అది జడము కాదు. అది సర్వదా శుద్ధము, దోషరహితము కూడా. శుద్ధ చైతన్యమగు అది ఈ ఆకాశము కంటే వేరైనదికూడా. అనంతమగు ఆ 'చిత్' అణువు ఈ భౌతికమైన ఇంద్రియములచే దర్శించబడజాలదు. ఇంద్రియాలకు 'అవిషయము' అయిఉండటంచేత "అది రూపరహితము" అని చెప్పబడుతోంది. అంతయు తనరూపమే అగుటచే "సర్వరూపము" కూడా. దృశ్యము దానియందు లేదు. అందుచేత "అరూపము" అనటం కూడా సమంజసమే.

గోచరించేదంతా అదే - కాని అగోచరం! : సర్వము తానే అయిఉన్నది. ఏదియు కాకుండానే ఉన్నది. నేను - తండ్రిగా, సోదరునిగా, మిత్రునిగా, సేవకునిగా కుమారునిగా - ఇట్లు అనేకముగా అనేకులకు ప్రాప్తించుచు......., వీటిలో ఏ ఒక్కటీ కాకుండానే ఉన్నాను కదా. ఇది కూడా అట్టిదే.

ఒకే బంగారమునందు అనేక రకములైన అభరణములు ఉంటూకూడా, బంగారముమాత్రం మార్పులేకుండా యథారీతిగానే ఉండిఉంటోంది కదా! ఆ తీరుగానే ఒకే చైతన్యము అనంతసంఖ్యలైన ఉపాధులలో ప్రతిబింబించుటచే భిన్నభిన్నములుగా గోచరిస్తోంది. పరమాకాశస్వరూపమగు ఆ చిదణువే అన్నిటిని ప్రకాశింపజేస్తోంది. అత్యంతసూక్ష్మమై, ఇంద్రియములకు లక్షితము (object of perception) కాజాలకున్నది. అందుచేత అలక్షితము. సర్వులరూపము, సర్వరూపము అదే అయినప్పటికీ-అది ఇంద్రియములకు గోచరించేది కాదు.

శూన్యము - సర్వవ్యాపకము! : పరమాత్మస్వరూపమగు ఆ సద్వస్తువు వస్తురహితమగుటచే "శూన్యము". అయిననూ అయ్యది సర్వుల ఆత్మస్వరూపమై ఉన్నదికదా!.... అద్దానిని 'శూన్యము' అని ఎట్లా అనగలం? ఎవ్వరైనా తననుతానే "నేను లేను. నేను శూన్యమును" అని ఎట్లా నిషేధించుకోగలడు, చెప్పు? ఏ యుక్తిచే విచారించినా సరే "సత్తు" అసత్తు అవుతుందా? లేదు. కస్తూరి తన సువాసనలచే నాలుగువైపులా వ్యాపించియే ఉంటుంది కదా! (అంతట వ్యాపించి ఉంటున్నది. సద్రూపమగు ఆత్మయే అది. అది ప్రతి ఒక్కరి స్వస్వరూపము.)

ఏకము - అనేకము! : ఈ ఇంద్రియవృత్తులచే చిద్వస్తువే (లేక ఆత్మయే) అనేక రూపములుగా అనుభవమౌతోంది. అంతాకూడా అది మాత్రమే. అయితే, అది శుద్ధచైతన్య మాత్రమై, ఇంద్రియములకు అతీతమగు తత్వమై, ఆ ఇంద్రియములను ప్రకాశాపజేయునదియై, అపరిచ్ఛిన్నమై ఉండి ఉంటోంది. అందుచేత అది మరింకేదీ గాకుండానే ఉంటోంది. ఆ పరమాత్మ సర్వదా ఏకమే అయిఉన్నప్పటికీ, ఉపాధిభేదం చేత అనేకంగా తోచుచున్నది. సర్వుల ఆత్మస్వరూపము అదేకనుక, ఈ జగత్తును ధరిస్తున్నది అదే. 'జగత్తు' అనే రత్నం ఉన్నట్టి పెట్టె ఆ పరమాత్మయే. ఆ చైతన్యమహాసముద్రంలో

"జగత్తులు" అనే తరంగాలు ఆవర్తముల వలె (Circles or Revolutions) వ్యక్తమౌతున్నాయి.

స్వానుభవము – అలభ్యము! : అట్లు ఇంద్రియ – మనస్సులకు లభించక, "శూన్యమా"? అని వితర్కించబడుచున్న ఆ పరమాత్మ వాస్తవానికి "స్వానుభవమే" అయిఉంటోంది. ఆత్మసాక్షాత్కారముచే తనయందే లభించుచున్నది. కాని, లభించకయే ఉన్నది. ఎందుకంటావా?

ఏ 'అనుభవి' కైనా (Experiencer) అతని కంటే వేరైనది మాత్రమే లభించటం జరుగుతుంది. అతని కంటే ఏమాత్రం వేరుకానిది అతనికి "లభించుట" ఎట్లా?

వాస్తవానికి అది ఎల్లప్పుడు లభించియే ఉన్నది. "అది ఆకాశరూపము అయి ఉన్నప్పటికీ, శూన్యము మాత్రం కాదు" అని జ్ఞానులు ప్రకటిస్తున్నారు.

"నేను–నీవు–నాది–నీది" – అంతాకూడా "తానే"! : ఓ రాక్షసీ! అద్వైతతత్వ సాక్షాత్కారముచే నేను ఆత్మనే అయిఉన్నాను. నీ రూపమున వెలుగుచున్నదికూడా నేనే. అయినప్పటికీ, పారమార్థిక దృష్టిచే ఆత్మ నాది కాదు. నీదికాదు. మరెవ్వరిదీ కూడాకాదు. నేను, నీవు, అతడు --- ఇత్యాది వ్యవహారమంతటికీ ఆవల అది ఉన్నది. అది కేవలం 'బోధ' స్వరూపం మాత్రమే. "నీవు – నేను – అతడు" అనే భేదభావమంతా అట్టి కేవలస్వరూపమగు ఆత్మయందే ఉద్భవించి లయించుచున్నది. అది మాత్రమే తనంతతానుగా అంతటా వెలుగుచూ, ఈ సర్వమును భాసింపజేయుచున్నది. ఆత్మతో ఏకత్వము సంపాదించిన నిర్మల హృదయములకు అది ఇప్పటికిప్పుడే అనుభవమౌతోంది.

నిశ్చలము – వ్యాపకము! : ఆ "శుద్ధ" చైతన్యమే ఆకాశమువలె అనేక యోజనములు వ్యాపించియున్నది. అన్నివైపులా చలించుచూనే సర్వదా చలించకుండానే ఉంటోంది. ఒకడు తన స్వప్నమునందు స్వీయకల్పనా ప్రభావంచేత తన హృదయమునందే వేలాదిమైళ్ళ విస్తీర్ణం, అసంఖ్యాకమైన పదార్థములను వ్యక్తులను దర్శించుచున్నాడు కదా! ఈ బాహ్యమున తోచుచున్న విస్తీర్ణములన్నీ ఆ 'చిత్‌వస్తువు' నందే ఉండిఉన్నాయి. ఇక, అద్దాని చలనము విషయమేమిటంటావా? అది సర్వత్రా వ్యాపించియుండుటచే, అన్నివైపులా సంచరిస్తూ ఉన్నప్పటికీ స్థిరముగానే ఉండిఉంటోంది. తనయొక్క చిదాకాశ గర్భమునందు సర్వదేశ – కాలాదులు కలిగియుండి, ఏ మాత్రం చలనము లేకయే ఉంటోంది. పొందతగిన ప్రదేశమంతా దానియందే ఉండియుండుటచే ఇక అది ఎటూ పోలేదు. ఒకతల్లి తన 'పైట' క్రింద పాపను ఉంచుకొని, ఆ పాపకొరకు వెతుకుచున్నదనుకో .... కొంతసేపటికి ఆ పాప పైటలోనే ఉన్నదని గమనించినపుడు క్రొత్తగా పొందినది ఏం ఉన్నది? ఈ జీవుడు వాస్తవానికి ఆత్మవస్తువే అయిఉండగా --- ఇక అట్టి ఆత్మవస్తువు ఒకప్పటికి ఏదో నిర్వర్తించి ఆపై పొందటమనేది ఎక్కడ ఉంటుంది?

రాక – పోకలు లేనిది! : ఒక కుండకు మూతనుపెట్టి, దానిని ఒక చోటునుండి మరొకచోటికి తీసుకుపోయామనుకో.... ఆ కుండలోని ఆకాశమునకు రాకపోకలు ఉంటాయా? ఉండవు. ఆత్మకు కూడా గమనాగమనములు లేవు. సమస్త "దేశ–కాల–కల్పనలన్నీ (Space - time - Imaginations) జరుగుచున్నవి. తనయందే అయిఉండగా, ఇక ఎట్లా, ఎటు పోగలదు? దృష్టాంతము

నీ యొక్క స్వప్నమే. నీ స్వప్నంలో కనబడే విస్తారమైన ప్రదేశములు, వస్తువులు, వ్యక్తులు నీయొక్క కల్పన చేతనే దర్శించబడుచుండగా, అందులో నీవు ఒకచోటునుండి మరొకచోటికి పోవుట ఏమిటి?

జడము – చేతనము – కర్తృత్వరహితము!

ఆ చైతన్యము ఒకానొకప్పుడు, "ఈ జడమగు దేహమే నేను" అను రూపముగల తెంపులేని "ధ్యాస" (Cogitation) కలిగి ఉంటోంది. అప్పుడు అది చిత్తమును పొందినట్లు, జడముగా అయినట్లు భావనను ప్రదర్శిస్తోంది. అందుచేతనే, "ఆత్మ జడము – చేతనము కూడా" అని చెప్పబడుచున్నది.

కర్త – అకర్త – భోక్త – అభోక్త! : ఆ చిద్వస్తువు రాతియందు కూడా వ్యాప్తమైయున్నది. అది ఒక బండరాయిలాగా 'మహాఘనము' అని చెప్పబడింది. అనాది–అనంతము అయినట్టి 'చిదాకాశము' అను గొప్ప శిలయందు ఈ 'స్వర్గలోకం–మర్త్యలోకం –పాతాళలోకం' అనబడు విచిత్రములైన శిల్పభాగములను చిత్స్వరూపుడగు పరమాత్మయే చిత్రించుచున్నాడు. అయితే ఆ త్రిలోకముల వ్యవహారమంతా మిథ్య, కల్పన మాత్రమే సుమా! శిలలో కన్పించే ఆయా శిల్పలేఖనమంతా శిలకు వేరైనది కాదు కదా! శిల శిల్పస్థితిలో కూడా శిలగానే ఉండి ఉంటోంది. అట్లే "ఇక్కడ ఏదియు సృష్టించబడుట లేదు. ఇదంతా అకృతమే. అనగా, దీనికి ఎవ్వరూ 'కర్త' లేదు" అను వాక్యములు కూడా సమంజసములే అగుచున్నాయి.

'అగ్ని' యొక్క సత్త, తదితర భూతముల సత్త కూడా ఆత్మసత్తకు అధీనమై ఉంటోంది. ఇక ఆత్మయో, సర్వవ్యాపి కదా! ఈ జగత్తును ప్రకాశింపజేసేది ఆత్మయే. కాని అది అగ్నిలాగా మరొక దానిని దహించేది కాదు. ఆ ఆత్మచైతన్యము దేదీప్యమానమై, ప్రకాశవంతమై, ఆకాశము వలె నిర్మలమై ఉంటోంది. అట్లు ఉండగానే అద్దానినుండి జ్వలనశక్తి గల అగ్ని, తదితర భూతజాలం ఉత్పన్నమౌతున్నాయి.

దానిని స్పర్శించగలిగేదేదీ లేదు .... కాని అంతటికీ స్థానం అదే! : ఆత్మకు రూప–నామాలు లేవు. అనుభవరూపమగు ఆ ఆత్మయే చంద్ర–సూర్యాదులనుకూడా ప్రకాశింపజేయుచున్నది. అట్టి ఆత్మ యొక్క ప్రకాశమును 'మహాకల్పాంతములు' కూడా స్పృశించలేవు. ఈ భౌతికమైన నేత్రాదులకు లభ్యము కానట్టి అనుభవ రూపమగు ఆ ఆత్మయే హృదయంలో దీపమువలె ప్రకాశిస్తూ, సమస్తమైన తదితర ప్రకాశములకు 'సత్త'ను కలుగజేస్తోంది. స్వయం జ్యోతిస్వరూపము..... ఇంద్రియమనస్సులకు అతీతము .... అయినట్టి ఆత్మ నుండే "నీవు, నేను, తదితర జగత్తు" అను ప్రకాశమంతా ఉత్పన్నమగు చున్నది. దీపపు వెలుతురులో వస్తువులు కనబడుచున్నట్లు, ఆత్మ యొక్క ఉనికిచేత ఈ దేహము – ఇంద్రియముల అనుభవం కలుగుతోంది. చెట్లను, పూతీగలను కూడా పోషించేది ఆ పరమ ప్రకాశరూపము, అనుభవమాత్రము అగు ఆత్మయే.

అంతా ఉన్నది అద్దానియందే.... కాని దానికి దేనితోకూడా సంబంధమే లేదు. అద్దానియందు జగత్తు – జీవులు అనబడేవేవీ లేవు. దర్పణంలో అన్నీ అగుపడుచున్నప్పటికీ, దర్పణంలో ఏ వస్తువూ లేదుకదా! స్వప్నాంతర్గత వస్తువులతో స్వప్నదృష్టకు పోలికయే లేదుకదా!

ఓ ఆత్మస్వరూపిణీ! అనుభవస్వరూపమగు ఆత్మయందే ఈ "దేశ–కాల–క్రియాదులు, జగత్‌సత్త" కూడా ఉండి ఉన్నాయని సూక్ష్మ బుద్ధికి తెలియవచ్చుచున్నది. మన బాహ్యా దృష్టితో చెప్పుకొంటే– పరమాత్మయే ఈ జగత్తుకు తండ్రి అయి ఒప్పుచున్నాడు. అన్నిటికి కర్త–భోక్త–ప్రభువు అతడే. కాని పరమార్థ దృష్టితో చూచినప్పుడు ... అతడు పరిశుద్ధాత్ముడు అగుటచే ఏదియు కాకయే, దేనికి సంబంధించకుండానే ఉంటున్నాడు.

జగత్కారణము–జగత్స్వరూపము! : ఆ "చిత్ అణువు" తన అణుత్వమును ఏమాత్రం త్యజించకుండానే ఈ "సువిశాలజగత్తు" అను రత్నమును ధరిస్తోంది. స్వప్నములో, ఆ స్వప్నమునకు ద్రష్టవై ఉన్నట్టి నీవు ఆ స్వప్నజాలమంతా చూస్తూ ఉన్నప్పటికీ–అందులో కొన్నింటిని త్యజిస్తున్నప్పటికీ నిన్ను నీవు త్యజించుట జరుగుతోందా? లేదుకదా! అందులో నీవు పాల్గొనుచు సుఖదుఃఖములు, సంయోగవియోగములు అనుభవిస్తున్నప్పటికీ, ఆ స్వప్నములో తటస్థపడుచున్నదంతా నీ కంటే వేరైనదేదీ కాదు. ఈ దృశ్య జగత్తు విషయం కూడా అట్టిదే! అయితే వాస్తవానికి "ద్రష్ట–దృశ్యము –దర్శనము" ... అను రూపముతో తోచుచున్న ఈ జగత్తు శుద్ధమగు ఆత్మయందు లేనేలేదు. 'మరి ఈ జగత్తు ఉన్నదెక్కడ?– అని మనం పరిశోధిస్తే, ఇది ఆత్మలోనే ఉన్నది కాని, మరింకెక్కడా లేదు. అని కూడా తేలుచున్నది. స్వప్నము నీలోనే ఉన్నదికాని, ఆ స్వప్నమునందు నీవు లేవు కదా! నీవే ఆ స్వప్న రచనా వ్యవహారము కంతటికీ కర్తవు. అంటే ఏమిటి? నీయందు, నీవే, నీ కల్పనచే (లేక) ఊహచే ఆ స్వప్నమును ఆ రీతిగా దర్శించుచున్నావు. అయితే, పరిశుద్ధమగు ఆత్మయే స్వరూపముగా గల నీయందు స్వప్న తుల్యమగు ఈ వస్తుజాలమంతా ఎక్కడుంటుంది? ఉండదు.

అద్వితీయం – నిత్యోపలబ్ధం! : ఆత్మవస్తువును పొందాలంటే అధికమైన ప్రయత్నం అవసరమగు చున్నది. అందుచేత "అది కష్టసాధ్యం" అని అంటున్నారు. బాహ్యదృష్టిచే ఎంతగా వెతికినా లభించదు కనుక "తమస్సు" అని చెప్పుచున్నారు. చిన్మాత్ర స్వరూపమే అది కనుక "జ్యోతిర్జ్యోతి" (అది వెలుగులకే వెలుగు) అని అనటంకూడా సమంజసమే. అది ఇంద్రియములకు అలభ్యం కనుక "అత్యంతదూరంగా ఉన్నది" అని చెప్పబడుతోంది. అదియే ద్రష్ట కదా! అందుచేత అంత సామీప్యములో ఉన్నది మరొకటేదీ లేదు" అను మాట వాస్తవమే అగుచున్నది. నీకు 'నీ'కన్నా వేరేది సమీపమున ఉన్నది చెప్పు? అన్ని సమయములలోను "... నేను ...నేను ..." అను రూపమున అది ప్రత్యక్షముగానే ఉన్నది కదా! అత్యంత సూక్ష్మమై అత్యంత ఘనీభూతమైకూడా ఉన్నది అదే. ఈ "నేను" అనునది ఉండనిది ఎప్పుడు?

స్వీయస్ఫురణ! : జగత్తు = స్వకీయ స్ఫురణ!

ఓ చిదానంద స్వరూపిణీ! దృశ్యమానమై కనబడు ఈ జగత్తంతా "చిత్తము యొక్క స్వయంకృతమైన స్ఫురణ" మాత్రమే సుమా! కనుక ఈ కనబడే పర్వతములు, భూమి, నీవు, నేను – మొదలైన వస్తువులన్నీ సత్యములు ఏమాత్రం కావు. స్వకల్పనచే ఘనీభూతమైన 'దృష్టి' కారణంగా ఇవన్నీ ఈ విధంగా జీవునకు తోచుచున్నాయి. సర్వము కల్పనతో కూడిన దృష్టి యొక్క పర్యవసానమే అయి

ఉండగా, ఇక ఒక అణుస్వరూపమునందు ఒక మహాపర్వతము యొక్క 'సత్త' సిద్ధించుటలో ఆశ్చర్యం ఏమి ఉంటుంది?

కాలము - కాలాతీతం! : ఆత్మ "క్షణము" లో కూడా ప్రకాశిస్తూనే, అదియే 'నిమిషము' అని, 'కల్పము' అని కూడా కల్పింపజేస్తోంది. ఉదాహరణకు, అనేకకోట్ల మైళ్ళ దూరంలో ఉన్న ఒకానొక నగరం క్షణంలో మనస్సునందు భాసించుచున్నది కదా! 'కల్పము' - అంతటి కాలములోని క్రియలనన్నిటినీ ఈ ఆత్మ తనయందు ఒక్క నిమిషంలో ప్రతిభాసింపజేయగలదు. ఒక చిన్న - నిర్మలదర్పణం విశాలనగరమునను కూడా తనయందు ప్రతిబింబింపజేయకలదు. అట్లాగే, ఒక్క నిమిషములో "అనేక కల్పములు" కూడా సంభవమే. ఈ "నిమిషము - కల్పము" మొదలైనవన్నీ ఒకానొక మిథ్యాత్వమును ఆశ్రయించి సూక్ష్మాతి సూక్ష్మమైన అణువులోనే ఉండి ఉంటున్నాయి. ఇక అద్దాని యందు 'ద్వైతము-ఏకత్వము' ఈ రెండూ సంభవములే. మిథ్యాదృష్టికి ఏది ఏ రూపంగానైనా ప్రాప్తించగలదు. ఒకని 'ఊహాకల్పన' యందు ఏది ఎట్లైనా ఉండగలదు కదా! ఇందుకు మనకు దృష్టాంతము "స్వప్నభ్రమ"యే. ఎంతో కాలం ప్రయత్నించిన తరువాత కూడా సంభవించనిది, స్వప్నంలో క్షణకాలంలో సంభవిస్తోంది. హరిశ్చంద్రమహారాజుకు ఒక్క రాత్రియే పంద్రెండు సంవత్సరాలుగా తోచటం జరిగింది. దుఃఖంతో బాధింపబడేవానికి కొంచెము కాలము కూడా అత్యంత దీర్ఘంగా తోచుచున్నది. సుఖము అనుభవించువానికి దీర్ఘకాలం కూడా స్వల్పకాలము వలె గడచిపోతుంది. పాచికలాడేవారికి అనేక రోజులు ఇట్టే గడచిపోతున్నాయి. "కొద్ది సమయం దీర్ఘంగాను, భారంగాను ఉండటం, దీర్ఘకాలం త్వరత్వరగా గడచిపోవటం" అనే ఈ రెండూ విషయాలు మనలో ప్రతి ఒక్కరికీ ఈ లౌకిక జీవితంలో కూడా అనుభవమగుచున్నవే!

బంగారమునందు "ఈ ఈ ఆభరణములు వేరు వేరు" అని తోచుచున్నది కదా! అట్లే, చైతన్యమునందు కూడా ఈ సత్య-అసత్యముల రూపమున గల నిశ్చయమంతా ఏర్పడుతోంది. ఈ అనేక జీవుల రూపంతో, సత్యాసత్యములతో కూడినదై ప్రకాశించుట అద్దాని చమత్కారము మాత్రమే. ఓ చైతన్యస్వరూపీ! పరమార్థ దృష్టియందు "నిమిషము-కల్పము" గాని "దూరము-దగ్గర" గాని, లేనే లేవు. "చిత్ అణువు" నందే ఉండి ఉన్నట్టి చిత్తము యొక్క వృత్తులే భిన్నభిన్నములుగా కనిపిస్తున్న వివిధ రూపములతో కూడిన ఈ దృశ్యజగత్తుకు కారణమగుచున్నది. సర్వము దేనిచే అవధరించబడుతోందో.... అట్టి అధిష్ఠానమగు చైతన్యమునందు 'ప్రకాశము - అంధకారము', 'దూరము - దగ్గర', 'జడము - చైతన్యము' మొదలయినవన్నీ అభ్యాసపూర్వకంగా సంకల్పించబడి, అనుభవించబడుచున్నాయి.

ప్రత్యక్షం - అప్రత్యక్షం! : సర్వేంద్రియములకు 'ఆత్మ' యే శక్తిని ప్రసాదిస్తోంది. కనుక, అది సర్వదా (ఆధార-రూపంగా) ప్రత్యక్షము అయి ఉండనే ఉన్నది. అయితే అది ఇంద్రియాదులకు ఎదురుగా ప్రత్యక్షమై ఉండుటలేదు. కనుక "అది అప్రత్యక్షమైనది" అని అనటం కూడా సరియే. ఆ ఆత్మయే ఒక వైపు ద్రష్ట (Seer) అయి , సద్రూపమై, ఉండి ఉంటోంది. అదే సమయంలో

మరొకవైపు దృశ్యమై ప్రకాశించుచు ప్రాప్తించుచున్నది. అయితే, "ఎదురుగా నిలచియున్నట్టి ఈ దృశ్యము సత్యమే" అను బుద్ధి ఉన్నంతవరకు "చిత్స్వరూపబుద్ధి" ఏర్పడుటలేదు. శిల్పమును చూచేవాడు 'ఇది శిలయే' అనే దృష్టి కలిగి ఉండడు కదా! ఆభరణమును చూచుచున్నప్పుడు "వీటి అన్నిటిలో ఉన్నది ఒకేరకమైన 'బంగారము' మాత్రమే" అనే విషయం ఏమరుపాటు పొందుతోంది. బంగారము అను దృష్టితో చూస్తే "అనేక ఆభరణములు" అను భావావేశం ఉండదు. ఈ దృశ్యమునకు సంబంధించిన సంకల్పములన్నీ క్షీణించటం జరిగినప్పుడు --- తనతో సహా ఈ కనబడే సర్వులయందు, సర్వమునందు 'శుద్ధబ్రహ్మము' ఒక్కటే వ్యాప్తించియున్నట్లు సుదృఢంగా తెలియవచ్చుచున్నది.

సత్తు – అసత్తు! : ఆత్మయే – సర్వులయొక్క వాస్తవ స్వరూపమై ఉండి ఉండుటచే అది 'సత్తు'. అయితే, అది ఒక బాహ్యవస్తువు కాకుండుటచే, అది దుర్లక్ష్యమైన "అసత్తు" కూడా! కథారచయిత నాటకంలోని సంఘటనలను రచిస్తూ, అతడు మాత్రం కథాగమనంలో (లేక) తెరపై అగుపించనట్లు, ఆత్మ ఇంద్రియములకు ఎదురుగా అగుపించకపోవటంచేత 'అసత్తు' కూడా అగుచున్నది.

అది ఎల్లప్పుడు చైతన్యరూపిణిగానే ఉన్నది. ఆత్మయందు ఈ విషయములు, అనుభవములు మొదలైనవన్నీ ఉండుట అసంభవం. ఎట్టి అనుభవములు, మార్పులు, చేర్పులు, దాని యందు ఉండవు. కనుక "ఆత్మ అచేతనమైనది" అని కూడా అంటున్నారు. ఇక ఈ జగత్ విషయం ఏమిటంటావా, ఇది చిత్ (Absolute Awareness) 'ఎరుక కలిగియుండుట' అను తత్త్వము యొక్క చమత్కారం మాత్రమే. చిత్ స్ఫురణమే దీని రూపము. అందుచేత, "జగత్తును చైతన్యమే నిర్మించు చున్నది" అనుట మాత్రం ఎట్లా? సూర్యకిరణములు "మృగతృష్ణయందలి జలం"గా కనిపిస్తున్నప్పుడు, "సూర్యకిరణాలు మమ్ము భ్రమింపజేయుటకే అట్టి పని నిర్వర్తిస్తున్నాయి" అని అనగలమా? సూర్య కిరణాలకు కర్తృత్వం ఆపాదించగలమా? లేదే! అసలు, మృగతృష్ణ కనబడటానికి కారణం ఏమిటి?

1) ద్రష్ట యందలి అజ్ఞాన దృష్టి
2) సూర్యకిరణముల స్వభావసిద్ధమైన ప్రసరణ

'అద్వైతము – విశాల రూపము' అయిన చిద్వస్తువే ఈ జగత్తురూపంగా 'భావన' చే పొందబడుచున్నది.

'సూర్యగోళము' అనగా ఏమిటి? 'కిరణములు – అగ్ని' యొక్క సంయోగమే సూర్యగోళము రూపమున మనకు ప్రాప్తిస్తోంది కదా! 'ప్రకాశము –కిరణములు' కాకుండా సూర్యునకు వేరైన అస్థిత్వమెక్కడ? నాస్థిత్వమెక్కడ? ఈ "నిమిషము–కల్పము" మొదలైన వాటితో కూడిన జగత్తు కూడా బ్రహ్మమునందు కల్పించబడినదై భాసించుచున్నది. సూర్యకిరణముల సంయోగం కారణంగా ఆకాశంలో వర్ణములు ఏర్పడినప్పుడు, అది చూస్తున్నవారిలో కొందరు అజ్ఞాన బాలురు "ఓహో! ఆకాశములోని ఈ ప్రదేశమును ఎవరో బంగారముతో పూతవేశారు" అనుకొంటారు. అజ్ఞానబాలురకు మాత్రమే అట్లు అనిపిస్తుంది కదా! అజ్ఞానికి మాత్రమే అవిద్య యొక్క ప్రభావం చేత ఈ జగత్తు ప్రత్యక్షమై ఎదురుగా నిలచుచున్నది. జ్ఞానికో – ఇదంతా బ్రహ్మముగానే తెలియవచ్చుచున్నది.

వాస్తవానికి బ్రహ్మమునందు (శుద్ధస్వస్వరూపమునందు) "చిత్ - ఎరుగునది, చేత్యము -ఎరుగ బడునది" అను భేదమే లేదని విజ్ఞులైనవారు గ్రహించుచున్నారు.

స్వప్నంలో కనబడే వస్తువులు, వ్యక్తులు సత్యమెట్లా అవుతాయి? అయితే స్వప్నద్రష్టకు మాత్రం ఆ స్వప్నసమయంలో అవన్నీ సత్యమే అయినట్లు అనుభవమౌతున్నాయి. అందుచేతనే ఆ నిదురించేవాడు భయాదులు ప్రదర్శిస్తూ గావుకేకలు వేయటం జరుగుతోంది. అతడు కలవరిస్తుంటాడు. స్వప్నములోని పదార్థములు సత్యములు గాని, అసత్యములు గాని కావు. కేవలం "స్వకీయ భ్రమ మాత్రము" అయి ఉన్నాయి కదా! అట్లే ఈ జగత్తుకూడా భ్రమమాత్రమేనని గ్రహించటం ఉచితం.

ఈ విధంగా, "ఈ జగత్తు మిథ్యయే" అని సూచించే యుక్తులను మరల మరల చింతిస్తూ ఉండాలి. ఇట్లు క్రమంగా అభ్యసిస్తూ రాగా... అట్టి "ముముక్షువు" యొక్క చిత్తము నిర్మలత్వం పొందుతూ ఉంటుంది. క్రమక్రమంగా 'అవిద్య' అంతా నశించిపోతుంది. అప్పుడిక శేషించునది చిదాకాశ సందర్శనానందం మాత్రమే. అట్టి చిదాకాశానందము ప్రాప్తించిన ఇక ఈ సంసారదుఃఖము మచ్చుకైనా మిగిలియుండదు.

గోడకు బహువిస్తారమైన ఆకాశమునకు భేదమంటూ ఏమీ లేదు. అయితే మరి ఈ కనబడేదంతా ఏమిటంటావా? భేదంగా కనిపించేదంతా కల్పితము మాత్రమే. బ్రహ్మదేవుని నుండి ఒక చిన్నపురుగు వరకు భిన్నభిన్న అనుభవరూపములుగా రూఢిపడి ఉన్నదంతా కల్పనను అనుసరించే ఏర్పడుచున్నది. అట్టి కల్పన ఆ ద్రష్టకు వేరైనది కాదు. కల్పించువాడు కాకుండా కల్పనకు వేరు అస్థిత్వమెక్కడ?

అపరిమితము - సర్వాత్మకము! : సూర్యప్రకాశము ప్రసరించుచున్న చోట దర్పణమో, మణియో ఉంటే, అవి కూడా ప్రకాశిస్తూ ఉంటాయికదా! చిదాకాశము నందు చిత్ప్రకాశము చేతనే ఈ లోకములన్నీ ప్రకాశిస్తున్నాయి. 'అద్వైతము, అపరిమితము' అయినట్టి చిద్వస్తువే తన యొక్క చమత్కారముచే భిన్నత్వము కలుగజేయగల శక్తి కలదై, ఇట్లు ద్వైతముగా తోచుచున్నది. అట్లు ఏర్పడుచున్న ఈ ద్వైతమంతా కూడా సర్వమునకు అధిష్ఠానమైనట్టి బ్రహ్మము కంటే ఏమాత్రం ఏ క్షణంలోను భిన్నమైనది కాదు. బీజములో వృక్షము యొక్క తత్వమంతా (ఆకులు, పూవులు, కాయలు, కాండము, వ్రేళ్ళు మొదలైన స్వభావమంతా) వ్యాపించియున్నట్లు పరమోత్తమమగు ఆత్మప్రకాశమే సర్వేసర్వత్ర సర్వాత్మకమై వ్యాపించియున్నది. ఒక బీజము తనయందు భిన్నాభిన్నరూపములైన వృక్షవిభాగ తత్వములను కలిగి ఉన్నట్లుగా, నిర్మలాకాశము వంటి బ్రహ్మమునందు అసంఖ్యాకములైన జగత్తులు విన్యాసము కలిగి ఉంటున్నాయి. "ఈ జగత్తు అనబడునది - అత్యంత సూక్ష్మమైనట్టి బ్రహ్మమునందు ఉన్నట్లు అనుభవమగుట అనిర్వచనీయం, అవిచారణ యొక్క ఫలితం" అని జ్ఞానులు మనకు తెలియజేస్తున్నారు.

❖

ఓ రాక్షసీ! 'బ్రహ్మము' ఒక్కటి మాత్రమే సర్వదా, సత్యమై వెలయుచున్నది. దానికి ఆది-మధ్య-అంతములు లేవు. అది పరమశాంతమై, జన్మాదివికారములు లేనట్టిదైయుండియున్నది. ఎవ్వరైతే

ఈ మాయను, ఈ మాయ యొక్క కార్యములను రహితం చెయ్యగలుగుతారో – అట్టివారు మాత్రమే ఆ బ్రహ్మమును అనుభవపూర్వకంగా పొందగలుగుచున్నారు. మనమంతా ప్రయత్నించవలసినది అద్దాని కొరకే సుమా! అది ఏకరూపమని, గుణరహితమని, నిర్మలమని, అద్వైతరూపమని, నిరాటంకంగా అంతటా వ్యాపించియున్నదని -- జ్ఞానులు ప్రవచించుచున్నారు. శుద్ధ మానసులమగు ఈ రాజుకు, నాకు కూడా అది అనుభవయోగ్యమగుచున్నది.

యథార్థానికి అద్దాని యందు "నేను–నీవు–రాజు–మంత్రి–రాక్షసి" మొదలైన కల్పనలు ఏమాత్రం లేవు. ఆ బ్రహ్మమే నేను, నీవు, ఈ రాజు అయి ఉన్నాము.

ఓ ప్రియమైన రాక్షసీ ! నీ ప్రశ్నలు అత్యంత ఉత్తమ వస్తువునే సమాధానంగా సూచిస్తున్నాయి. జ్ఞానము కలిగినట్టి ఉత్తములు మాత్రమే అద్దాని విషయమై అట్లు ప్రశ్నించగలరు. 'పరమ విజ్ఞాన పరవశం' చేతనే నీవు అంతటి ఉత్తమ ప్రశ్నలు వేయగలిగావు.

నీ ప్రశ్నలన్నిటికీ సమాధానం ఏకరీతిగా ఒక్కటే అయి ఉన్నది.

"అది నామరూపరహితము" : ముముక్షువులమగు మనం, మన సౌలభ్యం కొరకు అద్దానిని 'బ్రహ్మము' అంటున్నాం. అది "మనందరి యొక్క అద్వితీయమగు, సచ్చిదానంద విశేష పూరితమగు ఆత్మయే."

❖

కర్కటి : ఆహా! అమోఘం! ఓ మంత్రీ! నీవు నా ప్రశ్నలకు ఇచ్చిన సమాధానం ఉత్తమమైన అర్థం కలిగియున్నది. ఈ జీవునికి, సర్వ దుఃఖములను నశింపజేయగల విషయమునే గుర్తు చేస్తున్నది. మిత్రమా! విక్రమమహారాజా! ఇప్పుడు మీ వాక్యామృతమును గ్రోలాలని నాకు ఉన్నది. నా ప్రశ్నలకు మీరు చెప్పాలని భావించినది నాపై ప్రేమచే చెప్పవలసినదని అర్థిస్తున్నాను. ప్రార్థిస్తున్నాను.

❖❖❖

12. విక్రమరాజు సమాధానం - "ఆత్మ ఉన్నచోటు"

ఓ ఆత్మస్వరూపీ ! విను.

ఈ జీవునకు మూడు అవస్థలు ఉంటున్నాయి.

1) జాగ్రత్,

2) స్వప్నము,

3) సుషుప్తి

ఈ మూడు విధములైన అవస్థలందు ప్రాపంచికమైన వృత్తులను రహితం చేసివేయుటచేతనే "తురీయావస్థ" అనబడు ఆత్మస్థితి కలుగుచున్నది. సమస్త సంకల్పములు తొలగించబడినపుడే అట్టి 'ఆత్మనిష్ఠ' ప్రాప్తించగలదు.

ఎవని యొక్క సంకల్పమునకు సంబంధించిన సంకోచ-వికాసములచే ఈ జగత్తు యొక్క సృష్టి ప్రళయాలు సంభవిస్తున్నాయో... అట్టి పరమాత్మ గురించి ఏమని చెప్పాలి? "ఆ చైతన్య భగవానుడు 'వాక్'కు అతీతుడు" అని వేదాంత శాస్త్రముచే ప్రతిపాదించబడుచున్నది.

బ్రహ్మము సత్-అసత్తులకు, అనగా ఉండుట-లేకుండుట అనునట్టి వ్యవహారస్థితికి, శూన్య అశూన్యములకు విలక్షణమై, అనిర్వచనీయమై ఒప్పుచున్నది. ఈ దేశ-కాల పరిచ్ఛేదముచే భాసించు చున్నదంతా అదే...! అయినప్పటికీ, అది దేశ-కాలములు కలిగియున్నట్టిది కాదు. దాని యందు ఈ దేశ-కాలాదులు లేవు. ఈ చరాచర జగత్తు అంతా సమష్టి జీవస్వరూపుడగు ఆ హిరణ్యగర్భుని చిత్తము యొక్క లీల మాత్రమే! కనబడేదంతా సత్-అసత్‌ల, చిత్-జడముల సంధిరూపము మాత్రమే!

ఓ మంగళస్వరూపిణీ! ఈ విశ్వరూపమున భాసించుచున్ననూ ఏతత్త్వం యొక్క ఏకరూపత్వము నకు భంగం వాటిల్లదో అట్టి తత్త్వాన్ని శాస్త్రములు 'బ్రహ్మము' అని పిలుస్తున్నాయి. అట్టి పరబ్రహ్మము గురించే నీవు ప్రశ్నించావు.

'చిత్' అణువు వాయురూపానుభవం పొందితే, మరుక్షణం భ్రాంతిచే వాయువు యొక్క ప్రాప్తి సంభవిస్తోంది. అయితే, శుద్ధ చైతన్యమగు బ్రహ్మమునందు వాయురూపాదులు లేవు. అట్లే, అది శబ్దరూపమును భావించినప్పుడు భ్రాంతిచే ఏర్పడుచున్న భావనా మాత్రంచేత "శబ్దము"ను పొందుచున్నది. కాని 'బ్రహ్మము' అనబడునది సర్వశబ్దార్థముల కంటే వేరైనదిసుమా! ఈ విధంగా మాయతో కూడిన పరమాత్మయే సమస్తము అగుచున్నది. కాని శుద్ధరూపము దృష్ట్యా ఏదీ కాకుండానే ఉండి ఉంటోంది.

మట్టితో అనేక ఆకారములు చేసినప్పుడు, ఆ ఆకారములన్నీ మట్టియే. ఆకారాదులు ఎదురుగా కనబడుచున్నది నిజమే కావచ్చు. అయితే ఏం? మట్టి మట్టిగానే ఉండి ఉంటోంది కదా! 'మట్టిముద్ద - మట్టిబొమ్మ' అను మాటలు మనం చెప్పుకుంటున్నాం. వాటి యొక్క అర్థం 'మట్టిచే ముద్ద - మట్టిచే బొమ్మ' (తృతీయా విభక్తి) అని మాత్రమే. మట్టికి ఆకారమెక్కడిది? సర్వశక్తివంతమగు చైతన్యమే అహంకారాదులుగా కనబడుచున్నది. అయినప్పటికీ అది అహంకారాదులుగా మారుట లేదు సుమా! అది సర్వదా అహంకార రహితమగు శుద్ధ చైతన్యముగానే శేషించి ఉంటోంది.

అయితే, ఆత్మజ్ఞానం లభించటం కష్టసాధ్యమే అగుచున్నది. అనేక యత్నములచే మాత్రమే అది పొందబడుచున్నది. 'ఆత్మజ్ఞానము' అను లాభం పొందిన తరువాత, ఇక దానికి మించిన లాభం అంటూ ఏదీ ఉండదు. మూలఅజ్ఞానం (root cause of ignorance) తొలగనంతవరకు, 'ఆత్మబోధ' కలుగనంతవరకు ఈ సంసారము విజృంభిస్తూనే ఉంటుంది.

ఓ రాక్షసీ! నిరాకారమగు ఆత్మయే సాకారరూపము వహించి ఇట్లు దృశ్యముగా ప్రాప్తించు చున్నది. అనగా, ఈ జీవుడు తానే ఈ దృశ్యమై, తనయందు తానే 'నిమగ్నుడు' అగుచున్నాడు. కాని, అజ్ఞాన కారణంగా అతడు ఆ విషయము ఎరుగుటలేదు. ఎడారిలోని ఎండమావులలో జలము ఉన్నట్లే ఉంటుంది చూచావా? జీవుడు ఈ దృశ్యజగత్తును కల్పించుకొని అందు వస్తుజాలము కొరకు, విషయభోగములకొరకు తన దృష్టిని సారించుచున్నాడు. ఫలితంగా, తన స్వస్వరూపమును

ఏమరచుచున్నాడు. అనగా, తన ఆత్మను తానే తిరస్కరించుచున్నాడు! చూచావా! సర్వజీవుల యొక్క స్వస్వరూపమే అయి ఉన్నట్టి ఆ చిత్ అణువే ఒకానొకప్పుడు ఈ 'జగత్తు' అనబడు దానిని వెలుపలకు ప్రవర్తిల్ల చేసి మాయారూపమున దానిని బాహ్యంలో గాంచుచున్నది. మరొకప్పుడు స్వస్వరూప జ్ఞానముచే త్రిలోకములను తృణప్రాయంగా దర్శించుచున్నది.* ఈ చేతనాణువు తనయందు ఏదిభావిస్తూ ఉంటే, అట్లు భావించుచున్నదానినే బాహ్యమున గాంచుచున్నది సుమా!

కాముకుడు తాను సంకల్పించు స్త్రీని బాహ్యమున భావనామాత్రంగా గాంచి, ఆలింగనం చేసుకొంటాడు చూచావా! ఇది కూడా అట్టిదే. సర్వశక్తిమంతుడగు ఆ పరమాత్మ ఆదిసృష్టి యందు ఏ విధంగా వ్యక్తమౌతాడో ... ఆ విధంగానే తన సంకల్పము నందు అతిశీఘ్రంగా సర్వమును పొందుచున్నాడు. నామరూపరహితుడగు ఆ ప్రత్యగాత్మయే మొట్టమొదట "సమష్టిసృష్టి నాచే దర్శించబడు గాక" అనబడు కర్తృత్వము వహించుచున్నప్పుడు అదియే "సృష్ట్యాది"గా ప్రాప్తిస్తున్నది. ప్రత్యగాత్మ బాహ్య జగత్తును ఇచ్ఛచే దర్శించటమే సృష్ట్యాది. అట్టి "ప్రథమ సృష్టి" అను కర్తృత్వమునకు "హిరణ్యగర్భుడు" అను పేరు శాస్త్రములు ఇచ్చాయి. ఒక దృష్టాంతము విను. ఒక బాలుడు ఏ వస్తువునైతే ఎట్లు "ఇది నాకు ప్రియము" లేక "ఇది నాకు అప్రియము" అను రీతిగా (అట్టి దృష్టిచే) గాంచుచున్నాడో .... ఆయా ఆట వస్తువులు మొదలైనవి అట్లే ప్రాప్తిస్తూ ఉంటున్నాయి కదా! అదే విధంగా చైతన్యము విషయంలో కూడా జరుగుతోంది. అనగా...... మనోరూపముతో వ్యక్తమైన పరమాత్మ యందు ఏయే పదార్థములు ఏఏవిధంగా భావనాపూర్వకంగా భాసించుచున్నాయో – చైతన్యము అద్దానిని అట్లే గాంచుచున్నది. ఆ 'చిత్ అణువే' దేశ–కాల–వస్తు రూపమున అంతటా నిండి యున్నది. ఈ "నేనూ–నీవు–ఈ మంత్రి– ఈ సర్వ సృష్టి స్థితిలయ సమన్వితమైన జగత్తు" – ఇదంతా చిత్ పరమాణువు యొక్క రూపమే.

ఈ జీవుని యొక్క వాస్తవరూపమే అయిఉన్న ఆ చిద్వస్తువు సర్వగామి (All pervading), అనాది (ఆది లేనిది) కూడా! ఆ పరమాత్మ అనబడుచున్నదానికి 'ఆకారము' అంటూ లేదు. ఆకారమే లేని దానికి పరిమితి ఏమి ఉంటుంది. అందుచేత, అనంతవిస్తీర్ణంగా వ్యాపించియున్నది. అనంతమైన వస్తువులు రెండు ఎట్లా ఉంటాయి? రెండవది ఉంటే అది మొదటి దాని యొక్క 'అంతము' నిర్దేశిస్తున్నట్లే అవుతుంది కదా! అందుచేత అద్దానికి రెండవది అనునది లేదు. ఇందుకే జ్ఞానులు "అది అద్వితీయము" అని చెప్పుచున్నారు. అయ్యది అప్రమేయము కూడా (It is not related to anything).

కలిగియుండటం – ప్రకాశింపజేయటం! : ఇక ఈ కనబడే జగద్దృశ్యము విషయానికి వస్తే, ఇదంతా అత్యంత చమత్కారమైనదనే చెప్పాలి. ఎందుకంటావా? ఒక కాముకుడు, ధూర్తుడు అయినవాడు "కళ్ళు కదల్చుట" మొదలైన ఆయాచేష్టలచే అమాయకురాళ్ళైన స్త్రీలను వశపరచుకొంటూ

---

* ఒకపరి జగములు వెలినిడి యొకపరి లోపలికి గొనుచుఁ నుభయముఁదానై
సకలార్థసాక్షియగున య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్. అని అనుటలో భావం ఇదే!
భాగవతము – గజేంద్ర మోక్షము 8.34

ఉంటాడుకదా! ఈ జగత్తు కూడా పర్వతములు, తృణములు మొదలైన అనేక పదార్థములతోను, చేష్టలతోను, సంఘటనలతోను కూడుకొనియుంటున్నది. అట్టి ఈ జగత్తు శుద్ధచిత్ ప్రకాశమును తనవశము ఒనర్చుకొని, నాట్యం ఆడించుచున్నది. ఇదంతా 'చమత్కారం' కాక మరింకేమనాలి? అయితే చేతనారూపమగు ఆ ఆత్మవస్తువే స్వయముగా బాహ్యజగత్తును గాంచుచున్నది. ద్రష్ట ఉంటేనే కదా, దృశ్యము! ద్రష్ట యొక్క దృష్టిని అనుసరించే దృశ్యము ఉంటోంది. ఏది ఏమైతేనేం? "ఈ బాహ్యమునందు చూడబడుచున్న జగత్తు అంతా ఆ చిద్వస్తువు ఆ విధంగా తనయందే అట్లు కలిగియున్నది" అని జ్ఞానులు గమనించుచున్నారు. ద్రష్టయొక్క స్వస్వరూపమగు ఆత్మయే ఈ జగత్తును కలిగియుండి, దీనిని పరివేష్టించుచు, ప్రకాశింపజేయుచున్నది.

పరిచ్ఛేదరహితం - దృష్టాంతములకు అతీతం! : ఒక వెంట్రుకలోని చిట్టచివరి భాగపు అణువులోని లక్షవ భాగంకంటే కూడా అత్యంత సూక్ష్మాతిసూక్ష్మమైయున్న ఆ ఆత్మ వస్తువు 'దేశ-కాల-వస్తు పరిచ్ఛేదము లేనిదే' అయి ఉన్నది. అందుచేత అది "అస్థూలము" అనబడుతోంది. దానిని మాటలలో ప్రకటించలేము. అయితే, ఏవో కొన్ని దృష్టాంతముల ద్వారా ఆ ఆత్మ వస్తువు గురించి మనం చెప్పుకుంటున్నాం. శుద్ధజ్ఞానమే స్వరూపముగా కలిగియున్నట్టి ఆ 'ఆత్మచైతన్యము' ఎట్టి సామ్యము (Example) తోకూడా నిరూపించలేం. వాక్కుచేత గాని, ఆయా శబ్దములచేతగాని, ఇంద్రియములచేతగాని చెప్పుటకు అలవికాదు. అది అనుభవమాత్రమై యున్నది. ఒక పెద్ద కొండ - ఒక పరమాణువు.... ఈ రెండింటి నిర్మాణమును పోల్చడం ఎట్లా?

మాయతో కూడుకొని ఉన్నప్పటికీ 'చిద్వస్తువు' నందు అణుత్వములేదు. పోనీ "బంగారము - ఆభరణము" లను దృష్టాంతముగా తీసుకొందామా అంటే... ఆత్మ ఎట్టి వేరైన ఆకారములను కూడా పొందుట లేదు. అది నిర్లిప్తము, సంకల్పముల కంటే కూడా మునుముందే ఉండి ఉన్నది. సర్వమునకు ఆధారమైయున్నది. ఏకత్వ - అనేకత్వములకు ఏమాత్రం సంబంధించినది కాదు. ఏ వస్తువూ అది కాదు. అట్టి ఆ ఆత్మ వస్తువును ఆయా దృష్టాంతములతో ఎట్లా ప్రకటించగలం? 'అణుత్వము - మహత్వము' ఇత్యాది మాటలన్నీ పరమాత్మ యందు కల్పిత వచనాలే అవుతున్నాయి. నీ యొక్క, నా యొక్క, అట్లే భూత - భవిష్యత్తులలోని ప్రతి ద్రష్టయొక్క జడ-చైతన్యముతో కూడిన సత్స్వరూపము ఆ పరమాత్మయే. ద్రష్టత్వమునకు ఆవల ఉన్నట్టి ద్రష్టయొక్క స్వరూపమే ఆత్మయొక్క స్వరూపము. అంతేకాని, ఆత్మ అనగా ఎక్కడో ఉన్నట్టిది కాదు. మరెప్పటికో లభించనున్నది కాదు.

అన్ని అనుభవములకు మూలకారణం! : ప్రకాశము, అంధకారము - రెండూనూ చైతన్యము నందే వెలయుచున్నవి. అందే కల్పితమైయున్నవి. అనుభవ రూపమైయున్నట్టి 'ఆత్మ' అనబడు దీప ప్రకాశమే లేకపోతే, ఇక ఈ జీవులకు ప్రకాశము - అంధకారముల అనుభవమే ఎన్నడూ కలిగేది కాదు. వారియందు సద్వస్తువు లేకపోతే అసత్ వస్తువుల దర్శనం సాధ్యపడేది కాదు. సూర్యుడు మొదలైన అనేక పదార్థములు కలిగియున్న ఈ జగత్తంతా జడమే అయి ఉన్నది కదా! దానిని ప్రకాశింపజేయుచు, అనుభవము పొందగల చైతన్యమే లేకుంటే, ఈ జగత్తును అనుభవించేదెవరు?

కాబట్టి "ఆత్మచైతన్యము-అనబడునదేదీ లేదు. అనుభవములు మాత్రం ఉన్నాయి"-అనునది అత్యంత అసంగతమైన మాట.

శుద్ధజ్ఞాన స్వరూపమగు ఆ చైతన్యము తన రూపములే అయి ఉన్న ఈ ప్రకాశము - అంధకారములను తనయందు కల్పన చేసుకొనుచున్నది. ఆ చైతన్యమే ఈ ఎదురుగాగల జగత్తు తనకు బాహ్యమునందు ఉన్నదానివలె భావావేశము పొందుచున్నది.

ఓ విజ్ఞాన స్వరూపీ! ప్రియ రాక్షసీ! నీచే గాంచబడుచున్న ఈ 'జగత్తు' అనబడునదంతా నీ చేతనే కల్పించబడినదై, అనుభవించబడుచున్నదని గ్రహించు.

దృష్టాంతానికి, "సూర్య-చంద్ర-అగ్ని" ల ప్రకాశమే తీసుకొందాం. అవి జడ రూపమగు 'తమోఘనము' కంటే వేరే ఏమీ కాదు. ఎట్లా అంటావా? ప్రకాశము యొక్క వర్ణము తెలుపు. అంధకారము యొక్క వర్ణము 'నలుపు'. వెలుతురు లేకపోవటమే చీకటి. వెలుతురు ఉండటమే చీకటి యొక్క లేమి. జడత్వదృష్టితో చూస్తే ...రెండూ జడమే. "ఆ రెండిటినీ 'ఇది వెలుతురు - ఇది చీకటి' అని గ్రహించుచున్నట్టి 'స్వసత్త' రూపమగు చైతన్యమే బ్రహ్మము" అని గ్రహించు. ఏ చైతన్యమైతే సూర్యగోళముచే జనింప చేయబడుచున్న ప్రకాశమును, అంధకారమును గ్రహిస్తోందో ... అట్టి చైతన్యము నుండి ప్రకటితమగు సత్త సర్వవేళల ఒకే రీతిగా ఉంటోంది.

ఆత్మయొక్క ప్రవృత్తియే ఈ జగత్తు! : ఈ కనబడే భౌతికమైన సూర్యుని ప్రకాశమునకు ఆత్మ యొక్క ప్రకాశమునకు ఏమాత్రం పోలిక చెప్పజాలము. సూర్యుని ప్రకాశము కొన్ని ప్రదేశములలో కొన్ని సమయములలో ప్రసరించుచున్నది. అయ్యది వాస్తవానికి ఆత్మ యొక్క అనుభవ - భావనల చేతనే అస్థిత్వము పొంది ఉంటోంది. కాని, ఆ చైతన్య-సూర్యుడు రాత్రింబవళ్ళు యెడతెగకుండా బాహ్యాభ్యంతరములందు, శిలయందు, జీవపదార్థములన్నిటియందు, జడములందు, ప్రకాశించు చున్నది. అద్దానియందు తమస్సునకు చోటే లేదు. ఆత్మసాక్షాత్కారము పొందినట్టి జ్ఞానులకు ఈ వివిధ భోగములతో కూడిన జగత్తు అంతా, 'ఆత్మయందు ఆత్మగానే' తెలియవచ్చుచున్నది. 'త్రిలోకములు' అని చెప్పబడుచున్న వాటితోసహా ఈ సర్వమూ ఆత్మతేజము చేతనే ప్రకాశించుచున్నాయి. చైతన్యమే ఈ జగత్తును నశింపచేయనీయకుండా ఇట్లు కార్య-కారణరూపమున (As effect & cause) తనయందు ప్రవృత్తి కలిగియుండుట ద్వారా ప్రకటించుచున్నది.

సర్వ అనుభవములు ఏర్పడుచున్నది అద్దానియందే!

"తమస్సు" లేక "అజ్ఞానము" (Ignorance) ఈ జగదనుభవం రూపమున ప్రకాశితమై యున్నదని విజ్ఞులు ఎరిగియే ఉంటున్నారు.

'ఏకైక చిద్వస్తువే ప్రకాశము యొక్క - అంధకారము యొక్క రెండింటి 'సత్త'ను వ్యక్తపరచుచున్నది" అని సూక్ష్మబుద్ధికి తప్పక తెలియవచ్చుచున్నది. సత్తుకు అసత్తుకు కూడా 'సత్త' ను కలుగజేయునది ఆ చిద్వస్తువే. అద్దానియందే సర్వ అనుభవములు స్థితి కలిగియున్నాయి. ఆ చిత్‌సత్త అత్యంత

సూక్ష్మమైనది అవటంచేత "అనాస్వాదువు – ఏమియు అనుభవించనట్టిది" వలె కనిపించినప్పటికీ, సర్వరుచులకు హేతువు అదే.

చైతన్యము సర్వవేళలందును సర్వజనులచే అనుభవరూపమున అస్వాదింపబడుచునే ఉన్నది సుమా! కనుక మేము చెప్పు ఆ చిద్వస్తువు ప్రతిఒక్కరికి అత్యంత సమీపమునందే ఉండియున్నది.

వివిధ జలములలోని రసరూపమున ఉన్నది ఆ చైతన్యమే. చైతన్యమే లేక పోతే, రసమే సిద్ధించేది కాదు.

సర్వతత్త్వాత్మకం – సర్వతత్త్వవిదూరం! : ఆ పరమాత్మ 'శుద్ధ చైతన్యస్వరూపుడు' అయిఉండుటచేత, అతడు వ్యక్తము కాకుండానే ఉండి ఉంటున్నాడు. అందుచేత "అతడు సర్వము త్యజించివేసియున్నాడా?" అని అనిపిస్తోంది. కాని స్ఫురణ మరియు జ్ఞాపకము రూపమున సర్వజగత్తుకు ఆశ్రయమైనవాడు అతడే.

చేతనారూపమగు ఆ పరబ్రహ్మము సర్వవ్యాపకము. సర్వము తానే అయి ఉన్నది. "అది మరియొక దానిని అచ్ఛాదిస్తోంది" అనుట సమంజసం కాదు. అది తనను తానే ఎట్లా ఆచ్ఛాదించుకో గలుగుతుంది? కాని అదియే విస్తరించి సర్వమును కప్పివేయుచు, సర్వము తనయందే ధరించు చున్నది. పచ్చగడ్డి మొక్కల సమూహము మధ్యలో ఉన్న ఏనుగు తననుతానే కనబడకుండా ఆ పచ్చగడ్డి మొలకల మధ్యలో దాగుకోగలదా? ఆకాశమువలె విశాలమైన ఆకృతిగల పరమాత్మ తనను తాను దేనితో కప్పుకోగలడు?

అందరియందు ప్రదర్శితమై ఉంటున్నది అతడే! : అందరియందు ప్రదర్శితమగుచున్నదంతా అతడే. అతడు ఈ విశ్వమంతా వ్యాపించియుండి, క్షణక్షణం ఈ జగత్తంతా రక్షించుచున్నాడు. ఈ విధంగా తననుతానే ఆచ్ఛాదించుకొనజాలక, జగత్తునంతా ఆచ్ఛాదించుట మాయయొక్క విచిత్రశక్తి మాత్రమే.

చేతనమును ఆశ్రయించి ఉండుటచేతనే ఈ జగత్తు ప్రళయమునందు లీనమై సంస్కారరూపమున దాగి ఉంది. మరల ఉత్పన్నమగుచున్నది. వికాసము పొందుట జరుగుతోంది.

❖

ఓ రాక్షసేశ్వరీ! ఈ విశ్వమంతా వాస్తవానికి 'ఎరుగుట' అను చమత్కారము యొక్క రూపం మాత్రమే. అందుచేతనే శాస్త్రములు "జగత్తు యొక్క వాస్తవరూపము చిన్మాత్రమే" అని నిర్ణయం చేస్తున్నాయి.

ఆ చిన్మాత్రమునకు కాళ్ళు, చేతులు మొదలైన అవయవములు లేవు. కాని, సర్వప్రాణుల అంతరాత్మ అదేకదా! ఈ అనేక హస్తములు, పాదములు, నేత్రములు కలిగియున్నది అదియే. ఒక బాలుడు తన స్వప్నంలో "నేను ముసలివాడను అయ్యాను" అని కల కనటం జరిగినట్లు ఈ చేతనవస్తువు నందు ఒక్క నిమిషము అనేక కల్పములవలె తోచుచున్నది.

చేతన సత్త యొక్క స్ఫురణయే 'కల్పాది' రూపమును ధరించి శోభించుచున్నది. అనగా, "ఈ 'బాహ్యజగత్తు' అనబడు అనుభవము పొందెదనుగాక" అను కల్పనను ఆశ్రయించుటయే 'కల్పాది' గా చెప్పబడుచున్నది.

ఒకడు తాను భుజించక పోయినప్పటికీ, తన స్వప్నమునందు, "నేను ఇప్పుడు భుజించుచున్నాను. తృప్తిగా త్రేన్చుచున్నాను" అను రూపముగల అనుభూతిని పొందుచున్నాడు కదా! ఆ స్వప్నానుభవ మంతా అంతరంగమునందే ఉండి ఉన్నట్లు బ్రహ్మమునందే ఈ మిథ్యానుభవము కలుగజేయగలుగు చున్న చిత్తవృత్తులు ఆయా వాసనలతో గూడి, ఆవృతమై ఉన్నాయి. అయినప్పటికీ బ్రహ్మము జగత్ రహితముగానే ఉండి ఉంటోంది.

అట్టి చైతన్యాణువునందే ఈ జగత్తులన్నీ ఉండిఉంటాయని అనుకొన్నాము కదా! జగత్తునందలి స్ఫురణలన్నీ కలుగుచున్నది ఆ చైతన్యాణువునుండే. స్తంభములో చెక్కబడిన స్త్రీరూపము స్థంభముయొక్క రూపమే అయినట్లు, ఈ జగత్తు బ్రహ్మముయొక్క స్వరూప-స్వభావములకు వేరైనది కాదు. అయితే, ఏ పదార్థము ఎచ్చట ఉనికి కలిగి ఉంటుందో, అది అచ్చటనే ఉత్పన్నమౌతుంది. ఏది ఎక్కడ ఉండ జాలదో, అది అచట ఉత్పన్నమే అగుట జరుగదు. సర్వదా కారణరహితమే అయిఉన్న చిదాకాశము నందు ఏదీకూడా ఎన్నటికీ ఉత్పన్నము కాకయే ఉన్నదని జ్ఞానుల అవగాహన.

కాలము మొదలగు వాటిచే తాకజాలనిది : ఆహాఁ! ఆ చైతన్యము నందే భూత-భవిష్యత్ -వర్తమానకాలమునందలి ఈ జగత్తులు, ఇందలి ప్రాణసమూహములు, వాటివాటి అనేక చిత్ర విచిత్రములైన అనుభవములు ఉండి ఉంటున్నాయి. నిమిషము, కల్పము కూడా చిద్వస్తువు చేతనే ఆవృతమై ఉన్నాయి. అయినా, మిత్రమా! ఒక నిమిషమునకు, ఒక కల్పమునకు తేడా ఏమిటో చెప్పు? విషయానుభవములే కదా! విషయరూపములే అయిఉన్న ఆ రెండింటినీ కూడా ఈ చైతన్యము తనయందు ఏకంచేసివేయగలుగుచున్నది. చైతన్యమే జగత్తుకంతటికీ ఆత్మ. అది ఏ సమయమందు కూడా, ఎట్టి కర్తృత్వ - భోక్తృత్వములచేతనూ స్పృశింపబడకుండానే ఉంటోంది. కేవలం ఉదాసీనంగా, మౌనంగా, ప్రశాంతంగా, నిర్లిప్తంగా, పూర్ణంగా ఉండి ఉంటోంది. ఈ విషయం జ్ఞాన-విజ్ఞాన పూర్వకముగా గ్రహించువారు సర్వదుఃఖములనుండి సహజంగానే విడివడు చున్నారు. అట్టి ఆత్మనుండే స్వభావసిద్ధంగా నీటినుండి కెరటములువలె - జగత్‌సత్త ఉదయిస్తోంది. ఇక ఈ భేదకల్పన, ఈ కర్తృత్వ, భోక్తృత్వ భావనలు, ఈ సుఖ-దుఃఖములు, ఈ "నేను-నాది-మేము-మాది-మీరు-వారు" అను రూపంగల ఖండభావనలు.... వీటి విషయమేమిటంటావా? ఇదంతా అవిచారణచే స్వప్నమందువలె ఏర్పడుచున్న మాయయే సుమా!

ఇంకొక చమత్కారం చెపుతాను. విను. ఈ 'జగత్తు' అనబడుదానిని ఎవ్వడు, ఏనాడు సృష్టించియుండలేదు. అట్లే ఏకాలమందు, ఎవ్వరు దీనిని లయం ఒనర్చుట లేదు. "సృష్టి - లయములు" అనబడునవి కెరటత్వము - జలత్వములవలె అంతా కల్పితములు మాత్రమే.

సృష్టి : "నేను-నీవు-అది-వస్తుజాలము - ఇంద్రియానుభవములతో కూడిన బాహ్యజగత్తు మొదలుగాగల "ద్వితీయానుభవము" యొక్క ప్రారంభము.

లయము : "నేను – తదితరము" అంతయు ఏకమే అయిఉన్నది అను "అద్వితీయానుభవస్థితి". ఈ రెండు అనుభవస్థితులందును ప్రశాంతస్వరూపుడగు ప్రత్యగాత్మ యథాతథంగానే ఉండి ఉంటున్నాడు. కాని ఆయాభావనలను ఆయారూపములైన అనుభవములుగా పొందుచున్నాడు. భావనామాత్రంచేత ఏర్పడుచున్నదంతా 'మాయ' (యామా–ఏదైతేలేదో) అను శబ్దముచే శాస్త్రకారులు ప్రతిపాదిస్తున్నారు. వేదాంతవాక్యములు ("ఏకమేవాద్వితీయం బ్రహ్మ" మొదలైనవి) – "ఈ దృశ్యము లేదు. ఈ దృశ్యమునకు అధిష్ఠానమై యున్న పరమాత్మ మాత్రమే కలదు. ఈ దృశ్యము అధిగమించ బడుగాక! పరమాత్మయే పొందబడుగాక!" – అని పలుకుచున్నాయి. పరమార్థదృష్టిని ఆశ్రయించ వలసినదిగా మనముందు ప్రతిపాదిస్తున్నాయి. కనుక, జన్మ – మృత్యువులతో కూడిన ఈ కనబడు 'జగత్తు' అనబడునదంతా మాయాపరికల్పితమే అయికూడా, 'ఇది వాస్తవము' అనురూపముగల అనుభవమును ఎందుకో ఈ జీవుడు పొందుచున్నాడు.

భావాత్మకమే అయి ఉన్న ఈ దృశ్యము స్వతహాగాలేదు. కాని స్వప్నంలో వస్తుజాలమంతా దర్శనమిచ్చుచున్నట్లు, ఇంద్రియబుద్ధికి ఇక్కడ ఎంతయో నామరూపాత్మకమైన వ్యవహారం ఘనీభూతమై గోచరిస్తోంది. ఇది 'వాక్కు' నకు అవిషయమై, వికారవంతమై, అనిర్వచనీయమై యున్నదని పరిశీలనాత్మక దృష్టికి (ఆత్మ బుద్ధికి) సుస్పష్టంగా తెలియవస్తోంది. వాస్తవానికి, ఈ 'జగత్తు' గా కనబడుచున్నదంతా – "సమము, స్ఫురణరూపము" – అయిఉన్న చిదాకాశమేకాని, మరింకేమీ కాదు. చిత్‌వస్తువే, తనయందలి మాయావిశిష్టమగు 'చైతన్యరూపచమత్కారం' చేత, దృశ్యమును సిద్ధింపచేసుకోవటానికి బాహ్యప్రపంచ రూపము ధరిస్తోంది. ఆ చిద్వస్తువే 'ద్రష్ట' యొక్క శుద్ధ స్వరూపము. అనగా, ద్రష్ట అయినట్టి ఆత్మ నేత్రములద్వారా బాహ్యావలోకనం చేస్తోంది. అయితే, అట్లు బాహ్యముగా చూడబడేదంతా 'వేరు' అయిన దృశ్యముగాని, వస్తువుగాని కాదు. ఎందుచేత నంటావా? బాహ్యమున–అంతరమున కూడా సర్వదా ప్రకాశించుచున్నది – నిత్యానిత్యము, సత్ స్వరూపము అగు 'ఆత్మ' యేకాని, మరింకేదీ కాదు. ఈ ఆత్మ – తానే అయిఉన్న సత్యవస్తువగు చైతన్యమును "ఇది బాహ్యము" అని భావన చేసి, ఆపై "ఇది కుండ–ఇది వస్త్రము" మొదలగు ఆయా పదార్థములుగా గాంచుచున్నది.

❖

ఒకానొకప్పుడు ఆత్మయే స్వస్వరూపముగా గల ఈ ద్రష్ట "ఇది బాహ్యము–ఇవి బాహ్యవస్తువులు" అను భావావేశమును కించిత్ త్యజించి, కాకతాళీయంగా "ఇది ఇట్లేనా?" అని చింతించుచున్నాడు. విమర్శించుచున్నాడు. 'ధ్యానము, యోగము, గురువాక్యమననము, స్వవిచారణ' మొదలైనవి ఆశ్రయించి తన బుద్ధిని శుద్ధిచేసుకొంటున్నాడు. ఈ మనస్సు "ఆహాఁ! నాకు ఈ శరీరముయొక్క ధర్మములు గాని, 'ద్రష్ట' యొక్క ధర్మములుగాని లేనేలేవు. లోన, బయట సర్వదా శాశ్వతమై, అఖండమై ప్రసరించియున్నది, ప్రసరించుచున్నది–నేనే. అందుచేత శాస్త్రములచే చెప్పబడిన ఆత్మయొక్క స్వరూప – స్వభావములన్నీ నాయొక్క స్వరూప స్వభావములే అయి ఉన్నాయి" అనునట్టి ఒకానొక

ఎరుకను సంతరించుకొంటోంది. "నేను అనామయమగు ఆత్మనే" అను జ్ఞానము ప్రాప్తించినప్పుడు, సర్వదా ఏర్పడియున్న సత్యమే తెలుసుకొనబడుచున్నది కాని, నూతనమైనదేదీ వచ్చిచేరుట లేదు సుమా!

"అవును నాకు జన్మ-కర్మలుగాని, బంధ-మోక్షములుగాని లేవు. 'త్రిజగత్తులు' అనబడునవే లేవు."అని ఆత్మచే గ్రహించబడుతోంది. అప్పుడు అయ్యది తన విశుద్ధత్వమును పునః స్వీకరించుచున్నది. ఇంతమాత్రమే బంధ-మోక్షములు అయివున్నాయి.

ఆత్మయందే అంతర్భూతమైయున్న ఈ దృశ్యజగత్తు గురించి ఆయా విధి విధానములు, చర్చలు, సిద్ధాంతములు, శబ్దజాలము, నిర్వచనములు - ఇవన్నీ కూడా వేరువేరు 'అవగాహన - సంస్కారము'లతో కూడియున్న ఆయా జీవులకు ఉపదేశించడానికే గురువులచే కల్పించబడుచున్నాయి.

ద్రష్టయొక్క దృష్టియే - ఈ దృశ్యము : ఓ ప్రియరాక్షసీ! మరొకసారి ప్రకటిస్తున్నాను. విను. 'ద్రష్ట' అయిఉన్న ఆత్మయే, బాహ్యవిషయముల దృష్టిని పెంపొందించుకొని తదనుకూల భావనాబలం చేత, ఆయా బాహ్యపదార్థములు తానే అగుచు, 'అసత్తే' అయిఉన్న 'జగత్తు' అనబడు దానిని గాంచుచున్నది. అంటే, దీని అర్థం ఏమిటి? నిన్ను నీవే "బాహ్యమందు జగత్తు" గా గాంచుచున్నావు. ఇంతలోనే, మరొకప్పుడు, ఈ విషయమును అనుభవపూర్వకంగా గ్రహించి, మోక్షస్వరూపిణివి అగుచున్నావు.

అయితే, పరమార్థ దృష్టితో అదంతా గమనిస్తేనో? "శుద్ధచైతన్య స్వరూపుడు" అయినట్టి ద్రష్ట దృశ్య రూపమును పొందజాలడు. అతడు అన్ని వేళలు సర్వదృశ్యములకు అతీతుడై వెలయుచునే ఉన్నాడు. దృష్టత్వమునకు కూడా అతడు "కేవలసాక్షి". కనుక, "అజ్ఞానము-అవిచారణ" లే ఈ 'జగత్తు' అనబడు అనుభవమునకు అసలైన కారణములు. నీవు సర్వదా ఆత్మస్వరూపమే!

విచారించినప్పుడు "లేదు" అని తెలియవచ్చుచున్న ఈ జగత్తుకు, "ఇది ఇప్పుడు పుట్టినది. ఇన్నాళ్ళు ఉంటుంది. ఇట్లు కరిగిపోవుచున్నది" అనబడు కాలనియతి మాత్రం ఎక్కడో చెప్పు?

❖

"నేత్రములు" అంటే ఏమిటి? దృక్ శక్తియే కదా! 'ప్రత్యక్షము' గాని, పరోక్షముగాని కానిదై (అపరోక్షమై), నిత్యమైయున్నట్టి చైతన్యమే దృక్‌శక్తిగా ప్రకటితం అవుతోంది. అట్టి దృక్ శక్తినే 'నేత్రము' అని పిలుస్తున్నాం. అంతేకాని, జడమాత్రమైన ఈ 'కంటి గ్రుడ్డు' ను కాదు. అట్టి దృక్ శక్తియే వాసనారూపమైనట్టి దృశ్యమును రచించి, అట్లు రచించబడుచున్నదానికి ద్రష్టత్వము వహించుచున్నదని సూక్ష్మగ్రాహ్యులు గ్రహించుచున్నారు. తండ్రిలేనిచోట పుత్రుడు ఉంటాడా? సూక్ష్మ దృష్టితో చూస్తే - ఏకత్వము లేనిచోట అనేకత్వముకూడా ఉండదు. 'ద్రష్ట' యొక్క సత్తయే లేకపోతే, ఇక దృశ్యము యొక్క సత్త మాత్రం ఎక్కడ ఉంటుంది? ఈ 'దృశ్యము' అనబడేది ఎట్లు, ఎవరికి స్వయంగా సిద్ధించగలదు చెప్పు? కనుక 'దృశ్యము' అనునది ద్రష్టను అనుసరించే ఉంటోంది. ద్రష్టయొక్క నిర్వచనములే దృశ్యము.

ద్రష్టైవ దృశ్యతామేతి నద్రష్టృత్వంవినా అస్తి తత్
వినా పిత్రేన తనయో, వినా భోక్త్రేన భోగ్యతా ॥ (సర్గ 81, శ్లో. 65)

తండ్రిలేకుంటే కొడుకేమిటి? 'భోక్త' లేకుంటే భోగ్యవస్తువుయొక్క ఉనికి ఎక్కడ?

ద్రష్టయగు ఆత్మయే దృశ్యభావమును పొందుచున్నది. అట్టి భావనను అనుసరించే దర్శనం కూడా ఉంటోంది. అందుచేత, ఈ దృశ్యము – "భావనాస్వరూపము, స్వసంకల్పమాత్రము, స్వప్న దర్శనము వంటిది" – అని అంగీకరించక తప్పదు.

ఎక్కడ 'ద్రష్ట' భావము (A feeling that 'I am perceiver') ఉన్నదో, అక్కడ మాత్రమే దృశ్యము సిద్ధిస్తోంది. ఎవ్వడైతే "నేను ద్రష్టత్వమునకు కూడా అతీతమైనవాడను. సత్యస్వరూపమగు పరిశుద్ధ చైతన్యమును. నాకు దృశ్యముగాని, జన్మాదులుగాని లేవు" అను దృఢభావనయందు సుస్థిరుడై ఉంటాడో, అట్టివానికి ఈ దృశ్యములేదు, జన్మలులేవు, మృత్యువులేదు, జగత్తులేదు. "నా స్వస్వరూపము నకు జన్మమృత్యువులు లేవు" అను రూపముగల దృఢమైన ఎరుకయే "జన్మరాహిత్యము" గా చెప్ప బడుచున్నది. ఇప్పుడు చెప్పు! "నేను ద్రష్టనుకూడా కాదు ద్రష్టత్వమునకు మునుముందే ఉండిఉన్నట్టి కేవలసాక్షి స్వరూపస్వభావుడను" అని ఇంతమాత్రం భావించుటలో కష్టమేమి ఉన్నది? బంగారము అనేక ఆభరణములుగా ప్రదర్శితమగుటకు సామర్థ్యము కలిగియున్నది కదా! అట్లే ఈ ద్రష్ట కూడా, తాను చైతన్యస్వరూపుడే కనుక, దృశ్యములో అనేకత్వము నిర్మించుకొనుటలో సామర్థ్యము కలిగి ఉంటున్నాడు. ఆకారాదులు వహించుచు, దర్శించుచు కూడా నిరాకారుడై ఉంటున్నాడు.

అయితే, ద్రష్ట, ఈ దృశ్యమును గాంచకలుగు సామర్థ్యము కలిగి ఉంటున్నాడు. కానీ, ఈ దృశ్యమునకు......అది స్వతహాగా జడమే కాబట్టి.....ద్రష్టకు సత్త కలుగజేయగల సామర్థ్యము లేదు సుమా! ఆభరణము బంగారమునకు 'సత్త' కలుగజేయుట ఎంత అసమంజసము? బంగారమే ఆభరణమునకు సత్త కలుగజేయుచు, నిరాకారముగా ఉండిఉంటోంది. బ్రహ్మము జీవుడగుట అట్టిదిగా గ్రహించబడుగాక!

వాస్తవానికి, సువర్ణమునందు 'ఆభరణము' అనబడు భ్రమ అవివేకముచేతనే కలుగుచున్నది. అట్లే, చిత్‌శక్తి చేత నిర్మించబడిన దృశ్యమునందు చిత్‌ప్రసరణచే సత్యభ్రాంతి కలుగుతోంది. ఆభరణ దృష్టితో చూచేవానికి బంగారమునకు సంబంధించిన లోహదృష్టి ఉండదు కదా! దృశ్యస్ఫురణ ఉంటున్నప్పుడు, ఆ దృశ్యము దర్శించుటలో ఆ ద్రష్ట తనయొక్క పాత్రేమిటో గమనించకుండానే దర్శనము చేస్తున్నాడు. అయితే, బంగారు ఆభరణమునకు ఆభరణ సత్తను ప్రసాదిస్తున్నది ఏది? బంగారమే కదా! ఈ దృశ్యమునకు కూడా చేతనస్వరూపుడగు 'ద్రష్ట' యే దృశ్యత్వమును కలుగచేయు చున్నాడు. ద్రష్ట లేనప్పుడు దృశ్యము ఎక్కడవుంటుందో చెప్పు?

ఒకడు ఒకచోట ఒక బల్లపై గల రెండు వేరువేరు రకములైన రెండు బంగారు గొలుసులను చూస్తున్నాడనుకో ....ఆ చూచువాడు. 'ఆభరణ దృష్టి' తో చూస్తుంటే రెండు వేరువేరైన ఆభరణములు కనిపిస్తాయి. అతడు 'సువర్ణ దృష్టి' తో చూస్తుంటేనో....ఒకే బంగారం రెండు గొలుసులలోను

కనిపిస్తోంది. అనగా, సువర్ణదృష్టికి 'ఆభరణములు' అనేది మరుగునపడిఉంటోంది. ఆభరణ దృష్టికి బంగారమునకు సంబంధించిన ధ్యాస మరుగునపడుతోంది. అదే రీతిగా :

దృశ్యదృష్టి ఉన్నసమయంలో 'ద్రష్ట'కు సంబంధించిన పాత్ర మరుగునపడి ఉంటున్నది.

ద్రష్టను పరిశీలింపబడుచున్నప్పుడు దృశ్యము విషయం దృష్టిలో ఉండుట లేదు.

ఈ విషయమై మరొక చిన్న దృష్టాంతము చెపుతాను. విను.

వృత్తిని కప్పి ఉంచే మరొక వృత్తి : దూరంగా కదలివచ్చుచున్న ఏదో ఆకారమును ఒకడు చూస్తున్నాడనుకో.... ఇంతలో, "అది పశువా? మనిషా?" అని పరిశీలనాత్మకంగా చూస్తున్నాడు..... "ఓహో అది పశువు కాదు ..... మనిషే.... అరె, మనవాడేనయ్యా....! అని అనటం జరిగిందని అనుకొందాం.

ఇప్పుడు ఈ సంఘటనలో జరుగుచున్నదేమిటి? :

1. మొట్టమొదట "విషయరహితమైన శుద్ధ చైతన్యము" స్వరూపముగా గలిగియున్నట్టి ఆ వ్యక్తి అక్కడ ఉన్నాడు. అతనియందు 'ద్రష్టత్వము' అను సామర్థ్యము ఉన్నది. అయితే ఆ సామర్థ్యము "మూసుకున్న కళ్ళలోని చూచుశక్తి" లాగా అప్రకటితమైయున్నది.

2. నిర్మల జలంలో తరంగం బయలుదేరుతుంది....చూసావా? అలాగే అతనియందు "ద్రష్టత్వము అను వ్యాపకమునకు ఉపక్రమిస్తాను..." అను 'భావపూర్వకమైన-క్రియాపూర్వకమైన' స్పందన బయలుదేరింది.

3. అట్టి ప్రారంభవృత్తినుండి, "ఆ దూరంగా, కదలి వస్తున్న ఆకారము ఏమైయున్నది?" అను రూపముగల రెండవ 'వృత్తి' లేక 'ధ్యాస' బయలుదేరుతోంది. ఈ రెండవ ధ్యాస మొట్టమొదట 'వృత్తి' (Thought)ని కప్పివేస్తోంది.

4. ఆ రెండవ వృత్తి నుండి "అది పశువా? లేక మనిషా?" అను మూడవ నిర్ణయాత్మ వృత్తి రూపం పొందుతోంది.

5. "అవును అది పశువుకాదు....మనిషే.... మనవాడే కూడా!" అను మరొక వృత్తి బయలుదేరి తదితర వృత్తులనన్నిటినీ మరుగు పరచుతోంది.

ఆ తరువాత ఆ స్థానంలో మరొక వేరైన 'వృత్తి' ఏర్పడుచూ ఉంటుంది....!

విషయరహితమైన శుద్ధ సత్,

ద్రష్టత్వము వహించు 'వృత్తి' లేక ధ్యాస,

విషయమును గ్రహించటం, నిర్ణయించటం, అనుభవం,

కొంత సమయానంతరం ఆ విషయమును త్యజించటం,

మరొక విషయమును స్వీకరించటం ....

ఇదంతా కొద్ది క్షణములలోనో-ఒక్కక్షణంలోనో-ఒకటి తరువాత మరొకటిగా జరిగిపోతోంది.

ఈ విధంగా ప్రతి జీవుడు వాస్తవానికి విషయములకు అతీతుడు, విషయరహితుడు అయి ఉండి కూడా, ఈ అనేక విషయపరంపరలను ఒకదాని తరువాత మరొకటిగా స్వీయఇచ్ఛ చేతనే పొందటం జరుగుతోంది.

❖

"ద్రష్ట" –ఈ దృశ్యమును గాంచుచున్నప్పుడు... తన స్వస్వరూపాత్మను గాంచుటలేదు. అనగా, "దృశ్యాకారవృత్తి" మనస్సునందు ఏర్పడి ఉన్నప్పుడు, ఆత్మాకారవృత్తి సంభవించదు. అయితే, దృశ్యము సంభవిస్తున్న సమయంలో ఆత్మాకారము మరెక్కడికో పోవుచున్నదా? లేదు. అది యథా తథంగా ఉండి ఉండగా, అందు దృశ్యమునకు సంబంధించిన 'భావన' లేక 'వృత్తి' ఏర్పడిఉంటోంది. ఆత్మాకారమే లేకపోతే, ఇక దృశ్యాకారము ఏర్పడునది ఎక్కడ? కాని దృశ్యాకారము ఏర్పడిఉన్నప్పుడు "ఆత్మాకారము లేదేమో" అనురీతిగా (అసత్తుల్యంగా) ఆ ద్రష్టయొక్క దృష్టియందు ఏర్పడుచున్నది. అయితే, వివేకముచే దృశ్యభ్రాంతి తొలగినప్పుడు, ఇక "కేవల ద్రష్ట" మాత్రమే ప్రకాశిస్తూ ఉంటాడు.

అందుచేత ముముక్షువు అయినవాడు "ఈ దృశ్యాకారవృత్తి నన్ను మోహింపచేయకుండునుగాక! ఈ దృశ్యము ఉంటే ఉండనీ. లేక తొలగనీ. ఏది ఏమైనా నేను ద్రష్టత్వమునకు కూడా అతీతమైనట్టి అనిర్వచనీయ – శుద్ధతత్వమునే" అనియే భావించాలి. అట్టి భావమును దృఢపరచుకొనుటకే ప్రయత్నశీలుడు కావాలి. అప్పుడిక అతని యందు అకృత్రిమమగు ఆత్మాకారవృత్తి ('నేను ఆత్మనే' అను రూపముగల ఎరుక) తనంతట తానే స్వయముగా ప్రాప్తించుచున్నది. కాని, అనేక మంది అవివేకులు, "ఈ దృశ్యము నందలి ఈ ఈ విషయములు పొందితిని. అయ్యో! ఇంకను ఇవి పొందలేకపోయాను కదా?" అని వేదనను ఆశ్రయించి ప్రయత్నించుచు, తద్వారా దృశ్యాకారవృత్తినే అభివృద్ధి చేసుకొంటున్నారు. "నేను ఆత్మతత్వమునే" అను ఉద్దేశమును అభివృద్ధి చేసుకొన్నంతమాత్రం చేత ఈ జీవుడు దుఃఖరహితుడు కాగలడు. ఇక తాత్సారం ఎందుకు చెప్పు?

దర్శనము లేనట్టి ద్రష్ట : ఈ "ద్రష్ట–దృశ్యము" ల విషయమై మరికొంత విచారిద్దాం. "ద్రష్ట" అనబడువారు త్రిపుటియందు (ద్రష్ట–దర్శనము–దృశ్యము అను వ్యవహారమునందు) అంతర్గతుడై, ఉంటున్నాడు. తాను 'దర్శనము' నకు వేరుగా ఉంటూ, ఈ 'దృశ్యము' చే ఏమాత్రం స్పర్శించబడనివాడై ఉంటున్నాడు. కాని, ఈ దృశ్యమునకు కారకుడు తానే అగుచున్నాడు. అతడు 'అద్రష్ట' అయిఉన్నప్పుడు 'వాక్యములకు అందనివాడు' గా అగుచున్నాడు. దర్శించుచున్న సందర్భమునందు మాత్రమే మనో వాక్కులకు లభించుచున్నాడు.

దృశ్యము ఉన్నప్పుడే ద్రష్ట ఉంటున్నాడు : "ద్రష్ట" దృశ్యరహితుడు అయినప్పుడు "పరిశుద్ధ చైతన్యము" అని అనిపించుకొంటాడు. అంతేకాని, ద్రష్ట అని పిలువబడడు. కనుక ఎప్పుడైతే, జ్ఞానోత్పత్తి యొక్క ప్రభావంచేత 'ఈ దృశ్యము ఏక్షణమందూకూడా లేనిదే' అనునట్లు అనుభవం అవుతుందో, అప్పుడు ద్రష్ట–దృశ్యములు రెండూ కూడా లేనివే అగుచున్నాయి. ఓ ప్రియరాక్షసీ! వాస్తవానికి నీకు దృశ్యముగాని, ద్రష్టత్వముగాని లేవు. నిర్మలచైతన్యమే నీవు, నేను, ఈ మంత్రి,

తదితరులు కూడా! కాని, ఆకాశమును మేఘము కప్పివేసి ఉంచుతుంది చూచావా? అట్లే, దృశ్యము పట్లగల "ఇది సత్యము" అను బుద్ధి ద్రష్టత్వమునకు కారణమగుచున్నది. అట్టి భావావేశమే స్వస్వరూపముయొక్క అఖండానుభవమును కప్పి ఉంచుచున్నదని గ్రహించు. శుద్ధ సత్వమైయున్న ఆత్మ యొక్క స్వరూపమును గ్రహించిన తరువాత, ఇక దృశ్యవృత్తిగాని, భేదములుగాని ఉండవు. ఇది గ్రహించువాడు తాను 'నిత్యము - నిర్మలము - సత్యము' మొదలైన విశేషణముల అనుభవం పుణికిపుచ్చుకుంటున్నాడు. సాక్షాత్ బ్రహ్మమే అగుచున్నాడు.

దీపపు వెలుగు - వస్తువులు - చూచేవాడు : మరొక దృష్టాంతము చెపుతాను. సూక్ష్మ బుద్ధితో గ్రహించు.

ఒక గదిలో అంతా చీకటిగా ఉన్నది. అప్పుడు ఒక దీపం వెలిగించబడినది. ఆ దీపము వెలుగుచుండగా, దీపపు వెలుగులో అక్కడున్న ఆయాకొన్నివస్తువులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు :

నీవు చూస్తున్న ఆయావస్తువులపై వెలుగుగా ప్రసరించి అవి నీవు చూడకలుగునట్లు చేస్తున్నదేది? దీపమే కదా....!

కాని "ఆ వస్తువులను నీకు చూపునది దీపమే" అని అనగలమా? 'చూపుట' అనబడు కర్తృత్వము దీపమునకు ఎట్లా ఆపాదిస్తాం? దీపమునకు ఇచ్ఛ-అయిచ్ఛలు లేవుకదా!

నీయందలి వస్తువృత్తులే ఆయా వస్తుజాలములలో కొన్నిటిని చూచుటకు కొన్నిటిపై దృష్టి సారించక పోవటానికి కారణము అగుచున్నాయి.

కాని, దీపం లేకుంటే ఆ వస్తువులు కనబడేవే కావు కదా!

ఈ దృష్టాంతమును దృష్టిలో పెట్టుకొని, ఇక నేను చెప్పునది విను :

"ద్రష్ట-దర్శనము-దృశ్యము" ... ఈ మూడిటిని (త్రిపుటిని) ఆత్మయే ప్రకాశింపజేయుచున్నది. అనగా చైతన్యరూపమగు ఆత్మయొక్క సమక్షము (Presence) చేతనే ఈ మూడు స్థితివంతము లౌతున్నాయి.

అయితే "దృశ్యత్వబుద్ధిని ఆత్మయే కల్పించుచున్నది" అని అనలేం. అనగా, ఈ కల్పనయొక్క కర్తృత్వము ఆత్మకు ఆపాదించలేము.

ఆత్మయే లేకపోతే ఈ ద్రష్ట-దృశ్యముల ఎరుకయే ఏర్పడేది.

ఆత్మయొక్క విశేషము ఏమిటో ఏమరచిన అజ్ఞాని దృశ్యవృత్తిలో నిమగ్నమగుచున్నాడు. జ్ఞానియో "ద్రష్ట-దర్శనము-దృశ్యము" లనే త్రిపుటిని ఆత్మయందు లయము ఒనర్చుచున్నాడు. 'ఆత్మవృత్తి' ని మాత్రమే అంగీకరించుచు, ఆత్మానుభవము పొందుచు, ఆత్మయే అయిఉంటున్నాడు. అసద్రూపంగా వెలయుచున్న 'ఆభరణము' యొక్క ఆకారాదులను, ఆ బంగారమును పరిశీలించు కంసాలి, - తన తార్కిక బలంతో ఆభరణ సంబంధమైన ఆకారాదులను ప్రక్కకు పెట్టి బంగారము, అద్దాని నాణ్యత పై దృష్టి పెట్టుచున్నాడు కదా! అది కూడా అంతే.

❖

ఓ ప్రియా! బ్రహ్మానంద స్వరూపిణీ ! కర్కట నామధేయీ ! అసలు ఒక్కసారి ఈ కనబడే దృశ్యమంతా సమగ్రంగా గమనించు. నీ చుట్టూ, నా చుట్టూ ఉన్నదంతా పంచభూతసముదాయము మాత్రమే కదా! అంతకు మించిన దృశ్యవస్తువంటూ ఎక్కడ ఏది ఉన్నది చెప్పు? అయితే, ఇదంతా ఆత్మయొక్క వృత్తిని అనుసరించే అనుభవమౌతోంది. ఆవిధంగా, స్వభావసిద్ధమైయున్న 'చైతన్యతత్త్వము' కంటే భిన్నమైనట్టి దృశ్య-పదార్థమంటూ ఎక్కడా ఏదీ లేదు. ఆత్మ సర్వవ్యాపి, సర్వానుభవస్వరూపము అయి ఉన్నది కదా! అందుచేత ఆత్మానుభవం సిద్ధించిన మరుక్షణం ద్రష్ట-దృశ్యముల ఐక్యత సహజంగాను అకృత్రిమంగాను ప్రాప్తించగలదు. ఆత్మ యొక్క ఇచ్ఛానుసారమే ఫలప్రాప్తి జరుగుతోంది కనుక, "పదార్థములు – ఇచ్ఛ' '... రెండిటి యొక్క ఐక్యత స్వయముగానే సిద్ధించుచున్నది. దీనిని బట్టి నీవు గ్రహించవలసినది ఏమిటి? సముద్రము కంటే తరంగములు వేరుకావు కదా! అట్లే "ఆత్మేచ్ఛ" కు అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ లేదని గమనించు.

పరమాత్మ : ఆ పరమాత్మ దేశ-కాల వస్తువులచే పరిచ్ఛిన్నుడు కాడు. అందరియొక్క 'ఆత్మ' అతడే. వానికి భిన్నమైనదంటూ ఎక్కడా ఏదీ ఉండదు. అతడు ఎక్కడోలేడు. ఎన్నటికో లభించబోయే వాడుకాడు. సర్వుల అనుభవస్వరూపుడై వెలుగుచున్నది అతడే. కాబట్టి "సర్వ ఇచ్ఛల స్వరూపము అతడే" అనే ఒకానొక ఉత్తమ రహస్యం జ్ఞానివైన నీ ముందు ప్రస్తావిస్తున్నాను. "ఆ పరమాత్మ సత్-చిత్ స్వరూపుడు" అని (ఋగ్వేదాది) శాస్త్రములు ప్రతిపాదిస్తున్నాయి. నేత్రములనే ప్రకాశింప జేయుచున్న అతడు, అవే నేత్రములచే ఎట్లా చూడబడగలడు చెప్పు? అందుచే అవివేకులు అతని గురించి... "అతడు ఎవ్వరికీ కనబడుటలేదు కదా! అందుచేత అసత్తుల్యుడేమో! అనగా, అతడులేడేమో!" – అని భావిస్తున్నారు.

స్వస్వరూపుడగు పరమాత్మ యందు ద్వైతమేమిటి? ఏకత్వ మేమిటి? అందుచేత "ద్వైతము మిథ్య – ఏకత్వము సత్యము" అనికూడా చెప్పలేము. ఎందుచేతనంటావా? రెండవవస్తువు ఉన్నప్పుడు కదా... "అది – ఇది ఒక్కటే" అను ఏకత్వమును సంభవింప చేయకలిగేది! 'ఆకారము-దాని నీడ' వలె, ద్వైత – ఏకత్వములలో ఒకటి ఉంటేగాని, రెండవది సిద్ధించదు. రెండవవస్తువే లేనప్పుడు ఒకే వస్తువు యొక్క ఏకత్వం ఎట్లా ఉంటుంది? "ఏకత్వము లేదు" అని అనుకొన్న మరుక్షణం ద్విత్వము కూడా లేనట్లే అగుచున్నది.

"ఆత్మ ద్వైతాద్వైత భేదరహితము"...అను భావము నీ హృదయమునందు పదిలపరచుకో! – సముద్రముకంటే ద్రవత్వము వేరైనదా? కాదుకదా! "ద్వైత-ఏకత్వములు పరమాత్మ కంటే భిన్నమైనవి కావు" అని గ్రహించుటయే జ్ఞానము.

జగత్తు : సత్త్వము-రజము-తమోగుణముల 'సామ్యస్థితి' లేక 'అతీతస్థితి' నుండి చ్యుతి నొందనట్టి బ్రహ్మమునందు అనేక కార్యవ్యవహారముతో కూడియున్న ఈ జగత్తు కన్పట్టుచున్నది. ఒక బీజమునందు మహావృక్షము ఉన్నట్లు. ఈ జగత్తు అంతా ఆత్మయందే ఉండియున్నది. బంగారము – ఆభరణములు వేరు వేరు కానట్లు, ఈ ద్వైత ప్రపంచము బ్రహ్మమునకు వేరైనది కాదు. ఉత్తమ

"బోధ" పొందినట్టి తత్వవేత్త ఈ 'ద్వైతము' ఏమిటో, ఏమై ఉన్నదో ఎరిగియే ఉంటున్నాడు. కనుక అతడు "ఇది ద్వైతము ... కాదు, అద్వైతము" మొదలగు మీమాంసలు కలిగియుండుట లేదు. జలత్వము ద్రవత్వము వేరా? వాయువు కంటే దాని చలనత్వము వేరువేరని ఎవరనగలరు? ఈ ద్వైత ప్రపంచమంతా ఈశ్వరునికంటే వేరైనది కాదు. నీవు, నేను ఈ మంత్రి కూడా అంతే ! ఓ చైతన్య స్వరూపిణీ ! రాక్షసీ ! ఈ ద్వైత – అద్వైత అనుభవములు రెండూ క్రియాత్మకములే కాబట్టి దుఃఖప్రదములే అవుచున్నాయి. బుద్ధి నైపుణ్యం చేత ఈ రెండింటినీ రహితం చెయ్యాలి. 'అదియే ఉత్తమ జ్ఞానం' అని అనిపించుకొంటోంది.

త్రిపుటి : ద్రష్ట – దర్శనము – దృశ్యము; ప్రమాతృత్వము – ప్రమాణము – ప్రమేయము త్రిపుటితో కూడిన ఈ జగత్తు "చేతనము" అయి ఉన్న స్వస్వరూప తత్వమునందే ఉండియున్నది. వాయువు ఒకప్పుడు తనయందు చలనము కలిగి ఉంటూ, మరల ఇంతలోనే మరొకప్పుడు ఆ చలనమును రహితము చేసుకొనుచున్నది కదా! ఆత్మకూడా, ఒక సమయంలో తనయందు 'జగత్తు' అను కల్పన కల్పించుకొనుచు, మరొకప్పుడు, దీనినంతటినీ తన స్వస్వరూపమునందు లయము చేసుకొనుచున్నది. ఆహాఁ! ఈ మాయ ఎంతటి చిత్రమైనదో, ఎంతటి భయంకరమైనదో చూచావా? జీవులను మోహింపచేయుటలో దీనిని మించినవారు మరెవ్వరూ లేరు. అది ఒక పరమాణువులో కూడా విస్తారమైన త్రిలోకములను అనుభవింపజేయగలదు.

(**ప్రమాత:** ఎరుగెడువాడు, ప్రమేయము: ఎరుగతగినది, ప్రమాతృత్వము: ఎరుగుట అను స్వభావం, ప్రమాణము – ఎరుగబడు విధము.)

అయితే, వేదములు, "ఏకమేవాద్వితీయమ్ బ్రహ్మ", "జీవో బ్రహ్మేతినాపరః" అను వాక్యముల ద్వారా "రెండవవస్తువే లేదు" అని ప్రతిపాదించుటచేత, అస్సలు ఆత్మయందు 'మాయ' అనబడు మరొకవస్తువు ఉండటం ఏమిటి? అందుచేత ఈ జగత్తంతా చిత్‌చైతన్యమే కాని మరింకేమీకాదు. ఏదైతే తదితరంగా తోచుచున్నదో, అదంతా 'అవిచారణ' కారణంగానే అట్లు తోచుచున్నది.

"దృశ్యము ద్రష్టకు అభేదమైనదే!" ..... అని గమనించు.

సదసత్తు : చిదణుస్వరూపుడగు పరమాత్మయే తనయందు లీలామాత్రంగా, సంకల్పమాత్రంగా, కారణం లేకుండానే, ఈ బ్రహ్మాండములను ధరించుచున్నాడు. కనుక ఓ రాక్షసీ! ఈ కనబడే జగత్తులన్నీ చిత్ – చైతన్యమునందే ఉండి ఉన్నట్లు సర్వదా నీవు గ్రహించి, ఆపై ఇక్కడ యథాతథంగా సంచరించు. ఈ ద్వైత ప్రపంచమును చిద్రూపపరమాణువు నందు అద్వైతరూపంగా (చిత్ భగవానునకు వేరు కానట్టిదిగా) గాంచువాడే సత్యదర్శి–సమదర్శి కూడా! యథార్థానికి ఈ ద్వైతాద్వైతములు గాని, బీజ–అంకురములు గాని, స్థూల – సూక్ష్మములు గాని, అణు – బ్రహ్మాండములు గాని లేవు. ఉండజాలవుకూడా. 'త్రిలోకములు' అనబడునవి ఏమైనా ఉన్నాయని మనం అనుకోదలిస్తే – అవి చైతన్యాణువునందే "సత్ – అసత్" రూపములుగానే ఉండి ఉన్నాయి. వ్యక్తులకు – వ్యక్తులకు, వ్యక్తులకు – పదార్థములకు సంబంధములన్నీ కల్పనచే ఉంటూ, కల్పనాతీత

దృష్టితో పరిశీలిస్తే ఉండడం లేదు. ఈ త్రిలోకముల ఉనికి కూడా అట్టిదే. ఇవి శాంతములు కావు. అశాంతములు కూడా కావు. పరమార్థ దృష్టితో చూచినప్పుడు పంచభూతముల యొక్క ఆయా పాళ్ళ కలయిక మాత్రమే అయిన ఈ పదార్థజాలం లేనివి గానే జ్ఞానులచే గాంచబడుచున్నాయి. ఒకానొక దృష్టికి మాత్రం ఘనీభూతమై తోచుచు, మరొకదృష్టిచే లేకయేపోతున్న దానిని "ఉన్నది" అనాలా? లేక "లేదు" అనాలా? అందుకే, "ఇదంతా సదసత్తు" అని చెప్పబడుతోంది.

త్యాగి – అత్యాగి : ఈ జగత్తు గాని, దానికి భిన్నమైన మరొకటి గాని లేవు. కేవలము 'చైతన్యము' మాత్రమే ఉన్నది. అది ఎప్పుడు, ఎట్టి పూర్వ సంస్కారములను ఆశ్రయించి ఆవిర్భవిస్తుందో, అట్లే స్ఫురించుచు, అట్టి అనుభవమునే పొందుచున్నది. ఈ సృష్టి రూపమున ఆ చైతన్యమే ఉత్పన్న మగుచు ఉంటున్నప్పటికీ, అంతమాత్రం చేత తన "యథాతథ–నిత్యోదిత–ప్రకాశత్వము"నకు తరుగు పొందుట లేదు. కనుక "ఈ సృష్టి ఏ సమయంలో కూడా ఉత్పన్నము కాకయే ఉన్నది" అను వాక్యము కూడా సముచితమే అగుచున్నది. ప్రపంచరహితమైన చిదాకాశము సర్వదా ఏకరూపముననే ఉన్నది. కాని, భ్రమానుభవముచే అనేక రూపములుగా కన్పట్టుచున్నది. వృక్షము తన వృక్షస్వభావము త్యజించకుండానే బీజమును ఉత్పన్నము చేయుచున్నది. ఆ బీజము మరల భూమిపై మహావృక్షము అగుచున్నది. పరమార్థతత్త్వమగు బ్రహ్మము ఈ జగత్తు రూపమున ఉదయిస్తోంది. జనన – మరణాది కల్పనలతో కూడిన ఈ 'జగద్రూపము' యొక్క అనుభవమును పొందుతోంది. కాని ఆ అనుభవకాలంలో కూడా బ్రహ్మము తన స్వరూప–స్వభావములు ఏమాత్రం కోల్పోవుటలేదు. ఒక యువకుడు వివాహము చేసుకొని పుత్రులు పొందుటచే తండ్రిగా పిలువబడు చున్నప్పుడు "తండ్రి" అనబడు మరొకటేదీ అగుటలేదు. అతడు తన స్వస్వరూపమునకు సంబంధించిన స్వరూప–స్వభావములు త్యజించుటగాని, మార్పు–చేర్పులు పొందుటగాని జరుగుటలేదు కదా! బ్రహ్మము విషయము కూడా అట్టిదే. ఈ జీవునికి వేరైనవాడు కానట్టి 'బ్రహ్మము' అనబడు ఆ పరమాత్మ త్యాగ–అత్యాగములు రెండూ కలవాడే. ఎట్లా అంటావా? అతడు అసంగుడు, అద్వితీయుడు (ద్వితీయము అనునది లేనివాడు) కదా! అందుచేత అతడు సర్వత్యాగపరుడైయున్నాడు. అతడు సర్వవ్యాపి కదా! అందుచేత, దేనినీ త్యజించకయే, ఏకరూపమున సర్వదా ప్రకాశించుచున్నాడు.

చిత్‌అణువు : కమలనాళములోని తంతువుకంటే కూడా కోట్లాదిరెట్లు సూక్ష్మాతిసూక్ష్మమైయున్న 'చిత్'– అణువునందు కోట్లాది జగత్ సమూహములు ఉండగలవు. ఉండియున్నాయి. మహత్తరమగు అట్టి చిత్ – పరమాణువు చేతనే ఈ జగత్తంతా వ్యాప్తమైయున్నది. అద్దానిచేతనే ఉత్పత్తిని పొందుతోంది. అద్దాని సహాయంచేతనే కార్యవంతం అవుతోంది కూడా. అయినప్పటికీ, ఈ పరమాత్మ ఈ 'జగత్తు' అనబడు దానిచే స్పృశించబడక నిర్వికారుడే అయిఉన్నాడు. కల్పిత – గంధర్వనగరం (Ilusion Visualised in the Sky) చే స్పృశించకుండానే ఆకాశం ఎల్లప్పుడూ నిర్మలంగానే ఉంటోంది కదా! మేఘములు మొదలైనవి ఆకాశపు స్వచ్ఛతను తొలగించ గలుగుచున్నాయా? లేదే! అట్లే పరమాత్మయే అయి ఉన్న ఈ జీవుని వాస్తవస్వరూపము జన్మ–మృత్యువులచే, తదితర సంబంధ–బాంధవ్యములచే స్పృశించబడుటలేదు. ఆకాశము ఏ సమయమందూ కూడా దేని చేతనూ ఏ

దోషమూ తాను పొందకుండా, ఎప్పటి అట్లే స్వచ్ఛంగా, నిర్లిప్తంగా, అఖండంగా, నిర్మలంగా, ఏకంగా ఉండి ఉంటున్నది. అట్లాగే, పరమాత్మకూడా సర్వదా నిర్వికారుడు, నిర్మలుడూ, నిర్లిప్తుడు! అయితే, ఆ పరమాత్మయే 'నేను జీవుడను' అను భావనను స్వయంగా భ్రమపూర్వకంగా పొందుచున్నాడు (జీవోశివః! జీవో బ్రహ్మైవ ఇతి నాపరః). అట్టి అజ్ఞానకాలంలో – "జడము, అవిద్యాస్వరూపము, సుషుప్తి" – మొదలైనవాటితో సమానమైనట్టి 'ద్వైతస్థితి'ని గాంచుచున్నాడు. అట్లు 'ద్వైతము' దర్శించు సమయము నందు కూడా, పరబ్రహ్మము 'ఏకమై ప్రకాశించుట' అనుదానికి లోటేమీ ఉండుట లేదు.

క్రియారూపమైనట్టి ఈ జగత్తు అధిష్ఠానమగు ఆత్మతత్త్వము కంటే ఏమాత్రం వేరు కాదు. కాబట్టి ఓ స్నేహితురాలా! నీ ప్రశ్నలన్నిటికి సమాధానం... "ఆ పరమాత్మయే."

ఈ 'జగత్తు' పరమార్థమగు బ్రహ్మమే అయి ఉన్నది. కనుక "ఈ జగత్తే" అని నీ ప్రశ్నలకు సమాధానంగా చెప్పటం కూడా ఉచితమే అవుతుంది.

ఈ ప్రపంచమునకు రూపకల్పన చేస్తున్నది నేనే. అయితే నేను ఈ ప్రపంచమునకు అతీతమైనట్టి "పరమోత్కృష్టమైన" నేను అను "తత్త్వము"ను కూడా! అంతేగాని నేను ఈ ప్రపంచరూపుడను గాను. ఈ కనబడే జగత్తునందు నేనుగాని, ఇది నాయందుగాని లేవు.

అద్వైత బ్రహ్మస్వరూపుడనే "నేను."

ఇక నాకు జన్మ-మృత్యువులెక్కడ? ఉనికి ఎక్కడ? లేమి ఎక్కడ? నేను ఏదై ఉన్నానో, నీవు కూడా అదే (తత్ త్వమ్). కనుక, నీ ప్రశ్నలన్నిటికీ మేము ఇచ్చే సమాధానం ఇదే.

"అది నేనే!"

"అది నీయొక్క వాస్తవ స్వరూపమే! ప్రతి ఒక్కరియొక్క వాస్తవ స్వస్వరూపమే!"

❖❖❖

13. పరస్పరం

రాజు-మంత్రులను చూడకముందు ఆ కర్కటి కొంత చపలచిత్తము కలిగి ఉండేది. ఆ ఇద్దరి 'విజ్ఞానమయమైన-ఆత్మవస్తునిర్ణయాత్మక' వాక్యాలు శ్రద్ధగా విన్నది. మరుక్షణం ఆత్మజ్ఞానముయొక్క ప్రాప్తిచే పరమానందం పొందింది. తన మనస్సునందు శేషించియున్న కొద్దిపాటి మాత్సర్యమును, చాపల్యమును విడనాడింది. ఇక ఆ రాక్షసికి బాహ్యదృష్టిగాని, ఆ బాహ్యదృష్టిచే ఏర్పడు సంతాపము గాని తొలగిపోయాయి. చిత్తము ప్రశాంతత పొందినది. ఆనందమయంగా ఇట్లు పలికినది.

కర్కటి : ఓ రాజ-మంత్రులారా! మీ ఇద్దరి వాక్యములు వినినంత మాత్రంచేతనే నా జన్మ ధన్యమైనది. మీ ఇరువురిలోను శాంతమయమై, నిత్యోదితమై, ఏకరసమైన చంద్రకిరణములవంటి ఉత్తమ ఆత్మజ్ఞానం వెల్లివిరుస్తోంది. ఇది చాలా మహత్తరమైన విషయం! వివేకయుక్తములైన మీ ఇరువురి వాక్యములు

వినిన తరువాత నేను మీకు "దాసోఽహం" అంటున్నాను. మీరిద్దరు నాకు పూజ్యులు. మీతోకూడిన సత్సంగముచే నేను నిర్మలంగా ప్రకాశించుచున్నాను. "సజ్జనులతోటి సాంగత్యము అద్భుతమైన ప్రభావం కలిగి ఉంటుంది" అనే శాస్త్రప్రవచిత విషయం మీరిద్దరు మరొక్కసారి నిరూపించి చూపారు. మరల మరల మీ పాదాలు స్పృశిస్తూ ప్రణామంచేస్తున్నాను. చేతిలో దీపం ఉన్న తరువాత, ఇక అంధకారమెక్కడ ఉంటుంది? మీయొక్క సంసర్గముచే నా మనస్సులోని రాక్షస ప్రవృత్తులు, కుసంస్కారములు ఉపశమిస్తున్నాయి. దుఃఖం తొలగిపోతున్నది.

ఓ రాజ-మంత్రులారా! ఒక రాక్షసినైనట్టి నాపట్లే మీ విజ్ఞానసమన్విత వాక్యములు ఇంతటి ప్రభావం చూపించినప్పుడు, ఇక తదితరులు వింటే ఎంతటి ఉత్తమ ప్రయోజనం కలుగుజేస్తాయో? ఇతరులలో అనేకులు ఈ వాక్యములు వింటే మరుక్షణం దుఃఖరహితులు అవుతారు. ఈ మీ వాక్యములు అనేకమంది ముముక్షువుల చెవులకు విందు చేయునుగాక!

ఓ విక్రమ మహారాజా! సుబుద్ధివగు ఓ మహామంత్రీ! "మహాత్ములు" అయి ఉన్న మీ ఇద్దరితో ఇంతకుముందు నేను పరుషవాక్యములు పలికినందుకు నన్ను క్షమించండి. 'క్షమ' యే మీవంటి మహనీయులకు భూషణమై ఉంటుందని పెద్దలు చెప్పగా విన్నాను. ఆకాశములో సూర్య-చంద్రులవలె భూమిపై వెలుగొందుచున్న మీ ఇద్దరు నాకు అత్యంత పూజనీయులు, ప్రీతిపాత్రులు అగుచున్నారు. ఇప్పుడు ఏదైనా కోరుకొమ్మని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. అత్యంత వినమ్రతతో మీ మనోరథం ఈడేర్చటానికి సిద్ధంగా ఉన్నాను.

విక్రమమహారాజు : ఓ ప్రియరాక్షసీ ! మా రాజ్యములోని ప్రజలు ఒక ఈతిబాధకు లోనగుచున్నారు. 'విసూచిక' అనబడు ఒక వ్యాధిరూపమైన మహమ్మారి ఇక్కడి ప్రజలను పట్టి పీడిస్తోంది. అది హృదయమును బలహీన పరచివేయుటచే, ఆ రోగికీ ఏ ఔషధము ఇచ్చినప్పటికీ నిష్ప్రయోజనమే అవుతోంది. మా దగ్గర ఉన్న మంత్ర - తంత్ర శక్తులన్నీ ఆ మహమ్మారి ముందు కొఱగాకుండా పోతున్నాయి. మీ వంటి మహాత్ములనెవరినైనా ఆశ్రయించి ఏదైనా మంత్రము-తంత్రము-ఔషధము పొంది తద్వారా మా ప్రజలకు సుఖశాంతులను కలుగజేయాలనే ఉద్దేశంతోనే మేమిద్దరం ఈ అర్ధరాత్రి ఇటువైపు వచ్చాం.

మీ వంటి రాక్షసులు అట్టి మహమ్మారులను నిరోధించగలిగే శక్తియుక్తులు, ఉపాయములు కలిగి ఉంటారని వింటూ ఉంటాం. మీవంటివారిని వశపరచుకొని, తద్వారా మా ప్రజలను మేము కాపాడుకోవాలని మా ఉద్దేశం. అది రాజులమగు మాకు విధ్యుక్తధర్మమే కదా!

మా రాజ్యములోని మంత్రద్రష్టలు మాకు చెప్పిన కొన్నికొన్ని విషయములను అనుసరించి "నీవు గొప్ప మంత్రశక్తిగల దానవు" అని మేము అనుకుంటున్నాం. మా సంకల్పము, దైవనిర్ణయం కూడా ఒకే తీరుగా ఉన్నాయి కాబోలు! ఇప్పుడు నీవు తారసపడ్డావు. నిన్ను ఒక కోరిక కోరుతున్నాం.

ఆ విసూచివ్యాధి మా ప్రజలను హింసించకుండా ఉండునట్లు అనుగ్రహించు. అంతేకాదు. మా ప్రజలను నీవు హింసించవద్దని మా మనవి.

కర్కటి: ఓ రాజా! ఒక రాజుగా, నీ ప్రజాక్షేమం కోరినవాడవై, మంచి కోరికనే కోరావు. నీ వితరణశీలత తప్పక మెచ్చుకోతగ్గదే. మీరిద్దరు నాకు ఇప్పుడు గురుతుల్యులు కదా! ఇక ఇప్పటి నుండి మీ రాజ్యములోని ఏ ప్రాణిని నాకు నేనుగా హింసించనని మీకు మాట ఇస్తున్నాను. మీ అభీష్టమును అనుసరించే ఉంటాను. ఆ విసూచి వ్యాధిని నివారించటానికి మంత్రం తప్పక చెపుతాను.

విక్రముడు: కానీ, నీవు జన్మతః రాక్షసివి కదా! ప్రకృతి నిర్ణయమును అనుసరించి నర-జంతు దేహములను భుజించుట నీయొక్క స్వభావమే అయిఉన్నది. మరి నీవు 'అహింస' ను నియతిగా గ్రహిస్తే ఇక ఈ నీ శరీరనిర్వహణయే కష్టతరం అవుతుందేమో? ఇంకొక విషయం. నీవు ఎవరో, నీ పూర్వవృత్తాంతమేమిటో, ఇంతటి ఆత్మదృష్టి ఎట్లా పొందావో తెలుసుకోవాలని మాకు ఉన్నది.

కర్కటి: హే మహాత్మా! మీరిద్దరు ప్రవచించిన ఆత్మవచనములు నాయొక్క 'ఆత్మదృష్టి' కి ఎంతో దృఢత్వం చేకూర్చాయి.

నేను ఒకానొకప్పుడు ఒక పర్వతముపై ఆరునెలలు సమాధియందు ఉండి ఉన్నాను. ఆ తరువాత సమాధినుండి లేవగానే (వ్యుద్థానకాలమునందు) నాయందు 'భోజనము' గురించి సంకల్పము ఉదయించింది. జీవులను భక్షించాలనే ఉద్దేశంతోనే ఇటువైపు వచ్చాను. ఇప్పుడు మరల ఆపర్వతశిఖరం చేరుతాను. ధ్యాననిష్ఠయందు నిమగ్నమైపోతాను. ఒక శిలాశిల్పంలాగా నిశ్చలత్వము వహిస్తాను. అమృత స్వరూపమగు ఆత్మ గురించి భావనచేస్తూ ఉంటాను. మీరు చెప్పిన వాక్యార్థములను మననం చేస్తూ ఈ జీవితము గడుపుతూ ఉంటాను. ఆ తరువాత నా ఇచ్ఛానుసారంగా ఎప్పటికో అప్పటికి ఈ ఉపాధిని త్యజించివేస్తాను. ఈ శరీరము త్యజించబడేవరకు నేనిక ఏ ప్రాణిని హింసించను.

ఇక నా ఇతః పూర్వపు విశేషాలు చెపుతాను వినండి. నేను 'కర్కటి' అనే పేరుగల రాక్షసిని. హిమాలయ పర్వతపు ఉత్తరదిక్కునగల ఒకగుహలో నివసిస్తూ ఉండేదానను. ఒకసారి గొప్పతపస్సు చేసి బ్రహ్మదేవుని మెప్పించాను. బుద్ధిమాంద్యంచేత "విసూచిక" అనే సూక్ష్మ ఉపాధితో వ్యాధి స్వరూపురాలయ్యాను. అనేకజనుల రక్తమాంసములు పీల్చుచు ఉండేదానను. అప్పుడు గుణవంతుల రక్షణకై బ్రహ్మదేవుడు ఒక మంత్రమును లోకములకు ప్రసాదించటం జరిగింది. ఓ రాజా! బ్రహ్మదత్తమైన ఆ మంత్రమును మీకిప్పుడు ఉపదేశిస్తున్నాను. అది శ్రద్ధగా పఠించువారు అట్టి ఉపాసనాబలంచేత.... ఇతరుల హృదయములోని శూలబాధను క్షణంలో నశింపజేయగలరు. కలుషితనాడులందలి శూలబాధను తొలగించుట కొరకు బ్రహ్మదేవునిచే ప్రవచించబడిన విసూచికామంత్రమును నావద్దనుండి మీరిద్దరు స్వీకరించుటకు సిద్ధంకండి. అదుగో.... అక్కడ ఏదో సరస్సు కనబడుతోంది. అక్కడికి మనం ముగ్గురం నడచివెళ్ళుదాం. స్నానము, ఆచమనము ముగించిన తరువాత నేను మంత్రప్రదానం చేస్తాను.

❖

వారు ముగ్గురు నదీతటం జేరారు. ప్రజల క్షేమమే ఆశయముగా గల రాజు - మంత్రులిద్దరూ ఆ రాక్షసికి గురుభావంతో ప్రణామం చేశారు. బ్రహ్మప్రోక్తము, సిద్ధిదాయకము అయినట్టి విసూచి

మంత్రమును, ఆమంత్రమునకు సంబంధించిన సంకల్పవిధానమును కర్కటి నుండి నేర్చుకొన్నారు.

కర్కటి : మిత్రులారా! మీకు, మీ రాజ్యమునకు శుభమగుగాక! ఇక నాకు సెలవు ఇప్పిస్తే, నా స్వస్థానమునకు చేరుకొంటాను.

విక్రమరాజు : ఓ స్నేహితురాలా! దీర్ఘదేహీ! ఈ విసూచీమంత్రము మాకు ప్రసాదించుటచే ఇటుమాకు, అటు మా ప్రజలకు ఎంతో మేలు చేశావు. ఇప్పుడు నీవు మాకు గురువువు, స్నేహితురాలివికూడా అయ్యావు. నీ మీద వాత్సల్యంతో గౌరవంతో నీకు తగిన భోజనసదుపాయం చెయ్యాలని మేము అనుకొంటున్నాము. ఎందుకంటే, జ్ఞానుల ఆవశ్యకత ఈ భూమిపై ఎంతో ఉన్నది.

ఇప్పుడు మేము ఒక నిశ్చయానికి వచ్చాం. మాపై కరుణతో, ప్రేమతో మా ఈ నిశ్చయమును అంగీకరిస్తావని తలుస్తాము. సజ్జనులగు మహాత్ములను ప్రేమతో దర్శించినంత మాత్రంచేత వారితో స్నేహం సిద్ధిస్తుందని పెద్దలు అనగా విన్నాము. మా నిశ్చయమేమిటో విను.

నీవు అందమైన ఆభరణములు ధరించి మనోహరమైన ఆకృతితో మా రాజగృహమునకు రావచ్చు. అచట నీవు సుఖంగా ఏలోటూ లేకుండా ఉండవచ్చు. అక్కడ మేము మా సేవకులను నియమిస్తాం. వారు నీకు అన్న పానీయములు చేకూర్చుచు నీకు సేవ చేస్తూ ఉంటారు.

కర్కటి : ఓ రాజా! నీవు కోరినట్లే, నేను ఒక సుందరస్త్రీ రూపం ధరిస్తే, నీవు తప్పక అన్నపానీయములు చేకూర్చుతావు. కాని, నేను జన్మతః రాక్షసిని కదా! మీ మానవులు భుజించే అన్నపానీయములు మాకు రుచిస్తాయా? లేదు. సామాన్య భోజనం మాకు తృప్తిని కలిగించవు. ఈ రాక్షస ప్రవృత్తితో కూడిన దేహము ఉన్నంతవరకు మా స్వభావం ఇట్లే ఉంటుంది. కనుక, నా అన్నపానాదుల గురించి నీవు చింతించవద్దు. నిశ్చింతగా నీ రాజ్యం చేరి, ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుకో. నాకు సెలవు ఇప్పించు.

విక్రమరాజు : నీవు అన్నమాట నిజమే. అయితే మాత్రం ఏం? ముందుగా ఒక సుందర స్త్రీ రూపము దాల్చినదానవై, బంగారు ఆభరణములతో శోభిల్లుచు, మా అంతఃపురంలో కొన్నాళ్ళు ఉండి విశ్రాంతి తీసుకో. మా రాజ్యములోని దుష్టులను, చోరులను, నిరంతర-హింసాపరాయణులను వధించటానికి ఒకచోటకు చేరుస్తూ ఉంటాము. అట్టివారిని నీకు ఆహారంగా సమకూరుస్తాము. నీవప్పుడు నీ సుందర స్త్రీ రూపము త్యజించి, రాక్షసిరూపివై ఆ వధింపతగువారిని హిమాలయపర్వత గుహలోనికి గొనిపోయి అక్కడ భుజించు. నీవలె అధికంగా భుజించేవారికి ఏకాంతభోజనమే బాగుంటుంది కదా! అట్లు భుజించి తృప్తిగా ఆ గుహలో కొంతకాలం విశ్రమించు. ఆ తరువాత నిదురలేచి సమాధిస్థితి స్వీకరించు. సమాధినుండి లేచిన తరువాత మా నగరం వస్తూఉండు. మరల యథావిధిగా క్రూరులు, పాపులు అయినట్టి ప్రాణులను నీ కొరకు సిద్ధంచేసి ఉంచుతూ ఉంటాము.

నీకు సంకోచం అఖ్ఖర్లేదు. ఇట్లాచేయటం పాపం కాదు. "స్వధర్మేణచ హింసైవ మహాకారుణయా సమా".... స్వధర్మ పూర్వకమైన హింస కూడా మహాకరుణతో సమానమే.

అందుకు నీవు ఒప్పుకుంటే, ఈ నీ స్నేహం మాకు మరెంతో కాలం లభ్యమౌతుంది. అది మాకు మహదానందమైన విషయమే అవుతుంది. స్నేహం స్థిరపడిన తరువాత, విరుద్ధస్వభావముతో కూడిన జీవులైనప్పటికీ, వారిమధ్య స్నేహబంధం తొలగదుకదా! మేము, ఇకపై నిన్ను 'కందరాదేవి' అని పిలుస్తాం.

రాక్షసి : ఓ స్నేహితుడా! అట్లే అగుగాక! నీవంటి ఉత్తమ శ్రేయోభిలాషుల మాట తీసివేయగలనా? నా 'ఆకలిబాధ' విషయంలో నీవు చూపుచున్న ఔదార్యమునకు సంతసించుచున్నాను. నీకు, ఈ మంత్రికి, నీ ప్రజలకు శుభమగుగాక!

❖

ఆ ముగ్గురు రాజగృహం చేరారు. ఆ రాత్రంతా ఆత్మవిషయమై అనేక విషయాలు చర్చించు కొంటూ గడిపివేశారు. సుందరస్త్రీ రూపం ధరించిన ఆ రాక్షసి మరునాడు నగరంలోని వింతలు, విశేషాలు అన్నీ చూచివచ్చింది. రాజు, మంత్రులు తమ తమ రాచకార్యములలో నిమగ్నమైనారు.

ఆ విధంగా ఆరు రోజులు గడచిపోయాయి. ఏడవ రోజు రాత్రి విక్రమమహారాజు తన భటులను పిలిపించాడు. ఓ భటులారా! తక్షణం వెళ్ళండి. తమయొక్క దుష్టప్రవృత్తి కారణంగా మన రాజశాసనమును అనుసరించి మరణశిక్ష విధింపబడి, చావుకై ఎదురుచూస్తున్న నేరస్థులు ఏఏ చెఱసాలలో ఎక్కడెక్కడ ఉన్నారో విచారించండి. అట్టి నేరస్థులందరినీ మన నగరానికి తీసుకురండి" --- అని ఆజ్ఞాపించాడు. శిక్షయొక్క అమలుకై ఎదురుచూస్తున్న కొంతమంది నేరస్థులను ఒకచోటికి రప్పించారు. రాజు ఆ రాక్షసిని సమీపించి, "ఓ కందరాదేవీ! ఇదిగో..... వీరందరిని నీకు ఆహారంగా ఇస్తున్నాను. వీరు నేరప్రవృత్తి కలవారు. మా రాజశాసనములను అనుసరించి మరణదండన విధింపబడినవారు. అందుచేత నీకు ఆహారం అవుతారు" అని పలికాడు.

ఆ రాక్షసి సంతోషించింది. రాజువద్ద సెలవు పుచ్చుకొన్నది. తన భీకరమైన ఆకారమును ధరించి, వారందరిని తన భుజంపై వేసుకొని హిమాలయపర్వత గుహకు రివ్వున ఎగిరింది. వారిని సుష్టుగా భుజించి మూడురోజులు నిదురించింది. ఆకలి తీరుటచే స్వస్థచిత్త అయి 'సమాధి'ని అవధరించింది. ఐదు సంవత్సరాలు సమాధిలో ఉండిపోయింది. ఒకానొక రోజు సమాధినుండి వ్యుత్థానం పొందింది. రాజు విక్రమార్కుని అభిప్రాయం గుర్తుకువచ్చుటచే మళ్ళీ కిరాతరాజ్యం ప్రవేశించింది. అక్కడ రాజు – మంత్రులను కలుసుకొన్నది. ఉచితమర్యాదల తరువాత, ఆ ముగ్గురు ఆత్మవిషయమై సంభాషణలతోను, అనేక కథాప్రసంగములతోను కొన్ని రోజులు గడిపారు. ఒక రోజు, రాజుచే సిద్ధము గావించబడినట్టి, వధింపబడతగ్గ ప్రాణులను తనవెంట గైకొని హిమాలయ పర్వతములవైపు రివ్వున ఎగిరిపోయింది.

❖❖❖

14. కందరాదేవి

ఓ రామచంద్రా! నేటికికూడా ఆ రాక్షసి ఆ పర్వతముపైనే నివసిస్తోంది. ఒకప్పుడు ధ్యాననిష్ఠ యందు, మరొకప్పుడు వ్యుత్థానస్థితియందు ఉండిఉంటోంది. ఆ కిరాతప్రభువు, అతని మంత్రి మాత్రం కాలానుగుణంగా కోర్కెలన్నీ త్యజించివేసి, శాంతచిత్తులై, విదేహముక్తిని పొందారు. ఆ రాజు యొక్క వంశపరంపరలోని తర్వాతి ప్రభువులు కూడా ఆ రాక్షసితో మిత్రత్వము కలిగి ఉంటున్నారు. అప్పుడప్పుడు ఆ రాక్షసి రావటం, వారు దుష్టజీవులను ఆమెకు ఆహారంగా ఇవ్వటం... ఇప్పటికీ ఆ రాజ్యంలో జరుగుతోంది. అయితే మహాత్ములు ప్రత్యుపకారం చెయ్యటమే స్వభావంగా కలిగిఉంటారు కదా! యోగసిద్ధిని పొందియున్న ఆ రాక్షసి తన మంత్ర – యోగశక్తిచే అక్కడి ప్రజలకు కలిగే అరిష్టములను, పిశాచాదుల నుండి వచ్చే భయాదులను తొలగిస్తూ ఉంటోంది. ఆయా రోగములను కూడా నివారిస్తూ ఉంటోంది. రాజ్యం వలన రాక్షసికి, రాక్షసివలన రాజ్యమునకు ఉపకారమే జరుగుతూ వస్తోంది.

ఎప్పుడైనా ఒక్కొక్కసారి ఆ కర్కటి చాలాకాలం వరకు ధ్యాననిష్ఠయందు ఉండటం జరిగితే, ఆ కారణంచేత చాలాకాలం కిరాతరాజ్యం వచ్చేదికాదు. అప్పుడు అక్కడి ప్రజలు, రోగనివారణకొరకై ఒక ఎత్తైనప్రదేశంలో ఆమె విగ్రహం స్థాపించి.... ఆ విగ్రహాన్ని పూజిస్తూ ఉంటారు. ఆమెను "కందరాదేవి", "మంగళేతర" అనే పేర్లతో ఆరాధిస్తూ ఉంటున్నారు.

అప్పటినుండి, ఆ రాజ్యమును పాలించే రాజులంతా సింహాసనం అధిష్ఠించేముందు కందరాదేవియొక్క విగ్రహప్రతిష్ట రాజ్యంలో ఎక్కడో అక్కడచేసి, అప్పుడు మాత్రమే రాజ్యభారం స్వీకరించేవారు. అట్లా ప్రతిష్ఠ చేయకపోతే అక్కడి ప్రజలకు అరిష్టం కలుగగలదని అక్కడి పెద్దల అభిప్రాయం. "కందరాదేవిని పూజించుటచే ప్రజలు అరిష్టముల నుండి, రోగములనుండి విముక్తిని పొందుతారు" అను ఒకానొక దృఢభావన అక్కడి ప్రజలకు శుభ, శ్రేయస్సులనే కలుగుజేస్తూ ఉన్నది. ఆమె విగ్రహములు, దేవాలయములు నేటికీ ఉన్నాయి. పూజింపబడుచున్నాయి. ఆ దేవి యొక్క లిఖిత చిత్రముకూడా అక్కడి ప్రజల ఇండ్లలో అలంకరించబడి కష్టములు, రోగములు తొలగించునవై ఉంటున్నాయి.

సకల కోమల మంగళకారిణీ కవీలితాఖిల వధ్యమహాజనా ।
జయతిసాత్ర కిరాతజనాస్పదే పరమబోధవతీ చిరదేవతా॥

అని ఆ కందరాదేవి ప్రార్థింపబడుచున్నది. "సర్వులకు సస్యసమృద్ధి, ఐశ్వర్యము, సకలసంపత్తులు, ఆయురారోగ్యములు ప్రసాదించు మా కందరాదేవి దుష్టశిక్షణ–శిష్టరక్షణ చేస్తూ సర్వదా మమ్ములను కనికరించునుగాక" అని, అక్కడి సర్వజనులు ప్రార్థనలు చేస్తూ ఉంటారు.

❖❖❖

15. సమీక్ష

ఓ రామచంద్రా! మన ఈ "ఆధ్యాత్మ తత్వప్రసంగం" లో "ఈ ప్రపంచము యొక్క ఉత్పత్తి" విషయమై కొన్ని విశేషాలు వివరించటానికే, నీకు, ఈ 'కర్కటి ప్రశ్నలు' చెప్పాను. దీనిని బట్టి గ్రహించవలసింది ఏమిటి?

ఈ జగత్తంతా – ఆదిగాని, మధ్యగాని, అంతముగాని లేని, పరమకారణము అయినట్టి – 'బ్రహ్మము' నుండే ఉత్పన్నము అయినది. ద్రష్ట–దృశ్యము కూడా పరబ్రహ్మ స్వరూపమే!

కాని, యథార్థానికి, బ్రహ్మమునందు ఏ క్షణంలో కూడా ఏదీ ఉత్పన్నమే అగుటలేదు. నీటిలో వేరువేరు ఆకారములు కలిగిఉండే చంచల తరంగాలు, గుండ్రటి ఆవృత్తములు మొదలైనవన్నీ కనబడుతూ ఉంటాయి. నీరే ఆ అన్ని ఆకారములుగా పరిణమించటం జరుగుతోంది కదా! కానీ, నీరు ఏదైనా మార్పుచెందుతోందా? మరింకేదైనా అగుచున్నదా? లేదే! అట్లాగే పరబ్రహ్మము నందు భూత – భవిష్యత్ – వర్తమాన కాలాత్మకమైనట్టి ఈ జగత్తు ఉన్నది. పరబ్రహ్మము తనయొక్క స్వభావసిద్ధమైన సమత్వ – సామ్యత్వములను ఏమాత్రం ఏ క్షణంలో కూడా త్యజించటం లేదు. అట్లు త్యజించకుండానే, సర్వమునకు కర్త అయి, ఈ జగత్తు యొక్క నిర్మాణం చేస్తోంది.

'కొయ్య 'లో ఒక విగ్రహం చెక్కబడుచున్నట్లుగానే, ఈ కనబడుచున్న 'సృష్టి' అనబడే దంతా స్వయముగా, బ్రహ్మమునందే ఒకానొక 'మిథ్యాకల్పన' రూపమున ఉదయించటం జరుగుతోంది. అంతేకాని "ఈ సృష్టి అంతా ఎక్కడినుండో బయలుదేరి ఇక్కడికి ఎప్పుడోవచ్చి చేరుచున్నది" అని భ్రమించకూడదు సుమా! ఈ దృశ్యము బ్రహ్మమే!

బీజముకంటే – ఆకులు, పుష్పములు, ఫలములు వేరా? కాదు కదా! కానీ, అవన్నీ వేరు వేరు ఆకారములతో విలక్షణంగా కనిపిస్తున్నాయి. ఈ అనేక పదార్థములతో కూడుకొని కనిపిస్తున్న జగత్తు బ్రహ్మము కంటే వేరుకాదు. కాని, భిన్నంగా కనిపిస్తోంది. పుష్ప – ఫల – ఆకుల సత్త బీజములో ఉన్నంత వరకు – "పుష్పాదుల సత్తకు – బీజము యొక్క సత్తకు" – ఏమైనా భేదం ఉన్నదా? బ్రహ్మము నందు చిత్‌నకు ('తెలుసుకొనుట' అను తత్త్వమునకు).... చేత్యమునకు (తెలియబడు తత్త్వమునకు) భేదము లేదు. వాయువునకు, ఆ వాయువు యొక్క చలనమునకు భేదమేమి ఉంటుందో చెప్పు? చిత్‌కు, చేత్యములకు (తెలుసుకొనుటకు, తెలియబడుటకు) భేదభావ మంతా విచారణలేనట్టి సమయమునందే ఏర్పడుతోంది. లేక స్ఫురిస్తోంది. అట్టి భేదభావన అసత్యమే కాబట్టి, "అయుక్తము, దుఃఖకారకము" కూడా అగుచున్నది. అనిర్వచనీయమగు 'మాయ' చేత మాత్రమే ఏర్పడుచున్నట్టి ఆ 'భేదదృష్టి' నశించాలంటే, 'ఆత్మవిచారణ' అనేది మాత్రమే ఉపాయం. ఆత్మవిచారణచే, "దృశ్యము ద్రష్టయొక్క స్వస్వరూప విన్యాసమే!"... అని సుస్పష్టం కాగలదు.

ఈ భ్రాంతి కారణరహితంగానే ఉత్పన్నమగుచున్నది. మరల ఇంతలోనే, జ్ఞానముచే నశించ గలదు. అవిచారణచే ఉత్పన్నమైనది కాబట్టి విచారించుటచేత తొలగిపోతోంది. ఓ రఘుకులతిలకమా! రామచంద్రా! నీవు "భేదదృష్టియే రూపముగా గల భ్రాంతి" ని త్యజించివేయి.

ఎప్పుడైతే బ్రహ్మసాక్షాత్కారం అవుతుందో అప్పుడు ఈ మాయను సమగ్రంగా ఎరుగ గలుగుతావు. ఈ మన వర్తమాన 'ఉపదేశం' శ్రద్ధగా వింటూ ఉంటే.... భ్రాంతి రూపమునగల హృదయగ్రంథులు క్రమంగా తప్పక ఛేదించివేయబడుతాయి. ఆ తరువాత ఇక అజ్ఞానముయొక్క శబ్దార్థముల గురించిన భేదభావమంతా స్ఫురించకుండానే పోతుంది. అట్టి సమయంలో నీవే స్వయముగా 'బ్రహ్మము' అయి ఉన్నట్లు గ్రహిస్తావు. 'చిత్తము' నకు కారణమైనట్టి అవిద్య, అట్టి ఈ చిత్తముచే కలుగుచున్న అనర్థములు.... అన్నీకూడా, ఈ ఉపదేశముచే తప్పక శాంతించగలవు.

❖❖❖

ఈ కర్కట్యుపాఖ్యానం యొక్క సారం:

ఈ జగత్తు బ్రహ్మము నుండే బయల్వెడలుతోంది.

బ్రహ్మము నందే ఉంటోంది.

బ్రహ్మము నందే లయిస్తోంది.

కనుక ఈ జగత్తు సర్వదా బ్రహ్మమే!

ఈ ద్రష్ట బ్రహ్మమే.

'దర్శన – దృశ్యములు' ఈ ద్రష్టకన్న వేరు కాదు.

కనుక అవి కూడా బ్రహ్మమే.

❖❖❖

VI. ఐందవ - బ్రహ్మాండములు

1. బ్రహ్మము 'వలన' జగత్తు?

శ్రీరాముడు : శ్రుతులు, ("తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః" వంటి) కొన్ని మహావాక్యముల ద్వారా, "బ్రహ్మము వలన జగత్తు ఉత్పన్నమైనది" అని ప్రకటిస్తున్నాయి కదా! ఇక్కడ 'వలన' (because of) అనే పంచమీతత్పురుష* మనకు వినబడుతోంది. అనగా, ఆ వాక్యములు 'జగత్తు – బ్రహ్మములు వేరు వేరు" అని ప్రకటిస్తున్నట్లే కదా! అప్పుడు "ఈ సర్వము అభిన్నము" అని మనం ఎట్లా అనగలం?

పోనీ, "జగత్తు, బ్రహ్మము వేరు వేరు" అనే నిర్ణయానికే వస్తే, మనం మన ఈ సంభాషణలో ఉపయోగిస్తున్న శబ్ద ప్రవృత్తి అంతా ఈ జగద్వ్యవహారమునకు సంబంధించినదే కదా! ఇట్టి శబ్ద జాలంతో బ్రహ్మమును ప్రతిపాదించటం ఎట్లా? ఇక విచారణగాని, ఉపదేశంగాని సాధ్యపడేదెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి: అవును. శబ్ద ప్రవృత్తి బ్రహ్మమును స్వయముగా ప్రకటించలేని మాట నిజమే. ఉపదేశము కొరకు శాస్త్రకారులచే శాస్త్రములందు తాత్కాలికంగా కావించబడుచున్న భేదకల్పనచేత మాత్రమే ఈ శబ్ద ప్రవృత్తి (మనస్సు, బుద్ధి, ఆత్మ, బ్రహ్మం మొదలైన శబ్ద ప్రయోగాలు) సంభవించటం జరుగుతోంది. లోక వ్యవహారం కొరకై కావించబడుచున్న శబ్ద ప్రవృత్తితో కూడిన ఉపదేశమంతా 'ప్రతియోగి' మరియు 'పక్షము'** (To Counter an approach before proposing a finer concept) మాత్రమే సుమా!

వాస్తవానికి "సత్యము" అనుభవపూర్వకమై మాత్రమే వెలయుచున్నది. దానిని మరెవ్వరు దేని చేతకూడా చూపించలేరు. అయితే శిష్యుడు ఉత్తమ ప్రయత్నశీలుడై, ఆత్మను గ్రహించుటకు ఉద్యుక్తుడైయున్నప్పుడు (ఉద్యమిస్తున్నప్పుడు) తత్వదర్శి అయినట్టి గురువు "ఇది కాదు"–"నేతి"– అనే అర్థాన్ని సూచించే అనేక శబ్దార్థముల సహాయంతో, దృష్టాంతములతో సంభాషిస్తూ, శిష్యునకు తన అనుభవం – అవగాహన ఏమైయున్నదో ఏమిటో తెలియజేస్తున్నాడు. అట్లు గురువులచే శిష్యులకు తెలియజేయబడుచున్నవే శాస్త్రములు కూడా! శాస్త్రముల ద్వారా కొంత విధి – నియమములను, మరికొంత విచారణను సద్గురువులు లోకమునకు అందిస్తున్నారు. శాస్త్రములను జీర్ణం చేసుకొన్నట్టి కొందరు మహనీయులు శాస్త్రసారాన్ని మరల తమను ఆశ్రయించినవారికి

---

* పంచమీ తత్పురుష / విభక్త ప్రత్యయం : 'వలనన్, కంటె, పట్టి.

** ప్రతియోగి (Criticism) : దేని గురించి అయినాసరే, దాని భేదముగాని, అభావము గాని తెలియచేసే ప్రతిపాదనము ("అది అట్లు అగుటకు వీలు లేదు" అను ప్రతిపాదన)

పక్షము (Holding) : ఏదైనా సందిగ్ధమైన విషయమును కొన్ని అనుమాన ప్రమాణములచే నిశ్చయించటం.

బోధిస్తున్నారు. బోధస్వరూపమై ఎట్టి పదజాలములకు, వాక్యపరంపరలకు అందజాలనట్టి ఆ బ్రహ్మతత్త్వమును ఆ శిష్యుడు గురుశాస్త్రవాక్యముల సహాయంచేత, స్వవిచారణాప్రభావం చేత తనయందే, అనుభవపూర్వకంగా దర్శించుచున్నాడు.

ఇక నీ ప్రశ్నకు వద్దాం. ఒక దీర్ఘమైన, సమగ్రమైన విషయమును పరశీలిస్తున్నప్పుడు మనం మహత్తరమైన తత్త్వబోధను అవగతం చేసుకోవటానికి ప్రయత్నించాలి. అంతేకాని, మధ్యలో మధ్యే మార్గంగా చెప్పిన ఒక్కవాక్యమును మాత్రం తీసుకొని, మిగతాదంతా ప్రక్కకునెట్టి, తర్జన – భర్జనలు మొదలుపెట్టడం ఉచితంకాదు.

బాలునితో తల్లి "నాయనా! అదిగో దయ్యం, నీవు ముద్ద తినకపోతే వచ్చిపడుతోంది," అని 'దయ్యము' అనబడే అక్కడ లేని విషయం కల్పించి చెప్తుతుంది. కాని అది వాస్తవమా? కాదు. "ఆ తల్లికి అక్కడ దయ్యం కనిపించింది" అని ఏమాత్రం అనుకోము కదా! అక్కడ ఆ తల్లికి బిడ్డ కడుపు నిండా తిండి తినటం ముఖ్యం. అట్లాగే శాస్త్రాలు కూడా "బ్రహ్మము – జగత్తు" అని చెప్పుచున్నప్పుడు "జగత్తు–బ్రహ్మము".... అనబడే రెండు విషయాలు ఉన్నాయి. అందులో ఒకటి ఒక తీరుగా, మరొకటి మరొక తీరుగా ఉన్నాయి" అని చెప్పుచున్నట్లుగా కొద్దిసేపు ఎవరికైనా అనిపించవచ్చేమో. "అట్టి భేదవ్యవహారమంతా 'అభేదదృష్టి' కొరకే కల్పించబడుతోంది". అని గ్రహించటమే సదవగాహన అని మా ఉద్దేశం. "అసలీ వ్యవహారభేద కల్పనలు శాస్త్రములు ఎందుకు చేయాలి?" అని అంటావా? మనం స్వప్నంలో వస్తువులను, మనుష్యలను, కొండలను, మొదలైనవి చూస్తూ ఉంటాము. అవన్నీ ఉన్నాయా? ఉంటే ఎక్కడున్నాయి? లేకుంటే, కలుగుచున్న అనుభవం మాటేమిటి? స్వప్నంలో కనబడే "ఒక ఇల్లు, ఒక మిత్రుడు " – ఈ రెండు ఒకే 'కల్పన' లేక 'ఊహ' చే తయారుచేయబడ్డాయా? ఆ రెండింటిని ద్వైతం అనాలా? అద్వైతం అనాలా? అనిర్వచనీయం అనాలా? ....ఒక స్వప్నంలోని ఆయా కల్పితవస్తువులకే ఇన్ని లక్షణములు ఆపాదిస్తున్నాము కదా! ఇక సత్యవస్తువు అయినట్టి ఆత్మ గురించి ప్రతిపాదించాలంటే ఎన్ని పద్ధతులు కావాలి? ఉపదేశము కొరకై ఆయా శబ్దార్థాలు అవశ్యకమే అగుచున్నది. శాస్త్రములు రచించబడే సమయంలో, లేక తత్త్వము బోధించే సమయంలో అనేక శబ్దములు, వాటికి అర్థములు కల్పించబడుచున్నాయి. దానినుండి విషయం విభాగం చేయబడుతోంది.

కారణ భావము	–	కార్యభావము (Cause & Effect)
స్వామి భావము	–	స్వభావము
హేతువు	–	హేతుమంతము
అవయవములు	–	అవయవి
భేదపరిణామము	–	అభేదపరిణామము
భావము	–	పదార్థముల వైచిత్ర్యము
విద్య	–	అవిద్య
సుఖము	–	దుఃఖము

ఇవన్నీ కల్పిత విభాగములు, పదజాలములే....ఒప్పుకొంటాను. ఎందుకంటే యథార్థానికి, వర్తమాన ప్రవచనము యొక్క "లక్ష్యము" అయి ఉన్న బ్రహ్మమునందు ఏ విధమైన భేదకల్పనలు లేవు. కాని, ఇవన్నీ శాస్త్రములచే గురువులచే కల్పించబడ్డాయి. ఎందుకోసం? అజ్ఞానులకు (People who are not aware of), అర్ధజ్ఞానులకు (People who are half-aware of) బోధించుట కొరకే.

అట్టి భేదకల్పన అంతా.... సత్యవస్తువును ప్రతిపాదిస్తున్న ఆత్మజ్ఞాని అయిన గురువుకు (శిష్యుడికి బోధించటానికై) అత్యంత అవసరమే అవుతోంది. తత్త్వజ్ఞానం ప్రాప్తించిన తరువాత శిష్యుని హృదయం నుండి ఈ భేదకల్పన స్వయంగానే ఉపశమించుచున్నది. ఇకప్పుడు మౌనము మాత్రమే శేషించుచున్నది.

అజ్ఞానికి, ఈ ఎదురుగా కనబడే దృశ్యమంతా కూడా.... ఖండముగా, అర్థము కానిదిగా, దుఃఖ భరితమైనదిగా, అగమ్యమైనదిగా ప్రాప్తిస్తోంది. అప్పుడు సంక్లిష్టమైన విచారణ ఆవస్యకమూ, శరణ్యమూ అవుతోంది. అట్లు ఈ దృశ్యం, అగమ్యంగా, అర్థం కానిదిగా కనిపించటం జరుగకపోతే, మా వంటి గురువులు రంగప్రవేశం చెయ్యవలసిన అగత్యం ఏమి ఉంటుంది? మేము ఆత్మ గురించి, అనాత్మ గురించి బోధిస్తున్నాము. అట్లు మా వాక్యములు వింటున్న ఆ శిష్యుడు క్రమంగా "ఈ దృశ్యము – ఆద్యంతరహితము, విభాగశూన్యము, అఖండము – అయినట్టి పరమాత్మయే కాని మరింకేమీ కాదు" అని దృఢంగా తెలుసుకుంటున్నాడు. అందుచేత రామా! అట్టి ఆత్మబోధప్రాప్తి క్రమంగా తప్పక లభించగలదు.

అయితే ఇప్పటికి మాత్రం ఈ ద్వైతకల్పనను ఉద్వేగరహితుడవై శ్రద్ధాసక్తులతో విను. కాలులో ముల్లు విరిగినప్పుడు ఏం చేస్తాం? మరొక ముల్లుతెచ్చి కాలిలో విరిగిన ముల్లును ఆ ముల్లు సహాయంతో బైటకు లాగి, ఆపై ఆ రెండుముళ్ళు ఆవల పారవేస్తాం కదా? అట్లాగే, ఈ ద్వైతాద్వైత బోధ కూడా జ్ఞానప్రాప్తి జరిగేవరకే ముముక్షువును వెంటనంటి ఉంటుంది. ఆపై, అంతా గ్రహించ బడిన తరువాత, అతడు స్వయంగా, స్వభావ సిద్ధంగా సర్వపదజాలమును తానే త్యజిస్తున్నాడు.

ఈ ప్రపంచంలో కొందరు తమతమ కల్పనల గురించి వాదోపవాదములు చేసుకొంటూ ఉంటారు. కాని ఈ వాదనలన్నీ వేదాంతోపదేశమునకు పూర్వము మాత్రమే సంభవిస్తూ ఉంటాయి. తత్త్వం ఎరిగిన తరువాత, ఈ జీవుని "వాస్తవ–కల్పిత" స్వరూప స్వభావాలు గ్రహించబడిన తరువాత ఇక ఆపై ద్వైతము యొక్క స్ఫురణయే ఉండదు. ఈ వాచ్యము (చెప్పుట) వాచకము (చెప్పబడునది) ల సంబంధం 'ద్వైతదృష్టి' సమయంలో మాత్రమే ఏర్పడగలుగుచున్నది. ఉత్తమదృష్టికి తార్కాణం అనుభవమే. అట్టి అనుభవమునకు ఈ చర్చ అంతా ఎంతో అవసరమగుచున్నదని మరల గుర్తు చేస్తున్నాను.

ఓ రాఘవా! నీవు 'వలన – నుండి' అని చెప్పు మహావాక్యములను బోధ కొరకు ఉపయోగించబడే సాధన పరికరములుగా మాత్రమే చూడాలి.

(ఉదా: "యతోవా ఇమాని భూతాని జాయన్తే" దేని నుండైతే సమస్త భూతములు ఉత్పన్న మవుతున్నాయో:".... ఇది సాధనవాక్యము మాత్రమే.)

ఇక అఖండబ్రహ్మమును ప్రతిపాదించే మహావాక్యాలు* ఉన్నాయి. ఈ మహావాక్యముల లక్ష్యార్థం అయినట్టి "నేను అఖండుడను" అను ఉత్తమమైన ఎరుకయందే నీవు నీ చిత్తమును నిలపాలి. అట్లు నిలుపుతూనే నేను చెప్పుచున్నదంతా వింటూ ఉండు.

❖

"భ్రాంతి మాత్రమే" అయినట్టి ఈ మనస్సు అనిర్వచనీయమైన మాయయొక్క ప్రభావం చేత ఉదయించి, తన రూపమే అయి ఉన్న, ఈ జగత్తును విస్తరింపజేయుచున్నది.

మనస్సును బట్టే జగత్తు ఉంటుంది. మనస్సుకు వేరుగా జగత్తు లేదు.

మనస్సు లేకుంటే జగత్తు కూడా లేదు.


'మాయారూపము' అయి ఉన్న ఈ జగత్తును ద్రష్టయొక్క మనస్సే ఎట్లా విస్తరింపచేస్తోందో నీకు చెప్పటానికి, సుబోధకమైన 'ఐందవులు' అను వారికి సంబంధించిన ఒక వృత్తాంతము చెపుతాను. అది విన్నావా.... "ఈ జగత్తు అంతా భ్రాంతి మాత్రమే".... అను విషయము గురించి సుస్థిరమైన నిశ్చయం పొందగలవు. సంకల్పమాత్రంచేత ఉదయించగలుగుచున్నట్టి ఈ త్రిలోకముల గూర్చిన భ్రాంతిని త్యజించి, శాంతచిత్తుడవౌతావు. అట్టి పరిజ్ఞానము నీకు ఆత్మయందు సుస్థిరుడవై ఉండటానికి సహకరించగలదు. నాయనా! సూక్ష్మమైన దృష్టి సునిశితమైన ప్రజ్ఞతో నా వాక్యములలోని వివేకసారాన్ని గ్రహించావా, ఇక ఆపై మనోవ్యాధి యొక్క 'ఊసు' అయినా ఉండదు. "ఐందవ ఉపాఖ్యానము" అనబడే ఈ పురాతనమైన కథలోని విషయపరిజ్ఞానంచే "ఈ జగత్తంతా మనోమాత్రమే. ఇసుకలో నూనె ఉంటుందా? ఈ శరీరాదులు కూడా సత్యదృష్టిచే లేవు" అనునట్టి ఒకానొక నూతన దృష్టి అలవడుచున్నది.

నాయనా! రాఘవా! రాగద్వేషాలచే కలుషితమైయున్న ఈ చిత్తమే "సంసారము" అని పిలువ బడుతోంది. రాగాదులు మనస్సునుండి తొలగిన మరుక్షణం ఈ సంసార భ్రమకూడా తొలగిపోతోంది. చిత్తమే అన్నిటికీ మూలం. చిత్తమే.... పాలన, విచారణ, వ్యవహారములకు సంబంధించిన సమాలోచన, సంపాదన, ధారణ మొదలైన ఆయా లౌకిక క్రియా వ్యవహారంగా తనకుతానే విస్తరిస్తోంది. కనుక ఓ సభికులారా! మనం ఎప్పుడెప్పుడు ఏదేది లక్ష్యముగా కలిగి ఉంటామో, అదంతా అట్లుగా స్వీయచిత్తమే పరిణమించుచున్నదని గ్రహించండి. ఈ దృశ్యమునంతటినీ తనయందు ధరించుచున్నది ఆకాశరూపమగు చిత్తమేకాని, మరింకొకటేదీ కాదు. చిత్తమే క్రమంగా ఈ దేహము – ఇంద్రియములతో కూడి వర్తిస్తున్నప్పుడు, "ఈ దేహము నేను. ఈ ఇంద్రియములు నేను. ఇది

---

* "అహం బ్రహ్మాస్మి"	:	నేను బ్రహ్మమును.
"తత్త్వమసి"	:	నీవు అదియే అయి ఉన్నావు
"సర్వం ఖల్విదం బ్రహ్మ"	:	ఇదంతా బ్రహ్మమే
"జీవో బ్రహ్మైతి నా పరః	:	ఈ జీవుడు బ్రహ్మయే అయి ఉన్నాడు.

నేను చేస్తున్నాను. వీరు నా వారు. ఇవి నా పరిమితులు" అనునట్టి అహంభావమును, మమకారమును, ప్రమేయమును పొందుచున్నది. చిత్తములోని చిదంశము అహంకారంగాను, జడంశము జగద్రూపం అయిన దృశ్యముగా ప్రకటితమౌతోంది.



నిరాకారుడగు బ్రహ్మదేవుడు ఆదిసృష్టి* యందు 'స్వతహాగా లేనివే' అయినటి.... ఈ భూమి, ఆకాశం మొదలైన దృశ్యజాలమును ఒక సమయంలో ఒకానొక స్వప్నమువలె గాంచుచున్నాడు. మరొకప్పుడు సర్వమును (స్వప్న విశేషములవలె) త్యజించుచున్నాడు. అనగా, అప్పుడు అతడు దృశ్యమును గాంచుటలేదు. ఇంకొకప్పుడు అతడు.... ఈ సృష్టి, స్థితి, లయములను, పంచభూతాత్మిక మైన బ్రహ్మాండములను, అహంభావమును, సమష్టి – సూక్ష్మ స్వరూపమగు హిరణ్యగర్భ దేహమును, సూత్రాత్మస్వరూపమును.... వీటినన్నిటినీ కూడా "శూన్యమే కదా!" అను జ్ఞానదృష్టిచే చూస్తున్నాడు. అనగా, అతని దృష్టిలో ఇవన్నీ స్వప్నవస్తువులవలె 'లేనివే' అగుచున్నాయి.

బ్రహ్మదేవుడు : అట్టి ప్రథమ భావనను చేయువాడు. త్రిలోకములతో కూడిన ఈ సమష్టికి కర్తృత్వము వహించుటయే అతని స్వభావం.

ప్రశాంతము, నిర్మలము అయిన జలంలో సూర్యప్రకాశం అత్యంత సుందరంగా వ్యాపిస్తూ ఉండునట్లు, సర్వవ్యాపి అయినట్టి ఆత్మ భగవానుడు. 'విషయ రూపములు' అనదగినట్టి ఈ సర్వదేహ – మనస్సులలో వ్యాపించియున్నాడు. అది అట్లా ఉండగా.... ఈ 'చిత్తము' అనే బాలుడు అజ్ఞాన కారణంచేత "మిథ్యారూపమే" అయినట్టి ఈ జగత్తును బేతాళవిన్యాసమువలె చూచుచున్నాడు. అదే చిత్తము జ్ఞానము పొందినప్పుడు నిర్వికారము, శుద్ధము, నిత్యము అగు తత్త్వమే తానని, 'అదే తదితరులు కూడా' అని ఎరుగుచున్నది.

ఇప్పుడు "ఐందవోపాఖ్యానం" అని లోకప్రసిద్ధికెక్కియున్న ఒకానొక కథనం విన్నావో, ఇక... మమకారమును, భ్రమను కలుగజేయకలుగుచున్న ఈ దృశ్యమును ఆత్మ ఎట్లు పొందుట జరుగు చున్నదో నీవు గ్రహించగలవు. మధురమైన శబ్దములతో ఉత్తమమైన అర్థసహితంగా, దృష్టాంత యుక్తంగా నీకు అది చెప్పటానికి ప్రయత్నిస్తాను. ఇది అనేక సంశయాలను నివారించగలదు. శ్రోతల హృదయాలలో వ్యాపించి కలకాలం ఉండగలదని అభిలాష.

---

*ఆదిసృష్టి : సర్వదా శుద్ధతత్త్వమే అయిఉన్న చైతన్యము "బాహ్యమునకు సంబంధించిన అనుభవం పొందెదను గాక" అను భావన పొందుట 'ఆదిసృష్టి' గా చెప్పబడినది.

శాస్త్రవిధిని అనుసరించకుండా, దృష్టాంతాలు లేకుండా, కఠినపదజాలంతో ఎంత గొప్పవిషయం చెప్పినా శ్రోతలు ఆనందించలేరు కదా! కథలు, దృష్టాంతాలు మొదలైనదంతా శ్రోతల అభిరుచిని దృష్టిలో పెట్టుకునే మేము చెప్పుచున్నాం సుమా!

❖❖❖

2. వేరు వేరు బ్రహ్మాండములు

ఓ ప్రియరామచంద్రా! భగవంతుడగు మత్పిత్రుదేవులు బ్రహ్మదేవుడు – ఈ ఐందవులకు సంబంధించిన ఒకానొక కథన చమత్కారమును నాకు, మన ఈ విశ్వామిత్ర మహర్షికి–ఒకప్పుడు చెప్పియున్నారు. ఇందు "ఈ జగత్తు మనోమాత్రమే" అని నిరూపించబడింది. శ్రద్ధగా విను.

❖

సర్వాంతర్యామి, పరమానందస్వరూపుడు అగు నా తండ్రి బ్రహ్మదేవుని నేను ఒక సందర్భంలో ఇట్లు ప్రశ్నించటం జరిగింది– "తండ్రీ! ఈ సృష్టులన్నీ ఎట్లా కలుగుచున్నాయి? ఈ సృష్టిరూపమున కనిపిస్తున్నదంతా వాస్తవానికి ఏదైఉన్నది? ఎక్కడినుండి ప్రాప్తిస్తోంది.?"

శ్రీ బ్రహ్మదేవుడు : పుత్రా! వసిష్ఠా! ఒక తటాకంలోని జలంలో విచిత్రమైన ఆవర్తములు (Circles) ఏర్పడుతూ ఉంటాయి. అవన్నీ జలముయొక్క రూపములే కదా! ఈ మనస్సు మహత్తరమైన కల్పనాశక్తి కలిగి ఉంటోంది. అదే ఇట్లు జగత్తు రూపమున స్ఫురిస్తోంది. ఈ ప్రశ్న వింటున్నప్పుడు నాకు ఒకప్పటి చమత్కారమైన సంఘటన ఒకటి గుర్తుకు వస్తోంది. చెపుతాను, విను.

❖

శ్రీబ్రహ్మదేవుడు : అద్వితీయుడనగు నేను ఒకానొక కల్పాంతములో జగత్తునంతా యథారీతి ఉపసంహారం చేశాను. ఏకాగ్రమనస్కుడనయ్యాను. స్వస్థచిత్తుడనై, ఆ కల్పముయొక్క రాత్రి అంతా ప్రశాంతముగా విశ్రమించాను. తెల్లవారింది యథాప్రకారంగా సంధ్యావందనాదులు ముగించాను. ఇక కల్పప్రారంభసూచకంగా ప్రజలను సృష్టించుటకు ఉద్యుక్తుడనై తలెత్తి ఆకాశమువైపు పరికించి చూచాను. ఆ ఆకాశంలో అంధకారముగాని, ప్రకాశముగాని లేవు. అంతములేనట్టి ఆ ఆకాశం శూన్యమే అయి ఉన్నది. అట్లా కొద్ది క్షణములు పరికించి చూస్తూ ఉండగా, ఆ ఆకాశంలో ఎక్కడో నా మనోనేత్రానికి వేరువేరు సృష్టులు కనిపించాయి. ఆ సృష్టులన్నీ కూడా ఎట్టి ప్రతిబంధకములు లేకుండా, చక్కగా వ్యవస్థితమైయున్నట్లు గమనించాను. ప్రతి ఒక్క సృష్టిలోను ఒక్కొక్క బ్రహ్మ ఉండటం గమనించాను. వారందరు నా ప్రతిబింబమువలెనే ఉన్నారు. ప్రతిసృష్టి యందు స్వర్గ–మర్త్య –పాతాళ లోకములు ఉన్నాయి. కాలచక్రము, ఋతువులు, పృథ్వి, ఊర్ధ్వ–అథో లోకములు, స్వర్గ–నరకములను ప్రాప్తింపజేయగల శుభ–అశుభ ఆచారములు, వేద–ఇతిహాస, పురాణములు, ఉపనిషత్తులవంటి విచారణ గ్రంథములు ప్రవర్తిస్తున్నాయి. ప్రతి సృష్టి ప్రకాశ–అంధకారములతో, నక్షత్రమండలములతో, సముద్రములతో, పర్వతములతో – మనోహరంగా కనిపిస్తోంది. ఆ

బ్రహ్మాండములలో వేరువేరుగా దేవతలు, మనుష్యులు, నాగులు, గంధర్వులు.... వారివారి లోకములలో వెలయుచుండటం చూచాను. యుగములు, కల్పములు, క్షణములు, నిమిషములు, పదార్థముల ఉత్పత్తి-స్థితి-ఉపశమనములు.... ఇవన్నీ కొంతసేపు గమనించాను. నా మనోనేత్రమునకు కనిపించిన ఆ పది బ్రహ్మాండములను చూచి చాలా ఆశ్చర్య చకితుడనయ్యాను.

"ఇది ఏమిటి? ఈ బ్రహ్మాండములన్నీ ఎట్లా ఉత్పన్నమైనాయి? నా మనోనేత్రములకు ప్రత్యక్షమై కనిపిస్తున్న ఈ సృష్టులు ఇక్కడికి ఎలా వచ్చాయి?".... నాలో నేను ఎంత తర్కించుకున్నప్పటికీ ఆ సృష్టుల వ్యవహారమేమిటో నాకు బోధపడనేలేదు.

అప్పుడు నాకు ఆకాశంలో ఒకానొక బ్రహ్మాండంలో ఒక సూర్యుడు తారసపడ్డాడు. వెంటనే, నేను అతనిని ఎలుగెత్తి పిలిచాను. "ఓ సూర్యభగవానుడా! ఇటు రావయ్యా! నీవెవరు? నిన్ను సృష్టించింది ఎవరు? నేను ఇంతవరకు 'కల్పాంత నిద్ర' పోయి, ఇప్పుడే నిదుర లేచానే! ఈ జగత్తులన్నీ ఎట్లా ఉత్పన్నమైయున్నాయి? ఈ విషయం నీకు తెలుసా? నిన్ను ఎవరు సృష్టించారు? నీకు తెలిస్తే తెలిసినదంతా చెప్పు!" అన్నాను.

సూర్యుడు : "హే బ్రహ్మదేవా! ఈ దృశ్యప్రపంచమునకంతటికీ సర్వదా కారణరూపులు మీరే కదా! దీనిని మీరే ఎరుగక పోవటమేమిటి? సర్వవ్యాపియగు ఓ మహాత్మా! పితామహా! నన్ను అడిగి, నా వలన ఆ బ్రహ్మాండముల విషయం విని వినోదాన్ని పొందుదామనుకొంటున్నారా? సరే. ఇది కూడా సంతోషమే. విచిత్రమైన నా యొక్క ఉత్పత్తి గురించి చెప్పుచున్నాను. వినండి.

హే పరమాత్మా! 'మాయాశక్తి' యే నిరంతరం ఈ జగన్నిర్మాణమంతా చేసుకొంటూ పోతోంది. తత్త్వజ్ఞానము యొక్క అభావము (లేక) 'మరుపు' కారణంగా ఆ మాయాశక్తిచే ప్రకటించబడునవన్నీ 'సత్యము'గా తోచటం జరుగుతోంది. ఒక్కసారి ప్రబోధం పొందటం జరిగిందా.... ఇక ఆ తరువాత ఇదంతా అసత్యముగానే తెలియవస్తోంది. ఇట్లు ఈ మాయ 'సత్-అసత్' రూపమైయుండి, దేశ-కాలాదులతో కూడుకొన్నదై, పరిచ్ఛిన్నత్వము సంతరించుకొని విజృంభిస్తోంది. అయితే ఇదంతా మనోవిలాసమాత్రమేనని తత్త్వజ్ఞులైనట్టి మీకు వేరుగా చెప్పేదేమున్నది? సర్వము ఎరిగియున్నట్టి మీకు 'మాయ-మనస్సు' ల విలాసం గుర్తుచేస్తూ, ఇక ఐందవులకథ వినిపిస్తున్నాను.

❖

కైలాసపర్వతపు క్రింద భాగంలోగల జంబూద్వీపంలో 'సువర్ణజట' అనే ఒక ప్రదేశం ఉన్నది. మీ కుమారులగు మరీచి మొదలైనవారి నివాసం అక్కడేకదా! అచ్చట 'ఇందువు' అనే ఒక గృహస్థుడు నివసిస్తూ ఉండేవాడు. అతడు కశ్యపుని వంశమునకు సంబంధించినవాడు. గొప్ప ధర్మాత్ముడు. బ్రహ్మజ్ఞాని. ఎల్లప్పుడు, బ్రహ్మనిష్ఠులగు సాధు – సత్పుంగవులతో సాంగత్యము కలిగి ఉండేవాడు.

అతనికి చాలాకాలం వరకు సంతానం కలగలేదు. అందుచేత భార్యతోసహా, కైలాసపర్వత సమీపంలో గల ఒక నిర్మానుష్యప్రదేశం చేరి, అక్కడ జలము మాత్రమే తీసుకొంటూ ఘోరతపస్సు ప్రారంభించాడు. చాలాకాలం గడచిన తరువాత ఒకరోజు కైలాసనాథుడగు పరమేశ్వరుడు

పార్వతీసమేతుడై ప్రత్యక్షమయ్యాడు. ఋషభారూఢులై వేంచేసియున్న ఆ ఆదిదంపతులను ఇందువు, అతనిభార్య భక్తిరసపూరితమైన స్తోత్రాదులతో పూజించారు.

ఇందువు : దేవేశా! భగవానుడా! పార్వతీనాథా! మీ దర్శనముచే మా జన్మలు సార్థకమయ్యాయి. మాపై కరుణతో గొప్ప తెలివితేటలు, ధారణాసామర్థ్యము, మేథస్సు గల పదిమంది కుమారులను ప్రసాదించమని వేడుకొంటున్నాను. అనుగ్రహించండి.

పరమేశ్వరుడు : "అట్లే అగునుగాక" అని వరమును ప్రసాదించి సపరివారంగా అంతర్ధానమయ్యాడు.

ఇందువు భార్యాసమేతంగా సంతోషంగా నిజాశ్రమం చేరాడు. వారికి కాలక్రమంగా మహాతేజః సంపన్నులు, సౌందర్యవంతులు అయిన పదిమంది పుత్రులు కలిగారు. వారంతా ఏడు సంవత్సరముల ప్రాయమునకే సర్వశాస్త్రములు అభ్యసించారు.

చాలాకాలం గడచిపోయింది. కాలక్రమంగా ఇందువు, అతనిభార్య తమ తనువులను చాలించి విదేహముక్తులు అయ్యారు. ఆ పదుగురు ఐందవులకు అక్కడ బంధువులెవ్వరూ లేరు. వారు తలితండ్రుల వియోగంచే ఖిన్నులై, ఆ ఆశ్రమంలో ఉండలేక అక్కడినుండి బయలుదేరారు. కైలాస పర్వతశిఖరంచేరి, అక్కడ ఒకచోట కొంతసేదతీరుటకై బసచేశారు. ప్రయాణపు బడలిక తీరినతరువాత, ఒకచోట అందరు సమావేశమై, ఇట్లు సంభాషించుకోసాగారు.

సమావేశం – సమాలోచన

జ్యేష్ఠసోదరుడు : తమ్ములారా! మన తల్లితండ్రులు మనను విడచి విదేహముక్తులయ్యారు. ఇక వారల గురించి శోకించడం అనవసరం, అప్రస్తుతం, అర్థరహితం కూడా. వారు మనకు ఈ మానవదేహములను ప్రసాదించి మహోపకారం చేశారు. ఈ మానవజన్మ ఒక మహత్తరమైన అవకాశంగా మనకు శాస్త్రాలు బోధిస్తున్నాయి. అందుచేత మనం ఇప్పుడు భవిష్యత్తు కొరకు ప్రయత్నశీలురం కావాలి. ప్రయత్నించువాడే ఏదైనా సాధిస్తాడు. ప్రయత్నమే చెయ్యనివారు పొందేదేముంటుంది? చేయకలిగేదేముంటుంది?

అయితే ఇప్పుడు దేనికొరకు ప్రయత్నించాలి? మనకు ఇహ – పరములందు అత్యంత సుఖమును, శ్రేయస్సును చేకూర్చకలిగేది ఏది? కీర్తి, ఐశ్వర్యం, సంతృప్తి, ఆనందాలను సొంతం చేసుకోవాలంటే, ఏది లక్ష్యముగా కలిగియుండి మనం ప్రయత్నించాలి? మన ప్రధాన లక్ష్యము ఏమిటో మీరంతా మీమీ అభిప్రాయములు చెప్పండి. అందరి అభిప్రాయాలు సేకరించిన తరువాత మనమంతా ఒక నిర్ణయానికి వద్దాం. అప్పుడు భవిష్యత్తు కార్యక్రమం నిర్ణయించుకుందాం.

రెండవ సోదరుడు : నా దృష్టిలో, ఎవరికైతే మంచి గృహములు, గ్రామములు ఉంటాయో – అట్టివాడు ఐశ్వర్యవంతుడు. మండలాధిపతి అనేక మందిపై పెత్తనం చెలాయించగలడు. కనుక మనమందరం మండలాధిపతులం అయ్యే ఉపాయం యోచించడం మంచిది.

మూడవ సోదరుడు : సోదరులారా! మనకు స్వల్పవిషయమైనట్టి 'మండలాధిపతి' ఎందుకు చెప్పండి?

మండలాధిపతులను నియమించేది, పెరికివేసేది రాజులే కదా! రాజే మహదైశ్వర్య సంపన్నుడు. కనుక మనమందరం రాజులం కావటానికి ప్రయత్నిద్దాం.

నాలుగవ సోదరుడు : అన్నలారా! తమ్ములారా! దేశాధిపత్యమా? అంతటితో తృప్తి చెందుచున్నారా? అది సరి కానేకాదు. మహద్విభవోపేతుడగు "చక్రవర్తి" అయితే అనేక రాజ్యాలను పరిపాలించ వచ్చును కదా! కాబట్టి మనకు చక్రవర్తి ఐశ్వర్యమే వాంఛనీయం. అందుకొరకే ప్రయత్నశీలురం కావాలని నా అభిప్రాయం.

ఐదవ సోదరుడు : కాదు. చక్రవర్తి ఎంత? అతని మహారాజ్యమెంత? మనం మహేంద్రపదవికే ఎందుకు ప్రయత్నించకూడదు?

ఈ విధంగా అనేక తర్జన భర్జనలు జరిగాయి. చివరికి ఆఖరి సోదరుడు లేచాడు.

ఆఖరి సోదరుడు : మహేంద్రపదవి అవీ ఇవీ, ఉత్తమమైనవంటున్నారా? ఏమి తెలివి తక్కువ ఆలోచన? ఎందుకంటారా? అది బ్రహ్మదేవుని విభవములు, ఆయుష్షు దృష్ట్యా చూస్తే, స్వల్పమైనదే కదా? బ్రహ్మదేవుని యొక్క కొద్దినిమిషములకాలంలో మహేంద్రుని దీర్ఘమైన ఆయుష్షు సమసి పోతోంది. కాబట్టి కల్పము గడచిపోయినా కూడా నశించనట్టి ఉత్తమపదవి ఏదైనా ఈ లోకంలో ఉన్నదేమోనని యోచన చేస్తే "బ్రహ్మదేవుని పదవి మాత్రమే" అని నాకు అనిపిస్తోంది.

జ్యేష్ఠ సోదరుడు : ఓ తమ్ములారా! మీ సమాలోచనలన్నీ విన్నాను. మన ఆఖరి సోదరుడు చెప్పుచున్నట్లు, సమస్త ఐశ్వర్యములలో కెల్లా బ్రహ్మదేవుని పదవే ఉత్తమోత్తమమైన పదవి అని మాకు కూడా అనిపిస్తోంది. కల్పము నశించినా, ఆ పదవి మాత్రం నశించుట లేదు.

❖

మిగతా సోదరులంతా ఈ ఆలోచనను, "మంచిది-మంచిది, బాగున్నది-బాగున్నది"; అని ప్రశంసించారు. అందరూ కలసి "జగత్ పూజ్యుడైన బ్రహ్మదేవుని పదవి మనం పొందవలసిందే" అని తీర్మానించుకున్నారు.

బాగానే ఉన్నది. కాని బ్రహ్మపదవి పొందటం అంటే మాటలేం కాదే! ఎట్లా పొందటం? ఈ ప్రశ్న వారి మనస్సును, అన్ని ఆలోచనలను ఆక్రమించివేసింది. అప్పుడు అత్యంత తేజోసంపన్నుడైనట్టి పెద్ద కుమారుడు దీర్ఘంగా ఆలోచించుకొని, ఆపై ఇట్లు పలుకసాగాడు.

జ్యేష్ఠ కుమారుడు : ఓ సహోదరులారా! మీరు విచారించవలసిన పనేమీలేదు. మనం బ్రహ్మదేవుని దివ్యపదము పొందువిషయమై నాకు ఒక గొప్ప ఉపాయం తట్టుచున్నది. మీరంతా దృఢ చిత్తంతో నేను చెప్పేది వినండి.

మనమంతా ఉత్తమమైన 'ఆసనం' స్వీకరించి ఆసీనులమౌదాం.

"సర్వప్రకాశములకు కారణభూతుడై, పరమప్రకాశవంతుడగు బ్రహ్మదేవుడను 'నేనే!' నా శక్తి యొక్క సహాయం చేత నేనే స్వయముగా బ్రహ్మాండమును సృష్టిస్తున్నాను. ఇంతలోనే సంహారం

కూడా చేసివేస్తూ ఉంటాను." అని భావనచేద్దాం. జీవన పర్యంతము అట్టి ధ్యానము విడువవద్దు. మనం బ్రహ్మపదవి పొందేవరకు అట్లు నిశ్చలంగా ధ్యానం చేస్తూనే ఉందాము. ఓ తమ్ములారా! ఈ శరీరాలు ఎప్పటికైనా శిథిలం కావలసిందేకదా! కనుక, ఈ శరీరము వైపు మనం దృష్టి సారించనేవద్దు. మన దేహముల విషయం కాల క్రమేణా,... "ఏది ఏట్లో- అది అట్లే"... అగుగాక!

మిగతావారందరికి ఆ వాక్యాలు అత్యంత సమంజసంగా కనిపించాయి. వారంతా ఒక చక్కని ప్రశాంతమైన ప్రదేశంలో ప్రవేశించారు. అక్కడ ఆయాస్థానాలలో ఉచితాసనములను ధరించి కూర్చున్నారు. మనస్సుచే, వాక్కుచే, శరీరముచే మౌనం వహిస్తూ ధ్యానపరులయ్యారు. చిత్రంలో లిఖించ బడిన చెట్లయొక్క, ఆకులవలె నిశ్చలత్వం వహించారు. బాహ్యవృత్తులను నిరోధించి, చిత్తమును అంతర్ముఖం చేశారు. ఇక ఆపై ఇట్లు చింతించసాగారు.

❖

"ఇప్పుడు నాకు ఒక వికసించిన, విశాలమైన కమలం గోచరమౌతోంది. ఆ కమలముపై ఆసీనుణ్ణి అయిఉన్నాను. ఈ జగత్తు అంతటికీ స్రష్ట – కర్త – భోక్త కూడా నేనే. నేనే ఈశ్వరుడను. యజ్ఞస్వరూపుడను. జ్ఞానవేత్తలగు మహర్షులంతా నాయందే ఉన్నారు.

శిక్ష, వ్యాకరణము–మొదలైన అంగములు, పురాణములు–మొదలైన ఉపాంగములు, గాయత్రీ యుక్తమైన వేదమంత్రములు, సర్వమానవకోటి.... ఇవన్నీ నాయందే స్థితి కలిగి ఉన్నాయి. లోక పాలకులు, యముడు, సిద్ధులు నివసించే లోకములన్నీ నాయందే ఉన్నాయి. ఉత్తమ స్వరములతో విభూషితమైన స్వర్గలోకము కూడా నాయందే ఉన్నది. అనేక పర్వతములు, ద్వీపములు వనములతో కూడి భూమండలము, నక్షత్రమండలము.... ఇవన్నీ నాయందు నిక్షిప్తమై, ఇదిగో, ఇప్పుడు ప్రకటిత మవుతున్నాయి.

ఆహాఁ! ఈ విశాల ఆకాశము, దేవతాస్త్రీలతో అత్యంత సుందరంగా ఉండే దేవలోకము, దైత్యదానవులతో నిండి ఉండే పాతాళలోకం.... ఇవన్నీ నాయందు ఎంత సహజంగా శోభిస్తున్నాయి! యజ్ఞభోక్త అయినట్టి ఇంద్రుడు నాయందే త్రిలోకనగరములను పాలించుచున్నాడు. అరుగో. పన్నెండు మంది ఆదిత్యులు తమ కిరణములచే దిక్కులను నింపివేస్తూ, పన్నెండు మాసములను తపింపజేయు చున్నారు. గోపబాలుడు గోవులను మేపుతూ ఉంటాడు కదా! అట్లే ఇంద్రుడు, యముడు, కుబేరుడు మొదలైన లోకపాలకులు నియతియుక్తులై, నా అంతరంగములో ఉన్నట్టి తమ తమ లోకములను పాలించుచున్నారు.

జలమునందే తరంగములు ఉత్పన్నమగుచున్నట్లు, నాయందే చమత్కారములైన వివిధ నామ రూపాత్మకమైన వేల వేలాది జీవజాతులు–జీవ ధర్మములు, జీవులు; వారి కొరకై ఆహార–విహారములు ఉత్పన్నములగుచున్నాయి. నశించుచున్నాయి. జీవులంతా ఒకప్పుడు ఐశ్వర్యయుక్తులు అగుచున్నారు. మరొకప్పుడు దారిద్ర్యబాధచే క్రుంగిపోవుచున్నారు. వీరందరి కొరకై తపస్సు–ప్రార్థన–యోగ సాధనాలు ప్రవర్తిస్తున్నాయి.

ఈ సృష్టి అంతా నా చేతనే నిర్మించబడుచున్నది. దీనినంతా మన్వంతరాలుగా మారి పోషిస్తున్నాను. మరల మరొకప్పుడు, నేనే దీనినంతా సంహారం చేస్తూ ఉంటాను. సమస్త లోకములకు ఈశ్వరుడను నేనే. ఏది ఏమైతేనేం? సర్వదా ఆత్మయందే స్థితి కలిగియున్నాను. కనుక పరమ శాంతియే నా స్వరూపము. ఇదిగో, ఇప్పుడు సృష్టికాలం. ఇప్పుడిప్పుడే లయము సంప్రాప్తిస్తోంది. యుగము తరువాత యుగము వస్తోంది. పోతోంది. ఇప్పటికి ఒక బ్రహ్మసంవత్సరము గడచి పోయింది. ఈ రోజుకు ఈ కల్పము గడచిపోయింది. ఇప్పుడు బ్రహ్మరాత్రి గడచుచున్నది. కాబట్టి పూర్ణాత్మ స్వరూపుడను, పరమేశ్వరుడను అయి ఉన్న నేను తదనంతర సృష్టిని కల్పించుచున్నాను.......”

❖

ఆ పదిమంది ఐందవులు ఈ రూపము కలిగినట్టి భావపరంపరలను మనస్సుతో అనుసంధానం చేయసాగారు. కొంతకాలం గడచింది. వారంతా పర్వతమువలె నిశ్చలులయ్యారు. ఒక శిలావిగ్రహం లాగా స్థిరచిత్తంతో ధ్యాన నిమగ్నులయ్యారు. బ్రహ్మదేవుని ధర్మములు చాలా కాలం భావన చేస్తూ ఉండిపోయారు. కొంతకాలానికి వారు మనస్సులోని సర్వదోషములను జయించివేయుటచే, “బ్రహ్మ పదము”ను సమీపించసాగారు. అత్యంతశోభతో కూడుకొన్నవారై చిరకాలం విరాజిల్లుచున్నారు.

హే బ్రహ్మదేవా! ఆ విధంగా ఆ ఐందవులు ఉపాసనా క్రమముచే.... లోకముల యొక్క ప్రాణులయొక్క సృష్టి – స్థితి – సంహారముల గురించి భావించుచు వచ్చారు. అట్లు బ్రహ్మోపాసన యందు నిమగ్నులైయుండగా, ఎప్పుడో వారి భౌతిక శరీరాలు ఎండకు – వానకు – గాలికి సంస్పృశ్య విషయమైయుండే ఒక ఎండుటాకు వలె నేల వ్రాలిపోయాయి. ఇటు అటు – చిందర వందరగా పడియున్న వారి శరీరభాగములను మాంసాహారులైనట్టి అడవి మృగాలు భక్షించాయి. ఇట్లు దేహములు పతనము చెందినతరువాత కూడా వారు “బ్రహ్మభావన” (....నేను సృష్టి కర్తయగు బ్రహ్మను – అను భావన) చేస్తూనే ఉన్నారు. నాలుగు యుగములు గడచిపోయాయి. కల్పక్షయం అయింది. కల్పాంతము వచ్చిపడినది. సూర్యుడు తన తీక్ష్ణ కిరణములచే లోకములను ధ్వంసం చేయటం ప్రారంభించాడు. ప్రళయమేఘములు, కల్పాంతవాయువులు అనేక ప్రాణికోట్లను నేల కూల్చివేశాయి. జగత్తంతా జలమయమైపోయింది. ఇంత తతంగం జరుగుచున్నప్పటికీ, ఆ ఐందవులు మాత్రం, శరీరరహితులై, అట్లే సూక్ష్మ శరీరముతో కూడి ధ్యానమునందు నిమగ్నులై ఉండి ఉన్నారు.

వారంతా ఆ విధంగా సుఖంగా “నేను బ్రహ్మదేవుడను. సర్వము సృష్టిస్తున్నాను” అను రూపము గల ధ్యానములో నిమగ్నమైయున్నారు కదా! “అహం బ్రహ్మదేవాస్మి” అను నిష్ఠను వారు వీడలేదు. కాలక్రమంగా వారు పదిమంది బ్రహ్మలు అయినారు. వారిచే సంకల్పించబడిన పది బ్రహ్మాండములు వారి చిత్తాకాశమునందే ప్రతిష్ఠితమైయున్నాయి.

అట్టి పదిబ్రహ్మాండములలో, ఒకానొక బ్రహ్మాండమునందు నేను సూర్యుని రూపము ధరించినవాడనై ప్రవర్తిస్తున్నాను. రాత్రి – పగళ్ళను, తదితర వస్తుజాలమును అత్యంత అకర్తృత్వము వహించి నిర్వర్తించుచున్నాను. ఆకాశములో సంచరిస్తూ, కాల – కర్మ విభాగములను నిర్మించు స్వభావముచే నియమించబడి ఉన్నాను.

శుద్ధ చిత్తముతో కూడుకొన్న మనోనేత్రములతో మీరు చూచిన ఆ పది బ్రహ్మాండములు ఎట్లా సృష్టించబడ్డాయో వివరించి చెప్పాను. ఇక మీకేది ఉచితమని తోస్తే, అట్లే నిర్వర్తించండి. హే ప్రభూ! మీకు తెలియనిదేమున్నది! ఈ దృశ్యము వివిధ కల్పనలచే.... బంధహేతువై మోహదాయకమే అగుచున్నది. జీవునకు సంభవిస్తున్న బాహ్య – అభ్యంతర ఇంద్రియతాదాత్మ్యమే ఇందుకు దృష్టాంతము. కాని, ఈ దృశ్యమంతా చిత్తభ్రాంతి మాత్రమే. ఇదంతా యథార్థమైనది కానేకాదు. ఎందుకంటే, ఇందులో మార్పుచెందని దంటూ ఎక్కడా ఏదీ లేనేలేదు కదా!

❖

పుత్రా! వసిష్ఠా! అదంతా విని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. చాలా సేపు నా యందు ఎంతో తర్జన – భర్జనలు జరిగాయి. అప్పుడు నేను ఆ సూర్యభగవానునితో ఇట్లా అన్నాను.

నేను (బ్రహ్మదేవుడు) : ఓ భాస్కరా! ఆ ఐందవులు తమయొక్క దృఢసంకల్పమాత్రంచేత తమ చిత్తాకాశంలో ఈ బ్రహ్మాండములన్నీ సృష్టించి, దర్శించుచున్నారు కదా! ఇక నేనేం చెయ్యాలి? క్రొత్తగా సృష్టి చేయుటచే ఒరిగే ప్రయోజనమేమున్నది? కాబట్టి, నా ధర్మము అయినట్టి “సృష్టించటం” అనే కార్యక్రమం ఆపివేయాలా? మౌనం వహించి ఉండాలా? లేక, ముందుగా వీరి సృష్టి లేకుండా చేయాలా? ఇప్పుడు నా కర్తవ్యమేమిటి? నాకేం పాలుపోవటంలేదు.

శ్రీసూర్య భగవానుడు: ఓ బ్రహ్మదేవా! జనులు కర్మలు ఎందుకు నిర్వర్తిస్తున్నారు. ....కొందరు, ‘భవిష్యత్తులో ఏదో పొందాలి’ అనే ఆశచే ... ఇంకొందరు, ‘దైవ లిఖితం’ అని అనుకుంటూ, ... మరి కొందరు, ‘దోష నివారణకై’ అని భావించి, ... వేరేకొందరు, ‘నా వారికొరకై’ అని అనుకుంటూ, ... ఇంకా కొందరు, ‘తప్పదు కదా’ అని అనుకుంటూ ఆయా కర్మలు చేస్తున్నారు.

అయితే, మీరు సంకల్ప వర్జితులు, సర్వసంకల్పములకు ఆవల ఉన్నట్టి నిర్మల స్వరూపులు, ఇచ్ఛారహితులు కదా! అట్టి మీరు ఏదైనా ప్రయోజనం ఆశించి ఈ సృష్టి కార్యమును నిర్వర్తిస్తున్నారా? లేదుకదా! ఓ జగన్నాథా! బాలుడు ఏమీ కోరకుండానే ఆడుట, పాడుట చేస్తున్నట్లు మీరుకూడా ఈ విధిని క్రీడాపూర్వకంగా నిర్వర్తిస్తున్నారు. ఈ సృష్టి అంతా ఒక ‘లీల’ యే కాని, మరింకేమీ కాదు. అట్లే అగ్నిగోళస్వరూపము ధరించినట్టి సూర్యుడనగునేను కూడా, – ఎట్టి ఇచ్ఛ లేకుండానే – నిశ్చల–నిర్మల జలంలో ప్రతిబింబిస్తున్నాను. నిష్కాముడగు మీచే ఈ జగత్తు యొక్క ఉత్పత్తి సంభవిస్తోంది. మరి నేనో, కోరకుండానే నా ఎదురుగా నడచివెళ్ళుచున్న మానవుని యొక్క నీడ ఏర్పడుటకు కారకుడనగుచున్నాను.

విజ్ఞానమే స్వరూపముగా కలిగియున్నట్టి మీకు దేహాభిమానమేమిటి? ద్వంద్వములెక్కడ? మీరు అహంభావరహితులు. ‘నేను – నాది’ ....అను భావావేశం లేనివారు. అందుచేత మీ వంటి వారు దేనిని వాంఛించరు. త్యజించరు. ఇచ్ఛాద్వేషములు లేకుండానే, నేను, రాత్రింబవళ్ళను నిర్మిస్తూ పోతున్నట్లు మీరుకూడా “ఇది ప్రాప్తించుగాక! ఇది తొలగుగాక” అను రూపము గల ప్రాప్తాప్రాప్తములకు సంబంధించిన దృష్టిని ఆశ్రయించ కుండానే సృష్టిస్తున్నారు; మరల

పరిపోషిస్తున్నారు. ఇట్టే సంహరిస్తున్నారు. సత్యద్రష్టలగు జ్ఞానుల అభిప్రాయం ప్రకారం ఇదంతా మీయొక్క విలాసం మాత్రమే.

ఇంతకాలంగా మీరు "ఇది నా కర్తవ్యము" అని తలచి, ఆసక్తిరహితంగా నిత్యము చేస్తూవస్తున్నట్లే, ఇప్పుడు కూడా ఎట్టి స్వార్థము లేకుండా పరమార్థ భావనతో యథారీతిగా చేస్తూ ఉండటమే ఉచితం. ఒకవేళ యథాప్రాప్తములైన కర్మలను త్యజించి, ఈ 'సృష్టించడం' అనేది మానివేశారనుకుందాం. అప్పుడు మాత్రం మీరు పొందే అపూర్వవస్తువు ఏమున్నది చెప్పండి? ఒక దర్పణము దేనిని వాంఛించకుండానే, దేనిపట్లకూడా ఇచ్ఛాద్వేషములు లేకుండానే, ఎదురుగా ఉన్నదంతా "తనయందు ప్రతిబింబింపజేయుట" అను క్రియా వ్యవహారం సల్పుచున్నది కదా! అదేవిధంగా సత్పురుషులు కూడా "ఇది నాకు ప్రాప్తించాలి" లేక, "ఇది మరోవిధంగా ఉండాలి" వంటి కల్పనకు, వాంఛకు తావు ఇవ్వకుండానే ఎల్లప్పుడు తమకు ప్రాప్తించిన కర్మలను నిర్వర్తిస్తున్నారు. ఆత్మజ్ఞానులకు "అయ్యో! మేము అది చేయలేదే?" అను రూపముగల అప్రాప్తములైన కర్మలను మననం చేయాలని ఏమాత్రం కోర్కె ఉండదు. అజ్ఞానులు, మాయామోహితులు మాత్రమే తమకు ప్రాప్తించిన కర్మలయందు దృష్టి ఉంచక, అప్రాప్తములైన వాటి గురించి యోచించుచూ, "వారి పనులు మాకు ఇచ్చి ఉంటే ఎంత బాగు!" అని ఆవేదన చెందుతూ ఉంటారు. వారంతా కర్మహస్యం ఎరుగనివారే అగుచున్నారు. జ్ఞానులకు, తమకు ప్రాప్తములైన కర్మలను త్యజించాలనే పట్టుదలగాని, అంటిపెట్టుకొని ఉండాలనే ఇచ్ఛ–ఉబలాటములు గాని ఉండవు.

❖

కాబట్టి, ఓ బ్రహ్మదేవా! "వాస్తవానికి నేనేమీ చేయుటలేదు" అను అనుభవమునే జ్ఞానులు కలిగి ఉంటున్నారు. మీరుకూడా కర్మను నిర్వర్తిస్తున్న సమయమందు **"నాహంకర్తా నైవకించిత్ కరోమి" –** నేను కర్తను కాదు. నేనేమీ చేయుటలేదు... అనురూపముగల మౌనము లేక సుషుప్తి వంటి భావన వహించటమే ఉచితం. ఎవ్వడైనా ఎప్పుడైనా ఆసక్తితో కూడుకొన్నవాడై ఏదైనా చేస్తే మాత్రమే ... అట్టి కర్మయొక్క కర్తృత్వము, వాటి ఫలితముల భోక్తృత్వము సంప్రాప్తిస్తుంది. కర్తృత్వ –భోక్తృత్వ భావములు ఉన్నచోట మాత్రమే, సుఖ దుఃఖానుభవములు దీర్ఘమైన ప్రభావం కలిగి ఉంటున్నాయి. 'నాహంకర్తా' అనునట్టి భావన కలవానికి కర్మ ఎక్కడ? ఫలితమెక్కడ? ఒకవేళ ఏ సమయమందైనా కర్మ ప్రతీతి ('నేను చేయవలసి వచ్చుచున్నదే?' అను భావన) కలిగినా కూడా – "ఆః! ఇదంతా స్వప్నమాత్రమే కదా!" అని తలచుచు, నిష్కాములమై, ప్రాప్తించిన కార్యములను నిర్వర్తించటమే ఉచితమని నా అభిప్రాయం. జన్మలు ఏర్పడుచూ ఉండగా కూడా జన్మ రాహిత్యం ఆస్వాదించటం మోక్షస్వరూపుని అంతిమ లక్షణం కదా!

ఓ దేవా! ఇప్పుడు మీరు ఐందవుల సృష్టిని చూచి కొంత ఆశ్చర్యమును, కొంత వినోదమును పొందియున్నారు కదా! మీ సృష్టి తదితరులకు వినోదకరంగా, సంతోషం ప్రసాదించేదిగా ఉంటూ ఉంటుంది. అందుచేత, మీ కర్తవ్యమై ఉన్నట్టి సృష్టిని తదితరుల వినోదము, ఉల్లాసముల కొరకై నిర్వర్తిస్తూనే ఉండండి.

ఇప్పుడు మీరు ఆ ఐందవులు సృష్టించిన సృష్టులను మనోనేత్రములచే మాత్రమే దర్శిస్తున్నారు. చర్మచక్షువులచే చూడలేరు. అన్యులచే గావించబడిన సృష్టులను మనం మనోనేత్రములచే మాత్రమే చూడగలం. కాని, సృష్టికర్త తాను సృష్టించినదానిని మాత్రం అవశ్యం తన చర్మచక్షువులచే చూడగలుగుతాడు. ఒకడు ఒక వస్తువుపట్లగాని, వ్యక్తిపట్లగాని ఏర్పరచుకొన్న ప్రియత్వము, అట్టి ప్రియత్వ కారణంగా కనిపిస్తున్న అందచందాలు అతనికే ఆ విధంగా తెలియవస్తాయికాని, ఇతరులకు కాదుకదా! అట్లే సృష్టికర్త మాత్రమే "దీనిని నేను సృష్టించితిని" అని ఎరుగగలడు.

మరొక్క విషయం. ఈ పది బ్రహ్మాండములు ఆ ఐందవులయొక్క దృఢచిత్తముచే ప్రతిష్ఠితములై, సృష్టించబడ్డాయి. బ్రహ్మాండములను గాని, వీటిని సృష్టించినట్టి ఐందవులను గాని ఎవ్వరూ నశింపజేయలేరు. ఎందుచేతనంటారా? మనమెవ్వరమైనా ఒకని కర్మేంద్రియములచే చేయబడిన కార్యం నిరోధించగలం కాని, మనోనిశ్చయముచే చేయబడే కార్యము నిరోధించటమెట్లా? ఇక్కడ చమత్కారమేమంటే .... ఎవని చిత్తమునందు ఏది దృఢంగా నిశ్చితమై ఉంటుందో – అద్దానిని అతడే తొలగించుకోవాలి. అంతేగాని, మరెవ్వరు దానిని తొలగించజాలరు. అసలు ఒక వ్యక్తియొక్క మనస్సులో ఒక దృఢనిశ్చయం ఎట్లా ఏర్పడుతుంది చెప్పండి? బహుకాలంగా మనస్సునందు ఆ నిశ్చయమునకు సంబంధించిన సంకల్పములను అత్యంత ప్రియంగా, తీవ్రేచ్ఛతో అభ్యసించటంచేతనే కదా! కనుక, అట్లు ఏర్పడిన దృఢనిశ్చయం శాప-వరాదులచేతగాని, దేహపతనము చేతగాని, మరింకే బాహ్యమైన ప్రయత్నంచేతగాని నివారించబడజాలదు. దృఢనిశ్చయమును సంకల్పిస్తున్నట్టి మనస్సు స్వయంగా దానికి వ్యతిరేకమైన సంకల్పములచే ఆ దృఢనిశ్చయమును ఉపసంహరించ వలసిందే. అట్లా ఉపసంహరించబడేవరకు ఆ నిశ్చయం 'అట్లే' ఉంటుంది. ఏదైతే మనస్సులో స్థిరంగా నిశ్చయింపబడుతుందో – ఆ మనుజుడు ఆ నిశ్చయమునకు సంబంధించిన రూపమునే పొందుచున్నాడు కాని, అన్యమైనరూపమును కాదు. ఏది ఏమైతేనేం? రాతిపై నీళ్ళు ఉన్నప్పటికీ, ఆ నీళ్లు ఒక బీజము అంకురించటానికి సహాయం చెయ్యలేవు కదా! ఈ సంసారదుఃఖం ఉపశమించాలంటే – ఒక్క ఆత్మబోధ తప్ప తక్కినవన్నీ నిష్ప్రయోజనములే.

❖

ఈ జగత్తులన్నీ సృష్టించుచున్నది 'మనస్సే' కదా! మనస్సే పరమపురుషుడు. ఈ ప్రపంచంలో ఎవ్వరు, ఎప్పుడు, ఏది, ఎక్కడైనా పొందుచున్నా అదంతా మనస్సుద్వారానేగాని, శరీరంచేత ఏ మాత్రం కాదు. ఈ మనస్సుయొక్క సామర్థ్యమేమిటో ఇప్పుడే ఈ ఐందవుల బ్రహ్మదేవత్వంలో చూచాము కదా! వారు కొంతకాలం క్రితం సామాన్యమైన మానవులై ఉండి, మనస్సు యొక్క దృఢ భావనచే బ్రహ్మపదమును పొందగలిగారు. ఈ జీవుడుకూడా మనస్సుయొక్క భావనను, ఆశ్రయించు స్వభావమును అనుసరించే ఆయా దేహములను పొందుచున్నాడు. ఒకనికి "నేను దేహమును" అనే భావనయే లేదని అనుకొందాం....అప్పుడు అతడు ఈ దేహముయొక్క ధర్మములైనట్టి జనన-మరణములచే కూడా బాధింపబడజాలడు. బాహ్యదృష్టి మరియు శరీరదృష్టి కలవానికి

మాత్రమే ఈ సుఖదుఃఖాది అనుభవములు ఉంటున్నాయి. కనుక, ఈ ప్రపంచములోని అనుభవము లన్నిటికీ కారణం మనస్సే. "(కృత్రిమ)ఇంద్రుడు–అహల్య"ల వృత్తాంతమే ఇందుకు మనకు తార్కాణం.

బాహ్యదృష్టి : బాహ్యమునందు "ఇది ప్రియము – ఇది అప్రియము" అను భావన.

అంతర్దృష్టి : "ఈ శరీరము, ఈ మనో–బుద్ధి–అహంకారాలే నేను" అను పరిమిత భావన.

బ్రహ్మదేవుడు : నాయనా! సూర్యుడా! నీ వచనములు చాలా యుక్తియుక్తంగానే ఉన్నాయి. నీవు చెప్పినదంతా అత్యంత సత్యము. నాకు చాలా సంతోషం కలుగజేశాయి. ఇప్పుడు సందర్భానుసారంగా "అహల్య – ఇంద్రుల వృత్తాంతం" అని అన్నావు కదా! వారి వృత్తాంతమేమిటో వినిపించవూ? వారిద్దరి కథ వింటే నా దృష్టి మరికొంత పవిత్రత పొందగలదని భావిస్తున్నాను. అనంత కిరణములచే నిత్యోదితుడవై ఉండే ఓ సూర్యుడా! నీవు చెప్పబోయేది శ్రద్ధగా వింటున్నానయ్యా!

❖❖❖

3. ఇంద్ర-అహల్యల ప్రహసనం

సూర్యభగవానుడు : పితామహా! మీరు ఆజ్ఞాపించినట్లే చెప్పుచున్నాను వినండి.

పూర్వము 'ఇంద్రద్యుమ్నుడు' అనే మహారాజు మగధదేశమును పరిపాలిస్తూ ఉండేవాడు. "మనరాజు గొప్ప ప్రతిభాశాలి" అని ఆ రాజ్య ప్రజలు చెప్పుకుంటూ ఉండేవారు. అతని భార్య అహల్య. ఆమె అత్యంత సౌందర్యవతి. ఆ పురములోనే 'ఇంద్రుడు' అనే పేరుగల ఒక జారుడు (స్త్రీ లోలుడు) ఉండేవాడు. అతని గురించి ఆ నగరంలో పరిపరి విధములుగా చెప్పుకొంటూ ఉండేవారు.

అంతఃపురములోని చెలికత్తెలు ఆ ఇంద్రునియొక్క (స్త్రీ సాంగత్యములకు సంబంధించిన) విచ్చలవిడి ప్రవర్తన గురించి చెప్పుచున్నప్పుడు రాణి అహల్య నవ్వుకుంటూ వింటూ ఉండేది. ఒకసారి, ఆ అహల్య గౌతముని పత్నియగు అహల్య–ఇంద్రులగురించిన పురాణగాథ వినటం జరిగింది. ఆ కథాప్రసంగమును తనకే అన్వయించుకొని, చంచలము – దుష్టసంకల్పములు గల మనస్సు కలిగియుండుటచే, జారుడగు ఇంద్రునియందు ఆసక్తి కలిగియుండటం ప్రారంభించింది. "ఈ ఇంద్రుడు అనబడేవాడు ఎంత అందంగా ఉంటాడోమరి! లేకపోతే, అంతమంది స్త్రీలను ఆకర్షిస్తాడా! లేదుకదా! అతడు నాయందు ఆసక్తి కలిగి, నన్ను వెతుక్కుంటూ వస్తే ఎంత బాగు! అవును, ఎందుకు రాకూడదు?" అని కుసంకల్పం చేయటం ప్రారంభించింది. చిలవలు – పలవలుగాను, అత్యంత దీర్ఘంగా తలపోయుటచేత కొన్నాళ్ళకు "ఇంద్రుని సాంగత్యము నాకు ఆవశ్యకము" అను భావన ఆమెయందు దృఢతరం కాజొచ్చింది. ఫలితంగా దుఃఖితురాలు అయ్యేది. అక్కడి రాజభోగములు ఆమెకు ఏమాత్రం ప్రీతిగొలిపేవి కావు. తన ఆలోచనలకు తానే 'వివశ' అయి సిగ్గునుకూడా విడచివేసింది. "ఇదిగో! ఇక్కడ ఎవ్వరో నిలబడ్డారు.... ఇతడే ఇంద్రుడు..... అవును. సందేహం లేదు. ఇతడే నా ప్రియుడు.... నా కోసమే వచ్చాడు....." అని చెట్టును, గోడను, స్తంభమును చూచికూడా అరవటం ప్రారంభించింది. ఆ రాణియందు మిక్కిలి స్నేహంగల

ఒక సఖి ఆమెయొక్క దీనావస్థనంతా గమనించింది. "ఓ రాణీ! ఈ పిచ్చి ఏమిటి? ఈ దుఃఖమేమిటి? సరే. ఏడవవద్దు. ఊరుకో. ఎట్లాగైనా సరే, నేను ఆ యువకుడగు ఇంద్రుని నీ వద్దకు తప్పకుండా తీసుకొస్తాను" అని లాలనగా పలికింది. అది విని ఆ రాణి వికసిత నేత్రములతో కొంత ఉపశమనం పొందింది. తన ఇష్టసఖి పాదాలపై వ్రాలి మరల మరల దీనంగా వేడుకొన్నది. మరింకే ఊసు ఎత్తినా, అది ఆమె చెవికి చేరుటలేదు.

ఎట్లాగైతేనేం... ఆ సఖి 'ఇంద్రుడు' అనబడు యువకుణ్ణి కలుసుకొన్నది. రాణి వృత్తాంతమంతా తెలియజేసింది. ఎట్లాగో..... అతనిని ఒక రహస్య ద్వారం గుండా అంతఃపురంలోకి తీసుకొచ్చింది. ఆ రాత్రి అహల్య ఒక రహస్య ప్రదేశంలో ఇంద్రునితో పొందు అనుభవించింది. ఆ విధంగా ఆ రాణి ఒక సామాన్యయువకునికి వశమైపోయింది. అతనియందు ఆసక్తిచే, "ప్రపంచమంతా అతనితోడిదే! అతని తరువాతే ఇక ఏదైనా సరే!" అను రూపం గల తన్మయత పొందసాగింది.

ఆ విధంగా అనేక రోజులు గడచిపోతున్నాయి. అతనియందు వ్యామోహము ఎప్పటికప్పుడు అధికమగుచు ఉండేది. అతడు కూడా ఆమె పట్ల అత్యంత ప్రేమ కలిగి ఉండేవాడు. అతనిపై గల వ్యామోహంచేత అహల్య ఉత్తమగుణములుగల తన భర్త ఇంద్రద్యుమ్నుని కూడా అల్పునిగా తలచుచూ ఉండేది. ఇంద్రుని గురించి తలచుకొనుచున్నప్పుడెల్లా ఆమె ముఖము ఎంతో సంతోషంతో వికసిస్తూ ఉండేది. ఇక ఇంద్రుడు కూడా ఆమెయందు ఆసక్తి కలవాడై, ఆమె వియోగమును ఒక్కక్షణమైనా సహించలేకపోయేవాడు. కొన్నాళ్ళకు, అతిసంతాపకరము, జుగుప్సాకరము, అధర్మప్రవృత్తి రూపము అయినట్టి వారిరువురి దృఢప్రేమబంధము రాజుయొక్క దృష్టిలోకి వచ్చింది. అప్పుడు 'జ్ఞానము-తితిక్ష' మూర్తీభవించిన ఆ ఇంద్రద్యుమ్నుడు "వీరిద్దరి పరస్పర ప్రేమ సాంఘిక విరుద్ధంకదా! కాబట్టి వీరిద్దరిని తగినరీతిగా శిక్షించక తప్పదు. అది నా రాజధర్మమై యున్నది. తద్వారా ఇట్టి నీచ ప్రవర్తనము నుండి వీరిని విరమింపజేస్తాను" అని తలచాడు.

అది శీతకాలం. వారిద్దరిని రాజు సభకు పిలిపించి, గట్టిగా మందలించాడు. భయపెట్టాడు. కాని ఏం లాభం? వాళ్ళు మాత్రం "ఏది ఏమైనాకానీ, మేము మాత్రం ఇంతే. మా ఇద్దరికీ ఒకరికొకరు కావాలి" అని మూర్ఖంగా మాట్లాడసాగారు. ఇక చేసేదేముంది? రాజశాసనమును అనుసరించి, వారిని సంస్కరించే ఉద్దేశంతో "ఇంద్రియములను బిగదీసివేయు చలి వాతావరణంలో వీరిద్దరు నాలుగు రోజులు కట్టివేయబడుదురుగాక" అని న్యాయవేత్తలచే నిర్ణయించబడింది. భటులు వారిని చల్లని నీటిలో నాలుగు రోజులు ఉంచారు. వారిలో ఏమాత్రం పరివర్తనలేదు. పైగా మామూలు వాళ్లెవరైనా రెండో రోజుకో, మూడో రోజుకో ఆర్తనాదాలు చేసేవారే! వారిద్దరికి కించిత్ కూడా బాధ గాని, దుఃఖము గాని కలుగలేదు. ఒకరితో మరొకరు సంభాషించుకొంటూ సంతోషముతో ఉండి ఉన్నారు. వారి పట్ల ఆ శిక్ష నిష్ప్రయోజనమే అయింది. ఆ వార్తను భటులు రాజుకు నివేదించారు. అప్పుడు ఇంద్రద్యుమ్న మహారాజు కొంత ఆశ్చర్యపడి, వారిద్దరిని సమీపించి "ఓ దుష్టజీవులారా! మేము విధించిన శిక్షచే ఏమాత్రం బాధ ప్రకటించనేలేదని, ఆ శిక్షచే మీరిద్దరు ఆనందమే

పొందుచున్నారని, ఈ భటులు చెప్పారు. నిజమేనా? ఎందుచేత?" అని ప్రశ్నించాడు. అప్పుడే నీటి నుండి బయటకు తేబడిన ఆ ఇద్దరు రాజుతో "ఓ రాజా! మీరు విన్నది నిజమే. మేమిద్దరం శిక్షా సమయంలో కూడా ఒకరినొకరం స్మరించుకొంటున్నాం. దృఢప్రేమబద్ధులమై యున్నాము. అందుచేత మాకు దేహస్మృతియే లేదు. దేహస్మృతి లేనివానికి చలి ఏమి చేస్తుంది? మా మనఃసంబంధం అత్యంత దృఢమైనదవటంచేత, మీ భటులచే బాధించబడినప్పటికీ మేము ఆనందంగానే ఉన్నాము. ఈ అవయవములు ఛేదించబడతాయంటే, అందుకుకూడా మేము సిద్ధమే. మేము మా ప్రేమ సంబంధబలం చేత సంతుష్టులంగానే ఉంటాము."

అంతావిన్న రాజుకు చాలా కోపంవచ్చింది. "ఓ భటులారా! వీరిని అగ్నిచే కుత-కుత ఉడికి పోతున్న గదిలోకి త్రోయించండి. రెండు రోజుల వరకు వీరిని పలకరించనే వద్దు. అరిచి గీపెడుతున్నా సరే, మీరు జాలి చూపవద్దు. ఈ లోగా మరణించారా, సరే. రేః!, లేదా, రెండు రోజుల తరువాత వీళ్ళని నా దగ్గరకు తీసుకురండి, అప్పుడు చూద్దాం....." అని ఆజ్ఞాపించాడు. అచటకూడా వారు ఏ మాత్రం ఖేదం చెందలేదు. ఒకరినొకరు తలచుకొంటూ ప్రసన్నులైయున్నారు. అప్పుడు ఏనుగులచే త్రొక్కించబడ్డారు. వారు విషాదమే చెందలేదు. అస్సలు, ఆ త్రొక్కిసలాట వారిని ఏమీ చెయ్యలేక పోయింది. వారిద్దరు మాత్రం అన్నివేళల అన్యోన్య స్మృతిచే హర్షమునే పొందుచున్నారు. అప్పుడు రాజు వారిని కొరడాలచే కొట్టించాడు. అయినప్పటికీ వారిద్దరు ప్రసన్నముగానే ఉండియున్నారు. ఇక వారిని శిక్షించి ప్రయోజనం లేదని గ్రహించిన మహారాజు వారిద్దరిని తన వద్దకు పిలిపించాడు.

❖❖❖

4. నేను మనోమాత్రుడను!

ఇంద్రద్యుమ్నుడు: ఓ తుచ్ఛబుద్ధులారా! మీ ఇద్దరినీ సంస్కరించాలని ప్రయత్నించాం. ఇంత జరిగినప్పటికీ, మీరు ఇంకా సుఖసంతోషములతో ఎట్లా ఉంటున్నారో--- నాకు కాస్త చెపుతారా?

ఇంద్రుడు : ఓ రాజా! నాకీజగత్తు అంతా అహల్యామయంగానే కనిపిస్తున్నది. నాయొక్క 'ప్రేమ' కారణంగా కాబోలు - నాకు ఈ ప్రపంచం ఈమె రూపముగానే తోచుచున్నది. ఈమెకు కూడా సర్వదా నా రూపమే గోచరిస్తోంది. అందుచేతనే, మీరు విధిస్తున్న దండనలన్నీ మాకు బాధకలుగజేయ లేకపోతున్నాయి. మా ఇద్దరికీ ఈ ప్రపంచమంతా ఒకరిరూపంగా మరొకరికి కన్పించుటచేతనే, అగ్నిబాధ, జలస్పర్శ, తాడనము మొదలైనవిగాని, "ఎవ్వరేమనుకొంటారో?" అనే భీతి మొదలైనవిగాని మమ్ములను ఏమీ చేయలేకపోయాయి.

ఓ మహారాజా! ఇంద్రద్యుమ్నా! నేను ఈ శరీరమునా? కాదు. నేను మనోమాత్రుడను. మనస్సే పురుషుడు. ఇక, మీకు కన్పించే ఈ దేహము మనస్సుయొక్క కల్పనాదృష్టికి ఇట్లు కనబడు చున్నదే కదా! అతిశక్తివంతమైన మనస్సును, దానియొక్క స్వకీయమైన (ప్రేమ మొ॥) కల్పనలను మీ పంచభూతపరిమిత దండనలు ఏమీ చెయ్యలేకపోతున్నాయి. ఎంతటి శక్తి కలవారైతే ఏం?

మనస్సుచే నిర్మించబడుచున్న అనుబంధమును, భావకలాపమును ఎట్లా ఛేదించగలరు? ఈ శరీరము వృద్ధి పొందవచ్చు. కాని, మనస్సు మాత్రం... "దృఢభావన" చే ఇష్టములైన, "అనుభూతి" మొదలగు వాటిని ఎప్పటికీ అట్లే ఉంచుకోగలదు. ఈ విషయం మా ఇరువురిపట్ల నిరూపించబడుతోంది కదా! ఈ మనస్సు చాలాకాలం ఒక పదార్థమును వాంఛించుచున్నదనుకోండి..... అప్పుడది దాని యందు సంలగ్నమగుచుండుటచే, ఆ పదార్థాకారమునే పొందుచున్నది. అట్టి దృఢభావము పొందిన 'మనస్సు'ను ఆయా భౌతికమైన ప్రతిబంధకములు తాకనైనా తాకలేవు.

ఓ ప్రియమహారాజా! ఈ మనస్సుకు గల ఒక ముఖ్యమైన లక్షణం గురించి చెపుతాను. వినండి. ఇది తనయొక్క తీవ్ర సంకల్పముచే దేనిని ఎట్లు నిశ్చయిస్తుందో– దానిని అట్లే స్థిరముగా "గాంచుట – పొందుట" చేస్తూ ఉంటుంది. ఇక వరములుగాని, శాపములుగాని, మరింకే బాహ్యమైన ప్రయత్నములుగాని అట్టి తీవ్రసంకల్పయుతమైన మనస్సును నిరోధింపజాలవు. ఒక లేడి పెద్ద బండరాయిని కదల్చగలదా? తీవ్ర అభిలాష కలిగిన మనస్సును తనయొక్క ఇష్టవస్తువు నుండి దృష్టిని మరలింపగలిగిన వారెవ్వరు చెప్పండి?

ఈ అహల్య నా కంటికి చూపువలె, దేవాలయములో వేంచేసియున్న దేవతారూపమువలె – నా మనస్సులో ప్రతిష్ఠితమైయున్నది. మేఘాలుగాని, గ్రీష్మఋతువుగాని, ఒక కొండను బాధించలేవు కదా! నా "జీవహేతువు" అయినట్టి ఈ నా ప్రియురాలిని భావన చేసినంతమాత్రంచేత, తదితర దుఃఖములు ఎన్నైనా భరించుటకు ఓర్పు, శక్తి వచ్చిపడుతున్నాయి. "నేను ఎట్లాగైనా ధనికుణ్ణి కావాలి" అని కోరుకొనువానికి డబ్బు సంపాదించటంలోను, దాచి పెట్టుకోవటంలోను, లోభ వ్యవహారసరళిలోను వచ్చే సాధక–బాధకములన్నీ సుఖప్రదములే అగుచున్నాయి కదా! నా విషయం కూడా అట్టిదే. నేను ఈ వర్తమాన మానసిక స్థితిని అనుసరించి, ఈమె పొందు కొరకు ఏ దుఃఖా నుభవమునైనా పొందటానికి సిద్ధంగా ఉన్నాను. మీరు మా ఇద్దరిని అనేక విధాలుగా భయపెట్టారు. కాని మాకు ఏ క్షణంలోకూడా భయమని అనిపించనేలేదు. నేను ఎక్కడైనా ఉండవచ్చు. లేదా, ఎక్కడైనా పతనం చెందవచ్చు. అచ్చట కూడా నేను నా ప్రియురాలి సమాగమము తప్ప, ఇంకేమీ తలచను...... భావించను. ఓ మహారాజా! మీరు సర్వము తెలిసినవారే. అంతా మనస్సే కదా! నా మనస్సుచేతనే అహల్య నాకు ప్రియురాలు అయినది. ఆమెయొక్క మనస్సుచేతనే సామాన్య పౌరుడనగు నేను ఒక మహారాజ్ఞికి అత్యంత ప్రియుణ్ణి అయ్యాను. దృఢాసక్తి పొందియున్నట్టి మా ఇరువురి మనఃస్వభావములను ఎన్ని ప్రయత్నములు చేసినప్పటికీ ఎవ్వరూ మార్చలేరు. ధీరులయొక్క చిత్తము దేనియందైనా నిమగ్నమైనదా.... ఇక దాని స్థిరత్వం ఎవరు పాడుచేయగలరు చెప్పండి? ధీరులు కానివారు మాత్రమే కొంతవరకు (ధ్యానము – పూజ – పఠించుట మొదలైన) ప్రయత్నములను ఆశ్రయించి, ఇంతలోనే ఒక చిన్న అడ్డంకి రాగానే వెనుకకు మరలుచూ ఉంటారు. "అట్లు కొనసాగించ లేకపోవటానికి ఫలానా పరిస్థితులు, ఫలానా వ్యక్తులు కారణం" అని వారు తమను తామే మోసం చేసుకొంటూ ఉంటారు.

వర-శాపములచే ఈ భౌతిక శరీరము ఒక రూపమును పోగొట్టుకొని, మరొక రూపం (మరొక శరీరం) పొందితే పొందవచ్చు. అంతేగాని, దృఢచిత్తం మాత్రం తప్పకుండా అన్ని విక్షేపాలను జయించి స్థిరంగా ఉండగలదు. ఇందులో సందేహించవలసిన పనిలేదు. ఒక వేళ విక్షేపం కలిగితే... అందుకు కారణం చిత్తము స్థిరత్వము కలిగియుండక పోవటము మాత్రమే సుమా!

❖

ఈ శరీరము మాత్రం మనస్సునకు ఎప్పటికీ కారణం కాదు. మనస్సే శరీరమునకు కారణమగుచున్నది. లతలలోను, వృక్షములలోను రసము వ్యాపించి ఉంటుంది చూచారా? అట్లాగే మనస్సే శరీరము నందు అంతటా వ్యాపించియున్నది. జీవాత్మకు మనస్సే మొట్టమొదటి శరీరమై ఆయా భోగానుభవములకు హేతువు అవుతోంది. ప్రపంచములోని ప్రాణికోట్ల శరీరములన్నీ మనస్సు చేతనే కల్పించబడుచున్నాయి. మనస్సుచేతనే దర్శించబడుచున్నాయి. స్వీకరించటం - త్యజించటం... అంతా మనస్సుయొక్క వ్యవహార దక్షతయే అయిఉన్నది. "ప్రథమ శరీరము" అని చెప్పబడుచున్న మనస్సునందే "నేను-నేను" అను అభిమానం కూడా ఉదయిస్తోంది. అట్లు ఉదయించుట చేతనే... అట్టి మనస్సుచే భిన్న శరీరములు ఏర్పడుచున్నాయి. ఇన్ని మాటలెందుకు? ఈ జీవత్వమునకు ముఖ్యకారణం (లేక) అంకురం మనస్సే సుమా! దానినుండే ఈ దేహములన్నీ ఏర్పడుచున్నాయి.

ప్రభూ! అంకురం ('మొలచుట' అను స్వభావం) నశిస్తే పుష్పములు కూడా నశిస్తాయి. కాని పుష్పములు నశిస్తే అంకురము నశిస్తుందా? లేదు. అదేవిధంగా, ఈ దేహము నశించినా - మనస్సు ఉంటుంది. కాని, మనస్సు నశించటం జరిగితే, ఇక దేహమెక్కడ?

కనుక అయ్యా! మేమిద్దరం పరస్పరం ప్రేమబద్ధులం. మా గురించి మీరు ఎందుకు వేసటచెందుతారు చెప్పండి? మీ శ్రేష్ఠమగు చిత్తమును పరమ పురుషార్థమునందే నియోగించితే ఈ 'జన్మలు-కర్మలు' అను బంధము నుండి మిమ్ములను మీరు రక్షించుకోగలరు. అట్లుచేసి, బంధము నుండి, విముక్తులు అవటానికే ప్రయత్నించండి. అదే ఉచితం.

ఓ సుబుద్ధీ! చక్రవర్తీ! నేను ఈ అహల్యనే అన్నివైపులా, అంతటా చూస్తున్నాను. నా చిత్తము ఇప్పుడు ఈమె రూపమే అయి ఉండటంచేత ఈమె సాంగత్యం చేత సర్వదా ఆనందము పొందుచున్నది. మీరు ఇప్పటికే అనేక రకాలుగా మమ్ములను హింసించుటకు యత్నించారు. అవన్నీ మీకు, మీ ప్రజలకు దుఃఖములను కలుగజేస్తాయేమోకాని, మాకు మాత్రం కాదు. అందుచేత ఇక మమ్మల్ని మా త్రోవలో పోనివ్వండి. ఇక్కడికి దూరంగా మా ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళిపోతాం.

❖

అంతా విన్న మహారాజు ఎంతో ఉద్రిక్తుడైనాడు. తన ఆసనం ప్రక్కనే ఆసీనుడైఉన్న రాజగురువగు "భరతుడు" అనునాతని వైపుచూచి ఇట్లు పలుకసాగాడు.

ఇంద్రద్యుమ్నరాజు : గురువర్యా! భరతమునీ! ఇతని ఆగడపు మాటలు వింటున్నారా? పరస్త్రీని అపహరించి మహాపాపమునకు ఒడిగట్టాడు. ఇంకా, ఏవేవో గర్వోక్తులు పలుకుచున్నాడు. నేను అనేక ప్రయత్నములచే కూడా, ఇతనిని ఏమీ చేయలేకపోయాను. మీరు మహాశక్తి సంపన్నులు కదా! "శిక్షించతగ్గవానిని శిక్షించకపోతే, ఆ రాజుకు పాపం చుట్టుకుంటుంది"– అని మన రాజ్యపు న్యాయశాస్త్రం ఘోషిస్తోంది. అందుచేత, మీరు మీ తపోశక్తిచే ఇతని పాపకార్యమునకు తగిన విధంగా ఏదైనా శాపం ఇవ్వండి. అటుపై వీళ్ళిద్దరిని పంపివేద్దాం.

అప్పుడా రాజగురువు ఇంద్ర – అహల్యల పాపకృత్య మంతా మరల విచారణ చేశాడు. ఎంతో చెప్పి చూచాడు. లాభం లేకపోయింది.

భరతమునీంద్రుడు : ఓ దురాత్ములారా! మీరిద్దరు చెయ్యరాని దోషపూరిత క్రియలు చేశారు. ఓయీ అహల్యా! నీవు భర్తృ దోహం చేసి పాపం చేశావు. ఓ ఇంద్రుడా! నీవు పరాయి స్త్రీతో అపవిత్రమైన సంబంధము కలిగి ఉన్నావు. ఈ రాజ్య–శాశనానుసారం, రాజాజ్ఞను అనుసరించి మిమ్ములను శిక్షించే నిమిత్తం నా తపస్సును వినియోగిస్తున్నాను. మీఇరువురి దోషపూరిత ప్రవర్తన శిక్షార్థం. అందుకు ఇదే నా శాపం. "మీరిద్దరు మరణించెదరు గాక!"

ఇంద్రాహల్యలు : ఓ రాజా ! ఓ మునీంద్రా ! మీరిద్దరు అల్పబుద్ధి కలవారే అగుచున్నారు.

ఓ మహామునీ! మీరు మాకు ఇట్టి శాపం ఇచ్చి, నిష్కారణంగా మీ దుష్కరమైన తపస్సు వ్యర్థం చేసుకొన్నారు. మా ఉద్దేశంలో ఈ శాపము మా ఇద్దరికి చేయగల హాని ఏదీలేదు. మీ వాక్య ప్రభావం చేత ఈ దేహాలు నశించవచ్చు. కాని ఒకరినొకరు ప్రేమించుకొంటున్నది ఈ భౌతిక దేహాలనా? కాదు. మనోరూపులమైనట్టి మాకు నాశనమెక్కడిది? మా చిత్తము సూక్ష్మము, చిన్మయము, అగోచరము కదా! మా మనస్సులు మీయొక్క శాపపర్యవసానానంతరం కూడా నశించకుండానే ఉంటాయని గ్రహించండి.

❖

దృఢస్నేహబద్ధులగు వారిద్దరు ఇట్లు ఎలుగెత్తి పలికారు. ఒకరు చెప్పుచుంటే మరొకరు 'అవును.... అవును' అనురూపముగల అనుకూల శబ్దములు చేశారు.

శాప ప్రభావంచేత వారిద్దరు నేలకూలి మరణించారు.

వారిద్దరికి ఒకరిపై మరొకరికి విడదీయరాని అనురాగమున్నది కదా! అందుచేత, మరుజన్మలో రెండు లేళ్ళుగా జన్మించారు. ఆ తరువాత అనేక పక్షి జంటల జన్మలు ఎత్తారు. ఇక ఇప్పుడు, నేను సంచారం చేసే ఒకానొక బ్రహ్మాండములో ఒకచోట వారిద్దరు పరస్పరాసక్తత కలిగియుండి––– తపః సంపన్నులగు బ్రాహ్మణ దంపతులుగా జన్మించారు.

చూచారా! పితామహా! దుస్సాధ్యములగు శాపములు కూడా వారిద్దరి మనస్సులను విడదీయ లేకపోతున్నాయి. వారియొక్క స్నేహసంస్కారముచే వారు ఎక్కెడెక్కడ జన్మించినప్పటికీ స్త్రీ – పురుషులు

గానే ఉంటున్నారు. వారి సహజ ప్రేమ భావమును, అత్యధిక స్నేహమును చూచి వృక్షములు కూడా ప్రేమరసపూర్ణములై ఉంటున్నాయి.

❖❖❖

5. యథావిధి

కనుక, శాపాదులు మనస్సును భేదింపలేవు. మరలింపజాలవు. ఐందవుల సృష్టులను నశింప జేయటం ఇప్పుడు ఉత్తమమైన పనికాదు. మీవంటి మహాత్ములు రాగము, మదము మాత్సర్యములను దగ్గిరకు రానివ్వరు కదా! ఈ లోకమునకు, అనేక బ్రహ్మాండములకు ప్రభువు అయినట్టి మీరు అట్లా చేయటం దీనత్వమునకే హేతువు అవుతుంది. బ్రహ్మాండములను సృష్టించగలశక్తి – సంపన్నములు గల వారి–వారి మనస్సులను ఎవ్వడూ దేనిచేతా నశింపజేయలేడు. అందుచేత, ఆ ఐందవులను తమ దివ్యదృష్టి కలిగియే ఉండనివ్వండి.

మీరు కూడా, మీ చిత్తాకాశమునందు యథావిధంగా ప్రజలను సృష్టించండి.

చిత్తాకాశము ఈ పాంచభౌతిక సంబంధమైన ఆకాశము వంటిది కాదుకదా! అది అనంతము. మీకు సర్వము తెలిసే ఉన్నప్పటికీ... మన ఉభయుల పునశ్చరణ కొరకు – సందర్భం వచ్చినది కనుక చెప్పుచున్నాను. మనం పూర్ణతత్త్వాన్ని పరిశీలించినప్పుడు, ఆకాశములు మూడు రకములుగా విభజించబడుచున్నాయి–

1. భూతాకాశము (Zone of matter)
2. చిత్తాకాశము (Zone of thoughts)
3. చిదాకాశము (Zone of Consciousness)

మొదటి రెండూకూడా చిదాకాశము చేతనే ప్రకాశింపబడుచూ, అనంతములే అయిఉన్నాయి. కాబట్టి ఓ జగదీశా! మీరు 'ఒకసృష్టి' గాని, లేక 'రెండుసృష్టులు' గాని, లేక 'అనేక సృష్టులు' గాని ఇతఃపూర్వము వలెనే సృష్టించండి. ఆ పదిమంది ఐందవులు మీదైనదంటూ ఏదీ ఆక్రమించియుండ లేదు కదా! ఇక వారిపై కోపందేనికి చెప్పండి? చిదాకాశమునందు వాస్తవానికి సృష్టిత్వము లేకయే ఉన్నది. అది ఎవరిది? ఎట్టిది? మాయచేతనే "నేను–నాది–నీవు–నీది–అది–ఇక్కడ–అక్కడ"... అను భేదమంతా తోచటం జరుగుతోంది. కనుక, సర్వజ్ఞులగు మీరు మీ "స్వకీయ ప్రేరేపణ"ను అనుసరించి సృష్టికార్యము చేయుచు, నిరభ్యంతరంగా ఆత్మయందు స్థితి కలిగియుండవచ్చు.

బ్రహ్మదేవుడు : ఓ సూర్యభగవానుడా! నీవు చెప్పుచున్నదంతా చాలా దీర్ఘంగా ఆలోచించాను. చాలా చక్కగా సత్యవిషయమును, నా యొక్క విహిత – అవిహితములను గుర్తుచేశావు. నీవు అన్నట్లు ఆకాశములన్నీ అనంతములే. "చిత్తాకాశము" అనగా "మనస్సహితమైన చిదాకాశము" కాకుండా మరింకేమీ కాదు. కాబట్టి చిత్త – చిదాకాశములు రెండూ అనంతములే. ఇక ఈ భూతాకాశము ఈ కనబడే సృష్టియందు అంతర్భూతమై ఉంటోంది. బ్రహ్మాకాశము (లేక చిదాకాశము)

నకు వాస్తవానికి దేనితోనూ సంగము (Attatchment) లేదు. కనుక నాకు అభిమతమగుచున్న ఈ సృష్టిని ఒనర్చుచు, స్వధర్మమైనట్టి నిత్యకర్మను నిర్వర్తించెదను గాక! ఓ భాస్కరా! నాకు ఇప్పుడు ఉత్తమ విషయమును (ధర్మమును) గుర్తు చేసినట్టి నీవే నా ఈ 'సృష్టి' అను కార్యక్రమము నందు, "ప్రథమ-మనువు" అగుదువుగాక! ఇక ప్రాణులను సృష్టించుటే నా తక్షణ కర్తవ్యం. నాయొక్క ప్రతినిధిగా నీవు నాచే ప్రేరితుడవై, నీ ఇచ్ఛానుసారంగా సృష్టిని గావించు!

❖

బ్రహ్మదేవుడు : నాయనా! వసిష్ఠా! మహాతేజస్వియగు ఆ భానుడు నేను చెప్పినదానికి అంగీకరించాడు. అప్పటికప్పుడు తన శరీరమును 'రెండు భాగాలు'గా విభజించాడు. అందులో ఒక శరీరమును 'ఐందవ సృష్టి' లోని సంచరించుచున్న బ్రహ్మాండము నందు "సూర్యుడు"గా ఉండి యథాతథంగా లోకములను ప్రకాశింపచేయటం కొనసాగించాడు. రెండవ శరీరముతో, నాచే ప్రసాదించ బడిన 'మనువు' పదవిని అలంకరించి నా అభిమతానుసారం సృష్టులను నిర్మించ ప్రారంభించసాగాడు.

❖❖❖

6. 'జీవుడు' అనగా?

శ్రీ బ్రహ్మదేవుడు : ప్రియపుత్రా! వసిష్ఠా "ఈ సృష్టులన్నీ ఎట్లా కలుగుచున్నాయి?" అను నీ ప్రశ్నకు సమాధానంగా "ఐందవ బ్రహ్మాండము" మరియు "ఇంద్రాహల్యల ప్రహసనం" చెప్పాను. 'మనస్సు' యొక్క సర్వకర్తృత్వము, శక్తి గురించి తెలియజేయుటయే నా ఉద్దేశం. ఇది ఇట్లు కనిపించి, అనుభవమగుటకు కారణం? నీ మనస్సు ఇట్లు భావించుట - సంకల్పించుటయే సుమా!

ప్రతిజీవిలోని మనస్సు అంతటి మహాశక్తి సమన్వితము, సర్వకర్తృత్వ సహితము, సర్వభావనా సమర్థము అయి ఉన్నది సుమా! అయితే ఈ జనులు స్వల్ప విషయములనే మళ్ళీ మళ్ళీ ఆశ్రయిస్తూ, సంకల్పించుచుండుటచే, వారి మనస్సులు స్వల్ప ప్రయోజనములను మాత్రమే పొందుచున్నాయి.

ఈ చిత్తమునందు ఏదేది ప్రతిభాసిస్తోందో - అది మాత్రమే వ్యక్తమగుట, స్థిరత్వము పొందుట, సాఫల్యమగుట జరుగుచున్నది. ఈ మనస్సుయొక్క సామర్థ్యమెట్టిదో ఐందవబ్రహ్మాండములు నిరూపిస్తున్నాయి. ఐందవులు మనోభావనాబలం చేతనే బ్రహ్మపదమును పొందగలిగారు. ఐందవుల చైతన్యమే చిత్తత్వము పొందటం జరిగింది. ఆ చిత్తత్వము నందలి 'భావన' యే, హిరణ్యగర్భత్వము (సమష్టిసృష్టి భావన)ను సంతరించుకొన్నది. అంతేకాదు, మనందరి విషయం కూడా అట్టిదే. చైతన్య స్థితి నుండి చిత్తత్వము పొంది, తత్ఫలితంగా మనం ఈ ఈ రూపములను ఆశ్రయించాము. చిత్తమే ప్రతిభాసారూపముచే (In the process of reflection) 'దేహము' మొదలైన రూపములను ప్రకాశింపజేయుచున్నది. అనగా, ఈ దేహాదులు చిత్తముకంటే ఏమాత్రం వేరైనవి కావు.

ఈ చిత్తము చాలా సమయాలలో అనేక కల్పనలతో కూడుకొని ఉంటోంది. మిరియపుగింజ కారంగాను, ద్రాక్షపండు తియ్యగాను ఉంటూఉంటాయి కదా! ఈ జీవుని చిత్తము కూడా

కామ్యకర్మలను, వాసనలను ఆశ్రయించటం, కలిగియుండటం స్వభావంగా పొంది ఉంటోంది. చిత్తము ఎట్లా ఉంటే అద్దాని భావసంస్కారములను అనుసరించే వ్యక్తీకరణ కూడా ప్రాప్తిస్తూ ఉంటుందని గ్రహించు. చిత్తము యొక్క మననమును – మననములను అనుసరించే సృష్టిలోని వివిధ దేహాలు రూపుదిద్దుకుంటున్నాయి.

ఈ జీవుడు భ్రాంతిచే తన సూక్ష్మ వాసనలనే స్థూలముగా భావించి, "నేను మనుజుడను, నేను దేవతను"... అని తలచుచూ వ్యర్థముగా మోహితుడు అగుచున్నాడు.

సూక్ష్మవాసనలతో కూడుకొని యున్న చిత్తమునే 'జీవుడు' అంటున్నాం. స్థూలత్వ భ్రాంతిచే అదియే 'దేహము' అని కూడా దర్శించబడుచున్నది. ఏది ఏట్లైనా ఉండనీ! ఈ సూక్ష్మ, స్థూల శరీరములు, వీటిని దర్శించటం – ఇదంతా కల్పనామాత్రమే. వాస్తవానికి ఈ జీవుడు సాక్షాత్ బ్రహ్మమే అయి ఉన్నాడని సర్వదా ఎరుక కలిగియుండుము.

❖

ఓ విశ్వామిత్ర – వసిష్ఠులారా! దారము కంటే వస్త్రము వేరైనదని అనగలమా? ఈ "నేను'–నీవు–అతడు" మొదలుగాగల తదితరములన్నీ... అత్యంతాశ్చర్యకరమైన ఈ చిత్తముకంటే వేరేమీ కాదు. అయితే, ఈ చిత్తము వాస్తవానికి స్వరూపరహితమైనదే. కల్పిత మాత్రమైనదే. కాని, మనం ఐందవ బ్రహ్మాండములు (ఐందవోపాఖ్యానం) విషయంలో గమనించినట్లు ఇది సత్తను పొంది వర్తించుచున్నది. "జడము మాత్రమే" అయిన ఈ చిత్తము ఇద్దాని ఆధారమగు చైతన్యము చేతనే సత్తను పొందుచున్నదని గ్రహించు. ఐందవుల మనస్సే 'బ్రహ్మ', 'బ్రహ్మాండము' లుగా పరిణమించినది కదా!

1) భూతికంగా ఘనీభూతమై కనిపించే ఈ పాంచ భౌతిక దృశ్య సృష్టి వస్తుతః మనోరూపమే అయి ఉన్నది. (లేక) ఇదంతా సంకల్ప రూపమే!
2) అనుభవమునకు కారణమగుచున్న 'అనుభూతి'– స్వయంకృతమే! (లేక) స్వయం నిర్మితమే!
3) జగత్ సంకల్పము ఆత్మ సంకల్పమునందు లయిస్తే ..., సర్వమూ పరమాత్మనుభవంగా శేషించగలదు.

మనం కూడా మన సంకల్పముల ప్రభావంచేతనే బ్రహ్మ – మహర్షులము అయినాము. అట్టి మనస్సుచే స్థితి పొందినట్టి మనం, మనచే రచించబడిన ఈ జగత్తు ... ఈ సర్వం సంకల్ప రూపముననే భాసించుచున్నది.

ఈ చిత్తముయొక్క కల్పనచేతనే ఒకడు 'నేను బ్రహ్మను' అని, మరొకడు "నేను అత్యంత పరిమితమగు పురుగును" అని అనుభవం పొందుచున్నారు. వాస్తవానికి, పరమాత్మయే ఈ సర్వ దేహాదుల రూపమున ప్రకాశించుచున్నాడు. పరమాత్మయే జగత్తు – జగద్రహితమగు చిదాకాశము కూడా అగుచున్నాడు.

నిర్మలమగు చిత్తమే పరమార్థ స్వరూపము సుమా! అంతేకాదు. పరమార్థ స్వరూపమగు చిత్తమే ఏమరపుచే, భావనావశంచేత 'జీవుడు' గాను, 'మలిన చిత్తము' గాను పరిణమించుచున్నదని

గ్రహించు. అట్టి మలిన చిత్తమే ఈ దేహాదుల రూపమున వ్యక్తమగుచున్నది. కల్పనయే అయినప్పటికీ, ఈ దృశ్యము సుఖదుఃఖముల రూపమున ఈ జీవునికి బంధము, బాధ కలిగించుచునే ఉన్నాయి కదా! ఎందుచేత?

ఒక దృష్టాంతము చెపుతాను. విను. ఒకడు తనయొక్క అజ్ఞానశక్తిచే ఉత్పన్నము చేసుకొన్నట్టి స్వప్నమునో, ఊహనో, లేక సంకల్పమునో చాలాకాలం అట్లే కలిగియున్నాడనుకో..... అప్పుడు ఏమవుతుంది? అది అతనిచే జాగ్రత్‌వలెనే దర్శింపబడుతుంది. అనగా "ఇది అత్యంత వాస్తవమే" అని అనిపిస్తుంది. అదే విధంగా చిద్వస్తువుచే వ్యాప్తమైయున్న ఈ జాగ్రత్ ప్రపంచము కూడా ఈ జీవునకు,... నాకు ఆ ఐందవసృష్టిలాగా,... సత్యమువలెనే అనుభూతమౌతోంది.

❖

నాయనలారా ! విశ్వామిత్ర వసిష్ఠులారా ! ఈ చిత్తమే ప్రపంచమునంతటినీ ఉత్పన్నము చేయుచున్నది. అతి సూక్ష్మ వాసనా మయమైనట్టి "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు" అనే తన్మాత్రలకు సంబంధించిన 'అధ్యాస' (Avocaiton) బలపడుటచేత 'జగత్తు' అనబడు అనుభవం ఏర్పడుతోంది. ఒకనికి కంటిచూపు దోషంచేత ఆకాశంలో రెండవచంద్రుడు కనబడుతూ ఉంటాడే! ఈ 'జగత్తు' దర్శనముకూడా అట్టిది మాత్రమే.

ఈ 'అహంభావము' రూపమున ప్రకాశించునది, దానిని ఆశ్రయించుకొని అనుభవమగుచున్నది... ఇదంతా సత్తు కానేకాదు. ఎందుకంటావా? ఏదైతే త్రికాలములందు అనగా, ఇంతకు ముందు - ఇప్పుడు - ఇకముందు కూడా, ఉండి ఉంటుందో... అట్టి దానిని మాత్రమే మనం 'సత్తు' అని అనగలం. 'గాఢనిద్ర' లో ఈ జీవుడు ఉండి ఉన్నప్పుడు జాగ్రత్ రూపమైన అహంకారము అనుభవమగుటలేదు కదా! ఒకప్పుడు ఉన్నట్లుతోచి, మరొకప్పుడు లేకుండా పోయేదానిని సత్తు అనిగాని, సత్యమనిగాని ఎట్లా అనటం? పోనీ, అహంభావమును ఆశ్రయించి లభ్యమయ్యేదంతా "ఇది అసత్తు మాత్రమే" అని అందామా? అసత్తు అయిన వస్తువు లభించనే కూడదు కదా! సద్వస్తువు ఎల్లప్పుడు సత్తుగానే (అనగా ఉండియే) ఉంటుంది. అసద్వస్తువు అసత్తుగా (లేకయే) ఉంటుంది. ఈ 'అహంకారము' అనునది - సత్తుకు, అసత్తుకు కూడా విలక్షణమై ఉండిఉండుటచే - అద్దానిని "మాయకము, అనిర్వచనీయము" అని విజ్ఞులు అంటున్నారు. ఎందుకంటే విచారణ ప్రభవించి, వికసించేవరకు అది ఉంటోంది. విచారణచే నిర్మలమైన బుద్ధి కలవాని దృష్టిలో అది ఉండుట లేదు. 'అహం' అని భావించుటకు మునుముందే ఆ భావకుడు భావరహితుడై భావములకు అతీతుడై ఉండి ఉన్నాడు కదా! అదియే ఈ జీవుని వాస్తవస్వరూపం.

ఈ మనస్సు సంకల్పాత్మకము, విశాలము అయి ఉంటోంది. అట్లే అది జడము, అజడముకూడా అయి ఉన్నది. ఎట్లా అంటావా? బ్రహ్మము అద్వితీయముకదా! కనుక మనస్సు స్వతహాగా బ్రహ్మ స్వరూపమే కదా! కనుక అజడము. కాని దానికి స్వకీయమైన ఉనికి ఎక్కడ? ద్రష్ట ఉంటేకదా, దాని ఉనికి! కాబట్టి జడమే. అది ఈ దృశ్యమే తన రూపముగా కలిగియున్నది. 'దృశ్యము యొక్క

అనుభవం' ఉండి ఉంటున్న సమయంలో ఈ మనస్సు సత్యమైనదానిలాగానే కనిపించుచున్నది. కాని, బ్రహ్మానుభవకాలమందు మాత్రం ('నేను బ్రహ్మమునే' అను ఎరుక కలిగి యున్నప్పుడు) అది బ్రహ్మము కంటే వేరుగా ఏమాత్రం లభించుటలేదు. ఇందుకుగాను ఒక దృష్టాంతము చెపుతాను. ఒకడు ఒక ఆభరణము యొక్క ఆకారమును, అంద-చందములను పరిశీలిస్తున్నాడనుకో.... అప్పుడతనికి "ఇది గొలుసు, అది ఉంగరం, ఇది గాజు, ఇది ముక్కుపుడక" మొదలైన ఆకారములే (ఆభరణత్వమే) కనిపిస్తాయి కాని, అందలి అన్ని ఆభరణములలోని బంగారమువైపు దృష్టి ఉండదు. ఆభరణమును చూస్తున్నప్పుడు బంగారము కనిపించదు. అనగా అదే ఆభరణములను సువర్ణదృష్టితో చూచినప్పుడు... ఆ ఆభరణములన్నీ బంగారముకన్నా వేరు కానివిగా (అభిన్నమైనవిగా) తెలియవస్తాయి. మనస్సుకూడా బ్రహ్మంలో,-బంగారంలో ఆభరణత్వమువలె,-స్థితి కలిగియున్నది.

చైతన్యము జడమును ఎట్లా ఎరుగుతోంది?

హిరణ్యగర్భుడు (సమష్టి సృష్టి స్వరూపుడు) అగు బ్రహ్మ సర్వస్వరూపుడు కదా! అందుచేత జడ-చైతన్యములన్నీ బ్రహ్మమే అవుతాయి. అయితే, బ్రహ్మదేవుడు మొదలుకొని, ఒక రాయి వరకు సమస్త పదార్థములు యథార్థానికి "జడ - చైతన్యముల" రెండింటికీ విలక్షణమై ఒప్పుచున్నాయి. 'అహంకారము' గురించి మనం అనుకొన్నట్లే, అవికూడా మాయారూపములై అనిర్వచనములై (Illusionary and undefinable) ఉంటున్నాయి. జీవుడు చైతన్యమే స్వరూపముగా కలవాడుకదా! కొయ్య మొదలైనవి జడము. చైతన్యరూపుడగు జీవుడు కొయ్యమొదలైన జడపదార్థములు పొందికను ఎట్లు అనుభవిస్తున్నాడు? ఈ ప్రశ్నకు శాస్త్రకారులు ఇస్తున్న సమాధానమేమిటో విను.

ఇక్కడ నాలుగు విషయాలు పాల్గొనుచున్నాయి.

ప్రమాత	:	ఎరిగెడువాడు (that which is knowing)
ప్రమాతృచైతన్యము	:	చైతన్యముయొక్క 'ఎరుగుట' అను స్వభావం.
ప్రమేయము	:	ఎరుగబడుచున్నది (that which is being known)
ప్రమేయ చైతన్యము	:	'ఎరుగబడుట' అను స్వభావము.

జీవునిలోని ప్రమాతృచైతన్యము, ఆ కొయ్యలోని ప్రమేయచైతన్యము... ఈ రెండు వృత్తిద్వారా అభేదము పొందుటచేతనే - ఆ రెండిటి యొక్క పొందిక (Association) సందర్భపడుతోంది.

కాబట్టి 'చైతన్యము'తో 'చైతన్య సంబంధము' కలుగుట వలన అనుభవము - అనేది సిద్ధిస్తోంది. సాదృశసంబంధము వలననే పొందిక లభిస్తోంది. చైతన్యరహితమైన వస్తువు అనుభవమునకే లభించదు. కనుక, జగత్తు అంటే చైతన్యమే రూపముగాగల జీవుడు... చైతన్యమే స్వరూపముగాగల ఆయావస్తువులతో ఏర్పడుచున్న సామ్యముయొక్క "అనుభవం పొందటం."

బ్రహ్మము సర్వదా విషయరహితమైనదే!


అయితే ఒక్క విషయం. విశాలమైన ఇసుక ఎడారి మధ్యలో ఎక్కడైనా ఫలవృక్షాలు ఉంటాయా? ఉండవు కదా! వాక్కుకు కూడా అతీతమై (అనుభవ మాత్రమైయున్న) 'పరబ్రహ్మము' నందు

చేతనారూపంగా కనిపించే 'నీవు – నేను' అనునవిగాని, అచేతనంగా కనిపించే పదార్థజాలముగాని లేవు. బ్రహ్మమునందు 'ఇది జడము'–'ఇది చైతన్యము' అనునట్టి శబ్దార్థముల కల్పనయే ఉండదు. అయితే ఈ చిద్వస్తువు ఒకానొకచోట దృశ్యమునందలి ఆయా పదార్థములతోను, వ్యక్తులతోను, సంఘటనలతోను ఏర్పరచుకొన్న సంబంధము కారణంగా ఒక 'స్ఫురణ' కలిగి ఉంటోంది. జలము కొన్ని సమయములలో ఆవృత్తములు (Circles) తోకూడి ఉంటుంది చూచావా? బ్రహ్మమునందు ఏర్పడు ద్రష్టత్వము–దృశ్యత్వము కూడా అట్టివి మాత్రమే. సర్వదా జలము జలముగానే ఉంటోంది. ఆ వృత్తమునకు ముందు, ఆవృత్తసమయంలో, ఆ తరువాతకూడా జలం జలమేకదా! జగద్భావము ఏర్పడుచున్నప్పుడు కూడా బ్రహ్మము బ్రహ్మముగానే ఉండిఉంటోంది. విషయసంబంధమైన చైతన్యము లేక బ్రహ్మముయొక్క స్ఫురణనే 'మనస్సు' అంటున్నాం. మనయొక్క విచారణ, మనస్సును రెండు రకాలుగా విభజించవచ్చు.

1. 'చిత్' అంశము లేక జ్ఞానాంశము : (Awareness consciousness / 'The knower' dimension / The experiencer)

2. విషయాంశము లేక విషయరూపానుభవం : (The knowing dimension / The experiences)

చిత్ అంశమును 'అజడము' అని, విషయాంశమును 'జడము' అని అంటున్నాం. మనం చూస్తున్న ఈ జడవస్తు జాలమంతా ఆ విషయాంశమే. ఈ జీవుని యందుగల "తెలుసుకొనుట" అను స్వభావం రెండు విధములైన ప్రసరణ కలిగి ఉంటోంది.



ఈ జీవుడు అన్ని వేళల చాంచల్యమును పొందుచున్నాడు. జగద్భ్రాంతిని అనుభవిస్తున్నాడు.

జగత్తు చిద్రూపమే : చిత్తమునందలి చిదంశమే (Knower concept) (1) చిత్తము (2) జగత్తు అను రెండు విధములుగా విభజించబడుచున్నది. కాని, ఈ కనబడే జగత్తుకూడా, విజ్ఞాన దృష్టితో చూస్తే, చిద్వస్తువు మాత్రమే అవుతుంది. చైతన్యముతో ఈ జగత్తు అభేదమే! అందుచేత ఆత్మదృష్టి కలవారు, "ఈ జగత్తు చిద్రూపమే అయి ఉన్నది, మరింకేమీ కాదు" అని సిద్ధాంతీకరించుచున్నారు.

భేద దృష్టిచే మాత్రమే... ఈ చైతన్యము-మరొక ఏవేవో రూపములు ధరించుచున్నట్లు అనుభూత మవుతోంది. వాస్తవానికి చైతన్యము విభాగరహితం సుమా! కాని, విభాగము కలదాని వలె కన్పట్టుచున్నది.* అది భ్రమ రహితమే అయినప్పటికీ, భ్రమయుక్తముగా ప్రవర్తించుచున్నది.

నాయనా! వసిష్ఠా ! యథార్థానికి 'భ్రమ' అనబడునది ఏదీ లేదు. "చేతనస్వరూపుడగు ఈ జీవుడు భ్రమను పొందుచున్నాడు" అనటం కూడా మా ఉద్దేశంలో సరికాదు. మరి ఇదంతా ఏమంటావా? పూర్ణసముద్రము తనయందు "తరంగములు" అను అనుభవం పొందుచున్నది కదా! సర్వదా పూర్ణమే అయిఉన్న చైతన్యము తనయందు ఈ "జగత్తులు-పదార్థములు-భావాభావములు" మొదలైన రూపముగల అనుభవం పొందుచున్నది. అంతే!

❖

'చిద్వస్తువు' - స్వస్వరూపం లేక ప్రతి ఒక్కరి వాస్తవ శుద్ధ స్వరూపం అయి ఉన్నది కదా! 'జడము' కూడా చిద్రూపమే అయిఉన్నది సుమా! ఎందుచేతనంటే 'జడము' అని చెప్పబడుచున్నది కేవలం జడము మాత్రమే అయి ఉంటే... స్వస్వరూపము దృష్ట్యా చిద్వస్తువగు నీకు అది భాసించ కుండానే ఉండేది. జాగ్రత్‌లో ఉన్నవాడే జాగ్రత్‌లో ఉన్నవాడితో సంభాషించగలడు. నిద్రించువాడు జాగ్రత్ - పురుషునితో ఎట్లా మాట్లాడుతాడు చెప్పు? స్వతహాగా చైతన్యమే అయిఉన్న నీవు అట్టి చైతన్యము యొక్క జడంశమునందు జడమునకు సంబంధించిన అనుభవం పొందుచున్నావు. కనుక జడంశము 'చిత్' యొక్క ఒకానొక అంశ మాత్రమే!

❖❖❖

7. అహంభావము

శ్రీ బ్రహ్మదేవుడు : "జ్ఞానము యొక్క చైతన్యాంశమునందు 'అహంభావము (నేను-నాది)' అను జడత్వపు భావన ఉదయిస్తోంది" - అనునదే ఇక్కడ మనకు సిద్ధాంతము. ఏదైతే ఎందులోంచి - బాహ్యకారణమేదీ లేకుండా ఉదయిస్తుందో... అట్లు ఉదయించేదంతా ఆ మూలవస్తువుకు వేరైనది అయిఉండదు కదా! శుద్ధతత్వమగు బ్రహ్మము లేక ఆత్మ 'జీవుడు' అనబడు మరొక తత్త్వముగా పరిణమించినట్లు తోచినప్పటికీ వాస్తవానికి బ్రహ్మమునందు బాహ్యమైన లేక బాహ్యము నుండి నియోగించబడిన కారణమేదీ లభించుటలేదు కాబట్టి... ఈ జీవుడు సర్వదా బ్రహ్మమే అయివున్నాడు.

శ్రీ వసిష్ఠ మహర్షి : తండ్రీ! అట్లా అయితే మరి ఈ 'అహంకారము,' అద్దానిచే అనుభవించబడుచున్న 'జడత్వము' మాట ఏమిటి?

శ్రీ బ్రహ్మదేవుడు : సూర్యుని తేజస్సే సూర్యకిరణరూపమై వస్తువులపై ప్రసరిస్తోంది కదా! అనగా, సూర్యకాంతి వస్తువు ఆకారం సంతరించుకొని కనబడుతోంది. "చైతన్యాంశమే అట్లు వివర్త భావము

---

* అవిభక్తంచ, భూతేషు విభక్తమివచ స్థితమ్.... *శ్రీమద్భగవద్గీత 13వ అధ్యాయం.*

పొందుచున్నది" అని అనక తప్పదు. అనగా ఈ జగత్తు, ఈ జగత్తును దర్శించుచున్నట్టి ద్రష్టవగు నీవు, నీతో ఈ సంభాషణ చేయుచున్నట్టి నేను... అంతా చైతన్యము యొక్క ప్రకటనయే అయిఉన్నది. చైతన్యమునకు అన్యమైనదంటూ ఏదీ ఎక్కడా లేదు. జలమునకు వేరుగా "తరంగములు" అనబడు మరొక బాహ్యవిశేషమేమైనా పరిణమించుచున్నదా? ఆ జలం మరొకటిగా మారుచున్నదా? లేదు. ఆ సమయంలో జలమునకు వేరుగా మరొకటి ఏదీ అగుచున్నదిలేదు. అదేవిధంగా 'పరమాత్మ' యందు అహంకారము మొదలైనవేవీ లేవు. మరి లేని అహంకారమును తొలగించుట లేక త్యజించుట ఏమిటి చెప్పు? కనుక, "అహంకారము చైతన్యముయొక్క సంప్రదర్శనమే!" అను సందర్శమును పెంపొందించుకొండి.

- "నేను శుద్ధ చైతన్యమునే" అనునదే జ్ఞానసారం.
- దృశ్యమందలి సారము కూడా ... 'ద్రష్ట' యందలి సారముకంటే వేరైనదేదీ కాదు.
- అనగా, అన్నిటియందును ఏకైక చైతన్యమే ఏకరసమై సర్వదా ప్రకాశించుచున్నది.

నాయనా! అహంభావమే 'మిథ్య' అయినప్పుడు, ఇక అట్టి 'అహం' భావనచే ఉత్పన్నములగుచున్న విషయముల మాట ఏం చెప్పాలి? అవన్నీ ఎండమావులలోని నీటిని కడవలలో నింపి తెచ్చుకోవటం లాగా అత్యంత భ్రమాత్మకమే అవుతాయి. అందుచేత "అవన్నీ అప్రస్తుతం అనగా, ప్రస్తుతమే లేవు" అని గ్రహించు. ద్వైతదృష్టి అంతా తొలగిపోగా, అప్పుడు శేషించేదే 'ఆత్మ' అయి ఉన్నది కదా! అట్టి ఆత్మయందు ఇక అహంకారమునకు, అల్పత్వభావనకు, అఖండమునకు వేరైన అస్థిత్వమునకూ చోటెక్కడ?

శ్రీ వసిష్ఠమహర్షి : పితృదేవా! మరి మాకు ఘనీభూతమై తోచుచున్న ఈ 'అహంభావన' ఎక్కడి నుండి వచ్చిపడుతోంది?

శ్రీ బ్రహ్మదేవుడు : నీరు అధికమైన శీతల వాతావరణము నందు ఉంచబడినప్పుడు 'మంచు' గా ప్రాప్తించుచున్నది చూచావా? చేతన వస్తువు స్వస్వరూపమునకు సంబంధించిన అజ్ఞానమును అంగీకరించి, అట్లు అంగీకరిస్తున్న సమయంలో "అహంకారము – 'విషయానుభవము' అనునట్టి రూపమును పొందుచున్నది.

ఒక చిన్న హాస్య సంఘటన చెపుతాను. విను. ఒకడు ఒక అర్ధరాత్రి తటాలున నిద్రలేచి, తన ప్రక్కనే నిద్రిస్తున్న తన స్నేహితుని నిద్రలేపి, "మిత్రమా! ఇప్పుడు నాకొక కల వచ్చింది. ఆ కలలో – నేను చచ్చినానట. అప్పుడు నా శరీరమును ఎవ్వరో మోసుకొని వెళ్ళుచూ, నా మంచితనము గురించి చెప్పుకొంటున్నారు. 'ఇతడు మరల బ్రతికితే ఎంత బాగుండు!' అని అనుకొంటున్నారు. కాని చనిపోయినట్టి నేను మరల బ్రతకటం అసాధ్యం కదా, ..." అని చెప్పుకుపోతున్నాడు. స్వప్న ద్రష్టయగు తానే మరణిస్తే స్వప్నమెక్కడిది? తన కల్పన ఉంటేకదా, ... ఆ కల్పనలో ఆయా వ్యక్తులుండటం! అతని శరీరము మోయుచున్నవారెవరు? స్వప్నద్రష్టచే సంకల్పించబడి, దర్శించబడేవారే కదా!

మరొకడు "రాత్రి కలలో నేను గాఢ నిద్రపోతూ ఉండగా, ఆ కలలో ఒకడు మా ఇంటిలో ప్రవేశించి నన్ను నిద్రలేపినట్లు కలవచ్చింది. అప్పుడేమైనదంటే....." అని కలలోని విశేషాలు చెప్పుచున్నాడు. తానే గాఢనిద్రలో ఉంటే ఆ స్వప్నములోని మరొకడు ఎక్కడి నుండి వచ్చాడు? స్వప్నమంతా స్వప్నద్రష్ట యొక్క స్వకీయకల్పనయే కదా! అదే విధంగా చైతన్యము కూడా మిథ్యారూపంగా జడత్వానుభవం పొందుచున్నది. సర్వాత్మకమగు ఆ చైతన్యము తన అనంత రూపములోని ఒకానొక చోట జడస్థితిని అనుభవించుచున్నది. దృఢమైన అజ్ఞానమును ఆశ్రయించుట ద్వారా స్వస్వరూపానుభవం ఏమరుస్తోంది. 'సంసృతి' అని చెప్పబడు బాహ్యదృష్టి కలిగియుంటోంది. అనగా అది తన సర్వాత్మకత్వమును మరచి, తనకు ఎక్కడ 'దృష్టి (Avocation) ఏర్పడుచున్నదో ..... అక్కడ జడాకారము, పరిమితత్వమును వహించి ఉంటోంది. సమస్త వస్తువులకు ఆదికారణం మనస్సే. ఆ మనస్సే అన్నిటా, అన్ని రూపములలోను వ్యక్తమగుచున్నది. అదే ఆకాశమువలె, అత్యంత విశాలమై అనేక రూపములను స్వయముగా దర్శించుచున్నది. ఇక దానిని నియమిస్తున్నది ఎవ్వరంటావా ? దాని వాస్తవ స్వరూపమైనట్టి ఆత్మయే.

❖

ఓ జనులారా! మీరు మొట్టమొదట అభ్యాసము, వైరాగ్యము మొదలైన ఉత్తమ గుణములను అలవర్చుకోండి. అప్పుడు మీ చిత్తములు జ్ఞానము పొందుటకు 'అర్హత' పొందుతాయి. జ్ఞానము అభివృద్ధి పొందుచూ ఉండగా ఇక "స్థూల – సూక్ష్మ – కారణ" శరీరముల భ్రాంతిని మీ అంతట మీరే పరిత్యజించివేస్తారు. "ప్రతిభాసాత్మక (Image like) చిత్తము" అనుదానిని మీయొక్క 'చిత్తము' నే ఉపయోగించి స్వయముగా విచారణ చేయండి. అప్పుడు నేను చెప్పు దానిలోని వాస్తవాన్ని మీరే గ్రహించగలరు. చిత్తము అపరిశుభ్రంగా ఉన్నంతకాలం భ్రమాత్మకములగు అనుభవములు, తత్ఫలితములు, సంసారదుఃఖ పరంపరలు తప్పునవికావు. చిత్తము శుద్ధమైనంతమాత్రం చేతనే నిత్య నిరతిశయానందమును పొందగలరు. మీరంతా ఈ దేహాదుల పరిశుభ్రతకొరకు ఎన్నో ప్రయత్నములు చేస్తున్నారుగాని, చిత్త నిర్మలత్వము కొరకు తగినంత ప్రయత్నశీలురు అగుచున్నారా? లేదు. కనుక, పరిశీలించి చూచుకోండి. చిత్త నిర్మలత గురించి అశ్రద్ధ వహించియుండుటచేత అనేక దౌర్భాగ్యములు వచ్చి పడుచున్నాయి. చిత్తముచే "చైతన్య పరబ్రహ్మము" అయిఉన్న స్వస్వరూపమును గ్రహించాలి. అది మానివేసి ఈ దేహాది ఖండములను మాత్రమే విచారించుచు ఆయుష్షను వృథా చేయుటచే ప్రయోజనమేమున్నది?

ఏది సత్యమో దానిని గురించే విచారించాలి. అట్టి విచారణ రూపమగు జ్ఞానమే సఫలమౌతుంది. అసత్యము, కల్పితము అయిన దాని గురించి ఎంత విచారించి ఏం ప్రయోజనం? అట్టి అసత్యమైన దానిని ఆశ్రయించుటచే శ్రమకు ఫలితంగా అసత్యమైనది, కల్పితమైనదే ప్రాప్తించటం జరుగుతుంది. అందుచేతనే సంసారజీవులను దుఃఖాదులు ఆశ్రయించుకొనియే ఉంటున్నాయి. ఆకాశంలో "తన యొక్క కల్పన" అను వికారముచే గాంచబడే వృక్షమును ఎవరైనా శోధిస్తారా? ఈ దేహాదుల

విషయం కూడా అట్టిదే. అందుచేత, జ్ఞానులు ఈ దేహముల రాక – పోకల గురించిన విచారణను ప్రక్కకు పెట్టి, దేహి (లేక) చైతన్యతత్వము గురించి శోధించుచున్నారు. నాయనలారా! సర్వప్రసరణ శీలమగు 'ఆత్మ'యే మీరు. కాబట్టి "నేను ఈ దేహపరిమితుడను" అని భావించి ఖేదము చెందకండి.

ఓ ప్రియ తనయులారా! వసిష్ఠా! విశ్వామిత్రా! "జీవుడనగా ఈ దేహమే. మరింకేమీ కాదు" అని చెప్పుచూ, కొందరు దేహాత్మవాదులు ఆయా ప్రమాణములతో ఈ జీవునకు అల్పత్వం ఆపాదించు చున్నారు. ఈ చిత్తము దేనిని ఎట్లు భావించునో అది అట్లే అయి, ప్రాప్తిస్తూ ఉంటుంది. అహల్య, ఇంద్రుల మనోనిశ్చయము యొక్క ప్రభావమే మనకు ఇందుకు దృష్టాంతము. కనుక అట్టి ఈ చిత్తముతో ఉత్తమోత్తమమైన భావనయే చెయ్యాలి. కాని, "నేను స్వల్పుడను, శరీరమును, అల్పుడను" అను రూపము గల నీచ భావనలు ఎందుకు చెయ్యటం? "సర్వాత్మకమైనట్టి చైతన్య పరబ్రహ్మమే ఈ "నీవు–నేను" మొదలైన సర్వరూపములుగా ... ఒకే జలం అనేక తరంగములు అగుచున్నట్లు ... ప్రకటితమౌతోంది. కనుక నేను పరబ్రహ్మమును. నాకు ఆద్యంతాలు లేవు. జన్మ–జరా–మృత్యువులు లేవు. ఇదంతా నాకంటే వేరైనది కాదు" అని భావన చెయ్యాలి. అట్లే "ఈ కనబడే ప్రతి ఒక్కరు పరబ్రహ్మ స్వరూపులే(తత్–త్వమ్అసి)" ... అను మననమును ప్రవృద్ధం చేసుకోవాలి. అట్లు భావించుట చేతనే మీరు ఉత్తమత్వమును పొందగలరని గ్రహించండి.

❖

ఈ చిత్తము ఏ విధంగా స్ఫురించుచున్నదో, అట్టి స్ఫురణను అనుసరించే ఆయా ఉపాధి పరంపరలు వచ్చి చేరుచున్నాయి. వాస్తవానికి, ఈ దేహముగాని, లేక, అహంకారముగాని ... స్వప్నములోని వ్యక్తులు, వస్తువుల వలె ... "లేనివే" సుమా! కనుక ఓ వసిష్ఠా! సర్వదా ఏకరూపమై, ఇచ్ఛారహితమై ఉన్నట్టి ఆత్మనే ఎరుగుము. అట్లు ఎరుగుచూ ఇచ్ఛారహితుడవై ఉండుము.

ఒక బాలుడు ఎవ్వరో చెప్పిన మాటలు విని తనకుతానే కల్పించుకొనినట్టి భ్రమపూర్వకమైన కల్పన చేత బేతాళదేహమును ఎదురుగా చూస్తూ, భయాదులను అనుభవిస్తూ ఉంటాడు. పంచభూతాత్మకమైన తన ఈ దేహమెక్కడ? జడలు – కోరలు – నాలుక మొదలగు కల్పనలతో మనస్సుచే ఊహగా చూడబడే బేతాళ దేహము ఎక్కడ? ఆ రెండింటికీ సంబంధమే లేదు కదా! కల్పనలు నశించగానే ఆ బేతాళుడు, భయాదులు, ... అన్నీ తొలగిపోతున్నాయి. ఆత్మ కూడా కల్పనావశం చేతనే ఈ 'మనుష్యుడు' మొదలైన దేహములుగాను, ఈ సర్వదృశ్య ప్రపంచముగాను అగుచున్నది. ఆ దేహాదులు నశించుచున్నప్పుడు తానే నశించుచున్నట్టి భావనకు లోను అగుచున్నది. అవిద్యా కల్పన నశించిన మరుక్షణం సర్వభ్రమలు తొలగిపోతాయి. అప్పుడు స్వస్వరూపప్రాప్తి స్వయముగానే సంభవించుచున్నది.

❖❖❖

8. శాప - మంత్రములు

శ్రీవసిష్ఠమహర్షి : తండ్రీ! బ్రహ్మదేవా! మీరు నాకు అత్యుత్తమమైన విషయమే బోధిస్తున్నారు. ఆత్మజ్ఞానమే అన్నిటా ఉత్తమమైనది. అయితే, మీరు చెప్పిన విషయాలలో ఒక్కటిమాత్రం నాకు యుక్తియుక్తంగా కనిపించటం లేదు. మీరు ఒకప్పుడు నాతో "శాప - మంత్రాదులు అమోఘమైనవి. అవి తమ ప్రభావం కలిగియే ఉంటాయి" అని చెప్పియున్నారు. మరి ఇప్పుడేమో "దృఢమైన మనోబలిమి కలవానిని శాప-మంత్రాదులు ఏమీ చెయ్యలేవు" అనే అర్థం వచ్చేవిధంగా చెప్పుచున్నారు. అంటే, 'శాప', 'మంత్రములు' మొదలైన శక్తులు వ్యర్థమైపోగలవంటారా? "శాపమంత్రాదుల శక్తిచే మనస్సు, బుద్ధి, జ్ఞానేంద్రియములు మూఢావస్థ చెందగలవు" అని అనేక సందర్భములలో నిరూపించబడినట్లు నేను వినియున్నానే?★ స్వామీ! వాయువు-దాని చలనము, నువ్వులు-నూనె, అగ్ని-ఉష్ణము వేరువేరైనవి కావు కదా! అట్లే ఈ మనస్సు-శరీరము ఒక్కటే కదా! ఎందుకంటే "మనస్సును అనుసరించే ఉపాధి ఉంటుంది" అని మీరు కూడా ఇప్పుడు చెప్పియున్నారు. కాబట్టి ఈ శరీరము మనస్సు యొక్క రూపమే. వర - శాపాదులు మనస్సును ప్రభావితం చేయలేకపోతే, ఇక దేహమును కూడా ఏమీ చెయ్యలేకపోవటమే జరగాలి. కాని అహల్య, కృత్రిమ ఇంద్రుల భౌతిక దేహములు శాపము యొక్క ప్రభావం చేత నేల కూలి, వారిద్దరూ మరణించారు కదా! ఎందుచేత?

పోనీ, మీరు అంటున్నట్లు, "ఈ దేహము వాస్తవము కాదు. అది చిత్తముయొక్క కల్పన మాత్రమే" అనే అనుకుందాం. "ఎండమావులవలె, రెండవ చంద్రునివలె ఈ దేహము వ్యర్థముగా అవాస్తవత్వముతో కూడి కనబడుతోంది. అయినప్పటికీ కూడా, ఈ దేహము, మనస్సులలో "ఒకటి నశిస్తే, రెండవది కూడా నశిస్తోంది" ... అనునదే లౌకిక దృష్టికి తెలియవస్తోంది. రెండూ సమాన సత్తయే కలిగి ఉంటున్నాయి. మనస్సు నశించినప్పుడు అట్టివాని శరీరం మాత్రం ఉంటుందా? నశిస్తుందనే నా ఉద్దేశం. మరి ఇక, శరీరము నశించినప్పుడు కూడా మనస్సు నశించవలసియే ఉంటుంది కదా?

వరశాపాదులచే శరీరము నశించినప్పుడు కూడా మనస్సు నశించదంటారా ఏమిటి?

శాపాదులవలన మనస్సు ఎందుకు ప్రభావితం కాకుండా ఉండగలుగు చున్నది? శరీరము మాత్రమే ఎందుకు ప్రభావితమౌతోంది?

ఈ విషయాలన్నీ మరికొంత వివరించి చెప్పండి.

★ "శాపము మనస్సుపై పనిచేస్తుంది" అని నిరూపించే కొన్ని ఇతిహాస సంఘటనలు ఉన్నాయి. నహుషుడు శాపవశం చేత సర్పము అయ్యాడు. అట్లు సర్పంగా మారి, తన వంశమునకు సంబంధించిన వారు, తనకు ప్రియాతి ప్రియులు అయి ఉన్న భీముడు మొదలైనవారిని బాధించాడు.

కొందరు ధర్మాత్ములు కూడా శాపవశం చేత పిశాచజన్మలు ఎత్తి తమ జాతివారగు మానవులనే భక్షించినట్లు కొన్ని కథలు చెప్పుచూ ఉంటాయి. అవన్నీ దృష్టిలో పెట్టుకొని మహర్షి బ్రహ్మదేవుని ఇట్లు ప్రశ్నించుచున్నారు.

శ్రీ బ్రహ్మదేవుడు : కుమారా! శుద్ధమైనట్టి శుభకర్మల చేత, పురుష ప్రయత్నముచేత ఈ జగత్తులో పొందరాని వస్తువంటూ ఏదీ లేదు. ప్రయత్నము చేతనే ఎవ్వరైనా ఏదైనా అధిరోహించగలరు, వహించగలరు, నిరోధించగలరు.

ఈ ప్రపంచంలో బ్రహ్మ నుండి ఒక పురుగు వరకు దేహధారులైనట్టి ప్రాణికోట్లన్నిటికీ రెండు శరీరములు ఏర్పడి ఉంటున్నాయి.

1) మాంసనిర్మితమగు ఈ 'భౌతిక దేహము'

2) సర్వకార్యములకు కారణమగుచు, సదా స్థిరమై ఉండి ఉంటునట్టి 'మనస్సు'

"మాంసదేహము" : అందరికీ కనబడుతూనే ఉంటుంది కదా! ఇది సకల విధములైన శాపముల చేతను, శస్త్రములచేతను, క్షుద్రవిద్యలచేతను బాధింపబడగలదు. ఈ పాంచభౌతికదేహము జడము. స్వయముగా ఏదీ నిర్వర్తించలేదు. కాబట్టి అత్యంత అసమర్థము. అతి దీనమైనది. తామరాకుపై నీటి బిందువు వలె అతిచంచలము కూడా. ఇది ఏ క్షణమైనను వినాశనం కావచ్చు. ప్రారబ్ధకర్మల చేత, రాజదండనము చేత, వాయువు – జలము – క్రియలు మొదలైన ప్రకృతి పదార్థములచేత ఎదుర్కొనబడుతూ ఉంటుంది.

"మనస్సు" : ఇది ఇతరుల భౌతిక దృష్టికి కనబడేది కాదు. ఈ మనస్సు స్వతంత్రమైనదీ – అస్వతంత్రమైనదీ కూడా! ఎవ్వరైతే పురుష ప్రయత్నమును ఆశ్రయిస్తూ, నిత్యము ధైర్యమును అవలంబిస్తూ ఉంటారో ... అట్టివారి మనస్సు దుఃఖమును పొందకుండా ఉంటుంది. జీవుని యొక్క ఈ మనోమయదేహము, ఏ విధమైనయత్నము ఇతడు చేస్తాడో, ఆ విధమైన ఫలములను పొందుతూ ఉంటుంది.

మాంసమయ దేహము తనంతటగా ఏ ప్రయత్నం చేయలేదు. దేనినీ సాధించలేదు. ఏదైనా సరే, మనోమయ దేహము క్రియావంతమగుచున్నప్పుడే అంతా ఫలవంతమవటం జరుగుతోంది. ఈ మనస్సు కనుక ఎల్లప్పుడు పవిత్రమైన దానినే చింతించటం, ధ్యానించటం జరుగుతూ ఉంటే, మాంసమయదేహమునందలి మార్పుచేర్పులు ఆ చింతనను ఏమీ చెయ్యలేవు. "ఒకడు ఒకదానికొరకు ఎంతటి తీవ్రేచ్ఛతో భావన–సంకల్పము –ప్రయత్నములను గావించుచున్నాడు?" అనునదే ప్రయోజనం యొక్క సరళిని నిర్ణయిస్తోంది. ఈ మాంసమయదేహము అగ్నియందు పడుగాక! మట్టిలో కలిసిపోవుగాక! లేక అనేక నామరూపములతో విజృంభించుగాక! ఏది ఏమైనప్పటికీ ... "మనస్సు దేనినైతే దీక్షతో చింతించుచున్నదో, అద్దానినే ఈ జీవుడు పొందుచున్నాడు" అని గ్రహించు.

ఈ భౌతికదేహము స్వయముగా ఏమాత్రం క్రియాకారకము కాదని అనుకొన్నాముకదా! అయినప్పటికీ పురుషప్రయత్నం అధికంగా సిద్ధించుచున్నప్పుడు ఇది కూడా నిర్విఘ్నంగా కొన్ని ఫలములను కలుగజేస్తూ ఉంటుంది. ఒక గొప్ప 'ముని' లో కనిపించే ముఖవర్చస్సు, ప్రశాంతచిత్తుని చూడగానే మనకు కనిపించే ప్రశాంత – ప్రజ్ఞ – ఆనందములు ఇట్టివే. పురుష ప్రయత్నము మనస్సు యొక్క రూపమే అయిఉన్నది. అనగా అట్టి ఫలములన్నీ "మనస్సే మనస్సుకు అట్టి

ఫలమును కలుగజేస్తోంది" అనియే గ్రహించాలి కాని "పాంచభౌతికమైన ఉపాధి అట్లు కొందరిని ప్రభావితం చేస్తోంది" అని భ్రమించటం ఉచితంకాదు. పురుష ప్రయత్నంచేతనే కృత్రిమేంద్రుడు తన యొక్క "మనస్సు"ను "అహల్యామయం"గా చేసివేశాడు. అట్లు మనస్సు అహల్యనే మననం చేస్తూ ఉండటం చేత భౌతికదేహము ఎంత బాధింపబడుచున్నప్పటికీ అతడు ఆ బాధను పొందనేలేదు. ఇట్లు "భౌతికదేహం బాధింపబడటం – కాని మనస్సులు ఆ బాధను పొందకపోవటం" అనే చమత్కారం అనేక గాథలలో నీవు వినే ఉంటావు. ఉదాహరణకు మాండవ్య మహర్షి ఒకసారి తన మనస్సును తీవ్రమైన తపస్సులో వినియోగించాడు. కొందరు దొంగలు రాజభటుల దృష్టినుండి తప్పించుకొని ఆ మహర్షి ఆశ్రమంలో ప్రవేశించి తలదాచుకొన్నారు. భటులు ఆ ఆశ్రమంలో ప్రవేశించి మహర్షిని చూచి "ఇతడు కపటముని వేషం ధరించిన దొంగల నాయకుడే అయిఉంటాడు" అని తలచి, అతనిని బంధించి, తీసుకుపోయి, రాజాజ్ఞపై 'కొరత'* వేశారు. కాని అతడు కొంచెము కూడా బాధ అనుభవించనేలేదు. ఎందుచేత? మనస్సు తపస్సునందు లగ్నమైనప్పుడు శారీరకశ్రమ బాధగా అనుభవమునకు రాలేదు కాబట్టి ! ఆ విధంగా బాధ దృష్టికి రాకపోవడం ప్రతిరోజు ప్రతిఒక్కరికీ అనుభవమయ్యే విషయమే. ధ్యాన నిష్ఠ కూడా ఉత్తమ పురుష ప్రయత్నము చేత మాత్రమే సాధ్యం కదా!

ఇలా, మానసికప్రవృత్తి ప్రభావం గురించి ఎన్నో దృష్టాంతాలు ఉన్నాయి. మరొక సంఘటన చెపుతాను. విను. 'దీర్ఘతపుడు' అనే మహర్షి ఒకసారి ఒక యజ్ఞం చేయతలపెట్టాడు. యజ్ఞసామాగ్రి కొరకై ఒకరాజును ఆశ్రయించాలని బయలుదేరాడు. అట్లా నడచిపోతూ ఉండగా త్రోవలో విధివశాత్తూ ఒక నూతిలో పడిపోయాడు. ఆ నూతినుండి తనంతటతానే బయటకు వచ్చుటకు ఏమాత్రం వీలు కాలేదు. అతని మనస్సు మాత్రం "నేను లోకమునకు శుభం కలుగజేయగల ఈ యజ్ఞం చెయ్యాలి" అనునట్టి బలవత్తరమైన సంకల్పము కలిగి ఉన్నది. అప్పుడు ఆ నూతిలోనే ఊహతో, లేక, మనస్సుతో మహాయజ్ఞం ప్రారంభించాడు. ఋత్విక్కులను ఆహ్వానించాడు. అగ్నిగుండమును సంకల్పించాడు. సశాస్త్రీయంగా అంతా నిర్వర్తించాడు. అప్పుడు ఇంద్రుడు ప్రసన్నుడై ఆ నూతి నుండి దీర్ఘతపుని బైటకుచేర్చి, తన ఇంద్రపదవిని సమర్పించాడు. చూచావా? వసిష్ఠా! ఇక్కడ మనస్సుచే చేసిన పురుషప్రయత్నం శరీరం పాల్గొనకపోయినప్పటికీ ఉత్తమ ప్రయోజనం ప్రాప్తింపజేసింది. ఇంతకు ముందు మనం ఐందవుల గురించి చెప్పుకొన్నాం. వాళ్ళు సామాన్య మానవులే కదా! ఐతే ఏం?పురుష ప్రయత్నంచే మనోబలం (చిత్తైకాగ్రత) సంపాదించారు. మనోబలం చేత బ్రహ్మపదప్రాప్తిని పొందారు. వారినిప్పుడు ఆ స్థానం నుండి తొలగించటం నా వల్ల కూడా కాదు కదా! ఆ విధంగానే, ఈ దేవత లలో, మానవులలో, జంతువులలో, తదితర పాతాళ జీవులలో కొంతమంది తమ యొక్క చిత్తైకాగ్రత్త మరియు, "జ్ఞాన, ఉపాసనలు" ఏమాత్రం త్యజించకుండా ఉంటున్నారు కూడా. నాయనా! ధ్యేయ వస్తువు (The aspect aimed at as the goal) నందు ఏకాగ్రచిత్తము కలిగి ఉంటే అట్టి చిత్తమును

---

* కొరత : పదునైన శూలమునకు శరీరమును నిలువుగా గ్రుచ్చటం.

శారీరక, మానసిక వ్యాధులుగాని, శాపములుగాని, విద్రోహచర్యలు గాని, పాప స్వభావులగు రాక్షసుల ప్రయత్నములు గాని విరమింపజేయలేవు. బండశిలను కమలము ఛేదించగలదా?

కొందరు శాపమును పొందినప్పుడు (నహుషుడు మొదలైనవారు) ఆయా శాపములచే నిర్ణయించ బడిన నూతన శరీరాలు పొందటం, జ్ఞానప్రాప్తి విషయంలో అసమర్థులై ఉండటం జరుగుచున్నమాట నిజమే. దానికి కారణం చిత్తము యొక్క అదృఢత్వమే సుమా! "నేను చచ్చాను. ఇప్పుడు నేను ఒక పామును అయ్యాను" అనునట్టి భ్రమాత్మకమైన అనుభవం ఒక జీవుడు పొందటానికి కారణం ... ఈ శరీరమును ఎంతో నమ్మికతో గాంచుటచేతనే. అనగా "నేను ఈ శరీరమును" అను భావనయే అట్టి దౌర్భాగ్యమునకు దారితీస్తోంది. అది కూడా చిత్తము యొక్క అశుభములకు దారితీయు ప్రయత్న రూపమే.

❖❖❖

9. సావధానులై ఉండండి!

సావధానచిత్తులైనవారు ఈ ప్రపంచమునందు జాగృత దశయందు గాని, స్వప్నమునందుగాని ఎట్టి దోషముల చేత కూడా పీడింపబడజాలరు. అసావధానచిత్తులే ఎప్పటికప్పుడు రాగ ద్వేషముల చేత, సుఖదుఃఖముల చేత, మాన అవమానముల చేత తాడనం పొందుచున్నారు. ఆ ద్వంద్వముల ప్రభావం చేత అనేక క్లేశములు అనుభవిస్తున్నారు. 'సంసారము' అని శాస్త్రములచే చెప్పబడుచున్నది ఏమిటి? ఈ జీవుడు నిజరూపమగు ఆత్మ విషయమై అసావధానచిత్తుడై ఉండుటయే సుమా! ఓ సర్వజనులారా! మీరు పురుష ప్రయత్నమునే ఆశ్రయించండి. మనస్సును మనస్సుచేతనే పవిత్రమార్గంలో నియోగించండి.

మనసైవ మనస్తస్మా త్పౌరుషేణ పుమానిహ ।
స్వకమేవ స్వకేనైవ యోజయే త్పావనే పథి ॥ (సర్గ : 92; శ్లో. 28.)

అంతేగాని, "నేను ఈ శరీరమును. ఒకప్పుడు పుట్టుచున్నాను. మరొకప్పుడు చచ్చుచున్నాను. ఇవన్నీ నావి. వీరు నా వారు" అని పలుకుచు మీమీ చిత్తములను అల్పత్వమువైపు నియోగించకండి. 'అజ్ఞానము' అనే చీకటినూతిలోకి మిమ్ములను మీరే త్రోసివేసుకోకండి.

ఓ మునీంద్రా! ఈ చిత్తమునందు ఏ వస్తువు స్ఫురిస్తే అది రూఢిపడి క్రమంగా స్థూలత్వమును పొందుచున్నది. క్రమంగా అదియే అతనికి సత్యముగా తోచుచున్నది. తల్లి తన బిడ్డ మొరాయిస్తూ అల్లరిచేస్తున్నప్పుడు. "ఓయీ! అల్లరి మాను. లేదా, అటువైపు ఆ చీకట్లోకి చూడు. అక్కడ ఒక బూచి ఉన్నది.... కనిపిస్తోంది కదా! ఆ బూచిని పిలుస్తాను. ఆపై నీ ఇష్టం" అని, అంటూ ఉంటుంది. ఆ వాక్యములు ఆ బాలుని చిత్తమునందు ప్రవేశిస్తాయి. రూఢిపడతాయి. అప్పుడు అతనికి ఆ చీకట్లో నిజంగా 'బూచి' అనునదేదో కించిత్ కదలికలతో కనిపిస్తూ ఉంటుంది. మనస్సే అట్లు కల్పనచేసుకొని కనులతో చూస్తోంది.

ఈ మనస్సు ఆయా పురుష ప్రయత్నములచే ఎప్పటికప్పుడు యితః పూర్వపువాసనలను త్యజించివేస్తూ, నూతన - దృఢ వాసనల ప్రాబల్యంచేత నూతన రూపములుగా అగుచున్నది. ప్రవహించటం ప్రారంభించిన జలం ఒక క్షణంలో తరంగరూపం చెందుతోంది కదా! ఈ మనస్సు కూడా క్రొత్త క్రొత్త దృఢభావనలచే వెంటవెంటనే ధ్యేయ వస్తురూపమును పొందగలదు. అందుకే మానవుడు మనస్సును ఉత్తమభావనలవైపే నడిపించాలి.

దృఢభావనకు మహత్తరమైన శక్తి ఉన్నది. దృఢభావనచే మనస్సు సూర్యబింబమునందు కూడా అంధకారమును గాంచగలదు. ఓ కుమారా! సర్వము భావనామయమే సుమా! ఈ మనస్సు దేనిని భావిస్తే అద్దానినే శీఘ్రంగా పొందుచున్నది. అట్లు పొందినదానిని హర్ష విషాదములతో అనుభవించుచున్నది. "కర్తయగు మనస్సే భోక్త కూడా అగుచున్నది" అని మేము గ్రహిస్తున్న నిత్య సత్యమును ప్రకటిస్తున్నాము. దృఢభావనచే ఈ చిత్తము చంద్రుని యందు కూడా అనేక అగ్ని జ్వాలలు గాంచుచు, ఉష్ణత్వమును అనుభవించగలదు. దగ్ధమై, పరితాపం కూడా పొందగలదు. ఈ చిత్తము తన భావము చేత రాతినేలలో జలానుభవము పొంది ఆ జలమును త్రాగి తృప్తిగా నాట్యం చెయ్యగలదు. తన కల్పన చేతనే ఆకాశంలో గొప్ప వనమును దర్శించి ఆ వనంలో సంచరిస్తూ పుష్పాలను, ఫలములను కోయటం, వృక్షములను పెంచటం, నరకటం కూడా చెయ్యగలదు.

ఇట్లు మనస్సే బంధము, మనస్సే మోక్షము. మనస్సు తాను కల్పించిన ఇంద్రజాలమును తానే వీక్షించుచున్నది. జీవుని యొక్క జగద్దర్శనమంతా అట్టిదే సుమా!

❖

కాబట్టి ఓ వసిష్ఠ-విశ్వామిత్రులారా! సర్వ జనులారా! "ఈ జగత్తు సత్తు కాదు! అసత్తు కాదు." అనియే భావించండి. మీమీ ఉత్తమ ప్రయత్నములచే .... పలువిధములైన కల్పనలతో కూడిన ఈ పరిచ్ఛిన్నదృష్టిని క్రమక్రమంగా త్యజించండి.

"సర్వగామి, అఖండము, అద్వితీయము అయిఉన్నట్టి ఆత్మతత్వమునే 'నేను'. ఈ నా చిత్తముయొక్క స్వరూపము కూడా ఆ చిదాకాశతత్త్వమే"

అని భావించి, సర్వకల్పనలను త్యజించి, సుఖరూపులు అగుదురుగాక!

❖❖❖

శ్రీవసిష్ఠ - రామచంద్రుల పరిశీలన

10. చిత్ర - విచిత్ర భ్రమలు - సమ్యక్‌దర్శనము

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నా తండ్రి బ్రహ్మదేవుడు ఆ సందర్భంలో నాకు, ఈ విశ్వామిత్ర మహర్షికి, తదితర మునివర్యులకు ఏమేమి చెప్పియున్నారో ... ఆ విషయాలు నీకు చెప్పాను. ఈ మనస్సు గురించి నా దృష్టిలో ఉన్నట్టి మరికొన్ని విషయాలు నీ ముందు ఉంచుతాను. విను.

❖

బ్రహ్మము సర్వదా అనిర్వచనీయము. వాక్కుకు అతీతము. అట్టి అనిర్దేశ్య తత్త్వమగు బ్రహ్మము నుండి మొట్టమొదట సర్వ వ్యాపకమగు అవ్యాకృతము ఉదయించింది. అది కాలక్రమంగా సంకల్ప వికల్పరూపమగు మనన శక్తిచే కొంత స్థూలత్వమును చెంది "మనస్సు" అగుచున్నది. ఆ మనస్సు ఒకానొకప్పుడు సూక్ష్మ భూత కల్పనతో కూడి ఉంటోంది. అప్పుడు అద్దానినుండి తేజోరూపమగు "సమష్ఠి లింగ శరీరాభిమాని" అయినట్టి "పురుషుడు" (పురుషకారమే స్వభావముగా గల తత్త్వము) ఉదయిస్తున్నాడు. అట్టి సమష్టిసృష్టి - అభిమానిని, 'బ్రహ్మ' అని, 'హిరణ్యగర్భుడు' అని, 'స్వయంభువు' అని - లక్షణములను దృష్టిలో పెట్టుకొని శాస్త్రములు వర్ణిస్తున్నాయి. ఈ సమష్ఠియగు ఆ బ్రహ్మ మనోరూపుడు మాత్రమే కదా! కనుక, మనోరూపమే జగత్తునకు కర్త అయి ఉన్నది.

మననతత్త్వమే ఆకారముగా గల భగవంతుడు బ్రహ్మదేవుడు 'సంకల్పరూపుడు' అయిఉన్నాడు. అతడు దేనిని ఎట్లు సంకల్పిస్తాడో, దానిని వెంటనే అట్లే దర్శిస్తూ, మరియు పొందుతూ ఉంటాడు. అతడు "సంకల్పసిద్ధి" కలవాడు. అతడు తనయొక్క సంకల్పశక్తి ప్రభావంచేత అవిద్యను* కల్పించినాడు.

అట్టి అవిద్యాకల్పన చేతనే బ్రహ్మదేవుడు ఈ పర్వత - తృణ - సముద్రయుక్తమగు జగత్తును సృజించారు. చిత్తమే స్వరూపముగా గల బ్రహ్మ నుండే సృష్టి జనించుచున్నది.

కాని కొందరు, "జడములగు పరమాణువుల చేతనే ఈ సృష్టి ఏర్పడినది" అని వాదిస్తున్నారు.

పరమాత్మ భగవంతుడు - జగత్తు .... వేరు వేరు సిద్ధాంతములు

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ జగత్తు గురించిన వేరువేరు సిద్ధాంతములు ప్రవచించబడుచున్నాయి కదా! వాటి గురించి సంగ్రహంగా చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ఆయా వాదములలో కొన్నిటిని ఇక్కడ వివరిస్తాను.

1) పరమాణు వాదము : "జడములైన వేరు వేరు పరమాణువులే ఈ సృష్టి. పరమాణువులు తప్పిస్తే, ఇక ఎక్కడా ఏదీ లేదు. భగవంతుడు అనబడునదేదీ ఎక్కడా లేదు."

---

* అవిద్య = అనాత్మయందు ఆత్మాభిమానము కలుగజేయునది.

మనకు ఇది ఉత్కృష్టమైన సత్యమును ప్రసాదించగలుగుటలేదు. ఎందుచేతనంటావా? ఈ వస్తుజాలములన్నీ అనేక స్వరూప - స్వభావములు కలిగి ఉంటున్నాయి కదా! ఇంద్రియములకు వస్తువులకు ఒకానొక సానుకూల్యత ఎట్లా ఏర్పడుతోంది? ఈ పరమాణువులు ఇన్ని రకములుగా ఒనగూడవలసినదిగా శాసించుచున్నదెవరు? నాలుక-ఉప్పులందు ఆ సమన్వయమును కల్పించి, రుచి యొక్క అనుభవమును పొందింపచేస్తున్నదేది? కర్తయే లేకపోతే, ఈ సూర్య-చంద్ర-నక్షత్ర-భూమి-వృక్షాది చమత్కారమైన వస్తువులతో కూడిన ఈ జగన్నిర్మాణము ఎట్లా సిద్ధిస్తోంది?

2) ప్రధాన కారణ వాదము : ఈ వాదము ప్రతిపాదించు ద్రష్టలు "సర్వమునకు పరమాత్మయే కర్త" అని చెప్పుచున్నారు. అయితే "భగవంతుడు అసంగుడు. ఉదాసీనుడు. కార్య-కారణములకు అతీతుడు" అని సామవేదాదులు శ్లాఘిస్తున్నాయి. ఆయనకు ఈ సృష్టి కార్యము నిర్వర్తించుటవలన కలిగే ప్రయోజనం ఏమి ఉంటుంది? సర్వ ప్రయోజనములకు అతీతుడై, సాక్షీభూతుడైయున్న పరమాత్మ తత్త్వమునకు ఈ "జగత్ కర్తృత్వం" (Intention of designing th world) ఎట్లా ఆపాదిస్తాం? కనుక ప్రధాన కారణ వాదము కూడా సరిపోదనే మేము భావిస్తున్నాం.

3) విజ్ఞానకారణ వాదము : వీరు "భగవంతుడే ఈ జగత్తురూపమున వివర్తం పొందుచున్నాడు" అని చెప్పుచున్నారు. అయితే, చైతన్య స్వరూపుడగు భగవంతుడు జడరూపమును ఎట్లా పొందుతాడు? అందుచేత, ఈ విజ్ఞానవాదము కూడా అత్యుత్తమ సత్యము ప్రకటించలేదని అనిపించుచున్నది.

4) శూన్యవాదము : "శూన్యమునుండే ఈ జగత్తు వచ్చుచున్నది. కొంతకాలానికి శూన్యమునందే లయించపోబోవుచున్నది" అని వీరు చెప్పుచున్నారు. అయితే "శూన్యం నుండి పదార్థములు ఎట్లా ఎవరి కారణంగా ఎందుకు ఉత్పన్నములు అవుచున్నాయి?" ఈ ప్రశ్నకు సమాధానం లభించటం లేదు.

ఈ విధంగా, ఈ వాదములన్నీ ప్రకటించబడ్డాయి.

ఇక, ఈ విషయంలో మరొక అభిప్రాయం కూడా చెపుతాను, విను.

ఈ సృష్టి యథార్థానికి ఉత్పన్నమే అయి ఉండలేదు.

చైతన్యమే, అనిర్వచనీయమగు మాయాశక్తిచే, "నేను జీవుడను" అను సంకల్పమును స్వీకరించి తనయందు దీనినంతా ఇట్లు తానే గాంచుచున్నది. (తద్భావయ - తద్విశతే)! కనుక ద్రష్ట - దృశ్యములు 'అద్వితీయ చైతన్యము'నకు వేరైనవి కావు.

సముద్రములోని తరంగములవలె ఈ త్రిలోకములందలి పదార్థజాలమంతా .... స్వసంకల్పమే స్వరూపముగా గల సమష్టి మనోరూపము చేతనే ఉత్పన్నమగుచున్నది, భావించబడుచున్నది, అనుభవించబడుచున్నది. కనుక ఇదంతా భావనామయమే. సమష్టి మనోరూపప్రజ్ఞ కలిగినట్టి 'సమష్టి-అహంకారి'ని 'బ్రహ్మదేవుడు' అని పిలుస్తున్నాం.

❖

చైతన్యమే సమష్టి మనోరూపమున పదార్థ జాలమంతా సంకల్పించి దర్శించుచున్నది. చైతన్యము సంకల్పించనట్టి దానికి అస్థిత్వమే లేదు. కనుక, "ఈ జగత్తు ఉత్పత్తి కాకయే ఉన్నది" అని నిశ్చయించ

బడుతోంది. బ్రహ్మము యొక్క 'చిత్‌శక్తి'యే "సమష్టి అహంకారోపాధి యందు ప్రవేశించుచున్నాను" అను కల్పన చేయుచు హిరణ్యగర్భుని (బ్రహ్మదేవుని) పొందుచున్నది. వ్యష్టి-సమష్టి అహంకార ఉపాధులలోని చిదాభాస శక్తులు సర్వశక్తివంతమగు బ్రహ్మముకంటే వేరేమీ కాదు. అనగా, ప్రతి వ్యక్తీ బ్రహ్మమే అయిఉన్నాడు. కాని అజ్ఞానముచే "నేను జీవుడను. నేను శరీరధారిని. పరిమితుడను" .... ఇట్లు అనేక విధములుగా భ్రమించుచున్నాడు. 'అవిచారణ' (Non enquiry) ఉన్నంతవరకు ఈ భ్రమ ఉంటూనే ఉంటుంది.

సూర్యుని నుండి వేలాది కిరణములు బయలుదేరుచున్నాయి. అయితే ఆ వివిధ కిరణములన్నీ సూర్యుని నుండి వేరైనవా? కావు కదా! అదేవిధంగా, బ్రహ్మదేవునియొక్క వివర్తభావము పొందిన వివిధ శక్తులే ఇట్లు అనేక జీవుల వలె ప్రకటితం అగుచున్నాయి. ప్రతి ఒక్క కిరణము వేరువేరైన వస్తువులపై ప్రసరించవచ్చుగాక ! కాని, అనేక సూర్యకిరణములలో ఏకత్వమే సత్యము కదా! బ్రహ్మదేవుడు, అతని నుండి ప్రసరించుచున్న ఈ వ్యష్టిజీవులు .... వీరంతా చైతన్యముకంటే వేరైన వారు కారు. సమష్టి జీవుని సంకల్పము సుదృఢం అగుచున్న సమయంలోనే ఈ జగత్తు ఆవిర్భవించు చున్నది. సమష్టి జీవుడే వివిధ జీవులుగా అయి, ఈ జగత్తును అనుభవించుచున్నాడు.

ఇందలి ప్రతిజీవి సమష్టిజీవుని తత్త్వమే అయి ఉన్నది.

సమష్టిజీవుడు బ్రహ్మముకంటే వేరు కాదు. వ్యష్టి జీవుడు కూడా బ్రహ్మమే.

ఈ జీవులంతా 'చిదాకాశము' నుండే బయలుదేరియున్నారు. అట్లు బయలుదేరి మాయాకాశ మందలి పంచభూతమాత్రమగు ఉపాధులతో కలయుచున్నారు. "అన్నివేళలందూ వీరంతా చిదాకాశ స్వరూపులే" అని వేదవాక్యములు ప్రకటిస్తున్నాయి కదా! వీరు "వాసనలు, కర్మలు" అనుసరించి స్థావర జంగమ రూపాలను పొందుచున్నారు. ప్రాణశక్తి ద్వారా వీర్య-రక్తాది రూపమున బీజత్వమును పొందుచున్నారు. అయినప్పటికీ తమయొక్క చిదాకాశత్వమును త్యజించుట లేదు. అట్లు బీజత్వము పొంది, యోనిమండలమునుండి వారు ఈ జగత్తున ఉత్పన్నమగుచున్నారు. కాకతాళీయ న్యాయముచే సంభవించిన వాసనాజాలమును అనుసరించి తమ తమ కర్మఫలములను అనుభవించుచున్నారు. శుభాశుభవాసనలతో కూడుకొని "పుణ్య-పాపకర్మలు" అనే త్రాడుచే కట్టబడి లింగశరీరాలను ధరించుచున్నారు. ఒకప్పుడు ఉత్తమలోకములకు, మరొకప్పుడు నరకలోకములకు పోవుచున్నారు.

❖❖❖

11. ఇచ్ఛారూపములు

ఈ ప్రాణులన్నీ ఇచ్ఛారూపములే అయి ఉన్నవి సుమా! అనగా 'చిత్తశక్తి' తన ఇచ్ఛను అనుసరించే ఈ ఏకానేక రూపములను ధరించుచున్నది. ఈ జీవులు తాము గాఢముగా కోరుకొన్నట్టి ఉపాధులను భావాభావములను పొందుచున్నారు.* రామచంద్రా! మరొక చెప్పుచున్నాను. విను.

* కామమయయేవాయమ్ పురుషః = ఈ జీవుడు ఇష్టమే స్వరూపముగా కలిగియున్నాడు -శ్రుతి

ఆయా జీవులు తమ ఇచ్ఛను అనుసరించే అసంఖ్యాకములగు జన్మలు పొందుచున్నారు. సంసారములోని చమత్కృతులన్నీ మరల మరల అనుభవిస్తున్నారు. వాసనలను అనుసరించి వర్తిం చుచూ 'కర్మ' అనే వాయువీచికలచే ఒకచోటినుండి మరొకచోటికి ఎగురగొట్టబడుచు సంచరిస్తున్నారు. ఒకానొక జన్మయందు ఈ జీవుడు యాదృచ్ఛికంగా "నేను ఉపాధిమాత్రుడనుగాను. ఈ కార్య-కారణములకు (Cause & effect) సంబంధించినవాడను కూడా కాను; కార్య-కారణరహితమగు ఆత్మయే నేను" అనునట్టి ఆత్మజ్ఞానమును సముపార్జించుచున్నాడు. అట్టి ఆత్మ జ్ఞానము యొక్క ప్రభావం చేత 'ముక్తుడు' అగుచున్నాడు. ఈ జన్మ, కర్మ, దృశ్యాదులను తన ఆత్మ యొక్క జడంశముగా ఆస్వాదిస్తూ ఆత్మత్వమును పుణికి పుచ్చుకొని ఉంటున్నాడు.

మరికొందరు జీవులు తమ స్వస్వరూపమే అయి ఉన్నట్టి చిద్వస్తువును ఎరుగుటలేదు. అజ్ఞానముచే మోహితులై అనేక కల్పముల పర్యంతము ఈ ప్రపంచములో జన్మిస్తూనే ఉన్నారు. ఇంకా కొందరు శుభజన్మలను అనుభవించినవారై, ఈ జన్మలో కూడా శుభకర్మపరాయణులై ఉంటున్నారు. అట్టి శుభకర్మపరాయణులు కొద్ది జన్మలలో ముక్తిని పొందగలరు. సముద్రంలో ఆవిరి రూపమున లేచిన జలము ఎప్పటికో సముద్రమే జేరుచున్నది కదా! ఈ జీవులంతా ఒకానొ కప్పుడు తమ స్వస్వరూప స్థితినుండి చ్యుతిపొంది ఈ సంసారారణ్యంలో అశాంతిగా, అవిశ్రాంతిగా సంచరిస్తూ ఉన్నారు. తత్త్వజ్ఞానము పొందనంతవరకు ఆ సంచారము కొనసాగుతూనే ఉంటుంది. ఉత్తమం, ప్రశాంతం అయిన మోక్ష స్థితియే సర్వజీవులలోని అంతర్లీనమై ఉంటున్న ఆర్తి సుమా!

ఓ దశరథవరపుత్రా! రామచంద్రా! ఈ విధంగా జీవులందరి ఉత్పత్తి బ్రహ్మము నుండే కలుగుచున్నది. బ్రహ్మము ఏమాత్రం మార్పు-చేర్పులు పొందక, యథాతథంగా ఉండియుండగా .... ఈ మనస్సు మాత్రం అనేక ఆవిర్భావ, తిరోభావములను కలిగి ఉంటోంది. క్షణభంగురములైన ఈ జన్మలను చూచుకొని, ఎప్పటికప్పుడు "ఇట్లు ఇప్పుడు ఇక్కడ కనబడుచున్నదంతా ఇట్లే సర్వదా శాశ్వతంగా ఉండబోవుచున్నది" అని భ్రమిస్తోంది. అనేక జన్మలకు కారణమై ప్రవర్తిస్తున్న "వాసనలు" అనువాటిచే వ్యాకులత్వము పొందుతోంది. సంసార జ్వరముచే పీడింపబడుచున్న జనులకు అనేక సంకటములు, అనర్థములు కలుగజేస్తున్నది ఎవరనుకొంటున్నావు? ఈ మనస్సే సుమా! ఇది ద్రష్టను (లేక జీవుని) అనేక దిక్కులందు, అనేక దేశములందు, అనేక కాలములందు సంచరింప జేస్తోంది. చిత్రవిచిత్రములైన భ్రమలను కలుగజేస్తూ, అనేక విక్షేపములతో కూడియున్న ఈ మనస్సును "సమ్యక్జ్ఞానము" (Perception of Unity in Diversity) అనే గండ్రగొడ్డలిచే నరికివేయాలి. అప్పుడు అది ఇక ఈ జగత్తు అనే మహారణ్యంలో మరల ఉత్పన్నము కాదు. సమ్యక్జ్ఞానమే ఈ జీవుని యొక్క సంసారవ్యాధికి దివ్యమైన ఔషధం.

❖❖❖

12. జీవుల విభాగము

ఓ రామచంద్రా! బ్రహ్మవస్తువు సర్వదా అన్నిచోట్ల అభేదరీతిలోనే ఉండిఉంటోంది. కాని, త్రిగుణములతో కూడుకొన్నదై, "సాత్విక-రాజసిక-తామస" గుణభేదములచే ఈ లోకంలో ప్రకటిత మగుచున్నది. అనేక కెరటములవంటి ఈ అనేక జీవులు శాస్త్రములచే విభాగించబడి జ్ఞానాభివృద్ధి కొరకు వర్ణించి చెప్పబడుచున్నారు. అట్టి ఉత్తమ-మధ్యమ జీవుల ఉత్పత్తి గురించి చెపుతాను విను.

ఈ ప్రపంచంలో కనిపించే జీవుల విభాగం

(1) 'ఇదం ప్రథమతా' జన్మ : ఒకానొకడు ఇంతకుముందు కల్పములోని చివరి జన్మయందు తన యొక్క అనేక ప్రయత్నముల సహాయంచేత "శమము – దమము" సంపాదించియే ఉంటాడు. కాని జ్ఞాన విశ్లేషణం వినక పోవటంచేతనో, లేక ఏవైనా బలవత్తరమైన విఘ్నములు కలగటం చేతనో జ్ఞానప్రాప్తిని, స్వస్వరూప అనుభవమును పొంది ఉండడు. ఇప్పుడు ఈ కల్పమునందు జన్మను పొందియుంటాడు. ఇట్టివాడు బాల్యమునుండే శమ – దమాది గుణములు, భక్తి, సాత్విక భావములు కలిగియుంటాడు. కనుక, జ్ఞాన ప్రాప్తికి యోగ్యుడు అగుచున్నాడు. ఇట్టివారిలో కొందరు ప్రవక్తలై తమ బోధామృతంచే అనేకులను అజ్ఞానాంధకారం నుండి కాపాడుతూ ఉంటారు.

అయితే పూర్వకల్పము నందు పూర్ణముగా శుభాభ్యాసము కలిగియున్నవారే ఈ "ఇదం ప్రథమతా" అనే విభాగానికి చెంది యుంటారు. వారు ఈ జన్మ యందో, లేక మరు జన్మ యందో ముక్తికి అర్హులు అగుచూ ఉంటారు.

(2) ఉత్తమ సంపన్నమైన జన్మ (గుణపీవరీ) : వీరు ఇంకా ఇదంప్రథములంతటి తీవ్రవైరాగ్యం పొందియుండరు. పుణ్యలోకముల కొరకై ఉపాసనాదులను మాత్రం ఇంకా చేస్తూ ఉంటారు. వీరు ఇక పది లేక పదిహేను జన్మలలో ముక్తులు అగుటకు క్రమంగా సిద్ధమగుచున్నారు.

(3) స-సత్వులు : వీరు గుణపీవరీల తరువాత తరగతికి చెందినవారు. వీరు పుణ్య పాపములతో కూడుకొనిన మిశ్రమ కర్మలు నిర్వర్తిస్తూ ఆయా సుఖ-దుఃఖములను పొందుచూ ఉన్నారు. కాని "మేము మెల్లమెల్లగా సత్వగుణమును పెంపొందించుకొనెదముగాక" అను ఉత్తమమైన లక్ష్యము, ఆశయము కలిగిఉంటున్నారు. ఉత్తమ కర్మలవైపు ఇంకనూ శ్రద్ధను అభివృద్ధి చేసుకోవలసి ఉన్నది.

వీరు సుమారు వంద జన్మలలో సత్వగుణమును ఆరూఢం చేసుకోగలరు. క్రమంగా ముక్తిని పొందటానికి సిద్ధమౌతున్నారు.

(4) అధమసత్వులు : వీరు విచిత్రములైన ప్రాపంచికవాసనలు కలిగి వ్యవహరిస్తూ ఉంటారు. మలినమైన అంతఃకరణముతో ఆయా సుఖదుఃఖరూపములుగల ఫలముల కొరకై మరల మరల ఆశ్రయించటం, జన్మలు ఎత్తటం చేస్తూ ఉంటారు. వారు తమ "దృష్టి"ని పరిశీలించుకొనే దాకా అట్లు వేలాది జన్మలు ఎత్తుతూనే ఉంటారు. వీరికి అశ్రద్ధ బాగా ఉండి ఉంటుంది. కాని, అధ్యాత్మశాస్త్రం పట్ల (ఆత్మ విషయమై విచారణ పట్ల) విముఖత మాత్రం కలిగి ఉండరు. కనుక, వారు అభివృద్ధి

చెందుటకు అనేక అవకాశములు కలిగియే ఉంటారు. ఏవైనా ఉత్తమ సంఘటనల వలన గాని, కాకతాళీయంగా గురువులబోధ వినుటచేతగాని వీరు ఆత్మజ్ఞానము వైపు సుముఖులు కావటానికి కొంత అంతరంగమునందు సిద్ధపడే ఉంటారు.

(5) అత్యంత తామసీ : వీరు కూడా కొంత వరకు అధమసత్త్వుల లక్షణములే కలిగి ఉంటారు. అయితే వీరు అధ్యాత్మశాస్త్రం పట్ల విముఖత్వము (disliking, Non-accepting) కలిగి ఉంటారు. సర్వదా అనేక సంశయములచే – శాస్త్రము యొక్క, గురువుల యొక్క సామీప్యతను తిరస్కరిస్తూ ఉంటారు. ఎన్నో కల్పములు, వేలకొలది జన్మలు గడచిపోవచ్చుగాక! “ఆత్మవస్తువు” అనే దూరస్త వస్తువు వైపు పయనించే విషయంలో, వీరికి వీరియొక్క సంశయత్వము-ప్రయత్నరాహిత్యములే అడ్డుపడుతూ ఉంటాయి.

(6) రాజసులు : వీరు పూర్వ కల్పమునందలి తమయందు శేషించియున్న వాసనలను అనుసరించి విచిత్ర కర్మాచరణములు కలిగి ఉంటూ ఉంటారు. అనేక మధ్యరకపు (జంతు) జన్మలు ఎత్తుతూ ఉంటారు. అయితే వారిలో “ప్రయత్నము” అను రూపముగల ఆర్తి బయలుదేరింది. అందుచేత వారు కొన్ని జన్మలలో మనుష్యత్వమును గ్రహించి, ఆ తరువాత కర్మానుసారంగా స్వర్గ – నరకములకు వెళ్ళివస్తూ మరి కొన్ని జన్మలు గడుపుతారు. వారు మోక్షప్రాప్తియందు ఏమాత్రం నిశ్చయం ప్రస్తుతానికి కలిగిలేరు.

(7) రాజస – సాత్వికులు : వీరికి ఇప్పుడిప్పుడే వైరాగ్యం కొంచం కొంచెం ఉదయించుచున్నది. సమీపంలోనే ‘జ్ఞానప్రాప్తి’ సిద్ధించు జన్మలను పొందగలరు. మోక్షార్హమైన ఉపాధులను పొందుచు, మోక్షప్రాప్తికి యోగ్యమైన కర్మాచరణం కలవారై ఉంటారు. వీరు కొంత నిశ్చలబుద్ధి గల మోక్ష – యత్నపరులని అనవచ్చు. వీరు ఇప్పటికి ఇంకా పూర్ణమైన ‘లక్ష్యశుద్ధి’ ఏర్పడి ఉండకపోవచ్చు. కాని వారి యందలి ప్రయత్నశీలత్వమే వారి కవచం.

(8) రాజస-రాజసులు : వీరు యక్ష – గంధర్వ యోనులలో ఎక్కువగా పుట్టుచూ ఉంటారు. కొలది జన్మలలో ‘రాజస-సాత్వికత’ను స్వీకరించనున్నారు. అప్పటినుండి ముక్తికొరకై యత్నించగలరు. వర్తమానంలో మాత్రం ‘ముక్తి’ యొక్క శబ్దార్థములు వారికి తెలియవు. వీరు సర్వదా ఏవేవో మానసిక, శారీరక క్రియావ్యవహారములందు నిమగ్నులగుచు, స్వప్నంలోలాగా విజ్ఞాన దృష్టి లేకుండా కాలం గడుపుచున్నారు.

(9) రాజస-తామసులు : వీరు అల్పమైన ప్రయత్నము కలవారు. ఎన్ని వందల జన్మల తరువాతో గాని, వారియందు ‘ప్రయత్నము’ అనునది కొంత వేగం పుంజుకోదు. వీరు ఎప్పటికో ‘రాజస రాజసులు’ ఆపై, రాజస సాత్వికులు కాబోవుచున్నారు. వీరు “అత్యంత తామసీలు” సమానమే.

(10) రాజసాత్యంతామసీలు : వీరు తమస్సుచే ఆవరించబడి కార్యములను చేస్తూ ఉంటారు. ఎన్ని వేల జన్మలు జరుగుచున్నప్పటికీ “నేనేమిటి? నేనెవ్వరు?” అనే విషయం వారి దృష్టిన పడుటయే లేదు.

(11) తామసులు : వీరు ఇప్పటికే అనేక కల్పములందు జన్మించారు. బహుకాలం జరిగిపోయింది. మోక్ష విషయమై ఒకానొక ప్రగాఢ నిద్ర అనుభవిస్తున్నారు. ఎవ్వరేది చెప్పినా వినుటలేదు. వారికి తోచుటలేదు. కాని, వీరిలో కొందరు వర్తమాన జన్మను సార్థకపరచుకొనువారు కూడా లేకపోలేదు సుమా!

(12) తామస-సత్వులు : తామసులై ఉండి, మోక్షప్రాప్తికి యోగ్యమైన కార్యాచరణం ప్రారంభిస్తున్నారు. అట్లు ప్రారంభించి ఉత్తమ పదమును పొందిన ఉదాహరణలు కూడా అనేకం (కర్కటి, ప్రహ్లాదుడు ఇట్టివారే).

(13) తమోరాజసులు : దూరంగా ఎక్కడో మినుకు మినుకుమంటున్న కాంతిని చూచి, అటువైపు వెళ్ళుట గురించి యోచించుచున్నట్లు, ఈ తమోరాజసులు ఇప్పుడిప్పుడే ప్రయత్నశీలురగుచున్నారు. వీరు కొన్ని జన్మలలో అట్లే కొంచము కొంచము ప్రయత్నశీలురగుచు ఉంటారు. ఆ ప్రయత్నముల నుండి విముఖులు కాకపోతే, వీరు తామససత్వులు కాగలరు.

(14) తామస-తామసులు : వీరు ఇప్పటికే అనేకవేల స్థావర జంగమ జన్మలు ఎత్తారు. ఇంకా ఎంతగానో జన్మిస్తూ పోవాలనే దృష్టియే కలిగి ఉంటున్నారు. వీరు ఎప్పటికి ఎట్లు జ్ఞానము వైపు దృష్టి మరల్చుతారో ఎవ్వరం చెప్పలేం. వీరు అత్యంత తామసులు.

లక్షలాది జన్మలు గడచిపోతున్నాయి. 'జ్ఞానం' విషయమై మూఢత్వం ఆవరించి ఉన్నది. మార్పు చేర్పులు లేవు. ప్రగాఢమగు దుఃఖ మోహములు ఆక్రమించివేసి ఉన్నాయి. వారు ఏమాత్రం ముక్తి గురించి వినరు, చూడరు. వారికేమీ తెలియదు. మౌనము, మౌఢ్యము వారి యందు తాండవిస్తున్నాయి. అయితే, వారందరిలో ఎవ్వరైనా-ఏక్షణంలోనైనా నిదురలేచి 'ఆత్మజ్ఞానం' వైపుగా అడుగులు వేయటానికి, నడచి వెళ్ళుటకు సర్వదా 'సంసిద్ధత' అంతరంగమున కలిగియే ఉన్నారు.

అంతా బ్రహ్మమే

ఓ రామచంద్రా! భిన్నభిన్న ఉపాధులు (Physical bodies) గల ఈ జీవజాతులన్నీ బ్రహ్మము నుండే ఉత్పన్నమౌతున్నాయి. బ్రహ్మమునకు వేరైనవి కావు. చలించుచున్న సముద్ర జలంలో అసంఖ్యాకంగా తరంగాలు బయల్వెడలుచున్నాయి కదా! ఆ తరంగములన్నీ జలముకంటే వేరైనవా? కాదు. దీపం నుండి వేలాది కిరణములు ప్రసరిస్తున్నాయి. ఆ కిరణములు దీపం కంటే వేరైన అస్థిత్వం కలిగి ఉంటున్నాయా? లేదు. అట్లే ఆ సర్వవిధ భౌతిక, మానసిక స్థితిగతులతో ప్రకటితమగుచున్న జీవరాసులన్నీ బ్రహ్మముకంటే వేరుకాదు. ప్రజ్వలించుచున్న అగ్నినుండి సన్నటి కాంతి పుంజములు లేచుచున్నట్లు, ఈ ప్రాణికోట్లన్నీ బ్రహ్మమునుండే ప్రభవిస్తున్నాయి. వృక్షం నుండి శాఖల వలె, బంగారము నుండి ఆభరణములవలె, జలము నుండి "జలబిందువులు – ఆవర్తములు-తరంగములు-బుడగలు" వలె, చంద్రబింబము నుండి చంద్రకిరణములవలె, మహాకాశం నుండి ఘటాకాశం వలె .... బ్రహ్మం నుండే ఈ ప్రాణికోట్లు, అవి దర్శించుచున్న దృశ్యములు ఉత్పన్నమవుతున్నాయి.

ఎండమావులలో జలతరంగముల అనుభూతి కలుగుతూ ఉంటుంది. ఆ ఎండమావులు సూర్యకాంతి కన్నా వేరైనదాని మూలంగా ఏర్పడుట లేదుకదా? సూర్యకాంతి ప్రసరించకుంటే ఎండమావులే ఏర్పడేవికావు. ఈ ద్రష్ట బ్రహ్మము యొక్క స్వరూపమే. ద్రష్ట యొక్క దృష్టిని అనుసరించే దృశ్యం ఉంటోంది. మనం ఇప్పుడు చెప్పుకొన్న అనేక విభాగములతో కూడిన జీవజాతులన్నీ ఏ పరమాత్మ నుండి ఆవిర్భవిస్తున్నాయో, ఆ పరమాత్మయందే లీనమౌతున్నాయి.* కొన్ని లేచిన కొద్ది క్షణాలకే లీనమౌతున్నాయి. మరికొన్ని అనేక జన్మల తరువాత ఎప్పటికో లీనమౌతున్నాయి.

ఏది ఏమైనప్పటికీ, జగత్తుకు బ్రహ్మమునకు భేదం లేదు. ఈ రెండిటికీ జల-తరంగముల సంబంధమే దృష్టాంతము. మరి ఈ కనబడుచున్న అనేకత్వము మాట ఏమిటంటావా? ఉపాధులందు ద్రష్ట కలిగియుంటున్న భ్రమాత్మకమైన దృష్టి కారణంగానే ఈ భేద ప్రతీతి అంతా ఏర్పడుతోంది. ఈ జీవజాతులన్నీ ఉపాధిభేదం చేత బ్రహ్మాండములందు అంతటా వ్యవహరిస్తున్నాయి. మరల ఆ సర్వేశ్వరుని యందే లయిస్తున్నాయి. వ్యవహరిస్తున్నట్టి సమయంలో స్వర్గాదులకు పోతున్నాయి. మరల అక్కడి నుండి అధోలోకములైనట్టి నరకాదులకు వెళ్ళుచు, పరిభ్రమిస్తున్నాయి. మాయ యొక్క చమత్కారం అట్టిది. అది అనిర్వచనీయం, అద్భుతం.

అయితే నాయనా! రామచంద్రా! ఇదంతా చూచి నీవు భ్రమించవలసిన పనేమీ లేదు.

ఆ సర్వేశ్వరుని శరణువేడు. సర్వదా సర్వేశ్వరత్వమును ఆరాధించు. ఆ సర్వేశ్వరత్వమునే భావించు.

"ఇదంతా నాదే. నేనే ఈ సర్వమునందు అంతర్లీనంగా ప్రసరించియున్నాను. నేను కానిదంటూ ఎక్కడా ఏదీలేదు".... అను సంభావనను ఆశ్రయించు.

మనస్సులో ఉండే దోషభావనలన్నీ తొలగించుకొని, నిర్మలుడవుకమ్ము.

ఆత్మారాముడవై విరాజిల్లు. ఈ దృశ్యమంతా నీ స్వస్వరూపంగా ఆస్వాదించు.

❖❖❖

13. జీవుల ఉత్పత్తి స్థానము

శ్రీరాముడు : హే సద్గురూ! "బ్రహ్మము నుండే ఈ జీవులు ఉత్పన్నమైనారు" అని చెప్పబడుచున్నది కదా! అట్టి వ్యవహారమును కలుగజేయుచున్న ఫలప్రదాత ఎవ్వరై ఉన్నారు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఒక వృక్షమునుండి ఆ వృక్షము యొక్క పూలు, ఆ పూలలోని సుగంధము - ఆ వృక్షమునకు అభిన్నమైనవే కదా! అట్లే కర్త, ఆ కర్త యొక్క క్రియ ఏకమే అయి ఉంటాయి. ఈ కర్త - క్రియలనబడు రెండూ కూడా పరమపదమైనట్టి బ్రహ్మము నుండే వ్యక్తము

---

* లీనమగుట = ఆత్మభావము నందు సువ్యవస్థమై ఉండుట (లేక) "నేను బ్రహ్మమునే" అను అఖండ - అప్రమేయ-అద్వితీయ-సర్వనియామక-"తత్త్వభావం" అవధరించి ఉండటం.

లవుతున్నాయి. ఇక్కడ చమత్కారం చూచావా? వాస్తవానికి ఏ కల్పనలు ఉండనట్టి నిర్మల- పరబ్రహ్మము నందు అజ్ఞానముచే జీవత్వము స్ఫురించుచున్నది. ఆకాశంలో, 'లేని నీలత్వం' కనిపిస్తోందికదా! ఇది కూడా అట్టిదే.

"ఈ జీవులు బ్రహ్మము నుండి ఉత్పన్నమయ్యారు" అనేదికూడా అసత్యమైన సిద్ధాంతమేనని, అది అజ్ఞానముచేతనే ప్రబలుచున్నదని గ్రహించు. పూర్ణాత్మ జ్ఞానులు ఉండేచోట ఇట్టి భ్రాంతి వాక్యములకు చోటు ఉండదు. ఎందుకంటే ద్వైతకల్పన ఉన్నచోట మాత్రమే, "ఒకదాని నుండి, మరొకటి ఉత్పన్నమగుట" అనే దర్శనము ఏర్పడగలదు. "ద్రష్టయే దృశ్యమును కల్పించి దర్శించుటచే, ద్రష్ట కంటే వేరుగా దృశ్యము లేదు" అను అవగాహనతో కూడిన అద్వైతస్థితియందు విజ్ఞానము సుస్థిరపడినప్పుడు, ఇక ఆపై అట్టి భేదభావనయే ఉండదు.

అయితే గురువులు తమ శిష్యులయందు ఉత్తమోత్తమమైన లక్ష్యము రూపుదిద్దుకొనుటకు వీలుగా ఒకానొక బోధక్రమమును రచించుచూ, "ఇది బ్రహ్మము, వీరు జీవులు. వీరు బ్రహ్మమునుండే బహిర్గతమయ్యారు" అను ద్వైత కల్పనను ప్రతిపాదిస్తున్నారు. ఇదంతా బోధ కలిగించుటకే అయి ఉంది. లోకము నందు గాంచబడేది కూడా ఇట్టి కల్పనాక్రమమే. ఒకవేళ 'అద్వితీయమగు బ్రహ్మము నుండే లేక అసంగుడగు పరమాత్మ నుండే ఈ కనబడేదంతా ఉత్పన్నమౌతోంది" అని చెప్పుకొన్నా, అట్లు ఉత్పన్నమగుటకు ఉపాదానకారణం బ్రహ్మమే (లేక పరమాత్మయే) అయిఉండాలి. ఎందుకంటే పరమాత్మను నియమించునది మరేదీ ఉండజాలదుకదా! కనుక, "ఈ జగత్తు బ్రహ్మము యొక్క రూపమే. ద్రష్ట బ్రహ్మము కంటే వేరైనవాడు కాడు" అని మనకు ఇక్కడ సిద్ధిస్తోంది. ఎందుకంటావా?

"ఉత్పత్తి"కి ముందు ఈ జగత్తు ఎక్కడ ఉన్నది? బ్రహ్మమునందే సంస్కారరూపంలో అణిగియున్నది సుమా! బ్రహ్మము ద్రష్ట-దర్శనములకు ముందే, దేనిచేతనూ తాకబడక, అసంగమైయున్నది. భ్రాంతిచే "ఉత్పత్తి-ఆకారము-భావన-అనుభవము" అను రూపములతో కూడి ఈ జగత్తు ప్రాప్తి స్తోంది. భ్రాంతిచేత బ్రహ్మమే ఇట్లు జగత్తుగా కనిపించటం జరుగుచున్నదని మేము సిద్ధాంతీకరిస్తున్నాం.

❖

అసంఖ్యాకములైన ఈ జీవరాసులన్నీ బ్రహ్మము నుండే ఉత్పన్నమై మరల ఆ పరమపదమగు బ్రహ్మమునందే లయించుచున్నాయి. జలములోనే బుద్బుదములు (Bubbles) లేచి లీనమగు చున్నాయి కదా! త్రికాలము* లందు ఈ జీవరాసుల "సృష్టి-స్థితి-లయలు" అనే ప్రక్రియ ఇట్లే జరుగుచున్నది. అయితే, పురుషునికి, అతని కర్మలకు పుష్ప-గంధముల వలె భేదం లేదు. జలము-జల కదలికల వలె అవి రెండూ పరమాత్మ నుండే ఉత్పన్నమై, తిరిగి పరమాత్మ యందే లయించుచున్నాయి.

శ్రీరాముడు : మునీంద్రా! మనకు ఈ దైత్య-నాగ-మనుష్య-దేవత-జంతు రూపములలో పాంచభౌతిక ఉపాధులు కనిపిస్తున్నాయి కదా! ఇవన్నీ ఎట్లా ఏర్పడుమన్నాయి?

---

* త్రికాలములు = సృష్టి - స్థితి - లయములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మరల మరల ఏర్పడుచున్న పాంచభౌతిక ఉపాధులన్నిటినీ నిర్మించుచున్నది అంతరంగములోని వాసనలే. వాసనలు ప్రియాప్రియ సంకల్పములకు వేరుగా ఏవీ కావు కదా! బాహ్యమునందు ఏర్పడుచున్న ప్రియ-అప్రియములకు మూల కారణం ఆత్మయొక్క విస్మరణమే సుమా! "ఆత్మ యొక్క స్వరూపమును ఏమరిచియుండుట" అనుదానికి వేరుగా జన్మాంతర ఫలదాత ఏదీ లేనేలేదు. "బాహ్యమున ఎక్కడో ఉండి ఎవ్వరో ఏదో చేస్తున్నారు" అనునదంతా వాస్తవం కాదు. ద్రష్ట యొక్క (1) అభిలాష, (2) ఆత్మవిస్మరణ.... ఈ రెండే అంతటికీ కారణమగుచున్నదని గ్రహించు. వాస్తవానికి జన్మలు లేవు, కర్మలు లేవు.

❖❖❖

14. "కర్మలు - ప్రభావములు" ఉన్నాయా? లేవా?

శ్రీరాముడు : మహాత్మా! "జన్మలూ లేవు - కర్మలూ లేవు" అని మీరు అంటున్నప్పుడు, నాకు చాలా సందేహాలు వస్తున్నాయి. రాగరహితులైన పెద్దలచే ఈ లోకమున వేదసమ్మతంగా ధర్మము, వ్రతము మొదలైనవి నిర్ణయించబడినాయికదా! అట్లాగే స్మృతులు, పురాణాలు, కాలకల్పసూత్రములు ప్రవచించే ఇతిహాసములు మొదలైనవి, కూడా ఉన్నాయి. "నాయనలారా! ఇది పుణ్యం. ఇది పాపం. ఇది ఇట్లా చేయండి. అది అట్లు చేయకండి" అని ఆయా విధి-విధానములను శాస్త్రములు జనులకు చెప్పుచున్నాయి.

ఈ ప్రపంచంలో విశుద్ధ సత్వగుణోపేతులు, ధీరులు, చక్కటి సమదృష్టి కలవారు, బ్రహ్మ సాక్షాత్కారము పొందియున్నవారు అగు సాధువులు సంచరిస్తున్నారు. వారి వాక్కులు, వారి ఆచరణలు, వారి శాస్త్రవ్యాఖ్యానములు తత్వజ్ఞానానుభవం లేని అనేకులకు ప్రమాణాలు అవుచున్నాయి. అనుసరణీయమౌతున్నాయి. అట్టి శాస్త్రనియమములు, ఆర్యనిర్ణయములు అనుసరించి అనేక మంది జనులు తమయొక్క ఉచిత - అనుచితములను నిర్ణయించుకొని, అప్పుడు ప్రవర్తిస్తున్నారు. కొందరైతే - "ఇతడు సాధువులు చెప్పిన మార్గంలో నడచుకోవటంలేదు. అందుచేత ఇతనిని మేము బహిష్కరిస్తున్నాం" అని కూడా అంటూ ఉంటారు. సంధ్యావందనము వంటి శిష్టాచారములను అనుసరించని వారికి దుఃఖమే కలుగగలదని లోకప్రతీతి కూడా ఉన్నది.

పైగా మహాత్మా! ఈ "కర్మ-కర్త" అను రెండూ కూడా, ఒకదానిచే మరొకటి కలుగుచున్నవని లోకంలో అంటూ ఉంటారు. శాస్త్రప్రతీతి కూడా అట్లాగే ఉంటోంది. అనగా, "కర్మచేత కర్త ఏర్పడుతుంది. కర్త, కర్మని సిద్ధింపచేస్తోంది. చెట్టు నుండి విత్తు, విత్తునుండి చెట్టు ఏర్పడుచున్నట్లు.... జీవుని వలన కర్మ, ఆ కర్మ వలన జీవుడు ఉనికిని ఏర్పాటు చేసుకొంటున్నారు" అని అర్థం అవుతోంది. మీరు చెప్పుచున్నట్లుగానే, ఈ జీవుడు ఏ వాసన కలిగియుండి ఈ సంసార పంజరంలోనికి త్రోయబడుచున్నాడో అట్టి వాసనలను అనుసరించే ఫలానుభవములను కూడా పొందటం జరుగుతోంది. వాసనలే జన్మకు మూలం. ఆ వాసనలు ఏర్పడుచున్నది ఎక్కడినుండి? కర్మలనుండే కదా!

మహర్షీ! ఇదంతా ఇట్లుండగా, ఇప్పుడు అసలు నా సందేహమేమిటో చెపుతాను. వినండి.

"జన్మకు బీజభూతమైన కర్మ అంటూ ఏదీ లేదు. ఎట్టి కారణం లేకుండానే ఈ జీవులు బ్రహ్మము నుండి ఉత్పన్నమగుచున్నారు" అని మీరు అక్కడక్కడ అంటున్నట్లుగా నాకు అనిపిస్తూ వస్తోంది. ఎందుచేత? కర్మలు అసలు ఉన్నాయా? జన్మలు కలిగేది కర్మ ప్రభావం చేత కాదా? శ్రుతులలోని కొన్ని వాక్యాలు ఉన్నాయి.* ఆ వాక్యములలోని సారమును అనుసరించి దుష్కర్మలు, సుకర్మలు వాటి వాటి ప్రయోజనమును కలిగియే ఉంటాయికదా! మరి, మీరు కర్మల వ్యవహారమే తిరస్కరించి, "ఇచ్ఛ, ఆత్మ విస్మరణలే అంతటికీ కారణం" అంటున్నారేమిటి? 'కర్త', 'కర్మ' – ఈ రెండూ కూడియే ఉత్పన్నమౌతాయికదా! కాబట్టి ఈ జగత్తు జన్మ – కర్మల హేతు – ఫలరూపమే కదా! బ్రహ్మము నందు కర్మల వ్యవహారమే లేదనుకొంటే బ్రహ్మరూపులగు ఈ అనేక విధములైన ద్రష్టలు, (లేక) జీవులంతా కర్తృ – కర్మల వ్యవహారం లేకుండా ఎట్లు జన్మించుచున్నారని అర్థం చేసుకోవాలి?

బ్రహ్మము (ఆ పరమాత్మ) కారణరహితుడు, మాయాసహితుడు అని కదా మీరు అన్నారు! అట్టి బ్రహ్మము నందు 'ఆకాశము' మొదలైన ఈ అనుభవమునకు వచ్చుచున్న పదార్థములు, బ్రహ్మదేవుడు మొదలుగా అనేక స్థూల – సూక్ష్మ ఉపాధులు, ఆయా ఫలానుభవాలు ఎట్లా ఏర్పడుచున్నాయి? కర్మలకంటే వేరైన కారణం ఏముంటుంది? ఈ కనబడేదంతా 'సృష్టి' అను కర్మ రూపఫలమే కదా? ఇదంతా కర్మఫలానుభవమే అయినప్పుడు ఈ జన్మ కర్మల వ్యవహారం తిరస్కరించటమెట్లా చెప్పండి?

ఒకవేళ మీరు "కర్మలు లేవు. కర్మలు నిష్ప్రయోజనమైనవి" అని సిద్ధాంతీకరించటం జరిగితే, అప్పుడు లోకంలో నరకాదులను గూర్చిన భయమే లేకుండాపోతుంది. అప్పుడు లోక సంకరమే ఏర్పడుతుంది. పాపభయం పోతుంది. పాపభయం లేకపోతే లోకంలో "మత్స్యన్యాయం" (చిన్నచేపను పెద్దచేప మింగటం) ప్రవర్తించి, బలవంతుడు బలహీనుణ్ణి హింసిస్తాడు. అప్పుడు సర్వనాశనమే చేకూరగలదు కూడా. స్వామీ! "బ్రహ్మమునందు కర్మలు లేవు. జన్మలకు కర్మ కారణం కాదు" అని అంటున్నప్పుడు మీరు కొంత సందిగ్ధమునే కలుగజేస్తున్నారు. ఓ వేదవరేణ్యా! ముందు నాకీ ప్రశ్నకు సమాధానం ఇవ్వండి.

ఒకనిచే నిర్వర్తించబడిన కర్మలు ఫలవంతము అవుతాయా? కావా? ఈ నా సంశయమును తొలగించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! కర్మల విషయమై మంచి ప్రశ్నే వేశావు. ఈ సమాధానం విను. దీని వలన కొంత విశేషమైన జ్ఞానం కలుగుతుంది.

❖

---

* ఉదా ॥ "సాధుకారీ సాధుభవతి – పాపకారీ పాపోభవతి ॥
"పుణ్యోవై పుణ్యేన కర్మణా భవతి – పాపః పాపేన కర్మణా జాయతే॥"

మనః సంబంధమైన క్రియయే కర్మకు బీజము కదా! ఇట్లు మనస్సుతో చేసిన క్రియకే ఫలితం కూడా లభిస్తూ ఉంటుంది.

ప్రథమ సృష్టి యందు* పరబ్రహ్మము నుండి మనోరూపము ఆవిర్భవించింది. అట్టి ప్రథమసృష్టి సమయంలోనే మనోరూప ఉపాధులచే కలుగుచున్న సమష్టి-వ్యష్టి జీవుల కర్మలు కూడా ప్రకటితం అవుచున్నాయి. అప్పుడే ఈ జీవులు పూర్వ కర్మ వాసనానుసారం దేహములందు అభిమానం కలిగి ఉంటున్నారు. "పుష్పము - దాని సువాసన" వేరువేరు కానట్లే "మనస్సు, కర్మలు" అనబడు రెండూ వేరువేరైనవి కావు. వాటియందు భేదం లేదు. విజ్ఞులైనవారు 'క్రియాస్ఫురణ (tinge of activity)" నే 'కర్మ' అని అంటున్నారు. సంస్కార రూపమగు మనస్సే అట్టి కర్మకు ఆశ్రయం కాబట్టి, కర్మయే మనస్సు. నాయనా! రామా! ఎవ్వడు ఎక్కడైనా ఉండవచ్చు. కర్మయొక్క ఫలితంనుండి మాత్రం తప్పించుకోలేడు. అది ప్రాప్తించియే తీరుతుంది.

❖

"కర్మ" అంటే ఏమిటి? ఈ జన్మ యందు గాని, ఇతఃపూర్వపు జన్మలందు గాని నిర్వర్తింప బడియున్న మనస్సుతో కూడినట్టి పురుషప్రయత్నములే సుమా! అట్టి పురుష ప్రయత్నం ఎన్నటికీ నిష్ప్రయోజనం కాదు.

అవిద్యచే ఉద్భవించిన ఈ మనస్సే క్రియావంతమగుచున్నది. ఈ మనస్సు 'చిదాత్మ' యొక్క ఉపాధియే కదా! కనుక కర్త-భోక్త కూడా ఈ మనస్సే అగుచున్నది. నీవు చెపుతున్నట్లు "చేయబడిన కర్మ ఫలవంతము కాకుండా ఉండుట - చేయబడని కర్మ ఫలించుట" ఈ రెండూ కుదిరే విషయాలే కావు. శాస్త్రప్రమాణములు ఈ విషయమే అనేకచోట్ల నిరూపిస్తున్నాయి. అందుచేత 'మత్స్యన్యాయము' ప్రసక్తే లేదు.

శ్రీరాముడు : అయితే మహర్షీ! ఒక కర్మ, దాని నుండి ఫలితము..... ఆ ఫలితము నుండి మరొక కర్మ.... ఈ విధంగా చర్విత చరణంగా సాగవలసినదేనా? ఈ కర్మల వ్యవహారమునకు నాశనమంటూ లేనే లేదా? ఈ మనస్సు ఎల్లప్పటికీ ఇంతేనా?

శ్రీవసిష్ఠ మహర్షి : 'నలుపుదనము' లేకుండాపోతే అప్పుడిక 'కాటుక' కూడా ఉండదు కదా! అట్లే, కర్మ నశిస్తే, కర్మ రూపమే అయి ఉన్న మనస్సు కూడా స్వయంగా శాంతిస్తుంది.

"నేను అకర్తను" అను అవగాహనయే కర్మనాశనము.

కర్మనాశనమే మనోనాశనము. అట్లే, మనస్సు నశించుటయే కర్మయొక్క సంక్షయము అయి ఉన్నది. అయితే, అట్టి మనోనాశనము ముక్తులకు మాత్రమే కలుగుచున్నది సుమా! "నేను సర్వాత్మకమగు బ్రహ్మమునే" అనునట్టి అనుభూతిపూర్వకమైన ఎరుక గలవాడే, అనుభవపూర్వకమైన ప్రజ్ఞను

---

* ప్రథమసృష్టి : వృత్తిగాని రాగముగాని లేనట్టి చిన్మయస్వరూపుడే ఈ జీవుడు. అట్టి పూర్ణానుభవము నుండి బాహ్యదృష్టిని లేక 'వృత్తి'ని, 'రాగము'ను అవలంబించటం ప్రారంభించుట చేతనే సృష్టి ప్రాప్తిస్తోంది. అట్టి ప్రారంభమే ప్రథమసృష్టి.

సుస్థిరపరచుకొన్నవాడే ముక్తుడు. కనుక ముక్త స్వరూపము పొందిన తరువాత ఇక మనస్సు ఉండదు. మనస్సు లేదు కనుక 'కర్మ' కూడా ఉండదు. బద్ధులైనట్టి అజ్ఞానులకు మాత్రం మనస్సు ఉండియే ఉంటుంది. మనస్సు ఉన్నంతవరకు కర్మలు, ఆ కర్మలకు ఫలితములు ఉండియే తీరుతాయి.

అగ్ని, ఉష్ణత్వములను గమనించావా? ఆ రెండిటిలో ఒకటి క్షీణిస్తే రెండవది కూడా క్షీణిస్తుంది కదా! 'చిత్తము – కర్మలు' అను ఈ రెండింటిలో ఒకటి నశిస్తే, రెండవది కూడా స్వయముగానే నశిస్తోంది. ఈ చిత్తము స్ఫురణ రూపమును పొంది, విహితమైనట్టి – నిషిద్ధమైనట్టి కర్మల (acts which one 'should do' and 'should not do') ద్వారా పుణ్య – పాపముల రూపమున, ధర్మాధర్మముల రూపమున పరిణమించుచున్నది. కర్మ కూడా, దాని ఫలభోగానుసారంగా, 'స్ఫురణ' రూపమును (లేక చలనరూపమును) పొంది 'చిత్తము' అగుచున్నది. వాస్తవానికి ఈ రెండూ ఒక్కటే. అయినాకూడా 'చిత్తము, కర్మ' అను రెండు పేర్లతో లోకంలో వ్యవహరించబడుతోంది. ఇవి రెండు ఒకదానికి మరొకటి కారణమూ, రూపము అగుచున్నవి.

చిత్తరాహిత్యమే మోక్షము. లేక కర్మరాహిత్యమే మోక్షము.

'కర్మరాహిత్యము' అనగా "నిష్క్రియ రూపమైన జడత్వమును ఆశ్రయించుట" అని మాత్రం అర్థం చేసుకోకూడదు సుమా! మరింకేమంటావా?

తననుతాను 'అకర్త'గా తనయందలి అకర్తాతత్త్వమును దర్శించుచున్నవాడు ఆత్మవస్తువుగానే శేషించుచున్నాడు. ఫలితంగా కర్తృత్వమునూ, భోక్తృత్వమునూ అధిగమిస్తున్నాడు.

శాస్త్రములలో అనేకచోట్ల చెప్పబడిన విహిత–నిషిద్ధ కర్మల అంతిమ ప్రయోజనం కర్మరాహిత్యమే లేక చిత్తరాహిత్యమే. అనగా, "నాఽహం కర్తా! నాఽహం భోక్తా!" – నేను కర్తను కాదు భోక్తను కాదు! ....అను రూపముగల ఆత్మ యొక్క ధర్మమును ఈ జీవుడు సంతరించుకొనుటయే ఉత్తమోత్తమ ప్రశాంత స్థానమైయున్నదని సూక్ష్మదృష్టిచే జనులు గ్రహించెదరుగాక! అట్టి ప్రశాంత–మౌన–అంతరంగ స్థితియే 'మోక్షము' అను శబ్దముచే వ్యవహరించబడుతోంది. సర్వం యొక్క అంతర్యామిత్వం స్వభావ సిద్ధంగా అభ్యాసఫలంగా అవధరించువాడు స్వతఃసిద్ధంగా కర్మలకు అతీతుడై వెలుగొందుచున్నాడు.

❖❖❖

15. మనస్సు యొక్క స్వరూపము

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! ఈ మనస్సు యొక్క రూపం భావనయే సుమా! భావించుటయే "మనస్సు కలిగియుండుట" అయి ఉన్నది. భావన చలన స్వభావం కలది. మనస్సు చేతనే ఆయా కర్మలన్నీ నిర్వర్తింపబడుచున్నాయి. క్రియలు సూక్ష్మత్వమును, అదృశ్య రూపత్వమును పొందియున్నప్పుడు అవి అంతరంగంలో సంస్కార రూపమును లేక సూక్ష్మవాసనల రూపమును (Subtle tendencies) పొంది ఉంటున్నాయి. అట్టి సంస్కారములను అనుసరించే భావికాలపు జన్మలు, కర్మలు, ఫలములు జీవులు పొందటం జరుగుతోంది.

శ్రీరాముడు : స్వామీ! మీరు మనస్సు గురించి కొన్ని విషయాలు చెప్పారు. చమత్కారమైన కథలు కూడా వినిపిస్తున్నారు. ఈ మనస్సు దృఢసంకల్పాత్మకమైన రూపం కలిగి ఉంటోందని, జడ – చైతన్యములనే ఉభయ – స్థితులు కలిగి ఉంటోందని నేను గ్రహిస్తున్నాను. ఈ మనస్సు యొక్క స్వరూపమేమిటో దయచేసి మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : అనంతుడు, సర్వశక్తిమంతుడు, మాయావేష్టితుడు అయినట్టి ఆ పరమాత్మ మొట్టమొదట "సంకల్పించుట" అను భావనతోకూడిన క్రియారూపమును స్వీకరించుచున్నారు. అట్టి సంకల్పాత్మకమగు ప్రథమ కల్పన యొక్క స్వరూపమే మనస్సు. అదియే వికల్పాత్మకమైన వ్యవహారములలో సత్ – అసత్ ల రెండిటిమధ్య 'స్మృతి' రూపమున ఉండి ఉంటోంది.

స్మృతి రూపమగు భావనయే "మనస్సు".

చిద్రూపమై, సర్వజ్ఞమై భాసించు ఆత్మయందు "నాऽహమ్‌వేదోస్మి – నేను ఏదో ఎరుగను" అనునట్టి ఒకానొక ప్రతీతి అనిర్వచనీయమైన కారణంగా కలుగుచున్నది. అట్టి ప్రతీతియే "మనస్సు".

అకర్త – అభోక్త అయినట్టి చిదాకాశాత్మయందు "నేను కర్తను" అను వ్యవహారము దేనివలన కలుగుతోందో .... అదే "మనస్సు".

ఓ రాఘవా! ఎక్కడైనా గుణరహితుడైన 'గుణి' ఉంటాడా? 'గుణి' అని అంటేనే "గుణములు కలవాడు" అని అర్థం కదా! ఈ జగత్తునందు స్పందస్వభావముగల కల్పనాత్మకమైన శక్తియే లేకపోతే మనస్సు కూడా ఉండటం సంభవించేదేకాదు. అగ్ని – ఉష్ణములు వేరువేరుగా ఉండటం సంభవిస్తుందా! లేదు కదా! కర్మయుక్తమైన మనస్సులు – మనోయుక్తమైన జీవులు వేరువేరుకాదు. వేర్వేరుగా ఉండజాలరు. ఈ చిత్తము (లేక మనస్సు) "ఫలధర్మిణి" (that which produces fruits of action) అను సంకల్పమునే శరీరంగా కలిగియున్నది. ఇది మాయామయము. కారణరహితము. అనేక విధములైన రచనలతో, కల్పనలతో కూడియున్నది. వాసనాయుతము. అట్టి ఈ చిత్తము జగత్తంతా వ్యాప్తమైయున్నది.

❖

ఎవడు, ఎచట – ఏ రూపమున ఉన్నట్లు కల్పన చేస్తాడో, ఆ కల్పనను అనుసరించి ఫల స్వరూపముగా అట్టి రూపమునే అతడు పొందుచున్నాడు. 'వాసన' అనబడు వృక్షము (The tree of tendency) నకు కర్మయే బీజము అయి ఉన్నది. మనస్సు యొక్క గతియే ఈ శరీరము. (This 'Physical Body' is merely one sequence of 'Thought') చిత్రవిచిత్రములైన ఆయా క్రియలన్నీ వాసనావృక్షము యొక్క శాఖలు. ఆయాఅనుభూతములు అగుచున్న క్రియాఫలములు ఆ వృక్షము యొక్క పండ్లు. అయితే జ్ఞానులగువారు మాత్రం 'అసంగము' (Unattachment) అనే ఒకానొక పదునైన గొడ్డలితో ఈ వాసనావృక్షమును కూకటివ్రేళ్ళతో సహా త్రెంచివేస్తున్నారు.

మనస్సు తాను ఏమి చింతిస్తుందో దానిని అనుసరించే కర్మేంద్రియాలు ఆయా పనులు నిర్వర్తిస్తూ ఉంటాయి. అందుచేత "మనస్సే కర్మ" అని మనం నిర్ణయిస్తున్నాం. స్వస్వరూపమును

మరచిన "అపరిచ్ఛిన్న – చిదేకరూపుడు" అగు పరబ్రహ్మము కాకతాళీయ యోగముచేత, అకస్మాత్తుగా ఒక సమయంలో బాహ్య విషయములవైపు ఉన్ముఖమగుచున్నది. అట్లు ఉన్ముఖమగుచున్న 'చిత్‌శక్తి'నే ఆయా స్థితిగతులను అనుసరించి అనేక పేర్లతో శాస్త్రకారులచే పిలువబడటం జరుగుతోంది.

శుద్ధ చైతన్యమునందు బోధ కొరకు రకరకాల పర్యాయపదములు కల్పించబడ్డాయి. శుద్ధ చైతన్యము ఏ బాహ్యకారణముగాని, ఉపాదానముగాని లేకుండానే, అకారణంగా ఒకానొకప్పుడు అవిద్యచే కలుషితమైనట్లు ఉంటోంది. అప్పుడు "స్ఫురణ" (జ్ఞాపకము) యొక్క రూపము కలిగి, వికల్పములచే అనేక రూపములను పొందుచున్నట్లు భావించుచున్నది. "వృత్తులు ఎట్లా రూఢి పడుచున్నాయి?" అనే విషయం నీవు గ్రహించటానికి వీలుగా ఈ యోగవాసిష్ఠమునందు, తదితర ఆధ్మాత్మ శాస్త్రములందు ఉపయోగించబడిన కొన్ని పదజాలములను చెపుతాను, విను–

1) మనస్సు : "స్ఫురణ"ను మూలముగా కలిగియున్న భావన. 'భావించుట' అను స్వభావము.

2) బుద్ధి : పదార్థముల "ముందు వెనుక" లను పరిశీలించటం. "ఈ వస్తువు (లేక విషయము, లేక వ్యవహారము లేక వ్యక్తి) ఇట్టిది" అను విశేషమును గ్రహించగలుగునట్టి సామర్థ్యము.

3) అహంకారము : మిథ్యయే అయినట్టి ఈ దేహము పట్ల "నేనీ దేహమును, ఈ దేహమునందు మాత్రమే ఉన్నాను. దేహ పరిమితుడను. తదితరులు కూడా దేహమాత్రులే" అనునట్టి దేహాభిమానము కలిగి, అట్టి "పరిమితసత్త" ను స్వయంగా ఆశ్రయించునప్పుడు, ఆ స్వభావమే అహంకారము. "నేను–నేను–నాది–నాది" అను రూపముగల అహంకారమే సర్వ అనర్థములకు హేతువు అగుచున్నది. అందుచేతనే దీనిని 'బంధహేతువు' అంటూ ఉంటారు.

4) చిత్తము : తగినంతగా విచారణ చేయకుండానే ఒక విషయమును స్వీకరిస్తూ, మరొక విషయమును త్యజిస్తూ ఉండే "నిలకడలేనితనము".

5) కర్మ : చైతన్యం స్పందము (చలనం)ను ముఖ్యధర్మముగా కలిగి ఉంటోంది. అట్టి స్పందము ఏర్పడుచున్న సమయంలో, అసద్వస్తువు సత్యమైనదానివలె గోచరిస్తూ ఉంటుంది. "నేను కర్తనగు చున్నాను". అను భావన పొందిన చైతన్యం శరీర, అవయవాదులను ఒకచోటి నుండి మరొక చోటికి కదల్చుటకు ఆయత్తమగుచున్నది. ఆయా ఇంద్రియములను నియమించుటకు ఆలోచనల – భావనల రూపమున ప్రవృత్తమగుచున్నది. అట్టి ప్రవృత్త వ్యవహారమునే 'కర్మ' అంటున్నాం.

6) కల్పన : చైతన్యము ఆకస్మికంగా (కాకతాళీయంగా) తనయొక్క స్వస్వరూపమునకు సంబంధించిన పూర్ణభావనను త్యజించి, తాను అభిలషించిన పరిచ్ఛిన్న భావమును, లేక, 'నేను అసంపూర్ణమును అను వెలితిని కల్పించుకొనుచున్నది. అప్పుడు ఆ చిద్వస్తువే "కల్పన" అనే పేరుతో పిలువబడుతోంది.

'కల్పారంభం – కల్పాంతము' అనునవి ద్రష్ట యొక్క "కల్పనా వ్యవహారం స్వీకరించుట – సర్వకల్పనలు త్యజించుట"ను అనుసరించే ఉంటున్నాయి.

7) సంసృతి : పూర్వము చూచినవి, చూడనివి, మరియు ఇప్పుడు చూస్తున్నవి అగువాటి

గురించి ఏర్పడుచున్న నిశ్చయములచే అంతఃకరణము చేష్టితం (flexible) అగుచున్నది. దృశ్యముతో ఏర్పడుచున్న సుఖ-దుఃఖ సమన్వితమైన సంబంధమే "సంసృతి".

8) వాసన : చైతన్యము తాను అనుభవించిన మరియు భావించిన పదార్థములను సూక్ష్మశక్తుల భావనారూపమును కలిగి ఉంటోంది. అట్లు సూక్ష్మమై, సూక్ష్మచేష్టా సహితమై ఉండునప్పటి ఆ చైతన్యమే 'వాసన' అని పిలువబడుతోంది.

9) విద్య : ఒకానొకప్పుడు ఈ చైతన్యమే - "శుద్ధమగు ఆత్మతత్త్వమొక్కటే సత్యమైనది. ఈ ద్వైత దృష్టి అవిద్య చేతనే కలుగుచున్నది. యథార్థానికి ఈ దృశ్యప్రతీతి అంతా మూడువేళల సత్యము కానేకాదు" అనునట్టి జ్ఞాన రూపమున ప్రకాశించుచున్నది. అప్పుడు ఆ సంవిదాత్మనే 'విద్య' అనే పేరుతో పిలుస్తున్నారు.

10) ప్రయత్నము : ఈ చైతన్యము క్రియాశీలత్వం పొందటమే ప్రయత్నం. అట్టి అనేక ప్రయత్నములలో కొన్ని ఆత్మను మరపించేవి, మరికొన్ని ఆత్మను గుర్తు చేసేవి అయి ఉంటున్నాయి.

11) మలము : తదితరమైన భావన యొక్క "ఆవరణ" ఈ ఆత్మను మరుగుపరచి, విస్మరించేట్లు చేస్తోంది. అట్టి ఆవరణ శక్తి ప్రాధాన్యము (over-covering) వలన ఈ ఆత్మయందు ఆరోపించ బడునదంతా 'మలము' అనే శబ్దముచే వ్యవహరింపబడుతోంది.

12) విస్మృతి : మిథ్యారూపమైన ఆయా వికల్పములచే అనేక రకములైన ఆలోచనలకు సంబంధించిన విక్షేపములు (perturbances) ఏర్పడుచున్నాయి. చైతన్యము యొక్క 'విక్షేప శక్తి' ప్రాధాన్యమే విస్మృతి.

13) ఇంద్రియములు : మనోరూపమును సంతరించుకొన్న చైతన్యము - వినుచూ, చూచుచూ, స్పృశించుచూ, ఆస్వాదించుచూ, వాసన చూచుచూ, సంకల్పించుచూ - ఉంటోంది. ఇట్లు ఆయా ఇంద్రియములచే భోగానుభవకార్యములను నిర్వహిస్తోంది. తద్వారా ఈ జీవత్వము పొందిన 'ఇంద్రుడు' అను పేరుతో చెప్పబడు ఈశ్వరుని తృప్తిపరచుచున్నాయి కనుక, వాటిని 'ఇంద్రియములు' అంటున్నాం.

14) ప్రకృతి : పరమాత్మ ఇంద్రియాలకు ఎదురుగా కనబడేవాడు, గాంచబడేవాడు కాదు. అనగా దృశ్య దృష్టిచే అతడు అలక్షితుడు (one who cannot be experienced by 'sences')" అయి ఉన్నాడు. అట్టి పరమాత్మయందు, అతని కంటే ఏమాత్రం వేరు కానట్టి కర్తృత్వరూపము ఏర్పడుతోంది. ఇది నీటి యందు తరంగములు ఏర్పడుటవంటిదే. "నేను కర్తనగుచున్నాను" అను కర్తృత్వ రూపము కారణముగా ఏర్పడుచున్నదే 'ప్రకృతి'.

15) మాయ : శుద్ధ చైతన్యమునందు ఒకానొక విస్మరణ ఏర్పడుచున్నది. ఆ విస్మరణ .... సత్యమగు ఆత్మను మిథ్యగాను, మిథ్యారూపమైన ఈ జగత్తును, ఇందలి అనుభవములను అత్యంత దృఢమైన సత్యముగాను దోపింపచేయుచున్నది. సత్యాసత్యముల వికల్పమునకు హేతువగుచున్న చైతన్యము యొక్క స్వభావమే "మాయ".

16) క్రియ : వినటం, చూడటం, ఆఘ్రాణించటం, రుచిచూడటం, స్పర్శ వంటి ఆయా కర్మలచే చైతన్యం లోకమునందు కార్యకారణరూపత్వము పొందుచున్నది. అదే 'క్రియ' అనబడుతోంది.

❖

ఓ రామా ! ఒక విషయం గమనిస్తున్నావా? ఇవన్నీ చైతన్యము యొక్క రూపాంతరములే. చైతన్యం విషయోన్ముఖమైనప్పుడు అవిద్యచే మలినమగుచున్నది. స్ఫురణ రూపదర్శనాన్ని పొందుతోంది. చైతన్యమే స్వయముగా చిత్తము యొక్క రూపము స్వీకరిస్తోంది, తద్ద్వారా సంసార బంధమున తగుల్కొనుచున్నది. అట్టి త్రోవలో రూఢిపడినదై, మనం చెప్పుకొంటున్న అనేక పేర్లకు తగుచున్నది.

చైతన్యము తనకు తానే "నేను అజ్ఞానిని, బద్ధుడను, ఈ దేహపరిమితుడను" అనునట్టి దోషముతోకూడిన భావనను, అనుభవ సిద్ధిని పొందుచున్నది. ఇంద్రియానుభవములపట్ల గల ఆసక్తిచే ఏర్పడిన ద్వైతవాసనా కళంకమును "తన స్వభావమే" అయినట్లు ఆపాదించుకొంటోంది. అవిచారణ వశంచేత పూర్ణమగు తన స్వస్వరూపము నుండి 'చ్యుతి' (displacement) పొందుచున్నది. చూచావా, ఎప్పుడైతే చైతన్యము వివిధ కల్పనలతో గూడిన జడమగు ఈ దేహాదులవైపు అభిముఖం అగుచున్నదో అప్పుడు ఆ చిద్వస్తువునే 'జీవుడు' అని, 'మనస్సు' అని, 'చిత్తము' అని, 'బుద్ధి' అని .... ఇట్లు అనేక విధములైన శబ్దములతో చెప్పుకుంటున్నాం.

పరమాత్మ పదము నుండి తొలగి, అవిద్యచే కళంకితమైన ఈ చైతన్యమే.... ఆయా ప్రకటిత మగుచున్న వృత్తులను అనుసరించి .... ఆయా పేర్లతో శాస్త్రకారులచే పిలువబడుతోందని గ్రహించు.

❖❖❖

16. మనస్సు జడమా? చేతనమా?

శ్రీ రాముడు : గురువర్యా! మునీంద్రా! ఇంతకీ ఈ 'మనస్సు' అనునది జడమా? చేతనమా? ఈ విషయం ఇంకా నాకు బోధపడనేలేదు.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మనస్సు చిత్ - అచిత్ రూపమైయున్నది. అనగా, ఇది జడముకాదు. చేతనము కాదు. చైతన్యమే సంసార దశ యందు ఉపాధి దోషంతో కూడుకొని ఉన్నప్పుడు 'మనస్సు' అని పిలువబడుతోంది. అనగా, చైతన్యమునకు వేరుగా 'మనస్సు' అనబడునది ఏదీ లేదు. 'ఆలోచన' అనునది ఆలోచించువానికి వేరుగా ఉంటుందా? ఉండదు కదా!

"మనస్సు సత్-అసత్తులకు విలక్షణమై ఉంటోంది" అని చెప్పబడుతోంది. ఈ మనస్సే జగత్తు అనబడు అనుభవమునకు కారణభూతమై ఉంటోంది. కాని మనస్సునకు పరమాత్మ కారణం కాదు సుమా! ఉపాధి భేదం చేత భిన్నభిన్నంగా కనబడేటట్లు చేస్తున్నది ఈ మనస్సే. అవిద్యచే కళంకితమైన చైతన్యమే మనస్సు లేక, చిత్తము. ఆత్మను గూర్చిన నిశ్చయత్వము లేకపోయినప్పుడు కలుగు స్థితియే 'చిత్తము' అని చెప్పబడుతోంది. చిత్తము చేతనే ఈ జగత్తు అను రచన సాగించబడుతోందని గ్రహించువాడు ఆత్మ యొక్క స్వభావమును పొందుటకు అర్హుడగుచున్నాడు.

మనస్సును – "మలినోపాధిని పొందినట్టి చైతన్యము యొక్క జడ – చేతనముల మధ్యగా స్వీయకల్పితమైన చంచలరూపమే" అని కూడా అనవచ్చు.

చిద్వస్తువు మలినోపాధితో సంబంధం ఏర్పరచుకొనుచున్నప్పుడు (నాచే గాంచబడు చున్న ఈ దృశ్యములో అంతర్గతమైయున్న ఈ శరీరమే 'నేను' అను భ్రమ పొందినప్పుడు), అట్టి సంబంధముచే చంచల భావయుక్తమగుచున్నది. అయితే ఆవరణరాహిత్యము దృష్ట్యా చూచినప్పుడు అన్నివేళల దోషరహితంగాను, కళంక వర్జితంగానే ఉండిఉంటోంది కూడా! అందుచేత మనస్సు జడమూ కాదు, చేతనమూ కాదు. ఈ మనస్సుకే అహంకారము, బుద్ధి, జీవుడు మొదలైన చిత్రవిచిత్రములైన పేర్లు ఉన్నాయి. ఒకే నటుడు అనేక వేషములు ధరించి, నాటకమాడుచున్న సమయంలో అనేక పేర్లతో ప్రేక్షకులచే గాంచబడతాడు చూచావా? ఈ మనస్సే క్రియా భేదంచే అనేక పేర్లు కలిగియున్నది.

ఈ చిత్తం యొక్క వివిధ సంజ్ఞల గురించి మనం చెప్పుకొన్నాం కదా! దీనినే భిన్న అభిప్రాయాలు కలవారు కల్పనా భేదంచేత అనేక రీతులుగా చెప్పటం జరుగుతోంది. అనేక తర్క– వితర్కములచే ఏర్పడుచున్న అభిమతములను అనుసరించి, కొందరు 'అణుత్వము, ద్రవత్వము' మొదలైన ధర్మములను మనస్సుకు ఆపాదిస్తున్నారు. తమ బుద్ధి ప్రసరణమును అనుసరించి మనో–బుద్ధి–ఇంద్రియములకు సంజ్ఞాభేదములను ఇస్తూ, వారు చిత్రవిచిత్రములైన రీతులుగా దర్శించుచున్నారు. ఈ మనస్సును కొందరు 'జడమైనది' అంటున్నారు. మరికొందరి అభిప్రాయానుసారం – ఇది జీవునికన్న భిన్నమైనది. అలాగా 'అహంకారం, బుద్ధి'ల గురించి కూడా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్పటం జరుగుతోంది.*

ఇక మా అభిప్రాయమేమిటో చెపుతాను విను.

❖

---

* నైయాయికులు *(గౌతమ మహర్షి)* : అహంకారం ఒకానొక ద్రవ్యవిశేషం. ఈ జీవుడు అహంకారమునకు భర్త వంటివాడు. మనస్సు అణుస్వరూపమైనది. ఇక బుద్ధి, అంతఃకరణం – ఆత్మకు సంబంధించినవి. ఆత్మ సాక్షాత్కారమైన తరువాత బుద్ధి, అంతఃకరణాలు ఉండియే ఉంటాయి. కాని మనస్సు, అహంకారాలు మాత్రం త్యజించబడతాయి.

సాంఖ్యులు (కపిలముని) : "బుద్ధి" అనేది ప్రకృతి చేస్తున్న పనే. సత్వ–రజ–తమోగుణముల ప్రదర్శనమే ప్రకృతి. బుద్ధియే మహతత్త్వము. బుద్ధిని మించినదేదీ ఎక్కడా లేదు. బుద్ధిని అనుసరించే అంతా ఉంటోంది. మనస్సు పదకొండు ఇంద్రియముల అంతర్గతమై ఉన్నట్టిది.

చార్వాకులు (చార్వాకుడు) : బుద్ధి ఈ శరీరమునకు అంతర్గతమయ్యే ఉంటోంది. అది శరీరము యొక్క ధర్మం అయి ఉన్నది. చైతన్యము కూడా శరీరము యొక్క గుణము లేక లక్షణము మాత్రమే. అహంకారరూపముననే 'ఆత్మ' అని చెప్పబడేది ఉన్నది. అయితే, అది శరీరముతో వస్తుంది. శరీరంతో పోతుంది. పూర్వాపరవిచారము చేయునది మనస్సు. అట్టి ఈ మనస్సును సంతసింపచేయుటయే బుద్ధియొక్క ధర్మము.

పంచరాత్రులు : 'వాసుదేవుడు' అను పేరుగల పరమాత్మ నుండి 'సంకర్షణుడు' అను పేరుగల జీవుడు కలిగాడు. ఆ సంకర్షణుడే అహంకారము. వాని నుండి 'ప్రద్యుమ్నుడు' అను మనస్సు, 'అనిరుద్ధుడు' అనే బుద్ధి ఏర్పడుచున్నాయి. సర్వము వాసుదేవమయమే. మిగతాదంతా మాయయే.

వైశేషికులు : 'అహంకారము' అనేది కూడా ఒకానొక ద్రవ్యవిశేషమే. ఇక ఈ 'బుద్ధి' ఐదు వికల్పములచే ఐదు విధములుగా ఉంటోంది. అవి – స్మృతి, ప్రత్యక్షము, అనుభవము, తర్కము, విపర్యము. అహంకామునకు కర్త జీవుడు. అహంకారమును దాటినప్పుడు శేషించునదే పరమాత్మ స్థానము.

అహంకారం, మనస్సు, బుద్ధి మొదలైనవన్నీ సంకల్పవృత్తి భేదంచేత వేరువేరుగా పిలువబడు చున్నప్పటికీ, అంతఃకరణము యొక్క ఏకత్వముచే అవన్నీ ఒకరూపమే అయి ఉన్నాయి. సంకల్పించు వాని నుండి సంకల్పము వేరుకాదు కదా! చూచువాని నుండి చూపువేరా? అందుచేత చైతన్యమే

అహంకరించునపుడు – అహంకారము,

నిర్ణయించునపుడు – బుద్ధి

మననము చేయునపుడు – మనస్సు

అంతేగాని 'అహంకారము', 'మనస్సు', 'బుద్ధి' .... అనునవేవీ విడిగా ఏమాత్రం లేనేలేవు. కర్తకు వేరుగా క్రియలు ఎక్కడుంటాయి? సూర్యుని నుండి సూర్యకిరణములు వేరా? అయితే, ... అట్లు అహంకరించుటకు ముందు .... చైతన్యము ఉండిఉన్నది. భావించుటకు ముందే భావించు వాడు ఉండనే ఉన్నాడు కదా! అట్టి 'అహమ్' అను భావనాక్రియ 'జరుగుచున్నప్పుడు –త్యజించునపుడు' .... ఏర్పడి ఉండేది, శేషించేదీ ఆ చైతన్యమే. అహంకారమునకు అతీతమైన దృష్టితో పరికించి చూస్తే "సర్వము చైతన్యమయమే" అని తెలియవస్తుంది.

అఖండమగు చైతన్యము 'నేను ఖండితుడను" అని భావించుటయే.... అహంకరించుట అయి ఉన్నది.

ఈ మనోబుద్ధి చిత్త అహంకారముల గురించి వేరు వేరు ఆచార్యులు వేరు వేరు కల్పనలతో తమ శిష్యులకు బోధించటం జరిగింది. వేరు వేరు కాలములందు బయలుదేరిన బాటసారులు దూరంగా ఉన్న ఒకే నగరమును ఆకారాదులకు సంబంధించిన వివిధ అవగాహనలతో వివిధ రీతులుగా దర్శిస్తూ ఉంటారు కదా! అట్లే వేరువేరు గురువులు తమ శిష్యులను తీర్చిదిద్దటానికి వేరు వేరు సిద్ధాంతాలు ప్రతిపాదించియున్నారు. వారంతా వారి వారి బుద్ధి యొక్క అనుభవమును బట్టి, శిష్యుల యొక్క అవగాహనా సామర్థ్యమును అనుసరించి–తమ యొక్క తపోఫలితంగా తాము గ్రహించింది నిర్ణయించి ప్రజలకు చెప్పటం జరుగుతోంది.

అట్టి వారిలో కొందరు ఆత్మపథమును అధిష్ఠించుటకు ప్రయత్నించుచున్నారు. మరికొందరు పరమార్థమగు బ్రహ్మతత్వమును అధిష్ఠించక పోవుటచే కొంత అపరిపక్వతతో కూడిన అవగాహన కలిగి ఉంటున్నారు. ఇక వారివారి శిష్యులలో కొందరు అపూర్ణమగు అవగాహనచేత, గురువుల ఉద్దేశము ఏమిటో సరిగ్గా గ్రహించకుండా, "మీ సిద్ధాంతములన్నీ తప్పు. మా సిద్ధాంతమే సరి అయినది" అనునట్టి కాలయాపనకు, రాగద్వేషములకు దారితీయగల వాదోపవాదములందు నిమగ్నులగుచున్నారు.

వాస్తవమేమిటో గ్రహించిన తరువాత .... "ఆయాదూరముల నుండి ఆత్మవస్తువు దర్శించినపుడు, అట్లు తోచుచున్నది. ఆత్మ వాస్తవానికి అనిర్వచనీయమైనది. అద్దానిని వాక్కుగాని, మనస్సుగాని ప్రకటించలేవు. ద్రష్ట యొక్క స్వస్వరూపము నుండి అది వేరుకాదు. అందరు అదియే అయి ఉండి, అటే పయనిస్తున్నారు. శ్రద్ధను బట్టి మనస్సులో దోషములు తొలగుచున్నాయి. నిర్మలమైన మనస్సుకు

పరమాత్మ స్వయముగా, సుస్పష్టముగా అంతర్-హృదయేశ్వరుడై ప్రకటితమగుచున్నాడు" - అని తెలియవస్తోంది. సత్యమేదో గ్రహించినవాడు ఇక వాదోపవాదములు నిష్ప్రయోజనమని, కాలయాపన యేనని తెలుసుకొంటున్నాడు. "సర్వము లయించగా, ఇక అప్పటికీ శేషించి, విస్తరిల్లియుండే నాయొక్క స్వరూపమే ఇదంతా" - అని గ్రహించుచున్నాడు. తనయొక్క వాస్తవ స్వస్వరూపం గురించి మరొకరు సిద్ధాంతీకరించి చెప్పవలసిన అగత్యం ఇక కనిపించదు.

❖

అనేకులు వేరువేరైనట్టి "దేశ-కాల-దృష్టులు" యొక్క ప్రభావంచేత కొన్ని విధినియమములకు సంబంధించిన ఆచార-అవగాహనల భేదం కలిగి ఉంటున్నారు. అట్టి వారిలో కొందరు, "ఈ మార్గమే ఉత్తమమైనది" అని ప్రశంసిస్తూ పరులను దూషిస్తూ ఉంటున్నారు. అట్టివారిలో మరికొందరు "ఫలేచ్ఛ"చే అట్టి ఫలమునకు సాధన భూతమగు కర్మయందే ఆసక్తిగల చిత్తులు అగుచున్నారు. గురువుల వాక్యములలోని జ్ఞానసారాన్ని తిరస్కరిస్తూ కేవలం బాహ్య ఆచారవ్యవహారములకు పరిమితులై అనేక భేదదృష్టులకు లోనగుచున్నారు. "సర్వం ఖల్విదం బ్రహ్మ .... ప్రతి ఒక్కడు బ్రహ్మమే అయిఉన్నాడు" వంటి ఉపనిషత్ ప్రమాణ వాక్యములను ఏమరచుచున్నారు.

కర్మలు, విధి-విధానములు అనేక రీతులుగా ఉంటేఉండనీ. ఆత్మవిచారణ విషయంలో అనేక గురువుల అభిప్రాయాలు ముముక్షువు తప్పక గ్రహించవచ్చును. ఇందులో తప్పేముంటుంది? అయితే, మానవుడు మనోనైర్మల్యము కొరకు ప్రయత్నించాలి, గ్రహించాలి, వినాలి. అనేకత్వములో అంతర్లీనమై జాజ్జ్వల్యమానంగా ప్రకాశిస్తున్న ఏకత్వము యొక్క అనుభూతిని పొందుటకు ఉద్యుక్తుడు కావాలి. అంతేగాని, "ఇది ఇంతవరకే. ఇక మేమేదీ వినం, గ్రహించం" అనునట్టి వ్యర్థమగు పలుకులతో, విచిత్రయుక్తులతో కల్పితవచనములతో ఆత్మకు భిన్నత్వము ఆపాదించుట ఉచితము కాదని మా అభిప్రాయం.

❖

స్నానము, దానము మొదలైన క్రియలు చేసేవాడు ఆ క్రియలను ఏ విధమైన కర్తృత్వముతో చేస్తాడో, అతని మనస్సు అట్లే విషయములను పొందుచున్నది.

ఈ క్రియలన్నీ - నన్ను పవిత్రుణ్ణి చేయగలవు - పుణ్యవంతుని చేయగలవు- పరిశుభ్ర పరచగలవు - ధనికునిగా చేయగలవు - జ్ఞానినిగా చేయగలవు - అందగానిగా చేయగలవు.

.... ఈ విధాలుగా ఎవడు ఏ విధమైన భావనచేస్తే అతడు ఆతీరుగానే పొందగలడు. మరి, మనస్సు యొక్క వైచిత్ర్యము అట్టిది. మనస్సు దేనిని ఎట్లు భావిస్తే అది అట్లే సత్యమై ప్రాప్తిస్తోంది. వేరువేరు ఆచార్యులు "అహంకారము-మనస్సు-బుద్ధి-పరమాత్మల"ల గురించి చెప్పిన సమాచారం కూడా వారివారి శిష్యులకు అట్లే సత్యమై తోచుచున్నది.

❖

ఒకడు వేరువేరు సమయ - సందర్భములలో వేరువేరు కార్యక్రమములందు నిమగ్నమై ఉన్నాడనుకో... అతడు ఎప్పటికప్పుడు చేస్తున్న పనిని బట్టి "మావటివాడు-సారథి-వ్యవసాయ దారుడు-కుటుంబపు యజమాని-సేవకుడు-మిత్రుడు" .... అని ఆయా సందర్భములలో వేరువేరు జనులచే పిలువబడుచూ ఉండవచ్చు. అయినప్పటికీ, ఆ వ్యక్తి ఆ అన్ని సందర్భములలోననూ "ఒక్కడే" అయి ఉన్నాడు కదా! మనస్సు అన్ని వేళల ఒక్కటే అయిఉంటున్నప్పటికీ, అది నిర్వర్తించే కార్యక్రమములను అనుసరించి, "జీవుడు, వాసన, కర్మ" మొదలైన పేర్లతో పిలువబడుచున్నది.

అయితే ఈ జీవులయందు ఉండి, ఈ సర్వ అనుభవములను పొందుచున్నది చిత్తమే కదా! ఎందుకంటావా? చిత్తరహితుడు ఏదైనా చూస్తున్నప్పటికీ ఏదియు గాంచకయే (గ్రహించకయే) ఉంటున్నాడు. చిత్తసహితుడు, భుజించుట, వాసనచూచుట, తద్వారా సుఖదుఃఖములను పొందుట జరుగుతోంది. ఒకచోట ఉండియున్న రూపములను చూడగలుగుటకు వెలుతురే కారణం అయినట్లు, సమస్త పదార్థములను ఆయావిధములుగా గ్రహించటానికి మనస్సే కారణం. అందుచేత, "బద్ధ చిత్తము" కలవాడు మాత్రమే బంధమును పొందుచున్నాడు. "ముక్త చిత్తము" కలవాడు 'మోక్షభావి' అగుచున్నాడు.

❖

'మనస్సు జడము' అనటం ఎట్లా? అది సంచలనము కలిగి ఉంటోంది కదా! పోనీ 'చేతనము' అని అందామా?


1. అది స్వయముగా చలించలేదు. ఆత్మయొక్క సామీప్యములో మాత్రమే 'చలనము-గతి'లను స్వీకరించగలుగుచున్నది.
2. అది చేతనమే అయి ఉంటే ఇక అద్దానికి జడరూపమైన జ్ఞానమే (పరిమితమైన, ఖండమైన జ్ఞానమే) ఉండేది కాదు.

అందుచేతనే "అది జడము కాదు. చేతనము కాదు" అని మొట్టమొదటే చెప్పాను. అట్టి మనస్సు ఎప్పుడైతే వ్యక్తమవటం జరుగుతుందో, అప్పుడే ఈ జగత్తు కూడా జడ-చేతనములకు విలక్షణమై ఆవిర్భవించుచున్నది.

మనస్సు ఏకరూపమైనప్పుడు (భ్రాంతి రూపమును త్యజించి బ్రహ్మాకారమును పొందినప్పుడు) ఇక ఆ మరుక్షణం ఈ జగత్తు ఇట్లుండదు. అనగా అట్టివాని దృష్టిలో జగత్తు లేనిదే అగుచున్నది. ఇందలి అనేకత్వము, పదార్థత్వము నశించుచున్నది. అనగా, ఈ జడచేతన జగత్తంతా స్వస్వరూపాత్మ యొక్క సంప్రదర్శనా విలాసంగా అనుభూతమవగలదు. అట్లుగాక మనస్సు మలినజలం లాగా కలుషితమైనప్పుడు మనస్సే జగత్తుకు కారణరూపముగా (ఇదంతా ఇట్లు తోచుటకు "కారణము"గా) రూపొందుచున్నది. అట్టి కలుషితమైనట్టి సమష్టిరూప మనస్సు నుండే ఈ కనిపించే జగత్తు అంతా ఉత్పన్నమైయున్నది సుమా!

ఓ రామచంద్రా! దోషదృష్టి, జడదృష్టి తొలగినాయా, అప్పుడు ఈ మనస్సు బ్రహ్మమే అగుచున్నది.

"ఈ మనస్సు జగత్తుకు కారణము" అనటం కూడా అసమంజసమే అని అనిపించుకొంటోంది. పోనీ "బాహ్యపదార్థజాలమే సంసారమునకు కారణము" అందామా? బాహ్యపదార్థమంతా జడ రూపమే కదా! జడమైనది ఒకానొక కర్తృత్వమును ఎట్లా నిర్వర్తించగలదు చెప్పు? అందుచేత "సంసారమునకు దృశ్యమే కారణం" అనటం యుక్తియుక్తం కాదు.



జడ మాత్రమగు మనస్సు సంసారమునకు కారణం కాజాలదు. కనుక "జడము – చైతన్యము" కూడా కానట్టి మనోవిభాగమే పదార్థములకు కూడా కారణమగుచున్నది.

చిత్తము లయిస్తే జగత్తుకూడా లయించుచున్నది. చిత్తములేనివానికి జగత్తే ఉండదు. ఇక్కడ "రహితం కావటం" అనగా "నిర్మలమగుట" అనియే అర్థం. కాలము ఒక్కటే అయి, ఋతుభేదంచే అనేక రూపములు ధరించుచున్నట్లు .... ఒకే మనస్సు వివిధ కర్మలచే (చిత్తము, అహంకారము మొదలైన) వివిధ నామములను ధరిస్తోంది.

శ్రీరాముడు : మునీంద్రా! ఈ జీవునియొక్క అహంకారం, ఇంద్రియాలు, క్రియలు, దేహము మొదలైనవన్నీ .... అనేక సందర్భములలో అతనినే బాధించుచున్నాయి కదా! మరి, 'ఇదంతా మనస్సే అయి ఉన్నది. జీవునియొక్క మనస్సే అతనిని బాధిస్తోంది" అనటం సమంజసమా? కాదేమో? ఈ జీవుని దుఃఖింపజేయటంలో "అహంకారం, ఇంద్రియాలు, క్రియలు, దేహము"ల పాత్ర ఏమిటి ? అవన్నీ మనస్సుకంటే వేరేకదా! మనస్సు యొక్క పాత్ర ఏమిటి?

శ్రీవసిష్ఠమహర్షి : మనస్సుతో సంబంధం లేకుండానే ఈ అహంకారము, ఇంద్రియములు, క్రియలు, దేహములు జీవుని బాధిస్తున్నాయంటావా?....ఊహూ! మనస్సు లేనప్పుడు కూడా అవి ఇతనిని క్షోభింపజేయగలిగితే, అప్పుడు "మనస్సు కంటే అవన్నీ వేరు" అని నేనుకూడా ఒప్పుకుంటాను. కాని అట్లు జరగటంలేదు. కనుక మనస్సు కంటే అవన్నీ వేరుకాదు. ఓ రామా! ఎవరైనా "దేహము వేరు. మనస్సు వేరు. జీవుడు వేరు" అని వాదిస్తుంటే, అట్టివారు యథార్థ వస్తువును ఎరిగినవారు కాదనే మా అభిప్రాయం. జ్ఞానమునకు సంబంధించిన ఉత్తమ శిక్షణ పొందకపోవుటచేతనే వారు అట్లా వాదిస్తున్నారు. మనస్సే "దేహానుభవము" అను వేషమును వేస్తోంది. 'జీవుడు' అని మనం అంటున్నది మనస్సునే.

❖

'మనఃశ్శక్తి' సర్వవ్యాపకమై ఉండుటచే, కుతర్క శక్తి కూడా మనస్సు అనే దేవుని యందే ఉండి ఉంటోంది.

శుద్ధ చైతన్యమునందు జడత్వ రూపమగు కలుషిత – శక్తి ఉదయించిన మరుక్షణం ఈ జగద్వైచిత్ర్యమంతా కలుగుతోంది.

'చేతనము' అయినట్టి సాలెపురుగు నుండి జడమగు సాలెతంతువులు (దారం) ఉత్పన్నమగు చున్నది కదా! నిత్యజ్ఞాన స్వరూపుడైన పరబ్రహ్మము నుండి మనోరూపమగు ప్రకృతి జననంపొంది, రూపుదిద్దుకొంటోంది.

అవిద్యా కారణం చేతనే కుతర్క – వితర్కములైన అనేక భావనలు చిత్తమునందు రూఢిపడుచున్నాయి.

చైతన్యము యొక్క పర్యాయ వృత్తులే 'జగత్తు'. కాని, భ్రమచే జగత్తు చైతన్యమునకు వేరైనదిగా తలచబడుచున్నది. అనగా, మనస్సు యొక్క వాస్తవరూపం ఆత్మచైతన్యమే! కనుక, ఈ ఎదురుగా కనబడేదంతా–జడచేతనములతో సహా ఆత్మ చైతన్యవిన్యాసమే!

❖

నిర్మలమగు చైతన్యమొక్కటే ఈ జీవ–మనోబుద్ధి–అహంకార రూపములుగా ప్రసిద్ధికెక్కుచున్నది. అదియే లోకంలో చేతనమని, జీవమని, చిత్తము అని జడమని .... ఇంకా అనేక సంజ్ఞలచే పిలువబడుచున్నది. ఈ విషయంలో సంశయము అవసరములేదని చేతులెత్తి ప్రకటించుచున్నాను.

ఆత్మచైతన్యం ఈవిధంగా అద్వితీయం! నిత్యనిర్మలం!

❖❖❖

VII. చిత్తచాంచల్యము

1. ఈ కనబడేదంతా ఉన్నది మనస్సులోనేనా?

శ్రీరాముడు : హే మహర్షీ! మనకు కనబడుచున్న ఈ జగత్ వైచిత్ర్యమంతా మనస్సు నుండే ఆవిర్భవిస్తోందంటారా? ఇదంతా మనః కల్పితమేకాని, మరింకేమీ కాదని మీ అభిప్రాయమా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. ఒక ఎడారిలో ప్రచండ సూర్యతేజము కారణంగా ఉత్పన్నమైన మృగతృష్ణ ఆ సూర్యతేజమును ఆవరించినదై జలభ్రాంతిని కలుగజేయటం జరుగుతోంది కదా! అట్లే జడమగు మనస్సు స్వయం ప్రకాశవంతమైన ఆత్మను ఆవరించివేసి ఉండగలుగుతోంది. మనస్సు యొక్క జడమునకు సంబంధించిన అంశమే ఆత్మను మరుగుపరచి ఉంచుతోంది. అట్టి "మరుగు" యే జగత్తుగా ప్రాప్తిస్తోంది. ఈ విధంగా "మనస్సే జగత్తునకు కారణం" అని నీవు చెప్పినది అక్షరాలా నిజమే.

ఈ జగత్తు బ్రహ్మరూపమే! అయితే,... మనస్సే 'జగత్తు' అను ఆకృతిని పొంది, ఒక చోట మనుష్యరూపముగాను, మరొకచోట దేవతారూపముగాను రూఢిపొందుచున్నది. ఒకచోట రాక్షస రూపంగాను, మరొకచోట యక్షరూపంగా, ఇంకొకచోట గంధర్వ రూపంగాను, కిన్నెర రూపంగాను అవతరించుచున్నది. అంతేకాదు. ఈ మనస్సే భిన్న భిన్న ఆచారములుగా, పంచభూతములుగా, గ్రామ, నగరాది రూపములుగా విస్తరించుచున్నది. మహావిశాలరూపమై కూడా మనస్సే వ్యక్త మగుచున్నట్లు మేము దర్శిస్తున్నాము. కాబట్టి ఓ సర్వజనులారా! మీరంతా ఈ మనస్సు గురించే బాగా విచారించండి. ఈ మనస్సు యొక్క శక్తి – యుక్తులు, స్వభావ వైచిత్ర్యములు గ్రహించండి. అట్టి మనస్సును పరిశీలించటం వదలి, గడ్డి పరక – కొయ్య – లతలవంటి ఈ స్థూల దేహముల గురించి, ఎదురుగా కనిపించే ఆయా దృశ్య సంబంధ వ్యవహారముల గురించి మాత్రమే విచారించటం చేత వచ్చే ప్రయోజనమేమీ ఉండదు.

❖

సర్వవ్యాపకమగు ఈ జగత్తంతా మనస్సు చేతనే పరిపూర్ణమైయున్నది. అట్టి ఈ మనస్సును శోధించినప్పుడు మాత్రమే ఈ కర్త–కర్మల రూపము చక్కగా తెలియబడగలదు. కర్త–కర్మల చమత్కార మంతా గ్రహించిన తరువాత ఇక ఆపై పరమాత్మయే శేషించుచున్నదని మా అనుభవమైయున్నది. అట్టి ఆత్మ సర్వ వస్తువులకు అతీతమై, సర్వవ్యాపి అయి, సర్వమునకు ఆశ్రయమైయున్నది. అద్దాని కృపాతిశయంచేతనే ఈ మనస్సు లోకంలో పరుగిడగలగడం, పలు విధములుగా విజృంభించటం జరుగుతోంది కూడా! ఈ 'మనస్సు' అనునది ఆత్మయొక్క 'ఇచ్ఛ–ఆలోచన' అను రూపమైన 'కర్మ' యేనని మేము ఎంచుచున్నాము.

అట్టి మనస్సే ఈ దేహాదులకు కూడా కారణం. మనస్సే ఉత్పన్నమౌతోంది. అదియే విజృంభిస్తోంది. అదియే అన్ని వైపుల ప్రవర్తిస్తోంది. అదియే లయించుచున్నది.* అంతే కాని 'ఆత్మ' కాదు. ఎందుకంటావా? ఆత్మకు జనన మరణాదులు, ఉత్పత్తిలయాలు లేవు. నాయనా! రామా! ఈ ఆత్మ విచారించబడిందా, ఇక మనస్సు స్వయంగానే లయించగలదని శాస్త్రనిశ్చయం. మనస్సు లయించిన మరుక్షణం మోక్షం ప్రాప్తించగలదు. భ్రమదాయకమైనట్టి 'మనస్సు' అనబడే కర్మ క్షయించినపుడు ఈ జీవుడు ముక్తుడు అగుచున్నాడు. అట్టివాడు ఈ ప్రపంచంలో మరల జన్మించుట లేదు.

శ్రీరాముడు : ఓ ముని శ్రేష్ఠా! మీరు ఇంతకుముందు .... సత్వరజస్తమోగుణముల దృష్ట్యా ఈ జీవులను పదునాల్గు విధాలుగా వర్ణించారు కదా! వాటన్నిటికీ ముఖ్య కారణం సదసదాత్మకమగు ఈ మనస్సే అయిఉన్నదని నేను గ్రహిస్తున్నాను. అయితే, నాదొక సందేహం. బుద్ధిరహితమగు శుద్ధ చైతన్యమునందు ఈ 'మనస్సు' అనబడునది ఎట్లా ఉత్పన్నమైనది? ఈ చిత్ర-విచిత్రములైన జగన్నిర్మాణం చేసే విధంగా అది ఎట్లా విస్తరిస్తోంది? బుద్ధి ఉంటే కదా సృష్టి సంభవించటం? మరి బుద్ధిగాని, మనస్సుగాని ఎట్లా ఏర్పడుచున్నాయి?

శ్రీ వసిష్ఠమహర్షి : అతి విశాలమైన మూడు 'ఆకాశములు' ఉన్నాయని ఇతఃపూర్వమే చెప్పియున్నాను. ఇప్పుడు మళ్ళీ చెప్పుచున్నాను. అవి :

1) భూతాకాశము (Zone of matter)
2) చిత్తాకాశము (Zone of thought)
3) చిదాకాశము (Zone of awareness, consciousness)

సర్వసామాన్యములైన ఈ మూడు వాటి వాటి కార్యములందు సువ్యవస్థిములై ఉన్నాయి. ఈ మూడిటికి "శుద్ధ చిత్ శక్తి" చేతనే స్థితి లభించుచున్నది.

చిదాకాశము: బాహ్య జగత్తునకు అంటక, అంతటికీ 'సాక్షి' అయిఉంటోంది. అది - ఈ బుద్ధి, మనస్సు మొదలైనవి - ఉండుటకు, లేకుండుటకు కూడా సాక్షీభూతమై, ఈ సర్వభూతములందు ఏకస్థమై, సర్వమునందూ వ్యాపించి ఉంటున్నది.

చిత్తాకాశము : ఈ జీవులందరి వ్యవహారములకు ఇదే హేతువుకదా! అందుకే దీనిని "సర్వ హితము" (సర్వజనులకు హితమైనది) అని కూడా అంటూ ఉంటారు. కార్య-కారణములన్నిటికీ ఇదే మూలమై ఉన్నది. అందుచేత సర్వశ్రేష్ఠమై ఉంది. ఇది జగద్వ్యాపకమై వికల్పరూపమై ఉంటోంది.

భూతాకాశము : ఈ భౌతికమైన కంటికి కనబడుచున్నది. ఇది పది దిక్కులలోను వ్యాపించి, విశాలమైన దేహము కలదై ఉంటోంది. ఇది వాయువు యొక్క, సూర్యుని యొక్క, మేఘము యొక్క .... విశాల రూపమై వెలయుచున్నది.

❖

---

* **"మనయేవ మనుష్యానాం కారణం బంధమోక్షయో"**

- మనస్సే ఈ జీవుని యొక్క బంధమునకు, మోక్షమునకు కూడా కారణమగుచున్నది.

భూతాకాశ – చిత్తాకాశములు రెండు చిదాకాశము నుండే ఉత్పన్నమౌతున్నాయి. 'పగలు' జరుగుచున్న కార్యములన్నిటికీ పగలే కారణమగుచున్నట్లు చైతన్యమే అన్నిటికీ కారణమగుచున్నది. "నేను జడస్వరూపుడను... నేను జడస్వరూపుడను" అనునట్టి చిద్వస్తువు యొక్క మలిన నిశ్చయమే మనస్సు. దీనివలననే ఈ ఆకాశాదులు ఉత్పన్నమౌతున్నాయి. అయితే రామా! ఇక్కడ నీవు ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. అదేమిటంటే, ఆత్మతత్త్వము ఎరుగనట్టి వానికి ఉపదేశించటం కోసమే ఈ మూడు అకాశాలు కల్పించబడుచున్నాయి. జ్ఞాని యొక్క దృష్టికి మాత్రం ఈ మూడు విభాగములతో పని లేనేలేదు.

ఎందుకంటే, పరమమగు బ్రహ్మమొక్కటే అంతటా నిండియున్నది. అంతయు తానే అయి వెలుగుచున్నది. భూత–భవిష్యత్–వర్తమాన కాలములందు అదియే ఏకరసమై, నిత్యమై, 'కాలము' అనే కల్పనయే లేనిదై ప్రకాశించుచున్నది. ఓ రఘురామా! జ్ఞానప్రాప్తి కలుగనంతవరకు నీకీ మూడు ఆకాశముల కల్పన ఉండనే ఉంటుంది. సర్వకల్పనలు నశించేవరకు, జ్ఞానోదయం అయ్యేవరకు ఇట్టి ఉపదేశములు అవసరమే అగుచున్నాయి. నీవు కూడా జ్ఞానోదయం అయ్యేవరకు ఈ విభాగమంతా పరిశీలిస్తూ ఉండు.

మాయా కళంకితమైన చిదాకాశము నుండి చిత్తాకాశము, భూతాకాశము ఉత్పన్నమౌతూనే ఉంటున్నాయి. ఆహాఁ! ఏమి విచిత్రమో చూచావా? మాయావేష్టితమైనట్టి చైతన్యమే "చిత్తత్వము ('చిత్తము' అను స్వభావం)" ను పొంది ఆ మలినరూప సంచయమంతా జగత్తు రూపమున గాంచు చున్నది. వివిధ కల్పనలతో కూడినదై, "త్రిలోకములు" అను ఇంద్రజాలమును నిర్మించుకొనుచున్నది. "ఇది ముత్యపు చిప్పయే కదా! ఇందు వెండి ఉండటానికి అవకాశమెక్కడ?" అను జ్ఞానము లేనివాడు ఆ ముత్యపు చిప్ప యందు వెండినే చూస్తూ ఉంటాడు. అజ్ఞానికి మాత్రమే చైతన్యము నందు మలిన రూపమగు చిత్తము యొక్క అనుభవం కలగటం జరుగుతోంది. లోకంలో 'అజ్ఞానము' అనే దోషముచే మాత్రమే బంధము కలుగుచున్నది 'జ్ఞానము' అను బలముచే మోక్షరూపమగు ఆనందము సిద్ధించుచున్నది.

ఈ జగద్రూపము యొక్క రహస్యము ఇంత మాత్రమే.

❖❖❖

2. అడవిలో చిక్కుకున్న బాటసారులు

ఓ రామచంద్రా! ఈ 'చిత్తం' అనునది ఎక్కడినుంచో ఆకస్మికంగా ఉత్పన్నమై వచ్చిపడింది. సరే, ఇప్పుడేం చేయాలి? ఈ చిత్తం ఎక్కడినుండి వస్తే మనకేం? ముందుగా ఈ చిత్తాన్ని 'ఆత్మవిముక్తి' యందు జాగరూకతతో నియోగించాలి. స్వస్వరూపి, సర్వాత్మకుడు, బ్రహ్మతత్వ స్వరూపుడగు పరమాత్మ యందు దీన్ని లగ్నం చేయాలి. క్రమంగా వాసనలన్నీ రహితం కావాలి. అప్పుడు ఏ విధమైన కల్పన లేనిదై, ఈ చిత్తం 'ఆత్మ స్వరూపము'నే పొందుచున్నది. ఆత్మ రూపంగానే వెలుగొందుచున్నది.

ఈ చరాచరజగత్తంతా చిత్తమునకే అధీనమైయున్నది. అనగా, బంధ-మోక్షములు కూడా చిత్తము యొక్క అధీనంలో ఉన్నట్లే కదా! ఈ సందర్భంలో పూర్వం నా పితృదేవులగు బ్రహ్మదేవుడు నాకు చెప్పిన చిత్తచాంచల్యమునకు సంబంధించిన ఒక చమత్కారమైన కథ గుర్తుకు వస్తోంది. అది చెపుతాను విను.

❖

ఒకచోట ఒక గొప్ప అరణ్యం ఉన్నది. ఆ అరణ్యం అతి విశాలమై, శూన్యవంతమై, అశాంతి మయమై, అతిభయంకరమై ఉన్నది. దాని ముందు అనేకవేల లక్షల యోజనాలు కూడా అత్యంత స్వల్ప భాగంగా కనిపిస్తున్నాయి, అది అంత విస్తీర్ణమైనదన్నమాట! ఆ మహారణ్యంలో అతిభీకరమైన ఆకారము కలిగిన ఒక పురుషుడు ఉన్నాడు. అతడు అనేక చేతులు, అనేక కాళ్ళు కలిగియున్నాడు. "మహావ్యాకులచిత్తుడై ఉన్నాడా?" అని అతనిని చూచినపుడు అనిపిస్తోంది. చూడటానికి అతిభయంకర మైన ఆకృతితో ఉన్నాడు. "ఇతడు ఇక్కడ ఏం చేస్తున్నాడు?" అని నేను మరికొంత పరిశీలనగా చూచాను. అతడు తన వేలాది చేతులతో అనేక గుదిబండలు తీసుకొని తన వీపుపై తానే బాదుకొంటూ, ఆ అరణ్యంలో పిచ్చిపిచ్చిగా సంచరిస్తున్నాడు. అటుఇటు పరుగులు తీస్తున్నాడు. అతిదీనంగా తనను తానే బాధించుకొంటున్నాడు. అట్లా అతడు అనేక యోజనముల దూరం పరిగెత్తడం చూచాను. పాపం, వివేకదృష్టి లేకపోవడం చేత అత్యంత వివశుడై పడుచూ, లేస్తూ. ఇటు అటు తిరుగుచూ, బాగా అలసిపోయి ఉన్నాడు. అతని అవయవములన్నీ తీవ్రమైన హింసను అనుభవిస్తున్నాయి.

అట్లా అతడు పరుగులు తీస్తూ పోయి పోయి ఒక లోతైన నూతిలో పడ్డాడు. ఆ నుయ్యి యొక్క లోపలిభాగం అత్యంత దట్టమైన చీకటి అలుముకుని ఉండటంచేత అసలేమీ కనిపించుటలేదు. చాలా సేపటికి ఆ పురుషుడు ఆ నూతిలోంచి బయటకు వచ్చాడు. బయటకు వచ్చిన మరుక్షణం మరల తననుతానే బాదుకొంటూ పరిగెత్తడం ప్రారంభించాడు. చాలా దూరం పరుగెత్తి ఈమాటు మరొక ప్రదేశం ప్రవేశించాడు. అతడు ప్రవేశించిన ప్రదేశమంతా దట్టమైన ముళ్ళపొదలతో నిండి ఉంది. అది అత్యంత బాధాకరంగా ఉండినది. అగ్నిని సమీపించిన మిడుతలాగా అక్కడ ఎంతో క్లేశం అనుభవించాడు. అక్కడ గల రక్కిస ముళ్ళు అతని దేహమును నిర్దాక్షిణ్యంగా బాధించాయి. ఇంతలోనే అక్కడి నుండి లేచాడు. తననుతానే కొట్టుకొంటూ అటు-ఇటు పరుగెత్తసాగాడు. అట్లా చాలాదూరం వెళ్ళాడు. ఈ మాటు ఒక అరటిచెట్ల వనంలో (తోట) ప్రవేశించాడు. ఆ తోట పున్నమినాటి చంద్రుని కిరణాలులాగా శీతలంగాను, మనోహరంగాను ఉండియున్నది. మరల ఎందుకో ఒక్క క్షణంలో ఆ అరటితోటను వదలి తనను తాను బాదుకొంటూ పరుగెత్తసాగాడు. చాలా దూరం పరిగెత్తటంచేత అతని అవయవములు ఛిన్నాభిన్నం కాసాగాయి. మరల గుడ్డివాడిలాగా ఇతఃపూర్వపు అంధకూపంలోకి పోయి పడ్డాడు.

కొంతసేపు గడచింది. ఆ చీకటి నుయ్యిలోంచి మరల బైటకు వచ్చాడు. మళ్ళా అరటితోటలో ప్రవేశించాడు. అక్కడి నుండి ముళ్ళతోకూడిన గంభీరమైన అరణ్యంలోకి ప్రవేశించాడు. ఆ విధంగా

అతడు ముళ్ళపొదల నుండి నూతిలోకి, నూతిలోంచి అరటితోటలోకి తనను తాను పీడించుకొంటూనే పరిగెత్తటం చాలాసేపు నా వివేక దృష్టితో నేను గమనించాను. అతడు నిష్కారణంగా పరుగులు తీస్తూ అలసిపోవటం, తనను తానే హింసించుకోవటం, రోదించటం చూచి నాకు ఎంతో జాలివేసింది.

అప్పుడు నేను నా యోగబలంతో అతనిని మార్గంలో ఒకచోట ఒక ఐదు నిమిషాలు ఆపాను. "ఏమయ్యా బాబూ! నీవు ఎవరవు? ఇటువంటి విచిత్ర కార్యం ఎందుకు చేస్తున్నావు? నీ బాధ ఏమిటి? నిన్ను నీవే ఎందుకు బాధించుకొంటున్నావు? నీకేం కావాలి? వ్యర్థంగా ఇట్లు ఎందుకు విమోహితుడవగుచున్నావు?" అని ప్రశ్నించాను. నేను ఇట్లా ప్రశ్నిస్తూ ఉండగానే అతడు పెద్ద గొంతుకతో "ఓ మునీ! నేనెవ్వరనూ కాదు. నేనేమీ చేయుటలేదే? నీవే నన్ను హింసిస్తున్నావు. ఇక్కడ నీకేం పని? నీవే నా శత్రువు" అని ఆవేశంగా అరవసాగాడు. నేను అనునయ వాక్యాలతో అతనిని కొంత ప్రశాంత పరచాను. నాపై గౌరవంతో, నమ్మికతో నేను చెప్పేది వినటం ప్రారంభించాడు. చాలాసేపు గడచిన తరువాత లేచి నిలబడి కృతజ్ఞతాపూర్వకంగా తలపంకించాడు. "అవునులే, మిత్రమా! నిన్ను చూడగానే నేను సుఖముగాని దుఃఖముగాని పొందుటలేదు. నీ సహచర్యంతో సత్యాసత్య, నిత్యానిత్య విషయం ఏమిటేమిటో తెలుస్తోంది" అని పలికాడు. తనయొక్క శిథిలములైన అవయవములవైపు ఒకసారి తేరిపార చూచాడు. కొద్దిసేపు సంతుష్టుడైనాడు. ఇంతలోనే ఎలుగెత్తి దుఃఖించసాగాడు. కన్నీళ్లు ప్రవహించసాగాయి. కొన్ని క్షణాలకు ఎందుకో ఏడుపు ఆపాడు. తన అంగములను చూచి నన్ను ఎరుగుచు నవ్వుకొన్నాడు. ఇంతలోనే వికటాట్టహాసం చేశాడు. ఆ అట్టహాసం ముగించిన తరువాత నా ఎదుట అతడు క్రమంగా తన అవయవములన్నిటినీ త్యజించి వేయసాగాడు. మధ్యమధ్యలో నాతో సంభాషిస్తున్నాడు, సంప్రదిస్తున్నాడు. అతిభయంకరమైన అతని శిరస్సు మొదట నేల వ్రాలింది. ఆ తరువాత క్రమంగా అతని కాళ్ళు, చేతులు, వక్షస్థలం, పొట్ట జారి పడ్డాయి. ఈ విధంగా నియతి శక్తి-జ్ఞానముల ప్రభావములచే అతడు అంగములన్నీ త్యజించాడు. అటు తరువాత స్వస్థత చెందటానికి ఉద్యుక్తుడయ్యాడు.

అతనిని అట్లాగే వదలి నేను మరొకవైపు చూచాను. అక్కడికి మరికొద్దిదూరంలో, మరొక ఏకాంత ప్రదేశంలో అట్టివాడే అయినట్టి మరొకడు కనిపించాడు. అతడు కూడా మొదటివానివలెనే తనను తాను బాదుకొంటూ హింసించుకొంటున్నాడు. గట్టి బాహువులతోను, ఆ బాహువులలో గల గుదిబండలతోను తనను తాను బాదుకోవడం అతిదారుణమైన విషయమనిపించింది. అతడు కూడా నూతిలో పడటం, బయల్వెడలటం, ముళ్ళ పొదలలోకి పరుగులు తీయటం, అక్కడినుండి అరటితోటలో ప్రవేశించటం చేస్తున్నాడు. మరల మరల దుఃఖిస్తున్నాడు. ఇంతలోనే తననుతానే సుదాయించుకుంటూ సంతోషిస్తున్నాడు. మరల, మరికొంతసేపైనతరువాత తననుతాను బాదుకొంటున్నాడు. అతని వింతక్రియలను కూడా చాలాసేపు చూస్తూ ఉన్నాను. అప్పుడు అతనిని కూడా ఆపాను. కొన్ని ప్రశ్నలు వేశాను. అతడు సమాధానాల కొరకు యోచించాడు. లభించలేదు. అప్పుడు నన్ను మరికొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆ విధంగా మా ఇద్దరి మధ్య అనేక ప్రశ్నలు-

జవాబులు నడిచాయి. ప్రశ్న-సమాధానాల ద్వారా అతనికి అనేక విషయాలు బోధించాను. అతడు ఒక ప్రక్క ఏడుస్తూ - నవ్వుతూనే మరొక ప్రక్క నేను చెప్పుచున్నదానినంతా విచారించాడు. అతని అంగాలన్నీ అప్పటికప్పుడే ఛిన్నాభిన్నములైనాయి. అప్పటికప్పుడు నిర్మలరూపుడయ్యాడు. ప్రయాసతో కూడిన పరుగులను ఆపి, ఇక అక్కడినుండి బయల్వెడలటానికి సిద్ధమైనాడు.

ఇక త్రోవలో ఆ అడవిలో మరికొంతదూరం పరిశీలిస్తూ పోయాను. మరొక ఏకాంత ప్రదేశంలో అట్టివాడే మరొకడు తారసపడ్డాడు. అతడు కూడా పరిగెత్తుకుంటూపోయి ఒక అంధకూపంలో పడటం చూచాను. అతడు ఆ నూతిలోంచి బైటకు వస్తాడేమోనని అతనికోసం కాచుకు కూర్చున్నాను. చాలా సమయం గడచిపోయింది. ఏదీ? ఆ మూర్ఖుడు ఆ నూతిలోంచి బైటకు రాడే? ఇక వెనుకకు మరలాలని ఉద్యుక్తుడనౌతున్నాను. ఇంతలో అతడు బైటకు రావటం చూచాను. నేను అతనిని పలకరించాలని ప్రయత్నం చేస్తూ ఉండగానే అతడు నా కేకలు వినిపించుకోకుండా మరల ఆ చీకటి నూతిలోకి దూకబోయాడు. ఎట్లాగో అతి కష్టంగా నా యోగబలంతో బలవంతం మీద అతనిని ఆపాను. ఇతఃపూర్వంలోలాగానే అవే ప్రశ్నలు వేశాను. అతడు నా ప్రశ్నలను అర్థంచేసుకున్నట్లు లేడు. నన్ను గుడ్లు ఉరిమి చూస్తూ "ఓ మూర్ఖుడా! నీకేమీ తెలియదు. నేను నిన్ను నమ్మను. నన్నెందుకు ప్రశ్నిస్తావు? నీవు దుష్టుడివలె ఉన్నావే? నువ్వు నాకేం చెపుతావు? ఇక ఆపు. నీలాంటి వారిని ఎందరినో చూచాను. నిన్ను నమ్మేది లేనేలేదు. నేను-నాసంగతి ఇంతే" అని అరచుచు యథాప్రకారం తన వ్యాపారంలో మునిగాడు. మరల ఆ చీకటి నూతిలోకి దూకాడు.

❖

ఆ తరువాత నేను ఆ మహారణ్యంలో సంచరిస్తూ, ఇట్టి వారినే అనేకులను చూచాను. వారిలో కొందరు నా ప్రశ్న, సమాధానాల ప్రభావంచే బోధితులైనారు. వారి దృష్టి పథంలోనించి స్వప్నం వలె మిథ్య అయినట్టి వారి గుదిబండలు ధరించిన చేతులతో కూడిన దేహము "లేనిది" కాసాగింది. వారు శాంతులయ్యారు. కొందరు నా వాక్యములు విననైనాలేదు. వారు అక్కడి అంధకూపములలో పడిలేస్తూనే ఉన్నారు. మరికొందరు అరటితోటలోంచి చాలాసేపటికి బైటకు వస్తున్నారు. నేను చెప్పేది లక్ష్యపెట్టకుండా మళ్ళా పొదల అడవిలోకి పరుగెత్తుకుపోతున్నారు. ఇంకా కొందరు ముళ్ళపొదల అడవిలోనే ఉంటూ, అక్కడే అంతులేని వేదనలు పొందుచున్నారేగాని, బయటకు వచ్చుటలేదు.

కొందరు "నువ్వు చెప్పక్కర్లేదు.... ఇది మా ఇష్టం" అని నాతో పలుకుచూ, కామ్య కర్మ పరాయణులై ఇటూ - అటూ తిరుగుచూనే ఉన్నారు. నన్ను పట్టించుకోవటంలేదు.

ఆ మహారణ్యమంతా ఈ విధంగానే ఉన్నది.

ఓ రామచంద్రా! ఆ మహారణ్యము ఇప్పటికి అక్కడే ఉన్నదయ్యా! దానియందు ఆయా పురుషులు ఆ విచిత్ర వ్యవహారములను అట్లే చేస్తున్నారు. నేనే కాదు. నీవు కూడా ఆ మహారణ్యం చూచావు. చూస్తున్నావు కూడా! కాని, సూక్ష్మబుద్ధితో గమనించకపోవుటచే ఆ అరణ్యమును

ఎరుగకపోతున్నావు. ఆ అరణ్యం అందరికీ కనిపిస్తూనే ఉన్నది. ఈ సభలో చాలామందికి ఆ ఆరణ్యబాటసారులు తారసబడుతూనే ఉన్నారు.

ఆహాఁ! ఏమి దౌర్భాగ్యం! ఉత్తమమైన మనుజ జన్మ పొందికూడా తాము సంపాదించుకొన్న బుద్ధికౌశలత్వాన్ని సద్వినియోగపరచుకోవటం లేదే? దానిని వృథాయే చేసుకుంటున్నారు కదా! అతి భయంకరము, ముళ్ళచే నిండియున్నది. గాఢాంధకారముచే వ్యాప్తమైనది అగు ప్రదేశములను వారు "ఇవి పుష్పవాటికలే కదా" అని తలచి మోహం చెందుచున్నారే? వాటినే మరల మరల సేవిస్తూ దుఃఖితులౌతున్నారు. "వీరు సంస్కరించబడేది, శాంతిని పొందేది ఎట్లా" అనియే నేను మరల మరల యోచించటం జరుగుతోంది. మేము వారికి ఏ రకంగా సహాయం చేసేది?

❖❖❖

3. కథా సంఘటనలు - ఉద్దేశము

శ్రీరాముడు : మహాత్మా! ఆ మహారణ్యం ఉన్నది ఎక్కడ? ఎట్లా ఉన్నది? నేను దానిని చూచానని అంటున్నారే? చూచినట్లు నాకు గుర్తులేదే? అందున్న ఆ భీకరమైన ఆకారములుగల జీవులు ఎవరు? వారంతా అట్లా ఆయారీతులుగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? మీరు ఎప్పుడు ఎందుకు ఆ మహారణ్యంలోకి వెళ్ళారు? ఈ సభలోని మహనీయులెందరో ఆ అరణ్యం చూస్తూనే ఉన్నారని అన్నారుకదా! మీరు ఏ ఉద్దేశంతో ఈ సంఘటన చెప్పారో నేను గ్రహించలేకపోతున్నాను. దయచేసి మీ ఉద్దేశమేమిటో మీరే వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆ వృత్తాంతమంతా చెపుతాను. విను. ఆ మహారణ్యముగాని, ఆ పురుషులుగాని ఎక్కడో లేరు సుమా! అత్యంత గంభీరము, విశాలము అయిన ఈ సంసారమే ఆ శూన్యారణ్యము.

బ్రహ్మము విచారించబడినప్పుడు "ఇదంతా ఆత్మచే పరిపూర్ణమైయున్నది. కదా" అని గ్రహించ బడుతుంది. అప్పుడిక ఆత్మకు వేరైనదేదీ ఎక్కడా గోచరించదు. అనగా, పరమార్థ దృష్టిచే ఈ సర్వము బ్రహ్మము రూపంగానే కనిపిస్తుంది. అప్పుడీ సంసారారణ్యం వస్తురహితమై శూన్యంగా గోచరిస్తుంది.

అట్లా కాకుండా జగద్దృష్టితో చూచినప్పుడు మాత్రం ఇది మహావికారయుక్తమై ఉంటోంది. ఈ సంసారారణ్యంలో అనేక సాంసారిక దృష్టులచే వికృతాకారం కలిగి సంచరిస్తున్నవారు ఈ జీవులే సుమా! వీరు భ్రాంతిచే అత్యంత దుఃఖితమైన చిత్తము కలవారై ప్రవర్తిస్తున్నారు. వారలను చూస్తున్న ద్రష్టయగు నేను ఆ జీవునియందలి వివేకమును. నేను వారిని ఈ సంసారారణ్యంలో అట్టి సంచలనముతో చూస్తున్నది నాయొక్క వివేకము చేతనే కదా! వివేకముచే వారి మనస్సులకు "ప్రబోధము" కలుగజేయుటకు నిరంతరం శాస్త్రములు, గురువులు యత్నించుచునే ఉన్నారు. వారంతాకూడా 'వివేకము', అనుదానిచే ఉద్దేశింపబడ్డారు. ఈ సంసారంలో సంచరిస్తున్న కొందరు తత్త్వజ్ఞానరూపమగు ప్రబోధమును పొందినవారై అద్దాని ప్రభావంచేత చిత్తశాంతిని పొంది ముక్తులు

అవుతున్నారు. మరికొందరు వారివారి వివేకములను వాంఛించక తిరస్కరిస్తూ అజ్ఞానకూపంలో పడుచున్నారు.

"అగాధమగు చీకటి నూతులు" = నరకములు

"అద్దాని నుండి లేవనివారు" = పాపకార్యములందు ప్రవృత్తి కలవారు.

"అరటితోటలో ప్రవేశించినవారు" = స్వర్గలోక భోగములందు ఆసక్తులై తత్సంబంధమైన యజ్ఞాది పుణ్యకార్యములకు ఆయత్తమగుచున్నవారు. పుణ్యవంతులు.

"ముళ్ళపొదల అరణ్యంలో ప్రవేశించువారు" = కర్మపరంపరాసక్తులతో కూడిన మనుజ రూపమున పరిణామము పొందినవారు. అంటే, కర్మ చక్రమును పొందినవారు.

ఈ మనుజ జన్మ పొందినవారిలో కొందరు జ్ఞానసంపన్నులై సంసార బంధము నుండి తప్పించుకొని ముక్తులగుచున్నారు. మరికొందరు ఒక యోని నుండి మరొక యోనికి వెళ్ళుచు స్వర్గ – నరక – భూలోకముల మధ్య పరిభ్రమిస్తున్నారు.

'ముళ్ళపొద' = దుఃఖములచే పూర్ణమై, భౌతిక స్వభావయుక్తమై, కుటుంబ, బంధు, స్నేహాదులు కలిగి రకరకాల ఇచ్ఛలతో కూడుకొని యున్నట్టి ఈ చిత్తము యొక్క స్థితి.

కొందరు ఆయా శాస్త్రములచే నిర్ణయింపబడుచున్న పుణ్యకర్మలను ఆచరించుచున్నారు. తద్వారా, తమ మనస్సును పరిశుద్ధ పరచుకుంటున్నారు. ధ్యేయ వస్తువు నందు (పరమాత్మయందు) తమ చిత్తమును సంలగ్నం చేస్తున్నారు. ఆయా ఉపాసనలను, సుహృద్భావపూర్వకమైన త్యాగాదులను ఒనర్చుచు, "గ్రహమండలము–సప్తర్షి మండలము–ధ్రువమండలము" మొదలైన ఉత్తమ పదములకు, గతులకు అర్హులగుచున్నారు. అట్టివారు అధికమైన తేజోసంపన్నులై తత్త్వజ్ఞానముచే ఎల్లప్పుడు శ్రేయమునే పొందుచున్నారు.

"కొందరు అజ్ఞులు నన్ను తిరస్కరించారు" = ఆత్మ జ్ఞానమును ఆశ్రయించక, కొందరు తమ వివేకమును తామే తిరస్కరిస్తూ దూషించుచున్నారు.

"నిన్ను చూడగానే నశించుచున్నాను. నీవు మా శత్రువు" = ఈ మాటలు చిత్తము యొక్క విలాసమే. వివేక దృష్టి ఏర్పడుచుండగా చిత్తము క్రమంగా వినాశనం పొందటమే అది.

"ఆర్తనాదం చేస్తూ బిగ్గరగా ఏడ్చువాడు" = భోగములు, విషయములు త్యజించుచుండగా ఖేదము పొందుచున్నట్టి ఈ చిత్తము యొక్క చమత్కారం.

వివేకము కొంత కొంత వికసించుచున్నప్పుడు ఇక భోగములు త్యజించబడుతూ వస్తాయి. అప్పుడు ప్రారంభదశలో ఈ చిత్తము కొంత కొంత దుఃఖము పొందుతూ ఉంటుంది. అల్పవివేకము గల చిత్తము స్త్రీ, పుత్రులు మొదలైన వాటిని కరుణాదృష్టితో తిలకిస్తూ "ఎంత కష్టం వచ్చింది! నా బంధువుల గతి ఏమిటి? వీరికి నేనంటే ఎంత అభిమానం!" అని తలచుచూ దుఃఖములు పొందుతోంది. పూర్ణజ్ఞానము, ఆత్మపదప్రాప్తి ఇంకా పొందనప్పుడు ఈ స్నేహములు మొదలైనవి కోల్పోయే సమయంలో చిత్తము కొంత ఆవేదన పొందటం సహజమే. ఇదంతా సంసార వైచిత్ర్యమే సుమా!

"నన్ను ఎరుగుచు, ఆ పురుషుడు నవ్వాడు = వివేకమును పొందిన చిత్తము సంతుష్టిని పొందుచున్నది.

వివేకము పొందిన చిత్తము క్రమంగా సంసార స్థితిని, తనయొక్క చిత్తత్వమును త్యజిస్తుంది. అప్పుడు ఆ చిత్తములో అకృతిమమైన ఆనందం వెల్లివిరుస్తుంది. అందరిపట్ల స్నేహభావం స్వయముగా పెంపొందించుకొంటుంది. ఇంతవరకు తనయందు చోటు చేసుకొన్న మోహము, ద్వేషము, లోభము మొదలైన అజ్ఞాన వీచికలను గుర్తుకు తెచ్చుకొని, "ఆహాఁ! మిథ్యావికల్పములతో రచించబడుచున్న విషయములచే నేను ఇంతకాలం ఎంతగా వంచింపబడ్డాను! ద్వేషము, ఆవేశము, కోపము, రాగము మొదలైనవి ఎంతటి హాస్యాస్పదమైన విషయాలు!" అని ఆ జీవుడు ఆశ్చర్యపడుతూ ఉంటాడు. వివేక ప్రాప్తిని పొంది "వ్యాపక బ్రహ్మము" నందు విశ్రాంతి పొందిన చిత్తమునకు ఇతఃపూర్వపు సంసారానుభవమంతా హాస్యాస్పదంగాను, స్వప్నమాత్రంగాను ఉంటూ ఉంటాయి. "నేను పడ్డ క్లేశములన్నీ నా అజ్ఞానము యొక్క పరిణామమే కదా" అని అతడు గ్రహిస్తాడు.

"నేను అతనిని ఆపి ప్రశ్నించాను" = వివేక బలముచే చిత్తము నిగ్రహించబడినది.

"అవయవములన్నీ ఛిన్నాభిన్నమై లుప్తం అయ్యాయి" = చిత్తము శాంతించగా, సర్వ పదార్థములపట్ల ఆశలు ఉపశమించాయి.

"వెయ్యి చేతులు, వెయ్యి కాళ్ళు గలవాడు" = ఇష్ట-అయిష్టములే రూపముగాగల ఈ చిత్తమే ఆ విధంగా వర్ణించబడినది. మనస్సులో ఎన్ని ఆశలు? ఎన్ని ఆసక్తులు? ఎన్ని ప్రియాప్రియములు?

"తనను తానే బాదుకొనుచున్నాడు. హింసించుకొనుచున్నాడు" = దుష్ట సంకల్పములచే ఈ మనస్సు తనను తానే బాధించుకొనుచున్నది.

"తననుతానే కొట్టుకొనుచు, పరుగెత్తుచున్నది" = మనస్సు తన యందలి వాసనలచే కొట్టబడుచు, ముల్లోకములందలి అనేక యోనులలో ప్రవేశించుచున్నది.

❖

ఓ రామచంద్రా! అజ్ఞానము యొక్క విచిత్రమైన లీలలు చూచావా? ఈ చిత్తము తన కోర్కెలను అనుసరించే తననుతానే బాధించుకొనుచు పరుగులు తీయుచున్నది. జీవుడు బ్రహ్మపదము పొందవలె నని లక్ష్యము పొందియుంటున్నప్పటికీ, "వాసనారాహిత్యము" అతడు పొందనంతవరకు అతని చిత్తము దుర్విషయముల అభ్యాసముచే 'క్షోభ' చెందుచూనే ఉన్నది. చిత్తములన్నీ సంసారారణ్యంలో పరుగులు తీస్తున్నాయి. ఈ జీవుని దుఃఖములను విస్తరింపజేయుచున్నది మనస్సే. అది అనేక ఆవేదనలను తనయందు దాచుకొన్నదై, మిక్కిలి భిన్నముగా అటు-ఇటు పరుగులు తీస్తోంది. పట్టుపురుగును గమనించావా? అది తనచేత నిర్మించబడిన గూటియందు తానే చిక్కుకొని బాధపడుతూ ఉంటుంది. ఈ మనస్సు కూడా తననుండి బయలుదేరిన సంకల్ప-వాసనాదులచేతనే బంధింపబడి, అనేక వేదనలకు గురి అగుచున్నది. ఊరకుక్కను గమనించావా! అది ఎందుకో- ఏమిటో తెలియకుండానే వీధులలో చుట్టి-చుట్టి పరుగులు తీస్తోంది. బాలుడు భవిష్యత్తులోని సాధకబాధకాలు

తెలియక దుష్ట పదార్థాలను భుజించటం, దుష్టప్రదేశాలలో సంచరించటం చేస్తూ ఉంటాడు. ఈ మనస్సు ముందు–వెనుకలను, ప్రయోజన–నిష్ప్రయోజనములను చూచుకోకుండానే అనర్థములను ఆశ్రయిస్తోంది. అనేక దుఃఖపూరితములైన కార్యక్రమములకు తనను తానే బలవంతంగా సమర్పించుకొంటోంది. చపలమగు కోతి తన చాపల్యం చేత చీల్చబడుచున్నట్టి దుంగలో కాలుపెట్టి యమయాతనలు తెచ్చిపెట్టుకొంటుంది చూచావా? చంచలమగు మనస్సు కూడా అనేక ఆసక్తులచే రాగద్వేషములను సంతరించుకొని సంచరించుచు అనేక దుర్భర పరిస్థితులన్నీ తెచ్చిపెట్టుకొంటోంది.

శ్రీరాముడు : మహర్షీ! మరి ఈ మనస్సు తన చాంచల్యము వదలదా? దీని గతి ఇంతేనా?

శ్రీ వసిష్ఠ మహర్షి : నిరుత్సాహపడవలసిన పనిలేదయ్యా! దీనిని అభ్యాస ప్రభావంచేత తప్పకుండా వశం చేసుకోవచ్చు. ఓ జనులారా! బాహ్యాడంబరములను, వృథాకాలయాపనలను, అల్ప లక్ష్యములను క్రమక్రమంగా తగ్గించుకోండి! మనసుకు మౌనం, ప్రశాంతత, సర్వులపట్ల అవ్యాజమైన ప్రేమ అలవాటు చేయండి. ఈ మనస్సు చిరకాలం ప్రపంచ–రహిత–సమాధిని అభ్యసించాలి. అనగా, మీ మనస్సు ప్రపంచమునకు సంబంధించిన మననము చేయకుండా చూచుకోండి. ఆత్మభావననే (సర్వము ఆత్మస్వరూపంగా) దృఢం చేసుకోవాలి. ఇక వేరే ఉపాయంలేదు. మనస్సు యొక్క ప్రమాదము వలననే ఈ జీవునకు అనేక దుఃఖములు పర్వతమంత ఆకారంగా వృద్ధి చెందుచున్నాయి. ఈ మనస్సు వశీకృతమైనదా.... ఇక మిగతా జాడ్యమంతా తనంతటతానే నశిస్తుంది.

మానవుడైనవాడు, శాస్త్రార్థములను చక్కగా గ్రహించాలి. ఉత్తమమైన సంస్కారములను అలవరచుకోవాలి. సమభావనను అన్నివేళల అభ్యసిస్తూ ఉండాలి. రాగద్వేషములకు విచలితం కావటమును తగ్గించుకొంటూ ఉండాలి. ఇంద్రియముల ప్రభావమును నిరోధిస్తూ దృష్టిని సర్వాత్మస్వరూపుడగు పరమాత్మవైపుకు సారించాలి. అప్పుడాతడు తప్పక అతి పవిత్రమగు బ్రహ్మపదమున చిరకాలం ప్రతిష్ఠితుడు కాగలడు. అట్టి "ఆత్మసారూప్య స్థితి" యందు జన్మాది వికారములు ఉండవు. అది పరమశాంతిదాయకమైనది. అందు ఈ ఆధ్యాత్మిక – ఆధిభౌతిక – ఆధిదైవిక తాపములకు చోటు ఉండదు. అట్టివాడు దుఃఖములు పొందడు. విపత్తులకు విచలితుడు కాడు. ఓయీ! మానవుడా! ఈ జన్మయందే, ఇప్పుడే ఉత్తమమైన ప్రయత్నములు, విచారణలచే అట్టి ఆత్మస్థితిని ప్రాప్తింపజేయు విషయమై ఎందుకు శ్రద్ధ కలిగి ఉండరాదు? చిత్తమును జయించి, జ్ఞానస్థితిని పొందుటకు ఇంతకన్నా ఉత్తమమైన అవకాశము ఎక్కడున్నది?

❖❖❖

VIII. బాల వినోదము

1. ఆత్మకు వేరైనదంతా అజ్ఞానమే!

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! సముద్రంలో తరంగములు ప్రకటితమగుచున్నట్లు, పరమపదమగు బ్రహ్మము నుండే ఈ 'మనస్సు' అనునది ప్రకటితమగుచున్నది. "మనస్సు లేదు" అని, "మనస్సు తప్ప మరింకేమీ లేదు" అని కూడా చెప్పవచ్చు సుమా!

మనస్సు లేదు = 'మనస్సు' వాస్తవానికి లేదు. బ్రహ్మం మాత్రమే ఉంది. అయితే మనస్సుగా ప్రాప్తించేదంతా బ్రహ్మం గురించిన ఏమరుపు-అజ్ఞానం యొక్క వికాసము మాత్రమే అయి ఉంది.

మనస్సు తప్ప మరింకేమీ లేదు = శుద్ధబ్రహ్మమే ఇట్లు స్వకీయమైన ఇచ్ఛచే సువిశాల దృశ్యరూపంగా వివర్తము చెందుచున్నది. కనుక, ఈ కనబడే సర్వము ఆ ద్రష్టయొక్క మనస్సే!

రెండు వివరణలూ సమంజసమే అగుచున్నది. జలసామాన్య రూపము ఎరిగినవానికి "జలము వేరు, తరంగము వేరు" అను దృష్టి ఉంటుందా? ఉండదుకదా! జ్ఞానుల దృష్టిలో ఈ మనస్సు బ్రహ్మమే అయిఉన్నది? అంతేకాని ఇది వేరే ఏదీ కాదు. "జలమే ఇట్లు తరంగము అగుచున్నది" అనే దృఢభావం లేనివానికి "ఈ తరంగము వేరు, ఆ తరంగము వేరు" అనే దృష్టి బలపడి ఉంటుంది. అజ్ఞానుల యొక్క స్వకీయచిత్తమే సంసారభ్రమణకు కారణమగుచున్నది. అట్టి అజ్ఞానులకు ఉపదేశించటానికే మేము వాచకములను (Technical words, jargons), వాచ్యములను (Meaning conveyed by such words) కల్పించుచున్నాము. అట్టి భేదకల్పన అంతా బోధను సునిశితం చెయ్యటానికీ, అజ్ఞాని యందు జ్ఞానదీపము వెలిగించటానికీ అయిఉన్నది.

పరమాత్మ సర్వశక్తిమంతుడు, నిత్యుడు, సర్వత్రా పరిపూర్ణుడై వెలుగు చున్నవాడు. అట్టి సర్వశక్త్యోపేతునికి సర్వశక్తిత్వమే శోభిస్తుంది కాని, అల్పత్వము కాదు. అతనిలో లేని వస్తువే లేదు. సర్వవ్యాపి అగు అతడు తనయొక్క సర్వశక్తిత్వము అంతటా క్రియారూపమున ప్రకటితం చేస్తున్నాడు. అతడు ప్రతి జీవునియందు ఉండిఉన్నాడు. ప్రతి జీవుడు అతనికంటే వేరు కాదు. ఆ బ్రహ్మము యొక్క చేతనశక్తి సర్వవిధ ప్రాణులందు కలదు. అదియే వాయువునందు చలనశక్తిగాను, బల్లయందు కఠినశక్తిగాను, జలమునందు ద్రవశక్తిగాను, అగ్నియందు ప్రకాశశక్తిగాను, ఆకాశమందు శూన్యశక్తి గాను, సంసారస్థితియందు వ్యవహారయోగ్యత్వ శక్తిగాను గాంచబడుచున్నది. ఈ విధంగా ఆ బ్రహ్మము యొక్క శక్తులన్నీ దశదిశలా వ్యాపించి ఉన్నాయి. నాశనవంతములగు పదార్థములందలి నశింప జేసేశక్తి ఇదే. దుఃఖితులైన వారిలోని శోకశక్తి, ప్రసన్నులందలి ఆనందానుభవశక్తి, సృష్ట్యాది యందలి- ప్రళయము నందలి ఉత్పత్తి - వినాశకశక్తి ఆ బ్రహ్మమే అయి ఉన్నది. సర్వపదార్థముల యొక్క "బీజము" అదే.

ఒక బీజంలో .... భవిష్యత్ వృక్షము, ఆ వృక్షముయొక్క ఆకులు, పూలు, కాయలు, కొమ్మలు ....ఇదంతా సంస్కార రూపమున దాగియున్నది కదా! వృక్షముయొక్క ధర్మములన్నీ ఒకప్పటి విత్తుకు వేరైనవి కావు. ఈ జగత్తు, ఇందలి శుభ – అశుభ వ్యవహారములు .... ఇవన్నీ బ్రహ్మమునందే ఉండిఉన్నాయి. అట్లే, "చిత్తము – జడము"ల మధ్య ఉన్నట్టి ఈ 'జీవుడు' అనబడుచున్న చిదాభాసుడు (చిద్వస్తువు యొక్క ప్రతిబింబము వంటివాడు) కూడా సాక్షి చైతన్యము యొక్క ప్రకటనయే. అట్టి సాక్షి చైతన్యమే స్వరూపముగా కలిగి, అతడు బ్రహ్మమునందే స్థితి కలిగియున్నాడు. 'నేను జీవుడను' అను భావన చేయటం బ్రహ్మము యొక్క ఒకానొక స్వభావమే అయి ఉన్నది. ఇక ఈ దృశ్యప్రపంచం విషయానికి వస్తే, ఇందలి పదార్థములన్నీ మాయతో కూడుకొనినట్టి చైతన్యము యొక్క వివర్తమే. ఇవన్నీ కూడా శుద్ధ చైతన్య రూపములే అయి ఉన్నాయి. కనుక రామా! ఈ జగత్తు, ఇందలి 'నేను' అను 'భావన' చేస్తున్న జీవత్వము.... "ఇదంతా చిద్రూప బ్రహ్మమే" ..... అను దృష్టితోనే చూడాలి.

"చిత్ లేక ఎరుక" శరీరముగా కలిగియున్న ఆ పరమాత్మయే మహత్తరమైన శరీరము కలిగియున్నవాడై ఈ 'నేను – నీవు – జగత్తు' మొదలైన సర్వవ్యవహారములతో కూడుకొని సదా ప్రకాశించుచునే ఉన్నాడు.

మనస్సు అంటే ఏమిటి? మనన శక్తిని కలిగియున్నప్పటి చైతన్యమే 'మనస్సు' అనే శబ్దంతో పిలువబడుతోంది. జలమును ఒడ్డున ఉండి చూస్తున్నవానికి "ఇది జలము – ఇవి వేరువేరు తరంగములు – ఇది ఆవర్తము" అను బుద్ధి కలుగుచున్నట్లు, ఈ జీవుడు–మనస్సు అనేవి ప్రతిభాసా రూపమున ఆత్మయందే ఉండి ఉంటున్నాయి. "ఆత్మనుండే మనన రూపమగు మనస్సు ఆవిర్భవిస్తోంది" అనుటలో సందేహమేమిటో చెప్పు? ఓ రఘురామా! ఈ సమస్తము బ్రహ్మము యొక్క శక్తియే. కనుక ఈ బ్రహ్మాండమంతటినీ బ్రహ్మస్వరూపముగానే దర్శించు. ఇక 'అది–ఇది–నేను' ఇత్యాది భిన్న విభజన అంతా ప్రతిభాసావశంచేతనే ఉత్పన్నమగుచున్నది.

ఒక దృష్టాంతము విను. ఒకచోట ప్రశాంతజలముతో కూడిన ఒక తటాకం ఉన్నది. అందలి జలంలో విశాలమైన ఆకాశం ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నక్షత్రములు ప్రతిబింబిస్తున్న విభాగములోని జలము, చంద్రుడు ప్రతిబింబిస్తున్న విభాగములోని జలము వేరువేరా? ఏది ఎట్లు ప్రతిబింబిస్తున్నా జలమంతా ఒక్కటే అయి ఉన్నది కదా! అద్వితీయ బ్రహ్మమునందే ఈ సమస్తము ప్రతిబింబిస్తోంది. వేరు వేరు సంస్కారములతో కూడిన ఈ వేరు బాహ్యా–అభ్యంతర (Outward and inward) చిత్త రూపములను ధరిస్తున్నది ఒకే పరబ్రహ్మము. నిప్పుకు నిప్పురవ్వలులాగా, ఆ బ్రహ్మము యొక్క చిత్ శక్తియందు ప్రకటితమగుచున్న కిరణపుంజములమే మనమంతా! అన్ని అగ్నికణములు అగ్నియే అయి ఉన్నట్లు మనమంతా బ్రహ్మమే అయి ఉన్నాము. దేశకాలానుగుణంగా భూమి యందు ధాన్యశక్తి ప్రకటితం అవుతూ ఉంటుంది కదా! అట్లాగే పరమాత్మకూడా దేశకాలములను అనుసరించి వ్యవస్థితమగుచున్న ఫలరూపంగా ఈ "నీవు–నేను–దృశ్యము" మొదలైన రూపములలో కనబడే ఆయా శక్తులను వ్యక్తమొనర్చుచూ ఉంటాడు.

అయితే ప్రతిభాసగా కనిపిస్తున్నది యథార్థముగా ఉన్నదౌతుందా? "ప్రతిభాసితం కారణంగా ఎండమావులలో జలము కనిపిస్తోంది. కనుక, అట్లు కనిపించటానికి కారణం అందలి జలమే" అని అనగలమా? అక్కడ వాస్తవమైన జలము లేనే లేదు కదా? ఇక అది కారణమవటమేమిటి? "దృశ్యము ఉండుట చేతనే దృష్టి ఉంటున్నది" అనునది సమంజసంకాదు. లేక, అది పరిపూర్ణమైన అవగాహన కాదు. ఇక పరమార్థ దృష్టితో చూస్తే, ఎవ్వరూ దేనిని గాంచుటలేదు. ఎందుకంటే ఈ ద్రష్ట యొక్క స్వభావం 'సత్త' ("Existence" Experience) యే కదా! ఎక్కడ 'సత్త' (Absolute Experience) మాత్రమే కలదో, అక్కడ ఎవరు దేనిని చూస్తారు?*

"ఆత్మ సత్త"కు అన్యమైన దృష్టి ఏర్పడుతుంటే, అందుకు కారణం అజ్ఞానమే" అని గ్రహిస్తావు గాక!

❖❖❖

2. బంధం ఎవరికి?

శ్రీరాముడు : మరి మేము ఈ దృశ్యమును 'ఘనీభూతమైన సత్యము' వలె పొందుచున్నామే?

శ్రీ వసిష్ఠమహర్షి : కారణం? తగినంత విచారణ, పరిశీలన, లేకపోవుటయే! జ్ఞానులు మీమాంస యొక్క నాలుగు అంగములను ఉపయోగించి దృశ్యము యొక్క సత్యాసత్యములను పరిశీలిస్తున్నారు.

1) ప్రతియోగి = "అది ఉన్నదా? లేదా?" అను విచారణ
2) వ్యవచ్ఛేదము = విభాగించి పరిశీలించుట
3) సంఖ్య = విడివిడిగా పఠించుట (Studying in separate components)
4) రూపము = Analysis of "what is its actual form?"

వారు ఈ దృశ్యజగత్తును "మీమాంస" (Logic) చే పరిశీలించి, ఆపై శాస్త్రముల రూపంలో ప్రవచిస్తూ, మనకుకూడా చెప్పుచున్నారు.

❖

ఈ జగద్వైచిత్ర్యములన్నీ స్వయముగా వాస్తవమైనవికావు. ఇవన్నీ మనస్సు చేతనే కల్పించ బడుచున్నాయి. మనస్సు చైతన్యము యొక్క మనన శక్తియే. కనుక అట్టి మనన శక్తి యొక్క కల్పితదృష్టిచే కనిపించుచున్న ఇవన్నీ కూడా .... వివర్త రూపమున బ్రహ్మము నందే, బ్రహ్మము నుండే ఉత్పన్నమౌతున్నట్లు అగుచున్నది. ఇదంతా బ్రహ్మమే. ఇవన్నీ బ్రహ్మమునకు వేఱైనవి కావు".

"ఈ దృశ్యము బ్రహ్మమే అయిఉన్నది (విశ్వమ్ విష్ణుః)" అను విషయమే ఉపనిషత్తులు, సత్య ద్రష్టలగు మహర్షులు అనేక రీతులలో ఘంటాపథంగా నిరూపించుచున్నారు. ప్రతిభాసాత్మకమైన ఈ మనస్సుకు అతి విచిత్రమైన ఒక శక్తి ఉన్నది. ఇది ఏ విధంగా దేని యందు ప్రవృత్తమగుచున్నదో అది ఆ విధంగానే ప్రాప్తించగలదు. ఐందవుల సృష్టియే మనకు ఇక్కడ దృష్టాంతము.

---

* **"యత్తత్వస్యాత్ అద్వైతమేవాభూత్ తత్ర కేన పశ్యత?"**
– అనే శ్రుతి వాక్యార్థమే ఇక్కడ వసిష్ఠ మహర్షి ఉద్దేశిస్తున్నారు.

అందుచేత, రామా! "నాతో సహా ఈ సర్వము సర్వదా అంతా చైతన్యమే అయి ఉన్నది. త్రికాలములలోను (In the past, in the present and also in the future) పరబ్రహ్మమునకు వేరైనది ఎచ్చటా లేదు" .... అనియే నీ మనస్సు అన్ని వేళలా ప్రవృత్తమగుచుండుగాక! దాని ఫలితంగా మోక్షం స్వయంగా ప్రాప్తించగలదు. ఒకడు తనకు ప్రవాహపతితంగా ప్రాప్తిస్తున్న ఆయా కార్యములను నిర్వర్తిస్తూ "నాతో సహా సర్వం బ్రహ్మమే" అను భావన కలిగియుండుటలో ఏమి కష్టముంది చెప్పు?

❖

ఏ జలములో అయితే ప్రశాంతత ఉన్నదో అదే జలములో తరంగత్వము కూడా ఉంటున్నది కదా! "తరంగము" అనబడేది ఎక్కడో బైటనుండి వచ్చిచేరే ఏదైనా పదార్థముకాదు. 'చ్యుతి' (Deviation) పొందటం (అనగా, ఈ జగద్భావమును అనుసరించటం); 'అచ్యుతి' పొందటం, (అట్టి జగద్భావమును త్యజించి ఉండటం) .... ఇదంతా కూడా బ్రహ్మము లేక పరమాత్మ యొక్క చమత్కారముతో కూడిన స్వభావమే అయి ఉన్నది. పరమాత్మయందే ఈ ప్రపంచ కల్పనంతా ఉండి ఉన్నది. ఇట్టి కల్పన అంతటికీ కారణం జీవరూపమున ఉన్నట్టి పరబ్రహ్మమేకాని, మరిక వేరే ఏదీ కాదు. కల్లోలముతో కూడిన సముద్రంలోని బుద్బుదములు, తరంగాలు, ఆవృత్తములు – అంతా జలమే కదా! జ్ఞానికి అంతటా బ్రహ్మమే వ్యాపించియున్నట్లు అగుపిస్తోంది. వికారవంతమైయున్నట్టి ఈ జగత్తునందు పరమాత్మకు వేరుగా ఏదీ లేదు. ఆ పరమాత్మయందు – నామరూప క్రియాత్మకమైన – వేరొక సత్త ఎక్కడి నుండి ఎట్లా వచ్చిచేరగలదు చెప్పు? ముత్యపు చిప్పలో వెండి ఉంటుందా? భ్రమచేత మాత్రమే నిర్లిప్త-నిరవయవమగు బ్రహ్మమునందు .... "ఉత్పన్నమగుట, నశించుట, ఉండుట, పోవుట" మొదలైన దృశ్యవికారములు భాసించుచున్నాయి. ఆత్మ వాస్తవానికి నామరూప రహితమే అయి ఉన్నప్పటికీ, తన ఇచ్ఛను అనుసరించే ఈ జగత్ వైచిత్ర్య రూపమున భాసించుచున్నది. అట్లు 'భాసించుట'ను తానే గాంచుచు, తన శృంఖలములను (Fetters or Limitations) తానే నిశ్చయించుకొనుచున్నది. మరొక తరుణంలో అఖండత్వమును ఆశ్రయించుచున్నది.

❖

"కర్త-కరణము-కర్మలు-జననములు-మరణములు" ..... ఇవన్నీ కూడా ఆ పరమాత్మయే. అతనికి అన్యముగా ఎక్కడా ఏ కల్పనా ఉండజాలదు.

పరమార్థ దృష్టికి లోభమోహములు కూడా లేవు. ఆత్మయందు ఆత్మకు లోభముగాని, తృష్ణగాని ఎట్లా ఉంటాయి? ఈ జగత్తు, దీని కల్పనా క్రమము ఆత్మయే అయి ఉన్నది. సువర్ణమే ఆభరణములుగా ప్రకాశించుచున్నట్లు ఆత్మయే ఈ ఈ మనస్సుల రూపమున ప్రకటితమగుచున్నది. ఇక చిత్తము గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ....ఇది ఉత్తమోత్తమమగు ఆత్మ పదము యొక్క "అనభిజ్ఞత్వము" లేక "ఏమరపు".... మాత్రమే! అదియే ఈ జీవుడు!

శ్రీరాముడు : స్వామీ! మరి ఈ బంధముల మాటేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : అజ్ఞాన దశలో ఎంతగానో అనుభవమునకు వచ్చుచున్న ఈ బంధము జ్ఞానముచే విచ్ఛేదనమగుచున్నది. అప్పుడు "బంధమనునది మొదలే లేదు" అను అనుభవమే

శేషిస్తోంది. ఆకాశమే శూన్యత్వమును వ్యక్తమొనర్చుచున్నట్లు, "అజ్ఞాత-చిన్మయి" అగు ఆ పరమాత్మయే తన సంకల్పముచే జీవత్వమును (నేను జీవుడననే స్థితిని) లీలగా, క్రీడగా ప్రకటిత మొనర్చుచున్నాడు.

ఆహాఁ! ఎంత చమత్కారం! ఈ జీవుడు వాస్తవానికి ఆత్మ స్వరూపుడే అయినప్పటికీ, అనాత్మ భూతమగు ఈ అహంకారము మొదలైన వాటితో "అభేదము"ను సంపాదించుకొనుచున్నాడు. మరుక్షణమే ఈ దృశ్య జగత్తు అంతా ఆవిర్భవించటం, ఎదురుగా నిలచియుండటం జరుగుతోంది. జీవుని యొక్క ద్వైత రూపముతోకూడిన ఈ కలుషిత దృష్టి అంతా మిథ్యమాత్రమే.

నిత్యాసంభవః బంధస్య, బద్ధోఽ స్మీతి కుకల్పనా?
యస్య కాల్పనికస్తస్య మోక్షో మిథ్యా స తత్త్వతః ।
సత్యత్వాదాత్మనశ్చైవ, క్వాత్మా బద్ధః? క్వముచ్యతే ।

ఓ సర్వజనులారా! మీరంతా ఆత్మయే అయి ఉన్నారు కదా! మరి, "కాదు నేను బద్ధుడను, ఎప్పటికో ఎవరి దయ వలననో ఎట్లో బంధ విముక్తి పొందవలసి యున్నది" అను కుకల్పన ఎందుకు చేస్తున్నారో చెప్పండి? యథార్థానికి "మోక్షము" అనుబడునది కూడా లేదు. ఎవరిపట్ల అయితే...., 'బంధమే కుకల్పితము' (false attribution) అని నిరూపిస్తున్నామో, అట్టి ఆత్మకు మోక్ష వ్యవహారం కూడా మిథ్యయే గాక మరేమిటి?

శ్రీరాముడు: గురువర్యా! మీరు చెప్పుచున్న దానిని అనుసరించి "ఆత్మ, మనస్సు" - అనబడు ఈ రెండింటిలో ఆత్మకు బంధముగాని, మోక్షముగాని ఉండజాలదు. ఈ జీవుడు ఆత్మయే స్వరూపముగా కలిగియున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నది. ఈ మనస్సు దేనిని ఎట్లా నిర్ణయిస్తే అది అట్లే అగుచున్నది. కాబట్టి మనస్సే బంధమై యున్నదా? మనస్సే బంధమునకు, మోక్షమునకు కారణ మగుచున్నదని మీరు చెప్పియున్నారు. అయితే, ఈ మనస్సు యొక్క దర్శనమంతా కల్పితము మాత్రమే కదా! అంతా కల్పితమే అయినప్పుడు, ఈ మనస్సుకు మాత్రం బంధమెక్కడిది?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును, మనస్సు కల్పితమైనదే. చైతన్యము జగద్వస్తువుపై ఆసక్తి కొనియున్నప్పుడు, అట్టి ప్రసరణముయొక్క రీతినే 'మనస్సు' అని అంటున్నాం. అదికాక మనస్సుకు వేరే రూపమేమి ఉన్నది? ఒకడు దీర్ఘస్వప్నంలో చూచిన అనేక పదార్థాలు అతడు జాగ్రత్తుకు వచ్చేసరికి మిథ్యయే అగుచున్నాయి కదా! అదేవిధంగా, బంధమును గూర్చిన అజ్ఞానుల కల్పన మిథ్యయే. జ్ఞానుల దృష్టిలో 'మోక్షము' యొక్క కల్పన కూడా మిథ్యయే. అనిర్వచనీయము, తుచ్ఛము అయినట్టి 'అజ్ఞానము' వలననే ఈ బంధ - మోక్షముల కల్పన అంతా జరుగుచున్నదని గ్రహించు. బంధ మోక్షములు సత్యములేనని అనటం వేద - ఉపనిషత్తులు ప్రతిపాదిస్తున్నదానికి విరుద్ధంకూడా. ఉపనిషత్తులు - "ఓయీ! జీవుడా! నిత్యోదిత చైతన్యస్వరూపుడగు నీకు బంధమెక్కడిది? నీవు సర్వదా అమృత పరమానంద స్వరూపుడవే" అని అవి ఎలుగెత్తి చెప్పుచున్నాయి.* నేను కూడా, నా స్వానుభవముచే "పరమార్థమున బంధమోక్షములు లేవు" అనే ప్రకటిస్తున్నాను.

---

* **"నముముక్షుర్నవైముక్త ఇత్యేషా పరమార్థతః"**
... యథార్థానికి ముముక్షువు గాని, ముక్తుడు గాని లేరు. ఆత్మ మాత్రమే ఉంది.

ఓ ప్రాజ్ఞుడా! రామచంద్రా! "త్రాడును చూచి పామని అనుకోవటం" మొదలైన అనేక దృష్టాంతములచే ఈ "కల్పన" యొక్క అవస్తుత్వము గురించి ప్రబుద్ధుడైయున్న శిష్యుని దృష్టిలో పెట్టుకొని మేము చెప్పుచున్నాం. ఇక ప్రబుద్ధుడు కానట్టి అజ్ఞాన శిష్యుని దృష్టిలో పెట్టుకొని "బంధము – బంధవిముక్తి" మొదలైన తతంగమంతా విశదీకరిస్తున్నాం. "నాయనా! నీవు నిష్కారణంగా 'నేను బద్ధుడను' అను భావం స్వీకరించావు. నీయొక్క బంధమునకు విచారణయే ఉపాయం. నీవెవ్వరో, ఈ దృశ్యమేమిటో గ్రహించు. తద్వారా మోక్షభాగివి కమ్ము" అని బోధిస్తున్నాం. సర్వము గ్రహించిన తరువాత ఆ అజ్ఞాని .... విజ్ఞాని అగుచున్నాడు. ఇక ఆపై అతనికి బంధమోక్షముల ప్రసక్తి అక్కర్లేదు. అట్టి విజ్ఞాన శిష్యునితో సంభాషించునపుడు "బంధ–మోక్షములు లేవు" అను పరమ సత్యం సంభాషిస్తున్నాం. తత్త్వవేత్తలకు బంధ–మోక్షముల వ్యామోహం ఉండదు. బంధ మోక్షముల కల్పనంతా అజ్ఞానియొక్క జ్ఞానాభివృద్ధి కొరకేనని సూక్ష్మబుద్ధితో గ్రహించు. అజ్ఞానిని జ్ఞానిగా తీర్చిదిద్దుటయే గురువుల ధర్మము నిర్వర్తిస్తున్న మా కర్తవ్యమైయున్నదికదా! అందుచేత ప్రథమంలో కొంత కల్పన అవసరమై ఉంటోంది. ఈ విషయములన్నీ తత్త్వజ్ఞులు ఎరిగియే ఉన్నారు. ఓ సత్యవ్రతా! రామా! మాయావేష్టితుడగు పరమాత్మ నుండి మొట్టమొదట మనస్సు, ఆ తరువాత బంధ మోక్షముల గురించిన కల్పన, అటుపై ఈ జగన్నిర్మాణం క్రమక్రమంగా ఒక బాలక్రీడవలె రూఢీ పడుతోంది. ఈ స్థితి అంతా "బాల వినోదము" లోలాగా ఈ జీవునికి ప్రాప్తిస్తోంది. ఈ జగద్దృశ్య బాలవినోదం ఎట్లా ఉంటే ఏం?పరమాత్మయే సర్వదా, అన్నిటా వెలుగొందుచున్నాడని గ్రహించు.

❖❖❖

3. కథావినోదం

శ్రీరాముడు : మునీంద్రా! "బాల వినోదము నందువలె" అని అంటున్నారు కదా! అనగా ఏమిటి? ఆ "జగద్దృశ్య–బాలవినోదం" అనబడే చమత్కారమేమిటో చెప్పండి.

శ్రీ వసిష్ఠమహర్షి : "బాలకాఖ్యాయిక" లేక "బాల వినోదము" అను ఒక మాట అధ్యాత్మ శాస్త్రంలో ప్రచారమై ఉన్నది. దాని వెనుక ఒక కథ ఉన్నది. అదేమిటో చెపుతాను. విను.

❖

అనగా, అనగా, ఒక బాలుడు ఉన్నాడు. అతని బుద్ధి "ఇది నిజము, ఇది కాదు" అనే విమర్శ చేయలేనట్టిది. బుద్ధి మాంద్యము గల ఆ పిల్లవాడు ఒక రోజు తన దాదితో "అవ్వా! నాకు నిద్ర రావటం లేదే. ఏదైనా రాజుల చరిత్ర వినిపించవూ?" అని అంటూ మారాం చేశాడు.

దాది : సరే, అబ్బాయీ! నీ వినోదంకొరకు ఆనందదాయకము, మధుర శబ్దములతో కూడినది అయిన "ముగ్గురు రాజకుమారుల అనుభవాలు" అనే కథ చెప్పుచున్నాను. ఇది విని, నీవు ఎంతో నేర్చుకోవచ్చు.

❖

ఒకచోట ఒక నగరము ఉన్నది. ఆ నగరంలో ఇళ్ళు–వాకిళ్ళు–బాటలు–వృక్షములు... ఇటువంటివేవీ లేనేలేవు. ఆ నగరమంతా 'శూన్యము' తో మాత్రమే నిండియున్నది. ఆ శూన్యనగరంలో ముగ్గురు రాజకుమారులు ఉన్నారు. ఆ ముగ్గురు గొప్ప అందగాళ్ళు, ధార్మికులు, వీరులుకూడా! అయితే, ఆకాశంలో ఎక్కడన్నా ఒక చెరువు ఉంటుందా? ఎక్కడన్నా నీళ్ళలో నక్షత్రాలు ఉంటాయా?

బాలుడు : అబ్బే! ఉండవు. ఉండవు. ఎట్లా ఉంటాయి?

దాది : అదేవిధంగా, ఆ ముగ్గురు రాజపుత్రులలో ఇద్దరు ఇప్పటికింకా జన్మించనేలేదు. ఇక మూడవవాడు, ఇంకా ఎప్పటికో తల్లి గర్భంలో ప్రవేశించవలసియున్నది.

బాలుడు : అవ్వా! ఆశ్చర్యంగా ఉన్నదే ! అయితే ఆ రాజపుత్రుల గురించి నేను వినాలి. ఎందుకంటే పెద్ద అయిన తరువాత నేను కూడా రాజకుమారుడనౌతాను కదా! అట్లాగే చేస్తాను. వాళ్ళేంచేశారు?

దాది : పాపం, దైవవశంచేత ఆ ముగ్గురు రాజపుత్రుల బంధు జనమంతా మరణించారు. అప్పుడు వారు ఎంతో దుఃఖాక్రాంతులయ్యారు. మలిన ముఖంతో ఒకచోట గుమిగూడి, కొంత సమాలోచన తరువాత ఒక నిశ్చయానికి వచ్చేశారు. "మనం ఇక్కడ ఇంకా ఉండి ఏం ప్రయోజనం? మన బంధువులంతా మరణించారాయె! ఇక లాభంలేదు. ఈ శూన్యనగరం వదలి ఏదైనా మరొక నగరం వెళ్ళిపోదాం" అని అనుకొన్నారు. ఒక రోజు వాళ్ళు బుధ – శుక్ర – శనులవలె ఆ శూన్య నగరం నుండి ఆకాశమార్గంలో బయలుదేరారు. ఆకాశ మార్గమధ్యంలో ఎండవేడిమికి ఎంతో తపించారు. అక్కడ (ఆకాశంలో) వేడి ఇసుకలో నడవటం చేత గుఱ్ఱాల కాళ్ళు కాలాయి. మంద నుండి వేరుపడ్డ మృగములలాగా వాళ్ళు ఎంతో పరితాపం పొందారు.

బాలుడు : ఊఁ! ఆ తరువాత?

దాది : అయినాసరే, వాళ్ళు ఆ ఆకాశంలోని ఇసుకతిన్నెలపై (ఇసుక గట్లపై) ఎట్లాగో అట్లా చాలా దూరం పయనించారు. ఒకచోట వాళ్ళకి మూడు పెద్దచెట్లు కనిపించాయి. ఆ మూడు వృక్షాలు లతలతోను, ఫలములతోను, పుష్పములతోను నిండి ఉన్నాయి. వాటి కొమ్మలు అనేక పక్షులకు ఆశ్రయమయి ఉన్నాయి.

అయితే, ఆ మూడు మహావృక్షములలో రెండు ఇంకా మొలవలేదు. మూడవదానికి ఇంకా బీజం ఏర్పడలేదు.

మన రాజకుమారులు అప్పటికే ఎంతో అలసిపోయి ఉన్నారు కదా! అందుచేత ఆ చెట్ల నీడలలో ఇంద్రుడు – అగ్ని – వరుణుడులాగా చాలాసేపు విశ్రమించారు. కొంత సేదతీర్చుకొన్నారు. తృప్తితీరా చాలా పండ్లను భుజించారు. పుష్పములను మాలలుగా చుట్టి ధరించారు.

బాలుడు : చెట్లే మొలవని ఆ పళ్ళు తియ్యగానే ఉన్నాయా? పుల్లగా ఉంటాయా ?

దాది : అబ్బో! భలే తియ్యగా ఉన్నాయి. ఆ తరువాత చాలాసేపు అక్కడే విశ్రాంతి తీసుకొని మరల బయలుదేరారు. చాలా దూరం వెళ్ళిన తరువాత వారికి ఒకచోట తరంగములచే చంచలమై గొప్ప శబ్దం చేస్తూ ఉండే మూడు నదులు కనిపించాయి.

ఆ నదులలో ఒకదానికి గట్లు అనేవి లేనేలేవు. ఇక తక్కిన రెండు నదులలో గట్లేకాదు,.... 'నీరు' కూడా ఉండదు.

గంగలో త్రిమూర్తులు స్నానం చేస్తున్నట్లు సూర్యతాపముచే పీడితులైన ఆ మన ముగ్గురు రాజకుమారులు ఆ మూడు నదులలో తీరికగా స్నానాలు చేశారు. ఎంతోసేపు జలక్రీడలాడారు. స్వచ్ఛమైన ఆ నీరు త్రాగి ప్రసన్నులైనారు.

బాలుడు : గుఱ్ఱాలకు నీళ్ళు పట్టారా ? లేదా ? ఊఁ!

దాది : ఆఁహా! గుఱ్ఱాలకు నీళ్ళు పట్టారు కూడా! ఇంతలో క్రమంగా సూర్యాస్తమయం అయింది. వారికి కనుచూపుదూరంలో నూతనంగా నిర్మించబడిన ఎత్తైన భవనములు కలిగిన ఒక నగరం కనిపించింది. ఆ నగరంలో, విశాల నీలాకాశంలో లాగానే, వృక్షాలు-పూమొక్కలు-జలము ఉండనట్టి సుందరవనములు, శూన్యసరోవరములు ఉన్నాయి. ఆ శూన్యసరోవరాలలో అందమైన కమలములు అప్పుడప్పుడే వికసిస్తున్నాయి. దూరానికి నగరవాసుల గానములు వినిపిస్తున్నాయి. ముగ్గురు రాజకుమారులు ఆ నగరంలో ప్రవేశించారు. అక్కడ వారికి అన్నిటికన్నా ఎత్తైన మూడు భవనాలు కనిపించాయి.

వాటిలో రెండింటికి నేల, పునాదులు లేవు. మూడవదానికి గోడలు కూడా లేవు.

వారు మొదటి రెండు భవనాలను వదలి, గోడలు - నేలకూడా లేనట్టి మూడవ గృహంలో ప్రవేశించారు. ఆ రాజకుమారులు తమ అందమైన ముఖములతో ఆ భవనంలో పచార్లు చేయసాగారు. అట్లా సంచరిస్తూ ఒకచోట బంగారంతో తయారైన మూడు పాత్రలు చూచారు.

ఆ పాత్రలలో రెండు కపాలములవలె అన్ని వైపులా మూసుకొని ఉన్నాయి.

ఇక మూడవపాత్ర 'చూర్ణం' (Powder) రూపంలో ఉన్నది.

వారు ఉత్తమధీశాలురు కదా! అందుచేత చూర్ణమైన పాత్రనే ఎంచుకొన్నారు. దానితో అప్పటికప్పుడు పదిశేర్లు అన్నమును, తదితర పదార్థములను వండుకొన్నారు. మరి ఆ ముగ్గురూ ఏమన్నా సామాన్యులా? గొప్ప ధర్మబుద్ధి కలవాళ్ళాయె! అందుచేత వాళ్ళు భోజనం చేయటానికి అతిథులుగా ముగ్గురు బ్రాహ్మణులను ఆహ్వానించారు.

అందులో ఇద్దరికి దేహాలే లేవు. ఒకనికి ముఖము కూడా లేదు.

ఓ బాలకా! వింటున్నావా!

బాలుడు : ఓఁ! బాగా వింటున్నాను. భలేగా ఉన్నది. ఇంకా చెప్పు. అప్పుడేం జరిగింది?

దాది : ఇంకేమున్నది? వారిలో ముఖములేని అతిథి ఉన్నాడు చూచావా? అతడు అన్నములోని చాలాభాగం తినివేశాడు. ఇక మిగిలిన దానిని ఆ ముగ్గురు రాజకుమారులు సుష్టుగా భోంచేశారు. తృప్తిచెందినవారై, అప్పటికీ-ఇప్పటికీ కూడా లేనట్టి - భవిష్యత్తులో ఎప్పటికో ఉండబోయే.... ఒకానొక నగరంలో (భవిష్యన్నగరంలో) వేటాడటానికి వెళ్ళారు. వారు నేటికికూడా అట్లే వేటాడుచూ

సుఖంగా ఉన్నారు. ఆ భవిష్యన్నగరంలోని మృగాలు – పక్షులు ఆ రాజకుమారులు వేటాడుతూ ఉంటే – తోడుగా ఉంటూ ఉన్నాయి.

ఓ అబ్బాయ్! ఈ ఉత్తమమైన చరిత్రను మొదటినుండి చివరిదాకా విన్నావు కదా! ఇది మరిచిపోకూడదు సుమా! దీనిని చక్కగా నీ మనస్సులో పెట్టుకో. అప్పుడు గొప్ప పండితుడవు అవుతావు. సరేనా?

బాలుడు : అవ్వా! అలాగే. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నీవు నిద్రపో. నేను ఇట్లా ఆ రాజకుమారులను మననం చేస్తూనే పడుకొంటాను.

❖

ఓ రామచంద్రా! నీకు ఇంతకుముందు "చిత్తాఖ్యానం" చెప్పానుకదా! ఇప్పుడు, 'ఈ జగత్తంతా మనోవికల్పం మాత్రమే' అని నిరూపించటానికే దృష్టాంతపూర్వకమైన ఈ 'బాలవినోదం' చెప్పాను. సంకల్ప – కల్పనలన్నీ దృఢపడటంచేతనే ఈ 'సంసార రచన' అంతా స్థిరత్వం పొందుతోంది. ఈ కల్పనా దృశ్యమంతా ప్రతిభాసా రూపమే. అయినప్పటికీ, ఈ బంధమోక్ష వ్యవహారమంతా విస్తరింప జేస్తోంది. "ఇది ఎట్లా సాధ్యం!" అని ప్రశ్నించుకోకుండానే, ఆ పిల్లవాడు ఆయా సంఘటనలు వింటూ ఎంతగా ఆనందించాడో చూచావా! జీవుడు కూడా ముందు – వెనుకలను పరిశీలించకుండానే ఈ "భావములు–అభిప్రాయములు–నిర్వచనములు–సంబంధములు, ఉద్వేగములు (Perceptions, Opinions, Definitions, Relationships, Emotions etc.)" .... మొదలైన వాటిని అవధరిస్తున్నాడు.

ఈ కనపడేదంతా సంకల్పమాత్రమేగాని వేరే ఏమీ కాదు. సంకల్పముచే భాసించేది యథార్థ మెట్లా అవుతుంది చెప్పు? ఇదంతా వాస్తవానికి లేనిదిగా, అనిర్వచనీయంగా చెప్పబడింది. ఈ ఇంద్రియములు, ఇవి గాంచుచున్న భూమి–ఆకాశము–వాయువు–దిక్కులు–పర్వతములు మొదలైన పదార్థజాలం .... స్వప్నములోని వస్తువులవలె ఊహామాత్రము, అసత్త్వ్యల్యము అయి ఉన్నాయి. నేనిప్పుడు చెప్పిన భవిష్యన్నగరంలోని ముగ్గురు రాజకుమారులు, నదులు, ముగ్గురు అతిథులు 'సంకల్ప మాత్రమే' అయినప్పటికీ, ఆ పిల్లవాడుమాత్రం అంతరంగమునందు ఉత్సుకత, అభిలాష, వికల్పములు పొందుచూనే ఉన్నాడు కదా!

"ఈ జగత్తు యొక్క అనుభూతి అంతా సంకల్పమాత్రమే" అనటంలో ఏమాత్రం సందేహం లేదు. అయితే. ఆత్మతత్త్వజ్ఞానము ఎరిగినవారు, జ్ఞానదృష్టికలవారు ఈ సత్యమును గ్రహించగలుగు చున్నారు. వారికి మాత్రమే అది గ్రాహ్యమగుచున్నది. ఇక తక్కినవారంతా 'ఇది సత్యమే' అని భావించుచు, ఒక అనుభవమునుండి మరొక అనుభవమునకు ప్రయాణిస్తూనే ఉన్నారు. అట్టి ప్రయాణమునకు 'అంతు' ఉండుట లేదు. అనేక తరంగములుగా కనబడుచున్నదంతా సముద్ర జలమే అయినట్లు, ఈ స్ఫురించునది, – మరియు ఇట్లు స్ఫురించుదాని అనుభవము పొందుచున్న "ఖండభావన" తో కూడిన 'ద్రష్ట' లేక 'జీవుడు' కూడా సంకల్పమాత్రమే. పరమాత్మ నుండి మొట్టమొదట సంకల్పము మాత్రమే ఉదయించింది. ఆ తరువాత, ఈ "ప్రాణుల యొక్క మరియు సూర్యుని

యొక్క" దైనందిన క్రియలచే 'కాలము' విస్తరిస్తోంది. క్రమంగా ఆ కాలమును అనుసరించి ఈ జగద్రూపమంతా విస్తారం పొందుతోంది.

కాబట్టి రామా! ఈ ప్రపంచమంతా సంకల్పరూపమే. మనోవికారములు, రాగద్వేషవృత్తులు, వాటికి సంబంధించిన తదితర విషయములు - ఇవన్నీ సంకల్పమాత్రమే. కనుక, నీవు నిర్వికల్ప (వికల్పములు లేనట్టి) సమాధి (మానసిక సుస్థిరత) ను ఆశ్రయించు. అనగా, సర్వసంకల్పములకు ఆవల గల "స్వస్వరూపము"ను అభ్యసిస్తూ-ఆస్వాదిస్తూ ఉండు. సర్వసంకల్పములనుఅధిగమించిన వాడవై ఉండు. అట్లు సంకల్పములను త్యజిస్తే ఇప్పుడే, ఇక్కడే, ఇదంతా ఇట్లు ఉంటూ ఉండగానే నీవు పరమశాంతిని పొందగలవు.

❖❖❖

4. నీకెక్కడి బంధం? నిదురలే!

అజ్ఞాని తన యొక్క సంకల్పవశం చేతనే మోహితుడగుచున్నాడు. జ్ఞానికో, ... మోహమే ఉండటం లేదు. ఆహాఁ! అజ్ఞుడు, నాశరహితమగు పరమాత్మ యందు క్షణభంగురము, భావనాను సరణము, అనుక్షణ పరిణామయుతము అగు 'జగత్తు' అనబడు దానిని మనస్సు యొక్క సంకల్పం చేత గాంచుచున్నాడు. భ్రాంతిని పొందుచున్నాడు.

శ్రీరాముడు : ఓ బ్రహ్మవిద్వరా! ఈ ఆత్మ మహామోహమయమగు సంసార భ్రమను దేని వలన పొందుతోంది? "నశ్వరము",* అగు సంకల్పములను కల్పన చేస్తున్నదెవరు? నిత్యాత్మ చేస్తోందా? లేక నశ్వరాత్మ చేస్తోందా? జగత్పారవస్యమును పొందుతోంది నిత్యాత్మయా! నశ్వరాత్మయా? అహంకారమా?

"నిత్యాత్మ చేస్తోంది" అనటానికి వీలు లేదు. అట్లా అంటే సంకల్పముతోబాటు అదీ నశించాలి. అప్పుడు ఆత్మయొక్క నిత్యత్వానికి హాని కలుగుతుంది కదా!

ఇక "నశ్వరాత్మ తన సంకల్పముచే తనను రచించుకొంటోంది" అని ఎట్లా అంటాము? అట్లా అంటే, ఆత్మను మరొకటేదో వచ్చి ఆశ్రయించుచున్నట్లు అవుతుంది కదా? అది కూడా వేదవాక్యములకు సరిపోదు. సంకల్పితమగు నశ్వరాత్మ జడమా? చేతనమా? 'జడము' అని అంటే, అది చిదాత్మతో ఐక్యం ఎట్లా పొందుతోంది? 'చేతనము' అందామా? చిద్వస్తువు నిష్క్రియము కదా! అది ఎట్లా సంకల్పిస్తుంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : పరమాత్మ 'అహం' అను అనుభవరూపముగల అవిద్యతో కూడుకొని ఈ సర్వప్రాణులందు ఉండిఉన్నాడు. బాలుడు దయ్యములను హృదయంలో కల్పించుకొని వాటిని బాహ్యమున చూస్తాడు చూచావా? అట్లే ఆ పరమాత్మ ఈ నశ్వర-సంకల్పాత్మకులగు ప్రాణులను

---

* **నశ్వరము :** ఏ క్షణమునందునూ నిలకడయే లేనట్టిది; ఎప్పటికప్పుడు మార్పుకు లోనగునట్టిది.

మిథ్యా రూపములుగానే కల్పించుకొని దర్శించుచున్నాడు. "ఒకే పరమాత్మయందు అంతయు స్థిర పడియున్నది" అనునది నిర్వివాదాంశము. ఇక "అహంకారము" అనబడునది వేరొకటి ఎట్లా ఎక్కడ ఉంటుంది? వాస్తవానికి పరమాత్మ భేదరహితుడు. భేదరహితుడగు పరమాత్మ యందు 'అహంకారము' అనునదే లేదు. అతడు సర్వదా అఖండుడే. కాని మండుటెండలో మృగతృష్ణ కనబడునట్లు, స్వతహాగా ఏమాత్రం లేనట్టి అహంకారము భ్రాంతిచే భాసించుచున్నది. ఏది భ్రాంతి మాత్రమే అయి ఉన్నదో అట్టిదానిని "ఇది అసత్యమే కదా!" అనే దృష్టిచే దర్శించటమే జ్ఞానం. అనిత్యమైన దానిలో నిత్యాత్మే దాగి ఉన్నది. నిత్యాత్మలోనే అనిత్యమైనది కనబడటం జరుగుతోంది.

జలము తనయందు తానే 'తరంగము' రూపమున వ్యక్తమగుచున్నది కదా!

"ఆత్మానాత్మనమాశ్రిత్య, స్ఫురత్యతః యథా అంబసా"

"ఈ ఆత్మ తనను తానే (మనస్సు రూపమున) ఆశ్రయించినదై, అటుపై తానే కార్యరూపమగు, (As an Eventuality) ఈ జగత్తుగా ప్రకటితమగుచున్నది" అని మేము ఈ జగత్తు విషయమై గ్రహిస్తున్నాం. కనుక ఓ విజ్ఞానఖనీ! రామచంద్రా! అసద్విషయము, (that which is not infact true) గురించిన భ్రాంతిని నీవు త్యజించు. ఇక అహంకారము విషయానికి వస్తే ...... జాగ్రదహంకారం స్వప్నంలో లేదు. స్వప్నాహంకారం సుషుప్తిలో లేదు. కనుక అహంకారం స్వతహాగా లేదు. స్వతహాగా లేనట్టి ఈ అహంకారమును చూచి, "అయ్యో! దీనిని నేను ఎట్లా తొలగించుకోవాలి?" అనే భ్రమాత్మక మైన ప్రయత్నము అనవసరం. అసత్యమును అసత్యముగానే దర్శించు. సత్యస్వరూపము, ఆనంద మయము అగు 'సమ్యక్‌దర్శనము' (Perception of Equality in all) నే ఆశ్రయించు. అట్టి సమ్యక్‌స్థితియే పరమాత్మ యొక్క స్వరూపము.

అజ్ఞానరహితుడవై సునిశితమైన బుద్ధిచే ప్రయత్నపూర్వకంగా ఆత్మతత్త్వ విచారణ చేయటమే ఉచితం. అసద్వస్తువు గురించి ప్రయత్నము, అనగా,"ఈ నా అహంకారము తొలగించుకొంటాను" అనే అభినివేశము ఉచితం కాదు.

అబద్ధో బద్ధ ఇత్యుక్త్వా కిం శోచసి ముధైవహి?
అనంతస్య ఆత్మతత్త్వస్య కిం, కథం, కేన బధ్యతే?

ఓ రామచంద్రా! ఓ సర్వజనులారా! మీలో ఏ ఒక్కరు బద్ధులు కానేకారు. మరి మీరు "నేను బద్ధుడను. విముక్తి ఎప్పటికి?" అని తలచుచూ ఎందుకు అనవసరంగా దుఃఖిస్తున్నారు? మీ అందరి వాస్తవస్వరూపము ఆత్మయే కదా! అనంతమగు ఆత్మ ఎవనిచే ఎట్లు బంధింపబడగలదు? ఆహా! భేదరహితమగు పరమాత్మయందు భేదాభేదముల గూర్చిన భ్రాంతి కల్పించబడుచున్నది. తొలగవలసింది భ్రాంతి మాత్రమే. భ్రాంతి తొలగగానే, ఇక బంధమేమిటి? ముక్తి ఏమిటి? ఆత్మ యందు వాస్తవానికి ఈ దేహాదులు లేవు. అది దేహరహితమే అయినప్పటికీ, దేహముతో కూడి యున్నట్లు కనిపించుచున్నది. ఈ దేహము ఛిన్నాభిన్నమవవచ్చు గాక! ఆత్మకు వచ్చే హాని ఏమీ ఉండదు. భేదా భేదములు, తదితర వికారములు ఈ శరీరమునకే గాని, ఆత్మకు ఉండవు. ఈ

దేహము నశించవచ్చు. లేక, అనేక గాయములచే, పుండ్లచే నిండిపోవచ్చు. ఎంతో బలం పుంజుకోవచ్చు. లేక క్షీణించవచ్చు. ఇవన్నీ ఆత్మకు సంబంధించినవే కావు. కంసాలి (లేక వడ్రంగి) ఉపయోగించే కొలిమివద్ద ఉండే తోలుతిత్తి చిరిగిపోవటం జరిగితే అందలి వాయువుకు ఏమైనా హాని కలుగుతుందా? సూర్యకిరణములు గోడపై పడుచున్నప్పుడు, ఆ గోడ నేలకూలటం జరిగితే సూర్యకిరణములు పోగొట్టుకున్నదేముంటుంది? ఈ దేహము యొక్క, మరియు ఈ జగత్తు యొక్క ఉత్పత్తి - వినాశనములచే ద్రష్టలగు మనకు వచ్చే హానిగాని, లోపముగాని ఏమీ ఉండదు. "నేను శరీరము కంటే విలక్షణ స్వరూపము కలవాడను. అట్టి నా యొక్క స్వరూపమునకు ఈ శరీరాదులవలన, తదితర భావాదులవలన కలిగే మార్పు చేర్పులేమి ఉంటాయి?" అనియే మనం భావించాలి. ఓ రామా! "దేహము-ఆత్మ" ఈ రెండింటికీ సంబంధము "మేఘము - ఆకాశము" ల సంబంధము వంటిది మాత్రమే. ఈ జగద్రూపమంతా మనస్సే. మనోరూపమగు ఈ జగత్తు యొక్క అంతర్లీనశక్తి చిదాత్మయే. ఆ చిదాత్మ మనస్సు కంటే కూడా అతి సూక్ష్మమైనది. అది ఎన్నటికీ నశించేది కాదు.

ప్రజ్ఞాస్వరూపమునకు జనన-నాశనాది వికారములు ఉండవు. అది ఎచ్చటికీ పోదు. ఎక్కడి నుండి రాదు. "ఆత్మ" సర్వవేళల అవినాశి అయిఉండగా, ఇక ఈ దేహాదుల వినాశమునకు ఎందుకు దుఃఖితులం కావాలి? ఒక మేఘం నశిస్తే, దానిని తాకుచున్న వాయువు ఏమౌతుంది?

శ్రీ రాముడు : మరొక మేఘమును తాకుతుంది. లేదా, ఆకాశమును పొందుతుంది.

శ్రీ వసిష్ఠ మహర్షి : అంతేగాని, మేఘము నశించినంతమాత్రం చేత, దానిని తాకుచున్న వాయువు నశించదు కదా! ఈ దేహము నశించటం జరిగినప్పుడు బద్ధాత్మ మరొక దేహమును పొందుతుంది. 'ముక్తాత్మ' అయితే పరమపదమునే పొందుచున్నది. ఇందులో దుఃఖించవలసిన విషయమేమున్నది? ఈ సంసారంలో పరిభ్రమిస్తూనే ఉంటున్నట్టి జీవుని మనస్సే శాశ్వతమై ఉంటూ ఉంటుంటే, ఇక, ఆత్మ విషయం వేరుగా చెప్పాలా?

నాశనభూతమగు ఈ దేహమునకు అవినాశియగు ఆత్మకు ఉన్న సంబంధం, కుండ బదర న్యాయము వంటిది.

ఒక కుండలో ఒక ఫలము వున్నది. ఏదో ప్రమాదవశాత్తు ఆ కుండచిట్లిపోయింది. అంతమాత్రం చేత ఫలము నశిస్తుందా? శరీరము నశించినప్పుడు ఈ జీవాత్మ చిత్తాకాశమును పొందుచున్నది. అట్లాగే, పగిలినప్పుడు కుండలోని ఆకాశము ఏమౌతోంది? కుండలోపల, కుండ బయట కూడా ఉన్నట్టి మహాకాశముతో లీనమగుచున్నదికదా! అసలు, "కుండలోని ఆకాశము కుండ పగులుటచే బాహ్యకాశమున లీనమగుట" అనునది మాత్రం ఎక్కడున్నది? ఆకాశమంతా సర్వదా అఖండంగా ఉండి ఉన్నదికదా! చిత్తము కూడా క్షయించినప్పుడు ఈ జీవుడు అఖండుడు అగుచున్నాడు. మహాకాశ స్వరూపుడుగా వెలుగొందుచున్నాడు.

ఈ ప్రాణుల యొక్క మనోమయదేహము 'మృత్యువు' అనే వస్త్రం కప్పుకొని 'దేశ-కాలములు' అనే ప్రదేశము లందు దాగుకొనుచున్నది. ఆత్మ వస్తువుకు చిత్ర విచిత్రములైన రంగులను

పూయుచున్నది. ఇట్టి మోసయుక్తమైన మనస్సు గురించి నీవు తపించవలసిన పనేమున్నది? ఇక మరణము మాటేమిటంటావా? పాపం అనేక గృహవ్యవహారములందు నిమగ్నమైన ఈ జీవుడు అంతిమశ్వాస సూచితమగు మరణమువరకు 'ఆత్మ' యొక్క స్వభావమేమిటో, ఎంతటిదో ఎరుగకయే ఉంటున్నాడు. తనపై తనకే సమగ్రమైన-అవగాహన లేకుండుటచే అనేక భ్రమలకు లోనగుచున్నాడు. ఆత్మ మరుగునపడుటయే మరణము. ఆత్మను ఎరుగనట్టి మూర్ఖుడు మాత్రమే "అయ్యో! నేను చచ్చుచున్నాను" అనే భావావేశము పొంది 'మరణము' అనుదానిని గాంచుచున్నాడు. ఆత్మయే స్వరూపముగా గలిగిన నీకుగాని, నాకుగాని, మరింకెవ్వరికిగాని మరణమనేదేదీ లేదు. మనమంతా అమృతానంద స్వరూపులమే. నిత్యత్వము, అప్రమేయత్వము మన సహజ స్వభావమే అయిఉన్నది. మరిక మరణము గురించి భయమెందుకు? ఈ మరణమనునది జీవునియొక్క ప్రారంభముగాని, అంతముగాని కాదు. లోకంలో ఎవరైనా "నేను లేకుండా పోవుచున్నాను" అను అనుభవం పొందు చున్నారా? అట్టిది ఎవరూ గాంచుటలేదు. జ్ఞాని తన యొక్క శరీరము తొలగినపుడు 'స్వసత్త' (Self State with the sense - "I exist") ను అనుభవిస్తూనే ఉన్నాడు. కనుక అతనికి మరణానుభవం లేదు. వాసనలతో కూడిన అజ్ఞానియొక్క మనస్సు జన్మలను, మృత్యువులను ఎప్పటికప్పుడు పొందుచూ, అనుభవిస్తూనే ఉన్నది. కనుక, 'మరణము'-అతని విషయంలో-మరొక దేహమునకై 'నాంది' పలుకుటయే అగుచున్నది.

రెక్కలు వచ్చిన తరువాత పక్షి గూటిలో ఇక ఉండదుకదా! అట్లాగే నీవు ఈ 'వాసనలు' అను గూటిని త్యజించివేయి. మనఃశక్తియే ఇష్ట-అయిష్ట వస్తువులందు, రాగ-ద్వేషములు కలిగి ఉంటున్నది. తద్వారా బంధమున తగుల్కొనుచున్నది. స్వప్నంలోలాగా, మనస్సు భ్రాంతి చేతనే ఈ 'కల్పన' అంతా వ్యర్థంగా చేసుకొంటోంది. ఇది అవిద్యారూపమే కదా! కాబట్టి ఈ మనస్సును నశింపజేయటం సుఖప్రదం. ఇది అభివృద్ధి పొందుచున్నప్పుడు దుఃఖమే కలుగుచున్నది.

'మనస్సు వృద్ధి పొందుట' అనగా అవివేకము పరిఢవిల్లుటయే.

శ్రీ రాముడు : ఈ మనస్సు నిరంతరం తుచ్ఛత్వం, మలినత్వం ఆశ్రయిస్తోందే? ఎందుచేత? దీనిని నిరోధించటం ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : తత్త్వజ్ఞానముయొక్క 'అల్పత్వము' చేతనే ఈ మనస్సు మిథ్యారూపమైనట్టి ఈ జగత్తును విస్తరింపజేస్తోంది. మంచుతోను, మేఘములతోను కప్పబడినప్పుడు ఆకాశము మలినమైనట్లు కనబడుతుంది. కాని, వాస్తవానికి ఆకాశము సర్వదా నిర్మలమైనదే కదా! స్వతహాగానే స్వచ్ఛమే అయినట్టి ఆకాశము మలినమొనర్చగలిగేది ఏది ఉన్నది చెప్పు? ఇక ఈ మంచు, మేఘములు అంటావా .... అవన్నీ వస్తూ, పోతూ ఉంటాయి. అంతమాత్రంచేత అవి ఆకాశమును తాకలేవు, మార్చలేవు కదా! భ్రాంతిచేతనే నీ మనస్సు "నేను సహజంగా తుచ్ఛమైనదానను. మలినమైన దానను" అని భావించుచున్నది. అది ఏమాత్రం వాస్తవం కాదు.

❖

మానసిక శక్తియే దీర్ఘస్వప్నము వంటి మిథ్యారూపమగు ఈ జగద్వైచిత్ర్యమంతటినీ సత్యమైనదానివలె కల్పన చేయుచున్నది. ఒక చిన్న దృష్టాంతము విను. ఒకని కంటికి 'తిమిర-రోగము' (a disease that leads to constant movement of eye-lids) అనే వ్యాధి వచ్చినదనుకో ... అప్పుడాతడు ఆకాశంలో రెండు చంద్రులను, రెండు సూర్యులను చూస్తాడు.

1) రెండు చంద్రులు కనబడుటకు కారణం? చంద్రుడా? కాదుకదా! కంటియొక్క దోషమే అట్లు కనబడుటకు కారణమగుచున్నది.

2) రెండవది దృష్టిదోషమును ఆశ్రయించి ఉన్నప్పటి భావనామాత్రవైచిత్ర్యమే కదా! అంతేకాని, సత్యం కాదు కదా!

మానసిక శక్తియే జగత్తుయొక్క ఆకారమును భావనామాత్రంగా గాంచుచున్నది. కనుక ఈ జగత్తు యొక్క కర్తృత్వమును మనస్సుకే ఆపాదించక తప్పదు. రెండు చంద్రులు కనబడుటకు చంద్రుడు కారణం కానట్లు ఈ జగత్తుల స్థితికి ఆత్మకారణం కాదు. దృశ్యము కూడా కారణం కాదు. ఉన్నదంతా ద్రష్టయొక్క మనోరాజ్యములోనే ఉన్నది.

ఓ రామా! సూర్యుడు తన తీక్ష్ణ కిరణాలతో మంచును కరిగించివేస్తాడు చూచావా? నీవుకూడా ఆత్మవిచారణచే మనస్సుయొక్క స్వరూపమును నశింపచేయి. తత్త్వవిచారణచే చిత్తము లయంకాగా, "నిర్మలాకాశం" లాగా ఆత్మసాక్షాత్కారం తప్పక సిద్ధించగలదు. ఓ సర్వసభికులారా ఆత్మతత్త్వము ఎరుగకపోయారా .... అనేక అనర్థములు కలిగించగల అవిద్య పలువిధములైన జన్మలకు, అనేక రకములైన బ్రహ్మాండముల అనుభవమునకు కారణం కాగలదు.

ఈ మనస్సు ఆత్మను ఆశ్రయించటం జరుగుచున్నప్పుడు తనను తానే వివేక - వైరాగ్యములచే నాశనము చేసుకొంటోంది. అందుకే కవులు, "మనస్సు ఆత్మను సమీపిస్తున్నప్పుడు స్వసంహార నాటక పాత్ర ధరించి నృత్యం చేస్తోంది" అని వర్ణిస్తూ ఉంటారు. తనయొక్క నాశనము కొరకే ఇది ఆత్మను దర్శించుచున్నది. ఆత్మ ప్రాప్తించనంతకాలం తన నాశనము ఎట్లా సాధ్యమో తానే ఎరుగలేకపోతోంది. దుర్బుద్ధికలవాడు తాను పొందుచున్న సంకటములకు, దౌర్బల్యములకు తానే కారణం అని ఎరుగలేడు చూచావా? ఇది కూడా అట్టిదే. ఏ వివేకులైతే మనోనాశనమును వాంఛించు చున్నారో, అట్టివారి అభీష్టమును ఈ మనస్సు తప్పక, సంకల్పబలమును అనుసరించి, సిద్ధింప చేస్తోంది. కాబట్టి ఈ మనస్సు ఆత్మయొక్క ఇచ్ఛను అనుసరించే ప్రవర్తిస్తోందని గ్రహించు. ఆత్మకు ఇచ్ఛగల వ్యవహారములను నిర్వర్తించటంలో ఈ మనస్సుకు క్లేశమేమీ ఉండదు. వివేకము, ఉత్తమ సంస్కారములు గల చిత్తము తన యొక్క వివేకబలమును అనుసరించి ఇతఃపూర్వపు సర్వసంకల్ప వికల్పములను త్యజించివేస్తోంది. ఆశలన్నిటినీ వదలుచున్నది. అప్పుడిక సహజంగానే బ్రహ్మాకారవృత్తి కలిగి ఉంటోంది.

మనస్సు లయించినప్పుడు పరమపురుషార్థమగు మోక్షము స్వయముగానే సిద్ధించుచున్నది.

"మనస్సుకన్నా ముందే స్వసత్తస్వరూపుడనై నేను ఉండనే ఉన్నాను" అను ఎరుక, అట్టి ఎరుకతో కూడిన సుస్థిరస్థితియే 'మనోనాశనము' అనే శబ్దముచే చెప్పబడుతోంది, ఉద్దేశించబడుతోంది కూడా! మనస్సు కన్నా (ఆలోచనల కన్నా) ఆ "ఆలోచనలు చేయుచున్నవాడు" మునుముందుగానే ఉండాలి కదా! అతడే ఆత్మ యొక్క ఉనికికి తార్కాణం. అతని గురించిన మననమే "ఆత్మోపాసన–మోక్షస్థితి కూడా".

అట్టి మోక్షస్థితిలో దుఃఖములన్నీ శమించుచున్నాయి. కనుక ఓ రాఘువా! అట్టి మనోనాశనము కొరకే నీవు ప్రయత్నించాలి. అంతేగాని.... మనోవిస్తృతి, విస్తరణ– కొరకు నీ ప్రయత్నములను వ్యర్థం చేసుకోరాదు సుమా! సంసారమనే ఘోరారణ్యం మిక్కిలి దట్టమైనది. ఈ అరణ్యంలో 'సుఖ – దుఃఖములు' అనే అసంఖ్యాకములైన వృక్షములు, 'మృత్యువు' అనే కొండచిలువ నివసిస్తున్నాయి. ఈ అరణ్యమునకు అవివేకముతో కూడిన మనస్సే ప్రభువు. అన్ని విపత్తులకు అవివేకమే హేతువు. కనుక జాగరూకుడవై ఉండాలి సుమా!

❖❖❖

IX.మహేంద్రజాలం

పరిచయము
1. చిత్త విన్యాసము - జగద్రూపము

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ సభికులారా! ఇక మనం తొమ్మిదవ రోజు విచారణలో ప్రవేశిస్తున్నాం.

సముద్రంలో తరంగాలు ప్రకటితమౌతాయి చూచారా? పరమాత్మయందే ఈ చిత్తము ప్రకటితమై, క్రమంగా విస్తారమగుచున్నది. అది అల్పకాలంలో హ్రస్వమును దీర్ఘంగాను, దీర్ఘమును హ్రస్వంగాను చేసివేయుచున్నది. తన రూపమును అన్యముగాను, అన్యమైనదానిని తన రూపముగాను ఒక్క క్షణంలో మార్చివేయుచున్నది. ఆత్మను 'అనాత్మ' గాను, 'అనాత్మ' ను ఆత్మగాను అనుభవించుచున్నది. ఈ చిత్తముయొక్క వైచిత్ర్యము, చమత్కారము అంతటిది. అది తాను చూడని వస్తువును కూడా తన భావనచే అత్యంత ఘనీభూతముగా పొంది అనుభవించగలదు.

బ్రహ్మ చైతన్యమునుండి వికాసము పొందిన ఈ మనస్సు ఒక్క నిమిషంలో అనేక బ్రహ్మాండములను నిర్మించుచూ, మరల వినాశనమొనర్చగలదు. రాఘవా! స్థావరజంగమములతో (Non-moving, moving) కూడిన ఈ దృశ్యమాన ప్రపంచమంతా కూడా చిత్తమునుండే ఆవిర్భవిస్తోంది సుమా! అట్లు ఆవిర్భవించి దేశ-కాల-క్రియా శక్తులచే సర్వదా పూర్ణమై ఒప్పుచున్నది. ఒక నటుడు అనేక వేషములు వేయుచున్నట్లు ఈ మనస్సు తన చంచలత్వకారణంగా ఎల్లప్పుడు భావనా శక్తిచే సత్యమును 'మిథ్య' గాను, 'మిథ్య' ను సత్యముగాను చేసివేయగలుగుతోంది. స్వయంకల్పితోపార్జితమైన అనేక సుఖ-దుఃఖములను స్వీకరించి అనుభవిస్తోంది. అది దేనిని సుఖముగా భావిస్తే అది సుఖముగాను, దేనిని దుఃఖంగా భావిస్తే అది దుఃఖముగాను పొందుచుండుట గమనార్హం. ప్రాప్తించిన వస్తువులను, విషయములను ఎప్పుడు ఏవిధంగా ('అనుకూలం' అనో, లేక 'ప్రతికూలం' అనో) గ్రహిస్తుందో, అప్పుడు ఈ కాళ్ళు-చేతులు-చెవులు ....మొదలైన ఇంద్రియాలన్నీ అట్లే ప్రవృత్తం అగుచున్నాయి. "ఇది సుఖరూప ఫలము-ఇది దుఃఖరూప ఫలము" అని ఏ క్రియను ఈ చిత్తము సంకల్పించి ఆచరిస్తుందో, అది అట్లే పరిణతి చెందటం జరుగుతోంది. పిల్లలు ఇంటిలో మట్టితో అనేక బొమ్మలు తయారుచేసి "ఇది రాజు-ఇది రాణి-ఇది మంత్రి-ఇవి సైనికులు-ఇవి శత్రురాజులు -ఇవి శత్రురాజుల గుఱ్ఱాలు" ....అని కల్పనచేసుకొని ఆడుకొంటారు చూచావా? అదేవిధంగా ఈ మనస్సు కూడా ఈ ఈ 'జగత్తు' అనే వికల్పములన్నీ నిర్మించుకొని క్రీడించుచున్నది. అట్టి క్రీడలోనే నవ్వటం, ఏడ్వటం, సుఖించటం, దుఃఖించటం, గర్వించటం, అవమానపడటం, కోపించటం... మొదలైన అనేక క్రియలు నిర్వర్తిస్తోంది. మనస్సుయొక్క సృజనాత్మకమైన 'బాలక్రీడ' యందు ఈ

మనుజుల దేహములు, తదితర దేహములు మట్టితో చేసిన ఆటవస్తువుల వలె ఉంటున్నాయి. అట్టి మట్టి ప్రతిమల వంటి తదితర దేహములందు, "ఇవన్నీ సత్యమే" అను సత్యత్వబుద్ధి చిత్తముచే కల్పించబడుచున్నది. కాని ఇదంతా మిథ్యయే అయి ఉన్నది. ఆహాఁ! ఈ చిత్తము పదార్థములన్నిటి యందు అనేక మార్పులను కలుగజేయుచూ, భేదమును ప్రదర్శించుచున్నది. స్వప్నము నందు, సంకల్పము నందు, మనోవీథియందు ఈ చిత్తము దీర్ఘకాలమును స్వల్పంగాను, అనేక యోజనముల దూరం బెత్తెడంతగాను చేసివేస్తోంది. ఓ రామా! సూక్ష్మబుద్ధి కలిగియున్నవాడవై, ఈ చిత్తముయొక్క చిత్ర–విచిత్ర కథనమంతా గమనించుచూ ఉండు.

❖

మనస్సు క్షణమును కల్పంగాను, కల్పమును క్షణంగాను చేసివేయగలదు. అందుచేతనే – "దేశకాలములు మనస్సుచేతనే భావించబడుచున్నాయి. అట్టి భావనయే 'అనుభవం' అగుచున్నది. అందుచేత అవి మనస్సుయొక్క అధీనంలోనే ఉన్నాయి" అని విజ్ఞులు చెపుతూ ఉంటారు. ఈ మనస్సు రజోగుణమును అధికముగా ఆశ్రయిస్తున్నప్పుడు తీవ్రమైన కార్యశీలత్వమును, తమోగుణం అధికంగా కలిగియున్నప్పుడు మందత్వమును పొందుతోంది. ఏ కార్యమునందైతే ఈ మనస్సు అధికంగా ప్రసరించి ఉంటోందో ఆ కార్యము ఆ రీతిగానే తప్పక సిద్ధిస్తోంది. దేనియందైతే ఈ మనస్సు మందకొడిగా ఉంటుందో, అట్టి కార్యక్రమము కష్టసాధ్యముగాను, అయిష్టముగాను తోచుచూ ఉంటుంది. మనస్సు యొక్క ఏకాగ్రత ఆత్మ సందర్శనాయుతంగా ఉన్నదా; ... ఇక, సర్వ విలంబనము లను ఈ జీవుడు తప్పక అధిగమించగలడు. చెట్టునుండి కాండములు, ఆకులు, పూలు, మొదలైనవన్నీ వస్తున్నట్లు, ఈ భ్రమలు, వ్యామోహములు, దేశకాలాదులు, గమనాగమనములు – ఇవన్నీ చిత్తము నుండే బయల్వెడలుచున్నాయి.

"అగ్ని" అంటే ఉష్ణత్వమే అయి ఉన్నది కదా!

'సముద్రము' అనగా జలము మాత్రమే కదా!

ఈ వివిధ సాంసారిక కార్యక్రమమంతా సంకల్పముల రూపమగు చిత్తమే అయి ఉన్నది. ఈ "ద్రష్ట – దృశ్యము – దర్శనము" "కర్త – కర్మ – కరణములు", "భోక్త – భోగ్యము – భోగములు".... ఇట్టి అనర్థములతో కూడుకొనియున్న ఈ జగత్తంతా చిత్తము మాత్రమే. మరింకేమీ కాదు. ఒక కంసాలి ఆభరణ విశేషము చూడకుండా, "ఈ నగలోని బంగారము ఎట్టిది?" అని మాత్రమే చూస్తాడు కదా! వివేకులు ఈ జగత్తును గాంచుచున్నప్పుడు, "ఆహాఁ! ఈ బ్రహ్మాండములు, ఈ లోకములు, ఇందలి వస్తుజాలములు ... ఇవన్నీ చిత్తము యొక్క విన్యాసములే. చిత్తమే ఇట్లు ప్రకటితం అవుతోంది" అని వారు గ్రహిస్తున్నారు.

ఈ సందర్భంలో మరొక చమత్కారమైన సంఘటన చెపుతాను. ఇందులో "జగద్రూపముగా కనిపిస్తున్న ఈ ఇంద్రజాలమంతా చిత్తము యొక్క అధీనములోనే ఉన్నది" అని నిరూపించబడుచున్నది.

❖❖❖

2. సభామధ్యంలో మహేంద్రజాలం

ఈ భూతలంలోగల "ఉత్తరపాండవము" అనే రాజ్యమును హరిశ్చంద్రుని వంశములోని వాడైన 'లవణుడు' అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతని యొక్క శౌర్యము, ఉదారగుణము, వినయములను ఇంద్రలోకవాసులు కూడా మెచ్చుకొంటూ ఉండేవారు.

ఒకరోజు అతడు రాజసభలో సింహాసనం అధిష్ఠించియున్నాడు. ఏవేవో రాజవ్యవహారాలు నిర్వర్తిస్తూ ఉన్నాడు. ఇంతలో ఒక ఐంద్రజాలికుడు ఆ సభలో ప్రవేశించాడు. వేషభాషల విషయంలో గొప్ప ఆడంబరములను ప్రకటిస్తూ లవణమహారాజుకు ప్రణామం చేసి "ప్రభూ! తమ అనుజ్ఞ అయితే నా ఇంద్రజాల విద్య ప్రదర్శించి మీకు, మీ ప్రజలకు వినోదం కలిగిస్తాను" అని విన్నపం చేసుకొన్నాడు. అప్పటికే ముఖ్యమైన రాచకార్యాలన్నీ పూర్తి అయినాయి. అక్కడి వారందరి మనస్సులు వినోదించాలని అభిలషించాయి. అందుచేత రాజాజ్ఞానుసారంగా ఇంద్రజాల ప్రదర్శన ప్రారంభించ బడింది. కొంచెము సేపు అవీ – ఇవీ చూపిన తరువాత ఆ ఐంద్రజాలికుడు రాజసింహాసనమునకు కొంచము దూరంలో నిలబడ్డారు. తన చంకకు తగిలించియున్న సంచిలోంచి ఒక నెమలి పింఛం బయటకు తీశాడు. అది అనేక రంగులతో వెలుగొందుచు, ఈశ్వర మాయవలె భ్రమను గొలుపుచున్నట్లు ఉంది. రాజు యొక్క దృష్టి అసంకల్పితంగా ఆ పింఛముపై కేంద్రీకరించబడింది. వివిధ కాంతులు విరజిమ్ముతున్న ఆ పింఛమును ఐంద్రజాలకుడు గాలిలో చిత్రమైన విన్యాసంతో అటు ఇటు ఊపాడు. రాజు కళ్ళు అనాలోచితంగా మూతబడ్డాయి.

❖

అప్పుడు ఒక రౌతు (Horse Rider) ఆ సభలో ప్రవేశించాడు. అతని వెంట ఒక పంచకళ్యాణ లక్షణములు గల గుఱ్ఱం నడచివచ్చింది. ఆ గుఱ్ఱం అత్యంత సౌందర్యముగాను, శాంతగుణమును కలిగినదై ఉన్నది.

రౌతు : రాజా ! ఇది అశ్వములన్నిటిలో శ్రేష్ఠమైన పంచకళ్యాణి – తెల్లగుఱ్ఱం. బహుప్రావీణ్యం గల ఈ గుఱ్ఱం వాయువేగంతో పరుగెత్తగలదు. మా ప్రభువు దీనిని మీ కోసం పంపించారు. మహాత్ములకు సమర్పించబడినప్పుడు అట్టి పదార్థములు మరింత శోభిల్లుతాయి కదా!

ఐంద్రజాలికుడు : ఔను ప్రభూ! మీరీ అశ్వమును అధిరోహిస్తే సూర్యభగవానునిలాగా స్వయంప్రకాశం తో వెలుగొందుతారు. భూమిపైకి విచ్చేసిన ఇంద్రభగవానునిలాగా మీరు ఈ గుఱ్ఱము పై కొంతసేపు స్వారీ చెయ్యండి. దీనిని మీ కొరకే తీసుకొచ్చాం!

రాజు ఆ గుఱ్ఱమును చూచి, దాని సౌందర్యమునకు ఎంతో ఆశ్చర్యచకితుడైనాడు.

❖

అనాలోచితంగా కళ్ళుమూసుకున్న ఆ రాజు ఇంతలోనే ఒక్క క్షణంలో విచిత్రమైన ఆకృతి కలవాడయ్యాడు. గోడ మీద చిత్తరువులో లిఖించబడిన పురుషుని యొక్క తెరచియున్న కన్నులువలె

తదేకదృష్టితో అవలోకించసాగాడు. అట్లాగే కొద్ది క్షణాలు ఉండి నెమ్మదిగా కనులు మూసుకొన్నాడు. సింహాసనముపై కూర్చుని ఉండియే చేష్టారహితుడైయ్యాడు. ఒక రాగరహితుడగు మునీశ్వరుడు అంతర్ముఖుడై ఆత్మానందము పొందుచున్నప్పుడు ఎట్లా నిశ్చలంగా ఉంటాడో, అతడు కూడా అట్లే ఉండిపోయాడు. గొప్ప బలశాలి, స్వబుద్ధిచే అత్యంత సునిశితమైన దృష్టిగలవాడు అయిన ఆ రాజు ధ్యానాసక్తుడై ఉన్నాడని అక్కడివారు తలచారు. చాలాసేపైన తరువాత మంత్రులు కొందరు సింహాసనము నకు సమీపంగా వెళ్ళి నిలుచున్నారు. మహాధీశాలి అయిన ఆ రాజును సమీపించటానికి, తాకటానికి అక్కడివారెవ్వరికీ ధైర్యం చాలటం లేదు. వింజామరలు కదలటం మానివేశాయి. వింజామరలు వీచే స్త్రీలు కూడా రాజును గమనిస్తూ, పాపం చేష్టారహితులయ్యారు. సభాసదులందరు క్రమంగా నిశ్చేష్టితులై ఉండిపోయారు. అక్కడి కోలాహలం క్రమంగా శాంతించింది. మహామేధావులైన అక్కడి మంత్రులు ఇదంతా విస్తుపోయి గమనిస్తున్నారు. ఏమి చెయ్యాలో తెలియక సంశయగ్రస్తులై విషాదంలో మునిగిపోయి, ఒకరి ముఖాలు ఒకరు చూచుకొంటున్నారు. సభికులలో చాలామంది ఆశ్చర్యంగా అంతా గమనిస్తూ నిరుత్సాహం, దుఃఖం పొందసాగారు.

ఒక గంట కాలం గడచిపోయింది. లవణ మహారాజు శరీరం అకస్మాత్తుగా కొంచెం ప్రబోధం పొందింది. అతడు అవయవములను కొద్ది కొద్దిగా కదల్చసాగాడు. ఇంతలోనే అతని అవయవములు వేగంగా కదలసాగాయి. పెద్ద భూకంపం సమయంలో ఎత్తైన మేడ ఒక్కసారి నేలకూలుతుంది చూచావా? ఆ విధంగా ఆ రాజు ఒక్కసారి పైకి ఎగిరి నేలకూలసాగాడు. ఆ ప్రక్కనే ఉన్నట్టి అత్యంత సమయస్ఫూర్తి గల అతని మంత్రులు రాజు నేలపై పడకముందే పట్టుకున్నారు. కొంచెము వగర్చుచు రాజు కొద్ది క్షణములైన తరువాత నెమ్మదిగా కనులు తెరచాడు. చుట్టూ చూచి ఒక్కసారిగా "ఏమిటిది? ఆశ్చర్యంగా ఉన్నదే? నేను ఇప్పుడు ఎక్కడ ఉన్నాను? ఇది ఏ ఊరు? అయ్యగార్లూ? మీరంతా ఎవరు? ఈ సభ ఏమిటి? పిల్లాడు ఏడీ? అయ్యా ! అయ్యా ! దణ్ణం పెడతాను. నన్ను వదలండి" అని కలవరిస్తున్నట్లు పలుకసాగాడు.

మహామంత్రి : దేవా! మహారాజా! రాహువును చూచినప్పటి సూర్యునిలాగా తాము ఇట్లు చింతా క్రాంతులు అయ్యారేమిటి? తమకు ఇట్టి స్థితి ప్రాప్తించటం, ఇట్లా మాట్లాడటం చూచి మేమంతా ఎంతో వ్యాకులచిత్తులమౌతున్నాం. మీ వంటి దృఢచిత్తము కలవారిని కూడా కారణం లేకుండానే భ్రాంతి భేదించగలదంటే మాకు ఆశ్చర్యంగానే ఉన్నది. మేమంతా చాలా కాలంగా ఉన్నతమైన తమ వ్యక్తిత్వమును గమనిస్తూ వస్తున్నాం. ప్రియమైన మిత్రునివలె మమ్ములను మామా ధర్మములందు సముత్సాహపరుస్తూ ఉండేవారు. మమ్ములను మా పూర్వజన్మసుకృతం చేతనే, మీరు పాలించటం జరుగుతోంది. వికల్పరూపముతో కూడిన అల్పభోగములందు మీ చిత్తం తగుల్కొనటం మేమెప్పుడూ చూడలేదు. అవిచారముచే మొదట రమణీయంగా కనిపించినా, ఆ తరువాత తుచ్ఛంగా పరిణమించే అల్పభోగవ్యవహారములు, మాయతోకూడిన ఆయా ప్రాపంచిక వ్యవహారములు... ఇవన్నీ, అనుభవజ్ఞు లగు మీకు తెలియునవి కాదు. ఉత్తమ గుణసమన్వితమైన మీ చిత్తము ఇప్పుడు ఏవైనా రాగాదులచే

మోహితం అయిందా? లేదే! మీరు నిత్యము రాజసభలో వివేకమును నిదురలేపే ఉత్తమ కథలను, చరిత్రలను ప్రవచించు కార్యక్రమములు ఆజ్ఞాపిస్తూ ఉండేవారు కదా! అట్టి శాంతనిర్మలమైన మీ మనస్సు ఏ భయోత్పాత విషయములందు నిమగ్నమై భ్రమ పొందటం జరిగింది?

మహారాజా! మీరు సర్వము తెలిసినవారు. "విషయములు నశించటం జరిగితే నేను కూడా నశిస్తాను" అని తలచటమే ఈ మనస్సు యొక్క ఒకానొక దుర్లక్షణం. అట్టి క్షుద్రభావముతో కూడియుండుట చేత ఈ మనస్సు లోకకార్యములందు విమోహితమగుచున్నది. అయితే శుద్ధము, వివేకయుక్తము అయిన మనస్సు మాత్రం అట్లా మోహం చెందుటలేదు. దేహాభిమానము కలిగి, అజ్ఞానము నందు ఉండి ఉన్నప్పుడు ఈ మనస్సు తనయందు ఏ 'విషయవృత్తి' ఉదయిస్తే ఆవైపే పరుగెత్తుతుంది. ఓ మహారాజా! ఏ మనస్సైతే వివేకమును తగినంతగా అభ్యసించకుండా దేశ కాలముల వైపు నిత్యం పరుగులు తీస్తూ ఉంటుందో అట్టి మనస్సు మాత్రమే మంత్ర – ఔషధములకు వశమౌతూ ఉంటుంది. మీరు అట్టివారు కాదు. వివేకయుక్తమై, ఉదారవృత్తిగల మీవంటివారి మనస్సు దేని చేతనూ బలహీనం కాదు. ఒకవేళ దైవవశాత్తూ కించిత్ విక్షేపం కొద్దిసేపు సంభవించినా, మీరు సంపాదించియున్న విజ్ఞాన–వివేకాదుల ప్రభావంచేత మరల ప్రశాంతత పొందగలదు. నిత్యము వివేకము కలిగియుండే మీ వంటివారి మనస్సు... ప్రజ్ఞ కోల్పోవటమో అల్పవిషయములను ఆశ్రయించటమో.... చేస్తుందా? అట్లా జరగకూడదే? గాలి కొండను కదల్చగలుగుతుందా? దృఢచిత్తమును విషయవృత్తులు ఏమీ చెయ్యలేవు.

❖

మంత్రుల యొక్క తదితర స్వజనుల యొక్క ప్రియవచనములు ఆ రాజు ఆలకించాడు. మరల కొంచెం కొంచెం ధైర్యం పుంజుకొన్నాడు. పూర్ణచంద్రునివలె అతని మనస్సు–బుద్ధి వర్తమానమైన పరిసర జ్ఞానంతో వికాసం పొందాయి. సభ అంతా కలియచూస్తూ కొంచెం సేపు గడిపాడు. అనేకులను కళ్ళతోను, చిరునవ్వులతోను పలకరించాడు. ఆ తరువాత కొంత భయ–ఆశ్చర్యములతో తన యందు ఉదయించిన 'తీవ్ర ఉద్వేగము' గురించి విచారించసాగాడు. ముందు వెనుక వృత్తాంతమంతా స్మరించుచు, ఇక ఇట్లు పలికాడు.

లవణ మహారాజు : ఓయీ! ఇంద్రజాలికుడా! నీ మాయాజాలం క్షణంలో శాంత సముద్రమును కూడా క్షుభితం చేయగలిగేదేనయ్యా! ఎంత విచిత్రంగా రచించావు! ఆహాఁ! మంత్రాదులందలి ఈశ్వరశక్తి అత్యద్భుతమైనది కదా! ఎంతటి సమర్థుల చిత్తమైనప్పటికీ, అది విమోహం చేసి వేయగలదు కాబోలు! మేము ఈ లోకవ్యవహారం నిర్వర్తించటంలో దక్షత కలిగిఉండవచ్చు. ఏం లాభం? ఆ దక్షతంతా నీ మాయ ముందు ఎందుకూ పనికి రాకుండా పోయింది కదా! మోహప్రదములైన ఆ ఆపదలు గుర్తుకు వస్తేనే ఒళ్ళు జలదరిస్తోంది. గొప్ప ప్రజ్ఞావంతుల ఉత్తమ వివేకయుక్తమగు మనస్సు కూడా అప్పుడప్పుడు స్వప్నములాగా, ఇంద్రజాలంలాగా మోహం చెందుతుందని విన్నాను. ఇక నేనెంతటివాడను?

ఓ సభికులారా! ఈ ఇంద్రజాలికుడు శంభరాసురుడంతటి మాయా రచయిత అయిఉన్నాడు. కొద్ది సమయంలో అతి దీర్ఘమైన, దుర్భరమైన, విచిత్రమైన జీవితమును చవిచూపించాడు. ఒకప్పుడు బలిచక్రవర్తి ప్రార్థించగా బ్రహ్మదేవుడు ఒక గొప్ప ఇంద్రజాలమును రచించి, ఇంద్రుని యొక్క పటాటోపమంతా వినాశనమొనర్చి, కొంతసేపు బలిచక్రవర్తికి ఇంద్రపదవి కట్టబెట్టిన అనుభవం కలిగించాడని పురాణాలలో చదివాం.

అదే విధంగా ఇతని ఇంద్రజాలంలో 60 సంవత్సరములుగా విస్తరించిన అనేక కార్యములను, చంచల పరిస్థితులను చూచాను.

ఇప్పుడు నేను భ్రమచే పొందియున్న అనేక వ్యవహారములను, స్థితి – గతులను వివరించి చెపుతాను. అంతా వినండి.

❖❖❖

3. వాహ్యాళి - ఆకలి - వివాహం

లవణ మహారాజు : సభికులారా!కొద్దిక్షణాలలో నా మనస్సుకు అనుభవమైన సుదీర్ఘ అనుభవ పరంపరల గురించి చెపుతాను. వినండి.

నేను ఈ సింహాసనముపై కూర్చుని ఉండగా ఈ ఇంద్రజాలికుడు ఎక్కడనుండో వచ్చి ఇక్కడ మన ముందు ఇంద్రజాలవిద్యలు ప్రదర్శించటం మీరు చూచారుకదా! అతడు ఒక నెమలి పింఛమును నా కళ్ళముందు వేగంగా త్రిప్పాడు. అందులోంచి చిత్రవిచిత్రములైన రంగులు కనిపించాయి. నా పరిసరాలన్నీ మరచి, ఒంటరివాడనై విరజిమ్ముచున్న ఆ రంగులనే కొంత సేపు చూచాను. ఏదో భ్రాంతి నా బుద్ధిని ఆవహించింది. తలవిదిల్చి చూడగా, ఎదురుగా నాకొక గుఱ్ఱం కనిపించింది. ఎవ్వరో "మహారాజా! ఈ ఉత్తమజాతి గుఱ్ఱం మీకే తగినది. దీని తెల్లటి స్వచ్ఛత, జూలు చూచారా? దీనిని మీవంటి వీరాధివీరులు అధిరోహించటం, స్వారీ చేయటం ఎంత సుందరమైన విషయం!" అని ఉత్సాహపరిచారు. అది విని నేను ఆ తెల్లటి పంచకళ్యాణి గుఱ్ఱం అధిరోహించాను. వేటకై అడవిలో ప్రవేశించాలనే ఉత్సుకతతో మన ఈ రాజధానికి ఉత్తరంగా గల అడవుల వైపు గుఱ్ఱమును పరిగెత్తించాను.

❖

ఆ గుఱ్ఱం ఎక్కి వాయు వేగంతో చాలా దూరం ప్రయాణం చేశాను. ఈ మనస్సు అవిచారణచే పైకి మాత్రమే రమ్యంగా కనిపించే విషయములను సేవిస్తూ జడత్వం పొంది, పరమాత్మానుభవమునకు దూరమౌతుంది చూచారా! నేను కూడా ఆ విధంగా తెలిసీ తెలియకుండా చాలా దూరం వెళ్లి, చివరికి ఒక వనంలో ప్రవేశించాను. ఆ వనం అతి భయంకరంగాను, సహించరానిదిగాను కనిపించింది. అందులో కొంత భాగం 'విరాగుల చిత్తము' వలె పదార్థరహితమై యున్నది. అయినప్పటికీ నేను అట్లా పోతూనే ఉన్నాను. ఎక్కడా కనుచూపు మేరలో చెట్టుగాని, నీరుగాని

కనిపించటం లేదు. గుఱ్ఱం ఎంతగానో అలిసిపోయి ఉండటం గమనించి ఆగి, అన్నివైపుల కలయ చూచాను. అనంతంగా కనబడుచున్న ఆ ప్రదేశంలో ఎక్కడా జనసంచారం ఉన్నట్లు లేదు. ఆ పరిసరాలు చూచి ఎందుకో ఎంతో ఖిన్నుడనయ్యాను. ఏదో దైన్యం నా గుండెలో ప్రవేశించింది. మరల గుఱ్ఱం ఎక్కి ఎట్లో ప్రయాణం సాగించాను. ఎట్లాగైతే ఏం? సూర్యాస్తమయం అయ్యే సమయానికి, వివేకులు ఈ సంసారమును దాటి వేయ కలుగుచున్నట్లు, నేను ఆ విశాలశూన్యవనమును దాటి వేశాను. ఎంతో అలసిపోయి ఉన్న ఆ గుఱ్ఱంతో మరొక అరణ్యంలో ప్రవేశించాను.

ఆ అరణ్యంలో ఆకాశమును అంటుచున్న పెద్ద పెద్ద వృక్షాలు కనిపించాయి. పక్షులు చెట్లపై నుండి మధురంగా గానం చేస్తున్నాయి. అయితే అక్కడ నాకు ఒక చిత్రం కనిపించింది. అధర్మముచే ధనము ఆర్జించే దుష్టుని యందు ఆనందవృత్తులే కనిపించవు చూచారా? అట్లాగే అక్కడ నేలపై ఎక్కడా పచ్చికయే కనిపించలేదు. కాని వెనుకటి వనంకంటే ఇది కొంత సుఖకరంగా అనిపించింది. ఈ జీవులు "అత్యంత దుఃఖదాయకమగు మరణముకంటే ఈ రోగములే మేలు" అని చెప్పుకొంటూ ఉంటారు చూచారా? నా పరిస్థితి కూడా అట్లాగే ఉన్నది.

❖

సాయంకాలమయింది. కొంచెం – కొంచెం సూర్యుడు అస్తాద్రి చేరుకున్నాడు. వెలుగు మందగించ నారంభించింది. నేను గుఱ్ఱంపై చెట్ల మధ్య నుండి వంకరటింకరగా ప్రయాణిస్తూ ముందుకు పోతూ ఉన్నాను. ఇంతలో ఒక పెద్ద వృక్షమునకు వ్రేలాడుతున్న ఏదో తీగ నా మెడకు చుట్టుకొన్నది. నేను నేలపై చతికిలపడ్డాను. గుఱ్ఱము నన్ను వదలి ఎటో వెళ్లిపోయింది. అప్పటికే ఎంతో అలసిపోయి ఉండటం చేత కొంతసేపు అక్కడే పడి ఉన్నాను. ఇంతలో సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. అరణ్యమంతటా నిబిడాంధకారం వ్యాపించింది. అక్కడి నుండి లేచి నెమ్మదిగా ఒక చెట్టు యొక్క తొఱ్ఱలోకి పోయి, దాక్కున్నాను. ఏవైనా క్రూరమృగములు అక్కడ సంచరిస్తూ ఉండవచ్చని నా భయం. ఆహాఁ! ఇక ఆ రాత్రి ఆ చెట్టు తొఱ్ఱలో ఎట్లా గడచిందో చెప్పలేను. పాము కరిస్తే మనిషి తన వివేకం కోల్పోతాడు చూచారా? నా బుద్ధి కూడా అట్లాగే అయింది. జ్ఞాపకశక్తి మందగించింది. త్రాళ్ళతో చెట్టుకు కట్టివేయబడినవానివలె విలవిలలాడాను. చీకటినూతిలో పడినవానివలె అస్వతంత్రుడనయ్యాను. మనస్సు మోహముచే కప్పివేయబడింది. "ఒక మహాసముద్రంలో ఎటో తెలియని వైపుగా కొట్టుకుపోతున్నానా?" అని అనిపించింది. ఆ రాత్రి ఒక కల్పమంత దీర్ఘంగా గడచి పోయింది. క్రమంగా తెల్లవారటం ప్రారంభమైనది. కాని, అప్పుడు నాకు స్నానం లేదు. పూజలేదు. భోజనం చెయ్యలేదు. ఒక్కొక్క క్షణం ఎంతో బరువుగా సాగుచున్నది.

సూర్యోదయం చూచి ప్రాణం లేచి వచ్చినట్లైనది. ఒక దరిద్రుడు గొప్ప బంగారపు మూటను చూచినట్లు, ఒక అజ్ఞాని గురుకృపచే సమగ్రమైన జ్ఞానం పొందినట్లు నేను సూర్యభగవానుని చూచాను. చెట్టు దిగి ఇక ఆ అరణ్యంలో సంచరించసాగాను. అక్కడ నాకు ఒక్క ప్రాణి కూడా కనిపించనే లేదు. అక్కడక్కడ పళ్లు ఏమాత్రం లేని వృక్షములపై ఏవో చిన్న పిట్టలు మాత్రం

కనిపించాయి. వాటి "కూచికూచి" శబ్దములు వింటూ అటూ ఇటూ తిరుగసాగాను. క్రమంగా నాలో నీరసం అధికం అయింది. మిట్టమధ్యాహ్నమైనది. ఆకలితో, దాహంతో, కడుపు కరకర లాడుతోంది. అన్నార్తితో నా కళ్ళు అటూ ఇటూ వెతుక నారంభిచాయి.

ఇంతలో నాకు అల్లంత దూరంలో ఒక 11 – 12 సంIIల వయస్సు ఉండే బాలిక కనిపించింది. ఆమె మట్టి కొట్టుకుపోయి, చినిగి, జీర్ణమైన వస్త్రములు ధరించియున్నది. జుట్టు ముళ్ళుపడి సంస్కార రహితంగా మట్టి ఊడలవలె వ్రేలాడుచున్నది. ఆమె చేతిలో అన్నపు మూట కనిపించింది. నా ప్రాణాలు లేచివచ్చాయి. ఎట్లాగో ఓపిక చేసుకొని చంచలనేత్రములుగల ఆమె దగ్గరకు పరుగులు తీశాను.

"ఓ బాలికా! ఒక్కమాట. ఇప్పుడు నాకెంతో ఆకలిగా ఉన్నది. ఈ ఆపద సమయంలో నాకీ అన్నం పెట్టు. దీనుల దుఃఖములను తొలగించువారి సంపదలు వృద్ధిపొందుతాయని పెద్దలంటారు. నా ఆకలి బాధ మాటలతో చెప్పలేను..." అంటూ ప్రార్థించసాగాను. కానీ ఏం లాభం? స్త్రీలను హింసించే వానికి లక్ష్మీదేవి ధనం ఇవ్వదు చూచారా? అట్లాగే ఆమె నాకు ఆహారం ఇవ్వకుండానే నడచి వెళ్లిపోతోంది. అయినాకూడా నేను ఆమె వెంటపడి బ్రతిమిలాడాను. అప్పుడా కన్య "ఏమయ్యోయ్! ఓ భుజకీర్తులు ధరించిన అయ్యగారూ! నా వెంటపడుచున్నావేమిటి? నేను చండాల కన్యనే! మేము మనుష్యుల, గుఱ్ఱముల, ఏనుగుల మాంసం తింటూవుంటాం కదా! నేను అతి క్రూరమైన రాక్షసివంటిదాననని నీవంటి పెద్ద అయ్యలు అంటూ ఉంటారు. మా ఆహారం నీవు తినటమేమిటి? చాలు చాలు. నా వెంటపడబోకు. నానుంచి నీకు ఒక ముద్ద బువ్వ కూడా లభించదు. వెళ్ళెళ్ళు" అంటూ పోతూనే ఉన్నది. మధ్యమధ్యలో వినోదంగా చెట్టు వెనుక, పుట్టవెనుక దాగుడు – మూతలాడుతూ నన్ను ఏడిపించసాగింది. "రా బాబు! రావయ్యా...రాఁ" అంటూ నన్ను కవ్విస్తోంది. పిల్లికి చెలగాటం – ఎలుకకు ప్రాణసంకటం అంటే ఇదే కాబోలు .... అని అనుకొన్నాను. ఎట్లాగో అట్లా ఒకచోట ఆమెను సమీపించాను. ఆమె నేలపై కూర్చుని నావైపు చిలిపిగా చూస్తోంది. నేను ఆ ప్రక్కనే చతికిలపడ్డాను.

నేను : చూడు అమ్మాయీ! ఇక నా ఓపిక క్షీణించింది. ఇప్పటికన్నా నీ చేతిలోని ఆహారం నాకు ఇచ్చి పుణ్యం కట్టుకో.

బాలిక : ఓ దొరా! ఇప్పుడు నా మనస్సులోని మాట చెపుతాను. విను. నీవు అందమైన కుఱ్ఱవాడివి. నాకు నచ్చావు. నీవు నాకు మొగుడు కావటానికి ఒప్పుకుంటే ఇప్పటికిప్పుడు ఈ ఆహారం నీకు ఇస్తాను. లేదంటావా, నా దోవన నేను పోతాను. నువ్వు ఒప్పుకోకపోతే, నీకు నేను బువ్వ ఎందుకు పెట్టాల? నా తండ్రి అదిగో, అల్లంత దూరంలో ఎద్దులు తోలటం, పొలములు దున్నటం చేస్తూ ఉంటాడు. ఈ ఆహారం మా అయ్యకోసమే తీసుకుపోతున్నాను. కాని నీవు నా మొగుడివైతే ఇదంతా ఇచ్చివేస్తాను. ఆడదానికి మొగుడు ప్రాణంతో సమానం కదా!

❖

అంత ఆకలిగా ఉన్నప్పుడు కుల – జాతి ధర్మాలు ఎవడికి కావాలి? ఆహాఁ! ఆకలి సకల విభేదాలు విస్మరింపజేస్తుంది.

నేను : ఓ అమ్మాయి! సరే. నీవు కోరినట్లే నీకు భర్తను అవుతాను. ముందు ఆ ఆహారం నాకు పెట్టు.

అప్పుడామె ఆ ఆహారంలో సగభాగం ఇచ్చింది. నేనది ఆవురావురంటూ అమృతతుల్యంగా తిన్నాను. ఆ సమయంలో ఆకలి తీర్చుకోవటమే యోచించాను. మరింకే విషయంలోనూ నా బుద్ధి పనిచేయటమే మానివేసింది. ఆ ప్రక్కనే పొదలలో ఉన్న ఏవో పళ్ళు తెచ్చి వాటిరసం ఒక తోలు పాత్రలో పోసి ఆ బాలిక నాకు ఇచ్చింది. అది గటగటా త్రాగివేశాను. అక్కడే కొద్దిసేపు విశ్రమించాను. ధూళిచే కప్పబడి, నల్లటి రంగు పుణికి పుచ్చుకొన్న ఆ అమ్మాయి నా చెయ్యి పట్టుకొని తన తండ్రి ఉన్న ప్రదేశానికి తీసుకుపోసాగింది. అప్పుడామె నా ప్రాణం తనవశం చేసుకొని తీసుకుపోతున్నట్లుగా అనిపించింది. ఒక అరగంటసేపు నడచిన తరువాత ఆమె తండ్రిని సమీపించాం. అతడు పొడవైన శరీరం కలవాడు. అతని ఆకారం చూడగానే భయము కొల్పేట్లు ఉన్నది. కురూపుడు, దుష్టుడు అయిన అతని కళ్ళు క్రూరత్వమును నిర్వచిస్తున్నట్లున్నాయి.

ఆ పిల్ల తండ్రి : ఏమేవ్? ఏందీ, ఇంత ఆలస్యమైనది? ఏం పోయేకాలం?

ఆ పిల్ల : అయ్యా! ఈ పోరగాడిని చూచావా? ఈడు నాకు నచ్చాడు. ఈడు నన్ను మనువాడుతాడంట! నువ్వు "ఊఁ" అనువే ...

ఆ పిల్ల తండ్రి : సరేలేయే .... ఆడు ఒప్పుకున్నాడు గందా .... అట్లాగే మనువాడుదువుగాని .... ముందు బువ్వపట్టుకురా.

అతడు ఆహారం తీసుకొని మరల పనిలోకి పోయాడు. ఆమె నా ప్రక్కన చేరి వినసొంపు గాని భాషలో ఏవేవో సరస – విరసాలు ఆడసాగింది. "నేను ఏమగుచున్నాను?" అనునది అర్థం కాక ఏదో విషాదంగా యోచిస్తూ అట్లే చతికిలపడి ఉన్నాను. ఇంతలో సాయం సమయమయింది. మేము ముగ్గురం నడచుకొంటూ చండాలవాటికకు చేరాం. అక్కడ గుడిసెల ముందు కోళ్ళు, కాకులు, కోతులు, పందులు మొదలైనవి ముక్కలు–ముక్కలుగా కోయబడి ఉన్నాయి. అనేకచోట్ల, నేల రక్తముచే తడుపబడి ఉన్నది. ఆ ప్రదేశాలలో దోమలు, ఈగలు దట్టంగా ముసురుతున్నాయి. కొన్ని గుడిసెల ముందు దండాలకు తడిప్రేగులు ఎండబెట్టి ఉన్నాయి. గొఱ్ఱె చర్మములు త్రాళ్ళకు వ్రేలాడుచుండగా, వాటిలోంచి రక్తపు చుక్కలు ఇంకా నేలకు రాలుచున్నాయి. కొన్నిచోట్ల వేపచెట్లపై పక్షులు శబ్దాలు చేస్తున్నాయి. నేలంతా ఎండిన వేపాకులతోను, పుల్లలతోను, మురికినీరు గల చిన్న చిన్న గుంటలతోను నిండిఉన్నది. అక్కడి బాలుర చేతులలోగల పచ్చి మాంసపు ముక్కలపై దోమలు వ్రాలుచు ఝుంకారం చేస్తున్నాయి. వృద్ధులు, శ్రేష్ఠులు అయిన అక్కడివారు ఆ బాలురను మందలిస్తున్నారు. నేను నడచి వెళ్ళటం చూచి, వాళ్లంతా ఆ రణగొణలు ఆపి నా వైపే చూడనారంభించారు. అట్లా కొంతసేపు నడచి, ఆ బాలిక యొక్క గృహంలో ప్రవేశించాం.

ఆ ఊరి పేరు 'పుష్కరఘోష'.

ఆ బాలికావాళ్ళ ఇంటి ప్రదేశమంతా నాడులతోను, జంతువుల బొమికలతోను నిండి ఉన్నది. ఆ కన్యక పరుగు పరుగున ఇంటిలోకి పోయి తల్లితో ఏదేదో చెప్పింది. ఆ ఇంటిలోనివారు ఆదరంతో నన్ను ఒక గోనెసంచీ ఆసనంపై కూర్చోబెట్టారు. ఆ చుట్టుప్రక్కల గుడిసెల వాళ్ళకి నా రాక గురించి తెలిసింది. కంకరరాళ్ళు దొర్లిస్తున్నట్లు భీకరమైన గొంతుగల మా అత్తగారు అక్కడి ఆడవాళ్ళతో 'ఓసి అత్తా! పిన్నీ! చూడండే. ఈడే మా కాబోయే అల్లుడు. మాకు శ్రమలేకుండా మా అమ్మాయే తెచ్చుకుంది" అని అరుస్తూ చెప్పసాగింది. వాళ్ళందరు, 'ఒక బుట్టబొమ్మను పిల్లలు చూచునట్లు' నన్ను చూడసాగారు. ఆ తరువాత నేను కొంతసేపు విశ్రమించాను. మా మామగారు, అత్తగారు ఏవేవో పదార్థములు తెచ్చిపెట్టారు. అవన్నీ "ఇవేమిటి?" అని అడగకుండా తినసాగాను. మరి ఆకలియొక్క మహిమ అట్టిది. ఇక ఆ పిల్ల, మా అత్తగారు అనేక దుఃఖములకు హేతువైన కుత్సిత ప్రణయవాక్యాలు పలుకసాగారు. ఆ వాక్యాలలోని నీచత్వం నాకు బాధ కలిగిస్తున్నది. అయితే వాళ్ళుమాత్రం గొప్ప ధనపుమూట దొరికినట్లు నవ్వుకొంటున్నారు.

ఒక శుభముహూర్తాన ఆ బాలికను నేను పెళ్ళి చేసుకున్నాను. మా పెళ్ళిరోజున అక్కడివారంతా ఒకచోట గుమిగూడారు. పచ్చివి, పచనము అయినట్టివి అయిన మాంసాదులను సేవించారు. చాలా మంది పీకల దాకా మద్యమును త్రాగారు. పెద్దపెద్ద వాయిద్యములతో భీకర శబ్దములు చేశారు, ఆడారు, పాడారు. నాకు మాత్రం – ఆ స్థలము ఒక మహానరకమువలె, ఆ వాయిద్యములు బ్రహ్మహత్యాది మహాపాపముల సముదాయమువలె నాకప్పుడు తోచింది. జీవుడు యమలోకమునకు పోయినప్పుడు స్తబ్ధుడైనట్లు నేను మౌనం వహించి అదంతా నిర్లిప్తంగా చూస్తూ ఉన్నాను. ఓ సభికులారా! ఇక ఎక్కువగా చెప్పేదేమున్నది? ఆ వివాహమహోత్సవమునకు వశుడనై, అది మొదలుగా, నేను అక్కడి వారిలో ఒకడనయ్యాను. క్రూరత్వము మొదలైన అక్కడివారి గుణములు నేను కూడా ఆశ్రయించాను. మా పెళ్ళి ఉత్సవం ఏడు రాత్రులు జరుపబడింది.

❖❖❖

4. క్రౌర్యం

క్రమంగా రోజులు గడుస్తున్నాయి. ఎనిమిది నెలల తరువాత నా భార్య ఋతుమతి అయింది. దుష్క్రియలు ఆపదలు కలుగజేస్తాయి చూచారా? మూర్ఖుడు అనర్థములైన సంకల్పములు చేస్తూ ఉంటాడు కదా! అదే విధంగా కాలం అనేక మూర్ఖపు పనులతో గడువసాగింది. మాకు కాలక్రమేణా ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు పుట్టారు. క్రమంగా మా పిల్లలు ఎదుగనారంభించారు. బ్రహ్మ హత్య చేసినవాడు అనేక దుఃఖములను పొందుతూ ఉంటాడే! అట్లాగే నేను కూడా అనేక సంసార దుఃఖములను మరల మరల పొందుతూ కాపురం చేశాను. నా పరిస్థితి అల్పజలాశయంలోని ముసలిచేపవలె తయారయింది. ఎండకు, చలికి వివశుణ్ణి అవుతూ ఇంతకుముందు నేను ప్రవేశించియున్న అరణ్యంలో ఎంతోకాలం సంచరించాను. "కుటుంబపోషణ" అనే చింతలో ఎందరు

ఈ మహాసంసారారణ్యంలో సంచరించటంలేదు చెప్పండి? నా సంచారం కూడా అట్టిదే అయింది. అనేక క్షుద్ర ప్రయత్నముల ప్రభావంచేత నా బుద్ధి మందగించింది. అనేక సంసార క్లేశములచే దుఃఖ పీడితుడనయ్యాను. "పిల్లలు-ఆరోగ్యములు-ఆహారములు-ధనములు".... ఇట్టి ఏవేవో కార్యక్రమములలో నిమగ్నమగుచు దిక్కుతోచక దిక్కులన్నీ పరిభ్రమించాను. పాపభారం మోసినట్లు, చినిగియున్న వస్త్రమును తలకు చుట్టుకొని, గడ్డిమోపును నెత్తిన ధరించి వేలాదిసార్లు అనేక మైళ్ళ దూరం నడిచాను. దుర్గంధ భూయిష్ఠమైన ఒక గోచి ధరించి ఎక్కడెక్కడో తిరిగాను. ఈగలు వ్రాలు చుండే అనేక మురికి ప్రదేశములలో విశ్రమించాను. నా కుటుంబాన్ని పోషించుకోవాలనే తపనతో అనేక ప్రయత్నములందు నిమగ్నమగుచు జీర్ణదేహుడనయ్యాను. జంతువులను వేటాడే ప్రయత్నాలలో ఎక్కడెక్కడో దాక్కున్నాను. ఎవరెవరినో ఎంతగానో హింసించాను. అనేక కలహములచే కలిగిన దుఃఖ తాపములకు రక్త బిందువులతో సమానమైన కన్నీళ్ళు కార్చాను.

అక్కడి అడవిలో కొన్ని శిలల క్రింద రహస్య గృహములవలె గుహలవంటివి ఉన్నాయి. ఆ రహస్యగృహములలో ఉండి అప్పటికప్పుడు కాల్చుకొన్న పంది మాంసము భక్షిస్తూ ఎన్ని రాత్రులు గడిపానో చెప్పాలంటే, అలవి కాదు.

ఆ విధంగా అక్కడ చాలా కాలం గడిచిపోయింది. నిరంతరం కొందరు బంధువులంటే ఇష్టం, మరికొందరు బంధువులంటే ద్వేషం కలిగియుండేవాళ్ళం. అనేకమందితో ఏర్పడిన పోట్లాటలు నన్ను దుఃఖితునిగాను, దీనునిగాను చేశాయి. కొన్నాళ్ళైన తరువాత నేను నా భార్య – పిల్లలతో మరొక చండాల గృహంలో ప్రవేశించి, అక్కడ చాలా కాలం ఉన్నాం. నా ముఖం ఎల్లప్పుడు భార్యతో పోట్లాడటంలోను, ఇతర చండాలురతో ఘర్షణ పడటంలోను ఆయత్తమగుటచే అతి క్రూరంగా ఉండేది. పైకి క్రూరంగాను, లోన దీనంగాను ఉంటూ ఉండేవాడను. మేక, పులి, లొట్టిపిట్ట, గొఱ్ఱె, పంది, ఎలుక మొదలైన రకరకాల మాంసములను చిత్ర – విచిత్రములైన విధానములలో పచనం చేసుకొని, దాచుకొని – దాచుకొని తినేవాళ్ళం. యాచకులు వస్తే ఎంతో సేపు దూషించిన తరువాత కొంచము పెట్టే వాళ్లం.

ఓ మిత్రులారా! సభికులారా! నాకు బట్టలు కూడా లేవు. గోచితోనే సంచరిస్తూ దుఃఖప్రదములగు అనేక అనుభవములు పొందాను. మన ఈ వర్తమానం "నిజమే కదా!" అని అనిపించినట్లు, అప్పుడు కూడా, అదంతా వాస్తవములాగానే నాకు అనుభవమయింది. మూఢచిత్తుడనై అనేక వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికాను. పిట్టల రెక్కలు పెడవిరిచి బుట్టలో కుక్కాను.

మట్టి కుండలో మాంసం వండుకోవటం.... వికృతమైన ఆకారంతో, లేళ్లు మొదలైన అనేక మృగముల కోమల భాగములను నీళ్ళతో కడగటం ... నా చర్యలకు హింసింపబడుతూ, రోదిస్తున్న మృగముల ఆర్తనాదములు మధురసంగీతం వలె విని ఆనందించటం ... మాంసమును ఎండలో ఆరబోయటం .... ఆ చండాలి భార్యతో అపవిత్ర ప్రదేశములలో కూడటం. ఎంతో ఆకలితో ఏవేవో తుచ్ఛపదార్థములు నములుతూ భుజించటం ...

ఇవన్నీ ఇప్పుడే జరిగిన సంఘటనలవలె నా కిప్పుడు స్పష్టంగా అనిపిస్తోంది. "అనేక జన్మల పాపఫలితం ఆ విధంగా పరిణమించిందా? లేక నేను మహాశాపగ్రస్థుడనయ్యానా?" అన్నట్లుగా నా బుద్ధి ప్రవర్తించింది. వచ్చిపడుతున్న ఏవేవో ఆపదలను ఎదుర్కోవటం, జంతువుల బారి నుండి శరీరాన్ని రక్షించుకోవటం, భార్యా – పుత్రులను పోషించటం గురించే ఎప్పుడూ యోచిస్తూ ఉండటం, ఇవే అప్పటి పెద్దపెద్ద కార్యక్రమాలు. ఇక ఒక్కొక్క రోజైతే నా భార్య నాకోసం తుచ్ఛమగు మాంసపు ముక్కలు మిగల్చనందుకు ఎంతోసేపు నీచమైన మాటలతో దూషించేవాడిని. "బేతాళుని బంధువా?" అన్నట్లు మలిన దేహంతో నదీతీరంలో అటూ – ఇటూ పచార్లు చేస్తూ చేపలు పట్టేవాడిని. ఇంకా నా అప్పటి ప్రవర్తనల గురించి ఏమని చెప్పమంటారు? తల్లి పాలు బిడ్డ త్రాగినట్లు, నేను, కోయబడిన మృగముల వక్షస్థలములోని రక్తమును జుర్రుతూ పానం చేస్తూ ఉండేవాడను. అపవిత్ర భోజనం చేసే అక్కడి అనేక జనులు కూడా నన్ను వీధిలో చూడగానే దూరంగా పారిపోయేవారు.

నాయందు 'పాపము – క్రౌర్యము' అనే వాయువీచికలు ప్రసరిస్తూ ఉండేవి. నాచేత హింసించబడే పక్షుల, జంతువుల చావుకేకలు నాకు ఆహ్లాదం గొలిపే సంగీతంలా అనిపించేది. నాలో కొంచెం కూడా జీవకారుణ్యం లేదు. నిష్టుర భాషణం చేస్తూ క్రౌర్యంగా దుర్గంధభూయిష్ఠమైన ప్రదేశాలలో ఏవేవో 'పేర్లు – ఆకారములు' గల జంతువులకోసం వెతుకుతూ, వలపన్నుతూ ఉండేవాడను. ఆహాఁ! "ఇప్పుడిట్లా ఈ ప్రాణిని హింసిస్తే నియమితకాలంలో దీని ఫలితంగా నేను దుఃఖమురూపంగా అనుభవించవలసి వస్తుందేమో?" అనే సంకోచమే లేకుండా ప్రవర్తించాను. భవిష్యత్ స్థితి–గతులు చింతించకుండా నరకభూములలో అజ్ఞానవిత్తులను నాటినవాడనయ్యాను.

గోచి పెట్టుకొని, బొంతనొకదానిని కప్పుకుని చేతిలో పొడవైన లావుపాటి కఱ్ఱతో, సంస్కార రహితమైన మీసము – గడ్డముతో నేను వస్తుంటే, సున్నితంగా వ్యవహరించు కోమల స్వభావులంతా గజగజ వణికేవారు.

❖

దోషరహితమైన రాజపుత్రుడనగు నేను ఆ విధంగా పూర్వజ్ఞానరహితంగా అనేక సంవత్సరాలు గడిపాను. ఓ సభ్యులారా! మన ఈ కాలమునకు వేరైన కాలక్రమంలో ఎన్నో ఏండ్లకు పైగా వర్తించాను. ఈ విషయం నాకే ఆశ్చర్యం గొలుపుతోంది.

అప్పుడు అక్కడ దుష్టవాసనలు అనే ఇనుపతీగలకు బద్ధుడనయ్యాను. క్రోధ పారవశ్యంతో వెనుక – ముందు చూడకుండా అసభ్యపదజాలం ఉపయోగిస్తూ, భయమును కలిగించే గర్జనలు చేశాను. ఆపదలు వచ్చినప్పుడు ఏడ్చాను. నింద్యమైన పదార్థాలు భుజించాను. ఏ మానసిక స్థితి నుండి ఎక్కడకు చేరి బ్రతుకసాగానో .... అదంతా మాటలకు అందదు.

❖

కాలచక్రం పరిభ్రమించసాగింది. సంవత్సరాలు వస్తున్నాయి. పోతున్నాయి. నా శరీరం కృశించింది. వృద్ధాప్యం వచ్చిపడింది. చర్మం ముడతలు పడింది. మీసము, గడ్డము, తల నెఱిసి

పోయాయి. ముసలితనమును చూస్తే దుఃఖములకు, మానసిక వేదలనకు పండగే కదా! "తోటివారితో తగాదాలు. హింసించుకోవటాలు" మొదలైన అమానుష ప్రవర్తనలలో చిక్కుకొన్న నన్ను అందరు నిరాదరించటం ప్రారంభించారు. ఆకాశంలో ఎగురుతూ అకస్మాత్తుగా శక్తినంతా కోల్పోయిన పక్షిలాగా నిరాధారుడనయ్యాను. ఎంతో భ్రాంతికి లోనయ్యాను. చింతాక్రాంతుడనై చక్రయంత్రమును (Giant Wheel) అధిరోహించిన వానివలె పరిభ్రమించసాగాను. 'కాలము' అనే సాగరంలో కొట్టుకు పోతున్న గడ్డిపీచులాగా ఆటు-పోట్లు నన్ను ఆవరించివేశాయి. నిస్సత్తువ క్రమ్మివేసింది. ఇట్టి శారీరక - మానసిక దౌర్భాగ్యం అనుభవిస్తూ, ఒక్క భోజనం విషయం మాత్రమే పట్టించుకొంటూ ఉండగా మరొక సంవత్సరం గడచిపోయింది.

"నేను రాజును" అనే కించిత్ ఇంగితజ్ఞానం కూడా ఆ సమయంలో లేదు.

"నేను చండాలుడను. ఈమె నా భార్య. ఈ పిల్లల యొక్క తండ్రిని. ఈ ఆహారం నాకు లభించుగాక! ఈ నా శత్రువులు బాధింపబడెదరుగాక..." ఇంతమాత్రమే నా ఆలోచనా పరిధి. ఫలితంగా ఆయా ఆశ - నిరాశల మధ్య నా చిత్తము అన్ని వేళల వ్యాకులత పొందుతూ ఉండేది. అట్లు ఒంటిలో సత్తువ క్షీణిస్తూ ఉండగా రోజులు ఉదాసీనంగా గడచిపోతున్నాయి.

❖❖❖

5. భయంకర దుర్భిక్షం

అప్పుడు ఆ ప్రదేశంలో ఒక భయంకర దుర్భిక్షం వ్యాపించింది. ఎండిన చెట్టుపై పిడుగుపాటు వలె, దావాగ్నిలాగా ఆ దుర్భిక్షం అక్కడి ప్రజలను ఎంతగానో భయభ్రాంతులను చేసింది. చాలాకాలంగా వర్షాలు లేవు. ఎండవేడిమిచే కలిగిన ఉష్ణవాయువుల వలన చెట్లన్నీ నశించాయి. ఆ వేడికి గడ్డి మొక్కలు కూడా ఎండిపోయాయి. పాషాణాలు కరిగాయి. ప్రాణుల అవయవాలు ధూళితో కప్పబడ్డాయి. జనులు ఆకలిబాధచే అలమటించసాగారు. తృణ - అన్న - పానములు లభించకపోవటం చేత పెద్ద - పెద్ద జనపదాలే నిర్మానుష్యం కాసాగాయి. దూరంగా మృగతృష్ణలను చూచిన దున్నలు అవి జలశయములని భ్రమించి పరిగెత్తి-పరిగెత్తి నేల కూలి ప్రాణాలు విడవ సాగాయి. అక్కడ వీచే వాయువులో జలకణమనే మాటే ఉండేది కాదు. ఎక్కడైనా 'జలము' అనే మాట వింటే చాలు, అక్కడి జనులు ఎంతో ఉత్కంఠులు అవుతూ ఉండేవారు. వాతావరణంలో ఉష్ణము పెరుగుతూ పదార్థములను శుష్కింపచేస్తున్నది. ఆకులను నమలి మ్రింగునంతటి ఆకలితో ప్రజలంతా విలవిల్లాడారు. కొన్ని చోట్ల కొందరు ఒకరినొకరు చంపుకుతినటం కూడా జరిగింది. కొందరు క్షుద్బాధకు తట్టుకోలేక ఏనుగులను, గుఱ్ఱములను చంపి తినసాగారు. ఆకలి కారణంగా జీవులలో విపరీతమైన ప్రవృత్తులు ఉదయించసాగాయి. తమ సంతానం నిస్సహాయంగా క్షోభిస్తుంటే, తల్లిదండ్రులు చేసేదేమీ లేక శిలామౌనం వహించి ఉండేవారు. ఉన్నట్టుండి ఇళ్ళలోంచి పెద్ద ఆర్తనాదాలు వినవచ్చేవి. కాని ఎవ్వరిని ఎవ్వరు పట్టించుకొనేవారు కారు. స్త్రీ పురుషులు కొంచెము

ఆహారంకోసం ఎక్కడెక్కడికో పరుగు తీస్తూ ఉండేవారు. ఇట్లు అకాలదుర్భిక్షం కారణంగా ఆ ప్రదేశ మంతా శుష్కించి పోయింది. శని–అగ్ని–సూర్యులు ఆ ప్రాంతమంతా విలయతాండవం చేయసాగారు.

దైవం ప్రతికూలించి, అకాలంగా ప్రళయం సంభవిస్తే ఎవరు మాత్రం ఏం చేయగలరు? పరమదుఃఖకరమైన ఆపదలు సంభవించటంచేత అక్కడి జనులు అనేకులు తమ బంధు–మిత్రులతోసహా దూర దేశాలకు వెళ్ళిపోయారు. మరికొందరు తమ పుత్ర – మిత్ర – స్త్రీ – బంధుజనులను వదల లేక అక్కడే ఉండిపోయి మరణించారు. ఎంత బాధించినా ఈ జీవుడు అట్లు బాధిస్తున్నట్టి అంగములను వదలలేడు కదా! అట్లాగే కొందరు తాము ప్రేమగా శ్రమించి ప్రోగుచేసుకొన్న గృహ – ధనాదులు వదల లేక అక్కడే ప్రాణాలు వదిలారు. మరికొందరు ఉన్న ఊరు వదలి దూరదేశాలకు ప్రయాణం చేస్తూ త్రోవలో క్రూరమృగములకు ఆహారమయ్యారు. మరికొందరు త్రోవలో నేలకూలి, ఆహారము, జలము లభించక అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

అట్టి మహాసంరంభముతో, భయోత్పాతంతో కూడిన సమయంలో నేను ఎంతో ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా భార్యను, పిల్లలను వెంటబెట్టుకొని దూరంగాగల ఒక దేశం వెళ్ళి పోయే ఉద్దేశంతో బయలుదేరాను. మా మామగారు, అత్తగారు ఉన్న ఊరు వదలబుద్ధిగాక, అక్కడే ఉండిపోయారు. వారికి "వర్షములు పడవచ్చు" అనే ఆశ ఇంకా ఉన్నది.

త్రోవలో పులులవల్ల, అగ్నివల్ల వచ్చే అనేక ప్రమాదాలు తప్పించుకొంటూ ముందుకు పోతున్నాం. ఒక రోజు ఒక ప్రదేశానికి చేరాం. నా భార్య, పిల్లలు చాలా అలసిపోయి ఉన్నారు. వాళ్లు ఒక తాడిచెట్టు నీడలో కాసేపు విశ్రమించారు. నా ముగ్గురు పిల్లలు తల్లి ఒడిలో నిదురించారు. మా ఆఖరివాడు మాత్రం నా వెంటే ఉన్నాడు. వాడి పేరు పృచ్ఛకుడు. వాడంటే నాకు మొదటినుంచీ ఎంతో ఇష్టం. వాడు కళ్ళ నీళ్ళు కారుస్తూ నా కాళ్ళు పట్టుకొని, "అయ్యా! నాకిప్పుడు ఎంతో ఆకలి వేస్తోందే! తినటానికి మాంసం కావాలి. త్రాగటానికి రక్తం కావాలి. నువ్వు తెచ్చిపెట్టాలిసిందే! నాకింకేం తెలియదు" అంటూ దీనంగా ఏడుస్తూ పలుకసాగాడు. ఎంత చెప్పినా వినడు. ఎంత సముదాయించినా ఏడుపు ఆపడు. వాడు మాత్రం ఏం చేస్తాడు? ఆకలి బాధ అంతటిది మరి. అప్పుడు నేను, "ఓరీ! పృచ్ఛకా! ఇప్పుడు మాంసము ఏడదిరా? అయినా కాసేపు ఆగు. ఏడుపు ఆపు. చూద్దాంగా!" అంటూ బుజ్జగించసాగాను. అనేకసార్లు చెప్పిచూచాను. వినుటలేదు. కొంతసేపటికి వాడు దగ్గటం ప్రారంభించాడు. దాహంతో, ఆకలితో వాడి ప్రాణాలు రెపరెపలాడుతున్నాయి. వాడి అవస్థను చూచి నాకు చెప్పరానంత ఏడుపు వచ్చింది. పుత్రవాత్సల్యంతో నా మనస్సు ఎంతో వేదన పొందింది.

"నాయనా! పృచ్ఛకా! నీవు ఆకలితో నకనకలాడటం నేను చూడలేనురా. ఇప్పుడు మాంసముగాని, రక్తముగాని నీకు తెచ్చిపెట్టగలిగే అవకాశమే లేదు. ఇక ఒక్కటే ఉపాయం. నీవు నన్ను పీక్కు తిను. నా రక్తమాంసములతో నీవు నీ ఆకలి తీర్చుకో".

అని ఉద్దేశపూర్వకంగా పలికాను. అప్పుడాబాలకుడు "ఓరై అయ్యా! పోనీ అట్లాగేచేయి. నేను ఈ ఆకలి భరించలేను. నీ మాంసమే తింటాను" అని అంటూ తన నుదుటితో నా మోకాలు

స్పృశించసాగాడు. అప్పుడు అత్యంత దుఃఖభారంతో క్రుంగిపోతున్న నా కుమారుని యొక్క సంకటస్థితిని చూచాను. అది నాకు గొప్ప ఆపదవలె కనిపించింది. ఆ ఆపదను సహించలేకపోయాను. కొడుకు కొరకై స్నేహ–కారుణ్యములకు వశుడనయ్యాను. సర్వదుఃఖములను ఉపశమింప జేయగలదని భావించి, మృత్యువుకు నా శరీరం అర్పించాలని నిశ్చయించుకొన్నాను.

అక్కడ – ఇక్కడ పడిఉన్న కొన్ని చితుకులను ఏరి ఒక చోటికి జేర్చాను. ఆ వాతావరణంలో వాటిని మండించటం ఏమాత్రం కష్టమనిపించలేదు. అగ్ని చటచట శబ్దములను చేస్తూ పైకి లేచింది. ఆ శబ్దములు నా ప్రాణములను కాంక్షిస్తున్నట్లు అనిపించింది. లేచి వెళ్ళి అమాంతంగా ఆ అగ్నిలోకి దూకాను.

అంతేఁ! మరుక్షణం నా ఈ శరీరం సింహాసనము మీద నుండి క్రిందకు పడుతోంది. ఈ మంత్రివర్యులు నన్ను నేలకు ఒరగకుండా పట్టుకొన్నారు. ఇక్కడి మీ అందరి గొంతుకలు నా చెవిన బడ్డాయి. వెంటనే ప్రబోధితుడనయ్యాను.

ఓ సభ్యులారా! ఈ విధంగా ఈ ఇంద్రజాలికుడు నన్ను మోహములో ముంచి, తేల్చాడు.

❖❖❖

6. అంతా మనోవిలాసమే

మహాతేజస్వి అయిన ఆ లవణ మహారాజు ఇట్లు చెప్పుచూ ఉండగా, అక్కడివారందు ఇంద్రజాలికుని వైపుగా ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నారు. ఇంతలో ఆ ఇంద్రజాలికుడు ఒక్కక్షణంలో అక్కడి సభామధ్యం నుండి అంతర్ధానమయ్యాడు. అది చూచిన అక్కడి సభ్యులు ఆశ్చర్యచకితులయ్యారు. సభలో కలకలం బయలుదేరింది. అంతా గమనిస్తున్నట్టి మహామంత్రి లేచి నిలుచున్నాడు. సభనంతా నిశ్శబ్దపరచి, ఇట్లు ప్రసంగించ ప్రారంభించాడు.

మహామంత్రి : ఓ మహారాజా! చూచారా! ఈ క్షణం వరకు మన మధ్య ఉన్న ఇంద్రజాలికుడు ఇప్పుడే అంతర్ధానమయ్యాడు. ఇంత ఇంద్రజాలం చూపినతరువాత మిమ్ములను ధనం అర్థించాలికదా? కానీ, అట్లు చేయలేదూ అంటే, అతనికి ధనాపేక్ష లేదు. ఈ ప్రపంచస్థితిని మనకు బోధించటానికి వచ్చిన ఒక దైవమాయయే అతడై ఉంటాడు. అంతేకాని, అతడు ఒక సామాన్య ఇంద్రజాలికుడు మాత్రం కాదు.

మీరు చెప్పినది ఇక్కడ జరిగినది పరిశీలించినప్పుడు, "ఈ ప్రపంచమంతా మనోవిలాసము మాత్రమే" అని మనకు తెలియవచ్చుచున్నది. సర్వశక్తిమంతుడగు విష్ణుభగవానుని మనస్సే కదా ఈ జగత్తు!* ఆ పరమాత్మకు అనేకానేక చమత్కారములు ఉన్నాయి. అతడు తన మాయచేత ఉత్తమ వివేకవంతులను కూడా మోహంలో ముంచివేయగలడు.

---

* విశ్వమ్ విష్ణుః – విష్ణు సహస్రనామమ్

ఆహాఁ! ప్రజ్ఞ-చతురత, మహావివేకము, ఎంతో లోకానుభవము కలిగియున్న మన ఈ లవణచక్రవర్తి ఎక్కడ? సామాన్య మానవుల మనోవృత్తి అనతగ్గ ఈ అల్పభ్రమ ఎక్కడ? ఓ రాజా! మేము అనేకమంది మాంత్రికులను, ఐంద్రజాలికులను చూచాం. వారికెవ్వరికీ ఇట్లు జనులను విమోహితులను చేసే ఆలోచనగాని, సామర్థ్యముగాని ఉంటుందనునది వినలేదు, చూడలేదు. ఈ ఐంద్రజాలికులంతా ప్రజల చిత్తములను రంజింపజేసి తద్వారా ధనం సంపాదిస్తూ మాత్రమే ఉండటం చూచాం! పైగా, మనం చూస్తూ ఉండగా అంతర్ధానం కాగలరా? ఈ విషయాలన్నీ గమనించిన తరువాత మేము "ఇతడు దైవమాయ యొక్క స్వరూపమే" అని తలచుచున్నాం. ఆ భగవంతుడే మనలను జ్ఞానులుగా తీర్చిదిద్దటానికి ఇట్లు చేసి ఉంటాడు.

❖

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ లవణమహారాజు యొక్క సభలో నేను కూడా ఉండిఉన్నాను. ఈ వ్యవహారమంతా నేను స్వయంగా చూచాను. ఆ చూచినదే నీకు చెప్పాను.

దీనినిబట్టి నీవు గ్రహించవలసినదేమిటి? ఈ మనస్సే వివిధరచనలచే వృద్ధి పొందుతోంది. చెట్టు యొక్క కొమ్మలు, ఆకులు, పుష్పములు, కాయలు వలె విస్తరిస్తున్నది ఆ వృక్షమే కదా! ఈ మనస్సే స్వయముగా ఈ జగత్తు రూపమున విస్తరిస్తోంది. మరల మరొకప్పుడు ఇదే మనస్సు జ్ఞానవిచారణాదులు చేపట్టుటచే, తన ప్రయత్నముల సాఫల్యంగా వాసనారహితం అవుతోంది. ఆత్మతో ఏకత్వమును పొందుతోంది. అప్పుడు భేదకల్పన అంతా నశించుటచే "ప్రశాంత, మౌన, అద్వితీయ, నిర్వికల్ప" అనుభవస్థితిని అవధరిస్తోంది.

ఓ రామా! సర్వభేదకల్పనలు నశించినప్పుడే (అతీతత్వమును సముపార్జించుకొన్నప్పుడే) పరిపూర్ణమగు ఆత్మపదము లభించగలదు. ప్రతి జీవుడు శాంతి పొందుటకు మార్గం ఇది మాత్రమే.

❖❖❖

7. చిత్తము - దాని చమత్కారము

శ్రీరాముడు : మహర్షీ! నాదొక సందేహం. అసలు మా ఈ చిత్తములు ఎందుకు విషయములపైనే అభిముఖమౌతున్నాయి? స్వస్వరూపమగు ఆత్మను ఎందుకు గ్రహించటం లేదు?

శ్రీ వసిష్ఠ మహర్షి : అన్నిటికీ మూలకారణమైయున్న అజ్ఞానము - అవిచారణల వలననే ఈ చిత్తము విషయాభిముఖమగుచున్నది. అట్లు అభిముఖమై, ఆయా పదార్థముల రూపమును పొంది, పలురకములైన వైచిత్ర్యములతో కూడిన మలినత్వమును పొందుచున్నది. స్వయంకృతంగానే అనేక మిథ్యావ్యాపారములచే భ్రాంతి దృఢమగుచున్నది! అట్టి భ్రాంతి యొక్క దృఢత్వ కారణంగా చైతన్యము తన పూర్ణరూపమును మరచి, మనోరూపమును పొంది, అనాది కాలంగా ఈ జనన-మరణాల పరంపరలో తాదాత్మ్యం చెందుతూ పరిభ్రమిస్తోంది. తుచ్ఛ మనోవృత్తి రూపమున అనేక వాసనలను తనయందు నిక్షిప్తం చేసుకుంటోంది. చిన్నపిల్లవాడు బేతాళుని రూపమును ఊహించుకొని, ఆ

ఊహకు అనుగుణంగా ఎదురుగా "జడలు-కోఅలు-కొమ్ములు" తో కూడిన రూపమును చూస్తాడు చూచావా? అట్లాగే చిద్వస్తువే తనయొక్క కల్పనలను విస్తరించుకొనుచూ దుఃఖములను పొందుచున్నది. అయితే, ... ఏది ఎప్పుడు ఎట్లైనా కావచ్చు - కాకపోవచ్చుగాక! ఈ జీవుడు సర్వదా చిద్వస్తువే అయి ఉన్నాడు.

వాసనలు క్షయించుటయే శాస్త్రప్రవచితములగు అన్ని ప్రయత్నములలోని గూఢార్థం. వాసనలు క్షయిస్తే ఇకప్పుడు సద్వస్తువగు చైతన్యం నిర్మల మనోవృత్తిని పొందుచున్నది. సర్వ దుఃఖములకు కారణం ఈ జీవుడు ప్రాపంచిక వృత్తులు కలిగి ఉండుటయే. సూర్యకిరణం ప్రసరించినచోట చీకటి ఉండదుకదా! ప్రపంచవృత్తులు ఏ చిత్తములో లయిస్తాయో, ఇక అట్టి చిత్తమునందలి దుఃఖమంతా క్షణకాలంలో పటాపంచలౌతోంది.

శ్రీరాముడు : మునీశ్వరా! చిత్తమునకు ఈ జాగ్రత్ - స్వప్నముల రూపమున గల వేరువేరు అనుభవములు ఎట్లా సంప్రాప్తిస్తున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మనస్సు దూరమును దగ్గరగా, దగ్గరను దూరముగా చేసి వేయగలదని ఇతఃపూర్వమే చెప్పుకొన్నాంకదా! పిల్లవాడు చిన్న చిన్న క్రీడల మధ్య క్రీడించుచున్నట్లు ఈ మనస్సు జీవులందు విజృంభిస్తోంది. "తదితరులు" అను అనుభవముయొక్క కల్పన చేసుకుంటూ పోతోంది.

అజ్ఞానియగు ఒక బాటసారి దూరంగా ఉన్న ఒక శిలను చూచి "అదిగో.... పిశాచం".... అని తలుస్తూ ఉంటాడు, చూచావా? వాసనలతో కూడిన చిత్తమునకు అభయమైన విషయములందు కూడా భయంకలుగుతోంది. మత్తుపానీయం సేవించినవానికి బుద్ధి యొక్క అల్పత్వం ఏర్పడుట చేత ప్రపంచమంతా గిఱ్ఱున తిరిగిపోతున్నట్లు అనిపిస్తుంది. వాసనలచే కళంకితమైన మనస్సుకు మిత్రుని యందు "శత్రువేమో?" అనే శంక కలుగుతోంది. మనస్సు వ్యాకులత చెందియున్నప్పుడు చంద్రుడు కూడా భరించరానంత వేడిమిని వెడలగ్రక్కుచున్నట్లు కనిపిస్తాడు. దుర్విషయ భావన గల వానికి అమృతమిచ్చినా, అది చేదుగా ఉంటుంది.

వాసనలచే ఆచ్ఛాదితమైన చిత్తము ఈ జగత్‌రచనను తనయొక్క 'అర్థము - అనుభవము' లను అనుసరించి గాంచుచున్నది.

ఓ రాఘవా! ఈ జాగ్రత్ స్థితి కూడా స్వప్నము వంటిదేనని సర్వజనులను ఉద్దేశ్యించి మరల మరల ప్రకటించుచున్నాను.

శ్రీరాముడు : ఈ దేహములోనికి దుర్భావాలు, దురభ్యాసాలు ఎందుకు వచ్చి చేరుచున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి : మరల చెప్పుచున్నాను. ప్రబలమగు వాసనలే ఈ జీవుని మోహమునకు కారణమగుచున్నాయి. అట్టి వాసనలను సమూలంగా ఛేదించి, పెరికివేయాలి.

ఈ సంసారవనంలో మనస్సు అనే మృగం వాసనాజాలం చేత ఈడ్వబడుతోంది. ఫలితంగా అనేక దుఃఖములను మరల మరల అనుభవిస్తోంది. ఎవని యందైతే తత్త్వవిచారణ యొక్క

దృఢత్వం చేత పదార్థములపట్ల "ఇవి నాకు కలగాలి, ఇవి తొలగాలి" .... అను రూపము గల వాసన (లేక) అభినివేశం నశించిపోతుందో, అట్టివానియందు జ్ఞానం అత్యంత సులభంగా ప్రవేశిస్తోంది. మేఘాలు తొలగితే ఆకాశంలో సూర్యుని ప్రకాశం స్వయంగానే ద్యోతకమౌతున్నట్లు "ఏదో పొందాలి" అను భావావేశం త్యజించగానే ఆత్మజ్ఞానం ఈ జీవునిలో ప్రకాశిస్తోంది. జ్ఞానమే ఈ జీవుని సత్యమగు స్వరూపము, స్వభావము కూడా. అట్టి జ్ఞానమును అజ్ఞానము ఆవరించుట చేతనే ఈ జగద్దృష్టులు ఏర్పడుచున్నాయి.

ఓ ప్రియరాఘవా! మనస్సే జీవుడు. అంతేగాని, ఈ తుచ్ఛమైన దేహము జీవుడు కాదు సుమా! ఎందుకంటావా? ఈ దేహము జడమైనది. ఇక దీనియందలి మనస్సు మాత్రం అటు జడము గాని, ఇటు చేతనముగాని కాక, ఈ రెండింటికీ విలక్షణమై ఉంటోంది. ఈ మనస్సు ఏ కార్యమైతే చేస్తుందో, అది మాత్రమే ఈ జీవునిచే వాస్తవంగా చేయబడినదౌతోంది. ఇది దేనిని త్యజిస్తుందో, అది మాత్రమే త్యజించబడుచున్న దగుచున్నది. ఈ జగత్తంతా మనస్సే. మనస్సుకాక ఇక్కడెక్కడా ఏదీ లేదు. ఈ భూమండలము, ఆకాశము, పృథివి, వాయువు, మహత్తు .... ఇవన్నీ మనస్సు మాత్రమే. ఈ మనస్సు కనుక ఆయా పదార్థము లందు భావన చేయటం జరుగకపోతే ఆయాపదార్థజాలము యొక్క ఉనికే అనుభవమవటం జరిగేదికాదు!

ఎవరి మనస్సైతే అజ్ఞానాన్ని ఆశ్రయిస్తోందో, అట్టివాడు "మూఢుడు" అని అనిపించుకొంటు న్నాడు. అదే మనస్సు వివేకమును ఆశ్రయించినపుడు "జ్ఞానయుక్తుడు" అని అంటున్నారు. అంతేగాని ఈ జడ శరీరమును దృష్టిలో పెట్టుకొని, "ఇతడు జ్ఞాని. ఇతడు మూఢుడు" అని అంటామా? లేదు.

అట్లాగే ఎదురుగా ఉన్నదానిని చూచేది మనస్సే కాని ఈ కనుగ్రుడ్లు కానేకావు. ఆ మనస్సే వినుటను నిర్వర్తించు చోటును "చెవులు" అని, స్పర్శను పొందేచోటును 'చర్మము' అని, సువాసన ఆస్వాదించే చోటును ఘ్రాణేంద్రియము (ముక్కు) అని, రుచిచూచే స్థానమును నాలుక అని అంటున్నాం. ఆయా వృత్తులందు ప్రవర్తిస్తున్నట్టి ఈ మనస్సు యొక్క శక్తి అతి విచిత్రమైనది. మనస్సు లేకపోతే ఇంద్రియాలకు ఉనికే లేదు. కవిత్వం అల్లుచున్నది కవియేగాని, కలముకాదు కదా! మనస్సే ఇంద్రియములలో ప్రవేశించి ఆయా అనుభవములను రచించుకొంటోంది.

ఒకే నటుడు అనేక వేషాలు వేస్తూ ఉంటాడు.... ఆ వేషములన్నీ అతడే....

కాని ఆ వేషములన్నిటికీ విలక్షణమై ఉండి ఉంటున్నాడు కదా! అట్లే

ఒక వ్యక్తి తండ్రి, తాత, తమ్ముడు, అన్న, కొడుకు, స్నేహితుడు మొదలైనవన్నీ అగుచున్నాడు.

అన్నీ అతడే....

కానీ అతడు వాటిలో ఒకటి నుండి మరొకటిగా పరిణమిస్తున్నాడా? లేదేం!

ఈ మనస్సు కూడా అన్ని ఇంద్రియములలోను వేరువేరుగా వర్తిస్తోంది. అందులో ఏ ఒక్కటీ తాను కాకుండానే ఉంటోంది. దీనికి వేరుగా ఇంద్రియములకు అస్థిత్వమే లేదు. ఇది అల్పమైన దానిని అధికంగాను, అధికమైనదానిని అల్పంగాను చేసి వేయగలదు. స్వజనుల తప్పులు

స్వల్పమైనవిగా, విరోధిజనుల అవే తప్పులు తీవ్రమైనవిగాను కనిపించటమే మనకు ఇందుకు తార్కాణం. సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగాను మార్చివేసి దర్శించటంలో ఈ మనస్సుకున్న శక్తి మరింక దేనికీ లేనే లేదు కదా! ఇది కటు (చేదు) వస్తువును కూడా మధురంగా భావిస్తే, అట్టి మధురానుభవంగానే పొందగలదు. శత్రువుని మిత్రునిగా, శ్రేయోభిలాషిని కూడా శత్రువుగా చూపించటంలో దీనికిదే సాటి.

ఈ చిత్తము దేనియందు ఏ వృత్తిచే ప్రతిభాసిస్తుందో, ఆ వస్తువు అట్లే పరిణమిస్తుంది. "ఇది నాకు ప్రియము" అను వృత్తితో అది దర్శించుచున్నప్పుడు, ఆ వస్తువు అట్లే ప్రియమై ప్రాప్తిస్తోందికూడా. ఇట్టి ప్రతిభాస (Reflection) లేక స్ఫురణ లేక భావన వల్లనే, వ్యాకులచిత్తుడైయున్న హరిశ్చంద్రుడు ఒకే రాత్రి కొద్ది గంటల కాలంలో పంద్రెండు సంవత్సరముల సుదీర్ఘమైన అనుభవం అత్యంత జాగ్రత్ లాగా, వాస్తవానుభవంలాగా స్వప్నంలో పొందాడు. ఈ చిత్తప్రభావం చేతనే ఇంద్రద్యుమ్నుడు అనబడు ఒక వ్యక్తి ఒక గంటకాలంలో ఒక యుగం కట్టివేయబడి ఉన్నాడు... అయితే ఆ బంధనము నకు ప్రయోజనంగా ఆ మరునాడు తాను తప్పక "ఒక రాజు" కాబోవుచున్నట్లు తెలిసింది..... అప్పుడు ఆ బంధమును కూడా సంతోషముతోనే అనుభవించగలుగుతూ ఉంటాడు. మనస్సు యొక్క వైచిత్ర్యము అట్టిది. భగవద్భక్తుల విషయంలో కూడా ఈ చమత్కారం చూస్తున్నాం. వారి మనస్సులు పరమాత్మ యొక్క చింతనాప్రభావంచేత ఒకానొక ప్రియవృత్తి కలిగి ఉంటున్నాయి. అట్టి సమయంలో వారు మహానరకములను కూడా నిశ్చింతంగా అనుభవించ గలుగుచున్నారు. అదంతా మనస్సు యొక్క ప్రభావమే.

దారం తెంచితే పూదండయందు గల పూలన్నీ నేల రాలుతాయి కదా! మనస్సు జయించబడితే చాలు. ఇక, తక్కిన ఇంద్రియములన్నీ తమంతట తామే అప్రభావితం అవుతాయి.

పదార్థముల గురించి విపరీత కల్పన చేయటంలో (ఇది ప్రియము. ఇది అప్రియము – అని త్వరితగతిని నిర్ణయించుకోవటంలో) ఈ మనస్సుకు మహాసామర్థ్యము ఉన్నది.

ఆత్మ అంతటా సమరూపమై యున్నది. అది స్వచ్ఛమై, నిర్వికారమై, సూక్ష్మమై, నిత్యమై, సాక్షి స్వరూపమై, సర్వపదార్థము లందు వ్యాపించియున్నది. సర్వ విషయములకు అతీతమై, వాక్–ఇంద్రియములకు అలభ్యమై మౌనభావము వహించి ఉంటోంది. అట్టి బ్రహ్మమును ఈ దేహ రూప మాత్రంగా చూస్తున్నది ఈ మనస్సే. శరీరముతో అభేద కల్పన చేస్తూ, ఇక తన జన్మ స్థానమగు బ్రహ్మము (లేక ఆత్మ)నే జడంగా దర్శిస్తోంది ఈ మనస్సు.

అంతరంగంలో .... ఇచ్ఛ, సంకల్పములు మొదలైనవి కలిగియున్న ఈ మనస్సు బాహ్యంలో – నది, ఆకాశం నగరాలు, సముద్రాలు మొదలైన కల్పనలు వ్యర్థంగా కలుగచేస్తోంది. ఎంత వివేకబోధ పొందుచున్నప్పటికీ, ఎంతగా నియమించబడినప్పటికీ .... ఈ మనస్సు దేనినైనా ఇష్టమైతే అమృతతుల్యంగాను, లేదా, ఇష్టంలేకపోతే, విషతుల్యంగాను చూచుట మానటం లేదు. అందుచేత 'ఇచ్ఛ'యే మనస్సు యొక్క బీజము ... అని చెప్పబడుతోంది. బీజమే వృక్షమగుచున్నట్లు, ఇచ్ఛయే మనస్సు అగుచున్నది.

శ్రీరాముడు : ఈ మనస్సు ఇష్టానిష్టములను ఎందుకు పొందుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఏ మనస్సైతే పూర్ణమగు ఆత్మ స్వరూపము యొక్క సాక్షాత్కారం పొందదో, అదియే ఆయా వస్తువులందు "ఇది నాకు ఇష్టము. ఇది నాకు కష్టము" మొదలైన కల్పనలన్నీ చేసుకుంటోంది. అయితే, తత్త్వజ్ఞుల మనస్సు ఇట్టి చపలత్వము కలిగియుండదు. మనస్సు అనేది చేతనశక్తినుండే స్ఫురిస్తోంది. కాబట్టి ఈ వాయుత్వము ప్రకాశత్వము, ద్రవత్వము కూడా "మనస్సే"! కఠినత్వము, శూన్యత్వము పొందుచున్నది అదే. చైతన్యము అనిర్వచనీయమైన తన ఇచ్ఛాశక్తిచేతనే ఇట్లు మనస్సు యొక్క రూపమును స్వీకరిస్తోంది. అట్టి మనోరూపముతో భావనామాత్రంగా దేశ కాలాదుల అనుభవం తనయందు అంగీకారబుద్ధిచే పొందుతోంది.

మనస్సు – సంలగ్నము : ఈ మనస్సు ఎక్కడ సంలగ్నమైతే అక్కడ మాత్రమే ఆ భావనకు సంబంధించిన అనుభవమును పొందుతోందని మరొకసారి ప్రకటిస్తున్నాను. ఒకడి మనస్సు ఎక్కడో లగ్నమై ఉన్నప్పుడు, అతడు తాను తింటున్న పదార్థపు రుచిని కూడా గుర్తించడుకదా! దృష్టి పథంలో ఎదురుగా ఉన్నా కూడా, మనస్సు లగ్నం కాకపోతే, ఆ వస్తువుగాని, విషయంగాని చూడబడకపోవటం మనందరికి అనుభవమే.

అట్లాగే ఈ మనస్సు చీకటియందు విచిత్ర కల్పనలన్నీ చేసి, వాటినన్నిటినీ స్వయంగా పొందగలదు. (అనగా అక్కడ లేని వాటినికూడ తానే కల్పించుకొని ఉన్నట్లే చూడగలదు). ఈ మనస్సు – ఇటు ఇంద్రియముల – అటు ఆ ఇంద్రియములచే అనుభవించబడుచున్న పదార్థముల – ఆకారములను పొందుచున్నది.

మనస్సే ఇంద్రియములకంటే శ్రేష్ఠమైనది. అది ఇంద్రియములకంటే మునుముందే ఉన్నదని గ్రహించు. ఓ రామా! ఈ చిత్తము – శరీరములు వేరువేరు వలె అజ్ఞాన దృష్టికి మాత్రమే కనిపించటం జరుగుతోంది. "మనస్సుయొక్క కార్యక్రమమే ఈ భౌతిక శరీరము."

ఈ మనస్సే "నేనిట్లు అగుదును" అని భావించి, అట్టి భావనకు అనుకూలమైన ఈ ఈ ఉపాధులను నిరంతరం పొందుతోంది. ఇదే మనస్సుతో ఉపాధుల కావల నిశ్చలంగా ఉన్న ఆత్మను గ్రహించువారు ఉపాధిభావనను అధిగమించి, ఆత్మభావనను స్వీకరించగలుగుచున్నారు. అఖండమగు ఆత్మను ఎరిగినవారు అఖండభావననే పొందుచున్నారు. మహాత్ములు సర్వము గ్రహించియుండుటచే మనోరహితులై ఉంటున్నారు. ధీరులై, వాసనలను జయించివేయుటచే మనోరాహిత్యమును పొందుచున్నారు. సుందరస్త్రీల లయవిన్యాసములు చూచినప్పుడుకూడా, వారు ఒక కొయ్య–రాయి లాగా వికారరహితులై ఉంటున్నారు. కొందరు మహనీయులగు మునులు తమ యొక్క మనస్సు ఆత్మయందు సంలగ్నమై ఉంటున్నప్పుడు తమ కాళ్లు – చేతులు త్రెంచబడటం కూడా గ్రహించకపోవటం మనం కొన్ని చరిత్రలలో విన్నాం కదా!* అదంతా అభ్యాసవశంచేతనే అట్లు

* మాండవ్య మహామునిని 'దొంగ' అని అనుకుని కొరత వేయడం జరిగినప్పుడు, ఆ శరీరము పొందిన హింస అతడు పొందకపోవడం.

'సుస్థిర' లేక 'అతీత' స్థితి సాధ్యపడుతోంది. "ఈ సాంసారిక వ్యవహారాలకు కలతచెందుట" అనేది కూడా ఈ జీవునకు మనస్సు యొక్క అభ్యాసవశంచేతనే ప్రాప్తించింది సుమా! జ్ఞానులు అభ్యాసబలం చేతనే దుఃఖములను సుఖములుగా, స్త్రీ-ధన-వస్తుప్రాప్తులన్నీ తుచ్ఛమైనవిగా గాంచగలుగుచున్నారు.

అంతదాకా దేనికి? ఒకని మనస్సు ఎక్కడో సంలగ్నమైయున్నదనుకో ... అప్పుడు నీవు అతనికి అనేక వివరణలతో కూడిన కథ చెప్పితే అది అతడు గ్రహిస్తాడా? లేదు కదా!

ఒకడు ఇంటిలోనే ఉండి "నేనిప్పుడు ఈ కొండను అధిరోహించాను. ఇక్కడ సరస్సు ఉన్నది. ఆ సరస్సును సమీపించాను. చల్లనిగాలి వీస్తోంది. స్వచ్ఛమైన మేఘములు అంతటా విహరిస్తున్నాయి. ఇప్పుడిక ఈ గుహలో ప్రవేసిస్తున్నాను. ఆహాఁ! సువిశాలమైన గుహాంతర్భాగంలోని ఈ చెట్టు క్రింద నే నిప్పుడు ఎంతో ప్రశాంతంగా విశ్రమిస్తాను..." అని భావించుచున్నాడనుకో... అప్పుడాతడు అక్కడి స్వచ్ఛమైన మేఘములను, గుహలను భ్రాంతిచే పొందగలడు. అట్లాగే మరొకడు సుందరమైన పాన్పుపై పరుండి, స్వప్నవశంచేత అనేక దుఃఖకరములగు ప్రదేశములలో సంచరిస్తూ ఏడవటం, నవ్వటం మొదలైనవి అనుభవిస్తూ ఉంటాడు. స్వప్నంలో మనస్సు విజృంభిస్తున్నప్పుడు అనేక వ్యక్తులను, సంఘటనలను పొందుతోంది. స్వప్నములోని ఆయా పదార్థజాలమంతా ఆ స్వప్న సమయంలో వాస్తవంలాగానే ప్రాప్తిస్తోందికదా! ఆ స్వప్నపదార్థములన్నీ ఎక్కడి నుండి వచ్చాయి? ఆత్మ తన స్వస్వరూపమునుండి చ్యుతి చెందినదై, క్షుభితం (disturbed) అయినప్పుడు, తన హృదయం లోనే ఆ స్వప్న వ్యవహారమంతా అట్లు దర్శించుచున్నది. అనగా ఆత్మయే అట్లు విస్తరిస్తోంది.

సముద్రజలం నుండి తరంగాలు ఉత్పన్నమౌతున్నాయి. అట్లే, ఈ దేహమునందు అంతర్గమై యున్న మనస్సునుండే 'స్వప్నము' అనే అవస్థ, అట్టి అవస్థలో ఆయా ఆకార-వికారములు ఏర్పడు చున్నాయి. ఈ జాగ్రత్ విషయం కూడా. అట్టిదే.

ఈ జాగ్రత్, స్వప్నములు రెండూ మనస్సు నుండే ఉత్పన్నమౌతున్నాయి.

ఒక కొండరాయి యందు చెక్కబడిన స్త్రీవిగ్రహం ఆ కొండరాయికి వేరైనది అవుతుందా? అట్లే ఈ జాగ్రత్ - స్వప్నములు చిత్తమునకు వేరైనవి కావు. సకల విధములైన వైచిత్ర్యములు చిత్తమునుండే కలుగుచున్నాయి. స్వకీయమైన చిత్తవృత్తియే జాగ్రత్ స్వప్నములందు, ఇష్ట-అయిష్టములందు, సుఖ-దుఃఖములందు, భావ - అభావములందు ప్రవర్తిస్తోంది.

❖

శ్రీ రాముడు : హే మహర్షీ ! లవణుడు ఆ అనుభవములన్నీ సుదీర్ఘమైన వాస్తవంగా పొందటం ఎట్లా జరిగింది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ప్రతిభాసావశం చేతనే (as a process of Refraction) అతనికి ఆ అనుభవాలు ప్రాప్తించాయి. అనగా, ఒకానొక సుదీర్ఘమైన దృశ్య వ్యవహారం అతని చిత్తమునందు ప్రతిబింబించటం చేతనే అతనికి ఆ అనుభవాలు కలిగాయి. "స్ఫురణ" యే రూపంగా కలిగియున్నట్టి ఈ మనస్సు ఏ రూపమును భావిస్తే అద్దానినే శీఘ్రంగా పొందటం జరుగుతోంది. దేనిని ఎట్లు భావన చేస్తూవస్తే,

అది అట్లే పరిణమిస్తూ ఉంటుంది. కనుక రామా! నీకు ఏది సమ్మతమై ఉంటుందో అదే భావనచేయి. ఒకటి భావనచేసి, మరొకదానిని పొందటం జరగదు.

ఆత్మ యొక్క సర్వసమ్యత్వమును భావనచేస్తే 'ఆత్మ' రూపమునే పొందగలవు.

ఈ 'మనస్సు' అనేది జీవుల యొక్క అంతరమున ఉండి, ఈ అనేక రూపములను తానే పొందుతోంది. అట్లు పొంది, జాగ్రత్ - స్వప్నమయమగు ఈ జగత్తును విస్తరింపజేస్తోంది. లవణమహారాజు చండాలత్వము పొందిన విధంగానే, ఈ చిత్తము ప్రతిభాసావశం చేత "దేవత్వం నుండి ఆసురత్వం, సర్పత్వము నుండి వృక్షత్వము" పొందుతోంది. ఒకడు, అతని భార్య దృష్టిలో భర్తగాను, అతని తండ్రి దృష్టిలో కొడుకుగాను, ఒక స్నేహితుని దృష్టిలో స్నేహితుడుగాను, అతని శత్రువు దృష్టిలో శత్రువుగాను అగుచున్నాడు కదా! స్వసంకల్పమును అనుసరించి ఈ మనస్సు కూడా అనేక వేషములు ధరిస్తోంది. అది ఆకారరహితమైనప్పటికీ, చిరకాలపు అభ్యాసముచే "జీవుడు" అను ఆకారమును అవధరిస్తోంది. మోహమయమగు వాసనలతో కూడుకొన్నదై, సర్వత్రా వ్యాపించి ఉంటోంది. ఒకడికి తన తల్లి-చెల్లి-భార్య-స్నేహితులు-శత్రువులు వేరువేరు రీతులుగా అనుభూతమవటమంతా మనో చమత్కారమే!

శ్రీ రాముడు : ఈ మనస్సు ఎందులోంచి ఉత్పత్తి అవుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఇది జన్మించేది ఎక్కడినుండో కాదు. ఆత్మయొక్క స్వసంకల్పమే మనస్సు యొక్క రూపము, ఉనికి, స్థానం కూడా! అట్టి సంకల్పము యొక్క ఆశ్రయము కారణంగానే శుద్ధస్వరూపమగు ఆత్మకు సుఖ-దుఃఖములు, భయ-అభయములు మొదలైన అనేక ద్వంద్వములు వచ్చిపడుచున్నాయి. నూనె నువ్వులలోనే ఉండి ఉన్నట్లు, ఈ ద్వంద్వములన్నీ కూడా మనస్సునందే ఉండి ఉన్నాయి. అందుచేత మనస్సుకి చికిత్స చేసుకోవాలి. మనస్సులో ఉన్నట్టి ఆవేశపూరితమైన భావనాక్రమమే ఆయాసందర్భాలలో అల్పంగానో, అధికంగానో ప్రకటితమవటం జరుగుతోంది. చిత్తమునందు ఘనీభూతమై ఇంతకుముందే నిలచియున్న ఆయా సుఖ-దుఃఖములు మనస్సు యొక్క స్ఫురణచే వ్యక్తమౌతున్నాయి. ఓ రామా! వేటినైతే మనం "దేశ-కాలములు" అని అంటున్నామో .... అదంతా మనస్సంకల్పమే అయి ఉన్నది. అనగా, సంకల్పముల ప్రభావంచేతనే దేశ - కాలములు స్థితి పొందినవై ఉంటున్నాయి. అంతేకాదు ఈ స్థూలశరీరం శోభించటం, విజృంభించటం, శాంతిని పొందటం, వేరైన స్థానములను పొందటం .... ఇవన్నీ కూడా మనస్సు యొక్క కార్యక్రమములే సుమా! అంతఃపురంలో మహారాణి గొప్పదర్పంతో సంచరిస్తూ ఉంటుంది కదా! ఈ మనస్సు తనయొక్క అనేక సంకల్పములచే రచించబడిన అనేక క్రియాసంరంభములను వెంటబెట్టుకుని ఈ దేహములందు గొప్ప అతిశయంతో వర్తిస్తోంది. "స్తంభనాస్త్రము" (మోహనాస్త్రం) ప్రయోగించినప్పుడు శత్రువులు చేష్టారహితులు అవుతారు చూచావా? అదే విధంగా ఎవడైతే తనయందు "విషయచింతన" అనే చాపల్యమునకు చోటు ఇవ్వడో ...అట్టివాడి మనస్సు, ఆ మనస్సు కల్పించే కల్పనా విశేషాలు తమంతటతామే సశాంతిస్తాయి. తత్త్వవిచారముచే విషయములనుండి మరలించబడిన మనస్సు

కలవాడే అందరికంటే 'శ్రేష్ఠుడు' అగుచున్నాడు. నాయనా! రామా! ఇక తక్కినవారి జీవితవిధానమంతా బురదలోని పురుగుల జీవితములకంటే, గొప్పవి కాదు.

ఎవని మనస్సు ఏకాగ్రతను పొంది స్థిరంగా ఉంటుందో అతడే తనయొక్క ఆత్మధ్యాన ప్రభావంచే సర్వోత్తమమగు బ్రహ్మపదమును పొందగలడు.

మందర పర్వతం చలించకపోతే క్షీరసాగరం ప్రశాంతంగా ఉంటుంది కదా! ఈ మనస్సు సంయమనం పొందితే సంసార భ్రమ కూడా శాంతిస్తుంది. అసలు ఈ సంసార విషవృక్షం మొలిచేది ఎక్కడో తెలుసా? విషయభోగములందు ప్రవర్తించు "మనోవృత్తులు" అనే ప్రదేశంలోనే సుమా! ఈ జీవులలో అనేకులు క్రోధ–మోహాదులతో కూడుకొన్నవారై, ప్రమత్తులై మందబుద్ధితో ప్రవర్తిస్తున్నారు. చపలమైన చిత్తము కలవారై ఈ సంసారము (wordly attachment) అనుదానిని ఆశ్రయిస్తున్నారు. జడత్వములో తగుల్కొని, తత్ఫలితంగా ప్రబలమైనట్టి అనేక దుఃఖములచే 'విచ్ఛిన్నులు' అగుచున్నారు. 'చక్రభ్రమణము' వలె అనేక చింతలలో మునిగి – తేలుచు, చివరికి ప్రవాహపతితంగా అనేక లోకసంచారములను మరల మరల పొందుచున్నారు.

వారి పతనము – ఉత్పతనములు సముద్రకెరటములవలె వచ్చి – పోతూనే ఉన్నాయి.

మనస్సును నిరోధించటంలో అప్రయత్నశీలురై ఉండేవారి దుస్థితికి అంతు ఉండుట లేదు.

❖❖❖

8. చిత్తము - చికిత్స - ఔషధం

నాయనా! రామా! ఇప్పుడు ఈ 'చిత్తము' అనే ఘోరవ్యాధిని నిర్మూలించటానికి ఒక గొప్ప 'ఔషధం' మీ అందరిముందు ఉంచుతాను. ఈ ఔషధం సేవించటానికి ఏ ఒక్కరు ఎక్కడికీ పోనక్కర్లేదు. ఎవ్వరినీ ఆశ్రయించవలసిన అవసరంలేదు. ఎవరికి వారికే తమ అధీనంలోనే ఉన్న ఔషధం ఇది. బాహ్య ప్రయత్నములు, ఇతరుల సహాయం అవసరముండదు. ఇది పురుషార్థ సాధకము. ఉత్తమ సుఖదాయకము కూడా.

మేము అనేక సంవత్సరములు సుదీర్ఘమైన తపస్సులచే, ధ్యానములచే, శాస్త్రవిచారణలచే, పరస్పర వాదోపవాదములచే ఎంతగానో విచారించాం. అట్లు విచారించిన తరువాతనే ఇక్కడ ప్రస్తావిస్తున్నాము. ఈ చెప్పబోయే 'ఔషధం' యొక్క ప్రాశస్త్యమేమిటో ఇక్కడకు వేంచేసియున్న అనేకమంది జ్ఞానులు గ్రహించియే ఉన్నారు. ఇప్పుడు ఆ 'ఔషధము' యొక్క విశేషమును చెప్పుచున్నాను. అంతా శ్రద్ధగా వినండి.

"ఇష్ట – వస్తువుల పట్ల ఏర్పడే వృత్తిని త్యజించటం"

ఈ 'చిత్తము' అనే బేతాళుణ్ణి నిరోధించాలంటే 'వాంఛిత వస్తువు' (I want some-thing).... అను దానిని త్యజించివేయాలి. అట్లు త్యజించాలంటే ఆత్మకు సంబంధించిన ఎరుకను, సాక్షాత్కారమును

పెంపొందించు శారీరక - మానసిక క్రియలను ఆశ్రయించటమే ఉపాయం. అట్లు ఆశ్రయిస్తూ ఉండగా కొంతకాలానికి, ఈ దృశ్యముపట్ల ఏర్పడుచున్న 'ఇది వాస్తవమే' అను అల్పభావం సన్నగిల్లుతూ వస్తుంది. 'ఇష్టవస్తువు' అను వృత్తిని త్యజించుచు, క్రమక్రమంగా 'రాగము-ద్వేషము' అను రెండు దోషములకు చిత్తమునందు చోటు ఇవ్వకుండా ఉంటూ ఉంటే చాలు. అట్టివానిచే మనస్సు జయింపబడటం అతిసులభం.

'ఆత్మసాక్షాత్కరము' అనునట్టి యత్నములచే ఈ చిత్తమును మిథ్య అయినట్టి ఈ సంసారపదార్థ సముదాయముల నుండి తొలగించాలి. ఎట్లాగైనా సరే 'ధ్యానము'ను 'ఆత్మస్వరూపము' అను సత్య వస్తువునందు నియమించాలి. "ఆయా గుణములతో కూడి కనిపిస్తున్న ఈ సహజీవులంతా మమాత్మ స్వరూపులే!" అనే మననమును రోజు-రోజుకూ పెంపొందించుకోవాలి. అప్పుడు నీవు జ్ఞానయుక్తుడవై, ఈ సంసారము అనబడుదానినుండి రక్షింపబడగలవు. శ్రేష్ఠమైన విషయములను విని, మననము చేయకలిగిన మనస్సు గల ఓ రామచంద్రా! దుఃఖాగ్నియందు పరితప్తమగుచున్న నీ మనస్సును మరొక నీ మనస్సుతో జయించివేయాలి. మనస్సుతోనే మనస్సును అణచివేయాలి. జయించివేయాలి. ఆ రెండవ మనస్సును చింతారాహిత్యముతోను, శాస్త్ర - సత్సంగములతోను, ధీరత్వముతోను, ప్రశాంతతతోను నింపివేయాలి.

ఒక బాలుడు దుష్ట, తుచ్ఛ కార్యము లందు నిరంతరం నిమగ్నమగుచున్నాడనుకో .... అప్పుడు ఏం చేస్తాం? అతనిని అనేక ఉపాయాలతో సరిదిద్ద యత్నిస్తాం.

సామం : Affectionalety explaining / Gentle cajoling

దానం : offering/showing the advantages

భేదం : differentiation

దండం : punishing

ఇట్లు ఈ నాలుగు ఉపాయాలు సమయోచితంగా తగినంతగా ఉపయోగించి అతనిని మరొక ఉత్తమ - కార్యమునందు వినియోగిస్తాం. అట్లే ఈ చిత్తముయొక్క 'దృశ్యాసక్తి' అనబడే ఒక భాగమును "దృశ్య తిరస్కృతి .. ఆత్మాంగీకారము" అను సమృద్ధితో నింపబడిన మనస్సుయొక్క మరొక భాగంతో నియమించాలి. సమయోచితంగా పై నాలుగు ఉపాయాలు ఉపయోగిస్తూ ఉండాలి. ఇందులో కష్టం ఏమీ లేదు. కొంత ప్రయత్నశీలుడవై, "ఈ దృశ్యము సత్యము కాదుకదా! ఇందు నాకు ఆసక్తి ఎందుకు ఉండాలి? కాబట్టి అన్ని పరిస్థితులలోను, అన్ని వేళలలోను 'ఈ దృశ్యము అవాస్తవమే' అను ఎరుక కలిగి ఉంటాను" అని నిర్ణయించుకో. నీ దృష్టిలో ఈ దృశ్యము అవాస్తవమైనదిగా సుస్థిరపడితే అప్పుడు ప్రాప్తించుచున్న స్థితినే "సమాధాన స్థితి" అని అంటున్నాం. అట్టి నిశ్చల సమాధియందు నియమితుడవై ఉండు. ఇక ఆయా ప్రవాహపతితమైన కార్యక్రమములను నిశ్చింతగా, అనాసక్తిపూర్వకంగా, సంగరహితంగా, ఉద్వేగరహితంగా నిర్వర్తిస్తూ ఉండు. అప్పుడు అట్లు నీచే నిర్వర్తించబడుచున్న ఆయా క్రియావ్యవహారముల కారణంగా నీ 'సమాధి స్థితి' కి వచ్చే లోటేమీ ఉండదు. మేమంతా కూడా అట్లే 'సమాధి' యందు సుస్థిరులమై "శిష్యులకు ఆత్మవిషయమై

బోధించుట" అను ఈ గురుధర్మమును, తదితర యజ్ఞాది లోక శుభకరమగు కార్యక్రమములను నిర్వర్తిస్తున్నాం. నీవు కూడా ఉత్తమ ఫలదాయకమగు 'సమాధి' అను సత్కర్మయందు మనస్సును నియోగించి, అట్టి సమాధి ద్వారా చిదాత్మ తోటి మనస్సును సర్వదా ఐక్యపరచి ఉంచు.

ఓ రాఘవా! "బాహ్యవిషయములు అభిలషించటం" అనే జాడ్యమును నిరాకరించటం (లేక) త్యజించటం నీ అధీనంలోనే ఉన్నది సుమా! దానికి గురువులుగాని, మరింకెవరోగాని ఏం చేయగలరు చెప్పు? నీవే అందుకొరకై ప్రయత్నించాలి. అట్టి ప్రయత్నం నీకు సర్వదా హితమును చేకూర్చగలదు.

"అభిలాషను జయించుట" అనే వైరాగ్యవృత్తిని అనుసరించుటకు సిద్ధముకానట్టి మనుజుడు కీటకముతో పోల్చతగినవాడు. అట్టివానికి ధిక్కారమగుగాక!

శ్రీ రాముడు : స్వామీ! ఏవేవో రమణీయమైన వస్తువులు మా ఎదుటకు వస్తూ – పోతూ ఉంటాయి. వాటిపట్ల ఆకర్షణ – వికర్షణలు ఏర్పడకుండా చూచుకోవటం ఎట్లా సాధ్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మసాక్షాత్కారరూప భావనచే అది సుసాధ్యమే! రమణీయమైన–అరమణీయమైన వస్తువులు, ఇష్ట – అయిష్టమైన వారు తారసపడుతూ ఉంటారు కదా! అయితే, "ఇవన్నీ కూడా పరమోత్తమమగు పరబ్రహ్మము యొక్క రూపమే అయి ఉన్నాయి కదా! పరమాత్మకు చెందినదే కదా!" అని భావిస్తూ ఉండు. అప్పుడు గొప్ప మల్లయోధుడు ఒక బాలుని జయించివేయునట్లు నీవు ఈ చిత్తమును జయించి వేయగలవు.

అరమ్యం రమ్య రూపేణ భావయిత్వా స్వసంవిదా ।
మల్లేనేవ శిశుశ్చిత్త మయత్నేనైవ జీయతే ॥

ఓ జనులారా! "ధ్యానము – ప్రార్థన – తపస్సు – పూజ – దానము – సత్సంగము – విచారణ" వంటి ఆత్మసాక్షాత్కారరూపమగు పురుష ప్రయత్నములు మీచే సర్వదా ఆశ్రయించబడుగాక! అప్పుడీ చిత్తము తప్పక జయించి వేయబడగలదు. అట్లు జయించబడిన చిత్తము అప్రయత్నంగానే బ్రహ్మమును పొందుచున్నది.

తన అధీనములోనే ఉన్నట్టి "అభిలాషను జయించుట" అనబడు మనోనిగ్రహంకోసం ప్రయత్నించువాడే 'మనుజుడు' అను పదమునకు తగుచున్నాడు. అట్లు ప్రయత్నించనివాని జన్మ తదితర జంతువుల జన్మలతో సమానమే అగుచున్నది. "అభిలషిత వస్తుత్యాగం", "ఈ కనబడే వారంతా పరమాత్మ స్వరూపులే", అను రూపముతో కూడిన ఉభయ అభ్యాసములు ఎవరికైనా స్వప్రయత్నము వలననే సుదృఢతరం అవుతున్నాయి. ఈ రెండిటిని ఆశ్రయించకుండా ఉన్నంతకాలం వేలాది జన్మలు గడచినప్పటికీ మోక్షం దుస్సాధ్యం. ఆత్మసాక్షాత్కారం కొరకై చేయు ప్రయత్నముల బలం చేతనే దృశ్యాసక్తి రూపమైన మనస్సు నశింపజేయబడుతోంది. మనస్సు నశించటం జరిగిందా, ఇక ఈ కామము, ఆకర్షణ, వికర్షణ మొదలైన శత్రువులు తమంతట తామే నశిస్తాయి. అట్టి ఆద్యంతరహితమగు స్వారాజ్యసుఖమును, మనోరహితస్థితిని ఈ జీవుడు, ఈ దేహం, ఉండి ఉండగానే తప్పక సంపాదించవచ్చు. కనుక రామా! నీవు సర్వదా జీవన్ముక్తత్వము కొరకే యత్నించెదవుగాక!

బాహ్యవిషయములపట్ల తిరస్కారం, మనోనాశనము కొరకు సంసిద్ధత లేకపోతే, ఇక గురువులు శ్రమతీసుకొని బోధించటం... శాస్త్రములలోని అర్థమును విచారణచేయటం ... ఏళ్ళ తరబడి మంత్రములను ఉచ్చరించటం ... ఇవన్నీ ఇవ్వవలసినంత ఫలితం ఇవ్వవు.

సంకల్పించకుండటం : 'సంకల్పరాహిత్యము' అనే శస్త్రమును సునిశితం చేసుకుంటూ ఉండు. అట్టి శస్త్రముచే ఈ చిత్తమును తప్పకుండా సమూలంగా ఛేదించవచ్చు. చిత్తము శాంతించిన మరుక్షణం ఈ జీవుడు "సర్వరూపము – సర్వవ్యాపి – శాంతము" అయినట్టి బ్రహ్మముయొక్క రూపమును తప్పక సంతరించుకుంటున్నాడు.

ఓ రాఘవా! "ఈ 'సంకల్పములు' అనే అనర్థం నిర్మూలించబడకపోవుట చేతనే ప్రశాంతమగు 'జీవన్ముక్తస్థితి' లభించుటలేదు" అని గ్రహించు. ఉత్తమమైన మనుజ జన్మ పొంది, తద్వారా మోక్షమునకు అర్హుడు అగుచున్న ఈ జీవుడు "సంకల్పములు చేయకుండుట" అనునది అభ్యసిస్తూ ఉండుటలో ఏమి కష్టమున్నదో మాకు అర్థమగుటలేదు.

శ్రీ రాముడు : తండ్రీ! ఏది ఏమైనప్పటికీ, ప్రారబ్ధము (The culmination of past deeds) మా పట్ల ప్రవర్తించియే తీరుతుంది కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ ప్రజ్ఞాస్వరూపా! రామచంద్రా! 'అల్పజ్ఞానదశ' ను సంస్కరించుట కొరకు మాత్రమే కల్పించబడి, చెప్పబడుచున్న 'ప్రారబ్ధము' అనబడునది నీచే ఇప్పుడు ఆదరింపబడవలసిన పనేమున్నది?

ఓ మానవులారా! మీ అందరికి మరల మరల గుర్తుచేస్తున్నాను. ఆత్మసాక్షాత్కారమగు పురుషప్రయత్నముచే ఈ చిత్తమును 'అచిత్తం' చేయండి. అంతేగాని ఆ కారణాలు – ఈ కారణాలు చెప్పుకొంటూ, మీనమేషాలు లెక్కించుకొంటూ, "మానవజన్మ పొందియుండుట" అనబడు మహత్తర అవకాశమును వృథా చేసుకోకండి. "నేను జీవుడను. మనోబద్ధుడను" అను తుచ్ఛకల్పనలు చేయటం మీ స్వస్వరూపమగు ఆత్మను తిరస్కరించటమే సుమా!

అందుచేత మీరు "అభ్యాసవశంచేత ప్రాప్తించగల ఉత్తమ బ్రహ్మపదమును పొందుటయే మేము లక్ష్యంగా కలిగి ఉంటాం" అని దృఢంగా నిర్ణయించుకొని 'మహాశయులు' (మహత్తరమైన ఆశయము కలవారు) కండి. అంతేగాని, "నేను స్వల్పుడను, అల్పుడను" అని ఎందుకు భావన చేయాలి? అట్లు తలచి స్వల్పత్వము పొందవలసిన అగత్యమేమున్నది? మీ స్వస్వరూపమగు ఆత్మకు అట్టి అల్పత్వమును ఆపాదించుటచే మీకు వచ్చే లాభమేమున్నదో కొంచెం చెపుతారా?

చిరకాలాభ్యాసంచే "నేను బ్రహ్మమునే. అంతేకాని, ఈ దేహ – మనో – బుద్ధ్యాదులు నేను కాను" అని భావించుచు ప్రసిద్ధమైయున్న ఉత్తమ బ్రహ్మపదమునే పొందండి.

అంతిమసాక్షాత్కారవృత్తిచే ఆవిర్భవించు నిష్కళంక చైతన్య భావమును స్వీకరించి, తద్వారా అవిద్యను సంపూర్ణంగా నశింపజేయండి. మీ చిత్తములను ఆత్మయందు లయింపజేయండి.

"చిద్వస్తుభావన"ను క్రమక్రమంగా అలవరచుకోండి. అద్దానిని హృదయంలో తీర్చిదిద్దుకోండి. మహత్తరంగా పదిలపరుచుకోండి.

❖❖❖

9. 'చిత్' ను భావన చేయుటం

"నా యందు ఈ నా మనస్సుకు కూడా సాక్షీభూతమైయున్న "సత్య – నిత్య" వస్తువు అగు "ఆత్మ", నాయందున్నట్లే, సర్వులందు – సర్వజీవరాసులందు కూడా సాక్షీభూతమైయున్నది" అని భావించుటయే చిద్వస్తు భావన.

అట్టి చిద్వస్తుభావనను, సుస్థిరపరచుకొనుటయందు సావధానముగా ఈ 'బుద్ధి' ని నియోగించాలి. ఓ జనులారా! మీరంతా స్వస్థచిత్తులై... చిత్తమునకు పరమైనట్టి, చిత్తమును కూడా మ్రింగివేయ కలుగునట్టి ...పరమాత్మయందే నిలకడ కలిగి ఉండండి.

ఓ రామచంద్రా! ఒకానొకడు కొంత భ్రమకు లోనగుటచేత పశ్చిమదిక్కును చూచి "ఇదియే తూర్పుదిక్కు" అని తలచటం జరిగిందనుకో...! విజ్ఞులగు వారిచే ఏది పశ్చిమమో, ఏది తూర్పో తెలియజేయబడగా, అది అతడు గ్రహించిన తరువాత, ఇతఃపూర్వపు దోషజ్ఞానం తొలగిపోతుంది కదా! పురుషప్రయత్నం చేసేవారికి కొంత కాలానికి దోషజ్ఞానం తొలగుతుంది. అప్పుడు మనస్సును జయించటం సులభమే అవుతుంది.

ఒకడు అనుద్వేగంగా, ఓర్పుతో, నేర్పుతో ప్రయత్నిస్తేనే ధనములు, పదవులు, రాజ్యములు పొందుచున్నాడు. మనోజయం కూడా అట్లు ప్రయత్నించినవానికే సిద్ధిస్తోంది. అయితే రాజ్యము, ధనము, పదవి మొదలైనవాటిలో రాజభయం, చోరభయం, శత్రుభయం వంటివి ఉంటాయి. స్వర్గలోకములో కూడా, "నా పుణ్యమంతా ఖర్చైతే అధోలోకములకు పోతానే...." అనే మనోవ్యాధి ఉండవచ్చు. కాని, "ఈ మనస్సును జయించి, ఆత్మయందు నిలిపి ఉంచుట" అనుదానిలో అట్టి తదనంతర క్లేశములు ఉండవు. అట్టి "స్వభావమాత్రవ్యావృత్తి" (Natural avocation towards one's own self) అయినట్టి 'ఆత్మస్థితి' కొరకు ఈ జీవుడు ఎందుకు ప్రయత్నిస్తూ ఉండరాదు? ఓ సర్వజనులారా! అట్టి చిత్తలయరూపమగు ఆత్మస్థితి పొందక పోవుటకు కారణం అజ్ఞానమే అయి ఉన్నది. "మేము ఈ ఈ పనులలో ఉన్నాం. అందుకే ఆత్మస్థితిని అవధరించలేకపోతున్నాం" అని పలకటం ఏమాత్రం భావ్యం కాదు. "సర్వము ఆత్మతత్త్వమే" అని నిశ్చయించుకుని యథాతథంగానే మీమీ ధర్మములు నిర్వర్తిస్తూ ఉండండి. ఆత్మయొక్క చమత్కారమంతా గ్రహించిన తరువాత, ఆపై మీకు ఎట్లు ఉచితమని అనిపిస్తే అట్లే చేయండి. (కర్మలు నిర్వర్తించండి – లేదా త్యజించండి).

కాబట్టి "ఆత్మతత్త్వమగు ఆ భగవంతుడే ఇదంతా" అని గ్రహించి, అట్టి సంగ్రహణము యొక్క శక్తి ద్వారా మనస్సు యొక్క సంచలనమును జయించివేయండి. ఇంతమాత్రపు భావన కలిగియుండుటలో కష్టమేమున్నది?

తన మనస్సునందలి దోషములేమిటో గ్రహించి, అట్టిదోషపూరిత మనస్సును జయించుటకు సిద్ధపడుచుండనివాడు ఈ లోకంలో ప్రశాంతంగా ఎట్లు జీవిస్తాడో మాకర్థమగుటలేదు.

శ్రీ రాముడు : మహర్షీ! ఈ జన్మ జరా మరణములు, ఇహ పరలోకములు, పురుష – స్త్రీజన్మలు మొదలైన తతంగమంతా ఏమైయున్నది? ఆత్మ అభేదస్వభావము కలదిగదా! ఈ భేదమంతా ఎందుకుంటోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : "నేను పురుషుడను. నేను స్త్రీని. నేను జన్మించితిని నేను జీవించుచున్నాను. నేను మరణిస్తున్నాను...." మొదలైన సర్వకుకల్పనలు చంచలచిత్తము యొక్క వృత్తులే అయి ఉన్నాయి. యథార్థానికి ఎవ్వరూ మరణించుటలేదు. జన్మించుట లేదు. ఈ మనస్సే "ఇది నా జన్మ, ఇది నా మరణము. ఇది ఇహము. ఇది పరము" అని స్వయముగా కల్పించుకొని అనుభవిస్తోంది. ఈ మనస్సే ఇక్కడికి వస్తోంది. మరల పరలోకమునకు పోతోంది. మరొక రూపముగా స్ఫురిస్తోంది. ఈ విధంగా మోక్షప్రాప్తి పర్యంతము మనస్సుయందు కల్పనలు సంభవిస్తూనే ఉన్నాయి. సర్వము కల్పనామయమే అయిఉండగా, ఇక మరణభయం ఎందుకు? ఎవరికి? ఎచట?

ఈ సర్వము చిత్తముయొక్క ప్రభావమే. చిత్తమునకు వేరైన రూపమేదీ ఈ జగత్తుకు లేదు. బంధువులు మరణించినప్పుడు, తదితర సందర్భములలోను ఆయా క్లేశములను పొందుచున్నది చిత్తమేకాని శుద్ధచైతన్యము కాదు సుమా!

పరమాత్మ సర్వవేళల ఆపేక్షారహితుడు, మహత్తర శక్తిమంతుడు. సర్వహితుడు. మాయాదోష రహితుడు. శ్రుతులచే ప్రతిపాదించబడినట్టి అట్టి స్వస్వరూపమగు పరమాత్మయందు ఈ చిత్తమును లయం చేయాలి. ఇంక మరే ఉపాయంచేతను ముక్తి లభించదు. ఈ నా నిర్ద్వంద్వమైన అభిప్రాయం ఈ త్రిలోకములందలి అనేకమంది తత్వవేత్తలచే అంగీకరించబడుచున్నది.

ఈ విషయమే వేదాంగములైన ఉపనిషత్తులు నిర్దుష్టంగా ప్రకటిస్తున్నాయి.

చిత్తము ఉపశమించగా, కేవల – చిన్మాత్రవస్తువుగా శేషించుటే ముక్తి.

ఇంతకుమించి 'మోక్షము' అనబడునది వేరుగా లేదు. ఆత్మసాక్షాత్కార రూపమైన ప్రబోధము హృదయమునందు ఉత్పన్నముకాగా అప్పుడు ఈ జీవునకు పరమశాంతి లభిస్తోంది. "నా ఆత్మయే సర్వుల ఆత్మ. సర్వులు ఆత్మస్వరూపులే! ఆత్మయే ఇదంతా!" ..... అనునదే ఆత్మజ్ఞానం.

అట్టి ఆత్మవస్తువు మాత్రమే సత్యమైయున్నది. అది త్రికాలములచే అభేద్యమై సర్వదా వెలుగొందుచున్నది. సర్వవ్యాపకమై, అఖండమైయున్నది. అజ్ఞానమాలిన్య రహితమగు అట్టి ఆత్మయొక్క స్వరూపమే ... నేను, నీవు, ఈ సర్వసభికులు, సర్వ భూత–భవిష్యత్–వర్తమాన జీవరాసులు కూడా.

ఓ రామచంద్రా! అతివిస్తీర్ణమగు హృదయాకాశమునందు ఈ 'మనస్సు' ఒక దురాక్రమణదారుని వలె తాండవం చేస్తోంది. అందుచేత, నీవు అంతిమసాక్షాత్కారవృత్తి (The final beautitude of self) చే ప్రకాశమానమగు, 'చిద్రూపము' అను సుదర్శనచక్రం చేతిలో ధరించు. అప్పుడు ఈ మనస్సును ఛేదించివేయి. ఆపై ఇక ఎట్టి మానసిక వ్యథలు నిన్ను బాధించలేవు.

ఈ స్త్రీ - పుత్రాదులు, తదితర విషయానుభవములు అవిచారణ చేతనే రమణీయంగా కన్పట్టుచున్నాయి. వాటియందలి అరమణీయత్వము గాంచబడిందా, మరుక్షణం మనస్సుయొక్క సర్వాంగములు తెగి నేలరాలినట్లే. ఎందుకంటావా? ఈ దృశ్యమానమగు ప్రపంచంలో ప్రాప్తిస్తున్న ఈ దేహపరంపరలు తదితర సంబంధ - బాంధవ్యములు, గృహ - ధన - క్షేత్రాదులు - ఇవన్నీ కూడా మనస్సు యొక్క వివిధ అంగములే అయిఉన్నాయి. అవన్నీ మనస్సు భావించకున్నంత మాత్రంచేత విచ్ఛిన్నం కాగలవు. సంకల్పరాహిత్యం చేత మనస్సే లయించిపోతోంది.

"సంకల్పరాహిత్యము" - అనే అభ్యాసం : శస్త్రములో, అగ్నియో, శత్రువులో ఉన్నచోటైతే భయం వేయవచ్చు. "సంకల్పరాహిత్యము" అను ప్రయత్నమునందు భయమెందుకు? సంకల్పించక పోయినంతమాత్రం చేత మనస్సు లయించగలదు కదా? సంకల్పరాహిత్యమును ఆశ్రయించుటలో ఏం కష్టం ఉన్నది? ఈ జనులంతా ఏది శ్రేయమో, ఏది బంధమో గ్రహించెదరుగాక! ఈ చిత్తము వ్యవహారంలో అత్యంత జాగరూకులై ఉండెదరుగాక! లౌకిక వ్యవహారాలలో ఉన్నప్పుడు "ఇది లాభదాయకము. ఇది కాదు" అని ఈ జనులు గ్రహిస్తున్నారు కదా! మరి, వీరు "సంకల్పరాహిత్యము - అచిత్తలాభము" ల గురించి ఎందుకు గ్రహించుటలేదో నాకు అర్థం కావటం లేదు!

మన బాలురను మనం ఉత్తమమైన క్రియలందే నియమిస్తూ ఉంటాం. అదే విధంగా ఈ మనస్సును కూడా ఉత్తమ శ్రేయోమార్గంలోనే నియోగించాలి. లేకుంటే దీనిని జయించటం కష్టమే అవుతుంది. ఏ మహాత్ములైతే ఈ మనస్సును ఒక పద్ధతిగా నియమించుచూ, క్రమంగా దీనిని నశింపజేస్తారో, అట్టివారే సర్వులలో ఉత్తములు అగుచున్నారు. అట్టివారు ఎక్కడవుంటే అక్కడ తదితరులను కూడా తమవలెనే 'ముక్తులు'గా చేసివేయగలరు.

ఎడారి భూములలోనే మృగతృష్ణలు అనుభవమౌతూ ఉంటాయికదా! ఈ "సంకల్పములు" అనే వ్యవహారమునుండే భయంకరములు, భ్రమదాయకములు అయిన, అనేక విపత్తులు ఉత్పన్నమౌతున్నాయి. అయితే కొందరు మహనీయులు సంకల్పములకు ఆవల ఉన్నట్టి ఆత్మతత్త్వమును సర్వదా పొందుతూనే ఉన్నారు. ఓ రామా! ప్రళయవాయువులు వీచుగాక! సప్తసముద్రములన్నీ పొంగిపోయి, లోకములన్నిటినీ ముంచివేయుగాక! ద్వాదశాదిత్యులు ఒక్కసారిగా ప్రజ్వలించుగాక! తమ మనస్సును జయించివేసి సుస్థిరం చేసివేసియున్న మహాత్ములు ఖేదము పొందరు. మోదము పొందరు. స్వస్థానమునుండి చ్యుతి పొందరు.

ఈ జగత్తులో, ఈ సృష్టిలో ఉత్తమోత్తమమైనది ఏదైనా ఉన్నదనుకొంటే, అది ... అకృత్రిమము, జడత్వరహితము అయినట్టి అమనస్కమే సంకల్పరాహిత్యత్వమే అయి ఉన్నది.

ఈ జనులలో అనేకులు, "అయ్యో! ఏదో మహత్తరశక్తి లేక 'విధి' అనబడేది మమ్ములను ఈ సంసారకూపంలో పడవేసి బాధిస్తోంది" అని అనుకొంటూ ఉంటారు. అది సరికాదు. ఈ 'మనస్సు' అనే బీజంలోనుంచే సుఖ-దుఃఖ రూపకములైన శుభాశుభములు, ఈ ఊర్ధ్వ, అధోలోకములతో కూడిన సంసారారణ్య సంచారం సంప్రాప్తిస్తున్నాయి. మరి మనస్సో, స్వసంకల్పముల నుండే

ప్రభవిస్తోంది. తన తలను తానే గోడకు బాదుకుంటూ “ఈ గోడ నన్ను హింసిస్తోంది” అని తలచటం మూర్ఖత్వమే అవుతుంది కదా! అట్లే, స్వసంకల్ప రచన అయి ఉన్న ఈ సంసారదోషమునకు పరులనెవ్వరినో దూషించటం ‘మూర్ఖత్వం’ అని అనిపించుకుంటుంది.

ఓ రామచంద్రా! ఇన్ని మాటలు అఖ్ఖర్లేదు. ఒక్కమాట ముక్కుకు సూటిగా చెపుతాను. విను.

అసంకల్పనమాత్రైక సాధ్యే సకల సిద్ధిదే ।
అసంకల్పనసామ్రాజ్యే తిష్ఠావష్టబ్ధతత్పదః ॥

నిశ్చల తత్వపూర్వకమైన ‘నిస్సంకల్పం’ అనబడే మహాసామ్రాజ్యం ఈ భౌతిక సామ్రాజ్యములకన్నా, స్వర్గాది లోకములకన్నాకూడా పరమోత్తమమైనది. “నేను దేనిని సంకల్పించకుండెదను గాక” అను భావం సుస్థిరం చేసుకున్నంత మాత్రంచేత అది సాధించబడగలదు. అట్టి నిస్సంకల్పము ఈ జీవుని “ఆత్మపదము” అను సింహాసనముపై కూర్చుండబెట్టగలదు. ఇంతమాత్రపు రహస్యమే అనేక మాటలు ఉపయోగించి శాస్త్రయుక్త – ప్రయత్నరూపములలో శాస్త్రకారులు ఈ జనులకు బోధిస్తున్నారు. ఇంతమాత్రం సాధించటంలో కష్టమేమి ఉన్నది? ఒకడు ఉష్ణతాపముచే బాధింపబడుచున్నాడనుకో .... అప్పుడు ఆతని సమీపంలో గల అగ్ని ఉపశమిస్తూ ఉంటే, ఉష్ణతాపం తొలగుతుందికదా! అట్లాగే దృశ్యతాదాత్మ్యము వలన కలుగుచున్న దృశ్యముయొక్క మననము –(“విషయములను ఆశ్రయించటం – దృశ్యమును సంభావించటం” వలన కలుగుచున్న) ‘అమననము’ అను అభ్యాసం చేత క్రమంగా ఆ జీవునికి ఉపశమనాన్ని కలిగించగలదు. దృశ్యము గురించి మననము క్రమంగా క్షయించుచుండగా, ఈ మనస్సు జీవునకు అనిర్వచనీయమగు ఉత్తమసుఖమును అందిస్తూ ఉంటుంది.

ఈ మనస్సు కనుక తలచుకొంటే, ఒక చిదణువునందు లక్షలకొలది బ్రహ్మాండములను వేర్వేరుగా, విస్పష్టముగా, గోచరింపజేయగలదు. సంకల్పమాత్రంచేత అనేక సృష్టులను రచించుకుంటూ పోగలదు. అది జీవునకు రుచి చూపించగల స్థితి గతులకు, విభ్రమములకు, దుర్లక్ష్యములకు, దుష్ట – అసత్య ఆకర్షణలకు అంతు ఉండదు. “అట్టి దుష్టము, దుర్భరము అయినట్టి ఈ మనస్సును జయించుట ఎట్లా?” అనునదే అందరియొక్క ముఖ్యమైన సమస్య. శాస్త్రకారులచే చెప్పబడుచున్న అనేక నియమములు, నిష్ఠలు – అన్నిటియొక్క ఉద్దేశము ఒక్కటే. ఈ మనస్సును సన్మార్గములలో నియమించుటే. అట్టి ఈ మనస్సు నిరంతర అభ్యాసముచే సిద్ధించగల రెండు ఆయుధములచే మాత్రమే జయించివేయబడగలదు.

1. తృష్ణారాహిత్యము (Desirelessness)
2. సంతోషము (Contentment)

ఈ రెండు ఆయుధములను నిర్మించుకో. అప్పుడు ఈ మనస్సును జయించివేయి. విజయమును పొందు. ఆత్మపదమును అధిరోహించు. అట్టి ఆత్మపదము ఇప్పుడే, ఇక్కడే లభించవలసినదే గాని “మరెక్కడో ఎప్పటికో లభించవలసినది” అని భావించతగదు. పరమపవిత్రమైన, అమనస్కరూపమైన,

అహంకారరహితమైన, దుఃఖరహితమైన, శాంతరూపమైన, ఈ 'జన్మలు' మొదలైన వికారములు ఏ క్షణమందును ఉండనట్టి స్థితియే 'ఆత్మపదము' అని పిలువబడుచున్నది. ఆత్మవేత్తలచే మహత్తరమైనదిగా చెప్పబడుచున్న ఆ ఆత్మపదము – కేవలం సంకల్పరాహిత్యంచేత ఏర్పడగల అమనస్కస్థితియే అయి ఉన్నది. ఏది నీయొక్క, నాయొక్క, సర్వులయొక్క సత్యస్వరూపమే అయి ఉన్నదో ...అది పొందటానికి ప్రతిఒక్కరికి సర్వహక్కులు ఉన్నాయి. ఓ రామా! అట్టి 'ఆత్మస్థితి' ని ఏమరచి అనేక భ్రమలకు లోను అగుచు ఆసక్తి కారణంగా ఈ సంసారసాగరంలో కొట్టుమిట్టాడవలసిన అవసరం ఏమున్నది? అట్టి అగత్యంలేదు. జ్ఞానివి అయి, ఆపై యథారీతిగా వర్తించుటయే ఉచితం.

❖❖❖

10. మనస్సు యొక్క స్వభావం - ఉపశమనము

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ మనస్సు ఏ పదార్థం గురించి ఏ విధంగా తీవ్రవేగంతో ప్రవృత్తమౌతోందో –ఆయా కోరుకునే పదార్థములను ఆ విధంగానే గాంచుచున్నది. తటాకపు నీటిలో బుద్బుదములు (బుడగలు) ఏ నిమిత్తము లేకుండానే స్వాభావికంగా ఉత్పన్నమై నశిస్తూ ఉంటాయికదా! అట్లే ఈ మనస్సులో కూడా సంకల్ప–వికల్పములు తీవ్రవేగముతో ఉత్పన్నమగుచు, నశించుచున్నాయి. శీతలత్వము మంచుయొక్క రూపం, నలుపురంగు కాటుకయొక్క రూపంకదా! "సంకల్పముల యొక్క తీవ్రాత్రీవములు" అను చంచలత్వమే ఈ మనస్సు యొక్క రూపం. సంకల్పముల పరంపరయే మనస్సుగా చెప్పబడుతోంది.

శ్రీ రాముడు : ఈ చపల మనస్సే సర్వ ప్రవృత్తులకు ముఖ్యహేతువు కదా! దీని వేగమును, బలాత్కారంగా అయినా సరే, నివారించేదెట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! ఈ లోకంలో ఎక్కడా మనస్సు తన చంచలత్వం విడిచిపెట్టి కనిపించుటలేదు. అగ్నికి ఉష్ణత్వం ఎట్లాగో, మనస్సుకు కూడా చంచలత్వము ధర్మమైయున్నది.

చిత్తము = "మాయతో కూడుకొన్న చైతన్యము యొక్క భావనాస్వరూపము"

చిత్తమునందలి చంచల క్రియాశక్తియే "మానసికశక్తి" అని పిలువబడుతోంది. అదియే ఈ జగదాడంబరమంతా. వాయువు స్పందాస్పందములే రూపముగా కలిగి ఉంటోంది కదా! 'స్పందము' లేక 'చపలత్వము' కాకుండా ఈ చిత్తమునకు వేరురూపం లేదు. చంచలత్వము లేకుండా పోయిందా, ఈ చిత్తమే లేకుండాపోతోంది. అట్టి మనోనాశనమే 'తపస్సు–మోక్షము' కూడా అయిఉన్నదని శాస్త్రముల సిద్ధాంతము. మనస్సు గనుక 'అఖండము – అప్రమేయము' స్వభావముగా గల ఆత్మనే నిత్యము మననం చేస్తుంటే, ఇక దుఃఖములన్నీ మటుమాయమవక తప్పదు. "అందరూ – అంతా (నాతో సహా) ఆత్మరూపమే" అనే సంకల్పంతో మనోసంకల్పములను జయించాలి.

ఈ మనస్సు లేక 'చిత్తము' అనే రాక్షసుడు స్ఫురించి విజృంభిస్తూ ఉంటే అనేక వేసటలు, దుఃఖములు, నీచప్రవృత్తములు, భేద దృష్టులు పొంగిపొరలి వచ్చిపడుచున్నాయి. అందుచేత, రామా!

నీవు ఈ మనస్సును ప్రయత్నపూర్వకంగా ఆత్మదేవునివైపుగా నడిపించగలిగితే ... అప్పుడు "దేశ – కాల – వస్తువులచే పరిచ్ఛిన్నము కాజాలనట్టి అనంత మోక్షసుఖము"ను అనుభవించగలవు.


దుఃఖముత్పాదయత్యచ్చై రుత్థితశ్చిత్త రాక్షసః
సుఖ యానంత భోగాయ తం ప్రయత్నేన పాతయ. (శ్లో.10, సర్గము. 112)

అనేక దుర్వాసనలకు (Bad tendencies) ఆహ్వానం పలుకుచున్న ఈ మనోచాంచల్యమునే "అవిద్య" అనే శబ్దంతో చెప్పుచున్నారు. అట్టి మనస్సును, దాని చాంచల్యమును "ఆత్మ – విచారము" అను ఉద్వేగరహిత తీవ్రయత్నము (Unemotional - intensified effort) చే నాశనము చేయవచ్చు.

శ్రీరాముడు : అది ఎట్లా సాధ్యం మహర్షీ!

శ్రీ వసిష్ఠ మహర్షి : ముందుగా, ఈ చిత్తశక్తి దేనివైపు ప్రసరించి అచ్చట తిష్టవేసుకొని ఉంటోందో గమనించు. ఏఏ ఇంద్రియ – ప్రాపంచిక విషయములపట్ల ప్రమేయము–ఆసక్తి–భయము–ఉద్వేగము ఏర్పడితే అచ్చటచ్చట నీ చిత్తము తగులుకొంటున్నట్లే! అట్టి ప్రియంగా భ్రమను గొలుపుచున్న బాహ్య విషయములపట్ల అనాసక్తి (Un-attachment) పెంపొందించుకో. క్రమంగా ఆయా బాహ్య విషయములను త్యజించివేయి. ఆత్మవస్తువు గురించి, దాని ధర్మముల గురించి మరల మరల మననం చేస్తూ ఉండు. ఆత్మ గురించిన సమాచారం విను, యోచించు, అవలంబించు. అప్పుడు తప్పకుండా "మోక్షము" అను ఉత్తమశ్రేయస్సు లభించగలదు.

ఓ రాఘవా! అసలు మనస్సు అనునది ఉన్నదెక్కడ? సత్–అసత్‌లకు, జడ–చైతన్యములకు మధ్యగల రూపము లేక తత్త్వమునే మనస్సు అంటున్నాం. ఈ మనస్సు అటు చైతన్యమువైపు, ఇటు జడమువైపు ప్రవృత్తము కలిగినదగుచున్నది.



ఈ మనస్సు జడపదార్థముల విషయమై, "ఇది ప్రియమైనది. ఇది అప్రియమైనది" అను చింతన చేయుచున్నది. అట్టి జడత్వమునకు సంబంధించిన దృఢాభ్యాసంచే కలుషితమైన ఈ చిత్తము జడత్వమునే పొందటం జరుగుతోంది. అదే చిత్తము చిద్వస్తువును చింతించటం జరిగినప్పుడు, అట్టి 'చిద్వస్తుచింతన' యొక్క దృఢాభ్యాసంచే చైతన్యముతో ఏకమౌచున్నది. శాస్త్రీయ-పురుషప్రయత్నముచే దేనియందు ఈ చిత్తము నియోగించబడితే, అభ్యాసబలం అనుసరించి, అద్దానిరూపమునే పొందుచున్నది. అందుచేత రామా! నీవు పురుష ప్రయత్నముచే చిత్తమును చిత్తముచే జయించివేయి. సర్వదా దుఃఖరహితమగు ఆత్మపదమునే ఆశ్రయిస్తూ ఉండు. సర్వసందేహములను అధిగమించి, నిశ్చలత, అద్వితీయత, అఖండత అలవరచుకో. 'మనోనాశనము' అని మనం చెప్పుకొంటున్న క్రియాక్రమమునందే సంలగ్నుడవై ఉండెదవుగాక! ఈ మనస్సును బలాత్కారంగా విషయముల నుండి విముఖం చెయ్యాలి. ఇంతకుమించి మోక్షప్రాప్తికి వేరే ఉపాయం లేదు. బాలుడు అల్లరిని ఆపి పాఠ్యాంశాలు పఠిస్తేనేకదా, చదువు వచ్చేది!

మనస్సును నిగ్రహించగలిగేదేది?

ఈ మనస్సును నిగ్రహించకలిగేది ఈ సృష్టిమొత్తం మీద ఒక్కటే - ఒక్కటి వున్నది.

అది ... "నీ మనస్సే"

రాజును రాజే జయించగలడు గాని బాలుడు రాజును జయించలేడుకదా!

ఈ జీవుడు 'సంసారము' అనే సముద్రంలోపడి 'తృష్ణ' అనే మొసలిచే పీడింపబడుచు, దిక్కుతోచకున్నాడు. 'విషయములు' అనే సుళ్ళలో చిక్కి దూరదూరాలకు కొట్టుకుపోతూ ఉన్నాడు. అట్టి ఈ జీవునకు 'వివేకము' తో కూడిన మనస్సే 'నౌక' అగుచున్నది. దీర్ఘపాశము వంటిది, దృఢబంధన రూపముగలది అయిన మనస్సును మనస్సుతోనే ఛేదించాలి. ఆత్మను బంధమునుండి విడిపించాలి. మరింకే క్రియలచేతను బంధవిమోచనము కలుగదు. 'మనస్సు' అను పేరుతో చెప్పబడుచున్న 'వాసనాసమూహం' అనేక 'ప్రాపంచిక - విషయములు' అనువాటికి గ్రుచ్చబడియున్నది. ఈ మనస్సు బాహ్య పదార్థములవైపు ప్రవృత్తి కలిగియున్నది.

ప్రాజ్ఞుడైనవాడు అట్టి వాసనలను రహితం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. 'ప్రజ్ఞ - పరిశీలన' కొరవడినప్పుడో... వాసనలను అధికం చేసుకుంటున్నాడు. ఫలితం? బద్ధుడు అగుచున్నాడు.

ఉష్ణత్వం క్షయిస్తే అగ్ని ఆరిపోవుచున్నట్లు వాసనలు క్షయిస్తే అవిద్యకూడా క్షయించగలదు. కనుక, రామా! మొట్టమొదట భోగవాసనలను త్యజించు. అటుతరువాత భేదవాసనలనుకూడా వదలివేయి. ఇక విషయములను కూడా త్యజించి, వికల్పరహితుడవై సుఖంగా ఉండు.

'పూర్ణానందము' ను 'దృశ్యవ్యామోహము' అను ఆవరణము మరుగుపరచుచున్నది. అట్టి అవిద్యను "ఆత్మసాక్షాత్కార రూపభావన" చే తొలగించివేయుటయే "వాసనలను క్షయింపజేయుట" అగుచున్నది.

ఓయీ! జీవుడా! నీవు వాస్తవానికి సర్వమునకు సర్వదా కేవలసాక్షివై ఉన్నావు. "ఈ చిత్తము ద్వారా సాక్షి (The Witness of Experiences) ఏఏ పదార్థములను అనుభవిస్తోందో అట్టి ఆయా అనుభవములు సాక్షియందు గాని, ఆ అనుభవములయందు 'సాక్షి' గాని లేకుండా పోవుట" అనుదానినే "నిర్వాణము" అని పిలుస్తున్నారు.

విషయానుభవం కలిగియుండుటయే "దుఃఖం".

విషయానుభవములకు అతీతమైనస్థితి కలిగియుండుటయే ... "నిర్వాణం".

అట్టి నిర్వాణము స్వప్రయత్నముచే తప్పక లభించుచున్నది. "ఆఁ! మేమెక్కడ? ఆ నిర్వాణమెక్కడ? మేము దానిని ఇప్పట్లో పొందలేం" అని చెప్పుకొంటూ అప్రయత్నశీలురై ఉండేవారితో పలుకనైనావద్దు. ఎవరైతే ప్రయత్నశీలురై ఆత్మవిశ్వాసముతో విచారణపూర్వకంగా వ్యవహరిస్తున్నారో వారికి సత్యము కరతలామలకము అగుచున్నది. పిడివాదములతో ఆత్మ స్థితిని గ్రహించని వారితో వాదులాట అనవసరం.

ఓ రామచంద్రా! జాగ్రత్తగా విను. నీ మనస్సులో "ఆయా విషయములు – వాటిని పొందవలె ననే ప్రయత్నములు" కాపురం చేస్తూ ఉంటే,.... "అవన్నీ మిథ్యయే" అని గ్రహించు. "అవన్నీ అజ్ఞానము నుండి ఉత్పన్నమైన భావనా క్రమములే కదా" అని భావిస్తూ ఉండు. క్రమంగా అట్టి అజ్ఞానవాసనల బీజమునే తొలగించి వేసుకోటానికి ప్రయత్నిస్తూ ఉండు. అట్లు ఆ వాసలను మొదలంట త్యజించి నిత్యతృప్తుడవైయుండు. ఇక ఆయా విషయజనితమైన హర్షశోకములను మరింకెన్నటికీ పొందకుండెదవు గాక!

❖❖❖

11. అవిద్య

శ్రీ వసిష్ఠ మహర్షి : కంటిదోషం వలననే ఆకాశంలో రెండవచంద్రుడు కనబడునట్లు, వాసనవలననే దృశ్యజగత్తు సుఖ–దుఃఖ బంధముల రూపంగా సంప్రాప్తిస్తోంది. అయితే, "వాసనలు" అనేవి మిథ్యారూపంగానే ఉదయిస్తున్నాయి. నీటిలో ప్రతిబింబించే ఆకాశంలాగా అవస్తువు అయినప్పటికీ, ఈ దృశ్యవ్యవహారం అవివేకముచే సత్యము అయినట్లుగా ప్రాప్తిస్తోంది. ఇదంతా అవిద్య యొక్క ప్రభావమే. వివేకులు దీనిని చూస్తున్నప్పుడు "ఇదంతా 'గొడ్రాలి రెండవకుమారుడు' అను మాటలాగా మొదలే అసత్యమై, అవాస్తవమైయున్నది" .... అను దృష్టిని కలిగి ఉంటున్నారు. వారి దృష్టిలో ఇదంతా లేనిదే అయి ఉన్నది. అవివేకుల దృష్టియో,... వేరొక విధంగా ఉంటోంది.

ఓ రామచంద్రా! నీవు అజ్ఞానివి కాకూడదు సుమా! చక్కగా ఆత్మవిచారణచేసి తత్వజ్ఞానివే అవ్వాలి. ఆకాశంలో రెండవచంద్రుడు అవాస్తవమే అయినట్లు, ద్వైతరూపమగు 'అవిద్య' లేక 'సంసారము' లేక 'దృశ్యము' అనునవికూడా ఉనికి కలిగిలేవు. ఈ ప్రపంచంలో బ్రహ్మతత్త్వమొక్కటి తప్ప ఇతరములైనట్టివన్నీ లేనేలేవు. వేలాది తరంగములతో కూడిన విశాలసముద్రమంతా జలమయమే

అయి ఉన్నదికాని, మరింకేమీ కాదుకదా! భావాభావయుక్తములై, మిథ్యారూపములే అయివున్న ఈ పదార్థములన్నీ 'సంకల్పము' నకు వేరైనవి ఏమాత్రం కాదు. ఆత్మ సర్వదా మాయారహితము, నిత్యము, వ్యాపకము, శుద్ధము, "నీ – నా – ఈ సర్వుల" స్వస్వరూపము అయి ఉన్నది. అట్టి ఆత్మయందు ఈ ద్వైతమును ఆరోపించుట తగదు.

శ్రీరాముడు : మేము ఆత్మస్వరూపులమే అయినప్పటికీ కూడా, మరి ఏవేవో క్రియావ్యవహారములందు ప్రవేశించవలసివస్తోంది కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : అయితే ముక్కుకు సూటిగా నిన్ను ఒక ప్రశ్న అడుగుచున్నాను. ఈ ప్రాపంచిక సంఘటనలన్నింటికీ నీవు కర్తవా? కాదు కదా!

నీవు కర్తవు కానప్పుడు ఈ క్రియలందు నీకు మమత్వం ఎందుకో చెప్పు?

అద్వితీయుడగు పరమాత్మ ఒక్కడే సర్వే – సర్వత్రా సర్వదా స్థితి కలిగియుండగా, ఇక ఎవనిచే ఏ క్రియ ఎట్లు ఒనర్చబడగలదో చెప్పు?

ఓ ప్రాజ్ఞుడా! ప్రియరాఘవా! అట్లని, నీవు అకర్తవుకూడా కావద్దు. స్వప్రయత్నముచే సాధ్యంకాగల ఫలమేదీ ప్రయత్నరహితునకు లభించదు కదా!

శ్రీరాముడు : స్వామీ! "కర్తవు కావద్దు – అకర్తవు కావద్దు" అని ఒకేసారి పరస్పర వ్యతిరేకములైన రీతిగా ఆజ్ఞాపిస్తున్నారు.....? అద్దాని సమన్వయం ఎట్లా ?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఇప్పుడు నీకు కర్మరహస్యం ఒకటి చెప్పుచున్నాను. విను.

కర్మలు, ఆసక్తి –

ఏదైనా కార్యమును అభిమానరహితుడవై నిర్వర్తించావనుకో. అప్పుడు నీయందు ఆసక్తి ఉండదు కాబట్టి అకర్తవే అవుతావు సుమా!

అదేవిధంగా "నేను దీనికి అకర్తను" అను అభిమానం కించిత్‌కూడా లేకయే ఉన్నప్పుడు "సర్వకర్త" గానే ఉండి ఉంటావు.

నీవు వాస్తవానికి ఆత్మయే స్వరూపముగా గలవాడవు. కనుక నిష్క్రియుడవు. అట్టి నీకు ఈ దేహముచే చేయబడు క్రియలకు సంబంధించిన 'బంధనం' ఎట్లా అంటుతుంది? ఈ క్రియావ్యవహారములేవీ నీ స్వస్వరూపమును స్పృశించలేవు.

"నిష్క్రియుడను, ఆత్మదర్శిని అయిన నాకు ఈ కర్తృత్వము వాస్తవంగా ఉన్నదా?" అనే విషయం ముందు యోచించు. అసలు 'కర్తృత్వము' అనేది సత్యమైతే, "నేను దీనికి కర్తను" అనునది గ్రహించటం ఉచితం. అసత్యం అయితే? త్యజించవలసిందేకదా! 'క్రియాప్రసక్తి' అంతా కర్మఫలములను దృష్టిలో పెట్టుకునే ఏర్పడుతోంది కదా! క్రియాఫలములు (The ultimate results of all acts) సత్యమై ఉంటే, అప్పుడు నీవు కర్మలందు ఆసక్తి కలిగి ఉండటం ఉచితమౌతుంది. పరిశీలనాత్మక దృష్టితో చూచినప్పుడు ఈ క్రియాఫలములన్నీ కూడా స్వప్నతుల్యము, అవాస్తవము

అయి ఉన్నాయి. అట్టి మిథ్యావ్యవహారమే అయివున్న ఈ కర్మలందు ఆసక్తి కలిగి ఉండటం ఎట్లు ఉచితమో చెప్పు? ఒక ఇంద్రజాలంలోని వస్తుసమూహంలాగా ఏ దృశ్యవ్యవహారమందైతే పదార్థములన్నీ మాయామయమై, స్వప్నతుల్యమై, భావనానుసారమై అలరారుచున్నాయో అట్టిచోట ఆసక్తి కలిగియుండుట ఉచితం ఎట్లా అవుతుంది చెప్పు? ఎదురుగా కనిపిస్తున్న ఈ సంఘటనలు, అనేక క్రియావ్యహారములను ఆశ్రయించుటచే పొందబడబోవు ఈ పదార్థజాలం... ఈ రెండుకూడా ఆత్మదృష్టితో చూచినపుడు సత్యము కాదు. ఇక వీటిలో గ్రహించవలసినవేవి? త్యజించవలసినవేవి?

ఓ రఘుకులతిలకమా! రామచంద్రా! "ఈ సంసారమునకు బీజము వంటిది" అని మనం చెప్పుకొంటున్న 'అవిద్య' సర్వదా లేనిదే అయిఉన్నది సుమా! అయినప్పటికీ చమత్కారంగా ఉన్నట్లే తోచుచు, విశాలరూపముగా పొందబడుతోంది.

కృత్రిమ వేషధారణి యగు ఈ అవిద్య అసారమగు ఈ సంసారయంత్రమును ప్రారంభించు చక్రము వంటిది. ఇదియే ఈ జీవుని చిత్తమునందలి వాసన అని గ్రహించు. వెదురు తీగ (వెదురు పుల్లలు విస్తళ్ళను కుట్టుటకు వాడతారు) అందంగా ఉండవచ్చు. కాని అందులో తినుటకు రుచికర మైనదేదీ లభించదుకదా! ఈ అవిద్యకూడా పైకి జీవుని ఆకర్షిస్తోంది. కాని, అంతరమున మాత్రం శూన్యంగాను, నిస్సారంగాను ఉండి ఉంటోంది. నదీతరంగమును ఒక కత్తితో విభజించుటకు ప్రయత్నించి సఫలులం కాగలమా? అట్లాగే ఈ అవిద్య కూడా అనేక ప్రయత్నముల తరువాత కూడా నశించుట లేదు. చేతితో తాకుటకై ఏమన్నా అందుతుందా? లేదు. విషయాసక్తులైన వారిని దుఃఖింపజేయటంలో దీనిని మించింది వేరొకటి లేనేలేదు.

ఈ అవిద్య అనేక కారణసమూహములు కలిగియున్నట్లు, అట్టి అవిద్య కార్యసమర్థములు అయినట్లు గోచరిస్తోంది. కాని, కొంచం "పరిశీలనాత్మక చతురత" తో చూస్తే, ... 'సత్యము – నిత్యము' ... దృష్ట్యా దీనికి ఏ ఉపయోగం లేనేలేదని తెలియవస్తోంది. 'మృగతృష్ణ' లో కూడా తరంగాలు వాస్తవమైనవాటివలె అనిపిస్తాయి. కాని అక్కడ జలం ఎక్కడ? ఈ కార్య – కారణములు కూడా ఆకారమాత్రంగా మాత్రమే కనబడుచున్నవి. ఈ అవిద్య ఒకచోట వక్రంగా – మరొకచోట స్వచ్ఛంగాను; ఒకచోట లఘువుగాను – మరొకచోట దీర్ఘంగాను; ఒకచోట సుస్థిరంగా – మరొకచోట చంచలంగాను భాసిస్తోంది. దీని ప్రభావంచేతనే ఉత్పన్నమైయున్న ఈ సకలపదార్థములు పరస్పర భేదభావాలు పొంది ఉన్నాయి. అవిద్యా ప్రభావంచేత కనబడుచున్న ఈ దృశ్యవ్యవహారమంతా లోన శూన్యమే అయినప్పటికీ, బయటకు మాత్రం సారవంతంగాను, సుందరంగాను కనిపిస్తోంది. ఎచ్చటా లేనిదే అయినప్పటికీ అంతటా విస్తరించి ఉన్నట్లే కనబడుతోంది. 'జడమే' అయినప్పటికీ చైతన్యమువలె కనిపించుచూ, మనస్సుయొక్క చపలత్వమును ఉజ్జీవింపజేయుచున్నది. ఇందులో ఏదైనా ఒక నిమిషమైనను ఒకచోట స్థిరత్వం కలిగి ఉంటోందా? లేదు. అయినను ఇదంతా స్థిరంగా ఉన్నట్లే అనిపిస్తోంది. సత్వగుణంచేత శుద్ధంగాను, తమోగుణంచే మినపగింజలాగా మలిన వర్ణంగాను కనబడుతోంది.

అయితే 'అవిద్య' అనే పేరుతో వ్యవహరించబడుచున్న ఈ దృశ్యవ్యవహారము (లేక) ఈ కనబడే ప్రపంచము స్వయంప్రకాశకము కానేకాదు. పరమాత్మయొక్క ప్రభావంచేతనే ఇది విజృంభించుచున్నది. మరల అతని సాక్షాత్కారంచేత నశించుచున్నది. ఎవని "ప్రభావముచే – కల్పనచే – దృష్టిచే" ఇది విజృంభిస్తోందో అట్టి వాని జ్ఞానదృష్టిచే క్షణంలో మటుమాయమౌతోంది.

ఇప్పుడు చెప్పు. ఒకానొక 'భావన' లేక 'దృష్టి' చే ఉండి, మరొక భావన–దృష్టులచే లేకుండా పోయేది ఉన్నట్లా? లేనట్లా? అజ్ఞానాంధకారంచే శోభిస్తున్న ఈ దృశ్యానుభవమంతా ఆత్మప్రకాశంచే రహితమగుచున్నది.

ఆహాఁ! ఈ దృశ్య–అవిద్య 'మృగతృష్ణ' వలె శుష్కప్రాయమైనప్పటికీ, పలువిధములైన వర్ణనములతో విలాసవంతముగా ఒప్పుచున్నదే?

వక్రమై, విషపూర్ణమై, అతి సూక్ష్మమై అనేక ఆపదలకు ఆలవాలము – హేతుభూతము అయినట్టి ఈ 'అవిద్య' యొక్క వాస్తవమైన రూపమేమిటో గ్రహించటానికి మేము ఎంతగానో ప్రయత్నించాం. చివరకు, "ఈ అవిద్యకు 'తృష్ణ' లేక 'రాగము' తప్ప వేరే రూపం లేదు" అని గ్రహించాం. ఆ రాగము నశించిందా ...ఇకప్పుడు నూనె లేని దీపంలాగా ఇది శీఘ్రంగా నశించగలదు. రాగము ఉన్నంతవరకు ఈ అవిద్య ఉంటూనే ఉంటుంది.

ఆహాఁ! ఈ అవిద్య క్షణకాలంలో స్ఫురించుచు, చంచలమై, మరల మరల జీవుని జడత్వమును ఆశ్రయింపచేస్తోంది కదా! అజ్ఞులగువారిని ఇది ఎంతగా దుఃఖింపచేస్తోంది! యత్నపూర్వకంగా ఈ జీవులను మెఱుపుతీగవలె పట్టిదహిస్తోందే? మరలమరల ఈ అవిద్యయొక్క ఉపశాఖలు ఉత్పన్నమవుతున్నాయి. మరల మరల లయించుచున్నాయి. మేఘముల సమూహంమధ్య ఏర్పడి క్షణకాలంలో మాయమయ్యే విద్యుల్లతలాగా ఈ అవిద్యయందు ప్రేమ, ద్వేషము మొదలైనవి క్షణంలో కనబడి, మరుక్షణం ఎటుపోతున్నాయోకూడా తెలియవచ్చుటలేదు. ఇదంతా కోరుకోనప్పటికీ ఎదురుగా ప్రాప్తిస్తోంది. పైకి రమణీయంగా ఉన్నప్పటికీ, నిజానికి అర్థరహితం–అనర్థకారిణియే కదా! ఈ 'అవిద్య' లేక 'సంసారం' అంతా ఏర్పడేది శ్రేయము కొరకు మాత్రం కాదు. ఇది ఒక అకాల పుష్పమాల వలె ప్రాప్తిస్తోంది. ఈ జీవుడు దీనిని బాగుగా విస్మరించటానికి ప్రయత్నించినప్పటికీ, ఇది అతిశయమైనట్టి "సుఖభ్రమ" కలుగజేయటానికి ఎప్పటికప్పుడు సంసిద్ధపడుతోంది. అనగా ఇందులో ప్రవేశించిన జీవుడు "ఏదో పొందాలి. అట్లు పొంది సుఖించెదనుగాక" అను భ్రమకు ఎప్పటికప్పుడు లోను అగుచున్నాడు.

దుఃస్వప్నకల్పన సుఖమైన విషయమా? కాదు కదా! "ఈ అవిద్య అనర్థకారిణియే" అని జ్ఞానులైనవారు మనందరినీ అనేకసార్లు హెచ్చరిస్తున్నారు. "నాయనలారా! ఈ 'అవిద్య' అనే అనర్థమునకు ఇక్కడ చికిత్స పొందండి" అని అనేకమంది సద్గురువులు చెవులో దూరి మరీ చెప్పుచున్నారు. కాని, ఏం లాభం? అనేకమంది జనులు అశ్రద్ధగానే జీవితాలు గడిపివేస్తున్నారు. ఆహాఁ! ఎంత చిత్రం! ఆ అవిద్య తన కల్పనచే కొన్ని క్షణాలలో విశాలమగు త్రిలోకములను

సృష్టించి, ధరించి, మరల నశింపజేయుచున్నది! లవణమహారాజు ఒక గంటన్నర కాలంలో ఎన్నో సంవత్సరముల అనుభవం పొందాడుకదా! అదంతా అవిద్యయొక్క ప్రభావమే. హరిశ్చంద్రుడు ఒక్క రాత్రిలో పండ్రెండు సంవత్సరముల అనుభవం పొందటం అట్టిదే.

అవిద్య చేతనే 'వియోగము' అనుభవించేవారికి కొద్ది సమయం కూడా దుర్భరమైన దీర్ఘకాలంగా ప్రాప్తిస్తోంది. అట్లే, ఏదైనా చమత్కారమైన విషయము నందు ధ్యాస ఏర్పడునప్పుడు దీర్ఘకాలం కూడా క్షణాలలో గడచిపోతుంది. దీని ప్రభావంచేతనే భ్రమకు లోనైనవారి దృష్టియందు కాలము అనేక విభిన్నరూపములుగా స్ఫురించుచున్నది. సుఖవంతులకు అల్పముగాను, దుఃఖితులకు దీర్ఘంగాను ఒకే పరిమిత కాలం స్ఫురించటమే అవిద్యకు ఒక "దృష్టాంతము".

శ్రీరాముడు : స్వామీ! ఈ అవిద్యకు ఇంతటి సామర్థ్యం ప్రసాదిస్తున్నవారు ఎవరు? ఇది ఇంత గమ్మత్తుగా ఎందుకు ప్రవర్తిస్తోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఒక గదిలో దీపం వెలుగుచుండగా ఆయా వస్తువులు కనిపిస్తున్నాయి. ఆ వస్తువులు అట్లు ప్రకాశించటానికి కారణం గదిలోని ఆ దీపమేకదా! కాని, ఆ దీపం తానుగా "నేను ఈ ఈ వస్తువులను చూపుతాను. వీటిని చూపను, ఇది బాగు – ఇది బాగుకాదు" అను కర్తృత్వ భావనతో సంకల్పించి అట్లు వెలిగిస్తోందా? లేదు. గదిలోని ఆ వస్తువులను చూచునది మనం. అంతేగాని, దీపం చూస్తుందా? లేదు. అట్లాగే ఆత్మ యొక్క సమక్షంలో మనస్సే అంతా చూస్తోంది. ఆత్మ యొక్క ఉనికి– ఔన్నత్యములను ఏమరచిన ఈ మనస్సు దృశ్యమునకు అధీనమై చరించుటే అవిద్య! అయితే, చైతన్యము యొక్క సమక్షంలో ఈ అవిద్యకు పరిమితమైన కర్తృత్వము మాత్రమే ఉన్నది. అన్నిటినీ గ్రహించేది, అనుభవించేది చైతన్యమేకాని, అవిద్య కాదు. అవిద్యకు స్వతంత్రమైన అస్థిత్వమే లేదు. అది ద్రష్ట యొక్క అవికాసదృష్టిని ఆశ్రయించుకొని మాత్రమే ఉంటోంది. అస్థిత్వమే లేనిది ఎట్లు అనుభవిస్తుంది? ఎట్లు ఏదైనా నిర్వర్తిస్తుంది? ఒక రంగులచిత్రంలో స్త్రీ మూర్తిని అందరు "ఇది స్త్రీయే" అని గుర్తించవచ్చు. అంతమాత్రంచేత ఆ స్త్రీమూర్తి ఒక స్త్రీ యొక్క మాతృవాత్సల్యాది ధర్మములన్నీ కలిగి ఉంటుందా? లేదు.

అవిద్యకు ఇతఃపూర్వం, ఇప్పుడు అనుభూతమైన విషయాలు, పదార్థాలు ... ఇవన్నీకూడా, "స్వవాసనలే అట్లు ప్రాప్తిస్తున్నాయి," అని గ్రహించాలి. ద్రష్ట దృశ్యవాసనలను కొనసాగిస్తున్నంతసేపూ అవిద్య ఉంటుంది.

అట్టి స్వవాసనలే ముందుముందు ఆయా ప్రవర్తనలుగా పరిణమిస్తున్నాయి.

అంతేగాని "అవిద్యయే అట్లు ప్రవర్తిస్తోంది" అనటం సమంజసంకాదు.

శ్రీరాముడు : తండ్రీ! ఈ అవిద్యను జ్ఞానులు ఎట్లా దర్శిస్తున్నారు? వారి దృష్టిలో ఇదంతా ఎటు పోతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! ఈ అవిద్య అంతా ఒక 'మనోరాజ్యం' లాగా కల్పితమైన ఆకృతి కలిగి ప్రకాశిస్తోంది. నిత్యసత్యమై యున్నదానిని కప్పిఉంచే భ్రమయే అవిద్య. ఇదంతా అనేక

శాఖలుగా విస్తరించి కనబడవచ్చుగాక! అయినప్పటికీ, పరమార్థమున (At its highest meaning) ఇదంతా 'లేనిది' మాత్రమే సుమా! ఇది అనేక మిథ్యారూపమైన ఆడంబరములు గలిగి, అజ్ఞులను మాత్రమే మోహపెట్టుచున్నది. విజ్ఞులు సర్వము గ్రహించి ఉంటున్నారు కనుక, వారు ఏమాత్రం మోహితులు కావటంలేదు. ఒక నదిలో నీరు ప్రవహిస్తూ ఉంటుంది కదా. ఆ నీరు అనుక్షణం ప్రవహించుచూ, అస్థిరమైనప్పటికీ, నదీ ప్రవాహరూపంగా 'నిత్యము' గానే కనబడుతూ ఉంటుంది. ఈ అవిద్య (లేక) సంసారం కూడా చంచలమైన ఆకృతి కలిగి ఉంటోంది. అవిద్య గ్రహించబడిందా, ఇదంతా ఏదీ కాకుండానే పోతోంది. ఇది తనశక్తిచే లోకములన్నీ ఆక్రమించి, సర్వత్రా పరిభ్రమించు చున్నమాట నిజమే. అయితే, ఈ అవిద్య తన గర్భమునందు పరమాత్మను ధరించుటచేతనే అట్లు ఆక్రమించి సంచరించుచున్నదని గ్రహించు.

ఆకాశంలో విశాలమైన మేఘములు రకరకాల ఆకారాలు ధరిస్తుంటాయి చూసావా? అక్కడ తోట, వృక్షములు మొదలైనవి ఉన్నట్లు మేఘముల ఆకారమును చూస్తూ మైమరచే ద్రష్టకు అనిపిస్తూ ఉంటుంది. ఈ సంసారము కూడా అట్టిదే. ఇది వాస్తవానికి అసారం. అందుకే జ్ఞానులగు కవులు దీనిని తరంగములతోను, కమలనాళములలోని తంతువులతోను పోలుస్తూ ఉంటారు. "మేము ఇక్కడ అభివృద్ధి చెందుచున్నాము" అని ఈ జనులు చెప్పుకునేదంతా భ్రమాత్మకమే. అవిచారముచేతనే ఈ అవిద్యాపూర్వక దృశ్యపదార్థములు ఆరంభంలో మధురంగా, చివరికి అతిభయంకరంగా పరిణమించుచున్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! అవిద్యచేతనే విజృంభిస్తున్న ఈ సంసారవ్యవహారం అవిద్య తొలగి పోయినప్పుడు ఏమగుచున్నది? ఎటు పోవుచున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : దీపం ఆరిపోయినప్పుడు, ఆ దీపమునందలి జ్వాలయొక్క ఆకారం ఏమవుతోంది? ఎక్కడికి పోతోంది? అవిద్య నశించినప్పుడు ఈ దృశ్యవ్యవహార ప్రహసనమంతా 'రహితం' అవుతోంది. ధూళిని చేతిలోకి తీసుకొన్నామనుకో.... ఒక ముద్దవలె ఉంటుంది. అదే ధూళి వెదజల్లబడినప్పుడో? 'ముద్ద' కనబడదు. నిజానికి, అదంతా కణములమయమేకదా! అవిద్యను పరిశీలించి చూచామా, అదంతా శూన్యమనియే తెలియవస్తోంది. ఆకాశం శూన్యమయమే కదా! మరి నీలపురంగుతో కనబడటానికి కారణమేమిటి? ద్రష్టయొక్క భ్రమయే కదా! అదేవిధంగా అవిద్య అకారణంగానే వ్యక్తమగుచున్నది. నౌకయందున్నవానికి ఒడ్డునవున్న చెట్లు కదలుచున్నట్లు తోచుచు ఉంటాయి. స్వప్నంలో అనేక పదార్థజాలమంతా కనిపిస్తోంది. అదంతా అవాస్తవము, స్వయంకల్పితము, మిథ్యా రూపము కదా! కాని ఆ స్వప్నసమయంలో మాత్రం అజ్ఞానదృష్టికి అదంతా వాస్తవమువలెనే ప్రాప్తిస్తోంది. మెలుకువ రాగానే స్వప్నము, ఆ స్వప్నములోని పదార్థములు ఎటు పోతున్నాయి?

అవన్నీ వాస్తవంగా ఉంటే కదా ఎటైనా పోవటం! అట్లే భ్రాంతి పూర్వకమైన ఈ అవిద్య మిథ్యారూపంగానే అజ్ఞానియొక్క దృష్టికి ప్రాప్తిస్తోంది. అవిద్యచే చిత్తము కలుషితమైన మరుక్షణంనుండి ఈ జీవుడు తనకు తానే చిరకాలంగా ఉండగల "దీర్ఘ – సంసారస్వప్నము" ను కల్పించుకొనుచున్నాడు.

ఆత్మ ఈ అవిద్యచేతనే ఆవరణయుక్తం అగుచున్నది. అట్టి తరుణంలో ఈ చిత్తంలో అనేక రకములైన భ్రమలు ఉదయించి నశించుచున్నాయి. సముద్రంలో తరంగాలు లేవటం, నశించటం జరుగుచున్నది కదా! కానీ, జలమో? సర్వదా యథాతథం. అట్లాగే భ్రమలయొక్క ప్రభావంచేత సత్యము, సర్వోత్తమము అగు బ్రహ్మము అసద్రూపంగా (లేనిదానిగా) భావించబడుతోంది. అమనోజ్ఞము, అత్యంత మిథ్యారూపము అయిఉన్న ఈ జగత్తు రమణీయంగా, సత్యంగా అనుభవం అవుతోంది. ఇంతకన్నా చమత్కారం ఏం ఉంటుంది?

'వల' క్రింద ఉంచబడిన ధాన్యపు గింజలు ఎక్కడో ఆకాశంలో ఎగురుచున్న పక్షియొక్క దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి చూచావా? 'ఇంద్రియ విషయములు' అను వాసనారూపమైన అవిద్య చిత్తమును విమోహితం చేసివేస్తోంది. క్షణంలో ఈ జీవులను బంధములో పడద్రోస్తోంది. కొంతసేపు ఆనంద – ఉల్లాసములను కల్పించటం, ఇంతలోనే సర్వమును విషపూరితం చేసివేయటంలో ఈ అవిద్యకు ఉన్న సామర్థ్యం మరింక దేనికీ ఉండదు. ఈ అవిద్యకు వాక్ మొదలైన ఇంద్రియములు లేకపోయినప్పటికీ, ఆయా కార్యక్రమములను రచిస్తూ,... ఇది జీవులను గ్రుడ్డివారిగా చేసివేయ గలుగుతోంది. ఒక బండరాయిని ఉన్మత్తనృత్యం చేస్తున్నట్లుగా చూచేట్లు చేస్తోంది. దీని ప్రభావం చేతనే "మట్టి, శిలలు" కూడా మహత్తరమైన విషయాలుగా చూడబడుతున్నాయి. "ఇదంతా మాదే. మాకే ఉండాలి" అను అర్థరహితమైన భావనలన్నీ హృదయంలో ప్రవేశించి ఈ జీవులను ఘోరంగా హింసించ గలుగుచున్నాయి.

సంహారకుడగు కాలునికి అతిదీర్ఘమైన ప్రళయరాత్రి కూడా అల్పంగా తోస్తుంది. అట్లాగే 'అవిద్య' కారణంగా దీర్ఘమైన కాలం కూడా 'క్షణికము' వలె అగుచున్నది, కొద్దిక్షణాల కాలం అతిదీర్ఘంగా అనుభవమౌతోంది. ఆహా! దీని సామర్థ్యం గురించి ఏం చెప్పాలి? తనయందు 'సత్యము' అనునదే లేకపోయినప్పటికీ, ఈ అవిద్య విజృంభిస్తోంది. వర్ణనాతీతమైన వ్యవహారమంతా నడిపిస్తోంది. కనుక వివేకవంతుడు – బుద్ధిమంతుడు అయినవాడు స్వప్రయత్నముచే తన చిత్తమును విషయములనుండి ప్రయత్నపూర్వకంగా మరల్చాలి. ఎట్లాగైనాసరే, ఆత్మయందే ప్రతిక్షేపించాలి.

❖

శ్రీరాముడు : ఆహాఁ! మునీంద్రా! మిథ్యారూపం, అల్పం, తుచ్ఛం, అవస్తువు అయినట్టి ఈ అవిద్య జగత్తును ఎంతగా అంధకారంలో ముంచివేస్తోంది! ఎంత ఆశ్చర్యం!

ఈ అవిద్యకు రూపంగాని, ఆకృతిగాని, స్థానంగాని లేదు. పోనీ ఇది స్వయంప్రతిభా సమన్వితమైన చైతన్యమా? కానే కాదు. ఇది అసత్తే అయినప్పటికీ 'అంతు' అనేది లేకుండా జనులందరిని మోహపరుస్తోంది.

ప్రకాశరూపమైనట్టి జ్ఞానంచేత నశిస్తోంది.

అంధకార రూపమైన అజ్ఞానంచేత స్ఫురిస్తోంది.

అరెరె! గుడ్లగూబయొక్క రెండు కన్నుల వలె ఇది ఎంత చాంచల్యంగా ప్రవర్తిస్తోంది! క్రియాశక్తిని

ఆశ్రయించి అనేక దుష్కర్మలకు కారణమగుచున్నదే! ఈ అవిద్య ప్రకాశమును (జ్ఞాన–వాక్యములను, జ్ఞాన–సమాచారమును) ఏమాత్రం సహించలేకపోతోంది.... దగ్గరకు రానిచ్చుటలేదు. అది జ్ఞానశూన్యం కదా! అందుచేత, "నేను ఇట్టిదానిని అను స్వ–శరీరజ్ఞానం లేదు. తనను ఆశ్రయిస్తున్న జీవుని కూడా స్వస్వరూప జ్ఞానరహితం చేసివేస్తోంది. "దుష్టాచారములు, నీచ స్వభావములుగల మనుజులు ఎక్కడెక్కడున్నారు?" అని వెతికివెతికి, అట్టి అజ్ఞుల ముంగిటవాలి, తీరికగా వారితో కాపురం చేస్తోంది. అనేక విధములైన దుఃఖములతో కూడుకొని, మృతప్రాయమై, జ్ఞానరహితమై ఇది ఈ జీవునియొక్క అనేక జన్మపరంపరలకు కారణభూతమగుచున్నది. కామము – క్రోధము... ఈ రెండూ అవిద్యయొక్క రెండు కళ్ళు. అజ్ఞానం ఎట్లెట్లు విస్తరించాలో నూతన విధానాలు ఎప్పటికప్పుడు కనిపెట్టుచు, భయంకరంగా ఒప్పుచున్నది.

జ్ఞానోదయంచే ఈ అవిద్య శీఘ్రంగా నశించగలదు. నిజమే. సందేహం లేదు.

కాని, అజ్ఞానకాలంలో జ్ఞానాకాశమును అంధకారమయం చేస్తోంది కదా! ఏమి విచిత్రం!

"ఓ అవివేకమా! ఇంతకీ నీ నివాసం ఎక్కడ?" అని మేము విజ్ఞానదృష్టితో పరిశీలించినప్పుడు, "ఇదిగో! ఇక్కడ! మీ అజ్ఞానుల హృదయములే నా నివాసస్థానం" అను సమాధానం వినవస్తోంది.

'జడత్వం' దృష్ట్యా ఎప్పటికప్పుడు శిథిలత్వమునే ఆశ్రయిస్తోంది.

తాను కలిగించగల దుఃఖములచే అది అతిదీర్ఘంగా అనుభవమౌతోంది. దాని ప్రతాపములు వింటుంటే భయంకరమైన రాక్షసియొక్క భీకర నినాదాలు గుర్తుకు వస్తున్నాయి.

చివరికి 'చైతన్యము' అను పురుషునియొక్క "ఏకత్వధ్యానం" అనే ప్రక్రియచే అవిద్య సమసిపోతోంది.

పురుషసంగి – ఈ అవిద్యను కవులు చమత్కారంగా "పురుషసంగి" అని కూడా చెప్పుచూ ఉంటారు. ఎందుకంటారా? ఇది అనేక కల్పనలు చేస్తూ భోగములను అనుభవించాలనే ఇచ్ఛతో పురుషునియందు అనురక్తమై ఉంటోంది. కాబట్టి, ఏ జీవుడైతే 'ఆత్మతత్త్వవిచారణ' అనే సుక్షేత్రం వదలి దూరంగా వస్తాడో అట్టి వానిని ఈ పురుషసంగి పిశాచివలె విమోహితుని చేసి 'అనర్థములు' అనే పేరుగల తన అంతఃపురమునకు గొనిపోతోంది. ఇది తన ఆవరణప్రభావంచేత ఈ జీవుడు నిలబడి ఉన్నచోటును అంధకారమయం చేసివేస్తోందే? ఇదేమన్నా స్వయంప్రతిభావంతమా? కాదు. అయినాసరే, ఇది మరింక ఏ బాహ్యవస్తువుచేతను నాశనం చేయబడజాలదు. ఏమి దీని ప్రతాపం!

శ్రీరాముడు: ఓ మహర్షీ! ఈ అవిద్య కలుగజేసే దుష్టభ్రమలకు అంతు–పొంతు లేకుండా పోతోంది. జనన – మరణములు, ఉత్పత్తి – నాశనములు కలుగుచున్నది కూడా దీని వలననే కదా! తండ్రీ! "విషయములు" అనే మనోగృహంలో 'వాసనలు' అనే రూపంలో ఉన్న ఈ అవిద్య నశించేదెట్లా? ఈ విషయం తలచుకుంటేనే నాకు వేదనగా ఉన్నది.

❖❖❖

12. మనస్సు - పరమేశ్వరుడు

శ్రీరాముడు : కాబట్టి, మునీంద్రా! మాయందు ఎక్కడినుంచో విచిత్రమైన అంధత్వం వచ్చిపడుతోంది. ఘనీభూతమై, ఆవరణరూపమున ప్రవర్తిస్తోంది. అట్టి ఈ అంధత్వం నశించేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అంధకారంలో ఉన్నప్పుడు భయ–ఉద్వేగ–నిస్తేజాదులు వచ్చి మీదపడుచున్నాయి. సూర్యుడు ఉదయించిన మరుక్షణం దిక్కులలోని అంధకారమంతా పటాపంచలైపోతుంది కదా! సర్వవ్యాపి, బోధస్వరూపము (of the nature of awaremess) అగు ఆత్మానుభవమే అవిద్యకు మందు. ఆత్మావలోకనం చేసినంతమాత్రంచేత సర్వసంసార వికారాలు తొలగిపోతాయి. ఆత్మదర్శనము గురించి తీవ్రేచ్ఛ ఉత్పన్నం కానంతకాలం మోహరూపమగు అవిద్య ఉండనే ఉంటుంది. అది అత్యంత దుఃఖకంటకయుక్తమై, ఈ జీవుని ఆందోళనపరుస్తూనే ఉంటుంది.

పరమాత్మను దర్శించిన మరుక్షణం ఈ అవిద్య నశిస్తుంది.

శ్రీరాముడు : స్వామీ! అసలు అవిద్యయొక్క మూలకారణం....?

శ్రీ వసిష్ఠ మహర్షి : "ఇచ్ఛ" యే అవిద్య. అంతకుమించి అది వేరే ఏదీ కాదు. మిగతాదంతా ఆ 'ఇచ్ఛ' యొక్క వికారస్వభావమే. అందుచేతనే ఆత్మద్రష్టలగు జ్ఞానులు "నాయనలారా! ఇచ్ఛానాశనమే మోక్షము" అని మనకు బోధిస్తున్నారు. అట్టి మోక్షము 'దృశ్య అసంకల్పత్వం' చేత సిద్ధిస్తోంది. "నేను చైతన్యమే స్వరూపముగా కలవాడను" అను భావన ఉదయించగానే, వెలుతురుచే చీకటి యొక్క గతివలె, కామవాసనారూపమైన అవిద్యావరణ (The cloudy cover of ignorance) స్వయంగా క్షయిస్తోంది. వివేకము ఉదయించనంతకాలం సంకల్పపరంపరల రూపంలో ఈ అవిద్య ఉండి తీరుతోంది. ఘనవాసనలచే దృఢమైన బంధనమునకు దారితీస్తోంది.

శ్రీరాముడు : మహర్షీ! ఈ దృశ్యప్రపంచమంతా అవిద్యాత్మకమని, ఆత్మభావనచే నశించిపోగలదని చెప్పియున్నారుకదా! ఆత్మస్వరూపము ఎట్టిదో ఇంకా కొన్ని విశేషాలు తెలియజేయండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! 'చిత్తము' లేక మనస్సు' అనబడునదే పరమేశ్వరుడు. మనస్సు ఈ అవిద్యతో కూడుకొనియున్నప్పుడు చిత్తమని, పరిపూర్ణమగు ఆత్మజ్ఞాన – అనుభవములతో కూడుకొని ఉంటే సర్వాతీతస్వరూపమగు 'భగవంతుడు' (భ=జ్ఞానము) అని చెప్పబడుతోంది. వాస్తవానికి ఈ మనస్సు – అనేది విషయవర్జితం, ఆవరణ – విక్షేపములు లేనట్టిది, సర్వవ్యాపకము, సర్వమునకు కారణము అయిఉన్నది.

ఈ మనస్సు (లేక, చిత్తము) తనయొక్క దృశ్యతాదాత్మ్యము త్యజించినప్పుడు ... ఇక, ఆపై, ఏది స్వయంసిద్ధంగా శేషిస్తోందో అదియే "చిత్‌వస్తువు".

ఈ మనస్సుకు ఆత్మలక్షణములన్నీ స్వతహాగా ఉన్నప్పటికీ ఇది చిరకాలంగా ఆర్జించుకొనియున్న పదార్థములపట్ల ఆసక్తి చేతనే పరిమితత్వము – ప్రమేయత్వములతో కూడి వ్యవహరిస్తోంది.

ఓ ప్రియశిష్యా! రామా! బ్రహ్మదేవుడు మొదలుకొని ఒక గడ్డిపఱక వరకు కూడా ఈ జగత్తు అంతా సర్వదా ఆత్మస్వరూపమే అయి ఉన్నది. 'అవిద్య' అనబడేది వాస్తవానికి లేనే లేదు. ఈ దృశ్యప్రపంచమంతా కూడా "నిత్యము – నాశరహితము – చిద్ఘనస్వరూపము" అగు బ్రహ్మమే సుమా! అసలు ఆత్మకు వేరుగా 'మనస్సు' అనబడే కల్పనయే లేదు.

శ్రీరాముడు : అదేమిటి స్వామీ! మా అందరికీ 'మనస్సు' అనబడేది అనుభూతమౌతోంది కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మ యొక్క మననము చేయు స్వభావమే మనస్సు. ప్రీతి పూర్వకముగా ఆయా బాహ్య విషయములను దర్శించుటే చిత్తము. "మననము – ప్రియత్వము" ఈ రెండూ కర్తకంటే వేరైనవి కావు కదా! అందుచే "మనస్సు అనబడునదేదీ నీకు వేరుగా లేదు" అని మేము చెప్పుచున్నాం. మనస్సు – లేకుండునప్పుడు, మనస్సును ఆశ్రయించుకొనియున్న మిగతా వ్యవహారము మాట ఏమిటి? నాటకమే 'కల్పన' అయినప్పుడు నాటకంలోని ఒకానొక పాత్రయొక్క స్వరూప–స్వభావాల గురించి 'కల్పనయే' అని వేరే చెప్పాలా? ఈ దృశ్యమంతా మనస్సును ఆశ్రయించి మాత్రమే ఉన్నది. కాబట్టి తదితర జగత్తు వ్యవహారం విషయము కూడా అట్టిదే. పరమార్థమున ఈ మూడు లోకములందు ఏదీ ఉత్పన్నమగుట లేదు, నశించుట లేదు. ఇక ఈ పదార్థముల వికారములు అంటావా? ఇవన్నీ ద్రష్ట యొక్క దృష్టిని అనుసరించి మాత్రమే ఉన్నాయి. అందుచేత ఇవి స్వతహాగా సత్యములే కావు.

ఈ జగత్తంతా కేవలము చైతన్యమే అయి ఉన్నది. చైతన్యము సర్వదా అద్వితీయమై, స్వయం ప్రకాశమై సర్వవ్యాపకమై, నాశరహితమై, విషయవర్జితమై, సద్రూపమై వెల్లివిరియుచున్నది.

ఈ జీవుడు అనబడేవాడు చైతన్యమే స్వరూపముగా కలిగియున్నాడు.

ఓ రాఘవా! ఆత్మ నిత్యమై, వ్యాపకమై, శుద్ధమై, చిన్మాత్రస్వరూపమై, దుఃఖరహితమై, శాంతమై, విశాలమై, సర్వత్రా ఏకరూపమై వెలయుచున్నది. అట్టి స్వతహాగా నిర్వికారమగు ఆత్మ తనయొక్క "చిత్స్వభావము" నకు విరుద్ధంగా ఆవరణయుక్తమైన జడత్వమును గ్రహిస్తోంది. పరిచ్ఛిన్నములగు విషయములను సంకల్పించుచు, వాటివైపే మరల మరల పరుగులు తీస్తోంది. అట్టి మలినముతో కూడిన 'విక్షేపణశక్తి' నే 'మనస్సు' అని పిలుస్తున్నారు.

సర్వవ్యాపి, సర్వశక్తిమంతము, మహత్తరము అయిన ఈ 'మనస్సు' అనబడే దైవము చేతనే, సముద్రంలోని తరంగాలులాగా, ఈ అనేకపదార్థముల కల్పనాశక్తి ఉత్పన్నం చేయబడుతోంది. వాస్తవదృష్టితో పరిశీలిస్తే "ఏకము – అద్వితీయము – వ్యాపకము – శాంతము" అగు పరమాత్మ యందు ఈ 'అవిద్య' అనబడేది ఉండటమేమిటి? ఎట్లా ఉంటుంది? కాని, సంకల్పమే రూపంగా కలిగి, స్ఫురణ మాత్రంగా అది అల్పదృష్టికి అనుభవమౌతోంది.

'అవిద్య' అనేది సంకల్పముగానే ఉత్పన్నమగుచున్నది.

మరల సంకల్పబలంచేతనే నశించిపోవుచున్నది.

అగ్నిజ్వాల వాయువు యొక్క ఉనికి చేతనే కలుగుచు, మరల వాయువుచేతనే నశించుచున్నది కదా! ఇది కూడా అంతే! ఏది దేనిచేత ఉత్పన్నమగుచున్నదో దానిచేతనే నశించబడుచూ ఉంటుంది. "విషయభోగాభిలాష" రూపమును గ్రహించుచున్న ఈ అవిద్య దృఢమైన నిధిధ్యాసలతో కూడిన పురుషప్రయత్నముచే సిద్ధించగల "అసంకల్పత్వము"చే నశించగలదు.

ఈ మనస్సు "నేను అల్పమగు వస్తువును; అంతేకాని, నేను బ్రహ్మమును కాను" అను దృఢమైన సంకల్పమును ఆశ్రయించి బంధమును తెచ్చిపెట్టుకుంటోంది. మరల ఇంతలోనే "నాతో సహా ఈ సర్వము ఆత్మస్వరూపమగు బ్రహ్మమే అయిఉన్నది" అను దృఢసంకల్పముచే ముక్తిని పొందుచున్నది.

దృశ్య – సంకల్పమే "బంధము".

దృశ్య – అసంకల్పమే "ముక్తి".

ఓ రామచంద్రా! "నేను బ్రహ్మమును కాను" అను సంకల్పమును "సర్వము బ్రహ్మమే" ("సర్వం ఖల్విదం బ్రహ్మ") అను విరుద్ధ సంకల్పమును ఆశ్రయించుటచే పొందబడు జ్ఞానబలంతో జయించివేయాలి. అట్లు జయించుటలో విజయము సాధించి, ఆ తరువాత నీకెట్లు తోస్తే అట్లే ఈ ప్రపంచమున వ్యవహరించు.

స్వతహాగా 'లేనిదే' అగు ఈ అవిద్య చిదాకాశమునందు చిత్రముగా ఉత్పన్నమై, చంచలమైన భ్రమణము కలిగినదై, అన్నివైపులా పుష్పసువాసనవలె వ్యాపించి ఉంటోంది. ఇది తన జన్మస్థానమైనట్టి ఆత్మప్రకాశమునే పరిహాసం చేస్తోంది! అనేక వికల్పజాలములను కల్పించుకొనుచూ, అట్టి జాలములందు తనకుతానే బంధితురాలు అవుతోంది. యథార్థానికి అవిద్య లేకున్నప్పటికీ, కనిపించటం జరుగుతోంది. బంధహేతువు, చపలము అయిన ఈ అవిద్యకు అజ్ఞానులు తమయొక్క దుఃఖము కొరకే కల్పనచేసుకుంటున్నారు కాని, సుఖము కొరకు కానేకాదు. బాలుడు "వినోదము కొరకు" అని తలచి అల్లరిని ఆశ్రయించి, తద్వారా అనేక శారీరక – మానసిక వేదనలను కొనితెచ్చి పెట్టుకొంటాడు చూచావా? ఈ జీవుని విషయము కూడా అట్టిదే. ఇతడు "నేను శరీరమాత్రుడను. అతి దుర్బలుడను, దుఃఖితుడను, బద్ధుడను, ఈ చేతులు – కాళ్ళు నా స్వరూపమునకు సంబంధించినవి, వీటిచే నేను పరిమితుడను....." అని దృఢంగా భావిస్తూ, తదనుగుణంగానే వ్యవహరిస్తున్నాడు. ఫలితం? బంధమునందు తగుల్కొనుచున్నాడు. "నేను దుఃఖితుడను కాను. చైతన్యమే స్వరూపముగా కలిగియున్నట్టి నేను ఒక పాంచభౌతిక పదార్థమును ఎట్లా అవుతాను? చైతన్యము సర్వమును ప్రకాశింపజేస్తుంది. అట్టి దానికి బంధ – మోక్షములేమి ఉంటాయి? నాకు దేహమే లేదు. ఇక బంధము ఎవరికి?" అని ఈ జీవుడు ఎందుకు ఉత్తమ భావనను ఆశ్రయించరాదో చెప్పు? అప్పుడు అతడు ముక్తరూపుడే అవుతాడు కదా! "నేను ఈ మాంసముగాని, బొమికలుగాని కానేకాను. ఈ దేహమునకు విలక్షణమైనవాడను. బుద్ధికి అతీతమైనట్టి చిద్రూపమే నేను" అని నిశ్చయించుకొన్నవాడే అవిద్యారహితుడు అగుచున్నాడు.

ఆకాశము-నీలత్వ ధర్మము : ప్రపంచము - అవిద్యాధర్మము

ఓ రామా! అటు ఆకాశంలోకి చూడు. అక్కడ నీకు నీలత్వం కనబడుతోంది కదా! "అట్లు నీలంగా ఎందుకు కనబడుతోంది? ఇంతకీ అక్కడ ఉన్నదేమిటి?" అను ప్రశ్నలకు వివిధరూపములైన సమాధానాలు చెప్పబడుచున్నాయి.

యోగ భాష్యకారులు : 'మేరువు' అనబడే ఒక మహాపర్వతం ఉన్నది. అందులో ఈ భూమి, ఈ నక్షత్రములు, మర్త్య-పాతాళ-స్వర్గాదిలోకములు ఒక స్వల్పభాగం వలె ఉన్నాయి. ఆ మేరు పర్వత శిఖరం 'నీలమణి' చే ప్రకాశిస్తోంది. ఆ శిఖరపు రంగే మనకు కనబడే ఈ నీలత్వం.

జ్యోతిష్కులు : సూర్యమండలమునకు దూరంగా ఉండుటచే ఏర్పడే అంధకారపు కాంతే అది.

వేదాంతులు : ఆ ఆకాశం అనేక విధములుగా గాంచబడుచున్నది. అనేక కల్పనలు చేయబడు చున్నది. అదే విధంగా అనాత్మభూతములగు ఈ దేహము, తదితర పదార్థములు మొదలైనవి, అవిద్య - అజ్ఞానముల ప్రభావంచేత పరిపరివిధములైన కల్పనా దృష్టులచే గాంచబడుచున్నవి. ఆకాశంకూడా కల్పనాదృష్టికి అట్లు కనిపిస్తోంది.

శ్రీరాముడు : మహాత్మా! ఆకాశంలో మనకు కనిపిస్తున్న ఆ నీలత్వమునకు కారణం " మేరు పర్వతం పై గల నీలమణి శిఖరం యొక్క కాంతి, అంధకార కాంతి" ... ఈ రెండు కావని నాకు అనిపిస్తోంది. ఎందుకంటారా? "మేరుపర్వతం ఎఱ్ఱగా రక్తవర్ణంగా ఉంటుంది" అని పురాణద్రష్టలు (దేవీభాగవతము మొదలైన) పురాణాలలో చెప్పుచున్నారు. ఈ కనబడే ఆకాశం మేరుపర్వతము యొక్క శిఖరాగ్రం అయిఉంటే, ఇది ఎఱ్ఱగా ఉండాలిగా? నీలంగా ఉన్నదేం? ఇక బ్రహ్మాండముయొక్క ఆవలి (ఊర్ధ్వ) భాగం 'సువర్ణచ్ఛాయలో ఉంటున్నట్లు పెద్దలు చెప్పుచున్నారు. కనుక సూర్యునకు దూరంగా ఉన్నంతమాత్రంచేత నీలంగా కనబడుటకు వీలులేదు.

పైగా ఊర్ధ్వలోకమైనట్టి "తపోలోకం", "సత్యలోకం" మొదలైనవి ప్రకాశవంతములైనవి కదా! మరి ఆకాశమునకు నీలత్వం ఎట్లా వచ్చింది?

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! రామా! ఈ నీలత్వము శూన్యరూపమగు - 'ఆకాశము' యొక్క గుణము కాదు.

మేరుపర్వతశిఖర కాంతి కాదు. సూర్యకాంతి అంధకారమువైపు పయనించుచున్నప్పుడు అట్లు నీలంగా కనిపిస్తోంది - అనేది కూడా కారణం కాదు. ఈ రెండు కారణాలు నీవు నిరాకరించటం ఉచితమే. మరి ఆ ఆకాశము ఏమై ఉన్నది? ఆ కనబడేదంతా కేవలం శూన్యం. అవిద్య వలన మిథ్యా రూపముగా అదంతా అట్లు కనిపిస్తోంది. ఆకాశమున నేత్రదృష్టి ప్రసరించనిచోట "అదర్శనము (Failure to see)" ఏర్పడుతోంది. అట్టి అదర్శనము వస్తుస్వభావముచే నీలత్వముగా దృష్టికి గోచరించుచున్నది. కనుక ఆకాశములోని నీలత్వమునకు అసలు కారణం "ద్రష్టయొక్క దృష్టి చమత్కారమే".

ఒకడు ఈ విషయమును ఇట్లు తెలుసుకొన్న తరువాత మరల ఆకాశంలో నీలత్వం కనిపించినప్పటికీ ... "ఈ నీలత్వము ఆకాశము యొక్క గుణము కాదు నాదృష్టి యొక్క వస్తుస్వభావ విశేషమే!" ... అను బుద్ధిని కలిగి ఉంటాడు కదా!

ఈ 'అవిద్య' అనే అంధకారం విషయం కూడా అట్టిదే. ఇదంతా స్వసంకల్ప మాత్రంగానే ఏర్పడుతోంది. జ్ఞానదృష్టి స్థిరపడియున్నప్పుడు, "నాచే అనుభవం పొందబడుచున్న ఇదంతా ప్రపంచ ధర్మముగాని, వస్తుధర్మముగాని, శరీరధర్మముగాని అయిఉండలేదు. నాకు నేనే నాయొక్క 'విక్షేపముతో కూడిన బుద్ధి' చేత ఇదంతా ఇట్లు దర్శించటం జరుగుతోంది" –అని సుస్పష్టంగా ఎరుగగలవు.

❖❖❖

13. అవిద్యను త్యజించేదెట్లా?

ఈ అవిద్య మిథ్యారూపంగానే ఉదయిస్తోంది. దీనిని జయించాలంటే ఉపాయం:

"సంకల్పములను త్యజించుటయే"

"దృశ్యమును అభావించుటయే!"

అని విజ్ఞులు చెప్పుచున్నారు. "అది కష్టసాధ్యంకదా?" అని అంటావేమో? సంకల్పం చేయటంలో కొంత క్రియాపూర్వకమైన శ్రమ ఉన్నదికాని, సంకల్పం చేయకపోవటంలో శ్రమ ఏమి ఉంటుంది, చెప్పు? కాబట్టి అవిద్యను జయించుట సులభసాధ్యమేనని ప్రకటించుచున్నాను. ఓ రాఘవా! 'మిథ్య' యే అయి ఉన్న ఈ జగద్భ్రమను పూర్తిగా విస్మరించివేయి. అనగా మిథ్యగానే దర్శించు అట్లు విస్మరించివేయగా ఏదైతే శేషించుచున్నదో అదే "స్వసత్త ('That which exists absolutely by itselfÑ) రూపమగు ఆత్మచైతన్యము." అట్టి స్వస్వరూపమునందే సుస్థిరుడవై యుండుము. ఇదియే ఉత్తమోత్తమమైన మార్గము.

ఒకడు తన స్వప్నంలో "అమ్మబాబోయ్! ఈ మృగం నాపైకి దూకుతోంది. నన్ను చంపుతోంది. ఇప్పుడు నేను చచ్చాను. నన్ను మోసుకుపోతున్నారు" అని అనుభవం పొందుతూ, దీనాలాపన చేస్తూ ఉంటాడనుకో.... ఆ దుఃఖస్థితికి విమోచనమేమిటి? "నేను మేల్కొన్నాను" అను అనుభవం చేత స్వప్నంలో ఏర్పడిన దుఃఖములను పారద్రోలివేయవచ్చు కదా! మెలుకువ రాగానే ఆ స్వప్నద్రష్ట సుఖమునే పొందుచున్నాడు. ఈ మనస్సు కూడా అనేక దుష్టసంకల్పములచే మరల మరల అల్పత్వమును పొందుతోంది. జ్ఞానరూపమగు ఉత్తమ సంకల్పముచే ఇది "బ్రహ్మైక్యజ్ఞానము"వైపునకు పరుగులు తీస్తున్నది.

ఓ రామా! ఈ అవిద్య ఎప్పుడు ఎట్లు ఉదయిస్తోందో చెపుతాను, విను.

ఈ ఆత్మయందు "నేను అల్పుడను, ఖండుడను" అనునట్టి సంకల్పముచే క్షణకాలంలో 'అనాది' యగు అవిద్య ఉదయించుచున్నది. నశ్వరము – క్షణికము అయిన అసంఖ్యాకమైన సంకల్పములు

రూపంపొంది అంతరంగంలో ఎప్పటికప్పుడు సంచారం చేస్తున్నాయి. వాటి రాక పోకలను సాక్షిత్వబుద్ధిచే గమనించాలి. నీ స్వస్వరూపము నుండి వాటిని వేరు పరచాలి. వాటితో ఏర్పడే "తాదాత్మ్యము"ను నిరోధించాలి. మొదలే, "ఇదంతా కల్పనామాత్రమే కదా! నేను స్వచ్ఛుడను. నిత్యుడను. సర్వసంకల్పములకు ముసు–ముందే వీటికి వేరై ఉండియున్నాను" అను భావనచే, దృష్టిని పవిత్రం, సుదృఢం చేయాలి. అప్పుడు సంకల్పములు తమంతటతామే ఛేదించబడతాయి. సంకల్పముల వైపు ప్రసరించుచున్న దృష్టి ఉపశమిస్తూ ఉంటే, ఇక ఈ జగత్తు యొక్క వాస్తవ – అవాస్తవములు తెలిసిపోతున్నాయి.

పదార్థములన్నిటిని ఉత్పన్నము చేసేది, జీవులందరిని మోహితులను చేసేది, నిరంతర దుర్భరమైన సంకుచితము ప్రసాదించేది అయిన ఈ అవిద్య "ఆత్మదర్శన ప్రభావం"చేత సువిశాలత పొందుచున్నది. సంకుచితమును త్యజిస్తోంది. అనగా 'విద్య' గా రూపుదిద్దుకొంటోంది. అపరిచ్ఛిన్న మైన ఆత్మస్వరూపము ప్రాప్తించినప్పుడు ఇక 'అవిద్య' ఏమగుచున్నదో కూడా చెప్పలేం.

శ్రీరాముడు : తండ్రీ! మరి ఈ ఇంద్రియముల మాటేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : రాజుగారి ఆజ్ఞను మంత్రులు పాటిస్తూ ఉంటారు చూచావా? మనస్సు దైనినైతే చింతిస్తూ ఉంటుందో అద్దానిని ఈ ఇంద్రియవృత్తులు వెంటవెంటనే సిద్ధింపచేస్తూ ఉంటాయి. ఎప్పుడైతే ఈ మనస్సు "అహం బ్రహ్మాస్మి" (నేను బ్రహ్మను) అను భావనయందు నిమగ్నమై ఉంటుందో, అప్పుడా మనస్సు విషయములు చింతించుటలేదు కాబట్టి, ఇంద్రియములు కూడా పరమశాంతినే పొందుతాయి. సర్వత్రా ఆత్మసందర్శనంలో ఉపకరణాలుగా అవి రూపుదిద్దుకుంటాయి.

ఓ రాఘవా! ఏ జగత్తైతే సృష్టికి పూర్వంలేదో, అది ఇప్పుడు కూడా లేనిదే అగుచున్నది. ఇక ఈ జగత్తు రూపమున భాసించుచున్నదంతా ఏమిటి? ఇదంతా శాంతము, పరమోత్తమము అగు బ్రహ్మమే అయిఉన్నదని గ్రహించు. బ్రహ్మమునకు వేరైనదంటూ, చింతింపతగినదేదీ ఎచ్చటా, ఎప్పుడూ ఎవ్వరికీ లభించుటలేదు. ఏమాత్రంలేదు. ఈ సర్వము అనాది – అనంతము – నిర్వికారము అగు బ్రహ్మమునందే స్థితి కలిగియున్నది. అట్టి భావనను ఆశ్రయించినవాడవై నీవు బ్రహ్మమునందే స్థితి కలిగియుండుము. అందుకుగాను, శాస్త్రాదులచే సవివరంగా చెప్పబడిన విచారణను గ్రహించు. ఉత్తమ బుద్ధిచే పురుష ప్రయత్నమును ఆశ్రయించు. "విషయ భోగాశ" రూపమగు భావనను నీ చిత్తము నుండి సమూలముగా తొలగించివేయి.

నాయనా! రామా! ఎందుకో, మహామోహము జీవునియందు ఉదయించుచున్నది. అది అనేక ఆశాపాశములతో కూడుకొని ఉంటున్నది. అది "వార్ధక్యము – మరణము" మొదలైన అనేక వికారములకు, అంతులేని అజ్ఞాన పరంపరలకు హేతువు అగుచున్నది. అట్టి మహామోహమంతా వాసనావిజృంభణము మాత్రమే. "నా పుత్రులు, నా ధనము, నా దేహము, నా గృహము, నా పొలములు, నా రాజ్యములు, నా పేరు ప్రతిష్ఠలు...." మొదలైన భ్రమాత్మకమైన ఇంద్రజాలమంతా వాసనలచేతనే ప్రాప్తిస్తోంది. వాయువుచే జలంలో తరంగాలు కల్పించబడునట్లు శూన్యమయమగు

ఈ దేహమునందు వాసనచేతనే "అహంభావము" అనునది కల్పితమగుచున్నది.

ఈ జీవుని "దృష్టి" .... ఈ దృశ్యము యొక్క "సృష్టి"

ఓ తత్త్వజ్ఞా! పరమార్థమున 'నేను – నాది' అనునదేదీ లేదు. ఎందుకంటావా? ఆత్మతత్త్వమునకు అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ సత్యమై లభించుటయే లేదు కదా!

ఒక చమత్కారమైన విషయం చెప్పుచున్నాను, విను:

ఈ రెండు ఒకే కాలంలో సంభవిస్తున్నాయి. అనగా, దృష్టిచేతనే సృష్టిఏర్పడుతోంది. అధ్యాత్మశాస్త్రాలలో ప్రచారంలో ఉన్న "దృష్టి – సృష్టి" న్యాయం (లేక) వాదము యొక్క అంతరార్థం ఇదే.

అవిద్యయే, వేరు రూపమును పొందినట్లున్నదై, అనేక విచిత్రములైన ఆకారములను ధరించుచు మరల మరల ప్రవర్తించుచున్నది. దేశ – కాల వస్తువులచే పరిచ్ఛిన్నమై కనబడుచున్న ఈ అవిద్య అజ్ఞానము చేతనే ఉదయిస్తోందని అనుకొన్నాము కదా! ఒకడు ఒక క్రీనీడగల ప్రదేశంలో ఒక త్రాడును చూచి "అమ్మబాబోయ్! ఇక్కడ పెద్దపాము మెలికలు తిరిగిపడి ఉన్నది" అని గావుకేకలు పెడుతున్నాడనుకో. ఇప్పుడు అతనియందు ఏర్పడియున్న త్రాడునందు "పాముకు సంబంధించిన బుద్ధి" పోవలసి ఉన్నది. మరి పోయేదెట్లా? 'ఎరుక' లేక జ్ఞానము' చేతనే కదా! ఈ అవిద్య కూడా ఎరుక (లేక) 'జ్ఞానము' చేత నశించగలదు. అట్టి అవిద్యానాశనము ఒక్కసారిగా కాని, లేక క్రమక్రమంగా కాని జరుగవచ్చు. దానికి "ఇది ఇట్లాగే జరగాలి" అను నియమమంటూ ఏదీ లేదు. "కాదు....ఏదో నియమము ఉన్నట్లే ఉన్నది" అని నీకు అనిపిస్తోందా? అట్లు అవిద్య తొలగుటకు ఏదో క్రమము ఉన్నదని అనిపించటం కూడా అవిద్య యొక్క ప్రభావం చేతనే.

"ఆఁ! అప్పుడే ఎక్కడ? మేము జ్ఞానులము కాగలమా? మాయను తొలగించగలమా? లేదు. అది ఎప్పటికో, ఎన్నటికో సాధ్యపడాల్సిందే. ఇప్పటికి మాత్రం ఇది ఇంతే...." అనునదంతా అజ్ఞానవశం చేతనే అట్లు అనిపిస్తోంది.

ఈ 'ఆకాశము–నేల–నదులు–గృహములు' మొదలైన రూపములో ఉన్న అవిద్య అంతా అజ్ఞాని దృష్టిలోనే ఉదయిస్తోంది కాని, జ్ఞాని దృష్టియందు కాదు.


శ్రీ రాముడు : మహర్షీ! జ్ఞాని దీనినంతా చూస్తూ ఏమని అనుకొంటున్నాడు?

శ్రీ వసిష్ఠ మహర్షి : జ్ఞాని, "ఈ కనబడుచున్న సర్వరూపములందు ఉన్నది బ్రహ్మమే. బ్రహ్మమే తనయొక్క మహిమాతిశయంచేత ఈ విధంగా ప్రతిష్ఠితమైనది. బ్రహ్మము యొక్క స్వభావము కానిదంటూ ఇక్కడ ఏదీ లేనే లేదు" అనియే గాంచుచున్నాడు. అతనికి "వికార రహితమగు పరమార్థ దృష్టి" మాత్రమే అన్ని వైపులా నిర్ణీతమై ఉంటోంది. ఇక ఈ రజ్జు – సర్ప భ్రాంతులు (తాడును చూచి 'పాము' అనుకోవడం), ఈ ప్రాతిభాసికదృష్టులు ఇవన్నీకూడా అజ్ఞాని చేత, అజ్ఞాన విన్యాసము కొరకు కల్పించబడి, అనుభవించబడుచున్నాయి.

❖❖❖

14. దుఃఖించడమెందుకు?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! నీవు ఏమాత్రం అజ్ఞానివి కావద్దు. జ్ఞానివే కావాలి. అజ్ఞానభూతమగు ఈ దేహము మొదలైన వాటియందు ఆత్మ భావము కలిగి ఉండవలసినపనేమున్నది? నీవు అసలు ఎందుకు అజ్ఞానివలె దుఃఖిస్తున్నావో చెప్పు? ఈ సుఖ-దుఃఖ వ్యవహారములు నిన్ను వివశుణ్ణి చేయడమేమిటి? వాటి చేత నీవు పరాజితుడవు కావటమేమిటి? అట్టి సుఖ-దుఃఖములకు కారణమగు ఈ జడదేహం నీ కెక్కడున్నది? "కత్తిపీట - కుండలోని పళ్ళు" గమనించు.



కత్తిపీటలో లోహము - కొయ్య కలిపి ఉన్నంత మాత్రంచేత అవి రెండు ఒక్కటే అవుతాయా? కుండలో మామిడిఫలములు ఉన్నాయనుకో. అప్పుడా పళ్ళు - కుండ ఒక్కటే అవుతాయా?

ఈ దేహము, ఆత్మ కూడా ఒకదానితో మరొకటి ఎన్నడూ సంబంధం లేకుండానే ఉంటున్నాయి.

'కొలిమితిత్తి' దహించబడినంత మాత్రం చేత అందలి వాయువు దహించబడుతుందా? లేదు కదా! ఆత్మ శరీరముచే పుట్టునది కాదు. శరీరంలో చిక్కి ఉన్నది కాదు. శరీరంతో నశించేది కూడా కాదు. నీవు ఆత్మ స్వరూపుడవు. అంతేగాని, "జడము - తుచ్ఛము" అగు శరీరరూపుడవుకాదు.

రెండు విధములైన "భావనాబీజములు" :

1) **"నేను స్వతహాగా దుఃఖిని :** అయితే, ఆయా వస్తువులు, స్థితి గతులు లభించినప్పుడు నేను 'సుఖి' ని అగుచున్నాను"

2) "**నేను స్వతహాగా 'సుఖి' ని :** ఆయా వస్తువులు, స్థితి గతులు వస్తూవుంటాయి, పోతూ ఉంటాయి. అయినా కూడా నా స్వస్థితిని సుఖ స్వరూపముగానే ఉంచుకోగలను!

మొదటిది త్యజించాలి. రెండవదానిని ఆశ్రయించాలి.

ఓ నరశార్దూలా! రామా! ఉత్తిష్ఠ! ఇక "నేను స్వతహాగా దుఃఖిని. కానీ విషయ సుఖములు పొందుచున్నప్పుడు మాత్రమే సుఖిని" ... అనునట్టి కలవరింతలు కట్టిపెట్టు. "ఇది ఇట్లే ఉండాలి? అది అట్లు ఉన్నదేం? వీరు నా వారు. వీరు సుఖించాలి. వారు వేరైనవారు. వారికి ఆ ధనాదులు ఎందుకు కలగాలి? ....." ఇట్టి అసంఖ్యాకమైన భ్రమలు ఎందుకు కలుగుచున్నాయి? భ్రాంతి చేతనే కలుగుచున్నాయి. ఇవన్నీ మృగతృష్ణలో జలబిందువువలె మిథ్యయేనని తెలుసుకొని త్యజించివేయి. నీవంటివారు సత్యమునే ఆశ్రయించాలి గాని అసత్యమును ఆశ్రయించటమేమిటి? దుఃఖించటమేమిటి? అనేకమంది అసత్యమును ఆశ్రయిస్తూ "నేను దుఃఖితుడను, స్వల్పుడను,

శరీరమాత్రుడను. ఇక ఈ నియమము ఇంతే, నా గతి అంతే!" అని సన్ననికేకలో – గావుకేకలో పెట్టటం మేము వింటున్నాము. ఓ జనులారా! మీరంతా ఆత్మస్వరూపులే. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఇక దుఃఖితులు కావలసిన పనియేమున్నది చెప్పండి? "సర్వదా శాశ్వతమై, అనంతమై, విశుద్ధమై, సర్వమునకు అంతర్యామి అయి ఉన్న ఆత్మనే నేను" అను భావనను ఆశ్రయించండి. అంతేగాని, ఈ శరీరముయొక్క ధర్మములను మీపై ఆపాదించుకొని భ్రమించమని, దుఃఖించమని మీకు ఎవరు చెప్పారు? మీ యొక్క "సేవకులు" మాత్రమే అయి ఉన్న ఈ ఇంద్రియములతో తాదాత్మ్యముచెంది, నిష్కారణంగా అల్పత్వం ఎందుకు ఆశ్రయించాలి?

ఆహాఁ! ఏమి ఆశ్చర్యం! సత్యమగు బ్రహ్మమును మరచి ఈ జనులు గొప్ప అసత్యమగు "అవిద్య"నే ఎల్లప్పుడు స్మరించుచున్నారే? ఓ రామా! ఆత్మను విస్మరింపజేయగల ఈ అవిద్యకు చోటు ఇవ్వకూడదయ్యా! అట్లా చోటు ఇచ్చావా... ఇక నీ చిత్తము కలుషితమై తీరుతుంది. ఫలితం? దుఃఖ పరంపరలు వచ్చి నిన్ను వివశుణ్ణి చేసి కూర్చోబెడతాయి. నీవు వాటిని జయించవలసిందిపోయి, అవే నిన్ను ఆక్రమించివేస్తాయి. ఈ అవిద్య :

- మిథ్యారూపంగా అనేక పదార్థములను ఎదురుగా ఉంచి చూపుతోంది.
- సంకల్పమాత్రంచేత బహు విశాలత్వం పొందుతోంది.
- చివరకు అజ్ఞానమే రూపముగాగల అనేక ఫలములను తెచ్చి పెడుతోంది.

అమృతతుల్యము, స్వయంప్రకాశవంతము అయి ఉన్న నీ యొక్క సత్య – నిత్య స్వరూపమగు ఆత్మను మరుగు పరచి, నిన్ను దుఃఖితునిగా చేస్తున్నది ఈ అవిద్యయే సుమా! ఈ జనులు చేస్తున్నదేమిటి? వేద – ఉపనిషత్తులచే ప్రతిపాదించబడుచు, ఋషులచే అనేక ఉపాయములద్వారా గుర్తు చేయబడు చున్న స్వస్వరూపమగు ఆత్మ యొక్క సమాచారమును – జ్ఞానమును తిరస్కరిస్తున్నారు. ఫలితంగా ఈ జీవుడు అనేక దుస్సహమైన అనుభవములను పొందుచున్నాడు. అవిద్యాప్రభావం చేతనే, సరోవరమును ఎడారివలె గాంచుచున్నాడు. ఊహాసౌధనిర్మాణం (గంధర్వ జన్మలు), నరకములు, స్వర్గములు – ఇటువంటి సుఖ, దుఃఖ ప్రదములైన విచిత్ర భ్రమలు స్వప్నంలోలాగానే అజ్ఞాన కారణంగా ఈ జీవునకు అనుభవమౌతున్నాయి.

అవిద్య కనుక చిత్తమునందు సాంసారికవాసనలు నింపియుండకపోతే ... ఇక ఈ జాగ్రత్ –స్వప్న విభ్రమములు ఆత్మను క్షోభించగలిగేవా? లేదు. మిథ్యారూపమగు 'అజ్ఞానాభివృద్ధి' చేతనే ఈ జీవుడు తన జాగ్రత్ స్వప్నములందు భయంకర దృశ్యములను నిర్మించుకుని, "అయ్యో! నన్ను ఎవరు కాపాడుతారోకదా?" అని రోదిస్తున్నాడు. 'అవిద్య' అను అస్వస్థతను పొందిన ఈ చిత్తము క్షణంలో 'విశాల సంసారసాగర' రూపమైనట్టి 'భ్రమ'ను, ఆ భ్రమకు అంతర్గతమై ఉంటున్న అనేక అనర్థములను తనయందే గాంచుచున్నది. చిత్తము రోగగ్రస్తమైనప్పుడు ఇక అట్టి జీవుడు రాజ్యాధిపత్యం పొందితే మాత్రం లాభమేమి ఉంటుంది? అతడు నిరుపేదకు కూడా అయోగ్యమైనట్టి దుఃఖములు అనుభవిస్తూనే ఉంటాడు.

కాబట్టి రాఘవా! ఈ ప్రపంచంలో బంధహేతువై, రాగమయమై, అవిద్యామయమై ప్రవర్తిస్తున్న వాసనల బారి నుండి నిన్ను నీవు రక్షించుకో. రాగరహితుడవై స్వచ్ఛమైన స్ఫటికమువలె వెలుగొందు. ఒక దర్పణములో ప్రతిబింబిస్తున్న ఆయా పదార్థజాలములపట్ల ఆ దర్పణమునకు ఏదైనా ఆసక్తి ఉంటుందా? ఉండదు కదా! అట్లాగే నీచే నిర్వర్తించబడు ఆయా కార్యములందు నీ మనోదర్పణమునకు ఎట్టి ఆసక్తి–రాగము ఉండకుండునుగాక!

నిరతిశయానందరూపమగు బ్రహ్మమును ఎరిగిన తత్త్వవేత్తలు ఈ భూమిపై నిరాడంబరముగా సంచరిస్తూ ఉన్నారు. వారిని సమీపించు. వారితో సంసర్గము కలిగియుండు. వారు బోధించునది భక్తి–జ్ఞాన–వైరాగ్యపూర్వకంగా గ్రహించు. మరల మరల విచారణ చేయి. బ్రహ్మభావనను దృఢపరచుకో! అట్టి దృఢ నిశ్చయముచే శోభించు. సమత్వము, సౌశీల్యము సర్వదా ఆశ్రయించి ఉండు. ఆసక్తి రహితుడవై ఉత్తమ వివేకబుద్ధితో కూడి సదా వ్యవహరిస్తూ ఉండు.

స్వల్పములగు శరీరాదులందు, ఈ దృశ్యవస్తువులందు 'మమత్వము'ను వదిలివేయి.

అప్పుడు అవిద్యాజనితములైన ఈ జనన, మరణాది వికారములు చేరజాలనట్టి స్థితి పొంది ఉండగలవు. నిత్యముక్తుడవై ఉంటావు.

ఓ రామచంద్రా! ఒక ఉత్తమ సత్యమును ప్రకటిస్తున్నాను.

"ఆత్మైక్యస్థితి" కలిగి ఉన్నావా, ఇక నీతో హరి–హర–బ్రహ్మాదులు కూడా సాటిరారు.

❖❖❖

15. కర్త - భోక్త

అమృతతుల్యములగు వసిష్ఠ భగవానుని వాక్యములు విని రామచంద్రుడు వికసితమైన అంతః కరణుడు అయ్యాడు. గొప్ప అనిర్వచనీయమైన వికాసం(Splendour)చే శోభించాడు. ఇట్లు పలికాడు.

శ్రీరాముడు : ఆహాఁ! ఏమి ఆశ్చర్యం! "ఒక బారెడు పొడుగు దారము పోయి ఉన్నతమైన ఒక కొండను బంధించినది" అనునది ఎంత హాస్యాస్పదమో, ఇదంతా కూడా అంతే మహా హాస్యాస్పదంగా ఉన్నదే! "స్వతహాగా ఏమాత్రం లేనిదే" అయినప్పటికీ ఈ అవిద్య అందరిని తన వశం చేసుకొంటున్నది కదా! ఎక్కడి ఆత్మ? ఎక్కడి అవిద్య? ఒక గొడుగు ఆకాశమును కప్పివేస్తున్నట్లు ఈ అవిద్య ... సర్వుల స్వస్వరూపము, దేశ – కాలాతీతము ...అయిన ఆత్మను మరుగున పడవేస్తోంది. తృణప్రాయమై, ఉండి కూడా, వజ్రప్రాయమై ప్రవర్తిస్తోంది. దాని ప్రభావంచేత 'అత్యంత మిథ్య' అయినది కూడా 'ఎంతో సత్యము' అని అనిపిస్తోంది.

మహాత్మా! ఈ 'మాయ' యొక్క స్వరూపమేమిటో మరికొంత గ్రహించాలని ఉన్నది. అందుచేత దీని గురించి ఇంకా కొన్ని వివరాలు చెప్పండి. ఇంతకుముందు లవణమహారాజు యొక్క అనుభవములు గురించి చెప్పుచున్నారు కదా! ఉత్తమజ్ఞాని, భాగ్యశాలి అని అందరిచే కీర్తించబడు

ఆ చక్రవర్తికి అట్టి అనుభవం ఎందుకు సంభవించింది? నాకీ విషయంలో ఇంకా సంశయం పోలేదు.

మరొక్క విషయం. లోహము – కొయ్యవలె పరస్పరం కూడియున్న ఈ దేహము – ఆత్మలందు ముఖ్యంగా శుభ – అశుభ కర్మలను అనుభవించేది ఏది? దేహమా? ఆత్మయా? లవణ మహారాజు యొక్క ఆ సభకు వేంచేసిన ఆ ఐంద్రజాలికుడు ఎవడు? ఎందుకు, ఎక్కడి నుండి వచ్చాడు? మరల ఎక్కడికి వెళ్ళాడు? ఆ సభలో మీరు కూడా ఉన్నానని అన్నారు కదా! ఇదంతా గమనించే ఉంటారు.

శ్రీ వసిష్ఠ మహర్షి : ముందుగా ఈ "శరీరము – ఆత్మ"లందు అనుభవము స్వీకరించుచున్న విభాగం గురించి కొన్ని విశేషాలు చెప్పుచున్నాను, విను.

కొయ్య, గోడలవలె ఈ దేహము జడమైనది మాత్రమే. స్వప్నంలో కనబడే వస్తువులను ఆ 'స్వప్నద్రష్ట' యే అట్లు కల్పించుకొని దర్శించుచున్నాడు కదా! చిత్తమే ఇదంతా ఇట్లు కల్పించుకొను చున్నది. అయితే, ఈ చిత్తము తనంతట తానే ప్రవర్తిస్తోందా? లేదు. అది స్వయంప్రకాశం కాదు.

ఈ చిత్తము చైతన్యముచేతనే ప్రకాశితం అగుచున్నది.

అయితే ఇది చిదాభాసుని (Refractive Awareness Reflective part of Atman) తో ఐక్యము పొందుచున్నదై ఉంటున్నది. ఫలితంగా ప్రపంచమున భోక్తృత్వాభిమానం కలదగుచున్నది. 'వానర సంచారము' వలె అతి చంచలమైన ఈ చిత్తమే 'నేను జీవుడు' అను భావనకు ఉత్పత్తి స్థానం అగుచున్నది. చిత్తమే అనేక రకములైన దేహములను ధరిస్తోంది కాబట్టి, "జీవుని దేహము ఈ చిత్తమే" అని అనటం కూడా ఉచితమే. ఇదే కర్మ ఫలభోక్త. వాస్తవానికి చిత్తమే జీవుడు. అంతేకాని, ఈ భౌతికదేహం జీవుడుకాదు.

అనంతంగా కనిపించే ఈ సుఖదుఃఖములన్నీ అజ్ఞాని యొక్క చిత్తమునందే ఏర్పడుచున్నాయి కాని, జ్ఞానియందు కాదు.

జడో దేహో న దుఃఖార్హో! దుఃఖీ 'దేహి' అవిచారతః ।
అవిచారోఘనాఽజ్ఞానాత్! అజ్ఞానమ్ దుఃఖకారణమ్ ॥

"సుఖదుఃఖములు శరీరమునకు సంబంధించిన ధర్మములు" అని అనటానికి వీలులేదు. ఎందుకంటే ఈ శరీరము జడమైనది కదా! శరీరం సుఖమునుగాని, దుఃఖమునుగాని పొందజాలదు.

ఇక శుద్ధస్వరూపమగు ఆత్మకో... సుఖదుఃఖాదులు ఉండజాలవు.

మరి ఈ సుఖదుఃఖాలు అనుభవిస్తున్నది ఎవరు?

అజ్ఞానియొక్క మనస్సు అనేక సంజ్ఞలచే కల్పితములైన భ్రమలను కలిగి ఉంటోంది. చిత్ర – విచిత్రములైన వృత్తులందు తగుల్కొనుచు, విచిత్రమైన ఆకృతులను పొందుతోంది. చమత్కారం చూచావా? ఈ మనస్సు తాను ప్రబుద్ధం కానంతవరకు ఇట్లే నిద్రిస్తూ ఉంటుంది. జ్ఞాన విషయమై అజాగ్రత్త వహించి ఉంటోంది. స్వప్నస్థితివలె అజ్ఞానమున ఉన్నదై అవిచారణను ఆశ్రయిస్తోంది.

"స్వసత్తాసామాన్యము" (Existence Absolute) ను మరచి దుఃఖాదులను పొందుతోంది. అధికమగు అజ్ఞానముచేతనే "అవిచారము" {Non-Enquiry} అనేది ఉత్పన్నమౌతోంది.

కాబట్టి అజ్ఞానమే సర్వదుఃఖములకు కారణం

పట్టుపురుగు తాను నిర్మించుకొనిన గూటిలో తానే చిక్కుకుంటుంది చూచావా? ఈ జీవుడు తనయొక్క అవివేకము చేతనే శుభాశుభములకు లోను అగుచున్నాడు. తన ఆసక్తి యొక్క ఆడంబరమే తనకు దుఃఖ వ్యవహారముగా పరిణమించుచున్నది. అయితే, ఎంతకాలం గడచిపోయినప్పటికీ, ఆ విషయం అతడు గ్రహించుటలేదు. 'అజ్ఞాన నిబిడాంధకారము' లో చిక్కుకొని బాధపడుచున్న ఈ మనస్సు అనేక వృత్తులను కలిగియుండి, వివిధ ఆకారములను పొందుచు, ఒక పెద్ద చక్రంలా పరిభ్రమిస్తోంది...., ఉత్పన్నమగుచున్నది...., దుఃఖించుచున్నది...., వధించుచున్నది..., భుజించుచున్నది..., సంచరించుచున్నది..., విజృంభించుచున్నది..., నిందించుచున్నది. దీని చేతలకు అంతు ఉండుట లేదు. ఇవన్నీ చేస్తున్నది మనస్సే కాని, జడశరీరం కాదు. మనస్సే తాను తెరవెనుక ఉండి, ఈ శరీరమును ప్రవర్తింపచేస్తోంది. లేకుంటే శరీరమే స్వయంగా ఈ పనులు చేయగలదా? ఇంటిలోని సమస్త వ్యవహారములు నిర్వర్తిస్తున్నది ఇల్లాలే గాని, ఇల్లు, ఇంటిలోని వస్తువులు కాదు కదా! అట్లే ఈ శరీరమునందు మనస్సే వర్తిస్తోంది.

సర్వ సుఖదుఃఖములందు, సర్వవిధ కల్పనలందు మనస్సే కర్త, మనస్సే భోక్త. ఇన్ని మాటలెందుకు? "మనస్సే మానవుడు గాని, ఈ శరీరము మానవుడు కాదు".

సర్వేషు సుఖదుఃఖేషు సర్వాసు కలనాసు చ ।
మనః కర్తృ మనో భోక్తృ మానసం విద్ధిమానవమ్ ॥

ప్రబుద్ధమైన మనస్సు ఆయా కార్యక్రమములకు సంబంధించిన క్రియావిశేషములను నిర్వర్తిస్తున్నప్పటికీ, వాటి పట్ల 'ఆసక్తి' అను భ్రమ కలిగి యుండదు. 'ఆత్మతత్త్వము' ను గ్రహించినదై ప్రశాంతమును, మౌనమును అనుభవిస్తూనే ఆయా క్లిష్ట – సాంసారిక విషయములను దర్శించగలదు. అజ్ఞానాంధకారం పటాపంచలైతే, ఇక అట్టి మనస్సే పరమాత్మ స్వరూపమై ఉంటుంది.

ఇప్పుడు నీకు లవణమహారాజు తన సింహాసనముపై కూర్చుని ఉండియే అరువది (60)యేళ్ళ ఆటవిక వ్యక్త్యానుభవం ఎందుకు పొందాడో వివరిస్తాను. ఇది వింటే "శుభాశుభ – కర్మఫలములను అనుభవిస్తున్నది మనస్సే" అని గ్రహిస్తావు.

హరిశ్చంద్రుని వంశములోని వాడైన లవణ మహారాజు ఆ సభాసమావేశమునకు కొద్దిరోజుల క్రిందట ఒక రోజు ఒంటరిగా వ్యాహ్యాళికై సముద్రపు ఒడ్డు చేరాడు. ఒక ఏకాంత ప్రదేశంలో ఇసుక తిన్నెపై సుఖాసీనుడైనాడు. "ఆహాఁ! నా పితామహుడు హరిశ్చంద్రుడు రాజసూయయాగం చేశాడు కదా! నేను కూడా ఆ యాగం చేస్తే ఎంత బాగుంటుంది! కాని, రాజసూయయాగం చేయాలంటే గొప్ప యజ్ఞసామగ్రి సంపాదించాలి. పైగా తోటి రాజులను,వారి ప్రజలను హింసించటం, బాధించటం వంటి దుష్ట వ్యవహారాలు కూడా చేయవలసివస్తుంది. మంత్ర తంత్రములతో, మహా

ప్రయాసతో కూడుకొనియున్న అట్టి యాగము ఎట్లా చేయటం?" అని యోచించసాగాడు. ఇంతలో అతని మస్తిష్కంలో ఒక మహత్తరమైన ఆలోచన మెరసింది.

తత్త్వజ్ఞులగు మహాశయులు "ఏ క్రియకుగాని, అనుభవమునకుగాని కారణం మనస్సే. అంతే గాని, ఈ జడశరీరం కాదు "– అని చెప్పటం విన్నాను కదా! అందుచేత రాజసూయయాగమును ఇప్పుడే, ఇక్కడే మానసికముగా చేసెదనుగాక!"

ఇట్లు నిర్ణయించుకొని, అప్పటికప్పుడు అక్కడే 'మానసిక యజ్ఞం' ప్రారంభించాడు. మనస్సుతోనే యజ్ఞసామాగ్రినంతా సమకూర్చుకొన్నాడు. దీక్ష వహించాడు. మనస్సుతో ఋత్విక్కులను ఆహ్వానించాడు. ముందుగా శ్రేష్ఠులైన మునులను, దేవతలను, సంకల్పపుష్పములతో పూజించాడు. హవిస్సు ద్వారా అగ్నిని ప్రజ్జ్వలింపజేశాడు. యజ్ఞవాటికామధ్యంలో మానసిక యజ్ఞ కార్యక్రమం ప్రారంభించాడు. అట్లు ఒక సంవత్సరకాలం ఆయా యజ్ఞవిధులన్నీ నిర్వర్తించబడ్డాయి. అతడు తన సర్వస్వము బ్రాహ్మణులకు, పేదలకు దక్షిణగా ఇచ్చి వేశాడు. మనోకల్పితులగు ఋత్విక్కులు "యజ్ఞపరిసమాప్తి – శాంతి" పలికిన తరువాత అతడు మానసిక – యజ్ఞం నుండి మేల్కొని బాహ్య దృష్టికి వచ్చాడు. సంతుష్టమానసుడై, "నేను రాజసూయయాగము చేశాను కదా!" అను తృప్తిని పొందాడు. అద్దాని ఆయా ఫలితములను అతడు పొందవలసియున్నది కదా! చేసిన కర్మ యొక్క ఆయా ప్రయోజనములు వచ్చి తీరుతాయి.

ఓ రాఘవా! సుఖదుఃఖములన్నిటికీ ఈ మనస్సే కారణమని అనుకున్నాం కదా! అట్టి మనస్సు లేక చిత్తమును "విచారణ(Enquiry as to its real nature)"చే నిగ్రహించాలి సుమా! క్రమంగా ఈ చిత్తమును 'పవిత్రము – సత్యవంతము' అయిన వస్తువు యొక్క సామీప్యత పొందేటట్లు చేయాలి.

మనస్సే క్రియాశక్తి. కర్త–కరణము–క్రియ కూడా అదే.

ఏ క్రియ యందైతే మనస్సు పాల్గొనుచు, నిర్వర్తించబడుతుందో, అది మాత్రమే సుఖ–దుః ఖాది రూపమున పరిణమించి ఫలదాయకం అగుచున్నది.

ద్రష్ట యొక్క ప్రతిబింబమే ఈ దృశ్యమంతటిలో వ్యాపించియున్నది. దృశ్యములో–దృశ్యముగా ప్రతిబింబించే ద్రష్టయొక్క స్వరూపతత్వమును 'చిదాభాసుడు' అని పిలుస్తున్నారు.

అనగా "చిత్ స్వరూపుడవగు నీవే నీ చేత దర్శించబడుచు, అనుభవించబడుచున్న దానియందు ప్రసరించియుండి, 'నిన్ను నీవే' అట్లు గాంచుచున్నావు" అనునదే వేదాంత రహస్యం. చూచువానితో సహా సర్వము చిత్‌శక్తి యొక్క ప్రసరణమే. ఇట్లు మనస్సే భోక్త – భోగము కూడా అగుచున్నది. కర్తృత్వ – భోక్తృత్వ భావనయే మాయయొక్క స్వరూపము. ఆత్మ సర్వదా నిర్మలం. అసంగము. అప్రమేయము. ఇట్లు 'తత్‌త్వమ్' యొక్క తాత్వికార్థం అదే!

'దేహము – ఆత్మ' లలో శుభాశుభ కర్మలను అనుభవించేదేది?

ఈ నీ ప్రశ్నకు మరల సమాధానం చెప్పుచున్నాను. విను. సర్వకర్మల కర్తృత్వముగాని, అనుభవముగాని ఇటు దేహమునకు సంబంధించినవి కావు.

అటు నిష్క్రియమగు ఆత్మకు సంబంధించినవి కూడా కావు.

'పాపము – పుణ్యాము', 'సుఖము – దుఃఖము', 'కర్మ – కర్మ ఫలము' ఇవన్నీ చిత్తమునకు సంబంధించినవి మాత్రమే.

ఓ సభికులారా! ఎప్పుడైతే ఈ మనస్సు దేశ–కాల–వస్తువులకు అందజాలనట్టి 'ఆత్మతత్త్వము' ను అవలంబిస్తుందో, అందు ప్రతిష్ఠితమౌతుందో, అప్పుడు ఇది 'పరిపూర్ణత్వము' ను పొందుతోంది. అట్లా కాకుండా, పరిచ్ఛిన్నమగు ఈ దేహాదులను, ఈ దృశ్యమును ఆశ్రయించిందా ... ఇక ఫలితం అల్పత్వము, దుఃఖము, అగమ్యత్వమే. కనుక, మీరంతా ఒక్క విషయం గ్రహించండి. "ఈ దేహమే నేను" అను భావము ఎవరు కలిగియుంటారో, అట్టివానికి గాని, లేక వారి వలన ఈ ప్రపంచమునకు గాని ఉత్తమ ప్రయోజనం లభించుటలేదని మనవి చేస్తున్నాను. వారి దుఃఖములు తొలగేదెట్లా?

వివేకులు – కొందరు ఉత్తములు వేదాంతము ప్రతిపాదిస్తున్న శాస్త్రములను తరచి – తరచి విచారిస్తున్నారు. ఆచార్యులను (విజ్ఞులను) సమీపించి సమ్యక్ విచారణ చేస్తున్నారు. అట్టి వివేకులు ప్రబుద్ధమైన తమ చిత్తమునందు, "అతిత్వరలో నశించబోయే ఈ దేహము నేను కాను. పూర్ణానంద ప్రకాశరూపమగు బ్రహ్మమే నేనై ఉన్నాను"... అను దృఢనిశ్చయం కలిగి ఉంటున్నారు. అట్టి బ్రహ్మాకార వృత్తి కలిగి, అభ్యాసవశం చేత దృఢంగా ఉండే జీవునికి దుఃఖమంతా పూర్తిగా నశించుచున్నది. సూర్యుడు ఉదయించగానే కమలములు విచ్చుకొనుచున్నట్లు, అట్టివాడు అంతటిని తనయందు, అంతటియందు తనను గాంచుచున్నాడు.*

శ్రీరాముడు : మీ ప్రవచనం మహత్తర సత్యమును ప్రతిపాదిస్తోంది. స్వామీ! మీరు లవణ మహారాజు యొక్క మానసికయాగం గురించి ప్రస్తావించారు. అయితే అట్టి మానసిక–రాజసూయ యాగం ఫలితంగానే లవణమహారాజు ఐంద్రజాలికునిచే కల్పించబడిన వివిధ కల్పనామయమగు మాయా జాలం పొందాడంటారా? 'అది రాజసూయ యాగ ఫలితమే' అనటానికి ప్రమాణం ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆ ఐంద్రజాలికుడు సభలో ప్రవేశించే సమయంలో నేను అచ్చటనే ఉన్నాను. అక్కడ జరుగుచున్నదంతా ప్రత్యక్షంగా అవలోకించుచున్నాను. ఇంద్రజాలమంతా సమాప్తమైన తరువాత ఐంద్రజాలికుడు అంతర్ధానమైనాడు కదా! అప్పుడు లవణమహారాజు నా వైపు చూచి ఇట్లు పలికాడు.

లవణ మహారాజు : తండ్రీ! వసిష్ఠ మహర్షీ! ఈ చిత్రమంతా ఏమిటి?

అప్పుడు నేను యోగబలంతో అంతా పరిశీలించి, అటు తరువాత ఇట్లు చెప్పాను–

నేను (శ్రీ వసిష్ఠ మహర్షి) : ఓ లవణమహారాజా! మీరు పది రోజుల క్రితం ఒక సముద్రపు ఒడ్డున ఇసుక తిన్నెపై కూర్చుని మానసికంగా రాజసూయయాగం చేసియున్నారు. గుర్తున్నదా? "రాజ

* **"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని"** – *శ్రీమద్భగవద్గీత (VI.29)*

సూయము నిర్వర్తించినవారు పం(డెండు సంవత్సరములు వివిధ ఆపదలను అనుభవిస్తారు. ఆయా దుఃఖములను ఆ 12 ఏళ్ళలో అనుభవించవలసివస్తుంది” అనేది శాస్త్రనిర్ణయం. ఆ దుఃఖములను కలుగజేయటానికే ఇం(ద్రుడు స్వధర్మనిర్వహణార్థం దేవదూతను ఐం(ద్రజాలికుని రూపంలో పంపించాడు.

శ్రీ లవణ మహారాజు : స్వామీ! అట్లా అయితే నేను చండాలునిగా అరువది సంవత్సరములు జీవించిన అనుభవంపొందానే? ఎందుచేత?

నేను : ఓ అదా! దానికి కారణం విను. శారీరక యజ్ఞము కంటే మానసిక యజ్ఞమునకు ఐదు రెట్లు అధిక ఫలము ఉంటుంది. ఆ నిర్ణయం ప్రకారమే నీకు 5×12 = 60 సంవత్సరాల ఆధి వ్యాధులతో కూడిన దుర్భర జీవితానుభవం కలిగింది.

శ్రీ లవణ మహారాజు : మరి ఐం(ద్రజాలికుని రూపంలో వచ్చిన దేవదూత ఎటు వెళ్ళారు?

నేను : ఓహో! ఆయనా! ఆయన తనకు నియమించబడిన కార్యమును నెఱవేర్చి, ఆ తరువాత సిద్ధులచే సేవించబడుచు ఆకాశమార్గంలో తిరిగి దేవలోకం చేరారు.

❖❖❖

16. సాధన ప్రయోజనం

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! రామచం(ద్రా! ఇదంతా నాకు ప్రత్యక్షంగానే జరిగింది. ఇందులో నీవు సందేహించవలసినదంటూ ఏమీ లేదు.

ఈ సర్వ విలక్షణములగు క్రియలకు కర్త, భోక్త కూడా మనస్సే. అందుచేత ఈ మనస్సును శుద్ధి చేసుకోవాలి. అందుకొరకుగాను ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము మొదలగు హఠయోగ క్రియలు కొంచెము ఆశ్రయించు. విధి, నియమములు, రాజయోగములతో కూడిన శ్రమ నుండే ఉత్తమ అవగాహనతో కూడిన ధీశక్తి అలవడుతోంది. అట్లు మనస్సుకు యుక్తులతో ఏకాగ్రత నేర్పి, అటుపై నిర్వికల్పసమాధియందు దానిని లయం చేయాలి. ఆవేశరహితంగా లక్ష్య శుద్ధితో యోగ – విచారణలను నిర్వర్తించటం ఉచితం.

ఈ చిత్తమే జీవులందరిని మోహపరుస్తున్న అవిద్య. అట్టి అవిద్యయే విచిత్రమైన ఇం(ద్రజాల రచనలాగా ఈ జగత్తునంతా ఉత్పన్నం చేస్తోంది. ‘వృక్షము’ అన్నప్పుడు, ‘చెట్టు’ అన్నప్పుడు, ... ఈ రెండు శబ్దాలు సూచించేది ఒక్కదానినే కదా! అదే విధంగా, – ఈ ‘అవిద్య’, ‘జీవుడు’, ‘చిత్తము’, ‘బుద్ధి’, ‘మనస్సు’ మొదలైన శబ్దముల వాస్తవార్థంలో భేదమేమీ లేదు. ఇది గ్రహించి నీవు ముందుగా నీ చిత్తమును సంకల్పరహితం చేయి. “చిత్త నిర్మలత్వము” అనే సూర్యుడు ఉదయించాడా.... ఇక అప్పుడు చోటు చేసుకొన్న అజ్ఞానాంధకారమంతా స్వయముగా సమసి పోతుంది. ‘చీకటి’ అంటే ఏమిటి? ‘వెలుగు లేకపోవుట’ అనియే కదా! అట్లే ‘అవిద్య’ లేక ‘అజ్ఞానము’ అంటే జ్ఞానము అసంపూర్ణమై ఉండుటయే. ‘స్వస్వరూపము’ గురించిన ఎరుక ఏమరుచుటచేతనే ఈ జీవులు జగత్తు అనబడుదానిని, అందలి ఏకానేకత్వములను గాంచుచున్నారు.

పురుషేణ జాతమాత్రేణైవ బాల్యాత్ ప్రభృతి
విద్యాగ్రహణమ్ కర్తవ్యమ్ । గురువో అనుగన్తవ్యమ్ ॥

తాత్సారం చేయరాదు. చిన్నప్పటి నుండే గురువులను సమీపించటం, సత్య వస్తువుకై ప్రయత్నించటం చేయాలి.

"ఈ లౌకిక వ్యవహారముల మధ్య ఉన్నంతకాలం నేను జ్ఞానం కొరకు ప్రయత్నించటం ఎలా సాధ్యం?" ...అని భ్రమించకుండెదవు గాక! చిత్తము లయించగా, అవిద్య శమించగా, అప్పుడు నీ యందు 'అవిద్యా వృత్తి' మాత్రమే నశిస్తుంది. అనగా ఈ దృశ్యమును, ఇందలి సంఘటనలను అర్థం చేసుకొనే రీతి మాత్రం వేరుగా ఉంటుంది.

మేఘములు లయించిపోతే ఆకాశం కోల్పోయేది ఏమైనా ఉంటుందా? లేదు కదా! దృశ్యమునకు సంబంధించిన వృత్తుల సమూహమే చిత్తము యొక్క రూపము. చిత్తము లయించినప్పుడు కూడా, చిత్స్వరూపుడు, ఆత్మాకాశ స్వరూపుడు అగు ఈ ద్రష్ట అట్లే ఉండిఉంటున్నాడు. నిత్యసత్యమైయున్న 'ఆత్మదృష్టి' కొరవడుటచేతనే 'అవిద్య' అనేది ఉంటోంది.

శ్రీరాముడు : అవిద్యాకార్యము అయి ఉన్న అవివేకమునకు, లేక, ఈ సంసారానుభవమునకు కారణం చిత్తమేనంటారా, మునీంద్రా?

శ్రీ వసిష్ఠ మహర్షి : కాదు. ఆ చిత్తములోని అజ్ఞానవృత్తులే కారణం. "ఈ చిత్తము నా యందు తొలగుట లేదే?" అని నీవు దిగులు పడవలసిన అవసరం లేదు. అజ్ఞాన వృత్తి తొలగితే, ఇక శేషించేది పరిశుద్ధమగు "ఆత్మతత్త్వమే"! అప్పుడు ఆ శుద్ధచిత్తము ఆత్మనే అంతటా, సర్వదా గాంచుచున్నది.

భోగింపబడు పదార్థ జాలముల ఉనికి (లేక) అనుభవమునకు కూడా అజ్ఞానమే కారణం.

నాయనా! రాఘవా! 'సర్వాత్మకము' అని ఎలుగెత్తి చాటబడుచున్న 'స్వాత్మదర్శనము' అనునదే అన్ని దోషములకు ఔషధమైయున్నది. ఆత్మవంతము కానిదేదీ అనుభవసిద్ధమై ప్రాప్తింపజాలదు. ఏదేదైతే ఆత్మకు వేరుగా స్వీకరించబడుచున్నదో... అదంతా మరొక సమయంలో త్యజించబడబోవుచున్నదని గ్రహించు. "ఆత్మీయముకానిది, పరకీయముకానిది" అంటూ ఎక్కడా ఏదీ లేదు. ఎప్పుడైతే 'స్వాత్మదర్శనము' ఏర్పడుచున్నదో అప్పటికప్పుడు అంతాకూడా అన్ని వేళలందు సర్వరూపమగు 'ఆత్మ' యే అయి వెలుగొందుచున్నది. ఇదే సత్యము, పరమార్థస్థితి కూడా.

మట్టితో తయారుచేసిన అనేక నామరూపములుగల వస్తువులు ఒకచోట ఉన్నాయనుకో.... వాటినన్నిటినీ జలంలో వేసినప్పుడు ఏకమే అవుతాయికదా! ఈ దృశ్య ప్రపంచము, ఇందలి సర్వజీవులు, ఈ దృశ్యజ్ఞానము... ఇదంతా కూడా ఆత్మజ్ఞానప్రభావంచేత "బ్రహ్మైక్యరూపము" నే పొందుతాయి. అందుచేత నీవు బ్రహ్మైక్యదృష్టినే రూఢిపరచుకో.

❖❖❖

17. బ్రహ్మానుభవం పొందేదెట్లా?

శ్రీరాముడు : హే మహర్షీ! "సర్వము బ్రహ్మ సత్తయే" అని మీరు మీ వాక్యములచే ప్రతిపాదిస్తున్నారు. "మనస్సు నశిస్తే సుఖ-దుఃఖములన్నీ నశిస్తాయి" అని కూడా మీరు సెలవిచ్చారు. అతి చంచలమైన 'చపలవృత్తి' కలిగియున్న ఈ మనస్సుకూడా 'బ్రహ్మసత్త' యే నంటారా? అది ఎట్లా?

మనస్సు శమిస్తే ఆత్మానుభవం శేషిస్తుందని అన్నారు. మనస్సు నశించేదెట్లాగో మరికొంత విశ్లేషణతో వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రఘురామా! నీకు మనోనాశనమునకు ఉపాయం చెపుతాను. విను. నేను చెప్పబోవుచున్న ఉపాయం గ్రహిస్తే ఈ బాహ్యోన్ముఖములు అగుచున్న ఇంద్రియవృత్తులేవీ ఉండజాలనట్టి 'శుద్ధబ్రహ్మము' నందు నీవు నీ మనస్సును జేర్చగలుగుతావు.

ఈ బ్రహ్మాండమున సాత్విక - రాజస - తామస భేదములచే మూడు విధములగు జీవులు బ్రహ్మదేవుని వలన సృష్టించబడుచున్నారు. ఈ గుణముల గురించి కొంత చెప్పియున్నాను. మరికొంత ముందు ముందు మనం చర్చించుకోబోతున్నాం కూడా!

జలమునందు తరంగము లేచునట్లు, సమష్టి ఉపాధిరూపమగు మనస్సు 'మననము' రూపమున ఆత్మయందు అనిర్వచనీయచమత్కారంగా ప్రకటితమౌతోంది. అట్టి ప్రథమ మనన స్వభావమే 'సమష్టి రూపము', 'హిరణ్యగర్భము' 'చతుర్ముఖ బ్రహ్మ' మొదలైన నామరూపములచే దర్శించ బడుతోంది, అర్చించబడుతోంది.

అట్టి 'సృష్ట్యాది' యందలి మనస్సే "నేను చతుర్ముఖుడగు బ్రహ్మను అగుదునుగాక! సమష్టి సృష్టిని దర్శించెదనుగాక" అని సంకల్పిస్తోంది. అనగా, స్వతహాగా చైతన్యమే స్వరూపముగా గల ఈ జీవుడు "హిరణ్యగర్భుడు, లేక, సమష్టి సృష్టిని సంకల్పించువాడు"... అని పిలువబడు స్వభావమును ఆశ్రయించి, సృష్టివ్యవహారమునకు నాంది పలుకుచున్నాడు.

చైతన్యమే ఇట్లు క్రియాశీలకమగుచున్నది, అట్టి క్రియాశీలత్వమే 'మనస్సు'.

మనో-బుద్ధి-చిత్త-అహంకార స్వరూపుడు, సమష్టి మనన స్వరూపుడు అగు ఈ జీవుడు సత్యసంకల్పుడు. అనగా, అతడు తాను ఏది సత్యమని భావించి సంకల్పిస్తాడో, అదే సత్యమై పరిఢవిల్లుతుంది. అందుచేత, జీవుడే ఈ సమస్తలోకములను కల్పన ఒనర్చుచున్నాడు. అతడు తన "సమష్టి మనస్సు" నందు ఈ జనన-మరణములతో కూడిన సంసారమును కల్పించుకొనుచున్నాడు. ఇదంతా సుఖదుఃఖరూపమై, సంస్మరణశీలమై ప్రాప్తిస్తున్నది అతని యొక్క కల్పనా ప్రభావంచేతనే.


సత్ (Existence Absolute) = విష్ణుత్వము (The State of "I exist")

చిత్ (Knowledge Absolute) = బ్రహ్మత్వము (The State of 'I experience')

అతడు "సహస్రకల్పముల పరిమితి" కలిగిన దినములతో గూడిన తన ఆయువునందు

ఆయాప్రదేశములకు అనుకూలమైనట్టి దేవ – అసుర – మనుష్యాది వివిధ జీవులను సృష్టించుచున్నాడు. అట్లు చాలాకాలం ఉండి, ఆ తరువాత తనయొక్క మూలకారణమగు విష్ణుభగవానునియందు లీనమగుచున్నాడు. మంచు బిందువు సూర్యతేజమునందు లీనమగుచున్నట్లు ఇది జరుగుచున్నది. మరల సృష్టికాలమున విష్ణుభగవానుని నాభికమలము నుండి అభివ్యక్తము అగుచున్నాడు. అప్పుడు మరల 'పూర్వకాలపు – సృష్టి సంకల్పము' ఉదయించగా, ఆ సమష్టి – మనస్సుచే సృష్టి ఒనర్చుటకు ఇచ్ఛగించుచున్నాడు. అనగా సత్ నందు చిత్ ప్రకటితమగుచున్నది.

అప్పుడు మరల చతుర్ముఖ రూపము ధరించి ఈ జగ్రద్రచన కొనసాగించుచున్నాడు. కల్పాంతమున మరల లయం అగుచున్నాడు. అనేకసార్లు ఇట్లు సృష్టి కల్పన ఒనర్చుచు, ఒకానొకప్పుడు తన అధికార సమాప్తికాగానే, ద్విపదార్థాంతమున (రెండవ పదార్థము అనుభావనయే త్యజించబడినప్పుడు) పూర్ణముగా శాంతిని పొందుచున్నాడు.



(ఈ చతుర్ముఖమే జాగ్రత్–స్వప్న–సుషుప్తి–తురీయములుగా కూడా చెప్పబడింది.)

ఈ విధంగా ఈ బ్రహ్మాండమునందు, తదితర బ్రహ్మాండములందు అనేక జగత్తులు ఉత్పన్నములై ఉన్నాయి. ఇప్పుడూ ఉత్పన్నం అవుచున్నాయి. ఇంకనూ ముందుముందు అంతర్గతమైయున్న ఒక్కొక్క పరమాణువు నందు ఇంకా ఎన్నో అసంఖ్యాకములగు జగత్తులు ఉన్నాయి. ఇట్టి విశేషణములు గల పరమాత్మయందు నెలకొనియున్న సమష్టి మనస్సునందు ఈ వ్యష్టి జీవుడు స్థితి కలిగియున్నాడు.

ఈ వ్యష్టి జీవుడు ఏ విధంగా స్థితి కలిగి ఉంటున్నాడు? ఎట్లు ముక్తుడౌతున్నాడు?... ఈ విషయమై వేదప్రవచనమేమిటో చెప్పుచున్నాను. విను.

ప్రళయకాలంలో, ఉపాధులన్నీ నశిస్తున్నాయి. జీవులందరు అవ్యాకృత్యము (Unmanifested state) నందు లీనమై, అప్పుడు మౌనము – అనుభవాతీతము సంస్కారమాత్రులై శేషించుచున్నారు. అట్లు శేషించియున్న మనఃశ్శక్తినుండి మరల సృష్టి ప్రారంభమగుచున్నది. అప్పుడు :

– అవ్యాకృత్యము నుండి శబ్దతన్మాత్రకమగు ఆకాశశక్తి ప్రకటితమగుచున్నది.

– ఆకాశశక్తి నుండి శక్త్యాత్మకమగు వాయుశక్తి ప్రస్ఫుటమౌతోంది.

అందలి వాయుత్వమును అనుసరించి కించిత్ చలనయోగ్యమగు రూపమున 'మనస్సు' ను పొంది 'దృఢసంకల్పత్వము' అనుదానిని కలిగి ఉంటోంది. అట్టి మనస్సు తనకు ఎదురుగా ఉన్న రూప–రస–గంధాత్మకమగు 'తన్మాత్ర' యొక్క అనుభవము (The experience) పొందుచున్నది. ఉత్పత్తి క్రమముచే అదియే 'అపంచీకృత 'భూతము– అని అంటున్నారు. ఎందుకంటే మననమే స్వరూపముగాగల ఈ 'మనస్సు' అనబడేది శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములకు స్పందన కలిగి ఉంటున్నప్పటికీ, అది ఆ పంచతన్మాత్రలకు అతీతమై, వాటికి కారణమై కూడా ఉంటోంది.

ఆ అపంచీకృతమే అంతఃకరణదశ (మనస్సు–బుద్ధి–చిత్తము–అహంకారము...అనగా... మననము – నిర్ణయము – ఇష్టము – భేదము) పొందుచున్నది. అట్లు క్రమంగా వృద్ధి చెందుచూ, ఆ తరువాత, అది 'పంచీకృత స్థూల పంచభూత ప్రకృతి' అయిన ఆకాశ – వాయు – అగ్ని – జల – పృథివి రూపములను కల్పన ఒనర్చుచున్నది.

వ్యష్టిత్వము – అట్టి కల్పన కలిగియున్న మనస్సు మంచు – వర్షముల ద్వారా ఔషధులందు ప్రవేశించి అన్న రూపమును పొందుచున్నది. అప్పుడా అన్నము పురుషులచే భక్షించబడినదై, వీర్యరూపమున స్త్రీ గర్భంలో ప్రవేశించి క్రమంగా 'పిండత్వము' ను పొందుచున్నది. అట్లు గర్భము నుండి జనించిన ఆ శిశువు పెరుగుచు, అనుభవములనుండి అవగాహన, అవగాహనలనుండి అనుభవము పెంపొందించుకొనుచున్నాడు. అతని 'అవగాహన'ను ఆశ్రయించియున్న ఆశ – అర్తి – భ్రమ లను అనుసరించి ఒకదానివెనుక మరొకటి అనేక ఉపాధులు వచ్చిపోతున్నాయి. ఎప్పటి కప్పుడు, ఆ జీవుడు 'ఇదిమాత్రమే నేను, ఇంతమాత్రమే అంతా'... అను పరిమితభావనచే, తన స్వరూపమును తానే, నిబంధించుకొనుచున్నాడు.

శ్రీరాముడు : మహాత్మా! ఈ జీవునకు అనేక సుఖ – దుఃఖములు, జన్మ – మృత్యువులు వస్తున్నాయి, పోతున్నాయి. ఇతనికి 'దుఃఖనివృత్తి' గానవచ్చుట లేదు. దీనికి అంతెక్కడ?

శ్రీ వసిష్ఠ మహర్షి : నివృత్తి ఎందుకు లేదు? తప్పక ఉన్నది. అట్లు జన్మలు పొందుచున్న ఈ జీవుడు, అతని అధిక సుకృతముల (Good deeds) బలంచేత ఒకానొకప్పుడు కర్మ–జ్ఞానములకు తగినవాడగుచున్నాడు. ఉత్తమ కర్మ–జ్ఞానములను ఆశ్రయించుటకు తగియున్న ఉపాధులలో ఈ మానవజన్మ ఎంతో కష్టించి పొందినందుకుగాను, బాల్యమునుండే వివేకాన్ని పెంపొందించుకోవాలి. "సత్యము–అసత్యము, నిత్యము–అనిత్యము, దేహము–దేహి" మొదలైన ద్వంద్వములను విభాగంచేసి పరిశీలించాలి. తత్త్వవేత్తలగు గురువులను ఆశ్రయించాలి. అట్లు ఆశ్రయిస్తూ ఉండగా ఆ జీవుని యందు కూడా నీలాగానే క్రమంగా "సాధనచతుష్టయసంపత్తి" అను చమత్కృతి ఉదయిస్తుంది. అట్టి సాధనములచే క్రమంగా పరిశుద్ధచిత్తుడగుచు, అతడు "ఈ సంసారము అనర్థభూతమైనదే కదా! దీనిని జయించాలి, త్యజించాలి" ... అని గ్రహించి మోక్షమునకు అర్హుడై ఉంటున్నాడు. ఆపై విచారణ– వైరాగ్యాదులచే "నాకు జన్మ – మృత్యువులు గాని, దృశ్యాదులుగాని లేవు. పరమోత్కృష్టమైన ప్రజ్ఞాతత్వమునే నేను" అను జన్మరాహిత్యరూపమగు అవగాహనకు చేరుచున్నాడు. "పరిశుద్ధమూ,

సర్వమునకు అంతర్యామీ, కారణ – కారణమూ, సర్వమూ అయిన ఆత్మనే నేను" అనే జ్ఞానం దృఢ పడిన తరువాత అతడు బ్రహ్మానందమయుడు అగుచున్నాడు. ఇక అప్పుడు "నేను ఒక కీటకమును అగుదునుగాక! మానవునిగా అగుదునుగాక! దేవతను అగుదునుగాక!" అని భావించుట జరుగదు.

ఈ జీవునియందు ఎట్టి భావన సుస్థిరమై ఉంటుందో, అట్టి భావన యొక్క ఆసక్తి లేక ఆపేక్షలకు అనుగుణంగా ఈ జీవుడు సర్వదా అట్లే అగుచున్నాడు.

కనుక రామా! బ్రహ్మరూపానుభవం పొందాలంటే సర్వభేదములు త్యజించాలి. "సర్వమునకు అధిష్ఠానమై, ఏమియు కాకయే ఉన్నట్టి బ్రహ్మమే నా వాస్తవ స్వరూపం; అదే సర్వదా నా స్వభావం కూడా" అని మననం చేయాలి. అట్లు ఎందుకు మననం చేయరాదో చెప్పు? అట్టి మనన ప్రభావంచే ఇతడు బ్రహ్మముగానే శేషించుచు, ఈ సర్వమును బ్రహ్మముగానే దర్శించుచున్నాడు.

సత్వగుణమును ఆశ్రయిస్తున్న వివేకి ఉత్తమ జన్మలందు స్థితి పొందుచు, క్రమంగా 'మోక్షము' అను శ్రేయమును పొందుచున్నాడు. జ్ఞానముచే చిత్తము ప్రకాశించినప్పుడే సత్వగుణ సమన్వితమైన సంస్కారం రూపుదిద్దుకొంటుంది.

ఓ రాఘవా! నీయందు అత్యుత్తమ జ్ఞానం వికసించాలనే ఉద్దేశంతో ఇప్పుడు నీకు ఈ క్రింది విషయాలు వివరిస్తాను.

1) సప్త అజ్ఞాన – భూమికలు

2) సప్త జ్ఞాన – భూమికలు

❖❖❖

18. సప్త "అజ్ఞాన" భూమికలు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! అజ్ఞాన భూమికలు ఏడు, జ్ఞాన భూమికలు ఏడు ఉన్నాయి. ఇంకా వీటిలో అవాంతర భేదములు (Sub - divisions) ఎన్నో ఉన్నాయి.

శ్రీరాముడు : మహర్షీ! అసలు ఈ అజ్ఞాన భూమికాస్థితికి కారణం ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి :

I. అసాధారణ హేతువులు (From Unity towards Diversity) – అజ్ఞాన భూమికలు* :

1) స్వాభావికమైన ప్రవృత్తి (tendency) రూపమగు పురుష ప్రయత్నము.

2) విషయభోగములపట్ల ఏర్పడుచున్న దృఢమైన ఆసక్తి

ఇవి బ్రహ్మసత్తకు అధీనమైయున్న "ఆత్మత్త్వం" అను అఖండానుభవం నుండి దూరం చేస్తున్నాయి.

ప్రయోజనం : సంసారము, దుఃఖము

---

* భూమిక = వేషము. నటుడు వేరు, వేషము వేరు అయినట్లే... ఆత్మ వేరు, భూమికలు వేరు. (స్వప్న ద్రష్ట వేరు – స్వప్నాంతర్గత విశేషాలు వేరు ..... అయినట్లుగా),

II. సాధారణ హేతువులు (From Diversity towards Unity)

–శాస్త్రోచితమైన సాధనములు.

ఇవి ఆత్మ లాభ ప్రాప్తి కలుగజేస్తున్నాయి. అందుచేత 'జ్ఞానభూమికలు' అని పిలువబడుచున్నాయి.

ప్రయోజనం : దుఃఖ విముక్తి రూపమగు నిరతిశయానంద ప్రాప్తి.

అధోలోకములు – (అసాధారణ మార్గం–అజ్ఞానభూమికలు) : అతలము, వితలము, సుతలము, రసాతలము, మహాతలము, తలాతలము, పాతాళము.

ఊర్ధ్వలోకములు – (సాధారణ మార్గం–జ్ఞానభూమికలు) : భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, సత్యలోకము.

ఊర్ధ్వలోకములు ఏడు – ఒకదానికంటే మరొకటి అధికమైన జ్ఞానముతో నిండి ఉంటున్నాయి. అధోలోకములలో – ఒకదానికంటే మరొకటి అధికమైన అజ్ఞానావరణంచేత దుఃఖప్రదములుగా ఉంటున్నాయి. 'ఈ పదునాలుగు జ్ఞాన – అజ్ఞాన భూమికలు కూడా' జీవునియొక్క జ్ఞానమును, ప్రయత్నములను అనుసరించియే ఉంటున్నాయి.

ఇక, శుద్ధమగు ఆత్మస్వరూపమునందు స్థితి కలిగియుండుటయే "ముక్తి" అను శబ్దముచే చెప్పబడుతోంది. "అట్టి స్వస్వరూప స్థితి నుండి తొలగుట... తొలగి బాహ్య ప్రవృత్తి కలిగి యుండుట... బాహ్యప్రవృత్తి వలన రక్తమాంసనిర్మితమైన ఈ దేహాదులందు అహంభావము కలిగియుండుట."

ఇదియే అజ్ఞానము. అజ్ఞానమే అన్ని దుఃఖములకు "హేతువు" అగుచున్నది.

సంక్షిప్తంగా చెప్పాలంటే :

జ్ఞానము = "నా యొక్క స్వరూపం ఆత్మయే" అను ఎరుక వైపుగా ప్రయాణించే స్థితి గతులు.


అజ్ఞానము = "నేను ఈ భౌతిక శరీరమును" అను ఆత్మయొక్క స్వయంచమత్కారం అనే ఏమరుపు వైపుగా ప్రయాణించే స్థితి గతులు.

ఈ జీవుడు ఏమాత్రం రాగ – ద్వేషములు పొందక, సద్వస్తువగు శుద్ధ – జ్ఞాన స్వరూపము నుండి చలింపకయే ఉన్నాడనుకో.... ఇక అతడు అజ్ఞాని అవటం ఎన్నటికీ సంభవించదు.

స్వస్వరూపమునుండి మరలి విషయములందు మగ్నము అగుటయే 'అజ్ఞానము'. దీనికి మించిన అజ్ఞానమంటూ వేరే ఎక్కడా లేనే లేదు, ఉండబోదు.

స్వస్వరూపస్థితి : ఒక ముఖ్యమైన విషయం చెప్పుచున్నాను. శ్రద్ధగా విను.

ఈ చిత్తము ఒక పదార్థమును ఆశ్రయిస్తూ, మరల ఇంతలోనే మరొక "పదార్థము" లేక "విషయము" వైపు ప్రసరిస్తూ అంతకుముందు విషయాన్ని (లేక పదార్థం) త్యజిస్తూ ఉంటుంది కదా! ఇట్లా అది నిరంతరం ఒక విషయమును వదలి మరొక విషయమువైపు వెళ్ళుచునే ఉంటోంది. అయితే, అట్లు త్యజించబడుచున్న – స్వీకరించబడుచున్న విషయముల మధ్య మననరహితమగు స్థితి ఉన్నది.



పూర్వ విషయము విడిచిన తరువాత, మరియొక విషయము చింతించబడకముందు, ఆ రెండింటి మధ్య సర్వదా ఏర్పడియున్న శుద్ధ చైతన్యము యొక్క స్థితే "స్వస్వరూపస్థితి" అని చెప్ప బడుతోంది. అది అకళంకస్థితి, సర్వ సంకల్పరహితమైన స్థితి, సర్వము కానిది, నిద్ర – జడత్వ రహితమైనది కూడా. అది శిలవలె అచంచలము అయిన చైతన్యస్థితి.

ఈ దేహాదులందు 'అహం' భావము నశించినప్పుడు భేదజ్ఞానమంతా సమసిపోతుంది. అప్పుడు చైతన్యరూపమున ప్రకాశించుచున్నదే ఆత్మయొక్క స్వరూపము. అట్టి భేదవ్యవహార రహితమగు శుద్ధ చైతన్యమే నేను, నీవు, మనందరిలోని ప్రతి ఒక్కరూ కూడా! అయితే, ఈ జీవుడు విషయ రహిత స్థితిని త్యజించి వేరు వేరు జ్ఞాన–అజ్ఞాన భూమికలందు ప్రవేశించటం జరుగుతోంది.

అజ్ఞాన భూమికలు –

సాక్షి చైతన్యమునందు అనాది కాలము నుండి అధ్యస్తమై యున్న అజ్ఞాన భూమికలు ఏడుగా చెప్పబడుచున్నాయి. ఇవన్నీ పరస్పరం మిళితమై అనేక విధములుగా ఉన్నాయి.

1) బీజ జాగ్రత్తు – ఇది జాగ్రత్ అవస్థకు ప్రారంభబీజం. సృష్ట్యాదియందు – అనగా జాగ్రత్తుకు ప్రప్రథమారంభంగా ... 'ప్రాణధారణ' అను క్రియారూపమున చిత్తుయే ఆభాసరూపంగా– ఏర్పడుతోంది. అదియే చిత్తము యొక్క ఆవిర్భావం. నీటిలో ప్రప్రథమ కెరటంలాగా ఏర్పడుచున్న చిత్తముయొక్క ప్రప్రథమ చైతన్య స్ఫురణను 'బీజజాగ్రత్తు' అని అంటున్నారు. చిత్త ప్రప్రథమస్ఫురణయే 'జీవుడు', 'బుద్ధి' మొదలైన సంజ్ఞలచే చెప్పబడుతోంది. ఇద్దానిని "సుషుప్తి అంతరించినప్పటి, జాగ్రత్ అవస్థయొక్క ప్రప్రథమస్ఫురణారంభం"... తో పోల్చుకొని అర్థం చేసుకోవచ్చు.

2) జాగ్రత్ స్థితి – ఇది బీజజాగ్రత్ కంటే కొంత సుస్పష్టమైనది, విలక్షణమైనది. ఈ దశలో, "ఈ స్థూలదేహమునకు సంబంధించినవాడనే నేను! ఈ భోగ్యపదార్థములు నావి' అను రూపముగల ఒకానొక ప్రతీతి ఏర్పడుచున్నది. ఈ స్థితియందు, "ఇతఃపూర్వం గురించిన భావన" మరుగునపడుతూ ఉంటుంది. "ఈ దేహమే నేను, దేహసంబంధమున గృహ ధనాదులు నావి" అను రూపముగల అనేక జన్మపరంపరల దృఢసంస్కారంచేత జాగ్రత్‌దశలో క్రమక్రమంగా అనేక సంస్కార సమూహాలు ప్రవృద్ధమౌతున్నాయి.

3) మహాజాగ్రత్ – 'జాగ్రత్‌స్థితి' అనగా దృశ్యవస్తుజాలమునకు – ద్రష్టకుగల సంబంధమే! ఇక మహాజాగ్రత్ ద్రష్టకు – సంస్కారములకు సంబంధించినది. అనేక జన్మసంస్కారములచే – మహాభ్రమరూపంగా 'మహాజాగ్రత్' అనుభవమౌతోంది.

4) జాగ్రత్‌స్వప్నము – అదృఢమైన అభ్యాసం చేత ఈ జాగ్రత్‌ద్రష్ట తన జాగ్రత్‌లో మనోరాజ్యము (Realm of thought) వీక్షిస్తూ ఉంటాడు. అట్టి మనఃకల్పితమైన దానిని వాస్తవ బుద్ధితో చూడటం, అనుభవించటం 'జాగ్రత్ స్వప్నం' అని అంటున్నారు. లవణమహారాజు ఒక గంటసేపటిలో అరువది సంవత్సరముల జాగ్రత్ స్వప్నం (జాగ్రత్‌లో జాగ్రత్ స్వప్నం) అనుభవించటం మనం చూచాముకదా!

కంటి దోషం చేత రెండవ చంద్రుని చూడటం.... ముత్యపు చిప్పలో వెండి ఉన్నట్లు చూడటం.... మృగతృష్ణలో స్వచ్ఛమైన నీరు, కెరటములు చూడటం..... ఇవన్నీ జాగ్రత్ – స్వప్నములోని రకరకాల స్థితులతో పోల్చదగినవిగా చెపుతూ ఉంటారు. స్వప్నంలో అనేక విధములుగా ఉన్న అభ్యాసం చేత క్రమంగా జాగ్రత్ దశ పొందుతుంది. కనుక దీనిని "జాగ్రత్–స్వప్నం" అని అంటున్నాం.

5) స్వప్నము – స్వప్నంలో ఇతఃపూర్వం అనుభవించిన, చూచిన లేక ఊహించిన పదార్థాలు ప్రాప్తిస్తూ ఉంటాయి. దీనియొక్క బీజము స్వయంకల్పనయే. ఇక్కడ మనస్సు తనకు ప్రీతి అయిన ఊహయందు నివసించుటకు ఉద్యుక్తమౌతూ ఉంటుంది. స్వప్నం జాగ్రత్ స్థితి దృష్ట్యా "స్వల్పకాలం"గా అనిపిస్తూనే, అప్పటికి అత్యంత సత్యమైన దానివలె పొందబడినట్లు ఈ జీవుడు భావిస్తూ ఉంటాడు. ఈ స్వప్నము యొక్క అనుభవము 'మహాజాగ్రత్ స్థితి' యందున్న ఈ జీవుని యొక్క స్థూలశరీరంలోని కంఠభాగము – హృదయభాగముల మధ్య వ్యాపించియున్న నాడీప్రదేశంలో ఏర్పడుచున్నది.

6) స్వప్న జాగ్రత్తు – ఇది 'చిరకాలపు జాగ్రత్ భావం' చేత ఏర్పడుతుంది. దృఢమైన 'అభిమానము' చేతగాని, చిరకాలము ఒకేరీతిగా భావావేశము, కల్పన కలిగియుండుట చేతగాని జాగ్రత్ రూపంగా వృద్ధిపొందుతుంటుంది. జీవునిపట్ల ఇది మహచ్ఛరీరయుతమై ఉంటోంది. 'మహాజాగ్రత్' పొందిన స్వప్నమే 'స్వప్నజాగ్రత్తు'గా ప్రాప్తిస్తోంది.

హరిశ్చంద్రుడు ఒక్క రాత్రిలో పండ్రెండు సంవత్సరముల అనుభవం పొందటం ఈ స్వప్నజాగ్రత్ స్థితికి సంబంధించినదే.

స్వప్న జాగ్రత్ స్థితి ఈ దేహము ఉన్నప్పుడు, నశించినప్పుడు కూడా సంభవిస్తూ ఉండగలదు.

7) సుషుప్తి – స్వప్నజాగ్రత్తు పొందిన ఈ జీవునియొక్క స్థితి కొంత కాలానికి పూర్ణజడస్థితి పొందటం జరుగుతోంది. అప్పటిస్థితిలో ఈ జీవుడు తనకు సంభవిస్తున్న దుఃఖాదులకు ఉపశమన క్రియలను ఏమాత్రం ఆశ్రయించలేడు. (He becomes absolutely and deeply un-responsive). వాసనలు దట్టమై, తద్వారా ప్రాప్తిస్తున్న జడస్థితినే 'సుషుప్తి' అని అంటున్నాం.

ఓ రామచంద్రా! ఈ ఏడు భూమికలు అనేక రూపములు వహించి ఉంటున్నాయి. ప్రతి భూమిక అనంతశాఖలుగా విస్తరించి ఉంటున్నది.

చిరకాలము రూఢిపడియుండిన 'జాగ్రత్-స్వప్నము' చివరకు జాగ్రత్‌నందే 'పరిసమాప్తి' పొందుతోంది. ఆహాఁ! నానా ప్రకారములైన పదార్థములతో కూడిన ఈ జాగ్రత్ స్వప్నము విశాలరూపమును ధరించి ఉంటోంది. జాగ్రత్‌నందు స్వప్నమునందు కూడా 'మహాజాగ్రత్తు' యొక్క అసంఖ్యాకములైన అనుభవములు స్థితి పొంది ఉంటున్నాయి.

ఈ 'సంసారము' అనబడునది కూడా దీర్ఘకాలపర్యంతము స్వప్న - జాగ్రత్ రూపముననే ఉంటోంది. ఈ జీవులు ఒకరికి మరొకరు వారి యొక్క స్వప్నజాగ్రత్‌నందు స్వప్న జాగ్రత్ రూపముననే ఉంటున్నారు.

అనేక విధములైన అవాంతర భేదములచే "నింద్యములు (despicable)"... అయి ఉంటున్న ఈ సప్త అజ్ఞాన భూమికల గురించి విన్నావు కదా! అయితే జీవుడు ఈ అజ్ఞాన భూమికలన్నీ తప్పకుండా దాటివేయగలడు. ఉత్తమ విచారణ చేత, జ్ఞానముచేత నిర్మలమగు ఆత్మ స్వరూపమును సాక్షాత్కరించుకోవటమే అందుకు ఉపాయం. ఆత్మజ్ఞానరూపమగు స్వస్వరూపస్థితిని ఆశ్రయించినవారు ఈ ఆజ్ఞాన భూమికలను సులభంగా దాటివేస్తున్నారు. నెట్టివేసినవారై ఉంటున్నారు.

❖❖❖

19. సప్త "జ్ఞాన" భూమికలు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! ఇప్పుడు నీకు సప్తజ్ఞానభూమికల గురించి చెపుతాను విను. ఇది వింటే ఇక నీవు 'అజ్ఞానం' అనే బురదలో పడవు. ఆయా ప్రబోధకులు, ప్రవక్తలు ఈ జ్ఞాన భూమికలనే అనేక రకములుగా తమ ప్రవచనములలో నిక్షిప్తం చేస్తూ చెప్పుచున్నారు. అయితే 'ఇది సునిశ్చయమే' అని అనిపించినట్టి వేదాంత సిద్ధాంతమును అనుసరించి వివరిస్తున్నాను.

ఈ జ్ఞాన భూమికలలో ప్రవేశించుటయే జీవుడు అజ్ఞానమునుండి నివర్తించగలడు. సహజము, అఖండము అయిన స్వాత్మాకారవృత్తియందు ఆరూఢమై ధరించగలడు. అందుకే ఈ భూమికలకు ఈ పేరు వచ్చింది.

ఈ సప్త భూమికలే జ్ఞానము. వాటికి పరమైన ముక్తియే జ్ఞేయము.

సత్స్వరూపమగు పరమాత్మ గురించిన జ్ఞానము - మోక్షము.... ఈ రెండు పర్యాయపదములే కాని, వేరువేరు కాదు. ఎవడైతే అట్టి సత్యవస్తుజ్ఞానమును పొందుతాడో, అట్టివాడు ఈ సంసారమున మరల జన్మించడు. ఈ చెప్పబోవు సప్త భూమికల చివర 'ముక్తి' అనబడేది అవస్థితమై ఉన్నది. దానిని పొందినవాడు ఇక ఎప్పటికీ సాంసారిక దుఃఖాలను పొందడు. ఈ జ్ఞాన భూమికల గురించి విను.

1) శుభేచ్ఛ : 'స్వకీయ వాసనలు' కారణంగా అనేక అజ్ఞాన అనుభవములను పొందుచున్న ఈ జీవుడు ఒకానొకప్పుడు కాకతాళీయ న్యాయంచే వైరాగ్యపూర్వకమైన సత్సంకల్పము (Detachment from falsehood and inquiry into the nature of Truth) పొందుచున్నాడు. అంతే కాక, "ఒక మూఢునిలాగా ఉండిపోతున్నానేమిటి? ఇంతకీ శాస్త్రములు ఏమి ప్రకటిస్తున్నాయి?- వాటిని

పరికిస్తాను. సజ్జనులగు మహాత్ములను సమీపిస్తాను. వారి అభిప్రాయాలు సేకరిస్తారు. అప్పుడు ఉత్తమమైనదేదో చక్కగా నిర్ణయించుకొని, అట్టిదానినే మననం చేస్తాను"... అనే నిర్ణయానికి వస్తున్నాడు. అట్టి భావమునకు (లేక నిర్ణయమునకు) రావటమే 'శుభేచ్ఛ' అని అంటున్నాం.

2) విచారణ : ఈ జీవుని "శుభేచ్ఛ" యొక్క ప్రయోజనంగా శాస్త్రములతోటి, సజ్జనులతోటి సంపర్కము ఏర్పడుతోంది. ఒక నూతన ప్రవృత్తి అతనియందు ఏర్పడుతోంది. అప్పుడాతడు "వినుట – మననముచేయుట"... మొదలైన రూపములలో ఉండే ఆయా సదాచారములందు నిమగ్నమగు చున్నాడు. తాను వినుచున్న గురువాక్యములను, శాస్త్రవిషయములను మననపూర్వకంగా పరిశీలిస్తూ "విచారణభూమిక" (Sphere of Enquiry) లో పరిఢవిల్లుచున్నాడు. క్రమంగా తన వాస్తవ స్వరూప మేమిటో, తదితరుల వాస్తవ స్వరూపమేమిటో పరిశీలించటం ప్రారంభిస్తున్నాడు.

3) తనుమానస : శుభేచ్ఛ – విచారణ ప్రభావంచేత ఈ జీవునకు క్రమంగా ఈ శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములందు 'అనాసక్తి – తనుమానస (Non-attachment)' ప్రారంభం అవుతోంది. క్రమంగా ఇది చెదరనిది, భంగపడనిది అగుచున్నది. ఈ అనాసక్తి నిధిధ్యాసలు బల పడేందుకు సహకరిస్తున్నందుచేత దీనిని 'తనుమానస' అని పిలుస్తున్నారు. "దృశ్యము పట్ల ఏర్పడుచున్న అనాసక్తి – ఆత్మజ్ఞాన – అనుభవముల విషయములై ఏర్పడుచున్న ఆసక్తి" ఈ రెండూ నాణెము యొక్క రెండు వైపులు వలె, తనుమానస యొక్క స్వరూపములు.

4) సత్త్వాపత్తి : ఇట్లు "శుభేచ్ఛ – విచారణ – తనుమానస"లను అభ్యసింస్తూ రాగా, అట్టివాని చిత్తము బాహ్యవిషయములనుండి వెనుకకు మరలుచున్నది. కొంత విరామము లేక విశ్రాంతి స్థానము పొందుట జరుగుతోంది. అట్టి విరతియొక్క స్థైర్యము పొందుచున్నప్పుడు ఆ ద్రష్ట లేక జీవుడు ఇంకొక నూతన దృష్టిని పొందుచున్నాడు. ఆ నూతన దృష్టికి ఈ మాయగాని, దీని కార్యరూపమైనట్టి జాగ్రత్–స్వప్న–సుషుప్తి అవస్థలుగాని 'లేనివే' అగుచున్నాయి. అప్పుడాతడు సర్వమునకు అధిష్ఠానమైయున్న ఆత్మయందు స్థితి కలిగి ఉంటున్నాడు. అతడు సత్త్వమగు ఆత్మయందు స్థితి కలిగియుంటాడు కాబట్టి, దీనిని 'సత్త్వాపత్తి' అని పిలుస్తున్నారు. ఇది నిర్వికల్పసమాధి యొక్క బీజం. ఈ భూమికయందు ఉండే వివేకిని బ్రహ్మవిత్తు' అని పిలుస్తారు.

5) అసంసక్తి : పై నాలుగు భూమికలు అభ్యసిస్తూ రాగా, అప్పుడాతడు ఈ బాహ్య – అభ్యంతర విషయముల (Outer as well as inner aspects) చేతగాని, వాటియందు అంతర్గతమై యుండే సంస్కారములచేతగాని స్పృశించబడడు. 'అసంగము' అను రూపము గల సమాధి అతని యందు పరిపాకమౌతూ ఉంటుంది. అతడు నిరతిశయానందమగు బ్రహ్మాత్మభావన కలిగి ఉంటాడు. 'ఆత్మసాక్షాత్కారము' యొక్క సామీప్యత అనుభవిస్తూ ఉంటాడు. ఇట్టి జ్ఞానిని "బ్రహ్మవిద్వరుడు" అని అంటారు.

6) పదార్థాభావని : ఈ భూమికలో ఉన్నవానిని 'బ్రహ్మవిద్వరీయుడు' అని కూడా అంటారు. ఈ జీవుడు 'శుభేచ్ఛ విచారణ, తనుమానస, సత్త్వాపత్తి, అసంసక్తి' అను ఐదు భూమికలు బాగా అభ్యసిస్తూ ఉండగా అతనియందు 'ఉపరతి' (withdraw) అనే ప్రక్రియాబలం ఏర్పడుచున్నది.

అతడు సదా ఆత్మారాముడై ఉంటాడు. ఇక బాహ్య అభ్యంతరములందు దేనిని భావించవలసిన అవసరం అతనికి కనబడదు. బాహ్య అభ్యంతరములన్నీ ఆత్మయొక్క సంప్రదర్శనంగా దర్శిస్తూ ఉంటాడు. కేవలం దేహయాత్ర కొరకు మాత్రం ఇతరుల బలవంతముచే కొంత ప్రబోధితుడై ఆయా విషయములవైపు కొద్దిగా దృష్టిని మరలిస్తూ ఉంటాడు. అతని అంతరంగము మాత్రం పదార్థరహితం, విషయరహితంగానే ఉంటుంది. ఈ భూమికలో పదార్థములు అభావించబడతాయి. కనుక దీనికి 'పదార్థాభావని' అనే పేరు వచ్చింది. పదార్థముల విషయమై అతనికి ఏమాత్రం రాగయుక్తమైన భావన ఉండదు. "పదార్థములన్నీ ఆత్మయొక్క భావనా చమత్కారమే".... అనురూపంగా గమనిస్తూ ఉంటాడు.

7) తుర్యగ : ఆరవ భూమిక అయినట్టి 'పదార్థ – అభావన' చే భేదభావన అంతా 'కించిత్' కూడా లేకుండా సమసిపోతుంది. ఇతడు కేవలం 'స్వస్వరూపానుభవము' నందు మాత్రమే స్థితికలిగి ఉంటాడు. ఈ జాగ్రత్ మొదలైన అవస్థల నుండి విముక్తుడై కేవలము, శివము, అద్వైతము అగు తురీయస్థితియందు నిలకడచెంది ఉంటాడు. తానే అంతటా అయిఉంటాడు. అంతటా – అన్నీ తానుగా ఆస్వాదిస్తాడు.

ఇతనిని 'బ్రహ్మవిద్వరిష్టుడు' అని కూడా అంటారు. ఈ తురీయస్థితి జీవన్ముక్తులకు మాత్రమే సిద్ధిస్తుంది. ఈ ఏడవ భూమిక పొందిన మహనీయులే ఆత్మారాములు. అట్టివారు బ్రహ్మరూపమగు స్థితి – నిరతిలను ప్రాప్తించుకొనినట్లే.

ఇక విదేహ ముక్తికి సంబంధించినదగు 'తురీయస్థితి' దీనికి పరమై ఉంటుంది.

సామాన్య జనుల మనస్సు  సుఖభావన / సమభావన / దుఃఖభావన

తుర్యగుల మనస్సు ———————— సమభావన

జీవన్ముక్తులగు ఈ 'తుర్యగులు' అని చెప్పబడుచున్న మహాత్ములు సుఖ దుఃఖములచే చలింపక సర్వదా సమస్థితియందే ఉండి ఉంటారు. సామాన్యజనుల మానసికస్థితి ఉద్వేగ–ఉదాశీనములతో, ఉత్సాహ–నిరుత్సాహములతో, హర్ష–వేదనలతో అల్పాధికములతో ఉండగా, తుర్యగుల మనస్సు ఒకానొక సమస్థితి అవధరించి ఉంటోంది.

తుర్యగులు, కేవలం దేహ రక్షణ కొరకు మాత్రమే స్వల్పంగా వ్యవహారాసక్తి కలిగియుంటారు. 'తాము శరీరము ధరించియుండుటను కూడా 'నదీజలప్రవాహం' లాగా ప్రకృతి చమత్కారంగా యజ్ఞభావనతో దర్శిస్తూ ఉంటారు. లేదా, వ్యవహారాసక్తిని పూర్తిగా త్యజించి అయినా ఉంటారు.

ఇతరుల ప్రోద్బలంచేత మాత్రమే శరీరరక్షణ ధర్మములు, వర్ణాశ్రమ ధర్మములు నిర్వర్తిస్తూ ఉండవచ్చు. ఏది ఏమైతేనేం? గాఢనిద్రలో ఉన్నవాడిని అందమైన స్త్రీ సౌందర్యం లాలించగలదా? సదా ఆత్మారాములై ఉండే జీవన్ముక్తులకు ఈ ప్రపంచములోని ఆయా విశేషములు సుఖమునుగాని, దుఃఖమునుగాని కలిగించలేవు.

ఇట్టి జ్ఞానదశను పొందినవారు మానవ-పశు-మ్లేచ్ఛాది ఉపాధులు కలిగి ఉండవచ్చు. లేదా దేహరహితులై ఉండవచ్చు. వారు ఎప్పటికీ 'ముక్తులు' గానే ఉంటారు. విషయములు అప్రభావికంగా, అసత్యములుగా తోచుటయే ఈ 'భూమిక' యొక్క గుర్తు. నిజమేమిటో తెలుసుకొన్న తరువాత మృగతృష్ణలోని నీరు, ముత్యపు చిప్పలోని వెండి ఆకర్షించగలవా? జ్ఞానము పొందినవాని విషయంలో కూడా ఈ దృశ్యము అట్టిదే. ఈ సంసారవస్తు సముదాయమంతా మిథ్యారూపంగానే అతనికి గోచరిస్తుంది. విదేహస్థితికి శుకుడు మొదలైనవారు, సదేహముక్తస్థితికి ప్రహ్లాదుడు మొదలైనవారు మనకు ఈ అభిప్రాయంలో దృష్టాంతములు.

రెండవ భూమిక నుండి నాల్గవ భూమిక వరకు జ్ఞానోదయము కలిగి ఉండవచ్చు. అజ్ఞానము శమిస్తూ ఉండవచ్చు. కాని ప్రబల ప్రారబ్ధ విశేషము చేత నిరతిశయమగు పూర్ణానందము మాత్రం వారు పొంది ఉండరు.

శ్రీరాముడు : మహర్షీ! ఒక జీవుడు ఈ జన్మ - కర్మల దోషమేమిటో గ్రహించినవాడై శుభేచ్ఛను ఇప్పుడే ఆశ్రయించాడనుకోండి. అతడు తుర్యగస్థితి పొందుట ఎప్పటికి సాధ్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మస్థితి లేక ఆత్మానుభవము అనేది హృదయము యొక్క నిర్మలత్వము - దోషరాహిత్యములను అనుసరించే ఉంటుంది. కొందరు మహాత్ములు ఈ భూమికలన్నీ ఒక జన్మలో పొందగలిగి ఉంటున్నారు. మరికొందరు రెండవ భూమికకుగాని, మూడవ భూమికకుగాని రాగలిగి ఉంటారు. ఇంకొందరు ఆరవభూమికలోగాని, మరే ఇతర భూమికలో నాలుగవవంతు, మూడవవంతు, ఒకటవవంతు పొంది అట్లే సంచరిస్తున్నవారు కూడా ఉన్నారు. మహాత్ములగు సనకుడు, సనందుడు వంటివారు మొదటి జన్మలోనే 'తుర్యగ' స్థితిని అవధరించటం జరిగింది. ఈ విధంగా ఆయా భూమికలకు కాలమానంగాని, కాలయాపనగాని ఆపాదించటం కుదరదు.

❖

చూచావా! వివేకులైనవారు ఈ భూమికలయందు సంచరించుచున్నారు. వారంతా విశాలమగు 'ఆత్మస్థితి' ని కలిగి ఉండటం జరుగుతోంది.

ఈ బాహ్య-అభ్యంతర ఇంద్రియములు..... ఈ ఇంద్రియములందు అంతర్గతమై ఉంటున్న విషయములు.... వీటికి ఆధారభూతమైన ఈ శరీరము..... ఈ శరీరమునకు సంబంధించిన ఆదిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక తాపములు.....

వీటన్నిటివలన ఏర్పడుచున్న అల్పత్వమును నివారించటానికి వారు ఆత్మనిష్ఠ యందు నిమగ్నమై ఉంటున్నారు.

ఓ రఘురామా! వాస్తవానికి ఈ భౌతికమైన రాజ్యాలు ఏలే రాజులు ఉత్తమ దృష్టిలో నిజమైన రాజులు కారు. ఎవరైతే ఈ భూమికలను పొంది 'మనస్సు' అనే శత్రువును నిగ్రహిస్తారో, వారే నిజమైన నృపతులు. "ఆత్మజ్ఞానప్రాప్తి' తో పోల్చినప్పుడు ఈ శత్రు పరాజయాలు, సప్తద్వీప సామ్రాజ్యాలు తృణప్రాయమే అవుతాయని గ్రహించు.

ఈ ఏడు భూమికలు పొందిన మహాత్ములు ముక్తస్వరూపులు. వారు మాకుకూడా నిరంతరం వందనీయులు. వారు తమ 'ఇంద్రియములు' అనే శత్రువులనే జయించి వేస్తున్నారు. అనుక్షణికంగా ఆత్మసామ్రాజ్యాధినేతలై వెలుగొందుచున్నారు..... వారికి 'బ్రహ్మపదవి' కూడా స్వల్పమైనదే.

దేవతల ఆనందం గొప్పదైన విషయమే. కాని, అంతకంటే పరమావధి బ్రహ్మదేవుని ఆనందం. అట్టి బ్రహ్మదేవుని పదవికంటే కూడా పరమైయున్న కైవల్యానందమును ముక్తస్వరూపులు ఇప్పుడే ఇక్కడే పొందుచున్నారు.

ఓ జనులారా! అట్టి కైవల్యానందము లక్ష్యముగా కలిగి, ధర్మనిరతులై ఉండటము శ్రేయోదాయకమని గ్రహించెదరుగాక!

❖❖❖

20. బంగారంలో ఉంగరం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రఘువంశతిలకమా! రామచంద్రా! ఒక చమత్కారమైన విషయం చెపుతాను, విను. ఒక స్వచ్ఛమైన బంగారపు ఉంగరం ఉన్నది. అది 'అంగుళీయబుద్ధి' కలిగియున్నదై తనయొక్క ఆకారరాహిత్యమును సహజమైన రంగును మరచి "అయ్యో! నేను సర్వము కోల్పోయి, ఈ ఉంగరాకారమునకు పరిమితమైనాను! ఈ ఆకారత్వము తొలగేదెట్లా? నేను 'నిరాకారమగు బంగారం' గా ప్రభవించేది ఎన్నటికి?" అని నిష్కారణంగా రోదిస్తుంటే ఎట్లా ఉంటుంది? ఈ జీవుడు కూడా అజ్ఞానజనితమైన అహంకారముచే తన 'యథార్థము, సహజము' అయిన ఆత్మస్వరూపమును మరచి నిష్కారణంగా రోదించుచున్నాడు. తన స్వస్థత కొరకు ఈ దృశ్య వ్యవహారములో ప్రవేశించి అనేక జన్మలుగా ఎక్కడెక్కడో వెతకుచున్నాను.

శ్రీరాముడు : మహాత్మా! బంగారము నందు 'నేను ఉంగరమును' అనే బుద్ధిలాగా, ఆత్మ యందు ఈ అహంభావబుద్ధి ఎందుకు, ఎప్పుడు, ఎట్లా కలిగింది? ఈ విషయం యథారీతిగా చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఏదైనా పదార్థం ఉండి ఉంటే, "ఓహో! ఇది ఇప్పుడు ఇట్లా ఇక్కడి నుండి వచ్చింది అను సమాచారమునకు చోటు ఉంటుందేమో! అసత్తైన పదార్థమునకు ఒకప్పుడు రాక ఏమిటి? మరొకప్పుడు పోకడ ఏమిటి? బంగారము నందు అంగుళీయత్వము గాని, ఆత్మ యందు అహంకారము గాని ఏ కాలమందు కూడా లేవు.

నీ మిత్రుడెవడైనా నీతో "రామా! పది గురివింద గింజల బరువుగల బంగారపు ఉంగరం పట్టుకురా!" అని అన్నాడనుకో....అప్పుడు నీవు అతని కొరకు విక్రయదారుని వద్ద డబ్బు ఇచ్చి

పుచ్చుకునేదేది? ఉంగరమైతే అది బంగారము కన్నా వేరు కాదు కదా? అక్కడ "బంగారం సత్యము, ఉంగరం అనేది ఆకారమాత్రం అయి ఉన్నట్లే ఈ జీవుడు పరబ్రహ్మమే కాని మరింకేమీ కాదు."

శ్రీరాముడు : అట్లా అయితే స్వామీ? "ఇది బంగారం, ఇది ఉంగరం, ఇది జీవుడు, ఇది పరబ్రహ్మం" అని అనటందేనికి? ఈ 'బంగారము' 'బంగారపుటుంగరము'ల అర్థమేమిటో మరికొంత వివరించి చెప్పండి. దీని అర్థనిర్ణయం వలన నేను బ్రహ్మరూపమును మరింత బాగా, సునిశ్చయంగా ఎరుగగలను.

శ్రీ వసిష్ఠ మహర్షి : అసత్ పదార్థమునకు రూపం ఏమి ఉంటుంది? లేని దాని ఉత్పత్తిని నిర్వచించటం ఎట్లా? అది "గొడ్రాలి రెండవ కుమారుడు – మూడవ కుమార్తెల మధ్యగల తగాదా ఎందుకు వచ్చింది?" అనునది పరిశీలించటం వంటిదే.

'సువర్ణము' నందు 'అంగుళీయత్వము' అనేది కల్పన మాత్రమే. మిథ్యారూపమగు భ్రాంతి వంటిదే. 'ఉంగరము' అనబడే వేరైన పదార్థం బంగారమునందుగాని, మరెక్కడాగాని లేనేలేదు. బంగారము బంగారముగానే ఉండిఉండగా, ఒక ఆకారమునకు 'అయ్యా! 'ఇది ఉంగరం' అని నిర్ణయించుకున్నాం. తదితర ఆకారములకు 'ఇది గొలుసు. ఇది గాజు. ఇది వడ్డాణం' ... ఈ విధంగా పేర్లు పెట్టుకున్నాం. అన్నిటిలోను ఉన్నది సర్వదా బంగారమే. "బంగారము ఆ ఆకారమును పొందినది ఎప్పుడు?" అన్నప్రశ్నకు "బంగారము మరొక ఆకారమును ఏనాడూ అవధరించలేదు. బంగారము మరింకేదీ కాకుండానే ఆకారాదుల దృష్టిచేత ఆయాపేర్లకు తగుచున్నది" అని మనం అనక తప్పదు.

ఈ జగత్తు యొక్క కల్పన చేస్తున్న 'మాయ' కూడా మిథ్యయే. ఇది అసత్స్వరూపము మాత్రమే. విచారణా దృష్టిచే దీనికి రూపమే ఉండజాలదు. దీని స్వరూపవ్యవహారమంతా అంతవరకే. శుద్ధాత్మ మరింకేదీ ఏనాడూ పొందుటలేదు. ఏమియు కోల్పోవుట లేదు. కాని "ఆరోపితదృష్టి" (Attributive look) కారణంగా ఈ 'జగత్తు' అనబడేది కనబడటం జరుగుతోంది. ఇక్కడ కనిపించే అనేకత్వమంతా 'మృగతృష్ణ' లోని చిన్నతరంగం–పెద్ద తరంగం వంటిది మాత్రమే. ఈ దృశ్యమంతా యథాతథంగా బ్రహ్మమే! బ్రహ్మమునకు వేరుగా అనిపించేదంతా ఇది మెల్లకన్నువానికి కనబడే 'రెండవ చంద్రుడు' వంటిది. అంటే, విచారణ చేసి చూచామా, ఇందు ఏమీ ఉండజాలదని మా ఉద్దేశం.

ముత్యపు చిప్పలోని వెండి ఎప్పుడు వచ్చింది? ఎప్పుడు ఎలా పోతుంది? అసలు ముత్యపుచిప్పలో వెండి ఎక్కడున్నదయ్యా బాబు? అది చూచేవాని భ్రమసహిత దృష్టియే కారణముగా కలిగి ఉన్నది కదా? తత్త్వవిచారము యొక్క అభావకారణంగా 'మాయ' చే కనిపించటం జరుగుచున్న ఈ జగత్తు, ఇందులోని "నేను–నీవు–అతడు–దృశ్యము" మొదలైనదంతా అట్టిదేనని గ్రహించు.

శ్రీ రాముడు : తండ్రీ! ఇవన్నీ మాకు ఉన్నట్లే ఉంటున్నాయి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఏ విషయమైతే, లేక, పదార్థమైతే – యథార్థానికి లేదో, కాని, ఉన్నట్లు కనిపిస్తోందో... అది లేనట్లు తెలిసేది ఎట్లా?

"తత్త్వ విచారణ చేతనే! 'తత్-త్వమ్' అను శబ్దార్ధమును నిరంతరం అభ్యసించుటచేతనే!

విచారణ లేకపోవుట చేతనే "ఇది నేను. ఇది నాది, ఇది జగత్తు' అనునట్టి రూపము (లేక) అనుభవము ఈ జీవునకు స్ఫురిస్తోంది. ఒక దృష్టాంతము చెపుతాను విను.

'ఒక బాలుడున్నాడు. అతడు అతి పిరికివాడు. బలహీనుడు. ఆ పిల్లవాడి తల్లి ఒకనాడు "ఒరేయ్! బైటకు వెళ్ళకు. అక్కడ దయ్యాలున్నాయి" అని చెప్పి వంటఇంటిలోకిపోయింది. ఆ బాలుడు 'నిజమా? ఈ కిటికీలోంచి దయ్యం కనబడుతుందేమో చూద్దాం" అని అనుకున్నాడు. ఒక బల్లపై ఎక్కి బయటకు చూస్తున్నాడు. ఆ కిటికీ దగ్గరలో గల పెద్ద చెట్టు గాలియొక్క ఆకస్మికవేగానికి అటు-ఇటు కదలి పెద్దగా శబ్దం చేసింది. "అయ్యబాబోయ్! దయ్యం!" అని పెద్దగా కేక వేసి నేలమీద పడ్డాడు.

ఈ దృష్టాంతంలో ఏ విధంగా అయితే 'దయ్యము' అనబడేది సిద్ధిస్తోందో అట్లాగే అసత్తే అయినట్టి ఈ జగత్ పదార్థములు స్థిరరూపము, కార్యవంతము కాగలుగుచున్నాయి. ఇసుకలో నూనె ఉంటుందా? సువర్ణంలో సువర్ణమే ఉంటుందిగాని ఆభరణం ఎక్కడ ఏ స్థానంలో ఉంటుంది? చైతన్యములో చైతన్యమే ఉంటుంది? ఇక 'నీవు - నేను' అనబడునవి ఎక్కడివి చెప్పు?

మరి అవి ఎందుకున్నాయంటావా?

ఈ నీవు - నేను అను వాటియొక్క వాస్తవ స్వరూపము విచారించకపోవుటచేతనే.

ఒక ఉత్తమ రహస్యం చెప్పుచున్నాను. ఉద్వేగరహితుడవై విను.

ఈ ప్రపంచంలో సత్యవస్తువు యొక్క, మిథ్యావస్తువులయొక్కగాని 'అర్థక్రియాసామర్థ్యము' నకు ఒక నియమమంటూ ఏదీ లేదు. కాని, అధిష్ఠానమగు 'సత్త' యందు ఏది ఎట్లు ఆరోపించబడుచున్నదో అది అర్థక్రియాపూర్వకంగా అట్లే అగుచున్నది. బాలుడు తన మనస్సులో కల్పించుకొనిన దయ్యమును ఎదురుగా చీకట్లో చూచుటలేదా? మహచ్ఛక్తియుతమైనట్టి "యద్భావం - తద్భవతి" అనునట్టి ఈ 'అవిద్య' యే 'మాయ' లేక 'సంసారము'. అనాత్మ విషయములకు నిజానికి సత్తుగాని, ప్రతిష్ఠగాని లేదు. అట్టి అనాత్మయందు "నేను - నాది" అను భావము ఈ జీవునకు కలుగుతోంది! ఎందుచేత? లేనిది ఉన్నట్లుగా కనిపించుటయే 'మాయ' అనే శబ్దంచే చెప్పబడుతోంది. స్వచ్ఛము, నిర్మలము, శాంతము అగు ఆత్మయందు 'అహంకారము' అనబడేది ఉండజాలదు. ఆత్మకానిదంటూ ఎక్కడా, ఏదీ లేదు. అద్దానియందు 'అసత్తు' అంగీకరించినప్పుడే 'నేను - నీవు' అను భ్రమలు ఏర్పడుచున్నాయి. లేని అహంకారమును తొలగించుకోవాలనే ప్రసక్తి ఎక్కడిది? లేనిదానిని లేనిదానిగా చూడటం అభ్యాసం చేస్తూ ఉంటే సరిపోతుంది కదా!

❖❖❖

21. బ్రహ్మమే ఇదంతా

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! 'సనాతనత్వము - బ్రహ్మత్వము - బ్రహ్మాండము - ప్రజాపతిత్వము" ... ఇవన్నీ యథార్థానికి లేవు. అట్లాగే "వేరే లోకములు, స్వర్గాదులు, అమరత్వము, మనస్సు, సత్త్వము, దేహములు, మహాభూతములు, కారణత్వము, త్రిలోకత్వము, వస్తుగతము, భావ-అభావములు, నేను-నాది-నీవు, సత్-అసత్తులు, భేద కల్పనలు, రాగము, ఆసక్తి' ... ఇవన్నీ పరమార్థదృష్టితో చూస్తే లేనేలేవు. ఈ వ్యవహారమంతా నీ దృష్టిలో ఉత్తమోత్తమమగు 'ఆత్మస్థితి - ఆత్మభావన' పొందటానికి ముందు మాత్రమే గాని, ఆ తరువాత కాదు. వాస్తవానికి ఈ జగత్తంతటి యొక్క పారమార్థికస్వరూపము బ్రహ్మమే అయి ఉన్నది.

అట్టి బ్రహ్మము శాంతము, సర్వమునకు అధిష్ఠానము, అభాసవర్జితము (that in which nothing can reflect), నామరహితము, కారణవర్జితము అయి ఉన్నది. దానికి 'ఆది-మధ్యము -అంతము' అనునవి లేవు. ఉత్పత్తి వినాశనము మొదలైన వికారములు కూడా లేవు. అది వాక్కునకు గాని, మనస్సునకు గాని 'విషయము' అయ్యేది కాదు. ఏదీ అవకుండానే అంతయూ తానే అయి ఉంటున్నది. ఒకతను "తండ్రి-తాత-కొడుకు-మనుమడు-స్నేహితుడు" అనబడునవన్నీ, ... తాను మాత్రం ఏకించిత్ మార్పు పొందకుండానే.... "తానే" అయి ఉంటున్నాడు కదా!

ఈ సత్స్వరూపమగు ఆత్మ ఆకాశము కంటే కూడా అతిసూక్ష్మమైనది. సుఖములన్నిటికంటే కూడా ఉత్తమోత్తమ సుఖప్రదమైనది.

శ్రీరాముడు : మహాత్మా! అంతటా సమరూపమై వ్యాపించియున్న బ్రహ్మమును నేనిప్పుడు ఎరుగు చున్నాను. నామ రూపములతో కూడిన ఈ జగత్తుకు 'హేతువు' అజ్ఞానము అనేది నిర్వివాదాంశమే. అయితే, అట్టి ఈ జగత్తు జ్ఞానముచే శమించి కూడా, మరల ఏర్పడియే ఉంటోంది కదా? ఎందుచేత? పరబ్రహ్మము తన యందు ఈ జగత్తులను ఎందుకు పొందుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! రామా! పరబ్రహ్మము సర్వదా తన రూపముననే ఉండి ఉంటోంది. అది స్వస్థానమునుండి ఏమాత్రం, ఏ సమయమందునూ "చ్యుతి" (deviation) పొందుటయే లేదు. కాబట్టి, "సృష్టి" అని, "జగత్తు" అని నీవు దేనిని అంటున్నావో, అది ఆ బ్రహ్మమునకు వేరుగా ఏ సమయమందునూ లేదు. బ్రహ్మమే ఈ కనబడే సర్వముయొక్క స్వరూపము. మహాసముద్రం యొక్క రూపమేమిటి? జలమే కదా! "మహాసముద్రంలో జలము ఉన్నది" అని కూడా ప్రయోగించ బడుతోంది! ఈ సృష్టి కూడా అట్లాగే పరమాత్మయందు ఉన్నది.

కాని - సముద్రజలం ద్రవశీలం కనుక చంచలం. పరమాత్మయో, చలనరహితం. ఆ రెండిటి భేదం అంతే. పరమాత్మయే సృష్టిరూపంగా సందర్శించబడుచున్నారు. అయితే, ఎక్కడైతే ఏ విధమైన మార్పు-చేర్పులు, లేవో; అక్కడ "సుఖ-దుఃఖములు, ప్రాప్త - అప్రాప్తములు" .... మొ॥ ద్వంద్వములు ఆరోపించబడి, ఆ అనుభూతి అంగీకరించబడుతోంది. ఎంత చమత్కారం!

❖

పరమాత్మ సూర్యునివలె ప్రకాశించువాడు కాదు. ఈ సూర్యాదుల ప్రకాశము భౌతిక స్వభావము మాత్రమే కదా! నిష్క్రియుడు, స్వయంజ్యోతి స్వరూపుడు అగు పరమాత్మకు ఈ భౌతికవికారములను ఎట్లా ఆపాదించగలం?

తటాకంలో "ఇది తూర్పువైపు జలము. ఇది పడమరవైపు జలం", అని అన్నట్లుగా పరబ్రహ్మమున వివిధరూపములు గల ఈ జగత్తు స్ఫురిస్తోంది. అందుచేత సర్వదా, అంతాకూడా పరబ్రహ్మమే. దృఢమైన జ్ఞానం లేనివానికి మాత్రం ఈ జగత్తు పరమాత్మ కంటే భిన్నమైనదానిగాను, విషయ రూపంగాను కనిపిస్తోంది. అందుచేత అతనియందు "ఇది సృష్టి" అనే జ్ఞానం ఉండియే ఉంటోంది. కాని, జ్ఞాన పరిపక్వ స్థితియందు ఇదే సృష్టి "అంతా నిత్య సత్యమైయున్న పరబ్రహ్మమే" అని అనుభూతమౌతోంది.

ఓ మహాప్రజ్ఞానస్వరూపా! ప్రియ రామచంద్రా! అజ్ఞానికి నానావిధములుగా కనబడుచున్న ఈ జగత్తు యథార్థానికి ఏ కాలమందును లేకయే ఉన్నది. ఆకాశంలో ఎక్కడన్నా మరొక ఆకాశం ఉంటుందా? పరమార్థ వస్తువునందు, ఆ పరమార్థమునకు అన్యమైనదేదీ ఉండజాలదు. కనుక ఈ సృష్టి కూడా పరబ్రహ్మము యొక్క 'సంజ్ఞ' యేనని తేలుచున్నది.

"చిత్తమే పరమాత్మను సృష్టిరూపంగా గాంచుచున్నది". ఈ సృష్టిని ఇట్లు గావించుచున్నది చిత్తమే అని సత్యాన్వేషనానంతరం మునిజనులమగు మేము గ్రహించాము. ఈ చిత్తము బ్రహ్మము నందు పూర్ణముగా లయించినప్పుడు ఈ భ్రమపూర్వకమైన సృష్టి దర్శనమంతా తనంతటతానే లయిస్తుంది. అనగా చిత్తము లయిస్తే ఇదంతా పరబ్రహ్మస్వరూపమే అవుతుంది. చిత్తము ఉదయించి నప్పుడు మాత్రమే 'అసత్తు' అగు ఈ నామరూపాత్మక జగత్తు 'సత్త' ను పొందటం జరుగుతోంది.

అనేకసార్లు చెప్పాను. మరల చెప్పుచున్నాను, విను. ఈ సృష్టి అంతా 'అభిమానముతో కూడిన చిత్తము" కాక మరింకేమీ కాదు. చిత్తము ఉపశమించినచోట ఇదంతా 'జడము'గా కాకుండా పరబ్రహ్మముగానే అనుభవం కాగలదు.

ఒక శిల్పి ఎంతో చాతుర్యంతో మట్టితో "యుద్ధదృశ్యము"ను తయారు చేశాడనుకో.... మట్టిబొమ్మలతో కూడిన ఈ దృశ్యమునందు "ఇతడు రాజు, ఇతడు సైనికుడు, ఇతడు శత్రురాజు, ఇవి గుఱ్ఱములు, ఇవి ఆయుధములతో కూడిన బండి".... ఇట్టి దృష్టి ఒక చూచువాడు (A spectator) కలిగియుండవచ్చు. అయితే, అందలి అన్ని ఆకారములలో ఉన్నది మట్టియే కదా! రాజు బొమ్మకు, మంత్రి బొమ్మకు భేదము కల్పిత మాత్రమే కదా! జ్ఞానికి కూడా, ఈ దృశ్యమునందు ధృవీకరించబడియున్న 'నేను – నీవు – అతడు' అనబడునవన్నీ బ్రహ్మ చైతన్యముగానే గోచరిస్తున్నాయి. జ్ఞాని వ్యవహారసరళి కొరకు ఈ భేదములు (వారు – వీరు అనునదంతా) దృష్టిలో పెట్టుకున్నప్పటికీ, అంతర్లీనంగా 'చైతన్య దృష్టినే' కలిగి ఉంటున్నాడు. అతనికి సర్వే – సర్వత్ర శివాత్మకమే గోచరిస్తోంది. అతనియొక్క పరమార్థ దృష్టిలో ఈ జగత్తు, ఉత్పత్తిరహితము, నాశనరహితము, వికారరహితము. ఇదంతా పరమాత్మ యొక్క వ్యాప్తిచే పూర్ణమైనదై, పరమాత్మయందే వెలుగుచున్నది. కనుక సర్వదా

పూర్ణమే అయి శేషిస్తోంది. ఇక్కడెక్కడా అపూర్ణత్వమనేది లేశమైనాలేదు. ఆకాశమునందు ఆకాశము శాంతముగా ఉండి ఉంటున్నట్లు శివరూపమగు పరమాత్మయందు, శివరూపమగు ఈ జగత్తు వెలయుచున్నది.

"బ్రహ్మమునందే దూరత్వము – సమీపత్వములు కూడా ఉన్నాయి" అని తెలియజేయటానికి విజ్ఞులు ఒక దృష్టాంతము చెపుతారు. ఇక్కడికి కొద్దిమైళ్ళ దూరంలో ఒక నగరం ఉన్నదనుకో.... ఆ నగరం నీ ప్రక్కనే ఉన్న ఒక నిలువుటద్దంలో ప్రతిబింబిస్తోంది.

అద్దం నీ సమీపంలోనే ఉన్నది కనుక 'నగరం' నీకు దగ్గరలో ఉన్నట్లే కదా! కాని వాస్తవనగరం ఎక్కడో కొద్ది మైళ్ళ ఆవల ఉన్నది కదా!

ఇట్లా బ్రహ్మమునందే ఈ దృశ్యముంటూ, 'బ్రహ్మము – దృశ్యము" లకు ఎట్టి సంబంధము లేకుండానే ఉంటోంది. వాస్తవానికి బ్రహ్మమునందు దృశ్యాదులు ఉండజాలవు. అద్దంలో ఎక్కడన్నా భవనాదులు ఉంటాయా? "మరి కనిపిస్తున్నాయి కదా?"...... అని తర్కించేవారికి ఏం చెప్పగలం?

"అసత్తు మాత్రమే" అయినట్టి ఈ జగత్తు అనబడునది అజ్ఞానదృష్టికి మాత్రమే స్థితికలిగి ఉంటోంది. జ్ఞానుల దృష్టికో, ఇదంతా సత్స్వరూపమగు బ్రహ్మమే. "కొయ్యబొమ్మలన్నీ కొయ్యయే. మట్టి బొమ్మల వాస్తవస్వరూపం స్వరూపరహితమగు మట్టియే" అను విధంగా సత్స్వరూపమగు బ్రహ్మమే ఒకానొక భేదదృష్టికి ఇట్లు ప్రాప్తించుచున్నది. ఇదంతా "బ్రహ్మముకంటే వేరైనదికాదు" అనునది సిద్ధించుచుండుటచేతనే "ఈ జగత్తు సద్రూపమే" అనికూడా చెప్పబడుతోంది. భేదదృష్టితో చూస్తే మాత్రం ఇదంతా అవస్తువే కనుక, "అసన్మయమే". ఓ రామా! "అద్దంలో ప్రతిబింబించే నగరం" లాగా నీ చిత్తమునందు ప్రతిబింబించే 'అనేకత్వముతో కూడిన జగత్ చమత్కారం' వాస్తమెట్లా అవుతుందయ్యా? ఇంద్రజాలికుడు మాయాచూర్ణమును గాలిలోకి విసిరి, మిథ్యారూపమైన వస్తువులను చూపిస్తూ ఉంటాడు చూచావా? ఇది కూడా అట్టిదే.

ఈ జగత్తు 'చేతన వస్తువు' నందలి సారము, అసారము కూడా అయిఉన్నది.

అంటే "అధిష్ఠానరూపముగా (As "that concept" which is instrumental for the perception) ... సత్యము, దానికి వ్యతిరేకంగా చూస్తే మిథ్య" అని కూడా చెప్పబడుతోంది. (All this is one's own perception. The perception is a form of one's ownself.)

ఓ మానవులారా! ఒక్కసారి మీమీ చిత్తములను శోధించుకోండి. వాటియందు వాసనారూపమైన అవిద్య పేరుకొనియున్నది. మీరు చూచీ చూడక ఉన్నారా, ఉత్తరోత్తర స్థితిగతులు దుష్ఫలిత పూర్వకంగానే ఉండబోతున్నాయి. అందుచేత "ఆత్మవిచారము" అనే అగ్నిలో 'వాసనలు' అనే కట్టెలను సమూలంగా మసి చేసివేయండి. అప్పుడు నాచే ప్రకటించబడుచున్న సత్యము మీకే బోధపడుతుంది.

అట్లుగాక, ఉదాసీనత వహించి ఉన్నారా, ఈ అవిద్య శాఖోపశాఖలుగా విస్తరించి, సుఖ దుఃఖ రూపములైన అసంఖ్యాక జగత్తులను మీ ముంగిట ఉంచగలదని హెచ్చరిక చేస్తున్నాను. అట్టి 'సుఖ – దుఃఖ రూపములు' అనబడు 'మాయానృత్యశైలి' కి అంతు అంటూ లేదు. నేను చెప్పిన

జ్ఞానభూమికలను చక్కగా విచారించి, ఆపై మీమీ కర్తవ్యములను సముచితంగా నిర్ణయించుకోండి. అంతేకాని, విలువైన ఆయుష్షును స్వల్పవిషయములకొరకు వెచ్చించి, పారవశ్యము పొందకండి.

❖❖❖

22. పునః కథాప్రవేశం ప్రదేశము - పరిశీలన

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆ రోజు ఆ సభలో ఒక గంట సమయంలో దేవదూత ప్రభావంచేత లవణ మహారాజు అరువది సంవత్సరముల జీవితమును చవిచూచాడుకదా! ఆ రాత్రి సభ చాలించి రోజూలాగే అంతఃపురం జేరాడు. చాలాసేపు నిద్రపట్టలేదు.

"ఎంత ఆశ్చర్యం! మహద్దుఃఖం అనుభవించటం, ఆ ప్రదేశాలు, ఆ పరిచయాలు నా జ్ఞప్తిలో అత్యంత స్థూలంగా ఏర్పడి ఉన్నాయే? మరలమరల ఆ అరణ్యములోని విశేషాలే గుర్తుకొస్తున్నాయి! ఇంతకీ వింధ్యపర్వత సమీపంలోని ఆ ప్రదేశం, ఆ అరణ్యం, ఆ గృహాదులు అసలు ఉన్నాయా? లేవా?

నేను దర్శించినది స్వప్నసదృశ్యమా? వాస్తవమా?"

చాలాసేపు ఆలోచించిన తరువాత ఆ రాజు పెదవులపై ఒక చిరునవ్వు వెల్లివిరిసింది.

"దీనికి ఇంత బుఱ్ఱ పగులగొట్టుకొనవలసిన పనేమున్నది? ఉదయమే వెళ్ళి ఆ ప్రదేశమంతా పరిశీలించి వస్తే సరి కదా!" అని అనుకొన్నాడు. తాను విని, యోచించి, అలవర్చుకొనియున్న ఆత్మ జ్ఞానవిషయాల ప్రభావంచేత ఆలోచనలన్నీ కట్టిపెట్టి నిశ్చింతగా నిద్రాదేవత ఒడిలోకి జారుకొన్నాడు.

ఆ మరునాడు ఒక జాతిగుఱ్ఱమును అధిరోహించి, అతడు మహారణ్యంవైపు బయలుదేరాడు. కొందరు మంత్రులు కూడా అతనిని అనుసరించారు. తాను 'స్వప్నజాగ్రత్తు' లో మొట్టమొదట ప్రయాణించిన త్రోవలోనే ముందుకు పోసాగాడు. త్రోవ అంతా ప్రకృతి సంబంధమైన చిన్నచిన్న మార్పులు కలిగి ఉన్నప్పటికీ, ఇతఃపూర్వం చూచిన విధంగానే ఉన్నట్లు అనిపించింది. కుతూహలంగా ప్రయాణిస్తున్న అతనికి కొంతసేపటికి పూర్వం సంచరించియున్న అరణ్యం కనిపించింది. ఇతః పూర్వం జ్ఞాపకంలో పదిలంగా ఉన్న ఆయావృక్షములను పరిశీలిస్తూ ప్రదేశములను సరిచూచుకొంటూ, 'పుష్కరఘోష' అనే గ్రామంలో ప్రవేశించాడు.

ఆశ్చర్యం! తాను ఇంతకుముందు నివసించిన ఆ కుగ్రామంలోని జనులు, గృహములు, వృక్షాదులు యథాతథంగా తనలోని జ్ఞాపకములవలెనే ఉన్నాయి. చాలాకాలంగా సుపరిచయమై యున్న స్త్రీపురుషులను, ప్రదేశములను చూస్తూ ముందుకు అడుగులు వేస్తున్నాడు. ఆకస్మికంగా ఏర్పడిన కరువుకాటకాల వలన ఎండిపోయిన మహావృక్షములను చూచి తలపంకించసాగాడు. అప్పటి తన సహచరులగు అనేకమంది కిరాతకులు తమ మిత్రులను, పుత్రులను, తదితర బంధువులను పోగొట్టుకొనుటచే రోదిస్తూ తారసపడ్డారు. వారందరి సహచర్యం రాజుకు గుర్తు ఉన్నా, వారుమాత్రం రాజును గుర్తించలేదు. ఇట్లా చూచుకొంటూ క్రమంగా, తన అత్తగారి ఇంట్లో ప్రవేశించాడు. అక్కడి తమ పూర్వగృహంలో అతని అత్తగారు, ఇతర వృద్ధస్త్రీలతో కూడి బిగ్గరగా ఏడ్చుచు ఆర్తనాదములు చేయటం గమనించాడు.

అత్తగారు : హాఁ! నా కూతురా! నీవు నీ పిల్లలను లాలిస్తూ మమ్ములను ఎంతగానో ఆనందింప జేస్తూ ఉండేదానివే? పాపం. ఒకసారి మూడురోజులు అన్నం దొరక్కపోతే ఎంతగా విలవిల్లాడావో! ఎంత కృశించావో? ఈ చేతులతో నా కూతురుకు, నా మనుమళ్ళకు ఇంత అన్నం పెట్టలేకపోయాను. నా జన్మ ఎందుకు? కాల్చనా? మా అల్లుడిని మీరంతా ఎరుగుదురు కదా! మొలలో కత్తి పెట్టుకొని ఈ ఊరిలో ఒక రాజులాగా సంచరిస్తూ ఉంటే, ఎవడైనా బైటకు వచ్చేవాడా? అయ్యయ్యో! మీ రంతా నన్ను వదలి ఎక్కడికెళ్ళారట్లా? ఆరి దేవుడో?

ఓ అల్లుడుగారూ! నీవు నిమిషంలో ఎత్తైన తాడిచెట్లు ఎక్కి, అక్కడే తాళఫలములను జుట్టేవాడివి. ఒకవేళ, అంత ఎత్తైన తాడిచెట్టు నుండి క్రింద పడితేమాత్రం 'అబ్బా' అనేవాడివా? లేదు. మళ్ళా సాహసంగా ఇంకొకచెట్టు ఎక్కేవాడిని. మాకు నువ్వు కొడుకుకన్నా ఎక్కువ ప్రియంగా ఉండేవాడివి కదయ్యా! ఏమట్లోయ్! మా అల్లుడు పులులను కూడా ఒంటిచేత్తో ఎదుర్కోగలడు తెలుసా! అయ్యా అల్లుడూ? ఇప్పుడెక్కడున్నావో? ఏం చేస్తున్నావో? ఆ అరుపులు, ఆ పెడబొబ్బలు, ఆ గంతులు, ఆ జంతువుల చర్మం ఒలవటం, ఆ నెత్తురు జుట్టటం ఇవన్నీ మళ్ళా నేను చూడగలనా? అతడు మద్యం త్రాగేటప్పుడు, నా కూతురు నోట్లోంచి మాంసపు ముక్కలను గుంజుకుని తినేవాడు. అప్పటి మా అల్లుడి ముఖం చూస్తుంటే మన్మథుడు ఎందుకూ పనికిరాడు. ఆరి నాయనో! వేగంగా వీచిన గాలి తామరాకును త్రెంచుకుపోతుంది చూచారా? అట్లా ఆ యముడు వచ్చి, నా కూతురుని, అల్లుడిని ఎత్తుకొని పోయాడా? ఓరి యముడో!

గురివిందగింజల మాల ధరించి, విశాలమైన పాలిండ్లతో ఈ ఊళ్లో నా కూతురు తిరుగుతుంటే, అప్పుడందరు ఎంత సంతోషపడేవారు! ఓ నా కూతురా! కాటుక కళ్ళు, నారవస్త్రములు, నల్లని దంతములు గల నువ్వు నన్నొదిలి ఎక్కడికెళ్ళావే? అల్లుడా! నువ్వు ఎక్కడో గొప్ప పట్టణం వదలి మా దగ్గిరకు వచ్చి, మా కూతురుని మనువు ఆడావని అనుకుంటూ ఉండేవాళ్ళం. మీ ఇద్దరిది ఎంతటి ప్రేమ? ఒకరినొకరు వదిలి ఎప్పుడైనా ఉండేవారా? నా చిట్టితల్లిని పెళ్ళిచేసుకొన్న నా అల్లుడు చెయ్యని గొప్ప పనులు ఉన్నాయా? అట్లా, లేడికళ్ళు గల నా కూతురు, సింహము వంటి బలం గల నా అల్లుడు ఇద్దరూ క్షణంలో నశించిపోయారే?

అంతా అయిపోయింది. నా మొగుడు పోయాడు. కూతురు పోయింది. అల్లుడు పోయాడు. ఈ అనాగరక దేశంలో ఇంకా నేను మాత్రం మిగిలి ఉన్నాను. ఈ ఆపదలన్నీ అనుభవించటానికే మిగిలాను కాబోలు! ఇవన్నీ చూచినా, ఇంకా నాకు చావురాలేదేం? ఇంకా నేను బ్రతికేది ఎట్లా? బ్రహ్మదేవుడా! ఈ విధంగా, అనాథనై, ఇక్కడి వాళ్ళచేత – వీళ్ళచేత అవమానించబడటానికి, ఆకలిచే అలమటించటానికి, ఈ జనులకు ఆహారం కావటానికి, ఈ దుఃఖములు అనుభవించటానికి, నన్నుమాత్రం ఇంకా బ్రతికించి ఉంచావా? బంధువులు పోయి, అనేక మానసిక వ్యథలు – ఆపదలు పొందుచున్నట్టి నాకంటే, జీవంలేని ఒకరాయి నయం. స్వజనం లేరు. దుష్టజనం గల ప్రదేశంలో ఉంటున్న నా దుఃఖాలకు అంతు అంటూ ఉన్నదా? నా మొగుడు, నా అల్లుడు, నా

కూతురు చిల్లిగవ్వ కూడా మిగల్చకుండా పోయారు. ఓ స్వజనులారా! మీకేం? హాయిగా వెళ్ళిపోయారు. నా గతి ఏమిటి?

నూరుఏళ్ళు పైబడిన వయసుగల ఆ అత్తగారి రోదనమంతా రాజు విన్నాడు. వాళ్ళను సమీపించాడు. తన మంత్రులతో వాళ్ళకు ధైర్యం కలిగింపజేశాడు. "ఏం అవ్వా! ఇంతగా ఏడుస్తున్నావేమిటి? నీవెవరు? నీ కూతురు, అల్లుడు ఏమయ్యారు! ఈయన మా లవణ చక్రవర్తి. వీరు నీకు ఈ లోటులేకుండా చేస్తారులే. అసలు విషయమేమిటో చెప్పు" అని ఒక మంత్రి పలికాడు.

అప్పుడు కళ్ళనీరు కారుస్తూ ఆ వృద్ధస్త్రీ ఇట్లు చెప్పింది.

వృద్ధస్త్రీ : బాబుగారూ! మాది ఈ 'పుష్కరఘోష' అనే ఊరే. నా మొగుడు 'పుష్కరయ్య' ఇక్కడే పుట్టాడు. మా ఇద్దరికి చందమామవంటి ఒక కూతురు ఉండేది. ఒకసారి దైవయోగం చేత ఇక్కడి అడవికి ఒక కుఱ్ఱవాడు వచ్చాడు. అతడిని, నా కూతురు మనువు ఆడింది. నా అల్లుడు, కూతురు చాలాకాలం చిలకా–గోరింకలలాగా కాపురం చేస్తూ అనేకమంది సంతానం కూడా కన్నారు. హాయిగానే ఎన్నో రోజులు గడిచాయి. ఇట్లా ఉండగా, కొంత కాలానికి మా కర్మ కాలి, ఇక్కడ ఒక పెద్దక్షామం వచ్చింది. వర్షాలు చాలా కాలంవరకు లేకుండా పోయాయి. తిండి, నీరు లేక ఇక్కడివాళ్ళు ఎంతమంది చచ్చారో చెప్పలేము. ఇక బాధలు పడలేక, ఇక్కడివారు ఎంతోమంది ఈ చోటు వదలి ఎటో దూరంగా పిల్లా – జల్లాతోసహా వెళ్ళిపోయారు. అట్లా దూరప్రదేశాలకు వెళ్ళే ప్రయత్నంలో కొందరైతే త్రోవలోనే మరణించారు. దురదృష్టవంతులమగు మేమంతా మా బంధువులను పోగొట్టుకొన్నాం. ఎంతమంది చచ్చిపోయారో, ఎంతమంది ఎక్కడ ఇంకా బ్రతికే ఉన్నారో మాకేం తెలియదు. ఈ మధ్యనే మా ఆయన కూడా పోయాడు. ఇట్లా అందరినీ పోగొట్టుకొని శూన్య హృదయులమయ్యాం. మాకిక ఏడుపు గాక, ఇంకేం మిగిలింది? నెలరోజులక్రితం దేశాలు పట్టి పోయిన నా కూతురు – వాళ్ళు ఏమయ్యారో? ఏమో?

రాజు ఈ మాటలు విని విస్మితుడై సాలోచనగా మంత్రివైపు చూచాడు. ఆ తరువాత, తన పూర్వవృత్తాంత విశేషాలు అనేకం అడిగి తెలుసుకొన్నాడు. ఆ సమాధానాలన్నీ తన క్రితం రాత్రి సభలోని దేవదూతచే కల్పించబడిన అనుభవాలకు సరిగ్గా సరిపోతూనే ఉన్నాయి. అట్లు కొంతసేపు సంభాషించి, ఆ ముసలి స్త్రీని కొంత ధనముతో, పదార్థములతో సంతోషపరచి, మంత్రులతో కూడుకొని వెనుతిరిగినాడు. "ఆహాఁ! ఏమి ఈ దైవగతి?" అని యోచిస్తూనే నగరం చేరాడు.

అత్యంత ఆశ్చర్యచకితుడైన రాజు ఆ మరునాడు సభలో నాతో "హే వసిష్ఠమహర్షీ! స్వప్నతుల్యమైన జగత్తులో ప్రవేశించి నేను అనుభవించినదంతా, ప్రత్యక్షమై ఎట్లా ప్రాప్తిస్తోంది? ఈ విషయం నాకేమీ బోధ పడుటలేదు. దయచేసి, ఇందలి చమత్కారం, తాత్త్వికార్థం నాకు తెలియచేయండి" అని అభ్యర్థించాడు. అప్పుడు నేను అతని ప్రశ్నకు తగిన సమాధానమిచ్చి, అతని సంశయం నివారించాను.

చూచావా రామా? ఈ అవిద్య విశేషమైన 'భ్రమ' ను కలుగ జేయగలదు సుమా! క్షణంలో సత్తును అసత్తుగాను, అసత్తును సత్తుగాను చూపించగలదు.

❖❖❖

23. ఒకని మనస్సులో విశేషాలు - మరొకరి మనస్సులో ప్రతిబింబించటం

శ్రీరాముడు : మునీంద్రా! ఆ లవణ మహారాజు లాగానే నాకుకూడా సందేహం వస్తోంది. స్వప్నంలో చూచినది 'జగత్కాలాంతరతం' ఎట్లా అయినది? భ్రమదాయకములైన మీ వాక్యాలు నేను విశ్వసించ లేకపోతున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : అవిద్యయందు ఇదంతా సంభవమే. స్వప్నంలో కనిపించే కుండ, వస్త్రము, జనులు మొదలైనవి అప్పటికి సత్యమే అయినట్లు కనబడుచున్నాయా, లేదా? అవిద్యయొక్క కల్పనా ప్రభావంచేత, అద్దంలో ప్రతిబింబించే కొండ, దూరంగా ఎక్కడో ఉన్న కొండకూడా దగ్గరగా సమీపమునే ఉన్నట్లు తోస్తోంది. గాఢంగా రెండు – మూడు రోజులు నిద్రించినవానికి, ఆ మూడు రోజులు అత్యంత అల్పంగా ఒక్కక్షణంలాగా తోచుట జరుగుతోంది. ఒకడు, "రాత్రి ఒక కలవచ్చింది. అందులో నేను చచ్చిపోయాను. నా మిత్రులు, బంధువులు నాపైబడి ఏడుస్తున్నారు" అని అన్నాడనుకో. అతడు మరణించటం జరిగితే కల ఎవరికి? అందలి జనులు ఎక్కడివారు? ఈ విధంగా అవిద్యయందు అసంభవము కూడా సంభవము కాగలదు. అత్యంత అసత్యము కూడా సత్యమువలె ప్రాప్తించగలదు.

ఒకడు కొద్దిసేపు తనచుట్టూ తాను తిరిగాడనుకో ... అప్పుడాతనికి ఎదురుగా ఉన్న వస్తువులు స్థిరంగా ఉన్నప్పటికీ గిఱ్ఱున తిరుగుచున్నట్లు కనిపిస్తాయి కదా! కల్లు మత్తుగా సేవించినవానికి ఇళ్ళు, రహదారులు గాలిలో తేలుచున్నట్లు కనిపించుటలేదా? కదలకుండా ఉన్న వస్తువు కూడా అవిద్య కారణంగా కదలుచున్నట్లు ఒకడు పొందుచున్నాడు.

ఈ ప్రపంచంలో అనేక పదార్థములు తారసపడుచున్నాయికదా! "ఇవి సత్యమైనవా? లేక మిథ్యాభూతములేనా?" అనే విషయం ప్రక్కన ఉంచు. ఒక్కటి మాత్రం అందరు ఒప్పుకోక తప్పదు.

ఈ చిత్తం ఏ పదార్థమును ఎట్లు తీవ్రంగా భావిస్తే అది అట్లే సత్వరం అనుభవానికి రాగలదు.

అహంకారముతో కూడిన అవిద్య ఎప్పుడు ఉదయిస్తుందో, మరుక్షణాన ఆదిమధ్యాంతములు లేనట్టి భ్రమయొక్క అనంతత్వముకూడా ఉదయిస్తోంది. వాస్తవానికి పదార్థములన్నిటియొక్క 'పరిణామము – అనుభవము' ప్రతిభాసావశంచేతనే (ప్రతిబింబించు స్వభావముచేతనే) కలుగుతోంది. అట్టి ప్రతిభాసావశం చేత ఒక్కక్షణం కల్పంగా, ఒక కల్పకాలం క్షణంగా అనుభవం కాగలదు. విపరీత బుద్ధి గల ఒకానొక మానవుడు "నేను ఒక కోతిని" అని భావించి, నిజంగానే కోతివలె ప్రవర్తనను ప్రకటిస్తూ ఉంటాడు. అట్లాగే, భావనావశంచేత ఒక మేక కూడా సింహత్వము ప్రకటించ వచ్చు. అంతటికీ కారణం అంతరంగమునందలి వాసనలే.

"అవిద్య – మోహము – అహంభావము" ఈ మూడూ తెలుపుచున్నవి ఒక్క విషయాన్నేకాని, వేరువేరు విషయాలను కాదు. ఇవే చిత్తవైపరీత్యము కలిగించటానికి కారణం అవుచున్నాయి. చిత్తమునందలి వాసనలు కారణంగా ఒకనికి ఒక స్వల్పవిషయం కూడా మహత్కార్యంగాను,

మరొకడికి అదే మహత్కార్యం అత్యంత స్వల్పవిషయంగాను తోచుట జరుగుతోంది. అట్లాగే, ఒకని మనస్సు నందు ఏది తోచినదో, అదే కాకతాళీయ న్యాయంచే మరొకరి మనస్సునందు కూడా తోచు చుండుట జరుగుతోంది. లవణమహారాజు విషయంలో – ఆ దేవదూత ఐంద్రజాలికుడు మనస్సుద్వారా ఒక జరిగిపోయిన సంఘటన "చండాలకన్యా వివాహం" వృత్తాంతమంతా లవణుని మనస్సులో కూడా భాసించేటట్లు చేశాడు. అనగా, అవన్నీ మరొక జీవుని మనస్సుకు ప్రాప్తించిన అనుభవ పరంపరలు మాత్రమే !

శ్రీరాముడు : అదేమిటి? ఒకని మనస్సులోని అనుభవ విశేషాలు మరొకని మనస్సులో ప్రతిబింబించేటట్లు చేయబడగలవా?

శ్రీవసిష్ఠ మహర్షి : మాయలో చమత్కారములకు అడ్డేమున్నది?

జ్ఞప్తిని అనుసరించి భావము ఏర్పడటం – ఒకడు తాను భుజించికూడా, మరొక చోటికి పోయినప్పుడో, లేక స్వప్నములో ప్రవేశించినప్పుడో, "నేను ఈ రోజు ఏమి తినలేదే?" అని మననం చేసి, ఆకలిని అనుభవిస్తాడు. మరల ఎవరో, "నీవు భుజించావుకదా?" అని గుర్తుచేస్తే, "ఓహో ! ఈ విషయం గుర్తులేదు" అని ఆకలిని త్యజిస్తాడు. ఇక్కడ జ్ఞప్తిని అనుసరించి భావన ఉండటం జరుగుతోంది.

భావనను అనుసరించి మనస్సునందు అనుభవం ఏర్పడటం – దృఢంగా ఒక భావపరంపం వైపు దృష్టిసారించి, తదితర విశేషములన్నీ త్యజించటం జరిగినప్పుడు, అట్టి సమయంలో స్వప్నజాగ్రదనుభవం సిద్ధించగలదు. అట్టిసమయంలో "చేసియున్నట్టి – చేసి ఉండనట్టి" క్రియల గురించి కూడా ఆ భావమే అనుభవముగా పరిణమించుచున్నది. దృఢభావన ఉన్నచోట 'అనుభవం' రూపుదిద్దుకొనగలదు. ఒకానొకని ఊహలో – ఆటలలో ఎదుటివారిపై గెలుస్తున్నట్లు భావించటం.... యుద్ధంలో శత్రువును బాధించుచున్నట్లు భావించటం.... ఇవన్నీ పరధ్యాసచే నిజమైన సంగతుల వలె అనుభూతం కాగలవు.

స్మృతిలో లేని క్రియలు నిష్క్రియలు కావటం – అట్లే ఒకడు ఒక మహత్కార్యం చేసికూడా, అది పూర్తిగా మరచుటచే, దాని కర్తృత్వము తనయందు ఏమాత్రం కలిగియుండకపోవచ్చు.

ఇక లవణ మహారాజు విషయంలో – స్వప్నమందలి 'అపూర్వానుభవం' లాగా "వింధ్యపర్వత సమీపమున ఉన్న ఒక గ్రామములో ఇట్టి వ్యవహారము జరుగుచున్నది" అనునది రాజు మనస్సులో ప్రతిభాసించింది. ఆ లవణమహారాజు గాంచిన 'స్వప్నభ్రమ" వంటిదే అక్కడి ఒక చండాలుని చిత్తము నందు స్ఫురించింది. అనగా, లవణునిచే పొందబడిన వృత్తాంతమే అక్కడి వేరొక ఒక జీవుని హృదయము నందు రూఢిపడి ఉన్నది.

శ్రీరాముడు : స్వామీ! ఒక జీవుని హృదయములోని అనుభవం మరొక జీవునియందు స్ఫురించగలదా? లేక ప్రతిబింబించగలదా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఎందుకు కాగూడదు? "సమస్యాపూరణము" మొదలైన సందర్భాలలో అనేకమంది కవులలో ఒకే భావన, ఒకే వచనములు ఒకే రీతిగా ఉండటం జరుగుతూ ఉంటుంది కదా! ఇదికూడా అట్టిదే. అనేకమంది స్వప్నములో కూడా ఒక్కొక్కసారి దేశ-కాల-క్రియలు సమముగానే ఉంటాయి.

శ్రీరాముడు : అంటే ఆ లవణుని యొక్క "నేను చండాలుడనైయున్నాను. ఈమెను వివాహం చేసుకున్నాను. ఇట్లు ఈ అడవిలో ఈ క్రియలు నిర్వర్తిస్తున్నాను. ఈ పిల్లలు నాకు ఇష్టులు. వీరికొరకై ఇవన్నీ చేస్తున్నాను....." అను వ్యవహారమంతా స్వప్నముతో సమానమైనదేనంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అది స్వప్నసదృశమే. కాని ఇక్కడ నీవు మరొక ముఖ్యవిషయం దృష్టిలో పెట్టుకోవాలి. అది ఒక స్వప్నంలో ఏర్పడిన మరొక స్వప్నము. ఎందుకంటే, "నేను లవణుడను. ఈ దేశపురాజును" అనునది మాత్రం స్వప్నసదృశం కాదా? ప్రతి జీవుని యొక్క ఈ వర్తమాన దర్శనావ్యవహారము కూడా, భావించినదానిని అనుసరించే ఉంటోంది. కనుక, "ఇదంతా చైతన్యము యొక్క ప్రతిభాసచే ఏర్పడుచున్నదే" అని సూక్ష్మబుద్ధితో గ్రహించు. సమస్తవిషయములయొక్క పదార్థములయొక్క సత్త – దానికి అధీనమైయున్న (That in which every thing else finds place) 'చైతన్యసత్త' యొక్క స్ఫురణవల్లనే కలుగుతోంది. అట్టి 'అధిష్ఠానము' అయిఉన్న 'చేతన సత్త' యే భూత-భవిష్యత్-వర్తమాన ప్రపంచమున వ్యాప్తమైయున్నది.

అయితే జలములో తరంగములు జలముకంటే విలక్షణమైన (ఆకారములు కలగియుండుట మొదలైన) కొన్ని విశేషములతో ప్రకటితమౌతున్నాయి కదా!

బీజములో నిబిడీకృతమైన వృక్షం బీజం కంటే వేరైన నామరూపములతో ప్రాప్తిస్తోంది కదా!

'బంగారపు ఉంగరం' అను వస్తువు బంగారముకంటే వేరైన దృష్టిచే దర్శించబడుతోంది కదా! అధిష్ఠానమగు "చేతన సత్త" కంటే (ద్రష్ట సత్తకంటే) భాసించుచున్న పదార్థముల సత్త (దృశ్యసత్త) వేరైనది కాదు. కాని, వేరైనట్లు అల్పదృష్టికి ప్రాప్తిస్తోంది.

బంగారములో అంగుళీయకిత్వమన్నదా? లేదు. బంగారమునకు ఉంగరాకారం ఎక్కడున్నది? ఉంగరము బంగారముకన్నా వేరా?.... కాదు. బంగారమునకు వేరుగా అక్కడేదీ లేనేలేదు?

అట్లాగే 'ద్రష్టసత్త' యందు స్ఫురిస్తున్న ఈ దృశ్యసత్తకూడా సత్తు కాదు. అసత్తు కూడా కాదు. ఆ రెండిటికీ విలక్షణమైనది. (నాసదాసీనోసదాసీత్ : ఈ జగత్తు సత్తుగాని, అసత్తుగాని కాదు.)

అందుచేత, "ఈ జగత్తు 'స్థూలదృష్టి' కి 'సత్తు' గాను, పరమార్థదృష్టికి 'అసన్మయము' గాను ఉంటోంది. ఎక్కడన్నా ఇసుకలో నూనె ఉంటుందా? వాస్తవానికి 'అవిద్య' అనబడునది కూడా ఏదీ లేదు. 'ఆభరణం' అనగా బంగారమేగాని, మరింకేముంటుంది?

శ్రీ రాముడు : మహర్షీ! చేతనవస్తువును ఆశ్రయించి ఉంటోంది కనుక అవిద్య కూడా సత్త కలిగియున్నదని అనుకోవచ్చు కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : జడమగు అవిద్యకు, చేతనమగు చైతన్యమునకు సంబంధం ఎట్లా పొసగగలదు చెప్పు? ఎక్కడైనా సమాన వస్తువులకే సంబంధం ఉండటం సహజంగాని, అసమాన వస్తువుల సంబంధం అసహజమే కదా!

శ్రీ రాముడు : ద్రవశీలమగు లక్క, అద్రవశీలమగు కొయ్య ఒకచోట ఒకే వస్తువు నందు అమరిక పొంది ఉంటున్నాయి కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవి రెండు పాంచభౌతిక పదార్థములే! రెండూ అవిద్యయందే అంతర్గతమై ఉంటున్నాయి. కనుక సదృశవస్తువులే అవుతాయి. చైతన్యమో, అనుభవమాత్రం. ఈ జగత్తో, అత్యంత వికారయుక్తమై, ఘనీభూతమై కనిపిస్తోంది.

అనుభవ మాత్రమగు చైతన్యము ఈ 'జగత్తు' యొక్క ఉనికిని అంగీకరించి, అట్టి భావనానంతరం ఇట్లు దృశ్యముగా దర్శిస్తోంది. భావనకు వేరుగా 'జగత్తు' అనబడునది ఎక్కడా ఏ సమయమందు కూడా లేనే లేదు.

సమస్త పదార్థములు చైతన్యమయములే. చైతన్యం వల్లనే, సాదృశ సంబంధం చేత (The relationship that a Perceiver undertakes) అవన్నీ ప్రకాశితములౌచున్నాయి.

ఈ జగత్తులోని పదార్థములన్నీ సత్ + చిత్ మాత్రములే. (Mere combination of Existence and Conscionsness). కనుక 'స్వప్రకాశము' యొక్క బలముచేతనే అవన్నీ ప్రకాశితము అగు చున్నాయి. అంతేగాని, అవి ఎక్కడో ఉన్న మరొక చైతన్యముచే కాదు సుమా! ఒక దీపం ప్రకాశమును ప్రకటించటానికి మరొక దీపం దేనికి?

ఓ రామా! ఒక సిద్ధాంతము చెపుతాను. విను.

1. అసదృశ వస్తువులకు సంబంధం ఎన్నటికీ కలుగదు. ఒకటి ఇంకొక దాని వంటిది అయితేనే "ఆ రెండు సాదృశవస్తువులు" అని అంటాం.
2. పరస్పర సంబంధం లేకపోతే పరస్పర – అనుభవం ఘటిల్లే ప్రసక్తే లేదు..... కనుక
3. సదృశమగు పరమాత్మయందు సదృశమగు ఈ జగత్తు ఉండి ఉన్నది. ఇదంతా పూర్ణంగా ఏకత్వం పొందినదై, అట్టి ఏకత్వబలంతో, తన రూపమును విస్తరించుచున్నది. అంతేగాని, పరమాత్మ స్వరూపముకంటే వేరుగా ఈ జగత్తు లేదు.

ద్రష్ట–దర్శనము–దృశ్యము (Perceiver - perception - object) చేతన–చేత్యము–చేతయిత్వము (Knower - thing being known - knowing) ఈ త్రిపుటీ రూపమంతా అజ్ఞుల దృష్టిలో మాత్రమే ఉదయిస్తోంది. అయితే ఇట్లు ఉదయించేదంతా చిత్ – జడముల అభేద సంబంధం వలననే ఏర్పడుతోంది కాని, కేవలం జడముయొక్క ఉనికి చేతనే అనటం ఏమాత్రం తగదు. ఎందుకంటావా? జడము జడముతో కలిస్తే ఇంకా అధిక జడమే కావాలి కదా!

చిత్ – జడములు పరస్పరం విలక్షణమై ఉన్నాయి. కనుక వాటికి ఐక్యత సంభవించదు. నీవు ఒక పదార్థమును స్పృశిస్తున్నప్పుడు, ఆ అనుభవం పొందుచున్న నీవు, స్పర్శానుభవం కలిగిస్తున్న

పదార్థజాలము, 'స్పర్శ' అనబడే అనుభవమూ – ఈ మూడు చైతన్యము యొక్క ప్రసరణశీలత యొక్క ప్రభావం మాత్రమే. సర్వము చైతన్యమునకు సంబంధించినదే అగుటచే, "అసలు ఈ దృశ్యమే లేదు" అనునది సిద్ధించుచున్నది.

శ్రీ రాముడు : గృహము నిర్మించుటలో పనికివచ్చే చెక్క, పాషాణం మొదలైన నామరూపాత్మకమైన పదార్థములు ఏమై ఉన్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవి చిదాత్మకములు కావు. అవన్నీ ఒకటి మరొకటిగా పరిణామం చెందుతూ ప్రాప్తిస్తున్నాయి. అందుచేత "అవి మాయ యొక్క విలాసములే" అని చెప్పబడుతోంది. కాని చైత్యమునకు పరిణామాదులంటూ ఉండవు.

మరొక సమన్వయం కూడా విను : మనం నాలుకతో వివిధ పదార్థములను ఆస్వాదిస్తున్నాం. అట్టి క్రియ 'సజాతివస్తు సంబంధమే' అవుతుంది. "ఎల్లప్పుడు సాదృశ వస్తువులకు మాత్రమే సంబంధము ఏర్పడుచున్నది" అని అనుకొన్నాం కదా! అసదృశములైన (Unequal) జడ – చైతన్యము ఒకదానిని మరొకటి పొందలేవు.

కనుక చైతన్యమే శిల – గోడ మొదలైన రూపములను 'అనుభవము' అను చమత్కారం ద్వారా ధరిస్తోంది.

సద్వస్తువు అయి ఉన్న చైతన్యమే, భావసారూప్యము పొందినదై "ద్రష్ట – దృశ్యము" మొదలైన భ్రమలన్నీ కలుగజేస్తోంది. అందుచేతనే 'ఈ సర్వము చైతన్యమే' అని సిద్ధాంతీకరించబడుతోంది. సత్యద్రష్టలమగు మేము "చిదాత్మతోటి చిదాత్మ యొక్క సంబంధమే కల్పిత దృశ్యరూపమున ఉదయిస్తోంది" అని స్వానుభవ పూర్వకంగా ప్రకటిస్తున్నాం. అనగా, "ఇది కొయ్య, ఇది శిల" మొదలైన రూపత్వమంతా కల్పితమైనది మాత్రమే. అట్టి కల్పన చైతన్యము చేతనే గావించబడుచున్నది. అనంతమగు పరబ్రహ్మమే సర్వవిధముల పరిపూర్ణమై, సర్వరూపములందు సమముగా వెలుగొందుచున్నది.

కనుక, ఉత్తమ తత్త్వజ్ఞుడవగు ఓ రామా! "ఈ విశ్వమంతా సన్మాత్రమే" అని గ్రహించు! ఇక ఈ జగత్తు అంటావా? ఇది పలువిధములైన భ్రమలతో మిథ్యాగ్రహణం (false understanding) అను రూపముతో, చిత్‌యొక్క చమత్కృతి చేతనే ఒప్పుచున్నది. అట్టి చిత్‌చమత్కృతి ఈ జగత్తులోని ఏ పదార్థజాలముచేతను పూరింపబడజాలదు. ఒకడు తన స్వప్నంలో ఒక గొప్ప నగరమును చూస్తున్నాడనుకో.... ఆ నగరంలో "ఇది వీథి, ఇది ఇల్లు, ఇది వేరేవారి గృహములు, వీరు బంధువులు, వీరు అపరిచితులు" అనే రూపముగల అనేకత్వ భేదమంతా ఏర్పడుతోంది. కాని అదంతా స్వప్నద్రష్టయొక్క స్వసంకల్పపరంపరల ఘనీభూతస్థితియే కదా! ఈ బాహ్యమున కనిపించే 'బాహ్యజగత్తు' కూడా అట్టిదే. "ఇది ఉంగరం" అనే దృష్టి తొలగితే అప్పుడు అందులోనూ, మరొక గొలుసులోనూ కూడా బంగారమే కనిపిస్తుంది. భేదజ్ఞానము చేతనే "సృష్టి – అహంకారము" ఇత్యాది భ్రమలన్నీ ఉదయిస్తున్నాయి.

అనేక ఆభరణముల ఉత్పత్తి–ఉనికికూడా సువర్ణముయొక్క ఉనికి మీదనే ఆధారపడి ఉన్నాయి కదా? జడ, చేతనముల చమత్కారమంతా ఆత్మయొక్క "భావన"యందే అద్వితీయంగా ప్రదర్శనమగుచున్నాయి.

ఈ జగత్ స్థితి కూడా సద్వస్తువు అగు చైతన్యముపైనే ఆధారపడి ఉన్నది. దృక్ – దర్శనములకు వేరుగా 'అవిద్య' అనబడునదేదీ ఎక్కడా లేదు. చైతన్యపరమాత్మ స్వరూపమే అజ్ఞానదృష్టి కలవారికి జగత్తుగా అనుభవమౌతోంది.

❖❖❖

24. పరమాత్మయొక్క నిర్వచనము

అసద్రూపం అయి ఉన్న ఈ జగత్తును తత్త్వజ్ఞానం మాత్రమే సత్స్వరూపమగు పరమాత్మతో ఐక్యపరచుచున్నది. మట్టితో నిర్మించబడిన సైన్యము చిత్రవిచిత్రములుగా, "రాజు–మంత్రి–సైనికులు –గుఱ్ఱములు" మొదలైన విధంగా కనబడుచున్నప్పటికీ, విచారదృష్టికి అంతా మట్టిగానే తెలియవచ్చు చున్నది కదా! జగత్తు కూడా పరమాత్మ స్వరూపము మాత్రమే అయి ఉన్నది. ఇందులో ఎంత మాత్రమూ సందేహం ఉండవలసిన అవసరం లేదు.

తరంగములన్నీ జలమే కదా?.... కొయ్యవిగ్రహములన్నీ కొయ్యమయమే కదా?.... కుండలన్నీ మృత్తికామయమే కదా?.... ఈ ముల్లోకములలో సర్వము బ్రహ్మమయమే! బ్రహ్మమే!.... అందుకు వేరైనట్లుగా తోచుటయే 'అవిద్య'.

ఇప్పుడు పరబ్రహ్మమును గ్రహించుటకు వీలుగా కొన్ని నిర్వచనములు చెపుతాను విను.

I. పరబ్రహ్మము : ఈ దృశ్యము ద్రష్ట యొక్క భావనలను ఆశ్రయించి ఉంటోంది. 'ద్రష్ట దృశ్యము' ల సంబంధమును వివేకబుద్ధితో పరిశీలిస్తే తేలుచున్నది ఏమంటే

1) ద్రష్టయే దృశ్యమునందు ప్రవేశిస్తూ, స్వకీయసంస్కారములను అనుసరించి ఇదంతా ఆయా రీతులుగా దర్శిస్తున్నాడు.

2) ద్రష్టత్వము వహించుటచే అతనిని 'ద్రష్ట' అని పిలుస్తున్నాం.

3) ద్రష్టత్వము వహించటానికి మునుముందే అతడు ఉండిఉన్నాడు. ద్రష్టయొక్క 'దర్శన – దృశ్య' రహితమగు శుద్ధ స్వరూపము అనుభవమునకు మాత్రమే గోచరించగలదు.

అట్టి " సర్వమునకు ఆవల, సర్వమునకు కారణమై" యున్న ద్రష్టయొక్క నిత్యసత్యస్వరూపమే పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మం త్రిపుటియందు అంతటా వ్యాపించియున్నది.

II. మననరహిత శుద్ధచైతన్యము : ఈ చిత్తము ఒక స్థానమునుండి (లేక విషయము నుండి) మరొక స్థానమునకు వెళ్లుచున్నప్పుడు, ఆ రెండిటి మధ్యగల చిత్తము యొక్క జడత్వరహితమగు శుద్ధస్వరూపము ఉన్నది.

ఆ శుద్ధ స్వరూపమే చైతన్యము(తెలుసుకొంటున్నది). అదియే చేత్యము(తెలియబడునది) కూడా.

బ్రహ్మజ్ఞానులగు మహనీయులు ఎల్లప్పుడు ఆ శుద్ధ చైతన్య స్వరూపులై వెలయుచు, ఖేద రహితంగా ఆయా కర్మవిషయములను నిర్వర్తిస్తున్నారు. ఓ రామా! నీవు కూడా "నేను సర్వదా అట్టి శుద్ధ చైతన్య స్వరూపుడనే" అనే ఎరుకను వీడకుండా, ఆపై ఏది ఎట్లు ఉచితమో, అది అట్లే నిర్వర్తించు.

III. శుద్ధ చిత్తము : చిత్తము మననరహితం చేయి. లేదా, సర్వమననములకు అతీతమైన దృష్టి, అవగాహన కలిగియుండు. అప్పుడు మిగిలి ఉంటున్న శుద్ధ చిత్తమునకు, 'పరమాత్మ' అనుదానికి భేదమేమీ లేదు. సర్వదా శేషించి ఉంటున్న 'అనుభవాత్మకసత్త'యే పరమాత్మ స్వరూపము.

ఓ రామచంద్రా! జాగ్రత్-స్వప్న-సుషుప్త రహితమై, చిత్తవృత్తి రహితమైనట్టి 'శుద్ధచిన్మాత్రమే' నీ యొక్క, నా యొక్క ఈ సర్వజీవుల యొక్క, వాస్తవ స్వరూపము. కాబట్టి నీవు సర్వదా అట్టి చిద్వస్తు - స్వరూపుడవై ఉండెదవుగాక! నాయనా! నీవు ఈ జడత్వమంటూ ఏదీ లేనివాడవు. సర్వమును త్యజించి సమాధిని ఆశ్రయిస్తావా? లేక ఈ ప్రాపంచిక ద్వైత వ్యవహారములు నిర్వర్తిస్తూ ఉంటావా? అది నీ ఇష్టం. కాని ఉభయ సమయములందు కూడా "నేను సర్వదా చిద్ఘనస్వరూపుడను. నిష్కళంకవృత్తిరహిత - శుద్ధ చైతన్యమే నేను" అను భావనమాత్రం వదలవద్దు. వదలవలసిన పనేమీ లేదు కూడా!

శ్రీ రాముడు : తండ్రీ! మరి మాకు ఈ దుఃఖాదులు వచ్చిపడుచున్నాయి కదా? వీటిలో తగుల్కొనకుండా ఉండేదెట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : పరమార్థదృష్టితో పరిశీలిస్తే, ఈ ప్రపంచంలో ఎవ్వరికీ ఏదీ ప్రాప్తించుటలేదు, నశించుటలేదు. మరి ఈ దుఃఖాదులు ఆశ్రయించవలసిన పనేమున్నది? విచారణ లేకపోవుటయే అన్ని అనర్థములకు మూలకారణం. ఆత్మ ఈ దేహమునందు ఏదీ వాంఛించుటలేదు, త్యజించుటలేదు, ద్వేషించుటలేదు. కాబట్టి నీవు ఇచ్ఛారహితుడవై, ప్రశాంత చిత్తుడవై, నశ్వరమగు ఈ దేహాదులందు ఏమాత్రం తగుల్కొనకుండా ఉండు. "నేను ఈ దేహాదులందు, దృశ్యములందు లేను. నా యందు ఇవి లేవు. నేను వ్యవహరించుచున్ననూ, లేక సమాధిని ఆశ్రయిస్తున్ననూ సర్వదా స్వస్థుడనే. నిశ్చింతుడనే" అను మననమును ఆశ్రయించు.

ఒకనికి భవిష్యత్తులో నిర్మించబోయే నగరంలోని ఒక ఇంటిలో చేయవలసినదేమైనా ఇప్పుడుంటుందా? అప్పటి అందలి పదార్థముల గురించి ఆసక్తి అనవసరమైనదే కదా! అదే విధంగా చిత్తవృత్తుల నుండి విడివడి ఉండు. ఈ చిత్తవృత్తులందు నీకు ఎట్టి ఆసక్తి ఉండవలసిన పనేమీ లేదు. సదా, సర్వదా, సత్స్వరూపమగు ఆత్మయందే నీవు నిష్ఠ కలిగి ఉండెదవుగాక! ఎప్పుడో చాలాకాలం క్రితం ఎక్కడో తారసపడి, కొద్దిసేపు నీతో సంభాషించి, తనదారిన తాను వెళ్ళిపోయిన ఒక అపరిచిత వ్యక్తి ఇప్పుడు నీ దృష్టికి ఎట్లా ఉంటాడో, ఈ వర్తమాన దృశ్య వ్యవహారము పట్ల ఇప్పటికిప్పుడు కూడా అట్టి దృష్టినే సంతరించుకొనియుండు. ఎందుకంటే ఈ వర్తమానము యొక్క భవిష్యత్ పరిణామము అదే కాబోవుచున్నది. ఇదంతా అసత్తుల్యముగాను, కొయ్య శిలల

వలె స్వల్పవిషయములు గాను గాంచుచూ ఉండు. ఈ మానవులు తమ దృష్టిని శుద్ధ పరచుకోకుండా పదార్థజాలములోకి ప్రవేశించుట చేతనే సకల అనర్థములను పొందుచున్నారు. కాస్త ఆత్మదృష్టి కలిగి, వివేచించి చూస్తే ఇక్కడంతా అసారమే శేషిస్తోంది. కనుక అచిత్తత్వమునే బుద్ధిమంతులు అలవాటు చేసుకొంటున్నారు.

రాతియందు జలం ఉంటుందా? జలంలో అగ్నికణం దాక్కోగలదా? అట్లాగే, ఈ జీవాత్మయందు ఆత్మకన్న వేరైనదేదీ ఉండజాలదు. ఇక పరమాత్మయందు 'జగత్తు' అనబడునది ఎట్లా ఉంటుంది చెప్పు? 'చిత్తము' అనబడునది కూడా జీవాత్మయందుగాని, పరమాత్మయందుగాని ఆ రెండిటికి వేరుగా లేదు. అవిచారదృష్టితో చూచినప్పుడు మాత్రమే "ఇదియే చిత్తము" అనబడేదొకటి ఆత్మకు వేరైనదాని వలె తోచటం జరుగుతోంది. విచారణాదృష్టితో చూచినపుడు చిత్తమనునదే ఉండజాలదు. "ముగ్గురు రాజకుమారులున్నారు. ఇద్దరింకా పుట్టనే లేదు. ఇక ఒకరింకా ఎప్పటికో తల్లి గర్భంలో ప్రవేశించ వలసి యున్నది ....." అను వర్ణనవలె, మొదలే లేనట్టి చిత్తముచే చేయబడు కార్యమంతా అకృతమే అయి ఉన్నది.

ఓ రాఘవా! నీవు చిత్తము యొక్క అస్థిత్వమును నిష్కారణంగా నమ్మి "అయ్యో! ఇక నేను ఈ చిత్తమును త్యజించేదెట్లా?" అని వాపోవుచూ, అకారణంగా, ఆత్మస్థితి నుండి చ్యుతి పొందకూడదు సుమా! ఈ జనులు దేనినైతే 'చిత్తము' అని పిలుస్తున్నారో, అట్టిదానికి పరమైనట్టి "సుఖస్థితి" (A state beyond) యందు సర్వదా ఉండియుండుము.

ఆత్మను ఏమరచుటచే "చిత్తము" అనేది అనుభవమగుచున్నది కనుక "ఈ చిత్తము మిక్కిలి అనాత్మభూతము" అని విజ్ఞులు అంటూ ఉంటారు. అట్టి చిత్తవృత్తిని అనుసరిస్తూ, "ఇది ఉండనే ఉన్నది. మేము దీనిని తొలగించుకునేది ఎట్లా?" అని తలచుచు రోజులు గడపువారు లేని దయ్యమును ఊహించుకొని గజగజ వణకువారే అవుతారు. మా దృష్టిలో వారు అల్పమైన అవగాహన కలవారు మాత్రమే. నీ చిత్తమును ఇట్లు సంబోధించు–

"ఓ చిత్తమా! స్వస్వరూపమగు ఆత్మయే అయి ఉన్న నాకు వేరుగా నీవెక్కడున్నావు? మొదలే లేనట్టి నిన్ను నిరోధించటమేమిటి? నేను ప్రియత్వముతో కూడుకొని, సంకల్పములను ఆశ్రయిస్తు న్నప్పుడు అట్టి నా కార్యక్రమమునే 'చిత్తము' అని అంటున్నారు. నేను సంకల్పించటం జరిగితే నీవు ఉంటావు. నా సంకల్పములకన్నా నీవు వేరు కాదు. కాబట్టి ఓ చిత్తమా! నిన్ను లేనిదానిగా నేను నిర్వచిస్తున్నాను. నిరంతరం ఈ 'చిత్తము' అనుదానిని దూరమునుండే అనాదరిస్తూ ఉండదలిచాను!"

కనుక రామా! ఈ చిత్తము విషయంలో, ఒక 'మట్టి విగ్రహం' లాగా అచంచలంగా ఉండు. సర్వదా ఇచ్ఛారహితుడవై ప్రశాంతముగా ఉండటం అభ్యాసవశంగా నిర్వర్తించు.

ఓ రాఘవా నీవు వైరాగ్యప్రకటన చేస్తున్నప్పుడు ఈ చిత్తము గురించి అనేక విశేషాలు చెప్పావు. బాగానే ఉన్నది. కాని, యథార్థానికి ఈ చిత్తము అనేదేదీ లేదు. "మరి కనిపిస్తోంది కదా?" అంటావా? అపరిపక్వమైన మిథ్యాదృష్టికి మాత్రం అది అట్లా అగుపిస్తోంది. ఆకాశంలో

మేఘములు రూపుదిద్దుకొన్న తీరు చూచి "అక్కడ ఒక తోట ఉన్నది. ఆ ప్రక్కనే ముఖద్వారం" అని ఊహను జోడించి గాంచుటవంటిదే ఈ చిత్తము విషయం కూడా! కనుక ఈ చిత్తము యొక్క మిథ్యాత్వము నిశ్చయించుకున్నవాడవై, శిలాపురుషునివలె నిశ్చలంగా ఉండు.

ఆత్మానుభవదృష్టికి చిత్తము లేనేలేదని మరల ఒక్కసారి ప్రకటిస్తున్నాను.

ఓ ప్రియరామచంద్రా! నీవు యథార్థానికి చిత్తరహితుడవే సుమా! ఓ సర్వ జనులారా! మీరంతా 'చిత్తము' అనే కల్పనకు బద్ధులు కానట్టి చైతన్యాత్మానంద స్వరూపులే! మరి అనర్థములకు హేతుభూతమైన ఈ చిత్తముతో కూడి ఎందుకు దుఃఖించుచున్నారో చెప్పండి?

'అసత్తు' అయిన ఈ చిత్తమునకు వశీకరణమైపోతున్న 'అదృఢబుద్ధి" నుండే వజ్రపాతముతో సమానమైన అస్వస్థత' అంతా వచ్చిపడుతోంది.

ఓ రామా! అట్టి చిత్తమును తొలగించగా, ఇకప్పుడు మిగులుచున్నదేమిటి? నీ యొక్క స్వస్వరూపమే కదా! అట్టి ఆత్మస్వరూపముననే సుస్థిరుడవై ఉండు.

ఇంతమాత్రములో కష్టమేమున్నది చెప్పు? అందులకై "ఆత్మస్వభావమును మననము చేయుట" అను ఉత్తమ ఉపాయమును పొంది ధ్యాననిష్ఠుడవై ఉంటూ ఉండు. కొంతకాలానికి ఆత్మభావన అకృత్రిమముగా, అప్రయత్నంగా సుస్థిరం కాగలదు."పరమాత్మయే ఈ కనబడే సర్వజీవులుగా, సర్వవిశేషములుగా ప్రదర్శనమగుచున్నారు".... అనే మననమును సర్వదా అవధరించు.

"అసత్తే" అగు చిత్తమును అనుకరించుచు ఆకాశమును భేదించాలని అనుకోవటం మా దృష్టిలో మూర్ఖత్వమే! అట్టి మూర్ఖత్వమునకు ధిక్కారమగుగాక! ఓ జనులారా! మొట్టమొదట మీరంతా తత్త్వబోధయందు కుశలురు కావాలి. తద్వారా మనోనాశనము సంపాదించండి. అనగా అసత్ పదార్థములను మననము చేయటం తగ్గించండి. ఆ తరువాత నిర్మలాత్ములై ఈ సంసారమును దాటివేయండి. నాయనలారా! మేము ఎంతో పరిశీలించిన తరువాతయే ఈ వాక్యములు మీ ముందు ఉంచుచున్నాము. నిర్మలమగు ఆత్మయందు 'మనస్సు' అనబడు మాలిన్యమునకు ఏ మాత్రం చోటులేదు. అందుచేత, నా మాట వినండి. ఈ నా వాక్యములు విశ్వసించి, అనుకరించి ఆత్మ యందే సుస్థిరులై ఉండండి. ఆ తరువాత ఏది ఏట్లో అది అట్లే ఉండుగాక, అగుగాక! మీరు మాత్రం ఆత్మస్థితి నుండి చ్యుతులు కావద్దు. సర్వదా అచ్యుతులై వర్ధిల్లండి!

❖❖❖

X. ప్రకరణ సమీక్ష

1. సమీక్ష

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! మనం ఈ 'ఉత్పత్తి ప్రకరణము'లో విచారణ చేసిన విశేషాలన్నీ క్లుప్తంగా సమీక్షించుకుందాం! విను.

ఈ మానవులలో అనేకులు జన్మించినది మొదలు మరణించే వరకు తుచ్ఛమైన లక్ష్యములతో, అర్థం లేని ఆశలతో, అల్పమైన జ్ఞానముతో బ్రతికివేయటం జరుగుతోంది. స్వల్ప సంఘటనలకు కూడా విచలితులగుచున్నారు. ఇంద్రియ విషయముల పట్ల వ్యామోహితులగుచున్నారు. అవిచారణచే కాలయాపన చేస్తున్నారు. అందుచేతనే 'సంసారము' అను వృద్ధమాంత్రికురాలు ఈ జీవులను తన వశం చేసుకొని, తన ఇష్టం వచ్చినట్లు ఆడిస్తోంది. ఫలితం? అంతు లేని దుఃఖపరంపరలు. 'పరమాత్మ –ఆనందము' అనునవే స్వరూప, స్వభావములుగా కలిగి యున్న ఈ జీవుడు దుఃఖించుటయా? ఇతనికి కర్మబంధ మెక్కడిది? మోహ మెక్కడిది?

అవిద్యను నిరోధించటం ఎట్లా? – పుట్టిన తరువాత, ఈ మానవుడు, కాస్త బుద్ధి వికసించగానే, సత్సంగతత్పరుడై ఉండాలి. "నిరంతర ప్రవాహశీలము" వంటి ఈ అవిద్య అనబడే నదీజలవేగాన్ని నిరోధించాలంటే ఈ రెండూ అవసరమై ఉన్నాయి–

1) శాస్త్రాభ్యాసం (సాధనలతో సహా) 2) సత్సాంగత్యము

ఈ రెండిటి ప్రభావం చేతనే జీవునకు, "ఏది గ్రహించాలి? ఏది త్యజించాలి?" అనే వివేకం ఉత్పన్నమగుచున్నది.

అప్పుడాతడు "శుభేచ్ఛ" అనబడే మొదటి భూమికను పొందుచున్నాడు.

అట్టి శుభేచ్ఛ వివేకముతో కూడుకొని బలపడగా, క్రమంగా అతడు "విచారణ" అనే రెండవ భూమికలో ప్రవేశిస్తున్నాడు. సత్కర్మలు, ఉత్తమ ఆత్మజ్ఞానం ... ఈ రెండు బండికి రెండు చక్రముల వంటివి. అట్టి ప్రయత్నశీలుని చిత్తములో జన్మజన్మలుగా పేరుకొని తిష్ఠవేసుకొనియున్న 'దుష్టవాసనలు' బయటకు పంపివేయబడతాయి. అప్పుడు ఏర్పడే నిరంతర పరమార్థభావనచే మనస్సు సూక్ష్మత్వం పొందుచున్నది. అతడు 'సూక్ష్మగ్రాహి' అవుతాడు.

అప్పుడు ఈ జీవుడు 'తనుమానస' అని చెప్పబడే మూడవ భూమికలో ప్రవేశించుచున్నాడు.

క్రమంగా అతనియందు భేదభావము సన్నగిల్లుచున్నది. "మట్టితో రచించబడిన యుద్ధ దృశ్యములో మన సైన్యమేమిటి? శత్రుసైన్యమేమిటి? అంతా మట్టియే కదా!" అను ఎరుక ఉండనే ఉంటుంది చూచావా? అట్లే ఈ మూడవ భూమికలోని వానికి "నేను–నాది–అతడు–నీవు–నీ

గుణములు-నా పదార్థములు"... ఇవన్నీ మొదలంట్లా లయించిపోతాయి. సమ్యక్ పూర్వకమైన (Unity Oriented) సమగ్రమైన (Comprehensive) అవగాహన ఉదయించి, బలం పుంజుకుంటుంది.

అప్పుడాతడు "సత్త్వాపత్తి" అను నాలుగవ భూమికను పొందినవాడగుచున్నాడు.

ఆత్మజ్ఞానం వికసిస్తూరాగా ఆ యోగియందు వాసనలు సన్నగిల్లి, సూక్ష్మత్వాన్ని పొందుతాయి. వాసనలే అన్నిటికీ మూలం. ఈ అసత్యవస్తువులందు ఏర్పడుచున్న ఆసక్తి, ఈ జన్మపరంపరలు ... ఇవన్నీ వాసనల నుండే ఉద్భవిస్తున్నాయి. వాసనల రూపమే ఆసక్తి. కీలుబొమ్మను ఆడించినట్లు, ఆసక్తులు ఈ జీవుని తమ ఇచ్ఛ వచ్చినట్లు ఆడిస్తున్నాయి. అయితే నాలుగవ భూమికయగు సత్త్వాపత్తిని ఆశ్రయిస్తూ ఉండగా కొంతకాలానికి ఈ జీవుడు అకృత్రిమమైన అనాసక్తిని తనయందు పెంపొందించుకొంటున్నాడు.

అట్టి అనాసక్తుడు 'అసంసక్తుడు' అను ఐదవ భూమిక యందు ప్రవేశిస్తున్నాడు.

అట్టివాడికి కర్మల చేత గాని, ఆ కర్మల ఫలితముల చేతగాని సంబంధము ఉండదు. అవి అతనిని బంధింపజాలవు. దీర్ఘకాలంగా వాసనలను సూక్ష్మం చేస్తూ, బాహ్యపదార్థములకు సుదూరుడు అగుచూ ఉంటాడు. స్వయంగా, అంతర్ముఖ వృత్తిచే "నేను జీవుడనుగాను. నిర్జీవుడను గాను. సర్వదా బ్రహ్మమునే అయిఉన్నాను. ఈ శరీరము మొదలైనవి నేను కాదు. ఈ పదార్థ జాలము నా యందు లేదు. నేను ఈ పదార్థజాలమందు లేను. నన్ను బ్రహ్మమునుండి వేరుపరచు కారణము గాని, కార్యముగాని ఏ సమయమందును లేనేలేవు", అను రూపముగల బ్రహ్మాకార స్వభావమును సంతరించుకొంటున్నాడు. అట్టి భావనా దృఢత్వం చేత అతనియందు బాహ్యపదార్థవిస్మృతి రూపమైన ఒకానొక 'అతీత స్థితి' ఏర్పడుతోంది.

అట్టివాడు సమాధినిష్ఠుడై ఉండవచ్చు. లేదా, 'అసత్యములే' అయి ఉన్న ఈ స్త్రీ పుత్రాది ప్రాపంచక వస్తువుల మధ్య యథాతథంగా తదితరులులాగానే ఉండవచ్చు. "స్నానం, భోజనము" మొదలైన బాహ్యక్రియలు చేస్తూ ఉండవచ్చు లేక మానవచ్చు. ఎప్పుడైతే మనస్సు 'సూక్ష్మత్వం' చెందినదో ఇక అతడు 'బ్రహ్మాఽహమ్' అను భావన యొక్క అభ్యాసంచే, జన్మమృత్యువులతో సహా సర్వ సంఘటనలకు వేరైన స్వభావసిద్ధ స్థితిలో ఉండి ఉంటాడు. 'స్వధర్మము' అను 'ప్రవర్తనను' తదితరుల అనుకూలతను దృష్టిలో పెట్టుకొని నిర్వర్తించినప్పటికీ, వాటి ప్రయోజనములపట్ల ప్రీతి, మమకారాదులు ఉండవు. వాసనలు సన్నగిల్లినవాడు, ఆయా సంఘటనలను చూస్తున్నప్పుడు ఒక పసిబాలుడు ఈ ప్రపంచమును చూస్తున్నట్లు చూస్తాడు. అప్పుడే మేల్కొన్నవానివలె, నిర్లిప్తమానసిక స్థితిని ఆశ్రయించి ఉంటాడు.

వీరిలో కొందరు తమ దైనందిన సామాన్య విషయములైవున్న స్నాన - అన్న - పానాదులను కూడా ఇతరుల ప్రేరణచే మాత్రమే నిర్వర్తిస్తూ ఉంటారు.

ఏది ఎట్లైనా ఉండవచ్చు. అట్టివానికి దేనిపట్ల కూడా సంగముగాని, అసంగముగాని ఉండదు. "ఒక యంత్రముచే త్రిప్పబడుచున్న చక్రము" వలె ప్రవాహపతితమైన ఆయా క్రియా వ్యవహారములు

నిర్వర్తిస్తూ ఉంటాడు లేక ఏదీ నిర్వర్తించక పోవచ్చు! లేక, అన్నీ ఉత్సాహంతో నిర్వర్తిస్తూ ఉండవచ్చు కూడా! కానీ అవి అతనిని స్పృశించజాలవు.

ఏది ఎట్లా జరుగుచున్నప్పటికీ తాను మాత్రం బాహ్యపదార్థవిస్మృతి' 'అను ఒక చమత్కారమైన రూపము గల "ఉపరతి" స్థితియందు ఉంటాడు. అభ్యాసమే దృశ్యము నుండి ఉపరతికి (For withdrawal from involvement) ఉపాయం కదా!

తన 'స్వస్వరూపము' నందు నిలకడ పొందేవరకు ఆ యోగి శాస్త్రవిహితంగానో, లేక ఉత్తమ ఆచరణపూర్వకంగానో అభ్యాసం మాత్రం చేస్తూనే ఉంటాడు. ఇప్పటి అతని లక్ష్యము "స్వస్వరూపము నందు సంస్థితుడై ఉండుట" మాత్రమే. అంతే గాని, బాహ్యము నుండి ఏదియో పొందుట కాదు.

పదార్థాభావని – ఇట్లు సూక్ష్మమగు 'బ్రహ్మము' తో తన చిత్తమును ఐక్యపరచిన యోగి అసంసక్త భావన కలవాడై కొంతకాలానికి "పదార్థములను కించిత్ కూడా భావించకుండుట" అనబడు ఆరవ భూమికలో ప్రవేశిస్తున్నాడు. సర్వ భావములకు అతీతత్వము, మౌనస్థితులను అభ్యసిస్తూ వస్తాడు.

జీవన్ముక్తుడు – ఆ విధంగా పదార్థములను, సంఘటనలను, వివిధ స్వభావులగు జీవులను భావన చేయక, బ్రహ్మము నందు మరల మరల తన చిత్తమును లయంచేస్తూ ఉండగా, కొంత కాలమునకు అతనియందు ఆత్మవిషయమై ఉత్తమమైన ఏకాగ్రత ఏర్పడుచున్నది. ఇతరుల ప్రేరణచే, లేక ఇతరుల శుభము కొరకు మాత్రమే కొన్ని ప్రాపంచిక వ్యవహారములు నిర్వర్తిస్తున్నప్పటికీ, అతని అంతరంగము మాత్రం నిర్వికారంగా, ప్రశాంతంగా, ఏదీ కోరకుండానే ఉంటూ ఉంటుంది. చమత్కారం చూడు. ఏదీ తాను కోరకుండానే, ఆయా విషయములందు వ్యవహరిస్తూ ఉంటాడు. కర్మలు నిర్వర్తిస్తున్నప్పటికీ అతని అతీతస్థితి – మౌనస్థితి యథాతథమై ఉంటాయి.

దీనిని 'దృశ్య–అభావనస్థితి' అని కూడా అంటూ ఉంటారు.

అట్లు 'దృశ్యాతీత' స్థితిలో ఉంటూ ఉండగా, ఆ యోగి ఒకానొక తరుణంలో స్వయముగా 'తురీయుడు' అగుచున్నాడు. అనగా "నేనే సర్వేసర్వత్ర అందరియందు, అంతట, సర్వదా నిర్వికారముగా వ్యాపించియున్నాను. నేను సర్వమునకు చెందినవాడను. దేనికీ చెందనివాడను కూడా" అను అనుభవంలో ఉంటున్నాడు.

అట్టివానిని మనం "జీవన్ముక్తుడు" అని అంటున్నాం.

అతడు అభిలషితమైన వ్యవహారములు లభించినప్పుడు ప్రసన్నుడుకాడు. "ఇవి ప్రాప్తించలేదు" అని దుఃఖించడు. "నేను జీవించాలి. లేదా, మరణించాలి" అని కోరుకోడు.

"నేను జన్మమృత్యువులు, అద్యంతములు లేనివాడను" అను భావన నుండి ఏమాత్రం 'చ్యుతి' పొందడు. ఇచ్ఛారహితుడై ప్రారబ్ధకర్మానుసారంగా ప్రాప్తించిన దానిని మాత్రం అనుభవిస్తూ ఉంటాడు.

దుఃఖాదులు ఏర్పడుచున్నది 'భ్రమ' చేతనే – ఓ రామా! నీవు ఇప్పటికే అత్యంత చిత్తనైర్మల్యమును పొందావు. తెలుసుకోవలసిన ప్రత్యగాత్మను తెలుసుకుంటున్నావు. కనుకనే స్థిరాస్థిరములను

విభాగింపగలుగుచున్నావు. ఈ ప్రపంచవిషయములను సమగ్రంగా పరిశీలించి ఉన్నావు కాబట్టే వైరాగ్యప్రకటనంలో ఉత్తమమైన అభిప్రాయాలు వెలిబుచ్చగలిగావు. 'వైరాగ్యము' అనేది వాసనలు సన్నగిలుటచేతనే ఏర్పడుచున్నది.

కనుక, ఇక నిరుత్సాహమెందుకు? ఎల్లవేళల సమస్థితుడవై ఉండుము. ఏ వ్యవహారమైనప్పటికీ "లోకహితము" దృష్టిలో పెట్టుకొని నిర్వర్తిస్తూ ఉండు.

నీవు స్వతహాగానే సర్వదుఃఖరహితమగు చిదాత్మ స్వరూపుడవు.

ఇక ఎన్నటికీ, హర్ష-శోకములు పొందకుండెదవుగాక! ఏ ఒక్కక్షణంలోను ఈ భౌతిక శరీరాదులు నీ రూపము అయి ఉండలేదు. స్వయంప్రకాశము, నిర్మలము, సర్వవ్యాపకము, నిత్యము అయిన ఆత్మస్వరూపమే నీవు. ఈ శరీరాదులు ఉన్ననూ, లేకున్ననూ వాటితో నీకు ఏ మాత్రం సంబంధం లేదు. ఆత్మయే స్వరూపముగా గలిగినట్టి నీకు దుఃఖాదులు గాని, విషయ సుఖములుగాని, జననమరణములుగాని ఎట్లా ఉంటాయి? "నాకు జనన మరణములు లేవు" అనునదే వాస్తవమైన జ్ఞానం.

"లేదు. నేను పుట్టాను. చావబోవుచున్నాను. నాకు ఏవేవో లేవు; ఎన్నో లేనివి నేను పొందవలసి ఉన్నది ; కొన్ని తొలగించుకో వలసియున్నది - ఎప్పటికో, ఏదో పొంది, ఇక ఆపై పూర్ణుడను కావలసి యున్నది:" అను రూపములు గల భ్రమలన్నీ కట్టిపెట్టు.

ఇక, "నా గురించి అట్లా ఉంచు. నేను జ్ఞానము ఆర్జించుటచే జన్మమరణాదుల దుఃఖం నశిస్తుంది. కాని, నా బంధువుల విషయమై దుఃఖము నశించేదెట్లా?"... అని సంశయించకూడదు సుమా! ఎందుకంటావా? నీవు బంధు - మిత్ర రహితమగు శుద్ధాత్మస్వరూపుడవు కదా! అట్టి పరిశుద్ధ - ఆత్మ వస్తువుకు బంధువులేమిటి? దుఃఖములేమిటి? మిత్రులేమిటి? చింతలేమిటి? ఈ బాలుర కేరింతలు త్యజించు. అద్వితీయమగు పరమాత్మకు లేనిపోని బంధనవ్యవహారము అజ్ఞానం చేత ఆపాదించవద్దు. ఎవరైతే "నా బంధువులు-నా వాళ్లు" అని నీవు తలచుచున్నావో, వారి శరీరముల గురించి గాని, లేక వారి వాస్తవస్వరూపమగు ఆత్మ గురించిగాని నీవు శోకించవలసినపని ఏ మాత్రం లేదు. ఈ దేహము, పృథివి మొదలైనవి పంచభూతముల పరమాణు సమూహముచే నిర్మించబడినవే కదా! ఇది సర్వదా దేశ-కాల భేదములచే 'పరివర్తనశీలము' అయి ఉన్నది. అనుక్షణం పరివర్తనమయ్యేదానికి దుఃఖించటమేమిటి? అట్లాగైతే ఈ శరీరములో ప్రకృతి సిద్ధంగా నిత్యమూ ఏర్పడే మార్పు చేర్పులకు స్పందిస్తూ ప్రతి రోజు ఒక్కొక్క బంధువు పేరు చెప్పి కాసేపు దుఃఖిస్తావా? కాబట్టి అనివార్యమగు శరీరాదుల పరిణామశీలత్వము గురించి దుఃఖించటం ఎందుకు? ఇక ఆత్మ విషయానికి వస్తే, ఇది ఉత్పన్నమగుట లేదు. నశించుటలేదు.

ఓ మిత్రులారా! మీరంతా వాస్తవానికి నాశరహితులై ఉండగా, "నేను మరణించుచున్నాను" అను భావన ఎందుకు పొందుచున్నారో చెప్పండి? మృత్యురహితమగు ఆత్మకు దోషం అంటగట్టకండి.

కుండపగిలితే, ఆ కుండలోని ఆకాశం కూడా బ్రద్దలగుచున్నదా? లేదే. ఘటాకాశం (space within the pot) నకు మహాకాశం (Totality of space) నకు తేడా ఏమున్నది? మహాకాశమును ఘటం వేరుపరచగలదా?

"ఘటాకాశము" అని అసలు ఉన్నదెక్కడ?

ఆత్మకు వేరుగా ఈ జీవుడెక్కడ ఉన్నాడు?

లేని విషయం గురించి దుఃఖించుట ఏమిటి?

'దుఃఖము' అనుదానిని మనస్సు ఆశ్రయించుచున్నప్పుడు నిత్య – అనిత్య, సత్య – అసత్య విభాగము చేయు దృష్టిని అలవరచుకోవటం ఆవశ్యకం.

అభిలాషను త్యజించాలి – సూర్యకాంతి విశాల ప్రదేశము నందు ప్రసరించుటచే, మృగతృష్ణలో జలతరంగముల కదలికలు స్ఫురిస్తున్నాయి కదా! ఆ మృగతృష్ణాస్రవంతి వినాశనమైనంత మాత్రం చేత సూర్యరశ్మి కోల్పోయేది ఏమైనా ఉన్నదా? లేదు. ఈ శరీర నాశనము కూడా ఆత్మకు సంబంధించినదే కాదు.

నాయనలారా! అసలు నిరర్థకమూ, భ్రాంతి రూపకము అయిన పదార్థములందు మీకు అభిలాష ఎందుకు ఉదయిస్తోందో చెప్పండి?

కొంచెము సమాలోచన చేయండి – ఆత్మయే సర్వవస్తుస్వరూపమై ఉండగా ఇక వాంఛించవలసిన రెండవ పదార్థం ఎక్కడున్నది? వినేది, చూచేది, స్పృశించేది, ఆస్వాదించేది. ఆఘ్రాణించేది ... అంతా ఆత్మయే సుమా! ఆత్మకు అన్యమైన వస్తువంటూ ఎక్కడా ఏదీ లేదు. ఆకాశమునందు శూన్యత్వం ఉన్నట్లే ... సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపకుడు, సుప్రసిద్ధుడు అగు ఆ పరమాత్మయందు .... ఈ "స్పర్శ" మొదలైన శక్తులన్నీ ఉన్నాయి.

నీ ఈ భౌతిక శరీరము ప్రజ్ఞాస్వభావుడవగు నిన్ను నిర్వచించగలదా? లేదు.

అట్లాగే, ఈ శబ్ద – స్పర్శాది శక్తులన్నీ కలసికూడా పరమాత్మను నిర్వచించలేవు.

జీవుని ఆశ్రయించుకొని మాత్రమే 'శరీరము' ఉంటున్నట్లు ఈ శక్తులన్నీ పరమాత్మ నుండి బయల్వెడలి, పరమాత్మను ఆశ్రయించుకునే ఉంటున్నాయి.

అభిలాషయే 'వాసన' యొక్క స్వరూపం. ఈ త్రిలోకాలలో కనిపిస్తున్న ఉపాధులన్నీ సాత్విక–రాజస–తామసముల ఆయామిశ్రమములచే ఏర్పడి ఉన్నాయి. అయితే, ఇదంతా చిత్తము నందే ఉత్పన్నమగుచున్నది.

వాసన క్షయిస్తే మనస్సు నశిస్తోంది – మనస్సు నశిస్తే, కర్మకు నివాసభూతమైన 'మాయ' కూడా స్వయంగా నశిస్తోంది.

అందుచేత రామా! ఈ సంసారచక్రమును నడుపుచున్న 'వాసన' అనే త్రాడును నీవు ప్రయత్నపూర్వకంగా వివేకబలంచే ఛేదించివేయి. ఎరుగబడనంతవరకు, వాసనారూపమగు ఈ

మాయ గొప్పమోహమును కలుగజేయగలదు. ఎరుగబడిందా, ఇది అనంత-సుఖమునే ప్రసాదించ గలదు. అంతేకాకుండా, బ్రహ్మసాక్షాత్కారం కూడా ప్రాప్తింపజేయగలుగుతుంది.

ఈ 'మాయ' వచ్చేది ఎక్కడి నుండి? -

ఆగతా బ్రహ్మణోభుక్త్వా సంసారమిహలీలయా

పునర్బ్రహ్మైవసంస్మృత్య బ్రహ్మణ్యేవ విలీయతే ॥

ఈ 'మాయ' బ్రహ్మమునుండి ఉద్భవిస్తోంది. లీలామాత్రంగా 'సంసారము' ను స్మరించుచున్నది. అనుభవించి, మరల స్వలీలయగు బ్రహ్మవిద్యచే సంసారనాశనమొనర్చుచున్నది. బ్రహ్మమును ఎరుగుచు, బ్రహ్మమునందే లీనమగుచున్నది. ఆహాఁ! ఎంతటి చమత్కారం ! మంగళస్వరూపుడు, రూపరహితుడు, అప్రమేయుడు, నిరామయుడు అయి ఉన్న పరబ్రహ్మనుండి, ... నిప్పు నుండి నిప్పురవ్వలులాగా .... ఈ ప్రాణికోట్లు ఉత్పన్నము లౌతున్నాయి.

ఆకులో	ఈనెలు
జలంలో	తరంగాలు
బంగారంలో	ఆభరణాలు
అగ్నియందు ఉష్ణము	ప్రకాశము

ఇవన్నీ ఎట్లాగైతే అంతర్భాగంగా ఉన్నాయో, అట్లాగే ధ్యాన రూపమును దాల్చుచున్న ఆ పరమాత్మ యందు ఈ ముల్లోకములు ఉన్నాయి.

ఆయన యందే ఈ జగత్తు ఉత్పన్నమైనది. ఆయన యందే స్థితి కలిగి యున్నది. ఆయన యందే లయిస్తోంది. అయితే ఏం? ఆయనయందు 'జగత్తులు' మొదలైనవేవీ లేవు. ఉండబోవు కూడా!

అందుచేత ఈ జగత్తు పరమాత్మయే అయి ఉన్నది. ఆ పరమాత్మయే సమస్త ప్రాణికోట్ల యొక్క అంతరాత్మయగు 'బ్రహ్మము' అని చెప్పబడుతోంది. ఆతనిని ఎరిగినవాడు ఈ జగత్తంతా ఎరుగుచున్నాడు.


అంతేకాదు, ఎరుగుచున్నది కూడా అతడే - అతనికి నామరూపాలు లేవు. అయినప్పటికీ అనంతాకారము కలిగిన ఆ పరమాత్మకు శాస్త్రములు రచించటానికి, శిష్యులకు బోధించటానికి (వ్యవహారార్థం) "చిత్తు-బ్రహ్మము-శివుడు-విష్ణువు-ఆత్మ-పరమాత్మ" ఇత్యాది అనేక పేర్లు తత్త్వజ్ఞులు కల్పించారు. అదంతా అపరిపక్వమైన అవగాహనగల శిష్యజనులను ఉద్ధరించుటకొరకే అయి ఉన్నది. అట్టి కల్పిత నామములు, రూపములు భవిష్యత్తులోకూడా తత్త్వజ్ఞులచే ప్రవచించ బడబోవుచున్నాయి.

శుద్ధసాక్షీతత్త్వము-బుద్ధి-జగత్తు - జీవన్ముక్తులు సర్వదా "నేను సాక్షీతత్త్వమును. నా స్వరూపము సర్వదా నిశ్చలమై, వికార రహితమై ఉన్నది. అది అట్లే ఉండబోవుచున్నది కూడా" అను ఎరుకయే కలిగి ఉంటారు. ఒకవేళ ఎప్పుడైనా దైవకృతంగా ఇంద్రియములకు ప్రియాప్రియములైన సంఘటనలు పొందటం జరిగినా, వాటియందు ఆసక్తిగాని, భావోద్రేకముగాని పొందరు. సర్వదా అవినాశియగు

చిదాత్మయొక్క భావనను, అనుభవమును కలిగి ఉంటారు. అంతేగాని, సంసారస్వభావులు అగుటలేదు. వారు 'చ్యుతి' నుండి వెనువెంటనే నిశ్చల స్వరూపమగు 'అచ్యుతి' ని అవధరించుచున్నారు.

ఆకాశము కంటేకూడా అతి సూక్ష్మము, నిర్లిప్తము అయినట్టి ఆ చిదాత్మయందే ఈ జగత్తు ప్రతిబింబితమగుచున్నది. ఇది 'శుద్ధ సాక్షిస్వరూపదృష్టి'కి వేరుగా "సంకల్పములు-వికల్పములు, అహంకారములు - మమకారములు" మొదలైన చమత్కారములతో ప్రకటితమౌతోంది.

అట్లు ప్రకటితమగుచున్నది ఏది? జగత్తా? జగత్తుజడమైనది కదా! -



1) సాక్షిచైతన్యము - జగత్తులమధ్య 'బుద్ధి' ప్రతిబింబించుచున్నది.

2) 'బుద్ధి' అనునది 'ప్రియము - అప్రియము' అను విభాగములు కలిగి ఉంటోంది.

3) ఈ బుద్ధి జగత్తువైపు ప్రసరించుచున్నంత వరకు జడత్వమును పొందుతోంది.

4) సాక్షి చైతన్యముయొక్క అవివేకదృష్టియే జగత్తు ;
"ఇదమ్ సర్వమ్ బ్రహ్మమ్" అనునదే వివేకము.

ఈ 'బుద్ధి' .... లోభము, మోహము మొదలైన విషయములందు అవిచారణాపూర్వకంగా ప్రవేశించుచున్నది. అయితే బుద్ధి ప్రేరేపిత మాత్రం చేతనే కనిపిస్తున్న ఈ 'లోభమోహాలు' అనబడేవాటికి స్వకీయమైన అస్థిత్వం లేదు. అందుచేత "అవి యథార్థానికి లేవు" అని చెప్పబడుతోంది. భ్రమచేత మాత్రమే ఉన్నట్లు కనబడుచు, భ్రమతొలగగానే లేకుండా పోయేవాటిని 'ఉన్నాయి', అనాలా?, 'లేవు' అనాలా? అయినను, అజ్ఞానదృష్టి ఉన్నంతవరకు ఈ లోభమోహాలు ప్రతిబింబించి, దుఃఖాదులు ప్రాప్తించటానికి కారణ భూతములౌతున్నాయి.

మూర్ఖత్వము త్యజించబడుగాక! - ఓ రామచంద్రా! 'దేశ-కాల' రహితమైన నిర్వికల్ప స్వరూపమగు చిదాకాశమే నీ-నా రూపము, ఆకారము కూడా. అట్టి చిదాకశము (Pure-Realm of consciousness or awareness) నందు నీకు ఈ లజ్జ-భయ-విషాదములతో కూడిన మోహమంతా ఎక్కడినుండి దాపురించుచున్నదో చెప్పు? దేహమే లేనట్టి నీవు అసత్యము అయి ఉన్న ఈ దేహమును ఆశ్రయించి ఉత్పన్నములగుచున్న ఆయాస్థితి-గతులను చూచి దుఃఖించుటయా? దుర్బుద్ధితో కూడుకొన్న మూర్ఖత్వమే నిన్ను దుఃఖితుని చేయుచున్నదని గుర్తు చేస్తున్నాను.

ఆత్మ - చిత్తము - దేహము - నాయనా! రామా! ఈ దేహము ఖండఖండములుగా ఛేదించబడుగాక! అఖండమగు చైతన్యమునకు ఖేదన-అఖేదనములు ఉండనే ఉండవు. ఎవరైనా ఉన్నట్లు చూస్తుంటే, అది అజ్ఞానము చేతనేనని మేము గమనిస్తున్నాము. దేహము నశిస్తే "అజ్ఞాని యొక్క ఆత్మయే నశించుటలేదు" అని జనులు ప్రవర్తనలను ప్రకటించటం చూస్తూనే ఉన్నాము కదా!* ఇక జ్ఞాని గురించి వేరే చెప్పేదేమున్నది? సమ్యక్‌దర్శి యగు (One who perceives equality, evenness and sameness everywhere, all times) జ్ఞాని యొక్క ఆత్మకు ఈ దేహ నాశనముచే కలుగు లోటుపాటు లేమి ఉంటాయి?

వాస్తవానికి ఈ చిత్తము స్వతంత్రమైనదేకాని, పరాధీనమైనది కాదు. అనగా? నీ చిత్తము నీ అధీనంలోనే ఉంటుందిగాని, ఎవరో పరాయివారి అధీనంలో కానేకాదు. ఇకదాని చంచలత్వమంతా- స్వకీయమైన విషయ మననరూపమగు అభ్యాసవశంచేతనే సుమా!

అనగా, ఇది ఎక్కడినుండో, ఎవరిచేతనో నియమించబడుటలేదు. దాని గమనాగమనములు దాని అధీనంలోనే ఉన్నాయి. "దానిశక్తి 'ఇంతింత' అని చెప్పలేము" అని ఐందవోపాఖ్యానంలో చూచాము కదా! ఏ ఆశ్రయము లభింపజాలని 'సూర్యమార్గము (The orbit of Sun)' లోకూడా అది క్షణంలో పయనించగలదు. అట్టి చిత్తమునే మనం 'పురుషుడు' అని అంటున్నాం. మనం ఎవరినైనా, ఎందుకైనా, సంబోధించేటప్పుడు, దృష్టిలో పెట్టుకుంటున్నది చిత్తమునే గాని, ఈ దేహమును ఏమాత్రం కాదు సుమా! జనులు మాట్లాడుకునేది, వ్యవహరించేది, ప్రేమించేది, ద్వేషించేది ఈ చిత్తమునే. కాబట్టి చిత్తమే జీవుడు. ఈ పాంచభౌతిక - దేహము జీవుడు కాదు. 'జీవించుట' అను కర్తృత్వమును ఈ శరీరమాత్రమునకు ఆపాదించుట ఉచితం కాదు.

ఆత్మ దేనిచేతనూ స్పృశించబడజాలదు - ఓ రాఘవా! ఒకడు జ్ఞాని కావచ్చు, లేక అజ్ఞాని కావచ్చు, దేహము ఉండవచ్చు, లేక నశింపవచ్చును. ఆత్మమాత్రం యథారీతిగా, ముల్లోకములందు అచంచలంగా ఉండియే ఉంటోంది. అంతేకాదు, స్వస్వరూపాత్మ ఈ ముల్లోకములకు ఈవల-ఆవల సర్వదా ఆక్రమించుకొని వెలుగొందుచున్నది.

ఈ దేహం నశించినంత మాత్రం చేత ఆత్మ నశించదు. దీనిని సందేహించువారు తమ ఉనికిని తామే సందేహించువారు అగుచున్నారు.

ఇక ఎదురుగా కనిపిస్తున్న ఈ సుఖ-దుఃఖాలన్నీ శరీరమునకే గాని, లేదా మనస్సుకే గాని.... అగ్రాహ్యమగు ఆత్మకు కానేకాదు. చిద్వస్తువగు ఆత్మ మనోమార్గముకంటే కూడా అతీతమైనది. ఆకాశము కంటే కూడా అత్యంత విస్తీర్ణంగా వ్యాపించియున్నది. అట్టి చిద్వస్తువు ప్రాపంచక దుఃఖముల చేత గాని, విషయసుఖముల చేత గాని ఎట్లా ప్రభావితం అవుతుంది చెప్పు?

---

* సోది అడుగుట, ఆత్మశాంతికై ప్రార్థనాదులు చేయడం, చిత్రపటమును ఆవిష్కరించడం, సావత్సరీకములు జరపడం, మానసిక ఆహ్వానాదులు..... ఇవన్నీ ఈ అభిప్రాయము యొక్క దృష్టాంతాలు.

"దేహోఽహమ్ – ఆత్మాఽహమ్" – ఈ చైతన్యము అనేక జన్మలుగా అభ్యస్తమై యున్న వాసనలతో కూడుకొని ఉంటున్నది. అయితే ఈ 'వాసనలు' అనునవి "నేను ఈ దేహమును" అను భావన యొక్క పరిధిలో మాత్రమే ఉనికి కలిగి ఉంటాయి. ఒక సమయంలో ఈ చైతన్యము జ్ఞానమును ఆశ్రయించి, ఆ జ్ఞానబలంచేత తననుతాను ఎరుగుచున్నది. అప్పుడీ "దేహోఽహమ్" భావనను త్యజించివేస్తోంది. తనయొక్క యథార్థ స్వరూపమైయున్న పరమాత్మ యందే ప్రతిష్ఠిత మగుచున్నది.

అసలు 'జీవుడు' అనగా ఎవడు? – 'ఉపాధి' అనే ప్రదేశంలో ఏర్పడి ఉండువాడు మాత్రమేనా? కానేకాదు! అట్లా అయితే, అతనికి ఉపాధికంటే వేఱైన సత్తాయే ఉండేది కాదు. ఉపాధి నశిస్తే అతడు కూడా నశించేవాడే. కాబట్టి, ఈ జీవుడు దేహపరిమితుడుకాదు.

కాని, ఆత్మగా జీవుడుగా అగుట ఏమిటి? – ఆత్మను ఉపాధిపరంగా, చిత్తపరంగా చూచు అజ్ఞానదృష్టికి మాత్రమే జీవుడు అనబడువాడు తారసపడుచున్నాడు. ఆత్మకంటే వేరుగా జీవుడు అనబడే వాడే లేడు. ఇందులో సందేహం లేదు. ఆత్మ జీవుడే అగుటలేదు కదా ! ఇక 'దేహము'గా ఎట్లా అవుతుంది?

జీవుడు ఆత్మయే అయి ఉండుటచే, ఈ 'దేహము' అనే పంజరం నశించినప్పటికీ అతనికి కలుగుచున్న నష్టమేమీ ఉండదు. ఓ రామా! నీవు జీవుడవే కావు. ఆత్మయే అయి ఉన్నావు. అట్లే ప్రతిఒక్కరుకూడా. ఇక దుఃఖము పొందవలసిన పనేమున్నది?

"నేను ఈ శరీరమును కాదు." "జీవుడు' అనబడునది కూడా నేను కాదు."

"నేను సదా సత్స్వరూపమగు బ్రహ్మమునే అయి ఉన్నాను." ....

అని భావిస్తూ ఉండు. అంతేకాని, భ్రాంతి రూపములైన నశ్వరదేహములందు "ఈ దేహమునే నేను" అనునట్టి దేహాత్మభావన చేయటం ఉచితమా? .... కాదు.

ఓ సర్వసభికులారా! సర్వజనులారా! మీలోని ప్రతిఒక్కరు "నేను అఖండుడను, అప్రమేయుడను" అనురూపమైనట్టి "ఆత్మసారూప్య భావనను" నిరభ్యంతరముగా చేయవచ్చు. శుద్ధము, అకళంకము అగు పరమాత్మకు ఏ విధమైన 'ఇచ్ఛ' ఉండదు కదా! 'చిదాత్మ – స్వభావులే' అయి ఉన్నట్టి మీరంతా "నేను ఇచ్ఛారహితుడనే" అని ఎందుకు భావించరాదు?

జగత్తు భావనామాత్రమే – చిదాత్మ సర్వులయందు సాక్షీభూతమై, సర్వత్రా సమమై, నిర్మలరూపమై, నిర్వికల్ప స్వభావయుతమైయున్నది. అట్టి చిదాత్మయందు, అద్దమునందు వస్తువులు కనబడునట్లు, ఈ బ్రహ్మాండములన్నీ ప్రతిబింబిస్తున్నాయి. స్వచ్ఛమైన మణి అనిచ్ఛాపూర్వకంగానే (Without maintaining intentions) తనయందు సూర్యకిరణములను ప్రకాశింపజేయుటలేదా? ఆత్మకు ఏ ఇచ్ఛ లేకున్నప్పటికీ, వికల్పరహితమగు ఆత్మయందు ఈ జగత్తు ప్రతిబింబించుచున్నది. అద్దం కదలకుండానే తన యందు వస్తువుల కదలికలను చూపుచున్నది కదా! "దర్పణం – ప్రతిబింబం"ల అనిచ్ఛా పూర్వకమైన సంబంధం ఎట్లు సిద్ధిస్తుందో, ఆత్మ – జగత్తుల భేదాభేద సంబంధం సిద్ధిస్తోందని

గ్రహించుటయే "జ్ఞానము". అద్దములోని ప్రతిబింబము అద్దముకంటే వేరా? యథార్థానికి ఆ రెండు ఒక్కటే అయినప్పటికీ, భావనామాత్రంచేత వేరువేరుగా ఉంటున్నాయి. జగత్తుకూడా భావనా మాత్రం చేతనే ఆత్మకు వేరుగా తోచుచున్నది.

సూర్యుని సన్నిధానం చేతనే (Just by mere presence), అతని ఇచ్ఛ లేకుండానే (కిరణజన్య సంయోగము Photosynthesis మొదలైన) జగత్ కార్యములన్నీ సిద్ధిస్తున్నాయికదా! 'చేతనసత్త' యొక్క ఔన్నత్యమాత్రంచేత ఈ జగత్తు అంతా ఉత్పన్నమగుచున్నది. ఓ రామా! ఎప్పుడైతే నీ దృష్టి నుండి ఈ నామరూపాత్మక జగత్తు నివృత్తిస్తుందో, అప్పుడు నీ చిత్తము నందు 'ఆకాశము' వంటి శుద్ధ చైతన్యస్వరూపము రూఢి కాగలదు. 'దీపము' గదిలో వెలుగుచున్నంత మాత్రంచేత ఆ వెలుగులో ఆయా వస్తువులు, వాటి భేదాభేదములు కనబడుచున్నాయి కదా! "అయితే వస్తువుల భేద వ్యవహారము దీపపు వెలుగుచేతనే కల్పించబడుచున్నది" అని అంటామా? లేదు. ఈ జగత్తులోని భేద వ్యవహారమునకు, భగవంతునికి గల సంబంధము అట్టిదే.

చిద్వస్తు స్వభావ మాత్రంచేత, భావనానుగుణంగా ఈ జగత్తు ఏర్పడి ఉంటోంది.

మోహం తొలగితే చాలు! సర్వము విదితము, అనుభవము కాగలదు.

ఆకాశము యొక్క స్వరూపమేమిటి? శూన్యమేకదా! అయినప్పటికీ జనులంతా అక్కడ సుందరము, శోభాయమానము, కాంతియుతము అయిన నీలత్వమును చూస్తున్నారు. అట్లాగే, జనులు ఆత్మయందు జగత్తులను దర్శిస్తున్నారు. భావన-అనుభవం... ఒకదానిని రెండవది నిర్మిస్తోంది. భావనలో ఏర్పడుచున్న భ్రమ తొలగితే అంతా విదితమే అవుతుంది.

పరమాత్మ నుండి మనస్సు, మనస్సు నుండి జగత్తు ఉత్పన్నములవుతున్నాయి. ఈ జగదాడంబర మంతా మనస్సు చేస్తున్న పనే! సంకల్పము నశించినంత మాత్రంచేత చిత్తము క్షయించగలదు. మనో-జగత్తుల వాస్తవస్వరూపం ఆత్మయే!

చిత్తము క్షయిస్తే మోహం స్వయంగానే నశిస్తుంది. మేఘాలు తొలగగానే నిర్మలాకాశం స్వయం గానే శోభిస్తుంది కదా! మోహం తొలగగానే అంతఃకరణము నందు, "జన్మవర్జితుడు, అనాది, అనంతస్వరూపుడు, నిర్మలుడు, చిన్మాత్రస్వరూపుడు" అగు పరమాత్మ స్వయంగానే ప్రకాశిస్తున్నాడు.

❖❖❖

2. లఘు సమీక్ష

మరికొంత లఘువుగా సమీక్షిస్తున్నాను. విను -

సర్వాత్మకమగు చిదాత్మయందు మొట్టమొదట "సమస్తప్రాణుల సమష్టికర్మ" రూపమున సమష్టి క్రియాశక్తి ప్రధానం అయినట్టి "మనస్సు లేక, చిత్తము" ఆవిర్భవిస్తోంది. అట్టి సమష్టిచిత్తరూపునే "బ్రహ్మదేవుడు" అని అంటున్నాం. ఆతని మనోసంకల్పమునుండి 'మనువు' మొదలైన మానసదేహులు ఏర్పడుచున్నారు. వారు దేహమును ధరించి, వివిధనామరూపములతో కూడిన ఈ మిథ్యాజగత్తును

విస్తరింపజేస్తున్నారు. బాలుడు బేతాళుని రూపమును మనస్సునందు కల్పించుకొని, అదియే బాహ్యమున చూచుచున్నట్లు, ఇదంతా ఏర్పడుతోంది.

సమష్టి – వ్యష్టి భేదములచే కల్పితమగుచున్న ఈ జగత్తంతా 'మనోమాత్రమే'! మనస్సు కూడా 'అసత్తే' అయి ఉన్నది. అజ్ఞానముయొక్క కార్యమే అది. సర్వమునకు అధిష్ఠానమై వెలుగుచున్న 'సాక్షిచైతన్యము' యొక్క స్ఫూర్తి చేతనే 'అసత్తు' అగు ఈ జగత్తు స్ఫురిస్తోంది.

అట్లు జగత్తుగా స్ఫురించుటయే దీని "ఉత్పత్తి". అంతయు విజ్ఞానదృష్టిచే పరిశీలించుచున్న మేము, "ప్రపంచ రహితమైన సచ్చిదానంద పరిపూర్ణ బ్రహ్మమే ఈ 'జగత్తు' రూపముగా అజ్ఞానదృష్టికి తోచుచున్నది" అని సిద్ధాంతీకరిస్తున్నాం. వాస్తవానికి 'జగత్తు' అనబడునదేదీ ఉత్పన్నమే అయిఉండలేదు. నిత్యోదిత–పరమానంద స్వరూపమగు ఆత్మయే స్వకీయ–అజ్ఞానకారణంగా జగత్తుగా దర్శించబడుతోంది.

పూర్ణ మహాసముద్రము యొక్క 'సత్తామాత్రము' నందు వలయాకారములగు తరంగముల పంక్తి (Water - ripples) ఉద్భవించి స్థితి పొందుచున్నాయి కదా! నీటిని ఆధారం చేసుకునే వలయాకారములు ఉంటున్నాయి. ఈ మనస్సు తనకు అధిష్ఠానమైయున్న సాక్షి చైతన్యము యొక్క ప్రభావం చేతనే "సద్వస్తువా?" అన్నట్లుగా భాసిస్తోంది.

వాక్కునకు లభ్యమగుచున్న ఈ విచిత్రమైన జగత్తు, ఈ దృశ్యము 'మిథ్యయే' అయి ఉన్నాయి.

సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మమే అవికృతరూపమున సదా నెలకొనియున్నది. ఇది గ్రహించటమే– బోధించటమే శాస్త్రముల – సర్వప్రయత్నముల అంతరార్థమైయున్నది.

❖❖❖

ఉత్పత్తి ప్రకరణం సమాప్తం

బ్రహ్మార్పణమస్తు – లోక కళ్యాణమస్తు

ఓం తత్‌సత్

❖❖❖

మోక్షోపాయమై ఉన్నట్టి ఈ గ్రంథము యొక్క సహాయంచే 'జ్ఞాన కాంతి'ని పొందువారు మోహాంధకారంచేత గ్రుడ్డివారు అవటం జరగదు. 'తృష్ణ' అనేది వివేకము ఉదయించనంత కాలమే ఉంటుంది. తృష్ణ ఉన్నంతకాలం వేదనలు తప్పవు.

ఓ జనులారా! లేవండి. ఈ శాస్త్రవిచారణను అనుసరిస్తూ రండి. సంసార బంధమును త్రెంచి వేయుటకు కృతనిశ్చయులు అవండి.

వసిష్ఠ మహర్షి

పుట: 130

శ్రీరాముడు : గురువర్యా! మునీంద్రా! ఇంతకీ ఈ 'మనస్సు' అనునది జడమా? చేతనమా? ఈ విషయం ఇంకా నాకు బోధపడనేలేదు.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మనస్సు చిత్ - అచిత్ రూపమైయున్నది. అనగా, ఇది జడముకాదు. చేతనము కాదు. చైతన్యమే సంసార దశ యందు ఉపాధి దోషంతో కూడుకొని ఉన్నప్పుడు 'మనస్సు' అని పిలువబడుతోంది. అనగా, చైతన్యమునకు వేరుగా 'మనస్సు' అనబడునది ఏది లేదు. 'ఆలోచన' అనునది ఆలోచించువానికి వేరుగా ఉంటుందా? ఉండదు కదా!

పుట: 522

CONQUER YOURSELF
ISBN 93-83972-14-2 (Set)
9 789383 972142
www.rkmath.org

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు-29
email : publication@rkmath.org

Vasishta Rama Samvadam : Vol 1
ISBN 93-83972-10-4
₹ 1000/- (set)